మేధో మథనం

జాహ్నవి



వర్తమాన మేధో, రాజకీయ
ప్రపంచంలో కళ్ళు మూసుకున్నా.....
కనిపించే నిజాలను వివరించే
అసాధారణ రాజకీయ
వ్యాసాల సంకలనం

Medho Madhanam

(Anthology of articles on contemporary political economy)

Jahnavi

First publication: January 2018

Price : Rs.200/-

Publishers:
Manasa Publications,
Plot No.72, Laxminagar,
Attapur,
Rajendranagar Circle,
HYDERABAD-500 030

Printed at:
Anupama Printers,
126, Shantinagar,
Hyderabad-500 028.

వరుసక్రమం...

ఆటనియమాల్ని మార్చే ఇంధనం 7
అంతరావలోకన 11
అంకితం 15
కృతజ్ఞతలు 16

1. శూన్య నిజంలోకి 17
2. అందరిదీ ఒకే బాట - 'శోష' లిజం 21
3. గొంగట్లో తింటూ 24
4. ప్రజాస్వామ్యం ముసుగులో 27
5. స్వేచ్ఛకోసం 31
6. మైక్రో.. మెగా.. సూత్రం ఒకటే 35
7. ఆహార రాజకీయ భద్రత 39
8. మసకబారిన నల్ల సూరీడు..... 43
9. సోషలిజం అనైతిక స్వప్నం..... 47
10. ప్రభుత్వ జోక్యాల పుణ్యమే ఈ అవినీతి 51
11. బీహార్‌లో ఏం జరిగింది?..... 54
12. సామాజిక ప్రజాస్వామ్యం! 58
13. చిక్కుముడులు విప్పుదాం 61
14. మొండి వ్యవసాయం 65
15. ద్రవ్యోల్బణం శాశ్వతం!..... 69
16. విభజనతో దోపిడీ ఆగదు..... 73
17. వాస్తవ తెలంగాణ..... 77
18. విమర్శలకు వివరణాత్మక స్పందన 81
19. విమర్శలకు వివరణాత్మక స్పందన -2, సోషలిజం విషమంత ప్రచారం 83
20. విమర్శలకు వివరణాత్మక స్పందన -3,'ఆర్థిక స్వేచ్ఛలోనే సంపద సృష్టి' 87
21. మావోయిస్టుల పౌరహక్కులు! 91
22. ప్రభుత్వం, విద్యానాశనం..... 94
23. మార్క్సు, ఏంగెల్సు, దేవతా వస్త్రాలు..... 97
24. ఎవరి శ్రమ ఎవరు దోస్తున్నారు?..... 101
25. సోషలిజం మత్తుమందు 105
26. విమర్శలకు స్పందన - సహజ హక్కులే లక్ష్యం కావాలి..... 108
27. విమర్శలకు స్పందన - 'సర్వ స్వతంత్ర్య రాతలు'..... 111
28. విమర్శలకు స్పందన - సోషలిష్టు భ్రమలపై సైద్ధాంతిక పోరు..... 112
29. తెగించిన రాజకీయానికి 115
30. అవినీతి వ్యాధికి అరకొర వైద్యం..... 118
31. విప్లవం ఒక ఉన్మాదం..... 121
32. నిషేధం వెనుక నిజాలు..... 124
33. ఒసామా వాదం సశేషం..... 127
34. గెలిచిందెవరు?..... 130
35. వ్యర్థ సిద్ధాంతాలు 133

36. ధాన్యం, దైన్యం..... 136
37. నల్లధనం పుట్టిళ్ళు..... 139
38. మూకస్వామ్యంలో భావ స్వేచ్ఛా?..... 143
39. లెక్కల చిక్కులు..... 146
40. కెజి బేసిన్ కుతంత్రం..... 149
41. సిద్ధాంత మౌఢ్యం..... 152
42. 'వ్యర్థ' ప్రయాస..... 156
43. తాత్విక కోణంలో తెలంగాణ..... 159
44. ప్రేమ - పిచ్చి 163
45. ఎవరో వస్తారని..... 167
46. ఎవరి కోసం పర్యావ'రణం'?..... 171
47. ఎందుకీ గందరగోళం?..... 174
48. నైతిక, రాజకీయ అస్పష్టత..... 178
49. అబద్ధాలు, అర్ధసత్యాలు..... 182
50. అన్నా - జగనన్న..... 186
51. ఉగ్రవాదం - జన్మ రహస్యం..... 190
52. భిన్న ఆలోచనల్లో ఒక ఏడాది..... 194
53. 'సకల' ప్రయోగం..... 198
54 ...మాటలకు అర్థాలే వేరులే..... 202
55. భవిష్యత్తుపై బెంగ..... 206
56. అగోచర సత్యాలు 209
57. చిల్లర సిద్ధాంతాలు..... 213
58. పిరికి చేష్టలు..... 217
59. మద్య సత్యాలు..... 221
60. అసహన రాజకీయాలు 225
61. సపాత్ర దానం..... 228
62. గణాంక తంత్ర దేశం..... 232
63. చక్ర భ్రమణం..... 236
64. రైళ్ళకోసం యాచన - యోచన..... 240
65. ఎర్రపెట్టె మాయాజాలం..... 244
66. 'కాలుజారిన' చెయ్యి 248
67. హిందూ వివాహ చట్రం..... 252
68. జేబులు కొట్టే హక్కు..... 256
69. ఇసుక నుండి తైలంబు..... 260
70. చాప కింద నీరులా..... 264
71. భయానక వర్తమానం..... 268
72. పతనానంతరం?..... 272
73. కరవు - చీకట్లు..... 276
74. ప్రభుత్వాల క్విడ్ ప్రో కో..... 280
75. ప్రాణం ఖరీదు..... 283
76. ఉచిత నిరుద్యోగం..... 287
77. దండలో దారం 291
78. ఊ ... అంటే ఉలికిపాటు..... 295
79. దృష్టి మళ్ళింపు..... 299

80. కావాల్సింది భావ వైవిధ్యం..... 303
81. నిరర్థక నియంత్రణలు..... 307
82. సంక్షేమ రాజ్య సంరక్షకుడు..... 311
83. సృజనాత్మక దారిద్ర్యం 316
84. నోట్లతో ఓట్ల బదిలీ 320
85. రాజ్యం - స్వీయ రక్షణ..... 324
86. వాచాలతకు విరుగుడు..... 328
87. యుద్ధోన్మాద ప్రమాదం..... 332
88. ఈ చీకటి విడిపోయేదెప్పుడు?..... 336
89. దొరికిన కాసేపే దొంగలు..... 340
90. మత ప్రేరిత ఉన్మాదం..... 344
91. బడ్జెట్ తంతులు..... 349
92. విజ్ఞతకు పరీక్ష..... 353
93. చరిత్ర చౌరస్తాలో భారత్..... 357
94. పాలనా వైఫల్యాలు..... 360
95. ఎందుకింత ఆశ్చర్యం?..... 365
96. నాగరికత - నిబంధనలు..... 369
97. తొమ్మిదేళ్ళ నిర్వాకం..... 373
98. 'భద్రతా' విపత్తు!..... 377
99. విభజన జరిగేనా?..... 381
100. సవరణ అంటే కష్టం..... 385
101. విషాద ఘట్టం..... 389
102. వైకుంఠపాళి..... 394
103. ముసుగు తొలగిద్దాం..... 398
104. చట్టాలు ధర్మబద్ధమేనా?..... 402
105. ఎందుకీ వర్గ కసి?..... 406
106. రాజ్యం దోపిడీదారుల భోజ్యం..... 411
107. విముక్తి మార్గం..... 416
108. వ్యక్తిగత కర్తవ్యం..... 420
109. రాచరిక ప్రజాస్వామ్యం..... 424
110. అనాగరీకరణ..... 428
111. గుత్తాధికారాలతోనే చేటు..... 432
112. ఉదారవాద ఎజెండా..... 436
113. ముందుకెళ్లే దారి..... 440
114. అనార్కిజం, అయోమయం..... 444
115. ఉగాదులు, ఉషస్సులు ఉన్నాయ్..... 448
116. స్వయం పాలన దిశగా 452
117. విభజనకు అటు, ఇటు..... 456
118. ఇది ఉద్వేగాల యుగం..... 460
119. మహా తమాషా భారతం..... 465
120. నిర్ణయం మనదే, పర్యవసానాలూ మనకే..... 469
121. సోషలిజం వచ్చేసింది!..... 473
122. కాగితాలయిపోయాయి... సెలవు..... 477

ఆటనియమాల్ని మార్చే ఇంధనం

పాఠకులు లోతుగా ఆలోచించేలా ఈ వ్యాసాల్ని జాహ్నవి రాశారు. దాదాపు నాలుగేళ్లపాటు ఆంధ్రజ్యోతి దినపత్రికలో వీక్లీ కాలమ్‌గా సాగిన 'మేధోమథనం' వ్యాసాలు పూర్తయి ఇప్పటికి నాలుగేళ్లు కావస్తోంది. వాటిల్లో తన అంచనాలు ఈ నాలుగేళ్లలో ఏ మేరకు రుజువయ్యాయన్నది పక్కనపెడితే...ఆ వాదనలకు ఇప్పటికీ వన్నె తగ్గలేదు.

మన జీవితంలో ఓ 60-70శాతం మాత్రమే మన చేతుల్లో ఉంటుంది. మిగిలిన 30-40 శాతం...సమాజం, ప్రభుత్వం ఇలా మన చుట్టూ ఉన్న ప్రపంచం చేతుల్లో ఉంటుంది. ఇది ఉజ్జాయింపు అంచనాయే! చుట్టూ ఉన్న సమాజం, రాజకీయం, పాలన సరిగా లేకపోతే మనం ఎంత తపనపడ్డా, కష్టపడ్డా అనుకున్న స్థాయికి చేరలేకపోవచ్చు. ఆశించిన ఆనందాల్ని పొందలేకపోవచ్చు. అందుకే ఆ 30-40 శాతం గురించి చెప్పిన జాహ్నవి 'మేధోమథనం' మనకు అంత ముఖ్యమైనది.

యువత కావచ్చు, మిగిలిన వయసులవారు కావచ్చు...ప్రొఫెషనల్‌గానే జాహ్నవి మేధోమథనంలో భాగస్వాములవ్వండి. ఇందులోని వ్యాసాలను గతంలో చదివినవారు కూడా మరోమారు చదవటం మేలు. మేధోమథనం వ్యాసాల తదనంతర పరిణామాల నేపథ్యంలో వాస్తవాలను బేరీజు వేసుకుని అభిప్రాయాలను మెరుగుపరచుకోవడానికి ఇది అవసరం.

స్వతంత్రం వచ్చిన నాటి నుండి మనదేశంలో ఆర్థికస్వేచ్ఛను అరికట్టి, ప్రభుత్వానికి గుత్తాధిపత్యాన్నిచ్చే లైసెన్సు-పర్మిట్-కోటా రాజ్యం కొన్ని దశబ్దాలపాటు నడిచింది. గతకాలపు తప్పిదాలు, వైఫల్యాల కారణంగా 1991లో తీవ్ర ఆర్థిక సంక్షోభం దేశాన్ని కుదిపేసింది. దశాబ్దాలపర్యంతం దేశంలో ఉత్పాదకతని, ఆర్థికస్వేచ్ఛని అణచివేసిన పర్యవసానమే 1991 సంక్షోభం. ఆపద్ధర్మంకొద్దీ, సంక్షోభ సమయంలో కొంతమేరకు పోటీవ్యవసస్థని ఆర్థికరంగంలో తేవటానికి సంస్కరణలని మనం చేపట్టాం. వాటి వల్ల కొన్ని ఫలితాలు వచ్చాయి. కానీ ఇప్పటికీ ఆర్థికవ్యవస్థలో ప్రభుత్వ పెత్తనం వివిధ రూపాలలో కొనసాగుతోంది. నిజమైన పోటీ, సంపదసృష్టి కాకుండా రాజకీయ పలుకుబడి, గుత్తాధిపత్యం, ఆశ్రితపక్షపాతం, బ్యాంకు రుణాలలో రాజకీయ జోక్యం, 'క్రోనీ కేపిటలిజం', వ్యవసాయ రంగంలో రైతుల నడ్డివిరిచే ఆంక్షలు, ఇంకా కీలకరంగాలలో ప్రభుత్వ గుత్తాధిపత్యం, అంతులేని అవినీతి - ఇవన్నీ గతకాలపు బూజుపట్టిన సిద్ధాంతాల అవశేషాలే. అందుకే ఆర్థిక స్వేచ్ఛని, పోటీని ఆహ్వానించిన పాశ్చత్య దేశాలు, జపాన్ స్థాయిని మనం అందుకోలేకపోతున్నాం. ఆలస్యంగా పోటీవ్యవస్థని ప్రవేశపెట్టిన చైనా శరవేగంగా ఎదిగి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలకపాత్రని పోషిస్తోంది. కానీ అపసవ్య విధానాల వల్ల ఇప్పటికీ భారత్ అతి బీదదేశాల జాబితాలోనే ఉంది.

ఒక పౌరుడిగా, ఐఏఎస్ అధికారిగా, రాజకీయ ఉద్యమకారునిగా ఎన్ని అవతారాల్లో పనిచేసినా, చేస్తున్నా...నా లక్ష్యం ఒక్కటే. నివారించదగ్గ బాధలను తొలగించి, వివక్ష లేకుండా ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలనిచ్చే క్రియాశీల వ్యవస్థల్ని ఈ దేశంలో నిర్మించటం! లోక్‌సత్తా కావచ్చు, దానికి మాతృసంస్థయిన ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) కావచ్చు... ఈ వ్యవస్థీకృత నిజాయితీ కోసమే పనిచేస్తాయి. వ్యక్తిగత నిజాయితీని ప్రజాజీవితంలో ఓ కనీస

లక్షణంగానే భావిస్తాయి. జాహ్నవి ఒక స్వేచ్ఛావాది. జాహ్నవి మేధోమథనం కూడా ప్రధానంగా హేతుబద్ధ ఆలోచన, స్వేచ్ఛ, అందుకు వ్యవస్థీకృత ఏర్పాట్లు అనే మూడు అంశాలే గీటు రాళ్లుగా సాగుతుంది. ప్రభుత్వం నామమాత్రంగానే ఉండాలని, ప్రభుత్వానికీ – ప్రజలకూ మధ్య ఎటువంటి అడ్డుగోడలూ లేకుండా పారదర్శకంగా ఉండాలని వాదిస్తుంది.

ఇలా హేతుబద్ధమైన, నిజమైన ప్రజాస్వామ్యయుతమైన వాదనల్ని చాలా శక్తిమంతంగా జాహ్నవి తన వ్యాసాల్లో వినిపించారు. విభిన్నమైన పరిణామాలు, ఘటనలను విశ్లేషించే క్రమంలో కూడా ఎక్కడా తన గీటురాళ్ల కార్యాకారణ సంబంధం చెదరకుండా చూసుకున్నారు. పడికట్టు పదాల జోలికి పోలేదు. భావాలకు, వాటి వడికి తగ్గట్టుగా మాటల్ని వినియోగించారు, వాక్యాల్ని నిర్మించారు, వ్యాసాలను కదం తొక్కించారు.

(ఫా బియన్) సోషలిస్టు భావజాలం, లైసెన్స్‌రాజ్ వ్యవస్థ కలగలిసి మనదేశంలో ఎలా కోట్లాదిమంది ప్రజల ఎదిగే అవకాశాలను దెబ్బతీశాయో వివరించటానికి జాహ్నవి పలు వ్యాసాలను కేటాయించారు. పైకి స్వేచ్ఛ, పేదరిక నిర్మూలన అని నినాదాలిస్తూ.. వాస్తవంలో వాటికి వ్యతిరేకంగా సోషలిస్టు భావజాలురు ఎలా వ్యవహరించారో, ఓట్లు, సీట్లు పొందిన సాంప్రదాయ పార్టీలు, శక్తులు వారితో ఎలా కుమ్మక్కయ్యాయో నిర్మొహమాటంగా వివరించారు.

అ వన్నీ వాస్తవాలే ! అయితే.. జాహ్నవి భావాలతో ప్రాథమికంగా ఏకీభవిస్తూనే, కొంత విభేదిస్తున్నాను. ఈ కోణంలో వారు మేధోమథనంలో కొన్నిచోట్ల లోక్‌సత్తా పేరును కూడా ప్రస్తావించారు. సోషలిజం, కమ్యూనిజం కొంత తేడాతో పర్యాయపదాలే అనుకుంటే.. వాటిలోనిదంతా తప్పే, ప్రజావ్యతిరేకమే అని కొట్టిపారేయటం తగదన్నది లోక్‌సత్తా భావన. ఇదేసమయంలో.. మనదేశంలో సోషలిస్టువాదులు చేసిన తప్పులు చాలా ప్రత్యేకమైనవి, మనందరికీ తీవ్రనష్టం చేసినవని గుర్తించాలి.

ప్ర పంచంలో ఎక్కడ పేదరికం తగ్గినా అందుకు కారణం మంచి చదువు, ఆరోగ్యం ప్రధాన కారణాలు. చివరికి కమ్యూనిస్టు దేశాలుగా చెప్పుకునే చైనా, క్యూబాల్లో కూడా ఆ రెండు రంగాలకూ కీలక ప్రాధాన్యత ఇచ్చారు. పేదల సంఖ్యను చైనా రికార్డుస్థాయిలో తగ్గించి గత 20 – 30 ఏళ్లలో 80 కోట్లమందిని పేదరికం నుంచి బైటపడేయగలిగిందంటే.. అందుకు స్వేచ్ఛా మార్కెట్ సంస్కరణలతోపాటు నాణ్యమైన చదువు కూడా కీలక కారణం. కానీ మనదేశంలో సోషలిస్టువాదులు సొంతంగా ప్రభుత్వాల్ని ఏర్పాటు చేసినా, కింగ్‌మేకర్లుగా ఉన్నా కూడా ఎక్కడా మంచి చదువు, ఆరోగ్యం కోసం పోరాడలేదు. పేదల తరపున నిలబడ్డామంటూ నినాదాలు, రాజ్యాంగ వ్యతిరేక ధర్నాలు, రాస్తారోకోలు తప్ప.. పేదరికాన్ని నిర్మూలించే విధానాల కోసం ప్రయత్నించలేదు. చాలా సందర్భాల్లో సంక్షేమం పేరుతో పేదరికాన్ని కొనసాగించే విధానాలకు మద్దతు పలికారు. విద్య, ఆరోగ్యం అందించటం రాజ్యవ్యవస్థ బాధ్యత కాదు అనే తన వాదం వల్లే.. సోషలిస్టు, కమ్యూనిస్టు భావజాలురు చేసిన ఆ అసలైన తప్పిదాన్ని జాహ్నవి ప్రస్తావించలేదనుకుంటా.

రా జ్యవ్యవస్థ జోక్యం కచ్చితంగాసాధ్యమైనంత తక్కువగా ఉండాలి. కానీ కేవలం శాంతిభద్రతలు, చట్టబద్ధపాలనకే పరిమితమైతే.. రాచరికానికి, ప్రజాస్వామ్యానికి సాంకేతిక పెద్ద తేడా ఏమీ ఉండదు (ఈ చట్టబద్ధపాలన కూడా మనదేశంలో సక్రమంగా లేదనుకోండి). ఆధునిక ప్రజాస్వామ్యంలో సాంకేతిక పురోగమనం వల్ల ఒక దేశం నుంచి ఇంకో దేశం మంచిని కావచ్చు. గుణపాఠాల్ని కావచ్చు.. నేర్చుకోవటం సులువైంది. ఒకరు బాగుపడాలంటే, ఇంకొకరు

నష్టపోవాలనే 'జీరోసమ్' గేమ్ అక్కర్లేకుండా.. అందరికీ ఎదిగే అవకాశాలనివ్వటం సాధ్యమయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. కానీ ఇలాంటి పరిస్థితుల్లో కూడా అవకాశాలను అందుకోలేని పరిస్థితులను ఎదుర్కొంటున్నవారికి కొన్ని రకాల రక్షణలు అవసరం. మనదేశంలో మరీ అవసరం. శతాబ్దాల అమానుష కులవివక్ష పట్ల క్షమాపణగానైనా ఈ భరోసా కల్పించాలి. రిజర్వేషన్లు వంటి ఏర్పాట్ల వల్ల అద్భుతాలేవీ జరగవు కానీ, ఆ భరోసా ఇవ్వడానికి సమాజం, ప్రభుత్వం సంకోచించాల్సిన పన్లేదు. ఇదే సమయంలో.. ప్రభుత్వం సొంతగానో, ప్రయివేటు రంగం ద్వారానో అందరికీ మంచి చదువు, ఆరోగ్యం అందించే ఏర్పాట్లకు బాధ్యత తీసుకోకపోతే, మార్కెట్టే అన్నీ సరిచేసుకుంటుందంటే.. అది దీర్ఘకాలంలో అసమానతల్ని పెంచుతుందే తప్ప తగ్గించదు. అందరికీ ఆరోగ్యానివ్వడం వల్ల పాశ్చాత్య దేశాలలో జీవన ప్రమాణాలు, ఉత్పాదకత గణనీయంగా పెరిగాయి. సంపన్న దేశాలలో అమెరికాలో మాత్రమే ఆరోగ్యరంగంలో చాలా గందరగోళం చోటుచేసుకుంది. ఆ కారణంగానే ప్రపంచంలో అతి ఎక్కువ డబ్బుని అమెరికాలో ప్రభుత్వం, సమాజం ఆరోగ్యం కోసం వెచ్చిస్తున్నా, ఇప్పటికీ ఖర్చుకి తగ్గ ఫలితాలు రావటం లేదు, ఆపైగా ఇంకా లక్షలాది కుటుంబాలు కనీస ఆరోగ్య భద్రత లేక, నిరంతరం భయంతో జీవితాలని గడుపుతున్నారు.

గుత్తాధిపత్యాన్ని తొలగించటం ద్వారానే పోటీపెరిగి ప్రజలకు సేవలు మెరుగ్గా అందుతాయి. అందుకే ప్రభుత్వ లైసెన్స్‌రాజ్ విధానాన్ని బద్దలు కొట్టాలి. అలా కొన్ని రంగాల్లో జరిగాకే మనదేశంలో టెలిఫోన్లు కావచ్చు, స్కూటర్లు, ఇతరత్రా ఉత్పత్తులు కావచ్చు.. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. కానీ మౌలిక వసతులు, పోలీసు వ్యవస్థ వంటి సేవల్లో ప్రభుత్వ గుత్తాధిపత్యం అనివార్యం. ఇక్కడ మార్కెట్ సూత్రం పనిచేయదు. ప్రభుత్వాలు తమ గుత్తాధిపత్యం వల్ల గాడితప్పకుండా, అవినీతికి పాల్పడకుండా చేయాలంటే.. పౌరుల చైతన్యమే విరుగుడు మార్గం. దాన్ని మించింది లేదు. దేశాన్ని చిన్న చిన్న ముక్కలుగా చేసి ప్రత్యక్ష ప్రజాస్వామ్యంతో ప్రజలంతా ఆనందంగా జీవించాలనటం యథాతథంగా ఆచరణ సాధ్యం కాదు. ఆ ఆలోచన అమలవటానికి స్థానిక ప్రభుత్వాలను మూడో అంచె పాలనా వ్యవస్థగా గుర్తించి బలోపేతం చేయటమే మెరుగైన మార్గం. కేంద్రం (జాతీయస్థాయి) – రాష్ట్రం – స్థానిక ప్రభుత్వాలు బలంగా ఉన్న దేశంలో ప్రజలకు సేవలు మెరుగ్గా ఉంటాయి. స్వేచ్ఛ సృజనాత్మకంగా, నిర్మాణాత్మకంగా ఉంటుంది. సంపూర్ణ స్వరాజ్యం లేదా సురాజ్యానికి బలమైన పునాది పడుతుంది.

అలాగే జాహ్నవి ప్రస్తావించిన ప్రభుత్వ జోక్యం సమస్య.. ప్రస్ఫుటంగా మన ఎన్నికల వ్యవస్థవైపు వేలెత్తి చూపుతుంది. చాలా సందర్భాల్లో ఎన్నికల్లో గెలవడానికే ప్రభుత్వ జోక్యాన్ని పెంచుతూ అవినీతిని ప్రారంభిస్తారు. కాలం గడుస్తున్నకొద్దీ సొంతంగా వెనకేసుకోవటం కూడా పెరుగుతుంది. రాజకీయాల్లో మరీ ఎక్కువ కాలం ఉంటే, కాస్త చివరి దశ వచ్చాక, కుటుంబ సభ్యులకు పదవులు ఇచ్చే సమయం వచ్చిందనుకున్నాక, ఇక చాలు అనుకున్నాక..నేతలు నీతులు చెప్పటం చేస్తుంటారు. రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డప్పుడు...వ్యక్తిగతం కోసం కాదు, పార్టీ కోసమే ఆ దొంగ విరాళాలు తీసుకున్నారు అని నమ్మించే ప్రయత్నం చేస్తుండటాన్ని తెలుగు రాష్ట్రాలు సహా పలుచోట్ల చూస్తూనే ఉన్నాం. ఎన్నికల్లో గెలవాలంటే చాలా సందర్భాల్లో విధానాలు, అభ్యర్థి సామర్థ్యం వంటి వాటికన్నా డబ్బు, కండబలం, గెలిచే మొదటి రెండు పార్టీల్లో ఉండటం వంటివి కీలకంగా కొనసాగుతున్నాయి. దీన్ని బాగుచేసే ప్రయత్నం చేయకుండా, పౌరసత్వాన్ని పెంచే ఏర్పాట్లు చేయకుండా... ఉన్నకొద్దీ జనం జీవితాల్లోకి చొరబడే మార్గాన్ని ఇంకా ఇంకా విస్తరించుకుంటూ పోతున్నాయి పార్టీలు. చట్టసభల్లో మాట్లాడాల్సిన ఎమ్మెల్యేలు,

ఎంపీలు నియోజకవర్గ ప్రజల ఇళ్లల్లో కార్యాలకు, ప్రభుత్వ కార్యాలయాల్లో చట్టానికి అతీతంగా పనులు చేసిపెట్టటానికి పరిమితమవుతున్నారు. సమాజంలో అవిద్య, పేదరికం తగ్గేవరకైనా ఇప్పుడున్న ఎన్నికల వ్యవస్థ వల్ల పనిజరగదనేది సుస్పష్టం. దామాషా ఎన్నికల పద్ధతి వంటి ఎన్నికల సంస్కరణలతో ఎన్నికల్లో డబ్బు ప్రమేయాన్ని కట్టడి చేస్తే...ప్రభుత్వ జోక్యానికి ప్రోత్సాహకాలు తగ్గుతాయి. మార్పు తేవడం తేలికవుతుంది. జాహ్నవి వ్యవస్థల ఏర్పాటు ఆవశ్యకత మీద ఎక్కువ దృష్టి పెట్టినందువల్ల...అందులో ఏర్పాట్లు ఎలా ఉండాలో మరీ ఎక్కువ ఇక్కడ మాట్లాడుకోనక్కర్లేదు.

జా హ్నవి కొంత డేటాను మథనం చేసి ఒక గనిని మనకు అందించారు. దాని మీద మనలోని ప్రతి ఒక్కరూ, ముఖ్యంగా యువత, మధ్యతరగతి మథనం చేయాలి. గనిలో నుంచి వీలైనంత తవ్వుకోవాలి. తద్వారా మన జీవితాల్లో 30-40 శాతాన్ని లాభదాయకంగా మార్చుకోగలగాలి. లాభానికి సంబంధించి ఇక్కడ ఇంకో ప్రస్తావన కూడా చేయాలి. విద్యాసంస్థలు సేవ కోసం కాదు, లాభం కోసం అని వదిలిస్తే విద్యాభివృద్ధికి దోహదం చేస్తుందని జాహ్నవి రాశారు. స్థూలంగా కరెక్టే! కానీ లాభం అంటే కేవలం డబ్బే అయితే, ఆ తరహా లాభాల్ని అక్కడ అనుమతించకూడదు. రాజకీయాల్లోకి, ప్రజాజీవితంలోకి అన్ని పనులూ మానుకుని ఎందుకు రావాలి? ఇక్కడా ఏదోక లాభం ఉండాలిగా? ఆ లాభం డబ్బే అయితే...చాలామంది సాంప్రదాయ రాజకీయనేతలు చేస్తున్న దోపిడీని మనం పూర్తిగా తప్పు పట్టలేం కూడా. కాబట్టి డబ్బుకు ఆవల కూడా దీర్ఘకాల లాభాలు, సుఖసంతోషాలు వంటి లక్ష్యాలు ఉన్నాయన్న స్పష్టత కావాలి.

అ టగాళ్లని కాకుండా ఆటనియమాల్ని మారిస్తేనే మనదేశంలో నిజమైన మార్పు వస్తుంది. అధికారం లక్ష్యంగాకాక జనహితాన్ని పెంచే మార్గంగాను, ప్రభుత్వం ఆధునిక రాచరికం కాకుండా మనమిచ్చే పన్నుల డబ్బుతో మన ఓటుతో మన ఉమ్మడి అవసరాలు తీర్చి సేవలందించే బాధ్యత గత సంస్థగాను భావించినప్పుడే ఆర్థికాభివృద్ధి, సామాజిక న్యాయం, అందరికీ ఎదిగే అవకాశాలు, నిజమయిన స్వేచ్ఛ సాధ్యమవుతాయి.

డే టామథనం చేసి కొన్ని డాట్స్‌ని భిన్నంగా, అదనంగా కలుపుకోగలిగితే ఆటనియమాలను మార్చేందుకు మేధోమథనం వ్యాసాలు మనకి కాలుష్యరహిత ఇంధనంలా ఉపయోగపడతాయి. నా మట్టుకు నేను దీన్నో లైవ్‌లీ పుస్తకంగా భద్రపరచుకుంటాను. జాహ్నవి వ్యాసాలపై విమర్శలు చేసినవారిలో ఎక్కువమంది కూడా ఈ సంకలనాన్ని భావాల సంఘర్షణగా తప్ప, వ్యక్తిగత ఘర్షణగా భావించరని నమ్ముతున్నాను. కొన్ని సందర్భాల్లో తన పత్రిక ప్రయోజనాల్ని కూడా లెక్కచేయకుండా ధైర్యంగా జాహ్నవి మేధోమథనం వ్యాసాల్ని ప్రచురించిన ఆంధ్రజ్యోతి ఎడిటర్‌గార్కి, వేమూరి రాధాకృష్ణగార్కి కూడా మనం అభినందనలు చెప్పాలి.

కా గితాలు అయిపోయాయి, ఇక సెలవు అని జాహ్నవి తన వ్యాసాల్ని ముగించారు. కాగితాల్ని, కీబోర్డుల్ని ఇవ్వడానికి అనేకమంది సిద్ధంగా ఉన్నారని మనందరి తరపునా వారికి తెలియచేస్తున్నాను.

మే ధోమథనం సంకలనం విస్తృతంగా ప్రజల్లోకి, ముఖ్యంగా యువతలోకి వెళ్తుందని, జాహ్నవి విరామానంతర కృషిని కూడా ప్రారంభిస్తారని ఆశిస్తూ...

శుభాకాంక్షలతో,

– ఎన్. జయప్రకాష్ నారాయణ్

అంతరావలోకన

స్వాంతంత్ర భారత దేశంలో కొన్ని దశాబ్దాలుగా ఒక రకమైన భావజాల నిస్తేజత అలుముకుంది. దీన్నుంచి బయటపడలేక, మిగతా ప్రపంచం ముందుకు వెళ్తుంటే కళ్లప్పగించి చూస్తూ... మనం వెనకబడిపోయాం. ప్రపంచంలోని ఎన్నో దేశాలు తమ చరిత్ర గతిని మార్చుకున్నాయి. కొన్ని వికసించే దిశగా పురోగమిస్తే, మరికొన్ని తిరోగమన దిశలో అధ: పాతాళంలోకి వెళ్ళాయి. ఉదాహరణకు జపాన్, చైనా, తైవాన్, దక్షిణ కొరియా, సింగపూర్, న్యూజిలాండ్, చిలీ వంటి దేశాలు గత అర్ధ శతాబ్దంలో అనూహ్యమయిన ఆర్థిక ప్రగతిని సాధించాయి. కాని క్యూబా, ఉత్తర కొరియా, వెనిజువేలా, జింబాబ్వే వంటి దేశాలు తమ ప్రజల కనీస అవసరాలు కూడా తీర్చలేనంత అత్యంత దీనావస్థలోకి వెళ్ళాయి.

మన్మోహన్ సింగ్ నాయకత్వంలోని *UPA-2* లో కుంటుపడిన ఆర్థిక అభివృద్ధి మోడీ హయాంలోనూ కొనసాగుతోంది. అప్పటి స్థాయిలో కుంభకోణాలు బయటపడడం లేదు కానీ; ప్రభుత్వాన్ని అడ్డం పెట్టుకొని సంపాదించే వర్గాలు సన్యాసమేమి పుచ్చుకోలేదు. కాంగ్రెస్ హయాంలో మోడీని ఒక రాక్షసుడిగా చూపించిన మీడియా ఛానళ్ళు - ఇప్పుడు అదే మోడీని తలపై పెట్టుకొని పూజిస్తున్నాయి. అప్పట్లో కొందరి ముస్లిముల హద్దుమీరిన చర్యలకు వ్యతిరేకంగా పన్నెత్తి మాట అనలేని పరిస్థితి. ఇప్పుడు గోరక్షణ పేరుతో కొందరు హిందువులు చేస్తున్న తప్పుడు పనులకు అలాంటి రక్షణే లభిస్తోంది. ఇప్పటి వేముల రోహిత్, నోట్ల రద్దు, జి.ఎస్.టి ఉదంతాలు, అప్పటి సల్మాన్ రష్దీ, తస్లీమా, ఉపాధి హామీ పథకం, సర్వీసు టాక్సులను గుర్తు చేస్తున్నాయి.

రెండు హయాములూ ఒకరికి ఒకరు తీసిపోకుండా మన ఆలోచనలను, ఆర్థిక వ్యవస్థను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఏం మారింది? ఏమీ మారలేదు. ఎందుకు మారలేదు? ప్రజలకు చాతనయింది ఓట్లేసి గెలిపించడం వరకే. అంత మెజారిటీ ఇచ్చినా, మోడీ ఎందుకు తడబడుతున్నాడు? చరిత్ర ఎందుకు మళ్ళీ మళ్ళీ పునరావృతమౌతోంది?

కొన్ని దేశాలు ఆర్థిక ప్రగతిపథంలో నడిస్తే, మరికొన్ని తిరోగమన దిశలోకి వెళ్ళటానికి గల కారణాలు ఏంటి? దీనికి సమాధానం – అంతా మన చేతుల్లోనే ఉంది, మన చేతల్లోనే ఉంది. ఇంకా సూటిగా చెప్పాలంటే, మన మెదళ్ళలో ఉంది. దేశాల ఆర్థిక గతిని మార్చేది సహజ వనరులో, ఉత్పాతాలో, యుద్ధాలో కాదు – మనుషుల ఆలోచనలు, సిద్ధాంతాలు, ఐడియాలు.

రోజువారీ పనుల్లో తీరికలేని సామాన్యులకు ఐడియాలు అందించేది మేధావి వర్గం. ఆ మేధావి వర్గమే తప్పుడు భావజాలాలను ప్రజల్లోకి చొప్పించి విశ్వవ్యాప్తం చేస్తే ఏమవుతుంది? వందల సంవత్సరాల పాటు ప్రపంచంలో అత్యంత ధనిక దేశంగా ఉన్న భారత ఉపఖండం...; ఒక థర్డ్ వరల్డ్ దేశంగా రూపాంతరం చెందుతుంది. కోట్లాది మంది ప్రజలు రోగాలకి, నిరుద్యోగానికి, బీదరికానికి బలయి పోతారు.

మన దేశంలో తెరపి లేకుండా జరుగుతున్న అపసవ్యాలకు అసలు కారణం – మనం ఎంచుకున్న తప్పుడు భావజాలం. ఇంకా విపులంగా చెప్పాలంటే మనం ఎంచుకున్న సోషలిస్ట్ సిద్ధాంతం.

నేను ఒక స్వేచ్ఛావాదిని. కాపిటలిస్ట్ సిద్ధాంతాన్ని నమ్మిన అహింసావాదిని. మనిషి వ్యక్తిగత స్వేచ్ఛకి అత్యంత ప్రాముఖ్యత ఇచ్చే తత్వశాస్త్రాన్ని ఆశ్రయించిన మనిషిని. ఒక మనిషి ఇతరులకు హాని కలిగించకుండా తన జీవితాన్ని తనకి నచ్చిన శైలిలో జీవించే హక్కు ఉందని నమ్మే మనిషిని. మనిషి తనకు నచ్చిన వృత్తిని, తనకు ఆసక్తి కలిగించే విద్యను, తనకు ఇష్టమయిన జీవనశైలిని, ప్రపంచంలో ఎవరితోనయినా నిరాటంకంగా వ్యాపార లావాదేవిలు నిర్వహించుకునే హక్కుని కలిగి ఉండాలి – అనే సిద్ధాంతానికి కట్టుబడిన మనిషిని. నా ఈ భావజాలం నైతికమయినదే కాక, భారత దేశాన్ని సుసంపన్న దేశంగా తీర్చిదిద్దే శక్తి దీనిలో ఉందని గట్టిగా విశ్వసించే మనిషిని.

దురదృష్టవశాత్తు బ్రిటిష్ పాలనానంతరం భారతదేశం స్వేచ్ఛావాద సిద్ధాంతం వైపు కాకుండా సామ్యవాద దిశలో పయనించింది. ఏడు దశాబ్దాల తరువాత వెనక్కి తిరిగి చూసుకుంటే మనకు మిగిలింది థర్డ్ వరల్డ్ దేశం అనే స్టేటస్ మాత్రమే.

చరిత్ర పుటలానుసారం ప్రపంచంలోని మొట్ట మొదటి స్వేచ్ఛావాది చైనా దేశపు టావోఇస్ట్ తత్వవేత్త లావ్ ట్జు. దాదాపు రెండు వేల అయిదు వందల సంవత్సరాల క్రితం – ప్రభుత్వం అతి చిన్నదిగా ఉండాలని ప్రతిపాదించాడు. కొన్ని వందల సంవత్సరాలు తరువాత, క్రీ.శ. 4 వ శతాబ్దంలో అదే టావో తత్వశాస్త్రాన్ని నమ్మిన పావ్ చింగ్-యెన్ ప్రభుత్వమంటేనే హింస, బలవంతుడు బలహీనుడిని దోచుకోవటం అన్న సిద్ధాంతాన్ని వ్యాప్తి చేసాడు. అటువంటి భావననే మహాత్మా గాంధీ కూడా తన రచనలలో వ్యక్తీకరించారు. ఒక ఆదర్శవంతమయిన సమాజంలో ప్రభుత్వ వ్యవస్థే అవసరంలేదు. కాని అటువంటి సంపూర్ణమయిన ఆదర్శ సమాజ స్థాపన ఈ జీవితకాలంలో జరగని పని. కాబట్టి, ఏ ప్రభుత్వమయితే అతి తక్కువ పాలనా వ్యవహారాలు నిర్వహిస్తుందో, అదే అత్యంత ఆదర్శవంతమయిన ప్రభుత్వం అని గాంధీ అభిప్రాయపడ్డారు.

ప్రభుత్వం అతి చిన్నదిగా ఉండాలి. దాని భూమిక దేశ రక్షణ, న్యాయ వ్యవస్థ నిర్వహణ, శాంతి భద్రతల పరిరక్షణకు మాత్రమే పరిమితం కావాలనేది నా అభిప్రాయం. నేను కలలుగనే ఆదర్శ సమాజంలో పన్నులు అతి తక్కువగా ఉంటాయి, అసలు రిజర్వు బ్యాంకే ఉండదు, ప్రభుత్వానికి విచ్చలవిడిగా డబ్బు ముద్రించే అధికారం ఉండదు. న్యాయంగా డబ్బు సంపాదించుకొనే అవకాశం ఉన్న సమాజంలో వ్యక్తుల మధ్య సహజంగా ఉండే ఆదాయ అసమానతలతో నాకు ఎటువంటి ఇబ్బంది లేదు. కాని, కష్టపడి పైకి రావాలనుకునే వ్యక్తి మార్గంలో ఆటంకాలు సృష్టించే వ్యవస్థకు నేను వ్యతిరేకిని.

మా అమ్మాయి పుస్తకాల పురుగు. ఇద్దరం కలిసి పుస్తకాల షాపులకి వెళ్ళటం అలవాటు. 2009లో పరీక్ష ఫలితాలు వచ్చిన ఆనందంలో ఇద్దరం ఒక పుస్తకాల షాపుకి వెళ్ళాం. అక్కడ ఫిలాసఫీ సెక్షన్ లో ఎప్పుడో కాలేజీ రోజుల్లో చదివి మర్చిపోయిన Ayn Rand పుస్తకాలు కనిపిస్తే కొని తీరిగ్గా చదివితే ఒక కొత్త ప్రపంచం సాక్షాత్కరించింది. అనుమానాల బూజు తొలగిపోయింది. విముక్తి పొందిన భావన కలిగింది. ఇక ఆపకుండా చదివాను. Paul Mckeever, Ludwig Von Mises, Murray Rothbard, Hans Herman Hoppe, Ron Paul, Thomas Sowell వంటి ఎంతోమంది ఆర్థిక, తాత్విక మేధావుల ఆలోచనలను, విశ్లేషణలను, చదివి, విని, అర్థం చేసుకొనే అదృష్టం కలిగింది. ఎంత క్లిష్టమయిన సామాజిక,

ఆర్థిక, తాత్విక, రాజకీయ సమస్యనయినా, సందర్భాన్నయినా సరైన, సత్యమయిన కోణంలో విశ్లేషించగల సామర్థ్యం అలవడింది.

నాకు క్షుణ్ణంగా అర్థమయిన ఆర్థిక అంశాలను కొందరు ఉన్నత ప్రభుత్వాధికారులతో ప్రస్తావిస్తే, నా ఆలోచనలను ఒక్క క్షణంలో కొట్టి పడేసే వారు. వాళ్ళు వంట పట్టించుకున్న కీన్స్, సోషలిస్ట్ కోణంలో భాష్యం చెప్పేవారు. అప్పుడర్థమయింది మన సమాజానికి పట్టిన శనికి కారణాలేమిటో, పరిష్కారానికి ఎటు నుంచి నరుక్కురావాలో.

మేధావి వర్గం చెమటలు పట్టేలా పని చెయ్యదు. వస్తువులుగానీ, సేవలుగానీ ఉత్పత్తి చెయ్యదు. అది ఉత్పత్తి చేసేదల్లా – ఆలోచనలు, ఐడియాలు మాత్రమే. భౌతికమయిన వస్తు, సేవలు ఉత్పత్తి చేసే వాళ్ళు వాటి క్వాలిటీకి, ప్రమాణాలకు, వాటివల్ల ఏదైనా కీడు జరిగితే పర్యవసానాలకు బాధ్యత వహిస్తారు. కానీ మేధావి వర్గం తమ ఐడియాల వల్ల కలిగే దుష్ట పర్యవసానాలకు బాధ్యత తీసుకోదు. కాబట్టి వాళ్ళ ఆలోచనలను అనునిత్యం ప్రశ్నించడం, ఒకింత అనుమానంతో చూడడం, నిరూపణ అయితేగాని నమ్మకపోవడం, వాళ్ళ పట్ల ఆరోగ్యవంతమయిన సంశయం అవసరం. నేను రాసిన ఈ రాతలు, నా ఆలోచనలు, విశ్లేషణలని కూడా అంతే క్రిటికల్ గా చూసి మరీ ఒక నిర్ధారణకు రావాల్సిందిగా మనవి.

నేను రాసినవేవి నేను కనిపెట్టినవి కావు. ఆర్థిక శాస్త్రంలో నోబెల్ గ్రహీత *Friedrich Hayek* మాటల్లో చెప్పాలంటే *"I am a second hand peddler of ideas"*.

భారత దేశంలో, ముఖ్యంగా తెలుగు సమాజంలో నెలకొన్న భావజాల నిస్తేజత నుంచి బయటకు తీసుకువచ్చే ప్రయత్నమే, ఆంధ్రజ్యోతి లో నేను రాసిన వ్యాసపరంపర. దానిని ఇప్పుడు మీ ముందు పుస్తక రూపంలో ఉంచుతున్నాను. నేను రాసిన ప్రతి మాటను, నా ప్రతి భావాన్ని, విశ్లేషణను, వాస్తవమనే గీటురాయితో పరీక్షించి చూసుకునే బాధ్యత పాఠకులదే. అంత ఓపికున్నవారే, పేజీ తిరగెయ్యండి.

– జాహ్నవి

There are only TWO WAYS of telling the complete truth - Anonymously and Posthumously ---- ***Thomas Sowell***

అంకితం

'జొన్నలి' గా వచ్చి నాలో ఏ రెక్కలకూ అందని కొత్తల్నాన్ని నింపి, నన్ను తిరిగి నిత్య విద్యార్థిని చేసిన నా గారాల కూతురు 'మానస'కు .... ప్రేమతో.

కృతజ్ఞతలు

నా వ్యాసాలను ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన వేమూరి రాధాకృష్ణ గారికి; నాలుగేళ్ళపాటు నా రాతలను భరించిన ఎడిటర్ శ్రీనివాస్ గారికి; అభినందించి, ప్రోత్సహించిన పలువురు మిత్రులు, పెద్దలకు; పుస్తక రూపంలో తెచ్చిందాకా నా వెంటపడిన చల్లగుళ్ళ నరసింహారావుగారికి; భోగాది వేంకట రాయుడుగారికి; ఆఖరు నిమిషం వరకు ప్రసవవేదన అనుభవిస్తూ చేత్తో రాసిన కాగితాలను ఆంధ్రజ్యోతి ఆఫీసులో పరుగు పరుగున అందించడానికి అలవాటుపడిన నా డ్రైవర్లు, వ్యక్తిగత సహాయకులకు; వారాంతం వచ్చిందంటే ఏదో ఆలోచిస్తూ, అన్యమనస్కంగా ఉండడాన్ని విసుక్కున్నా, అప్పుడప్పుడూ మెచ్చుకున్న, నా వ్యాసాలను కత్తిరించి, స్వంత ఆస్తిలా దాచుకున్న నా జీవిత భాగస్వామికి; బాధ్యతగల వ్యక్తులుగా ఎదిగిన నా పిల్లలకు; నా *friend, philosopher, guide* అయిన అన్నయ్యకు; ఎన్నో మంచి విలువలు నేర్పిన మా అమ్మకు; ప్రచురణ కర్తలకు... కృతజ్ఞతలు.

శూన్య నిజంలోకి...

చుట్టూ జరుగుతున్న అక్రమాలు, అన్యాయాలు, అబద్దాలు, రాజకీయ విన్యాసాలు, ఆర్థిక కుంభకోణాలు, నోట్లతో ఓట్లు, ఓట్లతో పదవులు, పదవుల్తో ప్రభుత్వ, ప్రైవేటు దోపిడీలు, నీతిలేని నేతలు, తేనె పూతల పలుకులు – వీటన్నిటిని అనుభవిస్తూ, కలవరిస్తూ, కలవరపడుతూ, క్షోభపడి, గందరగోళపడి అసలు తప్పెక్కడ ఉంది? ఏది మంచి? దేన్ని నమ్మాలి? అనే సందేహాలు మనసు, మేధస్సులను దహిస్తున్నాయా? గుడ్డివాళ్ళు ఏనుగును వర్ణించినట్టుగా ఎవరికి తోచిన రీతిలో వాళ్లు సమాధానపడే పక్షంలో ఈ వ్యాసం, ఈ పుస్తకమే చదవడం ఇంతటితో ఆపెయ్యండి, ఏ సోషల్ మీడియాతోనో కాలం గడిపేయ్యండి.

'మరో వెయ్యికోట్లు కుంభకోణం', 'న్యాయ వ్యవస్థపై నీలినీడలు', 'దివాళా తీసిన చిట్‌ఫండ్స్', 'సినీ తారలపై చిన్న నిర్మాతల సంఘం ధ్వజం...' లాంటి కథనాలు చదివి, అసలు తప్పెక్కడ ఉంది? ఏది మంచి? దేన్ని నమ్మాలి? అనే సందేహాలొస్తే మళ్లీ వెనక్కి రండి.

ప్రతి పరిస్థితికీ ఒక నేపథ్యం ఉంటుంది. ప్రతి సమస్యకూ ఒక చరిత్ర ఉంటుంది. ప్రతి కాలానికీ ఒక గతం ఉంటుంది. జరుగుతున్న అనేక విషయాలకు పూలదండలో దారంలాగా ఉమ్మడిగా, అంతర్లీనంగా, ఒక భావజాల వ్యవస్థ (ఐడియాలజీ) పొగమంచులాగా ఆవరించి, ఆవహించి ఉంటుంది. దాని నాడిని పట్టుకోకుండా, ఆ పొగమంచుని చీల్చి చూడకుండా ఏ విషయాన్నీ స్పష్టంగా, తార్కికంగా (లాజికల్) అర్థం చేసుకోలేం. తప్పుదారిలో పోతాం. తర్కం గనుక సరైనదైతే అది అన్ని విషయాలకూ అన్వయింపబడగలగాలి.

దేశంలోని మనుషుల్ని, వాళ్ల మనసులను, ఆలోచనలను, రాజకీయాలను, పౌర జీవనాన్ని, ఆర్థిక వ్యవస్థను, సాంస్కృతిక, కళారంగాలను నడిపిస్తున్న భావజాలమేది? అది ఎక్కడ్నుంచి మొదలైంది? ఎక్కడికి తీసుకొచ్చింది? ఎటు తీసుకుపోతోంది? ఆ భావజాలపు అద్దాల్లోంచి చూస్తే ప్రస్తుత పరిస్థితులకు, జరుగుతున్న సంఘటనలకు, రగులుతున్న వివాదాలకు, కరుగుతున్న విలువలకు నేపథ్యం బోధపడుతుంది. ఆలోచనలో స్పష్టత వస్తుంది, విశ్లేషణలో హేతుబద్ధత ఉంటుంది.

రాజ్యాలు, రాణులు, సానులు, యుద్ధాలు, సంధులు, మంత్రులు, ఆచార్యులు, భక్తి, ముక్తి గోలలే తప్ప శాస్త్రీయ జ్ఞానం, తార్కికత, హేతుబద్ధవాదం లాంటి ప్రజాబాహుళ్యాలకు పనికివచ్చే వస్తు, వినియోగం విషయాలలో ఏ మాత్రం పురోగతిలేని మధ్యయుగాల్నుంచి, రెండొందల సంవత్సరాల బ్రిటీష్ వాణిజ్య – సామ్రాజ్యవాదం కాలాన్ని దాటుకుని స్వాతంత్ర్యం సంపాదించుకునేటప్పటికి దేశ ఆర్థిక, సామాజిక వ్యవస్థ ఛిన్నాభిన్నమై దరిద్రనారాయణులతో పొంగి పొర్లింది.

ఈ నేపథ్యంలో స్వతంత్రభారత నాయకత్వం సోషలిస్టు పంథాను ఎంచుకుంది. దానికి ప్రజలు కూడా తలూపారు. నెహ్రూ లండన్‌లో చదువుకునే సమయంలో అక్కడ అప్పటి ఫ్యాషనైన ఫాబియన్ సోషలిజం అనే భావజాలాన్ని ప్రధానమంత్రిగా దేశమంతటా అమలుచేశారు. ఫాబియన్ సోషలిజం అంటే చిన్న చిన్న మాత్రల రూపంలో నెమ్మది నెమ్మదిగా సోషలిజం అనే మందును మింగించడం. సోవియట్ రష్యాలాగా కరుడుగట్టిన సోషలిజాన్ని ఒకేసారి విప్లవాత్మకంగా రుద్దకుండా, ఈ పద్ధతిని ఎంచుకోవడంలో చాలా సుళువులున్నాయి.

ఇది సోషలిజం, ప్రజాస్వామ్యం కలిసిన మాంచి బలమైన రాజకీయ అరకు. ఇందులోని ప్రజాస్వామ్య పాలుతో ప్రజామోదం, ప్రపంచ దేశాల ఆమోదం గ్యారంటీ. సోషలిజం పేరుమీద దేశ ఆర్థిక వ్యవస్థ మొత్తాన్ని రాజకీయ నాయకుల గుప్పెట్లో పెట్టుకోవచ్చు. కాబట్టి ఈ విషయం వరకు విపక్షాల మద్దతు కూడా గ్యారంటీ. ప్రణాళిక బద్ధమైన అభివృద్ధి (ప్లాన్డ్ డెవలప్‌మెంట్) పేరుమీద ప్లానింగ్ కమీషన్ లాంటివి ఏర్పరచి ఆర్థిక వనరులన్నిటినీ కేంద్రీకృతం చెయ్యవచ్చు. ఏ పరిశ్రమలను ఎప్పుడు కావాలంటే అప్పుడు జాతీయం చెయ్యవచ్చు. ఏ పరిశ్రమలో ఎవరికి కావాలంటే వారికి లైసెన్సులు ఇవ్వవచ్చు, కోటాలు నిర్ణయించవచ్చు. వాళ్లలో ఎవరిమీదైనా కోపం వస్తే, సవాలక్ష నిబంధనల్లో ఏదో ఒకటి అతిక్రమించారని మూసేయించవచ్చు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఏ వర్గాలను ప్రసన్నం చేసుకోవాలో వారికి వరాలు కురిపించవచ్చు. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న సాంకేతిక అభివృద్ధిని అనుకరించో, దిగుమతి చేసుకునో అదంతా

తమ ఘనతేనని చాటుకోవచ్చు. ప్రభుత్వం దగ్గర ఉన్న అపారమైన వనరులతో విద్యా, వైద్య, సామాజిక, సాంకేతిక, సాంస్కృతిక, రాజకీయ, మీడియా, మేధావి, ఉద్యోగ, కార్మిక, కర్షక, వ్యాపార రంగాల్లో వివిధ సంస్థలను స్థాపించి, పదవులు సృష్టించి, తమను, తమ భావజాలాన్ని, తమ రాజనీతిజ్ఞతను, తమ మేధోశక్తిని, తమ దార్శనికతను, తమ శాంతికాముకతను, తమ ప్రాపంచిక దృక్పథాన్ని, తమ సౌశీల్యతను, తమ సమదృష్టిని, తమ రుజువర్తనను వేనోళ్ళు కీర్తిస్తూ, ఉపన్యాసాలు చెప్పి, వ్యాసాలురాసి, పాఠాలుగా చెప్పి, పాటలు రాసి, సినిమాలు తీసి, తమ 'ఔన్నత్యాన్ని' తరతరాలు గుర్తుంచుకునేలా, తన తరవాతి తరాలు కూడా రాజకీయంగా లాభపడేలా కృషిచేసే ఆస్థాన విద్వాంసులతో ఆ పదవులు నింపవచ్చు.

అంతేనా? తనకంటే కరుడుగట్టిన సోషలిస్టుల నినాదాలను హైజాక్‌చేసి, దానికి ప్రభుత్వ, ప్రజాస్వామ్య పూతపూసి, ప్లానింగ్ కమిషన్ ద్వారానో, మంత్రులు సంఘం ద్వారానో దానికి తలంటి, అలంకరించి, ఒక పథకం తయారుచేసి, దానికో (తన పూర్వీకుల్లో ఒకరి) పేరుపెట్టి, ఓటర్లలోకి వదలి తనకు మించిన సంక్షేమ వీరుడెవరంటూ సవాల్ చేయవచ్చు.

రాజకీయంగా ఇన్ని ప్రయోజనాలున్న ప్రజాస్వామ్య సోషలిజం గాడిలో దేశం కొన్ని దశాబ్దాలు ప్రయాణించింది. అతని కంటే ఘనుడు ఆచంట మల్లన్న అన్నట్లు ఇందిరాగాంధీ రాజకీయ ప్రవేశం తర్వాత సోషలిజం పేరుమీది పెడధోరణులు పెచ్చుపెరిగిపోయాయి.

సోషలిస్టు భావజాలం ద్వారా సంక్రమించిన అంతులేని అధికారాలతో, ఆర్థిక వనరులతో, చట్టసభల్లోని సంఖ్యాబలంతో ప్లానింగ్ కమీషన్ నుంచి ఫ్యామిలీ ప్లానింగ్ వరకు ఈ విష(య)ం పాకింది; లాండ్ సీలింగ్ నుంచి, పెళ్లికాని వారికి కూడా ఆపరేషన్లు చేసే జనాభా సీలింగ్ వరకు – ప్రతిపక్ష నాయకులకు జైళ్ల కూళ్ల వరకూ వెళ్లింది.

ఎన్నికల్లో ఓటమి, మళ్లీ గెలుపు, మళ్లీ, మళ్లీ ... గెలుపు, కానీ రాజకీయం తీరు ఏమాత్రం మారలేదు. మర్మం ప్రజలకు బోధపడలేదు. మేధావులు జుట్లు పీక్కుంటున్నారు. వ్యాసాలు రాస్తూనే ఉన్నారు. సినిమాలు తీస్తూనే ఉన్నారు. తరాలు మారుతున్నాయి గానీ సమాధానం దొరకడం లేదు. పరిమాణంలో వ్యత్యాసాలు తప్పిస్తే, పాలకుల దోపిడీ ఆగలేదు. ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురుచూసి మోసపోయే ప్రజల పిచ్చి చూపులు మారలేదు.

నాకు అధికారమిస్తే పొడిచేసి చూపిస్తామనే యువ, మధ్యస్త, వృద్ధ నాయకుల సంఖ్యా పెరుగుతూనే ఉంది. పన్నుల భారం తగ్గకపోగా కొత్తకొత్త మార్గాల్లో, తమకు

తెలియకుండానే ప్రజల జేబులకు చిల్లులు పడుతున్నాయి. ఉత్పత్తి, ఉత్పాదకత ఎంత పెరిగినా రూపాయి విలువ రోజురోజుకీ దిగజారుతోంది.

ఇందులోని మర్మమేమయా అంటే, పూలదండలో పూలుమారుతున్నాయి గానీ, దారం మారలేదు. పాలకపక్షం, విపక్షం, పాలకపక్షంలోని విపక్షం, విపక్షాల్లోని పాలక పక్షపాత వర్గం – ఇలా అందరిదీ ఒకే భావజాలం. ఒకే ఐడియాలజీ. అది సోషలిజం, భారతీయ బ్రాండు సోషలిజం.

సకల రుగ్మతలకు అదెలా కారణం? ఆ భావజాల దృష్టికోణంలో ఈ దౌర్భాగ్యాలు ఏ విధంగా అనివార్యం?

19-09-2010 ....సమాధానాలు వచ్చేవారం.

అందరిదీ ఒకేబాట - 'శోష'లిజం

దేశంలోని అన్ని రాజకీయ పార్టీలదీ ఒకే భావజాలం - సోషలిజం. కాంగ్రెస్, బిజెపి, టిడిపి, మావోయిస్టులు, అకాలీలు, తృణమూల్, లోక్‌సత్తా ఒకటేమిటి అన్ని పార్టీలూ సోషలిస్టు అజెండాతోనే నడుస్తున్నాయి. తాము సోషలిస్టులం కాదు అని చెప్పే ధైర్యం ఏ పార్టీకీ లేదు. ఎమర్జెన్సీ సమయంలో ఇందిరాగాంధీ జరిపిన రాజ్యాంగ సవరణల్లో చాలా వాటిని తర్వాత వచ్చిన జనతా ప్రభుత్వం తిరగ రాసింది. కానీ దేశపు మౌలిక స్వభావాన్ని తెలియజేసే రాజ్యాంగ పీఠికలో ఇందిరాగాంధీ ఇరికించిన 'సోషలిస్టు' అనే పదాన్ని తీసేయడానికి మాత్రం ఇష్టపడలేదు. ఆమె కంటే తామే పెద్ద సోషలిస్టులం అని నమ్మించడానికి జనతా ప్రభుత్వం పడరానిపాట్లు పడింది. కోకాకోలాని దేశం నుంచి వెళ్లగొట్టి హీరోలయ్యారు. కాకపోతే కోలా పానీయాల వ్యాపారాన్ని తాము 'ఎంపి'క చేసిన ఇద్దరు దేశీయ పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టారు - థమ్సప్, కాంపాకొలా.

ఎన్నికల సంఘం వద్ద నమోదు చేయించుకునే పార్టీలన్నీ తాము సోషలిజానికి కట్టుబడి ఉన్నామని ప్రమాణ పత్రం ఇస్తే తప్ప వాటికి గుర్తింపు రాదు. అంటే మనది సోషలిస్టు దేశమని రాజ్యాంగం బల్లగుద్ది చెబుతోంది. సోషలిజానికి కట్టుబడి ఉన్నామని అన్ని పార్టీలూ లిఖితపూర్వకంగా చెబుతున్నాయి. ఈ రకంగా నాయకులు మారినా, పార్టీలు మారినా పూల దండలోని పూలు ఎన్ని మారినా చెక్కు చెదరని దారం - సోషలిజం. అదే అన్ని రాజకీయాలను, మేధావుల, ప్రజల ఆలోచనలను శాసిస్తోంది. మరి అన్ని పార్టీలూ సోషలిస్టులే అయినప్పుడు ఇంత శత్రుత్వాలు, వైరుధ్యాలు, హింస, పన్నాగాలు, కప్పదాట్లు, అధికార వ్యామోహాలు ఎందుకు? సోషలిజంలో ఇన్ని వెరైటీలున్నాయా? ఉన్నాయి. అసలు సోషలిజం లక్ష్యమేమిటి? సమసమాజ స్థాపన. మరి అందరి లక్ష్యం ఒకటే గదా! కానీ మార్గాలు వేరు. లక్ష్యంవైపు వెళ్లే వేగాలు వేరు. అందరూ కారల్

మార్క్సునే కొలుస్తారు. అందరికీ 'దాస్ కాపిటలే' మార్గదర్శకం. కానీ ఎవరి దారి వారిది. ఫాబియన్ సోషలిజాన్ని తన వీలునుబట్టి, రాజకీయ అవసరాలను బట్టి సవరించుకునే కాంగ్రెస్ పార్టీ మొదలు, చైనాలో 1940ల్లో మావో తెచ్చిన రక్తపాత విప్లవాన్ని భారతదేశంలో కూడా తేవాలనుకునే మావోయిస్టుల వరకు రకరకాల వెరైటీలున్నాయి.

ఈ పార్టీలన్నీ తాము ప్రకటించిన లక్ష్యం కోసం, తాము ఎంచుకున్న మార్గంలో ప్రజాహితం కోరి పయనిస్తున్నాయా లేక; కేవలం రాజ్యాధికార కాంక్షతో పనిచేస్తున్నాయా అనే ప్రశ్నకు సమాధానం వెతుక్కోనక్కరలేదు. వీరి లక్ష్యం, మార్గం సమాజాన్ని ఏ రకంగా మార్చాయి? ఎలా తయారు చేశాయి? ఎన్ని ముక్కలు చేశాయి? ఎన్ని వికృతాలకు కారణమయ్యాయో పరిశీలించాల్సిన అవసరముంది. ఆ సమయం వచ్చింది. ఇందులో ప్రజల, మేధావుల,మీడియా లాంటి వివిధ వర్గాల పాత్ర కూడా తరచిచూడాలి. అన్ని పార్టీల ప్రకటిత లక్ష్యం, రాజ్యాంగం, ఎన్నికల చట్టం నిర్దేశించిన సోషలిజం స్వభావమేమిటి? దాని లక్ష్యమేమిటి? సోషలిజమంటే సామ్యవాదం. అంటే సమసమాజ స్థాపన. దీని మార్గం ఉత్పత్తికి సంబంధించిన వనరుల్ని ప్రభుత్వం హస్తాల్లో పెట్టడం.

సమ సమాజమంటే సమాజంలో పేదా ధనిక అనే తేడాలు లేకుండా అందరూ ఒకే జీవన ప్రమాణాలు కలిగి ఉండాలి. ఉదాహరణకు సినిమా హాల్లో గేట్ కీపరుకూ,; సినిమాలో హీరోగా నటించిన సూపర్ మెగాస్టార్‌కూ ఒకే జీతం, ఒకే జీవన ప్రమాణం. రిక్షా కార్మికుడికీ, విమానం పైలెట్‌కూ... మిలిట్రీ జనరల్‌కు ఒకే జీతం. అదీ సమ సమాజమంటే.

ఇది సాధించాలంటే ఏం చెయ్యాలి? దేశంలోని వనరుల్ని – భూమి, నీరు, పరిశ్రమలు, దుకాణాలు, సినిమా స్టూడియోలు, బ్యాంకులు, ఆటోలు, హోటళ్లు – అన్నీ జాతీయం చెయ్యాలి. అంటే ప్రభుత్వమే ఇవన్నీ నడపాలి. అంటే ప్రభుత్వాధినేత కనుసన్నల్లో, దర్శకత్వంలో, ప్రభుత్వ యంత్రాంగం ద్వారా అన్నీ జరగాలి. మరి ఎవరేం పని చెయ్యాలి? అదీ ప్రభుత్వమే నిర్ణయిస్తుంది. ప్రభుత్వం చెప్పిన పని చెయ్యాలి. ఇచ్చినంత (సమాన) వేతనం పుచ్చుకుని సంతృప్తి పడాలి. అలా ఎందుకుండాలి? అలాగే ఎందుకుండాలి? చేసిన పనిని బట్టి కాకుండా అందరికీ సమాన వేతనం, తద్వారా సమాన జీవనప్రమాణం ఎందుకుండాలి?

ఎందుకంటే సోషలిస్టు సిద్ధాంతం ప్రకారం వనరులన్నీ సమాజానికి చెందుతాయి. భూమి, నీరు, ఖనిజాలు మాత్రమే కాక శ్రమ, మేధస్సు కూడా సమాజానికే చెందుతాయి. ఉత్పత్తిలో వ్యక్తి పాత్ర ఏమీలేదు. అంతా సమాజం పాత్రే. నీదంటూ ఏదీ లేదు. అంతా సమాజానిదే. సమ సమాజంలో డబ్బు పాత్ర ఉండదు. డబ్బే కదా అన్ని చెడులకు మూలం?

లాభాలు, నష్టాలు అనే విషయాలే ఉండవు. అంతా ప్రభుత్వమే నడుపుతున్నప్పుడు వ్యక్తికి లాభ నష్టాలతో పనేముంది?

ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ కష్టపడుతున్నప్పుడు అందరికీ సమానవేతనం అన్యాయం కదా? సోషలిస్టు సిద్ధాంత 'మానవీయ' దృక్పథాల ప్రకారం అది అన్యాయం కాదు. తోటి వారి కోసం త్యాగం చెయ్యడమే 'మానవీయం'. అదే మానవ ధర్మం. అదే మనిషి బాధ్యత. మనిషలు పుట్టిందే అందుకోసం. ఈ బాధ్యతలను మనిషి సక్రమంగా నిర్వర్తించేలా చూడడానికే ప్రభుత్వం ఉన్నది. కారల్ మార్క్స్ దర్శించిన 'శాస్త్రీయ' సోషలిస్టు సిద్ధాంతం ప్రకారం సోషలిస్టు సమాజ ఆవిర్భావం అనివార్యం. దాన్ని ఎవరూ ఆపలేరు. దాని నుంచి ఎవరూ తప్పించుకోజాలరు. సూర్యుడు ఉదయించడమంత స్థాయిలో అనివార్యం. అరచేతిని అడ్డంపెట్టి సూర్యోదయాన్ని ఆపగలరా?

ఈ సిద్ధాంతాన్ని అమలుచేసే క్రమంలో ఏం జరుగుతుంది? ఈ సిద్ధాంతానికి ప్రజాస్వామ్యమనే రాజకీయ ప్రక్రియ తోడైనప్పుడు ఏమవుతుంది? ఈ సిద్ధాంత లక్ష్యం ఆధారంగా ప్రభుత్వాలు ఏమేం చెయ్యవచ్చు? ఈ లక్ష్యాలను సాధించే క్రమంలో రివిజనిస్టు. రియాక్షనరీ, ప్రగతి నిరోధక, స్వార్థపర, అరాచక, నయా వలసవాద, పెట్టుబడిదారీ .. లాంటి శక్తులు సృష్టించే అడ్డంకుల్ని ఎలా తొలగించవచ్చు?

సిద్ధాంతాల లోతుల్లోకి వెళితే ఇలాంటి ఎన్నో ప్రశ్నలు ఉదయిస్తాయి. వాటన్నిటికీ సైద్ధాంతిక సమాధానాలు దొరుకుతాయి. వాటి ప్రకారం సోషలిజం మంచి చెడులు బేరీజు వేసుకోవచ్చు. ప్రస్తుతానికి మన రాజకీయ పార్టీల సోషలిస్టు అజెండా కారణంగా జరుగుతున్న విపరీత పరిణామాలు ఎలా వచ్చాయో, అలాంటివి జరగకుండా ఉంచే అవకాశం ఏమన్నా ఉన్నదా అని పరిశీలించాల్సిన అవసరం ఉంది.

26-09-2010

గొంగట్లో తింటూ

సమ సమాజాన్ని సృష్టిస్తామనే రాజకీయ పార్టీలు తామంతా అనుసరించే సోషలిస్టు సిద్ధాంతం ప్రకారం ఏం చేస్తామని చెబుతున్నాయి? 'పేదరికం నిర్మూలిస్తాం, ప్రతి మనిషికీ కూడు, గుడ్డ, గూడు..; తర్వాత విద్యా. ఆరోగ్యం- తర్వాత ప్రతి ఒక్కరికీ ఉద్యోగం, 'సరిపడా' జీతం, సెల్‌ఫోన్, సైకిలో, కారో, సరిపడా విశ్రాంతి; పర్యాటకానుభవం, రాజకీయ, ఆర్థిక స్వాతంత్ర్యం, సామాజిక న్యాయం, సినిమా టికెట్లు, ఇవన్నీ ఇస్తాం. దేని కోసమూ వెతుక్కోకుండా మీకు అందుబాటులో ఉంచుతాం.'

ఇదంతా చేయడానికి ఏమేం అధికారాలు ఏర్పరచుకున్నాయి? ఇంకా ఏ అధికారాలు కోరుకుంటున్నాయి? సహజ వనరులన్నీ ప్రభుత్వానివే. ప్రజలు సంపాదించిన డబ్బులో ఎంత మేరకు పన్నుల రూపంలో వసూలు చెయ్యొచ్చో ఎప్పటికప్పుడు నిర్ణయిస్తాం. కాదు, కాదు. ప్రజలు సంపాదించిన డబ్బులో ఎంత భాగం వాళ్లు ఉంచుకోవచ్చో ఎప్పటికప్పుడు నిర్ణయించి, మిగిలిందంతా పన్నుల రూపంలో లాగేసుకుంటాం. అలా లాక్కున్న డబ్బును ఏ పథకాలకు ఏ రకంగా ఖర్చు చెయ్యొచ్చో నిర్ణయిస్తాం. ఏ వర్గాలకు ఏ(ఎన్నికల) సమయంలో ఎలాంటి మేళ్లు చెయ్యాలో నిర్ణయిస్తాం. ఆస్తిహక్కు రాజ్యాంగ హక్కు కాదు. ప్రాథమిక హక్కు కాదు. కేవలం చట్టపరమైన హక్కు మాత్రమే. ప్రభుత్వం లాగేసుకోనంతవరకే ఆస్తి నీది. ఇంకో చట్టం ద్వారా ఎవరి ఆస్తిని ఎప్పుడు కావాలంటే అప్పుడు స్వాధీనం చేసుకుంటాం. ప్రభుత్వం పరిహారం ఇస్తే ఇస్తాం. ఎంత ఇవ్వాలనుకుంటే అంత ఇస్తాం. ఇచ్చిన పరిహారంతో ఇంకాస్త దూరంపోయి ఆస్తి కొనుక్కుంటే, దాని రిజిస్ట్రేషన్‌కు గోళ్ళూడగొట్టి మరీ పన్ను వసూలు చేస్తాం. ప్రజలు ఏ పనులు ఏ రకంగా చేయాలో పేజీలకొద్దీ రూల్సు, రెగ్యులేషన్లు తయారు చేస్తాం. అవి మీకేకాదు, ప్రభుత్వ యంత్రాంగానికి కూడా అర్థం కాకపోయినా

ఫర్వాలేదు. ఎలాగూ వాటిని పాటించడం సాధ్యం కాదు, పాటించరు గనక లంచాలు గుంజుతాం. రాజకీయంగా ఎదురొస్తే రూల్సు అతిక్రమించారంటూ మీమీద కేసులుపెట్టి అడ్డు తొలగిస్తాం. మరీ అవసరమైతే జైలుకు పంపుతాం. బుద్ధిగా దారికొస్తే బెయిలిప్పిస్తాం. తర్వాత కేసు మాఫీ చేస్తాం, 'ప్రజా క్షేమం' దృష్ట్యా.

గమనించాల్సిన విషయం ఏమిటంటే రాజకీయపార్టీలు చేసే వాగ్దానాలు, ప్రభుత్వాలు అనుభవించే అధికారాలు అన్నీ సోషలిస్టు సిద్ధాంతాల ప్రకారం సరైనవే. దేన్నీ ఆక్షేపించడానికి వీల్లేదు. మరి గొడవ దేనికి? గొడవలు – సోషలిస్టు లక్ష్యాలు, ప్రభుత్వ అధికారాల విషయంలో కాదు. గొడవలు – కేవలం లబ్ధిపొందే వర్గాల మధ్య మాత్రమే. ప్రభుత్వం పన్నులు, ఇతర రూపాల్లో వసూలుచేసిన డబ్బును ఏ వర్గాలు ఎలా పంచుకోవాలనే వాటాల విషయంలో మాత్రమే.

లక్ష్యాలు, అధికారాలను ఒక్కటొక్కటిగా విశ్లేషిస్తే బోధపడేదేమిటి? పేదరిక నిర్మూలన, ఇది ప్రపంచంలోని ప్రతి సోషలిస్టు మేధావికి చెరగని స్వప్నం. ప్రతి నాయకుడూ రాజకీయ అక్షరాభ్యాసం చేసిన్నాడు చెవిలో ఊదే గాయత్రి మంత్రం. పేదరికం నిర్మూలించడమంటే కూడు, గుడ్డ, గూడు ఉంటే చాలదు. అంటే అందరికీ ఆస్తిపాస్తులు, ఆదాయ వ్యయాలు సమానమవ్వాలి. అదే కదా సోషలిజం లక్ష్యం! స్వాతంత్ర్యం వచ్చిన్నాటితో పోలిస్తే ఈ రోజుల్లో ఆకలి చావులు అత్యల్పం, అతి అరుదు. శరీరానికి పూర్తి అచ్ఛాదన లేకుండా ఉండే వాళ్లూ అరుదే (కావాలని పొట్టి దుస్తులు వేసుకుంటే తప్ప!) అయినా సోషలిస్టు సిద్ధాంతం ప్రకారం పేదరికం పోయినట్టు కాదు. ధనిక పేదల తేడాలున్నంత వరకు సోషలిస్టులకు చేతినిండా పని, నోటినిండా నినాదాలు.

రిక్షా కార్మికుడు కూడా ముకేశ్ అంబానీ స్థాయికి ఎదిగితేనో లేక ముకేశ్ అంబానీ రిక్షా కార్మికుడి స్థాయిలో ఒదిగిపోతేనో మాత్రమే సోషలిజం సిద్ధించినట్టు లెక్క.

పేదరిక నిర్మూలనకు ప్రభుత్వాలు అనుసరించే వ్యూహం ఏమిటి? బియ్యం పంపిణీ, జనతా వస్త్రాలు,ఇళ్లు కట్టించడం, స్కూలు ఫీజులు కట్టడం, బస్ పాసులు, ప్రభుత్వ ఉద్యోగాలు సృష్టించడం (ఈ మధ్య తగ్గించేశారు గానీ!). ప్రైవేటు ఉద్యోగాల సృష్టికోసం రాయితీలివ్వడం, ఏదన్నా ప్రమాదం జరిగితే ఎక్స్‌గ్రేషియా, అనారోగ్యం పాలైతే ఉచిత వైద్యం, అందరికీ భూమి ... ఇంకా ఇంకా ఎన్నో. ఒకే ఒక ప్రశ్న!

ఇదంతా ఎవరి డబ్బుతో? నాయకుల, మంత్రుల, ముఖ్యమంత్రుల డబ్బుతోనా? కాదు. ప్రజల నుంచి బలవంతంగా పన్నుల రూపంలో వసూలు చేసిన డబ్బుతో. ప్రజల డబ్బుతో. ఇవన్నీ కల్పించిన నాయకులు దేవుళ్లు! అగ్గిపెట్టె, ఉప్పు దగ్గరినుంచి కార్లు, పెట్రోలు, విమానయానం వరకు ప్రతి వస్తువు మీద, ప్రతి సేవ మీద పన్నులు చెల్లించి డబ్బు సమకూర్చిన

ప్రజలకిచ్చే ముద్దుపేరు – 'దురాశా పరులైన ధనిక వర్గాలు', 'బూర్జువా శక్తులు', 'దళారీలు', 'ప్రగతి నిరోధకులు'..

చాలా మంది ప్రజలు ఒక చేత్తో పన్నులు కడుతూ మరో చేత్తో రాయితీలు పొందుతారు. తను కొనే పెట్రోలు రేటులో సగం పన్నులకే పోతోందని గమనించడు. తన పిల్లలు స్కూలుకెళ్లడానికి ఆర్టీసీ బస్‌పాస్‌కు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోందని తెగ సంబరపడిపోతాడు. పేద, ధనిక తారతమ్యాలు లేని సమసమాజ స్థాపన కోసం ప్రభుత్వం చేసే వస్తాల పంపిణీ, ఇళ్లు కట్టించడం, కాలేజీ ఫీజులు కట్టడం, వృద్ధాప్య పింఛన్లు వగైరాలకు సోషలిజాన్ని కోరుకునేవారూ అభ్యంతరం చెప్పే వీలులేదు. ఇందులో అర్హులు, అనర్హులనే మీమాంస కూడా వృథా ప్రయాసే. రిక్షా కార్మికుడు ముకేశ్ అంబానీ కానంత వరకు అన్నిటికీ అర్హుడే.

ఏ అధికారాలు ఉపయోగించి ప్రభుత్వాలు ఇవన్నీ చేస్తాయి? తన పోలీసు అధికారాలు ఉపయోగించి. పన్ను వసూళ్ల రూపంలో అందరి మెడ మీదా కత్తిపెట్టే అధికారాలు ప్రభుత్వాలు కలిగి ఉన్నాయి. ఆ అధికారాలు మనమే ఇచ్చాం. పన్నుల వసూళ్ళు, ఆస్తుల స్వాధీనం, ఆస్తుల జాతీయం ద్వారా ప్రజలు సంపాదించిన సంపదను పున:పంపిణీ చేసే అధికారాలు ప్రభుత్వాలకు మనమే ఇచ్చాం.

ప్రభుత్వాలు ఏ'పనీ' చెయ్యవు. ఏదీ ఉత్పత్తి చెయ్యవు. సంపదను సృష్టించవు. అవి చేసేదంతా ప్రజలు సృష్టించిన సంపదను పున:పంపిణీ చెయ్యడం మాత్రమే. అదీ– సంపద సృష్టించిన వారి అనుమతితో నిమిత్తం లేకుండా! రిక్షా కార్మికుడు కష్టపడి సంపాదించిన డబ్బుతో కొనుక్కున్న మద్యం మీద వేసిన పన్నుతో – రైతు భార్యకు ఆరోగ్య శ్రీ ఆపరేషన్. రైతు పండించిన ధాన్యం నుంచి లెవీ వసూలు చేసి – రిక్షా కార్మికుడికి రెండ్రూపాయలు బియ్యం. ఉద్యోగస్తుల నుంచి వసూలు చేసిన ఆదాయపు పన్నుతో– పరిశ్రమలకు రాయితీలు. పరిశ్రమల నుంచి వసూలు చేసిన ఎక్సైజు పన్నులతో – ఉద్యోగులకు పి ఆర్ సి.

వెరసి ప్రజల్లోని అన్ని వర్గాలూ లబ్ధిదారులే. అన్ని వర్గాలు పన్ను బాధితులే. ప్రతివారూ ఇతరుల డబ్బుతో లబ్ధిపొందుతున్నామని సంబరపడిపోతారు. ప్రభుత్వం ఒక జేబులోని డబ్బు కొట్టేసి ఇంకో జేబులో పెడుతోందని; ఆ క్రమంలో కొంత డబ్బు కాజేస్తూ, దాచేస్తూ కూడా ఎంతో సంక్షేమం చేస్తున్నట్టు ఫోజు కొడుతోందనీ తెలుసుకోరు. అయితేనేం? సమసమాజ స్థాపనకు ఇది తప్పదు. అందరి జేబుల్లోనూ ఒకే పరిమాణంలో డబ్బు ఉండే వరకూ ఈ చేతి గారడీ తప్పుకాదని సోషలిజం చెబుతోంది.

పన్ను చెల్లింపుల్లో ఒక్కటీ స్వచ్ఛందం కాదు. అంతా బలవంతమే. సమసమాజమే లక్ష్యం, బలవంతపు వసూళ్లే మార్గం.

ఇంకా ఉంది.

3-10-2010

ప్రజాస్వామ్యం ముసుగులో

ప్రజాస్వామ్యం పట్ల ప్రజల్లో కొన్ని అపోహలున్నాయి. దశాబ్దాలుగా పాలకులు, రాజకీయ, మీడియా, మేధావి వర్గాలు చేస్తున్న ప్రచారం కారణంగా కొన్ని తప్పుడు అవగాహనలు పాతుకుపోతాయి. వీటి బూజు దులపాల్సిన సమయం వచ్చింది. ప్రభుత్వాలను ఏర్పరచడానికి ఉన్న అనేకానేక మార్గాల్లో ప్రజాస్వామ్యం కూడా ఒక మార్గం మాత్రమే. ప్రభుత్వాన్ని వంశపారంపర్యమైన రాచరిక వ్యవస్థ ద్వారా కూడా ఏర్పరుచుకోవచ్చు. నిజాం పరిపాలన అలాంటిదే. యుద్ధం, ఆక్రమణల ద్వారా కూడా ఏర్పరచవచ్చు. భారతదేశంలో బ్రిటీష్ ప్రభుత్వం ఏర్పడింది ఇలాగే. ఉన్న ప్రభుత్వాన్ని కూలదోసి – నియంతృత్వాన్ని నెలకొల్పితే, అదీ ప్రభుత్వమే. పాకిస్థాన్‌లో జియా ఉల్ హక్, ముషారఫ్‌లు చేసిందదే. కొన్నిసార్లు ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికయ్యాక కూడా రాజ్యాంగాన్ని రద్దుచేసో, భ్రష్టు పట్టించో నియంతృత్వ అధికారాలను చేజిక్కించుకునే ప్రభుత్వాలూ ఉంటాయి. జర్మనీలో హిట్లర్, ఇటలీలో ముసోలిని, జింబాబ్వేలో ముగాబే, కొంతమేరకు ఎమర్జెన్సీ సమయంలో ఇందిరాగాంధీ ప్రభుత్వాలు ఈ కోవలోనివే. ఆఖరుకు కరుడుగట్టిన కమ్యూనిస్టు దేశాల్లో కూడా ప్రభుత్వాల ఎంపిక పైకి చూడ్డానికి 'ప్రజాస్వామ్య' బద్ధంగానే జరుపుతారు.

ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రభుత్వాలు ఏర్పడడం అనేది ప్రజల హక్కులకు గ్యారంటీ ఇవ్వదు. ఎన్నికైన ప్రభుత్వం ఏమి చెయ్యవచ్చో, ఏమి చెయ్యకూడదో రాజ్యాంగం పరిమితులు విధిస్తుంది. మరి రాజ్యాంగమే ప్రభుత్వాలకు అపరిమితమైన అధికారాలు ఇచ్చినప్పుడు ప్రజాస్వామ్య ప్రక్రియ అనేది తనంతట తానుగా ప్రజల హక్కులను రక్షించజాలదు.

ఇది రాజ్యాంగ, చట్టపరమైన పార్శ్వం అయితే; భావజాలపరమైన పార్శ్వం ఇంకోటుంది. వ్యక్తి స్వేచ్ఛకు, ప్రాథమిక హక్కులకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చే భావజాలం

ప్రభుత్వాల కార్యక్రమాలపై, ప్రభుత్వాలు వ్యక్తి స్వేచ్ఛకు భంగం కలిగించగల అధికారాలపై తీవ్రమైన పరిమితులు విధిస్తుంది. అదే సామ్యవాద భావజాలం మాత్రం ప్రభుత్వాలకు వ్యక్తులపై అపరిమితమైన అధికారాలను ప్రసాదిస్తుంది. అటువంటి వ్యవస్థలో సమాజహితం పేరిట వ్యక్తి నిమిత్త మాత్రుడవుతాడు. వ్యక్తి స్వేచ్ఛ ప్రభుత్వం దయా దాక్షిణ్యాలపై ఆధారపడి ఉంటుంది.

మనదేశం సోషలిస్టు దేశంగా ప్రకటించుకున్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రాజ్యాంగ పరంగానే విపరీతమైన అధికారాలు సంక్రమించాయి. ఉన్న అధికారాలు చాలవన్నట్టు కొత్తకొత్త చట్టాల ద్వారా మరిన్ని అధికారాలను హస్తగతం చేసుకుంటున్నారు. వ్యక్తి స్వేచ్ఛను మరింతగా హరిస్తున్నారు. ఇదంతా సోషలిజం దిశగా వేస్తున్న మరిన్ని ముందడుగులుగా పాలకులు, రాజకీయాలు, మీడియా, మేధావులు కీర్తిస్తున్నారు.

ప్రస్తుతం దేశంలో, రాష్ట్రంలోని కుంభకోణాలు, సమస్యలు, ఆందోళనలు, ఉద్యమాలు, ఉద్వేగాలను ఈ నేపథ్యంలో పరిశీలిస్తే, సోషలిస్టు ఆలోచనలోని లోటుపాట్లు, తప్పించుకోలేని సుడిగుండాలు అర్థమవుతాయి.

ఎమ్మార్ కుంభకోణాన్ని విశాలదృష్టితో చూస్తే ప్రజాస్వామ్యం ముసుగులో రాజ్యాంగం, ఇతర చట్టాల ఆధారంగా వ్యక్తుల హక్కులను తుంగలో తొక్కి – సోషలిజం పేరుమీద పాలక వర్గాలు చేసే దోపిడీ కనబడుతుంది.

1894 లో బ్రిటీష్ వాళ్లు చేసిన భూసేకరణ చట్టాన్ని చెక్కు చెదరనీయకుండా స్వతంత్ర్య భారతదేశంలో అమలు చేస్తూ వచ్చారు. ఈ చట్టం ప్రకారం ప్రభుత్వం (నిజానికి ప్రభుత్వాధినేత) కావాలనుకున్నప్పుడు ప్రజల భూములను సేకరించవచ్చు. చెయ్యాల్సిందల్లా అట్టి భూసేకరణ ఉద్దేశం 'ప్రజాహితం' లేదా 'సామాజిక హితం' కోసం అని ప్రకటిస్తే చాలు. ఇక ఆ భూముల యజమానులకు తిరస్కరించే హక్కు లేదు. పరిహారం విషయంలో ఇచ్చింది తీసుకోవాలి. నచ్చకపోతే కోర్టుకెళ్లవచ్చు. తన జీవిత కాలంలో కోర్టు తీర్పు వస్తుందో రాదో తెలీదు. అసలు భూమిని ఇవ్వననే హక్కు ప్రజలకు లేదు. వ్యక్తి స్వేచ్ఛను, వ్యక్తి ఆస్తిని ఇంత బట్టబయలుగా ప్రజాహితం పేరిట దోచుకునే హక్కును ప్రభుత్వాలకు కట్టబెట్టింది సోషలిస్టు భావజాలమే. ఎందుకంటే ఈ భావజాలం ప్రకారం వనరులన్నీ (భూమి, నీరు, ఖనిజాలు వగైరా) సమాజానికి అంటే ప్రభుత్వానికి చెందుతాయి. మరి ప్రజలెన్నుకున్న 'సోషలిస్టు' ప్రభుత్వం ప్రజాహితం పేరిట వ్యక్తుల భూములను లాక్కుంటే తప్పెలా అవుతుంది?

ఇక్కడ వచ్చిన చిక్కల్లా, – ఏది ప్రజాహితం, ఏది కాదు? రోడ్లు వెడల్పు

చెయ్యడానికి రోడ్డు పక్క భూములను సేకరించడం ప్రజాహితమా? మరి కొత్తగా రోడ్డు వెయ్యడానికో ఆ పేరుమీద పనిలో పనిగా రింగు రోడ్డును వంకర్లు తిప్పి తమ భూములను కాపాడుకుని వేరే వాళ్ల భూములను సేకరిస్తే? నీటిపారుదల ప్రాజెక్టులు కట్టడానికి ముంపుకు గురయ్యే భూములను సేకరించడం ప్రజహితమా? అలంపూర్ రైతుల సాగునీటి కోసం గద్వాల రైతుల భూములను ముంచడం ఎవరికి హితం? మరి ఇండస్ట్రియల్ ఎస్టేటు కోసమో, సెజ్‌ల కోసమో భూములను లాక్కోవడం? ఇవన్నీ ప్రజాహితం కోసమేనని ప్రభుత్వాలు, మేధావులు, కోర్టులు, మీడియా నిర్ధారించేశారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్ పెడితే ప్రైవేటు పరిశ్రమలోస్తాయట. ఉద్యోగాలొస్తాయట. కాబట్టి అది ప్రజాహితమేనట. ప్రైవేటు పరిశ్రమలను లాభాలొస్తాయనుకుంటే పెడతారా? లేక ఉద్యోగాలు పంచిపెట్టడానికి పెడతారా? లాభాలొస్తాయనుకుంటే ప్రైవేటు భూములను తామే కొనుక్కుని పరిశ్రమలు పెట్టరా?

పాలకులు ప్రజాహితమనుకున్న ప్రతిదానికీ ప్రజల భూములను లాక్కునే చట్టమున్నంత కాలం; అలాంటి చట్టాలను సోషలిస్టు భావజాలం సమర్ధించినంత కాలం– సెజ్‌ల పేరిట, ఎమ్మార్ లాంటి స్కీముల పేరిట జరిపే ఈ దోపిడీ ఆగదు. విశేషమేమిటంటే ప్రజల ఆస్తి హక్కును కాలరాసే ఈ 1894 నాటి భూసేకరణ చట్టం అత్యంత దుర్మార్గమయిందని ఏ రాజకీయ పార్టీ, ఏ నాయకుడూ, ఏ స్వచ్ఛంద సంస్థా, ఏ మీడియా, ఏ సోషలిస్టు మేధావీ అనడం లేదు. కోడిగుడ్డుకు వెంట్రుకలు పీకినట్టుగా ఎపిఐఐసితో చేసుకున్న ఒప్పందాల ఉల్లంఘనను గురించి, వాళ్లు సంపాదించిన లాభాల గురించే మాట్లాడుతున్నారు తప్ప; వ్యక్తుల భూములను బలవంతంగా లాక్కుని ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టడమనే 'ప్రజాహితా' న్ని ఎవరూ ప్రశ్నించడం లేదు. ఈ సోషలిస్టు భావజాల దారాన్ని తెంపే వరకూ ఈ అన్యాయాలు, స్కాములు ఆగే అవకాశం లేదు.

ప్రజాస్వామ్యంలో ఇంకో చిక్కుంది. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం కాబట్టి ఏం చేసినా దానికి ప్రజల పరోక్ష మద్దతు ఉందనే భావనను గత అరవై ఏళ్లుగా ప్రచారం చేస్తున్నారు. ఇంకో సమస్యేమిటంటే – పదవీకాలం అయిదేళ్లే కాబట్టి ఏం చేసినా, ఎంత సంపాదించినా ఈ అయిదేళ్లలోనే అనే తొందరలో ఉంటారు. అంతేగాక మళ్లీ ఎన్నికయ్యేందుకు సరిపడా డబ్బు సంపాదించడం; ఓటు బ్యాంకులను తయారు చేసుకోవడానికి పన్నుల ద్వారా వసూలు చేసిన డబ్బును ఎంపిక చేసిన వర్గాలకు అధికారికంగా, చట్టపరంగా పంపిణీ చెయ్యడం.

వీటన్నిటికీ ప్రజాస్వామ్యం, సోషలిజమనే ముసుగులు తొడగడం; బీద, బలహీన, వృద్ధ, వితంతు, మైనారిటీ వర్గాలను ఉద్ధరించడానికి – సంపాదించే వాళ్ల దగ్గరినుంచి

వసూలు చేసి సంపాదించని వాళ్లకు పంచిపెట్టడం సోషలిస్టు భావజాల లక్ష్యం... కాబట్టి ఎవరూ నోరుమెదిపే అవకాశం లేదు.

ఎవరైనా ప్రశ్నిస్తే సంక్షేమ విఘాతకులుగా, సంపన్న వర్గాల ప్రతినిధులుగా, ఫాసిస్టు, బూర్జువా శక్తులుగా ముద్రవేస్తారు. ఈ ముద్ర తమ మీద పడకుండా మేధావి వర్గాలే అత్యంత జాగ్రత్తలు తీసుకునే భావజాల వాతావరణంలో ఏ రాజకీయ నాయకుడు మాత్రం అంత రిస్కు తీసుకుంటాడు? చివరికి లోక్‌సత్తా వంటి పార్టీలు కూడా పంచిపెట్టే తీరును, పంపకంలో కొంత మింగడాన్ని ఆక్షేపిస్తాయే తప్ప, అసలు ఇలా పంచిపెట్టడాన్ని ప్రశ్నించవు. మేధావి వర్గాలు, మీడియా ఎందుకు ప్రశ్నించవు? బహుశా వాళ్లు కూడా ఈ సోషలిస్టు భావజాల దారం చుట్టూ అల్లబడ్డ దండలోని పువ్వులేనేమో!

టెలికాం స్పెక్ట్రం విషయంలోనూ, కామన్వెల్త్ క్రీడల విషయంలోనూ ఇదే వరస! ప్రజలు కష్టపడి సంపాదించిన సొమ్ములోంచి పన్నుల పేరిట బలవంతంగా లాక్కొని ఇరవై ఐదువేల కోట్ల రూపాయలు ఎవడబ్బ సొమ్మని క్రీడల పేరిట ఖర్చు చేస్తున్నారు? 'ప్రజాహితం' కోసం !!

ఎందుకంటే సోషలిస్టు దేశంలో క్రీడలు కూడా సమాజపరమే. క్రీడలను 'అభివృద్ధి' చెయ్యడం, క్రీడోత్సవాలు నిర్వహించడం అన్నీ సమాజహితం కోసమే. ప్రజాధనం నుంచి ఒక్కరూపాయి కూడా తీసుకోకుండా ఐపిఎల్ నిర్వహించారు.

అందులో 'ప్రజాహితం' లేదేమో!

ప్రభుత్వ కార్యక్రమాలను ఆఖరు నిమిషం దాకా నత్తనడకన సాగదీయడం, ఇక సమయం లేదన్నప్పుడు ఎడాపెడా వేల కోట్లు గుమ్మరించడం, ఆ క్రమంలో చేతివాటం చూపించడం పాలకవర్గ నాయకులకు, ప్రభుత్వ యంత్రాంగాలకు అలవాటే. ఇది మొదటిసారి కాదు; చివరిసారీ కాబోదు. ఎన్ని పార్టీలు, ఎన్ని ప్రభుత్వాలు మారినా, ప్రభుత్వ కార్యక్రమాల స్వభావం మాత్రం మారదు. సోషలిస్టు లక్ష్యాల పేరిట ప్రజల దగ్గరి నుంచి పన్నులు, ఇతర రూపాల్లో లాక్కున్న డబ్బులోంచి కొంత సొంతానికి దంచుడు, కాసింత ఓటర్లకు పంచుడు.

కళ్లుండీ మూసుకున్న ప్రజాస్వామ్య తల్లీ ... నీకెందరు గాంధార పుత్రులో...

(సంపూర్ణం)

10-10-2010

స్వేచ్ఛకోసం ....

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత సింగపూర్ ఒక మురికివాడ. హాంకాంగ్ ఒక వలస వాడ. ఇప్పుడా రెండూ ప్రపంచంలోనే అత్యంత సంపన్నమైనవి. చైనా పరిస్థితి ఏమిటి? ఒకప్పుడు అందులో భాగమైన తైవాన్ అభివృద్ధికి కారణమేమిటి? కారణం ఆర్థిక స్వేచ్ఛ. అంత చిన్న దేశాలను చూసి సిద్ధాంతీకరించలేమనే వాళ్లుంటారు. మరి బర్మా కూడా చిన్నదే. దాని పరిస్థితేమిటి? నేపాల్ కూడా చిన్నదే! కొరియా రెండుగా విడిపోయింది. దక్షిణ కొరియాలో తయారయ్యే కార్లు, టీవీలు, కంప్యూటర్లు ప్రపంచమంతా కొంటున్నారు. ఉత్తర కొరియా తయారు చేస్తున్న అణ్వస్త్రాలను చూసి ప్రపంచమంతా జడుసుకుంటున్నారు. ఎక్కడుంది తేడా? ఆర్థిక స్వేచ్ఛ.

ఆర్థిక స్వేచ్ఛ అత్యధికంగా ఉన్న దేశాల్లో ప్రజల ఆదాయాలు, జీవన ప్రమాణాలు అత్యున్నతంగా ఉన్నాయి. ఇది యాదృచ్ఛికం కాదు. ఆర్థిక స్వేచ్ఛలేని దేశాల్లో ప్రజల పరిస్థితి దయనీయంగా ఉంది. అదీ యాదృచ్ఛికం కాదు. ఆర్థిక స్వేచ్ఛలేని దేశాలు సోషలిజం మత్తులో తూగుతున్నాయి.

1991 లో వచ్చిన – కొంతలో కొంత – ఆర్థిక సరళీకరణకు ముందు భారతదేశం ఎలా ఉండేది? ఇప్పుడెలా ఉంది? మనుషులేం మారలేదు. వనరులేం పెరగలేదే! కొద్దిగా ఆర్థిక స్వేచ్ఛ. దానితోనే ఎంత మార్పు! ఫోను కనెక్షను కోసం ఒక దశాబ్ద కాలం..., గ్యాస్ కనెక్షన్ కోసం ఒక జీవితకాలం ఎదురుచూడాల్సిన పరిస్థితుల్ని మరిచిపోగలమా? ఆ కాస్త స్వేచ్ఛనయినా తప్పని పరిస్థితుల్లో ఇచ్చారు. అయినా, సోషలిస్టు మేధావులు గగ్గోలు పెట్టారు. నయా ఆర్థిక వలసవాదం వేళ్ళూనుకుంటోందని పుంఖాను పుంఖాలు వ్యాసాలు వెలువరించారు. *సోషలిస్టు భావజాలం ఊబిలాంటిది. మెత్తగా లోపలకు దింపుతుంది. వ్యక్తుల్ని, సమాజాన్ని, ఆర్థిక వ్యవస్థల్ని మింగేస్తుంది. ఎంత త్వరగా బయటపడగలిగితే అంత మంచిది. దింపడం వరకు సులువే. బయటపడేయడం రాజకీయ*

వ్యవస్థకు, మేధావులకు, మీడియాకు, కూడా సాధ్యం కాదు. వీరికి అసలా ఆలోచనే రాదు. బయటపడాల్సింది ప్రజలు. తమ తమ మేధస్సు, వివేకం, ఆలోచన, విశ్లేషణ శక్తితో సత్యాన్ని గ్రహించాలి. అసత్య, అవాస్తవ సిద్ధాంతాలను, భావజాలాలను, నినాదాలను విసిరి కొట్టాలి. తనకు తాను, తనలో తాను స్వతంత్రుడు కావాలి.

మనిషి స్వభావరీత్యా స్వతంత్రుడు. స్వేచ్ఛాజీవి. అది ప్రకృతిపరంగా మనిషికి పట్టిన యోగం. ఈ వాస్తవాన్ని ఎవరూ మార్చలేరు. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేని మనిషి మనిషి కాదు. అయితే బానిసవుతాడు. లేదా మృగం అవుతాడు. భూమ్మీద బతకడానికి మనిషి దగ్గరున్న ఒకే ఒక సాధనం తన మేధస్సు, హేతుబద్ధంగా ఆలోచించగల శక్తి. జీవన ప్రయాణంలో అడుగడుక్కీ ఎన్నో దారులు ఎదురవుతాయి. ప్రత్యామ్నాయాలు కన్పిస్తాయి. ఏ దారి ఎంచుకోవాలో ఆలోచించి నిర్ణయించుకోగల శక్తి మనిషికి మాత్రమే ఉంది. దూరదృష్టితో తనకు ఏది మంచో ఆలోచించగలిగేది కూడా మనిషి ఒక్కడే. అది ఏ ఇతర జీవులకూ, రాళ్ళకూ లేదు. తాను ఎంచుకున్న మార్గానికి, తీసుకున్న నిర్ణయాలకు, వాటి పరిణామాలకు వ్యక్తిగతంగా తానే బాధ్యుడు. వేరే ఎవరూ కాదు.

ఈ ప్రాకృతిక స్వభావ దృష్ట్యా – మనిషికి స్వేచ్ఛ కావాలి. నిర్ణయించుకునే స్వేచ్ఛ కావాలి. తన తెలివితేటలు, శారీరక శ్రమలతో బతికే స్వేచ్ఛ కావాలి. స్వయం కృషితో సంపాదించుకున్నది అనుభవించే స్వేచ్ఛ కావాలి. తన ధన, మాన, ప్రాణాలను కాపాడుకునే స్వేచ్ఛ కావాలి. అలా కాపాడుకునే హక్కు మనిషికి సహజంగా, ప్రకృతిపరంగా ఉంది. ఇతరుల స్వేచ్ఛకు, హక్కులకు భంగం కలిగించనంతవరకు మనిషి స్వేచ్ఛకు పరిమితుల్లేవు. పరిమితి విధించే హక్కు ఎవరికీ లేదు.

తన స్వేచ్ఛను, హక్కులను కాపాడ్డానికి మనిషి ప్రభుత్వాన్ని ఏర్పరచుకున్నాడు. అలాంటి గూర్ఖా ఉద్యోగానికే ప్రభుత్వాలు పరిమితం. ఇంటా బయటా శత్రువుల నుంచి హాని జరక్కుండా మనిషిని కాపాడ్డానికి, హాని చేసిన వాణ్ణి శిక్షించడానికి మాత్రమే ప్రభుత్వాలు పరిమితం కావాలి. అంతకు మించి ఏం చేసినా మనిషి హక్కుల్ని కాలరాయడమే అవుతుంది. అలా పరిమితమైన ప్రభుత్వాలుంటేనే మనిషి స్వేచ్ఛ అనుభవించగలుగుతాడు. లేకపోతే తాను ఏర్పరచుకుని, పాలు పోసి పెంచుతున్న వ్యవస్థకు తనే బానిసైపోతాడు. వెట్టి వాడవుతాడు.

ప్రకృతిలోని వనరులను తన మేధస్సుతో, తన శారీరక శ్రమతో తనకు పనికొచ్చేలా మలచుకోవడం ద్వారా మాత్రమే మనిషి మనిషిలా బ్రతగ్గలడు. లేకపోతే ఎవరినైనా అడుక్కోవాలి. లేదంటే ఇతరులను దోచుకుని బ్రతకాలి. మనుషులు తాము ఉత్పత్తి చేసిన వస్తువులను, సేవలను స్వేచ్ఛగా స్వచ్ఛందంగా ఇచ్చి పుచ్చుకోవడం ద్వారా

మానవ సంబంధాలు ఏర్పడతాయి. ఆ ఇచ్చి పుచ్చుకునేది స్నేహం కావచ్చు, సరుకులు కావచ్చు,సంగీతం కావచ్చు, ప్రేమాభిమానాలూ కావచ్చు. మనుషులు, వాళ్ళ సంబంధాలు కలిసి సమాజమవుతుంది. ప్రకృతిని మలుచుకుని – వేటాడో, చేపలు పట్టుకునో, నూలు వడికో, నాగలి చెక్కో – తనక్కావాల్సింది తయారు చేసుకోకపోతే – మనిషి బ్రతకలేడు. స్వచ్ఛందంగా ఇచ్చి పుచ్చుకునే ప్రక్రియ ద్వారా తాను కోరుకున్న సుఖ సంతోషాలను పొందగలుగుతాడు. సరిగ్గా ఈ విధంగానే మనిషి ఇంతటి వాడయ్యాడు. టీవీ చూస్తున్నాడు. సెల్‌ఫోన్‌తో మాట్లాడుతున్నాడు. వాయు వేగంతో కావాల్సిన చోటికి చేరుతున్నాడు. అకాల మరణాన్ని జయించాడు. ఆయుష్షు పెంచుకున్నాడు. తుపాన్లను తట్టుకునే ఇళ్ళలో వెచ్చగా దుప్పటి కింద నిశ్చింతగా నిద్రపోగలుగుతున్నాడు.

ఆర్థిక స్వేచ్ఛ – మనిషి ప్రాథమిక హక్కు. ఆ హక్కును కాదనడం మనిషికి రాసే మరణ శాసనం. ఆ హక్కును కాలరాసే శక్తి కేవలం ప్రభుత్వాలకే ఉంది. ఆ శక్తి నియంతృత్వ అధికారాల ద్వారానే వస్తుంది. ఆ నియంతృత్వం సోషలిజం కావచ్చు, ఫాసిజం కావచ్చు, జాత్యాంహకారం కావచ్చు, మత మౌఢ్యం కావచ్చు. మనిషి ప్రాథమిక హక్కుల్ని, సహజ సిద్ధమైన ఆర్థిక స్వేచ్ఛను హరించడంలో ఈ అన్ని రకాల నియంతృత్వాలూ ఒకటే. రూపంలో మాత్రమే తేడా. ఈ విషయంలో స్టాలినిస్టు రష్యాకు, మావోయిస్టు చైనాకు, ఆర్య శ్వేత హిట్లరుకు, నల్ల జాతి రొడీషియాకు, ఖ్మేర్‌రూజ్ కంబోడియాకు, తాలిబాన్ పాలిత ఆఫ్ఘనిస్తాన్‌కు – మౌలికంగా తేడా ఏమీలేదు. సోషలిస్టు భావజాలం నుంచి బయటపడే వరకు భారత ప్రజలకు కూడా విముక్తి లేదు.

రాజకీయ స్వేచ్ఛ ఉన్నంత మాత్రాన ఆర్థిక స్వేచ్ఛ రాదు. కానీ ఆర్థిక స్వేచ్ఛ ఉంటే రాజకీయ స్వేచ్ఛ దానంతట అదే వస్తుంది. రాజకీయ స్వేచ్ఛ మాత్రమే ఉంటే నిన్న, మొన్నటి కర్ణాటక రాజకీయంలాగా ఉంటుంది. గూండాలు, లోకల్ రౌడీలు, గనుల మాఫియాలు, కుల నాయకులు, మత పెద్దలు అధికారం చెలాయించవచ్చు. ఆర్థిక స్వేచ్ఛ ఉంటే ఒక హాంకాంగ్, ఒక డెన్మార్క్ లా కావచ్చు.

మనుషులందరూ ఒక్కటి కాదు. ప్రకృతి సహజంగా అందరూ వేర్వేరుగా... ప్రత్యేక శక్తి సామర్థ్యాలు కలిగి ఉంటారు. వాటి మేరకు, ఇంకొకరికి హాని చెయ్యకుండా సంపాదించుకుంటారు. ఇది వాస్తవం, అందరినీ ఒకే రకంగా బతకాలని శాసించడం ప్రకృతి విరుద్ధం. వాస్తవ విరుద్ధం. భూమిని వదిలి ఎంత ఎగిరినా, క్రింద పడక తప్పదు. సోషలిస్టు రష్యా పొరపాటున పతనం కాలేదు. చైనా తన ఆర్థిక భావజాలాన్ని మార్చుకోవడం సైద్ధాంతిక తిరోగమనం అయితే కావచ్చు గానీ; అది డెంగ్ వ్యక్తిగత నిర్ణయం కాదు. సోషలిస్ట్ ఆర్థిక సిద్ధాంతం విఫలమయినప్పుడు, ప్రజలు లక్షల్లో, కోట్లలో ఆకలితో

మాడిపోతున్నప్పుడు ఇంకేం చేయగలరు? సోషలిస్ట్ క్యూబా పతనం అంచున నిలబడడం దేవుని తప్పిదం కాదు. అలాగే, పాకిస్థాన్ రావణకాష్టమవడం వాస్తు ప్రభావం కాదు. అవన్నీ వాస్తవాలకు, మానవధర్మానికి ఎదురీది చేయి కాల్చుకున్న ఉదాహరణలు.

మనిషి – మనిషిగా... మనిషిలా... సగర్వంగా... స్వశక్తితో, స్వేచ్ఛగా తన శక్తి మేరకు సంపాదించుకుని; తనకు నచ్చిన రీతిలో సుఖ సంతోషాలను అనుభవించడానికి తగిన పరిస్థితులు కావాలి. అటువంటి పరిస్థితులను ఉండనిచ్చే భావజాలం కావాలి. ఆ భావజాలమే Laissez-faire capitalism. నిఖార్సయిన, ఉదారమైన స్వేచ్ఛావాదం. వ్యక్తి స్వేచ్ఛ, ఆర్థిక స్వేచ్ఛ, కాపిటలిజం అనేది బూతు మాట కాదు. కాపిటలిజమంటే లంచాలిచ్చి ప్రభుత్వ కాంట్రాక్టులు పొందడం కాదు. కాపిటలిజమంటే ఎంపీలను కొనుగోలు చేసి లైసెన్సులు కోటాలు తెచ్చుకోవడం కాదు, తన రంగంలో పోటీకొచ్చే ఇతర వ్యాపారులను హత్యలు చేయడం కాదు. గనులను గుప్పెట్లో పెట్టుకుని ఓట్లు, సీట్లు కొనడం కాదు. నిజమైన వ్యక్తి స్వేచ్ఛ, ఆ స్వేచ్ఛను కాపాడ్డానికి మాత్రమే ఉన్న ప్రభుత్వం. ఇతరులకు హాని కలిగించనంతవరకు అడ్డులేని వ్యక్తి స్వేచ్ఛ. ఎవరూ అడ్డగించలేని ఆర్థిక స్వేచ్ఛ. ప్రజల ఆర్థిక వ్యవహారాల్లో తలదూర్చే అవసరం, అవకాశం లేని ప్రభుత్వం. ఇక ప్రభుత్వ కాంట్రాక్టులూ ఉండవు, మైనింగు లీజులూ ఉండవు.

పన్నుల రూపేణా ప్రజల నుంచి దోచుకునే వీలుండదు. సొంతానికి దంచుడు, ఓటర్లకు పంచుడూ ఉండదు. ఇక మనమిప్పుడు చూస్తున్న రాజకీయ కుప్పిగంతులు, కప్పగంతులు ఎందుకుంటాయి? అమాంతం ముఖ్యమంత్రి కావాలనే అణుచుకోలేని అభిలాషా ఉండదు. ఎలాగైనా మళ్ళీ ముఖ్యమంత్రి కావాలనే తపనా ఉండదు. 'అమ్మయ్య, ఎలాగోలా ముఖ్యమంత్రైతే అయ్యాం' అనే వృద్ధ నిట్టూర్పులూ ఉండవు.

తెలిసో తెలియకో దిగాం. తెలిసి తెలిసి ఈ సోషలిస్టు ఊబిలోకి దించిన నాయకులను, మేధావులను నమ్ముకుంటే లాభం లేదు. ఎవరికి వాళ్ళు ఆలోచించాలి. కళ్ళతో చూసిన వాటిని విశ్లేషించాలి. సత్యాన్ని గ్రహించాలి. రోడ్లు వేయమనో, కరెంటివ్వమనో, సబ్సిడీలివ్వమనో కాదు. వ్యక్తి స్వేచ్ఛ, ఆర్థిక స్వేచ్ఛల కోసం డిమాండ్ చెయ్యాలి. మిగతావన్నీ అవే అమరుతాయి సెల్‌ఫోన్ల లాగా. ఆలోచించండి.....

17-10-2010

మైక్రో ... మెగా.. సూత్రం ఒకటే

చేతిలో చిన్న రెగ్జిన్ బ్యాగు, స్కూటర్ మీద ప్యాంటు, చొక్కాలో ఒక మధ్యవయస్కుడు. చిన్నా, పెద్దా పట్టణాల్లో తోపుడు బండ్లు, పూల కొట్లలాంటి చిన్న వ్యాపారాలు జరిగే చోట సాయంత్రం వేళల్లో కనబడతాడు. తన సొంత డబ్బుతో చిన్నచిన్న మొత్తాలు వడ్డీకి అప్పులివ్వడం, రోజువారీ వసూళ్లు చేసుకోవడం - ఇదీ అతని వృత్తి. పోలీస్ కానిస్టేబుల్ కనబడితే వినయంగా పక్కకు తప్పుకుంటాడు. లోకల్ రౌడీ ఎదురైతే 'నమస్తన్నా' అంటాడు. ఎవరికి ఎంత అప్పు ఇవ్వచ్చో అనుభవం, పరిచయాల ద్వారా తనే నిర్ణయిస్తాడు. ఎగ్గొట్టిన వాళ్లను బతిమాలో, బెదిరించో, నటించో, పక్క వాళ్లతో చెప్పించో, ఇంకా ఎక్కువ మొత్తంలో అప్పిస్తానని ఆశపెట్టో వసూలు చేసుకునే ప్రయత్నం చేస్తాడు. అయినా ఎగ్గొట్టేవాళ్లు, పారిపోయేవాళ్లు ఉంటారు. కోర్టుకెళ్లి వసూలు చేసుకునేంత పెద్ద మొత్తాలు కావు. ప్రామిసరీ నోట్లు ఉండవు. చీటీల మీదో, చిన్న నోట్‌బుక్‌లోనో అంకెలుంటాయి. ఇదీ సంప్రదాయ పద్ధతిలో ఫ్రీ మార్కెట్ సూక్ష్మ రుణ వ్యాపారం. ఇందులో వచ్చే లాభంతో పొదుపుగా ఇళ్లు గడుపుకొని పిల్లల్ని చదివించుకుంటారు. కొందరు అత్యాశకుపోయి దివాళా తీస్తుంటారు.

1969-71 లో బ్యాంకుల జాతీయీకరణతో దేశ ద్రవ్య వ్యవస్థ రూపురేఖలు మారిపోయాయి. బ్యాంకులన్నీ ప్రభుత్వం ఆధీనంలోకి వచ్చాయి. బ్యాంకు లావాదేవీలు, పని విధానాల్లో రిజర్వ్ బ్యాంకు జోక్యం పెరిగిపోయింది. సోషలిజం పేరుమీద గరీబీ హటావో నినాదాల హోరులో ద్రవ్య విధానంతో రాజకీయాలు ఎన్నికల ఆటలాడు కున్నాయి. లోటు బడ్జెట్‌లను పూడ్చడానికి డబ్బు ముద్రించడం పెంచేశారు. బ్యాంకుల్లోని డిపాజిట్లలో తమకు కావలసినంత డబ్బును ప్రభుత్వం రుణాల పేరిట ఖజానాకు తరలించారు. బ్యాంకుల్లో ఉన్న డిపాజిట్లకు పదిరెట్లు రుణాల రూపంలో ఇచ్చేలా రిజర్వ్ బ్యాంక్ నిబంధనలు. దాంతో, లేని సంపదను బ్యాంకు రుణాల రూపంలో మార్కెట్‌లోకి వదిలారు.

ప్రభుత్వం పోగు చేసిన డబ్బును, బ్యాంకు రుణాలను ఎన్నికల్లో పనికొచ్చే వర్గాల్లో వెదజల్లారు. ఫలితంగా రూపాయి కొనుగోలు శక్తి దారుణంగా పడిపోయింది. అన్ని వస్తువుల రేట్లు పెరిగాయి. ఫ్రీ మార్కెట్‌లో వడ్డీరేట్లు కూడా పెరిగాయి.

బ్యాంకు రుణాలు ఏ వర్గాలకు ఇవ్వాలో, ఎంత వడ్డీకి ఇవ్వాలో ప్రభుత్వం నిర్ణయిస్తోంది. ప్రైవేట్ వడ్డీ వ్యాపారులు వసూలు చేసే వడ్డీపై మాత్రం పరిమితులు విధించారు. వాళ్లు లైసెన్సులు తీసుకోవాలన్నారు. అపారమైన డిపాజిట్లు, ఎంత కావాలంటే అంత డబ్బు ముద్రించుకోగల అధికారాలున్న ప్రభుత్వంతో వడ్డీ వ్యాపారులు ఏం పోటీ పడగలరు? అదీ గాక; ఎప్పుడు ఏ చట్టం తెచ్చి, ప్రైవేట్ రుణాలు మాఫీ అంటారో, మారిటోరియం అంటారో తెలియని స్థితి. దీంతో ప్రైవేటుగా రుణాలిచ్చే వారి సంఖ్య బాగా తగ్గిపోయింది. దాంతో పేద ప్రజలకు రుణాలు దొరక్క ఇబ్బంది పడ్డారు.

సోషలిజంలో ఉన్న ట్రాజిడియే ఇది. ఏ పేదలను ఉద్ధరిద్దామని బయలుదేరి ఫ్రీ మార్కెట్ గొంతు నొక్కుతుందో, ఆ విధానాలే పేదల కొంప ముంచుతాయి. డబ్బున్న వాళ్లు తాత్కాలికంగా చిరాకు, ఇబ్బంది పడినా; వ్యవస్థని ఉపయోగించుకోగల తెలివి, స్థోమత వాళ్ళకెప్పుడూ ఉంటాయి. విశాల ప్రజాబాహుళ్యంలో ఆర్థిక సృజనాత్మకత, స్వేచ్ఛ, భవిష్యత్తు మీద నమ్మకం చంపేయడం ద్వారా, పాడైపోయిన బ్రేకుల్లాగా సోషలిజం ఆర్థిక వ్యవస్థని ఎప్పుడూ వెనక్కి లాగుతూ ఉంటుంది.

చిన్న రుణాలు దొరక్క ఇబ్బందిపడుతున్న పేద ప్రజలకు రుణాల ఎరవేసి డ్వాక్రా సంఘాల కార్యక్రమం మొదలెట్టారు. వాళ్లకు బ్యాంకుల నుంచి మార్కెట్ కన్నా తక్కువ వడ్డీకి రుణాలివ్వడం మొదలెట్టారు. సంఘానికి యాభైవేలతో మొదలుపెట్టి క్రమంగా ఐదు లక్షల వరకు ఇస్తూ పోయారు. తీసుకున్న రుణాలతో పెట్టుబడి పెట్టి వ్యాపారాలు చేస్తున్నారో... ఇంటి అవసరాలకు వాడుకుంటున్నారో ఎవరికీ తెలియదు. నాయకులకు పట్టదు. అధికారులకు అసలే పట్టదు. అప్పిచ్చింది వాళ్ల సొంత డబ్బయితే కదా! ఇప్పటికి 8,000 కోట్లు డ్వాక్రా సంఘాల్లో ఉన్నాయి. అందులో ముప్పైశాతం ఇప్పటికే ఎగ్గొట్టారు. మిగిలినవాళ్లు ఇంకా పెద్ద మొత్తంలో అప్పిచ్చేదాకా కదతారు. ఇక అంతకుమించి అప్పివ్వరు అనుకున్నప్పుడు ఎగ్గొట్టడానికి ఏమాత్రం వెనుకాడకపోవచ్చు. వసూలుచేసే తీరిక, ఓపిక, అవసరం ఎవరికీ లేదు. మార్కెట్ రేటు కంటే తక్కువ ఉండేలా ధరలను నియంత్రిస్తే ఫలితం – కొరత. కాబట్టి డ్వాక్రా సంఘాల ద్వారా రుణాల పంపకం ఒక దశలో ఆగిపోక తప్పదు. రుణాలకు కొరత తప్పదు. ఆ లోటును తీర్చడానికి మైక్రోఫైనాన్స్ సంస్థలు పుట్టుకొచ్చాయి.

స్థానికంగా ఉండి తెలిసిన వాళ్లకు అప్పులిచ్చే ప్రైవేట్ వడ్డీ వ్యాపారస్తులను రకరకాల నిబంధనలతో, వడ్డీరేట్ల నియంత్రణలతో వేధించిన ప్రభుత్వాలే మైక్రో సంస్థలను ప్రోత్సహించాయి. ఏరకమైన గ్యారంటీ లేకుండా ప్రభుత్వ రంగ బ్యాంకుల ద్వారా వాళ్లకు వేలకోట్ల రుణాలిచ్చాయి. అది కూడా 12శాతం వడ్డీకి. వ్యవసాయ రుణాల కంటే చవక వడ్డీకి. గ్రామ, గ్రామాన, వాడవాడలా చిన్నా, పెద్ద అప్పులివ్వడం మొదలెట్టాయి. ఒక సంస్థ నుంచి తీసుకున్న అప్పు చెల్లించడానికి ఇంకో సంస్థ నుంచి అప్పుతీసుకోవడం. ఇలా పేద ప్రజలు అప్పుల సుడిగుండంలో మునిగి పోయారు. ఈ పాపం ఎవరిది? ప్రభుత్వానిది. తీసుకున్న వాళ్లు అప్పు ఎలా తీరుస్తారు..., అసలు తీర్చగలరా? అని చూడకుండా మైక్రో సంస్థలు ఎడా పెడా అప్పులెందుకిచ్చాయి? ఏ పూచీకత్తూ లేకుండా వాళ్లకు వేలవేల కోట్లు ప్రభుత్వరంగ బ్యాంకుల్నించి దొరికాయి. అదీ అసలు కారణం. ఆ మైక్రో సంస్థలు తమ సొంత డబ్బుతో మైక్రో రుణ వ్యాపారం చేసుకుంటే ఇంత బాధ్యతారహితంగా అప్పులివ్వవు.

ఇది ఒక ఎత్తయితే; అప్పు తీసుకున్న వాళ్ల పాత్రేమిటి? అంతంత వడ్డీలకు అప్పు ఎందుకు తీసుకున్నారు? అప్పు తీసుకోమని మైక్రోసంస్థలు బలవంతం చేశాయా? అన్ని అప్పులు ఎందుకు తీసుకున్నారు? తిరిగి కట్టాలని తెలియదా?తమ స్థోమత, తాహతు, తిరిగి కట్టగల సామర్థ్యం ఉందో లేదో తెలియదా? తీసుకున్న డబ్బు దేనికి ఖర్చు పెట్టారు? గేదెను కొనుక్కున్నారా? తట్టలు అల్లడానికి వెదురు బొంగులు కొనుక్కున్నారా? లేక శుభకార్యాలకో, ఇల్లు కట్టుకోవడానికో లాంటి వినియోగ ఖర్చు పెట్టారా? ఈ ప్రశ్నలకు సమాధానాల్లో కొన్ని దీనగాథలుండవచ్చు. కానీ ఈ ప్రశ్నలు అడగాలని కూడా ఏ మేధావికీ, మీడియాకు అనిపించడం లేదు. అదీ సోషలిస్టు భావజాల విశేషం.

స్వేచ్ఛ వెంటే బాధ్యతలుంటాయి. ప్రతి వ్యక్తీ తాను తీసుకున్న నిర్ణయాలకు, చేసిన పనులకు తానే బాధ్యత వహించడం ఉదార స్వేచ్ఛావాదం. తన తప్పుల్ని సమాజం మీద రుద్దడం; తన ఓటమికి సమాజాన్ని బాధ్యునిగా చేయడం; తన నష్టాన్ని ఇతరులతో బలవంతంగా పూడ్పించడం – సోషలిజం. వడ్డీరేట్లు నియంత్రించే అధికారం తనకు లేదంటోంది ప్రభుత్వం. ఒకవేళ వడ్డీరేట్ల నియంత్రణ సబబు కాదనుకుంటే (నిజానికది సబబు కాదు) స్థానిక వడ్డీ వ్యాపారుల మీద నియంత్రణలు, నిబంధనలను ఎత్తివేయాలి. వారిని వేధించడం మానాలి. వాళ్ళు స్థానికంగా ఉంటారు. పరిచయాలుంటాయి. తెలిసిన వ్యక్తులు. కాబట్టి ఆర్థిక క్రమశిక్షణ, బాగుపడే ఆలోచన, తీసుకున్న అప్పును నిజాయితీగా తిరిగి కట్టాలన్న సదుద్దేశం ఉన్న వాళ్ళకు అవసరం మేరకు మార్కెట్ రేటు వడ్డీకి అప్పులు సమకూర్చగల కెపాసిటీ ఏ ఊరికీ ఆ ఊర్లో, ఏ వాడకు ఆ వాడలో ఉంది. అప్పుడు

మాత్రమే పోటీ వాతావరణం ఏర్పడి మైక్రోరుణ సంస్థల వడ్డీరేట్లు మార్కెట్ రేట్ల స్థాయికి కిందకు దిగుతాయి. స్థానిక వడ్డీ వ్యాపారుల్ని దొంగల్లాగా, విలన్లలాగా చూస్తూ, సూటూ బూటూ వేసుకుని బ్యాంకులిచ్చిన డబ్బుతో ఇష్టమొచ్చిన వడ్డీరేట్లతో అప్పనంగా వ్యాపారం చేసే మైక్రో సంస్థలు ప్రజాసేవ చేస్తున్నట్టు ఇన్నాళ్లూ భ్రమింప చేసిన మేధావి వర్గాలు ఆలోచించాలి.

బ్యాంకులు బ్యాంకుల్లాగా పనిచెయ్యడం లేదు. కేంద్రంలోని అధికారపార్టీలు ఏ వర్గాలను ప్రసన్నం చేసుకోవాలనుకుంటున్నాయో ఆ వర్గాలకు; తీర్చాల్సిన అవసరంలేని అప్పుల రూపంలో డబ్బు పంపిణీ చేసే సంస్థలుగా తయారయ్యాయి. ఈ క్రమంలో నిజంగా పెట్టుబడి అవసరమున్న చురుకైన చిన్నచిన్న ఔత్సాహికులకు ద్రవ్యం దొరకడం లేదు. సూక్ష్మరుణ సంస్థలకు ఉదారంగా కోట్లు కట్టబెట్టి గాలికొదిలేశారు. రిజర్వు బ్యాంకు, ప్రభుత్వాల నిబంధనలు ఎత్తేసి, స్వచ్ఛందంగా మార్కెట్ రేటుకు రుణాలు ఇచ్చిపుచ్చుకునే ఆర్థిక స్వేచ్ఛ అందరికీ ఉండాలి. ఇచ్చిన రుణాలు రాబట్టుకునేందుకు సత్వరంగా పనిచేసే న్యాయవ్యవస్థ ఉండాలి. అప్పుడు రుణాలివ్వడంలో పోటీ వాతావరణం ఏర్పడుతుంది. రుణాలకు కొరత ఉండదు. వడ్డీరేట్లు తగ్గుతాయి.

సోషలిస్టు మేధావులకు ఒక సూచన. వీరు వాడవాడనా, పల్లె పల్లెనా విస్తరించి ఉన్నారు కదా! వారి వారి స్థానిక ప్రాంతంలో వారు చెప్పే తక్కువ వడ్డీకి అప్పులిచ్చి పేదలను ఆదుకోవచ్చు కదా ! వారినెవరు ఆపారు? వారిలో కొంతమందికి స్థోమత లేకపోవచ్చు. ఇన్ని లక్షల మందిలో కనీసం వంద మందికైనా స్థోమత ఉంటుంది కదా! వారైనా మార్గదర్శకులు కావచ్చు కదా!

24-10-2010

ఆహార రాజకీయ భద్రత

రెండుమూడొందల ఏళ్ల క్రితం ఉన్న జనాభా, సాగుభూమి, ఆహార లభ్యతతో పోల్చుకుంటే ఇప్పుడున్న ప్రపంచ జనాభా ఉపయోగిస్తున్న తిండి గింజలు పండించడానికి 85 భూగోళాలు అవసరం. అయినా ఒక్క భూగోళంతోనే సరిపెట్టుకున్నాం. అందరికీ సరిపడా ఆహారం పండించగలుగుతున్నాం. ఇదెలా సాధ్యపడింది? టెక్నాలజీ, వ్యవసాయశాస్త్రం, కొత్త వంగడాలు అభివృద్ధి చెయ్యడం, సాగుచేసే భూమి పరిమాణం, యాంత్రీకరణ పెరగడం ఇలా ఎన్నో కారణాలతో కావలసినంత ఆహారం పండించగలుగుతున్నాం.

మరి ఆహార భద్రత ఎవరి కోసం? దేశంలో ఆహార ధాన్యాలకు కరువేమీ లేదే! సోషలిస్టులు చెప్పేది – పేదలకు సరిపడా ఆహారం దొరకడం లేదని. పేదలకు దొరకంది ఆహారం కాదు, ఆహారం కొనుక్కునే డబ్బు. పంచిపెట్టాల్సొస్తే డబ్బు పంచిపెట్టకుండా ఆహారం పంచిపెడతానంటారేమిటి? దీనివల్ల ఎవరికి లాభం? ఎవరికి నష్టం? దీనివల్ల వ్యవసాయానికి, ఆర్థిక వ్యవస్థకు జరగబోయే దీర్ఘ కాలిక పరిణామాలేమిటి?

అతి ప్రాచీనమైన వ్యవసాయం ఒక వృత్తిగా స్వేచ్ఛాయుతమైనది. అన్ని వ్యాపారాల్లాగే అది కూడా ఒక స్పెక్యులేషన్. పంట వేసే రైతు ముందు ఎన్నో ప్రశ్నలుంటాయి. వాతావరణం, విత్తన ఖరీదు, అదును, పదును, మార్కెట్‌రేటు, తెగుళ్ళు – ఇలాంటివన్నీ బేరీజు వేసుకుని ముందుకెళ్తాడు. కొన్నిసార్లు లాభం రావచ్చు; కొన్నిసార్లు ఖర్చులు మాత్రం రావచ్చు. కొన్నిసార్లు నష్టం రావచ్చు. మానవ జీవితంలో ఫలానా ప్రయత్నం ఫలిస్తుందని ఎవరూ గ్యారంటీ ఇవ్వరు. నష్టాన్ని భరించే శక్తి రైతులకు రావాలంటే – లాభాలు గడించి, దాన్ని పొదుపు చేసుకోవడం ద్వారా మాత్రమే వస్తుంది. వ్యవసాయంలోనే కాక మొత్తం ఆర్థిక వ్యవస్థలో వేతనాలు పెరగాలంటే యాంత్రీకరణ పెరగాల్సి ఉంటుంది. ఇంకో మార్గం లేనే లేదు. వ్యవసాయంలో యాంత్రీకరణ జరగాలంటే సరిపడా పెట్టబడులు

పెట్టాలి. అంతేకాక యాంత్రీకరణ చేయడానికి - కొంత కనీస పరిమాణంలో భూమి ఉండాలి. మూడెకరాల రైతు యాంత్రీకరణ చెయ్యలేడు. ఎప్పటికీ.

ఓట్లు వేసే జనాభాలో అత్యధిక శాతం ఉన్న రైతులను, రైతు కూలీలను రాజకీయాలు కబళించేశాయి. ఎప్పుడూ రెడిమేడ్‌గా ఉండే సోషలిజం ముసుగు తగిలించుకుని ప్రభుత్వాలు - వ్యవసాయంలోని అన్ని విభాగాల్లోనూ తలదూర్చాయి. కాలక్రమేణా ఉక్కు కౌగిలిలో బిగించేశాయి. విత్తనాల పరిశోధన, ఉత్పత్తి, ప్రైవేటు విత్తనాల నియంత్రణ, వాటి ధరలు, నాణ్యత - ఇవన్నీ ప్రభుత్వ గుత్తాధిపత్యంలో ఉన్నాయి. ఎరువుల సరఫరా, ధరలు, సబ్సిడీలు, కూలీరేట్లు, కూలీల అందుబాటు ప్రభుత్వం అమలు చేసే పని గ్యారంటీ పథకం - సమయం...అమలు తీరు మీద ఆధారపడ్డాయి. యాంత్రీకరణ చేద్దామంటే సీలింగు పరిమితుల్లో సాధ్యపడదు. నీటిపారుదల, చెరువులు ప్రభుత్వ ఆస్తులే. కరెంటు ఎన్ని గంటలు ఏ సమయాల్లో ఏ ధరకు ఇచ్చేది ప్రభుత్వ నిర్ణయమే. పంటపండాక ఎఫ్‌సిఐ లెవీ ద్వారా, జిల్లా దాటగూడదనే నిబంధనల ద్వారా రేటుని నిర్ణయించేది ప్రభుత్వమే. ఇన్ని నియంత్రణల మధ్య రైతుజీవితం, ఆదాయం అతని చేతుల్లో ఉంటుందా? ప్రభుత్వం దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉంది. ఇప్పుడు ఆహార భద్రత ద్వారా సాధించబోయేదేమిటి? ప్రజల జేబులోని డబ్బును పన్నుల రూపంలో లాక్కుని, అందులో కొంత తిరిగి బియ్యం లేదా గోధుమల రూపంలో వాళ్ల మొహాన కొడతారు. ఇదంతా చేసేది ఎఫ్‌సిఐ; చౌకధరల దుకాణాల ద్వారా. లక్షల టన్నుల ధాన్యాన్ని ఎండా వానలకొదిలేసి పందికొక్కులకు మేపిన ఎఫ్‌సిఐ నిర్వాకం కళ్ళెదుటే ఉంది.

స్వేచ్ఛా మార్కెట్‌లో రైతు తను పండించిన పంటల్ని మార్కెట్ ధరకు అమ్ముకోనివ్వాలి. లేదా ధరలు పెరుగుతాయనుకుంటే దాచుకోనివ్వాలి. అప్పుడే తను చేసిన స్పెక్యులేషన్ ఫలితాలు రైతు అనుభవించగలుగుతాడు. మార్కెట్‌లో శాస్త్రీయమైన స్పెక్యులేషన్ ఉంటే వ్యాపారులు మంచి ధర ఇచ్చి, కొని, నిల్వ చేసుకుని, ధర పెరిగిన తర్వాత అమ్ముకుని లాభం తీసుకుంటారు. ఈ మార్కెట్ స్పెక్యులేషన్ విస్తృత స్థాయిలో జరిగేది ఫ్యూచర్స్ ట్రేడింగ్ ద్వారా. వాతావరణ సూచన, దేశంలోని వివిధ ప్రాంతాల్లో వేసిన పంటల పరిమాణం, దిగుబడి అవకాశాలు, ఉండబోయే డిమాండ్, ప్రపంచవ్యాప్తంగా ఎగుమతులకు అవకాశాలు ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని ఫ్యూచర్స్ ట్రేడింగ్ జరుగుతుంది. దీని ద్వారా పంట వచ్చిన సమయంలో రేట్లు పడిపోవడం జరగదు. దానివల్ల రైతులు లాభపడతారు. కానీ వ్యవసాయం లాభసాటిగా మారితే రైతులు ప్రభుత్వం మాట వింటారా? ప్రతి సీజనులో జోలె పట్టుకుని 'మాకు విత్తనాలు కావాలి, ఎరువులు కావాలి, కరెంటు కావాలి, మద్దతు ధర కావాలి' అని ప్రభుత్వాన్ని యాచించరు కదా! అందుకే

సోషలిస్టు ప్రభుత్వాలు ఫ్యూచర్ ట్రేడింగ్‌ను నిషేధించేశాయి. ఆహార భద్రత పథకం ద్వారా ప్రభుత్వం పండించిన పంటంతా లెవీ, కంట్రోళ్ల రూపంలో ఎఫ్‌సిఐ ద్వారా లాక్కుంటుంది. ఉచితంగా ప్రజల్లోని అత్యధిక శాతానికి పంచిపెడుతుంది. అలా పంచిపెట్టిన తిండిగింజలు తిన్నవాళ్లు తమకు ఓట్లేయకపోతారా? యువరాజు పట్టాభిషిక్తుడు కాకపోతాడా? ఎంతసేపూ అదే యావ. ఇది ఆహారభద్రత కాదు. రాచ కుటుంబానికి రాజకీయ భద్రత.

ప్రైవేటు వ్యాపారులు పంటలను కొని నిల్వచేస్తే ఒక్క గింజ కూడా పాడవనివ్వరు. సరైన సమయంలో సరైన ప్రాంతంలో డిమాండు ఉన్న ఆహార ధాన్యాల్ని మార్కెట్‌లో విడుదల చేస్తారు. ఎఫ్‌సిఐ అత్యంత అసమర్థ సంస్థ. దాని అజమాయిషీ ఖర్చులు, వాళ్లు పెట్టే రవాణా ఖర్చులు, వాళ్లు ఉపయోగించే గోదాముల అద్దెలు, లోడింగ్, అన్‌లోడింగుకు ఉపయోగించే కార్మికుల వేతనాలు – అన్నీ ఎక్కువే. ఈ దుబారా వ్యయాన్ని పన్నుల డబ్బుతో ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ప్రైవేటు వ్యాపారులు ధాన్యం సేకరించి నిల్వ ఉంచితే ఈ దుబారాల్ని అరికట్టవచ్చు. కానీ సోషలిస్టులకు, ప్రభుత్వాలకు, చివరికి చాలా మంది ప్రజలకు కూడా ప్రైవేటు వ్యాపారుల మీద నమ్మకం లేదు. అమ్మో, కొరత వస్తే అధిక ధరలకు అమ్ముకుంటారని భయం. కానీ ఆ భయం అహేతుకమైనది. సంవత్సరానికి రెండు పంటలు పండుతాయి. రేటు బాగా ఉందంటే ఎక్కువ మంది ఆ పంటే పండిస్తారు. ఆహార ధాన్యాల రేటు పెరుగుదల తాత్కాలిక పరిణామం. వచ్చే పంటతో కూడా కొరత తీరదనుకుంటే విదేశాల్నుంచి దిగుమతి చేసుకుంటారు. పంటలు పండక కొరత వస్తే ఎఫ్‌సిఐ మాత్రం ఎక్కడ్నుంచి తీసుకొస్తుంది. ఈ మధ్యనే గోధుమలు దిగుమతి చేసుకోలేదా?

ఈ పథకం పర్యవసానాలు ఊహించడం కష్టమేమీ కాదు. ఒకటి రెండు సంవత్సరాలు ఇప్పుడున్న అధిక నిల్వలతో, పన్నుల డబ్బుతో, రుణాలతో నడిపిస్తారు. ఈ లోపల ఎన్నికలు, గెలుపు, పట్టాభిషేకాలు అయిపోతాయి. ఆహార భద్రత కల్పించడం పేరుతో పన్నులు పెంచుతారు. లోటు బడ్జెట్‌తో రూపాయలు ముద్ర కొడతారు. దాంతో ద్రవ్యోల్బణం, అన్ని రేట్లూ పెరుగుతాయి. ధాన్యం రేట్లు కూడా పెరుగుతాయి. ఖజానాలో డబ్బుకు కొరత. దాంతో తక్కువ రేట్లకే ఆహారధాన్యాలు సేకరించే ప్రయత్నం చేస్తారు. రైతులు తీవ్రంగా నష్టపోతారు, వ్యతిరేకిస్తారు, ఆందోళనలు చేస్తారు. ఆఖరుకు గిట్టుబాటుకాక ధాన్యం పండించడం తగ్గించేస్తారు. ఆహార ధాన్యాలకు తీవ్ర కొరత ఎదురవుతుంది. అయినా సరే, ప్రభుత్వం తల్చుకుంటే చేయలేనిదేముంది ? ఖర్చెంతయినా సరే, విదేశాల్నుంచి దిగుమతి చేసుకుంటారు. వ్యవసాయం కుంటుపడి కూలీలకు పనులు

దొరకవు. పెరిగిన రేట్లతో పాటు కూలీల వేతనాలు పెరగవు. పనిచేయకుండానే కూలీ గ్యారంటీ పథకం, దాదాపు ఉచిత ఆహార పథకాలతో, కష్టించి పనిచేసే వాళ్లని హేళన చేసే పరిస్థితి వస్తుంది. ఈ లోపల వ్యాపారుల్ని, మిల్లర్లను, విదేశీ శక్తుల్ని, మావోయిజం, టెర్రరిజాల్ని నిందిస్తూ అసలు సమస్య నుంచి ప్రజల దృష్టిని మరలుస్తారు. యువరాజు పాలనలో స్థిరపడే దాకా మడమ తిప్పరు, వెన్నుచూపరు. వ్యవస్థ పూర్తిగా నాశనమైపోయిన తర్వాత మెల్లగా పంపిణీ చేసే ఆహారధాన్యాల రేట్లు పెంచవలసి వచ్చినప్పుడు ఎవరు పాలిస్తారో, వాళ్లని బ్రతికినన్నాళ్లూ రాజకీయంగా నిందించొచ్చు. ఏది ఏమైనా ఒకసారి తీవ్రంగా గాడి తప్పిన వ్యవస్థ మళ్లీ కుదురుకోవడం చాలా కష్టం.

అయితేనేం? గొప్పగొప్ప ఆర్థిక వేత్తలు ప్రధానమంత్రులయితేనేం? ఉచితాలు, సబ్సిడీలు పేదరికాన్ని తగ్గించవనీ, పెంచుతాయని ఎన్నోసార్లు నిరూపితమయితేనేం? ఇదే దారిలో ఇంతకు ముందు ప్రయాణించి ఎదురు దెబ్బలు తింటేనేం? రాజ కుటుంబంలో తరం మార్పు సందర్భంగా ఇలాంటి చారిత్రాత్మక నిర్ణయాలు అవసరం మరి ! దేశం ఎటుపోతేనేం? ప్రజలేమయిపోతేనేం? ఆర్థిక వ్యవస్థా?! ఎవరామె? రాజకీయ వ్యవస్థ ఇంట్లో పని మనిషేగా !

31-10-2010

మసకబారిన నల్ల సూరీడు

మంచి మెజారిటీతో ఎన్నికై , ప్రపంచ ప్రజలందరి చేత 'జైరా!' అనిపించుకున్న ఒబామా రెండేళ్ళు తిరక్కుండానే పరాజయాల సుడిగుండంలో చిక్కుకున్నాడు. ఆర్థిక వ్యవస్థ అదుపులోకి రావడం లేదు. ముగిద్దామనుకున్న యుద్ధాలు ముగిసే సూచనలు కనిపించడంలేదు. నిరుద్యోగం తగ్గడంలేదు. డాలరు కొనుగోలు శక్తి రోజురోజుకీ తగ్గిపోతోంది. ఫలితంగా మధ్యంతర ఎన్నికల్లో ఘోర పరాజయం. ఏం జరిగింది? ఎక్కడ తప్పు జరిగింది ? దీన్నుంచి మనం నేర్చుకోగలిగిందేమైనా ఉందా? ఒబామా అధ్యక్షపదవికి ఎన్నికల్లో ప్రచారం చేసే సమయానికే అమెరికా ఆర్థిక వ్యవస్థ కుప్పకూలింది. అంతకు ముందు ఎనిమిదేళ్ళు పాలించిన జార్జి బుష్ చేపట్టిన తప్పుడు విధానాల వల్ల 1930 లో వచ్చిన స్థాయిలో ఆర్థిక మాంద్యం ఏర్పడింది. దీనికి ఒక నేపథ్యం ఉంది. 2001-02 లో కంప్యూటర్, ఐటీ రంగం బుడగ పగలడం కారణంగా - ఒక మాదిరి సైజులో ఆర్థిక మాంద్యం వచ్చింది. దాన్ని తప్పించుకోవడానికి, ఇంకో బుడగను సృష్టించారు.

అసలు ఆర్థిక మాంద్యం అనేది ఎక్కడైనా, ఎప్పుడైనా, ప్రభుత్వం చేసే తప్పిదాల వల్లే వస్తుంది. మార్కెట్‌ను తన పని తాను చేయనీయకుండా, ఆర్థిక వనరుల్ని గుప్పెట్లో పెట్టుకుంటారు. తనకు పేరు తెచ్చి పెట్టే పథకాలు, ఎన్నికల్లో లబ్ధినిచ్చే పథకాల అమలుకు ఆ ఆర్థిక వనరుల్ని వెచ్చిస్తారు. జార్జిబుష్ చేసిందిదే. 2001-02 లో వచ్చిన మాంద్యం నుంచి ఆర్థిక వ్యవస్థను బయటపడేస్తానని బీరాలు పలికాడు. మనకు రిజర్వ్ బ్యాంకు ఉన్నట్లే, అమెరికాకు ఉన్న ఫెడరల్ రిజర్వు ద్వారా వడ్డీరేట్లను అథమస్థాయికి బలవంతంగా తగ్గించేశారు. "అమెరికా ప్రజలందరికీ సొంత ఇల్లు" అనే పథకాన్ని మొదలెట్టారు. బ్యాంకులు నిబంధనలు మార్చేసి ఇల్లు కావాలనుకున్న వాళ్ళకు అతి తక్కువ వడ్డీతో వెంటపడి మరీ రుణాలిప్పించారు. అమెరికాలో అన్నీ ప్రైవేటు బ్యాంకులే కదా? తిరిగి

చెల్లించలేరు అనుకున్న వాళ్ళకు రుణాలివ్వరు కదా ! అందుకని కేంద్ర ప్రభుత్వం సొమ్ముతో ఫ్రెడీమాక్, ఫానీమే అనే రెండు సంస్థలను స్థాపించారు. తిరిగి చెల్లించని రుణాల బాధ్యత ఈ రెండూ సంస్థలూ తీసుకునేందుకు బ్యాంకులతో ఒప్పందం. ఇక తమకు ఏ రిస్కులేదు కాబట్టి బ్యాంకులు ఎగబడి మరీ రుణాలిచ్చాయి. దాంతో ఇళ్ళకు డిమాండ్ పెరిగింది. ఇళ్ళ ధరలు పెరిగాయి. ధరలు పెరుగుతున్నాయి కదాని అవసరమున్నా లేకున్నా ఒక వ్యాపార పెట్టుబడిగా ఇళ్లు కొనడం మొదలెట్టారు. మన దగ్గర జరిగిన రియల్ ఎస్టేట్ బూమ్ లాగే.

కొన్ని బ్యాంకులకు కూడా ఆశపుట్టి, సొంత రిస్కు మీద కొన్ని రుణాలివ్వడం మొదలెట్టాయి. అమెరికాలో ఆర్థిక సేవల మార్కెట్ చాలా సంక్లిష్టమైనది. చాలా పెద్దది కూడా. భవిష్యత్తులో తిరిగి చెల్లించే రుణాలను తాకట్టుపెట్టి కొన్ని సంస్థలు అప్పులు తీసుకున్నాయి. భవిష్యత్ చెల్లింపులను కొన్ని సంస్థలు కొనుగోలు చేశాయి. రుణాలు తిరిగి చెల్లిస్తారా లేదా అన్న విషయం మీద బ్యాంకులు, సంస్థలు కొందరు మార్కెట్‌లో స్పెక్యులేషన్ పెట్టుబడులు పెట్టారు. ఇవన్నీ చట్టబద్ధమైన వ్యాపార ప్రక్రియలే. ఒకానొక రోజున ఈ బుడగ పేలింది. వెరసి బుష్‌గారి పథకం పేరుతో, పన్నుల డబ్బును అడ్డంపెట్టుకుని ఆడిన జూదంతో అమెరికా ఆర్థిక వ్యవస్థంతా పతనం అంచున నిలబడింది.

ప్రజల నిజమైన అవసరాలు, మార్కెట్‌లతో సంబంధం లేకుండా ఓట్ల కోసం రాజకీయనాయకులు చేసే ప్రయోగాలు - కాస్త ముందో, వెనకో విఫలంకాక తప్పదు. ఆర్థిక సూత్రాలకు ఏ వ్యవస్థయినా తలవంచక తప్పదు. కృత్రిమ బుడగలాంటి ఇళ్ళ బూమ్ 2007-08 లో బద్ధలయ్యింది. దాంతో ఉపద్రవం స్థాయిలో ఆర్థిక మాంద్యం ఏర్పడింది. రాజకీయ ప్రయోజనాల కోసం, ప్రభుత్వాలకున్న విశేషమైన అధికారాలతో ఆర్థిక వ్యవస్థ మెడలు వంచి, సోషలిస్టు పుక్కిట పురాణాలతో "నా ప్రజలకు అది కావాలి, ఇది కావాలి, నేను అది చేస్తాను" అని ఉపన్యాసాలు దంచి, ప్రజలు సంపాదించిన డబ్బును పన్నుల రూపంలో లాక్కుని తప్పుదారిలో పెట్టుబడులు పెడితే బుడగలు, బూమ్‌లు, బద్ధలవడాలు, మాంద్యాలు తప్పవు. ఇది వందేళ్ళుగా ఆర్థిక వేత్తలకు తెలిసిన వాస్తవం. అయినా అత్యధిక శాతం ఆర్థిక మేధావులు ఆస్థాన మేధావులై, ప్రభుత్వాలు చేసే పాపాలను వెనకేసుకొస్తారు. జరిగిన ఉపద్రవాలకు వేరే ఎవర్నో కారకులుగా ఎత్తి చూపుతారు. ఎవరికీ అర్థంకాని తర్క భాషలో రకరకాల అంకెలు, గ్రాఫుల గీతలతో ప్రజల దృష్టి మరల్చేస్తారు. అమెరికా కూడా దీనికి అతీతం కాదు.

వచ్చిన మాంద్యాన్ని వాల్‌స్ట్రీట్‌లోని పెట్టుబడిదారులు, స్పెక్యులేటర్ల మీదకి తోసేశారు. దాంతో సమస్య మూల కారణాలు మరుగున పడిపోయాయి. 'అమెరికన్లందరికీ

సొంతిల్లు' అనే సోషలిస్టు సంక్షేమ పథకం ద్వారా ఇళ్ల మార్కెట్‌లో ప్రభుత్వం తీవ్రమైన జోక్యం చేసుకోవడం అనేదే అసలు సమస్య – అని గుర్తించడానికి నిరాకరించారు. ఇక పరిష్కారాలు మాత్రం ఏమంత హేతుబద్ధంగా ఉంటాయి? ఒబామా మంచి వాక్చాతుర్యం గల నాయకుడు. ఉపన్యాసాలతో ఓటర్లను ఉత్తేజపరచగలడు. అమెరికా ఆర్థిక మాంద్యానికి తాను సూచించిన పరిష్కారాలు పూర్తిగా అసంబద్ధమైనవి. ఈ విషయం తన ఎన్నికల ప్రచార సమయంలోనే ఆస్థానంతో సంబంధంలేని ఆర్థిక వేత్తలకు అర్థమయ్యింది. కానీ తీవ్రమయిన ఆర్థిక మాంద్యం, ఎటూ తేలని ఆఫ్ఘన్, ఇరాక్ యుద్ధాలతో సంక్షోభంలో ఉన్న ప్రజలు – ఒబామా ఏదో ఒకటి చేసి తమను ఒడ్డున పడేస్తాడని నమ్మారు.

పాలన చేపట్టిన నాటినుంచి ఒబామా ఒకదానికి మించి ఇంకో తప్పు చేస్తూనే వచ్చారు. ఆర్థిక మార్కెట్‌లో ప్రభుత్వ జోక్యమే ఈ ఆర్థిక మాంద్యానికి మూల కారణం. అయినా పరిష్కారంగా – ప్రభుత్వం జోక్యాన్ని ఇంకా పెంచారు. తప్పుడు అంచనాలతో జూదమాడిన సంస్థలను దివాళా తీయనీయకుండా ప్రజల పన్నుల డబ్బుతో ఆ సంస్థలను నిలబెట్టారు. బ్యాంకింగ్, ఆర్థిక సేవా రంగాల్లో నియంత్రణలు పెంచేశారు. ప్రభుత్వ రుణాలను విపరీతంగా పెంచారు. డెబ్భై లక్షల కోట్ల రూపాయల లోటు బడ్జెట్ ప్రవేశపెట్టారు. దానికి సరిపడా డాలర్లు ముద్రకొట్టారు. వడ్డీరేట్లు నేలమట్టానికి తగ్గించేశారు. ఈ చర్యలన్నిటి ఫలితంగా – డాలర్ విలువ దారుణంగా పడిపోయింది. ప్రజలు దాచుకున్న డబ్బు విలువ పడిపోయింది. కొనే శక్తి లేక, మార్కెట్‌లో వస్తు, సేవల డిమాండ్ పడిపోయింది. దాంతో కొత్త వ్యాపారాలు, పరిశ్రమలు రావడంలేదు, ఉన్నవి విస్తరించట్లేదు, సరికదా – కుదించబడుతున్నాయి. దాంతో ఉద్యోగాలు పోతున్నాయి. కొత్త ఉద్యోగాలు రావడం లేదు. నిరుద్యోగం పది శాతంలో ఉండి క్రిందకు దిగనంటోంది. పరిస్థితులు ఇలా ఉండగా... తగుదునమ్మా అంటూ అమెరికాలోని ఆరోగ్య, వైద్య రంగాన్ని పూర్తిగా జాతీయం చేసే దిశగా పథకాలకు తెరతీశారు. తద్వారా ప్రజలందరికీ ఉచితంగా వైద్య సేవలందించిన చారిత్రక పురుషుడిగా మిగిలిపోవాలని కాంక్షిస్తున్నారు. ఈ శాసనం ప్రతినిధుల సభలో నెగ్గితే అమెరికా ఆర్థికవ్యవస్థ దివాలా తీసే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని చెప్పొచ్చు. ఇంగ్లండు, కెనడాల్లో జాతీయకరణ తర్వాత – రోగుల ఇబ్బందులు చూశాక అమెరికా ప్రజల మీద జాలి కలగక మానదు.

అంతే కాదు. తీవ్ర సంక్షోభంలో ఉన్న కొన్ని కార్ల కంపెనీలలో ప్రభుత్వం సొమ్మును పెట్టుబడిగా పెట్టి గట్టెక్కించారు. వాళ్ళు తయారుచేసే కార్లకు డిమాండు సృష్టించేందుకు ఇంకో పథకం వేశారు. తక్కువ మైలేజినిచ్చే కార్లు పక్కన పడేసి ఎక్కువ మైలేజినిచ్చే కార్లు కొనేవాళ్ళకు సబ్సిడీలిచ్చారు. ఆ సబ్సిడీ డబ్బు పన్నుల డబ్బులోనిదే.

ఇదే పద్ధతుల్లో చాలా బ్యాంకులు, ఆర్థిక సంస్థల్లో పెట్టుబడులు పెట్టి, అవి దివాళా తీయకుండా బలవంతాన ఆపారు. అది కూడా ప్రజల డబ్బుతోనే. అంటే జార్జిబుష్ చేసిన తప్పులకు, దురాశకు పోయిన కొన్ని ఆర్థిక సంస్థలకు, మార్కెట్ పోటీలో నిలవలేని కొన్ని కార్ల కంపెనీలకు – ప్రజల చేత పరిహారం చెల్లింపచేశారు. ఈ కార్యక్రమాలన్నింటి పేరిటా పన్నులు పెంచారు. టీ (టీఈఏ– టాక్స్‌డ్ ఎనఫ్ ఆల్‌రెడీ) పార్టీల పేరుతో చాలా చోట్ల స్వచ్ఛందంగా బృందాలుగా ఏర్పడి, ప్రభుత్వ ఆర్థిక విధానాలను తీవ్రంగా వ్యతిరేకించారు. వీటన్నింటికి ఫలితమే మధ్యంతర ఎన్నికల్లో తీవ్ర పరాజయాలు.

అమెరికాలో ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ జోక్యం ఇప్పటిది కాదు. 1930 నుంచే మొదలైంది. రిపబ్లికన్, డెమోక్రాటిక్ రెండు పార్టీలు దీనికి అతీతులు కారు. ఆర్థిక సూత్రాలు విస్మరించి, పాపులారిటీ కోసం తప్పుమీద తప్పు చేయడాన్ని చరిత్ర విస్మరించదు, క్షమించదు. ఇంకా చాలదన్నట్లు ఔట్ సోర్సింగ్ మీద వాగ్ధానాలు కురిపించడం సిగ్గుచేటు. ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వాల విపరీత జోక్యమే ఆర్థిక మాంద్యాలకు దారితీస్తుంది. కృత్రిమంగా వడ్డీరేట్ల తగ్గింపు, లోటుబడ్జెట్లు, దానికోసం రూపాయిల ముద్రణ, ప్రజల డబ్బులో అత్యధిక భాగం రకరకాల పన్నుల రూపంలో లాక్కోవడం, దాన్ని ఓటర్లకు పంచిపెట్టడం – ఇవీ ప్రభుత్వాలు చేసే పాపాలు. మాంద్యం వచ్చినపుడు ఆర్థిక వ్యవస్థ నుంచి ప్రభుత్వం దూరంగా జరగాలి. కొద్దికాలం ఒడిదుడుకులకు లోనైనా వ్యవస్థ తనంతట తాను సర్దుకుంటుంది. తిరిగి వృద్ధి బాటపడుతుంది. మాంద్యం పరిస్థితుల్లో ప్రభుత్వం ఇంకా జోక్యం చేసుకుంటే ఆ మేరకు మాంద్యం నుంచి బయటపడడం ఆలస్యమవుతుంది. వ్యవస్థ ఇంకా తీవ్రంగా దెబ్బతింటుంది. ఇది ఆర్థిక సూత్రం. ఆర్థిక సత్యం. ఎన్ని ఉపన్యాసాలిచ్చినా దీన్ని మార్చలేము. ఉదాహరణగా అమెరికాను చూడండి. ఒబామాను చూడండి.

07-11-2010

సోషలిజం అనైతిక స్వప్నం

పూర్వం ఎవరికే కష్టం వచ్చినా 'ఏం చేస్తాం, ఖర్మ, మనకలా రాసిపెట్టి ఉంద'ని సరిపెట్టుకునేవాళ్ళు. ఇప్పుడు ఎవరికి, ఏ వర్గానికి ఏ కష్టం, ఏ నష్టం వచ్చినా నెపం కాపిటలిజం మీదకు, ఉదార ఆర్థిక స్వేచ్ఛావాదం మీదకు, ఆర్థిక సరళీకరణ మీదకు, అమెరికా మీదకు, ప్రపంచ వాణిజ్యం మీదకు నెట్టేస్తున్నారు. దాన్ని మెజారిటీ ప్రజలు నమ్ముతున్నారు కూడా. ఈ విషయంలో సోషలిస్టు మేధావులు పూర్తి విజయం సాధించారని ఒప్పుకోక తప్పదు. మతోన్మాదాన్ని కాపిటలిజం పెంచి పోషిస్తోందని నాస్తికులు, ముఖ్యంగా సోషలిస్టు నాస్తికులు ఆరోపిస్తారు. కానీ అన్ని మతాల పెద్దలూ యువతలో ఆధ్యాత్మిక భావాలు క్షీణిస్తుండడానికి, సమాజంలో పాపం పెరిగిపోవడానికి, దురాశకు కాపిటలిస్టు భావాలే కారణమంటారు. శాంతి కాముకులందరూ అన్నియుద్ధాలకు కాపిటలిస్టు సామ్రాజ్యవాదమే కారణమంటారు. కానీ ముసోలినీ, హిట్లరు దగ్గర్నుంచి యుద్ధోన్మాదు లందరూ కాపిటలిజాన్ని పూర్తిగా వ్యతిరేకించారు. సాంప్రదాయులేమో– కుటుంబ వ్యవస్థ నాశనం కావడానికి, అశ్లీలత, విశృంఖలత్వం పెరిగిపోవడానికి కాపిటలిజం కారణమంటారు. కానీ అభ్యుదయవాదులు, స్త్రీ స్వేచ్ఛా ఉద్యమకారులేమో బూజుపట్టిన సామాజిక వ్యవస్థలను కూల్చివేయకుండా అడ్డుకుంటోంది కాపిటలిజమేనని నమ్ముతారు, వాదిస్తారు కూడా. వీరందరూ కాపిటలిజం వల్ల అందరిలో వస్తు వ్యామోహం (మెటీరియలిజం) పెరిగిపోతోందని ఎసి కారులో ఎఫ్ఎం రేడియోలో పాటలు వింటూ తెగబాధపడిపోతారు.

కాపిటలిజం పట్ల ఈ పరస్పర విరుద్ధ భావాలు ఒకదానొక్కటి కాన్సిల్ చేసేస్తాయి. సత్యం ఇంకెక్కడో ఉంది. దాన్ని శ్రమించి, దర్శించి, తడిమి చూసుకుంటే ఈ వైరుధ్యాల ఊబిలోంచి బయటపడగలం. కాపిటలిజమనేది ఉదార స్వేచ్ఛావాద భావజాలానికి ఆర్థిక, రాజకీయ కోణం. సహజసిద్ధంగా స్వేచ్ఛా జీవియైన మనిషి, తాను ఇతరులకు

హానిచేయనంత కాలం ఎటువంటి ఆటంకాలూ, నియంత్రణలు లేకుండా జీవించే హక్కు కలిగి ఉన్నాడు. వస్తు, సేవలను స్వచ్ఛందంగా ఇచ్చి పుచ్చుకోవడం ద్వారా మనిషి మనుగడను సాగిస్తాడు. మామూలు భాషలో చెప్పాలంటే మనిషి తను తయారుచేసే వాటిని ఇతరులకు అమ్ముకుని తనకు కావలసిన వాటిని ఇతరుల నుంచి కొనుక్కుని సుఖ సంతోషాలు పొందుతాడు. ఇతరులకు హాని కలిగించనంత వరకు మనిషి చేసే ఈ పనులకు ఎవరూ, ప్రభుత్వం కూడా అడ్డు రాకూడదు. ఎవరైనా అడ్డుకుంటే, వారి నుంచి రక్షించడానికి తప్ప, ప్రభుత్వం ఇతర విషయాల్లో జోక్యం చేసుకోకూడదు. ఈ రకంగా కాపిటలిజం భావజాలపరంగా శాంతిని కోరుకుంటుంది. ఆత్మరక్షణకు తప్ప ఏ రకమైన హింసను, ఏ రకమైన యుద్ధాలనూ ప్రోత్సహించదు, సమర్థించదు. ఇష్టం, సమ్మతం లేకుండా – ఒకరి దగ్గర్నుంచి లాక్కుని ఇంకొకరికి పంచిపెట్టడాన్ని వ్యతిరేకిస్తుంది. అలా పంచి పెట్టడమే సామాజిక న్యాయమని... అదే ధర్మమని... అందుకోసమే ప్రభుత్వాలు ఉన్నాయనే సోషలిజాన్ని వ్యతిరేకిస్తుంది. ఒకరి సహజ, ప్రాథమిక హక్కులకు ఇంకొకరు భంగం కలిగించకూడదని, ఈ విషయంలో రాజు, పేద అందరూ చట్టం ముందు సమానులేనని ప్రభుత్వం కూడా ఎవరి హక్కులకూ (నేరస్తులను తప్పించి) భంగం కలిగించకూడదని గట్టిగా వాదిస్తుంది.

ప్రజలందరి జీవన ప్రమాణాలు సరిసమానమయ్యేంత వరకు – సంపాదించే వాళ్ళ దగ్గర్నుంచి బలవంతంగా లాక్కుని సంపాదించని వాళ్ళకు పంచి పెట్టాలనీ, దీని కోసం – ఎంత హింసకైనా సిద్ధమేననే సోషలిస్టు భావజాలాన్ని తీవ్రంగా ఆక్షేపిస్తుంది. సోషలిస్టు భావజాలం అసాధ్యం, అనైతికమైన స్వప్నమేననీ, ప్రపంచవ్యాప్తంగా అలాంటి సమాజం ఏర్పడితే ఒక్కరోజు కూడా మానవ మనుగడ సాగదనీ; ప్రపంచం తిరిగి రాతి యుగాలకు మరలక తప్పదనీ తర్క బద్ధంగా నిరూపిస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా దేశాల మధ్య వాణిజ్యం స్వేచ్ఛగా జరగాలనీ, కార్మికులు కూడా ఒక దేశం నుంచి ఎక్కువ వేతనాలు దొరికే ఇంకో దేశానికి వలస వెళ్ళే స్వేచ్ఛ ఉండాలనీ వాదిస్తుంది.

దీనివల్ల పేద దేశాలే కాక ధనిక దేశాలు కూడా లాభపడతాయని నిరూపిస్తుంది. దేశాల సరిహద్దులు మనిషి గీసిన గీతలేనని, ప్రపంచ మానవులంతా స్వేచ్ఛా వాణిజ్యంలో భాగస్వాములు కావాలనీ, ఎవరి తెలివితేటలకు ఎక్కడ గిరాకీ ఉంటే అక్కడే ఉత్పత్తి చెయ్యడం ద్వారా ప్రపంచమంతా లాభపడుతుందని; తద్వారా పేదరికం మటుమాయమవు తుందని గాఢంగా విశ్వసిస్తుంది. చౌక మందులు, వ్యవసాయ విజ్ఞానం, ఆధునిక యాంత్రిక ఉత్పత్తి పద్ధతులు, రవాణా, సమాచార విప్లవాల ద్వారా – కాపిటలిస్టు విధానాలే ప్రపంచ ప్రజల జీవన ప్రమాణాలను, జీవిత పరిమాణాలను ఏ స్వాప్నిక కవీ, మేధావీ

ఊహించనంత స్థాయికి వేగంగా పెంచాయనీ గుర్తు చేస్తుంది. గత శతాబ్ద కాలంలో జరిగిన సోషలిస్టు ప్రయోగ శాలల్లో బ్రతికిన దురదృష్టవంతులకు – ఆత్మ – బండబారిపోయి, జీవితాలు మూసలో పోసిన లోహపు అచ్చుల్లాగా యాంత్రికంగా గడిచాయనీ; మనిషిలో నిక్షిప్తమై ఉన్న స్వేచ్ఛా భావం తన్నుకొని పైకొచ్చి ఆ హింసాత్మక భావజాల ప్రభుత్వాలను కూల్చి బయటపడ్డాయనీ గుర్తుంచుకోమంటుంది.

స్వేచ్ఛ ఎవరి కోసం? మనిషి కోసం. కాపిటలిజం మూల విరాట్టు – మార్కెట్. ఆ మార్కెట్ ఎంత స్వేచ్ఛాయుతంగా ఉంటే ఎవరి కష్టం, తెలివితేటలకు సరిపడా వారు అంత సంపాయించుకునే వీలుంటుంది. మార్కెట్ – మనిషి స్వేచ్ఛ కోసం. మార్కెట్‌లో తన పంటను మంచి రేటుకు అమ్ముకోగలిగే భారతీయ రైతు స్వేచ్ఛకు ప్రపంచ వాణిజ్య సంస్థ, అమెరికన్ సామ్రాజ్యవాదుల తొండి వైఖరి అడ్డు తగులుతున్నాయని కొందరు మేధావుల అభిప్రాయం. ప్రపంచ వాణిజ్య సంస్థ, అమెరికన్ తొండి వైఖరులను కాసేపు పక్కన పెడదాం.

రైతు మార్కెట్‌లో తన పంటను స్వేచ్ఛగా అమ్ముకోనీయకుండా అసలు అడ్డుకుంటున్నది ఎవరు? ధాన్యం జిల్లాల సరిహద్దులు దాటి అమ్ముకూడదని నిబంధనలు పెట్టింది ఎవరు? ఎఫ్‌సిఐ ద్వారా లెవీలు వసూలు చేసేదెవరు? మిల్లర్ల మీద ఆంక్షలు విధించేదెవరు? బియ్యం ఎగుమతులను నిషేధించింది ఎవరు? ఉల్లిపాయల ధర కాస్త పెరగ్గానే మీడియాలో గగ్గోలు పెట్టి ప్రభుత్వం వసూలు చేసిన పన్నుల సొమ్ముతో రవాణా ఖర్చులకు సబ్సిడీ ఇచ్చి నాసిక్ నుంచి ఉల్లిపాయలు దిగుమతి చేయాలని డిమాండ్ చేసేది ఎవరు? మార్కెట్‌లో ధర ఉండి కాస్త లాభపడదామంటే – కర్నూలు ఉల్లి రైతుకు ససేమిరా.

అదే రైతుకు వరదొచ్చి పంట కుళ్ళిపోతే రోజుకొకరు పరామర్శించి ఇంత బియ్యం బిచ్చంగా వేసి రావడం! ఇదంతా చేస్తున్నదెవరు? సోషలిస్టు మేధావులా? సోషలిస్టు భావజాల ఉత్తేజిత ప్రభుత్వాలా? ప్రపంచ వాణిజ్య సంస్థా? అమెరికన్ సామ్రాజ్యవాదుల తొండి వైఖరా?

1913 నుంచి అమెరికా రాజ్యవ్యవస్థలో సోషలిస్టు భావజాలం మొదలైంది. ఫెడరల్ రిజర్వు ఏర్పాటు నుంచి, 1933 లో బంగారం నిల్వలతో సంబంధంలేని డాలరు విలువ నుంచి, రూజ్‌వెల్ట్ న్యూడీల్ నుంచి, కయ్యానికి కాలు దువ్వి జపాన్‌తో యుద్ధం కావాలని తెచ్చుకున్నది మొదలు – అమెరికన్లందరికీ స్వంత ఇల్లు, నిరుద్యోగ భృతి, అందరికీ నిర్బంధ వైద్య ఇన్సూరెన్సులాంటి పథకాల వరకు సోషలిజం మత్తు ఎక్కుతూ వస్తోంది. దాని ఫలితాలుగా ప్రభుత్వం దగ్గర అపారమైన నిధులు, తద్వారా మిలిటరీ –

ఇండస్ట్రియల్ లాబీలు, అపరిపక్వమైన యుద్ధ నిర్ణయాలు, దుందుడుకు విదేశాంగనీతి, ఆర్థిక సంక్షోభాలతో అమెరికా సమాజం తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతోంది. ఈ విధానాలను, అమెరికాకు, తద్వారా ప్రపంచానికీ గుదిబండలా తయారైన వ్యవసాయ సబ్సిడీలను కాపిటలిస్టులు, ఉదార స్వేచ్ఛావాదులు తీవ్రంగా వ్యతిరేకిస్తూ వచ్చారు. ఆ వ్యతిరేకత ఫలితమే మధ్యంతర ఎన్నికల్లో ఒబామా పార్టీ ఓటమి. పెట్టుబడిదారులందరూ ఉదార స్వేచ్ఛావాదులు కారు. పెట్టుబడిదారులందరూ కాపిటలిజం వ్యాప్తిని కోరుకోరు. అందులో చాలామంది ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ జోక్యాన్ని కోరుకుంటారు. ఈ విషయం గురించి విపులంగా ఇంకోసారి. కాపిటలిజం, ఉదార స్వేచ్ఛా వాదాలను కోరుకునేది కాపిటలిస్టులందరూ మంచి వాళ్ళని కాదు. అందరు మనుషుల్లోలాగే వాళ్ళలోనూ దుస్వార్థపరులుంటారు, చెడ్డ వాళ్ళుంటారు. అలాగే సోషలిజాన్ని వ్యతిరేకించేది సోషలిస్టులు చెడ్డ వాళ్ళని కాదు. వారిలో చాలామంది స్వతహాగా మృదు స్వభావులు, పరులకు హాని తలపెట్టని వారు కావచ్చు. కాపిటలిజాన్ని గాఢంగా కోరుకోవడానికి కారణం అది మానవాళిని ముందుకు తీసుకెళ్తుంది. సోషలిజాన్ని తీవ్రంగా వ్యతిరేకించడానికి కారణం అది ప్రజల జీవన ప్రమాణాలను రాతియుగాల స్థాయికి తీసుకెళ్తుంది, స్వేచ్ఛను హరించి వేస్తుంది.

14-11-2010

ప్రభుత్వ జోక్యాల పుణ్యమే ఈ అవినీతి

అక్షరాలా లక్షా డెబ్భై ఆరువేల కోట్ల రూపాయలు! స్వాతంత్ర్యం వచ్చిన కొన్ని నెలల్లోనే (1948) జీపుల కొనుగోలు కుంభకోణం బయటపడింది. నెహ్రూ దాన్ని తేలిగ్గా కొట్టిపడేశారు. ఇంత చిన్న విషయాన్ని కుంభకోణం అనడమే ఒక కుంభకోణమన్నారు. 1963 లో పంజాబ్ ముఖ్యమంత్రి ప్రతాప్‌సింగ్ కైరాన్ కేసులో కూడా నెహ్రూ వాదన ఇలానే సాగింది. తర్వాత తర్వాత బోఫోర్సు, హర్షద్‌మెహతా, తెహల్కా, ఇప్పుడు 2జి స్పెక్ట్రమ్. కాలక్రమేణా అవినీతి కుంభకోణాల పరిమాణం విపరీతంగా పెరిగిపోయి నప్పటికీ, వీటన్నిటి మౌలిక స్వరూపం ఒక్కటే.

ప్రతిసారీ ప్రతిపక్షాలు గొడవ చెయ్యడం, సిబిఐ దర్యాప్తుకో, గొడవ ఎక్కువైతే సంయుక్త పార్లమెంటరీ కమిటీ (అదీ అధికార పార్టీ సభ్యుని నేతృత్వంలో) విచారణకో ఒప్పుకోవడం, తప్పదనుకుంటే ఒక మంత్రిచేత రాజీనామా చేయించడం, కొన్ని రోజులకు అందరూ మర్చిపోవడం – ఇదొక అంతులేని కథ. ఇంకో కుంభకోణం బయటపడే వరకు అంతా మామూలే. సమస్య మూల కారణాలు తెలుసుకోనంత కాలం సరైన పరిష్కారం దొరకదు.

ఈ అవినీతికి అసలు కారణం దేశ ఆర్థిక వ్యవస్థలో విపరీతమైన ప్రభుత్వ జోక్యం. నెహ్రూ లండన్ నుంచి దిగుమతి చేసిన ఫాబియన్ సోషలిజం సూత్రాల ప్రకారం దేశాన్ని మెల్లమెల్లగా సోషలిజం వైపుకు నడిపించడానికి ఆర్థిక వ్యవస్థలోని ముఖ్యమైన రంగాలన్నీ ప్రభుత్వం ఆధీనంలోనే ఉంచాలన్నారు. స్టీలు, బొగ్గు, విద్యుత్తు, విమానయానం, టెలిఫోన్లు వగైరాలన్నిటినీ ప్రభుత్వ రంగంలోనే నిర్వహించారు. ప్రైవేటు రంగంలో ఉన్న పరిశ్రమలను కూడా తీవ్రమైన ఆంక్షల నడుమ, లైసెన్స్, కోటాల రాజ్యంలో నడవనిచ్చారు. దీనివల్ల పెట్టుబడిదారులకు, పారిశ్రామికవేత్తలకు ఏమీ నష్టం కాలేదు సరికదా లాభపడ్డారు. విదేశీ వస్తువుల పోటీ భయం లేదు. ఎంత నాసిరకం సరుకులు ఏ ధరలకు అమ్మినా

ఇబ్బంది లేదు. పోటీకి వచ్చే వాళ్లకు ప్రభుత్వం లైసెన్సులివ్వకుండా లాబీ చెయ్యొచ్చు కదా! అందుకే అంబాసిడర్ కార్లు, బజాజ్ స్కూటర్లు, చివరకు చేతి గడియారాలు కూడా బ్లాక్ మార్కెట్ అయ్యేవి. ఆర్థిక, పారిశ్రామిక వ్యవస్థ కోళ్లగంప కింద పెరిగిన పూల మొక్కలాగా మరిగుజ్జు రూపం ధరించింది. 1990ల్లో తెచ్చిన ఆర్థిక సరళీకరణలో కూడా రాజకీయ నాయకులు తమకు గల అవకాశాలను అన్వేషించారు. స్వేచ్ఛగా ఎగరాల్సిన ఆర్థిక వ్యవస్థ రెక్కల మీద పీఠం వేశారు. అది ఎంత ఎత్తుకు ఎగిరితే తమను కూడా అంత ఎత్తుకు తీసుకెళ్లక తప్పని పరిస్థితి సృష్టించారు. సహజ వనరులన్నిటి మీదా ప్రభుత్వం గుత్తాధిపత్యాన్ని ఇంకా పెంచుకుంటూపోయారు. తమను కాదని ఆర్థిక పక్షి ఎగరలేని పరిస్థితి కలగజేశారు. అందులో భాగంగానే అందివచ్చిన ప్రతి అవకాశాన్ని డబ్బుగా మలుచుకుంటున్నారు. స్పెక్ట్రం పంచాలన్నా ప్రభుత్వమే. పరిశ్రమ పెట్టడానికి భూమి కొనుక్కోవాలన్నా ప్రభుత్వం అనుమతి కావాల్సిందే. నీళ్ల కోసం మళ్లా వాళ్ల దగ్గరికే వెళ్లాలి. విద్యుత్ రంగాన్ని పాక్షికంగా ప్రైవేటీకరిస్తారు, కానీ పక్షపాతంగా తమకు కావాల్సిన వారికి కేటాయిస్తారు.

ఈ అవకాశాలు తమకెప్పుడొస్తాయా అని ప్రతిపక్షాలు ఎదురుచూస్తూ ఉంటాయి. కుంభకోణాలు బయటపడినప్పుడల్లా పాలక పక్షాన్ని ఇరుకున పెడుతుంటాయి. అసలు మూల కారణమైన 'ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వం జోక్యం' గురించి మాట్లాడరు. తామైతే ఆ జోక్యాన్ని నివారిస్తాం, కనీసం తగ్గిస్తాం అని పొరపాటున కూడా చెప్పరు. వామపక్ష మేధావులైతే ఇదంతా సరళీకృత ఆర్థిక విధానాల ఫలితమేననీ, కాపిటలిస్టు వ్యవస్థలో ఉండే దోపిడీ మరోసారి రుజువైందనీ, ప్రభుత్వాలు బహుళజాతి సంస్థల ధనదాహానికి అమ్ముడుబోయాయని చర్చను ఇంకో దారిలోకి మళ్లిస్తారు. ఇలా ఎంత మంది పోలీసులున్నా అసలు దొంగ పారిపోతాడు. ప్రస్తుత కుంభకోణంలో అసలు దొంగ – స్పెక్ట్రం పంపకంలో ప్రభుత్వం జోక్యం.

ప్రభుత్వాలకు పట్టుచిక్కని ఒకే ఒక పరిశ్రమ కంప్యూటర్ రంగం. అందుకే అది అంత వేగంగా అభివృద్ధి చెందుతోంది. విడి భాగాలు, సాఫ్ట్‌వేర్‌ల ధరలు ఏటా సగానికి సగమవుతున్నాయి. కంప్యూటర్ పరిశ్రమలో వారి ప్రమాణాలను, ప్రోటోకాల్స్‌ను, కొత్త టెక్నాలజీలను ప్రభుత్వం జోక్యం లేకుండా పరిశ్రమలోని స్వచ్ఛంద వ్యవస్థల ద్వారా నిర్ణయించుకుంటారు. ఏ విషయంలోనైనా రెండు టెక్నాలజీలు పోటీపడితే, ఏది నిలబడేదీ మార్కెట్‌లో వినియోగదారులు నిర్ణయిస్తారు. ఉదాహరణకు సెల్‌ఫోన్లలో వాడే బ్లూటూత్ ఫ్రీక్వెన్సీని, వైద్య రంగంలో సమాచార వ్యవస్థకు వాడే ఫ్రీక్వెన్సీలను ఆ పరిశ్రమలే (ఐఈఈఈ ద్వారా) నిర్ణయించుకున్నాయి. అలాగే ఇంటర్నెట్ ప్రమాణాలు. అలాగే 2జి స్పెక్రమ్‌ను కూడా ఆ పరిశ్రమలోని స్వచ్ఛంద వ్యవస్థలే పంచుకోగలవు. ఈ లైసెన్సు

ఫీజులు, అవినీతి లేకపోతే ఇంకా కారు చౌకగా సెల్‌ఫోన్ సర్వీసులు ప్రజలకు దొరికేవి. ప్రభుత్వం జోక్యం చేసుకుని, అవినీతికి పాల్పడి, తమ అనుకూలురకు అమ్మడం ద్వారా గుత్తాధిపత్యానికి తెర తీశారు. మార్కెట్‌లో పోటీ లేకుండా చేశారు. దీనంతటి భారం పడేది వినియోగదారులమీదే. లంచాలిచ్చి లైసెన్సులు తెచ్చుకున్న కంపెనీలు ఆ ఖర్చంతా వినియోగదారుల దగ్గర్నుంచే వసూలు చేస్తాయి. అంతేగాక, కొత్తవారిని రాకుండా ప్రభుత్వం కాపలా కాస్తుంది. కనుక గుత్తాధిపత్యం చెలాయిస్తారు. ఇదొక్కటే కాదు. యాభై ఏళ్లుగా డ్రిల్లింగు చేస్తున్న ఓఎన్‌జిసికి దొరకని గ్యాసు – రిలయన్సు కంపెనీకి లైసెన్సు పొందిన రెండేళ్లలోనే అపారమైన పరిమాణంలో దొరుకుతుంది! ఆ గ్యాసును ఏ ధరకు ఎవరికి అమ్మాలో తెరవెనుక సంప్రదింపుల్లో ప్రభుత్వమే నిర్ణయించింది! దీన్ని ఆర్థిక సరళీకరణ అనాలా లేక సరళీకరణను రాజకీయీకరణ చేయడం అనాలా?

ఆర్థిక రంగంలో ప్రభుత్వ జోక్యాన్ని పాతుకుపోయిన పారిశ్రామికవేత్తలు మనసారా ఆహ్వానిస్తారు. దానివల్ల వాళ్లు ఎవరితోనూ పోటీపడాల్సిన అవసరం ఉండదు. కొత్త ఔత్సాహికులెవరూ రంగంలో దిగకుండా ప్రభుత్వం ఆంక్షలు, నిబంధనలు, లైసెన్సులు, కోటాల రూపంలో గుమ్మం దగ్గర కాపలాగా ఉంటాయి. నాణ్యతగల వస్తువులు, సేవలు సరసమైన ధరలకు అందించడం ద్వారా లక్షలాది, కోట్లాది వినియోగదారుల్ని మెప్పించడం కష్టంతో కూడుకున్న పని. దానితో పోలిస్తే, ప్రభుత్వాన్ని మెప్పించి, అడిగిన డబ్బు పడేసి గుత్తాధిపత్యం హక్కులు కొనుక్కోవడం చాలా తేలిక. ప్రభుత్వాలదేంపోయింది? ఒకవైపు అడిగినంత డబ్బు, మరోవైపు ఆర్థిక రంగంలో తమ జోక్యం కాపిటలిస్టులను కంట్రోలు చేయ్యడానికేనని ప్రజారంజక ఉపన్యాసాలివ్వవచ్చు. లైసెన్సు ఫీజు వసూలు చేసేది పేద ప్రజలను ఆదుకోవడానికేననీ; ఆ రకంగా ముందుకుపోతూ సమసమాజాన్ని స్థాపించడమే తమ ధ్యేయమని ఆవేశంగా నమ్మబలకవచ్చు. కానీ ఆ వసూలు చేసేది వినియోగదారులైన ప్రజల దగ్గర్నుంచనీ, పారిశ్రామికవేత్తల జేబుల్లోంచి కాదనీ మేధావులు, మీడియా గమనించరు. చిన్నా, పెద్దా స్థాయిలో రోజూ జరిగే అవినీతిని ఆపాలన్నా, కనీసం తగ్గించాలన్నా, ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ జోక్యం క్రమంగా తగ్గాలి. ప్రభుత్వం సైజు తగ్గాలి. మనిషి ఇతరులకు హాని చేయనంత వరకు తన వృత్తిని, జీవన విధానాన్ని, సంపాదనను తానే నిర్ణయించుకునే స్వేచ్ఛ ఉండాలి.

మరి ప్రభుత్వం ఉన్నది దేనికంటారా?

తార్నాకాలో తన దారిన తాను పోతున్న పౌరులపై తెలంగాణ ఉద్యమం పేరిట రాళ్లు విసరకుండా చూడడానికి.

21-11-2010

బిహార్‌లో ఏం జరిగింది ?

లాలూ ప్రసాద్ యాదవ్. ఆయన గెలిచినప్పుడల్లా అది ప్రజా విజయమన్నారు. ఆయన గేదె మీద సవారీ చేసినా, పాలు పిండినా రంగుల ఫోటోలు ప్రచురించి పరవశించిపోయారు. తన స్థానంలో భార్యను కూచోబెట్టి పరిపాలించినా, ప్రజలు ఓట్లేశారు కాబట్టి ఫర్వాలేదన్నారు. రైళ్లలో సగం బెర్తులు తత్కాల్ పేరుతో రెట్టింపు ధరలకు అమ్మినా 'ఆహా, ఛార్జీలు పెంచకుండానే రైల్వేల లాభాలు పెంచాడు చూశారా!' అని ఆయన ప్రతిభను ఆకాశానికెత్తారు. మరిప్పుడేం జరిగింది? ఎందుకు జరిగింది?

సమాజ హితానికి, ప్రభుత్వాల లక్ష్యాలకు మధ్య వైరుధ్యం ఉంటుంది. ఆ రెండింటి మధ్యా పోరాటం నడుస్తూనే ఉంటుంది. ఈ పోరాటంలో రెండూ నష్టపోతాయి. ఆ శిథిలాల నుంచి మళ్లీ కొత్త సమాజం మొలుస్తుంది. మళ్లీ ప్రభుత్వం పుడుతుంది. ఈ రెండింటి పోరాటం ఇంకో కొత్త నాశనానికి దారి తీస్తుంది. దీనికి కారణం మనిషి నైజమా, అజ్ఞానమా?

సమాజం, ప్రభుత్వం – రెండూ మనుషులతో ఏర్పాటయినవే. ఏ మనిషయినా తాను ఉన్న పరిస్థితిని మెరుగుపరుచుకోవాలని కోరుకుంటాడు. దాని కోసం కష్టపడతాడు. సంపాదిస్తాడు. సుఖపడతాడు. ప్రతి సంపాదన వెనుకా తన కష్టం, ప్రతి సుఖం వెనుకా తన చెమట ఉంటుంది. సుఖాలనైతే ఆశిస్తాడు కానీ, కష్టపడడానికి విముఖత చూపుతాడు. అది మానవ నైజం. వీలున్నంత తక్కువ కష్టంతో వీలైనంత ఎక్కువ సుఖాలను ఆశించడం సహజం. ఇక్కడి వరకు –మనిషికి, ఇతర జంతు, జీవ జాలాల ప్రవృత్తికి పెద్దగా తేడాలేదు.

మనిషికున్న అతి గొప్ప వరం, ప్రత్యేకత – తన మేధస్సు. అది ఉపయోగించి, ఇతరులతో ఇచ్చిపుచ్చుకోవడం ద్వారా తనంతట తాను తయారు చేసుకోలేని వస్తువులను, సేవలను కూడా పొందుతాడు. ఉదాహరణకు తాను పండించిన ధాన్యం అమ్ముకుని ఆ డబ్బుతో బట్టలు, టీవీ, బస్సు టిక్కెట్టు లాంటివి కొనుక్కోగలుగుతాడు. అంతేకాదు, తను సంపాదించింది కొంత పొదుపుచేసి, దాంతో పనిముట్లు, యంత్రాలు కొనుక్కుని ఎక్కువ

పండిస్తాడు. అలా తాను బాగుపడటమే కాక, ఎక్కువ ఉత్పత్తి చేయడం ద్వారా సమాజానికి కూడా మేలు చేస్తాడు. ఈ మార్కెట్ వ్యవస్థ, ఇచ్చిపుచ్చుకునే ప్రక్రియల ద్వారా – క్రమేపీ తక్కువ కష్టానికే ఎక్కువ ఫలితం పొందుతాడు. కానీ ఎంతోకొంత కష్టపడక తప్పదు– ఇబ్బంది, విసుగు అనిపించినప్పటికీ.

అసలు కష్టపడకుండానే సుఖపడాలనే తాపత్రయం నుంచి మనిషి బయట పడలేదు. కాబట్టి కొందరు ఇతరుల నుంచి దోచుకోవడానికి తెగబడతారు. ఈ దోపిడీ నుంచి రక్షణ కోసం కష్టపడి సంపాదించేవాడు తనకు చేతనైన ప్రయత్నం చేస్తాడు. సమాజం, మార్కెట్ పెద్దగా పెరిగినప్పుడు ఆ పని చేసిపెట్టడానికి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుంటారు. ఈ హింస, దోపిడీలను ఆపడానికి ప్రభుత్వాలకు గుత్తాధిపత్యం ఇస్తారు. ఆ మేరకు ఇవ్వాలి కూడా. లేకపోతే పని జరగదు.

కాని ప్రభుత్వం నడిపేది కూడా అందరిలాంటి మనుషులే. వాళ్లు కూడా తక్కువ కష్టంతో ఎక్కువ సుఖపడాలనే ప్రయత్నిస్తారు. కాకపోతే ఈ విషయంలో మామూలు ప్రజలకు లేనిది, వాళ్లకు ఉన్నదీ 'అధికారం'. ఆ అధికారం ఇచ్చే హంగు, ఆర్భాటం, ఫలితంగా అధికార వ్యామోహం. మార్కెట్ సమాజంలో గుర్తింపు పొందలేనివాళ్లు ఇంకా ఎక్కువ అధికార దర్పం ప్రదర్శిస్తారు. తమ అధికారాల పరిధిని పెంచుకుంటూపోవడానికి ప్రయత్నిస్తారు. ప్రజలను దోపిడీ నుంచి రక్షించడమనే చిన్న లక్ష్యంతో – వారి అధికార దాహం తీరదు. అందుకని ప్రజలకు మేలు చేస్తున్నామన్న పేరుతో మార్కెట్‌లో జోక్యం చేసుకుంటారు. పేరుకు 'జోక్యం'. కానీ, నిజానికది దోపిడీ.

తమకున్న పోలీసు గుత్తాధికారాలతో మార్కెట్ మెడలు వంచుతారు. స్వేచ్ఛా జీవులు, కష్ట జీవులను కట్టడి చేస్తారు. తమ జీత భత్యాలను తామే నిర్ణయించు కుంటారు. కష్టపడకుండా సుఖపడే దారులు వెతుకుతారు. ఈ ప్రయత్నంలో తమతో చేతులు కలిపే వర్గాలు – తోడు దొంగల – కోసం వెతుకుతారు. పాతరోజుల్లో కొందరు జమీందార్లు చేతులు కలిపేవాళ్లు. తర్వాతి కాలంలో ప్రభుత్వ లైసెన్సుల ద్వారా వ్యాపారాల్లో గుత్తాధిపత్యం పొందిన వ్యాపార వర్గాలు సహకరించాయి.

కానీ విస్తృత ప్రజాస్వామ్య వ్యవస్థల్లో అధికారానికి రాచ మార్గం ఓట్లు. కాబట్టి తాము అధికారం చెలాయిస్తూ కష్టపడకుండా సుఖపడాలంటే ఓటర్లలో చాలా మంది తమను సమర్థించాలి. దానికోసం ఈ ఉచిత సుఖాలను వాళ్లకు కూడా కొంత పంచాలి. తద్వారా తమ అధికార వ్యామోహాన్నీ, ఉచిత సంపాదనను, నియంత్రుత్వ పోకడలను ప్రశ్నించకపోవడమే కాకుండా, ప్రోత్సహించేలాగా కొన్ని వర్గాలను తయారు చేసుకోవాలి. ఈ ఆలోచనలలోంచి పుట్టినవే సబ్సిడీలు, ఉచిత పథకాలు, నిర్బంధ పన్నులు, ఎగుమతి నిషేధాలు, దిగుమతి లైసెన్సులు ...

మీకు సబ్సిడీలిస్తాం, మాకు అధికారమివ్వండి; మీరు కష్టపడకుండా సుఖపెడతాం, మమ్మల్ని ప్రశ్నించకండి అనే ఒప్పందం ఇది.

ఈ ఒప్పందాల ద్వారా ప్రజలు తమ రక్షణ కొరకు ఏర్పరుచుకున్న ప్రభుత్వం– వాళ్ల సంపాదనను భక్షించే రాజ్యం అవతారమెత్తుతుంది. ఈ ఉచిత సుఖాలు పొందే వర్గాల మద్దతు లేకపోతే రాజ్యం కూలిపోతుంది. రాజ్యం లేకపోతే ఈ వర్గాలు బతకలేవు. ఈ ఉచితాల పంపిణీకి ఎంచుకునే ముఖ్య మార్గం పన్నులు. పన్నుల వ్యవస్థ పన్నులు కట్టే ప్రజల నియంత్రణలో ఉంటే అవి పాపంలాగా ఇంతగా పెరిగిపోవు. కానీ సమాజం సంక్లిష్టమయిపోయి, ప్రజలు దైనందిక పనుల్లో నిమగ్నమై, ప్రభుత్వాలు చేసే పనులను గమనించి, ప్రశ్నించకపోవడంతో ; ప్రభుత్వాలు , అంటే రాజకీయ నాయకులు, అధికారుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. చివరకు చిక్కుపడిన దారపు ఉండలా కష్టపడేదెవరో, ఫలితం అనుభవించేదెవరో, పన్నులు కట్టేదెవరో, కూర్చుని తినేదెవరో... మొదలు – చివర తెలియని పరిస్థితి.

ఈ బలవంతపు పన్ను వసూళ్లలో కొంత భాగం కొంతమంది ప్రజలకు చేరుతుంది. వారు ప్రభుత్వ అధికారులను, పన్నుల వ్యవస్థలను సమర్థించకుండా ఉండలేరు. ఎవరైనా ప్రశ్నిస్తే, 'నువ్వేమైనా కడుతున్నావా? ఇది మా హక్కు' అని ఎదురుదాడి. క్రమేణా ఇది నియంతృత్వానికి దారి తీస్తుంది. కష్టపడే మనిషిని బానిసగా చేస్తుంది. ఇలా రాజ్యం సమాజాన్ని దురాక్రమణ చేస్తుంది. ఒకస్థాయి దాటాక తనను, తన పన్నుల దోపిడీ వ్యవస్థను ఎవరూ ప్రశ్నించలేనంత అధికారాలు కట్టబెట్టుకుంది. దానికి సామాజిక న్యాయమనే వినసొంపైన పేర్లు కూడా పెట్టుకుంది.

రాజ్యం అధికారాలు పెరిగే కొద్దీ మనిషి హక్కులు తరిగిపోతూ ఉంటాయి. మనిషి తన కష్టానికి తగినంతగా సుఖపడలేని పరిస్థితి వస్తుంది. ఇది అర్థమయిననాడు ఉత్సాహం తగ్గిపోతుంది. కష్టపడే స్వభావం మారిపోతుంది. తాను బతకడానికి సరిపడా మాత్రమే సంపాదిస్తాడు, లేదా మిగిలిన చాలా మందిలాగా తాను కూడా ఒక జోలె పట్టుకుంటాడు. ఎక్కువ మంది ఇలా చేస్తే ఇక పన్నులు కట్టేదెవరు? ప్రభుత్వ 'రాబడి' తగ్గిపోతుంది. ఉచిత పంపిణీలు తగ్గించాల్సి వస్తుంది. కక్షలు పెరుగుతాయి. కళలు, సృజనాత్మకత నశిస్తాయి. కడుపునిండా తిండికే ఇబ్బందైనప్పుడు, 'కళాపోషణ' చేసెదెవరు? సంస్కృతి, సంస్కారం క్షీణిస్తాయి.

15 సంవత్సరాల లాలూ యాదవ్ పరిపాలనలో బీహార్ పరిస్థితి క్రమంగా అలా తయారయింది. ఈ దిగజారడం – నిజానికి అంతకు ముందే మొదలయింది. ప్రజలను హింస, దోపిడీ నుంచి రక్షించాల్సిన ప్రభుత్వం ఆ పని తప్ప అన్నీ చేసింది.

హత్యలు, మానభంగాలు, డబ్బుకోసం అపహరణలు నిత్యకృత్యం. కష్టపడి సంపాదించడమే పాపం. ఆ సంపాదనను అనుభవించగలమన్న ఆశలేదు. స్కూళ్ళకు ఉపాధ్యాయులు రారు. ప్రభుత్వ ఆఫీసుల్లో ఎవరూ పనిచేయరు. అలా, ఉచిత సుఖాలకు అలవాటు పడ్డారు. ఉచిత పంపిణీలు చేసి ఓట్ల సంఖ్యలో మెజారిటీ వర్గాలయిన బలహీన వర్గాలు, మైనార్టీలు రాజ్యం మీద ఆధారపడేలా చేసుకున్నారు. అరాచకత్వం పేట్రేగిపోయింది. కరెంటు లేదు. రోడ్లు లేవు, రక్షణ లేదు. సబ్సిడీలున్నాయి. కులాలున్నాయి. కుల పార్టీలున్నాయి. కష్టపడేవాళ్లు చాలా మంది రాష్ట్రం విడిచి వెళ్లిపోయారు. పోగాపోగా చివరికి అర్థమయింది. అందరికీ అర్థమయింది. సబ్సిడీలు, కుల, మత, వర్గాల మత్తు లో ఇన్నాళ్లు జోగిన వాళ్లకు కూడా అర్థమయింది. ఏమయిందో స్పష్టంగా తెలియదు గానీ, ఏదో దారుణం జరిగిపోయిందనేది మాత్రం అర్థమయింది.

రాజకీయాన్ని తిరగరాసే ఆశాకిరణం నితీష్ కుమార్‌లో కనిపించింది. ప్రజలు స్పందించారు. దాని ఫలితమే భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఇప్పటివరకు నమోదు కానంతటి విజయం. కానీ ఆలోచించాల్సిన విషయం ఒకటుంది. లాలూ ప్రసాద్ యాదవ్ ప్రభుత్వం ఏం చేస్తోందో గమనిస్తున్న మేధావులు, మీడియాలకు ఇంతకాలం ఎందుకు అర్థం కాలేదు? గత కొన్ని దశాబ్దాలుగా బీహార్లో జరిగిన స్థాయిలో ప్రణాళికాబద్ధమైన అరాచకత్వం ఏ రాష్ట్రంలోనైనా జరగొచ్చు. దేశం మొత్తం మీదా జరగొచ్చు. దీన్నుంచి మనల్ని రక్షించడానికి అమెరికా రాదు, రష్యా రాదు, మనకు మనమే రక్షించుకోవాలి. తస్మాత్ జాగ్రత్త

28-11-2010

సామాజిక ప్రజాస్వామ్యం!

ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతోంది. సామాజిక న్యాయం సవాళ్ళు విసురుతోంది. కొత్త ప్రభుత్వం ఏర్పాటయిన నేపథ్యంలో పంపకాల కొట్లాటలు బహిరంగ మైపోయాయి. ఇదంతా ప్రజల క్షేమం కోసమేనని అనుకునేంత అమాయకులెవరూ లేరు.ఏ కులానికీ, ఏ జిల్లాకు ఎన్ని మంత్రి పదవులు, ఏయే శాఖలు, వాటి ప్రాముఖ్యతలను విశ్లేషించడానికి మీడియాకు సమయం, స్థలం చాలడం లేదు. ఏ నిర్ణయం వెనుక ఏ రాజకీయ సమీకరణాలున్నాయో అనే చర్చలు... రాజకుటుంబం నీడ నుంచి బయటకెళ్లి ఎండలో నిలబడ్డ యువరాజు తరువాతి ఎత్తులేమిటో అనే ఉత్కంఠ. రోజూ ఉండే పనులతో విసుగెత్తిన వాళ్ళకు కొంత వినోదం, వృత్తి రీత్యా రాజకీయులకు ఇదొక ఆట.

అసలు రాజకీయాలకు ఇంత ఆకర్షణ శక్తి ఎక్కడ్నుంచి వస్తుంది? అందులో దొరికే డబ్బు నుంచి, అధికారం నుంచి. ఆ అధికారంతో తనకు నచ్చని వాళ్ళను, తనకు ఎదురు తిరిగినవాళ్ళను ఆర్థికంగా, మానసికంగా నాశనం చెయ్యగల శక్తి నుంచి. తనకు, తన వాళ్ళకు, 'తన' అనుకున్నవాళ్ళకు, తన సామాజిక వర్గంలో కొందరికి, తన జిల్లా, ప్రాంతం వాళ్ళలో కొందరికి పనులు చేసిపెట్టగల సామర్థ్యం నుంచి. ఏం పనులు? లైసెన్సులు, ప్రభుత్వం కాంట్రాక్టులు ఇప్పించడం, బదిలీలు చేయించి పెట్టడం, అవినీతి కేసులు ఎత్తేయడం, హత్యలు చేసినా బెయిలిప్పించడం వగైరా.... వగైరాలు. లక్షకోట్ల బడ్జెట్‌లో తన మంత్రిత్వ శాఖకు కేటాయించిన సొమ్ములో ఎంత మిగుల్చుకోవచ్చు, ఎంతమంది 'లబ్ధిదారులు' తనకు రుణపడి ఉంటారు, ఎన్ని కొత్త పథకాలు రచించి పన్నుల డబ్బును ఇంకా ఎంత మందికి పంచిపెట్టవచ్చు అనే వాటిపై తన ప్రాధాన్యత ఆధారపడి ఉంటుంది.

ప్రజలకు సంబంధించినంత వరకు – పళ్ళూడగొట్టుకోవడానికి ఏ రాయైనా ఒకటే. ఎవరే మంత్రిత్వ శాఖ నిర్వహించినా పన్నులేమీ తగ్గవు. ద్రవ్యోల్బణం తగ్గదు. కష్టపడి సంపాదించిన వారి నుంచి పన్నుల రూపంలో లాక్కుని కష్టపడని, సంపాదించని వాళ్ళకు పథకాల రూపంలో పంచి పెట్టడం ఆగదు. ఆ పంచిపెట్టే పథకాలకు ఏ పేరు పెట్టినా ఫలితం ఒకటే. మానవజాతి – రాతి యుగాల్నుంచి ఈ స్థాయికి చేరింది ఉచిత పంపిణీల వల్ల కాదు. తక్కువ శారీరక శ్రమతో ఎక్కువ సుఖాలను అనుభవించాలంటే పెద్ద ఎత్తున యాంత్రీకరణ, ఆధునీకరణ జరగాలి. అది సాధ్యపడాలంటే పెద్ద ఎత్తున పెట్టుబడులు అవసరం. ప్రజలు సంపాదించిన డబ్బులో సింహభాగం పన్నుల రూపంలో ప్రభుత్వం గుంజుకోవడం ఆపేస్తే తప్ప; పెట్టుబడులు సమకూరవు. ప్రజలు తమ సంపాదనలో అవసరం, ఇష్టాయిష్టాలను బట్టి కొంత వినియోగించి, మిగతా సొమ్మును రకరకాల పద్ధతుల్లో పెట్టుబడికి ఉపయోగించగలుగుతారు. దాంతో యాంత్రీకరణ పెరుగుతుంది. యంత్రాలు తయారుచేయడానికి, వాటిని నడపడానికి మనుషుల అవసరం పెరుగుతుంది. ఉద్యోగాలు, జీతభత్యాలు, కూలీరేట్లు పెరుగుతాయి. అన్నివర్గాల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతాయి. అలాగాక ప్రభుత్వం జోక్యం చేసుకుని ఏ ఇతర మార్గాలననుసరించినా ఫలితాలు ఇంతకంటే అధమంగా ఉంటాయి. ఇది ఎవరూ మార్చలేని ఆర్థిక సత్యం. మిగులు ధనాన్ని ప్రభుత్వం పన్నుల రూపంలో లాగేసుకుంటే– పెట్టుబడులు పెరగవు. దాంతో ప్రజల జీవన ప్రమాణాలు పెరగవు సరిగదా..., మరింతగా దిగజారిపోతాయి.

ఆర్థిక వ్యవహారాల్లో ప్రభుత్వం ఎంత జోక్యం చేసుకుంటే ప్రజలకు అంత మేరకు నష్టం వాటిల్లుతుంది. కోట్లమంది ప్రజలు వినియోగదారుల రూపంలో, చిన్నచిన్న పెట్టుబడిదారుల రూపంలో కొన్ని వస్తువులను కొనడం ద్వారా, కొన్నిటిని కొనకపోవడం ద్వారా ఆర్థిక వ్యవస్థను నిర్దేశిస్తారు. ఏ వ్యాపారం, ఏ కంపెనీ నిలబడుతుందో, ఏది దివాళా తీస్తుందో శాసిస్తారు. అది మార్కెట్‌లో ప్రతి రూపాయికీ ఉండే ఓటు హక్కు. ఆ హక్కును రోజూ ఉపయోగించుకొని వ్యాపారాలను, ఉత్పత్తిదారులను ఎంచుకుంటారు. ఆ హక్కును లేకుండా చేసి ప్రభుత్వమే వినియోగాన్ని, పెట్టుబడులను, లాభనష్టాలను శాసించడం నియంతృత్వం. ఆ నియంతృత్వం నిలబెట్టుకోవడం కోసం సోషలిజం, సామాజిక న్యాయం, ప్రాంతీయ సమతుల్యత, పేదరిక నిర్మూలన..., ఇలా రకరకాల భావజాలాలను ఉనికిలోకి తెచ్చాయి. ఏ పేరు పెట్టినా అది ప్రభుత్వ జోక్యమే. దుష్పరిణామాలూ తప్పవు.

ఆర్థిక వ్యవస్థలో జోక్యానికి అవినీతి కూడా తోడైతే దుష్పరిణామాల తీవ్రత

మరితంగా పెరుగుతుంది. అవినీతి సొమ్మును స్విస్ బ్యాంకులకు తరలిస్తారు. లేదా విచ్చలవిడిగా ఖర్చుపెడతారు లేదా బినామీ ఆస్తులుగా మారుస్తారు. స్టీలు, సిమెంట్ ఫ్యాక్టరీల రూపంలోను; దినపత్రిక, ఛానెళ్ళ రూపంలోను బయటపడుతుంది. ఇదేంటని ప్రశ్నిస్తే బుకాయింపులు, బెదిరింపులు చేయడం; కొంత సొమ్మును పంపకం చేసి; 'ప్రజాదరణ' పొందుతూ రాజకీయ జీవితాన్ని నిరాటంకంగా నెట్టుకొచ్చే నాయకులకూ కొదవలేదు.

ఎంత లావు బడ్జెట్ పెడితే అంత గొప్ప ప్రభుత్వమన్న భ్రమలోంచి బయటపడాలి. ఆ డబ్బంతా మన దగ్గర్నుంచి వసూలు చేసిందేనన్న వాస్తవాన్ని గుర్తించాలి. సంపాదించిన వాళ్ళు తమ ఆలోచనల మేరకు ఖర్చు, పెట్టుబడులు పెట్టనీయకుండా ఆ నిర్ణయాలన్నీ రాజకీయ నాయకులు తమ చేతుల్లోకి తీసుకోవడం నియంతృత్వమన్న సత్యాన్ని గ్రహించాలి. ఉచిత పథకాల ద్వారా లబ్ధిపొంది, డబ్బు, సారా, బిర్యానీ పొట్లాల కోసం ఓట్లేయడం ప్రజాస్వామ్యం కాదు. అది మూక స్వామ్యం. ఎవరు సంపాదించింది వారు అనుభవించ గలగడమే నిజమైన ప్రజాస్వామ్యం. అలాంటి ప్రజాస్వామ్యం నిలబడగలిగేది, మనగలిగేది కేవలం ఉదార స్వేచ్ఛావాద పెట్టుబడిదారీ పునాదుల మీద మాత్రమే. అప్పుడు ముఖ్యమంత్రి ఎవరైనా ఫర్వాలేదు. ఇంతమంది మంత్రులూ అఖ్ఖర్లేదు. రాజ కుటుంబాల వైరాలతో ప్రజలకు పనుండదు. అర్ధరాత్రి నాయకత్వ మార్పిడులు ఉండవు. మిట్టమధ్యాహ్నపు తిరుగుబాటు లేఖలూ ఉండవు.

05-12-2010

చిక్కుముడులు విప్పుదాం

ఎమ్మార్పీయస్ ఉద్యమం, ప్రభుత్వోద్యోగుల అల్టిమేటం, తెలంగాణ ఉద్యమం – ప్రభుత్వాలనే కాదు... ప్రజలను కూడా ఆందోళన పరుస్తున్నాయి. ఏది సబబో, ఏది కాదో తెలియని మేధో గందరగోళం నెలకొని ఉంది. ప్రభుత్వాల పరిధిని నిర్వచించి, నిర్దేశించని సార్వజనిక ప్రజాస్వామ్యంలో రకరకాల సమూహాలు, వర్గాల ఉత్పన్నం అనివార్యం. ఓట్ల ద్వారా ఇతరుల ఖర్చుతో వర్గ ప్రయోజనాలు నెరవేర్చుకునే స్పృహ క్రమంగా కొత్త కొత్త వర్గాలను తయారుచేస్తుంది. ఎవరి ప్రయోజనాలను వాళ్లు ఎన్నికల సమయంలో ఓట్లేసి గెలిపించుకుంటారు. ఈ రకంగా కొంత కాలానికి రాజకీయాలు కేవలం సమూహాల సమాహారంగా, వివిధ వర్గాల చలనశీలమైన సమీకరణలుగా మిగిలిపోతాయి. ఒకస్థాయి దాటాక ఇవి ముదిరిపోయి ఎవరికీ అర్థంకాని, ఎవరూ విప్పలేని చిక్కుముడులుగా మారతాయి.

అరవై సంవత్సరాల క్రితం రిజర్వేషన్లు ప్రవేశపెట్టారు. ముందు పది సంవత్సరాల వరకే అన్నారు. తర్వాత ఆ వర్గం ఓట్ల సంఖ్యను, ప్రాముఖ్యాన్ని గమనించి ఎప్పటికప్పుడు పొడిగిస్తూ వచ్చారు. కొంత కాలానికి ఆ వర్గాల్లోనే అసమానతలు ఏర్పడి కొన్ని కులాలు ఎక్కువ, కొన్ని తక్కువ ప్రయోజనం పొందడంతో తక్కువ ప్రయోజనాలు పొందిన వాళ్ళు – ఇంకో కొత్త వర్గంగా ఏర్పడి ఉద్యమించారు. రాజకీయ పార్టీలు ఈ కొత్త వర్గం ఓట్లు పోగొట్టుకోలేవు. అలా అని ఎక్కువ ప్రయోజనాలు పొంది, వ్యవస్థలో బలమైన స్థానాలలో ఉన్నవారి ఓట్లనూ విస్మరించలేవు. ఏం చెయ్యాలా అనే సందిగ్ధం, ఏమీ చెయ్యలేని అసహాయత.

రిజర్వేషన్లు పొందడానికి ఓటు ఎంతగా ఉపకరిస్తుందో తెలిసొచ్చిన ఇతరుల్లో కొందరు – బలహీన వర్గాల పేరుతో కొత్త సమూహాలుగా తయారయ్యారు. ఏ కులాన్ని ఏ వర్గంలో వెయ్యాలి, ఏ వర్గానికి ఎంత శాతం ఇవ్వాలి, ఏ కులాన్ని ఏ వర్గం నుంచి ఏ

వర్గంలోకి ఎప్పుడు మార్చాలనేది ఎన్నికల సమయంలో రాజకీయ ప్రయోజనాల మీద ఆధారపడి మారుతూ ఉంటుంది. ఇదే మార్గాన్ని మైనారిటీలనబడే మతాలు కూడా అనుసరిస్తున్నాయి.

ఏతావాతా వీటన్నిటి ఫలితం ఎవరి కులాన్ని, మతాన్ని వాళ్లు సంఖ్యా పరంగా, ఐక్యతా పరంగా బలోపేతం చేసుకుంటున్నారు. గమ్మతేమిటంటే – అదే సమయంలో కులాలను నిర్మూలించాలనే మేధో వాదనలు చేస్తుంటారు.

ఇంకో ముఖ్యమైన వర్గం – ప్రభుత్వోద్యోగులు. ఓట్ల సంఖ్యాపరంగా కంటే; ఓటింగు సరళిని, ప్రభుత్వం మీద ప్రజల అభిప్రాయాన్ని ప్రభావితం చెయ్యగలరని... తమ డిమాండ్లను ఒప్పుకోకపోతే ప్రబుత్వాలను బ్లాక్‌మెయిల్ చెయ్యగలరనీ రాజకీయ నాయకుల నమ్మకం. అందుచేత ఉద్యమించి, తమ జీతభత్యాలను, పనిగంటలను, ఉత్పాదక ప్రమాణాలను తామే నిర్ణయించుకునే బలం వారికి అమిరింది. ప్రభుత్వాన్ని నడిపే వారికీ పోయేదేమీలేదు. జీతాలకు డబ్బు చాలకపోతే, ఇంకొన్ని పన్నులు విధించగలిగే గుత్తాధికారం ఎలాగూ ఉండనే ఉంది.

ఇకపోతే ప్రాంతీయ వాదాలు. ఒక ప్రాంతంలోని నిధులను ఇంకో ప్రాంతానికి తరలిస్తున్నారని, ఒకరు ఇంకొకరిపై ఆధిపత్యం చెలాయిస్తున్నారని, నీటి పారుదల, వ్యవసాయ రంగాల్లో అసమానతలున్నాయని, వాటిని రూపుమాపడానికి ప్రభుత్వాలు చెయ్యవలసినంత కృషి చెయ్యలేదని.. అభియోగాలున్నాయి. ఇవన్నీ ప్రభుత్వాలకు, ప్రభుత్వ విధానాలకు, ప్రభుత్వ ఉద్యోగులకు, ప్రభుత్వం చేసిన ఖర్చులకు సంబంధించినవే. ఈ అభియోగాల్లో నిజానిజాలు ఎలా ఉన్నా, అవి నిజమని నమ్మి, ఆ నమ్మకం ఆధారంగా ఓటింగు జరిగినంతకాలం – అది రాజకీయ నాయకులు విస్మరించలేని వాస్తవం.

ఈ రకరకాల అస్తిత్వాల ప్రాతిపదికగా ఇన్నిన్ని వర్గాలు, సమూహాలుగా చీలిపోయిన ప్రజలు – ప్రభుత్వం బలవంతంగా వసూలు చేసిన పన్నుల డబ్బులో తమ తమ వాటాల కోసం నిరంతరం ఉద్యమిస్తూనే ఉంటారు. అది తప్పదు. 'సంక్షేమం' పేరుమీద లాభపడలేని వర్గాలు – ప్రభుత్వాన్ని అడ్డం పెట్టుకుని పోటీలేని కాంట్రాక్టులు, గనులు, కార్ఖానాల ద్వారా సంపాదించే పనిలో పడతారు. అందులో కొంతభాగం ఎన్నికల సమయంలో 'తమ'దనుకున్న పార్టీలకు చందాలుగా ఇచ్చి గెలిపించుకోడానికి ప్రయత్నిస్తారు. వర్గ సమీకరణలు సరిగ్గా కుదిరితే గెలుపు గ్యారంటీ. గెలిచిన వాళ్లు రాజులు. ఓడిన వాళ్లక్కూడా తాత్కాలిక విరహ బాధ తప్పిస్తే, 'ఏదో ఒకనాటికి గెలవకపోతామా, పది తరాలకు సరిపడా సంపాదించకపోతామా' అనే భావన ఉంటుంది.

వర్గాలు గంపగుత్తగా ఓట్లేసి గెలిపించినా, ఆ వర్గంలోని ప్రతి ఒక్కరికీ ప్రయోజనం

కలగదు. కొంతమంది మాత్రమే ప్రభుత్వాధారంగా లాభపడతారు. మిగతావాళ్ల జీవితాలేం మారవు. అయినా ఈ వర్గ స్పృహపోదు. 'ఎప్పుడోసారి ఎలాగోలా లాభపడకపోతామా' అనే ఆశ ముందుకు నడిపిస్తూ ఉంటుంది.

ఈ వర్గ ప్రయోజన ఆధారిత రాజకీయాల వల్ల సమాజానికీ, వ్యవస్థలకు, తీవ్రమైన హాని కలుగుతుంది. అత్యధిక శాతం వ్యక్తులు కూడా నష్టపోతారు. కులం ఆధారిత రిజర్వేషన్ల వల్ల ప్రతి వ్యక్తీ తన కులం ద్వారా మాత్రమే గుర్తింపబడతారు. తనకంటూ ఒక గుర్తింపు ఉండదు. వ్యక్తిగత కృషి లోపిస్తుంది. ప్రతిభావంతులు సైతం తమ కులం స్థాయికి కుదించబడతారు. రత్నాల్లాంటి వ్యక్తులు సైతం సానపెట్టబడక, కుల ప్రవాహంలో కొట్టుకుపోతారు. రిజర్వేషన్లు లేని కులాలు కూడా సమూహాలుగా తయారై ఇతర మార్గాల్లో ప్రభుత్వ అధికారాలను తమ స్వప్రయోజనాలకు ఉపయోగించుకుంటాయి. దీన్ని తప్పుపట్టగల నైతికతను సమాజం కోల్పోతుంది. అందుకే జనాభా శాతంతో సంబంధం లేకుండా కొన్ని కులాల నుంచి ఎక్కువ సంఖ్యలో శాసనసభ్యులైనా, ఆ సంఖ్యకు తగినన్ని మంత్రి పదవులు పొందినా, ప్రభుత్వాన్ని రకరకాలుగా ఉపయోగించుకుని వ్యవస్థను భ్రష్టు పట్టించినా ఎవరూ తప్పుగా భావించకపోవడానికి ఇదే కారణం.

ఈ కుల, మత, ప్రాంత స్పృహలతో రాజకీయాలు నడిపించి, ప్రజాస్వామ్య ఓటింగు ద్వారా ప్రభుత్వాలను ఏర్పరుచుకొని, ఇతరుల ఖర్చుతో కొందరు లాభపడడం వల్ల సమాజ సంపద పెరగదు. గెలిచిన వర్గాలు – ఓడిన వర్గాల జేబులు ఖాళీ చేసి పంచుకోవడం మినహా కొత్తగా సంపద సృష్టికాదు. ప్రభుత్వం పరిధిపై ఆంక్షలు లేని ప్రజాస్వామ్యం... మెజారిటీ వర్గం మైనారిటీ వర్గాన్ని దోచుకోవడానికి దారి తీస్తుంది. పేరుకు ప్రజాస్వామ్యమయినా; రూపంలో మాత్రం ఫాసిజమవుతుంది.

వ్యక్తి ప్రాథమిక హక్కులైన జీవిత హక్కు, స్వేచ్ఛ, ఆస్తి హక్కులను ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో రక్షించినప్పుడే ప్రజాస్వామ్యం అర్థవంతమవుతుంది. పూర్తిస్థాయి మార్కెట్ ఆర్థిక వ్యవస్థలో కులాలు, మతాలు, ప్రాంతాలు వ్యక్తిని ఏ రకంగానూ ప్రభావితం చెయ్యవు. ప్రతిభావంతుణ్ణి మార్కెట్ తన కులమేమిటని అడగదు. కుల దురభిమానంతో తప్పుడు నిర్ణయాలు తీసుకునే వారే నష్టపోతారు. శూద్రులు, స్త్రీలు – గాయత్రి మంత్రం వింటే– చెవుల్లో సీసం పోయాలన్న మనుధర్మం పురాతనం. 'ఓం భూర్ భువస్వాహా .....' అంటూ సెల్‌ఫోన్ రింగుటోన్లుగా మారిన అదే గాయత్రి మంత్రాన్ని – ఎవరాపుతున్నారు? ఇలా కొంత కాలానికి కుల స్పృహ వ్యక్తిగత విషయాలకు మాత్రమే పరిమితమవుతుంది. ఇంకా కొంత కాలానికి కులాంతర వివాహాల ద్వారా వ్యక్తులకు తమ మూల కులమేమిటో తమకే తెలియని స్థితి వస్తుంది. గత 20 సంవత్సరాలుగా సొంత ప్రతిభతో సంపాదించుకునే యువతలో కుల స్పృహ తగ్గిపోవడాన్ని గమనించాలి.

అలాగే ప్రాంతీయ అసమానతలు తగ్గాలన్నా మార్కెట్టే మార్గం. హైదరాబాద్‌లో పండుతున్నాయి కదా అని అనకాపల్లిలో ద్రాక్ష పండించడానికి ప్రయత్నించడం అవివేకం. అలాగే పోలవరానికి, ప్రాణహితకు ముడిపెట్టడం అశాస్త్రీయం. ఎక్కడ ఏ పని, పరిశ్రమ లాభసాటిగా చేయగలిగితే అదే చెయ్యాలి. లేకపోతే పులిని చూసి నక్కవాతలు పెట్టుకున్నట్లవుతుంది.

ప్రభుత్వాలు తమకు తామే సృష్టించుకొని ఇప్పుడు పరిష్కరించలేకపోతున్న సమస్యలకు సమాధానం మార్కెట్ వ్యవస్థ. రాజకీయ వ్యవస్థ – తన తప్పు తెలుసుకొని; లెంపలేసుకుని, ఆర్థిక వ్యవస్థలో తలదూర్చడం క్రమేపీ తగ్గించుకోవాలి. తన భారీకాయ పరిమాణాన్ని తగ్గించుకోవాలి. అప్పుడీ ఉప కుల రిజర్వేషన్ సమస్యలు, జీతాల పెంపుకు ఉద్యమాలు, ఉప ప్రాంతీయ సమస్యలు వాటంతట అవే అదృశ్యమవుతాయి.

కానీ ఎన్నో స్వప్రయోజనాలు ముడిపడి ఉన్న రాజకీయ వ్యవస్థ తనంతట తానుగా ఈ నిర్ణయాలు తీసుకోవడం దాదాపు అసంభవం. దేశ విదేశాలు తిరిగి, ఆర్థిక పరిజ్ఞానం కలిగి, మార్కెట్ వ్యవస్థే సర్వ రోగ నివారిణి అని తెలుసుకొన్న రాజకీయ నాయకులు కూడా తమంతట తాము పిల్లి మెళ్లో గంటకట్టడానికి సాహసించరు. ప్రజలు కళ్లు తెరవాలి. మరీ ముఖ్యంగా ప్రజల ఆలోచనల్ని ప్రభావితం చేసే మేధావి వర్గం, మీడియా తమ ఆలోచనల్ని మార్కెట్ వ్యవస్థ దిశగా మార్చుకోవాలి. కొరుకుడుపడని సమస్యలకు ప్రభుత్వ జోక్యమే కారణమనీ, పరిష్కారం మార్కెట్ వ్యవస్థలోనే దొరుకుతుందనే సత్యాన్ని గుర్తించాలి. ఆలస్యమైన కొద్దీ ప్రజాస్వామ్యం పేరున నడుస్తున్న వర్గ ప్రయోజన, వర్గ ప్రాయోజిత ప్రభుత్వ వ్యవస్థ ఆర్థిక జడత్వానికి, అచేతనత్వానికి, చివరికి ఫాసిజానికి దారి తీస్తుంది. రాబోయే తరాలకు ఏం సమాధానం చెబుదాం?

12-12-2010

మొండి వ్యవసాయం

వ్యవసాయం మనదేశంలోనే కాదు, ప్రపంచ మంతటా చేసే అత్యంత పురాతన పరిశ్రమ. మరి ఏ దేశంలోనూ లేనన్ని కష్టాలు, కన్నీళ్లు మన రైతులకే ఎందుకొస్తున్నాయి? రాజకీయ పార్టీల చదరంగపు ఆటలో రైతు ఒక పావుగా ఎందుకు మిగిలిపోయాడు? ఈ పరిస్థితి నుంచి బయటపడే మార్గముందా? లేక మరో తుపాను లేదా కరువు ఎప్పుడొస్తే అప్పుడు చూసుకుందామా? ప్రతి దేశంలోనూ జనాభా, వాతావరణం, విద్యా, ఆర్థిక పరిస్థితులు వేరు వేరుగా ఉంటాయి. కానీ ఆర్థిక సూత్రాలు అన్ని దేశ కాల పరిస్థితులకూ ఒకే రకంగా అన్వయిస్తాయి. 1920 నాటికి అమెరికాలో మొదటిసారిగా వ్యవసాయేతర వృత్తుల వారి సంఖ్య వ్యవసాయదారుల సంఖ్యను దాటిపోయింది. ఈ రోజున ఆ దేశ జనాభాలో వ్యవసాయదారుల సంఖ్య కేవలం నాలుగు శాతం. అంత మాత్రాన వ్యవసాయ ఉత్పత్తి తగ్గలేదు సరికదా, విపరీతంగా పెరిగింది. యూరప్ దేశాల్లోనూ అదే పరిస్థితి. పాలు, వెన్న ఎక్కువై సముద్రంలో పారబోయ్యాల్సి వచ్చిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇదంతా ఎలా జరిగింది? వ్యవసాయం, పరిశ్రమలు, ఒకదానికొకటి పరస్పర చోదక శక్తులుగా పనిచేశాయి. యాంత్రీకరణ ద్వారా వ్యవసాయ ఉత్పత్తి, ఉత్పాదకత పెరిగాయి.

వ్యవసాయంలో మనుషుల అవసరం తగ్గిపోవడంతో అలా మిగిలిన వాళ్లు పారిశ్రామిక, సేవా రంగాల్లోకి వెళ్లి, ఆ రంగాల అభివృద్ధిలో పాలు పంచుకున్నారు. ఈ మార్పులన్నీ దీర్ఘకాలంలో, తమంతట తాము మార్కెట్ ప్రభావంతో జరుగుతాయి, జరిగాయి కూడా. అంతే కానీ రాజకీయ నాయకులో, ప్లానింగ్ కమీషనో, వ్యవసాయరంగ మేధావులో తెచ్చిన మార్పులు కావు. పారిశ్రామిక, సేవారంగాల్లో సంపద సృష్టికి అవధులు లేవు. వ్యవసాయంలో ప్రకృతి రీత్యా ఉండే పరిధులను అధిగమించాలంటే వ్యవసాయ క్షేత్రాల సగటు పరిమాణం పెరగాలి. యాంత్రీకరణ జరగాలి, తద్వారా అందులో పనిచేసే

శ్రామికుల సగటు ఆదాయాలు పెరగాలి. ఎంతో ఖర్చుపెట్టి పరిశోధించి తయారుచేసిన కొత్త వంగడపు విత్తనాలను, పురుగు మందులను వాడగలిగే ఆర్థిక స్తోమత సంపాదించు కోవాలి. ఇవన్నీ ఆర్థిక సూత్రాలు. అన్ని దేశాల్లోనూ తుచ తప్పకుండా వర్తిస్తాయి. వీటిని విస్మరించి ముందుకెళ్లడం జరగనిపని. మామిడి పండు చెట్టుమీద నుంచి నేల మీద పడకుండా గాల్లోకి ఎగిరినంత అసంభవం.

ఆయా దేశాల్లో అప్పట్లో ఉన్న రాజకీయ, ఆర్థిక పరిస్థితులు, సోషలిస్టు వాసనల ఫలితంగా – అమెరికాలో 1930 నుంచి, యూరప్‌లో 1950 నుంచి వ్యవసాయ రంగానికి భారీ సబ్సిడీలివ్వడం మొదలుపెట్టారు. అవి ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఆ మేరకు వాళ్ల వ్యవసాయ రంగం కూడా సంక్షోభాలను ఎదుర్కొంటోంది. అప్పుడప్పుడు రైతులు ట్రాక్టర్లు అడ్డంపెట్టి రహదారులను దిగ్బంధిస్తూ ఉంటారు. అదే దారిలో నడిచి... నడిచి, చివరికి 1996 లో అన్ని రకాల సబ్సిడీలు, నిబంధనలు ఎత్తివేసిన దేశం న్యూజిలాండ్. అప్పట్నుంచి సాలీనా ఆరు శాతం చొప్పున వాళ్ల వ్యవసాయ రంగం అభివృద్ధి చెందుతూ వస్తోంది. అదొక విజయగాథ.

మన వ్యవసాయరంగ దీనగాథకు కారణాలు అనేకం. ఏ రాజకీయ, చారిత్రక నేపథ్యంలో చేశారో కానీ, సీలింగు చట్టాల పుణ్యమా అని సగటు భూపరిమాణం కుటుంబానికి మూడున్నర ఎకరాలకు దిగజారింది. మూడున్నర ఎకరాలకు ఎన్ని సబ్సిడీలిచ్చి, ఏ పంట ఎంత బాగా పండించగలిగినా ఎంత సంపాదించగలరు, పేదరికం నుంచి ఎప్పటికయినా ఎలా బయటపడగలరు అన్న విషయాన్ని మేధావులు ఆలోచించాలి. ఆ సంపాదనతో వేరే వృత్తుల్లో స్థిరపడగలిగే లాగా పిల్లలను ఎలా చదివించగలరు? ఏ దేశంలోనయినా ఇంత తక్కువ భూమితో గౌరవప్రదంగా బతకగల సంపాదన సాధ్యమా?

అధిక దిగుబడులకు మరో ముఖ్యమైన ఇన్‌పుట్ – విత్తనాలు. విత్తనాల పరిశోధన, ఉత్పత్తి, ధర, పంపిణీ అంతా ప్రభుత్వం చేతుల్లో ఉన్నాయి. ప్రైవేట్ రంగంలో విత్తనాలు పరిశోధించి, ఉత్పత్తిచేసే కంపెనీలపై సవాలక్ష నిబంధనలు, నియంత్రణలు; మోన్‌శాంటో లాంటి హైబ్రిడ్ విత్తనాలు వచ్చాక మొక్కజొన్న దిగుబడులు ఎకరానికి 20 క్వింటాళ్ల నుంచి 40 క్వింటాళ్లకు పెరిగాయి. విత్తనాల ధర ఎక్కువైనప్పటికీ రైతులకు లాభసాటే. ఆ కంపెనీ మెడలు వంచి రేట్లు తగ్గించేలా చెయ్యిమెలిపెట్టారు. విత్తనాల ధరలు కొద్దిగా తగ్గాయి కానీ నాణ్యత కూడా తగ్గించేశారు. దిగుబడులు తగ్గిపోయాయి. ఇటువంటి జోక్యపూరిత వాతావరణంలో కోట్ల పెట్టుబడులతో కొన్ని సంవత్సరాల పాటు పరిశోధించి అధిక దిగుబడి వంగడాలను ఉత్పత్తి చెయ్యడానికి ఎవరు ముందుకొస్తారు?

నాలుగు సంవత్సరాల క్రితం పంచదార నిల్వలు పేరుకుపోయి చెరకు పంటకు

సరైన ధర దొరక్క, పంట నరకడానికి కూలీలు కూడా దొరక్క, వేల ఎకరాల పంటను తగలబెట్టుకోవాల్సి వచ్చింది. రెండేళ్ల తర్వాత పంచదారకు డిమాండ్ పెరిగి, చెరకు ధరలు పెరిగే సమయంలో ఒక్కసారిగా విదేశాల నుంచి పంచదార దిగుమతికి అనుమతులిచ్చేశారు.

దాదాపు ఒక దశాబ్ద కాలం పాటు వరి పంట గిట్టుబాటుకాని పరిస్థితిలో ఉండేది. రెండేళ్ల క్రితం ధరలు బాగా పెరిగి కొంచెం లాభం వస్తుందనుకున్న తరుణంలో విదేశాలకు ఎగుమతులు నిలిపేశారు. అంతేకాకుండా జిల్లా సరిహద్దులు కూడా దాటకూడదని ఆంక్షలు పెట్టారు. ఇలా ఎప్పటికప్పుడు గాలిపీల్చుకునే సమయానికి పీక నులుముతుంటే... రైతులు తమ పంటలను, పెట్టుబడులను ఎలా ప్లాన్ చేసుకోవాలి? ఇంతకూ తాము విదేశీ రైతులతో పోటీ పడుతున్నట్లా? స్వదేశీ రైతులతోనా? ప్రకృతితోనా? లేక, ఎప్పటికప్పుడు మారుతున్న ప్రభుత్వ నియంత్రణలతోనా?

అనుకూలించిన మేరకు యాంత్రీకరణ చేసుకుని, వ్యవసాయం మీద ఆధారపడ్డవాళ్లలో కొందరు పరిశ్రమలవైపు మళ్ళాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వ్యవసాయరంగం నుంచి మానవ వనరుల వలసలను ఆహ్వానించాల్సింది పోయి, అదేదో కళంకమన్నట్లు సూత్రీకరించే మేధావులను ఒక్కటడగాలి.

వాళ్ల తాతముత్తాతలు వ్యవసాయం చేసిన వాళ్లు కాదా? మరి వీరెందుకు మేధో రంగంలోకి వలసవచ్చారు? లేని పనులు కల్పించడానికి ఉపాధి హామీ పథకం, ప్రజల దగ్గర్నుంచి వసూలు చేసిన లక్షల కోట్ల రూపాయలను గంగపాలు చేయడం. దాంతో కూలీరేట్లు పెరిగిపోయి వ్యవసాయం ఇంకా గిట్టుబాటు కాని పరిస్థితి. ఒక పక్క నిరుద్యోగం, ఇంకో పక్క పట్టణాల్లో లిఫ్టు ఆపరేటర్ దగ్గర్నించి, వాచ్‌మెన్, ఫ్యాక్టరీ కార్మికుల వరకు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వాళ్లే ఎక్కువ మంది ఎందుకు ఉంటున్నారు?

ఎరువులు ఏ రకాలు దొరుకుతాయో, ఎప్పుడు దొరుకుతాయో, అసలు దొరుకుతాయో లేదో అనేది సర్కారు దయ. అది దొరికే నాటికి అదును, పదునుపోతే... వాడినా ఉపయోగముండదు. రైతు పంట చూసుకుంటాడా... కలుపు తీసుకుంటాడా... లేక రెండు బస్తాల ఎరువు కోసం రోజుల తరబడి క్యూలో నిలబడతాడా?

పంట, కాలం, వాతావరణాన్ని బట్టి ఎప్పటికప్పుడు మారుతూ ఉండే తెగుళ్లను నియంత్రించడానికి ఏ మందులు ఎలా వాడాలో మూడెకరాల రైతు ఎలా తెలుసుకోగలడు? పంట భీమా చేద్దామంటే ఆ భీమా ప్రీమియం, ఏ పంటలకు, ఏ ప్రాంతాల్లో వర్తించాలో అంతా ప్రభుత్వ నిర్ణయం. చిన్న చిన్న రైతులకు పాలసీలు అమ్మడం భీమా కంపెనీలకు ఖర్చుతో కూడిన పని. అందుకే ఆసక్తి చూపరు.

ఇన్ని గడ్డు పరిస్థితుల్లో వ్యవసాయం చేసే రైతులు ప్రకృతి ప్రకంపాలను ఎదుర్కొనే శక్తి, సామర్థ్యాలులేని పరిస్థితిలో ఉన్నారు. అసలే అంతంత మాత్రంగా ఉండే ఆర్థిక పరిస్థితి. వాతావరణం కాస్త అటూ ఇటూ కాగానే ఇంకా విషమిస్తోంది. కంటి తుడుపు చర్యలే తప్ప; ఏ ప్రభుత్వమైనా లక్షలాది మంది రైతులకు జరిగిన – వేలకోట్ల నష్టాన్ని భర్తీ చెయ్యలేవు. ఆ ఇచ్చే సాయం కూడా ఎంతో కాలాయాపన, లంచాల చెల్లింపుల తర్వాత ఎప్పటికి చేరుతుందో తెలియదు. అది అందేలోగా ఇంకో ప్రకృతి బీభత్సం, ఇంకో నష్టం జరగదనే నమ్మకమూ లేదు.

ఈ అత్యంత మౌలికమైన వాస్తవాలను గుర్తించకుండా తాత్కాలిక ఉపశమన చర్యల ద్వారా రైతాంగ సమస్యలు పరిష్కరించడమంటే, అది జండూబామ్ వైద్యమే అవుతుంది. పట్టణ లాండ్ సీలింగ్ ఎత్తివేయగా లేనిది వ్యవసాయ భూములకు సీలింగు ఎందుకో మేధావులు ప్రశ్నించుకోవాలి. కృత్రిమమయిన సీలింగు చట్టాలున్నంత కాలం వ్యవసాయరంగం పేదరికం నుంచి బయటకు రావడం ఎట్టి పరిస్థితుల్లోనూ, ఎన్ని సబ్సిడీలిచ్చినా సాధ్యం కాదు. కమతాల పరిమాణం పెరిగి, ప్రభుత్వ జోక్యం తగ్గినప్పుడే పెద్ద ఎత్తున పెట్టుబడులు ఆకర్షించడం సాధ్యం. లాభాలు, పెట్టుబడులతో యాంత్రీకరణ జరిగి ఆధునిక విజ్ఞానంతో, ఆధునిక పద్ధతుల్లో, ఆధునిక పనిముట్లతో వ్యవసాయం చేస్తే తప్ప పెరుగుతున్న జనాభాకు సరిపడా ఆహారాన్ని చౌకగా పండించడం సాధ్యం కాదు. అప్పుడే వ్యవసాయదారులకు ప్రకృతి వైపరీత్యాలు తట్టుకునే సామర్థ్యం వస్తుంది. అదే సమయంలో పారిశ్రామిక, సేవా రంగాలు పెరిగిన మానవ వనరులతో, తగ్గిన జీవన వ్యయంతో అభివృద్ధి చెంది సంపద సృష్టించబడుతుంది. అప్పటిదాకా ఈ అసెంబ్లీలో అరుపులు, ప్రకటించిన సాయాలపై పెదవి విరుపులు, ఇసుక తిన్నెల మీద నిరాహారదీక్షల రాజకీయ మలుపులు రాజకీయ నాయకులకు, ఈ వినోదాన్ని పంచే మీడియాకు, వీటికి రకరకాల భాష్యాలు చెప్పే మేధావులకు ఉపయోగపడతాయే కాని, పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయిన రైతులకు కాదు.

19-12-2010

ద్రవ్యోల్బణం శాశ్వతం!

పది గ్రాముల బంగారం ధర 1975 లో 540 రూపాయలు. నేడు అది 20,000 కు చేరుకుంది. ఉల్లిపాయల ధరలు భగ్గుమన్నాయి. కూరగాయల ధరలు కూడా మండిపోతున్నాయి. మార్చికల్లా ధరలు తగ్గుతాయని మన్మోహన్‌సింగ్ మంద్ర స్వరంతో చెబుతున్నారు. పదిహేను రోజుల్లో ఉల్లి ధరలు తగ్గుతాయని వ్యవసాయమంత్రి అంటున్నారు. ఉల్లిపాయల ఎగుమతులు నిషేధించారు. దిగుమతి సుంకం తీసేశారు. దిగుమతులకు తలుపులు తెరిచారు. వ్యాపారుల నిల్వలను బలవంతంగానైనా బయటకు తీయించాలని పిలుపునిచ్చారు. అసలు ధరలెందుకు పెరుగుతాయి? దానికి కారణమెవరు? పెరిగిన ధరలు ఎప్పటికీ తగ్గవెందుకని? ధరల పెరుగుదల వల్ల లాభం ఎవరికి? నష్టం ఎవరికి?

ద్రవ్యోల్బణమంటే ధరలు పెరగడం కాదు. డబ్బు పరిమాణం పెరగడం. డబ్బు పరిమాణాన్ని పెంచే అధికారాలు, అవకాశాలు కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలకు లేవు. ప్రతిపక్షాలకు లేవు. ప్రజలకు అసలే లేవు. సీజనల్‌గా వచ్చే ఉల్లిపాయలు, కూరగాయల ధరలు ప్రకృతి వైపరీత్యాల కారణంగా తాత్కాలికంగా పెరగొచ్చు, తగ్గొచ్చు. అది తాత్కాలికమే. కానీ అన్ని వస్తువుల ధరలూ చిక్కుడు తీగలాగా పైపైకి ఎగబాకడానికి కారణం డబ్బు పరిమాణం పెరగడమే. దానికి బాధ్యత వహించాల్సింది, కేవలం కేంద్ర ప్రభుత్వం మాత్రమే. అయినా గానీ ధరలు పెరిగినప్పుడల్లా ప్రధాని, ఆర్థిక మంత్రులు అమాయకత్వాన్ని..., ఆగ్రహాన్ని నటిస్తూ ఉంటారు. దొంగే– 'దొంగ, దొంగ' అని అరిచినట్టు వేరే ఎవరివైపో వేలెత్తి చూపుతూ ఉంటారు. అదొక రాజకీయ కళ. ఆర్థిక వ్యవస్థమీద పూర్తి పెత్తనాన్ని ప్రభుత్వానికి కట్టబెట్టిన మేధావి వర్గం కూడా ఈ విషయంలో తేలుకుట్టిన దొంగలాగా గప్‌చిప్‌గా ఉంటుంది. ఫలితంగా డబ్బు ప్రవాహం ఆగదు, ధరల పెరుగుదల ఆగదు. ద్రవ్యోల్బణం శాశ్వతం. కానీ అది సహజంకాదు, మానవ తప్పిదం.

కేంద్ర ప్రభుత్వం డబ్బు పరిమాణాన్ని రెండు విధాలుగా పెంచుతుంది. ఒకటి నిర్మొహమాటంగా రూపాయలు ముద్రకొట్టడం. పన్నుల ద్వారా వసూలు చేసిన సొమ్ము తమ ఓటరాకర్షక పథకాలకు చాలనపుడు రిజర్వుబ్యాంకును పురమాయించి డబ్బు ముద్రిస్తుంది. ఒకప్పుడు సేలం, కోయంబత్తూరులో తయారయ్యే నకిలీ కరెన్సీకి, ఈ మధ్య కాలంలో పాకిస్థాన్, బంగ్లాదేశ్ సరిహద్దుల గుండా చొప్పిస్తున్న నకిలీ నోట్లకు... లోటు బడ్జెట్ పూరించడానికి కేంద్ర ప్రభుత్వం ముద్రించే నోట్లకు తేడా ఏమీలేదు. అంతా దొంగ డబ్బే. ఆర్థిక వ్యవస్థ మీద, ధరల మీద వాటి ప్రభావం ఒకటే. లాభపడేవాళ్లు వేరుకావచ్చు గానీ, నష్టపోయేది మాత్రం ప్రజలే.

కేంద్ర ప్రభుత్వం డబ్బు ముద్రించే రెండో పద్ధతి బ్యాంకు రుణాలు. బ్యాంకుల్లో డిపాజిట్ చేసే డబ్బుకు సుమారు పదిరెట్ల మేర రుణాలిచ్చే సదుపాయం ఉంది. ఈ సదుపాయాన్ని ఎవరు కల్పించారు?

రిజర్వుబ్యాంకు ఆదేశాలు, డబ్బుకు సంబంధించిన చట్టాల ద్వారా కేంద్ర ప్రభుత్వమే కల్పించింది. అలా రుణాలిచ్చే డబ్బు కృత్రిమ డబ్బు. వనరులు, సంపదతో సంబంధం లేకుండా గాల్లోంచి రాలిపడిన లాంటి డబ్బు. ఒక్కమాటలో చెప్పాలంటే దొంగనోట్లతో సమానం. మళ్లీ ఆ బ్యాంకులిచ్చే రుణాల్లో తనకు కావల్సినంత మేరకు ప్రభుత్వ రుణాల రూపంలో తీసేసుకునే స్వేచ్ఛ కూడా కేంద్ర ప్రభుత్వం తనకు తాను కల్పించుకుంది. పన్నులు పెంచితే ప్రజలు, ప్రతిపక్షాల నుంచి వ్యతిరేకత వస్తుంది. కాబట్టి 'రాబడి' పెంచుకోవడానికి ఈ దొడ్డిదారి ఎంచుకోవడం. ఆ రుణాలను భవిష్యత్ తరాలు వడ్డీతో సహా చెల్లించాలి. ఇలా దొంగ నోట్లలాగా సృష్టించబడిన రుణద్రవ్యం మార్కెట్‌లోకి జీవనదిలా ప్రవహిస్తూనే ఉంటుంది.

రిజర్వు బ్యాంకు వ్యవస్థ ఉన్నదే ఈ పనుల కోసం. ఈ క్రమంలో సహజంగానే వచ్చే సంక్షోభాలకు ఇంకెవరినో తప్పుపడుతూ, చాలా కష్టపడి సంక్షోభాల్ని నివారిస్తూ, పరిష్కరిస్తున్నట్టు సామాన్యులకు అర్థం కాని ఆర్థిక పరిభాషలో అందంగా నటిస్తూ... వివరిస్తూ ఉంటారు.

రిజర్వుబ్యాంకు వ్యవస్థ ఉన్నంతకాలం ఈ కృత్రిమ డబ్బు సృష్టి ఆగదు. కాకపోతే ఎంత పరిమాణంలో మార్కెట్‌లోకి వదలాలనేది ఆ నాడున్న కేంద్ర ప్రభుత్వం ఇష్టం. ఉదాహరణకు 2001-04 మధ్య మూడేళ్లలో ఎన్‌డిఎ-బిజెపి ప్రభుత్వం డబ్బు పరిమాణాన్ని దాదాపు నలభై శాతం పెంచింది. ఆ మేరకు ధరలూ పెరిగాయి. ఆ ధరల పెరుగుదలను ఎత్తిచూపుతూ ఆమ్ ఆద్మీ పేరుతో అధికారం తెచ్చుకున్న యుపిఎ - కాంగ్రెస్ ప్రభుత్వం 2004 - 07 మధ్య మూడేళ్లలో అరవై శాతం కృత్రిమ డబ్బు సృష్టిని పెంచింది. 2007

– 10 మూడేళ్లలో ఏకంగా నూటముప్పై శాతం దొంగడబ్బు సృష్టించింది. మరి ధరలు పెరక్క ఏమవుతాయి?

ధరల పెరుగుదల వల్ల అత్యధికంగా నష్టపోయేది స్థిరాదాయ వర్గాల వారు. మార్కెట్‌లోకి వచ్చిపడే కృత్రిమ డబ్బుతో సమాంతరంగా వారి ఆదాయాలు పెరగవు సరికదా, రూపాయి విలువ తగ్గిపోయి జీవన ప్రమాణాలు పడిపోతాయి. ఖర్చు తక్కువ పెట్టి, ఎక్కువ ఆదా చేసుకునే మధ్యతరగతి వర్గాలు తీవ్రంగా నష్టపోతాయి. కొత్త పన్నులు విధించకుండానే సర్కారు ఖజానాకు డబ్బొచ్చి పడుతుంది. ఆ డబ్బుతో ఇంకొన్ని వర్గాలకు ఉచిత వరాలిచ్చి ఓట్లు కొనుక్కోవచ్చు. ప్రభుత్వం సృష్టించిన కృత్రిమ డబ్బు ముందుగా ఎవరి చేతుల్లో పడితే వాళ్లు లాభపడతారు. కొత్త డబ్బు ప్రభావం మార్కెట్ ధరల మీద పడకముందే పాత రేట్లకే వస్తువులు వాళ్ళు కొనుక్కుంటారు. అసలు నిజానికి సాంకేతిక అభివృద్ధి వల్ల, పనిచేసే వారి సంఖ్య పెరగడం వల్ల ఉత్పత్తి, ఉత్పాదకత పెరిగి ధరలు తగ్గాలి. కానీ ఈ కృత్రిమ డబ్బు ఆ ప్రభావాన్ని శూన్యం చేసి, ధరలు ఇంకా పెరిగేలా చేస్తుంది. ఇదీ ద్రవ్యోల్బణం అసలు కథ.

ఇక ఉల్లిపాయల విషయానికొస్తే; ధరలు పెరగ్గానే కేంద్ర ప్రభుత్వం చేసిందేమిటి? ఎగుమతులపై నిషేధం, దిగుమతి సుంకం రద్దు, పాకిస్థాన్ నుంచి దిగుమతి, ఢిల్లీలో ఇరవై, ముప్పై దుకాణాల ద్వారా అమ్మకం. వాస్తవాలేమిటి? దేశంలో ఏటా సుమారు కోటి ఇరవై లక్షల టన్నుల ఉల్లిపాయలు ఉత్పత్తి అవుతాయి. అందులో పది శాతం ఎగుమతి అవుతాయి. ముఖ్యంగా గల్ఫ్ దేశాలకు. ఈ ఏడాది అధిక వర్షాల కారణంగా పంట దెబ్బతిని ఉత్పత్తి తగ్గింది. దేశీయంగా రేట్లు పెరిగాయి. ఇక్కడే 60–70 రూపాయలయ్యాయి. పాకిస్థాన్‌లో రేట్లు 45–50, అమెరికాలో 70–80 రూపాయల రేటుంది. ఇక ఎగుమతులు నిషేధించి ఉపయోగమేముంది? పాకిస్థాన్ నుంచి రోజుకు 500–600 టన్నులు దిగుమతి చేసుకున్నంత మాత్రాన అవి ఏ మూలకు? వ్యాపారుల దగ్గరున్న నిల్వలను బలవంతంగా బయటకు తీయిస్తారు సరే, నిల్వలన్నీ ఖాళీ అయ్యాక పరిస్థితి ఏమిటి? దిగుమతి చేసుకున్న సరుకు దుకాణాలకు చేరే సరికి ఎంత ఖర్చవుతోంది?ఎంతకు అమ్ముతున్నారు? ఆ నష్టం ప్రభుత్వ ఖజానాలోని ఏ ఖాతా నుంచి చెల్లిస్తున్నారు? అదంతా పన్నుల డబ్బే కదా? ఇదీ ప్రజా 'సంక్షేమం'. ఇదీ జోక్యీకరణ నైతికత. ఉల్లిపాయల ఉత్పత్తి, డిమాండ్లను, తద్వారా ధరలను అంచనా వెయ్యగలిగేది మార్కెట్ మాత్రమే. ఫార్వర్డ్ ట్రేడింగ్ విధానం ద్వారా ఆ మార్కెట్ అంచనాలు రైతులకు కూడా చేరితే పంటవేసే విస్తీర్ణాన్ని పెంచాలో, తగ్గించాలో నిర్ణయించుకోగలుగుతారు.

నాలుగేళ్ల క్రితం కిలో రెండు మూడు రూపాయలు ధర పలికి, రవాణా ఖర్చులు కూడా రాక అదే ఉల్లి పంటను పారబొయ్యాల్సి వచ్చింది. ఆ అనుభవంతోనే – క్రమంగా

పంట విస్తీర్ణం తగ్గిపోయింది. ఈ సీజన్‌లో అధిక వర్షాల వల్ల ఉత్పత్తి ఇంకా తగ్గిపోయింది. వచ్చే సీజన్‌లో విస్తీర్ణం పెరిగి, ధరలు తగ్గడం ఖాయం. అప్పటిదాకా వేచి చూడ్డం తప్ప వేరే మార్గం లేదు. కొద్దిరోజుల్లో ఈ ధరలకు కొనలేక ఉల్లిపాయ వినియోగం తగ్గించు కుంటారు. దానికి అనుగుణంగా ధరలు కూడా కొంత తగ్గుతాయి. వచ్చే అయిదేళ్లలో, కనీసం వచ్చే సంవత్సరంలో ఎగుమతులు, దిగుమతుల్లో ఏది అనుమతిస్తారు? దీనికి సమాధానం కేబినెట్ సెక్రటరీకే తెలియదు. రైతులకేం తెలుస్తుంది? పండించాలా వద్దా అనే విషయంలో గుడ్డెద్దు చేలో పడ్డట్టు ఏదో ఒక నిర్ణయం తీసేసుకుంటారు. అసలు దౌర్భాగ్యం ఏమిటంటే నిలువ చేసుకుని, మంచి రేటున్నప్పుడు అమ్ముకోగలిగిన వస్తువైన ఉల్లిపాయలను పండించే రైతుకు నిల్వచేసుకునే సామర్థ్యం లేకపోవడం. అందుకే సీజన్లో వచ్చే ఉత్పత్తి హెచ్చు తగ్గులకు మార్కెట్ ఇంతగా ప్రతిస్పందించడం.

ప్రతి ఆర్థిక సంబంధ విషయంలోనూ మార్కెట్‌ను పక్కనబెట్టి ప్రభుత్వ జోక్యం కోరుకునేవారు ఆలోచించాలి. ప్రభుత్వం జోక్యం పుణ్యమే కందిపప్పు ధరలు, ఉల్లిపాయల ధరలు పెరగడం; బంగారం ఇరవై వేలు కావడం, శాశ్వత ద్రవ్యోల్బణం. ఆ జోక్యం పోనంత వరకు మార్కెట్‌లో ఈ అనిశ్చితి తప్పదు. ఈ సంవత్సరం వరదల వల్ల పాకిస్థాన్‌లోనూ ఉల్లిపాయల ఉత్పత్తి తగ్గింది. అదీ గాక మన దగ్గర్నుంచి ఎగుమతులు ఆగిపోవడంతో గల్ఫ్‌లో మంచి గిరాకీ ఉంది. మనం దిగుమతి చేసుకోవడంతో పాకిస్థాన్‌లో ఉల్లిపాయల ధరలు పెరుగుతున్నాయి. మనలాగే వారు కూడా ఎగుమతులను నిషేధిస్తే?

26-12-2010

విభజనతో దోపిడీ ఆగదు

రాష్ట్రంలో అందరి ఆలోచనలూ శ్రీకృష్ణ కమిషన్ నివేదిక గురించే. ఏ విషయాలను మథించి ఏమేం ప్రతిపాదనలు చేశారనే ఉత్కంఠ – సర్వత్రా నెలకొని ఉంది. ఒక ప్రాంతం వారు ఇంకో ప్రాంతం వారిని దోపిడీ చేశారన్న ఆరోపణలు నిజమా, కాదా? ఒకవేళ చేసుంటే అందుకు పరిష్కారమేమిటి? విభజనతో దోపిడీ ఆగిపోతుందా, లేక ఇంకో రూపంలో జరుగుతూనే ఉంటుందా – వీటన్నిటి గురించి కమిషన్ ఏ అభిప్రాయానికొచ్చిందోనని తెలుసుకోగోరుతున్నారు. ఇంతకూ అసలు 'దోపిడీ' ఎలా జరుగుతుంది....; దాన్ని ప్రోత్సహించే పరిస్థితులేమిటి? అవి తెలుసుకోకుండా – భవిష్యత్తులో దాన్ని ఆపలేము.

దోపిడీ జరగాలన్నా; అది ఆగకుండా కొనసాగాలన్నా – ప్రభుత్వ సహకారం అత్యంత అవసరం. ఒక వ్యక్తిని ఇంకో వ్యక్తి మోసమో, దోపిడీయో చెయ్యొచ్చు. అలాంటి వారిని శిక్షించడానికే ప్రభుత్వాలు ఉన్నది. వ్యక్తుల మధ్య – దోపిడీ వాతావరణముందంటే; ప్రభుత్వాలు తాము చెయ్యాల్సిన పనిలో విఫలమైనట్లు. ప్రాంతాలు ఒకదాన్నొకటి దోపిడీలు చేసుకోలేవు. ప్రాంతాలు ప్రాణ రహితాలు. ఒక ప్రాంతంలో పుట్టినవారు ఇంకో ప్రాంత ప్రజలను దోచుకోవాలంటే మోసమన్నా చెయ్యాలి...; లేదా కత్తితోనన్నా బెదిరించాలి. అలా జరిగుంటే శిక్షార్హమైన అలాంటి నేరాలను అరికట్టలేకపోవడం – ప్రభుత్వాల వైఫల్యమే. వ్యవస్థీకృతంగా, వనరుల విషయంలో దోపిడీ జరిగినా...; అదీ ప్రభుత్వాల పుణ్యమే. వనరులన్నీ ప్రభుత్వాల ఆధీనంలోనే ఉన్నాయి. అలా ఉన్నంతకాలం అందరికీ సమానంగా పంచడం అసాధ్యం.

ఇకపోతే ప్రభుత్వ ఉద్యోగాలు. *జనాభాలో ప్రభుత్వోద్యోగుల సంఖ్య ఒకశాతం మాత్రమే. అయినా గానీ ప్రజల దైనందిన జీవనాన్ని శాసించే అధికారాలు వాళ్ల గుప్పెట్లో ఉన్నాయి. అందుకే ఆ ఉద్యోగాల కోసం ఇంత వెంపర్లాట. ప్రజలు కట్టిన పన్నుల*

సొమ్ముతో జీతాలు తీసుకునే ప్రభుత్వోద్యోగులు - ఆ జీతానికి సరిపడా అప్పజెప్పిన పనులు చేయడానికే ఉండుంటే, పరిస్థితి ఇలా ఉండదు.

మార్కెట్‌తో పోటీగా జీతభత్యాలుండి, ప్రతిభ, పనితీరు ఆధారంగా నియామకం, ప్రమోషన్లు, సరిగా పని చెయ్యకపోతే ఉద్యోగం నుంచి తొలగించడం లాంటి వెసులుబాట్లు ఉండుంటే - వేరే రకంగా ఉండేది. ఇస్తామన్న జీతానికి పనిచెయ్యడానికి సిద్ధమై వచ్చిన వాళ్లలో అత్యంత ప్రతిభావంతులను ఎంపిక చేసుకుని - ప్రభుత్వ పనులకు ఉపయోగించుకునే వీలుండేది.

కానీ ప్రభుత్వ ఉద్యోగమంటే ఒక రాచరికం! వాళ్ల జీతాలకు మార్కెట్‌తో సంబంధం లేదు; అవి పెరుగుతూనే ఉండాలి, పనిచేసినా చెయ్యకున్నా అడిగే వీల్లేదు. వాళ్ల అధికారాలు రోజు రోజుకూ పెరుగుతూనే ఉండాలి. ఈ రకంగా అవి అధికారాల పంపకంగా చూడబడుతున్నాయే తప్ప; మామూలు ఉద్యోగాలుగా ఎవరూ చూడడం లేదు. అందుకే ఈ అధికారాల పంపకంలో తమ తమ వాటాలు డిమాండు చేస్తూ వివిధ వర్గాలు ఆందోళనలు చేస్తూనే ఉన్నాయి. కులం ఆధారిత రిజర్వేషన్లు, ప్రాంతం ఆధారిత రిజర్వేషన్లు, తాజాగా మతం ఆధారిత రిజర్వేషన్లు. నియామకాలకే కాక, ఇప్పుడు ప్రమోషన్లు ఇచ్చే విషయంలో కూడా. అందులో ఏమాత్రం తేడా వచ్చినా ఆందోళనలు తప్పవు. అంటే వర్గాల వారీగా అధికార పంపకానికే ఈ ప్రభుత్వోద్యోగాలు.

అలాగే వనరుల సేకరణ, పంపకం కూడా. సేకరించే లక్షల కోట్ల డబ్బు ఎక్కడ, ఏ పనులకు, ఏ రకంగా ఖర్చుపెట్టాలో ప్రభుత్వమే నిర్ణయిస్తుంది. ఎవరికి కాంట్రాక్టులివ్వాలో, అందులో ఎంత కమీషన్లు వసూలు చెయ్యాలో, ఎవరెవరు పంచుకోవాలో కూడా ప్రభుత్వాధినేతల ఇష్టం. ఇంత డబ్బు ఇష్టారాజ్యంగా ఖర్చుపెట్టే అధికారాలు మనమే ఇచ్చాం. ఈ విధానంలో అందరినీ సంతృప్తిపరచడం అసాధ్యం. రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు అందరూ పూర్తి నిజాయితీపరులైనప్పటికీ అది అసాధ్యం.

ఫలానా రోడ్డు ఎందుకెయ్యాలి? మా ఊర్లో ఎందుకెయ్యరు? ఫలానా ప్రాజెక్టే ముందుగా ఎందుకు కట్టాలి? ఇలాంటి ప్రశ్నలకు హేతుబద్ధమైన సమాధానాలివ్వడం సాధ్యం కాదు. మహా అయితే అలాంటి ప్రతి నిర్ణయం తీసుకునేందుకూ ఒక్కో కమిటీ నియమించవచ్చు. కమిటీ అలా చెప్పింది కాబట్టి నిర్ణయంచామనవచ్చు. కానీ కమిటీల నిర్ణయ ప్రక్రియకు మాత్రం హేతుబద్ధత ఎక్కడ్నుంచి వస్తుంది?

తెలంగాణ సమస్యని కూడా ఈ కోణాల్నుంచి మాత్రమే నిజాయితీగా విశ్లేషించగలం. రాష్ట్రం నలుమూలల్నించీ డబ్బు తెచ్చి హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టిన

వాళ్ళు తమ స్వలాభంకోసమే పెట్టారు తప్ప హైదరాబాద్‌ను ఉద్ధరించడానికి కాదు. ఇదెంత నిజమో... అంతే నిజం ఇంకోటుంది. పెట్టుబడులు పెట్టిన వాళ్ళకు తమ వ్యవసాయ, పట్టణభూములు అమ్మిన తెలంగాణవాసులు కూడా తమ లాభం కోసమే అమ్మారు తప్ప; అమాయకత్వంతోనో, మోసగించబడో కాదు. ఇరు పక్షాలకూ లాభమనిపించిన క్రయ, విక్రయాలను కొన్నేళ్ళ తర్వాత తిరగదోడడం అహేతుకం, అర్థరహితం. అలాగే పెట్టుబడి పెట్టో, కొత్త టెక్నాలజీ తెచ్చో; లేక తన సొంత తెలివి తేటలతోనో ఎవరైనా ఒక వ్యాపారమో, పరిశ్రమో పెడితే – అందరికీ లాభమే. ఉత్పత్తి పెరిగి, ధరలు తగ్గి జీవన ప్రమాణాలు మెరగవుతాయి. అందులో ఎవరు యజమాని, ఏ ప్రాంతం నుంచి వచ్చిన వారు గేట్‌కీపర్ అనే ప్రశ్న – పూర్తిగా అనుచితం. యజమానులవకుండా ఏ ప్రాంతం వారినయినా ఎవరైనా ఆపారా? లేక గేట్ కీపరు ఉద్యోగం చెయ్యమని ఏ ప్రాంతం వారినయినా ఎవరయినా బలవంతపెట్టారా అన్నది అసలు ప్రశ్న. అసలా వ్యాపారమే ఎవరో వచ్చి పెట్టకపోతే – గేట్‌కీపరు ఉద్యోగమే ఉండేది కాదనేది వాస్తవం. అయినా ఓడలు బండ్లవడానికి ఒక తరం చాలు. యజమానుల ప్రాంతీయతలు మారడానికి ఎంతో కాలం పట్టదు.

ఇక భాష, సంస్కృతుల విషయానికొస్తే – ఇవి ప్రస్తుతానికి మార్కెట్ సూత్రాలననుసరించే నడుస్తున్నాయి. తగినంత డిమాండు ఉంటే – కావలసిన భాష, యాసల్లో పత్రికలు ముద్రిస్తారు, సినిమాలూ తీస్తారు. దేశమంతటా – ఇంగ్లీషుభాష, ఆ భాషలో విద్యాబోధనలకు మార్కెట్ డిమాండు పెరుగుతోంది. అంతమాత్రాన అందరూ మాతృ భాషలను, సంస్కృతిని మరిచిపోయినట్టూ కాదు, దాన్నేదో ఇంగ్లీషు వాళ్లు అంత దూరం నుంచి మనమీద బలవంతాన రుద్దుతున్నట్టూ కాదు. మంచి నవలలు, ఇతర సాహిత్యం సృజించేవాళ్లు కరువై తెలుగు భాషే – మార్కెట్లో ఒడిదుడుకుల్లో ఉండగా; ఇక యాసల సంగతి వేరే చెప్పాలా?

శ్రీకృష్ణ కమిటీ ఏం చెప్పినా, తర్వాత కేంద్ర ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా, రాష్ట్రం ఒకటిగా ఉన్నా, ఎన్ని ముక్కలైనా ఆర్థిక వ్యవహారాల్లో ప్రభుత్వ జోక్యం తగ్గనంత వరకు – ప్రజల జీవితాలేం మెరుగుపడవు. మహా అయితే ఇంకా ఒకటో, రెండో రాజధానుల నిర్మాణం. అవి కట్టేది ప్రజల డబ్బుతోనే. వాటికి దగ్గర్లోని భూముల రేట్లు పెరగడం, దానికి సరిపడా ఇంకో చోట భూముల రేట్లు తగ్గడం; ఇంకో ఒకరిద్దరు ముఖ్యమంత్రులు, వాళ్ల హంగు, హంగామా – ఇలాంటి అనుత్పాదక ఖర్చులే తప్ప ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడే అవకాశాలను ఆశించగలమా?

ప్రభుత్వ జోక్యం తగ్గి, మార్కెట్ వ్యవస్థను పనిచేయనిస్తే; ఎన్ని రాష్ట్రాలయినా– ప్రజలకు తేడా పడదు. అది తగ్గనంత వరకు – ఎన్ని రాష్ట్రాలుగా ఉన్నా లాభం లేదు.

ప్రభుత్వ జోక్యం ఎంత పెరిగితే అన్ని వర్గాలు తయారవుతాయి. తమతమ వాటాల కోసం నిరంతరం కీచులాడుకుంటాయి. తమ స్వప్రయోజనాలను ప్రజా ప్రయోజనాలుగా చిత్రీకరించే ప్రయత్నాలు చేస్తూనే ఉంటాయి. ఈ వర్గాలనన్నిటినీ సంతృప్తి పరచడం ఎవరి వల్లా కాదు.

మార్కెట్ వ్యవస్థలో మనిషికి మనిషికి మధ్య తేడాలుండొచ్చు గాక. కానీ వైరుధ్యాలుండవు. ఇరు పక్షాలకు లాభమనుకున్న స్వచ్ఛంద క్రయవిక్రయాలు, ఇచ్చి పుచ్చుకోవడాలే ఉంటాయి. వారికి ప్రాంతంతో పనిలేదు, భాషతో, కులమతాలతో పనిలేదు. ప్రజల ధన, మాన, ప్రాణాలను కాపాడడానికే పరిమితమైన ప్రభుత్వాలుంటే ప్రాంతీయ విభేదాలకు అవకాశమే ఉండదు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం వెంపర్లాట ఉండదు. భూపందేరాలుండవు, 'అభివృద్ధి' నిధుల ఖర్చు విషయంలో పంచాయితీలూ ఉండవు. అలాకాదని; ప్రభుత్వ పరిధిని పెంచుకుంటూ పోతే ఇలాంటి వివాదాలకు అంతం ఉండదు. ఇంకొన్ని పరిష్కరించజాలని కొత్తకొత్త వివాదాలు రావడం ఖాయం. ప్రత్యేక తెలంగాణ ఇచ్చినా, ఇవ్వకున్నా ఆదిలాబాద్‌కు, నిజామాబాద్‌కు అంతరాలు ఉండనే ఉంటాయి. ఎన్ని రాష్ట్రాలయినా శ్రీకాకుళానికి, పశ్చిమగోదావరికి తేడాలు తప్పవు. సహజమైన ఈ అంతరాలను ఎత్తి చూపేవారు ప్రభుత్వ జోక్యాన్ని ; తద్వారా స్వప్రయోజనాలను ఇంకా ఇంకా పెంచుకుంటూ పోతారు. శాంతి సౌభాగ్యాలు కోరుకునే వారికి మార్కెట్ వ్యవస్థను నమ్ముకోవడమొక్కటే మార్గం.

02-01-2011

వాస్తవ తెలంగాణ

శ్రీకృష్ణ తులాభారం సమైక్యాంధ్ర వైపే మొగ్గింది. దానికి తనదైన రీతిలో కారణాలు కూడా వివరించింది. 'వాస్తవాలను విస్మరించి తప్పుచేస్తే అవి ప్రతీకారం తీర్చుకుంటాయి' అన్న సర్దార్ పటేల్ మాటలతో తమ నివేదికను ముగించారు. శ్రీకృష్ణ కమిటీ వెలికి తీసి ఎత్తిచూపిన వాస్తవాలు తెలంగాణవాదులకు రుచించడం లేదు సరికదా; మింగుడుకూడా పడడం లేదు. వారి సరికొత్త వాదనలో రెండు ముఖ్య అంశాలు – ఒకటి, కమిటీ నివేదికతో సంబంధం లేకుండా పార్టీలు రాజకీయ నిర్ణయం తీసుకుని తద్వారా కేంద్ర ప్రభుత్వం కూడా తెలంగాణాకు అనుకూలంగా నిర్ణయం తీసుకునేలా ఒత్తిడి తేవడం. రెండోది – తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోరిక అభివృద్ధికి, వనరుల కేటాయింపులకు, ఉద్యోగాలకు పరిమితమైనది కాదని; ఆత్మగౌరవానికి, స్వయం పాలనకు సంబంధించినదని. ఈ విషయాలనన్నిటినీ సర్దార్ పటేల్ చెప్పినట్లు వాస్తవాల గీటురాయి మీద పరీక్షించకపోతే తేలును జేబులో వేసుకున్నట్టే అవుతుంది.

ఒకపక్క – రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా ప్రజా సంక్షేమం దృష్టితో చూడమంటున్నారు. మళ్లా – నివేదికలు కాదు...; రాజకీయ నిర్ణయమే శరణ్యమంటున్నారు. ఈ ఆలోచనా సరళిలో వాస్తవికతను రొమాంటిసిజమ్ పొగమంచులా కప్పేస్తోంది. అసలు ప్రజా సంక్షేమం దృష్ట్యా ఏది మంచి నిర్ణయమో తేల్చడానికేగా కమిటీ వేసింది? రాజకీయ పార్టీలు ఆకాశమార్గాన, ఊహాలోకాల్లో విహరించవు. తమకు ఓట్లేసే ప్రజల మనోభావాల వెంటే పరుగులు తీస్తాయి. ప్రజల ఆలోచనలను మార్చే ప్రయత్నాలైతే చేస్తాయి. తమ ఆలోచనలను మార్చుకోవాలో వద్దో నిర్ణయించుకోవాల్సింది ప్రజలు. ఆ ప్రక్రియలో మేధావుల పాత్ర అత్యంత ముఖ్యమైనది. తెలంగాణ ఉద్యమ విషయంలో బీజం ఎవరు నాటారు? మేధావుల పాత్ర ఏమిటి? ఏ రాజకీయాలు నీళ్ళు పోసి పెంచాయి? ఫలాలు ఎవరు అందుకో జూశారు? ఉద్యమానికి వాడిన ఎత్తుగడలేమిటి? అసలు వాస్తవాలేమిటనేది? విశ్లేషించాలి.

1996 లో – మావోయిస్టుల (అప్పట్లో పీపుల్స్ వార్) నిర్ణయం ప్రకారం ప్రత్యేక తెలంగాణ నినాదం తిరిగి మొదలైంది. ఈ వాస్తవం కమిటీ దృష్టికి వచ్చిందో లేదో తెలీదు. ఈ నినాదాన్ని మేధావి వర్గం ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్ళడానికి – ముందువరస మేధావులుగా పౌరహక్కుల సంఘం నాయకులు కార్యక్రమాలు చేపట్టారు. గద్దర్ భువనగిరి సభతో ఊపందుకుంది. 1999 ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఓడిపోయింది. 2000 సంవత్సరంలో ఎన్‌డీఏ ప్రభుత్వం మూడు కొత్త రాష్ట్రాలను ఏర్పాటు చేసింది. 1998 లో కాకినాడలో బీజేపీ తీర్మానం చేసినా, తెలుగుదేశం పార్టీ మద్దతు మీద ఆధారపడ్డారు కనుక; తెలంగాణ ఏర్పాటు చేసే ఆలోచనే చెయ్యలేదు. అదీగాక అద్వాని హైదరాబాద్ వచ్చినప్పుడు అడిగితే, 'రాజధాని కలిగిన వారు ప్రత్యేక రాష్ట్రం అడగడమెందుకు?' అన్నారు. అయితే, ఎన్‌డిఎను, తెలుగుదేశం పార్టీని ఇరుకున పెట్టేలా 41 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తెలంగాణ ఏర్పాటునకు చొరవ తీసుకోమని సోనియాగాంధీకి వినతిపత్రం ఇవ్వడం, దాన్ని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో చర్చించి, రెండో రాష్ట్ర విభజన కమిషన్ వెయ్యమని అప్పటి ఎన్‌డిఎ ప్రభుత్వానికి పంపడం, వారు దాన్ని తిరస్కరించడం ఇవన్నీ తెలిసినవే. 1999లో తెలుగుదేశం మంత్రివర్గంలో చోటు దొరకని కేసీఆర్ తిరుగుబాటు బావుటా ఎగరేసి టిఆర్ఎస్‌ను స్థాపించడం కూడా తెలిసిందే.

వీటన్నిటిలో – రాజకీయ ప్రయోజనాలు తప్పించి ఏ ప్రజా ప్రయోజనాలున్నాయి? మావోయిస్టులు, మేధావులు, మీడియా, రాజకీయ పార్టీలు వీరంతా తెలంగాణ వెనుకబాటు తనాన్ని, జరిగాయంటున్న అన్యాయాలను, వివక్షను, దోపిడీలను ప్రస్తావించారే తప్ప – ఆత్మగౌరవం, స్వయంపాలన ఆనాటి నినాదాలు మాత్రం కావనేది వాస్తవం.

అయితే, కమిటీ నివేదిక ద్వారా బహిర్గతమయిన వాస్తవాలేమిటి? పెద్దమనుషుల ఒప్పందం కొన్ని విషయాల్లో... చాలా సందర్భాల్లో అమలు కాలేదు. కానీ దానివల్ల ప్రజాక్షేమానికి ఏ మాత్రం హాని జరిగింది? విద్య, వైద్యం, ఆరోగ్య రంగాల్లో తెలంగాణ వెనుకబడలేదు. విలీనానికి పూర్వం మిగిలిన ప్రాంతాలకంటే వెనుకబడి ఉండడం వల్ల, వాటికంటే వేగంగా పరుగులెత్తి ఇప్పుడు సమాన స్థాయికి చేరుకుంది. ఎయిడెడ్ కళాశాలల కిచ్చే గ్రాంటు, ప్రభుత్వ మెడికల్ కళాశాలల విషయాల్లో కొద్ది తేడాలు తప్ప, ఆక్షేపించదగ్గ వెనుకబాటుతనమేదీ లేదంది. అలాగే రోడ్లు, విద్యుత్తు, పాఠశాలలు, కళాశాలల విషయాల్లో తెలంగాణ సీమాంధ్రలతో సమానస్థాయిలో, కొన్ని విషయాల్లో ఎక్కువస్థాయిలో కూడా ఉందంది. నీటి పారుదల విషయానికొస్తే మొత్తంమీద భౌగోళిక పరిస్థితి అనుమతించిన మేరకు కాల్వల కింద కానీ, బోరుబావుల ద్వారా గానీ పంటలు పండే భూవిస్తీర్ణం పెరిగిందని వివరించింది. ఆహారధాన్యాల ఉత్పత్తిలో వెనుకబాటుతనమేమీ లేదని లెక్కలు

చూపించింది. ఈ అన్ని విషయాల్లోనూ అన్ని ప్రాంతాలకంటే రాయలసీమ చాలా వెనుకబడి ఉన్నదని నిరూపించింది. ఉద్యోగాల విషయంలో కూడా 1975 లో తెచ్చిన ఆరు సూత్రాల పథకం తర్వాత అక్కడక్కడా జరిగిన పొరపాట్ల కారణంగా మొత్తం ఉద్యోగాల్లో ఒకటి, అర శాతం అక్రమ నియామకాలే తప్ప, ఉద్దేశపూరితంగా వ్యవస్థీకృతంగా జరిపిన అన్యాయమేమీ లేదని తేల్చింది. విలీనానికి ముందు దాదాపు అన్ని రంగాల్లోనూ మిగతా ప్రాంతాలకంటే వెనుకబడి ఉన్న తెలంగాణ ప్రాంతం ఈరోజు అన్ని రంగాల్లోనూ సమానస్థాయికి చేరుకుందంటే; ప్రభుత్వం వసూలుచేసిన పన్నుల డబ్బు, ప్రైవేట్ పెట్టుబడులు ఏ ప్రాంతం నుంచి ఏ ప్రాంతానికి ప్రవహించాయో అర్థం చేసుకోలేమా? ఇక అన్యాయం, వివక్ష, దోపిడీ ఎవరు...ఎవరిని చేసినట్టు?

వాస్తవాలు ఇలా ఉండగా; రాజకీయ పార్టీలు చేసిన ప్రచారమేమిటి? లక్షల సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగాలు దోచుకున్నారన్నారు. అసలు మొత్తం ప్రభుత్వోద్యోగాల సంఖ్య సుమారు 12 లక్షలు. జనాభాలో ఒకటిన్నర శాతం. ఇందులో తెలంగాణలో 5 లక్షలుంటాయి. అందులో లక్షల సంఖ్యలో ఉద్యోగాలు దోచుకుంటే కమిటీ దృష్టికి రాకుండా ఉండదు కదా? రాజకీయ పార్టీలు చేస్తున్న వాగ్దానాలేమిటి? ఇంటికొకటి చొప్పున ప్రభుత్వ ఉద్యోగమిస్తామంటున్నారు. అంటే కోటి ప్రభుత్వ ఉద్యోగాలు సృష్టిస్తారా? మూడెకరాల చొప్పున వ్యవసాయభూమి ఇస్తామంటున్నారు. తెలంగాణాలో సగటు కమత పరిమాణమే మూడెకరాలు. మరి ఎక్కడ్నుంచి తెచ్చిస్తారు? భూమిని సృష్టిస్తారా? గోదావరికి కాలడ్డంపెట్టి నీటిపారుదల కల్పిస్తామంటున్నారు. కల్వకుర్తి లిఫ్ట్ స్కీం కింద ఎకరానికి సంవత్సరానికి సుమారు పాతికవేల వరకు ఖర్చవుతుందని శ్రీకృష్ణ కమిషన్ లెక్కేసి మరీ చూపింది. ఇంత ఖర్చుతో వచ్చే అదనపు ఉత్పత్తి, రాబడి సమర్థించదగిందేనా అని ప్రశ్నించింది. ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టు కింద ఎకరానికి సంవత్సరానికి ఖర్చు ఇంకా ఎక్కువవుతుందని తేలిగ్గా ఊహించగలం. భౌగోళిక, సహజ పరిస్థితులు పట్టించుకోకుండా అనకాపల్లిలో ప్రభుత్వ ఖర్చుతో ఆపిల్ పండ్లు పండించడానికి సాహసించడం ఎంత వరకు సమంజసం? ఇదంతా ఎవరి డబ్బుతో? ఇవేవీ విశ్లేషించకుండా బతుకమ్మ పండుగ, బలిదానాల గురించి మెత్తమెత్తటి కబుర్లు చెప్పే మేధావులు సత్యాన్వేషకులా, భావజాల ప్రచారకులా, ఆస్థాన పండితులా లేక తెరవెనుక రాజకీయులా?

గడియారాన్ని వెనక్కు తిప్పలేం. ఇన్నాళ్లూ జరిగిందేదో జరిగింది. ఈ లెక్కలన్నీ తన దగ్గరున్నా గానీ బయటపెట్టి నిజాలు ప్రజలకు తెలిసేలా చెయ్యని ప్రభుత్వాల దుర్మార్గాల వల్ల – అందరూ నష్టపోయారు. ఇప్పటికైనా ప్రజలు వాస్తవాలను తెలుసుకోవాలి. ఆ వాస్తవాల ఆధారంగా మనోభావాలు మలుచుకోవాలి. బ్రూస్‌లీ సినిమా చూసి కండలు

బిగించి ఆవేశపడిపోయే యువతను... రాజకీయ నాయకులు – దీపావళి టపాకాయల్లా వాడుకుంటారు. రాజకీయులు ఉన్నదే అందుకు. ప్రజలు ఆలోచనా పరులైతే తప్ప ఈ విష రాజకీయాల్నుండి విముక్తి లేదు. చిన్న రాష్ట్రాలు కావాలనే బీజేపీని – ఎంత చిన్నవైతే ఫర్వాలేదో అడగండి. కమిటీ వెలికి తీసిన వాస్తవాలను తాము ప్రభుత్వం నడిపినపుడు అధికారికంగా ఎందుకు వెల్లడించలేదో టీడీపీని అడగండి. రెండో ఎస్సార్సీ కావాలన్న కాంగ్రెస్ – అది లేకుండానే డిసెంబర్ తొమ్మిది ప్రకటన ఎందుకు చేసిందో నిలదీయండి. ఆరోజు సోనియాగాంధీ పుట్టినరోజు కావడం యాదృచ్ఛికమేనా అని ప్రశ్నించండి. ఇన్నాళ్లూ దోపిడీ, దొంగలు, అన్యాయం, వివక్ష, ఇప్పుడు ఆత్మగౌరవం, స్వయంపాలన మాత్రమే నంటున్న టీఆర్ఎస్ ను మరి జాగో... భాగో అని ఎందుకన్నారో కనుక్కోండి. ప్రజల ధన, మాన ప్రాణాలను రక్షించడానికే పరిమితమైనంత కాలం ఏ ప్రభుత్వం వచ్చినా, ఎన్ని రాష్ట్రాలయినా ఎవరికీ ఇబ్బంది ఉండదు. అలా కానంత కాలం – ఏ రాయైతేనేం పళ్ళూడ గొట్టుకోవడానికి?

09-01-2011

విమర్శలకు వివరణాత్మక స్పందన

మేధోమథనం శీర్షిక ద్వారా చర్చించిన సమకాలీన విషయాలు, భావజాల విశ్లేషణలపై పలు విమర్శనాత్మక వ్యాసాలు వెలువడ్డాయి. విమర్శకులను, విమర్శలను విమర్శించకుండా; వాటికి వివరణ ఇవ్వడం భావ్యమనే ఉద్దేశంతో ఎత్తిచూపిన విషయాలకు విడివిడిగా వివరిస్తున్నాను. విమర్శనా వ్యాసాలను ప్రక్కన ఉంచుకుని ఈ వివరాలు చదవడం పాఠకులకు సాధ్యం కాదు కాబట్టి ముఖ్యమైన విమర్శా వాక్యాల్ని పున:స్పర్శిస్తూ...

"ఎవరి 'స్వేచ్ఛ' కోసం?" — తమ్మినేని వీరభద్రం

విమర్శ : "పాశ్చాత్యుల 'సంపద'ల వెనుక పేద దేశాలకు చెందిన కోట్లాది ప్రజల 'శ్రమ' ఉందనే సంగతి ప్రతి ఒక్కరికీ తెలుసు".

స్పందన : *ఇది సోషలిస్టుల నినాదమే తప్ప – వాస్తవం కాదు. పేద దేశాలతో ఎగుమతి దిగుమతి వ్యాపారం చెయ్యడమే పాశ్చాత్యుల సంపదకు కారణమా? వ్యాపారం అంటేనే దోపిడీ అయితే; 1972 లో మావో బతికుండగానే అమెరికాతో వ్యాపార సంబంధాలనెందుకు పునరుద్ధరించుకున్నారు? మీ లాజిక్ ప్రకారం భారతదేశ సంపదల వెనుక ఇథియోపియా, సోమాలియా, బర్మా, నేపాల్ ప్రజల 'శ్రమ' ఉన్నట్లా?*

విమర్శ : 'సోషలిస్టు ఆకాంక్షల్ని అణచివేయడం కోసం పెట్టుబడిదారులు అనుసరించిన వ్యూహమే సంక్షేమ రాజ్యం'.

స్పందన : *సంక్షేమ రాజ్యం సోషలిస్టు భావజాలం నుంచి పుట్టిందే. ఒకవేళ అది పెట్టుబడిదారుల కుట్ర అయితే సంక్షేమ రాజ్యాన్ని సోషలిస్టులు ఎందుకు వ్యతిరేకించడం లేదు? ఇంకా సంక్షేమం పెంచాలని ఉద్యమాలెందుకు చేస్తున్నారు?*

విమర్శ : 'పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రజల కొనుగోలు శక్తి పడిపోయి.."

స్పందన : *మరయితే అమెరికా, ఇతర పాశ్చాత్య దేశాల్లో ప్రజల కొనుగోలు శక్తి పడిపోయి*

ఉండాలి కదా! అలా జరగలేదే? కీన్సు విధానాలు ఫాబియన్ సోషలిజానికి సరిగ్గా అతుకుతాయి. ఆ విధానాల పుణ్యమే ప్రతి పది పదిహేనేళ్ళకూ ఆర్థిక సంక్షోభాలు. '

విమర్శ : ఈ పోటీలో క్రమంగా మొత్తం ప్రపంచంలోనే శ్రామికుల జీతాలు పడిపోతాయి".

స్పందన : శ్రామికుల జీతాలు ప్రపంచీకరణ, పని విభజన వల్ల పెరుగుతాయి, పెరిగాయి కూడా అంతేగానీ తగ్గవు, సోషలిస్టు దేశాల్లో తప్ప.

విమర్శ : "భారతీయ రైతుకు – చేతులు కట్టేసి కుస్తీ పట్టమన్నట్లవుతుంది.".

స్పందన : మన దేశంలోనైనా, అమెరికాలోనయినా వ్యవసాయ సబ్సిడీలు మార్కెట్‌ను వికృతపరచి, సంక్షోభాలకు దారి తీస్తున్నాయి. సబ్సిడీలు ఎక్కడున్నా ఉదార స్వేచ్ఛావాదం వాటిని తీవ్రంగా వ్యతిరేకిస్తుంది.

విమర్శ :'పెట్టుబడి పెట్టేవారి విశ్వాసం కోసం వారు అడిగినవన్నీ చేయాల్సి ఉంటుంది. భూములు, గనుల కుంభకోణాలు...."

స్పందన : సహజ వనరులన్నిటి మీద ప్రభుత్వానికి గుత్తాధిపత్యం కట్టబెట్టింది సోషలిస్టు భావజాలమే. వాటిని రాజకీయ నాయకులు స్వలాభానికి అమ్ముకుంటున్న పాపానికి ఆ భావజాలమే బాధ్యత వహించాలి. ఉదార స్వేచ్ఛా ప్రపంచంలో బాక్సైట్ ఖనిజం ఎక్కడ దొరికితే అక్కడ ప్రైవేట్ కంపెనీలు పెద్ద సంఖ్యలో పోటీపడి అల్యూమినియం తయారుచేస్తాయి. పోటీవల్ల ఉత్పత్తి పెరగడమే కాక, ధరలు తగ్గుతాయి. వినియోగించే ప్రజలు లాభపడతారు. స్వేచ్ఛగా పోటీపడగలిగిన ప్రతి రంగంలోనూ రుజువయిందదే.

నిజానికి ప్రపంచీకరణఫలితంగా– ప్రజలకు అనేకభోగభాగ్యాలు అందుబాటులోకి వచ్చాయి. వినడానికి నవ్వులాటగా ఉంటుందికానీ, అశోక చక్రవర్తి అనుభవించని భోగభాగ్యాలు – నేటి మధ్యతరగతి అనుభవిస్తోంది. గంటసేపట్లో కళింగ నుంచి హస్తినాపురానికి ప్రయాణం... నిమిషానికి పదిపైసల ఖర్చుతో దూర శ్రవణం... ఎయిర్ కండిషన్, చైనా నుంచి యాపిల్ పళ్ళు – ఇవి చాలవూ? భోగభాగ్యాలంటే! కొందరు రాణులు, వందల కొద్దీ సానులు, యుద్ధాల్లో లక్షలాది మందిని చంపడం – ఇవా?

"స్వేచ్ఛా విపణిలో స్వేచ్ఛ ఉందా?" ఆర్.వి. రమణ మూర్తి

విమర్శ : "ప్రభుత్వం జోక్యం అంటే సోషలిజం కాదని, పెట్టుబడిదారుల మనుగడకు రాజ్యం చాలా అవసరమని మార్కెట్ వాదులంతా ఒప్పుకున్నారు, రాజ్యం నియంత్రణ

అసలు ఉండకూడదని 1930 నుంచి నేటి దాకా మిల్టన్ ఫ్రైడ్‌మాన్‌తో సహా ఎవరూ వాదించలేదు".

స్పందన : జోక్యానికి ప్రభుత్వాలు, మేధావులు ఇచ్చే జస్టిఫికేషనే సోషలిజం. తమ మనుగడ కోసం రాజ్యం జోక్యాన్ని కోరుకునేది మార్కెట్‌లో పోటీపడడం ఇష్టంలేని, రాజ్యం మీద ఆధారడే పరాన్నభుక్కు పెట్టుబడిదారులు. అంతేకాని మార్కెట్‌వాదులు కాదు.

ఫ్రైడ్‌మన్‌తో సహా థియరీ ఎవరు చెప్పినా; సమకాలీన సమస్యలకు అన్వయించి వివరించగలిగినప్పుడే దాని వ్యాలిడిటీ రుజువవుతుంది. ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థ మనుగడకు రాజ్యం అవసరమేమిటో రుజువు చెయ్యాల్సింది జోక్యీకరణవాదులు.

23-01-2011

సోషలిజం విషమంత ప్రచారం

'కార్పొరేట్ ఆలోచనే ఆహార భద్రత' — పి. ప్రసాద్

విమర్శ : 'కార్పొరేట్ ఆలోచనే ఆహార భద్రత'

స్పందన : మరి, అది కార్పొరేట్ ఆలోచన అయినప్పుడు సహజంగానే కమ్యూనిస్టులు వ్యతిరేకించాలి కదా! ఎందుకు వ్యతిరేకించట్లేదు? కనీసం విమర్శించట్లేదేం?

విమర్శ : 'ప్రభుత్వాలకు రాజకీయ దిశా నిర్దేశం చేస్తున్న బడా కార్పొరేట్ వ్యవస్థను రాజకీయ వ్యవస్థ ఇంట్లో పనిమనిషిగా వర్ణించడం జాహ్నవికే చెల్లింది'.

స్పందన : ఆర్థిక వ్యవస్థ అంటే బడా కార్పొరేట్ వ్యవస్థ ఒక్కటే కాదు. రైతు కూలీ, ఆటో డ్రైవర్, లారీ ఓనర్, ఫ్యాక్టరీ యజమాని వీళ్ళంతా ఆర్థిక వ్యవస్థలో భాగాలే. వారి ఆదాయవ్యయాలు, లాభ నష్టాలు – రాజకీయ నాయకుల పిడికిట్లో ఉన్నాయి. అన్ని అధికారాలు ప్రభుత్వం చేతుల్లో పెట్టాం కనుకనే ఆ అధికారాలను బడా కార్పొరేట్లకు చాటుగా అమ్ముకుంటున్నా ఏమీ చెయ్యలేకపోతున్నాం. ప్రజా సంక్షేమం పేరిట, సోషలిజం ముసుగులో నాయకులు ఆర్థిక వ్యవస్థను తమ చేతుల్లో కీలుబొమ్మను చేసి అమ్ముకుంటున్నారు.

విమర్శ : 'గ్రామీణ ప్రజల ఆహార బడ్జెట్ వ్యయాన్ని తగ్గిస్తే తప్ప; తమ వస్తువులకు గిరాకీ, తగినంత లాభం చేకూరదని కూడా అవి (కార్పొరేట్ కంపెనీలు) గుర్తించాయి'.

స్పందన : ఆహార వ్యయాన్ని ఎలా తగ్గించబోతున్నారు? సబ్సిడీల ద్వారా. ఆ సబ్సిడీలకు

దబ్బెక్కడిది? పన్నుల ద్వారా వసూలు చేసింది. అంత డబ్బు పన్నుల రూపంలో చెల్లించాక పన్నులు కట్టిన వాళ్ల వినియోగ శక్తి ఆ మేరకు తగ్గిపోదూ? వారు వస్తువులను కొనలేకపోతే కార్పొరేట్లకు నష్టం కాదూ? పన్నులు కట్టే – మధ్య... ఉన్నత తరగతులే కదా కార్పొరేట్లు తయారుచేసే వస్తువులు కొనేది! గ్రామీణ ప్రజలు కాదు కదా!

విమర్శ : 'అంతటి బ్రహ్మాండమైన శక్తి సామర్థ్యాలు గల ఆర్థిక వ్యవస్థను – స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కోల్పోయిన బానిసరాలిగా జాహ్నవి సూత్రీకరణ'

స్పందన : ఐఎమ్ఎఫ్, ప్రపంచబ్యాంకు, ప్లానింగ్ కమిషన్ – ఇవన్నీ జోక్యీకరణ సిద్ధాంతం నుంచి పుట్టిన వ్యవస్థలే. ఆ సిద్ధాంతం నుంచి వచ్చిన అధికారాలతోనే కోస్టల్ కారిడార్, సెజ్‌లను ప్రైవేటుగా అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఆర్థిక వ్యవస్థ – పనిమనిషిగా కాకుండా – స్వేచ్ఛగా ఉన్నప్పుడు, ఇలాంటి పందేరాలు జరిపే అధికారం, అవకాశం– రాజకీయాలకు ఉండదు.

'ఆ స్వప్నం అనైతికం కాదు' — కె.శ్రీకృష్ణ

విమర్శ : 'సోషలిజం ఒక స్వప్నం అంటే బాగానే ఉండేది. కానీ అనైతిక స్వప్నం అనడం చాలా అన్యాయం'.

స్పందన : సోషలిజం స్వప్నం మాత్రమే కాదు. ముమ్మాటికీ అనైతికం కూడా. అందులోని స్వాప్నికత కంటే అనైతికతే ఇంకా ప్రమాదకరమైనది. మానవసంఘ నిర్మాణం రెండు విధాలుగా సంభవం. ఒకటి మనిషి స్వేచ్ఛా జీవియై, ఉత్పత్తి, వినియోగం, లాభం, నష్టాలను మార్కెట్ ద్వారా నిర్ణయించుకోగలగడం. రెండోది నియంతృత్వం ద్వారా ఒక కేంద్రీకృత అధికారం మార్కెట్‌ను రద్దుచేసి, ప్రతి మనిషీ ఏం చెయ్యాలో, ఏం తినాలో, ఎలా ఉండాలో నిర్ణయించడం.

ఆ అధికార కేంద్రం పార్టీ జనరల్ సెక్రటరీ కావచ్చు, ఫాసిస్టు లేదా నాజీ నియంత కావచ్చు, లేదా ఒక మత గురువు కావచ్చు. ప్రభావం, ఫలితం రెండూ ఒకటే.

అందులో – వ్యక్తికి భావ ప్రకటనా స్వేచ్ఛ, ఆర్థిక స్వేచ్ఛ ఉండవు. అంతా నియంత, అతని అనుచరుల కనుసన్నల్లోనే జరగాలి. నైతికంగా – అది మనిషి పట్ల అత్యంత అమానుషమయిన విధానం. అలాంటి నియంతృత్వ సమాజం నిర్మించడానికి, నడపడానికి ఎంతో మంది ప్రయత్నించి విఫలమయ్యారు. అది ఒక స్వప్నం మాత్రమే. కారణం – మార్కెటే లేని నాడు ధరల వ్యవస్థ ఉండదు. అదిలేని నాడు ఏ వస్తువును ఏ పద్ధతిలో ఉత్పత్తి చేస్తే మెరుగో చెప్పగల సూచికలుండవు. వినియోగదారులకు ఏది

అవసరమో తెలుసుకునే వీలుండదు. ఈ 'సోషలిజంలో లెక్కల సమస్య'ను ఏ సోషలిస్టు ఆర్థిక మేధావీ పరిష్కరించలేకపోయారు. అదీ ఇదీ కానిది – మిశ్రమ ఆర్థిక వ్యవస్థ. నేడు అన్ని దేశాల్లోనూ రకరకాల పాళ్లలో ఇదే ఉంది. అందులో కాపిటలిజం పాలు ఉన్నమేరకు ఆర్థికాభివృద్ధి జరుగుతుంది. సోషలిజం ఉన్న మేరకు – ప్రభుత్వాలకు నియంతృత్వ అధికారాలు దఖలు పడతాయి. ఆ అధికారాలనుపయోగించి ఆర్థిక వనరుల్ని ప్రైవేటుగా అమ్ముకోటానికి రాజకీయ నాయకులుంటారు.

అమెరికాలో ఎలక్షన్ ఖర్చులకు నేరుగా చందాలిస్తారు. మన దేశంలో చాటుగా ఇస్తారు. అంతే తేడా. అమెరికాలో కేపిటలిజం పాళ్లు తగ్గిపోయి, సోషలిస్టు విధానాలు ఎక్కువవు తున్నాయి. ఇరాక్ యుద్ధమే కాదు, ఏ యుద్ధాన్నీ కాపిటలిజం సమర్థించదు. ఇకపోతే మోసాలు చెయ్యడం, కల్తీ మందులు, కబ్జాలు – ఇవన్నీ శిక్షించదగ్గ నేరాలు. వాటికి కేపిటలిజానికి ముడిపెడితే అసలు సమస్య అవగతం కాదు, పరిష్కారం దొరకదు.

విమర్శ : 'సోషలిజం కొంతైనా మనిషిని మనిషిగా ఉంచే ప్రయత్నం చేస్తుంది'.

స్పందన : సోషలిజం పూర్తి స్థాయిలో అమలయినప్పుడు అదొక అమానుష నియంతృత్వం. భావ ప్రకటన స్వేచ్ఛ. ఆర్థిక స్వేచ్ఛలేని బానిసత్వం. అది మనిషిని మనిషిగా ఉంచే ప్రయత్నమా?

'సోషలిజం అన్నమంత అవసరం' — నాగవర్ధన్ రాయల

విమర్శ : 'పొట్ట చేత పట్టుకుని విదేశాలకు వెళ్లడం ఆ దేశ ప్రజల దయనీయ స్థితికి అద్దంపడుతుంది'.

స్పందన : కూనవరం నుంచి ఖమ్మం వెళ్లినా...;అనకాపల్లి నుంచి అమెరికా వెళ్లినా అందులో అవమానమేమీ లేదు. తన సామర్థ్యానికి తగిన గుర్తింపు, ప్రతిఫలం వచ్చే చోటును వెతుక్కుంటూ వెళ్లడం మనిషి సహజ ధర్మం.

విమర్శ : మేధో, కళా రంగాల్లోని కృషి ఉత్పత్తిలో పాల్గొనే ప్రజల అదనపు ఉత్పత్తి నుంచి లభించిన విశ్రాంతే. మేధోరంగ కృషి వల్ల.. శ్రామిక జనానికి లభించిన ప్రయోజనాలేమిటి? ఆ ఫలితాలను ముందుగా అందుకుంటున్నదెవరు?'

స్పందన : మరయితే; అదనపు ఉత్పత్తి అంతా సమాజపరం చేశామన్న సోషలిస్టు దేశాలు మేధో, కళా రంగాల్లో ఏమీ సాధించలేకపోయాయెందుకు? ప్రజలందరికీ అందుబాటులో

ఉన్న గడ్డం గీసుకునే బ్లేడు మొదలుకొని – కంప్యూటర్, సెల్‌ఫోన్, గుండె ఆపరేషన్లు, చౌక మందులు – వీటిలో ఏ ఒక్కటైనా సోషలిస్టు సమాజాలు కనిపెట్టాయా ?

విమర్శ : 'పౌష్టికాహార లోపంతో పిల్లలెందుకు చనిపోతున్నారు? రైతులు అప్పుల పాలవతున్నారే! కూలీలెందుకు దయనీయంగా ఉన్నారు? ఇవన్నీ కాపిటలిజం దుష్ఫలితాలే'.

స్పందన : సమస్యకు నిజమైన కారణాలు గుర్తించకపోతే పరిష్కారం దొరకదు. మీరు చెప్పిన దరిద్రాలన్నిటికీ కారణం సోషలిస్టు విధానాలే. కాపిటలిజం బలంగా ఉన్న దేశాల్లో పౌష్టికాహార లోపంతో పిల్లలెవరూ చనిపోవడం లేదు. సోషలిజం వెర్రి తలలువేసిన సోమాలియా, ఇథియోపియా, హైతీల్లోనే ఇది ఎక్కువ. మార్కెట్‌ను తన పని తనను చేసుకోనిస్తే – కటిక దారిద్ర్యం పూర్తిగా పోతుంది. సోషలిస్టు విధానాల వల్ల ఎక్కువ నష్టం జరిగేది పేదలకే. సెజ్‌లు, పరిశ్రమలు, గనులలో ప్రభుత్వ ప్రమేయం సోషలిస్టు భావజాల ఉత్తేజితం. కాపిటలిజం కారణం కాదు. విష సర్పం ఒకవైపు ఉండగా, వేరే చోట వెతుకుతూ కూర్చుంటే మళ్లీ మళ్లీ కాటేస్తుంది. ఈస్టిండియా కంపెనీ – బ్రిటీష్ ప్రభుత్వం లైసెన్సు ఇచ్చిన గుత్తాధిపత్య సంస్థ. అది కాపిటలిజం కాదు. అదీగాక, అది రాకముందు కూడా యుద్ధాలు జరిగాయి. చిలీలో జోక్యం, అమెరికా, నాటోల యుద్ధాసక్తికి కాపిటలిజం వ్యతిరేకం. అవి రాజ్యాన్ని, దాన్ని పీల్చుకుతినే పరాన్న జీవులు, యుద్ధ సామాగ్రి సరఫరా దారులను బలోపేతం చేస్తాయే తప్ప; ప్రజలను, వారి ఆర్థిక స్వేచ్ఛను కాదనేదే కాపిటలిస్టుల వాదన. కాపిటలిస్టు ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ యంత్రాంగం – చాలా చిన్న పరిమాణంలో రక్షణకు మాత్రమే పరిమితమై ఉంటుంది. ఆస్థాన కవులు, ఆస్థాన ఆర్థికవేత్తలు, తత్వవేత్తలు రాణించేది సోషలిస్టు రాజ్య వ్యవస్థలో మాత్రమే. ఏ పరిమాణంలో స్వీకరించినా, 'సోషలిజం' అనేది విషమంత ప్రమాదం.

30-01-2011

' కేపిటలిజం అమానుష వాస్తవం ' గుడిపాటి నరసింహారావు

విమర్శ : 'పెట్టుబడిదారీ విధానం – ఆ తర్వాత కాలంలో వస్తువులు, సరుకుల తయారీని ప్రజల కోసం కాక, లాభాల కోసం ప్రోత్సహించింది'.

స్పందన : పెట్టుబడిదారి విధానం – ఏ కాలంలోనయినా లాభాలకోసమే సరుకుల తయారీ అందుకే కొత్త, కొత్త విధానాల్లో ఇంకా ఇంకా చవుకగా ఎక్కువ సరుకులు తయారుచేస్తుంది. ప్రజలు వినియోగించకపోతే లాభాలెలా వస్తాయి? కాబట్టి ప్రజల (వినియోగం) కోసం, లాభాల కోసం అనే వైరుధ్యం – ఒక మిథ్య. అది సోషలిస్టు ప్రచారమే తప్ప వాస్తవం కాదు.

విమర్శ : 'కేపిటలిజం ఒక భావజాలంగా శాంతిని కోరుకుంటుందా?'

స్పందన : అవును. శాంతినే కోరుకుంటుంది. శాంతి లేని చోట వ్యాపారానికి తగిన వాతావరణం ఉండదు. అదీకాక; యుద్ధాల వల్ల విలువైన పెట్టుబడి ధనం వృథా అవుతుంది.పనిచేసే వాళ్ళు సైనికులుగా వెళ్ళడంతో ఉత్పత్తి కుంటుపడుతుంది. ప్రాణనష్టం వల్ల గిరాకీ తగ్గిపోతుంది. అందుకే శాంతినే కోరుకుంటుంది. యుద్ధాలను కోరుకునేది, చేసేది ప్రజల పన్నుల డబ్బుతో – తెగ బలిసిన రాజ్య వ్యవస్థ. లేకపోతే ప్రజల పేదరికానికి సమాధానం చెప్పలేక దృష్టి మరల్చడానికి... అధికార పీఠం స్థిరపరచుకోడానికి ప్రయత్నించే భ్రష్టుపట్టిన ప్రభుత్వాధినేతలు.

విమర్శ : 'పన్నులు ఎగ్గొట్టే కేపిటలిస్టులు, బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను చెల్లించని బకాయిదార్లే కేపిటలిజం ముద్దు బిడ్డలు'.

స్పందన : ఇవన్నీ జరిగేది మనం ఎన్నుకుని, అంతులేని అధికారాలు కట్టబెట్టిన రాజకీయ నాయకుల జోక్యం వల్లనే తప్ప ; కేపిటలిస్టు భావజాలం వల్లకాదు.కేపిటలిస్టులు కోరుకున్నట్లు పన్నులే లేకపోతే..., ఎగ్గొట్టడం అనేదే ఉండదు. కొంతమంది రుణాలు ఎగ్గొట్టేది – ప్రభుత్వ రంగ బ్యాంకులకే. ఎందుకంటే ఆ బ్యాంకులు రాజకీయ నాయకులకు తప్ప ఎవరికీ జవాబుదారులు కాదు. ప్రైవేటు బ్యాంకులు – వారి షేర్ హోల్డర్లకు జవాబుదారులు.

విమర్శ : 'శ్రమ దోపిడియే అత్యంత అమానుష నేరం'

స్పందన : ఉత్పత్తికి కావలవసిన అన్ని ముడి వస్తువుల్లాగే, శ్రమ కూడా ఒకటి. ఉద్యోగికి, యజమానికి సమ్మతమైన జీతానికి పని చేయించుకోవడం శ్రమదోపిడీ అయితే, మనం రోజూ డబ్బిచ్చి కొనుక్కునే వంకాయలు కూడా శ్రమదోపిడీ ఫలాలే.

విమర్శ : 'చౌక మందులు, పౌష్టికాహారం లేక చనిపోతున్న లక్షలాది బాలల్లో అత్యధికులు కేపిటలిస్టు దేశాలకు చెందిన వారేనన్నది వాస్తవం కాదా?'.

స్పందన : కాదు.

విమర్శ : 'అమెరికా సారథ్యంలో జరిగిన కుట్రలు, సోషలిజాన్ని అమలు జరిపిన పార్టీలో కొందరి కుహకాలు, గొర్బచేవ్‌లాంటి ద్రోహుల వల్ల సోవియట్‌లో సోషలిజం కూలిపోయింది'.

స్పందన : ఎవరి కుట్రలకో కూలిపోయేది... ఆదర్శ వ్యవస్థ ఎలా అవుతుంది? అదీగాక తన సోషలిస్టు విధానాలకు స్వస్తి చైనా చెప్పడం ఎవరి కుట్ర?

విమర్శ : 'ధరల నిర్ణయంలో జోక్యం లేకపోతే లాభం రైతులకు కాదు, దళారులకే'.

స్పందన : అంత లాభం వస్తుందనుకున్నప్పుడు కొంతమంది రైతులు తమ పొలాలను కౌలుకు ఇచ్చి,దళారీలుగా మారతారు. ఎక్కువ మంది పోటీ పడితే దళారుల అడ్డగోలు లాభాలు తగ్గిపోతాయి. అయితే రైతు, లేకపోతే వినియోగదారుడు లాభపడతారు. ధరలను ప్రభుత్వం నిర్ణయించడం వల్ల దళారులు లేకుండా పోలేదే! ప్రతి సీజన్లోనూ గిట్టుబాటు ధరలిప్పించమని రైతులు చేసే ఆందోళనలు ఆగడంలేదే!

'పబ్లిక్ సెక్టార్‌పై ఏకపక్షదాడి' — బండారు రవికుమార్

విమర్శ : 'బీహెచ్ఈఎల్, ఈసీఐఎల్‌ను ఏర్పాటు చేసిన ప్రాంతంలో అవి ఆ ప్రాంత సామాజిక, ఆర్థికాభివృద్ధికి బాటలు వేయడం కనబడటం లేదా?'

స్పందన : భారీ పరిశ్రమ ఎక్కడ, ఎవరు పెట్టినా స్థానికంగా అభివృద్ధి జరుగుతుంది. దానికోసం అది ప్రభుత్వ రంగంలోనే ఉండనవసరంలేదు. ఉదాహరణకు జంషెడ్‌పూర్‌ను చూడండి.

విమర్శ : "దేశీయ పెట్టుబడిదారులెవరూ తక్షణ లాభాలకు అవకాశం లేని, నిర్మాణ వ్యయం భారీగా ఉండే భారీ పరిశ్రమల స్థాపనకు ముందుకు రాలేదు."

స్పందన : నిజమే. ఎలా వస్తారు? ఎప్పుడు జాతీయం చేస్తారో తెలియని అనిశ్చితిలో– ఎవరు మాత్రం ఆత్మహత్యకు సాహసిస్తారు? స్వాతంత్ర్యం వచ్చిన్నాటి నుంచీ సోవియట్ రష్యా మూసలో ప్రణాళికాబద్ధమైన సోషలిస్టు సమాజాన్ని స్థాపిస్తామని చెబుతూ, 1955లో సోషలిస్టు పారిశ్రామిక విధానం అమల్లోకి తెచ్చాక ఉక్కు, బొగ్గు, విద్యుత్తు వంటి భారీ పరిశ్రమలను ప్రభుత్వరంగానికి రిజర్వు చేశాక; ఇక ప్రైవేటు రంగానికి అవకాశమెక్కడుంది? ప్రైవేటు రంగం నుంచి వచ్చిన వాళ్ళంతా టాటాలు స్టీలు, ఆటోమొబైల్, కెమికల్స్ రంగాల్లో; బిర్లాలు సిమెంటు, ఆటో (అంబాసిడర్), టెక్స్‌టైల్ రంగాల్లో; ఇలా కొంతమంది – ప్రభుత్వ అనుమతితో, ప్రభుత్వ కనుసన్నల్లో భారీ పరిశ్రమలు స్థాపించి, ఇంకెవరూ ఆ రంగాల్లోకి రాకుండా గుత్తాధిపత్యం పొందారు. అది ఏ భావజాల పుణ్యం?

విమర్శ : 'హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్ ఆయిల్ కంపెనీలు ఏటా 21 వేల కోట్లు ఎక్సైజు సుంకం చెల్లిస్తుండగా, వాటితో సమాన టర్నోవర్ కలిగిన తొమ్మిది ప్రైవేటు కంపెనీలు రెండువేల కోట్లే చెల్లిస్తున్నాయి.'

స్పందన : ఎక్సైజు పన్ను రేటు నిర్ణయించేది కేంద్ర ప్రభుత్వం. చివరకు కట్టేది ప్రజలు. ఆయా కంపెనీలు కాదు.

విమర్శ : 'నాడు నెహ్రూ పబ్లిక్ సెక్టారును ప్రోత్సహించడం; నేడు ప్రభుత్వరంగ సంస్థలను మన్మోహన్ తెగనమ్మడం రెండూ గుత్త పెట్టుబడిదారుల ప్రయోజనాలకే ఉపయోగపడ్డాయి'.

స్పందన : అదే నేనూ చెప్పేది! ఆర్థిక వ్యవస్థని రాజకీయ నాయకుల చేతుల్లో పెడితే స్వప్రయోజనాల కోసం పరాన్నభుక్కు పారిశ్రామికవేత్తలకు అమ్ముకుంటారు.

'సమాజ శ్రేయస్సు ప్రజాస్వామ్యంలో భాగం' రావులపాటి సీతారామారావు

విమర్శ : 'అపరిమితమైన ఆర్థిక స్వేచ్ఛ నిస్సందేహంగా ధనవంతుణ్ణి మరింత ధనవంతుడిగా చేస్తుంది. బీదరికం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందానే ఉంటుంది'.

స్పందన : లేదు మాస్టారూ! ఆర్థిక స్వేచ్ఛ ఉన్న వాతావరణంలో మాత్రమే సంపద సృష్టించబడి బీదరికం తొలగిపోతుంది. చరిత్రలో ఇప్పటివరకు జరిగిందిదే.

విమర్శ : 'దీన్ని ఎవరు ప్రశ్నించినా రాజ్యాంగాన్ని ప్రశ్నించినట్లే అన్న భావన కొందరికి కలగక మానదు'.

స్పందన : ప్రశ్నించకూడనంత పవిత్ర గ్రంథమేమీ కాదు రాజ్యాంగం పాలించే వారితో విభేదించే హక్కుతోపాటు; రాజ్యాంగాన్ని ప్రశ్నించే హక్కు కూడా ప్రజాస్వామిక ప్రాథమిక హక్కే.

విమర్శ : 'ప్రస్తుతం విద్యా, వైద్యం విషయాల్లో ప్రభుత్వం ఎక్కువ స్వేచ్ఛను ఇవ్వడం ద్వారా సామాన్యుడికి అవి అందుబాటులో లేని పరిస్థితి...'

స్పందన : మన రాష్ట్రంలో ఇంజనీరింగ్ కాలేజీలు ఏడు నుంచి అయిదు వందలయ్యాయి. కాబట్టే సన్నకారు రైతుల పిల్లలు కూడా ఇంజనీరింగ్ చదవగలుగుతున్నారు. గ్యాస్ట్రిక్ మాత్రల నుంచి గుండె ఆపరేషన్ల వరకు వైద్యం సామాన్యుడికి అందుబాటులోనే ఉంది. ఉండేకోద్దీ ధరలు తగ్గుతున్నాయి. ఇందులో సర్కారు పుణ్యమేం లేదు.

విమర్శ : 'రాజకీయంగా ప్రస్తుతం ఉన్న ఈ గందరగోళ పరిస్థితుల్లో ఇలాంటి సూత్రీకరణ మరింత గందరగోళానికి దారితీస్తుందేమో...'

స్పందన : దశాబ్దాలుగా కొనసాగుతున్న మేధో గందరగోళానికి తెరదించడం, హేతుబద్ధమైన పరిష్కారాలు సూచించడమే ఈ వ్యాస పరంపర లక్ష్యం. సమయం వెచ్చించిన విమర్శకులకు కృతజ్ఞతలు.

06-02-2011

మావోయిస్టుల పౌరహక్కులు !

ప్రముఖ పౌరహక్కుల ఉద్యమనేత కన్నబిరాన్ ఇటీవలే మరణించారు. దాదాపు ఏడాది క్రితం బాలగోపాల్ మరణించారు. సుమారు నెల క్రితం పౌరహక్కుల నేతగా గుర్తింపబడి; మావోయిస్టుల సానుభూతిపరుడుగా ముద్రపడి, వారికి కొరియర్‌గా పనిచేశారన్న అభియోగాలు నిరూపించబడిన బినాయక్‌సేన్ - యావజ్జీవ కారాగార శిక్షకు గురయ్యారు. కన్నబిరాన్, బాలగోపాల్, బినాయక్‌సేన్ పనిచేసిన పౌరహక్కుల సంఘాలకు ఒక నేపధ్యం ఉంది. ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘానికి కన్నబిరాన్, బాలగోపాల్, తెలంగాణా జేఏసీ కన్వీనర్ కోదండరామ్‌లు పునాది రాళ్ళవంటివారు. ఈ సంఘం మావోయిస్టు (అప్పట్లో పీపుల్స్‌వార్) ఉద్యమంలో భాగంగా స్థాపించబడింది. వివిధ ప్రజారంగాల్లో (వకీళ్లు, లెక్చరర్లుగా) పనిచేసుకుంటూనే పౌరహక్కుల ఉద్యమాన్ని మావోయిస్టు నిర్దేశిత అజెండా ప్రకారం ముందుకు తీసుకెళ్ళడంలో కృతకృత్యులయ్యారు.

కన్నబిరాన్, బాలగోపాల్ ఇద్దరూ మొదట్లో పీపుల్స్‌వార్ ఉద్యమాన్ని, లక్ష్యాలను, వ్యూహాన్ని, ఎత్తుగడలను, హింసాత్మక మార్గాన్ని పూర్తిగా సమర్థించారు. కానీ గ్రామాల్లోని లంపెన్ శక్తులు సాగించిన అకృత్యాలు, అఘాయిత్యాలు, భర్త తల నరికి భార్య చేతుల్లో పెట్టడం వంటి సమర్థించజాలని సంఘటనలను - వేర్వేరు సమయాల్లో బహిరంగంగా విమర్శించారు. మొదట అలా విమర్శించిన కన్నబిరాన్‌ను కర్నూలులో జరిగిన సమావేశంలో ఏపీసీఎల్‌సీ నుంచి బహిష్కరించారు. అప్పట్నుంచి ఆయన మితవాద సోషలిస్టు భావాలున్న పీయూసీఎల్‌లో పూర్తిస్థాయిలో పనిచేశారు.

కన్నబిరాన్‌ను బహిష్కరించిన సమయానికి కూడా మావోయిస్టుల హింసకు పూర్తి మద్దతు పలికిన బాలగోపాల్ పీయూసీఎల్‌తో కూడా వాదాలకు దిగేవారు. పీయూసీఎల్‌తో ఆయనకు తీవ్ర బేధాభిప్రాయాలుండేవి. అదే బాలగోపాల్ 1990ల్లో

మావోయిస్టుల హింసను వ్యతిరేకించి, ఏపీసీఎల్‌సీ గుంటూరు సభలో ఆ సంఘం నుంచి బయటకొచ్చేశారు. అప్పట్నుంచి మానవ హక్కుల కమిటీ పేరుతో కార్యక్రమాలు నిర్వహించారు.

పౌరహక్కుల, మానవహక్కుల సంఘాలన్నీ – కమ్యూనిస్టు, లేదా కనీసం సోషలిస్టు భావజాల ప్రచారానికి పనిచేశాయి, చేస్తున్నాయి. ఇది అత్యంత దురదృష్టకరం. ఎందుకంటే పౌర / మానవ హక్కులకు... కమ్యూనిస్టు భావజాలానికి తీవ్ర వైరుధ్యముంది. కమ్యూనిస్టు వ్యవస్థలో మానవ హక్కులు, పౌర హక్కులు మచ్చుకైనా కనిపించే వీలులేదు. వ్యక్తిని–సమాజానికి, ఆ పేరుతో ఏర్పడే ప్రభుత్వానికి, ఆచరణలో ఆ ప్రభుత్వపు అధినేతకు బానిసగా చేసే శ్రామికవర్గ 'నియంతృత్వం' లో – మానవ హక్కుల ప్రస్తావనే రాదు. అన్ని వనరులు..., పూర్తి ఆర్థికవ్యవస్థ.... సకల ఉద్యోగాలు... నియంతృత్వ ప్రభుత్వ ఆధీనంలో ఉంటాయి. దానికి సోషలిస్టు మేధావులు పెట్టే ముద్దుపేరు సామాజీకరణ. అటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వాన్ని గాని, దాన్ని నడిపే వారిని గాని, వారి విధానాలను గానీ వ్యతిరేకించేవారు – ఆకలితో మాడి చావడం తప్ప వేరే మార్గం లేదు. భావ ప్రకటన స్వేచ్ఛకు అవకాశమే లేదు. మీడియా మొత్తం ప్రభుత్వం ఆధీనంలోనే. ఎవరైనా ప్రభుత్వ వ్యతిరేక భావాలు ప్రకటిస్తే – సైబీరియాలో కారాగారం, బానిస శ్రమ తప్పవు. ప్రపంచంలో మొదటి అతిపెద్ద కమ్యూనిస్టు దేశాలైన రష్యా, చైనాల్లో ప్రజల అనుభవం ఇదే.

స్టాలిన్‌తో సైద్ధాంతికంగా విభేదించిన ట్రాట్స్కీని వెంటాడి, వేటాడి మెక్సికోలో చంపేశారు. మావో అమలు చేసిన ముందడుగు (గ్రేట్ లీప్ ఫార్వార్డ్), సాంస్కృతిక విప్లవాల సమయంలో సీనియర్ నాయకుడైన డెంగ్ జియావో పింగ్‌తోపాటు లక్షలాది కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలను రాజకీయ ఖైదీలుగా పశ్చిమ పర్వతాల్లోని మిలిటరీ ఆయుధ కర్మాగారాల్లో పనిచేయించారు. నిజానికి కమ్యూనిస్టు దేశాల్లో ఉన్నంతమంది రాజకీయ ఖైదీలు ఇతర ఏ దేశాల్లోను, ఏ కాలంలోను కానరారు. మిలటరీ కోర్టులు, బలవంతపు ఆత్మవిమర్శలు, సొంత వకీలును నియమించుకునే అవకాశంలేని వ్యవస్థ – ఈ పరిస్థితుల్లో మానవహక్కుల గురించి ఆలోచించడమే హాస్యాస్పదం.

ఉదారవాదులకు, మార్కెట్ వాదులకు స్వేచ్ఛ ముఖ్యమైన మానవహక్కు. ప్రశ్నించే స్వేచ్ఛ, వ్యతిరేకించే స్వేచ్ఛ, తన పని తాను చేసుకోగలిగే స్వేచ్ఛ లేనిదే మార్కెట్ నడవదు. మానవునికి సహజ సిద్ధంగా హక్కైన స్వేచ్ఛను, ధన, మాన, ప్రాణాలను కాపాడడానికి మాత్రమే ప్రభుత్వాలు పరిమితమవ్వాలని వారి వాదన. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల సొమ్ముతో రకరకాల స్వప్రయోజన వర్గాలను తయారుచేయడాన్ని మార్కెట్‌వాదులు వ్యతిరేకిస్తారు. యుద్ధాలను కూడా వ్యతిరేకిస్తారు. ప్రభుత్వాలు తమ వైఫల్యాలను

కప్పిపుచ్చుకోవడానికి, ప్రజల దృష్టి మళ్ళించడానికి ఇతర దేశాలతో కయ్యం పెట్టుకుని; ఆ పేరుతో ప్రజలు సృష్టించుకున్న సంపదను మిలిటరీ అవసరాలకు మళ్ళించడాన్ని తీవ్రంగా ప్రశ్నిస్తారు. ప్రభుత్వాలు తమకు తామై సృష్టించిన ఇంటా, బయటా కల్లోలాలను సాకుగా చూపి – ప్రజల హక్కులను హరించే రాక్షస చట్టాలను రద్దు చేయమంటారు.

ఏ కాలంలోనయినా, ఎటువంటి సమాజంలోనైనా – నేరాలు, నేరస్తులు ఉండడం సహజం. నేరాలను అదుపు చేసేందుకు హేతుబద్ధమైన విధానాలు, విచారణ పద్ధతులు, శిక్షలు ఉండాలి. ఆ విధానాలకు, చట్టాలకు లోబడి మాత్రమే పనిచేసే క్రమశిక్షణ గల పోలీసు, మిలిటరీ వ్యవస్థ ఉండాలంటారు. అంతే తప్ప, ఆటవిక న్యాయం, అమానవీయ శిక్షలు ఆధునిక సమాజానికి సరిపోవు. అటువంటప్పుడు కొన్నిసార్లు నేరస్తులు తప్పించుకునే అవకాశం మెండుగా ఉంటుంది. అది స్వేచ్ఛా సమాజంలో, హేతుబద్ధ చట్టబద్ధ పాలనలో బతకడానికి మనిషి చెల్లించక తప్పని మూల్యం. అదే సమయంలో ఎవరు ఎవరి మీద దౌర్జన్యం చేసినా నిర్ద్వంద్వంగా ఖండించాలి. ఈ రకంగా మానవ హక్కుల అవసరం మీద, వాటిని పరిరక్షించడానికి ప్రభుత్వాన్ని అదుపు చేయాల్సిన విధానాల పట్ల ఉదార, స్వేచ్ఛా, మార్కెట్ వాదులకు స్పష్టత ఉంది.

తార్కిక వాస్తవాలు, చారిత్రక అనుభవాలు ఇలా ఉండగా; ఉగ్రవాద కమ్యూనిస్టు సంస్థలకు కొంతకాలం ప్రతినిధులుగా, మిగిలిన కాలం వత్తాసుగా ఉన్న కన్నబిరాన్, బాలగోపాల్ వంటి మేధావులు – మానవ హక్కుల గురించి ఉద్యమించడం వింతగా కనిపిస్తుంది. వారిద్దరూ విప్లవ కమ్యూనిస్టు పార్టీల భావజాల ప్రతినిధులుగా, అందుబాటులో ఉన్న చట్టాలను, చట్ట వ్యవస్థలను, రాజ్యాంగం ద్వారా కలిగిన సదుపాయాలను విప్లవకారుల ప్రయోజనార్థం వీలున్నంత వరకు ఉపయోగించడానికే శ్రమించారు. ఎంతసేపూ ప్రభుత్వం, పోలీసు చర్యలను ఎండగట్టడానికి పరిమితమయ్యారు. మావోయిస్టుల హింసను ఖండించడం తమపని కాదన్నారు. దాంతో 'వీళ్ళు విధానంలో ఏదో తేడాగా ఉంది' అని – ప్రజల అనుమానాలకు గురయ్యారు. ఆ అనుమానాలు బలపరిచేలా వారి కార్యక్రమాలూ సాగేవి.

విప్లవ పార్టీల్లో రిక్రూట్‌మెంట్‌కు పనికొచ్చే వర్గాలను అనాలోచితంగా వెనకేసుకురావడం, ఆ వర్గాల్లో వారెవరైనా నేరస్తులయితే అదివాళ్ళ తప్పుకాదు, సమాజం తప్పు అనే సూత్రీకరణలు కూడా ప్రజల అనుమానాలను బలపరచాయి. మనిషిపై మనిషి చేసే దౌర్జన్యాలను, ప్రభుత్వం జరిపే అణిచివేతను, పోలీసుల చట్టవ్యతిరేక పనులను కుల, మత, వర్గాలతో సంబంధం లేకుండా, సమాన తాత్విక, భావజాల స్థాయిలో వ్యతిరేకిస్తే – వారి మేధస్సుకు, వారి కఠోర శ్రమకు తగినంత ప్రజాదరణ ఉండేది.

13-02-2011

ప్రభుత్వం - విద్యానాశనం

వృత్తి విద్యా కళాశాలల్లో ఫీజులు చెల్లింపు సమస్య సృష్టించడంలో ఎవరి పాపం ఎంతెంత? అసలు విద్య ఒక హక్కా? ప్రాథమిక హక్కా? కాకపోతే... ఎందుకు కాదు? ప్రభుత్వ జోక్యం విద్యారంగాన్ని ఎటువైపు తీసుకుపోతోంది? ప్రాథమిక హక్కులంటే - కేవలం ధన, మాన, ప్రాణ రక్షణ హక్కులు మాత్రమే. ఎందుకంటే అవి మనిషికి సహజ స్వభావ సిద్ధంగా లభించిన హక్కులు. వాక్ స్వాతంత్ర్యం లాంటి మిగిలిన హక్కులు ప్రాథమిక హక్కుల్నుంచే ఉద్భవిస్తాయి.

ఇతరుల జేబులో చెయ్యిపెట్టి లాక్కునే హక్కులు ప్రభుత్వాలు, సోషలిస్టు మేధావులు విడివిడిగానో, కూడబలుక్కునో సృష్టించిన కృత్రిమ హక్కులే. ఇతరుల హక్కులకు భంగం కలిగించనంత కాలం మనిషి స్వేచ్ఛగా తన హక్కులను అనుభవించగలిగితేనే సమాజంలో శాంతి పరిఢవిల్లుతుంది.

విద్య, వైద్యం, కూడు, గుడ్డ, గూడు - ఇవన్నీ చెట్లకు కాయవు. గాల్లోంచి ఊడిపడవు. వాటిని ఉత్పత్తి చెయ్యడానికి ఎవరో ఒకరు డబ్బు, శ్రమ, ఆలోచన, సమయం వెచ్చిస్తే గానీ తయారుకావు. వాటికి ప్రాథమిక హక్కులని పేరు పెట్టినంత మాత్రాన వాటి స్వభావం మారదు. వాటిని అందరికీ పంచి పెట్టడానికయ్యే ఖర్చు ఎవరు భరించాలి? ప్రభుత్వమా? ప్రభుత్వం ఏదీ ఉత్పత్తి చెయ్యదు. ఏమీ సంపాదించదు. అది చేసేదల్లా తుపాకి గురిపెట్టి కొందరి దగ్గర్నుంచి నిర్భంధంగా వసూలు చేసి వేరే కొందరికి పంచిపెట్టడం మాత్రమే. అలా ప్రజల అసలైన ప్రాథమిక హక్కుల్ని హరించి, కృత్రిమ హక్కుల్ని పోషించేకొద్దీ అసంతృప్తి, అశాంతిలకు అంతం ఉండదు.

పథకాల పేరుతో డబ్బు వెదజల్లి ఓట్లు కొనుక్కోవడానికి ప్రభుత్వాలు రూపాయలు ముద్రిస్తాయి. దాంతో రూపాయి విలువ పడిపోతుంది. దాన్నే ద్రవ్యోల్బణం అంటాం. అలాగే ఓటర్లను ఆకర్షించడానికి కొత్త హక్కులను సృష్టిస్తారు. దానివల్ల అసలు సిసలు

ప్రాథమిక హక్కులైన ధన, మాన, ప్రాణ రక్షణలు విలువ కోల్పోయి ప్రాధాన్యతా క్రమంలో కిందకు నెట్టబడతాయి. ఇది హక్కులోల్బణం. అలా కృత్రిమంగా సృష్టించిన హక్కులే విద్య, ఆరోగ్యం, కూడు, గుడ్డ, గూడు, పని, ఉద్యోగం, రిజర్వేషన్లు, ఇతరులను సమ్మె చేసేలా నిర్భందించే హక్కు, ఉద్యమ క్రమంలో ఎవరినైనా తన్నే హక్కు – ఇదొక అంతులేని చాంతాడు. ఎన్నికల సమయాల్లో కొత్త హక్కులు పుట్టుకొస్తుంటాయి. వీటి కోసం ఎగబడే సమూహాల కాళ్ల కింద మనిషి ధన, మాన, ప్రాణాలు తొక్కి వేయబడతాయి. సమాజ ముఖ చిత్రమే మారిపోతుంది.

మనిషి – తన జీవితానికి, వ్యాపకానికి అవసరమైన జ్ఞానం, వృత్తి నైపుణ్యం సంపాదించడానికి డబ్బు, శ్రమ, ఏకాగ్రత, సమయం ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. విద్యార్థుల అవసరాలు, డిమాండును బట్టి పాఠ్యాంశాలు, కోర్సులు, వాటినందించే విద్యా సంస్థలు పుట్టుకొస్తాయి. ఆ విధంగా అది కేవలం ఒక మార్కెట్ మెకానిజం. గమ్యం చేరడానికి కొందరు బస్సు, కొందరు సొంత కారు ఎంచుకున్నట్టే; ఏ కోర్సు చదవాలి, ఏ కాలేజీలో చదవాలి, ఎంత ఫీజు కట్టగలం అనేది ఎవరికి వారు తీసుకోవాల్సిన నిర్ణయం.

అలాంటిది, విద్యారంగం తీవ్రమైన నిబంధనలు... నియంత్రణల చట్టంలో ఇరుక్కుపోయింది. ఏ కోర్సులు నడపాలో, ఎంత ఫీజు వసూలు చెయ్యాలో, ఏయే పాఠ్యాంశాలుండాలో, ఏ ప్రమాణాలు పాటించాలో ప్రభుత్వమే నిర్ణయిస్తోంది.

చట్ట ప్రకారం – విద్యా సంస్థల్ని వ్యక్తులు నడపకూడదు. సొసైటీ లేదా ట్రస్టులే నడపాలి. లాభార్జన ధ్యేయంగా ఉండకూడదు. అందులో వచ్చిన లాభాలు సంస్థను నిర్మించి, నిర్వహించిన వ్యక్తులు వాడుకునే స్వేచ్ఛ లేదు. ఇన్ని కృత్రిమ నిబంధనల మూలంగా– నాణ్యమైన విద్యనందించగలిగే సంస్థలు, వ్యక్తులు ఈ రంగం నుంచి దూరమయ్యారు.

ప్రభుత్వ శాఖల్ని 'మేనేజ్' చెయ్యగల పలుకుబడి కలవారు, ఎన్ని నిబంధనలున్నా లాభాలను నల్ల డబ్బు రూపంలో బయటకు తీసుకుపోగల చాకచక్యం ఉన్నవారు మాత్రమే ప్రైవేటు విద్యారంగాన్ని శాసిస్తున్నారు. దీనికి తోడు – ఉన్నత విద్యారంగాన్ని దాదాపు పూర్తి ఉచితంగా తయారుచేయడంతో; లక్షల కొద్దీ గ్రాడ్యుయేట్లు, పోస్టు గ్రాడ్యుయేట్లు, డాక్టరేట్లు తయారవుతున్నారు. మార్కెట్‌లో డిమాండు ఉన్న పనులు వేరు, ఈ విద్యాధికులు నేర్చుకున్నది వేరు. నాణ్యతలేని విద్య, ఏ వృత్తికీ, (కనీసం వ్యక్తిత్వ వికాసానికి) కూడా పనికిరాని డిగ్రీలు పట్టుకుని లక్షలాది మంది యువత రోడ్ల వెంట తిరుగుతున్నారు. ఉద్యోగాలు కావాలని ఉద్యమిస్తున్నారు. మరోవైపు ఉన్న పనులు చెయ్యడానికి కావలసిన నైపుణ్యం గల అభ్యర్థులు దొరక్క వివిధ రంగాల్లో ఉత్పత్తి కుంటుపడుతోంది.

గత ఎన్నికల సమయానికి సమాజాన్ని వర్గాలుగా ముక్కలు చేసి; ఒక్కో ముక్కకూ ఒక్కో ఉచిత తాయిలం పంచిపెట్టారు. లక్షల సంఖ్యలో ఉన్న వృత్తి కోర్సుల విద్యార్థుల మీద కన్నుపడింది. వారు, వారి కుటుంబ సభ్యుల్ని కలిపితే. అబ్బో ఎన్ని లక్షల ఓట్లో!

ఇంకేముంది? ఇంకో 'కృత్రిమ హక్కు' సృష్టించబడింది. వృత్తి విద్యా కోర్సుల ఫీజులను తమ ప్రభుత్వం చెల్లింస్తుందని గాలం విసిరారు. చేప పడింది. దీనిక్కావల్సిన డబ్బు ఎవరి దగ్గర్నుంచి దోచుకొస్తారనే స్పృహను మెజారిటీ ఓటర్లు ఎప్పుడో కోల్పోయారు. తీరా బిల్లు చేతికొచ్చేసరికి... సర్కారుకు ముచ్చెమటలు పడుతున్నాయి. ఇప్పటికే పన్నుల వ్యవస్థ ఇంకా పిండితే రక్తం తప్ప, పాలు రాని స్థాయికి చేరుకుంది. ఓట్ల కోసం అనైతిక, అసంబద్ధ వాగ్దానాలు చేశామని ఒప్పుకోనూ లేరు; డబ్బు కట్టనూ లేరు. ఎలాగూ ఉచితమే కదాని; ఉన్న పనులు వదులుకుని, అవసరం, అభిరుచి ఉన్నా, లేకున్నా లక్షలాది మంది వృత్తి విద్యా కోర్సుల్లో చేరారు. సర్కారు కట్టే ఫీజులతో ఎంచక్కా లాభాలు గడించొచ్చని కళాశాల యాజమానులూ ఆశపడ్డారు. ప్రజల సొమ్ముతో ఉచితంగా ఓట్లు దండుకున్నాం కదాని పాలకులూ సంబరపడ్డారు.

చివరకు బుడగ పేలింది.

కొన్నేళ్ల కిందట – విజయవాడలో సప్తగిరి అనే మోసపూరిత సంస్థ ఒక వినూత్న ప్రక్రియను ఎంచుకుంది. వందరూపాయలకు ప్రెషర్‌కుక్కర్, వెయ్యి రూపాయలకు ఫ్రిజ్, సగం ధరకే బంగారం ఇస్తామని ప్రచారం చేసింది. మెలికేమిటంటే... డబ్బు కట్టిన కొన్ని రోజుల తర్వాత గానీ వస్తువులివ్వరు. మొదట్లో డబ్బు కట్టిన వాళ్లకు చెప్పిన మాట ప్రకారం వస్తువులిచ్చారు. ఇంకేముంది; జనం ఎగబడ్డారు. క్యూలో నిలబడి మరీ డబ్బు కట్టారు. చూస్తుండగానే లక్షలు, కోట్లు పోగయ్యాయి. అందరికీ తెలుసు, ఏదో ఒకరోజు గుడారం ఎత్తేస్తారని, ఎత్తేయక తప్పదనీ. ఎవరికి వాళ్లు తమ వంతు దాకా వస్తువులొస్తే చాలనుకున్నారు. అనుకున్నట్లే ఒక రాత్రికి రాత్రి సప్తగిరి నిర్వాహకులు చాప చుట్టేసి పరారయ్యారు. మిగిలిపోయిన వాళ్లు లబో దిబోమన్నారు. పచ్చిమోసమన్నారు. వస్తువులు పొందిన వాళ్లు మాత్రం గప్‌చిప్‌గా ఉండిపోయారు.

ఇతరుల సొమ్ముతో అన్నీ ఉచితంగా ఇస్తామని అనైతిక, మోసపూరిత, వాగ్దానాలతో ఓట్లు కొనుక్కుని ఎన్నికల్లో నెగ్గిన ప్రభుత్వానికి, సప్తగిరి సంస్థకు తేడా ఏమన్నా ఉందా? మూతపడుతున్న ఒక సప్తగిరిని ఆక్షేపిస్తూ దీక్షలు చేస్తున్న నాయక పుత్రులు కూడా – రాబోయే 'ఇంకో సప్తగిరే' నన్న స్పృహ మెజారిటీ ఓటర్లకు ఎప్పటికైనా కలుగుతుందా?

20-02-2011

మార్క్స్, ఏంగెల్స్, దేవతా వస్త్రాలు

గత వంద, నూటయాభై సంవత్సరాలుగా- ప్రపంచవ్యాప్తంగా సోషలిస్టుల పరమ గురువులు - మార్క్స్, ఏంగెల్స్ కలిసి ప్రచురించిన కమ్యూనిస్టు మేనిఫెస్టో (1848), 'దాస్ కాపిటల్' (1867) సోషలిస్టులకు పవిత్ర గ్రంథాలు. సోషలిస్టు మేధావులు ఈ రచనలకు రకరకాల భాష్యాలు రాశారు. అలాగే మార్క్స్ ఆలోచనలు, విశ్లేషణలు, తాత్విక, ఆర్థిక, రాజకీయ, భావజాల ప్రతిపాదనలపై చాలా విమర్శనాత్మక వ్యాసాలు, రచనలూ వెలువడ్డాయి. కానీ అప్పట్లో అవి సమకాలీన రాజకీయ, ఆర్థిక విధానాలపై తగినంత ప్రభావం చూపలేకపోయాయి. దానిక్కూడా కారణాలున్నా యనుకోండి. మార్క్స్,ఏంగెల్సులు ప్రవచించిన ప్రధాన సిద్ధాంతాల్లోని వైరుధ్యాలు, ఊహలు, అవాస్తవాలను విశ్లేషిద్దాం ....

సమాజాన్ని అర్థం చేసుకోడానికి మార్క్స్ ఎంచుకున్న తాత్విక విధానం గతితార్కిక భౌతికవాదం...; ఎర్ర సిరాతో గోడల మీద రాసిన నినాదాలు ఎక్కడో ఒకచోట చూసే ఉంటారు. ఇందులో భౌతికవాదం అంటే ఏమిటి ? మార్క్స్ దృష్టిలో - మనిషి శరీరానికి, మస్తిష్కానికి గల సంబంధం భౌతికమైనది. ఆ వాదం ప్రకారం; మనిషి ఆలోచనలు, ఐడియాలు మెదడు నుంచి భౌతికంగా స్రవిస్తాయట. అవి పరిస్థితులపై ఆధారపడి ఉంటాయట. కానీ ఒకే పరిస్థితులు ఇద్దరు వ్యక్తుల్లో వేర్వేరు ఆలోచనలు కలిగిస్తాయే! మరి అదెలా సాధ్యం?

సమాధానం దొరకదు.

అలాగే - భౌతిక ఉత్పత్తి శక్తులే అన్నిటికీ పునాది అంటాడు. ఈ శక్తులేమిటో ఆయన నిర్వచించలేదు. కానీ భౌతిక ఉత్పత్తి శక్తులంటే యంత్రాలు, యంత్ర సామాగ్రి అని అప్పటి, ఇప్పటి మేధావులు అర్థం చేసుకున్నారు. (ఉత్పత్తి శక్తులంటే సహజవనరులు కావు.) ఆ ఉత్పత్తి శక్తులు ఉత్పత్తి సంబంధాలను నిర్దేశిస్తాయట. ఉత్పత్తి సంబంధాలంటే

భూస్వామి – బానిస, యజమాని – కార్మికుడు లాంటి సంబంధాలు. ఆ ఉత్పత్తి సంబంధాల మీద మిగిలిన సమాజ నిర్మాణం – ప్రభుత్వం.... కళలు, విరామం... రాజకీయం... ఇత్యాది – ఆధారపడి ఉంటుందట. భౌతిక ఉత్పత్తి శక్తులే మనిషి ఆలోచనలను నిర్దేశిస్తాయట. అంటే – ఒక కాలంలో ఉన్న యాంత్రీకరణ స్థాయిని బట్టి, అంటే టెక్నాలజీని బట్టి మనిషి ఆలోచనలు ఉంటాయట. కానీ యంత్రాలు, టెక్నాలజీలు ఎక్కడ్నుంచి వచ్చాయి? ఆకాశం నుంచి ఊడి పడ్డాయా? అవి మనిషి ఆలోచనలు, ఐడియాల్లోంచి వచ్చినవే కదా! మనిషి సృష్టించిన, నిర్మించిన యంత్రాలు మనిషి ఆలోచనలను ఎలా నిర్దేశిస్తాయి?

సమాధానం దొరకదు.

మనిషి తాత్వికత (సృష్టి, సమాజం, ఇతరుల గురించి ఆలోచించే పద్ధతి) తన 'వర్గం' మీద, వర్గ 'ప్రయోజనాల' మీద ఆధారపడి ఉంటుందట. ఏ మనిషి ఆలోచనా– నిజమైన సత్యం కాదట. అది తన వర్గం వరకు మాత్రమే సత్యమట. కార్మికవర్గ ఆలోచన మాత్రమే నిజమైన నిజమట. ఆలోచనలు, ఐడియాలు మనిషికి తనంతట తాముగా రావట. వర్గ ప్రయోజనాలను బట్టే వస్తాయట. ఇంతకూ మార్క్స్, ఏంగెల్సు కార్మిక వర్గం నుంచి వచ్చిన వారేమీ కాదు.

ఏంగెల్స్‌ది సంపన్నవర్గం. మార్క్స్ తండ్రి ఉన్నతాదాయ వర్గ వకీలు. ఆయన భార్య ఉన్నత వంశస్తురాలు. బావమరిది జర్మన్ పోలీసు శాఖాధిపతి. తానై డబ్బేమీ సంపాదించలేదు. ఆ విషయంలో దాదాపుగా ఏంగెల్సు మీద ఆధారపడేవాడు. మరి ధనిక, కులీన వర్గాలకు చెందిన వీరిద్దరూ కార్మిక వర్గ ఆలోచనలను ఎలా ప్రతిబింబించ గలరు? అందుకు ఒక సవరణ ఇచ్చారు... "సమయం వచ్చినపుడు కొందరు బూర్జువా వర్గ సభ్యులు కూడా కార్మికవర్గంలో చేరతార"ని సూత్రీకరించారు. ఈ ఇద్దరూ మారగలిగినప్పుడు, ఇంకా కొందరు, మరికొందరు తమ వర్గ స్వభావానికి, ప్రయోజనాలకు భిన్నంగా ఎందుకు ఆలోచించలేరు? మరి వర్గం, వర్గ ప్రయోజనాలే ఆలోచనలను నిర్దేశిస్తాయనడం సార్వత్రిక సత్యం కాజాలదు కదా!

సమాధానం దొరకదు.

కమ్యూనిస్టు మేనిఫెస్టోలో ముఖ్యమైన విషయం వర్గం, వర్గ స్వభావం... వర్గ ప్రయోజనాలు... వర్గ సంఘర్షణ... ఇత్యాదులు. కానీ ఎక్కడా వర్గమంటే ఏమిటో చెప్పలేదు. నిజానికి వర్గాలంటూ ఏవీ గిరిగీసి, స్థిరంగా ఉండవు. అవి ఆ సమయానికి మన సులువుకోసం ఏర్పరచుకున్న తరగతులు(కేటగిరీలు) మాత్రమే. మనిషి ఆలోచనల్ని వర్గం చట్రంలో బంధించగలమా? అదీగాక మెజారిటీ మనుషులు ఒకే వర్గంలో జీవితాంతం ఉండిపోరు కదా!

1865 లో మొదటి కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ జరిగింది. అందులో మార్క్స్ ఒక కరపత్రం చదివాడు. దాని సారాంశమేమిటంటే – అప్పట్లో ఉన్న యూనియన్లు జీతభత్యాలు పెంపుకోసం, ఇతర సౌకర్యాల కోసం చేస్తున్న ఉద్యమాలు తప్పు అని; అవి విప్లవానికి ఉపయోగపడవని. ప్రభుత్వాలు సంక్షేమ పథకాల పేరుతో విసిరే రొట్టె ముక్కలకు ఆశపడి ఉద్యమాలు చేయడం శుద్ధ దండగ అనీ; అలా చేయడం ద్వారా కార్మిక వర్గం విప్లవ ఆగమనాన్ని ఆలస్యం చేస్తుందనీ సెలవిచ్చాడు. ఈ రకంగా కార్మికవర్గం, కార్మిక వర్గ తత్త్వవేత్త కార్మిక వర్గ 'ప్రయోజనాల' విషయంలో భేదాభిప్రాయపడ్డారు. మార్క్స్ సూత్రాల ప్రకారం – వ్యక్తి తప్పుడు ఆలోచనా విధానానికి లోను కావచ్చు. కానీ ఒక వర్గం ఎప్పుడూ ఏక మొత్తంగా తప్పుడు ఆలోచన చెయ్యదు. మరి యూనియన్ల కర్తవ్యాలు, ఎజెండా విషయంలో మార్క్స్ ఆలోచన తప్పా? లేక కార్మిక వర్గ యూనియన్లది తప్పా?

సమాధానం దొరకదు.

సిద్ధాంతకర్తగా – మార్క్స్ మహావైఫల్యం ఇంకోటుంది. తన సూత్రం ప్రకారం కార్మికులకు పెట్టుబడిదారులు జీతాలను వీలైనంత తక్కువ ఇస్తారట. ఎంత తక్కువంటే, చావకుండా బ్రతికి, తమ పిల్లలను కూడా కార్మికులుగా తయారుచేయడానికి అవసరమైన మేరకు మాత్రమే ఇస్తారట. దీన్నే జీతభత్యాల లోహ సూత్రం (ఐరన్ లా ఆఫ్ వేజెస్) అంటాడు. మళ్ళీ తానే – పెట్టుబడిదారీ విధానంలో కార్మికులు ఇంకా ఇంకా పేదరికంలోకి నెట్టబడి చివరకు తిరగబడతారంటాడు. మరి బ్రతికుండగలిగే జీతాలతో ఎదుగుబొదుగూ లేకుండా గడిపే కార్మికులు ఇంకా నెట్టబడగలిగిన పేదరికం, సంక్షోభం ఏముంది? సమాధానం దొరకదు.

ఇకపోతే; గతి తార్కికం. ఇదంత సులువుగా కొరుకుడుపడే విషయం కాదు. సరళంగా చెప్పాలంటే ఒక ఆలోచన ఇంకో ఆలోచనకు దారి తీస్తుందట. ఈ రెండు ఆలోచనలూ సంఘర్షించి మూడో ఆలోచనకు పురుడు పోస్తాయట. ఇది హెగెల్ అనే జర్మన్ తత్వవేత్త ప్రతిపాదించిన చారిత్రక పరిణామ క్రమం. మార్క్స్ దానికిచ్చిన అన్వయింపు ప్రకారం; పూర్వకాలంలో, అంటే నాగరికత మొదలైన రోజుల్లో ఉత్పత్తి సాధనాలు, పనిముట్లు, వ్యక్తి చేతుల్లో ఉండేవట. అంటే ఎవరి పొలం వారిది; ఎవరి కాడెద్దు, నాగలి వారిది. పెట్టుబడిదారి యుగంలో ఉత్పత్తి సాధనాలన్నీ (అంటే యంత్రాలు, ఫ్యాక్టరీలు, వగైరా) యజమాని చేతుల్లో ఉన్నాయట. అప్పటిదాకా స్వతంత్రంగా ఉన్న వ్యక్తి కార్మికుడుగా, జీతానికి పనిచేసే బానిసగా మిగిలిపోయాట్ట. అంటే తాను చేసే ఉత్పత్తిపై హక్కేమీ లేకుండా పోయిందట. ఇక వచ్చే సోషలిస్టు సమాజంలో ఉత్పత్తి సాధనాలన్నీ సమాజం ఉమ్మడి ఆధీనంలో ఉంటాయట. దాంతో చరిత్ర పరిసమాప్తమవుతుందట.

దాంతో మానవ సమాజ పరిణామం ఆగిపోతుందట. ఇది అనివార్యమట. అదొక సహజపరిణామ క్రమమట. దాన్ని వేగవంతమూ చెయ్యలేము, ఆపలేము కూడానట. (అరచేతిని అడ్డంపెట్టి సూర్యోదయాన్ని ఆపలేరనే నినాదాలు ఈ ఆలోచనల్లోంచే) పెట్టుబడిదారి విధానం - పండులా పరిపక్వమై, పగిలిపోయి విప్లవం ద్వారా సోషలిస్టు సమాజం ఏర్పడుతుందట. ఆ సోషలిస్టు స్వర్గంలో, మనిషిలో దాగి ఉన్న శక్తులన్నీ బయటికొచ్చి మనిషి ధన్యుడవుతాడట.

వినడానికి బాగానే ఉన్నా, కొన్ని ప్రశ్నలు ఉదయించక మానవు. పెట్టుబడిదారి విధానం పెరిగి, పెద్దదై, పరిపక్వతకు చేరుకున్నాకే కదా - విప్లవం సాధ్యం! మరి విప్లవాన్ని కాంక్షించేవారంతా కేపిటలిజం వృద్ధి చెంది త్వరగా పరిపక్వ దశకు చేరడానికే ప్రయత్నించాలిగా! దాన్ని వ్యతిరేకించకూడదు కదా! రెండోది, నిజానికి పరిపక్వ కేపిటలిజానికి దగ్గరగా ఉన్న అమెరికా, ఇంగ్లాండులాంటి దేశాలు విప్లవానికి ఏ మాత్రం దగ్గరకాలేదు. కానీ అప్పటికి ప్రధానంగా వ్యవసాయ దేశాలై, కేపిటలిజం వేళ్ళూనుకోని రష్యా, చైనాల్లో విప్లవం వచ్చేసింది, వెళ్ళిపోయింది కూడా! మరి గతితార్కిక పరిణామ క్రమ సిద్ధాంతం ఎటుపోయినట్టు?

సమాధానం దొరకదు.

అదీకాక వేటాడుకొని బతికే పూర్వ యుగాల్నుంచి మనిషిని ఇంతదూరం రమ్మని ఎవరు బలవంతం చేశారు? ఏ సహజ శక్తులు ముందుకు నడిపాయి?

27-02-2011

ఎవరి శ్రమ ఎవరు దోస్తున్నారు?

నూటయాభై సంవత్సరాల క్రితం మార్క్స్, ఏంగెల్స్ ప్రతిపాదించిన సిద్ధాంతాల్లో ఎన్నో అంతర్గత వైరుధ్యాలు, కాల్పనికాలు ఉన్నాయి. వారికాలంలోనే ఎంతోమంది ఆ వైరుధ్యాలను ఎత్తి చూపారు. కానీ సోషలిస్టు గురుద్వయం వారి జీవిత కాలంలో ఆ చిక్కుముడులను విడదీయ లేదు. ఆ తర్వాత కూడా అవి విడలేదు. అవే వైరుధ్యాలు, అవే కాల్పనిక వాదాలు ఈనాటికి కమ్యూనిస్టు, సోషలిస్టు పార్టీల్లోనూ, మేధావుల్లోనూ గమనిస్తూనే ఉంటాం.

మార్క్స్, ఏంగెల్స్ చేతుల మీదుగా 1848 లో కమ్యూనిస్టు మేనిఫెస్టో వెలువడింది. దాని ప్రకారం విప్లవం కనుచూపు మేరలోనే ఉందన్నారు. ఆర్థిక, సామాజిక విషయాల్లో ప్రభుత్వ జోక్యం ద్వారా విప్లవాన్ని వేగిరపరచొచ్చన్నారు. కానీ 1859 కల్లా సిద్ధాంతం మారిపోయింది. సంస్కరణవాదాన్ని త్యజించారు. చట్టసభల ద్వారా విప్లవం రాదన్నారు. రాత్రికి రాత్రే మార్పులు జరగాలన్నారు. ఇది ఒక దశాబ్ద కాలంలోనే మూల సిద్ధాంతంలో తెచ్చిన సవరణ.

అలాగే, ప్రజాస్వామ్య పార్టీలు చేపట్టే సంస్కరణ, సంక్షేమ కార్యక్రమాలు– కమ్యూనిస్టులకు 'పెటీబూర్జువా ఎత్తుగడలు'గా కనబడుతుంటాయి. విప్లవకారులు, సామాజిక శాస్త్రవేత్తలు, సోషలిస్టు మేధావులు – తాము సమాజం ఆశించిన రీతిలో సమాజం ఉండాలనుకుంటారు. తాము సృష్టించిన మార్గంలోనే నడవాలనుకుంటారు. అదీ తమ జీవిత కాలంలోనే చూడాలనే తొందర కూడా వారిలో కనబడుతుంది.

మనిషికి తన జీవితాన్ని నిర్మించుకుని, నిర్దేశించుకునే హక్కు ఉందని వారనుకోరు. అందరూ ప్రణాళికబద్ధంగా నడవాలనుకుంటారు. ఆ ప్రణాళిక తామే తయారు చేస్తామంటారు. నిజానికి ఏ మనిషైనా తన జీవితాన్ని ఒక ప్రణాళిక ప్రకారం నిర్మించుకోవాలి. కానీ ఎవరి ప్రణాళిక? వ్యక్తి ప్రణాళికా? మేధావులు రచించిన ప్రణాళికా?

అన్న విషయంలోనే ఇబ్బంది. సోషలిస్టు ప్రభుత్వం వచ్చినా, అందులో ఈ మేధావులకు పేరుపేరునా పెద్దపీట వెయ్యకపోతే అదసలు సోషలిస్టు ప్రభుత్వమే కాదు పొమ్మంటారు. సమకాలీన రాజకీయాల్లో దాయాది కమ్యూనిస్టు పార్టీల మధ్య జరిగే విన్యాసాలు కళ్ళముందు కదలాడడం లేదా!?

మార్క్స్ చెప్పిన 'శాస్త్రీయ' సోషలిస్టు సిద్ధాంతం ప్రకారం - మనిషి తన వర్గ ప్రయోజనాలను బట్టే ఆలోచిస్తాడన్నారు. మరి కార్మిక వర్గంలోనే అంతర్గతంగా తీవ్రమైన అభిప్రాయ భేదాలెందుకు వస్తాయి? బోల్షెవిక్కులకు, మెన్షెవిక్కులకు జరిగిన సైద్ధాంతిక పోరాటంలో నెత్తుటి మడుగుల సాక్షిగా బోల్షెవిక్కులు విజయం సాధించారు. లెనిన్ దృష్టిలో కార్ల్ కౌట్స్కీ విప్లవ ద్రోహి. స్టాలిన్ దృష్టిలో ట్రాట్స్కీ ద్రోహి. పార్టీ బహిష్కరణలు, సైద్ధాంతిక వర్గాల మధ్య హింసాత్మక పోరాటాలు మార్క్సిజం తాత్వికతలో తప్పని పరిమాణాలు. వర్గప్రయోజనాల చట్రంలో మాత్రమే ఆలోచించగలిగినపుడు ఇన్ని తీవ్రమైన అభిప్రాయభేదాలెందుకు వస్తాయి?

ఈ ప్రశ్నలకు సమాధానం దొరకదు.

పారిశ్రామిక విప్లవం గురించి మార్క్స్ ఆలోచనలు - మూఢత్వాన్ని, అపరిపక్వతను సూచిస్తాయి. మధ్యయుగాల్లో భూస్వామ్య వ్యవస్థ, వారి క్రింద బానిసత్వం, వెట్టిచాకిరి ఉండేవి. సాంస్కృతిక పునరుజ్జీవనంలో భాగంగా తాత్విక, సామాజిక, రాజకీయ రంగాల్లో ఉదారవాద ఉద్యమాలు వచ్చాయి. చట్టం ముందు అందరూ సమానులేనని..., బానిసత్వం అమానవీయమైనదని..., అందరికీ స్వేచ్ఛ ఉండాలని సభ్యత గల సమాజాలన్నీ అంగీకరించే స్థితి వచ్చింది. దాని ఫలితంగా వెట్టి రైతులు, బానిసలు విముక్తులయ్యారు. అలా విడుదలైన శ్రేణులు అప్పుడప్పుడే విస్తరిస్తున్న పారిశ్రామిక రంగంలో పెద్ద ఎత్తున చేరారు. దీనికి మార్క్స్ ఇచ్చిన భాష్యం ఇంకోలా ఉంది. భూస్వామ్య సమాజంలో బానిసలు పనిచేసినా, చెయ్యకపోయినా, వారి బాగోగులు చూసే బాధ్యత భూస్వామికి ఉండేదట. కానీ కాపిటలిజంలో కార్మికుడు పనిచేస్తేనే జీతం, చెయ్యనినాడు ఏమీ లేదట. కాబట్టి బానిసత్వపు రద్దు చట్టాలు - తమలాభం కోసం బూర్జువా వర్గాలు తాము తెచ్చుకున్న సంస్కరణలు మాత్రమేనట! హాస్యాస్పదంగా లేదూ? అదే ఆలోచనా సరళిలో పారిశ్రామిక విప్లవాన్ని, ఆ క్రమంలో వచ్చిన పెట్టుబడిదారీ వ్యవస్థ సోషలిస్టు విప్లవానికి అవసరమైన ఆఖరు మెట్టుగా అభివర్ణించాడు.

కాపిటలిజంలో కార్మికుని శ్రమలో కొంత భాగం యజమాని దోచేస్తాడట. దానివల్ల కార్మికుల ఖర్చుపెట్టే శక్తి, వినియోగశక్తి క్షీణిస్తాయట. దానివల్లే ఆర్థిక మాంద్యాలు వస్తాయట. ఈ రకంగా ఆర్థిక మాంద్యాలనేవి కాపిటలిజం యొక్క సహజపరిణామాలట.

ఆర్థిక మాంద్యాలు కాపిటలిజం సహజ లక్షణాలైతే, ఎప్పుడూ మాంద్యమే ఉండాలి కదా! ప్రతి పది, పదిహేనేళ్ళకొకసారే ఎందుకొస్తుంది? నిజానికి బూమ్‌లు, తర్వాత మాంద్యాలు వచ్చేవి 'అదనపు శ్రమ దోపిడీ' నుండి కాదు, ప్రభుత్వాల దుర్మార్గపు ద్రవ్య విధానాల వల్ల – నోట్లు ముద్రించడం, బ్యాంకు రుణాల రూపంలో గాల్లోంచి డబ్బును సృష్టించడం లాంటి వాటివల్ల – వస్తాయని నిర్ద్వంద్వంగా నిరూపించబడింది. ఇకపోతే, అదనపు శ్రమ సిద్ధాంతాన్ని నమ్మే వారందరికీ తట్టని, పట్టని విషయమొకటుంది. చూడ్డానికి క్లిష్టంగా అనిపించినా, కొద్దిగా ఆలోచిస్తే బోధపడుతుంది. అదేమిటంటే – ఉత్పత్తి అనేది సరళమైన పద్ధతి నుంచి; పని విభజన, ప్రావీణ్యత (స్పెషలైజేషన్)ల ద్వారా సంక్లిష్ట పద్ధతిలోకి ఎలా, ఎందుకు మారుతుంది అనేది.

ఉదాహరణకు వ్యవసాయాన్నే తీసుకుందాం. దున్నకుండా విత్తనాలు చల్లడం సరళమైన ఆదిమ పద్ధతి. అది ఎవరైనా చెయ్యగలరు. ప్రావీణ్యత అవసరంలేదు. తరువాతి దశ – ఎడ్లు, నాగలి వ్యవసాయం. కొంచెం క్లిష్టమైనది. ఎడ్లు మేపేవారు ఒకరు, నాగలి చెక్కేవారింకొకరు, దుక్కిదున్నేవారు మరొకరు, ఎడ్లకు జబ్బు చేస్తే వైద్యం చేసేది వేరొకరు. ఈ రకంగా పని విభజన జరుగుతుంది. అందరూ అన్ని పనులు చెయ్యలేరు. ఎవరి పనిలో వారు ప్రావీణ్యులు.

అదే ట్రాక్టర్ వ్యవసాయం – ఇంకా సంక్లిష్టమైన పద్ధతి. వ్యవసాయం చేసేది ఒకరైతే, ట్రాక్టరు తయారుచేసేది ఒకరు, రిపేరు చేసేవారు వేరే, డీజిలు తయారుచేసేది ఒకరు – ఇలా ట్రాక్టరు వ్యవసాయంలో ఎంతమంది చేతులుపడ్డాయో రైతుకు తెలియదు, తెలియాల్సిన అవసరమూ లేదు. ఎవరి పని వాళ్ళు ప్రావీణ్యతతో చేసుకుపోతారు. ఉత్పత్తి క్రమం ఎంత సంక్లిష్టమయితే ఉత్పాదకత (Productivity) అంత పెరుగుతుంది.

కానీ సంక్లిష్టం ఎలా అవుతుంది? దానికి యంత్రాలు, పనిముట్లు కావాలి. వాటికి డబ్బు కావాలి. అందుకు పొదుపు చేసి, మదుపు (invest) చెయ్యాలి. శ్రమ ద్వారా సృష్టించిన సంపదంతా తినేసి కూర్చుంటే ఇంకా అడవుల్లోనే ఉండేవాళ్ళం. కొన్ని వేల సంవత్సరాలుగా మన పూర్వీకులు పొదుపు చేసి సృష్టించిన సంపద – యంత్రాలు, పరిజ్ఞానం, రోడ్లు, చెరువులు, ప్రకాశం బ్యారేజీ, నిజాంసాగర్ – ఫలితాలను మానవాళి నేడు అనుభవిస్తోంది.

ఇసుక రేణువు నుంచి తయారయ్యే కంప్యూటర్ చిప్స్... కృష్ణదేవరాయల కాలంలో ఎందుకు రాలేదు? ఆ రోజుల్లో ఇసుక రేణువులు లేవనా? కాదు తయారు చెయ్యడానికి అవసరమయ్యే రీసెర్చి ఫలితాలు, యంత్రాలు లేవు గనుక. అవన్నీ ఇప్పుడు ఎక్కడ్నుంచి వచ్చాయి? మన పూర్వీకులు కష్టపడి, సంపాదించి, కొంత పొదుపు చేసి, పనికొచ్చే పనులను ఆ పొదుపు చేసిన డబ్బు సహాయంతో చేయడం వల్ల వచ్చాయి.

ఈ పొదుపు, మదుపుల ద్వారానే పారిశ్రామిక యుగం సాధ్యమైంది. ఉత్పత్తిని, ఉత్పాదకతను అనూహ్యంగా పెంచింది. ఇంత జనాభాను పోషిస్తోంది. 1700 సంవత్సరంలో ఇంగ్లండు జనాభా 55 లక్షలు. 1940 కల్లా అది ఆరుకోట్లు అయింది. ప్రతి ఎనిమిది మందిలోనూ ఏడుగురు కేవలం పారిశ్రామిక విప్లవ ఫలాల వల్లే జీవించి ఉన్నారనేది ఒక లెక్క. ఎవరైనా తాను ఆ ఏడుగురిలో ఒకరుకాదని, ఎనిమిదోవాణ్ణని, పారిశ్రామిక విప్లవం వచ్చినా, లేకపోయినా ఇలాగే ఉండగలిగే వాణ్ణని చెప్పగలరా?

అదనపు శ్రమ అనేది ఒక భ్రమ. ఇద్దరు వ్యక్తులు స్వచ్ఛందంగా ఒప్పుకున్న ప్రకారం ఒకరు వస్తువులో, సేవలో అందిస్తే ఇంకొకరు దానికి డబ్బు చెల్లిస్తే అది దోపిడీ అనడం అర్థరహితం. ఆ ఇద్దర్లో ఎవరో ఒకరికి ఒప్పుకోక తప్పని అసహాయత ఉండవచ్చు గాక. అది కార్మికుడిదీ కావచ్చు. కొన్నిసార్లు యాజమాని అసహాయతా కావచ్చు. మండుటెండలో బాలింతరాలు రిక్షాఎక్కి ఇస్తానన్న డబ్బుఇస్తే ఎవరి అదనపు శ్రమ ఎవరు దోచినట్టు? మార్కెట్‌లో టమాటాలు నిన్న కిలో ముప్పైకి, ఇవాళ మూడు రూపాయలకు కొంటే ఎవరి శ్రమ ఎవరు దోచినట్టు? చేస్తున్న ప్రాజెక్టు అర్ధాంతరంగా వదిలేసి, అమెరికాలో ఇంకా మెరుగైన ఉద్యోగానికెళ్ళే సాఫ్ట్‌వేర్ ఇంజనీరు అదనపు శ్రమ ఎవరికి పోయినట్టు? అనాలోచితంగా నిర్మించి, అమ్ముడుపోని ఫ్లాట్ల పై అంతస్తు నుంచి దూకేసిన బిల్డరు ఎవరి శ్రమను దోచినట్లు?

06-03-2011

సోషలిజం మత్తుమందు

మనిషి ఉత్పత్తి పరంగా సాధించిన విజయాల్లో ఎక్కడా మార్క్సిజం ప్రభావం కనపడదు. దాని ప్రభావం ఏమన్నా ఉంటే అది పంచిపెట్టడంలో మాత్రమే ఉంది. ఉత్పత్తి లేకుండా ఏం పంచిపెడతారు? మరి ఇంత ఉత్పత్తికి కారణమైన కాపిటలిజమంటే ఇంతమందికి ఎందుకు మంట? ఎందుకంత కసి?

కాపిటలిస్టు వ్యవస్థలో – వినియోగదారుడు కోరుకునే ప్రతిభ కలవాళ్లు మాత్రమే రాణిస్తారు. మిగిలినవాళ్లను వ్యవస్థ పక్కకు విసిరేస్తుంది. వంశాన్నిబట్టో, మతాలను బట్టో, చర్మం రంగునుబట్టో, చదువుకున్న డిగ్రీలను బట్టో రాణింపు ఉండదు. అలా రాణించలేని వారు అభద్రతకు గురవుతారు. ఆలోచనలు చేదుబారతాయి. మార్కెట్ కోరుకునే నైపుణ్యత గానీ, కౌశలం గానీ, కనీసం కష్టపడే మనస్తత్వం గానీ తమ దగ్గరలేవని అంగీకరించలేరు. వాళ్ల కసి సమాజం మీద చూపిస్తారు. తనకు లేనిది వేరే ఎవరికీ ఉండకూడదనే అసూయ, ద్వేషం నిలువునా దహిస్తాయి. ఆ మంటల్లోకి మొత్తం సమాజాన్నే నెట్టడానికి ప్రయత్నిస్తారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి, రాణించిన వాళ్లలో లోపాలు వెతుకుతారు. డబ్బులో అమానవీయత కనబడుతుంది. స్వచ్ఛందంగా ఇచ్చిపుచ్చుకునే మార్కెట్ ప్రక్రియల్లో వారికి అన్యాయం కనబడుతుంది. ప్రతిభ ఉన్నా, లేకున్నా అందరూ ఒకే విధంగా బతికే సమాజం కావాలని నినదిస్తారు. అలాంటి వారంతా పోగై ఉద్యమాలు నిర్మిస్తారు. అది మనిషి ప్రవృత్తికి సహజమో, అసహజమో; సమాజానికి మంచిదో, కాదో; నైతికంగా తప్పో, ఒప్పో వీరికి పట్టదు.

ఏ దేశంలోనైనా, ఏ కాలంలోనైనా ఉన్నవి కొద్దిపాటి (Limited) వనరులు. వీటితో వినియోగదారుల అపరిమితమైన కోరికల్లో వేటిని తీర్చాలి? దాన్ని ఎవరు, ఎలా నిర్ణయించాలి?

ఇదీ ఆర్థిక శాస్త్రంలో ముఖ్యమైన ప్రశ్న. కాపిటలిజమైనా, కమ్యూనిజమైనా ఈ ప్రశ్నకు సమాధానం వెతక్క తప్పదు. కాపిటలిజంలో జవాబు మార్కెట్ చెబుతుంది. ధరల వ్యవస్థ ద్వారా ఎవరు ఏది పొందగలరో నిర్ణయిస్తుంది. ఉదాహరణకు జేబులో డబ్బులు, మనసులోని కోరికలు, వాటికి ఎంత చెల్లించడానికి సిద్ధమో – వీటిని బట్టి ఆరోజుకు ఎవరు ఆకుకూర తింటారో, ఎవరు కోడికూర తింటారో నిర్ణయమవుతుంది. మరి కమ్యూనిజంలో? మార్క్స్ అభిప్రాయం ప్రకారం అదేం కష్టం కాదట. ఒకసారి సోషలిజమొస్తే అన్నీ సర్దుకుంటాయట. అన్నీ అవసరాలూ తీరతాయట. ఎలా తీరతాయో చెప్పదు.

సోషలిస్టు రాజ్యంలో ఎవరేం చేస్తారో ఎలా నిర్ణయిస్తారు? దానికి ప్రాతిపదిక ఏమిటి? ఈ ప్రశ్నలను మార్క్స్ దాటవేశాడు. మరి ఎవరేం ఉత్పత్తి చెయ్యాలో? ఎలా ఉత్పత్తి చెయ్యాలో? (దుక్కి దున్నాలా, లేక ఊరికే విత్తనాలు చల్లాలా?) ఎవరు ఎలా నిర్ణయించాలి?

సమాధానం దొరకదు.

మార్క్సిస్టు సిద్ధాంతం కొన్ని విషయాల్లో ఎంత పల్చగా, నేలబారుగా ఉంటుందంటే; దాన్ని విమర్శించడం కూడా కష్టం, అనవసరం కూడా.

ఉదాహరణకు – మార్క్స్ సమాధి మీద ఏంగెల్స్ ఇలా రాశారు. – 'మార్క్స్ మానవ పరిణామాన్ని కనుక్కున్నాడు – ఇప్పటిదాకా సైద్ధాంతిక కంపల్లో మరుగునపడి ఉన్న సింపుల్ వాస్తవం – అదేమంటే మనిషి రాజకీయాలు, కళలు, మతం లాంటి వాటి గురించి ఆలోచించే ముందు తనకు తిండి, బట్ట, గూడు కావాలి!'

దీన్ని ఎవరు మాత్రం ఎప్పుడు కాదన్నారు? ఇందులో విమర్శించడానికేముంది? నిజానికి మార్క్స్ చెప్పింది, కనుగొన్నానన్నది అంత సింపుల్ విషయమా? మరి గతితార్కిక భౌతికవాదం? తిండి, బట్ట, గూడు కావాలనుకోవడంలో మానవ పరిణామమేముంది? ఏకాలంలోనైనా అవి కావాల్సినవే కదా!

మార్క్స్ నాస్తికుడు. మతం మత్తుమందన్నాడు. తరువాతి మార్క్సిస్టులు మిలిటెంట్ నాస్తికులు. మత మౌఢ్యం మీద తీవ్రంగా దాడులు చేశారు. కమ్యూనిస్టు దేశాల్లో మత సంస్థలను మూయించేశారు. నిజానికి వివిధ మతాల బోధనలకు... సోషలిజానికి ఏమన్నా వైరుధ్యం ఉందా? లేనే లేదు.

మతం మీద మార్క్స్ ధ్వజమెత్తడానికి ఒక కారణం ఉంది. మార్క్స్ జమానాలో ముఖ్యంగా జర్మనీ, రష్యాల్లో – చర్చి కూడా ప్రభుత్వంలో అంతర్భాగం. రెండూ రాచరిక ప్రభుత్వాలే. ప్రజల మన్నన, అంగీకారం పొందే ప్రయత్నంలో – చర్చిని విరివిగా

ఉపయోగించుకునేవారు. కాబట్టే, ప్రభుత్వం మీద దాడిలో భాగంగా అప్పటి సోషలిస్టులు చర్చి మీదకు కూడా దాడిని విస్తరించారు. అదే అలవాటు సెక్యులర్ సమాజాల్లో కూడా ఇప్పటికీ కొనసాగుతోంది. కానీ మతాలు బోధించే సమ సమాజానికీ, సోషలిస్టులు స్వప్నించే రాజ్య రహిత సమ సమాజానికి అట్టే తేడా ఏమీలేదు.

అసలు సోషలిస్టు ఆలోచనే – మధ్యయుగాల్లోని కొన్ని క్రైస్తవ అతివాద ధోరణుల నుంచి ప్రారంభమయింది. ఎన్నో ప్రయోగాలు, రక్తపాతం, వైఫల్యాలు, మార్పులు, చేర్పుల తర్వాత 19వ శతాబ్దం మధ్యలో – కార్ల్‌మార్క్స్ చేతిలో పడి, లౌకిక సోషలిస్టు సిద్ధాంతంగా తుది రూపు దాల్చింది. కమ్యూనిస్టు పార్టీల జాతీయ, అంతర్జాతీయ మహాసభల్లో రాజకీయ సమీక్షా పత్రాన్ని తప్పనిసరిగా విడుదల చేస్తారు. అందులో ప్రపంచ రాజకీయ పరిస్థితిని అంచనావేస్తారు. విప్లవం ఎంత దగ్గరగా ఉందో, విప్లవ పరిస్థితులెలా ఉన్నాయో చర్చిస్తారు. ప్రపంచదేశాలన్నీ కాపిటలిజం కారణంగా ఎంతగా సంక్షోభంలో కూరుకుపోయాయో వివరిస్తారు. విప్లవం కోసం, రాబోయే సోషలిస్టు సమాజం కోసం ప్రపంచ ప్రజలందరూ ఎంత తహతహ లాడుతున్నారో, కాబట్టి సోషలిస్టు పార్టీల కర్తవ్యాలేమిటో నిర్ధారిస్తారు.

క్రిస్టియన్ (ఆ మాటకొస్తే ఏ మతంలోనైనా ఉండే) ఆశావాదానికి, సోషలిస్టు స్వాప్నికతకు ఏమన్నా తేడా ఉందా? మతం మత్తుమందైతే... మరి సోషలిజం?

13-03-2011

సహజ హక్కులే లక్ష్యం కావాలి

కన్నబిరాన్ మరణం నేపథ్యంలో రాసిన 'మావోయిష్టుల పౌరహక్కులు' వ్యాసంపై చాలా విమర్శనాత్మక వ్యాసాలు వెలువడ్డాయి. అంతేకాక ఈ మధ్య రాసిన ఇతర వ్యాసాలపై కూడా తీవ్ర విమర్శలు ప్రచురితమైనాయి. వీటన్నిటికీ కొంత విడివిడిగా, కొంత కలగలుపుగా నా స్పందన.

'ఆచరణలో నిలబడగలరా?'

ఆర్.కె.

విమర్శ : 'సోషలిస్టు ప్రపంచంలో హింస, అమానవీయత గురించి మాట్లాడారు. మరి పెట్టుబడిదారీ సమాజం గురించి మాట్లాడారా?'

స్పందన : మాట్లాడాను. మరొక్కసారి వ్యాసం చదవండి 'మార్కెట్‌వాదులు ... యుద్ధాలను కూడా వ్యతిరేకిస్తారు. ప్రభుత్వాలు తమ వైఫల్యాలను కప్పిపుచ్చు కోవడానికి, ప్రజల దృష్టి మరల్చడానికి ఇతర దేశాలతో కయ్యం పెట్టుకుని, ఆ పేరుతో – ప్రజలు సృష్టించుకున్న సంపదను మిలిటరీ అవసరాలకు మళ్ళించడాన్ని తీవ్రంగా ప్రశ్నిస్తారు. ప్రభుత్వాలు తమకు తామై సృష్టించిన ఇంటా, బయటా కల్లోలాలను సాకుగా చూపి; ప్రజల హక్కులను హరించే రాక్షస చట్టాలను రద్దు చేయమంటారు' అని రాశాను. అమెరికా చేస్తున్న యుద్ధాలను, అక్కడ ఉన్న ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాలను ఉదార స్వేచ్ఛావాదం చీల్చి చెండాడుతూనే ఉంది.

విమర్శ : 'కనీసం ఇటీవల అయిదేళ్ళ కాలంలో ప్రభుత్వం జరిపిన చట్ట వ్యతిరేక అణచివేతను, పోలీసుల చట్టవ్యతిరేక ఎన్‌కౌంటర్ హత్యలను మీరెప్పుడైనా ఖండించారా?'

స్పందన : అయిదేళ్ళేం ఖర్మ, ప్రభుత్వ అణచివేతలు దశాబ్దాలుగా సాగుతున్నాయి. ఎన్‌కౌంటర్ హత్యలను ప్రత్యేకంగా ఖండించే సందర్భం – ఇప్పటివరకు రాసిన వ్యాసాల్లో ఎక్కడా రాలేదు. చదువుతూనే ఉండండి. ఈ విషయాల్లో ఉదార స్వేచ్ఛావాదంలో ఎంత స్పష్టత ఉందో మీకే తెలుస్తుంది.

‘కమ్యూనిస్టు పార్టీలు ఏకమైతే..’ — డాక్టర్ ఎ.పి.విఠల్

విమర్శ : ‘కమ్యూనిజం, సోషలిజం పట్ల ద్వేషమే తప్ప వాటిని గూర్చి కనీస అధ్యయనం సైతం కొరవడినట్లు కనిపిస్తున్నది...’

స్పందన : విడమర్చి చూపిన వైరుధ్యాలకు మీ వివరణ లివ్వండి. ఏది నమ్మాలో పాఠకులకే వదిలేద్దాం.

విమర్శ : ‘కోట్లాది శ్రమజీవులు సృష్టించిన అదనపు విలువ గనుక కొద్దిమంది కలవారికి కాకుండా శ్రమజీవులకే చెందినట్లయితే...’

స్పందన : అదనపు శ్రమ, అదనపు విలువ సిద్ధాంతం, దానిలోని డొల్లతనం గురించి తదుపరి వ్యాసాల్లో వివరంగా రాశాను. దయచేసి చదవగలరు.

విమర్శ : ‘ఈ చైతన్యం అనండి, విధానం అనండి మరింత అదనంగా శ్రమ ద్వారా ఉత్పత్తిని సాధించేందుకు ఉపయోగపడుతుంది. అప్పుడు నూతన ఉత్పత్తి శక్తులు ఆవిర్భవిస్తాయి. అలా ఉత్పత్తి శక్తుల పురోగమనం అప్రతిహతంగా కొనసాగుతూనే ఉంటుంది..’

స్పందన : నూతన ఉత్పత్తి శక్తులు (యంత్రాలు, పనిముట్లు, పరిజ్ఞానం...) గ్రాఫిక్ సినిమాలోలాగా ఉద్భవించవు. వ్యక్తుల క్రియాశీలత నుంచి, ఆలోచనల నుంచి, పొదుపు, మదుపుల ద్వారా వస్తాయి.

విమర్శ : ‘అమెరికాతో అణు ఒప్పందం బిల్లు పాసయేందుకు కాంగ్రెస్, బీజేపీ వంటి పార్టీలన్నీ ఏకమైనాయి’

స్పందన : ఏకమైంది – ‘సామాజిక న్యాయ’ పార్టీ ములాయం. అమర్‌సింగ్ లు. బీజేపీ ఎంపీలను కొనడానికి ప్రయత్నం, పార్లమెంటులో నోట్ల కట్టల ప్రదర్శన, టీడీపీ ఎంపీల కొనుగోలు చూసినట్లు గుర్తు.

‘హక్కులు ప్రజలకా, పెట్టుబడికా?’ — ప్రొఫెసర్ ఎస్. శేషయ్య

విమర్శ : ‘కన్నబిరాన్ 1993 డిసెంబరులో ఎపిసిఎల్‌సి 9వ రాష్ట్ర మహాసభల్లో అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పుకున్నారు. అంతేగానీ; ఆయనను సంస్థ బహిష్కరించలేదు.. ఉద్యమకారుల అప్రజాస్వామిక చర్యలను ఖండించాలనే చర్చ ఈ సంస్థలో 1993 నుంచి ప్రారంభమైంది...’

స్పందన : కన్నబిరాన్‌ను బహిష్కరించడమన్నది నా వ్యాసంలో అసలు ముఖ్యాంశం కాదు. ఆ రోజుల్లో వచ్చిన వార్తల ఆధారంగా రాశాను. ఈ మధ్య వెతగ్గా, ఎన్. వేణుగోపాల్ రాసిన '24 గంటలు - కె.జి.కన్నబిరాన్ ఆత్మ కథాత్మక సామాజిక చిత్రం' పుస్తకంలో ఇలా రాసుంది. '...చర్చ 1986 నుంచి జరుగుతున్నదన్నమాట... కర్నూలు మహాసభ నాటికి చాలా ముందుకు పోయింది.. ఇది సభ్యుల మధ్య భిన్నాభిప్రాయాల బహిరంగ ప్రకటనగా మారింది... నేనూ అధ్యక్ష పదవి నుంచి తొలగిపోదలచుకున్నాను. వాళ్ళు కూడా ఈయన అధ్యక్షుడిగా లేకపోతే చీలిక సులభంగా జరిగిపోతుంది కదా అనుకున్నట్టున్నారు.. నేను దిగిపోతానంటే సులభంగా అంగీకరించారు... చివరికి కృతజ్ఞతలు చెప్పే ఉపన్యాసం ఇద్దామని కూడా ఎవరూ అనుకోలేదు. అంతే! నాకు ఎపిసిఎల్‌సి నుంచి ఒక గౌవనీయమైన, ఆహ్లాదకరమైన వీడ్కోలు దొరకలేదు...' (పేజీ 168-170) అయినప్పటికీ ఎపిసిఎల్‌సి ప్రస్తుత అధ్యక్షులుగా మీరు బహిష్కరించ లేదంటున్నారు కాబట్టి; బహిష్కరించలేదనే అనుకుందాం.

విమర్శ : 'సోషలిస్టు సమాజ నిర్మాణానికి హక్కులు, స్వేచ్ఛలు ఆటంకం అని ఎపిసిఎల్‌సి భావించడం లేదు'

స్పందన : సోషలిస్టు సమాజ నిర్మాణానికే కాకుండా దాన్ని నడపడంలోనూ హక్కులు, స్వేచ్ఛ పూర్తిగా కాలరాయబడతాయి. ఇప్పటివరకూ ఏర్పడ్డ చిన్నా, పెద్దా సోషలిస్టు దేశాల్లో వ్యక్తి స్వేచ్ఛ, భావ ప్రకటన స్వేచ్ఛ, వృత్తి స్వేచ్ఛ, మత స్వేచ్ఛ ఎక్కడైనా ఉన్నాయేమో చెప్పండి. సోవియట్ రష్యా నిర్మాణంలో కులక్‌ల ఊచకోత, తర్వాతి రోజుల్లో సైబీరియా కారాగారాలు, బానిస చాకిరీలు హక్కులు, స్వేచ్ఛకు ఉదాహరణలు కాదుగదా!

విమర్శ : 'ఇవాళ మనం తేల్చుకోవాలసింది మార్కెట్‌కు అంటే పెట్టుబడికి స్నేహపూర్వకంగా ఉండే హక్కుల కోసమా, లేక ప్రజలకు అవసరమైన హక్కుల కోసం పోరాడాలా? పెట్టుబడిదారీ (మార్కెట్) శక్తుల కోసమే అని జాహ్నవి చెబుతున్నారు'.

స్పందన : పౌరహక్కుల సంస్థలు పోరాడాల్సింది పెట్టుబడులో, మార్కెట్ శక్తులో, సోషలిస్టు భావన ప్రకారం ప్రజలకు 'అవసరమైన' హక్కుల కోసమో కాదు. మనిషికి ప్రకృతి, ప్రవృత్తిని బట్టి సహజంగా సిద్ధించిన ధన, మాన, ప్రాణ హక్కుల కోసం పోరాడాలి. ఇందులో కుల, మత, వర్గ, భావజాల బేధాలు చూపకూడదు.

23-03-2011

'అజ్ఞాత మేధావి అజ్ఞానం' — ప్రొఫెసర్ జి. హరగోపాల్

విమర్శ : '... ఈ అజ్ఞాత మేధావి చికాగో స్కూల్ ఆలోచనా విధానాన్ని... మిల్టన్ ఫ్రైడ్‌మాన్ ప్రభావంలో ప్రపంచ పెట్టుబడిని, మార్కెట్ విలువలను, సామ్రాజ్యవాద భావజాలాన్ని సమర్థిస్తూ కఠోరమైన కృషి...'

స్పందన : నేను చికాగో స్కూల్‌ను , మిల్టన్ ఫ్రైడ్‌మాన్‌ను చదవలేదు. సామ్రాజ్యవాద భావజాలాన్ని ఎన్నడూ సమర్థించలేదు.

విమర్శ : 'విదేశీ పెట్టుబడి తనకు కావాల్సిన మేధో వాతావరణం సృష్టించుకునే ప్రయత్నంలో ఇలాంటివారు తప్పకుండా ఉంటారు... కానీ వీళ్ళు ఎవరివైపు నుంచి మాట్లాడుతున్నారో స్పష్టం చేస్తే కొంత ప్రయోజనం...'

స్పందన : ఆరోపిస్తున్నారు కాబట్టి స్పష్టీకరిస్తున్నాను. ఏ వ్యక్తులకు, సంస్థలకు ఊడిగం చెయ్యకుండా సర్వ స్వతంత్ర్య స్వేచ్ఛతో రాస్తున్నాను.

విమర్శ : 'ఈ వ్యాసంలో కన్నబిరాన్‌ను పౌరహక్కుల సంఘం బహిష్కరించిందని రాశారు... అదొక పెద్ద అబద్ధం..'

స్పందన : దీనిపై ఇంతకుముందే స్పందించాను.

విమర్శ : 'నిజానికి కర్నూలు సభలో – కన్నబిరాన్ అధ్యక్ష పదవి నుంచి దిగి, తన తల్లి ఆరోగ్యం బాగా లేదని వెళ్లిన తరువాత; ఆయన విలువైన పాత్ర మీద మేమందరం ప్రసంగించాం. ఇదీ అసలు వాస్తవం'

స్పందన : బహుశా కావచ్చు. ఆంతరంగిక సమావేశం కాబట్టి లోపల ఏం జరిగిందో తెలిసే అవకాశం లేదు. కాకపోతే ఎన్. వేణుగోపాల్ రాసిన పుస్తకం ప్రకారం కన్నబిరాన్ ఇలా అన్నారు – '...నేను దిగిపోతానంటే సులభంగా అంగీకరించారు. అంగీకరించడమేకాదు, పదిహేను సంవత్సరాలు అధ్యక్షుడిగా ఉండి వైదొలుగుతున్నా కదా... చివరకు ఒక కృతజ్ఞతలు చెప్పే ఉపన్యాసం ఇద్దామని కూడా ఎవరూ అనుకోలేదు... నేనే ఒక చివరి ఉపన్యాసం చేసి, వాళ్ళకు చెప్పేసి వచ్చేశాను.' (పేజీ 170) మరి ఇదీ వాస్తవమేనా?

విమర్శ : '... మన దేశంలో అమలులో ఉండే హక్కులను రద్దు చేయాలనో – లేక, అవి తమకు అమలులో ఉండి మిగతావాళ్ళకు ముఖ్యంగా మావోయిస్టులకు లేకున్నా ఫర్వాలేదన్న భావన చాలా ప్రమాదకరమైనది.'

స్పందన : అవును. అలాంటి భావన ప్రమాదకరమైనదే. ఉదార స్వేచ్ఛావాదులకు కూడా అలాంటి భావన ఆమోదయోగ్యం కాదు. దీనికి విరుద్ధంగా నేనైతే ఏమీ రాయలేదే!

విమర్శ : 'పౌరహక్కుల ఉద్యమాన్ని, మానవ హక్కులను హేళన చేస్తూ ఈ దేశంలో రాజ్య నియంతృత్వాన్ని కోరుకుంటున్న కొంతమంది ఆలోచనాపరుల్లో జాహ్నవి ఒకరు'.

స్పందన : ఇది పూర్తి వక్రీకరణ, నిరాధార ఆరోపణ. మానవహక్కులను ఏనాడూ హేళన చేయలేదు. స్వేచ్ఛ కోరుకునే ఉదారవాదులు అలా చేస్తారా? మనిషి ప్రాథమిక హక్కులను కాపాడే రాజ్యం మాత్రమే కావాలని, వ్యాసాల నిండా రాస్తుంటే, ఈ శీర్షాసనం ఏమిటి?

విమర్శ : 'నిరాయుధులైన పౌరహక్కుల నాయకుల ప్రాణాలు ఎందుకు తీసుకున్నారో జాహ్నవిలాంటి వాళ్ళు జవాబు చెప్పవలసి ఉంటుంది'

స్పందన : నేనెందుకు జవాబుచెప్పాలి? వ్యాసకర్త మీద హత్యానేరం మోపుతున్నారా?

విమర్శ : 'కమ్యూనిస్టు దేశాల్లోనే ఆటవిక చట్టాలుంటాయనడం ఎంత విచిత్రం?'

స్పందన : విచిత్రం అది కాదు. నేను రాయని దాన్ని రాశాననడం. ఈ వాక్యంగాని, భావంగానీ నా వ్యాసంలో ఎక్కడా లేదు.

27-03-2011

సోషలిస్టు భ్రమలపై సైద్ధాంతిక పోరు

'మార్కెట్ పండితులున్నారు జాగ్రత్త' — లోచన్

విమర్శ : '...అంతులేని జనజీవన హననం, పారుతున్న రక్తం. ఇవన్ని జాహ్నవి దృష్టిలో స్వేచ్ఛా సమాజంలో ఇక్కడి హేతుబద్ధ, చట్టబద్ధ పాలనలో మనిషి బతకడానికి

చెల్లించక తప్పని మూల్యం!.... ఎవరు ఎవరి కోసం మూల్యం చెల్లించాలి?.... అరవై యేళ్ళుగా ....'

స్పందన : మీరు ఆవేశంలో వ్యాసాన్ని తప్పుగా అర్థం చేసుకోవడమే కాకుండా ఉదార స్వేచ్ఛా మార్కెట్ వాదమంటే ఏమిటో అర్థం చేసుకోవడానికి నిరాకరిస్తున్నారు. '... చెల్లించాల్సిన మూల్యం.....' అని రాసిన సందర్భం ఏమిటంటే, సాధారణంగా, సమాజంలో జరిగే నేరాలకు పౌరహక్కుల రక్షణ గురించి పనిచేసే వారిని సమాధానం చెప్పమంటుంటారు. ఈ విషయంలో ఉదారవాదాన్ని వివరించాను. నేరస్తులున్నంత మాత్రాన; నేరాలు జరిగినంత మాత్రాన - ప్రజా బాహుళ్యపు పౌరహక్కులను హరించడం సమర్థనీయం కాదనీ; ఎంతో కొంత స్థాయిలో నేరాల్ని భరించడం సభ్య సమాజంలో బతకడానికి మనం చెల్లించాల్సిన మూల్యమని రాశాను. దాన్ని వక్రీకరిస్తే ఎలా? అరవయ్యేళ్ళుగా మన దేశంలో నడుస్తున్నది ఉదారవాద స్వేచ్ఛా మార్కెట్ కాదు. సోషలిస్టు ముసుగులో సాగుతున్న భ్రష్ట ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం. ఈ రెండింటి మధ్య తేడాను ఆకళింపు చేసుకోకుండా ప్రస్తుత వ్యవస్థ పట్ల మీ ఆవేశాన్నంతా ఉదార స్వేచ్ఛావాదం మీద చూపిస్తే ఏం ఉపయోగం ఉండదు.

'దేవతా వస్త్రాలా? భూతాల భాష్యాలా?' — తెలకపల్లి రవి

విమర్శ : 'తనపై వరుసగా విమర్శలు రావడమే విజయమనే భ్రమలో ఈ వారం ఆ రుజాగ్రస్త జాహ్నవీయం పరాకాష్ఠకు చేరింది....

'అంకుల్‌శాం అఘాయిత్యాలు అరకంట చూసినా ప్రపంచీకరణ పారవశ్యంలో పడిపోయేవారు కాదు...'

'మహత్తర పెట్టుబడిదారీ విధానం వీటికి ఎందుకు అవకాశమిచ్చిందో అక్కర్లేదు...'

'కోటీశ్వరులకు రాయితీల వల్ల దేశ ఉత్పత్తి పెరుగును...'

స్పందన : భ్రమల నుంచి బయటపడేయడానికే తప్ప, ఏ భ్రమలకో లోనయి ఈ వ్యాసాలు రాయడంలేదు. వ్యాసకర్త అంకుల్ శాం కు రాయబారేమీకాదు. ఒబామా సందర్శన సందర్భంగా రాసిన 'మసకబారిన నల్ల సూరీడు' వ్యాసం చదవగలరు. ఇకపోతే, ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం అన్ని భ్రష్ఠత్వాలకూ దారి తీస్తుంది. వ్యవస్థల పట్ల ఏవగింపు కలిగిస్తుంది. దానిక్కారణం మనం ప్రభుత్వాల కిచ్చిన అపరిమితమైన అధికారాలే. ఉదారస్వేచ్ఛా వాదం దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. ప్రజల డబ్బు

గుంజి రాయితీలిమ్మని ఉద్యమాలు నడిపి, పొత్తులు పెట్టుకుని, ఓట్లేస్తే అది చివరకు కోటీశ్వరులకు రాయితీలివ్వడానికే దారి తీస్తుంది.

✦✦✦✦

ఇప్పుడు అన్నిటినీ కలిపి ఒక వివరణ -

సమాజాన్ని నిర్మించడానికి రెండు మార్గాలున్నాయి - ఒకటి సోషలిజం / కమ్యూనిజం. రెండోది ఉదార స్వేచ్ఛా మార్కెట్ వ్యవస్థ. అది కొంతా ఇది కొంతా కలిసిన మిశ్రమ వ్యవస్థల్లో జరిగే తప్పులు ఏ వాదపు అంశాల వల్ల జరుగుతున్నాయో తెలుసుకోవడానికి నిశిత పరిశీలన అవసరం. ఆ పనే నా వ్యాసాల ద్వారా చేస్తున్నాను. ఆర్థిక, సామాజిక విషయాల్లో ప్రభుత్వ జోక్యం, మనిషి ప్రాథమిక హక్కులను రక్షింపకపోవడం వల్ల ఎటువంటి అనర్థాలు జరుగుతున్నాయో ఉదాహరణలతో సహా వివరిస్తున్నాను.

సోషలిజాన్ని విమర్శించడం తెలుగు రచనా రంగంలో అత్యంత అరుదు. కాబట్టి ప్రతి విమర్శల వేగం, వేడి అర్థం చేసుకోగలిగినవే. అందుకే పేరుపేరునా స్పందిస్తున్నాను, వివరణ ఇస్తున్నాను. నా భావాల్లో కానీ, తాత్వికతలోగానీ, సిద్ధాంత అన్వయింపులో గానీ, విశ్లేషణలోగానీ ఏవైనా వైరుధ్యాలు తటస్థిస్తే నిరభ్యంతరంగా నిలదీయండి. అంతేగానీ వక్రీకరించడం, వెక్కిరించడం సిద్ధాంత లేమికి నిదర్శనం. సోషలిజాన్ని మనసంతా నింపుకుని, మతంలా స్వీకరించిన వృత్తి కమ్యూనిస్టు మేధావులను మార్చగలనన్న భ్రమగానీ, మార్చాలన్న ఆలోచన గానీ లేవు. పుట్టుకనుంచి, గిట్టేదాకా సోషలిస్టు భావజాలం తప్ప మరొక ఛాయ కనిపించని మన రచనా, మేధోరంగాల్లో, - ఒక ప్రామాణిక ప్రత్యామ్నాయం, సిద్ధాంతం ఉన్నదన్న సత్యాన్ని కొత్త తరాలకు అందించడమే ధ్యేయం. ఈ మాత్రం స్వేచ్ఛయినా ఉన్న వ్యవస్థలో బతికున్నందుకు సంతోషం.

03-04-2011

తెగించిన రాజకీయానికి...

నిర్మానుష్యంగా ఉన్నదారిలో - స్కూటరు మీద వెళ్తున్న భార్యాభర్తల్ని అడ్డుకుని కత్తులు, కర్రలతో బెదిరించి నిలువుదోపిడీ చేసేవాళ్ళను దొంగలంటాం. ఆ దొంగలు పేదవాళ్ళే కావచ్చు. కొన్ని నగరాల్లో బాగా బలపడిన రౌడీ ముఠాలు స్థానిక వ్యాపారస్తుల దగ్గర్నుంచి వారానికో, నెలకో మామూళ్ళు వసూలు చేస్తారు. ఆ వసూలు చేసిన దాంట్లోంచి కొంత స్థానిక పేద ప్రజానీకం మధ్య ఉండే తమ అనుయాయులకూ పంచుతారు. ఆ రకంగా తమ వెంట మంద బలం ఉండేలా చూసుకుంటారు. వాళ్లను రౌడీలంటాం. సంఘ వ్యతిరేకశక్తులంటాం.

శాసనసభలో మూడు నిమిషాలు కూడా చర్చించని చట్టాల ద్వారా ప్రత్యక్ష, పరోక్ష పన్నులు ముక్కు పిండి వసూలు చేస్తారు. కట్టకపోతే పోలీసులను, ఇతర అధికారులను ప్రయోగించి వ్యాపార సంస్థల్ని మూయించేస్తారు. వాటికి, పన్నులనీ.... ప్రభుత్వాలనీ గౌరవప్రదమైన పేర్లు పెట్టుకుంటాం. ఆ పన్నులు ఎగ్గొట్టే వారిని దేశ ద్రోహులుగా అభివర్ణిస్తాం. దొంగనోట్లు ముద్రించేవాళ్ళను అరెస్టు చేసి కోర్టుల కీడ్చి, జైల్లో పెడతాం. అదేపని లోటు బడ్జెట్ రూపంలోను, బ్యాంకురుణాల రూపంలోను రిజర్వుబ్యాంకు చేస్తే, అది ప్రభుత్వ ద్రవ్య విధానమని సమాధానపడతాం.

దారిదోపిడీకి..., రౌడీ మామూళ్లకు..., ప్రభుత్వ పన్నులకు - నైతికంగా తేడా ఏమీలేదు. అలాగే దొంగనోట్లకు..., ద్రవ్యోల్బణానికి కారకమైన రిజర్వుబ్యాంకు ముద్రణకూ కూడా తేడా ఏమీలేదు. తేడా ఉన్నదల్లా లబ్ధిదారుల్లో మాత్రమే. లబ్ధిదారులు లక్షల సంఖ్యలో ఉన్నంత మాత్రాన నైతికత మారుతుందా? గత ఎన్నికల్లో కలర్ టీవీలు పంచిపెడతామన్న డిఎంకెకు తమిళ ఓటర్లు బ్రహ్మరథం పట్టారు. చూసినవాళ్ళంతా ఔరా అనుకున్నారు. ఇంత విచ్చలవిడిగా ప్రజాధనం లంచంగా ఇచ్చి బాహాటంగా ఓట్లు కొనుక్కోవడమేమిటని విమర్శించారు. ఏమైతేనేం? గెలిచిన వాడే రాజు. మడమ తిప్పకుండా, ఆడినమాట తప్పకుండా

ఇస్తామన్న వారందరికీ కలర్ టీవీలు పంచారు. అది అనైతికం, ఓటర్లను ప్రలోభపెట్టడం అని కొందరు కోర్టుకెక్కారు. సుమారు సంవత్సరం క్రితమే సుప్రీంకోర్టు ఆ ఆక్షేపణల్ని కొట్టిపారేసింది. విద్యార్థినులకు సైకిళ్లు పంచినట్లే పేదలకు కలర్ టీవీలివ్వడం ప్రజాసంక్షేమం దృష్ట్యా సబబేనని వక్కాణించింది. దాంతో ఈ ప్రక్రియ శంఖంలో పోయబడి; తీర్థమై కూర్చుంది.

ఈసారి ఎన్నికలలో డిఎంకె, అన్నాడిఎంకె పోటీపడి మరీ వరాలు కురిపించాయి. మిక్సీలు, కుక్కర్లు, కంప్యూటర్లు, బంగారం, సెల్‌ఫోన్లు పంచి పెడతామని మేనిఫెస్టోలు విడుదల చేశారు. పంచిపెట్టేది వారి సొంత సంపదయితే కదా! ఎలాగోలా గెలిచేస్తే, అయిదేళ్ళ కాలంలో ఇస్తానన్నవి మెల్లగా ఇవ్వవచ్చు. కావాలంటే పన్నులు పెంచవచ్చు. రోడ్లు బాగు చెయ్యాల్సిన నిధులను అటు తరలించొచ్చు. ఇంకా డబ్బు చాలకపోతే కేంద్ర ప్రభుత్వం పీకల మీద కూర్చుని ఏదో ఒక పథకం ద్వారా నిధులు తెచ్చుకోవచ్చు.

కేంద్రానికి మాత్రం ఏం పోయింది? అది వాళ్ళ సొంత సొమ్మా ఏమిటి? ఆ ఇచ్చే వస్తువుల కొనుగోళ్ళలో వచ్చే కమీషన్లు – ఎలాగూ వస్తాయి. ఇంతమంది లబ్ధిదారుల జయజయధ్వానాల మధ్య ఏ ధన యజ్ఞం చేసినా, భూ పందేరాలు చేసినా, ఎన్ని కంపెనీలు సృష్టించినా విమర్శించగల ధైర్యం ఎవరికుంటుంది? ఎవరైనా విమర్శిస్తే వాళ్ళు పేదల సంక్షేమానికి వ్యతిరేకులనీ, ప్రపంచ బ్యాంకు పాలేర్లనీ ముద్రేస్తారు. ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలను గుర్తించకపోతే ఎలా అని కొందరు ఆస్థాన మేధావులు కూడా సన్నాయినొక్కులు నొక్కుతారు.

ఇది ప్రజాస్వామ్యమా? రెండు తోడేళ్ళు...ఒక మేకా – ఓటింగు ద్వారా సాయంత్రం ఏం భోం చేయాలో నిర్ణయించడం ఎంత ప్రజాస్వామమో; ఇదీ అంతే. ప్రజాస్వామ్యం అనేది అయిదేళ్లకొకసారి శాంతియుతంగా, కావాలనుకుంటే... ప్రభుత్వాన్ని మార్చుకునే సాధనం మాత్రమే. ప్రభుత్వ పరిధులేమిటో, అది ఏం చెయ్యొచ్చో, ఏం చెయ్యగూడదో నిర్ణయించగల నైతిక పునాది కాదు. సమాజం, ప్రభుత్వాల నైతికతకు పునాది – స్వేచ్ఛ. మనిషి స్వేచ్ఛను హరించే ఏ ప్రభుత్వమైనా – ఎంత పారదర్శక, స్వేచ్ఛా ఎన్నికల ద్వారా ఎంపికైనా సరే – నైతిక ప్రభుత్వం కాజాలదు. మెజారిటీ ప్రజల డిమాండును బట్టి ఏసుక్రీస్తును శిలువ వెయ్యడం ప్రజాస్వామికమేమోకానీ... నైతికం కాదుకదా! మెజారిటీ జర్మన్ ప్రజల అనుమతి ఉంది కాబట్టి యూదుల ఊచకోత నైతికమవుతుందా? మహాభారతంలో ఓటింగు ప్రక్రియ లేదు కాబట్టి – పాండవులు బతికిపోయారు!

ఒక పెద్దాయన అన్నట్లు ప్రజలు ఏదో మాయలో పడితే తప్ప; తమ స్వేచ్ఛను చేజార్చుకోరు. 'ప్రజాస్వామ్యం' అనే మాయలో పడి స్వేచ్ఛను చేజార్చుకున్నాం. ప్రజాస్వామ్యమంటేనే – 'స్వేచ్ఛ' అనే భ్రమలో ఉన్నాం. ఓటేసే హక్కుంది కాబట్టి మన

స్వేచ్ఛ ఎక్కడికీ పోలేదనుకుంటున్నాం. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ రెండూ వేరు వేరని గుర్తించలేకపోతున్నాం.

ఉదాహరణకు ధాన్యం పండించే రైతుకు స్వేచ్ఛ లేదు. తన భూమిని సెజ్‌ల కోసం లాక్కుంటే ఆపలేడు. పండించిన ధాన్యంలో కొంత రెండ్రూపాయల బియ్యం కోసం లెవీ గా లాక్కుంటే ఆపనూ లేడు. రేటు పెరక్కుండా చెయ్యడానికి ఎగుమతులను నిషేధిస్తే ఏమీ చెయ్యలేడు. ఇక స్వేచ్ఛ ఎక్కడుంది? తాను ఎవరికి అన్యాయం చేశాడని..., ఏం తప్పు చేశాడని తన స్వేచ్ఛను కోల్పోయాడు? ధాన్యం పండించని తన పక్కింటాయన, బియ్యం తినని ఒక పంజాబీ ఆసామి ఓట్లేయగా – ప్రజాస్వామికంగా ఎన్నికయిన ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది, కాబట్టి తాను స్వేచ్ఛ కోల్పోవడం – ఒక విషాద వాస్తవం కాకపోతుందా?

ప్రజాస్వామ్యం ఒక లారీ అయితే; ప్రభుత్వాలు చెలాయించే అధికారాలు– దానిమీద వేసిన లోడులాంటివి. టైర్లు పగిలిపోయెంత అంతులేని అధికారాల లోడు భరిస్తూ లారీ నత్తనడక నడుస్తోంది. ఏదో ఒకరోజు కూలబడిపోయే పరిస్థితిలో ఉంది.

సమాచార హక్కు చట్టం వల్ల కొంత మంచి జరిగినా, అవినీతి ఏమీ ఆగలేదు. ఆ చట్టం వచ్చాక స్కాముల సంఖ్య, పరిమాణం పెరిగాయేగాని తగ్గలేదు. లోడు తగ్గించకుండా హెడ్‌లైట్లు మార్చినంత మాత్రాన స్పీడు పెరగదుకదా! అన్నా హజారే కోరుతున్న జన్ లోక్‌పాల్ బిల్లు వచ్చినా, అవినీతి నికరంగా తగ్గుతుందనే ఆశలేదు. అవినీతికి మూల కారణం ప్రభుత్వాలకు మనమిచ్చిన అంతులేని విచక్షణాధి కారాలు. వాటిని అడ్డంపెట్టుకునే, ప్రజాస్వామ్యం పేరుతో తెగింపు రాజకీయాలు చేస్తున్నారు. ఎన్నికల వేళ ఎన్ని స్కీములు ప్రకటిస్తే, అన్ని స్కాములకు తెరతీసినట్లే. ఎన్ని హామీలు గుప్పిస్తే మనం కష్టపడి సంపాదించిన సంపద అంత మేరకు హారతి కర్పూరమైనట్టే. సమ సమాజ స్థాపన, సామాజిక న్యాయం, పేదరిక నిర్మూలన లాంటి రంగు కళ్లద్దాల్లోంచి సర్కస్ చూపిస్తారు. మనల్ని బుట్టలో పడేసేది రాజకీయ పటిమ కాదు. భావజాల మహిమ. తస్మాత్ జాగ్రత్త.

10-04-2011

అవినీతి వ్యాధికి అరకొర వైద్యం

మెదడులో రక్తం గడ్డ కట్టి తలనొప్పి వచ్చింద నుకుందాం. మందుల షాపుకు వెళ్లి తలనొప్పికి మందు అడిగితే...అతనికి తెలిసినంతలో ఒక మందు ఇస్తాడు. దాంతో తాత్కాలికంగా ఉపశమనం కలుగుతుంది. కానీ అసలు రోగం నయం కాదు. అన్నాహజారే ఉద్యమం కూడా ఆర్ఎంపి వైద్యం లాంటిదే. ఆయన ఉద్దేశాన్ని, చిత్తశుద్ధిని శంకించలేము. నిరాడంబరుడు, నిగర్వి, ఉద్యోగ విరమణ తర్వాత జీవితాన్ని తాను నమ్మిన కార్యక్రమాలకు అంకితం చేసిన అన్నా - అత్యంత గౌరవనీయుడు. ఈ వయసులో కూడా ఆయన చేస్తున్న కృషి యువతకు ఆదర్శనీయం. కానీ అవినీతికి సరైన రోగ నిర్ధారణ చెయ్యలేదు. ఆయన ప్రతిపాదించిన జన్‌లోక్‌పాల్ బిల్లుతో తలనొప్పి కొంత మేరకు కాసేపు తగ్గుతుందేమో గానీ; అసలు రోగం నయం కాదు.ఆయన ఎంచుకున్న ఉద్యమ రూపం, లక్ష్యాలు - రెండు ప్రశ్నించదగినవే.

రోజుకొకటిగా బయటపడుతున్న స్కాములు, మరోపక్క అయిదు రాష్ట్రాల్లో ఎన్నికలు. ఈ నేపధ్యంలో అన్నాహజారే పెట్టిన డిమాండ్లన్నీ చప్పున ఒప్పేసుకుని కేంద్ర ప్రభుత్వం బయటపడింది. కానీ, సత్యాగ్రహాలతో చట్టాలు వస్తే...; మరి పార్లమెంటు, అందులో సభ్యులు ఎందుకున్నట్లు? పౌర సమాజం నుంచి కొందరు, ప్రభుత్వం నుంచి కొందరు కలిసి బిల్లు తయారు చేస్తారట. అంటే పార్లమెంటు సభ్యులు పౌర సమాజం (సివిల్ సొసైటీ) నుంచి రాలేదా? నేర సమాజం (క్రిమినల్ సొసైటీ) నుంచి వచ్చారా? ప్రజలే కదా - వారినెన్నుకుని తమ ప్రతినిధులుగా పంపింది? ఇకపోతే, ఈసారికి అన్నాహజారే సూచించిన వారు లోక్‌పాల్ ఎంపికలో భాగస్వాములవుతారట. ఆయన తర్వాత? తదుపరి అన్నాహజారేను ఎవరు, ఎలా గుర్తించాలి? మీడియా ద్వారానా? లేక ఇండియన్ ఐడల్ ఎంపిక లాగా ఎస్ఎంఎస్‌ల ద్వారానా?

ఏసిబీ వల్ల ప్రభుత్వాధికారుల్లో అవినీతి ఎంత తగ్గిందో చూస్తూనే ఉన్నాం. లోక్‌పాల్ బిల్లు వల్ల రాజకీయ అవినీతి ఆ మాత్రం కూడా తగ్గదు. ఎందుకంటే అవినీతికి

మూలాలు వేరే ఉన్నాయి. **ఇంత అవినీతికి ఆస్కారమిస్తున్నది మనం కట్టే లక్షల కోట్ల పన్నుల డబ్బు. మనం ప్రభుత్వాలకిచ్చిన విశేష విచక్షణాధికారాలు. ప్రతి విషయంలోనూ ప్రభుత్వ జోక్యం, లెక్కలేనన్ని నియంత్రణలు, వాటిని అమలు చేసే పేరుతో రాకాసంత బ్యూరోక్రసీ. వీటిని తగ్గించనంత వరకు అవినీతి చీమంతలకాయంత కూడా తగ్గదు.**

2జి స్కాము నేపథ్యంలో సోనియాగాంధీ ఒక హుకుం జారీ చేశారు. కేంద్ర మంత్రిత్వ శాఖలన్నీ తమ విచక్షణాధికారాల్ని తగ్గించుకోవాలని. (తద్వారా అవినీతి తగ్గించడం పట్ల తనకు, తన పార్టీకి గల నిబద్ధతను చాటుకోవాలని భావించి ఉండవచ్చు).

అదే సమయంలో హైదరాబాద్ గాంధీభవన్‌లో పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి సమక్షంలో – ఒక పార్టీ సమావేశం జరిగింది. పీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతూ సంక్షేమ పథకాల్లో లబ్ధిదారుల్ని ప్రభుత్వ అధికారులే గుర్తిస్తే ఇక తమ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు విలువేం ఉంటుందని గద్దించారు. దాన్ని ముఖ్యమంత్రి కూడా సమర్థిస్తూ, ప్రభుత్వ కార్యక్రమాల్లో పార్టీవారి మాట చెల్లేలా చూస్తామని హామీ ఇచ్చినట్లుగా పేపర్లో వచ్చింది. ఎవరైనా ఆక్షేపిస్తారనే బిడియం కూడా లేదు. ఐదారేళ్ల క్రితం ఒక పెద్ద మంత్రి – ప్రభుత్వ బంతి భోజనంలో పార్టీ కార్యకర్తలకు ముందు వరుసలో వడ్డించడం తప్పుకాదు పొమ్మన్నారు. ఇటువంటి ఆలోచనలు, వాటికి మేధావుల ఆమోదం ఎక్కడ్నుంచి వచ్చాయి? ఇస్లాం మతదేశాల్లో మతం, ప్రభుత్వం మమేకమైనట్లే, కమ్యూనిస్టు దేశాల్లో; కమ్యూనిస్టులు పాలించిన పశ్చిమబెంగాల్ లాంటి రాష్ట్రాల్లో – పార్టీయే ప్రభుత్వం, ప్రభుత్వమే పార్టీగా కలగలిసి పోయాయి. అవినీతికి తలుపులు బార్లా తెరిచే ఈ ఆలోచనలు ఆ భావజాలం నుంచి పుట్టినవే.

నదుల్లోను, పెద్ద వాగుల్లోను ఇసుక క్వారీలు వేలానికి పెడతారు. కాగితం మీద చూడ్డానికి అంతా చట్టబద్ధంగా, పారదర్శకంగానే ఉంటుంది. కానీ స్థానిక ప్రజా ప్రతినిధులకు ముడుపులో; వ్యాపారంలో వాటానో ఇవ్వకపోతే – ఒక్క లారీ ఇసుక కూడా బయటకు రానివ్వరు. ఎక్కడో ఉన్న నిబంధనల్ని బయటకు తీస్తారు. మనుషుల్తో లోడింగు చెయ్యాలని నిబంధనలుండగా యంత్రాలతో లోడింగు చేస్తున్నారనో...;లారీ ఓవర్ లోడ్ అనో... వే బిల్లులు లేవనో... దారికి అడ్డం పెట్టో... క్వారీ పాడుకున్న వారిని ముంచేస్తారు. ఈ తతంగంలో ప్రజాప్రతినిధులు ఏరికోరి తెచ్చుకున్న అధికారులు చక్కగా సహకరిస్తారు. ఎవరికి దక్కాల్సింది వారికి దక్కాక; ఏ నిబంధనలూ అడ్డురావు. ఇకదారి పొడుగునా రవాణా శాఖ, పోలీసుల మామూళ్లు సరేసరి. ఈ భారమంతా ఎవరి మీద పడుతుంది? వినియోగదారుడి మీద. నిర్మాణవ్యయం తడిసి మోపెడవుతుంది.

అలాగే టోల్ గేట్లు. అలాగే ప్రభుత్వ కాంట్రాక్టులు. వీటిని ఏ లోక్‌పాల్ బిల్లు నిరోధించగలదు? అసలు నదిలో ఇసుక వాడుకోవడానికి ప్రభుత్వ జోక్యం ఎందుకు?

ఎక్కువ తవ్వేస్తారనా? ఎవరైనా అవసరానికి మించి ఇసుక ఎందుకు మోసుకుపోతారు? దానికి ఇన్ని శాఖలు, వాళ్లకు జీతాలు, ఆపై లంచాలు, ఇంత హంగామా అవసరమా?

దేశంలో అందరికన్నా ఎక్కువ డబ్బు, ఆయుధాలు, మందీమార్బలం ఉన్న రౌడీలు ఎవరంటే – ప్రభుత్వాలు మాత్రమే. పన్నెండు లక్షల కోట్ల వార్షిక 'ఆదాయం' తో కేంద్ర ప్రభుత్వం; లక్షా పాతికవేల కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం – ఏమైనా చెయ్యగలవు. తలుచుకుంటే ప్రభుత్వ రంగ ఆయిల్ కంపెనీల డీజిల్, పెట్రోలు రేట్లు తగ్గించి, రిలయన్సు బంకుల్ని మూతపడేయగలవు. అదే రిలయన్సుకు అపారమైన సహజవాయు క్షేత్రాల్ని కట్టబెట్టగలవు. బ్రాహ్మణి స్టీల్స్‌కు పన్నెండువేల ఎకరాలు ఇవ్వనూగలరు ; సంబంధాలు బెడిసి కొడితే ...తిరిగి స్వాధీనం చేసుకోనూ గలరు. 'ప్రజాక్షేమం' పేరుతో పన్నులు పెంచడం ద్వారా ఏ పరిశ్రమనైనా దివాళ తీయించగలరు. వాళ్లొచ్చి ముడుపులు చెల్లిస్తే... పారిశ్రామిక రంగానికి ప్రోత్సాహం పేరుతో పెంచిన పన్నులను తగ్గించనూగలరు. ఇదంతా ఏ లోక్‌పాల్ రుజువు చెయ్యగలదు?

ఆర్థిక సరళీకరణ తర్వాత అవినీతి ఇంకా పెరిగిపోయిందని మేధావులంటుంటారు. నిజమే కావచ్చు. ఆర్థిక సరళీకరణ తర్వాత పరిశ్రమలు, వ్యాపారాలు, ఉత్పత్తి, సేవలు, సంపద సృష్టి విపరీతంగా పెరిగాయి. కానీ అందరి జుట్టునూ ప్రభుత్వం తన చేతుల్లోనే పెట్టుకుంది. ప్రభుత్వ, పాలక రాజకీయ వ్యవస్థ రౌడీ మామూళ్లు పెరిగాయి. దానికి రౌడీని నిందించాలా లేక స్తోమత పెరిగినందుకు రౌడీ గారు పెంచిన రేట్ల ప్రకారం మామూలు సమర్పించుకునే వాణ్ణి నిందిద్దామా? ప్రభుత్వానికి గుత్తాధిపత్యంగాని, విచక్షణాధికారాలు గానీ లేని ఏ రంగంలోనూ – అవినీతి లేదు. సెల్‌ఫోన్, సిమ్‌కార్డును కిళ్లీకొట్లో కొనుక్కుంటున్నాం. కానీ లంచం ఇవ్వకుండా కరెంటు కనెక్షనో, భూమి రిజిస్ట్రేషనో, వాహన యజమాని పేరు మార్పో చేసుకోగలరా?

ఓటర్లు విద్యావంతులయితే రాజకీయాలు మెరుగవుతాయనుకోవడం భ్రమ. దేశంలో అక్షరాస్యత, ఉన్నత విద్యావంతుల సంఖ్య పెరుగుతోంది. కానీ రాజకీయాలు ఇంకా ఇంకా భ్రష్టుపడుతున్నాయి. దీనిక్కారణం విద్యావంతులు ఓటేయకపోవడం కాదు. ఓటేసే వాళ్లు తమ జేబుల్ని ఎవరు, ఎలా కత్తిరిస్తున్నారో తెలుసుకోలేక పోవడం వల్ల.

ప్రజల ధన, మాన, ప్రాణాలను కాపాడడం వరకే ప్రభుత్వాలు పరిమితమైతే, అవినీతి ఆ మేరకు పరిమితమవుతుంది. స్కూళ్లు, చేపల దుకాణాలు, ఆస్పత్రులు, బస్సులు నడపడం, రోడ్లు వేయడం (వేశామనడం), ప్రాజెక్టులు, కాలువలు, బొగ్గు, స్టీలు ఉత్పత్తి ఇవన్నీ ప్రైవేట్ రంగానికి వదిలేస్తే అవినీతి ఆ మేరకు తగ్గుతుంది. లేని పక్షంలో జన్‌లోక్‌పాల్‌కు – కూడా సీబీఐ, సీవీసీ, లోకాయుక్త, విజిలెన్స్, ఏసీబీ వ్యవస్థలకు పట్టిన గతే పడుతుంది. తేలును జేబులో వేసుకుని తిరిగితే...'మంత్ర' గాడు పక్కనున్నా సరే, కుట్టక మానదు.

17-04-2011

"పెట్టుబడులు దోపిడీ సొమ్మే" — మంజరి లక్ష్మి

విమర్శ : "పెట్టుబడిదారుడు ఎప్పుడూ కార్మికుడి శక్తిని కొనేవాడిగానే ఉంటాడుగానీ తన శ్రమతో తయారైన ఏ వస్తువునూ కార్మికుడికి అమ్మేవాడిగా ఉండడు. ఇదే ఈ సంబంధంలో ఉన్న వైరుధ్యం".

స్పందన : పెట్టుబడిదారుడు కార్మికుని శ్రమకు చెల్లించడానికి డబ్బు ఎక్కడ్నించి వచ్చిందో ఆలోచించండి. పూర్వాశ్రమంలో తాను చేసిన శ్రమతో, అందులో మిగిల్చి, పొదుపు చేసిన సంపదతోనే కదా! అంతేగాక, వాడికి నష్టం వస్తే, ఎవరి అదనపు శ్రమను ఎవరు దోచుకున్నట్లు?

"గందరగోళపరిచే రాతలు" — ఎస్. వీరయ్య.

విమర్శ : "అభివృద్ధి బాటలో పరుగులు తీసిన అమెరికా, జపాన్, ఫ్రాన్స్ తదితర ఆర్థిక వ్యవస్థలు అంతర్గత వైరుధ్యాలతో కుప్పకూలాయి..."

స్పందన : కుప్పకూలుతుండడం వాస్తవం. అంతర్గతంగా భావజాల వైరుధ్యాలూ వాస్తవమే. కానీ అవి కుప్పకూలడానికి కారణం ప్రజల స్వేచ్ఛను హరించి, సంక్షేమం పేరిట ఓట్ల వేటలో పరుగులు తీయడం వల్ల.

విమర్శ : "ప్రపంచ ధనికుల లిస్టులో చేరుతున్న భారతీయుల సంఖ్య వేగంగా పెరుగుతుంటే మరోపక్క దారిద్ర్యం, రైతుల ఆత్మహత్యలు, శిశుమరణాలు... వెంటాడుతూనే ఉన్నాయి"

స్పందన : సోషలిజం ముసుగులో అయినదానికి, కానిదానికీ ప్రభుత్వం ఆర్థిక, సామాజిక వ్యవస్థల్లో జోక్యం చేసుకుని; 'వ్యక్తి అభివృద్ధి'ని అడ్డుకోవడం వల్లే – దారిద్ర్యం ఇంకా మిగిలి ఉంది. తమ అనుమతి లేకుండా, తమకు ఓట్లేయకుండా ఎవరూ దారిద్ర్యరేఖను దాటకూడదనే దుష్ట రాజకీయానికి – మనమే సకల అధికారాలూ కట్టబెట్టాం. ఈ మాత్రమయినా ముందుకెళ్లామంటే కారణం – మనిషిలో సహజంగా ఉండే స్వలాభాపేక్షవల్లనే తప్ప; సోషలిజం వల్ల కాదు.

విమర్శ : 'పెట్టుబడిదారీ వ్యవస్థను ఎవరూ బలవంతంగా కాపాడలేరని, సహజ సూత్రాల ఫలితంగానే కుప్పకూలుతుందన్న విషయం గుర్తించడం మంచిది".

స్పందన : ఇదే మాట 1850 లో పశ్చిమ దేశాలనుద్దేశించి మార్క్స్, ఏంగెల్స్ చెప్పారు. కుప్పకూలిపోయిందెవరో మన కళ్ళ ముందే చూశాం.

"మత్తుమందు కాదు, మానవతా ప్రదీప్తి" పవన రవికుమార్, ఎస్.ఎఫ్.ఐ

విమర్శ : "ఉత్పత్తి మానవుల అవసరాల మేరకు కాకుండా 'ఉత్పత్తి కోసం' అవసరాలను సృష్టించడానికి మార్క్సిజం వ్యతిరేకం"

స్పందన : వ్యక్తికి ఏది అవసరమో వ్యక్తే నిర్ణయించకుంటాడా లేక మార్క్సిస్టులు నిర్ణయిస్తారా? ఎంచక్కా గుర్రాలు, బగ్గీలు ఉండగా మోటారు కారును సృష్టించడానికి మార్క్సిస్టులు వ్యతిరేకమా?

విమర్శ : "మతాలు భావవాద సిద్ధాంతాలతో, మార్క్సిజం భౌతికవాద సిద్ధాంతంతో నడుస్తాయి."

స్పందన : విద్యార్థి సంఘం కార్యకర్త గనక ఒకసారి Open mindతో పరిశీలించండి – బైబిలు ప్రకారం మనిషి మొట్టమొదట్లో గార్డెన్ ఆఫ్ ఈడెన్‌లో కష్టం లేకుండా బ్రతికేవాడట. నిషిద్ధ ఫలాన్ని ఆరగించడం ద్వారా పాపం చేశాడని; ఆ పాపమే ఈ ప్రాపంచిక జీవితంలో మనిషిని వెంటాడుతోందని క్రైస్తవులు నమ్ముతారు. మళ్లీ రాబోయే "భూమిపై దేవుని రాజ్యం"లో అందరూ (ఆ దేవుణ్ణి నమ్మిన వారందరూ) తమ పాపాలను కడిగేసుకుని, స్వర్గసుఖాలను అనుభవించొచ్చని కూడా నమ్ముతారు. కొద్దిపాటి తేడాలతో దాదాపు అన్నీ మతాలూ ఇదే వేదాంతం చెబుతాయి. మనిషి మొదట్లో దేవునితో కలిసిపోయి ఏకాత్మగా ఉండేవాడని... దేవుణ్ణించి విడిపోబట్టి ఈ కష్టాలు, ఒంటరితనం, పరాయీకరణ అనుభవిస్తున్నాడని, యుగాంతం వస్తుందని, అప్పుడు మళ్ళీ దేవుడిలో కలిసిపోయి మోక్షం పొందుతాడనీ చెబుతాయి.

క్రీస్తు శకం మొదట్లో రోమను సామ్రాజ్యంలో క్రైస్తవం కొత్తగా విస్తరించే రోజుల్లో దేవుని రాజ్యం ఇంకెంతో దూరం లేదని, అదుగో వచ్చేస్తోందని ప్రచారం చేసేవాళ్ళు నమ్మినవాళ్ళు నమ్మేవాళ్ళు. ప్రతి ప్రకృతి వైపరీత్యాన్నీ రాబోతున్న మహా ప్రళయానికి, ఆ తర్వాత వచ్చే దేవుని రాజ్యానికి సూచన అనుకునేవారు. ఇప్పటికీ కొన్ని మత సంస్థలు ఏవేవో లెక్కలు వేసి రాబోయే యుగాంతానికి తారీఖులు నిర్ణయించడం చూస్తూనే ఉన్నాం. స్వస్థత కూటములో స్వదేశీ, విదేశీ మత ప్రచారకులు దేవుని రాజ్యం గురించి ఉత్తేజపూరితమైన ఉపన్యాసాలిచ్చి. రోగులను, అనాథలను, అభాగ్యులను ఉన్మాద స్థాయికి

తీసుకెళ్ళడం టీవీల్లో కూడా చూపిస్తారు. అదే ఉన్మాద స్థాయిలో ఒక మతం కోసం అమరులైతే స్వర్గంలో తమ కోసం వేచి ఉండే సుఖాలను వర్ణించి...; ప్రాణాలను తృణ ప్రాయంగా వదిలే టెర్రరిస్టులను కూడా తయారుచేస్తారు.

సోషలిస్టుల సిద్ధాంతం, ఎత్తుగడలు కూడా అలాగే ఉంటాయి. పూర్వకాలంలో తన సొంత ఉత్పత్తి సాధనాలతో తనకు సరిపడా సంపాదించుకుని మనిషి సుఖంగా బ్రతికేవాడట. (కానీ ఈ కాల్పనిక సౌఖ్యంలో ఆయుష్షు తక్కువగా ఉండేదని, అందుకే జనాభా పల్చగా ఉండేదని చెప్పడం మరుస్తారు). ఉన్నచోట ఉండకుండా స్వార్థానికి లోనై, స్వంత ఆస్తి ఏర్పరచుకొని, ఇక్కడిదాకా వచ్చి, నిరంతర సంక్షోభాలను ఎదుర్కొంటున్నాడట. తన ఉత్పత్తిమీద హక్కు కోల్పోయి, విషాదకర పరాయీకరణ భారాన్ని అనుభవిస్తున్నాడట. (మరి ఎవరో ఉత్పత్తి చేసిన కూరగాయలు, మందులు, బస్సులు, సినిమాలు మనం అనుభవిస్తున్నప్పుడో?).

అతి చేరువలో ఉన్న సోషలిస్టు సమాజంలో ఏ బాధలు లేకుండా స్వర్గ సుఖాలను అనుభవిస్తాడట. అప్పుడు పనిని కూడా ఒక ఆటలాగా ఆనందిస్తాడట. కాసేపు పనిచేసి, కాసేపు పాటలు పాడుకుని, కళను ఆస్వాదిస్తూ, తనలోని వివిధ శక్తులను, ప్రతిభలను బయటకు తీసి, సమాజపరం చేసి తరిస్తాడట. తనకు కావలసినంత మాత్రమే తీసుకుంటాడట. రాజ్యరహిత సమాజంలో నూతన మానవుడే రాజు, దేవుడు అవుతాడట!

విప్లవం ఎంతోదూరంలో లేదని, అన్ని దేశాలూ సంక్షోభంలో కూరుకుపోయి, విప్లవ దిశగా ముందడుగు వేస్తున్నాయని ప్రతి కమ్యూనిస్టు పార్టీ మీటింగులోనూ కాసెట్ వినిపిస్తారు. తమ దారిద్ర్యానికి, దౌర్భాగ్యాలకు, సంపాదించే ఇతరులే కారణమని, సమసమాజం కోసం, తమ వాటా కోసం ఉద్యమించమనీ, విప్లవించమనీ, వినేవాళ్ళను ఉన్మాద స్థాయికి తీసుకెళతారు.

మత్తు కలిగించే లక్షణంలో మరి మతానికి, మార్క్సిజానికి తేడా ఏమన్నా ఉందేమో మీ లాంటి యువకులే నిర్ణయించుకోవాలి.

24-04-2011

నిషేధం వెనుక నిజాలు

ఈ మధ్య ఎండోసల్ఫాన్‌ను నిషేధించాలని కొత్తగా ఒక ప్రాయోజిత ఉద్యమం మొదలైంది. వామపక్ష ఆస్థాన మేధావులందరూ తమ అభిప్రాయాలను వెల్లడించారు. కొందరు ఎండోసల్ఫాన్‌ను నిషేధించమంటే, మరికొందరు అసలు పురుగు మందులన్నిటినీ నిషేధించాలన్నారు.! కొందరేమో అసలు మానవాళికి ప్రధానమైన సమస్య–ఆధునిక టెక్నాలజీయేనని, పారిశ్రామికవేత్తల స్వార్థ ప్రయోజనాల కోసమే తప్ప; ఈ టెక్నాలజీ ప్రజల కోసం కాదనీ వాదిస్తారు. కొన్ని వాస్తవాలను పరిశీలిద్దాం.

వందలాది పురుగు మందుల్లో ఎండోసల్ఫాన్ ఒకటి. ఒక జర్మన్ బహుళజాతి సంస్థ కనిపెట్టగా – గత నలభైయేళ్ళ నుంచీ వాడకంలో ఉంది. అన్ని పురుగుమందులూ ఎంతో కొంత అవశేషాలను పంటలమీద మిగులుస్తాయి. ఆ అవశేషాలు ఏ స్థాయి వరకు ఉంటే ప్రమాదం లేదో శాస్త్రవేత్తలు ఎప్పటికప్పుడు పరిశోధనల ద్వారా నిర్ధారిస్తారు. కొత్త పురుగుమందుల్ని తయారు చేయాడానికి వందల కోట్ల రూపాయల ఖర్చు, ఎన్నో సంవత్సరాల శ్రమ అవసరం. కాబట్టి, బహుళజాతి సంస్థలే ఈ పరిశోధనల్లో ముందుంటాయి. పేటెంటు ఉన్నంతకాలం అధిక ధరలు వసూలు చేసి, ప్రయోగాలకు పెట్టిన ఖర్చు పూడ్చుకుని ఇంకొంత లాభాలు ఆర్జిస్తున్నాయి.

పేటెంటు కాలం ముగిశాక అందరూ తయారు చేస్తారు. రేట్లు పడిపోతాయి. కాబట్టి ఆ పురుగు మందులు మార్కెట్‌లో ఉండకూడదని బహుళ జాతి సంస్థలు కోరుకుంటాయి. నాలుగైదు స్వచ్ఛంద సంస్థలకు విరాళాలిచ్చి ఆ పురుగుమందులు ప్రమాదకరమైనవనీ, నిషేధించాలనీ ఉద్యమాలు సృష్టిస్తాయి. ప్రభుత్వాల మీద ఒత్తిడి తీసుకొస్తాయి. ఖరీదైన వకీళ్ళతో కోర్టుల్లో కేసులు వేయిస్తాయి. మనం ఇచ్చిన అంతులేని అధికారాలతో, ఉద్యమాల సాకు చూపి ప్రభుత్వాలు ఆ మందుల్ని నిషేధిస్తాయి.

వాటి స్థానంలో కొత్తమందులు రావడం, వాటి పేటెంటు కాలం తీరిపోయాక మళ్ళీ కథమామూలే. బహుళ జాతి సంస్థల ప్రయోజనాల కోసం ఉద్దేశించిన ఎండోసల్ఫాన్ నిషేధం ఉద్యమాన్ని – వామపక్షాలు భుజాన వేసుకోవడమే విచిత్రం.

ధనిక దేశాల్లో ప్రజల ఆహారంలో పురుగు మందుల అవశేషాల పట్ల అత్యంత జాగ్రత్తలు పాటిస్తారు. ఉత్పత్తి గొలుసు కట్టులో – అన్ని స్టేజిల్లోనూ ప్రమాణాలు పాటించేలా జాగ్రత్తపడతారు. దానివల్ల ఆహారం ధరలు బాగా పెరుగుతాయి. కలిగిన మా రాజులు కాబట్టి వారికి ఇబ్బంది లేదు. ఉదాహరణకు, యూరప్‌లో స్వచ్ఛమైన టమోటాలు కిలో మూడువందల రూపాయలు. దాదాపు సంవత్సరం పొడుగునా అదే రేటు. ప్రమాణాలేమీ పాటించని మలేషియాలో అరవైరూపాయలు. అసలు ప్రమాణాలే లేని మన దేశంలో గత రెండునెలలుగా – రేటు నాలుగు రూపాయలు. కొద్ది రోజులపాటు ఇరవై, ముప్ఫై రూపాయలకు పెరిగితే ఎంత గొడవైందో గుర్తుండే ఉంటుంది. వినియోగదారులు ఎక్కువ ధరకు కొనగలిగితే యూరోపు ప్రమాణాలతో ఆహారం పండించడం మన దేశంలోనూ సాధ్యమే. సగటు భారతీయ వినియోగదారుడి ముందున్న సమస్య–కిలో నాలుగైదురూపాయల్లో పురుగుమందుల అవశేషాల మోతాదు కొంత ఎక్కువగానే ఉన్న ఆహారం కొని, తిని, ఇంకొంత కాలం బతకడమా; లేక అసలు ఆహారం కొనుక్కోలేక ఆకలితో మరణించడమా అనేది.

ఇవేమీ గమనించకుండా – పాశ్చాత్య దేశాల ప్రమాణాలు మనకూ కావాలనుకోవడం – పులిని చూసి నక్క వాత పెట్టుకోవడం లాంటిది. అలాగే, భూతాపం పెరిగిపోతోందని..., కర్బన వాయువులు వాతావరణాన్ని అతలాకుతలం చేస్తున్నాయని కాబట్టి అభివృద్ధి ఆపేయాలని..., మనిషి పాదముద్రల దుష్ప్రభావం సున్నితమయిన భూమి మీద పడనీయకూడదనీ – చిన్న పిల్లల దగ్గర్నుంచీ నూరిపోస్తున్నారు.

కానీ ఈ థియరీలలో దేనికీ సరిపడా శాస్త్రీయ ఆధారాలు లేవు. ఇది మేధో ప్రపంచంలో ఒక సరికొత్త ఫ్యాషనై కూర్చుంది. ప్రభుత్వాల పరిశోధనా నిధులన్నీ అటువైపే ప్రవహిస్తున్నాయి. పి.హెచ్.డీలు, నోబుల్ బహుమతులు పొందడం – ఇలా అగ్నికి ఆజ్యం తోడై ఈ భావనలు దావానలంలా విస్తరిస్తున్నాయి. వీటిలో ఏ ఒక్క సిద్ధాంతమూ విస్తృత స్థాయిలో శాస్త్రీయ పద్ధతిలో నిరూపితం కాలేదు. అయినా వాటినే పట్టుకుని మేధావులు... మీడియా... చివరికి – రాజకీయనాయకులు కూడా ఐన్‌స్టీన్ స్థాయిలో మానవాళికి సలహాలిస్తున్నారు.

ప్రతి తరంలోనూ అప్పుడున్న టెక్నాలజీ బట్టి కొన్ని సవాళ్ళు ఎదురవుతాయి. ఆ సవాళ్ళను ఎదుర్కొని, అధిగమించాలే తప్ప – టెక్నాలజీని, శాస్త్రాన్ని బయట పడెయ్యడం

పరిష్కారం కాదు. 1900 సంవత్సరంలో పట్టణవాసుల ప్రధాన సమస్య గుర్రాల పేడ. పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా అప్పటి ప్రయాణ సాధనమైన గుర్రాల, బళ్ళు పెరిగిపోయాయి. గుర్రాల పేడను ఎలా తొలగించాలన్నది ఒక ప్రధాన సమస్యయి కూర్చుంది. ఇంకో యాభై సంవత్సరాల్లో ఇంకా ఎన్ని గుర్రాలు పెరుగుతాయో ; వాటిని కట్టేయడానికి స్థలం ఎక్కడ చూపాలో తెలియక సతమతమయ్యేవాళ్ళు.

ఇంతలో టెక్నాలజీ మారిపోయింది. మోటారు కార్లు వచ్చాయి. ముప్ఫైయేళ్ళలో గుర్రాలు లేవు. పేడ సమస్యా లేదు. ముందుముందు ఏ పరిజ్ఞానం రాబోతుందో ఈనాటికీ ఎవరికీ తెలియదు. ఉన్న పరిజ్ఞానాన్ని ఉపయోగించుకునే పరిణతి కూడా చాలామందికి లేదు. వీరంతా కలిసి కొత్త పరిజ్ఞానాన్ని, కొత్త పరిశ్రమలను అడ్డుకోవడం ఎవరి బాగుకోసం చేస్తున్నట్లు? ఉదాహరణకు ఈ మధ్య కురిసిన అకాల వర్షాల వల్ల వేలాది ఎకరాల్లో కళ్ళాల్లో ఉన్న పంట తడిసిపోయి రైతులు నష్టపోయారు. కానీ వర్షాలు పడబోతున్నాయని ఇంటర్నెట్‌లో ఉచితంగా దొరికే వెబ్‌సైట్లలో వారం ముందునుంచే హెచ్చరికలున్నాయి.

ఎంతసేపూ జగన్, సాయిబాబా, సినిమాలు, క్రికెట్ తప్ప రాబోతున్న ప్రమాదం గురించి తగిన స్థాయిలో హెచ్చరించాలని ఏ మీడియాకూ అనిపించలేదు. ఇక ప్రభుత్వ ఆధీనంలో ప్రజల సొమ్ముతో నడిచే – వాతావరణ పరిశోధనా కేంద్రాల గురించి మాట్లాడ్డమే దండగ.

దుమ్ములేస్తుంది కాబట్టి ఓపెన్ కాస్ట్ గనులు వద్దట. దగ్గర్లో ఉన్న భూముల మీద బూడిద పడుతుందేమో కాబట్టి థర్మల్ విద్యుత్ కేంద్రాలు వద్దంట. అణువిద్యుత్ ప్రమాదం కాబట్టి, అదీ వద్దంట. జపాన్‌లో అంత పెద్ద ప్రమాదంలో ఎంత మంది చనిపోయారు? మరి అమెరికాలో టోర్నడో వల్లే 300 మంది చనిపోయారే! భావి తరాలకు మిగల్చాలి కాబట్టి పెట్రోలియం తవ్వకం, వాడకం తగ్గించాలట. మన ముందు తరాలు కూడా ఇలాగే అనుకుని ఉంటే; రైళ్ళు, విమానాలు, రోడ్లు, మందులు, గుండె ఆపరేషన్లు, ఇంత ఆహారం, ఫోన్లు, విద్యుత్తు తయారయ్యేవా?

ఇవేవీ లేకపోతే బావుణ్ణని ఎవరైనా అనుకుంటున్నారా? మరి మనం అనుభవించే సరకులు, సౌఖ్యాలు, వసతులు మన భావి తరాలు అనుభవించొద్దనడానికి మనమెవరం? తన కారులో ఏసీ, పవర్ స్టీరింగు ఉండాలి. ఛీఛీ ఈ ట్రాఫిక్ ఎలా పెరిగిపోయిందో! (తనది తప్ప), కొన్ని వాహనాలను నిషేధిస్తే తప్ప బతకలేం. తన పిల్లలకు ప్లాస్మా టీవీ అయితే తప్ప క్రికెట్ మ్యాచ్ చూసినట్టు ఉండదు. నూట ఇరవై అయిదు కోట్లమందికి ముప్పూటలా సరిపడా తిండి దొరకాలి. ఎండోసల్ఫాన్ నిషేధించాలి, విప్లవం వర్ధిల్లాలి!

01-05-2011

ఒసామా వాదం - సశేషం

ఎట్టకేలకు ఒసామా హతమయ్యాడు. కొందరు సంతోషించారు. కొందరు అమెరికాను నిందించారు. కొందరు అతనిలో ఒక హీరోను చూశారు. మరికొందరు అమరవీరుడని కీర్తించారు. కొందరైతే ఈ సంఘటనలో ఉగాది పచ్చడిలా, మంచీ, చెడులు రెండూ ఉన్నాయిలే అని నిర్వేదపడ్డారు. ఇంతకూ ఒసామా లక్ష్యాలేమిటి? అతను స్వప్నించిన భవిష్యత్ ప్రపంచ స్వభావమేమిటి? ఎంచుకున్న మార్గమేమిటి? అతను కేవలం ఒక వ్యక్తా, లేక బలమైన భావజాలం వెన్నుదన్నుగా ఉన్న శక్తా? ఇవన్నీ తరచి చూస్తే గానీ అతని మరణ ప్రభావాన్ని సరిగ్గా అంచనా వేయలేం.

చరిత్ర 2001 సెప్టెంబర్ 11 తోనే మొదలుకాలేదు. ఒసామా గానీ, అతని భావజాలం గానీ హఠాత్తుగా ఊడిపడలేదు. దానికి సుదీర్ఘమైన గతం ఉంది. 14వ శతాబ్దంలో మధ్యప్రాచ్యంలో ఇబన్ తయిమియా అనే ఇస్లాం మతబోధకుడు ఉండేవాడు. అతని దృష్టిలో - అప్పట్లో ఇస్లాం మతం వివిధ అన్యమత సంప్రదాయ ధోరణులతో మలినమైంది. మహ్మద్ ప్రవక్త చెప్పిన ప్రకారం ముస్లింలు నడుచుకోవడం లేదనీ, కాబట్టి దాన్ని శుద్ధిపరచవలసి ఉందనీ, ఒక ప్రచార ఉద్యమం లేవదీశాడు. అప్పట్లోని రాజులకు ఇది కంటగింపుగా ఉన్నా, సామాన్య ప్రజల్లో ఆయనకు ఆదరణ ఉండేది.

ఆయన మరణం తర్వాత కూడా అక్కడక్కడా ఆ ఆలోచనలు ప్రాచుర్యంలో ఉండేవి. 18వ శతాబ్దంలో అవే ఆలోచనలను తీవ్రమైన కార్యరూపంలోకి తెచ్చిన వ్యక్తి ముల్లా అల్ - వహాబ్. ఇప్పటి సౌదీరాజుల పూర్వీకులు, అల్ - వహాబ్ కలిసి వహాబీ ఉద్యమం లేవనెత్తారు. అనేక దండయాత్రలు, అపార రక్తపాతం జరిగాక అరబ్బీ ఎడారుల్లో ఒక రాజ్యాన్ని ఏర్పాటు చేశారు. వారి భావజాలం ప్రకారం ముస్లింల ప్రవర్తన, జీవన విధానం ఖురాన్, షరియత్, హదిత్ తదితర గ్రంథాల్లో రాసిన ప్రకారం మాత్రమే ఉండాలి. వాటిని జవదాటిన ముస్లింలను శిక్షించాలి. అల్లాని నమ్మని వారిని, ఇతర

మతస్తులపై జిహాద్ ప్రకటించి వారందరినీ అంతమొందించాలి. ఇది ప్రతి ముసల్మాను ధర్మం. ఈ యుద్ధంలో మరణించిన వారు ఖచ్చితంగా స్వర్గానికి వెళతారు. విజయం పొందినచో... భూమి మీదే అల్లా రాజ్యంలో ప్రవక్త చూపించిన మార్గంలో సుఖంగా బతుకుతారు. ఇదీ వహాబీ భావజాలం.

ఇస్లాం మత సూత్రాల ప్రకారం షరియత్ లాంటి ఇస్లామిక్ చట్టాలు అమలయ్యేదే ముస్లిం రాజ్యం. అటువంటి రాజ్యంలో ఇమామ్ మతపెద్ద. అమీర్ అనే ఆయన ప్రభుత్వానికి, సైన్యానికీ పెద్ద. ప్రజలేం చేయవచ్చో, చెయ్యకూడదో ఫత్వాలు జారీ చేసే అధికారం ఇమామ్‌కు ఉంది. అమీర్ చెయ్యాల్సిందల్లా ఫత్వాలను అమలు చేయడం, జిహాద్‌కు సారథ్యం వహించడం, సేనలను నడిపించి ప్రపంచం మొత్తాన్ని ఇస్లామిక్ రాజ్యంగా మార్చే ప్రయత్నం నిరంతరం కొనసాగించడం. సౌదీ అరేబియాలో రాజ్యపాలన ఈ భావజాలాన్ని అనుసరించే జరుగుతుంది. అల్ – వహాబ్ వారసులే అక్కడ ఇప్పటికీ ఇమామ్‌లు. ఇబన్ సౌద్ వారసులే అమీర్లు. షరియత్ చట్టం అమలవుతోంది. కొరడా దెబ్బలు, వేలాదిమంది చూస్తుండగా, కాళ్ళు, చేతులు, తలలు నరకడాలు ఇప్పటికీ అమలవుతున్నాయి. ఒసామా కోరుకున్న సమాజ స్వభావం ఇంకా వందల రెట్ల భయంకరమైనది. అటువంటి సమాజంలో వ్యక్తి స్వేచ్ఛకు చోటేలేదు. అందరూ ముల్లాల కనుసన్నల్లోనే నడవాలి. సంగీతం నిషిద్ధం. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ ఉండదు. బ్యాంకులు గానీ, ఎవరు గానీ వడ్డీ వసూలుచేయడం ఖురాన్‌కు విరుద్ధం. బురఖా వేసుకోకుండా ఉండే స్వేచ్ఛ – ఏ స్త్రీకి ఉండదు. స్త్రీలు ఒంటరిగా ఎక్కడకీ వెళ్ళకూడదు. రంజాన్ మాసంలో ఉపవాసం పాటించకపోతే, శిక్ష తప్పదు. మరి వ్యక్తి స్వేచ్ఛ ఏపాటిదో ఊహించుకోగలం. వ్యక్తి ఒక మత సూత్రాలకు – శాశ్వత బందీ.

మధ్యయుగాల్లో ఈ రకమైన మత మౌఢ్యం క్రిస్టియన్లలోనూ ఉండేది.

మతం పేరుతో దండయాత్రలు సాగేవి. రకరకాల సంస్కరణ ఉద్యమాలు, సాంస్కృతిక పునరుజ్జీవనం, పారిశ్రామిక విప్లవం వాటి ప్రభావాల కారణంగా పరిస్థితి మారింది. అత్యంత ఛాందస భావాలుండే వాటికన్ కూడా మారింది. మనిషి ఏ మతాన్ని అనుసరించయినా... భగవంతుణ్ణి దర్శించవచ్చు, చేరవచ్చు అని అధికారికంగా ప్రకటించింది. కానీ, ఇస్లాం మతంలో ఆ స్థాయిలో ఇంకా ఆధునికత రాలేదు. ఈ మధ్య మక్కాలోని ఇమామ్‌లు సమావేశమై ఇస్లాంలోని సున్నీ, షియా లాంటి వివిధ శాఖలు ఇస్లాంలో భాగమేననీ, వారు అంతర్గతంగా సంఘర్షించుకోవద్దనీ ప్రకటించారు. కానీ, ఇతర మతాల గురించి, జిహాద్ గురించి ఇంకా ఏమీ చెప్పలేదు. మనిషిని ఒక వ్యక్తిగా కాక; ఒక మతస్తుడిగా చూడ్డం తప్పు. వ్యక్తికి ఏ మతాన్నైనా అనుసరించే స్వేచ్ఛ, అసలు

ఏ మతమూ వద్దనే స్వేచ్ఛ సహజంగానే సిద్ధించాయి. ఆ స్వేచ్ఛను కాలరాసే హక్కు ఒసామా కాదు, వహాబీ కాదు, ఎవరికీ లేదు. ఒసామాలాంటి వారిని ప్రతి ఒక్కరూ నిరసించాలి. ప్రతిఘటించాలి. అలాంటి నిరంకుశ ఆలోచనల్ని అంతమొందించాలి. తాను వంటబట్టించు కున్న మత మౌఢ్యం కోసం వేలాది మంది ప్రాణాలు తీయడానికి వెనకాడని వారికి ఏ హక్కులూ మిగలవు.

విచిత్రమేమిటంటే, వేల సంవత్సరాల క్రితం రాసిన మత గ్రంథాల ఆధారంగా వ్యక్తి స్వేచ్ఛను హరించి, సమాజాన్ని మెడలు వంచి నడిపించాలని కోరుకునే వారు కొందరు. అలాంటి తాలిబన్ల ఆధిపత్యంలో నడిచిన ఆఫ్గానిస్తాన్ కడు పేదరికంతో, అవిద్యతో నరకప్రాయంగా తయారైన విషయం కళ్ళముందు కనిపించినా, వారి మతస్వప్నం వీడదు. అలాగే – అహేతుకం, అశాస్త్రీయం అని తేలినా... తెలిసినా; కొన్ని వందల సంవత్సరాల క్రితం రాసిన సోషలిస్టు పవిత్ర గ్రంథాల ఆధారంగా కార్మికవర్గం పేరిట నియంతృత్వాన్ని నడపాలని కోరుకునే వారు మరికొందరు.

కళ్ళ ముందు సోవియట్ యూనియన్ పతనం, చైనా పీఛే మూడ్, కంబోడియాలో కంకాళాల గుట్టలు కనబడినా సోషలిస్టు స్వప్నం – వారిని వీడదు. ఇద్దరూ అధర్మవాదులే, ఇద్దరికీ ఆదర్శం నియంతృత్వమే. ఇద్దరి స్వభావం ఒక్కటే, కానీ; భావజాలాల దాయాదులు కదా, ఇద్దరూ బద్ధ శత్రువులు. ఇద్దరూ వ్యక్తి స్వేచ్ఛకు, వ్యక్తి వికాసానికి శాశ్వత శత్రువులు.

08-05-2011

గెలిచిందెవరు?

కడప ఉప ఎన్నికల్లో ప్రచార తీరు, హోరు చూసి చాలామంది ఆశ్చర్యపోయారు. ఫలితాలు చూసి ఇంకా ఎక్కువ మంది హడలిపోయారు. ప్రజాస్వామ్య ప్రక్రియ అపహాస్యానికి గురైందా? ఎన్నికల్లో గెలుపును అడ్డం పెట్టుకుని అడ్డగోలు అక్రమాలకు, సంపాదనకు పాల్పడ్డా - ప్రజల్లో చలనం లేదా? చైతన్యం లేదా? ఇంతింత డబ్బు పంపకాలకు అలవాటు పడ్డాక; ఎన్నికల పట్ల ఓటర్ల ఆలోచనలను ఎప్పటికైనా మార్చగలమా? ఇలా అనేక సందేహాలు వెంటాడుతున్నాయి.అర్థం చేసుకోవాల్సిన విషయమేమిటంటే, ఈ పరిస్థితి ఒక్క రోజులో రాలేదు.కొన్ని దశాబ్దాలుగా నూరిపోసిన భావజాలం, ఐడియాల ఫలితమిది. విలువలిలా పడిపోయాయేమిటా అని ఇప్పుడు వగచి ఏమీ లాభం లేదు.

స్వాతంత్ర్యం తర్వాత మనం ఎంచుకున్న సోషలిస్టు పంథా ప్రకారం; దేశ ప్రజల సంపాదన, సహజవనరులు, ప్రజల స్వేచ్ఛ, చివరికి వారి ఆలోచనా సరళి అన్నీ ప్రభుత్వపరమై పోయాయి. అంతులేని అధికారాలు..., వచ్చి పడిన పన్నుల సొమ్ముతో - పంపకాల కార్యక్రమం మొదలు పెట్టారు. ప్రజల్ని రకరకాల సమూహాలుగా విభజించి, ఏదో ఒకటి ఉచితంగా ఇచ్చి, వారిని స్వప్రయోజన వర్గాలుగా తయారు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు ఒక వర్గం, షెడ్యూల్డు కులాలు ఒక వర్గం, రైతులు ఒక వర్గం, మైనారిటీలు, బీసీలు, దీపం మహిళలు, డ్వాక్రా మహిళలు, సొంత జిల్లావారు, సొంత కులం, సొంత పార్టీ వారు- ఇలా ఒకటికాదు. ఎన్ని రకాలుగా విభజించొచ్చో చేసి చూపించారు. నాయకుల, పార్టీల సృజనాత్మకత అంతా ఎన్నికల సమయానికి కొత్త వర్గాలను తయారుచేయడం; వారికి ఉచిత వరాలు ప్రసాదించడంగా మారింది.

ఇదంతా ఎందుకు చేశారు? ప్రజల మీద ప్రేమతోనా...? లేక నిజంగా సమ సమాజస్థాపన పట్ల నిబద్ధతతోనా? రెండూ కాదు. ఏదో 'మాయఫెస్టో' చూపి - గెలిచాక; కొన్ని వర్గాలకు పడేయాల్సింది పడేశాక... ఇక తెరచాటు సంపాదన మొదలెడతారు.

ప్రభుత్వోద్యోగుల్ని బదిలీ చేయడానికి డబ్బు. బదిలీ చేయకుండా ఉంచడానికి డబ్బు. పథకాల అమలుకు జరిపే కొనుగోళ్ళ ద్వారా డబ్బు. వసూలు చేసిన పన్నుల డబ్బుతో రోడ్లేసినా, కాలువలు తవ్వినా, అన్నిట్లోనూ డబ్బే. తన నియోజకవర్గంలో ఏ బదిలీ జరిగినా, ఎవరు కాంట్రాక్టు పట్టినా తన అనుమతి కావాల్సిందే. తనను కలిసి, ముడుపులు... వంగి వంగి వందనాలు చెల్లించుకుంటే తప్ప; అన్నీ ఆపేస్తారు. ఈ రకంగా, సంపాదించడానికి ఎన్ని మార్గాలున్నాయో కనిపెట్టడంలో కూడా కాలక్రమేణా మన నాయకులు సృజనాత్మకతను చూపారు. అప్పనంగా వస్తున్న ఇంత సొమ్ము, దానికి తోడు, ప్రజానాయకుడు... మహానేత అన్న బిరుదులు.

గౌరవం వదులుకోలేరు కాబట్టి... తిరిగి ఎన్నికవడం కోసం ఖర్చు చేయడానికి వెనుకాడరు. ఎంత ఖర్చు పెట్టినా దాన్ని పెట్టుబడిగానే భావిస్తారు. ఉచిత పథకాలకు ఎలాగూ అలవాటు పడ్డ ప్రజలకు ఎన్నికలవేళ డబ్బు, మద్యం, బిర్యానీ పంచడంలో కొత్తగా వచ్చిన నైతిక సమస్య ఏమీ లేదు. ***అదీగాక, ఎలక్షన్ కమిషన్, కోర్టులు, మీడియా, మేధావుల పిచ్చిగానీ; గెలిస్తే కలర్ టీవీ పంచుతాననడం అనైతికం కానప్పుడు...; గెలుపు కోసం డబ్బు పంచడం అనైతికం ఎలా అవుతుంది?.*** ఈ అక్రమ సంపాదన, అనైతిక పంపిణీ, అనైతిక గెలుపు, తిరిగి అక్రమ సంపాదన అనే చక్రం ఒకసారి పూర్తయ్యాక, ఎవరు మంచి, ఎవరు చెడు అనే మీమాంస తొలగిపోయింది. ఎన్నికలపుడు పంచిన డబ్బు తీసుకున్న ప్రజలు నాయకులను ప్రశ్నించే అర్హత కోల్పోయారు. అనైతికంగా అంతంత డబ్బు సంపాదించిన నాయకులు, డబ్బు తీసుకోకుండా ఓటేయమని అడిగే యోగ్యతను కోల్పోయారు. చివరికి మేధావి వర్గం కూడా చేతులెత్తేసింది. అవున్లే పాపం, ఎన్నికల్లో అంత ఖర్చు పెట్టాక సంపాదించుకోకుండా ఎలా ఉంటారులే అని పార్టీలు, నాయకుల పట్ల సానుభూతి. ఇన్ని వేల కోట్లు సంపాదించుకున్నారు కదా...; అయినా ఓటుకు రెండొందలే ఇస్తున్నారు, ఓటర్లు ఆశించినట్లుగా కనీసం వెయ్యి రూపాయలైనా ఇవ్వడం లేదేమని బహిరంగ ప్రశ్నలు.

హేతుబద్ధంగా ఆలోచించి, సరైన తాత్విక దృష్టితో చూస్తే...; ప్రభుత్వం ఏర్పరచుకున్నది - ప్రజల ధన, మాన, ప్రాణాలను రక్షించడానికి. వ్యక్తుల మధ్య వచ్చే తగాదాలను పరిష్కరించే న్యాయవ్యవస్థను నడపడానికి మాత్రమే. అంతకుమించి ఎందులో తల దూర్చినా అది అహేతుకం, అనైతికమే. ప్రజలు ప్రభుత్వం నుంచి ఆశించాల్సింది తమ మానవ సహజసిద్ధమైన స్వేచ్ఛకు రక్షణ మాత్రమే. అంతేగానీ, రెండు రూపాయలకు కిలో బియ్యమో, ఉచిత విద్యుత్తో, పనిచేయకున్నా ఫర్వాలేని ప్రభుత్వోద్యోగాలో కాదు. ఈ విషయంలో ఎవరు కాలు జారినా, అది ఒక విషయంతో ఆగదు. కాలుజారిన విషయాన్ని వెంటనే గుర్తించి, దాన్ని తప్పుబట్టి, వెనక్కు తీసుకోవాలని ఒత్తిడి తేగల మేధో వాతావరణం ఉన్నప్పుడు మాత్రమే - ఈ తప్పిదాలు ఆగుతాయి. కాలు జారడమే ఆధునిక సామాజిక విప్లవం, ఎదుటివాడి జేబు కొట్టేయడం ఒక గౌరవప్రదమైన ఉద్యమం అనే భావనలు వ్యాపింపజేస్తే -

ఫలితాలు ఇదుగో ఇలాగే ఉంటాయి. ఒక ప్రభుత్వంతో పోటీపడి ఇంకోటి ; ఒక స్వప్రయోజన వర్గంతో పోటీగా ఇంకో వర్గం. రాజకీయ, సామాజిక, భావజాల భ్రష్టత్వాన్ని పరాకాష్టకు తీసుకెళతాయి. ఇప్పటికే తీసుకెళ్లాయి. అలా తయారైన నేటి సమాజంలో హేతుబద్ధత (ఆబ్జెక్టివిటీ), వివేకం (రేషనాలటీ), తర్కం (లాజిక్) అంతర్ధానమయ్యాయి. అశాస్త్రీయ, అహేతుకమైన భావనలు, వాదనలే అందరి ఆలోచనలనూ ప్రభావితం చేస్తున్నాయి. వారసత్వవాదం, సెంటిమెంటు, సానుభూతి, (నాయకుడి) ఆత్మగౌరవం, భాష, ప్రాంతం, కులం, మతం, రంగు, రక్తం – ఇలాంటి అప్రధాన, అహేతుక అంశాలే రాజకీయ చర్చలో ముఖ్యపాత్ర వహిస్తున్నాయి. మడమ తిప్పని వంశం అనే వారొకరు, తొడకొట్టేవారొకరు, మా కులానికెప్పటికీ ఇవ్వరా అనే వారొకరైతే, మా ప్రాంతంలో అడుగుపెడితే ఖబడ్దార్ అనేవారు ఇంకొకరు. ఇటువంటి చర్చల్లో మనిషి స్వేచ్ఛ, దాన్ని రక్షించాల్సిన ప్రభుత్వం ప్రాథమిక బాధ్యత అనే విషయాలకు ఎక్కడైనా చోటుందా? అసలు తన హక్కులేమిటో, ఏవి హక్కులు కావో, ప్రభుత్వం నుంచి ఏం కోరుకోవాలో, ఏం ఆశించకూడదో, మన డబ్బు కొట్టేసి మనకే ఉచిత వరాలిస్తానంటున్నవాడు నాయకుడా, మాయలోడా అనే వివేచన కోల్పోయిన జనం ఈ సెంటిమెంట్ల నిషాలో ఊగిపోయి ఓట్లేయడం ఇది మొదటిసారీ కాదు, చివరిసారీ కాబోదు.

ఇంతకుముందు తెలంగాణలో జరిగిన ఉప ఎన్నికలలో, అంతకుముందు కరీంనగర్‌లో కూడా ఇదే తంతు. ఏదో పేదలకు సాయం చెయ్యాలన్నాం కానీ అవినీతికి పాల్పడమన్నామా అని సోషలిస్టులు వాపోతారు. కానీ వారు గుర్తించడానికి ఇష్టపడని వాస్తవం ఏమిటంటే, సోషలిస్టు భావజాలం, ఐదేళ్ళకోసారి ఎన్నికలొచ్చే ప్రజాస్వామ్య ప్రక్రియ – ఈ రెండూ కలిస్తే కల్తీ కల్లు లాంటి విషం తయారవుతుంది. అది జాతి నరనరాల్లోకి ఎక్కి, నిర్వీర్యం, నిస్తేజం చేసేస్తుంది. పంచమనడం తేలికే. కానీ ఎవరి దగ్గర్నుంచి ఎంత లాక్కుని, ఎవరికి ఎంత పంచాలో తేల్చడంలోనే ఉంది ఓట్ల సంఖ్యా శాస్త్రమంతా. అసలీ గుంజడం, పంచడం రెండూ అనైతికమేనని ఎప్పటికి తెలుసుకుంటాం? సకాలంలో మేలుకోకపోతే ఈ దిగజారుడు ఇంకా ఇంకా లోతైన ఊబిలోకి నెడుతుంది. ఎక్కడో, ఏదో తప్పు జరిగిపోయిందని తెలుసుకోవడానికి, ఆ ఊబిలోంచి బయటపడే బలమైన ప్రయత్నం చెయ్యడానికి దశాబ్దాలు పట్టొచ్చు – బీహార్, బెంగాల్‌లో లాగా. కానీ ఈలోగా తరాలు తరలిపోతాయి. అవకాశాలు తరిగిపోతాయి, కాలం కదలిపోతుంది. మహాభారత యుద్ధానంతరం మిగిలిన వల్లకాడులాంటి స్థితే మనకూ మిగులుతుంది. సజీవ ప్రవంతైన సమాజంలోని వ్యక్తులు ఏనాడైతే మేల్కొని ఆలోచిస్తారో, వ్యక్తి స్వేచ్ఛ, పరిమిత ప్రభుత్వాలను ప్రప్రధానమైన అంశాలుగా గుర్తిస్తారో అదే పండగ రోజు. అప్పుడే విముక్తి.

15-05-2011

వ్యర్థ సిద్ధాంతాలు

రంగా, నాయక్ శ్రీకాకుళంలో పదవతరగతి తప్పారు. ఉద్యోగం వేటలో హైదరాబాదొచ్చారు. ఒక ఇరానీ హోటల్లో పనిచేశారు. భోజనం పెట్టి, నెలకు వెయ్యిరూపాయలు జీతం. నెలకు రెండొందలు ఖర్చు పెట్టుకుని మిగతాది రంగా దాచుకున్నాడు. నాయక్ సినిమాలు, బట్టలు, ఐస్‌క్రీముల మీద ఏ నెలకానెల ఖర్చు చేసేవాడు. సంవత్సరం తిరిగింది. రంగా మిగుల్చుకున్న పదివేలతో ఒక తోపుడు బండి, దానిమీద టీస్టాలు సామాను కొనుక్కున్నాడు. రోజూ పేపరు చదివి మీటింగులు, ధర్నాలు, పూజలు ఎక్కడున్నాయో – అక్కడ బండి పెట్టేవాడు. బాగాసాగింది. ఆ చేసే ఉద్యోగం తన దగ్గరే చెయ్యమని నాయక్‌నీ చేర్చుకున్నాడు. రెండేళ్ళలో సొంత హోటల్‌కి యజమాని అయ్యాడు. నాయక్ తన దగ్గరే పనిచేస్తున్నాడు.

సోషలిస్టు మేధావుల సిద్ధాంతం ప్రకారం "రంగా, నాయక్ శ్రమని దోచుకునే ఇంతటి వాడయ్యాడు. శ్రమపడకుండా కూర్చుని సంపాదిస్తున్నాడు. నాయక్‌కి వర్గ కసి ఉండడం న్యాయమే. ఆ కసితో రంగాను చంపినా అది ఉద్యమమవుతుందేకానీ, హత్యకాదు." ఇదీ వరస. ఇది కట్టుకథ కదా అనవచ్చు.

నిజం కథలూ అలాగే ఉంటాయి. లక్షల కోట్ల విలువైన ఇన్ఫోసిస్ స్థాపించిన నారాయణమూర్తి ముప్ఫై రెండేళ్ళ క్రిందట కేవలం పదివేల రూపాయలతో మొదలయ్యాడు. చదువులేని వాళ్ళకైతే తమ శ్రమను ఎవరెలా దోచుకుంటున్నారో మేధావులు చెబితే తప్ప తెలుసుకోలేరనుకోవచ్చు. అంత జ్ఞానం ఉన్న ఇంజనీర్లంతా ఇన్ఫోసిస్‌లో పనిచెయ్యాలని కోరుకుంటారేం? ఎవరి దగ్గరా పదివేలు లేకనా? ప్రపంచపు మొదటి బిలియనీర్, చమురు పరిశ్రమకు ఆద్యుడు – రాక్‌ఫెల్లర్. రోజుకు అర్ధడాలరు జీతంతో పనిచేసి, నాలుగువేల డాలర్ల అప్పుతో పరిశ్రమ మొదలెట్టాట్ట. అలాగే మధ్యపశ్చిమ అమెరికాలో జిగురు నేలలు దున్నడం సాధ్యంకాని రోజుల్లో – జాన్‌డీర్ అనే ఆయన పోత ఉక్కు నాగలి కర్రును కనిపెట్టాడు. దాంతో కోట్ల మంది ఆ ప్రాంతానికి వలసవెళ్ళి వ్యవసాయం చేశారు.

మెకానిక్‌గా మొదలై పరిశ్రమ స్థాపించి వేలమంది కార్మికులకు యజమాని అయ్యాడు. అదనపు శ్రమ దోచుకుని మానవాళికి ఎంత అన్యాయం చేశాడో కదా!!

వస్తువు విలువ – దాన్ని తయారు చేయడానికి పట్టే శ్రమరూపంలో లెక్కించాలన్నది ఒక ఆర్థిక సిద్ధాంతం. కాపిటలిజానికి పితామహుడిగా భావించే 18వ శతాబ్దపు ఆడమ్ స్మిత్ దగ్గర్నుంచి, 19వ శతాబ్దపు కారల్‌మార్క్స్ వరకు ఈ సిద్ధాంతాన్ని సమర్థించారు. తర్వాత ఈ సిద్ధాంతం తప్పని రుజువైంది. ఆ పొరపాటు పునాదులమీద పుట్టినవే అదనపు శ్రమ, శ్రమ దోపిడీ, అదనపు విలువ తదితర సిద్ధాంతాలు. వీటి డొల్లతనం సైద్ధాంతికంగానూ, ఆచరణలోనూ నిరూపణైంది. ఈ విషయం కొందరు సోషలిస్టులకు అసలు తెలియకపోవచ్చు కూడా. కాకపోతే, సోషలిజమే మెరుగైన ఆర్థిక విధానమని ప్రచారం చెయ్యడానికి మాత్రం ఈ సిద్ధాంతం భేషుగ్గా పనిచేస్తుంది. మార్క్స్‌నుంచి నేటి మేధావుల వరకు దీన్ని ఒక ప్రచారాస్త్రంగా వాడుకోవడం అలవాటైంది. వారి దృష్టిలో భౌతిక శ్రమ మాత్రమే శ్రమకింద లెక్క.

వాస్తవానికి సంపద భౌతిక శ్రమ నుంచి కాదు, మనిషి మేధస్సు నుంచి పుడుతుంది. కేవలం భౌతిక శ్రమ ద్వారా అడవిలో కందమూలాలు ఏరుకోవడం మినహా మనిషి ఏమీచెయ్యలేడు. ఇక్కడి దాకా వచ్చేవాడే కాదు. చివరికి ఒక వలో, చేతిలో రాయో, ఉంటే తప్ప కుందేలును కూడా పట్టలేడు. అవన్నీ మేధస్సు నుంచి పుట్టినవే. మనిషి వేలాది సంవత్సరాలుగా సంపాదించి, కొంత కూడబెట్టి, వలల నుంచి ఓడల వరకు ఉత్పత్తి సాధనాలను పెంచుకొని, తద్వారా ఉత్పాదకతను కొన్ని వందల రెట్లు పెంచుకుని, ఇన్ని వస్తు, సౌకర్యాలను అనుభవిస్తున్నాడు. కేవలం కాళ్ళు, చేతులతో ఉత్పత్తి జరగదు. అలా జరిగేదైతే సెల్‌ఫోన్ తయారుచెయ్యడానికి ఇన్నివేల సంవత్సరాలు పట్టదు. గతంలో మనుషులు ఇప్పటికంటే ఎక్కువ శ్రమ పడేవారు. కానీ జీవన ప్రమాణాలు ఇప్పటికంటే చాలా అధమ స్థాయిలో ఉండేవి.

మనుషులంతా ఒక్కలా ఉండరు. శారీరక, మానసిక, ముఖ్యంగా –మేధోస్థాయిలో వ్యత్యాసాలుంటాయి. అది సహజం. ఒక పిరమిడ్‌లాగా అత్యుత్తమ మేధోస్థాయి గలవారు కొద్దిమందే ఉంటారు. వాళ్ళే నాగరికతకు, మానవజాతి పురోగమనానికి ముఖ్య చోదకులు. కొత్త పరిజ్ఞానం, ఐడియాలు సామాన్య ప్రజలక్కూడా ఉపయోగపడేలా రూపొందిస్తారు. వారికంటే కాస్త క్రింద స్థాయి గలవారు మేనేజర్లు, టెక్నీషియన్లుగా పనిచేస్తారు. పూర్తిగా క్రిందిస్థాయిలో ఆలోచించ గలిగే వాళ్ళు మాత్రం కేవలం తమ భౌతిక శ్రమ శక్తిమీద ఆధారపడతారు. దీర్ఘకాలిక వ్యూహం, దార్శనికత లేకుండా నైపుణ్యాన్ని పెంచుకునే ప్రయత్నం కూడా చెయ్యక, కొంత అభద్రతతో ఏరోజుకారోజుగా బ్రతుకుతారు. ఈ పిరమిడ్‌లో ఏ స్థాయివారైనా యజమానీ కావచ్చు. జీతానికి పనిచేసే వారైనా కావచ్చు.

అదివారి ఇష్టాయిష్టాలపై ఆధారపడి ఉంటుందే తప్ప అసహాయత కాదు. కారు డ్రైవరుగా ఉండాలో, బండిమీద కూరగాయల వ్యాపారం చేసుకోవాలో అతనిష్టం. ఇంద్రాసూయీ పెప్సీ కంపెనీకి యజమానికాదు, ఉద్యోగినే. పెప్సీ షేర్ హోల్డర్లందరూ ఆమె శ్రమను దోచేస్తున్నట్లా?

రైతు అయినా.... రాక్‌ఫెల్లరైనా ఉత్పత్తి చేయాలంటే మేధస్సు కావాలి; స్వలాభపేక్ష ఉండాలి. చెయ్యనిచ్చే స్వేచ్ఛ ఉండాలి. వీటిలో ఏదిలేకున్నా ఉత్పత్తి జరగదు. ఇందులో లాభం వస్తుందో, నష్టం వస్తుందో ఆయా పరిస్థితులను బట్టి ఉంటుంది. సరైన నిర్ణయాలు తీసుకోకపోయినా నష్టం రావచ్చు. సగందూరం వెళ్ళాక – సర్కారు వారు రూల్సు మార్చినా నష్టం రావచ్చు. ఉదాహరణకు పంట చేతికొచ్చే సరికి ధాన్యం ఎగుమతులు నిషేధిస్తే రేట్లు పడిపోయి నష్టం రాక ఏమవుతుంది? పిరమిడ్‌లో పైస్థాయిలో ఉన్నవారు మానవాళికి చేసిన మేలుతో పోలిస్తే, వాళ్ళు పొందేది చాలా స్వల్పం. పెట్రోలు, ట్రాక్టరు, కంప్యూటర్ కనిపెట్టిన వారి రుణం ఏమిచ్చి తీర్చుకోగలం? ఈ పిరమిడ్‌లో క్రింద ఉన్నవాళ్ళు తమ శ్రమకు పూర్తి ఫలితంతో పాటు పైవాళ్ళు అందించిన మేధోశక్తి ఫలాలను కూడా పొందుతారు. చౌకగా మందులు, ప్రయాణ సాధనాలు, ఆహార లభ్యత, విశ్రాంతి, పదిరూపాయలకు సినిమా, పదిపైసలకు ఫోన్‌కాల్ – ఇవన్నీ మేధోశక్తి సంపన్నుల పుణ్యమే. మరి ఎవరి శ్రమను ఎవరు దోచుకున్నట్లు?

గడియారం, డీజిలింజను, విమానం, బిటి విత్తనాలు మనిషి మేధస్సుకు ఘనీభవించిన ప్రతిరూపాలు. వాటిని చూసి మనిషిగా పుట్టినందుకు గర్వపడాలి. శ్రామికుడిని బానిసగా భావించడం అమానవీయం. మనం అప్పనంగా ఇచ్చిన అధికారాలను అడ్డంపెట్టుకుని వేలకోట్లు సంపాదించే వసూల్‌రాజాలను కేపిటలిజం ప్రతినిధులుగా ప్రచారం చెయ్యడం ఒక కుట్ర. లేదా కనీసం అవివేకం. సహజవనరులు, శ్రమ ఎప్పుడూ ఉన్నాయి. మేధోశక్తి, ఉత్పత్తి సాధనాలు ముందుకు రాకపోతే అవి ఉన్నచోటే ఉంటాయి. మేధో పిరమిడ్‌లో పైనున్నవారు – క్రిందివారు చేసే పనులు చెయ్యగలరు. నాయక్ చేసే పని రంగా చెయ్యగలడు. కానీ రంగా చేసింది నాయక్ చెయ్యలేడు. అతని మానసిక స్థాయి అంతే. అందులో తప్పేంలేదు. ఆ ఇద్దరూ చేసే పనుల్లో – ఏదీ చెయ్యని వాళ్ళు కొందరుంటారు. లేనివర్గాలను సృజించి, లేకి భాషలో వాళ్ళ మధ్య సంఘర్షణ, నిస్పృహల విషం చిలకరించే పూర్తికాలపు వృత్తిలో ఉంటారు. శ్రమదోపిడీ దారులు అలాంటివారు కాక ఇంకెవరు?

22-05-2011

ధాన్యం - ధైన్యం

చేతికొచ్చిన ధాన్యం అమ్ముకోలేక రైతులు దిగాలు పడిన వైనం అందరం చూశాం. ఈ పరిస్థితి ఎందు కొచ్చిందో విశ్లేషిస్తే ఇది ఆరంభం మాత్రమేననీ, రాబోయే కాలం ఇంకా విషాదమయమనీ అర్థమవుతుంది. మనదేశంలో వ్యవసాయం దాదాపుగా జాతీయం చెయ్యబడింది. రైతు తన భూమికి పేరుకు మాత్రమే యజమాని. రకరకాల ప్రణాళికలు, పథకాలు, చట్టాలు, నియంత్రణల ద్వారా వ్యవసాయానికి సంబంధించిన దాదాపు అన్ని వ్యవహారాలూ ప్రభుత్వం తన గుప్పెట్లో పెట్టుకుంది. వ్యవసాయానికి కావలసిన రుణాలు, వడ్డీరేట్లు, కూలీరేట్లు, విత్తనాల ధరలు, నాణ్యత, లభ్యత, పరిశోధన, పురుగుమందులు, ఎరువుల ధరలు, పండించిన దాదాపు ప్రతిపంటకూ ధరల నిర్ధారణ – అన్నీ ప్రభుత్వమే నిర్దేశిస్తోంది. రైతుకు నిర్ణయాధికారం పేరుకు మాత్రమే ఉంది. ఇది హిట్లరు జమానాలో జర్మనీలో అమలుచేసిన నేషనల్ సోషలిజం లాంటిది. అటువంటి వ్యవస్థలో రైతును ఎప్పటికైనా కోలుకోనిస్తారను కోవడం అత్యాశే అవుతుంది. రైతు కేవలం పండించి పెట్టే సామాజిక సాధనం మాత్రమే. ప్రతి ఎన్నికల సమయానికీ తాత్కాలికంగా సంతుష్టులను చేసే పథకాలను విసరడం, ఓట్లు వేయించుకోవడం, ఎన్నికలైనాక ఇచ్చిన దానికి రెట్టింపు వేరే రూపంలో లాక్కోవడం. ఇదే జరుగుతున్న కథ.

2009 ఎన్నికలకు ముందు రైతుల రుణాలు మాఫీ చేసి, దానికి బహుళ ప్రచారం కల్పించి, ఓట్లేయించుకుని గెలిచారు. 2014 ఎన్నికలకు అదే మంత్రం పారదు కదా! కాబట్టి ఇప్పుడు ఆహార భద్రత అనే కొత్త మంత్రాన్ని తయారుచేస్తున్నారు.

దేశంలో అందరికీ మనిషికి ఇన్ని కిలోల చొప్పున చవగ్గా ఆహారధాన్యాలు సరఫరా చేస్తారట. ఎంత చవకంటే, దాదాపు ఉచితంగా ఇచ్చినంత చవక. మరి దీనికి డబ్బెవరిస్తారు? పన్నుల డబ్బు. చాలకపోతే నోట్ల ముద్రణాలయం ఉండనే ఉంది. చూసేవాళ్ళకు, "ఆహా, ఎంత గొప్ప ఆలోచన, దేశ ప్రజలందరికీ ఆకలంటే ఏమిటో

తెలియకుండా మూడు పూట్లా భోజనం దొరుకుతుంది కదా!" అనిపిస్తుంది. దీనికి సోషలిస్టు మేధావుల వైపునుంచి పూర్తి సమర్థత లభిస్తుందని పాలకులకు తెలుసు. ఏ రాజకీయ పార్టీ కూడా ఈ పథకాన్ని విమర్శించే సాహసం చెయ్యదు. పేదవర్గాల ప్రజలందరూ ఈ పథకం పెట్టిన పార్టీని అన్నపూర్ణగా పొగిడి వెల్లువలా ఓట్లేస్తారు. సమస్యలేమైనా వస్తే ఆ తర్వాత చూసుకుందాంలే అనుకుంటారు.

ఈ పథకానికి – ఇప్పుడు ధాన్యం అమ్ముడుకాకపోవడానికి సంబంధం ఏమిటంటే – దేశంలో అతిపెద్ద ధాన్యం వ్యాపారి ప్రభుత్వం. ఎఫ్‌సిఐ ద్వారా ఏటా కొన్ని కోట్ల టన్నుల ధాన్యాన్ని తనకిష్టమైన రేటుకు కొని నిల్వచేస్తుంది. అందులో కొంత పాడుచేస్తుంది, కొంత పారబోస్తుంది. ఈ నష్టాలన్నీ మనం కట్టే పన్నుల సొమ్ము ఖాతాకే జమ. ఎఫ్‌సిఐ కొనగా మిగిలినదాన్ని – ధాన్యం వ్యాపారులు కొన్ని వేల పేజీల నిబంధనల నడుమ కొని, బహిరంగ మార్కెట్‌లో అమ్ముతారు. వారు కొన్న ధాన్యాన్ని జిల్లా, రాష్ట్రం, దేశం బయట అమ్ముకోవచ్చో లేదో ఎప్పటికప్పుడు రాష్ట్రం, కేంద్ర ప్రభుత్వాలు నిర్ణయిస్తాయి. అన్ని అధికారాలు ప్రభుత్వం చేతిలో పెట్టుకుంది. ఈ నిబంధనలు, అనిశ్చితి వాతావరణం తట్టుకోలేక – చిన్న వ్యాపారులెవరూ అటువైపుకుపోరు. రాజకీయ అండ, బోలెడు డబ్బు ఉన్న పెద్దవ్యాపారులే ఈ రంగంలో మిగిలారు. రైతులందరూ తమ ధాన్యాన్ని ఎఫ్‌సిఐకో, ఈ వ్యాపారులకో అమ్ముకునే దాకా ఎవరూ ఏమీ మాట్లాడరు. ఆ తర్వాత ప్రజా ప్రతినిధులను వెంటేసుకుని వెళ్ళి, ప్రభుత్వం మీద పలుకుబడి ప్రయోగించి ఎగుమతులకు అనుమతులు తెచ్చుకుంటారు. తద్వారా అడ్డగోలు లాభాలు సంపాదిస్తారు. అందులో కొంత తమకు సమయానికి పనికొచ్చే ప్రజాప్రతినిధులకు ఎన్నికల కోసం చందాలిస్తారు. ఎన్నికల సమయంలో ఓటుకింత చొప్పున పంచడానికి నాయకులకు కూడా చందాలు అవసరమే కదా! ఎవర్ని తప్పు పట్టాలి?

చివరకు రైతుకు మిగిలేది చిప్ప. ఆ చిప్ప పట్టుకుని మళ్ళీ ప్రభుత్వం దగ్గర ముష్టెత్తుకుంటే ఏదో ఇన్‌పుట్ సబ్సిడీనో, ఇంకో పదేళ్ళకు రుణ మాఫీనో రాకపోదు. అంతదాకా ఆగలేని వాళ్ళు ఆత్మహత్య చేసుకుంటారు. వచ్చే ఎన్నికల్లో విజయం కోసం ఆహార భద్రత అనే తురుపుముక్కని ఎంచుకున్నారు కాబట్టి, కేంద్ర ప్రభుత్వం ఇప్పట్నుంచే దానికి కాలవసిన ఏర్పాట్లు మొదలుపెట్టింది. పంట బాగా పండింది. నిల్వ చెయ్యడానికి గోదాములు లేవు. అయినా ఎగుమతులకు అనుమతిస్తే రేట్లు పెరుగుతాయి. ఒకసారి రేట్లను పెరగనిస్తే వచ్చే సంవత్సరం తక్కువ రేట్లకు ధాన్యం సమీకరించలేరు. సమీకరించ లేకపోతే 2012-13 నుంచి ఆహారభద్రత పథకం అమలు చెయ్యలేరు. అందుకే ఎగుమతులాపేశారు. ఈ విషయం గమనించే మిల్లర్లు కూడా కొనడం మానేశారు.

తద్వారా ధాన్యం మార్కెట్‌లో సంక్షోభం ఏర్పడింది. అదుగో కొంటున్నామని... సంచులు రాలేదనీ... తాత్సారం చేస్తారు. ఒకపక్క వేసవి వర్షాల భయం. ఇంకోవైపు వీళ్ళ వాలకం చూస్తే అసలు కొంటారో కొనరో తెలియదు. దాంతో రైతులు అయినకాడికి అమ్ముకుని బయటపడే తొందరలో ఉన్నారు. ఈ రకంగా ధాన్యం రేటు మూడేళ్ళ క్రింద ఉన్న స్థాయికి దిగజారింది. ఇదీ మన ప్రభుత్వాల చలవ.

రైతు దేశానికి వెన్నెముక అని ఉపన్యాసాలు దంచని రోజుండదు. తమది రైతు ప్రభుత్వమని పదేపదే చెబుతారు. తామిచ్చిన ఉచిత విద్యుత్, చేసిన రుణమాఫీలను తార్కాణాలుగా చూపుతారు. చేయబోతున్న ఉచిత ఆహార పథకం గురించి కూడా వివరిస్తారు. ప్రజలకు అన్నం పెడుతుంటే విమర్శిస్తావా అని హూంకరిస్తారు. ఇదంతా ఎవరిసొమ్ముతో చేశారు నాయనలారా అని ఎవరూ అడగరు, వారూ చెప్పరు.

ఆహార భద్రత పుణ్యమాని ముఖ్యంగా ఆహారధాన్యాలు పండించే రైతులు భవిష్యత్తులో ఇంకా దుర్భర పరిస్థితులను ఎదుర్కోబోతున్నారు. ఈ సంక్షోభాన్ని ముందే ఊహించి రాయడం జరిగింది. కానీ ఈ పథకం కార్పొరేట్ వర్గాల ఆలోచననీ, ఇంకా ఏమేమో విమర్శించారు గానీ అసలు మర్మం గ్రహించలేదు. చితికిపోయిన రైతు, కూలీ రేట్లు పెంచలేకపోతాడు. అప్పుడు వ్యవసాయ కూలీల పరిస్థితి కూడా దుర్భరమవుతుంది. ఎంత చవగ్గా సేకరించినా ఖర్చు ఖర్చేగనక ఈ పథకం అమలుకు పన్నులు పెంచుతారు, రూపాయిలు ముద్రిస్తారు. దాంతో ద్రవ్యోల్బణం తప్పదు.

ప్రజల ఆర్థిక వ్యవహారాల్లో ప్రభుత్వ జోక్యం అనేది – పాతివ్రత్యం పోగొట్టుకోవడం లాంటిది. ఒకసారి జరిగితే అంతటితో ఆగదు. ఒక జోక్యంతో కలిగే దుష్పరిణామాలను సరిదిద్దే ప్రయత్నంలో ఇంకో జోక్యం. ఇలా దానికి అంతుండదు. చివరికి ఏ తప్పు మరే తప్పుకు దారితీసిందో కూడా తెలుసుకోలేని చిక్కుముడులు పడిపోతాయి. అప్పుడు పండించే రైతుకు, కష్టించే ప్రజలకు కూడా ఆహార భద్రత ద్వారా పడేసే చిప్పకూడే దిక్కు.

29-05-2011

నల్లధనం పుట్టిళ్ళు

విదేశాల్లో దాచిన నల్లధనాన్ని వెలికితీయాలని గడచిన సార్వత్రిక ఎన్నికల నాటి నుంచీ రాజకీయ ధ్వనులు వినిపిస్తున్నాయి. దానికి వికీలీక్స్, ఇతర విదేశీ మీడియాలో స్విస్ బ్యాంకుల్లో భారతీయులు దాచిన లంకె బిందెల కథనాలూ తోడయ్యాయి. ఈ నల్లధనం ముఖ్యంగా రెండు రకాలుగా జమ అవుతుంది. మొత్తం నల్లధనంలో కొద్దిశాతం వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు, బ్రోకర్లు దాచుకునేది. పన్నులు కట్టడం ఇష్టంలేకో, తమ షేర్ హోల్డర్ల కళ్ళు గప్పి సొంతం కోసం దాచుకోవడానికో; ఇతర దేశాల్లో పెట్టుబడి పెట్టడానికి ఉన్న నియంత్రణలను అధిగమించడానికో, అన్నింటికంటే ముఖ్యంగా రాజకీయ పార్టీలకు, నాయకులకు లంచాలివ్వడానికో డబ్బు విదేశాలకు చేరవేస్తారు.

ఎక్కువ శాతం నల్ల డబ్బు విదేశాల్లో దాచేది – రాజకీయ నాయకులు, పార్టీలు. ఆ అవకాశం, అవసరం ఎక్కువగా ఉండేది వారికి మాత్రమే. స్వాతంత్ర్యం వచ్చినప్పట్నుంచి మొదలుకొని సోషలిస్టు విధానాల పేరుతో దేశంలోని భారీ పరిశ్రమలు దాదాపుగా అన్నీ ప్రభుత్వం ఆధీనంలోనే నడిచాయి. వీటికి కావలసిన యంత్రసామాగ్రి విదేశాలనుంచి దిగుమతి చేసుకున్నదే. అలాగే దిగుమతయ్యే ముఖ్య అవసర వస్తువులు – చమురు, వంట నూనెలు, పంచదార, ఎరువులు, లోహాలు – అన్నీ ప్రభుత్వరంగ సంస్థల ద్వారానే దేశీయ మార్కెట్‌కు అందేవి. ప్రైవేటు పరిశ్రమలు, వ్యాపారులు చేసుకున్న ఎగుమతులు, దిగుమతులపై కూడా లెక్కలేనన్ని నియంత్రణలు విధించి; వారంతా ప్రతి పర్మిట్, లైసెన్స్ కోసం ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిరిగేలా చేశారు. ఎగుమతులకు ప్రోత్సాహకాలు, దిగుమతులపై సుంకాల పేరుతో మొత్తం విదేశీ వ్యాపారమంతా ప్రభుత్వం, దాన్ని నడిపే రాజకీయ పార్టీల చెప్పుచేతల్లో ఉంచుకున్నారు. అంతేకాకుండా భారీ నీటి పారుదల, రోడ్లు, విద్యుదుత్పాదక కేంద్రాలు వంటి భారీ ప్రాజెక్టులన్నీ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల

చేతుల్లోనే ఉన్నాయి. పేరుకు టెండర్ల ప్రక్రియ, కాగితాల మీద అంతా ఓకే అనిపించినా– లంచం డబ్బులు అందనిదే పనులు మొదలు కావు, బిల్లులు రావు. ఇన్ని మార్గాల్లో ఎక్కడపడితే అక్కడ డబ్బులు రాలే వ్యవస్థను ఏర్పరచుకున్నారు.

ఇన్ని అవకాశాలుండబట్టి దేశాన్ని అత్యధిక కాలం పరిపాలించిన రాజకీయ పార్టీ – నల్లడబ్బు సేకరణలో అందరికంటే ముందుంది. అదీగాక తాళాలు కూడా దాదాపు పూర్తి కాలం ఒకే కుటుంబం చేతుల్లో ఉన్నాయి. అరవైయేళ్ళ నుంచి జమచేసిన మొత్తాలు పిల్లల్ని పెడుతూ బోలెడంత పోగైంది. ఈ విధానం – పై స్థాయిలో ఉన్న రాజకీయ నాయకులందరికీ పాకింది. ఎన్నికల్లో కొన్నిసార్లు ఓడిపోక తప్పదు కాబట్టి ఇలా దాచుకున్న డబ్బు అధికారంలో లేని రోజుల్లో పార్టీ నడపడానికి పనికొస్తుంది. అధికార పార్టీ కక్షసాధింపు, గాలింపులకు – ఇది దొరకదు. అందుకనే – ప్రతిపక్ష పార్టీ రూపంలో కూడా ఎన్నికలు ఎదుర్కొన్నప్పుడు అధికార పార్టీకి ధీటుగా ఖర్చు చేయగలుగుతారు. ఈ రకంగా రాజకీయ పార్టీలకు, నాయకులకు విదేశాల్లో నల్లధనం దాచుకోవడం అత్యంత అవసరం. ఇదంతా గమనిస్తే ఎన్నికల్లో మనం కష్టపడి ఓడిస్తున్నది ఎవరిని... అనే సందేహం కలగక మానదు.

ప్రభుత్వాల విశేషాధికారాలను సొమ్ము చేసుకోవడం, ఆ నల్లడబ్బును స్విస్ బ్యాంకుల్లో దాచుకోవడంలో మనవాళ్ళతో పాటు వెనుకబడిన, అభివృద్ధి చెందుతున్న ఆఫ్రికా, ఆసియా దేశాల నాయకులందరూ ముందు వరుసలోనే ఉంటారు. కాకపోతే వాటితో పోల్చినపుడు భారతదేశం పరిణామం జనాభాలో చాలాపెద్దది కాబట్టి మన వాళ్ళ పేరు కాస్త ఎక్కువగా వినపడుతుంది. కానీ పశ్చిమదేశాలు, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి దేశాల్లో ఈ పోకడలు చాలా పరిమిత స్థాయిలో ఉంటాయి. దానికి కారణం తెల్లవాళ్ళు, నల్లవాళ్ళన్న తేడా కాదు. ఆ దేశాల్లో కూడా కొన్ని పరిశ్రమలు – ముఖ్యంగా రక్షణ రంగానికి సంబంధించి – ప్రభుత్వ నియంత్రణల మధ్యే పని చేస్తాయి. అక్కడ కూడా పన్నుల వసూళ్ళు ఎక్కువే. వాళ్ళు గత వంద సంవత్సరాలుగా సోషలిస్టు విధానాలు అనుసరించడంలో ముందంజలోనే ఉన్నారు. కానీ ఆఫ్రికా, ఆసియా దేశాల స్థాయిలో అక్కడ అవినీతిగానీ, నల్లడబ్బు కూడబెట్టడం గానీ లేదు. దానిక్కారణం ఆ దేశాల్లో రాజకీయాలు పరిణామం చెందిన క్రమం వేరు.

పశ్చిమ దేశాలు కూడా మధ్యయుగాల్లో భయంకరమైన మత, ఫ్యూడల్ వ్యవస్థల గుండా ప్రయాణించాయి. ఆ తర్వాత సాంస్కృతిక పునరుజ్జీవనం, మేధోవికాసం, మరుగునపడిన అరిస్టాటిల్ కాలం నాటి తాత్విక భావజాలాన్ని వెలికితీయడం ద్వారా రాజకీయ ఆలోచనల్లో పెనుమార్పులు వచ్చాయి. ముందుగా రాజ్యాన్ని మతం నుంచి

విడదీయడంలో సఫలీకృతులయ్యారు. ఆ తర్వాత రాజ్యాన్ని ప్రజల ఆర్థిక వ్యవహారాల నుండి దూరం చేశారు. వ్యక్తి స్వేచ్ఛకు పట్టం కట్టారు. కష్టపడి సంపాదించి, పొదుపు చేసి, తద్వారా పెట్టుబడులు పెట్టి, యాంత్రీకరణ ద్వారా మరింత ఉత్పత్తి చేయడానికి కావలసిన రాజకీయ వాతావరణం ఏర్పడింది. దాంతో తక్కువ కాలంలోనే ప్రపంచంలోకెల్లా అత్యాధునిక ఉత్పత్తి సాధనాలను ఏర్పరచుకున్నారు. కొన్ని అపభ్రంశాలున్నప్పటికీ, రాజ్యం ముఖ్యంగా కేవలం ప్రజల ధన, మాన, ప్రాణాల రక్షణకే పరిమితమైంది. కొత్తగా ఏర్పడ్డ అమెరికా – ఈ విషయంలో ప్రపంచానికి వెలుగుదివ్వె చూపింది. కాపిటలిజం బలంగా వేళ్ళూనుకుంది. పారిశ్రామిక విప్లవం అప్రతిహతంగా సాగింది. వారి సాంకేతిక, ఆర్థిక ఆధిక్యతకు అడ్డులేకుండా పోయింది. పెద్దస్థాయిలో సంపద పోగయ్యింది. సామాన్యుల జీవన ప్రమాణాలు అనూహ్యంగా పెరిగాయి.

20వ శతాబ్దం మొదట్లో, మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత, సోవియట్ రష్యా అవతరణ నేపథ్యంలో సోషలిస్టు భావజాలం రాజకీయ నాయకులకు అక్షయపాత్రలాగా దొరికింది. అప్పట్నుంచి ఒకరిని మించి ఒక దేశ నాయకుడు ప్రజల ఆర్థిక వ్యవహారాల్లో తలదూర్చడం మొదలుపెట్టారు. ఒంటె – గుడారం సామెతలాగా మెల్లమెల్లగా మొదలైన ఈ భావజాలం – ఓట్లు 'కొని' తెచ్చే సాధనంగా మారి, ప్రవాహమైకూర్చుంది. అయినప్పటికీ, మౌలికంగా వ్యక్తి స్వేచ్ఛకు అత్యధిక ప్రాధాన్యమిచ్చే నేపథ్యం ఉన్న సమాజాలు కావడంతో పశ్చిమదేశాల్లో ఈ సోషలిస్టు పోకడలు ప్రత్యక్ష అవినీతికి దారితీయలేదు. అదీగాక ప్రజల ఆర్థిక వ్యవహారాలకు – రాజ్యం – కొన్ని వందల సంవత్సరాలుగా దూరంగా ఉండడంతో మన దేశంలో జరిగే స్థాయిలో నల్లధనం పోగేసే అవకాశం, అవసరం వాళ్ళకు కలగలేదు. భారతదేశంలాగే చాలా ఆఫ్రికా, ఆసియా దేశాలు ఫ్యూడల్, వలసవాద వ్యవస్థల నుంచి తిన్నగా సోషలిస్టు భావజాల ప్రేరిత వ్యవస్థల్లోకి ప్రవేశించాయి కాబట్టి అపసవ్యాలు ఎక్కువ.

అసలు కాపిటలిజమంటే ఏమిటో, వ్యక్తి స్వేచ్ఛ వల్ల జరిగే మేలు ఏమిటో మనమెప్పుడూ అనుభవించి చూడలేదు. ఆ కారణంగానే – ఆ స్థాయిలో సంపద పోగవ్వలేదు. జీవన ప్రమాణాలు పశ్చిమదేశాల స్థాయికి ఎన్నడూ చేరుకోలేదు. పాలించే మారాజులు అన్యాయం చెయ్యడం, అక్రమ సంపాదన చేసి దాచుకోవడం లాంటి వాస్తవాల్ని ఫ్యూడల్ వ్యవస్థ కాలంలో ప్రశ్నించే సాహసం ఎవరికీ ఉండేది కాదు. అదే అలవాటుతో సోషలిస్టు భావజాల వాతావరణంలో కూడా దిగమింగుకుని అంగీకరించే పరిస్థితుల్లో ప్రజలున్నారు. ఫ్యూడల్ శక్తుల దగ్గర అలవాటైన బానిసత్వం అర్ధసోషలిస్టు రాజకీయ వ్యవస్థలో రాజకీయ నాయకులకు బానిసగా బతికే సహనాన్ని నేర్పింది. కర్రపుచ్చుకుంటే తప్ప మాట వినరనే మనస్తత్వాన్ని నేర్పించింది. మన దేశానికి ప్రజాస్వామ్యం పనికిరాదు....

ఎవరైనా మంచి నియంత వస్తే గానీ బాగుపడదని కొందరు అంటుంటారు. *నియంతల్లో మంచి నియంతలు ఉండరనేది చరిత్ర నిరూపించిన నిజం.*

నల్ల డబ్బు బయటకు తీయడం సరే. కానీ అటువంటి డబ్బు పోగేసే అవకాశాలు ప్రభుత్వాల దగ్గర లేకుండా చెయ్యడం అంతకంటే అత్యవసరం. అది చేయకుండా, ప్రభుత్వాల విశేష విచక్షణాధికారాలు తగ్గించాలని డిమాండు పెట్టకుండా, ఇప్పుడున్న నల్లడబ్బును నిజంగా వెలికితీయగలిగినా, ఇంకో వైపు నుంచి వేరొకరి పేరు మీద కొత్త నల్ల డబ్బు స్విస్ బ్యాంకులకు చేరుతూనే ఉంటుంది. ముందు ఇంటి తలుపులకు తాళం వెయ్యకుండా దొంగల్ని పట్టుకోవడానికి ఊరంతా వెతికే పనిలో బిజీ అయిపోతే ఏమవుతుందో ఊహించలేమా?

05-06-2011

మూకస్వామ్యంలో భావ స్వేచ్ఛా?

చిత్రకారుడు ఎమ్.ఎఫ్.హుస్సేన్ 97 సంవత్సరాల వయసులో లండన్‌లో కన్నుమూశారు. దేశంలోని మేధావులు, రాజకీయ నాయకులకు ఒక్కసారిగా గతం గుర్తుకొచ్చింది. 'చిల్లర మనస్తత్వంతో వ్యవహరించే వారి కారణంగా, చివరి రోజుల్లో ఆ మహా కళాకారుడు విదేశాలలో నివసించాల్సి రావడమే అసలైన విషాదమం'టూ భారత ప్రభుత్వం విచారం వ్యక్తం చేసింది. కానీ ఈ సందర్భంగానైనా అసలు హుస్సేన్ దేశం వదిలివెళ్ళాల్సిన పరిస్థితులు, దానికి కారకులు, అలాంటిది మళ్ళీ జరగకుండా ఏం చెయ్యాలో మేధావులూ చెప్పడం లేదు, ఏం చెయ్యబోతున్నారో ప్రభుత్వాలూ వివరించట్లేదు.

భావప్రకటన స్వేచ్ఛ ప్రాథమిక హక్కుల్లో ఒకటి. ఇది మనిషి స్వేచ్ఛగా బతకడానికి తనకు సహజంగా ఉన్న హక్కు. ఇది ఏ రాజ్యాంగ నిర్మాతలో జాలిపడి పెట్టిన భిక్ష కాదు. ప్రపంచంలోని అన్ని రాజ్యాంగాల్లోనూ, చివరికి కమ్యూనిస్టు దేశాల్లో కూడా, భావ ప్రకటన హక్కును ప్రాథమిక హక్కుగా గుర్తిస్తారు. కానీ దానికి వివిధ దేశాల్లో రకరకాల మెలికలు పెడతారు. నిజానికి ఈ హక్కు గురించి రాజ్యాంగంలో రాశారా లేదా అన్నదానికంటే, అది ఎంత అందంగా అమలవుతోంది, ప్రజలు ఈ స్వేచ్ఛను ఏ మాత్రం అనుభవించగలుగుతున్నారు అనేదే ముఖ్యం. ఈ విషయంలో మన దేశం విషాదకర అనుభవాలను చవిచూసింది.

1975 లో విధించిన అత్యవసర పరిస్థితి కాలంలో – మాట్లాడే స్వేచ్ఛలపై ఆంక్షలు – ఈ హక్కును అత్యంత తీవ్రంగా హరించాయి. తరువాత్తరువాత ఈ ఆంక్షలు తొలగించినా, తాము నిర్వచించిన 'ప్రజా సంక్షేమం' పేరిట భావ ప్రకటనా స్వేచ్ఛకు తాము నిర్ణయించిన మేరకు సంకెళ్ళు వేయవచ్చని పాలకులకు అర్థమైంది. ప్రత్యక్షంగా చట్టాలు చేయకపోయినా, పరోక్షంగా అనేక ఆంక్షలు విధించారు.

ఉదాహరణకు సినిమా నిర్మించి, ప్రదర్శించాలంటే సెన్సారు అనుమతి కావాలి. సెన్సారు బోర్డు సభ్యుల మనోభావాలను బట్టి ఏ సన్నివేశాలు, సంభాషణలు ఉంచాలో, తీసేయాలో నిర్ణయిస్తారు. అలాగే వార్తాపత్రిక నడపాలంటే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. తమకు తీవ్రంగా నచ్చని విషయాలను ప్రచురిస్తే, చేసిన రిజిస్ట్రేషన్‌ను రద్దుచేసే అధికారం కూడా ప్రభుత్వానికి ఉంది. అలాగే ప్రైవేటు రంగంలో టెలివిజన్ ఛానళ్ళు ప్రారంభించడానికి అర్ధశతాబ్దం పాటు అనుమతించలేదు. ఆ విషయంలో చర్చ నడిచిన రోజుల్లో బాగా చదువుకున్న వాళ్ళు కూడా అనుమానాలు వ్యక్తం చేసేవారు. అశ్లీలమైన దృశ్యాలు చూపిస్తే ఎలా? కాబట్టి నియంత్రించాలన్నారు. మరి దిన, వార పత్రికల్లోనూ అశ్లీల చిత్రాలు ప్రచురించవచ్చుకదాని, వాటినీ నిషేధిద్దామా అనడిగితే సమాధానం ఉండేది కాదు.

గత పాతికేళ్ళుగా ఇంకో అలవాటు మొదలైంది. ఎవరైనా సంఖ్యాపరంగా బలమైన మూక ఆందోళన చేసో... దాడులు చేసో... డిమాండు చేస్తే; వారి డిమాండ్ మేరకు భావస్వేచ్ఛను హరించడం. సల్మాన్ రష్డీ రాసిన 'సాటానిక్ వర్సెస్' పుస్తకాన్ని ముస్లింల డిమాండ్ మేరకు, ముస్లిం దేశాలకంటే ముందే నిషేధించిన ఖ్యాతి మనదేశానికి దక్కుతుంది, అలాగే ఆ తర్వాత ఏసుక్రీస్తు జీవితం మీద నిర్మించిన ఇంగ్లీషు సినిమాను క్రిస్టియన్లు డిమాండు చేస్తే నిషేధించారు. అలాగే ఈ మధ్యన వచ్చిన 'డావిన్సీ కోడ్' అనే ఇంగ్లీషు పుస్తకం, సినిమాల మీద కూడా ఆందోళనలు నడిచాయి. క్రిస్టియన్లకు వ్యతిరేకంగా కరపత్రం ప్రచురించారని ఖమ్మంలో ఒకరిని రాత్రికి రాత్రి అరెస్టు చేశారు. అళగిరికి నచ్చని విధంగా పత్రికలో వ్యాసం రాశారని – మధురైలోని పత్రికాఫీసుపై అతని అనుచరులు దాడిచేసి నిప్పుపెడితే ఉద్యోగులు మరణించారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన వ్యాసానికి ఆగ్రహించి, ఆఫీసుపై దాడి చేశారు. చివరికి ఎడిటర్‌ను జైల్లో పడేశారు. ఇలాంటి ఉదాహరణలు కోకొల్లలు.

వీటన్నిటికి కారణమై, ఉపేక్షించిన ప్రభుత్వం ఇప్పుడు కారుస్తున్నది – మొసలి కన్నీరు మాత్రమే. మూక ఎంత పెద్దదైతే అంత పెద్దస్థాయిలో – వారి డిమాండ్ల మేరకు భావస్వేచ్ఛను నేలరాయడానికి అన్ని ప్రభుత్వాలూ రెడీ. ఆ మూక యొక్క సామాజిక, రాజకీయ, భావజాల స్వభావాన్ని, ప్రాధాన్యతలను బట్టి మేధావుల, రాజకీయ నాయకుల ఖండనలు, దండనలు ఉంటాయి. అంతే తప్ప భావ ప్రకటనా స్వేచ్ఛ ఒక ప్రాథమిక హక్కు అని; ఎంతమందికి...; ఎంతటి వారికి నొప్పి కలిగినా ఆ హక్కును రక్షించాలన్న స్పృహ అందరిలోనూ కొరవడింది. దాంతో ఒకరిని చూసి ఒకరు పెట్రేగుతున్నారు. వాలంటైన్స్‌డే నాడు కనిపించిన యువ జంటలను పరిగెత్తించే భజరంగ్‌దళ్ గూండాలను నియంత్రించే నైతికత – మేధావి, పాలకవర్గం కోల్పోయింది.

అందుకే హుస్సేన్ గీసిన బొమ్మలకు నిరసనగా ఆయన ఎగ్జిబిషన్ మీద, ఇంటిమీద దాడులు చేసినా ఏం చేయలేకపోయారు. గట్టిగా బిగబట్టిన హనుమంతుని తోకమీద సీతాదేవి నగ్నంగా కూర్చునట్లుగా గీసిన బొమ్మ ప్రదర్శించడానికి హుస్సేన్‌కు భావస్వేచ్ఛ, కళాస్వేచ్ఛ ఉండాలి. ఆ బొమ్మలోని సౌందర్యాన్ని కొంతమంది ఆస్వాదించొచ్చు. మరికొందరు దాన్ని అసహ్యించుకోవచ్చు. ఇష్టమున్న వాళ్ళు కొనుక్కోవచ్చు. అది వారిష్టం. అంతే స్వేచ్ఛ– 'సాటానిక్ వర్సెస్' చదవదల్చుకున్న వాళ్ళకూ ఉండాలి. అది లేకపోవడం వల్లనే ప్రతి మూకా, రకరకాల కారణాలు చూపి భావస్వేచ్ఛకు కళ్ళెం వేసి తమ సంఖ్యాపరమైన ఆధిక్యతను చాటుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. ఒకరిని మించి ఒకరు పోటీపడుతున్నారు.

తెలంగాణా వద్దనే వారి నాలుకలు కోస్తాం, తెలంగాణకు అడ్డొచ్చిన వారిని నరికేస్తాం అనే హూంకరింపులతో పాటు, కావూరి ఇంటిపై దాడి, వార్తా పత్రికల ఆఫీసులపై దాడి, మీటింగుల మీద దాడి – ఇవన్నీ దేనికి సంకేతాలు? మూక నియంతృత్వానికి. ఎదురుచెప్పినా, తమకు నచ్చని రాతలు రాసినా అట్రాసిటీ కేసులు పెడ్తాం అని ఎంపీలు, మంత్రులే బెదిరించే స్థాయికి దిగజారారు. ఈ గోలంతా మనకెందుకులే అనుకుని తాహతుగల హుస్సేన్ లాంటివాళ్ళు విదేశాల్లో స్థిరపడతారు. అంత స్థోమత లేని వారు స్థానికంగా నోరు మూసుకుని, చేతులు కట్టేసుకుని కూర్చుంటున్నారు.

భావప్రకటన స్వేచ్ఛ అనేది – జీవించే స్వేచ్ఛతో అతి దగ్గరగా ముడిపడి ఉన్న అంశం. ఆ స్వేచ్ఛను నియంత్రించే అధికారాలను ప్రభుత్వాలు, మూకల చేతుల్లో పెడితే క్రమంగా అరాచక సమాజంలో బానిసలుగా బ్రతకాల్సి వస్తుంది. అపరిమితమైన స్వేచ్ఛ ఉంటే విశృంఖలత్వం ప్రబలుతుందని; కాబట్టి కొన్ని నియంత్రణలుండాల్సిందేనని కొందరు భావిస్తూ ఉంటారు. ప్రభుత్వాలకు ఆ అధికారాలు ఉండాల్సిందేనని వాదిస్తారు. ప్రజలు తమకు ఏది మంచో, ఏది చెడో తెలుసుకోలేని అమాయకులని, కాబట్టి వారు వక్రమార్గం పట్టకుండా ప్రభుత్వం గొర్రెల కాపరి పాత్ర పోషించాలని భావిస్తారు. మూకల మనోభావాల ప్రకారం మిగతావారు నడవాల్సిందేనంటారు. కానీ ఇందులో ఒక చిక్కుంది. ఏది మంచో, ఏది చెడో తెలియని అమాయక గొర్రెల్లాంటి ప్రజలు మరి ఏ జ్ఞానంతో – తమను సక్రమ మార్గంలో నడిపించగలిగే నాయకులను, ప్రభుత్వాలను ఎన్నుకోగలరు? భావప్రకటనా స్వేచ్ఛ విశ్వవ్యాప్తమై గుండెల నిండా పీల్చుకోగలిగిన గాలి లాంటిదా? లేక ఏ రోజుకారోజు మూకలు, ప్రభుత్వాల దయను బట్టి అడుక్కు తెచ్చుకునే పాలపాకెట్టు లాంటిదా? ఆలోచించుకోవాల్సింది మేధావులు, ప్రజలే.

12-06-2011

లెక్కల చిక్కులు

సిద్ధాంతాలలో ఎన్ని తేడాలున్నా, సోషలిస్టులు అందరూ కోరుకునేది సమసమాజ స్థాపన. అందరి ఆస్తులూ స్వాధీనం చేసుకుని సామాజీకరించడం. వ్యూహాలు, ఎత్తుగడల్లో తేడాలుండొచ్చు. కొందరు రాజ్యాంగబద్ధ ప్రజాస్వామిక పంథాననుసరించవచ్చు. మరికొందరు ఒకపక్క ఎన్నికల్లో పాల్గొంటూనే; ఇంకోపక్క సాయుధ దళాలతో నిరంతర ఉద్యమాలు, 'పోరాటాల' ద్వారా రాజ్యాన్ని కూలదోసే పనిలో ఉంటారు. ఇంకొందరు ఈ ఎన్నికలు, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ఒట్టి బూటకమని, సాంప్రదాయ రాజకీయ భావజాలపు చట్రం నుంచి బయటపడలేని మధ్యతరగతి (బూర్జువా) అశక్తతకు నిదర్శమని ; రాజ్యాన్ని కూలదోయడానికి తీవ్రమైన సాయుధ పోరాటమొక్కటే మార్గమని నమ్ముతారు. ఎన్ని సైద్ధాంతిక విభేదాలున్నప్పటికీ, కొన్నిసార్లు ఒకరినొకరు ఓడించుకోవడం, చంపుకోవడం కూడా జరిగినప్పటికీ; వారందరి మధ్య ఒక రకమైన సోదరభావం, ఒకరిపట్ల ఒకరికి సానుభూతి, ఉదారత కూడా కనిపిస్తాయి. మార్గాలే వేరు కానీ – అందరి లక్ష్యమూ ఒక్కటేనన్న పరస్పర గౌరవం.

సోషలిస్టుల లక్ష్యం ఒక అసెంబ్లీ సీటు గెలవడమో, ఒక రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయగలగడమో, లేక ఒక దేశంలో రాజ్యాధికారం చేజిక్కించుకోవడమో కాదు. వారి అంతిమ లక్ష్యం ప్రపంచం మొత్తాన్ని కమ్యూనిస్టు రాజ్యంగా మార్చడం. అందుకే వారి దృష్టిలో జాతీయతా భావాలు కృత్రిమ, సంకుచితత్వానికి దారి తీస్తాయని, ప్రపంచ వ్యాప్తమైన కార్మికవర్గంలో విభేదాలు సృష్టిస్తాయనీ, తద్వారా ప్రపంచ కార్మికులు ఏకం కావడానికి అవరోధాలు ఏర్పడి, ప్రపంచ వ్యాప్త సోషలిస్టు స్థాపన ఆలస్యమవుతుందనీ అభ్యంతర పెడుతుంటారు. ఇంత బలమైన భావజాల వ్యవస్థ ఉంది కాబట్టే చిన్నచిన్న ఎదురుదెబ్బలకు సోషలిస్టులు భయపడరు. ఎన్నికల్లో ఓట్లశాతం తగ్గినా, సీట్లు రాకపోయినా, ఉన్న రాష్ట్రాల్లో అధికారం పోయినా వెనక్కేమీ తగ్గరు. సోవియట్ రష్యాలో సోషలిస్టు

వ్యవస్థ కుప్పకూలినా... చైనాలో కమ్యూనిస్టు విధానాలను పక్కనపెట్టినా... ఉత్తరకొరియా, క్యూబాలాంటి మిగిలి ఉన్న కమ్యూనిస్టు దేశాల ప్రజలు తమ పొరుగు దేశాలతో పోలిస్తే పేదరికంలో మగ్గుతున్నా... సోషలిస్టులు కంగారుపడరు. తమ దీర్ఘకాలిక లక్ష్యంపైన, దాని నైతికత పైన, అనివార్యతపైన వారికి అంత గురి. తాము కొలిచే దేవుని రాజ్యం తప్పకుండా వస్తుందని వివిధ మతాల వారు నమ్మినట్లే ; తాము తలచిన సోషలిస్టు రాజ్యం తప్పక ఏర్పడుతుందని, తద్వారా మానవ సమాజం శాశ్వతంగా మోక్షం పొందుతుందని సోషలిస్టులు అంతే గాఢంగా విశ్వసిస్తారు. సాధారణ ప్రజలు కూడా సోషలిజం రావడం కష్టమేగానీ – వస్తే మాత్రం మంచిదే అనుకుంటారు.

శాస్త్రీయ విధానపు పునాదుల మీద నిర్మించామని చెబుతున్న సోషలిస్టు సిద్ధాంతం, శాస్త్ర ప్రకారం విశ్లేషిస్తే ఒక ముఖ్యమైన చేదు వాస్తవాన్ని ఎదుర్కొంటుంది. *నిజంగా ప్రపంచ వ్యాప్తంగా సోషలిస్టు వ్యవస్థ ఏర్పడడమంటూ జరిగితే – అది తనంతట తాను అతి త్వరితంగా కూలిపోక తప్పదు. ఇది మాత్రం శాస్త్రపరంగా అనివార్యం. దానికి కారణం సోషలిస్టు వ్యవస్థలో మార్కెట్ ఉండదు. వ్యక్తులు తమ ఇష్టం మేరకు వస్తువులు, సేవలు, శ్రమ ఇచ్చిపుచ్చుకోవడం ఉండదు. కాబట్టి ద్రవ్య (డబ్బు), ధరల వ్యవస్థ ఉండదు. ధరలు తెలియని పరిస్థితిలో లెక్కలు కట్టడం సాధ్యం కాదు. లెక్కలు కట్టలేనప్పుడు ఉత్పత్తి సాధనాలను, ఉత్పత్తి ప్రక్రియను ఎంచుకోవడం అసాధ్యం. ఎంత నిజాయితీ, తెలివైన నాయకత్వం ఉన్నా, ఈ పరిస్థితి అనివార్యం.*

ఉదాహరణకు సోషలిస్టు ప్రభుత్వం దగ్గర ఉన్న సరంజామాతో నదిమీద బ్రిడ్జి కట్టాలా, ప్రజలకు ఇళ్ళు కట్టాలా, లేక కాలేజీ పెట్టాలా, లేక వెనుకబడిన ప్రాంతంలో ఫ్యాక్టరీ కట్టాలా? ఏది అత్యవసరం? నిర్ణయించడానికి ప్రాతిపదిక దొరకదు. బ్రిడ్జి కట్టాలని నిర్ణయించినా, ఎక్కడ కట్టాలో, సిమెంటుతో కట్టాలో, స్టీలుతో కట్టాలో నిర్ణయించలేరు. ఒకవేళ ఇళ్ళు కట్టాలంటే పెంకుటిళ్ళా, ఫ్లాట్లా? ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు దొరకవు. ఎందుకంటే ఏది కడితే, ఎలా కడితే ఎంత ఖర్చవుతుందో, లెక్కలు వేయడానికి ధరల సూచిక లేదు కాబట్టి.

ప్రపంచ సోషలిజానికి ఇది అత్యంత ముఖ్యమైన సమస్య. దీనికింత వరకు ఏ సోషలిస్టు ఆర్థిక మేధావీ పరిష్కారం చూపలేదు. మరి సోవియట్ రష్యాలో 70 సంవత్సరాల ఆర్థిక వ్యవస్థ ఎలా నడిచింది? సోషలిస్టేతర ప్రపంచంలో ధరల వ్యవస్థ ఉంది కాబట్టి, ఆ ధరల ప్రాతిపదికగా కొంతమేర లెక్కలు వేయగలిగారు. అయినాగానీ ఆ దేశంలో పెద్ద పెద్ద మేకులు తయారు చెయ్యడం, నట్లు, బోల్టుల వంటి చిన్న విడిభాగాలు లేక భారీ యంత్రాలను మూలన పడేయాల్సి రావడం లాంటి హాస్య సంఘటనలు అనేకం.

మిగతా ప్రపంచంలోని ధరల సూచిక సహాయం లేకపోతే సోవియట్ ఆర్థిక వ్యవస్థ ఇంకా త్వరగా కూలిపోయేది. అదీగాక, వేల సంవత్సరాలుగా పోగుపడిన సంప్రదాయిక జ్ఞానం కొన్ని సంవత్సరాలు, దశాబ్దాల పాటు ప్రజల ఆలోచనాసరళిని అలవాటు పడిన దారిలో నడిపించగలుగుతుంది.

ఈ లెక్కల సమస్య ఇంత తీవ్రమయినదన్న సంగతి మార్క్సు, ఏంగిల్స్ దృష్టికి రాలేదు. *ఏంగిల్స్ ఆలోచన ప్రకారం ఉత్పత్తి సాధనాలన్నీ (ఆస్తులన్నీ) సమాజం స్వాధీనం చేసుకున్నాక – అందరూ పనిచేస్తారు. ఒక వస్తువు తయారీకి ఎంత శ్రమ అవసరమో ఇట్టే తేల్చేయొచ్చు. కానీ నిపుణుల పనికి, సాధారణ శ్రమకు తేడా ఉంటుంది గదా! దానికి మార్క్సు చెప్పిన సూత్రం ప్రకారం నిపుణుల పని సాధారణ శ్రమకు ఎన్ని రెట్లో లెక్కించొచ్చు. ఎలా? ఒక డాక్టరు పని పదిమంది కాంపౌండర్ల పనితో సమానమా? పదిమంది కాంపౌండర్లు కలిసి డాక్టర్ చేసే ఆపరేషన్ చేసేస్తారా? వాళ్ళ జీతాలను బట్టి లెక్కేస్తారా? ధరలు, మార్కెట్, జీతాలు లేని వ్యవస్థలో ఎలా లెక్కేస్తారు? ఈ సమస్యకు సమాధానం చెప్పడానికి మార్క్సు తరువాతి సోషలిస్టు ఆర్థిక వేత్తలు చాలా ప్రయత్నం చేశారు. ఒక కృత్రిమ మార్కెట్ వ్యవస్థ ద్వారా ఈ సమస్యను అధిగమిం– చొచ్చన్నారు. నిజమైన మార్కెట్‌లో ప్రైవేటు ఆస్తులు, లాభాలు, నష్టాలు, ఉంటాయి కాబట్టి వ్యక్తులు ఒళ్ళు దగ్గర పెట్టుకుని నిర్ణయాలు తీసుకుంటారు. తనది కాని సొమ్ముతో ఆడుకోవడం – మార్కెట్ వ్యవస్థకు ప్రత్యామ్నాయం ఎలా అవుతుంది ? కాబట్టి అది పరిష్కారం కాజాలదు.*

శ్రమ, దోపిడీ సిద్ధాంతాలను వల్లెవేసే మేధావులు సోషలిజంలో ఉన్న ఇలాంటి అంతర్లీన అసంభవాలను గురించి మాట్లాడరు. మాట్లాడనివ్వరు. సోషలిజం కోసం ఎన్ని యుద్ధాలు చేసినా, ఎంత రక్తం పారించినా, ప్రజలకు అరచేతిలో స్వర్గం చూపి మత్తెక్కించినా; సోషలిజం ఒక ఆర్థిక విధానంగా, వ్యవస్థగా మనజాలదు. ఆ భావజాలానికి అంకితమై పోయిన వృత్తి సోషలిస్టు మేధావులు ఎలాగూ దాన్నుంచి బయటకు రాలేరు. కానీ పడికట్టు నినాదాలకు, అసాధారణ అబద్ధాలకు ఆకర్షితులయ్యే యువత లోతుగా ఆలోచించకుండా ఈ కాల్పనిక భావజాల ప్రలోభానికి, ప్రభావానికి లోనుకాకూడదు. సోషలిజం ముసుగులో ప్రజల జేబులు ఖాళీచేసి పన్నులు వసూలు చేసే ప్రభుత్వాలు కూడా ఈ లెక్కల సమస్యలో మునిగితేలడం చూస్తూనే ఉన్నాం. వచ్చిన లక్షాపాతిక కోట్ల 'రాబడి' ని ఎక్కువశాతం ఇందిరమ్మ ఇళ్ళకు కేటాయించాలా? లేక ఉచిత విద్యుత్తుకా? లేక కాలేజీ ఫీజులుకా? లేక ఇంకేదన్నా కొత్త పథకం కనిపెట్టాలా?

మన పాలకులు ఈ పథకాల లాభనష్టాలను ఓట్లరూపంలో కొలుస్తారు. కానీ సోషలిజంలో ఎన్నికలుండవు, ఓట్లూ ఉండవు. మరప్పుడు లెక్కల సమస్య ఎంత తీవ్రమయిన విషయమో అర్థం చేసుకోవాలి.

కెజి బేసిన్ కుతంత్రం

ముడి చమురు దిగుమతి, శుద్ధి చెయ్యడం, పంపిణీ, అమ్మకం అనేవి మన దేశంలో లక్షల కోట్ల వ్యాపారం. ఈ వ్యాపారం స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచీ కేంద్ర ప్రభుత్వ గుత్తాధిపత్యంలో ఉంది. ఎంత ధరకు దిగుమతి చేసుకుంటున్నారో, శుద్ధి, పంపిణీలకు ఎంత ఖర్చవుతోందో, ఎంత ధరను ఎందుకు ఎలా నిర్ణయిస్తున్నారో సామాన్యులెవరికీ తెలిసే అవకాశం లేదు. ఇందులో ఎంత డబ్బు చేతులు మారుతుందో కూడా తెలీదు.

ప్రైవేటు రంగానికి ఇందులో ప్రవేశం లేదు. పోటీ లేదు. ఒక పక్క దిగుమతి సుంకాలు, ఎక్సైజు పన్ను, అమ్మకం పన్నులు విధిస్తారు. ఇంకోపక్క సబ్సిడీ ఇస్తున్నామంటారు. 1956 లో కేంద్ర ప్రభుత్వం ఓఎన్‌జీసీ నెలకొల్పింది. దేశంలోని చమురు, సహజవాయువుల అన్వేషణ, వెలికితీసే బాధ్యతలు అప్పజెప్పారు. పన్నుల డబ్బు పెట్టుబడితో, ప్రపంచ దేశాల నుండి తెచ్చుకున్న టెక్నాలజీతో అన్వేషణ, తవ్వకం, ఉత్పత్తి ప్రారంభించారు. బాంబే హై, అస్సాం లాంటి ప్రాంతాల్లో దొరికిన పెట్రోలియంను ప్రభుత్వరంగ సంస్థలకు అమ్మేవారు. ఆ అమ్మకపు ధర అంతర్జాతీయ ధరల స్థాయిలో ఉండడం వల్ల విపరీతమైన లాభాలు ఆర్జించింది. సంస్థ పరిమాణం, నైపుణ్యం పెరిగాయి. దేశంలో ఎక్కడెక్కడ ఏ రకమైన చమురు, గ్యాస్ నిక్షేపాలున్నాయో సమాచారం సేకరించారు. అదే క్రమంలో 1980ల నుంచి కృష్ణా, గోదావరి బేసిన్‌లో అన్వేషణ చేపట్టి విలువైన సమాచారం (డేటా) సేకరించారు.

1997 లో ఆర్థిక సంస్కరణల పేరుచెప్పి చమురు అన్వేషణ, ఉత్పత్తుల్లో ప్రైవేటు రంగాన్ని కూడా ఆహ్వానించారు. అప్పుడు మొదలైంది అసలు రాజకీయం. పేరుకు అంతర్జాతీయ టెండర్లేగానీ, షరతుల ప్రకారం ప్రాజెక్టు వ్యయం, ఉత్పత్తి ధర, అమ్మకం ధర, ఎవరికి అమ్మాలో ఇవన్నీ ప్రభుత్వం చేతుల్లోనే ఉంటాయి. రిలయన్స్ కంపెనీ

ఎనిమిది వేల చదరపు కిలోమీటర్ల సముద్రగర్భం మీద హక్కులు తీసుకుంది. ఓఎన్‌జీసీ కోట్ల రూపాయలు ఖర్చుచేసి, సంవత్సరాల తరబడి సేకరించిన కీలక సమాచారంతో పాటుగా ముఖ్యమైన ఇంజనీర్లు, భూగర్భ, రసాయన శాస్త్రవేత్తలు ఇంకాస్త ఎక్కువ జీతానికి రిలయన్స్‌లో చేరిపోయారు. ఆ విధంగా అన్వేషణకు సంబంధించి చాలా వరకు పనైపోయింది.

మొదట చెప్పిన ప్రకారం ప్రాజెక్టుకు సుమారు పదకొండువేల కోట్లు ఖర్చవ్వాలి. కానీ రకరకాల కారణాలు చెప్పి ప్రాజెక్టు వ్యయం ముప్ఫై ఎనిమిదివేల కోట్లు అయిందన్నారు. ఈ పెరిగిన వ్యయం గురించి ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వానికి దరఖాస్తు పెట్టుకోవడం, మొదట్లో మంత్రులు, అధికారులు నిరాకరించి బెట్టు చెయ్యడం; తర్వాత సమావేశాల మీద సమావేశాలు నిర్వహించి, చివరికి ఇంకొన్ని షరతులు విధించినట్లుగా చూపి, రిలయన్స్ లెక్కలను అంగీకరించడం – ఇలా మీడియా, ప్రజల కళ్ళుగప్పే ప్రక్రియలు పలుమార్లు జరిగాయి.

ఈ డ్రామా తర్వాత–దొరికిన గ్యాసుకు ధర నిర్ధారించే ఇంకో డ్రామా మొదలైంది. ఇది కూడా ప్రభుత్వమే నిర్ణయించేది. చివరికి విషయం ప్రధానమంత్రి ఆఫీసు వరకు వెళ్ళింది. మంత్రులు, అధికారులు రోజుల తరబడి చర్చించాక 4.2 డాలర్ల ధర నిర్ణయించారు. అది తక్కువో, ఎక్కువో అని చెప్పడానికి ప్రాతిపదిక ఏదీ లేదు. రిలయన్స్ ఖర్చుపెట్టానని చెబుతున్న మొత్తాలకు లెక్కలు ఎలాగూ సరిగ్గా ఉండవు. చూపించడం కోసం, తయారు చేసే లెక్కలను – మార్చి చూపలేనంత అమాయకులేం కారు. ప్రతిస్థాయి లోనూ ప్రభుత్వం అనుమతులు కావాలి కాబట్టి ఎన్ని వందల,వేల కోట్ల రూపాయలు ముడుపులుగా ఎవరెవరికి చెల్లించి ఉంటారో ఊహించవచ్చు. చివర్లో తమకు నచ్చిన ధర నిర్ధారింప చేసుకోవడానికి ఎంత డబ్బు వెదజల్లి, ఎంతమందిని ప్రసన్నం చేసుకుని ఉంటారో కూడా తేలిగ్గా ఊహించుకోవచ్చు.

విషాదం ఏమిటంటే – ఈ దుర్మార్గపు, లంచగొండి ప్రైవేటు ప్రైవేటీకరణను కేపిటలిజంగా చూపి, ప్రజల అశక్తతను, ఆగ్రహాన్ని కేపిటలిజం వైపు మళ్లించడం. చమురు జాతీయ సంపదనీ, దానిపై పూర్తి అధికారం ప్రభుత్వానికే ఉండాలని నినదించి ప్రభుత్వం చేతిలో ఇన్ని అధికారాలు పెట్టిన మేధావులు తమ ఆలోచనలను సమీక్షించుకోవాలి. నిజమైన కేపిటలిజమైతే, ఒక్క రిలయన్సుకే కాదు, అందరికీ స్వేచ్ఛ ఉండేది. చమురు నిక్షేపాలు, గ్యాసు కోసం అన్వేషించి, దొరికితే ఉత్పత్తి చేసి, ఎవరికి కావాలంటే వారికి, ఏ ధరకు కావాలంటే ఆ ధరకు అమ్ముకునే స్వేచ్ఛ అందరికీ ఉండేది. దానికి కావలసిన నైపుణ్యత, పెట్టుబడి పెట్టగల సామర్థ్యం ఉన్న అనేక కంపెనీలు పోటీపడి అతి తక్కువ ఖర్చుతో ఉత్పత్తి చేసేవి. పోటీ కారణంగా వీలైనంత తక్కువ ధరకే గ్యాసు దొరికేది.

దాంతో విద్యుత్, ఎరువులు, వంటగ్యాస్ కూడా చవకయ్యేవి. దానిమీద ప్రభుత్వ నియంత్రణ, తద్వారా అవినీతి కూడా ఉండేవి కావు. ఎక్కువ సమర్థవంతంగా ఉత్పత్తి చేసిన కంపెనీకి- ఎక్కువ లాభాలొచ్చేవి. లాభాలకు ఆశపడి ఇంకొన్ని కంపెనీలు ఈ రంగంలోకి దిగి, పోటీ వాతావరణాన్ని పెంచే అవకాశం ఉండేది.

అప్పటికే గుర్తించిన చమురు, గ్యాస్ నిక్షేపాలను వెలికి తీయడానికి ఎనిమిది వేల చదరపు కిలోమీటర్ల సముద్ర గర్భాన్ని ఒకే కంపెనీకి గుత్తగా కట్టబెట్టడమే అసలు విద్రోహం. అంత వైశాల్యంలో కొన్ని డజన్ల కంపెనీలు, కొన్ని వందల బావులు తవ్వి, ఉత్పత్తి చెయ్యగలవు. వాళ్ళంతా పోటీపడితే చమురు, గ్యాస్ ఎంత చవగ్గా దొరికేవో ఊహించలేమా?

దేశీయంగా చమురు, పెట్రోలు, డీజిల్ వ్యాపారం మొత్తం కేంద్ర ప్రభుత్వం గుప్పెట్లో ఉన్నాయి. ప్రైవేటు రంగం అందులో ప్రవేశించే సాహసం చేస్తే, అటువంటి సాహసికులను నష్టాల్లో ముంచి, మూతపడేటట్లు చేస్తారు. ప్రభుత్వ రంగ ఆయిల్ కంపెనీల ఉత్పత్తుల ధరలను తాత్కాలికంగా తగ్గిస్తారు. ఆ నష్టాన్ని పన్నుల వసూలు ద్వారా వచ్చిన డబ్బుతో పూడుస్తారు. ఆ రకంగా ప్రైవేటు కంపెనీలను నష్టాల్లో ముంచుతారు. ప్రైవేటు రంగం పారిపోయాక తన ఇష్టం వచ్చినపుడు - దగ్గర్లో ఎన్నికలు లేనప్పుడు - డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్ రేట్లు పెంచుతారు. మార్కెట్‌లో పోటీలేని గుత్త వ్యాపారం, లక్షల కోట్ల విలువైన చమురు దిగుమతుల్లో ఎంత డబ్బు చేతులు మారుతుందో, అందులో ఎంత స్విస్ బ్యాంకులకు పోతుందో, ఎంత ఎన్నికలకు ఖర్చవుతుందో ఏ కాగ్ లెక్కల్లో తేలుతుంది?

రిలయన్స్ లాంటి సంస్థలు ప్రభుత్వం ఎటువంటి వ్యాపార వాతావరణం కలగజేస్తే; దానికనుగుణంగా వ్యాపార పంథాను అవలంబిస్తాయి. లంచాలిమ్మంటే లంచాలిస్తాయి. లేదూ మార్కెట్‌లో పోటీపడమంటే - తన శక్తి మేరకు పోటీపడతాయి. పోటీలో గెలిస్తే గెలుస్తాయి. వ్యాపారదక్షత, ముందుచూపు లేకపోతే అంబాసిడర్ కార్లు తయారుచేసిన హిందూస్థాన్ మోటార్స్‌లాగా ఓడిపోతాయి..., మూతపడతాయి. కేజీ గ్యాస్ విషయంలో కుతంత్రానికి పాల్పడినందుకు రిలయన్స్‌ను నిందించి ప్రయోజనం లేదు. నిందించాల్సింది ప్రభుత్వాన్ని. (డబ్బులు గుంజగలిగే) ప్రతి ఆర్థిక వ్యవహారంలోనూ తలదూర్చి తమ విచక్షణాధికారాల్ని సొమ్ముచేసుకునే అవకాశం ప్రభుత్వాలకిచ్చిన భావజాలాన్ని. అసలు కారణాలను గుర్తించకుండా, వివరించకుండా క్రోనీ కాపిటలిజాన్ని, దాని అవలక్షణాలను, దుర్మార్గాలను కాపిటలిజం మీద రుద్దే ప్రయత్నం చేసే మేధావులను నిందించాలి.

26-06-2011

సిద్ధాంత మౌఢ్యం

విద్యార్థి కార్యకర్తలుగా పనిచేసిన వయసు నుంచీ సోషలిస్టు సిద్ధాంతాలను వల్లెవేస్తూ ఎదిగిన నాయకులు, మేధావులకు; అలాగే మదరసాల్లో, వేద పాఠశాలల్లో చదివిన పిల్లలకు ప్రత్యామ్నాయ సిద్ధాంతాలు కనపడవు. ఒకవేళ కనపడినా, వాటిని చీల్చి చెండాడే ప్రయత్నం చేస్తారే తప్ప కొంచెం లోతుగా తొంగిచూడ్డానికి ఇష్టపడరు. తాము నమ్ముతూ వచ్చిన తాత్విక దృష్టికోణం తప్ప వేరొక దృశ్యం కనబడదు. ఎదురుగా కనబడినా, కళ్ళు మూసేసుకుని, 'పాపం శమించు గాక' అని మనసులో అనుకుంటారు.

కమ్యూనిస్టు సిద్ధాంత తాత్వికతకు, మత తాత్వికతకు మౌలికంగా తేడా ఏమీ లేదు. రెండూ మనిషిని, అతని ఆలోచనలను నియంత్రించి, బేషరతు విధేయతను, త్యాగాలను శాసిస్తాయి. బయటకు కనిపించే తేడాలు; ఆ రెండు తాత్వికతల మధ్య జరిగే ఘర్షణలు మనిషి మీద పెత్తనం ఎవరు చెలాయించాలనే విషయంపైనే తప్ప – మౌలిక బేధాల వలన కాదు. వారి వారి ప్రాపంచిక దృష్టిలో తేడాలుండొచ్చు, వ్యూహాలు, ఎత్తుగడల్లో తేడాలుండొచ్చు; కానీ, ప్రధాన రాజకీయ పార్టీల మధ్య మౌలిక విషయాల్లో తేడా ఎలా లేదో, ఇదీ అంతే.

మౌలిక తాత్విక స్థాయిలో నిజంగా ఒకదానికొకటి విరుద్ధమైన భావజాలాలు రెండే రెండు. ఒకటి వ్యక్తి స్వేచ్ఛను సమర్థించే భావజాలం.దీని కవలలు –లిబర్టేరియనిజం, ఆబ్జెక్టివిజం, కేపిటలిజం. దీనికి పూర్తి విరుద్ధమైనవి వ్యక్తి నియంత్రణ భావజాలాలు – సోషలిజం, మతవాదం, నాజీయిజం, ఫాసిజం మొదలైనవి. ఇవి వ్యక్తి స్వేచ్ఛకు వ్యతిరేకం.

ఏ తాత్విక వ్యవస్థయినా సంపూర్ణమైనదిగా పరిగణించబడాలంటే నాలుగయిదు అంశాలను పూర్తి స్థాయిలో వివరించగలగాలి. అవి – ప్రకృతి / సృష్టి లేదా భౌతిక / బాహ్య ప్రపంచానికి సంబంధించిన అవగాహన (మెటా ఫిజిక్స్); జ్ఞానం, దాని మూలాలు, జ్ఞానాన్వేషణ మార్గాలకు సంబంధించిన శాస్త్రం (ఎపిస్టెమాలజీ); నీతి శాస్త్రం (ఎథిక్స్);

మానవ సంబంధాల లేదా సమాజ నిర్మాణ లేదా రాజకీయ శాస్త్రం (పాలిటిక్స్); ఇక చివరగా కళా శాస్త్రం (ఈస్తటిక్స్). వీటిని వివరించే క్రమంలో ఒక విషయ వివరణ రెండో విషయానికి దారితీసేటట్లు, వైరుధ్యాలు లేకుండాను చూసేది తర్క శాస్త్రం. వీటన్నిటి పట్ల సమగ్ర అవగాహన ఉంటేనే సృష్టి, అందులో మానవుని స్థానం, మనిషి ప్రత్యేకత, మనుషుల మధ్య సంబంధాలకు ఉండే, ఉండాల్సిన ప్రాతిపదిక, సమాజ నిర్మాణం, అందులో ప్రభుత్వాల పాత్ర, మనుషుల హక్కులు ఇత్యాది విషయాల్లో - స్పష్టత వస్తుంది. ఆ అవగాహన, మేధో స్పష్టతలు ఉంటేనే సమకాలీన విషయాలను తాత్విక దృష్టితో వైరుధ్యాలు లేకుండా విశ్లేషించగలిగే సమర్థత అలవడుతుంది.

లోతైన తాత్విక అవగాహన ప్రజలందరికీ ఉండదు కాబట్టి - దీపస్తంభాల్లాగా మేధావులు దారి చూపుతుంటారు. ఇప్పటివరకు జరిగిన మానవ పరిణామ క్రమాన్ని అర్థం చేసుకోవడం, ప్రస్తుత పరిస్థితుల్ని అధ్యయనం చేసి, మనిషిని, సమాజాన్ని ఏ మార్గంలో భవిష్యత్తు వైపు మళ్ళించాలనే ప్రశ్నలకు సమాధానాలు - వారి వారి తాత్విక దృష్టి కోణాలపై ఆధారపడతాయి. భిన్నమైన తాత్విక పునాదుల నుంచి వ్యాఖ్యానించే వివిధ మేధావులు సరళమైన భాషలో సూచించే మార్గాల్లో ఏది సమంజసంగా అనిపిస్తుందో వివేకంతో ఆలోచించి వ్యక్తులే నిర్ణయించుకోవాలి. అదికూడా చేయలేమనే వారు గొర్రెల్లా మిగిలిపోతారు.

స్థూలంగా చెప్పాలంటే - వ్యక్తి స్వేచ్ఛావాద తాత్వికత ప్రకారం స్వేచ్ఛ అనేది మనిషికి స్వతహాగా లభించే జన్మహక్కు. స్వేచ్ఛ లేకపోతే మనిషి మనిషి కాలేడు. బానిసో జంతువో అవుతాడు. సృష్టి ఎలా జరిగిందనే ప్రశ్నకు సమాధానం లేదు, రాదు, అనవసరం కూడా. ప్రకృతికి - అంటే వస్తు, జంతు, జీవ, మానవ నైజాలకు - విరుద్ధంగా చేసే ప్రయత్నాలు సఫలీకృతం కావు, కాలేవు. జ్ఞానం - ఇంద్రియ సమాచారం, మేధస్సుల కలయికతో సిద్ధిస్తుంది. వాస్తవికత ఆధారంగా, జీవించడం కోసం, తన కష్టఫలంతో సుఖపడడం కోసం స్వలాభాపేక్షతో వ్యవహరించడంలోనే నీతి ఇమిడివుంది. ఇక రాజకీయాల విషయానికొస్తే, బ్రతికే హక్కు - అత్యంత మౌలికమయిన ప్రాథమిక హక్కు. స్వేచ్ఛ (లిబర్టీ), ఆస్తిహక్కు, భావప్రకటనా హక్కు - ఇవన్నీ బ్రతికే హక్కు నుంచి పుట్టినవే. తాను ఈ హక్కులు అనుభవించాలంటే - ఇతరుల అవే హక్కులను గౌరవించాలనేది తర్కం దృష్ట్యా ప్రాథమికమైన వాస్తవం. సృష్టిలో - మనిషి అత్యంత ఉన్నతుడు. తనకు సంక్రమించిన మేధస్సు (చెట్లు నరికి ఆ కలపతో ఇల్లు కట్టుకోవడం లాంటివి), తన శారీరక, మేధో శక్తుల మేరకు ఉత్పత్తులు, సదుపాయాలను తయారు చేసి, వాటిని ఇతరులతో ఇచ్చి

పుచ్చుకుని సౌఖ్యాల్ని పొందే ఆర్థిక స్వేచ్ఛ మనిషికుంది. మనిషి ఔన్నత్యాన్ని, మానవ జన్మ ఉత్కృష్టతను చాటిచెప్పి, తద్వారా ఉత్తేజపరచి, కార్యోన్ముఖులుగా ప్రేరేపించేవే సత్కళలు.

ఇక రెండో వైపు చూస్తే, కొద్ది తేడాలతో విభిన్న మతాల తాత్వికత ప్రకారం మనిషి మౌలికంగా పాపాత్ముడు. అతణ్ణి దారిలో పెట్టడానికే దేవుడున్నాడు. సృష్టి, అందులోని మనుషులను దేవుడు సృష్టించాడు (మరి దేవుణ్ణి ఎవరు సృష్టించారనే ప్రశ్నకు సూటి సమాధానం దొరకదు). కాబట్టి దేవుని పట్ల భక్తి, విధేయతలతో ఉండాలి. జ్ఞానం దేవుడు చెప్పింది చెప్పినట్లుగా రాసినట్లు చెబుతున్న మత గ్రంథాల నుంచి వస్తుంది. దీన్ని ఎవరూ, ఏ కాలంలోనూ జవదాటడానికి వీల్లేదు. ప్రశ్నించడానికి ఎవరికీ హక్కులేదు. విశ్వాసముంటే ఏ రుజువులూ అక్కర్లేదు. మనిషిని సన్మార్గంలో ఉంచడానికి దేవుని పేరిట మతపెద్దలకు అధికారాలు ఉండాలి. ప్రాపంచిక విషయాలకూ వారే భాష్యం చెప్పాలి. ప్రభుత్వం కూడా వారి కనుసన్నల్లోనే మెలగాలి. మనిషి తన జీవితాన్ని సృష్టికర్తయైన దేవుడికి అంకితం చెయ్యాలి. తనదంటూ ఏమీలేదు. మనిషి అశక్తతను ఎత్తిచూపి, దేవుణ్ణి పొగిడేవే కళలు. అదే భక్తి, ముక్తి.

ఇకపోతే, సోషలిస్టు తాత్వికత ప్రకారం మనిషికి తనకంటూ అస్తిత్వం లేదు, సమాజానికి మాత్రమే ఉంది. జ్ఞానం సమాజం నుంచి వస్తుంది. వ్యక్తిని శాసించే అధికారం సమాజానికి (అంటే దాన్ని నడిపే ప్రభుత్వానికి) ఉంది. మనిషిని అలాగే వదిలేస్తే వివిధ వర్గాలుగా ఏర్పడి, సంఘర్షణ తప్పదు. సత్యం, నైతికతలు సమాజ సంప్రదాయాల మీద ఆధారపడి ఉంటాయి. అసలు సిసలైన సత్యాన్ని హేతుబద్ధ తర్కం ద్వారా కనుగొనడం అసాధ్యం. ఇంకో మాటలో చెప్పాలంటే మెజారిటీ నిర్ణయమే సత్యం. మనిషి ఆలోచనలు, నమ్మకాలు, అవసరాలు, కోరికలు సమాజానికి, దాని (అంటే తాను తప్ప ఇతరుల) అవసరాలకు లోబడి ఉండాలి. మనిషి ప్రథమ కర్తవ్యం తనకోసం కాక, సమాజం కోసం పాటు పడటమే. మనిషి జీవితం సమాజ శ్రేయస్సుకు ఒక సమిధ మాత్రమే.

ఈ రకంగా మతం, సోషలిజం రెండూ – మనిషి త్యాగాన్ని కోరతాయి, శాసిస్తాయి. మనుషుల అభిరుచులు, శక్తి సామర్థ్యాలలో ఎన్ని తేడాలున్నా, అందరూ ఒకే జీవన ప్రమాణాలు కలిగిన సమసమాజంలో బ్రతకాలి. దీనికి మనిషి స్వచ్ఛందంగా ఒప్పుకోడు కాబట్టి బలవంతంగానైనా ఒప్పించాలి. ఎవరూ నోరెత్తకుండా, పారిపోకుండా బెర్లిన్ గోడలు, ముళ్ళకంచెలు, సెర్చిలైట్లతో బలమైన శ్రామికవర్గ నియంతృత్వ ప్రభుత్వం సమాజానికి కాపలా కాయాలి. అందరూ కష్టపడేలా నిర్బంధించి, వచ్చిన ఫలితాన్ని అందరికీ సమానంగా పంచాలి. మనిషిలోని అమానవీయతను, పరాయీకరణ భావాలను, పేదరికాన్ని, వర్గ సంఘర్షణలను, దోపిడీ మనస్తత్వాన్ని ఎత్తి చూపేవే ప్రజాకళలు. అవే

శ్రామికవర్గ ఔన్నత్యాన్ని, పార్టీ నాయకత్వ అవసరాన్ని ప్రజలకు వివరిస్తాయి. సామాజిక స్పృహను ఇనుమండిపజేస్తాయి.

ఈ విభిన్న తాత్విక మార్గాల్లో దేన్ననుసరించాలో అనేది ఆలోచించి వివేకంతో తీసుకోవల్సిన నిర్ణయం. దాన్ని పాఠకులకే వదిలేద్దాం.

ఇటీవల ఒక విమర్శకుడన్న దానికి సమాధానం – బురఖా వేసుకోవాలని బలవంతం చేయడం మత మౌఢ్యం. అది మత వాదం నుంచి వచ్చింది. బురఖా వేసుకోనక్కర్లేదు, కాకపోతే సోషలిస్టు సమాజమనే జైలులో జీవితాంతం తనకోసం కాకుండా సమాజం కోసం కష్టపడమనే నిర్భంధం సోషలిస్టు తాత్వికత నుంచి వచ్చింది. వ్యక్తి స్వేచ్ఛను హరించడంలో ఈ రెంటికీ తేడా ఏమన్నా ఉందా?

03-07-2011

'వ్యర్థ' ప్రయాస

ప్లాస్టిక్ సంచులను నిషేధించాలని హైదరాబాద్ నగర పాలకసంస్థ ఒక హడావుడి నిర్ణయం తీసుకుంది. దీనికి ముందు, తర్వాత ఇతర పట్టణాలు, పర్యాటక ప్రదేశాలు ఇటువంటి నిర్ణయాలే తీసుకున్నాయి. కొంతమంది హైకోర్టులో సవాలు చేయగా, నిషేధాజ్ఞలకు కొన్ని సవరణలు చేసినట్లు వార్తలొచ్చాయి. అసలు ప్లాస్టిక్ సంచులు చేసిన పాపమేమిటి? వాటిని వాడే వారి నేరమేమిటి? వాటి వాడకం ద్వారా వస్తున్న ఇబ్బందులకు సరైన పరిష్కారమేమిటి? ఈ విషయాలను హేతుబద్ధంగా విశ్లేషించకుండా, చర్చించకుండానే నిషేధించడం వల్ల ఒక సమస్య బదులు మరిన్ని వేరే సమస్యలు కొని తెచ్చుకున్నట్లు అవుతుంది. ప్లాస్టిక్ సంచులను నిషేధించడాన్ని అత్యుత్సాహంతో సమర్థించిన మీడియా, మేధావులు, అధికారులు ప్రత్యామ్నాయం గురించి పూర్తిగా ఆలోచించారా? వారి ఉత్సాహానికి కారణం ప్లాస్టిక్ సంచుల పీడ వదిలిందనా, లేక ప్రజల మీద పెత్తనం చెయ్యడానికి మంచి అవకాశం దొరికిందనా?

నూటయాభై సంవత్సరాల క్రితం భూగర్భ చమురును కనిపెట్టిన మొదట్లో దాన్ని శుద్ధిచేసి, కిరసనాయిలు రూపంలో – దీపాలకు, వంట చెరకుగా మాత్రమే వాడేవారు. క్రమేపీ పరిశోధనల ద్వారా చమురు నుంచి రకరకాల పదార్థాలు వేరు చేసి, కొన్ని లక్షల వినియోగ వస్తువుల్ని తయారుచేసే పరిశ్రమలొచ్చాయి. వివిధ రూపాల్లో ప్లాస్టిక్ విస్తృతంగా వినియోగంలోకి వచ్చింది. ఈ రోజున ప్లాస్టిక్ వాడని ప్రపంచాన్నే ఊహించుకోలేము. ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు ఆధునిక జీవితంలో విస్మరించలేని అంతర్భాగమయ్యాయి. పళ్ళు, కూరగాయలు, పచారీ ఇతర వస్తువుల దైనందిన కొనుగోళ్ళు సత్వరంగా, సౌకర్యవంతంగా జరగడానికి, తద్వారా ప్రజల ఉత్పాదకత పెరగడానికి కారణమయ్యాయి.

మరి వీటిని నిషేధించటానికి చూపిస్తున్న కారణాలేమిటి? అవి పర్యావరణాన్ని కలుషితం చేస్తాయట. ఎక్కడపడితే అక్కడ పారేయడం వల్ల కాపలా లేకుండా రోడ్లంట

తిరిగే ఆవులు, గేదెల కడుపుల్లో ఇరుక్కుంటున్నాయట. అవి చెత్తతో కలిపి పారేసినపుడు మట్టిలో కలిసిపోకుండా వందల సంవత్సరాల వరకు అలాగే ఉంటాయట. దానివల్ల భూగర్భజలాలు అడుగంటటమే కాక, కలుషితమవుతాయట. మరీ పలుచని వాటితోనే ఎక్కువ ప్రమాదమట. నలభై మైక్రాన్ల మందమయితే ఫరవాలేదట. వాటి బదులు తిరిగి వాడగలిగే చేతిసంచులు వాడాలట.

ఈ వాదనల్ని ప్రాథమికంగా, స్థూలంగా విశ్లేషిద్దాం. వందల సంవత్సరాల పాటు మట్టిలో కలిసిపోక పోవడం ఒక్క క్యారీ బ్యాగులకే కాదు, అన్ని ప్లాస్టిక్ వస్తువులకూ వర్తిస్తుంది. మరి వాటన్నిటినీ నిషేధిద్దామా? కాపలా లేకుండా తిరిగే పశువులు పౌర జీవనానికే అడ్డంకి. వాటిని తొలంగించాల్సింది పోయి, అవి ఇబ్బంది పడుతున్నాయని ప్లాస్టిక్ బ్యాగులను నిషేధించడం హాస్యాస్పదం. ప్లాస్టిక్ – రసాయనికంగా జడపదార్థం.

అలాంటప్పుడు అది భూమినో, నీటినో కలుషితం ఎలా చెయ్యగలదు? మనదేశంలో ఎక్కడ చూసినా చెత్తను నేలమీదే కుప్పలుగా పోస్తారు. భూమిలో గోతులు తీసి నింపరు. మరి భూగర్భజలాలను ఎలా నష్టపరుస్తాయి? ఎక్కువ మందం గల బ్యాగులను తయారు చెయ్యాలంటే ఎక్కువ ప్లాస్టిక్ కావాలి. అంటే ఎక్కువ ముడిచమురు కావాలి. మరి ముడి చమురును భావి తరాల కోసం ఆదా చెయ్యాలంటారు కదా? ప్లాస్టిక్ బ్యాగులకు సూచిస్తున్న ప్రత్యామ్నాయాలేమిటి? కాగితం లేక జౌళితో చేసిన సంచులు. మరి కాగితం తయారీ కోసం చెట్లు నరకాలిగా? జౌళి సంచుల కోసం ప్రత్తి, జనుము లేదా గోగుల సాగు పెరగాలిగా? మరి ఆమేరకు ఆహార ధాన్యాల సాగు తగ్గిపోదూ? కాగితం తయారీలో వాడే రసాయనాలు భూమిని కలుషితం చెయ్యవూ? సమయానికి చేతి సంచిలేకపోతే ఏం చెయ్యాలి? సమయం, ఇతర వనరులు వృధాకావూ? వాటికి విలువ లేదా?

నిజానికి – ఈ పాపం ప్లాస్టిక్ బ్యాగులది కాదు. మన పురపాలక వ్యవస్థది. ప్లాస్టిక్ బ్యాగుల్లాంటి కొత్త వస్తువులు అత్యధిక స్థాయిలో వాడకంలోకి వచ్చినపుడు వాటిని ఎలా సేకరించాలి, ఎలా వేరుచేసి, లాభదాయకమైతే రీసైకిల్ చేయడమో, లేకపోతే ఎలా డిస్పోజ్ చెయ్యాలో ఆలోచించగల ముందుచూపు, సామర్థ్యం వాటికి లేవు. ఎలా కావలిస్తే అలా పారెయ్యడానికి పైసా ఖర్చులేదు కాబట్టి, పౌరులు కూడా బాధ్యతారాహిత్యం ప్రదర్శిస్తారు. పూర్తిగా సామాజీకరించిన పురపాలక సేవల్లో ఇది తప్పదు. జనావాసాల మధ్యే కంపుగొడుతూ, పందులు తిరుగాడే రీతిలో చెత్తను నేలమీద కుప్పపోసే పురపాలక వ్యవస్థలకు – ప్లాస్టిక్ క్యారీ బ్యాగులొక్కటే ఇబ్బందిగా తయారయ్యాయా?

చెత్తను మొత్తంగా కాల్చేయాలా, తద్వారా విద్యుచ్ఛక్తి ఉత్పత్తి అవుతుందా, లేక

కుప్పలు పోసి కుళ్ళబెట్టాలా, లేక భూమిలో గోతులు తీసి పూడ్చిపెట్టాలా, చెత్త నుండి ప్లాస్టిక్‌ను ఎలా వేరు చెయ్యాలి? ఇవన్నీ శాస్త్ర, సాంకేతిక ప్రశ్నలు. వీటన్నిటికీ జవాబులున్నాయి. లేనిదల్లా స్థానిక పురపాలక వ్యవస్థల జవాబుదారీతనం. *చెత్తను సేకరించడం, ఇతరులు ఎవరికీ నష్టం కలగకుండా దాన్ని డిస్పోజల్ చెయ్యడాన్ని ప్రైవేటీకరిస్తే అన్ని సమస్యలకూ సమాధానం దొరుకుతుంది. ప్రైవేటు సంస్థలు రకరకాల వ్యర్థాల సేకరణకు వేరువేరు ధరలు నిర్ణయిస్తాయి. వాటిని వీలు, అవసరం మేరకు వేరుచేసి, రీసైకిల్ చేసి మిగిలిందాన్ని ఇతరులెవరికీ నష్టం, హాని కలగని రీతిలో సక్రమంగా వదిలించుకుంటారు. అప్పుడు ప్లాస్టిక్ క్యారీబ్యాగులు, వస్తువులను పారేయడానికి ప్రజలకు కొంత ఖర్చవుతుంది. ఈ ఖర్చుల లెక్కలతో ప్లాస్టిక్ బ్యాగులు వాడాలో లేక చేతిసంచులు వాడాలో వినియోగదారులు నిర్ణయించుకుంటారు.*

పల్లెల్నుంచి మహానగరాల వరకు పారిశుద్ధ్యం ఒక సవాలుగా నిలుస్తోంది. చెత్తను సేకరించకపోవడం, సరిగా పారవేయక పోవడంతో ఎన్నో వ్యాధులకు కారణమవుతోంది. ఈ పరిస్థితి శాశ్వతంగా మారాలంటే ఇళ్ళలో, పరిశ్రమలో తయారయ్యే చెత్తను సేకరించడం, శాస్త్రీయ పద్ధతుల్లో ఇతరులకు హాని కలగకుండా డిస్పోజ్ చెయ్యడానికి ఈ రంగాన్ని ప్రైవేటీకరించడం మినహా వేరే మార్గం లేదు.

10-07-2011

తాత్విక కోణంలో తెలంగాణ

"దేవుడా, నేనుమార్చలేని విషయాలను అంగీకరించే ధీరత్వమివ్వు. మార్చగలిగేవాటిని మార్చేశక్తినివ్వు. ఆ రెంటికీ తేడా-తెలుసుకోగల వివేకాన్నివ్వు".

మద్యానికి బానిసలైనవారు తమ బలహీనతలను గుర్తెరిగి, తమనుతాము సంస్కరించుకోవటానికి జరుపుకునే సమావేశాల్లో చేసే ప్రార్థన ఇది. అది అందరికీ వర్తిస్తుంది.

వాస్తవికత ఆధార హేతుబద్ధ స్వేచ్ఛావాద తాత్వికత ప్రకారం అధిభౌతిక సృష్టి ప్రాథమికం. అంటే వాస్తవ భౌతిక ప్రపంచాన్ని ప్రశ్నించకుండా అంగీకరించాలి. మనిషి స్పృహ, చైతన్యం (కాన్షస్‌నెస్) వాస్తవ ప్రపంచానికి సంబంధించే ఉంటుంది తప్ప శూన్యంలో మనజాలదు. మనిషికి ఆలోచనాశక్తి ఉండడం ఒక వాస్తవం. కానీ, ఆలోచించాలో వద్దో అన్నది మనిషి స్వబుద్ధి మీద ఆధారపడి ఉండడం కూడా అంగీకరించక తప్పని వాస్తవంలో భాగం. మనిషి చేసే ఆలోచనలు, పనులు వాస్తవికతకు విరుద్ధమైనవైతే అవి ఆమోదయోగ్యం కావు, విజయం సాధించవు. సృష్టిని, వాస్తవికతను (రియాలిటీ) ప్రశ్నించకుండా అంగీకరించాల్సిందే. కానీ మనిషికున్న స్వబుద్ధి కారణంగా అతడు చేసే ప్రతి పనిని, ఆలోచనను ప్రశ్నించకుండా, 'వాస్తవంతో వైరుధ్యం లేదుకదా' - అని నిర్ధారించుకోకుండా అంగీకరించకూడదు.

దీనికి భిన్న ధృవమయిన సమసమాజ సమతావాదం ప్రకారం; మనిషి చైతన్యమే ప్రాథమికం. *అంటే మనిషి ఆలోచనల మేరకే సృష్టి, వాస్తవం ఉంటాయి. సృష్టిని మనిషి నిజమనుకుంటే నిజం; మాయ అనుకుంటే మాయ. అంటే సృష్టి అనేది మనిషి మెదడులో, ఆలోచనల్లోనే ఉంటుంది తప్ప వాస్తవంగా ఏం లేదు. అంతా మిథ్య. కాబట్టి మనిషి ఆలోచనల్నీ, కోరికల్ని ఇతరుల అవసరాలకు అనుగుణంగా మలచవచ్చు, నిర్దేశించవచ్చు, ఆదేశించవచ్చు. అసమాన వ్యక్తుల నుంచి సమాన ఫలితాలను, ఉత్పాదనను ఆదేశాల ద్వారా రాబట్టవచ్చునే సమసమాజ తాత్వికత, సోషలిస్టు భావజాలం ఈ దృష్టికోణం నుంచే*

అవిష్కృతమయ్యాయి. తప్పుడు తాత్వికత మనిషిని గందరగోళంలో పడేస్తుంది. తన నమ్మకాలకు, ఆలోచనలకు, వాస్తవానికి పొంతన లేక - దారితప్పిస్తుంది.

తెలంగాణ సమస్య ఒక కొలిక్కి వస్తున్న నేపథ్యంలో తాత్విక గీటురాయితో దాన్ని తడిమి చూడొచ్చు. ఇరువైపులా మేధావులు, ప్రజలు ఏ వాస్తవాలను విస్మరించి ఎలా గందరగోళానికి గురవుతున్నారో అర్థం చేసుకోవచ్చు.

ముందుగా ప్రకృతి, సృష్టి సంబంధ విషయాలు. భౌగోళికంగా - కృష్ణా, గోదావరి డెల్టాలు వేరు, పీఠభూమయిన తెలంగాణ వేరు. ఇదెవరూ మార్చలేని వాస్తవం. గోదావరికి కాలడ్డం పెట్టి సాగునీరు పారిస్తామని డాంబికాలు పలికిన వాళ్ళ మాటలను ప్రశ్నించకుండా ఎలా నమ్మేశారు? పండించగలిగే పంటలు వేరు..., భూమి స్వభావం వేరు. మరి ఒకరితో పోలికెందుకు? ఇంతకంటే నిస్సారమయిన భూమి కలిగి, వర్షమంటే ఏమిటో తెలియని ఇజ్రాయెల్‌లో కోస్తా కంటే వందల రెట్లు విలువ గల పంటలు పండిస్తున్నారు. ప్రభుత్వ రాయితీలతో కాదు, ఎకరాకు సంవత్సరానికి అరవైవేల రూపాయలు చెల్లించి నీళ్ళు కొనుక్కుని మరీ. కాబట్టి మనిషికున్న మేధస్సుతో అదికూడా సాధ్యమే. ఎవరూ నిస్పృహ పడాల్సిన అవసరం లేదు. అలాగే తెలంగాణ ప్రాంతం శతాబ్దాల పాటు ఆధునిక విద్యావ్యవస్థ, స్వేచ్ఛల్లేని నిజాం పాలన నుంచి బయటికొచ్చిందని, సీమాంధ్ర ప్రాంతాలు దాదాపు వంద సంవత్సరాల పాటు బ్రిటీష్ విద్యావ్యవస్థ, చట్టబద్ధ పాలనలో ఉన్నాయనేవి విస్మరించజాలని వాస్తవాలు.

ఇకపోతే మానవ కారక విషయాల్లోకి వద్దాం. ఒకే పార్టీలోని పెద్దమనుషులు తమలో తాము రాసుకున్న ఒప్పందాన్ని వాళ్ళు బ్రతికుండి, ప్రభుత్వంలో ఉన్నప్పుడే ఇరుపక్షాలవారూ ఉల్లంఘించారు. దాంతో ఇవాళొచ్చిన నష్టమేమిటి? ఉద్యోగాల దోపిడీ? ఉద్యోగమంటే జీతానికి పనిచేయడమనే వృత్తి. అదేమన్నా బంగారమా దోచుకోవడానికి? అది దోపిడీ అయితే మరి ఇంటికొక ఉద్యోగం, డబుల్ ప్రమోషన్లు ఇస్తామని చేస్తున్న వాగ్దానాలు? ఎవర్ని దోచుకోవడానికి?

2004 ఎన్నికల ఒప్పందం. దాని ప్రకారం కాంగ్రెస్ వారు ఇస్తామన్నది రెండో ఎస్సార్సీయే కదా! సంతకాలు పెట్టిన ఇరుపార్టీలూ ఈ ఒప్పంద వివరాల్ని ఆ రోజున బహిరంగపరిచాయా? పోనీ ఆత్మహత్యలు చేసుకుంటున్న విద్యార్థులకు చెప్పారా? మరిప్పుడు కాంగ్రెస్‌ను ఎవరు, ఎందుకు, ఎలా తప్పు పట్టగలరు?

ఆమరణ దీక్ష రెండో రోజునే పళ్ళరసం తాగడం వాస్తవం. తర్వాత కూడా పుష్టికరమైన ద్రవాహారం మీద దీక్ష కొనసాగించడం వాస్తవం. అసలీ డిమాండును పదిహేనేళ్ళ క్రితం అందరికంటే ముందుగా మావోయిస్టులు తెరపైకి తెచ్చారన్నది వాస్తవం.

వాళ్ళకు భయపడి, ఎవరూ వ్యతిరేకించడానికి నోరెత్తలేదన్నది వాస్తవం. ఇన్నాళ్ళూ వెనుకబడినతనం కారణం చూపి డిమాండు పెట్టారన్నది వాస్తవం. శ్రీకృష్ణ కమిటీ రిపోర్టు తర్వాత ఆత్మగౌరవ ప్రాతిపదికను ముందుకు తెచ్చారన్నదీ వాస్తవం. ఉద్యమ క్రమంలో ఏంచేసినా అభిశంసనీయం కాదనే రాజకీయ నైతికతను మీడియా, మేధావులు పెంచి పోషించారన్నది వాస్తవం. ఆ బలంతో ఉద్యమం పేరిట వ్యక్తుల ప్రాథమిక హక్కుల్ని తుంగలో తొక్కడం వాస్తవం.

(హోటల్) పేరు ఇష్టం లేకపోతే భోజనం కొనుక్కోవడం మానేయొచ్చు. హీరో స్థానికత ఇష్టంలేకపోతే సినిమా చూడ్డం మానేయొచ్చు. సహచరులను కూడా చూడొద్దని నచ్చజెప్పవచ్చు. అంతేగానీ ఆంధ్ర మెస్‌లను మూయించడం, థియేటర్లు పగలకొట్టడం, షూటింగులు భగ్నం చెయ్యడం, ఇళ్ళమీద దాడులు, వాహనాల దహనం, నాలుకకోస్తాం, జాగో భాగోలన్నీ లక్షలాది మంది భయ విహ్వలతకు, కోట్లాది మంది అభద్రతా భావానికి దారితీశాయన్నది వాస్తవం.

అసలీ ఆటలన్నీ ఇరువైపులా రాజకీయాల అధికార క్రీడలే తప్ప ప్రజల బాగుకోసం కాదన్న వాస్తవాన్ని ఐదేళ్ళుగా చూస్తూ కూడా గ్రహించలేని వాళ్ళు తమ అజ్ఞానానికి తామే బాధ్యులు. చిక్కుముళ్ళ నుంచి ఎలా బయటపడాలో తెలియక గిలగిల్లాడుతున్న నాయకులు, పార్టీలు వారి పరిస్థితికి వారే బాధ్యులు. డబ్బిచ్చి పేపరు కొనుక్కునే వినియోగదారులకు వాస్తవ సమాచారం అందించాల్సిన పత్రికలు, వాటి సిబ్బంది – ఉద్యమంలో పక్షాలు కట్టారన్నది వాస్తవం. అలాంటి వాళ్ళు రాసిన కథనాలు చదివి రక్తపోటు పెంచుకోవడం విజ్ఞత అవుతుందా? మనిషి చేసిన ఏ పనినయినా నిశితంగా, విమర్శనాత్మకంగా పరిశీలించకుండా అంగీకరించకూడదనే తాత్విక సూత్రాల్ని విస్మరించడం వల్లే – ఈ పరిణామం.

భాష అనేది భావ వ్యక్తీకరణకు ప్రధాన మాధ్యమం. అంతమాత్రాన రాజకీయ నిర్మాణానికి అదే ప్రాతిపదిక కానక్కర్లేదు. అయినా భాష ప్రాతిపదికన రాష్ట్రాలేర్పడ్డాయనేది చారిత్రకంగా జరిగిన మానవ నిర్మిత వాస్తవం. దాన్ని మార్చుకోవడం అసంభవమూ కాదు, తప్పూ లేదు. కాకపోతే ఏ కొత్త ప్రాతిపదికన రాష్ట్రాలను విభజించాలో దేశవ్యాప్తంగా ఒక విధానముండాలనే వాదనా ఆక్షేపణీయం కాదు. దోపిడీదారులనబడేవారు నిజంగా దోచి ఉంటే; అది ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకునే చేశారు. అలాంటి విచక్షణాధికారాల్ని ప్రభుత్వాలకు మనమే ఇచ్చాం.

కొత్త రాష్ట్రంలో అలాంటి అధికారాలను రద్దుచేసి దోపిడీని అరికడతామని ఏ పార్టీ కూడా చెప్పడంలేదు. అంటే దోపిడీదారులు మారుతారు గానీ దోపిడీ మాత్రం

ఆగదు. సామాన్య ప్రజలకు ఏరాయైతేనేం పళ్ళూడగొట్టుకోవడానికి? మరి కొత్తదోపిడీ ముఠాలకు పట్టాభిషేకం చేయడానికి ప్రజా సమూహాలకు ఎందుకింత ఉబలాటం, ఇంత సెంటిమెంటు? తాత్విక శూన్యత, అహేతుక, ఆత్మాశ్రయ వాదం (సబ్జెక్టివిటీ). "వాస్తవాలెలా ఉన్నా సరే, నేనడిగింది ఇచ్చి తీరాల్సిందే, ఎందుకంటే 'నేను' కావాలనుకుంటున్నాను గనక. ఇంతమంది చెబుతున్నారు కాబట్టి నిజమే అయ్యుండాలి, ఇంతమంది కోరుతున్నారు కాబట్టి న్యాయమే అయ్యుంటుంది" అనే ఉద్వేగపూరిత గొర్రెదాటు మనస్థత్వం.

అహేతుక సెంటిమెంటుతో అప్పుడప్పుడూ ఊగిపోయే వారు కూడా తమ సొంత విషయాల్లో హేతుబద్ధంగానే వ్యవహరిస్తారు. ఇక్కడైతే చదువులు సరిగ్గా సాగేట్లు లేవని తమ పిల్లలను కోస్తా కాలేజీల్లో చేరుస్తారు. బంధుత్వాలు కలుపుకోవడానికి ప్రాంతం అడ్డురాదు. మన ప్రాంతం వాడైనా ప్రభుత్వాఫీసుల్లో లంచం ఇవ్వనిదే పని జరగదు. వ్యక్తిగతంగా ఎదగడానికి ప్రాంతం అడ్డురాదని వ్యక్తులకు తెలుసు. ఎటొచ్చీ ప్రభుత్వం, దాని వ్యవస్థల మీద పరాన్న జీవులుగా బ్రతికేవాళ్ళకే, ఇంకా ఎక్కువ పొందొచ్చనే ఆశ. వారి ఆశను ప్రజల ఆశయంగా, ప్రజలకున్న ఏకైక మోక్షమార్గంగా భ్రమింపచేస్తున్నారు. స్వంతంగా, వైరుధ్య రహితంగా, హేతుబద్ధంగా ఆలోచించలేని వాళ్ళు బుట్టలో పడుతున్నారు.

ఇరువైపుల ప్రజలు, విద్యార్థులు, మేధావులు అసలు కోరాల్సింది ప్రజల హక్కుల్ని రక్షించే ప్రభుత్వ వ్యవస్థని. ఉద్యమించాల్సింది, విప్లవించాల్సింది రాజకీయ నాయకులు తమ స్వప్రయోజనాల కోసం ప్రజలకు వేసిన సంకెళ్ళను తెంచుకోవడానికి. దానికి కావలసింది ఎదుటివాళ్ళను తొక్కిపెట్టే హింసాత్మక ఉద్యమాలు కాదు. స్వేచ్ఛగా, తన నిర్ణయాలు, చేతలు, వాటి పర్యవసానాలకు బాధ్యత వహిస్తూ, ఎవరినీ వంచక, ఎవరికీ తలవంచక, సర్వసత్తాక వ్యక్తిగా బతకగల సమాజం కోసం భావోద్యమం కావాలి. అప్పుడే మనిషికి విముక్తి. దానికి ప్రాంతం, భాష, యాస, బిర్యానీ అడ్డుకావు, అడ్డురావు.

17-07-2011

ప్రేమ - పిచ్చి

యువతులపై యాసిడ్ పొయ్యడం, గొంతు కోయడం లాంటి దుర్మార్గాలు రోజురోజుకూ ఎక్కువవు తున్నాయి. ప్రేమించట్లేదని బ్లేడ్లతో, కత్తులతో గాయపరచడం, ప్రాణాలు తియ్యడం, లేదా రకరకాలుగా వేధించడం మామూలైపోయాయి. దిగ్భ్రాంతికరమైన సంఘటన జరిగినపుడు మీడియా, మహిళా సంఘాలు ఆందోళన చెయ్యడం, బాధ్యులను బహిరంగంగా ఉరితీయాలని డిమాండ్ చేయడం, కొన్నాళ్ళకు అందరూ మరిచిపోవడం జరుగుతోంది.

పాశ్చాత్య సంస్కృతి, సినిమాలు, టీవీ ఛానళ్ళ ప్రభావం, మెటీరియలిజం పెచ్చుపెరిగిపోవడం వల్లే ఇదంతా జరుగుతోందని, ఆర్థిక సంస్కరణలు, కాపిటలిజమే దీనికి కారణమనీ చాలామంది అంటుంటారు. ప్రభుత్వ, చట్ట, శిక్షా వ్యవస్థ వైఫల్యం కారణంగా భయం లేకుండా పోయిందని కొందరు, అసలు విద్యావ్యవస్థలోనే లోపముందని కొందరు వాదిస్తారు. ఈ వాదనల్లో ఎంతో కొంత నిజమున్నా, అసలు సమస్యకు మూలకారణం నైతిక గందరగోళం. ఏది సరైంది....ఏది కాదు, ఏది చెయ్యొచ్చు.... ఏం చెయ్యకూడదు, ఏది మంచి; ఏది చెడు, అసలు ఎందుకు మంచి... ఎందుకు చెడు అన్న విషయాలపై అవగాహన లేకపోవడమో; లేక తప్పుడు అవగాహనలకు లోనవడమో కారణంగా ముఖ్యంగా యువతలో తాత్విక గందరగోళం నెలకొని ఉంది.

తప్పుడు తాత్వికత - జీవితాన్ని తప్పుదారిలో నడిపిస్తుంది. ఎదురు దెబ్బలు తగులుతాయి. ఆ ఎదురుదెబ్బలు, ఎదుర్కొనే సంక్షోభాల నుంచి నడివయసుకు వచ్చేసరికి చాలామందికి హేతుబద్ధ ఆలోచన అలవడుతుంది. కానీ అప్పటికే చాలా ఆలస్యమై పోతుంది.తన జీవితంలోని విలువైనకాలాన్ని నష్టపోవడం, తాను ఎదురుదెబ్బలు తినడమే కాక, తన అహేతుక చర్యల వల్ల ఎంతో మందికి ఇబ్బంది, నష్టం కలిగించిన వారవుతారు. కొన్ని సరిదిద్దుకోలేని తప్పులు, నష్టాలు జరుగుతాయి. అదీగాక చాలామందికి అనుభవంతో

నేర్చుకున్న పాఠాల ద్వారా తాత్విక స్పష్టత ఏర్పడదు. దాంతో తమ తరువాతి తరాన్ని సరైన మార్గంలో నడిపించడంలో విఫలమవుతారు. అసలీ నైతికత అంటే ఏమిటి? అదెక్కడ్నుంచి వస్తుంది? దానికి ప్రాతిపదిక, ఆధారం ఏమిటి?

నైతికత అనేది మనిషి సన్మార్గంలో జీవించడానికి అవసరమైన విలువల జాబితా. సృష్టిలో – కొండలు, నదులు, టీవీల్లాంటి ప్రాణరహిత వస్తువులకు నైతికత అవసరం లేదు. కానీ ప్రాణమున్న చెట్లు, చేమలకు, జంతు జాలానికి, మనిషికి నైతికత అవసరం. మత తాత్విక వాదం ప్రకారం నైతికత దేవుడు చెప్పినట్లుగా రాసిన మత గ్రంథాల నుంచి వస్తుంది. సమసమాజ లేదా సమతావాదం ప్రకారం నైతికత సమాజం నుండి, సమాజ అవసరాల నుంచి, సమాజ సంప్రదాయాల నుంచి వస్తుంది. సమాజమనేది ఒక భావనే (Concept) తప్ప నిర్దిష్టరూపం కలది కాదు కాబట్టి; ఈవాదం ప్రకారం సమాజాన్ని నడిపే ప్రభుత్వాలు లేదా వ్యక్తులు లేదా మెజారిటీ అభిప్రాయాలే నైతికతకు ప్రాతిపదిక. హేతుబద్ధ వాస్తవిక వాదం లేదా ప్రామాణిక ఉదారవాదం లేదా వాటినుంచే వచ్చే కాపిటలిజం తాత్వికత ప్రకారం నైతికత జీవజాతి స్వభావాన్ని బట్టి, ప్రాణం నిలుపుకోవాల్సిన అవసరం నుంచి వస్తుంది.

జీవజాతుల సహజ స్వభావమే – అవి ప్రాకులాడాల్సిన విలువలను నిర్ణయిస్తుంది. వృక్షాలకు, జంతువులకు పనికొచ్చే విలువలు... మనిషికి పనికిరావు. మనిషికున్న కొన్ని ప్రత్యేకతలు వాటికి లేవు. వృక్షజాతి తనకు సిద్ధించిన లక్షణాల ప్రకారం ఆహారం, నీరు, సూర్యరశ్మి కోసం శ్రమించడం ద్వారా బ్రతికుండడానికి ప్రయత్నిస్తుంది. అదే దాని నైతికత, విలువలు. ఆ మేరకు తెలివి దాని డిఎన్ఏలో నిక్షిప్తమై ఉంటుంది. జంతు జాతులకు తమ పరిణామ స్థాయిని బట్టి లక్షణాలు, చైతన్యం, చైతన్య స్థాయిని బట్టి జ్ఞానం ఉంటాయి. అధమ ప్రాణులకు కేవలం ఇంద్రియ జ్ఞానం, పైస్థాయిలో ఉండే కుక్క, పులి లాంటి వాటికి ఇంద్రియ జ్ఞానంతోపాటు కొంత అవగాహన శక్తి, గ్రహణ శక్తి, ఉంటాయి.

అత్యంత చైతన్యం కలిగిన మానవజాతికి ఇంద్రియ జ్ఞానం, గ్రహణ శక్తిలతో పాటు ఊహించే శక్తి, భావశక్తి, దీర్ఘకాలీక ఆలోచనా శక్తి కూడా ఉన్నాయి. జ్ఞాపక శక్తి, సింపుల్ భావాలను కలిపి సంక్లిష్ట భావాలు రూపొందించుకునే శక్తి, భావాల్నుంచి నిర్దిష్ట విషయాలను అమూర్తీకరించే (అబ్‌స్ట్రాక్షన్) శక్తులు కూడా మనిషికే పరిమితం. మానవ జాతికున్న ఈ ప్రత్యేకతలే ఆ జాతి నైతికతను నిర్దేశిస్తాయి.

ఈ లక్షణాల్నుంచి వచ్చిన నైతికత ప్రకారం జీవితం, అందులోనూ ఆనంద మయమైన జీవితమే మనిషి నైతికత ముఖ్య లక్ష్యం. జీవితాన్ని ముందుకు తీసుకెళ్ళేవే నైతిక విలువలు. చావుకు దగ్గరగా తీసుకెళ్ళేవి – అనైతికాలు. వృక్షజాతి తన పరిసరాల్నుంచి

ప్రాణాధారాలైన ఆహారం, నీరు, సూర్యరశ్మిని గ్రహిస్తుంది. జంతుజాతి వేటాడి బ్రతుకుతుంది. మానవజాతి తన కాళ్ళు, చేతులు, మెదడు ఉపయోగించి ఉత్పత్తి చేసి బతకాలి. ఇది వారి వాటి స్వభావం. ఉత్పత్తి చేయడానికి మనిషికున్న ఉపకరణాలు తన శరీరం, మేధోశక్తి, ఆలోచనా పటిమ, యుక్తి (రీజన్).

కాబట్టి – మనిషి శరీరం మనిషికి సొంతం. దాని మీద ఏ ఇతరులకూ అధికారం లేదు. అలాగే మనిషి ఆలోచనలు, స్వబుద్ధితో తీసుకునే నిర్ణయాలు, వాటి పర్యవసానాలు తనకే సొంతం, తనదే బాధ్యత. జీవితకాలం అరవై – డెబ్భై సంవత్సరాలుంటుంది కాబట్టి; మనిషి ఆలోచనలు దీర్ఘకాలికమైనవై ఉండాలి. పర్యవసానాల్ని సరిగా బేరీజు వేసుకుని నిర్ణయాలు తీసుకోవాలి. ఎవరూ సర్వజ్ఞానులు కారు కాబట్టి – కొన్ని నిర్ణయాలు వికటించవచ్చు. కానీ ఆ బాధ్యత తానే తీసుకోవాలి తప్ప, ఇతరుల మీదకో, సమాజం మీదకో నెడితే ప్రయోజనం వుండదు.

ప్రేమ పేరుతో దాడులు చేసే వారికి – అసలు ప్రేమంటో ఏంటో తెలుసా? ప్రేమంటే ఇద్దరు వ్యక్తుల మధ్య విలువల మార్పిడి. విలువలంటే డబ్బు, దస్కం కాదు. చదువు, దానికంటే మించి సంస్కారం, జీవితం పట్ల అవగాహన, కష్టించే గుణం, ఇలా జీవితాన్ని మెరుగుపరిచే నైతిక విలువల మార్పిడి. సమస్థాయిలో విలువలు గల వారి మధ్య సంబంధం కలకాలం నిలుస్తుంది. *ప్రేమను ఇవ్వడంలో మన విలువలను ఇంకొక వ్యక్తిలో సాక్షాత్కరింప జేసుకుంటాం. ప్రేమను అందుకోవడంలో మనం అలవరచుకున్న, ఆర్జించిన విలువలకు గుర్తింపు, బహుమానం పొందుతాం.*

ప్రేమ గుడ్డిదని, షరతుల్లేనిదని, త్యాగాన్ని కోరుతుందని, ప్రేమలో స్వార్థానికి తావులేదని సినిమాలు, కథలు, కాల్పనిక సాహిత్యం ఘోషిస్తుంటాయి. ప్రేమ గుడ్డిది కాదు. చీకట్లో రాయి విసరడం లాంటిది కాదు. ఎవరికి తగిలితే వాళ్ళను – ఇంకే కారణమూ లేకుండానే ప్రేమించలేరు. అలాగే అది షరతుల్లేనిదీ కాదు. ఒకరెన్ని తప్పులు, ఆకృత్యాలు చేసినా రెండోవారు భరించాల్సిన అవసరం లేదు. అలాగే ప్రేమ త్యాగాన్ని కోరదు. అసలైన ప్రేమలో స్వార్థమే తప్ప త్యాగానికి చోటులేదు. తన విలువల్ని ఇంకొకరిలో చూసుకోవడం, ఇంకొకరి విలువలను తనకు గుర్తింపుగా భావించడం, ఆ రకంగా తనను తాను విస్తృతపరచుకోవడం హేతుబద్ధ, ధర్మబద్ధ స్వార్థమే తప్ప త్యాగం కాదు. ఇచ్చిపుచ్చుకోవడమే ప్రేమకు పునాది, ఇంధనం కూడా. ఇందులో ఎవరి బలవంతం ఎవరి మీదా ఉండకూడదు. సమయం, డబ్బు ఖర్చుచెయ్యడం, కష్టాలు పంచుకోవడం – ఇవన్నీ మనం ప్రేమించిన వాళ్ళ సంతోషం మనకెంతో విలువైంది కాబట్టి స్వార్థంతో అవన్నీ చేస్తాంకానీ అందులో త్యాగం ఏమీలేదు. ప్రేమనేది అవతలి వాళ్ళ బలహీనతల పట్ల జాలితోవేసే బిచ్చం

కాదు. అవతలి వ్యక్తిలోని గొప్పదనాన్ని గుర్తించి, తాత్కాలికంగా ఉన్న ఒడిదుడుకులను సరిదిద్దడానికి, తద్వారా వారి సంతోషం కోసం స్వార్థంతో చేసే సహాయం త్యాగం కాదు.

తల్లిదండ్రులు, సామాజిక నేపథ్యం, పెరిగిన వాతావరణం, చదువు నేర్పిన గురువులు ఎలా ఉన్నా, వయసొచ్చాక తన స్వభావాన్ని, ప్రాపంచిక దృష్టిని, విచక్షణా జ్ఞానాన్ని, దృక్పథాన్ని, బ్రతకగలిగే సామర్థ్యాన్ని అలవరచుకోవాల్సిన బాధ్యత వ్యక్తులదే. తాను ఎంచుకున్న విలువలకు, జీవనమార్గానికి, పర్యవసానాలకు తానే బాధ్యుడు.

కానీ నేటి యువతకు సమాజం నేర్పిస్తున్నదేమిటి? పాపులర్ సినిమాలు, సాహిత్యం చెబుతున్నదేమిటి? థమ్సప్ ప్రకటనలో ఒక సీసా కోలా కోసం భవనాల మీద నుండి ఎగిరి దూకినట్లే, తాను ఎంచుకున్న యువకుడు లేదా యువతి కోసం ఎన్ని కుప్పిగంతులన్నా వెయ్యాలని, వెయ్యొచ్చని. ఏ విలువల ఆధారంగా ఎంచుకున్నారో అర్థం కాదు. అమ్మాయైతే అందం చూసి, అబ్బాయైతే కండలో, చిలిపితనమో, ఫైట్లో చూసి. ఒకటి జంతు స్థాయిలో ఇంద్రియ జ్ఞానం ద్వారా కలిగే ఆకర్షణ, రెండోది నేలవిడిచి సాముచేసే ఫాంటసీ. తాను పట్టిన మూడు కాళ్ళ కుందేలుకోసం ఏంచేసినా చెల్లుతుందనే భావన.

అంతే ప్రమాదకరమైంది సమకాలీన రాజకీయ భావజాలం. వర్తమాన రాజకీయ నైతికత ప్రకారం – సంపాదించే వాళ్ళంతా సంపాదించని వాళ్ళకోసం త్యాగం చెయ్యాలి. "ఉన్నవాడిని కొట్టు, లేనివాడికి పెట్టు; ఇదే ఈ మేస్త్రీ ఆదర్శం" లాంటి డైలాగులకు హాలంతా చప్పట్లు మోగుతాయి. అదే భావజాలాన్ని పొడిగించి; ప్రేమించబడే యోగ్యత. అర్హత లేనివాడు, ఏ విలువలూ లేని వాడు కూడా తాను కోరుకున్న యువతితో ప్రేమించబడే హక్కు ఉందనుకుంటాడు. తిరస్కరిస్తే గొంతు కొయ్యడానికి సిద్ధపడతాడు. జరగాల్సిన అనర్థం జరిగాక అతని కుటుంబ నేపథ్యం, సామాజికత, ఆర్థిక స్థోమత, సమకాలీన సంస్కృతి ప్రభావం – వీటన్నింటిని విశ్లేషించి, చివరికి తప్పు అతనిది కాదని, కనీసం అతనొక్కడిదే కాదనీ తేల్చేస్తారు. దాంతో చట్టపరమైన చర్యలెలా ఉన్నా, వ్యక్తిని తన చర్యలు, ఆలోచనలు, వాటి పర్యవసానాలకు తననే బాధ్యుణ్ణి చెయ్యకపోవడం వల్ల, ఇలాంటి ఆకృత్యాలకు నైతికంగా పరోక్ష మద్ధతు లభిస్తోంది. ప్రేమ, పెళ్ళి, స్నేహం ఇవన్నీ వ్యక్తి ఇష్టాయిష్టాలకు సంబంధించినవనీ, ఎవరికీ బలవంతం చేసే హక్కులేదనీ నిర్ద్వందంగా చెప్పగలిగినపుడే యువతకు అర్థమవుతుంది. అలాగే తన సహజ శారీరక స్వభావం ప్రకారం, గీతదాటితే వచ్చే శారీరక మార్పుల గురించి యువతులు కూడా జ్ఞానం ఉపయోగించాలి. అంతా జరిగాక అమాయకురాలినంటే, కాలం తిరిగి వెనక్కు మళ్ళదు. ప్రేమ పేరుతో ఆడపిల్లలను వేధించడం, గొంతులు కోయడం మానసిక రోగమో, సామాజిక రుగ్మతో కాదు. అసలు ప్రేమంటే ఏమిటో తెలియని తనం, ఎదుటి వారి ప్రాథమిక హక్కుల పట్ల కించిత్తైనా గౌరవం లేకపోవడం.

24-07-2011

ఎవరో వస్తారని

ఒకానొక రాష్ట్రంలో - ధైర్యం, నిజాయితీ గల ఒక వ్యక్తి లోకాయుక్తగా ఉండడం వల్ల గనుల తవ్వకాల్లో అక్రమాలు, రాజకీయ అవినీతి బయటపడ్డాయి. ఇంకో విషయంలో సుప్రీంకోర్టు స్వయంగా పర్యవేక్షించబట్టి - కేంద్ర మంత్రితోపాటు; రాజకీయంగా శక్తిమంతులైన ఎంపీలు జైల్లో ఉన్నారు. మన రాష్ట్రంలోనూ హైకోర్టు కల్పించుకోబట్టి 'దేవుని పాలన'లో జరిగిన అక్రమాలు బయటకొచ్చే అవకాశం ఏర్పడింది. ఈ పరిణామాలు చూసి సంతోషించాలా? లేక బయటకు రాని కుంభకోణాలెన్నున్నాయో కదా అని ఆందోళన చెందాలా? అసలు ఇవన్నీ జరగనిచ్చిన పరిస్థితులను విశ్లేషించాలా? ఇక ముందర జరక్కుండా ఉండాలంటే ఏం చెయ్యాలో తీవ్రంగా ఆలోచించాలా?

రోగ లక్షణానికి మందేస్తే తాత్కాలిక ఉపశమనం కలుగుతుంది, అది అవసరం కూడా. కానీ రోగ కారణాన్ని కనుక్కుని దానికి తగిన మందేస్తేనే శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుంది. ఇదొక వాస్తవం. ప్రజా జీవితంలోను, ప్రభుత్వ నిర్వహణలోను తప్పులు జరక్కుండా చూడ్డానికి నిజాయితీ గల వ్యక్తులు అవసరమే. వ్యక్తుల కంటే సరైన వ్యవస్థలు ఇంకా అవసరం. అసలు వ్యవస్థ కంటే కూడా సిద్ధాంతం, భావజాలం, తాత్విక స్పష్టత అన్నిటికంటే ఎక్కువ ప్రధానం. ప్రభుత్వం ఏం చెయ్యడానికి ఏర్పాటయిందో సిద్ధాంత పరంగా ఖాయమైతే, ఎలా చెయ్యాలో ఆలోచించి...తగిన వ్యవస్థను ఏర్పాటు చేసుకోవచ్చు. అప్పుడే ఆ వ్యవస్థను నడపడానికి కావలసిన వ్యక్తులు, వారి అర్హతలు, పని విధానం, అధికారాలు నిర్ధారించొచ్చు. లోకాయుక్త వ్యవస్థ కొన్ని దశాబ్దాలుగా దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ ఉంది.

కానీ అందరికీ తెలిసిన ఈ అక్రమాల్ని హెచ్చే ఒక్కడే నిరూపించగలిగాడు. ఆయన పదవీ కాలం కొద్దిరోజుల్లో ముగుస్తోంది. ఆ తర్వాత? అలాగే కపాడియా ప్రధాన

న్యాయమూర్తిగా ఉండబట్టే 2జి స్కామ్, కామన్వెల్త్ క్రీడల కుంభకోణం బయటికొచ్చాయి. అదే పదవిని ఇంతకు ముందు అధిష్టించిన బాలకృష్ణన్‌పై తీవ్రమైన అవినీతి ఆరోపణలున్నాయి. అంతేకాదు, మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి మార్పు, రాజకీయంగా పెనుమార్పులు జరగకుంటే ఈ సీబీఐ విచారణ జరిగేదా? అంటే ప్రజా జీవితంలో నిజాయితీ, పారదర్శకతలు ఎప్పుడో ఒకసారి వచ్చే ఒక హెగ్డే, ఒక కపాడియా, ఒక అకాల మరణంపై ఆధారపడి ఉండాలా?

ముప్పాతిక సోషలిజం, పావలా వంతు ఫ్యూడలిజంతో పుట్టిన భారతదేశం- 1990ల్లో ఆర్థిక సంస్కరణల తర్వాత అర్థసామ్యవాద, అర్థ వాణిజ్యవాద (మెర్కెంటైలిజం - mercantilism) దేశంగా రూపాంతరం చెందింది. దీన్ని కాపిటలిజంగా అభివర్ణించడం అవగాహనా రాహిత్యానికి, భావ సంక్షోభానికి సూచిక. కాపిటలిస్టు సమాజంలో సహజ వనరులన్నీ వ్యక్తులకు స్వేచ్ఛగా (ఉచితంగా కాదు) అందుబాటులో ఉంటాయి. మన సోషలిస్టు - మెర్కంటైలిస్టు సిద్ధాంత ఆచరణలో భాగంగానే వనరులన్నీ సామాజీకరణ పేరుతో ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయి. తోపుడు బండి దగ్గర్నుంచి స్టీలుప్లాంట్ల వరకు ఎవరూ ప్రభుత్వ కటాక్షం లేకుండా ఉత్పత్తి, వ్యాపారం చేసుకునే స్వేచ్ఛలేదు. తోపుడు బండి నడిపేవారు ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు లోకువైతే, స్టీలుప్లాంట్లు నడిపేవారు నీరు, భూమి, ఖనిజం, రవాణా, కరెంటు, టాక్సులు, ఎగుమతి, దిగుమతి, కాలుష్యం ఇలా వందలాది విషయాల్లో ప్రభుత్వ దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉండాల్సిందే. ఇన్నేసి అధికారాలు జేబులో ఉన్న ప్రభుత్వాలు, వాటిని నడిపే నాయకులు మునీశ్వరుల్లాగా ఉండాలను కోవడం మన అత్యాశే అవుతుంది.

చట్టాలు, నిబంధనలు స్పష్టంగా ఉన్నాయి కదా అని కొందరనుకుంటారు. కానీ వాటిని అమలుచేసే వాళ్ళను నియమించేది, నియంత్రించేది ఎవరు? ఈ ప్రభుత్వాలు, రాజకీయ నాయకులే కదా! ఏ చట్టాన్ని ఎవరిమీదకు ఎక్కుపెట్టాలో, ఏ నిబంధనలను ఎవరి విషయంలో నీరుకార్చాలో లోపాయికారీగా నిర్ణయించే విశేష, విచక్షణాధికారాలు కొన్ని మనమిచ్చాం. మిగతావి వాళ్ళే పుచ్చేసుకున్నారు. తెల్లారి లేస్తే ఏ ఎమ్మెల్యే ఏ రూలు సడలింపు కోసం ఎక్కడ పైరవీ చేస్తున్నాడో ఎవరు చూడొచ్చారు? అంత తీరిక, ఓపిక, అవకాశం ఎవరికుంది? ప్రతిపక్షాలున్నాయి కదా అనుకుంటారు. వారి అవకాశాలూ పరిమితమే, వారూ ఆ తాను లోని గుడ్డలే; అదీగాకను హెలీకాప్టర్‌లో తీసుకెళ్ళి వాళ్ళక్కూడా తలొక సూట్‌కేసు పడేస్తే? ఇకపోతే మీడియా. వారు మాత్రం అవినీతికి అతీతులా? అసలుతాళాలు దొంగలచేతిలో పెట్టడమెందుకు..? మళ్ళీ వాళ్ళనుకాపలా కాయడమెందుకు?

ఇనుప ఖనిజానికి దేశీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో ఉన్న డిమాండు కారణంగా

అది అత్యంత లాభదాయకమైన వ్యాపారమైంది. కానీ అన్ని సహజ వనరుల్లాగే ఈ గనులు కూడా ప్రభుత్వం చేతుల్లోనే ఉన్నాయి. కాబట్టి అందులో చెయ్యితిరిగిన వాళ్ళు రాజకీయంగా పెట్టుబడులు పెట్టి మైనింగ్ లైసెన్సులు తెచ్చుకున్నారు. వచ్చిన లాభాల్లో కొంతభాగం తిరిగి రాజకీయాలకు పెట్టుబడిగా పెట్టారు. వేరే వాళ్ల గనులనూ భయపెట్టి లాగేసుకున్నారు. సరిహద్దులు దాటి తవ్వారు. వేలకోట్ల డబ్బు పోగేసుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క సీటు కోసం చలవ పందిళ్ళు వేసి, యాభైవేల మందికి నెలరోజుల పాటు రోజూ మద్యం, మాంసాహారం సరఫరా చేశారు. పెద్ద మెజారిటీతో గెలిచారు. బొటాబొటి మెజారిటీతో ఏర్పాటైన ప్రభుత్వాన్ని శాసించే స్థితికి చేరారు. ఇక వారి అక్రమాలను అడ్డుకునేందుకు ఏ ప్రభుత్వాధికారి సాహసించగలడు? పోటీలేకుండా ఇనుప ఖనిజాన్ని దిశదిశలా అమ్ముకున్నారు. పోటీలేకుండా ఎలా పోయింది? అదొక ఆసక్తికరమైన కథ.

ఖనిజం నాణ్యతలో కొన్ని హెచ్చుతగ్గులున్నప్పటికీ; ఖమ్మం జిల్లా బయ్యారంలో కూడా విస్తారంగా ఉంది. వారికి పోటీ రాకుండా ఉండేందుకు మన రాష్ట్రంలోని ఖనిజాన్ని తక్కువ ఎపిఎండిసికి అప్పజెప్పారు. ప్రైవేటు సంస్థలేవీ ఆ ఖనిజం కోసం దరఖాస్తు కూడా చేసుకునే వీలు లేకుండా నియంత్రించారు. తర్వాత అదే ఎపిఎండిసి అదే ఖనిజాన్ని రాజుగారి అల్లుడు (బ్రదర్)కి సంబంధించిన బినామీ సంస్థలకు గుత్తగా కట్టబెట్టింది.

ప్రభుత్వ ఆధారిత వాణిజ్యం – పార్టీలకు, ప్రాంతాలకు అతీతంగా చాపకింద నీరులా ఎలా చొచ్చుకుపోతుందో చెప్పడానికిదో మచ్చుతునక. బళ్ళారిలో తవ్విన ఖనిజం రాష్ట్రాలు దాటి రైల్వే వ్యాగన్ల ద్వారా, ఓడ రేవుల ద్వారా సరఫరా అయ్యేది. వేరే ఇంకెవరైనా అయితే ముప్పుతిప్పలు పెట్టేవారు. ఏ జిల్లాల ద్వారా ప్రయాణించి రవాణా అవుతుందో, దారి పొడుగునా సంబంధిత శాఖలకు ముడుపులు ముట్టాయి. రైల్వే వ్యాగన్లలోకి లోడింగ్ చెయ్యడంలో దుమ్ములేస్తోందని, పర్యావరణం కాలుష్యమవుతోందని రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు ఆందోళనలు చెయ్యడం, స్థానిక మీడియాతో సహా ఎవరికి ముట్టజెప్పాల్సింది వారికి ముట్టజెప్పాక ధర్నాల విరమణ, అంతా గప్‌చిప్.

బెంగుళూరు చుట్టుపక్కల సుమారు యాభై మైళ్ళ విస్తీర్ణంలో భూములపై పూర్తి పెత్తనం ప్రభుత్వానిదే. ఏలిన వారి ప్రాపకం లేకుండా ఎవరూ డెవలప్‌మెంట్ గానీ, మార్పిడిగానీ చేసుకునే వీలులేదు. ప్రభుత్వం దగ్గర ఇన్ని అధికారాలుంటే అవినీతి జరక్క చస్తుందా? అలాగే జిందాల్ సంస్థ స్టీల్ ప్లాంటు పెట్టాలంటే ప్రభువులను ప్రసన్నం చేసుకోక తప్పదు కాబట్టి 'ముఖ్య'మంత్రుల ట్రస్టులకు విరాళాలు. ఒరిస్సాలో ప్రతిపక్ష ప్రభుత్వముంది కాబట్టి అక్కడ ఎవరు ఏ పరిశ్రమ పెట్టడానికి ముందుకొచ్చినా, గిరిజన హక్కులనో, అటవీ ప్రాంతాలనో, పర్యావరణ సాకులో చెప్పి కేంద్ర ప్రభుత్వం

అడ్డుపడుతుంటుంది. ఇలా సోషలిజం పేరుతో వనరులన్నీ గుప్పెట్లో పెట్టుకుని వాణిజ్య వ్యవస్థని పిండి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ పాపులర్ భావజాలం అన్ని వర్గాల ప్రజల్లో, అన్ని రంగాల్లో, అన్ని వ్యవస్థల్లో అంతర్లీనమవడంతో ఏ రాజకీయ పార్టీ కూడా ఏటికెదురీదడానికి సాహసించదు.

ఈ రోగం వదిలించుకోవాలంటే – ప్రజల్లో, ముఖ్యంగా విద్యావంతులు, మేధావుల ఆలోచనా విధానంలో మార్పు రావాలి. ప్రభుత్వం అనేది ప్రజల ధన, మాన, ప్రాణాలను రక్షించడానికే పుట్టిందనీ, అంతవరకే పరిమితమవ్వాలని, మిగిలిన అన్ని విషయాలూ వ్యక్తుల స్వచ్ఛంద ఇచ్ఛి, పుచ్చుకోవడాలకే వదిలేయాలనీ గ్రహించాలి. సహజ వనరులు ఏ ఒక్కరి సొత్తో, ప్రభుత్వం ఆస్తో కావని, వాటిని స్వేచ్ఛగా ఎవరైనా ఉపయోగించుకోగలగాలని, తద్వారా మాత్రమే ఈ ప్రభుత్వాల అవినీతి అంతమవుతుందని గమనించాలి.

ఈ సిద్ధాంతపరమైన మౌలిక మార్పు రానంత వరకు లోకాయుక్త, లోక్‌పాల్ వంటి ఎన్ని వ్యవస్థలు, ఎన్ని పర్యవేక్షణలున్నా సొమ్ము దండగ తప్ప ఉపయోగమేమీ ఉండబోదు. బిర్యానీ పొట్లం, పావు సీసా, ఉపాధిహామీ, రుణాల ఎత్తివేత వంటి బిచ్చాలు పొందడమే స్వాతంత్ర్యం, అదే ప్రజస్వామ్యమని భ్రమించే ప్రజలు, మేధావులున్నంత కాలం రాజకీయ నాయకులకు, వాళ్ళని ఆశ్రయించి బ్రతికే పారిశ్రామికవేత్తలకు పండగే పండగ. ఈ రాజకీయ – వాణిజ్య అనైతిక సంబంధాన్ని మీడియా, కోర్టులు, లోక్‌పాల్, లోకాయుక్తల ద్వారా నిరోధించగలమనుకోవడం భ్రమే.

గుండెజబ్బుకు మందు జండూబామ్ కాదు.

31-07-2011

ఎవరి కోసం పర్యావ'రణం' ?

పర్యావరణం, కాలుష్యం, జీవజాతి సమతుల్యం, ప్రకృతి, సహజ వనరులు కొనసాగించగల (Sustainable) అభివృద్ధి, అంతరించిపోయే ప్రమాదమున్న జీవ జాతులు, తరిగిపోతున్న అడవులు, పెరిగిపోతున్న కర్భన వాయువులు, తద్వారా భూతాపం, కరిగిపోతున్న హిమశిఖరాలు, వరదలొచ్చే ప్రమాదం, సముద్ర మట్టం పెరగడం, కోస్తా తీర ప్రాంతాలకు ముప్పు, వర్షాలు కురవక కరవు కాటకాలు – ఇలా చదువరులను భయభ్రాంతులు చేసే వార్తలు, 'శాస్త్రీయ' ఆవిష్కరణలు రోజూ చూస్తూనే ఉన్నాం.

వాతావరణాన్ని కలుషితం చేసే హక్కు పరిశ్రమలకు, పారిశ్రామిక వేత్తలకు ఎవరిచ్చారు? తమ లాభాల కోసం ప్రజల ఆరోగ్యాన్ని హరిస్తున్న కాపిటలిస్టుల ఆగడాలు ఇంకెన్నాళ్ళు? ప్రస్తుత స్థాయిలో వనరులను ఉపయోగిస్తూ పోతే ఈ అభివృద్ధి స్థాయిని కొనసాగించడం సాధ్యమా, భూమాత తట్టుకోగలదా? సహజ వనరులను ఖాళీ చేసేస్తే భావితరాలకు ఏం మిగల్చబోతున్నాం? ప్రకృతికి, పర్యావరణానికి, సమస్త జీవులకు ఉన్న హక్కులను హరించే అధికారం మనిషికెక్కడిది? వనరుల దోపిడీకే గదా కాపిటలిజం? ఒరిస్సా, చత్తీస్‌ఘడ్‌లలో చూడడం లేదా? ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు దొరక్క గందరగోళానికి గురవుతుంటారు.

*ఇలాంటి ప్రశ్నలు సంధించే వృత్తి పర్యావరణ వేత్తల్లో రెండు రకాల వారున్నారు. మొదటి రకం వారు కమ్యూనిస్టు మేధావులు. వీరు ఒక ఎజెండాతో పర్యావరణ ఉద్యమాల్లో దూకుతుంటారు. పేరుకు పర్యావరణమే కానీ అసలు ఆసక్తి అధికారం మీద – 'ప్రజల కోసం', 'సమాజం కోసం', 'ఎవరూ ఆపలేని చారిత్రక శక్తుల కోసం', ఇతరుల జీవితాలను శాసించే అధికారం మీద. **1989** లో సోవియట్ రష్యా, తూర్పు యూరోపుల్లో సోషలిజం పతనంతో ఒక ఆర్థిక వ్యవస్థగా, అభివృద్ధి నమూనాగా సోషలిజం పనికిరాదని*

రుజువైపోయింది. కొందరు ఇంకా మిగిలి ఉన్న క్యూబా, ఉత్తర కొరియాలను కీర్తిస్తూ గడిపేస్తున్నా, మిగిలిన వారు రూటుమార్చి పర్యావరణ ఉద్యమం వైపు మళ్ళారు. వీళ్ళను 'పుచ్చకాయ పర్యావరణ మేధావుల'నవచ్చు. పైకి ఆకుపచ్చగా, లోపల ఎర్రగా ఉండే పుచ్చకాయలాగా, వీరు పైకి పర్యావరణం గురించి మాట్లాడినా, అంతర్యం మాత్రం ఎర్రెర్రని సోషలిజమే.

ఇక రెండో రకం అసలు సిసలు ఆకుపచ్చ పర్యావరణ వాదులు. వీరి దృష్టిలో పర్యావరణాన్ని కలుషితం కాకుండా ఉంచడం ఏదో ఒక ఉదాత్త లక్ష్యానికి మార్గం కాదు. దానంతట అదే ఒక లక్ష్యం. వీరి వాదం ప్రకారం మనిషి – ప్రకృతికి, పర్యావరణానికి శత్రువు. కాబట్టి పర్యావరణాన్ని రక్షించుకోవడానికి మనిషిని నాశనం చేయడానిక్కూడా వెనుకాడరు. ఇందులోని కొందరు అతివాదుల వాదన ప్రకారం చెట్లకు, జంతువులకు, చివరికి వైరస్‌లకు కూడా హక్కులున్నాయి. ఇంకా అతివాదుల వాదమేమిటంటే; భూగోళాన్ని, పర్యావరణాన్ని పాడుచేస్తున్నది మార్కెట్లు, స్వేచ్ఛా వాణిజ్య విధానం, కాపిటలిజం. కేవలం తమ లాభాల కోసం ప్రజలకు అవసరంలేని వస్తువులను అవసరానికి మించి ఉత్పత్తి చేస్తూ వనరులను నాశనం చేస్తున్నారంటారు. ఈ అపరిమిత వినియోగాన్ని అరికట్టడానికి దయాగుణం గల ప్రభుత్వ జోక్యాన్ని కోరుకుంటారు. మార్కెట్టు మానవత్వాన్ని హరించినట్లు, పర్యావరణాన్ని పెట్టుబడి కలుషితం చేస్తోందంటారు. కొందరు విమానాల్ని, ఇంకొందరు కార్లను, కళ్ళద్దాలను, బట్టలుతికే యంత్రాలను నిషేధించాలంటారు. వీరి తీవ్రవాదంతో పోలిస్తే పుచ్చకాయ పర్యావరణ వేత్తలే పదిరెట్లు మెరుగు – కనీసం ఆలోచనల ప్రకారం వారు తమ సాటి మానవజాతికి ద్రోహులు కారు. అదీగాక మార్గమెంత అననుసరణీయమైనా మనిషి సుఖ సంతోషాలను తమ లక్ష్యంగా పెట్టుకుంటారు.

కానీ ఈ రెండు రకాల వాదనల్లో ఏది నిజం? ఏది అవాస్తవం? ఎందుచేత? తెలిసి అబద్ధమాడుతున్నారా?లేక తెలియని తనంతో పొరబడుతున్నారా? పొరబడితే ఎక్కడ పొరబడ్డారు? ఈ గందరగోళానికి కారణమేమిటి? ప్రకృతి పట్ల, మనిషికి దానితో గల సంబంధం పట్ల సరైన శాస్త్రీయమైన అవగాహనేమిటి? ఇవన్నీ విశ్లేషిస్తే గానీ భయాలు తొలగవు. స్వేచ్ఛావాదం ప్రకారం ప్రభుత్వాలు ప్రజల ధన, మాన, ప్రాణాలను రక్షించడానికే పరిమితమవ్వాలని, ఇతర విషయాల్లో జోక్యం చేసుకోకూడదని ఎవరైనా అనగానే, "మరి కాలుష్యాన్ని ఎవరు నియంత్రిస్తారు?" అనే ప్రశ్న ఉదయిస్తుంది. దీన్నే ఆర్థిక శాస్త్రవేత్తలు శాస్త్రీయ భాషలో వివరిస్తూ 'మార్కెట్ వ్యవస్థ వైఫల్యం' వల్లే ఉదారవాద ఆర్థిక వ్యవస్థల్లో వాతావరణ కాలుష్యానికి ఎవరూ బాధ్యత వహించలేకపోవడం జరుగుతోందంటారు. అదే సోషలిస్టు వ్యవస్థలో అయితే కాలుష్యం ఖర్చులను కూడా లెక్కేసి మరీ ప్రణాళికలు రూపొందిస్తారు కాబట్టి ఈ సమస్యకు సమాధానం దొరుకుతుందంటారు, పైకి చూడ్డానికి నిజమేకదా అనిపించినా, వాస్తవాలు వేరేగా ఉన్నాయి, ఉంటాయి కూడా.

నిజానికి కాలుష్యమనేది చెత్తలాంటిది. మనింట్లో చెత్తను పక్కింట్లో పడేస్తే ఊరుకోనట్లే, ఒకరి వల్ల కలిగిన కాలుష్యం ద్వారా వేరొకరికి హాని జరిగితే పరిహారం చెల్లించాల్సిందే. ఈ న్యాయాన్ని అమలు చెయ్యాలంటే, ఆస్తి హక్కులు స్పష్టంగా ఉండాలి. ఒకరి హక్కులను వేరొకరు కాలుష్యం ద్వారా కబళిస్తే సత్వర న్యాయం, పరిహారం చెల్లింపు జరిగేలా ఉండాలి. అప్పుడు మాత్రమే కాలుష్య కారకులు ఒకటికి రెండు సార్లు ఆలోచించుకుని, ఇంతమందికి పరిహారం చెల్లించే బదులు కాలుష్యాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తారు. అసలు ఆస్తిహక్కులే లేని సోషలిస్టు వ్యవస్థలో పరిహారం ఎలా సాధ్యం? ఆర్థిక వ్యవస్థ సమస్తం ప్రభుత్వాధీనంలో ఉన్న పరిస్థితిలో సర్కారు మీద పరిహారం కోసం వ్యాజ్యం వేసే అవకాశం ఏ బాధితులకుంటుంది? ఇకపోతే, కాపిటలిస్టు వ్యవస్థలో మార్కెట్ వైఫల్యం గురించి. అది మార్కెట్ వైఫల్యం కాదు, ప్రభుత్వ వైఫల్యం. ఎలాగో చూద్దాం.

పారిశ్రామికీకరణ జరిగిన మొదటి రోజుల్నుంచి దాదాపు 1830 వరకు ఆస్తి హక్కులు పూర్తిగా పరిరక్షించబడ్డాయి. పొలాల మధ్య నుంచి వెళ్ళే రైలింజన్ల నుండి నిప్పురవ్వలు పడి గడ్డివాములు తగలబడితే పరిహారం పొందేవారు. తరువాతి కాలంలో ప్రభుత్వ జోక్యం మొదలైంది. ఈ వ్యాజ్యాలతో పారిశ్రామికీకరణకు ఇబ్బంది కలుగుతోంది కాబట్టి, "ప్రజాహితం" దృష్ట్యా కాలుష్యాన్ని నివారించే పనిని ప్రభుత్వం హస్తగతం చేసుకుంది. ఇక వ్యక్తులుగా కాలుష్య బాధితులు ఏమీచేయలేని పరిస్థితి నెలకొంది.

మనదేశంలో పారిశ్రామికీకరణ జరిగిన మొదట్నుంచి ప్రభుత్వాధీన కాలుష్య నివారణ యంత్రాంగ వ్యవస్థే కొనసాగుతోంది. పేరుకు ఒక కాలుష్య నివారణ బోర్డు ఉంటుంది. కానీ సిఫారసుల వలనో అవినీతి వల్లో...,శాస్త్రీయ పరిజ్ఞానం, పరికరాలు లేకపోవడం వల్లో... వారు చేసే నివారణ, నియంత్రణ శూన్యం. అదీగాక మంత్రిగారో, ముఖ్యమంత్రిగారో కోరుకున్న చోట ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లు నెలకొల్పడం; రాయితీలిచ్చి మరీ పరిశ్రమలను నెలకొల్పజేయడం – ఇలా రాజ్యం తలదూర్చడం వల్ల; కాలుష్యం కలుగజేసే వారిని బాధితులు ప్రశ్నించే వీలులేదు. అదేమంటే కాలుష్య నివారణ బోర్డు వారిచ్చిన క్లీన్ సర్టిఫికెట్ చూపిస్తారు. ఈ రకంగా ఆస్తి హక్కులు నిర్వచింపబడక, అంతా ప్రభుత్వం చేతిలో ఉండడం వల్ల – కాలుష్యం కలగజేసే వారికి ఖర్చు లేకుండా పొయిందే తప్ప; మార్కెట్ వ్యవస్థ వైఫల్యం వల్ల కాదు. కాలుష్యానికి పెద్ద మొత్తాలు పరిహారంగా చెల్లించవలసి వస్తే, జనసాంద్రతలేని వెనుకబడిన ప్రాంతాల్లో ఎక్కువ పరిశ్రమలు స్థాపించే వాళ్ళు. పర్యావరణం, కాలుష్యం, ప్రకృతి, హక్కుల పట్ల ఇదే కాకుండా ఇంకా ఎన్నో మేధో గందరగోళాలున్నాయి. వాటన్నిటినీ వివరంగా విశ్లేషిస్తే తప్ప పర్యావరణ వేత్తలు, శాస్త్రజ్ఞుల ప్రచారాల్లో వాస్తవం పాలు ఎంతో విశదపడదు.

07-08-2011

ఎందుకీ గందరగోళం?

మనిషి బ్రతికేదే ప్రకృతి, సహజవనరుల మీద ఆధారపడి. వేటాడి బ్రతికినా, వ్యవసాయం చేసినా, పరిశ్రమలు నెలకొల్పినా, సాఫ్ట్‌వేర్ రాసి సంపాదించినా...; ఏదో ఒక స్థాయిలో ప్రకృతిమీద ఆధారపడే. తన మేధస్సు, శ్రమలనుపయోగించి ప్రకృతిని ఏదో ఒక రకంగా రూపాంతరం చెందించడం ద్వారా మాత్రమే మనిషి ఉత్పత్తిని సాధించగలడు. తద్వారా మనుగడ సాధించగలడు. ప్రకృతిని ముట్టుకోకుండా, తన పాదముద్రలు పర్యావరణం మీద పడకుండా మనిషి బ్రతకడం అసాధ్యం. మరి ప్రకృతి మీద ఇంతలా ఆధారపడిన మనిషి దాన్ని చేజేతులా నాశనం చేస్తాడా? నిజంగా చేస్తోంటే దానికి కారణమేమిటి? నాశనం చేస్తున్నాడనడానికి ఆధారాలేమిటి? తన దుష్ట పాదముద్రలు పడనీయకుండా ప్రకృతిని ప్రకృతిగా వదిలేయాలని, దానివల్ల మానవజాతి అంతమైపోయినా ఫర్వాలేదనే పర్యావరణవాదుల గందరగోళానికి కారణమేమిటి?

ఈ గందరగోళానికి ముఖ్యంగా మూడు పార్శ్వాలున్నాయి. ఒకటి అధి భౌతిక (మెటాఫిజికల్), రెండు నైతిక, మూడు రాజకీయ తాత్విక అవగాహనల్లో లోపం. మొదటి గందరగోళం అసలు సృష్టికి, మనిషికి ఉన్న సంబంధం, మనిషిని బ్రతికించే ఉత్పత్తి క్రమం విషయంలో. కాపిటలిస్టు భావాల ప్రకారం ప్రకృతి మీద ఆధారపడి బ్రతకడం– స్వభావ రీత్యా మానవ అవసరం. మనిషి తన శారీరక, మేధోశ్రమల ద్వారా సహజ వనరులనుపయోగించుకుని ఉత్పత్తి చేసి, అందులో కొంత భాగాన్ని ఇతర వస్తువుల ఉత్పత్తుల కోసం ఇతరులతో స్వచ్ఛందంగా మార్పిడి చేసుకుని జీవిస్తాడు. కమ్యూనిజం ప్రకారం సహజ వనరులన్నీ సమాజానికి చెందుతాయి – అంటే అందరికీ చెందుతాయి కానీ ఏదీ ఏ ఒక్కరికో చెందదు. అంటే ఏదీ ఏ ఒక్కరికీ చెందదు. ఉత్పత్తి వ్యక్తుల వల్ల కాదు; సమూహాలు, సమాజం ద్వారా మాత్రమే జరుగుతుంది. కష్టజీవుల శ్రమఫలితమే

ఉత్పత్తి. మరి యంత్రాలు, పరికరాల వంటి ఉత్పత్తి సాధనాలు ఎక్కడ్నుంచి వస్తాయి? చెప్పరు. ఇకపోతే పర్యావరణ వాదుల ప్రకారం భూమిని తవ్వి, సంగ్రహించడం ద్వారా మాత్రమే ఉత్పత్తి జరుగుతుంది. ఇందులో మనిషి నిమిత్తమాత్రుడేనట. ఆగకుండా, ఆపకుండా ఇలా భూమి నుంచి వనరులను ఖాళీ చెయ్యడం వల్ల – ఈ అభివృద్ధి స్థాయిని కొనసాగించలేమంటారు. కాబట్టి భవిష్యత్తులో పేదరికానికి, లేమికి, తీవ్ర కొరతలకు సిద్ధం కావల్సిందేనంటారు. అంతేనేమోలే అని ప్రజలు కూడా సమాధానపడిపోతారు.

కానీ ఇందులో పైకి కనపడని విషయాలు చాలా ఉన్నాయి. వెయ్యి సంవత్సరాల క్రితంతో పోలిస్తే ప్రపంచజనాభా కొన్ని వందలరెట్లు పెరిగింది. అయినా అప్పటి వారి జీవన ప్రమాణాలతో పోలిస్తే, ఇప్పుడు దాదాపు అందరికీ కనీస సౌకర్యాలు, ఎన్నో సదుపాయాలు సమకూరాయి. ప్రకృతిలోకి కొత్తగా వచ్చి చేరిన నిక్షేపాలేవీ లేవు కదా! మరి ఇదంతా ఎలా సాధ్యపడింది? కేవలం మనిషి సముపార్జించిన జ్ఞానం, మేధస్సు– పొరమీద పొరగా పెరగడం వల్ల.

అదే ఇనుప ఖనిజం నుంచి రకరకాల పనిముట్లు; బొగ్గు నుంచి, గుప్పెడు యురేనియం నుంచి విద్యుచ్ఛక్తి, నాలుగు ఇసుక రేణువులతో కంప్యూటర్ చిప్స్ తయారైంది మనిషి మేధస్సువల్లే. వీటన్నిటినీ ప్రకృతి తనంతట తాను – వర్షంలా కురిపించలేదు. వివిధ మూలకాలను, పదార్థాలను తీసుకుని వాటిని తెలివితో, పనికొచ్చే వస్తువులుగా రూపాంతరీకరించడం ద్వారా మాత్రమే ఉత్పత్తి సాధ్యపడుతుంది, సంపద సృష్టించబడుతుంది. కాబట్టి సంపద పరిమాణం స్థిరం కాదు, అంతా జాతీయం చేసేసి అందరికీ సమానంగా పంచేయడానికి. రకరకాల అడ్డుపుల్లలు వెయ్యకుంటే సంపద పెరుగుతూనే పోతుంది. సంపద ఖనిజాల్లో లేదు, దాన్ని ఖనిజ రూపం నుంచి విమానం రూపం దాకా మలచిన మేధలో ఉంటుంది. ఈ ఖనిజాలు, పెట్రోలియం ఖాళీ అయిపోవు, ఒకవేళ అయిపోయినా, ఆలోగా ప్రత్యామ్నాయాలు కనిపెట్టగలిగే శక్తి మనిషికుంది. అంతెందుకు, ఇంట్లో కూర్చుని కంప్యూటర్ ద్వారా ఎక్కడ్నుంచి ఎక్కడికయినా రైల్వే రిజర్వేషన్ చేసుకోవచ్చని యాభై యేళ్ళ క్రితం ఎవరైనా అంటే పిచ్చోడని ఆటపట్టించేవారు కాదూ?

వందేళ్ళ నుంచీ – అదయిపోతున్నది, ఇది ఖతమైపోతోందని మనల్ని భయపెట్టే మేధావులు ఎప్పటికప్పుడు తమ గణాంకాల్ని సవరించుకుంటూ పోతున్నారు. 1914 లో అమెరికా మొత్తం మీద ఆరు బిలియన్ బ్యారళ్ళ కంటే ఎక్కువ చమురు ఉత్పత్తి చెయ్యజాలదని లెక్కలేసి చెప్పారు. కానీ తరువాతి ఎనభై యేళ్ళలోనే 160 బిలియన్ బ్యారళ్ళు తోడారు. ఇంకా తియ్యగలిగింది ఎన్నో రెట్లు ఉంది. విషయమేమిటంటే, ప్రస్తుత అవసరాల మేరకు మాత్రమే ముడిపదార్థాల లభ్యత గురించి ఆరా తీస్తాం తప్ప, ఇంకో

వందేళ్ళకు అవసరం రావచ్చేమోనని ఇప్పట్నుంచే సర్వేలు చేపట్టరు. పదేళ్ళ తరువాత కొందామనుకుంటున్న కారు గురించి ఇప్పట్నుంచే వాకబు చెయ్యంకదా! ఈలోగా టెక్నాలజీ, అభిరుచులు ఎన్నో మారొచ్చు. కరీంనగర్ జిల్లా కాళేశ్వరం లాంటి ఎత్తైన, పొడి వాతావరణ ప్రదేశాల్లో మొదలైన నాగరికత..., మైదాన ప్రాంతాలు దాటి సముద్రం తీరం వరకు క్రమంగా విస్తరించింది. అప్పుడున్న అడవులు నరికి, మడ భూములకు గట్లు, కట్టలు వేసి, సాగునీరు, మురికి నీటి కాల్వలు తవ్వి, వరదలు, దోమలు, మలేరియాలను తట్టుకున్న వారి కష్టఫలితమే – నేటి విలువైన డెల్టా భూములు. పర్యావరణ తీవ్రవాదులతో అంగీకరించాల్సివస్తే ఇప్పుడు అక్కడున్న వారంతా చెంపలేసుకుని, తమ (పూర్వీకుల) 'దుష్ట' పాదముద్రలను వెనక్కి తీసుకుని, డెల్టాను ఖాళీచేసి, తిరిగి అడవులను పెరగనివ్వాలి, సైబీరియా కొంగలకు ఆశ్రయం కల్పించాలి. ఇది ఎక్కడితో ఆగుతుంది? సృష్టిలోని చివరి మనిషి మరణంతో!

ప్రకృతిలోని ఏభాగానికీ దానంతట దానికి విలువలేదు. మనిషి దాన్ని చేతబట్టి, ఒక రూపం ఇచ్చి, ఎవరో ఒకరికి పనికొచ్చేలా చేస్తేనే దానికి విలువ. మనిషికి పనికిరానప్పుడు ప్రకృతి అంతా అడవిగాచిన వెన్నెల లాంటిదే. మనిషి మేధను, సృజనాత్మకతను గుర్తించక, ఉత్పత్తి శ్రమజీవుల కష్టంతో దానికదే జరిగిపోతుందనుకునే వారు మాత్రమే ఇవాళ లేనిది రేపు ఎక్కడ్నుంచి వస్తుందిలే అనుకుంటారు. సంపద స్థిరమైన పరిమాణంలో ఉంటుందని, దాన్ని అందరి దగ్గర్నుంచి బలవంతంగా లాక్కుని అందరికీ సమానంగా పంచేస్తే చాలనీ అనుకుంటారు. కానీ మనిషి జ్ఞానం పోగైన కొద్దీ కొత్త కొత్త ఐడియాలు, ఆలోచనలు, కొత్త కొత్త వస్తువులు వస్తూనే ఉంటాయి. ఉత్పత్తి పద్ధతులు మెరుగై అందరి అవసరాలూ తీర్చేన్ని వస్తువులు తయారౌతాయి. కాబట్టి భవిష్యత్తులో కొరతలు తప్పవనుకునే నిశ్చల, స్థిర, యథాతథస్థితి వాదుల ఆలోచన వాస్తవ విరుద్ధం, అది వారి తాత్విక గందరగోళ ఫలితం.

నైతిక గందరగోళం ఇంకా ప్రమాదకరమైంది. కొరతలు, కరువులు, పేదరికం తప్పవు అనడమే కాక; కొంత మంది అసలు నైతికంగా అదే సరయిందంటారు. మనిషి తన అవసరాలను తగ్గించుకుని, ప్రకృతికి అతి దగ్గరగా బ్రతకాలంటారు. ఎంత దగ్గరగా? అడవుల్లో అర్ధనగ్నంగా, ఏ పూటకాపూట తిండికి వెతుక్కుంటూ, ఎండకు ఎండి, వానకు తడుస్తూ, పాము కాట్లకు, విషజ్వరాలకు గురై అర్ధాయుష్కులుగా బ్రతికేంత దగ్గరగానా? వారి భావాల ప్రకారం అభివృద్ధి అంటే దొంగతనమేనట. ప్రక్కవారి నుండి, భవిష్యత్ తరాల్నుండి, భూమి నుంచి దొంగిలించడమే అభివృద్ధికి నిర్వచనమట. అందుకే అమెరికా లాంటి దేశాల అభివృద్ధిని ఆడిపోసుకుంటూ ఉంటారు. స్వయం కృతాపరాధాలతో ఆ

దేశాలు తడబడితే – వీరు మెటికలు విరుస్తారు. మళ్ళీ ఆ దేశాల స్థాయిలో అభివృద్ధి చెందాలని ఆశపడతారు. తమ పిల్లలను, మనుమలను అక్కడికే పంపాలని ప్రయత్నిస్తారు, అదివేరే విషయం. మనిషికున్న హక్కులే ప్రకృతికి, దాన్లోని సమస్త జీవులకు ఉన్నాయంటారు. రోగకారక క్రిములకు, వైరస్‌లకు కూడా హక్కులు ఉన్నాయా?

ఆశ్చర్యపోకండి, అవుననే పర్యావరణ వేత్తలు కూడా ఉన్నారు. మనిషికున్నదేమిటి, వాటికి లేనిదేమిటని ప్రశ్నిస్తారు. అసలు హక్కులంటే ఏమిటో తెలియని అయోమయం నుంచే ఇంత గందరగోళం ఉద్భవిస్తోంది. దాన్ని వచ్చేసారి విశ్లేషిద్దాం.

పరహితత్వం, నిస్వార్థ సేవా వాదం ప్రకారం మనిషి తన స్వలాభం కోసం ఏది చేసినా అది నేరం, పాపం. ఆ సూత్రానుసారం తన సుఖ సంతోషాల కోసం ప్రకృతి నుంచి వనరులు సేకరించడం, స్వీకరించడం మహా పాపం. ఈ వాదం ప్రకారం మనిషి తన కోసం తాను బ్రతకడం అమానుషం. తానెప్పుడూ ఇతరుల కోసమే బ్రతకాలిట. ఎవరా ఇతరులు?

సమాజంలోని పతితులు, భ్రష్టులు, బాధాసర్ప ద్రష్టులే ఆ ఇతరులని సోషలిజం చెబుతుంది. ప్రకృతిలోని రాళ్ళు, కొండలు, చెట్లు, చేమలు, పురుగులు, పిచ్చిమొక్కలే ఆ ఇతరులని పర్యావరణతత్వం చెబుతుంది. మనిషికి పనికిరాని పర్యావరణం కోసం మనిషెందుకు శ్రమించాలి? పనికొచ్చే దాని కోసం శ్రమిస్తే అది స్వార్థం అవుతుందట. కాబట్టి నిస్వార్థంగా, మనిషికి పనికిరాకపోయినా, పనికిరానప్పుడే, పనికిరాదు కాబట్టే పర్యావరణం కోసం శ్రమించాలట. ఇదీ నైతిక గందరగోళం....!

14-08-2011

నైతిక, రాజకీయ అస్పష్టత

పర్యావరణం విషయంలో - నైతిక, రాజకీయ అస్పష్టత, సందిగ్ధత, గందరగోళం విస్తారంగా నెలకొని ఉంది. అసలు 'పర్యావరణం' అనే పదం నిర్వచించడంలోనే దానికి మనిషితో గల సంబంధం ఆవిష్కృతమవుతుందని గమనించాలి. ఎవరి పర్యావరణం? దోమలకు పనికొచ్చే పర్యావరణం వేరు, మనిషికి పనికొచ్చే పర్యావరణం వేరు. ఏ జీవులకు పనికొచ్చే పర్యావరణాన్ని (మనిషి శ్రమించి) రక్షించాలి? ఈ నైతిక విషయంలో స్పష్టత లేకపోతే కప్పలు, నత్తగుల్లల కోసం పాటుపడే క్రమంలో మనిషి తాను కూర్చున్న కొమ్మను తానే నరుక్కోవలసి వస్తుంది. అసలు మనిషిని ప్రక్కకు నెట్టి, ఇతర జీవుల కోసం కొంతమంది ఎందుకింత ఆరాటపడతారు?

నిప్పు రాజేయడం దగ్గర్నుంచి నానో టెక్నాలజీ వరకు మనిషి సాధించిన సాంకేతిక అభివృద్ధి అంతా - ప్రకృతి మనిషి మీద విధించే పరిమితులను దాటివెళ్ళడానికి చేసిన ప్రయత్నాలే. మనిషి ఈ రకంగా కొత్త ఎత్తులకు ఎదగడాన్ని, ప్రకృతిని జయించడానికి చేసే ప్రయత్నాలను పర్యావరణ వాదులు నిరసిస్తారు. ప్రతి కొత్త టెక్నాలజీని రంధ్రాన్వేషణకు గురిచేస్తారు. ప్రకృతి ముందు మనిషి ఒక అసహాయ, అల్పజీవిగా చిత్రీకరించడానికి తాపత్రయపడతారు. దేవుడి పేరుతో మనిషి ఎలా భయపడేవాడో, ఇప్పటికీ ఎలా భయపడుతున్నాడో, పర్యావరణాన్ని చూసి కూడా అలా వణికిపోయి, మోకరిల్లాలను కుంటారు. ఇదొక కొత్తమతం, కొత్త దేవుడు.

అందుకే మతం, పర్యావరణవాదాల మధ్య రోజురోజుకీ బలపడుతున్న సంబంధాలు ఆశ్చర్యం కలిగించవు. ఈ విషయంలో ఇద్దరి వాదమూ ఒకటే - మనిషి మౌలికంగా అల్పుడు, పాపి, స్వార్థపరుడు, తన మేధస్సు గురించి, తన ఉత్పాదకత గురించి, తాను సాధించిన విజయాలను గురించి గర్వించే హక్కు, స్థాయి మనిషికి లేదు. తన జీవితాన్ని తనకోసం కాకుండా, వేరే ఏదో అత్యున్నత 'శక్తి', సూపర్ పవర్‌కు ధారపోయడమే మనిషి కర్తవ్యం.

మనిషిని ఇలా నైతికంగా బలహీనపరచి, మెడలు వంచి ఉంచకపోతే, 'హన్నన్నా ఇంకేమైనా ఉందా.. మతపెద్దలు, పర్యావరణ మేధావులు, శ్రామికవర్గ నియంతృత్వ అధికారుల మాట అసలు వింటాడా?' ఆలోచనా పరులు ముందీ నైతిక సందిగ్ధత నుంచి, స్వీయ రక్షణ సంశయాల నుంచి బయటపడాలి.

ఇక రాజకీయ గందరగోళం అపారమైంది. "జంతువులకూ హక్కులుంటాయి. సర్కస్‌లో జంతువులను ఉపయోగించకూడదు. ఊరకుక్కలకు, పరిశోధనల్లో వాడే చిట్టెలుకలు, కోతులకు హక్కులుంటాయి. అడవులను ధ్వంసం చేసి గనులు తవ్వకూడదు. సహజ వనరులను కాపిటలిస్టుల పరం చేస్తున్నారు. తద్వారా పర్యావరణ విధ్వంసాన్ని సృష్టిస్తున్నారు. ఆర్థిక హక్కులు లేకుండా రాజకీయ హక్కులకు అర్థం లేదు. అందరికీ విద్యాహక్కు, ఆరోగ్య హక్కు, ఉపాధి హక్కు, కనీస వేతన హక్కు చట్టబద్ధంగా కల్పించాలి..." ఇలాంటి నినాదాలను, డిమాండ్లను రోజూ చూస్తూనే ఉంటాం. అన్నింటికంటే అత్యంత దుర్వినియోగానికి గురైన పదం "హక్కులు".

అసలు హక్కులంటే ఏమిటి? ఎవరికుంటాయి? ఎక్కడ్నుంచి వస్తాయి? ఎవరిస్తారు? ఎవరు కాపాడతారు?

హక్కులనేవి సామాజిక నేపథ్యంలో, మనుషుల మధ్య ఉండే సంబంధాల విషయంలో, మనిషి స్వేచ్ఛను నిర్వచించే నైతిక సూత్రాలు. ఏదైనా ద్వీపంలో ఒంటరిగా బ్రతికే మనిషికి హక్కులతో పనిలేదు. ఇంకో 'మనిషి'తో సంబంధం నెరపాల్సిన సందర్భంలో మాత్రమే హక్కుల ప్రస్తావన వస్తుంది. హక్కులు మనిషి స్వేచ్ఛను నిర్వచిస్తాయి. అంటే ప్రతి మనిషికీ సమానంగా వర్తిస్తాయి. అవి నైతిక సూత్రాలు మాత్రమే, జేబులో డబ్బులో...; శరీర భాగాలో కాదు, 'ఉన్నాయో' లేదో తడిమి చూసుకోవడానికి. వాటిని ఆ సూత్ర స్థాయిలో అర్థం చేసుకోగల హేతుబద్ధ ఆలోచనా పటిమ గల జీవులకు; అంటే మనుషులకు మాత్రమే హక్కులుంటాయి. ఇతర జంతు, జీవజాలాలకు ఉండవు. ఒకరి జీవించే హక్కును ఇంకొకరు పరస్పరం గౌరవిస్తూ ఇద్దరు మనుషుల సంబంధాలు నెరపగలరు. కానీ అదే సూత్రంపై మనిషి ఒకవైపు, పాము, మొసలి, ఎలుక లేదా బాక్టీరియా ఇంకోవైపు ఉండి పరస్పర సంబంధాలు నెరపగలరా? కాబట్టి హక్కులనేవి మనుషులకు మాత్రమే ఉంటాయి. జంతువులకు ఉండవు. మనకిష్టమైన పెంపుడు జంతువు లేదా అడవి జంతువుల మీద ప్రేమ ఉండడం వేరు. పాడి గేదెను రోజూ కడిగి, ఒళ్ళు తోమి, కుడితి పెట్టడం వేరు.

జంతువులకు కూడా మనుషుల్లాగే హక్కులున్నాయనీ, వాటిని చట్టబద్ధం చేయాలనడం వేరు. కాబట్టి జంతువులకూ హక్కులుంటాయేమోనన్న సందిగ్ధతను తొలగించుకోవాల్సిన అవసరం ఉంది. జంతువులు మనుషులతో సమానంగా హక్కులు

కలిగి ఉండవు. చాలా మటుకు జంతువులు మనిషికి ఆస్తి. ఆస్తి కాని పక్షంలో – అధిక శాతం జంతువులు అసలు పుట్టేవే కాదు. కోడిని చంపి తినకూడదనే పక్షంలో – ఇన్ని కోట్ల కోళ్ళను పౌల్ట్రీ ఫారాల్లో పుట్టించి, పెంచేవారా? సర్కస్‌లో జంతువులను ఆడించడం నచ్చకపోతే సర్కస్ చూడ్డం మానేయొచ్చు. అసల అలాంటప్పుడు జంతుప్రదర్శన శాలలు ఎందుకుండాలి? తిరుమలకు కాలినడకన దారిలో భక్తులను గాయపరిచే చిరుతపులిని ఎందుకు నిర్భందించాలి? గుర్రపుస్వారీ కూడా హక్కుల హననమేనా?

మనుషులకే ఉండే అత్యంత ముఖ్యమైన, మౌలికమైన హక్కు జీవించే హక్కు. మనిషి స్వభావరీత్యా ఉత్పత్తి చేసి లేదా మార్పిడి చేసుకుని మాత్రమే బ్రతగ్గలడు కాబట్టి, తన ఉత్పత్తిని, తన సంపాదనను తానే అనుభవించే హక్కు, అంటే ఆస్తి హక్కు ద్వారా మాత్రమే జీవించే హక్కు అమలు అవగలదు. తనకు చాతనయిన పనిచేసి సంపాదించుకుని; ఆ సంపాదనను అనుభవించే హక్కు మనిషికి సహజంగా సిద్ధించింది. కానీ ఎవరో సంపాదించిన దాంతో తనకు విద్య, ఆరోగ్యం, ఉపాధి ఇవ్వమనే హక్కు లేదు. ఎందుకంటే అది ఇతరుల సంపాదనను, తద్వారా హక్కులను హరించడం అవుతుంది. ఇతరుల హక్కులను కాలరాయడం వేరొకరి హక్కెలా అవుతుంది? కాబట్టి, ఇతరుల హక్కులకు భంగం కలిగించకుండా సంపాదించుకుని బ్రతికే హక్కు మాత్రమే నిజమైన హక్కు. విద్యాహక్కు, ఉపాధి హక్కులు అసలు హక్కులు కావు. ఉదార స్వేచ్ఛావాదం, దాన్నుంచి పుట్టిన కాపిటలిస్టు భావజాలం మాత్రమే మనిషికి గల జీవించే హక్కును, ఆస్తిహక్కును గుర్తిస్తాయి.

ఈ వివరాలకు – వనరుల దోపిడీ, పర్యావరణాలకు సంబంధమేమిటి? మధ్యయుగాల్లో – రాజులు, జమీందార్లు తమ ఇలాకాలోని వనరులన్నిటికీ తామే అధిపతులు. ప్రజలంతా వారి దయా దాక్షిణ్యాల మీద ఆధారపడి బ్రతకాల్సిందే. తమ రాజ్యంలో పుట్టిన మల్లీశ్వరుల దగ్గర్నుంచి, భూమిలో దొరికిన మణిమాణిక్యాలన్నీ వారి సొంతం. 'వ్యక్తి హక్కుల'నే ఆలోచనే లేని రాజకీయ వాతావరణమది. స్వాతంత్ర్యం వచ్చాక రాజుల స్థానంలో మెజారిటీ ఓట్లతో ఏర్పడ్డ ప్రభుత్వాలొచ్చాయి. వనరులపై, వ్యక్తులపై పాలకుల పట్టుమాత్రం సడలలేదు. సోషలిజం పేరుతో సహజవనరులన్నీ జాతీయం చేసి చేతిలో పెట్టుకున్నారు. 'సమాజ క్షేమం', 'ప్రజాహితం' అనే సూపర్ పవర్‌ల పేరిట వ్యక్తి హక్కులను ఎప్పుడైనా, ఎలా అయినా కబళించగల అధికారాలు ఏర్పరచుకొన్నారు. ఆ అధికారాలు, కాకి లెక్కలు, పిచ్చి జీవోలు, నపుంసక వ్యవస్థల ఆధారంగా డబ్బు పిండుకుని – తమకిష్టమైన వారికి వనరుల్ని దోచిపెడుతుంటే; కిమ్మనలేని అశక్తతలో ఉన్నాం. ఆ అశక్తతను అంగీకరించలేని మేధావి గణం అసలు సమస్యను ఎత్తి చూపకుండా కాపిటలిజం మీదకు నెపాన్ని నెట్టేసి చర్చను తప్పుదోవపట్టిస్తున్నారు.

కాపిటలిస్టు వ్యవస్థలో వనరులేవీ ప్రభుత్వాల ఆధీనంలో ఉండవు. ప్రైవేటు ఆస్తుల రూపంలో వ్యక్తుల దగ్గర ఉంటాయి. వ్యక్తులకే తప్ప సమాజానికి ఏ నైతిక నియమాలూ ఉండాల్సిన అవసరం లేదంటూ ప్రభుత్వాలకు ఇన్ని అధికారాలను కట్టబెట్టింది – ఏ భావజాలం? ఆ అధికారాలతోనే టాటాలు, జిందాల్, సహారా, గాలి ఇత్యాది ఆస్థాన పారిశ్రామిక వేత్తలకు వనరులను గుత్తగా అప్పగిస్తున్నారు.

బేరం కుదిరితే, "కె.జి. బేసిన్ గ్యాసు వల్ల రాష్ట్రానికి ఎంతో పారిశ్రామిక అభివృద్ధి" అంటారు. కుదరకపోతే "ఈ గ్యాసు సమాజానికి చెందుతుంది, రిలయన్స్‌కు కాదు" అని మోహరిస్తారు.

వనరులను అవినీతికి అమ్ముకోవడం; పర్యావరణ హాని – ఇవి రెండూ వేర్వేరు విషయాలు. నైతిక, రాజకీయ ప్రాతిపదికల ప్రకారం మనిషి తన స్వలాభం కోసం, సంపాదన కోసం ప్రకృతిలోని వనరులను ఉపయోగించుకోవడం పూర్తిగా నైతికం, ఆ హక్కు ప్రతి మనిషికీ ఉంది. కానీ ఇతరులకున్న అవే హక్కులకు భంగం కలిగించకూడదు. *ఉదాహరణకు ఎవరి పొలంలో వారు చేపలు పెంచుతారో, చామ దుంపలు పండిస్తారో వారిష్టం. కానీ దానివల్ల ప్రక్క పొలానికి చేటురాకూడదు. వస్తే పూర్తిస్థాయిలో నష్టపరిహారం కట్టాలి. ఇవి జరగాలంటే ఆస్తి హక్కులు స్పష్టంగా నిర్వచించాలి, వాటిని పటిష్టంగా కాపాడే వ్యవస్థ ఉండాలి. హక్కులకు భంగం వాటిల్లితే సత్వరం పరిష్కారం, పరిహారం లభించాలి. ప్రభుత్వాలు కేవలం ఈ పనికే – ఈ పనిలోనే ఉండాలి. ఈ సూత్రాలు పొలాలకే కాదు, అడవులు, గనులు, నదులు, రోడ్లు, కొండలు అన్నిటికీ వర్తిస్తాయి. ఆఖరుగా, పర్యావరణ వాదులు చేసే ముఖ్యమైన ఇంద్రజాలం – తమ థియరీలకు లేనిపోని శాస్త్రీయతను జోడించటం. అదేమిటో చూసి వచ్చేవారం ముగిద్దాం.*

21-08-2011

అబద్ధాలు, అర్ధసత్యాలు

పర్యావరణ వాదుల సిద్ధాంతాలు, గణాంకాలు, జోస్యాలు - పైకి చూడ్డానికి కేవలం ప్రజలను జాగృత పరచడానికో లేక వారిలో అవగాహన కల్పించడానికో అన్నట్లుంటాయి. కానీ వాటి ముఖ్య ఉద్దేశం, అంతిమలక్ష్యం ప్రభుత్వాన్ని, ప్రభుత్వ విధానాలను ప్రభావితం చెయ్యడం, తమ లెక్కలు, జోస్యాల ఆధారంగా చట్టాలు చేయించడం, నియంత్రణలు విధింపజేయడం, పరిశోధనల పేరుతో నిధులు రాబట్టడం.

ఆ ప్రభుత్వ జోక్యాల వల్ల కలిగే అనర్థాలకు చివరకు ఎవరూ బాధ్యత వహించరు. కాబట్టి సైన్సును రాజకీయం చేయజూసే పర్యావరణ వాదాలను, లెక్కలను, గణాంకాలను ఎప్పటికప్పుడు నిశితంగా, విమర్శనాత్మకంగా విశ్లేషించడం, వారు ఏ ఆధారాలతో కొన్ని నిర్ధారణలకు వచ్చారో ఆ ఆధారాలను, వాటి శాస్త్రీయతను ప్రశ్నించడం అవసరం.

1980 ల చివర్నుంచి మొదలై బహుళ ప్రాచుర్యంలో ఉన్న థియిరీ - భూతాపం పెరిగిపోతోందన్న వాదన(గ్లోబల్ వార్మింగ్). మనం వాడుతున్న ఇంధనాల వల్ల వాతావరణంలో కర్బన పులుసు వాయువు పరిమాణం పెరిగిపోయి, సూర్యుణ్ణించి వచ్చే వేడిమి ఆ వాయుపొరల్లో ఇరుక్కుపోయి భూ ఉపరితల ఉష్ణోగ్రత పెరుగుతోందని, దానివల్ల మహా విపత్తులు తప్పవని భయపెడుతూ వస్తున్నారు. ఈ భయాలను విస్తృతంగా ప్రచారం చేసి, కొన్ని దేశాల్లో వీటిని ఎన్నికల అంశాలుగా ముందుకు తెచ్చి, సాంప్రదాయక ఇంధన వాడకాన్ని నియంత్రిస్తూ రకరకాల చట్టాలు చేసేలా చూశారు. సంప్రదాయేతర ఇంధన వనరులపై పరిశోధనలు, వాటి ఉత్పత్తిపై సబ్సిడీల కోసం భారీ బడ్జెట్ కేటాయింపులు జరిపారు. వెరసి, కొన్ని వేల కోట్ల రూపాయలు ప్రభుత్వ జోక్యం వల్ల ఒక రంగం నుండి మరొక రంగానికి తరలడమో, వినియోగదారులకు లభించని ఉత్పత్తుల రూపంలోనో నష్టాలు కలిగాయి. ఇంతచేసిన ఈ థియరీలో 'శాస్త్రీయత'ను గమనిస్తే ముక్కున వేలేసుకోక తప్పదు.

భూ ఉపరితల ఉష్ణోగ్రతను కొలవడం 1861 నుంచే మొదలైనా, సూక్ష్మమైన తేడాలు పసిగట్టగల టెక్నాలజీ ఇరవైయవ శతాబ్దంలోనే ఆరంభమైంది. 1910 నుండి

1940 వరకు ఉష్ణోగ్రతలు పెరిగినట్లు, 1940 నుంచి 1975 వరకు తగ్గినట్లు గుర్తించారు. 1975 నుంచి స్వల్పంగా పెరిగాయి. కానీ ఈ పెరుగుదలలు, తగ్గడాలు సూర్యునిలో జరిగే రసాయనిక చర్యల్లో సహజంగా వచ్చే చక్రీయ మార్పుల వల్ల జరుగుతున్నాయా లేక మానవుల చర్యల వల్ల జరుగుతున్నాయా అనేది ముందు తేల్చవలసిన విషయం.

ఒకవేళ ఇంధన వాడకం వల్ల భూతాపం పెరిగేటట్లయితే, అత్యంత ఎక్కువ స్థాయిలో ధర్మల్ విద్యుత్, వాహనాల వాడకం పెరిగిన 1940 - 75 కాలంలో ఉష్ణోగ్రతలు పెరక్కపోగా తగ్గాయెందుకు? అంతేకాక, భూ ఉపరితల ఉష్ణోగ్రత ఒక్క డిగ్రీ ఫారన్‌హీట్ మేర పెరిగినట్లు చెబుతున్నప్పటికీ, 1979 నుంచి ఉపగ్రహాల ద్వారా కొలుస్తున్న భూ వాతావరణ ఉష్ణోగ్రతలో ఆ మాత్రం మార్పు కూడా కొలతకు రాలేదు. నోబుల్ బహుమతి గ్రహీత రాజేంద్ర పచౌరీ నేతృత్వంలో కోట్ల డాలర్ల బడ్జెట్‌తో నడిచే ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థలు ఇచ్చిన తప్పుడు లెక్కలు, చేసిన దొంగ పరిశోధనల గుట్టు ఈ మధ్యనే రట్టయింది.

కార్బన్ డయాక్సైడ్, మీథేన్‌లను గ్రీన్ హవుస్ వాయువులంటారు. బొగ్గు, పెట్రోలియం వినియోగం ద్వారా మానవులు జమచేసే గ్రీన్‌హౌస్ వాయువుల పరిమాణం తృణప్రాయం. వృక్షజాతి శ్వాసక్రియ ద్వారా, అప్పుడప్పుడు బద్ధలయ్యే అగ్నిపర్వతాల ద్వారా, అలాగే ఎండిపోయిన గడ్డి నుంచి మృత వృక్షాల వరకు అవి కుళ్ళిపోయే క్రమంలో వెలువడే కర్బన వాయువులు కొన్ని వేలు, లక్షల రెట్లుంటాయి. అయినా గానీ మానవ జనిత కర్బన వాయు నియంత్రణ మీద బతుకుతున్న కొందరు రాజకీయ నాయకులు, పరిశోధకులు, పారిశ్రామిక వేత్తలు ఈ నిజాలు ప్రాచుర్యం పొందనివ్వరు. ఎందుకంటే గ్లోబల్ వార్మింగ్ భయం మీద నడిపించడంలోనే వారి స్వలాభం దాగి ఉంది. ఇన్ని స్వప్రయోజనాలు, రాజకీయాల నడుమ మానవ జనిత కర్బన ఉద్గారాల వల్లే భూతాపం పెరుగుతోందని చెప్పినా... ఎలా నమ్మడం?

పండ్లను తాజాగా, మెరుపుగా, ఎక్కువ రోజులు నిలవ ఉంచడానికి 'అలార్' అనే రసాయనాన్ని పూతగా పూసేవారు. దాని వల్ల కాన్సర్ వస్తుందని పెద్ద ఆందోళన చేసి, 1989 లో దాన్ని నిషేధించారు, పళ్ళ మార్కెట్‌ను పీకల్లోతు కష్టాల్లో ముంచారు. ఈ నిషేధానికి ఆధారమైన శాస్త్రీయ అధ్యయనాల లోతుల్లోకి వెళితే ఆశ్చర్యపోతారు. ఈ రసాయనం తినిపించిన ఎలుకల్లో ట్యూమర్లు రావడం నిజమే. కానీ ఏ డోసులో పెడితే ఆ ట్యూమర్లు వచ్చాయో చూస్తే గాని దాన్లోని అశాస్త్రీయత అవగతం కాదు.

మనిషి రోజుకు పద్నాలుగు టన్నుల చొప్పున డెబ్భై సంవత్సరాలు ఈ రసాయనం పూసిన ఆపిల్స్ తింటే ఎంత డోసు అవుతుందో అంత డోసులో తినిపించిన ఎలుకలకు ట్యూమర్లొచ్చాయి! అందులో సగం డోసు అంటే మనిషి రోజుకు ఏడు టన్నుల యాపిల్స్ తింటే ఆ ట్యూమర్లు కూడా రావు ఇదీ ఆ అధ్యయనాల శాస్త్రీయత!

మనందరకు సుపరిచితమైన డీడీటీ 1977లో - నిషేదానికి దారితీసిన అధ్యయనాలు చూసినా అంతే. ఆ పురుగు మందు అవశేషాలు ఆహారంలోకి వచ్చి చేరే పరిమాణానికి లక్ష రెట్ల పరిమాణంలో ఎలుకలకు తినిపిస్తే ; వాటి కాలేయాల్లో హానికరం కాని ట్యూమర్లు వచ్చాయి. అవే ప్రయోగాల్లో వాడిన ఇతర జంతువుల్లో ఆ మాత్రం కూడా దుష్ప్రభావం కనబడలేదు. కాబట్టి ఇటువంటి అధ్యయనాలు ఎంత అశాస్త్రీయంగా జరుగుతాయో అర్థమవుతుంది.

ఏ పురుగుమందైనా చల్లేటపుడు డోసు అత్యంత ప్రధానమని ఏ రైతునడిగినా చెబుతాడు. ఎక్కువగా తింటే పచ్చి వేరుశెనగ పప్పు కూడా ప్రాణాంతకమే. మరి దాన్నీ నిషేధించాలా? 1944 నుండి 1972 వరకు డీడీటీ వినియోగంలో ఉన్న కాలంలో కాలేయ క్యాన్సర్ రావడం 30శాతం తగ్గింది. మరి అదెలా జరిగినట్లు? అంతే కాకుండా, అనాలోచితమైన డీడీటీ నిషేధం వల్ల జరిగిన నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారు? భారతదేశంలో 1951లో ఏడున్నర కోట్ల మలేరియా కేసులుండగా, డీడీటీ వాడకంతో- అది యాభై వేలకు తగ్గింది. డీడీటీని నిషేదించిన తర్వాత మళ్ళీ మూడు కోట్లకు పెరిగింది. అలాగే శ్రీలంకలో 1948 లో 28 లక్షల కేసులుండగా 1963లో కేవలం పదిహేడు కేసులు, నిషేధించాక మళ్ళీ 25 లక్షలకు పెరిగాయి. ఈ తప్పుడు పర్యావరణ వాదాల వల్ల బలైన లక్షలాది ప్రాణాలకు ఎవరు బాధ్యులు?

శీతలీకరణలో వాడే క్లోరోఫ్లోరో కార్బన్ (సిఎఫ్‌సి) గ్యాసులు ఓజోను పొరను దెబ్బతీస్తాయని, దానివల్ల నీలలోహిత కిరణాలు చొచ్చుకుని వచ్చి చర్మ క్యాన్సర్‌కు కారకమవుతాయని, కాబట్టి ఆ గ్యాసులను క్రమేపీ నిషేధించాలని ప్రపంచ వ్యాప్తంగా నిర్ణయించారు. ఫ్రిజ్‌లు, ఏసీలు పేదవారికి కూడా అందుబాటులోకి వస్తున్న సమయంలో ఇదొక గొడ్డలిపెట్టులాంటి నిర్ణయం. కొత్త గ్యాసులు కనిపెట్టడం, వాటి పేటెంటు ఖర్చులు, ఆ టెక్నాలజీని దిగుమతి చేసుకోవాల్సి రావడంతో - కొత్త తరం ఏసీల ధరలు ఇప్పటికే పెరగడం మొదలెట్టాయి.

అసలు ఈ వాదనలో నిజమెంత? ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తయ్యే సిఎఫ్‌సి గ్యాసులు సంవత్సరానికి పది లక్షల టన్నులు. దాంట్లోంచి లీకేజీ ద్వారా పోయేదెంత? దాంతోపోలిస్తే, సముద్ర జలాల నుంచి ఆవిరవడం ద్వారా వాతావరణంలోకి ప్రవేశించే క్లోరిన్ పరిమాణం సంవత్సరానికి మూడువేల లక్షల టన్నులు. మరి ఓజోన్ పొర నిజంగా మానవ జనిత సిఎఫ్‌సిల వల్లే తగ్గుతోందా? అదీగాక ఓజోను పొర తగ్గుతోందని చెప్పిన సమయంలోనే భూమ్మీద పడే అతినీలలోహిత కిరణాల పరిమాణం పెరగలేదు సరికదా, తగ్గింది!

1960,70,80 లలో భారతదేశంలో పెరిగిపోతున్న జనాభాను చూపి విపరీతంగా భయపెట్టే వారు. జనాభా నియంత్రణ పేరిట లక్షల కోట్ల ప్రజాధనం తగలేశారు. గత పది,

ఇరవై ఏళ్లుగా దాని గురించి ఎవరూ పెద్దగా మాట్లాడ్డం లేదు. జనాభా పెరగడం ఆగిపోయిందా? లేదే! ఒక్కొక్క సీజన్‌లో ఒక్కో కొత్త ఫ్యాషన్ వచ్చినట్లు.

పాశ్చాత్య దేశాల్లో మొదలయ్యే నినాదాలు, భయాలు, ఉద్యమాలు కొంత కాల వ్యవధితో మనదేశానికి దిగుమతి అవుతుంటాయి. వాటిని మన స్థానిక మేధావులు ప్రచారం చేస్తారు. ఉత్పాదకత పెరిగి, జీవన ప్రమాణాలు పెరిగే సమయంలో పెరిగిన జనాభాని భరించడం – ఆర్థిక వ్యవస్థకు భారం కాదు. అప్పట్లో చౌక మందుల వల్ల ఆయు:పరిమాణం పెరిగింది, కానీ విపరీతమైన సోషలిస్టు ప్రేరేపిత నిర్భంధ ఆర్థిక నియంత్రణల వాతావరణంలో ఉత్పాదకత, నిజమైన పొదుపు, అర్థవంతమైన పెట్టుబడులు, యాంత్రీకరణ పెరగకపోవడంతో ; 1960 – 90 కాలంలో పెరిగిన జనాభా –పేదరికానికి దారితీయడం నిజమే. కానీ ఆ తప్పు జనాభాది కాదు, ప్రభుత్వ విధానాలది. మాట వరసకు – ప్రపంచంలోని జనాభా అంతటినీ తెచ్చి ఆంధ్రా, కర్నాటక రాష్ట్రాల్లో సర్దినా, సగటు జనసాంద్రత ఇప్పుడు ఢిల్లీ నగరంలో ఉన్న సాంద్రత (చ.కి.మీ.కు పదివేలు) స్థాయిలో మాత్రమే ఉంటుంది. మరి జనాభా లెక్కలు చూసి అంత భయమెందుకు, భయపెట్టడమెందుకు?

ప్రభుత్వ పరిశోధనా గ్రాంట్ల మీద బతికే దాదాపు అందరు పర్యావరణ శాస్త్రవేత్తలు, వాళ్ళ లెక్కలు, జోస్యాలు చూపి, జోక్యం, నిర్బంధాలు, పన్నులు పెంచే రాజకీయ నాయకులు, సంచలనాల కోసం వెతికే మీడియా మేధావుల ఉద్దేశం సత్యాన్ని శోధించడం కాదు. సత్యానికి ముసుగేసి ప్రజల్ని భయపెట్టడం. తప్పుడు అంకెలు, విశ్లేషణలతో ప్రభుత్వ విధానాలను ప్రభావితం చెయ్యడం.

కానీ; నిజంగా సాక్ష్యాధారాలతో రుజువై ప్రజారోగ్యానికిగాని, ఆస్తికిగాని నష్టం కలిగితే, కఠినమైన చర్యలు తీసుకోవాలి. సోంపేట, కాకరాపల్లి థర్మల్ విద్యుత్కేంద్రాలను నిరసించాల్సింది పర్యావరణ ప్రాతిపదిక మీద కాదు. అందులో ఉన్న బినామీల కారణంగా నిరసించాలి. ప్రభుత్వ భూములను, ప్రత్యేక మేళ్ళను అస్మదీయులకు గుత్తగా కట్టబెట్టి నందుకు నిరసించాలి. వాళ్ళు చేపట్టిన నిర్మాణ కార్యక్రమం వల్ల మురుగునీరు పోయే సహజ దారులు మూసుకుపోయి, ఎగువనున్న రైతుల పొలాలు ముంపుకు గురయ్యాయి కాబట్టి, ముక్కుపిండి మరీ నష్ట పరిహారం చెల్లించేలా చెయ్యాలి. థర్మల్ కేంద్రాల లైసెన్స్ జారీలు, విద్యుత్ ఒప్పందాలను పారదర్శకంగా చేపట్టి, ఔత్సాహికులందరికీ అవకాశం ఇవ్వాలని ఉద్యమించాలి. అంతేగానీ, ప్రభుత్వాల అవినీతిపై పోరాడ్డానికి పర్యావరణ సాకులను అడ్డం పెట్టుకోవడమెందుకు? పూటకొక అబద్ధం చెప్పే రాజకీయ నాయకుల కంటే అలాంటి వారు ఏరకంగా మెరుగు?

28-08-2011

అన్నా - జగనన్న

గత రెండు వారాలుగా దేశంలో రెండు పరస్పర భిన్న ప్రవంతులను చూశాం. ఒకపక్క అన్నాహజారే నిరాహార దీక్షకు మద్దతుగా దేశమంతా కదిలింది. పార్లమెంటును ఒక ఊపు ఊపింది. కుల, మత, ప్రాంతాల-కతీతంగా దేశంలోని అన్నివర్గాల ప్రజలు, ముఖ్యంగా యువత అవినీతికి వ్యతిరేకంగా ర్యాలీ అయ్యారు. అన్నాబృందంలోని ఒక్కొక్కరి మీదా నిస్సిగ్గుగా బురద జల్లడానికి ప్రయత్నించిన కేంద్రమంత్రుల దాడికి దేశం నివ్వెరపోయింది. తామంతా అన్నా బృందమేనని, అందరం అన్నాలమేనని, ఇప్పుడెందరిమీద బురద జల్లుతారో చూస్తామని సవాలు విసిరింది అశేష పౌర సమాజం. రాజకీయ చౌరవ తమ చేతుల్లోంచి ఎవరో అనామక, అసంఘటిత ఉద్యమకారుల చేతుల్లోకి పోవడం ఇష్టపడని అన్ని రాజకీయ పార్టీలూ – చివరికి వెల్లువెత్తిన ప్రజాగ్రహానికి తలవంచక తప్పలేదు. సార్వభౌమత్వమంతా పార్లమెంటులోనే ఉన్నదని, తాము తప్ప చట్టాలు ఇంకెవరు చెయ్యగలరని, అన్నా ఒక నియంత అని, ప్రజాస్వామ్యాన్ని బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని చట్ట, రాజకీయ శాస్త్రపరమైన విశ్లేషణలు చేసిన వివిధ పార్టీల నాయకులు, మేధావులు, మీడియా వర్గాలు కూడా చివరికి మాట మార్చక తప్పలేదు. పార్లమెంటులో జరిగిన చర్చ, అన్ని పార్టీల నాయకులూ మిక్కిలి వినమ్రపూర్వకంగా దీక్ష విరమించమని చేసిన విజ్ఞప్తులలో నిజాయితీ లేదని అన్నాతో సహా అందరికీ తెలుసు. అయినా ఎక్కడో తెలియని అసంతృప్తి, వ్యవస్థ పట్ల పేరుకుపోయిన రోత ఈ రూపంలో పెల్లుబికి బయటికొచ్చినట్లపించింది.

సుమారుగా అదే సమయంలో యువరాజు సామ్రాజ్యం మీద సీబీఐ కేసులు, దాడులు మొదలయ్యాయి. అయినా సరే జైత్రయాత్ర ఆగలేదు, వచ్చే జనమూ తగ్గలేదు. చేసిన అక్రమాలు బయటపడతాయేమోనన్న సంశయంగాని, అల్లరవుతావేమోనన్న ఆందోళనగాని, నైతిక సంకటం గానీ వంది మాగధుల్లో ఏమాత్రం కనబడలేదు సరికదా,

రాజీనామా బెదిరింపులకు కూడా తయారయ్యారు. డబ్బులు, బిర్యానీ, మద్యం ఇచ్చి జనాన్ని తెస్తున్నారని ఎవరెంత సరిపెట్టుకున్నా, ఆ జనం కేరింతలేం తగ్గలేదు. ఒక్కటొక్కటిగా బయటికొస్తున్న అవినీతి, అక్రమాల వివరాలు కూడా వారి ఉత్సాహంపై నీళ్ళు చల్లలేదు సరికదా, కుర్చీలు విరగొట్టడం, సిబిఐని ఆక్షేపించడానికి కూడా వెనుకాడడం లేదు. ఏమిటీ వైరుధ్యం? ప్రజలనెలా అర్థం చేసుకోవాలి? ఒక ప్రక్క అన్నాతో ప్రేరేపితులై ఒక ఆశాకిరణాన్ని చూపిస్తున్న యువత, ఈ మధ్య కాలంలో అత్యంత అవినీతిపరుడుగా, అధికార వ్యామోహిగా వివాదాస్పదుడైన యువనేత వెంట నడవడమా? తేడా ఎక్కడుంది? రెండూ వాస్తవాలేనా? లేక ఏది వాస్తవం? ఏది మిథ్య? బుద్ధి జీవుల మెదళ్లను సీరియస్‌గా తొలుస్తున్న ప్రశ్నలివి.

ఏ కాలంలోనైనా సమాజంలో ప్రబలంగా ఉండే తాత్వికతను బట్టే దాని సంస్కృతి, రాజకీయ చర్చ, కళారూపాలు ఉంటాయి. మనదేశంలో ప్రస్తుత కాలంలో బలంగా వేళ్ళూనుకున్న తాత్వికతను ప్రతిబింబించే చర్చా సారాన్ని కొన్ని ఉదాహరణల్లో గమనించొచ్చు – "నలుగురికి నచ్చేది, పదిమంది మెచ్చేదే న్యాయం, ధర్మం". అంటే నైతికత ప్రజాదరణ, ప్రజామోదం మీదే ఆధారపడుతుంది తప్ప వేరే నిర్దిష్టమయిన, హేతుబద్ధ నిష్పాక్షిక గీటురాయి లేదంటారు! కాబట్టి ప్రజాదరణ గల నాయకుడు ఏం చేసినా అది తప్పుకాదు? ఒకరి కంటే ఇంకొకరు ఎక్కువ సంపాదించడం నేరం, పాపం, కాబట్టి అటువంటి నేరపూరిత సంపాదనను లాక్కుని సంపాదించని వారికి పంచిపెట్టడమే నైతికం? అదే ప్రభుత్వాల ప్రథమ విధి? మనుషుల్లో సమానత్వం అనేది రాజకీయ హక్కులు సమానంగా కలిగి ఉండడంలో కాదు, ఆర్థికంగా కూడా సమానస్థాయి రావడంలోనే ఉంది? అలా జరిగే దాకా ఈ లాక్కోవడం, పంచిపెట్టడం ఆగదు? దాన్నే పేదరిక నిర్మూలన అంటారు? ఈ ప్రక్రియలో అందరూ పేదలైపోయినా ఫరవాలేదు? ఎవరికంటే ఎవరికీ ఎక్కువ లేకపోతే పేదరికం పోయినట్లేనా? అంటే పేదరికమనేది ఇంకొకడికి ఎక్కువ ఉండడం వల్ల వస్తుంది తప్ప, తనకు లేకపోవడం నుంచి రాదు, అంతేనా?

ఈ సమానత్వాన్ని సాధించి పెడతాననేవాడే నాయకుడు? మద్యం మీద వసూలు చేసిన పన్నుతో రెండ్రూపాయలకు బియ్యం ఇచ్చినవాడే మహానాయకుడు? ఇంతసేవ చేసిన మహానేత, అతని కుటుంబం వేలకోట్లు వెనకేసుకుంటే నాకేం? నా మూడొందల పెన్షను వచ్చినంత కాలం ఎవరెంత తింటే నాకేం? ఎన్నికల సమయంలో డబ్బులిచ్చారు, ఎన్నికలయ్యాక ఇంకా ఎన్నో ఇస్తామన్నారు. కాబట్టి ఓట్లేసి గెలిపిస్తాం. ఎవరి డబ్బుతో ఇవన్నీ ఇస్తామన్నారో అడక్కండి. ఎవరిదైతే నాకేం? నా ఓటు, నా ఇష్టం. ఈ బలహీనతే వారి బలం. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, లైంగికంగా, శారీరకంగా బలహీనులంతా తమ తమ గుంపులుగా

ఏకమై రాజ్యాధికారం పంచుకోవాలి. అదే ప్రజాస్వామ్యం. ఆ రాజ్యాధికారంతో తమ గుంపుకు కొంతపడేసి, గుంపు నాయకులుగా తామెంతైనా దోచుకోవచ్చు, దాచుకోవచ్చు. ఎక్కడ్నుంచి? కష్టపడి సంపాదించిన వాళ్ళ దగ్గర్నుంచి. ఏ నైతిక అధికారంతో? సంపాదనంటేనే నేరపూరితం, పాప ఫలితం కదా! కాబట్టి లాక్కోవడంలో అనైతికత ఏమీలేదు. తమ బలహీనతే తమ ప్రత్యేక హక్కులకు ప్రాతిపదిక. కాబట్టి కులాలవారీగా, మతాలవారీగా, ప్రాంతాలవారీగా రిజర్వేషన్లుండాలి. మహిళలు ఏభై శాతం కాబట్టి వారికీ రిజర్వేషన్లుండాలి. హక్కులు వ్యక్తుల కుండవు, గుంపులకే ఉంటాయి. న్యాయానికి, ధర్మానికి ప్రాతిపదిక వ్యక్తి ప్రాథమిక హక్కులు కాదు. అందరినీ సమానస్థాయికి తీసుకురావాలనే తాత్వికతే దాని ప్రాతిపదిక. అందుకోసం ప్రభుత్వాన్ని, దాని సైన్యాన్ని ఉపయోగించుకోవడమే రాజకీయం". ఇదీ సమకాలీన రాజకీయ వాతావరణం.

చట్టాలు చేసినంత మాత్రాన అవినీతిపోదని, ముందు ప్రజల్లో నైతికమార్పు రావాలనే వాదన సరైనదే. కానీ నైతికత గాల్లోంచి రాదు. దానికొక తాత్విక పునాది కావాలి. *అసమానులను ప్రభుత్వ జులుంతో సమానులను చేయజూసే విఫలయత్నాల నైతికత కావాలా? లేక అసమానతలను – ప్రకృతి సహజమైన యథార్థంగా అంగీకరించి, ఎవరి సంపాదనను వారిని అనుభవించనిచ్చి, వ్యక్తి హక్కులను, వ్యక్తుల మధ్య స్వచ్ఛంద సంబంధాలను కాంక్షించే నైతికత వైపు మొగ్గు చూపాలా?*

ఈ విషయం ముందుగా తేల్చుకోకుండా ఏ నైతిక మార్పుకోసం కృషి చెయ్యగలం? 'ఉన్నవాడిని కొట్టడం, లేనివాడికి పెట్టడం' అనేది అత్యంత నైతికమనే భావన అందరిలో నరనరాలా జీర్ణించుకుపోయింది. పన్నుల రూపంలో వసూలు చేసిన డబ్బును రాశిపోసి, బలహీనతను ఓట్లబలంతో ఎత్తిచూపే గుంపులకు పంచిపెట్టడాన్ని నైతికమంటున్నాం. అసలెందుకు పంచిపెట్టాలనే ప్రశ్న వేసేవారే లేరు.

ఈ పనులు చేయడానికి నిజాయితీపరులు రాజకీయాల్లోకి ఎందుకు రారు? అని మథనపడతాం. ఒకడ్ని కొట్టి ఇంకొకడికి పెట్టడం, ఒక జేబులో డబ్బు పన్నుల రూపంలో కొట్టేసి, ఇంకో జేబులో సబ్సిడీల రూపంలో పెట్టడం అంతర్గత వైరుధ్యం. నిజాయితీపరులైతే ఆ పనిలోని నైతికతను ప్రశ్నిస్తారు. కాబట్టి మౌలికంగా అనైతికమైన ఈ రాజకీయ కార్యక్రమానికి అవినీతిపరులే (డబ్బు రూపంలోనో, పదవీ కాంక్ష, అధికార వ్యామోహ రూపంలోనో) ముందుకు రాగలరు. ఈ పోటీలో ఒకరిని మించిన ఘనులు ఇంకొకరు పీఠం ఎక్కుతూ ఉంటారు. ఉచితంగా పొందడానికి అలవాటు పడ్డవాళ్ళు ఆ పెద్ద దొంగలకే ఓట్లేస్తారు. ప్రజలకు తెలిసేలోగా..., మీగడ – మారిషస్‌కు తరలిపోతుంది. దొరికిన చల్ల నీళ్ళకే జనం కేరింతలు కొడతారు. ఇదీ అసలు సమస్య.

అందరికీ డబ్బే ప్రధానమైపోయింది, వినిమయ వ్యామోహానికి గురవుతున్నారు, కోరికలను అదుపులో పెట్టుకోవాలని కొందరంటారు. ఊరికే ప్రతిదాన్నీ విమర్శించడం కాదుగానీ, ఇందులో కొంత అస్పష్టత ఉంది. 'డబ్బు; అంటే – సంపద ప్రధానమవడం... లేక వినిమయ వ్యామోహం – అసలు సమస్యకాదు. డబ్బు తనంతట తాను అంత చెడ్డదయితే, మరి ఆ డబ్బుతోనే కదా పింఛన్లు, స్కాలర్‌షిప్పులు ఇస్తున్నది? వినిమయ వస్తువులతో సుఖాలు, సదుపాయాలు పొందడం కోసం కాకపోతే ఆర్థిక అభివృద్ధి దేనికోసం?

సమస్యల్లా – ఎవరో సంపాదించిన డబ్బు తాను పొందాలనుకోవడంలో ఉంది. దానికి చారిత్రక, రాజకీయ, సామాజిక సంజాయిషీలిచ్చుకునే ప్రయత్నాల్లో ఉంది. ఈ తాత్వికతను, నైతిక గందరగోళాన్నే రాజకీయ నాయకులు లాభసాటిగా ఉపయోగించుకుంటున్నారు. తనెంత తింటే నాకేంటి, నాకు ఎక్కువ పంచుతానంటున్నాడు కదా అని జనం కూడా వారి వెనుక బడి పరుగులు తీస్తున్నారు. ఒక్క ఛాన్స్ రాకపోతుందా, తరతరాలకు సరిపడా సంపాదించక– పోతామా అని ఆశావహులు ఎక్కడికక్కడ జనాన్ని పోగేస్తున్నారు. సమసమాజ వాద నైతికతతో తమకళ్ళుగప్పి కొందరు కోట్లకు పడగెత్తడంతో కడుపుమండిన జనం అప్పుడప్పుడు తిరగబడతారు. అదే అన్నాహజారే ఉద్యమం.

అన్నా తదుపరి లక్ష్యం అందరికీ ఉచిత విద్య, ఉచిత వైద్యం సాధించడమని విన్నాం. అవెక్కడ్నుంచి వస్తాయో, ఎవరి డబ్బుతో ఇస్తాడో? అదే బాటలో వెళితే అన్నా కూడా మరో జగనన్న అవుతాడు. రాజకీయ నాయకులు తినేదానికన్నా, తినడం కోసం చేసే చట్టాలు, నియంత్రణల వల్ల సమాజానికి జరిగే నష్టం కొన్ని వందల రెట్లు ఎక్కువ. నైతిక గందరగోళం సమాజానికి చాలా ఖరీదైన జాడ్యం.

04-09-2011

ఉగ్రవాదం - జన్మ రహస్యం

ఢిల్లీ హైకోర్టు ముందు బాంబు పేలుళ్ళతో దేశమంతా ఉలిక్కి పడింది. డజను మరణాలు, మరిన్ని డజన్ల క్షతగ్రాతులు. యధావిధిగా ప్రధాని, హోం మంత్రుల ప్రకటనలు. ప్రధాని కావాలనుకునే వారంతా క్షతగాత్రులకు పరామర్శలు. "ఇదో పిరికి చర్య, ఇలాంటి చర్యలకు మేం లొంగం" అన్న ప్రధాని మాటలకు నవ్వొస్తుంది.

పిరికి తనం ఎవరిది? అఫ్జల్ గురుకు క్షమాభిక్ష పెట్టనందుకు నిరసనగా ఈ పేలుళ్ళు జరిపి పన్నెండు మంది అమాయకులను చంపారని తెలుస్తోంది. విధించిన ఉరిశిక్ష అమలు చేయకుండా ఇన్నాళ్ళూ పిరికి తనం చూపిందెవరు? ఏ ఓటు బ్యాంకులకు లొంగిపోయి?

అలాగే రాజీవ్‌గాంధీ హంతకులకు విధించిన శిక్షలను అమలు జరపరాదని సరాసరి అసెంబ్లీ తీర్మానమే చేసేశారు. కాశ్మీర్, శ్రీలంక తమిళుల పోరాటాలను – వామపక్ష మేధావులు జాతుల పోరాటాలుగా అభివర్ణిస్తారు. ప్రపంచంలో జరుగుతున్న ఉగ్రవాద చర్యలన్నిటి వెనుక ప్రాంతీయ, మత, జాతి, తెగల పేరిట జరిగే గుంపుల పోరాటాలే ఉన్నాయి. ఈ ధోరణులు ఇన్నేళ్ళుగా నిర్మించుకున్న నాగరికతకే సవాలు విసురుతున్నాయి. నాగరికత దానంతట అది పరిఢవిల్లదు. జాగ్రత్తగా పోషించుకుంటేనే నిలబడుతుంది.

ప్రస్తుతం నాగరికత క్రమంగా అంతరించిపోయే ప్రక్రియ విజయవంతంగా సాగుతోంది. అది ఒక్క రాత్రిలోనే జరిగిపోదు. దాన్ని పట్టిపీడిస్తున్న మహమ్మారి వ్యాధిని గుర్తించి సకాలంలో విరుగుడు చర్యలు చేపట్టకపోతే అంతర్గతంగా కుళ్ళి, కృశించి, నశించిపోతుంది. ఆ వ్యాధి ఏమిటంటే – తెగల స్వభావానికి (ట్రైబలిజం) మనుషులు లోనుకావడం. ఒకపక్క ఆధునిక సమాచార సాధనాలతో ప్రపంచమంతా అరచేతిలోకి వస్తోంది. మరో పక్క సమాజాలన్నీ కుల, మత, భాష, ప్రాంతీయ, జాతీయ, చర్మం రంగుల్లాంటి ప్రాతిపదికలపై ముక్కలుముక్కలవుతున్నాయి. అస్తిత్వాల పేరిట కొత్త కొత్త గుంపులు

ఆవిర్భవిస్తున్నాయి. ఆఫ్రికా, ఆసియాల్లో బహిరంగంగాను, యూరప్, అమెరికాల్లో అంతర్గతంగాను గుంపులు పోరాటాలు నడుస్తున్నాయి. వాటి స్వభావమేమిటి? కారణాలు, పర్యవసానాలేమిటి?

మనుషుల్లో పెరుగుతున్న తెగ స్వభావం అహేతుకత, సామూహికత్వాల (కలెక్టివిజమ్) కలయికతో జనించే విషం. ఇప్పుడు రాజ్యమేలుతున్న తాత్వికతకు అదొక పర్యవసానం. వ్యక్తిని మేధోపరంగా, నైతికంగా అసహాయుణ్ణి చేసి, ఏ హక్కులూ లేకుండా చేసి, హేతుబద్ధ మార్గంలో నడవనీయకుండా చేసి, గుంపులే సర్వస్వమని, తన గుంపుకు సేవచేయడమే వ్యక్తి పరమావధి అని ప్రవచించడంతో, ప్రతి వ్యక్తీ ఏదో ఒక గుంపులో జొరబడక తప్పని పరిస్థితి ఉత్పన్నమయింది. ఏ గుంపులో భాగమవ్వాలి? సింపుల్ - తన ప్రమేయం లేకుండా, తాను జన్మించిన గ్రూపులో. అది కులం కావచ్చు, మతం కావచ్చు, దేశం కావచ్చు. అలా తనపుట్టుక, తన రక్తమాంసాలు తన మేధస్సును నిర్దేశిస్తు--న్నాయి! నిజానికిది జాత్యహంకారం. కానీ గుంపు పెద్దదయితే జాత్యాభిమానమంటారు. మరీ చిన్నదయితే దాన్ని మైనారిటీ ఆస్తిత్వ చైతన్యమంటారు.

ఈ సామూహికత్వం, తెగ స్వభావం ఎప్పుడైనా, ఎక్కడైనా యుద్ధం, రక్తపాతాలనే సృష్టిస్తుంది. విముక్తి తెస్తానన్న కమ్యూనిజం, రష్యా, చైనా, కంబోడియాల్లో - ప్రజల రక్తంతో తడిసిన నియంతృత్వాలను తెచ్చింది. ఐశ్వర్యం తెస్తానని చెప్పి ఇండియా, క్యూబా, ఉత్తర కొరియాల్లో పేదరికం నింపింది. శాంతి బదులు - రెండు ప్రపంచ యుద్ధాలు, ఎన్నో స్థానిక యుద్ధాలు, అణు- -బాంబుల భయాన్ని ప్రపంచానికిచ్చింది.

ఈ సామూహికత్వం కేవలం కమ్యూనిస్టు దేశాల్లోనే కాదు, పెట్టుబడిదారీ దేశాలుగా చెప్పుకునే అమెరికా, యూరప్‌లను కూడా ఆవహించింది. అందుకే వాళ్ళకీ కష్టాలు. జాతి హక్కులు, మైనారిటీ హక్కులు, ఆదిమ సంస్కృతుల పేరుతో జాత్యాంహకారాన్ని పెంచి పోషించే తెగ స్వభావాన్ని సమకాలీన రాజకీయాలు, తాత్విక ధోరణులు ప్రోత్సహిస్తున్నాయి. స్వేచ్ఛా సమాజంలో సంస్కృతి - అంటే వ్యక్తులు సాధించిన పారిశ్రామిక, శాస్త్రీయ, సాంకేతిక, మేధోపర, కళా, సౌందర్యాత్మక విజయాల సమాహారం. అది సాంప్రదాయికతను చీల్చుకుని వాస్తవాధారితమై వర్ధిల్లుతుందే తప్ప, పూర్వీకుల అంగీకారం కోసం ఎదురుచూడదు. కానీ తెగ స్వభావానికి సంప్రదాయమే ప్రాతిపదిక. సాంప్రదాయికులు తరతరాలకు అందించేది జానపద నృత్యాలు, పాటలు, దుస్తులు, వంటలు, పండుగలే. స్వభావ రీత్యా తెగల విజయాలన్నీ జంతుజాతి సమానమైన ఇంద్రియ జ్ఞాన స్థాయిలోనే ఉంటాయి. మనిషికి మాత్రమే సాధ్యమైన భావగ్రహణం (కాన్సెప్ట్),

దార్శనికత, అమూర్త (అబ్‌స్ట్రాక్ట్) ఆలోచనలు వాటిలో కానరావు. అవి ఇంద్రియాలను తాకే నిర్దిష్ట, తక్షణ విషయాలకే పరిమితం. ఒక పరిమిత ప్రపంచంలో మాత్రమే బ్రతకగలిగి, ఇంకా ఏమేమి సంభవమో దర్శించజాలని, అమూర్త సూత్రాలతో వ్యవహరించలేని మానసిక స్థాయితో, ప్రశ్నించకుండా, పుక్కిట పట్టిన ప్రవర్తనా నియమావళిని అనుసరించడమే తెగవాదం, జాతి జీవనం. తెలంగాణ నుంచి కెనడా వరకు ఇందులో మినహాయింపు లేదు. భాష అనేది భావ మార్పిడికి ఒక సమాచార సాధనం మాత్రమే. ఎన్ని భాషలు నేర్చుకుంటే భావాల (కాన్సెప్ట్) పరిధి అంతగా విస్తృతమవుతుంది. ఒక మాటలోని ధ్వని కంటే భావం ముఖ్యం. లోతుగా చూస్తే భాషా యుద్ధాలు భాష కోసం కాదు, తమ పరిమిత మానసిక చైతన్యస్థాయిని, తమ నిష్క్రియాపరత్వాన్ని, తమ తెగపట్ల గుడ్డి విధేయతను, ఇతరులను గుర్తించలేని తమ అసహాయతను కప్పిపుచ్చుకోవడానికి, వాస్తవం నుంచి పారిపోవడం కోసం మాత్రమే.

ఆత్మగౌరవాన్ని అధికారికంగా, ప్రామాణికంగా పొందలేని వాళ్ళకు జాత్యహం కారం ఒక సూడో ఆత్మగౌరవం ఆపాదించి పెడుతుంది. తమ కలవరపాటు, కంగారు, అస్పష్టతలు, భయాల నుండి, తమ జడచైతన్యావస్థల నుండి సురక్షితమైన భద్రత అనే భ్రమను కలగజేస్తుంది.

మనుషుల మధ్య ద్వేషాన్ని వ్యాపింపజేయాలంటే వారిని తెగలు, వర్గాలుగా విభజిస్తే చాలు. వాళ్ళే కొట్టుకు చస్తుంటారు. మిశ్రమ ఆర్థిక వ్యవస్థల్లో ప్రభుత్వాల అధికారాలు, నియంత్రణలు పెరిగే కొద్దీ తెగల సృష్టి, వాటి మధ్య సంఘర్షణ పెరుగు--తుంటాయి. ఒకరి ఖర్చుతో వేరొకరికి చట్టపర పక్షపాతాలు, ప్రత్యేక హక్కులు కలగజేయడం వ్యవస్థీకృత పౌరయుద్ధాలకు దారితీస్తుంది. దీన్నెవరూ ఆపలేరు. "మా న్యాయమైన వాటా మాకు దక్కాలి", "మా వర్గం హక్కులను కాపాడాలి" - ఇలాంటి నినాదాలు వినపడగానే..., సామూహికత్వం వేళ్ళూనుకుంటోందని అర్థం చేసుకోవాలి.

దానర్థం తమకు ఎక్కువ వాటా కావాలని, అవసరమైతే లాక్కుంటామని వారి భావం. దురాశ పరులైన నాయకులు కొత్త వర్గాలకు ప్రాణం పోస్తారు. సామాన్యులకు ఒరిగేదేం ఉండదు. ప్రత్యేక హక్కులు, మేళ్ళు, గుర్తింపు పొందేది నాయకులు మాత్రమే. ఈ ప్రక్రియ ఎంతదూరం వెళ్ళిందంటే, తెగ, సామాజికవర్గ భావనలు మార్క్సిజాన్ని కూడా మరుగున పడేస్తున్నాయి. వివిధ కమ్యూనిస్టు పార్టీలు అంతర్గతంగా కుల, మత, ప్రాంత విభేదాలతో సతమతమవుతున్నాయి. కుల, మత, ఆస్తిత్వ భావనల టెంకను చీల్చుకుని వారి మెదళ్ళలోకి మార్క్సిజం వెళ్ళలేకపోతోంది. ఎందుకంటే, ఎంత

విమర్శనార్హమైనదైనా, మార్క్సిజం ఒక మేధో భావన, మేధో నిర్మాణం, ఎంత తప్పుడుదైనా, అదొక అమూర్త సిద్ధాంతం. దాన్ని ఈ ఇంద్రియ గ్రహణ స్థాయిలో ఉన్న మేధస్సులు అర్థం చేసుకోలేవు.

పుట్టుకను బట్టి ఎవరి తెగకు వాళ్ళు చెంది, తమ ప్రత్యేక స్వభావాలను బలవంతంగా కాపాడుకుంటూ ఉంటే, వివిధ తెగల మధ్య సోదర భావం, సమాచారం, పరస్పర అవగాహన ఉండవు. కేవలం పరస్పర ద్వేషం, భయం, అనుమానాలే మిగులుతాయి. ఆ ద్వేష వాతావరణంలో బాంబుపేలుళ్ళ లాంటి ఆకృత్యాలు అప్రతిహతంగా సాగిపోతూనే ఉంటాయి. వాటిని కూడా సమర్థించుకోజూస్తారు. ఈ తెగ స్వభావాలతో రాజీపడడం నిరుపయోగం. అదింకా విశృంఖల ఆకృత్యాలకు దారితీస్తుంది. విల్లంబులతో కాకపోతే..., అణు బాంబులతో. తెగల స్వభావం, వాటి అస్తిత్వం రాజకీయంగాను, నైతికంగాను, అహేతుకం.

హక్కులు – వ్యక్తులకు మాత్రమే ఉంటాయి. గుంపుల కుండవు. ఒక నియంతృత్వం నుంచో, మిశ్రమ ఆర్థిక వ్యవస్థ నుంచో విడిపోయి ఒక స్వేచ్ఛా సమాజాన్ని నిర్మించుకునే హక్కు అందరికీ ఉంటుంది. కానీ కొందరు నేతలు ముఠాగా ఏర్పడి, తమ సొంత నియంతృత్వాన్ని, నియంత్రణల ప్రభుత్వాన్ని ఏర్పరచుకునే హక్కు ఎవరికీ, ఏమాత్రం లేదు. స్థానికంగాను, అంతర్జాతీయ స్థాయిలోను కాపిటలిజమొక్కటే రక్తపాత రహిత సమాజానికి, వ్యక్తుల మధ్య స్వచ్ఛంద సంబంధాలకు పూచీ ఇస్తుంది. అన్ని ప్రాంతాల ప్రజలనూ కలుపుకొని గొప్ప సమాజాలను నిర్మించింది. పౌరుల జీవన ప్రమాణాలను ఊహించనంత ఎత్తుకు పెంచింది. తెగ స్వభావాలను తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. చారిత్రకంగా – పాము, ముంగిస లాంటి తెగల నుండి వచ్చిన ప్రజలు కూడా శాంతితో కలిసి బ్రతికే వాతావరణం కల్పిస్తుంది. ప్రపంచ ప్రజల్లో ఆశ, అభ్యుదయం, సర్వమానవ సౌభ్రాతృత్వం ఇనుమడింపజేసింది. తెగ స్వభావి – రాసే కవితలు,రచనలు రెచ్చగొడతాయి. ఎందుకంటే అవి ఇంద్రియాలను తాకుతాయి. స్వతంత్ర భావాలున్నవాడెవడైనా – హిందువైన, ముస్లిమైనా – తన మతం కోసం బాంబులు పెడతాడా ?

11-09-2011

భిన్న ఆలోచనల్లో ఒక ఏడాది

ఈ శీర్షిక మొదలు పెట్టి సంవత్సరమయింది. ఈ సమయంలో ఎన్నో వివాదాస్పదమైన సామాజిక, ఆర్థిక, రాజకీయ, తాత్విక విషయాలను స్పృశించి వాటివాటి చారిత్రక నేపథ్యంలో విశ్లేషించడం జరిగింది. ఆ విశ్లేషణలకు తీవ్రస్థాయిలో అభ్యంతరాలు, విమర్శలు వచ్చాయి. దాదాపు అన్ని కమ్యూనిస్టు పార్టీలకు చెందిన రాష్ట్రస్థాయి నేతలు, పలువురు పేరొందిన మేధావులు విమర్శనాత్మకంగా స్పందించారు. కొన్నిసార్లు వ్యక్తిగత దూషణలకూ దిగారు. వారి విమర్శలకు వినమ్రంగా జవాబిచ్చే ప్రయత్నం చేశాను. ఎవరు సంతృప్తి చెందినా, చెందకున్నా, ఒక వైరుధ్య రహిత భావజాల దృష్టికోణంలో సమకాలీన సమస్యల చిక్కుముడులను విప్పిచూపి, శాశ్వత పరిష్కారం దిశగా, భావ ప్రయత్నం చేయగలిగానన్న తృప్తయితే మిగిలింది.

తరతరాలుగా చిన్నవయసునుండే ప్రజలకు నూరిపోస్తున్న సోషలిస్టు, సామాజిక భావజాలం లోపభూయిష్టమైంది. కాబట్టే సమస్యలను సరైన కోణంలో అర్థం చేసుకోలేక పోతున్నాం. పరిష్కారమనుకున్న ప్రతి నిర్ణయం, చర్యా మరిన్ని సమస్యలకు ప్రాణం పోస్తోంది. ఎక్కడ తప్పుచేస్తున్నామో తెలుసుకోలేనితనం; భావజాల అయోమయం, గందరగోళం, అస్పష్టతలు వీడి; సరైన ప్రత్యామ్నాయ ఆలోచనా విధానాన్ని అలవరచుకోకపోతే, జాతి సమయం, శక్తియుక్తులన్నీ బూడిదలో పోసిన పన్నీరవుతాయి.

ఏ సమస్య వచ్చినా పరిష్కారం కోసం ప్రభుత్వం వైపు చూస్తున్నాం. అసలు ప్రభుత్వమే సమస్యకు ముఖ్యకారణమని, కాబట్టి అది పరిష్కారంలో భాగం కాజాలదని గుర్తించలేక పోతున్నాం. అత్యంత మౌలికమైన ధన, మాన, ప్రాణ రక్షణ, ఆ పనికోసం హేతుబద్ధ చట్టాల తయారీకి తప్ప ప్రభుత్వాలు ఏ ఇతర విషయాల్లో జోక్యం చేసుకున్నా, రోగం నయం కాదు సరి కదా, ఎవరూ ఊహించని, కొంప మునిగే దాకా గమనించలేని కొత్త కొత్త రోగాలకు దారితీస్తుంది.

భావజాల పరంగా – కొన్ని తప్పుడు అవగాహనలు మన ఆలోచనా విధానాన్ని వక్రమార్గంలోకి తీసుకుపోతున్నాయి.

వాటిలో మొదటిది – వ్యక్తి నిమిత్త మాత్రుడని, తన సామాజిక, ఆర్థిక నేపథ్యమే అతని ఆలోచనలను నిర్ధారిస్తుందని, సమాజమే ముఖ్యమనే ఆలోచన. కానీ, నిజానికి సమాజమనేది వ్యక్తుల సముదాయమే తప్ప, దానికంటూ ప్రత్యేక అస్థిత్వం లేదు. ఆకలిదప్పులు, ఆలోచనలు, కృషి, కష్టసుఖాలు, జయాపజయాలు వ్యక్తులకుంటాయి గానీ సమాజానికుండవు. పాశ్చాత్య సామాజిక తత్వం వ్యక్తి, వ్యక్తి స్వేచ్ఛ కేంద్రబిందువుగా రూపొందింది. వారి ఆర్థిక, శాస్త్ర, సాంకేతిక, మేధోరంగ విజయాలన్నిటికీ అదే మూలకారణం. వ్యక్తి సాధించిన విజయాలకు, చేసిన తప్పులకు వ్యక్తినే బాధ్యుణ్ణి చెయ్యాలి తప్ప, వాటికి ఏ ఇతర భాష్యాలు చెప్పజూసినా – అది తప్పుడు అవగాహనలకు దారితీస్తుంది. దళితవాడలు, పూరి గుడిశెల్నుంచి వచ్చి వివిధ రంగాల్లో రాణించిన వారు ఒక పక్కన; పరమ శుంఠలయిన పండిత పుత్రులే మరొక పక్క కనిపించడమ్ – దీనికి నిదర్శనం.

ఇక రెండోది – సంపాదించని వారికోసం సంపాదించే వారు త్యాగం చెయ్యాలనే బలవంతం. 'నీవు నీ సోదరునికి కాపరివి' అన్న బైబిలు సూక్తి మొదలుకుని, అన్ని మతాలూ చెప్పే ధార్మిక సూక్తిని అడ్డం పెట్టుకుని పన్నుల విధింపు, ఓట్ల కొనుగోలుగా భాసిల్లుతున్న రాజకీయ (అ)నైతికతే సకల సంక్షోభాలకు హేతువు. తాత్కాలిక కష్టాల్లో ఉన్న, యోగ్యులైన సాటి మానవులపట్ల సానుభూతితో, దయతో వ్యక్తులు ఇష్టపూర్వకంగా చెయ్యాల్సిన సహాయాన్ని ఒక హక్కుగా మార్చేసి, తుపాకి గురిపెట్టి వసూలు చేసిన పన్నుల డబ్బును వివిధ ఓటు బ్యాంకులకు పంచిపెట్టి ; తమను తాము సంక్షేమ దేవుళ్ళుగా అభివర్ణించుకున్నా తప్పుపట్టలేని అసహాయత – ఈ 'నీచ నైతిక ప్రామాణికత' నుంచే వచ్చింది.

మూడోది – మనిషి వ్యక్తిగత ప్రవర్తనను ప్రభుత్వం ద్వారా సమాజం శాసించాలనే దురభిప్రాయం. ఇతరుల స్వేచ్ఛకు భంగం కలిగించనంత వరకు, ఇతరులకు హాని కలిగించనంత వరకు వ్యక్తిగత ప్రవర్తనను తన ఇష్టాఇష్టాలకే వదిలేయాలి. తన నిర్ణయాలు, ప్రవర్తనల పర్యవసానాలకు వ్యక్తి తానే బాధ్యత వహించాలి. వ్యక్తికి నైతికత నేర్పాల్సింది తల్లిదండ్రులు, మిత్రులు, సంస్కర్తలు, తత్వవేత్తలే తప్పించి; బలవంతాన, తాను నిర్ణయించిన నైతిక మార్గంలో నడపాల్సిన బాధ్యత ; ప్రభుత్వాలది కాదు. తన కష్టంతో సంపాదించిన డబ్బుతో జూదమాడతాడో, తాగి తగలేస్తాడో, లేక పెట్టుబడిగా పెట్టి మరింత సంపాదిస్తాడో తనిష్టం. కానీ ఇతరుల హక్కులకు భంగం కలిగిస్తే మాత్రం హేతుబద్ధ చట్టాలపరంగా విచారించి ఖచ్చితంగా శిక్షించే వ్యవస్థ తప్పనిసరి.

ఇక నాలుగోది, ముఖ్యమైనదీ – కేపిటలిస్టు వ్యవస్థ దుర్మార్గమయిందనీ, కొంచెం కష్టమైనా గానీ సోషలిస్టు వ్యవస్థే అభిలషణీయమనే ముందస్తు వీర దురభిప్రాయం.

మేధావులతో సహా చాలా మంది కాపిటలిజాన్ని భూస్వామ్య వ్యవస్థగా భ్రమిస్తారు. అది వాస్తవం కాదు. కాపిటలిజం రాకముందు ఉత్పత్తి చాలా పరిమిత స్థాయిలో జరిగేది. భూమి, వ్యవసాయం మీదే దాదాపు అందరూ ఆధారపడే వాళ్ళు. యుద్ధాల్లో గెలిచిన వాళ్ళు తమ సేనానులకు, సైనికులకు భూమిని పంచి పెట్టేవాళ్ళు. కులవృత్తుల్లో పరిమితంగా జరిగే ఉత్పత్తి – పాలకుల అవసరాలకే సరిపోయేది. చేయగలిగే పని పరిమితంగా ఉండి, నిరుద్యోగం, దుర్భర పేదరికంలో సామాన్యప్రజలు తరతరాలుగా ఉండిపోయేవారు.

కాపిటలిజం తెచ్చిన ముఖ్యమైన మార్పు – కుల వృత్తులు, చేతివృత్తుల స్థానంలో యాంత్రీకరణ జరగడం మాత్రమే కాదు, ఉత్పత్తి అంతా జన బాహుళ్యాల ఉపయోగార్థం తయారుచేయడమే దాని ముఖ్యలక్షణం. అందులో ధనికుల వినియోగం అతిస్వల్పం. కార్మికులే ముఖ్య వినియోగ దారులు. సామాన్యులకు అందుబాటులో ఉండే కోకాకోలా, సబ్బులు తయారుచేసేవే మెగా పరిశ్రమలవుతాయి. ధనికుల కోసం సెంటు సీసాలు ఉత్పత్తి చేసే కంపెనీలు ఆ స్థాయికి ఎప్పటికీ చేరవు. పూర్వం రోజుల్లో ఎంత కష్టపడినా, ఎంత ఆస్తి ఉన్నా, సైకిల్ కొనుక్కోవడం కష్టమయ్యేది. కానీ నేటి తరంలో ఎంత చిన్న ఉద్యోగి అయినా మోటారు సైకిలు కొనగలుగుతున్నాడు. మన కష్టం పెరక్కపోయినా, వినియోగ వస్తువులు అందుబాటు లోకి రావడానికి కారణం కాపిటలిజం మూలమంత్రమైన విస్తృత (మాస్) ఉత్పత్తి, విస్తృత వినియోగం.

అలాగే మందులు, ఆధునిక వైద్యం, ప్రయాణం, ఇళ్ళు, బట్టలు, ఆహారం మునుపటికన్నా విస్తృతస్థాయిలో అందుబాటులోకి తెచ్చి సాధారణ ప్రజల జీవన ప్రమాణాలను అనూహ్యంగా పెంచింది – కాపిటలిజమే తప్ప; ప్రభుత్వ పథకాలు కాదు. ప్రజల వినియోగశక్తి, కొనుగోలు శక్తి పెంచడమేకాక, ఖర్చుపెట్టే ప్రతిరూపాయికీ మార్కెట్‌లో ఓటుహక్కు కల్పించి ఆర్థికపగ్గాలను భూస్వాముల చేతుల్లోంచి యావత్ ప్రజానీకం చేతుల్లోకి మార్చింది. అదే – రాజకీయ రంగంలో ప్రజాస్వామ్యానికి దారితీసింది. వ్యక్తుల ఆస్తి హక్కును గుర్తించడం, గౌరవించడం, రక్షించడం పైనే కాపిటలిజం మనుగడ ఆధారపడి ఉంటుంది. కాపిటలిజం విజయాలు వాటికవే సాక్ష్యం. దానికి వేరే ప్రచారం అవసరం లేదు.

మార్కెట్ వ్యవస్థలో వినియోగదారుని సార్వభౌమత్వాన్ని గుర్తించలేక పోవడం సోషలిస్టుల దృష్టి దోషానికి నిదర్శనం. వినియోగదారుడికి సరిగా సేవ చెయ్యకపోతే, మారుతున్న అభిరుచులు, కొనుగోలు శక్తులను గుర్తించకపోతే, ఒకప్పుడు సుపరిచితమైన

న్యూట్రిన్ చాక్లెట్ మరుగున పడిపోయి, క్యాడ్‌బరీ ముందుకొస్తుంది. ఆలోచనే మనిషికి అత్యంత శక్తివంతమైన ఆయుధం. సామాన్య స్థాయినుంచి అనతికాలంలోనే టాటా, బిర్లాలను మించిపోయిన ఇన్ఫోసిస్ నారాయణమూర్తిని చూసి అసూయపడాలో...,ఆ విజయాన్ని ప్రేరణగా తీసుకోవాలో...; తద్వారా మనిషి ఔన్నత్యాన్ని, మానవ జన్మ ఉత్కృష్టతను పండగ చేసుకోవాలో నిర్ణయించుకోవడంలోనే మన మానసిక స్థాయి, భావజాలం ఆవిష్కృతమవుతాయి. రెండు భిన్న కవితలతో ముగిద్దాం.

"నాలో ప్రవేశించు, నా చర్మం తొడుక్కో – అప్పుడర్థమవుతుంది, నేనెవ్వరో, నేనేమిటో, నేనెందుకో" అనే అసహాయత, నపుంసకావేశం కావాలో, లేక

"నా తండ్రులు, తాతలు నిద్రోతున్నారు...
తమ సమాధుల్లో ఒంటరిగా...
నేను యే మృతమీసాల సంపంగి నూనెపైనా,
లేక గత తరాలెదుర్కున్న వివక్షలపైనా ఆధారపడను.
కీర్తికైనా, తిరస్కారానికైనా నాపేరు నాదే.
నా జననం తోటే పుట్టిందీ ప్రపంచం...
వచ్చి తనను గెలుచుకోమని ఆహ్వానిస్తోంది".

అనే స్వతంత్రత, ఆశావాదం కావాలో ఎవరికివారే నిర్ణయించుకుందాం.

18-09-2011

'సకల' ప్రయోగం

గత పక్షం రోజులుగా సకలజనుల సమ్మె పేరుతో జరుగుతున్న గొలుసు ఆందోళనల వల్ల సకల జనులూ ఇబ్బందుల పాలయ్యారు. ఆందోళన చేసిన వారితో సహా అందరికీ ఏదో ఒక రకమైన నష్టం జరిగింది. ఈ సమ్మె విజయవంతమైనదా, లేదా అన్న చర్చను కాసేపు ప్రక్కన పెడదాం. ఎప్పుడో ఒకసారి వచ్చే ప్రళయం, ఒక మహాయుద్ధం, సమాజ స్థితిగతులను మార్చేస్తుంది. చరిత్రను కొత్తదారి పట్టిస్తుంది. అప్పటిదాకా యథాస్థితి వాదంలో కొట్టుమిట్టాడే సమాజం ఒక్కసారిగా ఉలిక్కిపడి తన స్థానం, దశ, దిశలను సమీక్షించుకుంటుంది. మరీ అంత స్థాయిలో కాకపోయినా, ఈ సమ్మె ఒక ప్రయోగంగా ఉపయోగపడింది. సమ్మె సందర్భంగా కొన్ని విషయాలు రుజువయ్యాయి.

ఈ సమ్మెను వివిధ వ్యక్తులు, వర్గాలు తమదైన శైలిలో తమ తమ ఆలోచనల మేరకు అన్వయించుకొని వ్యాఖ్యానిస్తున్నారు. విభజన వాదులైతే ఈ సమ్మె ఒక బ్రహ్మాండమైన విజయంగా, జనజీవనాన్ని స్థంభింపజేసి, వత్తిడి అలలు ఢిల్లీ తీరాన్ని తాకేలా చేసిన, ఎదురులేని మహోజ్వల ప్రజా ఉద్యమంగా భావిస్తున్నారు. సమైక్యవాదులేమో ఇది పదేళ్ళ నుండీ సాగుతున్న రాజకీయ చదరంగంలో మరో ఎత్తుగా, చివరికి తనంతట తాను నీరు కారిపోక తప్పని ఎత్తుగడగా ఉపేక్షించి వదిలేస్తున్నారు.

ప్రజల ప్రాథమిక హక్కుల్ని నేలరాసే ఉద్యమాలు ప్రజాస్వామికమెలా అవుతాయంటూ మధనపడే మేధావులు, ఈ సమ్మెవల్ల మొత్తానికి నష్టపోయేది తెలంగాణ ప్రజలేనని, తమ కాలు తామే నరుక్కుంటున్నారనీ ఆవేదన చెందే మేధావులు అదే మాట బయటకు చెప్పడానికి సాహసించడం లేదు. విభజనవాద మేధావులైతే ఇంత పెద్ద ప్రజాందోళనలు చేస్తున్నా ఉద్యమాన్ని క్రూరంగా అణచివేయజూస్తున్నారని ఆరోపిస్తున్నారు. వీరెవ్వరితోనూ సంబంధంలేని స్వేచ్ఛావాదుల దృష్టికోణం పూర్తి భిన్నంగా ఉంది. అదేమిటో చూద్దాం.

పేరుకు సకలజన సమ్మె అయినా, అందులో సకల జనులూ భాగస్వాములు కాలేదు. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ఆర్టీసీ, సింగరేణి కార్మికులే తప్ప ప్రైవేటురంగం మొత్తంగా సమ్మెకు దూరంగా ఉంది. ఉద్యమ నాయకుల ఒత్తిళ్ళ కారణంగా ఆటో డ్రైవర్లు, పేపరు బాయ్స్, దూర ప్రాంతాలకు వెళ్ళే ప్రైవేటు వాహనాలు లాంఛనప్రాయంగా ఒకరోజు పనిమానేసినా అది పెద్ద లెక్కలోనిది కాదు. స్వచ్ఛందంగా చేసేది సమ్మె. బలవంతాన చేయించేది గూండాయిజం. ప్రభుత్వోద్యోగుల్లో ఎంతమంది, ఎంత మేరకు స్వచ్ఛందంగా సమ్మె కొనసాగిస్తున్నారో...; ఆఫీసుకు హాజరైతే సహోద్యోగుల తిట్లు, ఛీత్కారం, ఉద్యోగ సంఘ నాయకుల బెదిరింపులు, దాడులకు జడిసి ఇంట్లో కూర్చుంటున్నారో చెప్పడం కష్టం.

సెక్రటేరియట్ ఉద్యోగులు ప్రయాణించే బస్సులను అడ్డుకుని అద్దాలు పగులగొట్టడం; పన్లోకి వెళ్తున్న సింగరేణి కార్మికులను బెదిరించడం దీనికి దృష్టాంతాలుగా చెప్పుకోవచ్చు. అదీగాక గత అనుభవాల దృష్ట్యా, ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నిరోజులు సమ్మెచేసినా ఏమీ కాదనీ, తమ జీతాలు ఏదోనాటికి రాకుండా పోవనీ, సమ్మె విరమణ విషయంలో సంధికి షరతుల్లో అదొక ముఖ్యమైన షరతు అవుతుందని భావించడమే– సమ్మె కొనసాగింపుకు ముఖ్యకారణం కావచ్చు. ఇది ప్రైవేటు రంగంలో సాధ్యపడదు. ప్రైవేటు రంగం – వినియోగదారుని దయాదాక్షిణ్యాలపై బతుకు తుంది. లాభాల సంగతి తర్వాత, తమ వస్తువులను, సేవలను అమ్ముకుంటే తప్ప తమ ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేరు. ఈ విషయం యజమానులకు, ఉద్యోగులకు కూడా తెలుసు. కానీ ప్రభుత్వాలకు అలాంటి అనివార్యత ఏమీ లేదు. వ్యాట్‌ను ఇంకో శాతం పెంచి సమ్మెవల్ల జరిగిన నష్టాన్నంతా పూడ్చుకోగల సౌలభ్యత... ప్రభుత్వానికి మాత్రమే ఉంది. ఈ సకల జన సమ్మె ప్రయోగశాలలో స్పష్టంగా నిరూపణ అయిన విషయాల కొద్దాం.

ప్రజా రవాణాలో గుత్తాధిపత్య సంస్థగా, లాభనష్టాలతోను, వినియోగదారుల సంతృప్తి, అసంతృప్తిలతో సంబంధం లేకుండా నడుస్తున్న ఆర్టీసీకి ఇన్నాళ్ళుగా ఇచ్చిన ప్రత్యేక ప్రతిపత్తిని తొలగించాల్సిన అవసరాన్ని ఈ సమ్మె తెలియజేసింది. నగరంలో సిటీబస్సులు లేకపోవడంతో ఆటోలు లాభపడ్డాయి, ప్రజలు తమ వ్యక్తిగత వాహనాలు బయటకు తీశారు, ట్రాఫిక్ రద్దీ ఏ మాత్రం తగ్గలేదు. సెట్విన్ బస్సులు తిరుగుతూనే ఉన్నాయి. ఆర్టీసీని ప్రైవేటీకరించాల్సిన అవసరం లేదు, ప్రజారవాణా వ్యవస్థలో ప్రైవేటు రంగాన్ని అనుమతిస్తే చాలు, చీటికి మాటికి బందుల కారణంగా ప్రజలు ఇబ్బంది పడాల్సిన పని ఉండదు. విమానయాన రంగంలో ప్రైవేటు కంపెనీలను అనుమతించడం

వల్ల ఛార్జీలెలా తగ్గాయో, కొత్త రూట్లలో విమానాలు, లక్షల ఉద్యోగాల సృష్టి ఎలా జరిగాయో రోడ్డు రవాణా రంగంలో కూడా అదే జరుగుతుంది. ప్రమాదాలు పెరుగుతాయని, ఛార్జీలు పెంచుతారని, నష్టాలొచ్చే రూట్లలో నడపరని ప్రైవేటు రంగంపై వ్యక్తం చేసే అనుమానాలు అహేతుకం. ప్రైవేటు విమాన సంస్థల్లో ప్రమాదాలు పెరిగాయా? ఎయిరిండియాలోనే నకిలీ పైలట్లున్నట్లుగా గుర్తించారు. ఇరవైయ్యేళ్ళ క్రితం ఇండియన్ ఎయిర్‌లైన్స్ వసూలు చేసిన ఛార్జీకీ ఇవాళ కూడా ప్రయాణించగలగడం ప్రైవేటీకరణ చలవే.

ఆటోలు, జీపులు పెరగడంతో ఆర్టీసీ కూడా అనేక గ్రామీణ రూట్ల నుంచి బస్సులను ఉపసంహరించుకుంది కదా! ఆర్టీసీ కొచ్చే నష్టాలన్నీ ప్రజలే భరించాల్సి వస్తోంది కదా! వినియోగదారులకు సేవలందించడంలో ఆర్టీసీ ఏనాడూ సృజనాత్మకత చూపలేదు. దూరప్రాంత బస్సులు శివారు కాలనీలకు వెళ్ళడం, ఏసి, వాల్వో, స్లీపరు బస్సులు, కంప్యూటర్ రిజర్వేషన్ – ఇవన్నీ ప్రైవేటు రంగం ప్రవేశపెట్టగా, ఆర్టీసీ వాటిని అనుకరించింది. భయపడుతూ, దొంగతనంగా, దారిపొడుగునా మామూళ్ళిచ్చుకుంటూ నడిపేవారే ఇన్ని కొత్త సేవలందిస్తూంటే, అదే అధికారికంగా అనుమతించి, జెట్, కింగ్‌ఫిషర్ లాగా తమ బ్రాండును ప్రకటించుకుని, పెద్ద యెత్తున నడపనిస్తే, ఒకరితో ఒకరు పోటీపడి తక్కువ ధరలకే ఎక్కువ సేవలు, సౌకర్యాలు అందజేస్తారనడం అతిశయోక్తి కాదు.

అలాగే, సింగరేణికి సమాంతరంగా కొత్త బొగ్గు గనులను ప్రైవేటు రంగానికి అప్పజెబితే సమ్మెల భయమూ, బందుల బెడదా ఉండదు. ఇప్పటికంటే ఎంతో తక్కువ ధరకే బొగ్గు లభ్యమవుతుంది. విద్యుత్ ఛార్జీలు తగ్గుతాయి. బొగ్గుగనులను రాజకీయ మాఫియాలకు కట్టబెడితేనే ప్రమాదాలు పెరిగేది.

స్వేచ్ఛా వాతావరణంలో పారదర్శకంగా, బహిరంగ వేలం ద్వారా గనులను కేటాయిస్తే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, ప్రావీణ్యతతో నడిచే కంపెనీలు పోటీపడి ఉత్పత్తి వ్యయం తగ్గుతుంది. అలాగే విద్యుదుత్పత్తి, పంపిణీలను కూడా ప్రైవేటీకరిస్తే కరెంటు కోతలు, లోవోల్టేజీ సమస్యలు శాశ్వతంగా దూరమవుతాయి. అమ్మో, రేట్లు పెంచేస్తారేమోనని భయపడాల్సిన పనిలేదు. ప్రవేశ నిబంధనలు లేకుండా పోటీ వాతావరణాన్ని అనుమతించిన ఏ ప్రైవేటు రంగమైనా ధరలు తగ్గించిందే గానీ పెంచలేదు.

ఇకపోతే ప్రభుత్వోద్యోగులు. ఈ సమ్మెతో ప్రభుత్వపు అనవసరాన్ని, చేతగాని తనాన్ని ప్రజలు పూర్తిగా గుర్తించారు. మంత్రులే ఒకరి మీద ఒకరు దుమ్మెత్తి పోసుకోవడం, ప్రభుత్వం మీద ధ్వజమెత్తడం, ధర్నాలకు దిగి అరెస్టవడం చూస్తుంటే సెలవల్లో పిల్లలు

ఆడుకుంటున్నట్లుంది. ఉద్యోగుల సమ్మెవల్ల ప్రజలకొచ్చిన ఇబ్బందేం లేదు. కాకపోతే వాహనాల రిజిస్ట్రేషన్, పన్ను కట్టించుకోవడం, పర్మిట్లు జారీ, భూములు రిజిస్ట్రేషన్‌లు, జనన, మరణ, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల జారీ ఆగిపోయాయి. వీటన్నిటినీ ప్రభుత్వ గుత్తాధిపత్యం నుండి తొలగించి, ఈ – సేవలాంటి ప్రైవేటు సంస్థలకు బదలా–యించాల్సిన అవసరం కొట్టొచ్చినట్టు కనబడుతోంది. ఆశ్చర్యపోనవసరంలేని విశేషమేమిటంటే – రవాణా శాఖ సిబ్బంది ఆఫీసులకైతే రావడం లేదు గానీ, తెల్లవారు జామున ఊరి బయట, సరిహద్దు చెక్‌పోస్టుల్లో అక్రమ వసూళ్ళు మాత్రం ఆపలేదు. దానికి ఏ సెంటిమెంటూ, ఆత్మగౌరవం,ఉద్యమ ఉద్వేగం అంటవు.

పట్టుమని పదిమంది కూడా లేని యువకులు జండాలు పట్టుకుని రద్దీగా ఉండే జంక్షన్‌లో వేలాది వాహనాలను గంటల తరబడి నిర్బంధించడాన్ని ప్రజాస్వామ్య హక్కుంటారో; లేక, ప్రాథమిక హక్కుల హననమంటారో; ప్రజల హక్కుల్ని కాపాడలేని ఈ ప్రభుత్వాన్ని, దాని వ్యవస్థలను పన్నులు కట్టి, మేపి, పోషించాలో, అక్కర్లేదో ప్రజలే నిర్ణయించుకోవాలి. ప్రభుత్వ ఆఫీసులలోకి వెళ్ళి పనిచేస్తున్న సిబ్బందికి ఆకుకూర కట్టచూపించి, దాన్ని గోంగూర అన్నవాళ్ళను ఆంధ్రా ఉద్యోగులుగా, పుంటికూర అన్నవాళ్ళను తెలంగాణ వారిగా గుర్తించే ఉద్యమ ప్రక్రియ నాజీయిజాన్ని తలపిస్తోంది. ఊచకోతల ఊహలకు ఊతమిస్తోంది. ఈ కాలంలో, సభ్యత గల సమాజంలో ఇంత బహిరంగ వివక్షకు పాల్పడుతున్న విషయాన్ని ఎండగట్టకపోగా, మీడియా దాన్ని ఒక జోక్‌గా తీసుకోవడం అత్యంత విషాదకరం. ఇది ఉద్యమమా, ఉన్మాదమా?

02-10-2011

...మాటలకు అర్థాలే వేరులే

ఉద్యమ సందర్భాల్లో ముందుగా బలయ్యేది భాష. పదాలకు అర్థాలు మారిపోతాయి. అవాస్తవాలు నిజాలవుతాయి. భావాలకు నిర్వచనాలు పునర్లిఖించ బడతాయి. ఈ భావగందరగోళంలో కొట్టుకుపోతూ నిజమేమిటో... అబద్ధమేమిటో... వాస్తవమేదో... కల్పితమేదో అర్థం చేసుకోలేని అస్పష్టతకు గురవుతాం. ప్రాథమికంగా అహేతుకాలైన గుంపు, తెగ, వర్గ మనస్తత్వాలు, అస్తిత్వాల ఆధ్వర్యంలో జరిగే ఉద్యమాల్లో ఈ ధోరణులు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. ఏ ఉద్యమంలోనైనా మీడియా తటస్థంగా ఉండదు. ఏదో ఒక వైపు వాదాన్ని భుజానేసుకుంటుంది. కాబట్టి మీడియాలో వచ్చే ప్రతి సమాచారాన్ని, కథనాన్ని స్వయంగా ఆలోచించాకే దాన్ని పూర్తిగానో, పాక్షికంగానో నమ్మాలో వద్దో నిర్ణయించుకోవాల్సిన బాధ్యత పాఠకులది, వీక్షకులదీ. అలాంటప్పుడు మీడియా ప్రతినిధులు తామే స్వయంగా ఉద్యమంలో భాగస్వాములైన ప్రస్తుత పరిస్థితుల్లో వాస్తవాలకు మీడియా చేసే వక్రీకరణను ఇంకా జాగ్రత్తగా గమనించాల్సి ఉంటుంది.

ఉద్యమ నిఘంటువుల ప్రకారం జాగో, భాగో అన్నది బెదిరింపు కాదట. కేవలం ప్రాంతీయ నుడికారమట. సెలవులకు ఇంటికెళ్తున్న వాళ్ళను పూటల తరబడి నడిరోడ్డు మీద నిలిపివేయడం శాంతియుత ఉద్యమమని సెలవిస్తారు. రోడ్డు పొడవునా బస్సులు, కార్లపైన రాళ్ళేసి అద్దాలన్నీ పగలగొట్టడం కూడా 'శాంతియుత'మేనట. మతి కోల్పోయి, గతి తప్పిన కొందరు యువకులు చేసిన తొందరపాటు పనులను తప్పు అని ఖండించాల్సింది పోయి, అది మఫ్టీలో ఉన్న పోలీసుల పని అని గౌరవ ప్రొఫెసర్లు వ్యాఖ్యానించడం వాస్తవాలను ఏమేరకు వక్రీకరిస్తున్నారో సూచిస్తుంది. రైళ్ళు నడవకుండా ఆపడం శాంతియుతమైన ఉద్యమమట. అది ఉద్యమకారుల హక్కట. సమ్మె విరమించిన ఆర్టీసీ కార్మికులు బస్సులు నడపడం కవ్వింపు చర్యట. కాబట్టి వాటిని ధ్వంసం చెయ్యడం

సబబేనట. రైళ్లు, బస్సుల్లో ప్రయాణించదలచిన వ్యక్తుల హక్కుల మాటేమిటి? (మన పిచ్చిగానీ, వ్యక్తులకు హక్కులెక్కడేడ్చాయి? హక్కులు కేవలం గుంపులు, మూకలకు మాత్రమే ఉంటాయి!!)

ఈ స్వభావం, ఇలా వాదించే విధానం – ప్రస్తుతం నడుస్తున్న ఉద్యమం ఒక్కదానికే పరిమితం కాదు. ***మూక హక్కుల కోసం చేసే ఏ ఉద్యమంలోనైనా ఈ లక్షణాలను చూస్తాం. మూకకు ప్రాతిపదిక ప్రాంతం, కులం, ఉపకులం, మతం, వర్గం – ఏదైనా కావచ్చు... కాలరాయబడేవి మాత్రం వ్యక్తి హక్కులే. బడులు, కాలేజీలు బలవంతాన, బెదిరింపులతో మూసేయిస్తారు. చదువుకుందామనుకునే విద్యార్థుల భవిష్యత్తును బుగ్గి చేస్తారు. ఇదేమి అన్యాయమని ప్రశ్నించిన వాళ్ళను ఉద్యమ విచ్ఛిన్నకారులని నిందిస్తారు. రెచ్చగొట్టవద్దని హెచ్చరిస్తారు. మనిషి మౌనంగా ఏడవడం తప్ప చేయగలిగిందేమీ లేదు. ఈ అసహాయతల నుండి మనిషిని కాపాడ్డానికి, మనిషి హక్కులను రక్షించడానికి బోలెడు పన్నులు కట్టి ఏర్పరచుకున్న ప్రభుత్వాలు ఏం చేస్తున్నట్టు?***

శూన్యం. అసలీ మూకలను పెంచిపోషించేదే ప్రభుత్వాలు కావడంతో ఈ మూకల హింసను ఆపగలిగే మానసిక, నైతిక స్థైర్యం ప్రభుత్వాలు కోల్పోయాయి. ప్రజలను పలువర్గాలు, తెగలు, ప్రాంతాలు, కుల మతాలుగా విడగొట్టి, రాజకీయ అవసరాల మేరకు ఒకరిమీద ఒకరిని ఎగదోసి పబ్బం గడుపుకునే వాళ్ళు ఏ మొహం పెట్టుకుని ఈ అరాచకాన్ని ఆపగలరు?

మిశ్రమ ఆర్థిక వ్యవస్థ రకరకాల గుంపులను తయారుచేస్తుంది. పన్నుల ద్వారా వసూలుచేసిన అపారమైన డబ్బును కొన్ని గుంపులకు ఎక్కువ మొత్తంలో వెదజల్లి, లేదా వెదజల్లుతామని హామీలిచ్చి, ఓట్లేయించుకుని, అధికారం హస్తగతం చేసుకుంటారు. కొన్నిరోజుల తర్వాత ఇతర గుంపుల్లో అసహనం, వ్యతిరేకత మొదలవుతుంది. వారిని సంతుష్టులను చెయ్యడానికి మరికొన్ని ఎంగిలి మెతుకులు విదిలిస్తారు. ఎన్నిపాట్లు పడినప్పటికీ అన్ని గుంపులను, గుంపుల్లోని అందరినీ తృప్తిపరచడం ఏ పార్టీ, ఏ ప్రభుత్వం వల్లా కాదు. అందుకే అప్పుడప్పుడు ప్రభుత్వాలు, పాలకులు మారుతుంటారు. కానీ గుంపుల మధ్య రగిల్చిన అసూయలు, కక్షలు అలాగే ఉండిపోతాయి. మందబలంతో ప్రభుత్వాన్ని ఉపయోగించుకుని ఎక్కువ లబ్ధి ఎలా పొందాలా అన్న కొట్లాటలే తప్ప; వ్యక్తుల మధ్య ఏ గొడవలూ ఉండవు. ఈ రకమైన ఉద్యమాల్లో అంశాలు, డిమాండ్లు, కోపాలు, అసూయలు, ద్వేషాలు ప్రభుత్వ పెత్తనంలో నడిచే విషయాల చుట్టూనే తిరుగుతుంటాయి. ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రభుత్వం చేసిన భూపందేరాలు, మంత్రి పదవులు,

అడ్వకేట్ జనరల్ నియామకాలు, ప్రాజెక్టులు, కాంట్రాక్టులు, నువ్వెంత తిన్నావు, నాకెంత పెట్టావు – ఉద్యమాలన్నీ ఈ విషయాల చుట్టే పరిభ్రమిస్తాయి. ప్రైవేటు రంగంలో ఇవేవీ కానరావు. ఆటోల జేఏసీ నాయకుడైనా, ప్రయాణీకుణ్ణి తనదే ప్రాంతం అని అడగడు. వైద్యానికి వెళ్లినప్పుడు డాక్టరుది ఏ ప్రాంతం అని చూడం, మంచి వైద్యుడా కాదా అని మాత్రమే చూస్తాం. కానీ ఒకసారి ఉద్యమం మొదలయ్యాక అసహాయ స్థితిలో ఉండే ప్రైవేటురంగం మీదే పడతారు, పడ్డారు కూడా. నిధుల సమీకరణకు పాడి ఆవులాంటి ప్రైవేటురంగం సిద్ధంగా కనబడింది. ఎవరికి వారు, పాలు పోస్తే మనల్ని కరవదులే అన్న అమాయకత్వం తోనో, లేక అందరూ పోస్తున్నప్పుడు తామొక్కరమే పాలు పొయ్యకపోతే పగబడుతుందేమో అన్న సంశయంతోనో శక్తి మేరకు, భయం మేరకు ధారపోశారు.

పాముల సంఖ్య వందలు, వేలు, లక్షల్లోకి చేరిపోయింది. ఇప్పుడందరూ చెట్టెక్కి కూర్చుని ఏదో ఒక వరదొచ్చి పాములన్నీ కొట్టుకు పోవాలన్న ఆశతో బిక్కు బిక్కుమని ఎదురు చూస్తున్నారు. కానీ వరదొచ్చినప్పుడు పాములతో పాటు అమాయకులు కూడా కొట్టుకుపోతారు. ప్రతి ఉద్యమకారుడు ఈ పాడి ఆవును ఒట్టిపోయే దాకా పిండుకునే వాడే.

ఈ విపరీత ధోరణులు ఈ ఒక్క ఉద్యమానికే పరిమితం కావు, మళ్ళీ మళ్ళీ వస్తూనే ఉంటాయి. ఈ ఉద్యమాన్ని ఎవరు, ఎందుకు, ఎప్పుడు, ఎలా మొదలెట్టారో, కాలక్రమేణా ప్రజలను ఎంత తప్పుదారి పట్టించి విద్వేషాల్ని రగిల్చారో – కాస్త తెలివున్న వారందరికీ తెలుసు. ఎవరికి వారు తమ రాజకీయ ప్రయోజనాల కోసం ఎలా పరితపిస్తున్నారో స్పష్టంగా కనబడుతూనే ఉంది. చివరికి ఎలాంటి ముగింపు వచ్చినా, జనబాహుళ్యానికి ఒనగూడేదేమీలేదని ఉద్యమ నాయకులు, మేధావులు, మీడియాలతో సహా అందరికీ తెలుసు. కానీ ఎవరూ నోరు విప్పి నిజం పలికే స్థితిలో లేరు.

తమ వ్యక్తిగత జీవితాల్లోని కష్టాలకు, అనిశ్చితాలకు ఎవరు కారణమో, ఎవర్ని నిందించాలో తెలియని అమాయక జనం – ఒకరిని ఒకరు వేలెత్తి చూపుకుని ఆత్మ సంతృప్తి పొందుతున్నారు. లక్షల్లో ఉద్యోగాలు సృష్టిస్తామంటున్న నాయకుల మాటలకు గొర్రెల్లా తలూపుతున్నారు. ప్రస్తుతం జనాభాలో ఒకటి, రెండు శాతం ఉన్న ప్రభుత్వోద్యోగుల జీతభత్యాలకే వేలకోట్లు పన్నులుగా కడుతున్నాం. ఇంకొన్ని వేలకోట్లు లంచాలుగా సమర్పించుకుంటున్నాం. ఇది చాలదన్నట్టు మరో ఒకటి, రెండు శాతం ప్రభుత్వోద్యోగాలు సృష్టిస్తే, వాళ్ళ జీతాలు మనమే కదా చెల్లించాల్సింది? మనమెడకు మనమే ఉరేసుకుందామా? ఆ ముగ్గురు, నలుగురిని మేపడానికి తొంభై ఆరు మంది కష్టపడి,

సంపాదించి, పన్నులు కట్టాలి. ఎక్కువ మంది ప్రజలు ఆ తొంభై ఆరుమందిలోనే ఉంటారు కదా! అయినా ఆ ఉద్యోగాలన్నీ తమకో, తమ పిల్లలకో మాత్రమే వచ్చిపడతా యన్న పిచ్చి ఆశలతో ఉద్యమం పేరిట శివాలెత్తుతున్నారు.

ప్రభుత్వాల నిష్క్రియాపరత్వంతో, గూండాల జాగీరుగా సమాజం మారింది. అబద్ధపు ప్రచారాలతో, వాస్తవాల వక్రీకరణలతో, మొగుణ్ణి కొట్టి మొగసాల కెక్కడమే మేధావి తనంగా చెల్లుబాటవుతోంది. ఇటువంటి మూక, మూఢ వాదనల ప్రాతిపదికగా విభజనలు జరిగితే; నాజీ ఊచకోతలను తప్పించుకోగలరా? ఆ అరాచకాన్ని ఆపే నైతికస్థాయి ఏ నేతలకైనా ఉందా? అది వ్యక్తుల హననానికి, సమాజ పతనానికి దారితీయడం ఖాయం. సామాజిక, భౌగోళిక, ఉపప్రాంతీయ, కుల, ఉపకుల, మత ప్రాతిపదికలపై మరిన్ని కొత్త మూకలు, ఉద్యమాలు, సెంటిమెంట్లు, ఆత్మ గౌరవాలు, అల్లర్లు తప్పవు.

ఈ పరిస్థితుల్లో వ్యక్తులకు దారేది? అరాచక పరిస్థితుల్లో తమను తాము రక్షించుకునే మార్గమేది? స్వీయ రక్షణ కోసం ఆయుధాలు ధరించడం, ఉపయోగించడం వ్యక్తుల ప్రాథమిక హక్కు. 1857 సిపాయిల తిరుగుబాటు తర్వాత భారతీయుల్ని క్రమంగా నిరాయుధుల్ని చేయడం కోసం తెచ్చిన చట్టాల వల్లే – ప్రతిమనిషీ స్వీయరక్షణ కోసం ప్రభుత్వాన్ని దేబిరించాల్సి వస్తోంది. స్వాతంత్రోద్యమ సమయంలో, ముఖ్యంగా జలియన్ వాలాబాగ్ మారణకాండ తర్వాత ఇంకాస్త కఠినంగా అమలుచేసిన ఆయుధ చట్టాలను గాంధీజీ కూడా వ్యతిరేకించారు. భారత ప్రజల్ని నపుంసకులుగా చేస్తున్నారని దుయ్య బట్టారు. *కానీ, స్వాతంత్ర్యం వచ్చాక – నల్లదొరలు ఆ చట్టాలను ఇంకా కఠినతరం చేసి, వ్యక్తిగత రక్షణ కోసం పూర్తిగా ప్రభుత్వాల దయాదాక్షిణ్యాలపై ఆధారపడేలా చేశారు. దాని ఫలితమే నేటి అభద్రతా పరిస్థితులు. ప్రతి మూకా వ్యక్తుల్ని నిర్భయంగా బెదిరించ గలుగుతోంది. తనను తాను రక్షించుకోలేని మనిషి స్వేచ్ఛాజీవి కాదు, బానిస మాత్రమే. ఓట్ల కోసం మూకలను తయారుచేసి వాళ్ళు కొట్టుకుచస్తుంటే గుడ్లప్పగించి చూస్తూ, ఏం చేస్తే ఎన్ని ఓట్లు పోతాయోనని లెక్కేసుకునే ప్రభుత్వాల మీద ఆధారపడడం బుద్ధిహీనత అవుతుంది. ఎవరి స్వీయ రక్షణ వారే చూసుకోవాల్సిన సమయం వచ్చింది. ఆ హక్కు ఎవరూ కాదనలేనిది.*

16-10-2011

భవిష్యత్తుపై బెంగ

సకలజనుల సమ్మె ముగిసిందనుకున్నా... లేక వాయిదా పడిందన్నా...; ప్రస్తుతానికి కొంత ప్రశాంత వాతావరణం ఏర్పడింది. సమ్మె జరిపిన తీరు, అందులో పాల్గొన్న వారెవరు, ఎందరు, ఎవరికి ఎంత నష్టం జరిగింది, ఎవరు లాభపడ్డారు అన్న విషయాలపై రకరకాల భాష్యాలు వినపడడం అనివార్యం. వాస్తవాలు చూస్తే; ఎన్ని రోజులు పని ఎగ్గొట్టినా తమకు వ్యక్తిగతంగా నష్టం లేని వర్గాలే సమ్మెను సాగదీశాయి. దీనివల్ల వివిధ వృత్తుల్లోని ప్రైవేటు వ్యక్తులకు, అసంఘటిత వర్గాలకు, తద్వారా రాష్ట్రం మొత్తానికి జరిగిన నష్టం అపారం, అది ఎవరూ పూడ్చలేనిది.

బొగ్గు కొరత కారణంగా మన రాష్ట్రమే కాక; పొరుగున ఉన్న దక్షిణాది రాష్ట్రాలు కూడా భారీగా నష్టపోయాయి. విపరీతమైన కరెంటు కోతలతో అల్లాడిన మన రాష్ట్రంలోనయితే కోల్పోయిన ఉత్పత్తిని లెక్కించడం కూడా కష్టం. ఆర్థిక నష్టం మాత్రమే కాక, చెప్పిన సమయానికి సరుకు అందజేయలేకపోవడంతో ఫార్మా, రసాయన, ఇంజనీరింగ్ ఉత్పత్తుల రంగాలు తమ కస్టమర్ల వద్ద నమ్మకం, విశ్వసనీయత కోల్పోవాల్సి వచ్చింది. టెక్నాలజీ, రవాణా వ్యవస్థలు ఆధునికమై, విపరీతమైన పోటీ వాతావరణం కారణంగా, యంత్రాలు, వినియోగ వస్తువులు తయారుచేసే వారందరూ ఏ గంటకు కావలసిన ముడిసరుకు అప్పుడు దించుకునే వ్యవస్థ ఏర్పడింది. నెలల తరబడి ఉత్పత్తికి కావలసిన ముడి సరుకు ఎవరూ తమ దగ్గర పేర్చి పెట్టుకోవడం లేదు.

ఈ పరిస్థితుల్లో ఒక్కరోజు రవాణా...లేదా.... ఉత్పత్తి స్తంభించినా కూడా – ఉత్పత్తి గొలుసు కట్టుమీద తీవ్రమయిన దుష్ప్రభావం చూపుతుంది. అలాంటిది నెలరోజుల పాటు జరిగిన సమ్మెతో ఉత్పత్తి రంగం పడినపాట్లు వర్ణనాతీతం. పోయిన కాలం తిరిగిరానిది. ముఖ్యంగా విద్యార్థులు, ప్రతిరోజూ పది, పదిహేను గంటల బోధన, చదువు ఆటంకాలు లేకుండా కొనసాగితే తప్ప జాతీయ స్థాయిలో జరిగే పరీక్షల్లో ర్యాంకులు సాధించలేని

పరిస్థితి. అలాంటిది కనీసం ఇరవై, ఇరవై అయిదు రోజులు చదువు కోల్పోయిన విద్యార్థులు ఎలా కోలుకుంటారు? తెలంగాణ కాలేజీలు బందుపెట్టారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల విద్యార్థులకు, ఇతర రాష్ట్రాల్లోని విద్యార్థుల చదువుకు ఏ విఘాతమూ లేదు. దీంతో నష్టపోయిందెవరు? పోటీ పరీక్షల్లో తెలంగాణ విద్యార్థులకు జరిగే నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారు? పూనకంతో ఊగిపోతూ కేజీ నుండి పీజీ దాకా విద్యాసంస్థల నిరవధిక బందుకు ఏ ఆచార్యులు ఏ అధికారం, ఏ నైతిక హక్కుతో పిలుపునిచ్చారు?

అలాగే కరెంటు కోతల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు ఎవరు, ఏవిధంగా పరిహారమివ్వగలరు? అధికారికంగా ఆరుగంటలు కరెంటిచ్చినట్లు చెప్పినా, అది అయిదారు విడతల్లో, పూర్తిగా రాత్రివేళల్లో ఇచ్చి, పొట్టమీదున్న పంటలను ఎండగట్టిన పాపం ఎవరిది? ఇప్పటికే ప్రతిదానికీ ప్రభుత్వాన్ని అడుక్కోవాల్సిన స్థితికి దిగజారిన రైతులు – ఇకనుంచి, తమను కాపాడమని ఉద్యమ నాయకులను కూడా అడుక్కోవాలా?

ఈ సకలజనుల మీద సమ్మె వల్ల రాష్ట్రవ్యాప్తంగా నష్టపోయారు. ఒక కంటికి దెబ్బతగిలితే రెండు కళ్ళలోనూ నీరుబుకుతుందని రుజువైంది. దీన్ని ఆపడమో, వాయిదా వెయ్యడమో ఎందుకు చేశారన్న చర్చ కంటే; భవిష్యత్తులో మళ్ళీ ఇలా జరగదని నమ్మకం లేకపోవడమే భయాందోళనలకు గురిచేస్తోంది. పోలవరం టెండర్లకూ, సమ్మె నిలుపుదలకు సంబంధం ఉందో లేదో గానీ, ముందు ముందు ఇంకెవరన్నా ఇలాగే ఉద్యమాలు లేవదీసి, సమాజాన్ని బ్లాక్‌మెయిల్ చేసి, ప్రభుత్వాలను బెదిరించి సొమ్ము చేసుకోరనే గ్యారంటీ అయితే లేదు. ఇలాంటి ఉద్యమాలకు ఉచిత శలభాలుగా మారుతున్న వ్యక్తులు ఆత్మపరిశీలన చేసుకోవాలి. వారి ఆలోచన, రాజకీయ విశ్లేషణలో తీవ్రమైన మార్పులొస్తే తప్ప, ఇటువంటి పరిస్థితుల నుంచి సమాజం బయటపడదు.

ఏదైనా సంక్లిష్టమైన రాజకీయ ప్రశ్న ఎదురైనప్పుడు; దాన్ని – నైతికత అనే గీటురాయి మీద పరీక్షించి చూడాలే తప్ప, ప్రజాస్వామ్యం, మెజారిటీ వాదనల త్రాసులో తూయకూడదు. అలా తూస్తే అది చాలా ప్రమాదకరమైన పరిణామాలకు దారితీస్తుంది. ఉదాహరణకు, ప్రజాస్వామ్యం, మెజారిటీ వాదనలే ప్రామాణికాలయితే జర్మనీలో యూదుల ఊచకోత, గుజరాత్ మారణకాండ, కాంధమాల్‌లో క్రిస్టియన్ ఫాదరీల సజీవదహనం – వీటన్నిటికీ మెజారిటీ ప్రజల మద్దతు ఉంది. కాబట్టి తెలంగాణ అయినా, రాయలసీమ, ఉత్తరాంధ్ర అయినా ప్రతి విభజన వాదాన్నీ నైతికత దృష్ట్యా పరిశీలించి, పరీక్షించాల్సిందే. ఇవాళ విభజన వాదులు చెబుతున్న తెలంగాణ ప్రజల స్వయం పరిపాలనాభిలాష రేపు హైదరాబాద్ ప్రజల స్వయంపాలనాభిలాషగా, తర్వాత ఆదిలాబాద్ మొదలుకుని ఏ జిల్లాకు ఆ జిల్లా, ఏ మండలానికా మండలం, చివరికి ఏ ఊరికావూరు స్వయం పాలనాభిలాషగా మారే అవకాశం లేకపోలేదు. అలా జరిగిన నాడు ఆ అభిలాషలను గౌరవిస్తామని, అంగీకరిస్తామని చెప్పగలిగిననాడు ప్రభుత్వమే మాయమవుతుంది. స్వేచ్ఛావాదులు కోరుకునేది కూడా అదే ఇందుకు, ఉద్యమకారులు సిద్ధమేనా, మరి?

అలా కాకుండా తెలంగాణపై పరిపాలనాధికారాలు తెలంగాణ వారికే ఉండాలనడం, దాని కోసమే విభజన కోరడం అస్పష్టం, అహేతుకం.

పరిపాలనాధికారాలు దేనికోసం? ప్రభుత్వ భూములు తమకిష్టమైన వాళ్ళకు కట్టబెట్టడానికా? ప్రభుత్వ పనుల టెండర్లన్నీ తనవారికే ధారపోయడానికా? దొంగల పేర్లు, ముఖాలు మారడం తప్ప; దోపిడీ తప్పనప్పుడు విభజన జరిగితేనేం, జరక్కపోతేనేం? భౌగోళిక తెలంగాణ, సామాజిక తెలంగాణ మీమాంసలు, ఉద్యమ నాయకత్వం కోసం ఎత్తులకు పైఎత్తులు చూస్తుంటేనే అర్థమవుతోంది – రాజ్యాధికార రొట్టెకోసం ఎన్ని కొట్లాటలు జరగబోతున్నాయో. ముఖ్యంగా రెండు విషయాల్లో స్పష్టత అవసరం. ఒక మిత్రుడన్నట్లు తెలంగాణ కావాలనుకునేవారు అధికారాభిలాషతో కాక, కేవలం వెనుకబాటుతనం పోగొట్టడానికే విభజన కోరుకుంటున్నారనుకుందాం. తెలంగాణ వెనుకబాటుతనానికి చారిత్రక కారణాలు కారణమా... లేక కోస్తా, రాయలసీమ ప్రాంతాలతో కలిసి ఆంధ్రప్రదేశ్‌గా ఏర్పడ్డం వల్ల వచ్చిందా? ఒకవేళ చారిత్రక కారణాల వల్ల ఉండుంటే, ఆంధ్రప్రదేశ్ అవతరణ తరువాత వెనుకబాటు తనం తగ్గిందా, పెరిగిందా? కళ్ళకు కనబడ్డమే కాక, గణాంకాలతో సహా రుజువై, ఆంధ్రప్రదేశ్ అవతరణానంతరం తెలంగాణలో జరిగిన అభివృద్ధికి కారకులెవరు? ఉమ్మడి రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుండి ప్రవహించిన నిధులు, మానవ వనరుల ప్రభావమెంత? ఈ విషయాల్లో శాస్త్రీయ ఆధారాలతో కూడిన స్పష్టత రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇక రెండోది – విభజనలు, విడిపోవడాలు కోరుకునే హక్కెవరికుంటుంది? ఏ పరిస్థితుల్లో ఉంటుంది? స్వేచ్ఛాభిలాషతో ఒక నియంతృత్వం నుంచి వేరుపడే అధికారం, హక్కు ప్రతి మానవుడికి, ప్రతి సమూహానికి ఉంటుంది. అంతే తప్ప ఒక నియంతృత్వం నుంచి ఇంకో నియంతృత్వంలోకి వెళ్ళేందుకు, ఒక లంచగొండి ప్రభుత్వం స్థానంలో ఇంకో లంచగొండి ప్రభుత్వం ఏర్పాటు చేసుకునేందుకు జాతీయత లేదా ప్రాంతీయతల్లాంటి అహేతుక ప్రాతిపదికలపై విభజన కోరుకునే హక్కు ఎవరికీ, ఎప్పటికీ ఉండదు. విభజన తర్వాత తెలంగాణలో ప్రజలకు పూర్తి స్వేచ్ఛనిచ్చి, ఎవరి బ్రతుకు వారిని బతకనిస్తారనే నమ్మకముంటే విభజనను సమర్థించొచ్చు. అంతే తప్ప ఇప్పుడున్న పాలకవర్గాల స్థానే కొత్త దొరల మోచేతి నీళ్ళు త్రాగుతూ బతకాల్సొస్తే, ఈ తెలంగాణ వద్దు, నీ రాజ్యం వద్దు, ఆ రాజ్యం వద్దు అని ప్రజలు గ్రహించాలి. స్వేచ్ఛకోసం త్యాగం చేసినా అర్థం ఉంది. కొత్త దొరల దగ్గర బానిసత్వం కోసం త్యాగాలు చెయ్యడం శుద్ధదండగ.

30-10-2011

అగోచర సత్యాలు

వాల్ స్ట్రీట్ వేడెక్కింది. గ్రీసు ఆర్థిక వ్యవస్థ పతనం అంచున ఉంది. పెట్రోల్ రేట్లు మళ్ళీ పెరిగాయి. ద్రవ్యోల్బణం పెరుగుతూనే ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరమే లక్షన్నర ప్రభుత్వ ఉద్యోగాలిస్తున్నట్లు ప్రకటించింది. తెలుగు చలన చిత్ర పరిశ్రమ సంక్షోభం నుంచి బయటపడేందుకు కొన్ని సూచనలు చేసింది. ఇవన్నీ భిన్న రంగాల్లో, వేర్వేరు దేశాల్లో జరుగుతున్న పరిణామాలు. ఎక్కడన్నా ఒక భూకంపమో, వరదో వస్తే అయ్యో పాపం అనుకుంటాం. కష్టాల్లో ఉన్నవారికి తోచిన సాయం చేస్తాం. ఒక్కసారితో పోతుంది.

కానీ, మానవ జనిత పరిణామాలు, సమూహాల ఆలోచనా సరళులు మనకు తెలియకుండానే ప్రతిఒక్కరి జీవితాలనూ కాస్త ముందో, వెనుకో ప్రభావితం చేస్తాయి. ఎవరూ తప్పించుకోలేరు. కాబట్టి ఇటువంటి పరిణామాలను ప్రపంచ వ్యాప్తంగా గమనిస్తూ, వాటిని లోతుగా విశ్లేషించి, దేన్ని సమర్థించాలో, దేన్ని వ్యతిరేకించాలో ప్రతి ఒక్కరూ నిర్ణయించుకోవాలి. ఒడ్డున నించుని చూద్దాంలే అనుకుంటే కుదరదు.

ఇంత లోతుగా ప్రతిమనిషీ విశ్లేషించలేడు, అందుకే మేధావులు ఈ పనిలో మధ్యవర్తులుగా వ్యవహరిస్తారు. మేధావుల్లోనూ కొందరు ఒక భావజాల దృష్టి కోణంతోను, మరికొందరు దానికి విరుద్ధమైన భావజాలపు కళ్ళద్దాల్లోంచీ చూస్తారు. కనుక ఏ రకం మేధావుల వాదనలకు, విశ్లేషణలకు విలువివ్వాలనే నిర్ణయం వ్యక్తులే తీసుకోవాలి. ఈ విషయంలో డిగ్రీలు, ఆచార్యత్వం, పదవులు, వయసు, నేపథ్యం, నోబుల్ బహుమతులు చూసి అనుసరించి అనుకరించి బోల్తా పడితే; అది వ్యక్తుల వైఫల్యమే అవుతుంది.

అమెరికా వాణిజ్య సామ్రాజ్యానికి మారుపేరైన వాల్ స్ట్రీట్‌ని ఆక్రమించడమనే ఉద్యమం అక్కడి పలు నగరాల్లోనేకాక, అభివృద్ధి చెందిన ప్రపంచ దేశాలన్నిటికీ పాకింది. కార్పొరేట్ సంస్థల దురాశకు, ఆశ్రిత పెట్టుబడిదారీ విధానానికి, గుత్తసంస్థలపైన వ్యతిరేకత

వ్యక్తం చేస్తున్నారు. కొనుక్కున్న ఇళ్ళ విలువ పడిపోయి, నిరుద్యోగం, ద్రవ్యోల్బణాలతో సతమతమవుతున్న ప్రజల సొమ్ముతో కార్పొరేట్లు జల్సా జీవితం గడపడంపై పెల్లుబికిన ప్రజాగ్రహం సహేతుకమైనదే. కాకపోతే, గురి తప్పింది.

ఎలాగంటే, అమెరికా లాంటి అభివృద్ధి చెందిన దేశాల్లో ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలడానికి కారణం ప్రభుత్వాలు. ప్రజలను ఆకర్షించి మళ్ళీ మళ్ళీ అధికారంలోకి రావడానికి, అందరికీ ఇల్లు, అడిగినంత అప్పు, నిరుద్యోగ భృతి, ఉచిత వైద్యం లాంటి పనికిమాలిన పథకాలు పెట్టి, బ్యాంకు రుణాలు, డాలర్ల ముద్రణల ద్వారా డబ్బును గాల్లోంచి సృష్టించి – అయ్యవారిని చేస్తామన్న ఆర్థిక వ్యవస్థను – కోతిలా తయారు చేసింది ఆయా ప్రభుత్వాలే.

ఒక దశ దాటాక ఈ కృత్రిమ అభివృద్ధివాపు కుప్పకూలింది. ప్రభుత్వ కనుసన్నల్లో పనిచేసిన బ్యాంకులు, ఆర్థిక సంస్థలు దివాలా తీసే పరిస్థితి వచ్చింది. దివాలా తీయనీయకుండా, ప్రజల సొమ్ముతో వాటిని కాపాడింది ఈ ప్రభుత్వాలే. ఈ నిరంతర ప్రభుత్వ జోక్యాల వల్లే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కుదుట పడడం దేవుడెరుగు, పూర్తిగా కుప్పకూలే ప్రమాదం ముంచుకొస్తోంది. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాలకు, ఉద్దీపన పథకాలకు ఉదార ఆర్థిక స్వేచ్ఛావాదం బద్ధవ్యతిరేకం. ఆందోళనకారులు ఉద్యమించాల్సింది వాల్‌స్ట్రీట్ మీద కాదు. మధ్యతరగతి, పేద ప్రజల కష్టార్జితాన్ని లాక్కుని ఆశ్రితుల ఉద్దీపన కోసం వెచ్చిస్తున్న ప్రభుత్వాల మీద.

గ్రీసు ప్రభుత్వం ఆర్థిక దివాలా అంచున నిలబడింది. దానికి దారితీసిన పరిస్థితులు సుస్పష్టం. 17 దేశాల యూరో జోన్‌లో భాగమైన గ్రీసు అప్పుల బారిన పడింది. మొదటి నుంచి కొంత బలహీన దేశమైన గ్రీసు యూరో జోన్‌లో చేరాక మరింత బాధ్యతా రాహిత్యంతో వ్యవహరించింది. 17 దేశాలు ఒకే కరెన్సీని వాడుతున్నప్పుడు ఒకే ప్రమాణాలు పాటించాలి. అదొక ప్రాథమిక ఆర్థిక సూత్రం. కాగితాల మీద నిబంధనలున్నా, వాటి నెవరూ పాటించలేదు, పాటించాల్సిందేనన్న ఒత్తిడీ లేదు. రాజు గారింట్లో పెళ్ళికి పాలెందరు పోస్తారు? దీన్నే 'ఉమ్మడిలో ఉన్న విషాదం' (ట్రాజెడీ ఆఫ్ ది కామన్స్) అంటారు. యూరోపియన్ రిజర్వు బ్యాంకు కల్పించిన అతి తక్కువ వడ్డీ సదుపాయాన్ని అడ్డం పెట్టుకుని స్వదేశమే కాక ఇతర దేశాల ప్రజలు, బ్యాంకుల నుంచి గ్రీకు ప్రభుత్వం అడ్డగోలుగా రుణాలు తీసుకొని ప్రజాకర్షక పథకాలకు వెదజల్లింది. తీర్చాల్సి వచ్చేసరికి ప్రభుత్వం చేతులెత్తేసింది. ఇప్పటిదాకా అందుతున్న ఉచితాల పథకాలు వదులుకోడానికి ప్రజలు సిద్ధంగా లేరు. ఇంకా అప్పు చేద్దామంటే పుట్టే పరిస్థితి లేదు. పౌరుషానికి పోయి యూరో ద్రవ్య వ్యవస్థను కాపాడుకోవాలంటే, యూరో జోన్‌లోని

ఇతర (సంపన్న) దేశాలు గ్రీసు చేసిన అప్పుల్లో సింహభాగాన్ని నెత్తినేసుకోక తప్పదు. అంటే గ్రీకు ప్రభుత్వాల ప్రజాకర్షక పథకాలకు ఇతర యూరో దేశాల్లోని కష్ట జీవులు డబ్బు కట్టాల్సి వస్తోంది.

పెట్రోల్ ధరలు మళ్ళీ పెరిగాయి. తామేమీ చెయ్యలేమని ఆర్థిక మంత్రి సెలవిచ్చారు. డబ్బు లేమన్నా చెట్లకు కాస్తున్నాయా అని ప్రధాన మంత్రి నిలదీశారు. ద్రవ్యోల్బణం అదుపు తప్పుతోందని వాపోయారు. ఎంత అమాయకత్వం! వాస్తవమేమిటంటే ద్రవ్యోల్బణమనేది పూర్తిగా ప్రభుత్వాల పాపం.

ద్రవ్యలోటు, నోట్ల ముద్రణ, డిపాజిట్ల కంటే కొన్ని రెట్ల స్థాయిలో బ్యాంకుల ద్వారా రుణ వితరణలు – ఇవన్నీ ప్రభుత్వాలు చేసే పనులే. రైతులో, వ్యాపారులో, పారిశ్రామికవేత్తలో చెయ్యరు. చేసిందంతా చేసి, ఇంకా పాపం చేస్తూ.... మళ్ళీ ద్రవ్యోల్బణం అదుపులోకి రావడంలేదని మొసలి కన్నీరు కార్చడం దుర్మార్గం, దగా.

చమురు కంపెనీలన్నీ ప్రభుత్వరంగ సంస్థలే. అందువల్ల ఒకదానితో ఒకటి సమర్థతలో పోటీపడాల్సిన అవసరం వాటికి లేదు. అటువంటి పరిస్థితిలో పెట్రోలు ధర పెంపు అనివార్యమనడం అర్థరహితం. పెట్రోరంగాన్ని పూర్తిగా ప్రైవేటీకరిస్తే, సెల్‌ఫోన్ కంపెనీల్లా ధరలు తగ్గిస్తాయో, లేక అంతర్జాతీయ ముడి చమురు ధరల ఆధారంగా కొన్నిసార్లు పెంచడం, కొన్నిసార్లు తగ్గించడం జరుగుతుందో లేదో తెలుస్తుంది.

రాష్ట్రావతరణ దినోత్సవ సందర్భంగా ఈ సంవత్సరాంతం లోగా లక్షన్నర ప్రభుత్వ ఉద్యోగాలు, రాబోయే రెండేళ్ళలో మరిన్ని లక్షల ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించారు. దీనికి సంతోషించాలా, లేక కంగారు పడాలా? వాళ్ళందరి జీతభత్యాల ఖర్చులను పన్నుల ద్వారా మనమేకదా భరించాలి? ఈ ప్రభుత్వోద్యోగుల్లో ఎక్కువ భాగం ప్రజలకు పనికిరానివే. ప్రభుత్వ ఉద్యోగులు సోమరిపోతులు కారు. ప్రైవేటురంగంతో దాదాపు సమానంగా పనిచేస్తారు. కానీ అది ఎందుకూ ఉపయోగపడని పని.

ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతి లిఫ్టుకీ ఒక అంటెండరుంటాడు. ఆటోమాటిక్ లిఫ్టులొచ్చి దశాబ్దాలు గడుస్తున్నా ఆ ఉద్యోగాలు తొలగించరు. కనీసం వాళ్ళతో వేరే ఏదైనా పనికొచ్చే పని చేయించరు. అలాగే గణాంకాల సేకరణకు వేలాదిమంది. అన్నీ కాకి లెక్కలు. మళ్ళీ ఆ లెక్కల ఆధారంగా పిచ్చి ప్రణాళికలు.

స్వభావ రీత్యా బ్యూరోక్రసీ – తనను తాను విస్తరించుకోవడానికి, రకరకాల నియంత్రణలు, చట్టాల ద్వారా తన ప్రాముఖ్యతను, జీతభత్యాలను పెంచుకోవడానికి, ఏ పనినైనా అత్యంత అసమర్థ పద్ధతిలో చెయ్యడానికి, చేయించడానికే ప్రయత్నిస్తుంది.

రిటైరయ్యే సమయానికి ప్రభుత్వరంగ సంస్థలో కారు డ్రైవరు జీతం నెలకు డెబ్భైవేలు. కట్టేది మనమే. మరి లక్షల ఉద్యోగాల ప్రకటనలకు సంబరపడాలా, లేక కలవరపడాలా?

తెలుగు సినిమా రంగం తీవ్ర సంక్షోభంలో ఉందంటున్నారు. నిర్మాణ వ్యయం పెరిగి, ప్రేక్షకుల ఆదరణ తగ్గి, పైరసీ వంటి కారణాల వల్ల చిత్రాల సంఖ్య, ప్రమాణాలు, సృజనాత్మకతలపై ప్రభావం పడుతోంది. సినిమా వర్గాలు పైకి చెప్పని కారణాలు ఇంకా ముఖ్యమైనవి.

సినిమా టికెట్ల రేట్ల నియంత్రణ వీటిలో మొదటిది. టిక్కెట్టు రేటు అనేది ఎగ్జిబిటరుకు, ప్రేక్షకుడికి సంబంధించిన విషయం. బ్లాకులో అమ్మేరేట్లు, విడుదలైన కొన్ని రోజులపాటు ఉండే రద్దీలను గమనిస్తే కొన్ని సినిమాలను, కొన్ని రోజుల్లో ఎక్కువ డబ్బిచ్చైనా చూడ్డానికి కొందరు ప్రేక్షకులు ఇష్టపడతారు. కొన్ని సినిమాలు ఉచితంగా చూపించినా చూడరు. టిక్కెట్టు రేట్ల నియంత్రణ వల్ల నిర్మాతలు నష్టపోయి, మంచి చిత్రాలు తీయడానికి ముందుకు రారు. ఇంకో ముఖ్య కారణం చిత్ర నిర్మాణ కార్మిక రంగంలో ఉన్న విపరీతమైన యూనియనిజం. వీటిని పరిష్కరించుకునే ప్రయత్నం చేయకుండా హాలివుడ్, డబ్బింగ్ చిత్రాలను నిషేధించాలని, నియంత్రించాలని, వాటిపై పన్నులు పెంచాలని ఫిలిం ఛాంబరువారు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నంలో ఉన్నారు.

ఏ ప్రభుత్వ నియంత్రణల వల్ల నష్టపోతున్నారో గమనించకుండా అదే ప్రభుత్వ బలంతో ఇతరులను అడ్డుకోజూస్తున్నారు. ప్రేక్షకులు హాలివుడ్, డబ్బింగ్ చిత్రాలను ఇష్టపడుతుంటే కాదనడానికి వీరెవరు? ప్రభుత్వాల కర్రపెత్తనంతో ప్రేక్షకుల స్వేచ్ఛకు భంగం కలిగించడం, పరభాషా చిత్ర నిర్మాతలను నష్టపెట్టడం తప్పు కానప్పుడు, పార్టీల, ఉద్యమకారుల కర్రపెత్తనంతో తెలంగాణాలో షూటింగులను అడ్డుకుంటున్న వారిని ఎలా తప్పు పట్టగలరు?

స్వేచ్ఛ అనేది – ఇష్టమున్నప్పుడే వాడుకునే లిప్‌స్టిక్ కాదు. ప్రభుత్వాన్ని ఆశ్రయించి పొందే సబ్సిడీ కాదు. మనకు మాత్రమే ఉండాలనుకునే సెంటిమెంటు కాదు. అదొక మానసిక నిబద్ధత, ఒక భావజాలం. మనతోపాటు అందరికీ నిలకడగా, అవిరుద్ధంగా వర్తించాలని అంగీకరించాల్సిన నైతిక నియమం. మనిషిని చీకటి శకాలు, మధ్య యుగాలు, మతోన్మాదాల చెర నుంచి విడిపించే ఆధునిక సహనశీల ఆలోచనా విధానం. దాన్ని పొందగానే సరిపోదు. నిలబెట్టుకోవాలంటే ఆలోచించాలి. ఆలోచిస్తూనే ఉండాలి. లేకపోతే చిటికెలో చేజారిపోతుంది.

13-11-2011

చిల్లర సిద్ధాంతాలు

రిటైల్ (చిల్లర వ్యాపారం) రంగంలో విదేశీ పెట్టుబడులను అనుమతించడంపై పార్లమెంటులో రభస జరుగుతోంది. దీని లోతుపాతులను పరిశీలిస్తే వివిధ పార్టీలు, మేధావులు, ఆర్థిక వేత్తలు, సిద్ధాంత కర్తలు, వ్యాపార వర్గాలు వెలిబుచ్చుతున్న భయాలు కేవలం అపోహలేనని అర్థమవుతుంది. ఇరవయ్యో శతాబ్దంలో రవాణా, కమ్యూనికేషన్లు, ఉత్పత్తి, సేవా రంగాల్లో సాంకేతిక పరంగా వచ్చిన విప్లవాత్మక మార్పులు వినియోగ రంగాన్ని ఊహించని స్థాయిలో విస్తరింపజేశాయి.

వందలు, వేలు, లక్షల సంఖ్యలో కొత్త ఉత్పత్తులు రూపొంది ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. వీటన్నిటికీ అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన, యంత్రాలు, యాజమాన్య (మేనేజ్‌మెంట్) పద్ధతులు – ఇవన్నీ అభివృద్ధి చెందిన పశ్చిమదేశాల్లో తయారయి మనలాంటి వెనుక బడిన దేశాల్లోకి దిగుమతయ్యాయి.

మన ప్రభుత్వాలు ఆమోదించిన మేరకు భారతీయ మార్కెట్లలో కూడా కొన్ని కొత్త వస్తువులు అందుబాటులోకి వచ్చాయి. కానీ దిగుమతులపై విపరీతమైన ఆంక్షలున్న సోషలిస్టు దశాబ్దాలలో (1947 – 1991) వినియోగ వస్తువుల సంఖ్య, నాణ్యత, సరఫరా, వైవిధ్యం (వెరైటీ) అంతంతమాత్రంగానే ఉండేవి.

పెళ్ళి సందర్భంగా అల్లుడికి చేతి గడియారం బహుకరించాలన్నా, స్కూటరు కొనాలన్నా సంవత్సరాల ముందు నుంచి బుకింగ్ చేసుకోవాల్సి వచ్చేది. అప్పటికే ప్రపంచమంతటా అందుబాటులో ఉన్న కెమెరాలు, కలర్ టీవీలు, టేప్ రికార్డర్లు, ప్రభుత్వం పుణ్యమాని మనదేశ ప్రజలకు నిషిద్ధ వస్తువులు.

అమ్మపెట్టదు, అడుక్కు తిననివ్వదన్నట్లు మనదేశీయ పరిశ్రమలకు అవన్నీ తయారు చెయ్యగల సాంకేతిక పరిజ్ఞానం ఉండేది కాదు, టెక్నాలజీని దిగుమతి చేసుకోనివ్వరు, విదేశీ కంపెనీలను ఉత్పత్తి చెయ్యనిచ్చే వారూ కాదు. ఆ రకంగా ప్రపంచ

ప్రజలందరికీ దొరికే ఉత్పత్తుల, సౌకర్యాల ప్రవాహానికి సరిహద్దుల్లో ఆనకట్టలు కట్టి అడ్డగించారు.

కొద్దికొద్దిగా ఊటనీరు స్మగ్లింగ్ రూపంలో వచ్చి, నల్లబజార్లను తయారు చేసేది. ఆ చీకటి సామ్రాజ్యాల్లో హాజీ మస్తాన్, వరదరాజన్, దావూద్ ఇబ్రహీం, ఛోటా రాజన్ లాంటి మాఫియా ముఠాలు వేళ్ళూనుకున్నాయి. దాని ఫలితాలను అభద్రత, తీవ్రవాదం రూపాల్లో ఈనాటికీ అనుభవిస్తూనే ఉన్నాం.

వినియోగ వస్తువుల ఉత్పత్తిలాగే; పంపిణీ, వర్తక వ్యవస్థ కూడా ఆధునీకరించ బడింది. సంక్లిష్టమైన సాంకేతిక పరిజ్ఞానంతో సరఫరా గొలుసు కట్టు (సప్లై చైన్) ప్రపంచీకరించబడింది. అభివృద్ధి చెందిన దేశాల్లో వందేళ్ళ క్రితం ప్రారంభమైన ఈ పరిజ్ఞానం ఇప్పుడు అత్యంత ఆధునిక రూపాల్లో ప్రపంచమంతటా విస్తరించింది. దీని అంతిమ లక్ష్యం అత్యంత చవగ్గా వినియోగ వస్తువులను అందించడం ద్వారా కొనుగోలు దారులను ఆకర్షించడం; వ్యాపార పరిమాణాన్ని పెంచడం (ఎకానమీస్ ఆఫ్ స్కేల్) ద్వారా తక్కువ ధరలకే వస్తువులను సేకరించి, తక్కువ లాభానికే అమ్మడం. తద్వారా అమ్మకపు ధరలను వీలున్నంతగా తగ్గించడం. దీనివల్ల ముఖ్యంగా లాభపడేది వినియోగ దారులు. పాల పీక దగ్గర్నుంచి పప్పులు, పరుపులు, కూరగాయలు, కారు టైర్ల వరకు అన్నీ ఒకేచోట ఇంతకు ముందుకన్నా తక్కువ ధరలకే లభించడం వల్ల డబ్బు, సమయం, శ్రమ ఆదా అవుతాయి.

ముందే కుదుర్చుకున్న ఒప్పందాల మేరకు పెద్దస్థాయిలో సరుకులు సరఫరా చెయ్యడంలో ఉన్న సానుకూలత వల్ల సరఫరాదారులకూ ఇది మంచి పరిణామమే. మధ్యవర్తులు, దళారీలు, ఎగ్గొట్టడాలు లేకపోవడంతో తక్కువ ధరలకే సరఫరా చెయ్యడం వీలవుతుంది. కూరగాయలు, ఇతర ఆహార వస్తువులు పండించడం, మాసూలు, నిల్వ ఉంచడం, రవాణాల్లో సాంకేతికత పెరిగి ఇటు రైతులకు, అటు కొనేవారికి లాభం పెరుగుతుంది.

అందరికీ లాభం జరుగబోతుంటే, ఇంత పెద్ద ఎత్తున అభ్యంతరాలు ఎందుకు వస్తున్నాయి? ఎవరికి నష్టం కలగబోతోంది? ప్రస్తుతం చిల్లర వ్యాపారం నెరపుతున్న చిన్న వర్తకులకు వ్యాపారం దెబ్బతింటుందనే భావన, భయం ఉంది. అది కొంతమేరకు నిజమే కావచ్చు కూడా. సాంప్రదాయ పద్ధతుల్లో చిల్లర వర్తకం చేసే దుకాణాలకు తాత్కాలికంగా వ్యాపారం తగ్గిపోయే ప్రమాదం ఉంది.

అంతమాత్రాన ఒక సాంకేతిక ఆవిష్కరణకు, వినియోగదారులైన ప్రజలకు చేకూరే మేలుకు అడ్డుపడడం భావ్యమేనా? జట్కా బళ్ళు నడిపే వారి ఉపాధి పోతోందని

రైళ్ళు, బస్సులను అడ్డుకుంటే ఏమయ్యేది? ఎక్కడుండే వాళ్ళం? లాంతర్లు, కొవ్వొత్తులు తయారుచేసే వాళ్ళ వ్యాపారం పెంచడానికి విద్యుత్ వెలుగులను అడ్డుకుందామా?

గత పది, పదిహేను సంవత్సరాల్లో దేశీయంగా కూడా వివిధ రిటైల్ చైన్లు వెలిశాయి. రిలయన్స్, ఐటిసి, మోర్, సుభిక్ష, హెరిటేజ్ వంటి సంస్థలు గొలుసు దుకాణాలను ఏర్పరచి షాపింగ్ స్వరూపాన్నే మార్చేశాయి. వాటిలో కొన్ని నష్టాలకు గురై మూతపడ్డాయి. కొన్నిటిని ఇతర సంస్థలు కొనుగోలు చేసి, కలిపేసుకున్నాయి. ప్రపంచ రిటైల్ దిగ్గజమైన వాల్‌మార్ట్ కూడా ఇంగ్లండ్‌లో లాభపడింది కానీ, జర్మనీలో నష్టపోయి... అమ్ముకుని బయటపడింది.

రిలయన్స్ దుకాణాల రాకవల్ల స్థానిక వ్యాపారులు మొదట్లో భయానికి గురై ఆందోళనలకు దిగారు. కొన్ని చోట్ల హింసకూడా చెలరేగింది. ప్రజాకర్షణే పరమధ్యేయంగా గల కొందరు రాజకీయ నాయకులు, ప్రభుత్వాలు కూడా రంగంలోకి దిగాయి. ఉత్తరప్రదేశ్‌లో రిలయన్స్ రిటైల్ దుకాణాలను నిషేధించారు. వాటిని నడవనిచ్చిన ప్రాంతాల్లో మాత్రం కాలక్రమేణా స్థానిక వ్యాపారులు మారిన పరిస్థితులకనుగుణంగా తమ వ్యూహాలను మార్చుకుని వ్యాపారాల్లో కొనసాగారు.

కాబట్టి విదేశీ రిటైల్ సంస్థల రాకతో ప్రళయం వస్తుందనే భయాలు అహేతుకం.

దేశీయ రిటైల్ సంస్థలు ఎంతగా విస్తరించినా, ఒక స్థాయిని దాటి ముందుకు పోలేకపోయాయి. దానికి కారణం పెట్టుబడి కొరత, సాంకేతిక నైపుణ్యతలేమి, అంతర్జాతీయ మార్కెట్ల గురించి అవగాహన లేకపోవడం, వ్యవస్థ కుదురుకునే దాకా తట్టుకుని నిలబడలేని ఆర్థిక బలహీనత, సరఫరా గొలుసుకట్టును స్థిరీకరించలేకపోవడం, ఇత్యాదులు.

విదేశీ సంస్థల రాకతో ఈ సమస్యల పరిష్కారంతోబాటు, సాంకేతిక పరిజ్ఞానం బదిలీ ద్వారా దేశీయ సంస్థలు, సరఫరా వ్యవస్థలో పెట్టుబడుల వల్ల రైతులు, ఇతర సరఫరాదారులు, చవకధరలు, కేంద్రీకృత కొనుగోళ్ళ ద్వారా వినియోగదారులు లాభపడతారు, బలపడతారు. రైతులు, ఇతర సరఫరాదారులను వత్తిడికి గురిచేసి, వారి లాభదాయికతను తగ్గించేస్తారనేది అపోహ మాత్రమే. ఒకే సంస్థకు ప్రభుత్వ గుత్తాధిపత్యం కట్టబెట్టినప్పుడే అలా జరిగే వీలుంటుంది.

ఎఫ్‌సిఐ ద్వారా కేంద్ర ప్రభుత్వం – వరి రైతులకు ఉరి వేస్తున్నది ఆ గుత్తాధిపత్యం కారణంగానే. ఒక సంస్థ వత్తిడికి గురిచేస్తే వేరే సంస్థకు అమ్ముకునే స్వేచ్ఛ, వీలు ఉన్నంత కాలం రైతులు, సరఫరా దారులకెవరూ సంకెళ్ళు వెయ్యలేరు. తక్కువ ధరలతో బాటు, సరఫరా సరిగా ఉండేలా, కొరతలు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత కూడా ఉంటుంది కాబట్టి సరఫరాదారులను కావాలని ఇబ్బంది పెట్టే అవసరం కానీ, అవకాశం

గానీ ఉండదు. అలాగే, ఒకసారి స్థిరపడ్డాక వినియోగదారులను దోచేస్తారనే ప్రచారం కూడా ప్రచారం మాత్రమే. అలా చేసిన సంస్థలు మూతబడి, సరైన పోటీ ధరలకు అమ్మేవారే నిలబడగలుగుతారనేది రోజూ చూస్తున్న సత్యం.

కంప్యూటర్లు వస్తే నిరుద్యోగం పెరిగిపోతుందంటూ హింసాత్మక ఆందోళనలు చేసిన భావజాల వర్గాలే – ఇప్పుడు రిటైల్ రంగంలో విదేశీ సంస్థలకు అనుమతిపై చిందులు తొక్కుతున్నాయి. వారి అహేతుక అభ్యంతరాలను ప్రక్కనబెట్టి ఉండకపోతే ఈనాడు మనదేశంలో బ్యాంకులు, వ్యాపారాలు, రైల్వే రిజర్వేషన్లు, టెలిఫోన్ సదుపాయాలు ఏ స్థితిలో ఉండేవో ఊహించుకుంటేనే ఒళ్ళు జలదరిస్తుంది. పెరిగే సాంకేతికతను అందుకోవడానికి ఎప్పటికప్పుడు – ప్రభుత్వ అనుమతుల కోసం ఎదురు చూడవలసి రావడంలోనే దేశ ప్రజల దురదృష్టం ఇమిడి ఉంది. ఈ మానసిక సంకెళ్ళను తెంచుకుని, ప్రభుత్వాలను ప్రజల రక్షణకు మాత్రమే పరిమితం చేయనంత కాలం ఈ అనవసర వాగ్యుద్ధాలు, సంస్క'రణా'లు తప్పవు.

27-11-2011

పిరికి చేష్టలు

ఒకప్పటి న్యాయవాది, ప్రస్తుత కేంద్రమంత్రి కపిల్ సిబల్ ఇటీవల వెలిబుచ్చిన అభిప్రాయాలు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. అంతర్జాలం (ఇంటర్నెట్) లో అత్యంత ఆదరణ పొందిన ఫేస్‌బుక్, గూగుల్, ట్విట్టర్ లాంటి వెబ్‌సైట్లలో రాసే రాతలను నియంత్రించాలని ఆయన ఒక ప్రతిపాదన చేశారు. ఈ మేరకు ఆయా వెబ్‌సైట్ల నిర్వాహకులకు నోటిసులు కూడా పంపారు. రాసే రాతల్లో కొన్ని అత్యంత అభ్యంతరకరంగా ఉంటున్నాయనీ, కాబట్టి ప్రతివ్యాఖ్యనూ ముందే పరిశీలించి మరీ వెబ్‌సైట్‌లోకి అనుమతించాలనీ టెలికాం మంత్రిగా హుకుం జారీచేశారు. దీనిపై దేశవ్యాప్తంగా తీవ్ర చర్చ, ప్రతిస్పందనలు మొదలయ్యాయి. ప్రముఖ వ్యక్తులను కించపరిచే వ్యాఖ్యలు, వివిధ వర్గాల ప్రజలమధ్య వైషమ్యాలను కలగజేసే వ్యాఖ్యలను నియంత్రించకపోతే ఎలా అని కొందరు ప్రశ్నిస్తున్నారు. అంతర్జాల ప్రపంచంలో అపరిమితమైన స్వేచ్ఛను అనుభవిస్తున్న వారు; ముఖ్యంగా యువత, ఈ నియంత్రణల పట్ల తీవ్ర నిరసనను వ్యక్తం చేస్తున్నారు.

అమెరికా, సోవియట్ యూనియన్‌ల మధ్య ప్రచ్ఛన్నయుద్ధం (కోల్డ్‌వార్) తీవ్రంగా సాగుతున్న 1960ల్లో అమెరికా రక్షణ శాఖ ఒక ఆధునిక సాంకేతిక పరిశోధనకు శ్రీకారం చుట్టింది. అణుయుద్ధం అనివార్యమైన పక్షంలో తమ సైనిక స్థావరాలు, నాయకత్వ కేంద్రాల మధ్య సంబంధాలు తెగిపోకుండా, సమాచార వ్యవస్థ కొనసాగింపుకు మార్గాలు వెతకటం దాని లక్ష్యం. ఆ పరిశోధనలు, అప్పటికే ప్రైవేటు రంగంలో విస్తరిస్తున్న కంప్యూటర్ టెక్నాలజీలు అనుసంధానమై, సమాచార వ్యవస్థలో విప్లవాత్మక మార్పు లొచ్చాయి. వివిధ రకాల కంప్యూటర్లు రకరకాల సాఫ్ట్‌వేర్‌ల మధ్య సమాచార (డాటా) మార్పిడి సుగమమైంది. గత ముప్పై సంవత్సరాల్లో అది ప్రపంచమంతటా విస్తరించింది. కేవలం రక్షణ, వ్యాపార అవసరాలకు, విద్యా విషయక సమాచారానికి, ఒక జ్ఞాన

భాండాగారంగా మాత్రమే కాక; ఈ రోజున కొన్ని వందల కోట్ల మందికి సమాచార ప్రవంతి సాధనమై, ఒక అత్యవసర వ్యవస్థగా మారింది. గత అయిదారు సంవత్సరాలుగా ఫేస్‌బుక్, ట్విట్టర్ లాంటి సోషల్ నెట్‌వర్క్ వేదికల ద్వారా సుమారు వంద కోట్ల మంది రోజువారీగా తమ బంధువులు, స్నేహితులు, వ్యాపార సంబంధీకులతో సమాచారం, సంగీతం, ఫోటోలు, అభిప్రాయాలు పంచుకుంటున్నారు. దాదాపు కాంతి వేగంతో ప్రయాణించే సమాచారం క్షణాల్లో కానీ ఖర్చు లేకుండా వేలు, లక్షల మందికి చేరిపోతుంది. ఇంతకు ముందు కంప్యూటర్లకే పరిమితమైన ఈ సౌకర్యం ఇప్పుడు సెల్‌ఫోన్లకూ విస్తరించింది. వెరసి, గతంలోలా కాకుండా ఏదైనా ముఖ్యమైన సమాచారం, లేదా రాజకీయ, సామాజిక అభిప్రాయం నిమిషాల్లో అందరికీ చేరిపోయి, వారిని ప్రభావితం చేయగలుగుతుంది. అన్నిటికంటే ముఖ్యమైన ప్రత్యేకత ఏమిటంటే, ఈ వ్యవస్థపై ప్రభుత్వ పెత్తనం లేదు.

ఇటీవల ఈజిప్టులో మొదలై, అరబ్బు దేశాల్లో ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ప్రజలను పెద్ద సంఖ్యలో సమీకరించి పాలకులను గద్దె దించడం, వికీలీక్స్ వివరాలు ప్రపంచమంతటా వ్యాపించడంలో ఈ సోషల్ నెట్‌వర్క్ వేదికలు ముఖ్యపాత్ర పోషించాయి. అంతెందుకు! ఇటీవల అన్నాహజారే నిరశన దీక్ష చేపట్టినప్పుడు కాలేజీల్లో విద్యార్థులంతా ఫేస్‌బుక్‌లో సంప్రదించుకొని, దీక్షకు సంఘీభావంగా మర్నాడు అందరూ నల్ల దుస్తులు వేసుకుని కాలేజీకి వెళ్ళాలని నిర్ణయించేసుకుని వెంటనే అమలు చేశారు. ఇంత అలవోకగా ఏదైనా విషయం, ముఖ్యంగా రాజకీయ విషయాల మీద యువత పెద్ద సంఖ్యలో సమీకృతం కావడం పాలకులను బెంబేలెత్తిస్తున్నది.

పాలకులు, పాలనలో నియంతృత్వ లక్షణాలు ఎంత ఎక్కువైతే వారిలో కంగారు అంత ఎక్కువగా ఉంటుంది. రాజకీయ స్వేచ్ఛలేని చైనాలో అందుకే ఇంటర్నెట్ తీవ్ర నియంత్రణలకు లోనయింది. అక్కడి ప్రభుత్వానికి, పాలక కమ్యూనిస్టు పార్టీకి వ్యతిరేకంగా రాసే వ్యాఖ్యలను ఎప్పటికప్పుడు వడపోసి, వేరుచేసి, తొలగించడానికి వేలాదిమంది ఇంటర్నెట్ పోలీసులను నియమించారు. గత యాభై సంవత్సరాలుగా క్రమేణా సోషలిస్టు లక్షణాలను పుణికి పుచ్చుకుంటున్న అమెరికాలో కూడా ఇంటర్నెట్ స్వేచ్ఛ పట్ల అధికార వర్గాల్లో కొంత కినుక లేకపోలేదు.

ఇక అర్ధ సామ్యవాద భారతదేశం విషయానికొస్తే, అన్ని మాధ్యమాల్లాగే ఇంటర్నెట్‌ను కూడా ఏదో ఒకరకంగా నియంత్రించాలని పాలకవర్గాలు ప్రయత్నించడంలో ఆశ్చర్యం ఏమీలేదు. సోషలిజం ముసుగులో, సగటు జీవి (ఆమ్ ఆద్మీ) పేరుమీద పన్నులతో నడ్డివిరగ్గొడుతూ, ద్రవ్యోల్బణంతో దోపిడీ చేస్తూ, కళ్ళుండీ 'ఉచిత' గంతలు కట్టుకున్న ప్రజా బాహుళ్యాలకు మరమరాలు విసిరేస్తూ; ఆశ్రితులను అందలాలెక్కించి...; అవినీతిలో నిలువెల్లా

కూరుకుపోయారు మన పాలకులు. పళ్ళ బిగువున పాలన సాగిస్తున్న ప్రభుత్వం, ఎప్పుడు, ఏ విషయంలో ప్రజాగ్రహం కట్టలు తెచ్చుకుంటుందోనన్న ఆందోళనలో ఉండక తప్పదు. జనాభాలో అత్యధిక శాతం ఉన్న యువత ఎప్పుడెలా స్పందిస్తుందోనన్న సంశయమే ఈ ఉలికిపాటుకు కారణం. అందుకే అంతర్జాలంపై ఆంక్షలు విధించాలన్న పిరికి ప్రయత్నం.

నియంత్రణ లేకుంటే ప్రముఖుల పరువుతీసే రాతలు, వర్గ వైషమ్యాలకు దారితీసే వ్యాఖ్యలకు అడ్డుండదనే వాదం అర్ధరహితం. నియంత్రించాల్సిందేగానీ, అది సాంకేతికంగా సాధ్యం కాదేమోనంటూ సన్నాయి నొక్కులు నొక్కే మేధావుల ధోరణి – గర్హనీయం. మనకు నచ్చినా, నచ్చకపోయినా, ఎవరి భావాలను వారు ప్రకటించుకునే వీలుంటేనే అది భావస్వేచ్ఛ అవుతుంది. భావస్వేచ్ఛ గల వాతావరణంలో పరువుతీసే రాతలకు, నిరాధార ఆరోపణలకు ప్రభావితమయ్యేవారికంటే; వాటిని అక్కడికక్కడే ఖండించే వారి సంఖ్యే ఎక్కువగా ఉంటుంది. అదీగాక, నియంత్రణ లేని మాధ్యమం కాబట్టి, ఇంటర్నెట్‌లో వచ్చే ప్రతి సమాచారాన్నీ అనుమానంతో చూసే ఆరోగ్యకరమైన నిస్పృహ తత్వం (సినిసిజం) ఇంటర్నెట్ వాడే వాళ్ళందరికీ ఉంటుంది. వైషమ్యాలు సృష్టించే రాతలను నమ్మేవాడి తెలివితేటలు ఏ సంతకెళ్ళినట్టు?

ఇంటర్నెట్‌లోనే కాదు, వార్తాపత్రికలు, ఛానళ్ళలో వచ్చే ఏ వార్తయినా, అభిప్రాయాన్నయినా, సునిశిత, హేతుబద్ధ దృష్టితో పరిశీలించి, ఎంత వరకు నమ్మాలో, నమ్మకూడదో, ఎలా ప్రతిస్పందించాలో నిర్ణయించుకోవాల్సిన బాధ్యత వ్యక్తిదే. ఆ మధ్య ఒకసారి ఒకట్రొండు ఛానళ్ళలో వచ్చిన ప్రాయోజిత కథనాలు చూసి, దాన్ని సాకుగా చూపి ఒక సంస్థకు చెందిన దుకాణాలను ధ్వంసం చేసిన భ్రష్టులనే బాధ్యులుగా చెయ్యాలి. అంతేగానీ, వ్యాపారం కోసం నడిపే మీడియాను దుమ్మెత్తిపోస్తే వ్యక్తులు పాల్పడిన హింస క్షమార్హమవుతుందా?

ఇకపోతే ధరల పెరుగుదల గురించి పార్లమెంటులో జరిగిన చర్చ – కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుంది. అధిక ధరలు ద్రవ్యోల్బణానికి కారణం కాదు, ధరలు పెరగడమన్నది ద్రవ్యోల్బణపు రోగలక్షణం మాత్రమే. ఇరవయ్యో శతాబ్దంలో ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు ప్రజలకు పెట్టిన శాపమే ద్రవ్యోల్బణం. ధరల సూచీ, ఆర్థిక వృద్ధిరేటు – ఇవన్నీ రూపాయల్లో చూపే కాకి లెక్కలు మాత్రమే. అసలు సమస్య, ద్రవ్యోల్బణానికి మూలకారణం ప్రభుత్వాలు సృష్టించే కృత్రిమ కాగితపు డబ్బు. ఇది అన్నిదేశాల్లోనూ ప్రభుత్వాల కనుసన్నల్లో నడిచే రిజర్వు బ్యాంకుల పాప ఫలితం. దీనికి ఏ దేశమూ అతీతం కాదు.

1913 లో అమెరికాలో ఫెడరల్ రిజర్వు (వారి రిజర్వు బ్యాంకు) ఏర్పడే నాటికి – పది గ్రాముల బంగారం ఆరున్నర డాలర్లకు దొరికేది. అది, ఈనాడు

అయిదొందల అరవై డాలర్లకు పెరిగింది. అంటే ఎన్ని వందల రెట్ల పరిమాణంలో డాలర్లను ముద్రించి జనం మీదకు వదిలారో ఊహించుకోవచ్చు. అలాగే భారత ప్రభుత్వం– ఎన్ని కృత్రిమ రూపాయలను సృష్టించబట్టి గత అయిదేళ్ళలో బంగారం ధరలు ఇంతగా పెరిగిపోయాయో ఆలోచించండి. పన్నులను పెంచి, పెంచి, ఇక పెంచలేమనుకున్నప్పుడు, అప్రమత్తంగా లేని అమాయక ప్రజలు డబ్బురూపంలో దాచుకున్న సొత్తును దోచుకునే ప్రక్రియే ద్రవ్యోల్బణం. దీనివల్ల జీతాలు పెరిగినట్లు కనిపిస్తాయిగానీ, అంతకంటే వేగంగా ధరలు పెరుగుతాయి. ఈ విలువ తగ్గిన రూపాయిల లెక్కలతో చూపే అభివృద్ధి సూచీలు సంపదకు చిహ్నాలు కావు. ఆర్థిక మంత్రుల జాణతనం, మేధావుల అవగాహనా లోపం, ప్రజల అమాయకత్వాలకు నిదర్శనాలు మాత్రమే.

ఇలా లోపాయికారీగా ప్రజలనుంచి దోచుకున్న సంపదను ఓట్లు కొనుగోలు చేసే పథకాలకు, ప్రభుత్వపు దర్పాలకు, అవినీతి రూపంలో ఆర్జించి పెట్టే ప్రాజెక్టులకు వెదజల్లడమే సంక్షేమం, అభివృద్ధి అని పిలవబడే జుగల్‌బందీ రాగాలు. మరో రెండేళ్ళలో రాబోయే ఎన్నికల్లో యువరాజు పట్టాభిషేకానికి గ్యారంటీ యిచ్చే అద్వితీయ పథకాలు రూపకల్పనలో ఉన్నాయి. ఆహార భద్రత పేరుతో దేశంలోని డెబ్భైశాతం మందికి ఉచిత ఆహార పథకం వాటిలో ఒకటి. రెండోది అడిగిన, అడగని వారందరితోను (ప్రభుత్వరంగ) బ్యాంకుల్లో ఖాతాలు తెరిపించి, మనిషికి పదివేలు చొప్పున తీర్చనవసరం లేని అప్పురూపంలో జమ చేయించే పథకం శరవేగంతో తయారవుతోంది. వీటన్నిటికీ డబ్బెక్కడ్నుంచి వస్తుందని ఇంకా అమాయకంగా ప్రశ్నిస్తారా? బంగారం ధర యాభై వేలయిన రోజు మీకే తెలుస్తుంది. ఎవడబ్బ సొమ్మని విరజిమ్ముతున్నావు మన్మోహనా? అని నిలదీయాలనిపిస్తుంది.

11-12-2011

మద్య సత్యాలు

అనుకోకుండా జరిగినట్లనిపిస్తున్న విచారణలు, దాడుల పరంపరలో ఎన్నో వాస్తవాలు బయటపడ్డాయి. మన రాష్ట్రంలో మద్యం వ్యాపారం – రాజకీయాల కనుసన్నల్లో ఎంత పగడ్బందీగా జరగుతోందో ఇప్పటివరకు తెలియని వాళ్ళకు అర్థమైంది. సర్కారు ఖజానాకు సాలీనా సుమారు ఇరవై వేల కోట్లు జమచేస్తున్న అతిపెద్ద ఖాతా మద్యం. దాని లైసెన్సులు పొందడంలోను, నడపడంలోను, వేలంలో ఒక్కో దుకాణాన్నీ కొన్ని కోట్ల రూపాయలకు పాడిన వాటిని లాభదాయకం చేసుకోవడంలోను రాజకీయాల పాత్ర ఏమిటో అమాయకులకు తెలిసొచ్చింది.

సంవత్సరానికి సుమారు రెండు వేల కోట్ల రూపాయలు లంచాల రూపంలో 'వ్యవస్థకు కందెన'లా ఎలా పనిచేస్తున్నాయో అవగతమైంది. ఇదేదో తెలియని, ఊహించని విషయమన్నట్లుగా కొందరు హాహాకారాలు చేస్తూ, తమకు తోచిన సంస్కరణలు ప్రతిపాదిస్తున్నారు. మద్యం దుకాణాలను ప్రభుత్వమే నడపాలని, తద్వారా ఎన్నోవేల మందికి ఉపాధి కల్పించవచ్చునీ చెబుతున్నారు.

మద్యం వ్యాపారంపై తీవ్ర నియంత్రణ, దాన్నో ప్రభుత్వ 'ఆదాయ' వనరుగా పరిగణించడం ఒక సంప్రదాయంగా బ్రిటీష్, నిజాం కాలాల నుంచీ వస్తున్నదే. కొన్ని దశాబ్దాల క్రితం వరకు మద్యం దుకాణం నడపడం సామాజికంగా ఒక మచ్చలా భావించేవారు. వాటిని నడిపే వారింటి పిల్లలను పెళ్ళిచేసుకోవడానికి వెనకడుగు వేసేవారు. సారాను ప్రభుత్వీకరించడం, సారా పాటల్లో పోటీలు, రాజకీయ, అబ్కారీ శాఖల అండతో విపరీతమైన లాభాలు రావడంతో ఈ వ్యాపారాలకు గిరాకీ పెరిగి, మచ్చ తొలగిపోయింది. సారా, మద్యం వ్యాపారులే రాజకీయనాయకులై, పార్టీలకు ప్రధాన పెట్టుబడిదారులుగా, కొన్ని జిల్లాల్లో పార్టీ అధ్యక్షులుగా కూడా అవతారమెత్తారు.

ఈ సారా, మద్య ప్రవాహ విశృంఖలత్వం పట్ల కలిగిన విముఖత నుండి ఉదయించిందే మద్యపాన నిషేధ ఉద్యమం. మద్యం నిషేధం అమల్లోకి వచ్చాక మద్యం

స్మగ్లర్లు, కల్లుపేరుతో కల్తీ కల్లు వ్యాపారం చేసిన వర్గాలు, దొంగసారా కాసే వాళ్ళు, కాయించే వాళ్ళు, కాయించనిచ్చిన వాళ్ళు విపరీతంగా లాభపడి ఒక సమాంతర ఆర్థిక, రాజకీయ వ్యవస్థగా తయారయ్యారు. అది విపరీత రూపం సంతరించుకోకముందే మద్యనిషేధం ఎత్తేశారు. కానీ రాజకీయ పార్టీలు, మేధావి వర్గాలు, మహిళా సంఘాల కాపట్యం (హిపోక్రసీ)ని తృప్తిపరచడం కోసం దుకాణాల సంఖ్యను నియంత్రించారు.

డిమాండు ఎక్కువ ఉండి, సరఫరా తగ్గితే కొరత ఏర్పడుతుందనేది ప్రాథమిక ఆర్థిక సూత్రం. దాన్నుంచి ఎవరూ తప్పించుకోలేరు. ఈ కొరతను అధిగమించడానికి అనధికార బెల్టుషాపులు ఊరురా వెలిశాయి. వాటిని నడవనిచ్చినందుకు అబ్కారీ శాఖ, పోలీసులు, స్థానిక రాజకీయ నాయకులు చేసే వసూళ్ళు క్రమంగా పెరిగిపోయి; అదంతా ఒక అవినీతిమయమైన మురికి కూపంలా మారింది. మీడియా కూడా ప్రతి సంవత్సరమూ అనుమతించిన దుకాణాల సంఖ్యను ఎత్తిచూపుతూ, అదో పెద్ద రాజకీయ నేరమన్నట్లు ప్రచారం చెయ్యడంతో – దుకాణాల సంఖ్య విషయంలో ప్రతి ప్రభుత్వమూ ఆత్మరక్షణలో పడిపోయింది. దుకాణాల సంఖ్యను నియంత్రించడం వల్ల వాటిని పొందడం కోసం తీవ్రమైన పోటీ ఏర్పడింది. బార్ల లైసెన్సు ఫీజులు, మద్యం ధరలను పెంచుకుంటూ పోయారు. మద్యం హోల్‌సేల్ వ్యాపారం బెవెరేజెస్ కార్పొరేషన్ రూపంలో ఎలాగూ పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోనే ఉంది.

ప్రజల ఆర్థిక, వ్యక్తిగత వ్యవహారాల్లో కలగజేసుకునే ప్రభుత్వ జోక్యానికి ఒక దుర్గుణముంది – ఒక జోక్యం తప్పనిసరిగా మరో జోక్యానికి దారితీస్తుంది. అది చివరకు ప్రజల వ్యక్తిగత జీవితాలను, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని పూర్తిగా నియంత్రించే స్థితికి చేరుతుంది. మద్యవ్యాపార నియంత్రణలోనూ ఇదే జరిగింది. హోల్‌సేల్ వ్యాపారం ద్వారా ఏ కంపెనీ మద్యాన్ని ఎంత ధరకు కొనాలో, ఏ కంపెనీలకు వ్యాపారం ఇవ్వాలో నిర్ణయించే గుత్తాధికారం ప్రభుత్వం తన చేతుల్లో పెట్టుకుంది. ఇందులో ఎవరికంటా పడని అవినీతి ఏ స్థాయిలో ఉంటుందో ఊహించుకోవచ్చు. అంతేకాక, మద్యం తయారీదారులు తమ ఉత్పత్తుల ధర, నాణ్యతల ద్వారా వినియోగదారులను సంతృప్తిపరచాల్సిందిపోయి, తామిచ్చే కమీషన్లు, రాజకీయ అండదండలతో కేవలం ప్రభుత్వాన్ని, అధికారులను సంతృప్తిపరిస్తే సరిపోయే పరిస్థితులు నెలకొన్నాయి.

కోట్ల రూపాయలకు పాడుకున్న దుకాణాలను నడిపి లాభాలార్జించడం కష్టతరమైంది. దుకాణాల పాట మొత్తాలతో పోలిస్తే బార్ లైసెన్సులు చవగ్గా ఉన్నచోట ఒక మలిగీ (షట్టర్) కి బోర్డుపెట్టి, ఒక పొయ్యి, పచ్చి మిరపకాయ బజ్జీలతో బార్‌పెట్టి, లూజ్ సేల్సు చెయ్యడం మొదలెట్టారు. సర్కారు తేరుకుని బార్ లైసెన్సులివ్వడం నిలిపేశారు.

ప్రభుత్వం ఆదాయం కోసం వైన్ లాంటి సాత్విక మద్యంపై కూడా బ్రాందీ, విస్కీలతో సమానంగా పన్నులు విధించారు. దాంతో పేదలు, యువత కూడా బీరు, వైన్ల కంటే చవకగా మత్తెక్కించే గాఢమైన మద్యాలకు అలవాటు పడ్డారు. మద్యం ధరలు భరించలేక, నాటుసారా తయారీ, అమ్మకాలు పెరిగాయి. ఈ మధ్య తూర్పుగోదావరి జిల్లా లంకల్లో సంభవించిన కల్తీసారా మరణాలు ప్రభుత్వ విధానాల పుణ్యమే. ఇన్ని నియంత్రణల నడుమ మద్యం వ్యాపారం నడపడానికి లంచాలివ్వడం, రాజకీయ మద్దతు ఎలాగూ తప్పడం లేదు కాబట్టి, దుకాణదారులు జిల్లాలవారీగా సిండికేట్లుగా ఏర్పడి, గరిష్ట చిల్లర ధరలను మించి అమ్మడం మొదలెట్టారు. ఈ రంగంలో అనుభవం ఉన్న రాజకీయ పెద్దలు ఈ సిండి'కేట్ల' కింగులయ్యారు. స్థానిక ఉద్యమాలకు, ధూంధాంలకు కూడా ఈ సిండికేట్లే వనరులయ్యాయి.

ఇన్ని చిక్కుముడుల నేపథ్యంలో అసలు చేయాల్సిందేమిటి?

మద్యపానం వ్యక్తుల ఇష్టాయిష్టాలపై ఆధారపడే వ్యక్తిగత విషయం. దాన్ని శాసనాల ద్వారా నియంత్రించాలనుకోవడం ఒక భ్రమ. దుకాణాల సంఖ్య తగ్గిస్తే తాగేవారి సంఖ్యేమీ తగ్గదు. పైన చెప్పుకున్న సంక్లిష్టతలు, అపసవ్యాలే పెరుగుతాయి. తాగి చెడిపోయే వారికి; చెడిపోయి తాగే వారికీ ప్రభుత్వాలు బాధ్యత వహించవు. అది వారి వారి... మహా అయితే వారి కుటుంబ సభ్యుల స్వవిషయం. పదిహేనువేల కోట్ల రూపాయలతో 'సంక్షేమ' పథకాలు అమలు చెయ్యడానికి మరో పదిహేను వేల కోట్లతో ప్రభుత్వ యంత్రాంగాన్ని నడుపుతూ, ఇరవై వేల కోట్ల రూపాయలను ఉపాధి హామీ, ఉచిత బియ్యం పేరుతో వెదజల్లుతున్న ప్రభుత్వాలు; ఆ పథకాలను ప్రోత్సహించి, సమర్థించే మేధావి వర్గాలు ఒక్క విషయం గమనించాలి.

ఏ వ్యక్తయినా, తన స్వశక్తితో, సమర్థతతో, దీర్ఘకాలం పాటు జీవనోపాధిని కలగజేసే వ్యాపకం, తద్వారా వచ్చే ఆదాయంపైనే ఆధారపడతాడు. అటువంటి ఆదాయం ప్రాతిపదికనే తన జీవన విధానాన్ని, జీవన ప్రమాణాల్ని, భవిష్యత్ కోసం ప్రణాళికల్ని తయారు చేసుకుంటాడు. అంతేగానీ, దారిలో దొరికిన వెండి రూపాయి బిళ్ళ లాంటి తాత్కాలిక 'ఉచిత' పథకాలను నమ్మి, తన పిల్లల్ని మంచి కాన్వెంటులో చేర్పించడు. ఎన్నాళ్ళు నడుస్తుందో, ఎప్పుడు అమలవుతుందో, ఎప్పుడాగిపోతుందో తెలియని ఉపాధి హామీ పథకం ద్వారా వచ్చిన డబ్బుతో మద్యం సీసా కొనుక్కుని ఆ పూటకు ఎంజాయ్ చేస్తాడే తప్ప, దాన్ని ఒక శాశ్వత జీవనోపాధిగా నమ్మడు. ఆ చేత్తో పంచిన డబ్బును, సర్కారు ఈ చేత్తో లాగేసుకుంటుందని తెలుసు. అందుకే వారి జీవన ప్రమాణాలు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నట్లున్నాయి. అలాగే ఉంటాయి. మారేదల్లా ఈ జోక్యీకరణ

వ్యవస్థను తెలివిగా మలుచుకుని, పిండి, డబ్బుచేసుకునే రాజకీయ నాయకుల, ప్రభుత్వ ప్రాపకం ఆధారంగా బ్రతికే వ్యాపారుల, నియంత్రణల చట్రాలను సొమ్ము చేసుకునే ప్రభుత్వ ఉద్యోగుల, మరి మా సంగతేమిటనే మీడియా వర్గాల అదృష్టరేఖలే.

ఈ మాఫియాను అరికట్టడం చాలా సులభం. దానికొక్కటే మార్గం. మద్యం వ్యాపారంపై నియంత్రణలు, వేలంపాటలు, లైసెన్సు ఫీజులు పూర్తిగా నిర్మూలిస్తే చాలు. కోకాకోలా, కొబ్బరి బొండాల్లాగా ఎవరు కావాలంటే వారు, ఎక్కడ కావాలంటే అక్కడ మద్యం అమ్ముకోగలిగితే మాఫియాల సమస్యే ఉండదు. మద్యం కన్నా పెద్ద వ్యసనం అవినీతి. ఎటొచ్చీ దాని కలవాటుపడిన వాళ్ళకే ఇబ్బంది.

25-12-2011

అసహన రాజకీయాలు

వరంగల్ జిల్లాలో – శుక్రవారం నాడు రైతు పోరు బాట సందర్భంగా జరిగిన సంఘటనలు అందరినీ ఆలోచింపజేసేవిగా ఉన్నాయి. ఇటువంటి పరిస్థితులను విశ్లేషించడానికి ఎంచుకోవలసిన ఒకేఒక ప్రాతిపదిక – మనిషి హక్కులు – భావ ప్రకటనా స్వేచ్ఛ, ఎక్కడయినా తిరగ్గలిగే స్వేచ్ఛ. అంతే తప్ప సెంటిమెంటో, నమ్మకమో, రాజకీయ భావజాలమో, ఎత్తుగడలో, ప్రతిక్రియలో – ప్రాతిపదికలు కాజాలవు. గత రెండు మూడు సంవత్సరాలుగా ఉద్యమాలు సాగుతున్న తీరు, చర్చా వేదికల్లోను, టీవీల్లోను, విలేఖరుల సమావేశాల్లోను, బహిరంగ సభల్లోను జరుగుతున్న సంభాషణలు; వాడే పదజాలపు తీరులను గమనిస్తే – అంతు తెలియని పాతాళం వైపు అడుగులు వేస్తున్నట్లుగా ఉంది. తోటకూరను దొంగతనం చేసిన్నాడే మందలించకపోతే ఏం జరుగుతుందో, చిన్నచిన్నగా మొదలైన హక్కుల హననాలను ఉపేక్షించడం వల్ల, క్రమేణా ఆ ధోరణులు కొరకరాని కొయ్యలుగా – మొదలేదో, చివరేదో తెలుసుకోలేని చిక్కుముడులుగా తయారయ్యాయి.

కళ్ళముందే ఇన్ని జరుగుతున్నా, కొన్నిసార్లు బుద్ధిపూర్వకంగాను, కొన్నిసార్లు అసమర్ధతవల్ల, మరికొన్నిసార్లు నిస్సహాయంగా మిగిలిపోయిన ప్రభుత్వాల పనితీరు సిగ్గుచేటు. కొన్నిసార్లు నాయకత్వలేమి, కొన్నిసార్లు మనకెందుకొచ్చిందిలే అన్న నిరాశావాదం, మరికొన్నిసార్లు దిశానిర్దేశపు కొరతల కారణంగా వ్యవస్థల వైఫల్యం భయానకంగా మారింది. చిట్టచివరి ఆశాకిరణమనుకునే న్యాయవ్యవస్థ కూడా తీవ్ర వత్తిడికి లోనుకావడం, నిస్సహాయంగా నలుగురితో నారాయణ అని లౌక్యంగా తప్పించుకోవడం దురదృష్టం. ఎమర్జెన్సీలాంటి భయంకర పరిస్థితులను కూడా తట్టుకుని నిటారుగా నిల్చున్న మీడియా కూడా; భావోద్రేకాలకు లోనై, శిబిరాలుగా విడిపోవడం, పరమపూజ్యంగా భావించే భావ స్వేచ్ఛను తామే అడ్డుకోవడం చూస్తుంటే; భావ

గందరగోళం, వ్యక్తిగత ఆత్మాశ్రయిత (సబ్జెక్టివిటీ) బుద్ధిజీవులను కూడా ఎంతలా దిగజారుస్తుందో అవగమతమవుతోంది.

2010 మే నెలలో మహబూబాబాద్‌లో ఓదార్పు యాత్ర కోసం బయలుదేరిన జగన్‌ను – హింసాత్మక కార్యక్రమాల ద్వారా అడ్డగించడం, రైల్వే స్టేషన్లో రాళ్ళ వర్షం, కాల్పులకు దారితీసిన వైనంతో చర్చ ప్రక్కదారి పట్టడం మొదలైంది. ఆనాటి ప్రభుత్వానికి అనుకూలమైన పని కాబట్టి, నిస్తేజంగా వ్యవహరించిన అధికార వ్యవస్థ నిశ్చితంగా ఉండగలిగింది. ఆనాడు తుంగలో తొక్కబడ్డ వ్యక్తి స్వేచ్ఛ తరువాతి రోజుల్లో మరిన్ని దౌష్ట్యాలకు గురైంది. మిలియన్ మార్చ్‌లకు, విగ్రహాల ధ్వంసానికి, అసెంబ్లీలో జెపిపై దాడికి, విజయవాడ హైవేలో బస్సుల ధ్వంసాలకు దారితీసింది.

మొదటి సంఘటనను సరైన కోణంలో విశ్లేషించి, విమర్శించి, ప్రతిఘటించని వాళ్ళు – తర్వాత్తర్వాత జరిగిన వాటిని చూసి నిట్టూర్చడం తప్ప ఏమీ చెయ్యలేకపోయారు, చెయ్యలేరు కూడా. ఈ అప్రతిఘటిత బల ప్రయోగాల ద్వారా ఉద్యమకారులను, విస్తృత జన శ్రేణుల సెంటిమెంట్లను రగిల్చి, తద్వారా ఉద్యమానికి ఊతం, పనిలోపనిగా రాజకీయ లబ్ధిపొంది ఉండవచ్చు. కానీ అది తాత్కాలికమే. ఆ హింసాత్మక ధోరణి, ఒంటెద్దు పోకడలు, తమ ప్రత్యర్థులందరినీ ఏకం చేస్తాయని, తద్వారా మానసికంగా, రాజకీయంగా ప్రతిఘటన పెరుగుతుందనీ ఊహించక పోవడం హ్రస్వదృష్టికి నిదర్శనం.

హింసను – ఉద్యమంగా, హక్కుగా పునర్‌నిర్వచించడం గడుసుదనమే తప్ప; అది కాల పరీక్షకు, నైతిక ప్రశ్నలకు, తర్కానికి నిలువజాలదు. మనకిష్టం లేనివాడు దారిన పోతుంటే రాళ్ళేయడంలో తప్పులేదనడం, అలా రాళ్ళేసే వాళ్ళను నిరోధించడం అన్యాయమని, అప్రజాస్వామికమని ఇల్లెక్కి అరవడం సరైనది కాదు.

విజయవాడలో ప్రత్యేకవాదుల సమావేశాన్ని అడ్డుకోవడం ఎంత తప్పో, హైదరాబాదులో విశాలాంధ్ర మహాసభ సమావేశాన్ని జరగనివ్వబోమనడం అంతే తప్పు. కొండా లక్ష్మణ్ బాపూజీ ప్రతిపాదించిన సద్భావనా కార్యక్రమం ఆహ్వానించదగ్గది. కానీ అంతటి గౌరవనీయుడు, వయోవృద్ధుడు, స్వాతంత్ర సమరయోధుడు కూడా హైదరాబాద్‌లో సమైక్యతావాణి వినిపించుకునే స్వేచ్ఛకు హామీగానీ, మద్దతుగానీ ఇవ్వలేకపోయారంటే పరిస్థితులు ఎంత చేయిదాటి పోయాయో అర్థం చేసుకోవచ్చు.

ఇవే ధోరణులు కొనసాగితే, కొనసాగనిస్తే క్రమేణా మధ్యయుగాల మౌఢ్యంలోకి, గత శతాబ్దపు నాజీ నియంతృత్వంలోకి దిగజారిపోవడం తథ్యం. ప్రక్కింటివాళ్ళని తిట్టినపుడు, తన్నినపుడు, చంపినపుడు ప్రతిఘటించకపోతే, స్పందించకపోతే; ఆ ముష్కరులే మనింటి తలుపు తట్టినపుడు ఆదుకోమని పిలవడానికి – ప్రక్కింటి వారెవరూ మిగలరు.

సమకాలీన ఉద్యమాల వాతావరణంలో మీడియా, అందులో పనిచేసేవారు ఎంచుకున్న దారులు, పోషిస్తున్న పాత్ర మరింత విషాదకరం. ప్రతి మీడియా సంస్థకూ తనదంటూ ఒక ఎజెండా, స్థూల భావజాలం ఉంటాయనేది అంగీకరించక తప్పని వాస్తవం. అందుకే ప్రసారం, ప్రచురితమయ్యే వార్తలను ఒకింత అనుమాన దృష్టితో, సొంత విచక్షణతో వడపోసి మరీ తలకెక్కించుకోవడం ప్రతి వీక్షకుని, పాఠకుని బాధ్యత. అది చాలదన్నట్లు కొన్ని మీడియా సంస్థలు, దాదాపు అన్ని మీడియా సంస్థల్లోనూ లెక్కించదగినంతమంది ఉద్యోగులు ఏకంగా ప్రత్యేక సంఘాలను ఏర్పరుచుకుని ఉద్యమాల్లో మమేకమైతే, వార్తల్లో సత్యానికి చోటెంత మిగులుతుంది?

ఈ వక్ర వార్తలు, ఉత్తుత్తి శీర్షికలు, ఏకపక్ష వ్యాసాల వెల్లువల్లో సత్యాన్ని వెతికి పట్టుకోవడం గడ్డివాములో సూది కోసం శోధించినంత కష్టమవుతోంది. జాణతనం నేర్చిన యాజమాన్యాలు వార్తా శీర్షికలు (హెడ్‌లైన్స్) ఒక్కో ప్రాంతానికి ఒక్కో రకంగా వేసి, రాసి, తమ పాఠక భక్తులను నిలబెట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఏ రోటి కాడ ఆ పాట పాడి తమ సర్క్యులేషన్ తగ్గకుండా నెట్టుకొస్తున్నారు. ఇదంతా ఒక ఎత్తయితే, విలేఖరులుగా వెళ్ళి, తమ భావాలకు అనుకూలంగా లేని వక్తలపై భౌతిక దాడులకు దిగడం ఉద్యమ వ్యసనానికి పరాకాష్ట. తమ కిష్టంలేని సంస్థలు, వ్యక్తులు ఏర్పాటు చేసిన సభలకు, పత్రికా సమావేశాలకు హాజరు కావద్దని నిర్ణయించు కోవచ్చు. ఒకవేళ హాజరైనా, వక్తలు వెలిబుచ్చిన అభిప్రాయాలు తనకు అభ్యంతరకరమైనవైతే రిపోర్టు చేయకపోవడమో, ప్రచురించకపోవడమో నిర్ణయించుకునే హక్కు ఎలాగూ ఉంది. ఒకవేళ ప్రచురించినా దానితోపాటు తన విశ్లేషణను, అభ్యంతరాలను, వ్యక్తీకరించిన భావాల్లోని అసమంజసతను విపులీకరిస్తూ రాసి ప్రచురించవచ్చు.

ఇన్ని అవకాశాలు, వెసులుబాట్లు ఉన్న రాచమార్గాన్ని వదిలిపెట్టి; వక్తల చేతుల్లోంచి మైకులు లాక్కోవడం, వక్తలను తొయ్యడం, కొట్టడం, వాళ్ళు మాట్లాడ కూడదంటూ నినాదాలు చెయ్యడం, ధర్నాకు దిగడం, వారి ప్రసంగం పూర్తికాకుండానే ప్రశ్నలకు దిగడం, తమ ప్రశ్నలకు తమకు నచ్చిన సమాధానమిచ్చే వరకు ప్రసంగాన్ని కొనసాగించనీయకపోవడం; ఇవన్నీ తమ వృత్తి ధర్మానికి వన్నె తెస్తాయో, లేక తమను కూడా ఒక 'వీధి ఉద్యమకారుడి' స్థాయికి దిగజారుస్తాయో మీడియా ప్రతినిధులు, యాజమాన్యాలు, విమర్శకులు ఆలోచన చెయ్యాలి.

వ్యక్తి స్వేచ్ఛ, భావ స్వేచ్ఛ, చరించే స్వేచ్ఛలేని బ్రతుకైనా, చావైనా ఒకటే. కోల్పోతున్న ఆ స్వేచ్ఛల కోసం ఉద్యమించాలా, ఈ విషయంలో గందరగోళంలో ఉన్నవారికి విడమరిచి బోధించాలా, లేక హక్కులు హననమవుతున్న తీరుకు మౌనంగా రోదిస్తూ మరణం కోసం ఎదురు చూడాలా అన్నది ఎవరికి వారు తీసుకోవాల్సిన నిర్ణయం.

08-01-2012

సపాత్ర దానం

మన దేశంలో దాన కర్ణుల కథలకు కొదవే లేదు. అయితే తనకున్నది అడిగిన వారికల్లా ఊడ్చి పెట్టడం అపాత్రదానమవుతుంది. ఒక మనిషిని దానం ఆశించకుండా సశక్తుడిగా చెయ్యడం మహోత్కృష్టమైన దానం. మనిషిని తనకున్న సహజ పరిమితులకు లోబడి సొంత కాళ్ళ మీద నిలబడగలిగేలా, స్వేచ్ఛగా జీవించేలా సహాయపడడమే అన్నిటికంటే గొప్పదానం. దానితో పోలిస్తే కూడు, గుడ్డలాంటి తక్షణ వినియోగాలకు డబ్బు విదిల్చడం తృణప్రాయమైన తాత్కాలిక సహాయం మాత్రమే.

సమకాలీన ప్రపంచంలో దాన ధర్మాలు, పరోపకారమనేవి – తమ సంపదను నలుగురికీ తెలిసేట్లు ట్రస్టులు..., అన్నదానాలు..., మందుల పంపిణీల్లాంటి రూపాల్లో పంచిపెట్టడమనేది ఫ్యాషన్‌గా మారింది. పూర్వపురోజుల్లో ఇలా వృథా చేసేంత సంపద ఉండేది కాదు. ఎవరికి వారు పొట్టపోసుకోవడమే కష్టమయ్యేది. ఇప్పుడు దాన ధర్మాల పేరిట జరుగుతున్న పందేరాలు ఆశించిన ఫలితాలనివ్వవు, సరికదా, పుచ్చుకునే వారిని సదా బిచ్చగాళ్ళుగా తయారుచేసి, తద్వారా వారిని నష్టపరుస్తాయి. నిజమైన దాతృత్వానికి నాలుగు ప్రధాన లక్షణాలుండాలి. మొదటిది – ఒక విలువైన వస్తువు యొక్క యాజమాన్యం దాత చేతినుంచి గ్రహీత చేతికి మారాలి, అంటే ఇచ్చిన వస్తువు లేదా సంపద ఇచ్చేవాడి సొంతదై ఉండాలి. అంతే తప్ప అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్లు పన్నుల సొమ్ము పంచిపెట్టే ప్రభుత్వ పథకాలు ఈ పరీక్షకు నిలబడవు.

రెండోది – ఇచ్చి పుచ్చుకోవడాలు రెండూ స్వచ్ఛందంగా జరగాలి తప్ప బలవంతంగా ఉండకూడదు. ముఖ్యమైన మూడో లక్షణం – దానం గుప్తమైనదై ఉండాలి. దానం ద్వారా దాతకు వ్యక్తిగతంగా రుణపడి ఉండడం రుణాన్ని సూచిస్తుందే గానీ, అది దానం కాజాలదు. గుప్తదానం కానప్పుడు రుణపడి ఉండే భావనను తప్పించుకోలేము. ఇక చివరగా– ఇచ్చిన దానం దీర్ఘకాలంలో గ్రహీతకు ఉపయోగపడేదై ఉండాలి. ఇది దాత యొక్క వివేచనకు

సవాలే తప్ప దాతృత్వానికి పరీక్ష కాదు. వీటిలో అతి ముఖ్యమైనది గుప్తత్వం, అనభిజ్ఞత (అనానిమిటీ). అది లేకుండా తన సొంత డబ్బా కొట్టుకోవడానికిచ్చే దానాలు అహాన్ని సంతృప్తిపరిచే షోకులే తప్ప; అవి నిజమైన దానాలు కావు. మనం రోజూ చూసి దాన ధర్మాలనుకునే వాటిలో అత్యధిక శాతం పైన చెప్పిన నాలుగు నిబంధనలలో ఏదో ఒక దానికైనా లోబడనటువంటివే.

చాలా దానాలు – ఏదో ఒకరోజు ఏదో ఒక రకంగా తనకు గ్రహీత ఉపయోగపడతాడనే 'అప్రకటిత భావం'తో ఇచ్చేవే. ఏ రకంగా తీర్చుకోవాలో ఖచ్చితంగా చెప్పరు కానీ, ఏదో ఒక రకంగా తీర్చుకోక తప్పని ఋణాలే. చివరికది ఖచ్చితత్వం లోపించి, తీర్చుకున్నామో, లేదో తెలియని పరిస్థితికి దారితీస్తాయి. దాతవైపు నుంచి 'నేనింత చేశాను, తనేమీ చెయ్యలేదు' అనే ఆలోచన, 'నేను పొందిన దాని కన్నా ఎక్కువే తిరిగి చేశాను' అనే భావన గ్రహీత వైపు నుంచి దీంతో ఇద్దరూ అశాంతికి గురవుతారు. తిరిగి ఏమీ చెయ్యలేని వారు; జీవితాంతం దాతలకు మానసిక బానిసలుగా మిగిలిపోతారు. ఈ క్రమంలో మనిషి ఇంకొక మనిషికో లేక ఒక వర్గానికో భౌతికంగానో, కనీసం మానసికంగానో బానిసై పోతాడు. జాతీయ, సామ్యవాదాల్లో మనిషి తన స్వయం సమృద్ధిని, వ్యక్తిత్వాన్ని కోల్పోయి, తన మనుగడ కోసం రాజ్యం మీద ఆధారపడే బానిసగా మిగిలిపోతాడు. ఆధునిక కమ్యూనిజానికి మూల సిద్ధాంత కర్తలు రూసో, తదుపరి మార్క్స్‌ల దృష్టిలో మనిషి అనేవాడు తన ఉనికి కోసం సమాజం మీద ఆధారపడే సంక్లిష్ట సామాజిక సంబంధాల సమాహారం మాత్రమే. ఈ రకంగా ప్రజా బాహుళ్యాలను సామాజీకరించడం ద్వారా శాశ్వత అభద్రత, బానిసత్వం, పరాధీనతలకు గురిచేశారు.

వ్యక్తిగత, లేదా విస్తృత, వర్గ సామాజిక స్థాయిలో బానిసత్వానికి దారితీయని దానం స్వచ్ఛంద వస్తుమార్పిడి, ఋణాల రూపంలో డబ్బు ఇచ్చి, పుచ్చుకోవడం, పెట్టుబడులు పెట్టడంలో మాత్రమే సాధ్యం. ఆకలంటున్న వాడికి పట్టెడన్నం పెట్టడమో, లేక తినమని డబ్బులివ్వడమో లాంటి ప్రత్యక్ష వినియోగాలకు దానం చెయ్యడం తప్పు పట్టాల్సిన విషయం కాకపోయినా; వివేచన దృష్ట్యా అది దీర్ఘకాలం సాగదు. *వాస్తవంగా చూసినా, తార్కికంగా ఆలోచించినా, సంపాదించిన డబ్బును పొదుపు చేసి, యంత్ర పరికరాలకు పెట్టుబడిగా పెట్టడం అన్నిటికన్నా శ్రేష్ఠమైన దానం. విలువగల యంత్ర పరికరాలు, పనిముట్లు ఉత్పత్తికి దోహదపడి, అందరికీ మేలు చేస్తాయి. నిజమైన దాన, ధర్మాలకుండాల్సిన అన్ని లక్షణాలూ దీనిలో ఉన్నాయి.*

మొదటి లక్షణమైన – విలువైన వస్తువుల యాజమాన్య మార్పిడి – ఇందులో జరుగుతుంది. యంత్రపరికరాల వల్ల వచ్చిన అదనపు ఉత్పత్తిలో కొంతభాగం మాత్రమే

యజమానికి మిగులుతుంది. అధిక భాగం ఉద్యోగులకు, వినియోగ దారులకు చేరుతుంది. ఇక రెండో లక్షణం – మార్పిడి స్వచ్ఛందంగా జరిగింది. ఇందులో దొంగతనం లేదు, బలవంతమూ లేదు. కానీ ఉత్పత్తి సాధనాలన్నీ ప్రభుత్వాధీనంలో ఉండే కమ్యూనిస్టు దేశాల్లో వస్తుమార్పిడి స్వచ్ఛందం కాదు. ఇక మూడోది, ముఖ్య లక్షణమైన గుప్తత్వం విషయానికొస్తే, ఇంతకన్నా గుప్తదానం మరొకటి లేదు. తమకు కలిగిన లాభం ఎవరి వల్ల కలిగిందో వినియోగదారులకు తెలిసే అవకాశం లేదు. ఉదాహరణకు కొత్త సబ్బుల ఫ్యాక్టరీలు పెడితే సబ్బుల రేట్లు తగ్గుతాయి, నాణ్యత పెరుగుతుంది. కానీ సబ్బులు వాడేవారికి – ఫ్యాక్టరీ యజమానులెవరో, మేనేజర్లు ఎవరో, పెట్టుబడి పెట్టిన వాటాదారు లెవరో తెలియదు. కానీ ఎవరివో – పొదుపు, పెట్టుబడుల వల్ల వీరు లాభపడతారు.

మనం రోజూ చూసే సాధారణ దాతృత్వాల్లో ఎన్ని ఈ మూడు లక్షణాలు కలిగి ఉన్నవో ఆలోచిస్తే అర్థమవుతుంది. అమెరికా లాంటి అత్యధికంగా అభివృద్ధి చెందిన దేశాల ప్రజలు మిగతా ప్రపంచ ప్రజలతో పోలిస్తే పదుల రెట్లలో సౌఖ్యాలు, సౌకర్యాలు, వస్తు సేవా సదుపాయాలు అనుభవిస్తున్నారు. దీనికోసం వారేమీ ఎక్కువ గంటలు కష్టపడరు, ఎక్కువ తెలివికలవారేమీ కాదు. తేడా అంతా యంత్ర పరికరాలు, పనిముట్లలో ఉంది. వారి పూర్వీకులు కష్టపడి సంపాదించిన దాంట్లో ఎక్కువ భాగం పొదుపుచేసి, ఆస్తి హక్కులు స్పష్టంగా నిర్వచించిన స్వేచ్ఛా వాణిజ్య వాతావరణంలో యంత్రాలు, శాస్త్ర విజ్ఞానాల కోసం పెట్టుబడులు పెట్టడమే వారి నేటి తలసరి సంపద, ఆదాయాలకు కారణం.

ఈ యంత్ర పరికరాలు, పెట్టుబడుల వల్ల వచ్చే అదనపు ఉత్పత్తి ఎవరికి వెళ్ళింది? ఒక అంచనా ప్రకారం పెట్టుబడి పెట్టినవారికి 15 శాతం, వినియోగదారులు, ఉద్యోగులు, శ్రామికులకు 85 శాతం పోతుంది. ఆర్థిక వ్యవస్థ ఎంత స్వేచ్ఛాయుత వాతావరణంలో ఉంటే; పెట్టుబడి దారులకు అంత తక్కువ, వినియోగదారులకు అంత ఎక్కువ వాటా వెళుతుంది. ప్రభుత్వం, రౌడీల సాయంతో – ఇసుక, మైనింగ్, కాంట్రాక్టులు, మద్యం వ్యాపారాలు చేసేవారికి ఈ లెక్కలు వర్తించవు.

ఈ వాస్తవాలు – మార్క్స్ ప్రతిపాదించిన అదనపు విలువ సిద్ధాంతానికి సమాధానం చెబుతాయి. మార్క్స్ సిద్ధాంతం ప్రకారం – పెట్టుబడిదారుడు పొందే 15 శాతం కూడా వినియోగదారులకో లేక కార్మికులకో చెందుతుంది. కాకపోతే ఆ పెట్టుబడిదారుడి పొదుపు, పెట్టుబడి, యంత్రాలు లేనినాడు అసలు ఉత్పత్తే జరగదని, అప్పుడు ఈ అదనపు ఉత్పత్తి ఎవరికి చెందాలనే ప్రశ్నే ఉదయించదనీ గమనించాలి. అంతేకాక మార్కెట్‌లో జరిగే ప్రతి మార్పిడి (ఎక్స్‌ఛేంజి)లోనూ అదనపు విలువ చేతులు

మారుతుంది. శేరు బియ్యం పోసి రెండు వీశెలు ఉల్లిపాయలు కొన్నప్పుడు ఇచ్చి, పుచ్చుకున్న ఇద్దరూ తమకు లాభసాటైన బేరం దొరికిందనుకుంటారు. ఎవరికెంత లాభం అన్నది వారి వారి ఆత్మాశ్రయ(సబ్జెక్టివ్) మూల్యాంకనం (Valuation) మీద ఆధారపడి ఉంటుంది.

ఈ రకంగా ***స్వేచ్ఛాయుత మార్కెట్‌లో జరిగే ప్రతి మార్పిడి ఇరుపక్షాలకూ లాభం చేకూరుస్తుంది. అదే విధంగా స్వేచ్ఛా మార్కెట్‌లో యంత్ర పరికరాల వల్ల చేకూరిన అదనపు ఉత్పత్తి అన్ని పక్షాలకూ ఆమోదయోగ్యమైన రీతిలో విభజింపబడుతుంది. అందరికీ లాభం జరుగుతుంది.*** ఇందులో దోపిడీ లేదు సరికదా; అది అత్యంత శ్రేష్ఠమైన దానధర్మాలతో సమానం. మార్కెట్‌లో రోజూ జరిగే ఈ దానాలతో పోలిస్తే వ్యక్తులు ఇచ్చే విరాళాలు, స్వచ్ఛంద సంస్థల కార్యక్రమాల విలువ అతి స్వల్పం. నారుమడిలో చల్లడానికి విత్తనాలు మోసుకెళ్తూ దారిలో కనపించిన అన్నార్తుడికి వాటిని దానం చెయ్యడం అనేది చూడ్డానికి రొమాంటిక్‌గా కనిపించవచ్చు, కానీ అట్టి 'శీఘ్ర సంతృప్త' వికారాన్ని అణుచుకుని, విత్తనాలు చల్లి, పంట పండిస్తే ఒక్కరికి బదులు వందమందికి తిండి పెట్టిన వారమవుతామనే వివేచన ముఖ్యం.

శక్తి ఉండి కూడా కూర్చుని అడుక్కునేవారికి బిచ్చం వేయడం కంటే, కష్టపడ్డానికి సిద్ధపడ్డవానికి పని కల్పించడం విశిష్టమైన దానం. సామ్యవాద, కమ్యూనిస్టు విధానాల్లో ఇలాంటి అవకాశాలుండవు. ఆ విధానాలు మనిషిలోని చొరవను, ఆలోచనను, ఉత్సాహాన్ని, ప్రోత్సాహకరాన్ని సమాధి చేసి, బంగారు గుడ్లు పెట్టే బాతును కోసుకు తింటాయి. యంత్రాలు, పనిముట్ల వల్ల ఉత్పత్తి పెరుగుతుంది, కాబట్టి వాటిని జాతీయం చేస్తే, ప్రభుత్వమే దానకర్ణుడు, ధర్మకర్తల పాత్ర పోషించవచ్చుననుకునే ప్రమాదం ఉంది. కానీ జాతీయీకరణ, పన్నుల రూపంలో దొంగలించిన, బలవంతంగా వసూలు చేసిన సొమ్మును సంక్షేమ పథకాల రూపంలో పంచిపెట్టడం దానం కాదు.

దొంగతనం దొంగతనమే. గుళ్ళోకొచ్చిన వారు స్వచ్ఛందంగా హుండీలో వేయడం వేరు. వచ్చిన వాళ్ళ జేబుల్లో డబ్బు లాక్కుని హుండీ నింపడం వేరు. అది ఎంతో కాలం సాగదు. తదుపరి శనివారం నాడు భక్తులందరూ జేబులు ఖాళీగా పెట్టుకుని వస్తారు.

నిజమైన దానం అనేది – ప్రభుత్వేతర (ప్రైవేటు) వ్యక్తులు, వారి పెట్టుబడుల ద్వారా మాత్రమే సాధ్యం. స్వచ్ఛందమైనదే దానం. సంపాదన, పొదుపు, పెట్టుబడి, ప్రైవేటు యాజమాన్యంలో ఉత్పత్తి సాధనాలు – ఇదే ధర్మమార్గం, సపాత్ర దాన మార్గం. పన్నుల సొమ్మును పథకాల్లో వెదజల్లడం, అవినీతి సొమ్ముతో ఓట్ల కొనుగోలు, అస్మదీయులకు అందలాలు, కాంట్రాక్టులు, భూములు, లైసెన్సులు – ఇవి దానాలు కావు. అధికార దుర్వినియోగాలు.

22-01-2012

గణాంక తంత్ర దేశం

ఉత్తరప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న సందర్భంగా - నినాదాల హోరు, వాగ్దానాల జోరు ఊపందుకున్నాయి. గత పాతికేళ్ళుగా అక్కడి రాజకీయాలు కులాలు, మతాల చుట్టూనే తిరుగుతున్నాయి. ప్రతి ఎన్నిక లోనూ ఏదో ఒక కుల లేదా వర్గ లేదా మతానికి సంబంధించిన విషయమే ప్రధాన అంశంగా నిలుస్తోంది. క్రిందటి సారి జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో దళిత, బ్రాహ్మణ ఐక్యసంఘటన మాయావతి నేతృత్వంలో ప్రభంజనంలా ముందుకొచ్చింది.

ఈ సారి ముస్లింల ఓట్ల కోసం కుమ్ములాడుకుంటున్నారు. 2004 నుంచీ దేశమంతటా ముస్లిములు కాంగ్రెస్, దాని కూటమిలోని పార్టీలకే మొగ్గుచూపుతున్నా, ఉత్తరప్రదేశ్‌లో మాత్రం వారు ఏకపక్షంగా కాంగ్రెస్ బాట పట్టడం లేదు. ప్రత్యామ్నాయంగా ఉన్న సమాజ్‌వాదీ పార్టీని ఆదరిస్తూ వచ్చారు. ఈసారి ఎన్నికలను ప్రతిష్టాత్మకంగాను, తన భావి ప్రధాన మంత్రిత్వానికి ముఖ్యమైన నిచ్చెన మెట్టుగాను భావిస్తున్న యువరాజు - ఈ ఎన్నికల్లో పూర్తిగా మునిగిపోయారు. మాయావతి ప్రభావం నుంచి దళితులను బయటకులాగి తనవైపుకు తిప్పుకోవడానికి దళితవాడల్లో భోజనం చెయ్యడం, నిద్రించడం లాంటి జిమ్మిక్కులు ఆరునెలల కొకసారి చేయడం, దాన్ని జాతీయ స్థాయిలో ఆంగ్ల ఛానళ్ళు బ్రేకింగ్ న్యూస్‌గా ప్రచారం చెయ్యడం గత రెండేళ్ళుగా చూస్తూనే ఉన్నాం.

ఎన్నికలు దగ్గరకొచ్చేసరికి ముస్లిముల ఓట్లకు గాలం వెయ్యడానికి వారికి విద్య, ఉద్యోగాల్లో నాలుగున్నర శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రకటించారు. ఆ నాలుగున్నర శాతాన్ని బలహీన వర్గాలకిచ్చే రిజర్వేషన్ల నుంచి తీసి ఇస్తామన్నారు. ఎన్నికల్లో అభ్యర్థి భర్త, కేంద్రమంత్రి అయిన సల్మాన్ ఖుర్షీద్ ఆ రిజర్వేషన్ల శాతాన్ని తొమ్మిదికి పెంచుతామన్నారు. ముస్లిం ఓట్లపై పట్టును ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోలేని ములాయంసింగ్ పార్టీ; ఏకంగా పద్దెనిమిది శాతం రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించేసింది.

ఎన్నికలయ్యేలోగా ఈ హాస్యనాటకం ఇంకెన్ని మలుపులు తిరుగుతుందో వేచిచూడాల్సిందే.

ముస్లిములకు ఎన్నికల నేపథ్యంలో రిజర్వేషన్లు ప్రకటించడం ప్రజాస్వామ్య ప్రక్రియను అపహాస్యం చేయడమేనని, ఇది మతపరంగా దేశంలో ప్రజల మానసిక విభజనకు దారితీస్తుందని జాతీయ మీడియా గొంతు చించుకుంటోంది. బలహీన వర్గాల రిజర్వేషన్లలో కోతపెట్టి దాన్ని ముస్లిములకు కట్టబెట్టడమేమిటని ఆ వర్గాలు నిలదీస్తున్నాయి. పోటీపడి ప్రకటిస్తున్న ముస్లిం రిజర్వేషన్ల శాతాల వల్ల హిందువుల్లో కలిగే ప్రతిస్పందనను పిండుకుని ఓట్లేయించుకోవాలని భాజపా ప్రయత్నిస్తోంది. సుప్రీంకోర్టు నిర్దేశించిన మొత్తంమీద యాభైశాతం రిజర్వేషన్ల పరిధిని దాటడం న్యాయ విరుద్ధమని రాజ్యాంగ నిపుణులు, న్యాయ కోవిదులు ఘోషిస్తున్నారు.

కాకపోతే, ఈ సందర్భంలో ఉదయించే రకరకాల మౌలిక ప్రశ్నలకు వీరిలో ఎవరూ జవాబివ్వరు.

అసలు ఏ కులానికయినా, వర్గానికయినా రిజర్వేషన్లు ఎందుకుండాలి? మనది రాజ్యాంగబద్ధ గణతంత్ర దేశమా, లేక కులాల, వర్గాల గణాంకాల దేశమా? పౌరుల్లో కొందరు పౌరులు వేరా? ప్రతిభ అనేది మిథ్య అని, రిజర్వేషన్లు రాజ్యాంగ బద్ధమేనని కోర్టులు తీర్పులిచ్చాక ఈ శషబిషలెందుకు? రిజర్వేషన్లు యాభైశాతం మించకూడదన్న సుప్రీంకోర్టు తీర్పుకు ప్రాతిపదిక ఏమన్నా ఉందా? లేదు. యాభై బదులు అరవయ్యో, డెబ్భైయ్యో అని అన్నప్పటికీ; అదే శాసనమయ్యేది. మండల్ కమిషన్ పేరుతో బలహీన వర్గాలకు రిజర్వేషన్లిచ్చినప్పుడు సమర్థించిన వారు ఇంకో కమిషన్ ముసుగు చాటున ముస్లిములకు రిజర్వేషన్ల నివ్వడాన్ని ఎలా తప్పుపట్టగలరు? జనాభా ప్రాతిపదికన కొన్ని కులాలకు, మహిళలకు, రిజర్వేషన్లిచ్చినప్పుడు అదే జనాభా ప్రాతిపదికన ముస్లిముల కిస్తే తప్పేముంది? సమాధానాలు దొరకవు.

ఈ ఎన్నికల కాలంలో మరెన్నో సిత్రాలు జరిగాయి. జైపూర్‌లో జరిగిన ప్రపంచ సాహిత్య సమ్మేళనంలో పాల్గొనడానికొస్తున్న సల్మాన్ రష్దీని రాకుండా చెయ్యడానికి జరపని ప్రయత్నం లేదు. ఆయన రాసిన పుస్తకాన్ని ప్రపంచంలోని అన్ని దేశాల కన్నా ముందుగా నిషేధించిన ఘనత దక్కించుకున్న భారతదేశం – ఆయన రాకపోకలను ఇంతకుముందు ఏనాడూ నిషేధించలేదు. అయినా గానీ ఈ సున్నిత ఎన్నికల వాతావరణంలో ఆయన రాకను కొందరు ముస్లిం మతాధిపతులు నిరసించగానే, రాజస్థాన్ ప్రభుత్వం ఆయన రాకను నిషేధించకనే నిషేధించింది. చివరకు ఆయన వీడియో ద్వారా తన సందేశాన్ని వినిపించడానికి కూడా వీల్లేకుండా చేసింది. నిన్నగాక మొన్న బంగ్లాదేశ్ రచయిత్రి

తస్లీమా నస్రీన్ రాసిన పుస్తకావిష్కరణ కూడా ముస్లిం వర్గాల నిరసన కారణంగా జరగనీయకుండా చేశారు. ఇది లౌకిక తత్వమా, కేవలం రాజకీయ లౌక్యమా అన్నది తేటతెల్లం.

అపరిమిత ప్రజాస్వామ్యం – మూకస్వామ్యమై ప్రభుత్వానికి అన్ని వనరుల మీదా – ప్రకృతి వనరులు, ప్రజలు, వారి సంపాదన, వారి భావస్వేచ్ఛ, వారి వ్యాపారాలు, అలవాట్లు, ఆస్తి పంపకాలు, ఇలా అన్నిటిమీదా – ఆధిపత్యాన్ని చెలాయిస్తోంది. ఎప్పుడు కావాలంటే అప్పుడు, ఏ వనరును కావాలంటే దాన్ని కబళించే సర్వాధికారాలూ ఈ మూకస్వామ్యం ప్రభుత్వాలకిస్తుంది.

ప్రాథమిక హక్కులు కేవలం కాగితాలకే పరిమితం. అవి ప్రభుత్వాక్రమణకు అతీతం కావు. మూక పరిపాలనే ప్రాథమికం. దీని సమర్థకులు తమకు నచ్చిన రీతిలో ఇతరుల జీవితాలపై దాడి చేయడం తమ హక్కనుకుంటారు. సరైన పరిమాణంలో మూకను పోగేసు కోగలిగితే చాలు, ఎన్నికల ఫలితాలను ప్రభావితం చెయ్యగల ప్రతిగుంపూ ప్రజాస్వామ్యం పేరిట ఇతరులెవరినైనా నిర్దేశించగలిగే నైతిక అనుమతి పొందుతోంది. ఒక మూక చేసిన నిర్దిష్ట చర్యను తీవ్రంగా వ్యతిరేకించే వారు కూడా మూకస్వామ్య భావజాల నిబంధనలకు లోబడి దుర్మార్గాన్ని విమర్శించలేరు, అడ్డుకోలేరు. ఎందుకంటే వేరే ఒక విషయంలో వారు కూడా ఈ మూకస్వామ్య వెసులుబాటును ఉపయోగించుకున్నవారే. ఉదాహరణకు ఎస్సి, బిసి రిజర్వేషన్లు పొందేవారు ముస్లిం రిజర్వేషన్లను విమర్శించజాలరు. వాలంటైన్స్‌డే నాడు యువతీ యువకులను పరుగులెత్తించే మౌధ్యులు సల్మాన్ రష్దీపై నిషేధాన్ని నిరసించలేరు.

ప్రజలు అనుభవిస్తున్న ఆస్తిహక్కులు, వ్యక్తిస్వేచ్ఛ, ప్రాథమిక హక్కులు ప్రభుత్వాల, మూకల దయాదాక్షిణ్యాల మేరకే అనుభవించాల్సి వస్తోంది తప్ప; అవి ఎవరూ కబళించలేని మౌలిక, నైతిక, ప్రాథమిక హక్కులు కాకుండా పోయాయి. మూకల పరిపాలనను, దాని ద్వారా వచ్చిన 'వనరులపై ప్రభుత్వాధిపత్యం' అనే సూత్రాన్ని తిరస్కరిస్తే తప్ప – ఈ దాస్యం నుంచి విముక్తిలేదు. ప్రజలమీద పెత్తనం చెలాయించే అధికారాలను అంగీకరించినంత కాలం ఏవో కొన్ని విధాన నిర్ణయాలను ప్రశ్నించడం, నిరసించడం ప్రభుత్వాలను కలవర పెట్టదు. ఆ విధానాలపైన, ప్రభుత్వాలను ఎన్నుకునే తీరుమీద జరిగే సిద్ధాంత రాద్ధాంతాల కన్నా, అసలు ప్రభుత్వాలు ప్రజల జీవితంలో జోక్యం చేసుకునే విషయంలో పరిమితులుండాలి అనే చర్చ ముఖ్యం. మూకస్వామ్య ప్రియులందరూ ప్రస్తుతం ఉన్న ప్రజాస్వామ్యం పనితీరు పట్ల తీవ్ర అసంతృప్తిలో ఉంటారు. 'సరైన' నాయకులను

ఎన్నుకుంటే తమకు, తమ గుంపుకు ఇష్టమైన రాజకీయ విలువలు, ప్రభుత్వ కార్యక్రమాలతో ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని జీవితాంతం ఎదురు చూస్తుంటారు. కానీ ఆ 'సరైన' తనం ఏమిటన్న విషయంలో ఎన్ని గుంపులుంటే అన్ని భిన్నాభిప్రాయాలుంటాయి. సమాజాన్ని నడిపించ డానికి గుంపు స్వామ్యమే సరైన మార్గ సూత్రమని నమ్మడమే ఈ అనర్ధదాయక ఆలోచనలకు మూలకారణం.

ధర్మ రాహిత్యానికి పాల్పడ్డాడన్న ఆరోపణలతో నాటి ఏథెన్సులోని మూకల డిమాండ్ల మేరకు తత్వవేత్త సోక్రటీసుకు విషం తాగించి చంపిన నాటి నుంచి ఇప్పటివరకూ మూకస్వామ్యంలో ఉన్న ప్రమాదాలను ప్రపంచ ప్రజలు గ్రహించలేకపోతున్నారు. భౌతిక బల ప్రదర్శనల ద్వారా వచ్చినా, లేక పోలింగు బూత్ ద్వారా వచ్చినా, కండబలం, మందబలం నైతికతకు గీటురాయి కాదు, కారాదు. ఇవాళ్టి సమస్య ముస్లిం రిజర్వేషన్లో, సల్మాన్ రష్దీ, తస్లీమాల బహిష్కరణలో కాదు. మూకస్వామ్యమా.... వ్యక్తి హక్కులా? ప్రాథమిక హక్కులా.... ప్రభుత్వం దయాదాక్షిణ్యాలా? రాజ్యాంగ బద్ధ గణతంత్రమా... గణాంకాల ప్రహసనమా?

05-02-2012

చక్రభ్రమణం

ప్రతి అయిదు, పదేళ్ళకోసారి రాష్ట్ర, కేంద్రాల్లో ప్రభుత్వాలు మారిపోతుంటాయి. దాదాపు అంతే పౌనఃపున్యం (ఫ్రీక్వెన్సీ)తో దేశ ఆర్థిక వ్యవస్థలు కూడా ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటాయి, సంక్షోభాలు తలెత్తుతాయి. వచ్చే ప్రతి కొత్త తరానికీ ఈ సంక్షోభాలు కొత్తగాను, వారి తరానికే ప్రత్యేకించి జరుగుతున్నట్లుగాను అనిపిస్తాయి. కానీ, దూరంగా నిల్చుని, చారిత్రక దృష్టికోణంతో చూస్తే, జరిగే పరిణామాల్లోని చక్రభ్రమణ తత్వం స్పష్టంగా కనిపిస్తుంది. మారనిదల్లా ఒకటే – రూపాయి విలువలో క్షీణత, తద్వారా ధరల పెరుగుదల, ప్రభుత్వ పరిమాణం, దాన్లోని అవినీతి పెరుగుదల. వీటిల్లో మార్పు లేదు. ఇవన్నీ ఒక దానితో ఒకటి ముడిపడి ఉన్న అంశాలు. వీటిలో ఏదీ స్వతంత్రంగా తనంతట తాను పెరగడమో, తగ్గడమో జరగదు.

అంతేగాక, మనకు రోజువారీగా కనపడని, తెలియని, తెరచాటు ప్రభుత్వ నిర్ణయాలు ప్రజల దైనందిన ఆర్థిక పరిస్థితులను పెద్ద యెత్తున ప్రభావితం చేస్తాయి. వాటికి సంక్షేమం, అభివృద్ధి, అభ్యుదయం, హక్కులు, సామాజిక న్యాయం లాంటి రంగులద్ది; ముసుగువేసి – ప్రజా.... మేధావి.... మీడియా వర్గాల్లోకి వదులుతారు. సంక్షోభం చెయ్యిదాటుతోందనుకున్నప్పుడు తాత్కాలిక విరుగుడు కోసం మరో కొత్త ముసుగు తొడగగల సామర్థ్యాన్నే – 'రాజకీయ చతురత' అంటారు. ఒక (ఇంగ్లీషు) మాఫియా సినిమాలో అన్నట్లు, 'ఫైనాన్స్ అన్నది తుపాకీ లాంటిది, ట్రిగ్గర్ ఎప్పుడు నొక్కాలో నిర్ణయించడమే రాజకీయం'. బడ్జెట్లు, ఆర్థిక సర్వేలు, పంచవర్ష ప్రణాళికలు, రిజర్వు బ్యాంకు నిర్ణయాలు ఇవన్నీ ఆ రాజకీయాల్లో భాగమే.

ఉదాహరణకు కేంద్రంలో ఎన్‌డిఏ ప్రభుత్వం పనిచేసిన ఆరు సంవత్సరాలలో డీజిలు, పెట్రోలు ధరలు పదిహేను సార్లు పెంచారని అప్పట్లో ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్, ఇతర పార్టీలు రాజకీయంగా విరుచుకుపడ్డాయి. విమానాల ఇంధన ఛార్జీలు తగ్గించి,

డీజిలు ఛార్జీలు పెంచారని, తద్వారా సగటు మనిషిని దెబ్బతీసి, విమానాల్లో తిరిగేవారికి రాయితీలిచ్చారనీ ధ్వజమెత్తాయి. 2003 నాటికి పెట్రోలు, డీజిలు ధరలను నిర్ణయించే అధికారాన్ని ప్రభుత్వం వదులుకుని, నిర్ణయాధికారాలను ఆయా పెట్రోలియం కంపెనీలకే ఇవ్వాలని అంతకుముందు పనిచేసిన దేవగౌడ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అమలుపరచడంతో అగ్నికి ఆజ్యం పోసినట్టైంది.

అంతర్జాతీయ ధరలు, దేశీయ సరఫరా, వినియోగాన్ని బట్టి ప్రతి పదిహేను రోజులకోసారి ధరలు సవరించడంతో; ఈ విధానానికి ప్రజలు అలవాటు పడడానికి సమయం పట్టింది. కొన్నిసార్లు ధరలు తగ్గినప్పటికీ, ఆ అనిశ్చిత పరిస్థితులు ఒడిదుడుకులుగానే తోచాయి. ఈ విధానాలను అంతగా వ్యతిరేకించిన యుపిఎ ప్రభుత్వం చేసిందేమిటి?

గత ఎనిమిదేళ్ళలో డీజిలు, పెట్రోలు ధరలను ఎన్నోసార్లు పెంచారు. వంటగ్యాస్ ధరలను కూడా పెంచారు. సుమారు ఆరేళ్ళపాటు ఇతర పన్నులను మళ్ళించడం ద్వారా స్థానిక, రాష్ట్ర, కేంద్ర ఎన్నికలు వచ్చినప్పుడల్లా పెట్రోలు ధరలు పెరక్కుండా ఆపగలిగినా, చివరకు భారం మొయ్యలేక చేతులెత్తేశారు. మళ్ళీ ధరల నిర్ణయాధికారం పెట్రోలియం కంపెనీలకు అప్పజెప్పారు. అయినప్పటికీ, పెట్రోలియం కంపెనీలు సామర్థ్యరీత్యా తొంభైశాతం పైగా ప్రభుత్వ రంగ సంస్థలే కావడంతో – ముఖ్యమైన రాష్ట్రాల ఎన్నికలు జరిగే సందర్భంలో ధరలు పెంచకుండా ఆపించగలిగే శక్తి కేంద్ర ప్రభుత్వానికి ఎలాగూ ఉంది. విమానాల ఇంధన ధరలు కొన్ని సందర్భాల్లో తగ్గించడం కూడా జరిగింది.

మరి ఎన్‌డిఎ, యుపిఎ ప్రభుత్వాలకు ఏ విషయంలోనైనా తేడా ఏముంది? ఏమీలేదు. ఈ మసిపూసి మారేడుకాయ చెయ్యడమే 'రాజకీయ చతురత'. విషాద మేమిటంటే, ఆటో డ్రైవరు, ట్రాక్టరు తోలే రైతులతో పాటుగా మేధావులు కూడా ఈ రాజకీయ విన్యాసాల అసలు స్వరూపాన్ని గమనించకపోవడం.

వాస్తవమేమిటంటే – డీజిలు, పెట్రోలు ధరలు అంతర్జాతీయ ముడి చమురు ధరల మీద ముఖ్యంగా ఆధారపడతాయి. దేశీయంగా చమురు రంగమంతా ప్రభుత్వ ఆధీనంలో ఉంది. పోటీలేదు. దాంతో చమురు దిగుమతి రేటు, శుద్ధి కేంద్రాలు, పంపిణీ వ్యవస్థ ఇలా అన్ని విషయాల్లోను, అన్ని స్థాయిల్లోను అలసత్వం, అవినీతి, బాధ్యతారాహిత్యం తాండవిస్తుంటాయి. దానికి తోడు కేంద్ర, రాష్ట్రాల పన్నుల బాదుడు ఉండనే ఉంది. ప్రపంచ వ్యాప్తంగా డీజిలు, పెట్రోలు ధరలు దాదాపు సమానంగా ఉంటాయి. మనదేశంలో మాత్రం తీవ్ర వ్యత్యాసముంది. మారిన టెక్నాలజీతో, డీజిలు వాడేవారు పేదలు మాత్రమే కాదు, పెట్రోలు వాడే మోటారు సైకిళ్ళవారు ధనికులూ కాదు. అలాగే, విమానాల

ఇంధనం ధర అంతర్జాతీయ ధరకు అనుగుణంగా ఉండాలే తప్ప ఇష్టమొచ్చినట్లు పెంచడం కుదరదు. 2003లో కావలసినన్నిగా దొరికిన గ్యాసు సిలిండర్లకు, అయిదేళ్ళలో కొరతెలా వచ్చింది? ఇంటికొకటే ఇస్తాం, రెండు నెలలకు ఒకటే ఇస్తాం అనడమెందుకు? ఆ వంట గ్యాసు కిచ్చే సబ్సిడీ కూడా మన దగ్గర్నుంచే ఇంకో రూపంలో వసూలు చేసిందే కదా!

కేంద్ర ప్రభుత్వానికి నిధుల కొరత అనే సమస్యే లేదు. సర్వీసు టాక్సు లాంటి కొత్త కొత్త పన్నులతో పాటు కావలసినన్ని నిధులు సమకూర్చుకోవడానికి బయటకు కనపడని మార్గాలెన్నో ఉన్నాయి. లోటు బడ్జెట్ పూరించడానికి నోట్ల ముద్రణ యంత్రాలు వారి ఆధీనంలోనే ఉంటాయి. దేశీయంగాను, అంతర్జాతీయం గాను ఎంత కావాలంటే అంత అప్పుతెచ్చుకోగల వెసులుబాటు ఉంది. నేటికి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న అప్పు 28 లక్షల కోట్లు. ఇది దేశ స్థూల ఉత్పత్తిలో అరవైశాతం. దీన్ని ఎంతయినా పెంచుకోగల శక్తి వారికి ఉంది. పదిహేనున్నర ట్రిలియన్ డాలర్లతో వారి దేశ స్థూల ఉత్పత్తి కంటే ఎక్కువ స్థాయిలో అమెరికా అప్పుపడింది. దాని బాటలోనే ఇతర దేశాలన్నీ నడుస్తున్నాయి. అంతేగాక, అభివృద్ధి రేటు మందగించిందనుకున్నప్పుడల్లా రిజర్వుబ్యాంకును ఆదేశించి, వడ్డీరేట్లు తగ్గించి, అప్పుల పరిమాణం పెంచడం ద్వారా కొత్తడబ్బును మార్కెట్‌లోకి వదులుతారు. దాంతో తాత్కాలిక మిలమిల మెరుపులతో అభివృద్ధి అంకెలు మారతాయి. డబ్బు ముద్రణ, రిజర్వు బ్యాంకు విన్యాసాల ద్వారా యేటా సగటున డబ్బు పరిమాణం ముప్పై శాతం పెంచుతున్నారు. మరి ధరలు పెరక్క చస్తాయా? ఈ విధంగా తామే కారకులైన ద్రవ్యోల్బణం పాపాన్ని ఇతర దేశాల మీదో, దేవుళ్ళమీదో, వ్యాపార రంగం మీదో రుద్దడానికి ప్రయత్నించడం హాస్యాస్పదమే కాదు, పచ్చి మోసం కూడా.

నిజమైన సంపద సృష్టితో సంబంధం లేకుండా ముద్రణ, రుణాల ద్వారా డబ్బును ప్రవహింపజేయడం వల్ల నిజంగా లాభదాయకం కాని వ్యాపారాలు, ఉత్పాదనలు, వ్యాపకాలు లాభదాయక మైనవిగా భ్రమింపజేస్తాయి. ఆ రంగాల్లో పెట్టుబడులు పెట్టి సగం దూరం వెళ్ళేసరికి చేసిన తప్పుల ప్రభావం నాలుగు వైపుల నుంచి ఒత్తిడికి గురిచేసి, ముందుకు వెళ్ళలేక, అప్పటికే పెట్టిన పెట్టుబడులు ఇరుక్కుపోయి సంక్షోభం తలెత్తుతుంది. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల్లో జరిగిందిదే. మనదేశంలోనే కాదు, అమెరికా, దుబాయ్‌లు కూడా అలాగే మునిగాయి. చేసిందంతా చేసి, తమ తప్పేమీ లేదన్నట్లూ నటిస్తూ, సంక్షోభ నివారణ పేరు మీద మరిన్ని ఆర్థిక తప్పులు చేస్తూ, తదుపరి ఎన్నికల దాకా నెట్టుకు రావడం ప్రభుత్వాల కలవాటు.

మౌలికమైన రాజకీయ ధ్యేయాల్లో, పరిపాలనా పద్ధతుల్లో, ఆర్థిక విధానాల్లో తేడా లేకపోవడం వల్ల ఏ పార్టీలు ఎక్కడ అధికారంలోకి వచ్చినా, సంక్షోభాలు వస్తూనే

ఉంటాయి, ప్రతిసారీ కొత్తగా కనిపిస్తూ ఉంటాయి. ఇది ప్రకృతి నైజం కాదు, ఆధునిక ఆర్థిక వ్యవస్థల అంతర్గత బలహీనతా కాదు. ఇది నేడు ప్రపంచాన్ని నడిపిస్తున్న బలమైన భావజాలాల ఫలితం, రెండురెళ్ళు నాలుగేననే ప్రకృతి నియమాల శాపం, తెలిసి తెలిసీ వాస్తవాలను విస్మరించే మెజారిటీ ప్రజల, మేధావుల స్వయం కృతాపరాధం. ఎవరికి వారు తుపాకీని ప్రభుత్వం చేతిలో పెట్టి, పక్కవాణ్ణి కాల్చుమంటే, ఇంకొకరప్పగించిన తుపాకీ గుండు మనకు తగలకుండా పోతుందా? కళ్ళకు గంతలు కట్టుకుని నడిచే గానుగెద్దులకు చక్రభ్రమణం తప్పదు. పాత సున్నం స్థానే ఎప్పటికప్పుడు కొత్త సున్నం నలుగుతూ ఉంటుంది.

19-02-2012

రైళ్ళ కోసం యాచన - యోచన

ఈ మధ్య ఒక తెలుగు వార్తా ఛానల్ (ఎబిఎన్ కాదు) వారు రాబోయే రైల్వే బడ్జెట్‌ను పురస్కరించుకుని ఒక చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికార, ప్రతిపక్ష ఎంపీలు, కొందరు విశ్రాంత రైల్వే అధికారులు, విశ్లేషకులు పాల్గొన్నారు. రైల్వేల ఆధునికీకరణ, పెట్టుబడుల రంగంలో రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయం ప్రధాన చర్చా విషయం. ఈ విషయంలో తాము చేస్తున్న ప్రయత్నాలను అధికార పక్ష నాయకులు ఏకరువు పెట్టారు. ఇంతమంది ఎంపీలున్నా రాష్ట్రానికేం ఒరగలేదని ప్రతిపక్ష ఎంపీలు విమర్శలు ఎక్కుపెట్టారు.

విశ్రాంత అధికారులేమో అసలు రైల్వే బడ్జెట్‌లో కేటాయింపులు తెచ్చుకోవడానికి ఎన్ని నెలలు ముందునుంచి కసరత్తు ప్రారంభించాలో, లాబీయింగ్ ఎలా చెయ్యాలో వివరించారు. విశ్లేషకుల్లో ఒకరు అసలు రైల్వేలు రాష్ట్రాలే ఎందుకు నడపకూడదు, కేంద్రాన్ని దేబిరించాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. ఆ ప్రతిపాదనను మిగతా అందరూ నిర్ద్వంద్వంగా తోసిపుచ్చారు. రైల్వేలు దేశానికి వెన్నెముక లాంటివని, అవి దేశ సమైక్యతను కాపాడతాయని, వాటిని వికేంద్రీకరించడం పాపమన్నట్లు మాట్లాడారు. ఇంకా మౌలికమైన ప్రశ్నేమిటంటే, రైల్వేలను అసలు ఎందుకు ప్రైవేటీకరించకూడదు? దాని వల్ల వచ్చే లాభ నష్టాలేమిటి? దాన్లో ఇబ్బందులేమిటి?

సుమారు అరవై నాలుగువేల కిలోమీటర్ల నిడివితో, పదమూడు లక్షల మంది కార్మికులు పనిచేసే రైల్వేలు కేంద్ర ప్రభుత్వ శాఖల్లో అతి పెద్దది. స్వాతంత్ర్యం వచ్చేనాటికే యాభై అయిదువేల కిలోమీటర్ల రైల్వేలైన్లను బ్రిటీష్ వాళ్లు నిర్మించగా; గత అరవై అయిదు సంవత్సరాల్లో కేవలం తొమ్మిదివేల కిలోమీటర్లు మాత్రమే అదనంగా నిర్మాణమైంది. కాకపోతే, తాబేలు నడకతో అయినప్పటికీ; ఆధునికీకరణ క్రమంగా జరుగుతూ వచ్చింది. బొగ్గు ఇంజన్ల స్థానే డీజిల్, ఆ తర్వాత ఎలక్ట్రిక్ ఇంజన్లు, వేగం పెరిగి, ప్రయాణ కాలం

తగ్గడం, కొత్త రైళ్ళు, పెట్టెలు, సౌకర్యాలు పెరగడం; అన్నిటికంటే ముఖ్యంగా టికెట్ బుకింగ్‌ను కంప్యూటరీకరించడం జరిగాయి. వందల సంఖ్యలో కొత్త రైళ్ళు వేశారు. ఇన్నిచేసినా, వాస్తవ పరిస్థితి ఏమిటంటే – అప్పటికప్పుడు ప్రయాణం చేద్దామంటే రిజర్వేషన్ దొరకడం అసంభవం. మూడు నెలల ముందే రైళ్ళన్నీ నిండిపోయి ఉంటాయి. బొగ్గు, ముడి ఖనిజాల్లాంటి బల్క్ సరుకులు తప్ప; రోజువారీ ఉత్పత్తులను రైళ్ళ ద్వారా రవాణా చేసే అవకాశం లేదు. ప్రతిసారీ రైల్వే బడ్జెట్ చదివేటప్పుడు మన రాష్ట్రానికి కొత్త లైన్లో, కొత్త రైళ్ళో ఇస్తారేమోనని ఆశగా ఎదురుచూడడం.

అసలీ అడుక్కోవడం, ఇవ్వకపోతే ఈసడించుకోవడం, దాన్నొక రాజకీయ రాద్ధాంతం చెయ్యడం ఇవన్నీ అవసరమా? ప్రైవేటీకరిస్తే పోలా?

కానీ అలాంటి ఊహే రాజ్యభక్తు(స్టేటిస్టు)లకు, అభ్యుదయ (అంటే వామపక్ష లేదా సోషలిస్టు) వాదులకు ఒక దేశ ద్రోహంగా, ధర్మ ధిక్కారంగా తోస్తుంది. ఇంతపెద్ద సంస్థను ప్రైవేటు చేతుల్లో పెట్టి దోపిడీకి ద్వారాలు తెరవడమా?

ప్రజారవాణా వ్యవస్థను లాభాలే పరమావధిగా భావించే వ్యాపారులకు కట్టబెట్టడమా? గ్యాంగ్‌మాన్ దగ్గర్నుంచి జనరల్ మేనేజర్ వరకు రైల్వే ఉద్యోగులు, ఏ పక్షానికి చెందిన వారైనా అందరు రాజకీయ నాయకులు కూడా ఇదే వాదంతో ఏకీభవిస్తారు,

ప్రైవేటీకరణ ససేమిరా అంటారు. కాకపోతే వ్యతిరేకించడానికి ఎవరి కారణాలు వారికుంటాయి. దేశంలోని అతి పెద్ద కార్మిక సంఘం కావడంతో –ప్రభుత్వాలను బెదిరించి, అడిగినంత జీతభత్యాలు, సౌకర్యాలు, ఉద్యోగ భద్రత పొందుతున్న వారు – అవన్నీ వదులుకోవడానికి సిద్ధపడరు. లక్షలకోట్ల బడ్జెట్‌తో, తమ తమ నియోజకవర్గాల్లో జరిగే రైల్వే కాంట్రాక్టులపై పెత్తనం సాగించే అవకాశాన్ని వదులుకోడానికి ఏ పార్లమెంటు సభ్యుడూ ఇష్టపడరు. కాకపోతే రైల్వేల అసమర్థత వల్ల విలువైన కాలం, డబ్బు, సౌకర్యాలు నష్టపోతున్న ప్రయాణీకులకు – రైల్వేలను ప్రైవేటీకరించడం ద్వారా పోటీ వాతావరణం కల్పించి లాభపడొచ్చనే ఊహ కూడా అసలు తట్టదు.

ఇప్పుడు జరుగుతున్న తంతేమిటంటే, సంకీర్ణ ప్రభుత్వాల యుగంలో – ఏ 'మిత్ర'పక్షం ఎక్కువ బ్లాక్‌మెయిల్ చెయ్యగలిగితే వారికి రైల్వేశాఖ దక్కుతుంది. ఆ తరువాతి స్థాయిలో బ్లాక్‌మెయిల్ చెయ్యగలిగిన మిత్రపక్షానికి రోడ్డు రవాణా శాఖ దక్కుతుంది. రైల్వేమంత్రులు తమ నియోజకవర్గాలకు, తమ రాష్ట్రాలకు కొత్త రైళ్ళు, ప్రాజెక్టులు, పెట్టుబడులు మంజూరు చేసు కోవడం అలవాటుగా మారిపోయింది. ఇదే తరహాలో రోడ్డు రవాణా శాఖామాత్యులు తమ నియోజక వర్గం, రాష్ట్రాల్లో నాలుగు... ఆరు లేన్ల జాతీయ రహదారులు వేసుకోవడం కూడా ఆక్షేపణీయం కాకుండా పోయింది. ప్రయాణ

ఛార్జీలు పెంచట్లేదని బడ్జెట్ ప్రసంగాల్లో గంభీరంగా ప్రకటించి, బల్లలు చరిపించు కుంటారు. ఉన్న సీట్లలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఉన్నతాధికారుల్లాంటి దొరలకు ఎమర్జెన్సీ కోటాలు పోను; మిగతా సీట్లలో కొన్నింటిని అధిక ధరలకు తత్కాల్ పేరుమీద అమ్మడం ద్వారా – కనబడని ఛార్జీలు వసూలు చేస్తున్నారు. ఇప్పుడు అవికూడా దొరికే పరిస్థితి లేదు. రైల్వేలను పూర్తిస్థాయిలో ఆధునీకరించాలంటే పది లక్షల కోట్లు అవసరమని, అందులో అయిదున్నర లక్షల కోట్లు వచ్చే అయిదేళ్ళలోనే కావాలని శామ్ పిత్రోడా నాయకత్వంలో నిపుణుల కమిటీ అంచనాలు వేసింది. అమలు చేసే సమయానికి జలయజ్ఞం లాగా ఇంకా ఎన్ని లక్షల కోట్లు అవసరమవుతాయో ఇప్పుడే చెప్పడం కష్టం. అంత డబ్బు కళ్ళముందు కదలాడుతుంటే, దాన్ని వదులుకొని ప్రైవేటీకరణను సమర్థించడానికి ఎంపీలేమన్నా తెలివిలేని వాళ్ళా?

ప్రభుత్వ గుత్తాధిపత్యంలో లేనివి, ఒకప్పటి గుత్తాధిపత్యం నుంచి బయట పడిన వ్యాపార రంగాలన్నీ వస్తువులు, సేవల్లో నాణ్యత పెంచడంతో పాటు ధరలు తగ్గుతూ వస్తున్నాయి. దీనికి ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. మచ్చుకు చూస్తే కంప్యూటర్ రంగంలో నాణ్యత పెరిగి, ధరలు తగ్గి, కొత్త కొత్త ఉత్పత్తులు విడుదలవు తున్నాయి. అలాగే టెలిఫోన్ రంగం ప్రైవేటీకరణ తరువాత వినియోగదారుల సంఖ్య కొన్ని వందల రెట్లు పెరగడమే కాక – ధరలు కూడా తగ్గిపోయాయి.

అలాగే విమానయాన రంగం. అది కూడా ప్రజా రవాణా వ్యవస్థలో భాగమే. దాన్ని ప్రైవేటీకరిస్తారని ఒక సమయంలో ఎవరూ ఊహించలేకపోయారు. నేడు పోటీ వాతావరణంలో విమానయాన ధరలు ఎంతగా తగ్గాయో చూస్తూనే ఉన్నాం. మరి కింగ్ ఫిషర్ సంస్థ నష్టాల్లో మునగలేదా...; దివాళా దిశగా పోవడం లేదా అని ప్రశ్నించే వారుంటారు. మునిగితే మునగనివ్వండి, ఎవరికి ఇబ్బంది?

సమయానుకూలంగా సరైన నిర్ణయాలు తీసుకుని వినియోగదారులను సంతృప్తిపరచకపోతే, ఏ వ్యాపారమైనా దివాళాతీయక తప్పదు. కొన్ని కంపెనీలు దివాళా తియ్యడం మార్కెట్‌లోని పోటీ వాతావరణానికి సూచిక. కింగ్ ఫిషర్‌ని రక్షించడానికి ప్రజలనుంచి వసూలు చేసిన డబ్బు ఖర్చుపెట్టడం అత్యంత ఆక్షేపణీయం. అలాగే వేల కోట్ల నష్టాల్లో మునిగి ఉన్న ఎయిరిండియాను కూడా అమ్మేయాలే తప్ప ప్రజల సొమ్ముతో ప్రభుత్వ అసమర్థతను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చెయ్యకూడదు.

అలాగే టెలిఫోను రంగాన్ని ప్రైవేటీకరించడం వల్లే 2జి స్కాములు అయ్యాయి కదా అనే మేధావులూ ఉన్నారు. ఇది హాస్యాస్పదం. స్పెక్ట్రంను తమ గుత్తాధిపత్యంలో పెట్టుకుని,

పారదర్శకత లేకుండా, రాత్రికి రాత్రి నిబంధనలు మార్చి, అస్మదీయులకు తక్కువ ధరకు అప్పజెప్పి, అవినీతికి పాల్పడింది ప్రభుత్వంలోని మంత్రులు, అధికారులు, వారి పిఎలు. దానికి ప్రైవేటు రంగాన్ని నిందించడం అజ్ఞానమవుతుంది.

విమానాశ్రయాలు, విమానయాన సంస్థలు వేర్వేరుగా ఉన్నట్లే, రైల్వేలైన్లు, స్టేషన్లు, రైళ్ళు వేర్వేరు ప్రైవేటు సంస్థలు నిర్వహించవచ్చు. అప్పుడు ప్రయాణీకులు, సరుకుల రవాణాకు సరిపడినన్ని రైళ్ళు సమకూరుతాయి. రైల్వేలైన్ల ఆధునికీకరణ, వేగం పెంచడం విషయాల్లో ఆయా సంస్థలే లాభనష్టాల బేరీజుతో హేతుబద్ధమైన నిర్ణయాలు తీసుకుంటాయి. ప్రయాణ కాలం తగ్గడం, రేట్లు తగ్గడం, సౌకర్యాలు పెరగడం తథ్యం. అప్పుడు రైల్వేలకు మంత్రితో పనిలేదు. మంత్రి ఉన్నా; చేయగలిగిన చెరుపు చాలా తగ్గుతుంది. రైళ్ళకోసం, ప్రాజెక్టుల కోసం అడుక్కోవలసిన అగత్యం పట్టదు. ఆ రోజు త్వరలో వస్తుందని ఆశిద్దాం. ఇప్పటికే నూట ఇరవై కోట్లుండి, ఇంకా పెరుగుతున్న జనాభా, పెరుగుతున్న వారి అవసరాల నేపథ్యంలో – ఈ ప్రభుత్వ రైల్వే అనే కుంటి గుర్రం త్వరలోనే కుప్పకూలక తప్పదు. మరింత నష్టం జరగకుండా ముందే జాగ్రత్త పడడం జ్ఞానుల లక్షణం.

04-03-2012

ఎర్రపెట్టె మాయాజాలం

ఉత్తరప్రదేశ్ ఎన్నికల ఫలితాలు వెలువడిన మర్నాడే రిజర్వు బ్యాంకు ఒక ముఖ్యమైన విధాన నిర్ణయం ప్రకటించింది. బ్యాంకుల నగదు నిల్వల నిష్పత్తి (క్యాష్ రిజర్వ్ రేషియో)ని ఇంతకు ముందున్న ఐదున్నర శాతం నుంచి నాలుగు ముప్పాతిక శాతానికి తగ్గించారు. ఈ సంవత్సరం జనవరిలో ఇలాగే ఓ పావలా శాతం తగ్గించారు. దీనర్థం ఏమిటంటే ఇంతకుముందు ఏ బ్యాంకయినా వంద రూపాయలు డిపాజిట్లు సేకరిస్తే దానికి ప్రతిగా అయిదున్నర రూపాయలు నగదు రూపంలో ఉంచుకోవాలి. మిగిలిన తొంభైనాలుగున్నర రూపాయలను రుణాలుగా ఇవ్వడానికి వాడుకోవచ్చు.

అలా ఉంచాల్సిన నగదు పరిమాణం ఇప్పుడు వందకు నాలుగు రూపాయల ముప్పావలాకు తగ్గించబడింది. ఈ నిర్ణయం వల్ల బ్యాంకులు మరో ఏభైవేల కోట్ల రూపాయలు రుణాలు మంజూరు చెయ్యడానికి అవకాశం ఏర్పడింది. జనవరిలో తగ్గించిన పావలా శాతంతో కలిపి సుమారు డెబ్భై వేల కోట్లు కొత్తగా మార్కెట్‌లోకి ప్రవేశిస్తాయి. మంజూరు చేసిన రుణాలు తీసుకున్న వాళ్ళు అందులో సింహభాగం తాత్కాలికంగానైనా తిరిగి బ్యాంకుల్లోనే ఉంచుతారు. మళ్ళీ వాటిని డిపాజిట్లుగా పరిగణిస్తూ నూటికి సుమారు తొంభై అయిదు రూపాయలు మళ్ళీ రుణాలుగా మంజూరు చేస్తారు. ఇది చివరికి (ఒక అంచనా ప్రకారం) పదిరెట్లు పెరిగి మొత్తం మీద ఏడు లక్షల కోట్ల రూపాయలు మార్కెట్‌లోకి కొత్తగా విడుదలయ్యే గొలుసుకట్టు చర్యకు కారకమవుతుంది. ఈ డబ్బంతా దేశ సంపద పెరగడం వల్ల వచ్చింది కాదు. రిజర్వు బ్యాంకు – ఒక్క కలంపోటుతో గాల్లోంచి సృష్టించిన మాయడబ్బు. ఇది నకిలీ నోట్లతో సమానం. ఇంత కొత్త డబ్బు వచ్చి చేరితే, ఉత్పత్తి పరిమాణంలో పెరక్కుండా అలాగే ఉన్న కూరగాయలు, దుస్తులు, సిమెంటు, పప్పులు, ఉప్పులు, పనిముట్ల ధరలు పెరగడం ఖాయం.

ఈ కృత్రిమ డబ్బు పెరగడమే ద్రవ్యోల్బణం.

మళ్ళీ మూడోరోజునే కేంద్ర ఆర్థిక మంత్రివర్యులు, బడ్జెట్‌ను ప్రతిపాదిస్తూ ద్రవ్యోల్బణం పెరిగిపోతోందని అమాయకంగా ఆందోళన వ్యక్తం చేశారు. దొంగే – 'దొంగ... దొంగ' అని అరిచాడన్న సామెతకు ఇంతకు మించిన ఉదాహరణ ఉంటుందా?

ఈ సృష్టించిన కృత్రిమ డబ్బు వల్ల అత్యధికంగా లాభపడేవారు – ఆ డబ్బును అందరికంటే ముందుగా అందుకునే రుణ గ్రహీతలు. ఆ రుణాల్లో ఎక్కువ శాతం పొందేది – వ్యాపార వర్గాలు. అందుకే ఆ వర్గాలన్నీ ఇటువంటి నిర్ణయాల పట్ల హర్షం వ్యక్తం చేస్తుంటాయి. వ్యాపార వర్గాల్లో భాగమైనవారి ప్రకటనల మీద ఆధారపడి నడిచే మీడియా సంస్థలు కూడా – ఆ నిర్ణయాలను స్వాగతిస్తాయి. వ్యాపార సంస్థలు, ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే ఆర్థిక నిపుణులు కూడా సమర్థిస్తారు. అత్యంత లోపభూయిష్టమైన కీన్సు ఆర్థిక విధానాలను తరతరాలుగా వంటబట్టించుకుంటున్న ప్రొఫెసర్లకు కూడా ఇది అభిలషణీయమైన నిర్ణయంగా అనిపిస్తుంది.

ఈ కృత్రిమ డబ్బును ఏదో ఒక రూపంలో ఆఖరున అందుకునే వర్గాలు తీవ్రంగా నష్టపోతాయి. ఎందుకంటే; ఆ డబ్బువారికి చేరేసరికే అన్ని వస్తువుల ధరలూ పెరిగిపోయి ఉంటాయి. ఆ వర్గాలేవంటే ఉద్యోగులు, పెన్షన్ మీద ఆధారపడేవారు. ప్రభుత్వాలు నిర్ణయించిన ధరలకు అమ్ముకునే ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేసే సాంప్రదాయక వ్యవసాయదారులు, కూలీలు.

ఈ వర్గాలను పేదరికం నుంచి బయటపడనీయకుండా చేసే ముఖ్య కారణం ద్రవ్యోల్బణమే. ఈ విషయం వారికి తెలియదు, పేదల గురించి మొసలి కన్నీరు కార్చే నాయకుల్లో చాలామందికి – ఇన్ని లోతుపాతులు తెలియవు, తెలిసినవారు కూడా చెప్పరు.

ఎన్నికలలో చావుదెబ్బతిని, నమ్మకం కోల్పోతున్న యూపీఏ ప్రభుత్వానికి, ప్రజల దృష్టి మరల్చడానికి, వ్యాపార, మీడియా వర్గాల్లో కొంత సానుకూలత పొందడానికి ఈ విధాన నిర్ణయాన్ని సమయం చూసి మరీ ప్రకటించారు. ప్రభుత్వ రాజకీయ అవసరాలకు తగ్గట్లుగా నిర్ణయాలు తీసుకునే రిజర్వు బ్యాంకు – ఒక స్వతంత్ర సంస్థ అని ఎవరికైనా భ్రమలు ఉంటే వాటిని తొలగించుకోవడం మంచిది.

మన దేశంలోనే కాదు, అమెరికా, ఇంగ్లాండు – ఇలా అన్ని దేశాల్లోనూ రిజర్వు బ్యాంకులు చేసే పని ఇలాంటిదే. డబ్బు విపరీతంగా పెరిగిపోయింది, అయినా ఏ వస్తువూ కొనేట్లు లేదు అని వాపోతుంటారు. ఈ పరిస్థితికి కారణం రిజర్వు బ్యాంకు పుణ్యమే. 1990 ప్రాంతాల్లో సుమారు 1.5 శాతంగా ఉన్న నగదు నిల్వ నిష్పత్తిని అంచెలంచెలుగా నేటికి నాలుగున్నర శాతానికి తీసుకొచ్చి లక్షల కోట్ల రూపాయల్ని మార్కెట్లోకి

ప్రవహింపజేసింది రిజర్వు బ్యాంకు రాజకీయ నిర్ణయాలే. రాత్రికి రాత్రి డబ్బయితే సృష్టించగలరు కానీ; వస్తువుల్ని సృష్టించలేరు కదా!

అది ఉత్పత్తి ద్వారానే సాధ్యం. అందుకే డబ్బు పెరుగుతోంది కానీ వస్తువులు, సేవలు, సౌకర్యాలు – అదే వేగంలో పెరగడంలేదు. ధరలు పెరగడమన్నది శరీర ఉష్ణోగ్రత పెరగడం లాంటిది.అసలు కారణమైన జ్వరమే ద్రవ్యోల్బణం – అంటే కృత్రిమ ధన ప్రవాహం. ఆ జ్వర కారక వైరస్సే రిజర్వు బ్యాంకు, ప్రభుత్వం.

కృత్రిమ డబ్బు సృష్టించడమే కాక; ఆ డబ్బును; ఏ ఏ రంగాలను ప్రాధాన్యతా రంగాలుగా గుర్తించి ఎంత పరిమాణంలో రుణాలు ఇవ్వాలో కూడా నిర్ణయించి, ఆ నిర్ణయాలను అన్ని బ్యాంకుల మీద రుద్దే అధికారాలను కూడా రిజర్వ్ బ్యాంకులు కలిగి ఉన్నాయి. ఏ రంగంలో.... ఏ హామీలతో రుణాలివ్వాలో; అసలు ఏ హామీ లేకుండా ఎవరికెంత ఇవ్వాలో కూడా నిర్ణయిస్తాయి. సరైన హామీల్లేని రుణాలు ఎక్కువ శాతం తిరిగి రావు కనుక బ్యాంకులు తమ లాభదాయకతను నిలబెట్టుకోవడానికి, తిరిగి చెల్లించే రంగాల వారి నుంచి మరింత అధిక వడ్డీ వసూలు చేస్తాయి. వెంటపడి మరీ గృహ నిర్మాణ అవసరాలకు రుణాలివ్వడం, తత్ఫలితంగా ఆ రంగం సంక్షోభంలో కూరుకుపోవడం ఒక ఉదాహరణ మాత్రమే.

కృత్రిమ డబ్బు సృష్టించడం; ప్రాధాన్యతా రంగాలను ఎంపిక చేయడం; వాటివల్ల కలిగే వాపులను – బలుపుగా చూపించడం – ఇవన్నీ రాజకీయ నిర్ణయాలే. ఏ పరిశ్రమలోనైనా ముడిసరుకులను ఎప్పుడో పాత రేట్లకు కొంటారు. తయారైన ఉత్పత్తులను ద్రవ్యోల్బణం వల్ల పెరిగిన కొత్త రేట్లకు అమ్ముతారు. దాంతో ఆర్థిక సంవత్సరాంతానికి ఖాతాల్లో కృత్రిమ లాభాలు కనబడతాయి. లాభాలొచ్చాయని షేర్లసూచీ పెరుగుతుంది. అదే విధంగా మనకు లెక్కలు కట్టి చూపించే ఆర్థిక వృద్ధిరేటులో సింహభాగం ద్రవ్యోల్బణం ద్వారా వచ్చిన కృత్రిమ కల్పితమే. ఈ రకంగా వ్యాపార, ప్రభుత్వ రంగాల మనుగడకు, ప్రజల కళ్ళు కప్పడానికి ద్రవ్యోల్బణమని పిలువబడే కృత్రిమ డబ్బు సృష్టి, నల్లమందులాంటి ఒక వ్యసనమై తిష్టవేసింది.

ఈ మాయాజాలంలో మరో అంకమే – ఏటా జరిపే బడ్జెట్ జాతర.

ఏ వస్తువుల మీద ఎన్ని కొత్త పన్నులేశారు, ఏ వర్గాలకు ఎన్ని రాయితీలిచ్చారు – ఇవన్నీ రాజకీయ నిర్ణయాలు. వీటి ప్రభావం ఆయా వస్తువులు తయారు చేసేవారి మీద, వర్గాల మీద తప్పకుండా పడుతుంది. కానీ మొత్తం ఆర్థిక వ్యవస్థపైపడే ప్రభావం తక్కువ. ఎంతోమంది ఆర్థిక నిపుణులు వాక్రుచ్చే గణాంక పద విన్యాస రణగొణ ధ్వనిలో – ముఖ్యంగా చూడవలసిన విషయాలు – మొత్తం మీద పన్నుల 'రాబడి' (దోపిడీ)

పెరిగిందా? ప్రభుత్వ రుణ భారం పెరిగిందా? ఏవైనా రంగాల మీద ప్రభుత్వం నియంత్రణలు పెరిగాయా? వీటిలో దేనికైనా అవునని సమాధానమిస్తే మనం మరింత సంక్షోభం వైపు పయనిస్తున్నామని అర్థం చేసుకోవాలి.

కింగ్ ఫిషర్ విమానయాన సంస్థ – పతనం అంచుల్లో ఉంది. అయిన కాడికి అమ్ముకుని (ఇంతకుముందు 'డెక్కన్' 'సహారా'లను కూడా అమ్ముకున్నారు, అందులో తప్పేం లేదు) వందల కోట్లలో ఉన్న అప్పులు తీర్చుకుంటారో; లేక – కొత్త అప్పుల కోసం ప్రయత్నిస్తారో యాజమాన్యం, అందులో పెట్టుబడి పెట్టిన వారి ఇష్టం. ప్రజలకు పోయేదేంలేదు. కానీ పన్నెండువేల కోట్ల రూపాయల అప్పుల్లో కూరుకుపోయిన ఎయిరిండియాను గట్టెక్కించడానికి ప్రభుత్వం సిద్ధపడింది. ప్రజల దగ్గర్నుంచి పిండిన పన్నుల డబ్బులోంచి ఆరువేల అయిదొందల కోట్లు అందించాలని మంత్రుల కమిటీ నిర్ణయించింది. అంటే విమానాల కొనుగోళ్ళు, నిర్వహణల్లో రాజకీయ నాయకులు, సంస్థ మేనేజిమెంట్ల అవినీతికి, అసమర్థతకు, సిబ్బంది అధిక జీతాలకు, నిర్లక్ష్య సేవలకు ప్రజలు మూల్యం చెల్లించాలన్న మాట! మేడిపండ్లలాంటి ఏ ప్రభుత్వ రంగ వ్యాపార సంస్థ పొట్టవిప్పినా కనిపించే సినిమా ఇదే.

ముప్పై ఏళ్ళ క్రిందటే ఆర్థిక మంత్రిగా పనిచేసిన ప్రణబ్ ముఖర్జీ – ఇన్నేళ్ళుగా మారని ప్రజల అవగాహనా లేమిని, బడ్జెట్ కోసం ఎదురు చూసే బేల చూపులను, సుస్థిరత, సంక్షేమం, సమ్మిళిత అభివృద్ధి (ఇన్‌క్లూజివ్ గ్రోత్) లాంటి పడికట్టు పదాలతో అలవోకగా చెయ్యగల ఎర్ర పెట్టె మాయాజాలాన్ని తలుచుకుని నవ్వుకుని ఉండాలి. ద్రవ్యోల్బణాన్ని నియంత్రిస్తామని గంభీరంగా ప్రకటించడం – ఈసారి కూడా మరిచిపోలేదు సుమా!!

18-03-2012

'కాలుజారిన' చెయ్యి

'పోకిరి' సినిమాలోని ఒక సన్నివేశంలో విలన్లు హీరోను వెంబడిస్తారు. చూడ్డానికి హీరో పారిపోతున్నట్లు కనిపిస్తాడు. చివరకు అందరూ ఒక పాడుబడిన వర్క్‌షాపులోకి చేరతారు. 'కొట్టుకోవడానికి ఈ మాత్రం స్థలం కావాలిలే' అన్న హీరో మాటలు అతిశయోక్తిగా అనిపిస్తాయి. విలన్లు షట్టరు వేయబోతుంటే 'కొంచెం ఖాళీ ఉంచుకోండి, పారిపోవడానికి పనికొస్తుంది' అంటాడు హీరో. తర్వాత జరిగే ఫైట్లో హీరోదే పైచేయి కావడం, విలన్లకు చావు తప్పి, కన్నులొట్టబోవడం జరుగుతుంది.

నిజ జీవితంలో వాస్తవం, నిజం, సత్యం, రియాలిటీలే ఆ హీరో. ఎన్ని అబద్ధాలయినా ఆడి, ఓటర్లను మాయచేసి ఎన్నికల్లో గెలిచే రాజకీయాలే – ఈ పోరాటంలో విలన్లు.

పారిపోయే దారిలేకుండా షట్టరును పూర్తిగా వారే మూసేసుకున్నారు. వాస్తవాన్ని, ప్రకృతి ధర్మాన్ని కొంతకాలం, కొంత దూరం పరిగెత్తించగలరు కానీ, అబద్ధాలు అంతిమంగా ఓడిపోక తప్పదు. అరవైయ్యేళ్ళుగా అన్ని రాజకీయ పార్టీలు, మరీ ముఖ్యంగా గత ఎనిమిదేళ్ళుగా యూపీఏ ప్రభుత్వం చెబుతున్న తియ్యటి అబద్ధాలు, అవాస్తవాలు, ఆచరించిన తప్పుడు ఆర్థిక విధానాలు – ఒక పరాకాష్టకు చేరాయి. తేరిపార చూస్తున్న వాస్తవాల ఎదుట దోషులుగా నిలబడ్డాయి.

ఆర్థిక మేధావులుగా కీర్తించబడే మన్మోహన్ సింగ్, అహ్లూవాలియా, కౌశిక్ బసు (ప్రధాని ఆర్థిక సలహాదారు), రంగరాజన్, రాజకీయ మేధావి ప్రణబ్ ముఖర్జీలకు – వాస్తవాలు చుక్కలు చూపిస్తున్నాయి. ఆర్థిక వ్యవస్థ ముసలి గుర్రమైపోయి, ఎంతకొట్టినా లేవడం లేదు. వృద్ధి కనిపిస్తున్నది కేవలం ద్రవ్యోల్బణంలోనే. సంపద సృష్టి కుంటినడక నడుస్తోంది. వచ్చే త్రైమాసికానికి, వచ్చే సంవత్సరానికి వృద్ధి రేట్ల ఊహాజనిత అంచనాలు అందంగా చెప్పి; ట్రాజడీ కథను కామెడీగా మారుస్తున్నారు. మరి ఇదే టీమ్ 1991 –

92 లో ఆర్థిక సంస్కరణలు తెచ్చింది కదా...; దాని వల్ల ఆర్థిక వ్యవస్థ పరుగులు పెట్టింది కదా అన్న ప్రశ్న ఉదయిస్తుంది. వాస్తవమేమంటే, 1991 వరకు దేశంలో దాదాపుగా కమ్యూనిస్టు ఆర్థిక వ్యవస్థ నడిచింది. ముఖ్యమైన రంగాలన్నీ ప్రభుత్వం ఆధీనంలోనే ఉన్నాయి. టాటా, బిర్లా, బజాజ్ లాంటి కొన్ని ఎంపిక చేసుకున్న కుటుంబాలు తప్ప, ఔత్సాహికులకు ప్రవేశమే లేదు. గ్యాస్ లేదా టెలిఫోను కనెక్షన్ కోసం దశాబ్దాల కాలం ఎదురుచూడాల్సి వచ్చేది. 'ఆర్థిక సంస్కరణ'ల వల్ల జరిగిందల్లా కమ్యూనిస్టు ఆర్థిక వ్యవస్థనుంచి ఫాసిస్టు ఆర్థిక వ్యవస్థలోకి వచ్చిపడ్డాం. ఈ వ్యవస్థలో ఎక్కువ మేరకు ఉత్పత్తి సాధనాలు పేరుకు ప్రైవేటు చేతుల్లో ఉంటాయి. కానీ, వివిధ నియంత్రణలు, పన్నులు, ఎగుమతి – దిగుమతి విధానాలు, సమాంతర ప్రభుత్వ సంస్థలు, సుంకాలు, ప్లానింగ్ కమిషన్ ప్రణాళికల ద్వారా ప్రైవేటు రంగం కూడా ప్రభుత్వం చెప్పినట్లు ఆడే మరబొమ్మలా తయారైంది.

ప్రభుత్వాలు చేతిలో ఉంచుకున్న సర్వాధికారాలను ఉపయోగించుకుని కొందరు వ్యాపారవేత్తలు, రాజకీయులు, బ్రోకర్లు, తెరచాటు ఒప్పందాలతో అడ్డదారిలో రాత్రికి రాత్రే కుబేరులవడం ఈ ఫాసిజం మౌలిక లక్షణాల్లో ఒకటి. కేవలం ఫాసిజం నుంచి మాత్రమే పుట్టుకు రాగల ఇలాంటి అక్రమ వ్యవస్థలను – ఆర్థిక ఉదారవాదం (లిబరిలిజం), పెట్టుబడిదారీ విధానం (కాపిటలిజం) అనడం ఆ పదాలకే అవమానం. విశ్లేషకుల అపరిపక్వతకు నిదర్శనం.

నలభై అయిదేళ్ళపాటు ఆర్థిక వ్యవస్థకు వేసిన సంకెళ్ళను 1991లో కొద్దిగా సడులు వదలగానే దేశ ప్రజల్లో ఔత్సాహికత, సృజనాత్మకత పురులు విప్పాయి. ఉత్పాదకత పెరిగింది. సంపద సృష్టి జరిగింది. కోట్లమందికి ఉద్యోగావకాశాలు వచ్చాయి. సందట్లో సడేమియా లాగా – హర్షద్ మెహతా, టేకు మొక్కల కంపెనీలు, యూరియా కుంభకోణం, సుఖరాం రచిత టెలికాం స్కాములూ జరిగాయి. వాటిలో కొన్ని మదుపుదార్ల అవగాహనాలేమి, దురాశల వల్ల జరగ్గా; ఎక్కువ శాతం ప్రభుత్వ అధికార దుర్వినియోగ ఫలితాలు. అలాగే, ప్రభుత్వాలు ముద్రించి, సృష్టించిన కృత్రిమ డబ్బు వల్ల – బయటకు కనబడని అనర్థాలు జరిగాయి.

మొత్తం మీద ప్రభుత్వాల జోక్యం క్రమంగా తగ్గి, మార్కెట్‌లో నిజమైన పోటీ వాతావరణం పెరుగుతూ వచ్చింది. ఈ సరళీకృత ప్రక్రియ క్షేత్రస్థాయిలో ప్రారంభమై దశాబ్దకాలం గడిచిందో లేదో, భావజాలపరంగా ఒక ఇరుకు సందు చివరకు వచ్చేశారు. ముందుకెళ్ళేదారి కనిపించడంలేదు. మద్యం, గనులు, ఇసుక, విద్యుత్కేంద్రాలు, గ్యాసు, రక్షణ కొనుగోళ్ళులాంటి మౌలిక రంగవ్యాపారాలు ప్రైవేటుకు – 'ప్రైవేటు'గా అమ్ముకునే ఫాసిజాన్ని ఎదిరించగల భావజాల శక్తి కొరవడింది.

పరిమితి సంస్కరణల వల్ల వచ్చిన ఫలాలను హస్తగతం చేసుకుని, ఓట్ల కోసం, ఎన్నికల్లో గెలుపుకోసం వాటిని ఉదారంగా పంచిపెట్టేయడం, పనిలో పనిగా వీలైనంత దోచుకోవడమనే ద్విముఖ వ్యూహానికి శ్రీకారం చుట్టారు. ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వాలు డబ్బును సృష్టించాలని, ఆర్థిక రంగాన్ని అనునిత్యం 'మేనేజ్' చెయ్యాలనే కీన్సు సిద్ధాంతాన్ని నరనరానా జీర్ణించుకున్న మన ఆర్థిక ఆచార్యులకు – ఆ లోపభూయిష్ట భావజాల పరిమితులను ఎలా దాటాలనే దానిపై అవగాహన లేదు. రాజకీయ నాయకుల చేతికింద పనిముట్లయిన ఆస్థాన ఆర్థిక నిపుణులు – పార్టీలకు పనికొచ్చే పథకాలకు – 'శాస్త్రీయత' అనే మేలిముసుగు తొడిగారు. నిర్వచనం లేని ఆమ్ ఆద్మీ పేరిట ఆర్థిక విధానాలను తిరోగమన బాట పట్టించారు.

మిగతా అన్ని రంగాల్లోనూ తెచ్చిన సంస్కరణలకు – వ్యవసాయ రంగాన్ని మొదటి నుంచీ దూరంగా ఉంచారు. కాలం చెల్లిన భూ పరిమితి చట్టాలు, హేతుబద్ధం కాని మద్ధతు ధర నిర్ణయ విధానాలు, ఫార్వార్డ్ ట్రేడింగ్‌పై నిషేధాలు, ఎప్పుడు ఏ ఆహార సరుకుల ఎగుమతులు నిషేధిస్తారో... దిగుమతులకు అనుమతిస్తారో తెలియని వాతావరణం, కరెంటు, నీటి లభ్యతపై ప్రభుత్వ పెత్తనం. వీటన్నిటితో వ్యవసాయ రంగం ముందు కెళ్ళలేదు. అదే సమయంలో మౌలిక, పారిశ్రామిక, సేవారంగాల్లో పట్టణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఉద్యోగాలు, ఉపాధి సృష్టి జరిగింది. పనులు లేక, దారిద్ర్యపు అంచుల్లో ఉన్న పల్లెజనం మెరుగైన అవకాశాలు, జీతాలు, సౌకర్యాల కోసం పట్నాల బాట పట్టారు. ఈ వాస్తవాధారిత సహజ పరిణామాలు మన మేధావులకు అత్యంత అమానుషాలుగా కనబడ్డాయి.

పాక్షికంగా ఖాళీ అయిన ఊళ్ళను, బొంబాయి... హైద్రాబాదు బస్సులెక్కి వెళ్తున్న కూలీలను చూపిస్తూ – వెనుక విషాద సంగీతం వినిపించడం మీడియాకు కూడా ఫ్యాషనైంది. పల్లెలో ఉండిపోయిన ముసలి తల్లికి అండ ఎవరంటూ పాటలు కట్టి సినిమాలు కూడా తీశారు. ఎవరి బలవంతమూ లేకుండా మెరుగైన అవకాశాల కోసం పట్నాలకు వెళ్ళడం అమానవీయం ఎలా అవుతుంది? ఈ మేధావులందరూ పల్లెల్నుంచో, చిన్న పట్నాల్నుంచో హైదరాబాదు, ఢిల్లీ లేదా బొంబాయికి వెళ్ళి ప్రొఫెసర్లు, జర్నలిస్టులు కాలేదా? వారి పిల్లల్ని ఇంకా మెరుగైన అవకాశాల కోసం అమెరికా, ఆస్ట్రేలియాలకు పంపడం లేదా? వారి తల్లిదండ్రుల్లో ఎంతమంది వారితో కలిసి నగరాల్లో ఉంటున్నారు? ఎంతమంది వృద్ధులు (సంపన్న కుటుంబాల్లో కూడా) – తాము పుట్టి పెరిగిన ఊరిలో సొంత ఇళ్ళలో శేష జీవితం గడపడం లేదు? అది అమానవీయమా?

వాస్తవ విరుద్ధమైన ఇటువంటి సిద్ధాంతాల ఆధారంగా ఉపాధి హామీ చట్టం చేశారు. లక్షల కోట్ల పన్నుల డబ్బును వెదజల్లారు. పనులకు ఏనాడూ కొరతలేని కోనసీమ లాంటి ప్రాంతాల్లో కూడా అమలుచేశారు. ప్రతి మండలానికీ టార్గెట్లు నిర్ధారించారు. ఈ పథకం పనుల్లోకి రాకపోతే రేషన్ కార్డు తొలిగిస్తామని బెదిరించి మరీ కూలీలను మళ్ళించారు. ఇంతకూ వారితో చేయించిన పనులేమిటి?

చెరువుల్లో తూటి కాడ నరకడం, కొండల్లో ఇంకుడు గుంతలు తవ్వడం – ఇలాంటివి!

ఒకటి, రెండు గంటలు వచ్చి నిల్చుంటే చాలు, హాజరు వెయ్యడం, కూలీలకు కొంత, బ్రోకర్లు, సూపర్‌వైజర్లు, అధికారులు తలా కొంత పంచుకోవడం. ఒక పక్క అదునుపోతుంటే నాట్లు వేయడానికి, పండిపోతున్న మిర్చిని, ఎండిపోతున్న మొక్కజొన్న కంకులను తెంచే కూలీలు దొరక్క రైతులు చస్తుంటే; ఇంకోపక్క ప్రభుత్వం దోచుకున్న సొమ్మును – పప్పు బెల్లాలుగా పంచిపెట్టడం. రైతుల రక్తం మరగదూ?

రైతులు క్రాప్ హాలిడేకు వెళ్లక ఏం చేస్తారు?

ఇది ఒకానొక పథకం విస్తృత విశ్లేషణ. ఏ పథకం తీరు చూసినా ఇంతే. గత ఎనిమిదేళ్ళుగా ఆర్థిక రంగ శృంఖలాలను – తెంచనక్కర్లేదు– కనీసం వదులు చేసే పని ఒక్కటి కూడా చెయ్యలేదు. సేవా పన్ను, వ్యాట్ రూపాల్లో కొత్త పన్నులు వెయ్యడం తప్ప – మన గొప్ప ఆర్థిక నిపుణులు చేసిందేమీ లేదు. ఆ వచ్చిపడిన దోపిడీ 'రాబడి' లో 'ఓట్లాకర్షక పథకాల'కు వెదజల్లగా మిగిలిన సొమ్ముతో జలయజ్ఞాలు, కామన్వెల్తు క్రీడల్లాంటి పాడి ఆవులను సృష్టించి, రక్తం వచ్చేదాకా పిండుకున్నారు.

పరిస్థితి ఇంతకన్నా దిగజారదన్న నమ్మకమేమీ లేదు. ఒకసారి కాలుజారాక గ్రీసు, పోర్చుగల్ లాంటి యూరోపు దేశాలు కూడా వెనక్కి తగ్గి, సరైన దారిలో నడవలేకపోతున్నాయి. పందొమ్మిదో శతాబ్దంలోనే సామాజిక భద్రత (సోషల్ సెక్యూరిటీ) పథకాలు అమలుచేసిన జర్మనీ రెండు ప్రపంచ యుద్ధాలను, 1920ల్లో వారి కరెన్సీ వినాశనానికి వేదిక అయింది. ప్రజల ఆలోచనలను ప్రభావితం చేసే ఆర్థిక నిపుణులు, మేధావి, మీడియా వర్గాలు ముందుగా ప్రభుత్వ జోక్య సిద్ధాంతాల చట్రం నుంచి బయటపడాలి. రాజకీయ, ఆర్థిక, వ్యవస్థలు ప్రస్తుత ఫాసిజం నుంచి బయటపడాల్సిన అవసరాన్ని ఈ వర్గాలు గుర్తించాలి. ముందు భావజాలపరంగా సంస్కరణలు రావాలి. లేకపోతే దిమ్మతిరిగి, మైండ్ బ్లాకవుతుంది. కాలం, వాస్తవ ధర్మం వాటి పని అవి చేసుకుపోతూనే ఉంటాయి.

01-04-2012

హిందూ వివాహ చట్టం

"సుఖంగా ఉండే కుటుంబాలన్నీ ఒకేలా ఉంటాయి. సుఖంగా లేని కుటుంబాల్లో ఒక్కో కుటుంబానిది ఒక్కో సమస్య".

టాల్ స్టాయ్ రాసిన "అన్నా కెరనీనా' నవలలో ప్రారంభ వాక్యాలివి. మన దేశంలో ముస్లిమేతరులందరికీ వివాహ చట్టాలున్నాయి. వాటికి లోబడే విడాకులు, జీవిక, భరణం, మనోవర్తి లాంటి కేసులు పరిష్కరిస్తారు. బాల్య వివాహాలు, బహు భార్యత్వ వాతావరణ నేపధ్యంలో.

హిందూ వివాహ చట్టం 1955 లో అమల్లోకి వచ్చింది. స్త్రీ, పురుష తారతమ్యాలు లేకుండా అందరికీ సమాన రాజకీయ హక్కులు కల్పించిన రాజ్యాంగం నీడలో ఈ చట్టం రూపొందింది. ఈ చట్టం ద్వారా విడాకులు పొందడం అత్యంత కష్టం. భార్యాభర్తలిద్దరూ విడాకులు కోరుకున్నా గానీ చాలా సమయం పడుతుంది. ఇద్దర్లో ఒకరు అంగీకరించకపోతే, దాదాపు అసంభవం. ముస్లిం మతస్థుల వివాహాలు, విడాకులు వారి మత చట్ట గ్రంథమైన షరియత్‌కు లోబడి ఉంటాయి. దాని ప్రకారం పురుషులైతే మూడుసార్లు తలాక్ అని – ఉచ్చరిస్తే విడాకులైపోయినట్లే. కానీ ఈ వెసులుబాటు మహిళలకు లేదు. ముస్లిం మహిళ విడాకులు కావాలంటే న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సిందే.

ఈ చట్టం ద్వారా వివాహాన్ని ఒక చట్రంలా మార్చడానికి ఆనాటి న్యాయకోవిదుల్లో సనాతనులు ఎక్కువమంది ఉండడం ఒక కారణం. అంతేకాకుండా ఆ రోజుల్లో బాల్య వివాహాలు, బహు భార్యత్వం ప్రబలంగా ఉండడం; మహిళల్లో అత్యధికులు పోషణ కోసం భర్తలపై ఆధారపడినవారు కావడం, మహిళల్లో చదువుకున్నవారు అతి తక్కువ శాతంగా ఉండడం – ఇలాంటి పరిస్థితుల వల్ల ఈ చట్టం అప్పట్లో ఎవరికీ తప్పుగా అనిపించలేదు.

కానీ స్త్రీ, పురుష సంబంధాల్లో ముఖ్యంగా వివాహ సంబంధాలకు దిశా నిర్దేశం చేయగల తాత్విక స్పష్టత అప్పుడూ, ఇప్పుడూ కొరవడింది. మహిళల విషయంలో ఆనాడున్న దుర్భర పరిస్థితుల్లో దేనికీ ఈ చట్టం తనంతట తానుగా ఒక పరిష్కారం కాదనేది నిశితంగా పరిశీలిస్తేగాని – అర్థంకాని వాస్తవం. ఉదాహరణకు ఈ చట్టం వచ్చి అరవైయేళ్ళయినా, కొన్ని తెగలలో ఇప్పటికీ బహుభార్యత్వం చాలా సాధారణం, స్థానిక సమాజానికి ఆమోదయోగ్యం.

కానీ అదే తెగలకు చెంది, చదువుకుని, ఆర్థిక స్వావలంబన ఉన్న మహిళలు ఆ సంప్రదాయాన్ని అంగీకరించడం అత్యంత అరుదు. చదువుకున్న ముస్లిం మహిళల్లో కూడా ఇదే ధోరణి కనిపిస్తుంది. అలాగే సగటున చదువు, జ్ఞానం, వివేకం, వీటి ద్వారా ఆర్థిక అభివృద్ధి పెరిగిన ప్రాంతాలు, కులాలు, కుటుంబాల్లో చట్టంతో సంబంధం లేకుండా వివాహ వయసు క్రమేపీ పెరగడం చూశాం, చూస్తున్నాం.

తరచు యుద్ధాలతో, హింసే ప్రధాన బలంగా ఉన్న పాతయుగాల్లో స్త్రీ ఒక బానిస... ఒక వస్తువు... పురుషుల ప్రైవేటు ఆస్తి. అమ్మొచ్చు, కొనొచ్చు, యుద్ధంలో గెలిస్తే ఎత్తుకుపోవచ్చు. ప్రైవేటు ఆస్తి కాబట్టి ఏం చేసినా, ఎలా వ్యవహరించినా, ప్రశ్నించే హక్కు ఎవరికీ లేదు. పురుషుడు స్వేచ్ఛా జీవి కాబట్టి – ఆ కాలంలో అతని వివాహేతర సంబంధాలు ఆక్షేపణీయం కాదు. కానీ భార్య ప్రైవేటు ఆస్తి కాబట్టి ; ఆవిడ శీలం విషయంలో – ఏ పొరపాటూ జరగడానికి వీల్లేదు. హింసా ప్రాతిపదికపై వివాహాలు నెరపిన రోజుల్లో ఇవీ పరిస్థితులు.

పరువు హత్యలు, సతీసహగమనాలు, స్త్రీలకు ప్రత్యేక శీల సంబంధ నియమాలు, రాజ వివాహాల్లో కన్యత్వ పరీక్షలు – ఈ రూపాల్లో ఆ హింసాకాల వాసనలు ఇప్పటికీ చూస్తునే ఉన్నాం.

కానీ మొత్తం మీద, కాలక్రమేణా వివాహం హింస ప్రాతిపదిక నుంచి ఒప్పందం ప్రాతిపదిక వైపుగా నాగరికత ప్రయాణించింది. వివాహ విషయాల్లో డబ్బు పాత్ర ఎక్కువై దాని పవిత్రతను చెడగొడుతోందని ఒక పక్క కమ్యూనిస్టులు; మరోపక్క సనాతనవాదులు తిట్టి పోస్తుంటారు. వాస్తవమేమిటంటే, ప్రపంచవ్యాప్తంగా వైవాహిక జీవితంలో మహిళల స్థాయిని మెరుగుపరిచిందీ, బహు భార్యత్వానికి తెరదించిందీ సంస్కర్తలో, మత పెద్దలో కాదు.

స్త్రీ, పురుషుల ఆర్థిక సంబంధాల్లో వచ్చిన మార్పులే భార్యలను వస్తువులుగా పరిగణించే పరిస్థితులను మార్చేశాయి. తనతోపాటు రాజ్యాన్నో, అర్ధరాజ్యాన్నో, కట్న

కానుకలనో తెచ్చుకున్న భార్య, ఆమె బంధువులు ఆ ఆస్తి ఆమెకు, ఆమె సంతానానికి మాత్రమే చెందాలనే నిబంధనలు పెట్టడం ద్వారానే – బహు భార్యత్వం క్రమేపీ అంతరించింది. వివాహం ఒక యుద్ధ ఫలితంగానో, కత్తి పదునుకు, కండబలానికి చిహ్నంగానో గాక; ఒక ఒప్పందం (కాంట్రాక్టు) గా మారడం వల్లే – వైవాహిక జీవితంలో మహిళల స్థాయి పెరిగింది. ఇంటి విషయాల్లో, ఆర్థిక విషయాల్లో, ముఖ్యంగా శీలసంబంధ విషయాల్లో భార్యా, భర్తలకు హక్కులు, అధికారాలు, బాధ్యతల్లో దాదాపు సమాన స్థాయి వచ్చింది. ఇదే పరిణామ క్రమం మన దేశంలోనూ చూస్తూ వచ్చాం.

కాపిటలిజం వల్ల జరిగిన భారీ పారిశ్రామికీకరణ, (ముఖ్యంగా 1991 తరువాత) తద్వారా వందల రెట్లు పెరిగిన ఉద్యోగాలు, ఆధునిక విద్యల కారణంగా స్వశక్తితో సంపాదించే మహిళలకు వరుని ఎంపిక, వివాహానంతర జీవితం, ఎంతమంది పిల్లలు, ఎప్పుడు పొందాలి లాంటి విషయాల్లో తాము కోరుకున్నంత స్వేచ్ఛ లభిస్తోంది. మిగిలి ఉన్న ఒకే ఒక జాడ్యం – స్వకులంలో, అదీ పెద్దలు కుదిర్చిన వివాహాలకే పరిమితమవడం. ఇది పాత కాలపు వాసనలకు ప్రతీకగా ఉన్నప్పటికీ; ఇప్పటికీ విస్తృతంగా చెల్లుబాటులో ఉండడానికి ముఖ్య కారణం హిందూ వివాహ చట్టం. ఒకసారి వివాహమయ్యాక జీవితాంతం కట్టిపడేసే ఈ చట్టం వల్ల వివాహ సంబంధ నిర్ణయాలు సంస్కృతీ సంప్రదాయాల మూసలోనే తయారవుతున్నాయి.

పెద్దలు కుదిర్చినా, ప్రేమ వివాహమైనా, కొన్ని కాపురాల్లో ఎడతెగని కలహాలు రావడం సహజం. తప్పెవరిదన్న తర్జన భర్జన కాసేపు పక్కనపెడితే, పరస్పర ప్రేమ, గౌరవం, నమ్మకం, ఇష్టం లేకుండా నిరంతర కలహాలు, దెప్పికోళ్ళు, కన్నీళ్ళతో కాపురం సాగించి, మనిషికున్న ఒకే ఒక జీవితాన్ని వ్యర్థం చేసుకోమనడం ధర్మమేనా అన్నది ప్రశ్న.

హిందూ వివాహ చట్టం ప్రకారం – శీలం తప్పడమో, హింసించడమో, మతి స్థిమితం లేకపోవడమో, సన్యసించడమో లాంటి కొన్ని కారణాలు నిరూపణైతే తప్ప; విడాకులు మంజూరు కావు. 1983 లో సరిత వర్సెస్ వెంకట సుబ్బయ్య కేసులో జస్టిస్. పి.ఎ. చౌదరి తీర్పునిస్తూ, 'ఇష్టం లేని భార్యాభర్తలను కలిసి ఉండాలని చట్టపరంగా నిర్బంధించడం అనేది జీవించే హక్కుకు భంగం కలిగిస్తుంద'న్నారు. ఆ తీర్పును మరుసటి సంవత్సరమే సుప్రీంకోర్టు కొట్టేసింది.

ఈ మధ్య తన ముందు కొచ్చిన ఒక కేసు సందర్భంగా సుప్రీంకోర్టు తీర్పునిస్తూ, విడాకులకు అనుమతించగల కారణాల్లో 'సరిదిద్దలేని స్థాయిలో వివాహ వైఫల్యాన్ని' కూడా ఒక కారణంగా పొందుపరచాల్సిన అవసరం ఉందని, ఆ మేరకు హిందూ వివాహ

చట్టాన్ని సవరించాలనీ ప్రభుత్వానికి సూచించింది. ఆ సూచనల మేరకు కేంద్ర కేబినెట్ ఈ మధ్యనే ఈ చట్టానికి సవరణల ప్రతిపాదనను ఆమోదించింది. ఇది లా కమిషన్‌ను దాటుకుని, ఒక ముసాయిదా రూపంలో పార్లమెంటు ముందుకు రావాల్సి ఉంది. పత్రికల సమాచారాన్ని బట్టి ఈ సవరణల ప్రకారం విడాకులకు భార్య అభ్యర్థిస్తే మంజూరు చెయ్యొచ్చనీ, కానీ భర్తకు ఆ వీలు ఉండదని, అంతేగాక, విడాకులు మంజూరైన పక్షంలో భర్త ఆస్తిలో సగం భార్యకు చెందుతుందనీ ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. అదే నిజమైతే, ఇది సమస్యను పరిష్కరించకపోగా, కొత్త సమస్యలకు దారితీస్తుంది.

అసలీ బిల్లును ఆమోదం కోసం తయారుచేశారా...; లేక మహిళా రిజర్వేషన్ బిల్లు లాగే రాజకీయ లబ్ధి కోసం ఒక ప్రదర్శన వస్తువుగా వాడుకుంటారా అని అనుమానించాల్సి వస్తోంది.

మొదటగా, భార్యా, భర్తలకు అసమాన హక్కులు కల్పించడం ప్రాథమికమైన - 'సమానత్వపు హక్కు'కు విరుద్ధం. ఇప్పుడున్న చట్టం ప్రకారం భరణం, మనోవర్తి నిర్ణయించడంలో ఇద్దరి ఆస్తులను, సంపాదనా శక్తిని, పిల్లల సంరక్షణ ఖర్చులను లెక్కలోకి తీసుకుంటారు. అలా కాకుండా విడాకులు మంజూరైన పక్షంలో భర్త ఆస్తిలో సగం భార్యకివ్వాలనడం అసమంజసం, ఆచరణ సాధ్యం కానిది. దీనివల్ల, కొద్దిగా అభిప్రాయ బేధాలున్న కుటుంబాల్లో, పరస్పర అనుమానాలకు ఆజ్యం పోసి, వారిని విడాకులకు మరింత దగ్గరగా తీసుకెళ్తుంది.

ఆధునికత, పరిపక్వత, తమ జీవితాల విషయంలో నిర్ణయాలు తీసుకో గలిగిన తెలివితేటలు మన యువతీ యువకులకు మెండుగా ఉన్నాయి. కలిసి జీవించలేని భార్యాభర్తలు తమ తమ జీవితాలను విడివిడిగానైనా ప్రశాంతతో గడిపే అవకాశం వారికి జన్మత : సిద్ధించిన ప్రాథమిక హక్కు. విడిపోయినా, మళ్ళీ ఇష్టపడితే తిరిగి వివాహం చేసుకునే వీలు ఎలాగూ ఉంది. లాంఛన ప్రాయంగా చేసే కాపురాల్లో మన పెద్దలు, సమాజం, సనాతనులు ఆశించే పవిత్రత ఏ కోశానా ఉండదు.

పెళ్ళి చేసుకోవడానికి - వ్యక్తిత్వం, ప్రేమించి, ఆరాధించగలిగిన లక్షణాలు తప్ప ఇంకేదీ ప్రామాణికం కాకూడదు. అయినా కొన్నిసార్లు తప్పు నిర్ణయాలు జరగవచ్చు. అలాంటప్పుడు వివాహ బంధం నుంచి బయటికెళ్ళిపోయే పూర్తి స్వేచ్ఛ స్త్రీ, పురుషులకు ఉండాలి. నిర్దిష్ట ఒప్పందం లేని కేసుల్లో విధివిధానాలు నిర్దేశించడానికి చట్టం ఉండొచ్చు. కానీ అది జీవిత ఖైదును శాసించే చట్రం కాకూడదు.

15-04-2012

జేబులు కొట్టే హక్కు

కేంద్ర ప్రభుత్వం రెండు సంవత్సరాల క్రితం చేసిన విద్యాహక్కు చట్టం రాజ్యాంగ విరుద్ధం కాదని ఇటీవలే సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఆ చట్టంలోని ఒక సెక్షను ప్రకారం ప్రభుత్వం నుంచి ఏ సాయమూ పొందకుండా తమ స్వంత డబ్బుతో ప్రైవేటుగా నడిపే ప్రాథమిక విద్యాసంస్థల్లో కూడా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 25 శాతం సీట్లు దాదాపు ఉచితంగా కేటాయించాల్సిందేనన్న నిబంధన ఉంది.

ముఖ్యంగా ఆ నిబంధనను సవాలు చేస్తూ నడిచిన వ్యాజ్యంలో అట్టి నిబంధన – రాజ్యాంగ బద్ధమేనని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ముగ్గురు జడ్జీల బెంచిలో ఇద్దరు ఆ నిబంధనను సమర్థించారు. మూడో జడ్జి ఆ నిబంధన చెల్లదంటూ మైనారిటీ తీర్పునిచ్చారు. విద్యాహక్కు చట్టం ప్రకారం 6 నుంచి 14 ఏళ్ళ వయసు పిల్లలకు విద్య ఒక ప్రాథమిక హక్కు. ఈ చట్టం చేయడానికి వీలుగా 86వ రాజ్యాంగ సవరణ ద్వారా 21వ అధికరణానికి 21ఎ అనే ఉప అధికరణాన్ని ఎన్‌డిఎ ప్రభుత్వ హయాంలో 2002లోనే చేర్చారు. 21వ అధికరణం జీవించే హక్కుకు సంబంధించింది. 21ఎ ప్రకారం రాజ్యం ఉచిత ప్రాథమిక విద్యను అందించాలి. అంటే జీవించే హక్కుకు ఉచిత ప్రాథమిక విద్యాహక్కు ఒక ముఖ్యమైన అంగం అన్నట్లు.

ఈ చట్టం ప్రకారం నిర్దిష్ట వయసులో ఉన్న పిల్లలకు ప్రాథమిక విద్యను ఉచితంగా, నిర్బంధంగా అందించాలి. దాని కోసం పిల్లలుండే పరిసరాలకు దగ్గర్లో ప్రభుత్వ పాఠశాలలు పెట్టాలి. క్రమశిక్షణ పేరిటో, పరీక్షలు పెట్టో, ఇంకే కారణాలో చూపి పిల్లలను తప్పించడానికి వీలు లేదు. ముఖ్యంగా ప్రైవేటు స్కూళ్ళు, ప్రైవేటు మైనారిటీ స్కూళ్ళలో 25 శాతం సీట్లు ఆర్థికంగా వెనుకబడ్డ వర్గాల విద్యార్థులకు ఇచ్చి తీరాలి. ప్రైవేటు స్కూళ్ళు ఈ నిబంధనను పాటించాల్సిందేననీ, కానీ ప్రైవేటు మైనారిటీ విద్యాసంస్థలకు ఈ నిబంధన వర్తించదని సుప్రీంకోర్టు, తన విజ్ఞత మేరకు తీర్పు ఇచ్చింది.

అంటే మైనారిటీలైతే తప్ప – ప్రైవేటు విద్యాసంస్థలకు – ప్రభుత్వ నిబంధనలు, జోక్యం నుంచి రాజ్యాంగ పరమైన రక్షణ దొరకదని అర్థమవుతుంది.

ఈ సందర్భంగా ప్రాథమిక హక్కులు అంత ప్రాథమికమేమీ కావనీ, అవి రాజ్యాంగంలో రాసిన ఆదేశిక సూత్రాలకు లోబడి ఉండాల్సిందేననీ సుప్రీంకోర్టు మరోమారు స్పష్టం చేసింది. ఆదేశిక సూత్రాల ప్రకారం ప్రజలకు పని దొరకాల్సిన హక్కు, విద్యాహక్కు, మహిళా, శిశు సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, షెడ్యూల్ కులాలు, తెగలు, బలహీన వర్గాలకు, విద్య, ఆర్థిక విషయాల్లో ప్రోత్సాహం, కార్మికులకు సరిపడా జీతం లాంటి సంక్షేమ హక్కులు కల్పించే దిశగా ప్రభుత్వ విధానాలుండాలి.

ఈ హక్కులను తనంతట తానుగా ఏ వ్యక్తీ డిమాండు చేసే వీలులేదు కానీ, వీటిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వాలు శాసనం ద్వారా ప్రాథమిక హక్కులను నియంత్రించవచ్చని సుప్రీంకోర్టు పలు తీర్పుల్లో భాష్యం చెప్పింది. అదే ధోరణిలో, ఐక్యరాజ్యసమితి ప్రవచనాలనో, అమెరికా లాంటి దేశాలనో అనుకరించో, ప్రాథమిక హక్కులకు రక రకాల కొత్త అర్థాలు కూడా వెతికారు.

ఉదాహరణకు సమానత్వపు హక్కు అంటే... చట్టం ముందు అందరూ సమానులేననే 'రాజకీయ సమానత్వం' కాదట! సామాజిక, ఆర్థిక, విద్యా విషయక సమానత్వం సాధిస్తే గానీ రాజకీయ సమానత్వం, స్వేచ్ఛ అర్థవంతం కావట! ఈ భావ గందరగోళంలో అసలు మనిషి హక్కులంటే ఏమిటో, అవి ఎక్కుడ్నుంచి వచ్చాయో, మనిషి హక్కులకు, ప్రభుత్వానికి సంబంధమేమిటో, ఇందులో రాజ్యాంగాల, న్యాయస్థానాల పాత్ర ఏమిటో అర్థం కాక – మేధావులే జుట్టు పీక్కుంటూ ఉంటారు. ఇక ఈ విషయాల్లో సామాన్యులకున్న జ్ఞానం దాదాపుగా శూన్యం కావడంలో ఆశ్చర్యమేమి ఉంది?

మనిషికున్న అత్యంత ప్రాథమికమైన హక్కు – జీవించే హక్కు. తన బ్రతుకు తను బ్రతికే హక్కు. బ్రతకడానికి ఏం చెయ్యాలో, ఎంతమేరకు కష్టపడాలో నిర్ణయించుకునే హక్కు. తన కష్టం ద్వారా సంపాదించుకున్న దాన్ని అనుభవించే హక్కు. తన నోటికాడి కూడు ఎవరూ లాక్కోలేని హక్కు.

అదే సమయంలో తాను ఎవరి నోటికాడ కూడూ లాక్కోకూడదనే సూత్రం కూడా – అందులోనే ఇమిడి ఉంది.

భావ ప్రకటనా స్వేచ్ఛ, మత స్వేచ్ఛ, వృత్తి, నివాస తదితర స్వేచ్ఛలు – ఈ జీవించే హక్కు నుంచే ప్రవహిస్తాయి. జీవించే హక్కును అమలుపరిచేది ఆస్తిహక్కు. తాను సంపాదించింది ఎవరు పడితే వాళ్ళు లాక్కుంటే – ఇక జీవించేదెట్లా? తమ ఈ హక్కులను

కాపాడ్డానికే, మనుషులు – ప్రభుత్వాలనేర్పరుచుకుంటారు. ప్రభుత్వాలకు ఇంతకు మించి ఏ పనీలేదు.

ఆ పని కోసం హేతుబద్ధమైన చట్టాలు చెయ్యాలి. ఆ చట్టాల ముందు రాజు, పేద అందరూ సమానులే. అదే రాజకీయ సమానత్వం. మనిషి తనకున్న జీవించే హక్కుతో – వృత్తిని, జీవన మార్గాన్ని, కష్టపడే స్థాయిని ఎంచుకోగలడు.

కానీ ఆ హక్కు ద్వారా తాను కోరుకునే సంపాదనను, జీవన స్థాయిని, సుఖాలను పొందే హామీ ఎవరూ ఇవ్వరు, ఇవ్వలేరు. తను సంపాదించింది అనుభవించగలిగే స్వేచ్ఛకు మాత్రమే వ్యక్తి హక్కులు హామీ ఇస్తాయి.

ఈ హక్కులను హరించగలిగే శక్తి ఇద్దరికే ఉంది. ఒకటి దొంగలు, రెండోది ప్రభుత్వం.

హింస, లేదా బెదిరింపు లేదా మోసం ద్వారా మనిషి సంపాదించుకున్నది తనకు కాకుండా చేయగలిగేది దొంగలు. రకరకాల పన్నుల ద్వారా, (ఇతరుల హక్కులకు భంగం కలగకపోయినా కూడా) మనిషి వృత్తినీ, సంపాదనా మార్గాలను నియంత్రించడం ద్వారా, పోలీసు, తుపాకీ, జైలు, ఇన్‌కంటాక్స్, సేల్సు టాక్సు, ఎక్సైజు, సుంకాలు, నిషేధాలు, నిర్భందాలు, బెదిరింపులతో మనిషి సంపాదనను బలవంతంగా లాక్కునేది – ప్రభుత్వం.

వ్యక్తి హక్కుల్ని హరించే క్రమంలో దొంగల.... ప్రభుత్వాల ప్రవర్తనలో తేడా ఏమీలేదు.

కాకపోతే అది దొంగతనంగా, హక్కుల హరణగా కనిపించకుండా ఉండడానికి– ప్రభుత్వాలు కొన్ని గోసాయి చిట్కాలు ప్రయోగిస్తాయి.

వాటిలో అతి ముఖ్యమైన, విశ్వవ్యాప్తమైన చిట్కా – బంగారు నాణాల స్థానంలో తోలు నాణాలు చలామణి చేసినట్టు...; ప్రాథమిక వ్యక్తి హక్కులను పక్కకు జరిపి – వాటి స్థానంలో సంక్షేమ హక్కులను ప్రవేశపెడతారు.

జీవించే హక్కు, జీవించడానికి సంపాదించుకునే హక్కు; సంపాదించిన దానిని అనుభవించే హక్కులను పక్కకు నెట్టేసి– పని హక్కు, జీతం హక్కు, విద్యా హక్కు, ఆరోగ్యం హక్కు, ఆహార హక్కు, నివాస గృహం, నెలనెలా పింఛను, రెండ్రూపాయల కిలో బియ్యం, ఉచిత విద్యుత్తు లాంటి 'సంక్షేమ హక్కు'లే – అసలు హక్కులని మోత మోగిస్తారు.

దొంగ – బ్రాహ్మణుడు – మేక – కుక్క కథ లాగా; వినీ వినీ అందరూ అదే నిజమనుకుంటారు. ఈ 'కృత్రిమ హక్కు'ల అమలును డిమాండు చేసే పరిస్థితులు కల్పిస్తారు. ఈ డిమాండ్లు తీర్చడానికి డబ్బెక్కడ్నుంచి వస్తుంది? సంపాదించిన వారి

జేబులు కొట్టడం ద్వారా వస్తుంది. వేరే మార్గమే లేదు. ప్రభుత్వమనేది సంపాదించే వారి జేబు కత్తిరించే గుత్త అధికారం తమకు తామే ఇచ్చుకున్న వ్యక్తుల సమాహారం మాత్రమే. ఆ వ్యక్తులేం కష్టపడి సంపాదించరు. నిజానికి వారి జీత భత్యాలు, విలాసాలు, అవినీతి ఖర్చులు కూడా ఈ జేబు కత్తెరల 'రాబడి' ఖాతాలోంచే వెళ్తాయి.

విద్య, ఆరోగ్యం, ఆహారం, ఇళ్ళు, కరెంటు – ఇవేమీ తమంతట తాము ప్రకృతిలో లభ్యం కావు, చెట్లకు కాయవు. ఎవరో ఒకరు కష్టపడి ఉత్పత్తి చేస్తేనే వస్తాయి. వాటిని ఉచితంగా పంచిపెట్టడమంటే ఉత్పత్తి చేసిన వారి సంపాదనను, కష్టాన్ని, హక్కులను కొల్లగొట్టడమే. అది పన్నుల ద్వారా కావచ్చు, స్వాధీనం చేసుకోవడం ద్వారా కావచ్చు. ఈ దోపిడీని సమర్థించుకోవడానికి చట్టాలు చేసినా, ఆదేశిక సూత్రాలు రాసినా, ఎన్ని భాష్యాలు చెప్పినా ఆ చర్యల్లోని అనైతికత, అధర్మాలను కప్పిపుచ్చలేవు.

సుప్రీంకోర్టు ఉవాచ ప్రకారం – విద్యాసంస్థలు లాభార్జన కోసం నడపకూడదు. ఫీజులను ప్రభుత్వమే నిర్ణయిస్తుందట! పుస్తకాలు రాసేవారు, ముద్రించే వారు లాభాలు పొందొచ్చు. పిల్లలను స్కూలుకు తీసుకెళ్ళే ఆటో, బస్సు వాళ్ళు, యూనిఫాంలు, చాక్లెట్లు అమ్మేవాళ్ళు లాభాలు పొందొచ్చు. కానీ కోట్ల పెట్టుబడి పెట్టి, దీర్ఘకాలిక ప్రణాళికతో, పోటీ వాతావరణంలో, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి వెచ్చించి,ఉపయోగించి, లక్షల జీతాలకు ఉత్తమ ఉపాధ్యాయులను నియమించి, అత్యంత నాణ్యమైన విద్యనందించే యాజమాన్యాలు మాత్రం లాభాలార్జించడం నిషిద్ధం!

ఇదీ మన నైతికత! ఇదీ ఆదేశిక సూత్రం స్ఫూర్తి! 25శాతం పేద విద్యార్థుల కిచ్చే ఉచిత సీట్ల భారాన్ని ఎవరు మోయాలి? ఫీజులు కట్టే మిగతా 75 శాతం విద్యార్థుల తల్లిదండ్రులే కదా?

నాయకులో, ప్రభుత్వాధికారులో, న్యాయస్థానాలో, ఎడిట్ పేజీలు నింపే మేధావులో మోయరు కదా?

దొంగలకైనా కొంత నీతి ఉంటుంది. తాము చేసే పని గొప్ప నీతిమంతమైనదని, సమాజసేవ అనీ కనీసం ప్రచారం చేసుకోరు.

29-04-2012

ఇసుక నుండి తైలంబు...

హైకోర్టు ఉత్తర్వుల మేరకు దాదాపు నెలన్నర నుంచి రాష్ట్రంలో ఇసుక సరఫరా ఆగిపోయింది. ఇందిరమ్మ ఇళ్ళు మొదలుకొని ప్రాజెక్టులు, విద్యుత్ ప్లాంట్ల వరకు వేల కోట్ల రూపాయల నిర్మాణాలు ఆగిపోయాయి. లక్షల మంది నిర్మాణ రంగ కార్మికులు, ఇంజనీర్లు భుక్తిలేక రోడ్డున పడ్డారు. ఉరుము, మెరుపు లేకుండా వచ్చిపడిన ఈ మహాప్రళయం నుంచి ఎప్పటికి, ఎలా బయటపడాలో తెలియకుండా ఉంది. పర్యావరణం గురించి, సహజవనరుల వినియోగం గురించి అవగాహనాలేమి, మిడిమిడి జ్ఞానం, పరస్పర విరుద్ధ భావాలతో ఇష్టమొచ్చిన విశ్లేషణలు చేసే మేధావులు, మీడియా కూడా కిమ్మనడం లేదు. అసలు సమస్యేమిటో అర్థం చేసుకోలేక, అర్థమయినా గానీ; ప్రకటించే ధైర్యం లేక, బాధితుల పక్షం వహించలేకపోతున్నారు.

ఈ వ్యాజ్యంలో ముఖ్యంగా మూడు కారణాలను ఎత్తిచూపారు.

మొదటిది – నదులు, ఏరులు, వాగుల నుంచి ఇసుక వెలికితీయడం వల్ల – భూగర్భ జలాల నిల్వసామర్థ్యం తగ్గిపోతుందట. ఈ విషయంలో ఏవైనా పరిశోధనలు జరిగి, రుజువుచేసే శాస్త్రీయ ఆధారాలున్నాయా అని ఇద్దరు ప్రభుత్వ జియాలజిస్టులను సంప్రదించగా; తమకు తెలిసి పరిశోధనలేవీ జరగలేదని వారు అన్నారు. ఇంటర్నెట్‌లో వెతికినా – దీనికి సంబంధించిన వివరాలేవీ దొరకలేదు.

ఇక రెండవ కారణంగా – స్థానిక మత్స్యకారుల జీవనోపాధి దెబ్బ తింటోందన్నారు. ఎండిపోయిన నదులు, వాగుల నుండి పొడి ఇసుకను వెలికి తీస్తే మత్స్యకారులకొచ్చిన ఇబ్బందేమిటో అర్థం కాలేదు. ఇక మూడవ కారణంగా– ఇసుక మాఫియాలు పెచ్చరిల్లుతున్నాయని, అనుమతించిన పరిమాణం కన్నా ఎక్కువగా, అనుమతి మించి లోతుగా ఇసుక తవ్వుతున్నారని, సంబంధిత ప్రభుత్వశాఖలు దీన్ని నివారించడంలోను, అపరాధ రుసుము వసూలు చేయడంలోను నిరాసక్తత; నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయనీ కోర్టులో అభిప్రాయపడ్డారు.

ఈ కారణాలు చూపి ఇసుక సరఫరా నిలిపివేయడం వల్ల వినియోగదారులు పడుతున్న ఇబ్బందులు, భరించవలసి వస్తున్న నష్టం గురించి ఎవరూ ఆలోచిస్తున్నట్లు లేదు.

ఇసుక వాడకం వల్ల భూగర్భ జలాల మట్టం తగ్గిపోతుందనడానికి శాస్త్రీయ ఆధారాలైతే లేవు. ఒక వేళ ఉన్నాయనుకున్నా; ఇసుక వాడకం నిలిపివేయడం దానికి పరిష్కారమా?

భూగర్భ జలాలు వాడుకునే వారికి అది ఎంత ముఖ్యమో, ఇసుక అవసరమైన వారికి ఇసుక కూడా అంతే ముఖ్యం కదా! ఎవరి, ఏ ఇతర అవసరాల కన్నా భూగర్భ జలాల మట్టాన్ని కాపాడడమే ముఖ్యమా? అలా అయితే నాగార్జునసాగర్, ఎస్సారెస్పీ లాంటి ప్రాజెక్టుల్లోను, వాటి కాల్వల్లోను, నీటిని వాడకుండా అలాగే నిలవబెట్టి ఉంచితే; చుట్టుపక్కల భూగర్భజలాల మట్టం పెరుగుతుంది కదా!

అంతేగాక; ఆ నీటిని ఆశ్రయించి రకరకాల జలచరాలు, పాములు, జలగలు వృద్ధిచెంది ఒక ఆహ్లాదకరమైన జీవారణ్యం ఆవిష్కృతమవుతుంది కదా! సైబీరియా కొంగలు కూడా వలస రావచ్చు!

మరి వ్యవసాయానికి, విద్యుత్ ఉత్పత్తులకు నీరు విడుదలెందుకు చేస్తున్నాం? ఇంకో విషయం. కాలక్రమేణా ఇసుక మేటలు వేసి, నదుల, వాగుల ప్రవాహ సామర్థ్యం తగ్గి, గట్లుదాటి పారడంతో వరదలొస్తున్నాయంటారు. ఇసుక వాడకం వల్ల నదులు, వాగుల ఉపరితలం మట్టం తగ్గి, వరదల తీవ్రతను తగ్గిస్తాయి కదా!

ఇసుక ధరలో అత్యధిక భాగం – డెబ్భైశాతం వరకు – రవాణా ఖర్చులకే పోతుంది. కాబట్టి; అవసరం అయితే తప్ప ఉచితంగా ఇచ్చినా ఎవరూ ఎక్కువ పరిమాణంలో ఇసుక మోసుకుపోరు. నిర్మాణాల్లో రకరకాల పనులకు వేర్వేరు సైజు ఇసుక అవసరమవుతుంది. అది వేర్వేరు నదులు, వాగులు, రీచ్‌లలో వేర్వేరు లోతుల్లో దొరుకుతుంది. కాబట్టి అనుమతించిన పరిమాణం కంటేను, లోతుకంటే ఎక్కువ తవ్వేస్తున్నారనడం అర్థరహితం.

ఎంత తవ్వినా, వర్షాలు పడ్డాక మరసటి సీజను కల్లా కొత్త ఇసుక వచ్చి చేరడం; ఉన్న ఇసుక పక్కకు జరగడం ద్వారా ఉపరితలం యథాస్థితికి వస్తుంది. కాబట్టి నష్టమేమీ లేదు. ప్రభుత్వ నియంత్రణలు సరిగా అమలు జరగడం లేదని, మాఫియాలు పెరిగిపోతున్నాయని, కాబట్టి మరిన్ని నియంత్రణలు విధించాలనడం హాస్యాస్పదం. అసలు నియంత్రణలు విధించడమెందుకు...? అమలు చేసే వారు లేరని చింతించడమెందుకు?

గత పదిహేను సంవత్సరాల్లో నిర్మాణ రంగంలో వేగంగా వచ్చిన పెరుగుదలతో సిమెంటు, ఇసుక వంటి మౌలిక ముడి పదార్థాలకు డిమాండు విపరీతంగా పెరిగింది. సిమెంటు పరిశ్రమలకు అనుమతులు, నీటి సరఫరా, దానికి ముడి పదార్థమైన సున్నపురాయి నిక్షేపాల కేటాయింపుల్లో జరిగిన అవినీతి, ఆశ్రిత పక్షపాతాల వివరాలు సీబీఐ దర్యాప్తులో బయటపడుతున్నాయి.

మరి సిమెంటు పరిశ్రమ కూడా మూసేద్దామా? అలాగే మరో ముఖ్య ముడిపదార్థమైన ఇసుక మీద కూడా రాజకీయ నాయకుల కన్ను పడింది. మద్యం దుకాణాల్లాగే ఇసుక రీచ్‌ల వేలాలు – అడ్డగోలు సంపాదనకు రాజ(కీయ) మార్గాలయ్యాయి. స్థానిక రాజకీయ నాయకుల దగ్గర్నుంచి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రుల వరకు లంచాలు, బినామీ వాటాలు, ఎమ్మార్వో దగ్గర్నుంచి కలెక్టర్ల వరకు ఇచ్చే వత్తాసు, మైనింగ్, రెవెన్యూ, పోలీసు, రవాణా శాఖల అధికారుల రెగ్యులర్ మామూళ్లు ఈ రంగంలో పనిచేసే వారందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే. పదివేలుండే ఇసుక లారీ హైకోర్టు ఆంక్షలతో ఇప్పుడు నలభై వేలయింది. చీకటి మాటున తవ్వకం, రవాణా జరుగుతూనే ఉంది. ఇంత లాభసాటైన చీకటి వ్యాపారాన్ని ఇలాగే కొనసాగనిస్తే ఇంకా ఎంత ప్రమాదకరమైన మాఫియాలు తయారవుతాయో తేలిగ్గా ఊహించవచ్చు.

వీటన్నిటినీ ఒక్క దెబ్బతో ఆపాలన్నా, ఇసుక విషయంలో లంచాలు, మాఫియాలు లేకుండా చేయాలన్నా, సులువైన మార్గముంది. అసలు ఇసుక రీచ్‌ల వేలాలు రద్దుచేసి, ఎవరు కావాలంటే వారు ఎక్కడ్నుంచి, ఎంత ఇసుక కావాలంటే అంత వాడుకోవచ్చంటే అన్ని సమస్యలు తీరిపోతాయి. వెలికితీత, నిర్వహణ, రవాణా మెరుగుపడి ఇసుక ధరలు సగానికి సగం తగ్గుతాయి. ఫలితంగా ఇళ్ళ ధరలు, అద్దెలు తగ్గుతాయి. లక్షంబాతిక కోట్ల పన్నులు వసూలు చేస్తున్న ప్రభుత్వానికి ఇసుక వేలాల్లో వచ్చే యాభై, వంద కోట్ల 'ఆదాయం' రాకుండాపోతే కొంపలేం మునగవు.

కానీ ఇంతలేసి లంచాలకు అలవాటు పడిన రాజకీయ నాయకులు, ప్రభుత్వోద్యోగులు అలాంటి ప్రతిపాదనలకు సమ్మతిస్తారా? తీవ్రంగా వ్యతిరేకిస్తారు. కాకపోతే వారి వ్యతిరేకతకు అసలు కారణం చెప్పకుండా, సోషలిస్టు మేధావులు అల్లి ఉంచిన సామాజిక ముసుగును ఉపయోగిస్తారు. సహజ వనరులన్నీ సామాజిక ఉమ్మడి ఆస్తులని, వాటిని ఉచితంగా ఎవరూ ప్రైవేటు అవసరాలకు వాడుకోకూడదని, కాబట్టి ప్రభుత్వ జోక్యం, యాజమాన్యం అవసరమనీ వాదిస్తారు. ఇప్పుడు అసలు సిద్ధాంత చర్చలోకి వద్దాం.

సహజ వనరులు ఎవరికి చెందాలి? వాటిని ఉపయోగించుకునే హక్కులు ఎలా ఏర్పడతాయి? ఈ ప్రశ్నలకు - రెండు ముఖ్య భావజాలాలు భిన్నమైన సమాధానాలిస్తాయి.

సోషలిస్టు కమ్యూనిస్టు సామాజిక వాద భావజాలం ప్రకారం - సహజవనరులు సమాజానికి చెందుతాయి. వీటిపై ఏ వ్యక్తికీ వ్యక్తిగతంగా హక్కులేదు. మనిషికి తనుచేసే కష్టం, శ్రమపై హక్కుంటుంది కానీ, సహజ వనరుల మీద ఉండదు. ఈ సిద్ధాంత సహజ పర్యవసానమేమిటంటే - ప్రైవేటు ఆస్తి (భూమి, బావి, చెట్టు, ఆవు) ఉండరాదు, ఉత్పత్తి సాధనాలన్నీ సమాజపరం (అంటే ప్రభుత్వపరం, అంటే పార్టీ పరం, అంటే పార్టీ నాయకుని పరం) కావాలి.

దీనికి విరుద్ధమైన వ్యక్తివాద, ఉదారవాద కాపిటలిస్టువాదం ప్రకారం; ఇంతవరకు ఎవరూ ఉపయోగించని సహజ వనరుపై (అది ఏదైనా సరే) మొట్టమొదటిసారిగా దాన్ని ఉపయోగించి, దానికి తన శ్రమను జోడించి, తన స్వంత వాడకానికో, అమ్మకానికో ఏదైనా ఉత్పత్తి చేసిన వాడికి ఆమేరకు ఆ వనరుపై ఆస్తిహక్కు ఏర్పడుతుంది.

అట్టి ఆస్తి హక్కును అనుభవించవచ్చు, అమ్ముకోవచ్చు, కుదవబెట్టవచ్చు, తన సంతానానికి వారసత్వంగా ఇవ్వవచ్చు. మానవ సమాజ, నాగరికత అభివృద్ధిలో ఈ ఆస్తిహక్కు అత్యంత కీలక పాత్ర వహించింది. ఆస్తి హక్కును ఖచ్చితంగా నిర్వచించి, దాన్ని కాపాడని సమాజాలు, సమూహాలు...; ఆటవిక, ఆదివాసీ స్థాయి నుంచి ముందుకుపోవు.

ఆహారం మొదలుకుని మనం వాడే వస్తువులన్నీ సహజ వనరులను రూపాంతరం చెందించడం వల్ల వచ్చినవే. కేవలం శ్రమవల్ల ఉత్పత్తులు తయారు కావు. సహజ వనరులపై ఆస్తి హక్కు లేకపోతే శ్రమను దేని రూపాంతరీకరణలో ఉపయోగిస్తాం?

ఆస్తి హక్కులేకపోతే అసలు నిల్చోవడానికి, మరణించాక పూడ్చిపెట్టడానికి చోటెవరివ్వాలి? మా ఊరి వాగులోని ఇసుకపై ఢిల్లీలో ఉండే టాక్సీ డ్రైవరుకు కూడా సమాన హక్కుందా? కాబట్టి సహజవనరులపై ఆస్తిహక్కులను ఖచ్చితంగా నిర్వచిస్తే, వాటి యజమానులు దీర్ఘకాలిక వ్యూహాలతో సదరు ఆస్తి నాణ్యత చెడిపోకుండా కాపాడుకుంటూనే ; ఎక్కువ ఫలసాయం పొందే ఆలోచనలు చేస్తారు. అందరికీ చెందినదని చెప్పే (సామాజిక) ఆస్తులు - ఎవరికీ చెందనట్లే లెక్క. నీరైనా, అడవైనా, రోడ్లైనా, ఇసుకైనా.

13-05-2012

చాప కింద నీరులా....

టెలికాం రెగ్యులేటరీ ఆథారిటీ (ట్రాయ్) ఈ మధ్య కొన్ని ఆశ్చర్యకరమైన ఉత్తర్వులు జారీ చేసింది. వాటి ప్రకారం - ఇకపై టెలివిజన్ ఛానెళ్ళలో గంటకు పన్నెండు నిమిషాలకు మించి వ్యాపార ప్రకటనలు చూపకూడదు. సినిమా ప్రసారం చేస్తుంటే ఫలానా వ్యవధి వరకు మధ్యలో ఆపకూడదు. వార్తలు చదివేటప్పుడు, క్రీడా కార్యక్రమాలు చూపేటప్పుడు ఎన్ని ప్రకటనలు చూపవచ్చో సవివరంగా నియంత్రణలు విధించారు.

ఇంకోపక్క ఒక గౌరవ కేంద్ర మంత్రి ప్రైవేటు ట్యూషన్లను నిషేధించబోతున్నట్లుగా చెప్పారు. మరోపక్క డాలరుతో మారకంలో రూపాయి విలువ తీవ్ర ఒడిదుడుకులకులోనై గత కొద్ది నెలల్లోనే నలభై అయిదు నుంచి యాభై ఆరుకు పడిపోయింది. యాభై మూడు రూపాయల స్థాయి దాటగానే రిజర్వు బ్యాంకు హడావుడి చేసి పెద్ద మొత్తంలో తన దగ్గర నిల్వ ఉన్న డాలర్లను మార్కెట్‌లో ప్రవేశపెట్టి జారిపోతున్న రూపాయి విలువకు కాలడ్డం పెట్టింది. ఒక వారం తర్వాత రూపాయి మరింత ఉధృతంగా జారిపోయి యాభైఆరుకు చేరింది. ఆరవై రూపాయలవడానికి ఎంతోకాలం పట్టదని నిపుణుల అభిప్రాయం - పార్లమెంటు సమావేశాలు జరుగుతుండగా జరిగిన ఈ పరిణామాలు సహజంగానే చట్ట సభలను కుదిపాయి.

కేంద్ర ఆర్థిక మంత్రివర్యులు దాదాపు కంటతడి పెట్టినంత పనిచేసి; ఒక గంభీరోపన్యాసంతో... తాము చేయగలిగిందంతా చేస్తున్నామని, చేస్తూనే ఉంటామని చెప్పారు. వారి వయసుమీద గౌరవంతోనో, లేక ఇంకా ఎలా విమర్శించాలో తెలియకో; లేదా తమ దగ్గర ఏ ఇతర పరిష్కార మార్గాలూ లేకనో - ప్రతిపక్షాలు అంతటితో మిన్నకుండి పోయాయి. ఆకస్మికంగా రూపాయి విలువ పడిపోవడంతో విపరీతంగా ఇబ్బందులపాలైన దిగుమతిదారులు, విద్యార్థులు వంటివారు బాధను దిగమింగుకోవడం

తప్ప చేయగలిగిందేమీలేదు. పార్లమెంటు సమావేశాలు ముగియగానే పెట్రోలు ధర లీటరుకు ఏడున్నర నుంచి తొమ్మిది రూపాయలు పెరిగింది. అదేమంటే అది పెట్రోలియం సంస్థల స్వంత నిర్ణయమని, తమకేం సంబంధంలేదని కేంద్ర ప్రభుత్వం చేతులు దులుపుకుంది. పెట్రోలియం సంస్థలు సొంత నిర్ణయం తీసుకోవడానికి యూపిలో ఎన్నికలు, పార్లమెంటు సమావేశాలు పూర్తయ్యేదాకా ఆగుతాయా?

ఇవన్నీ చూడ్డానికి ఒకదానితో ఒకటి సంబంధంలేని వేరువేరు విషయాలుగా కనబడుతున్నా; వీటన్నిటినీ కలిపే దారం – ప్రభుత్వం. దేశంలో మళ్ళీ ఫాసిస్టు ధోరణులు చాపకింద నీరులా విస్తరిస్తున్నాయనడానికి ఇవన్నీ నిదర్శనాలు. ఇంతకు ముందొక సందర్భంలో ఆర్థిక రంగంలో ఫాసిస్టు ధోరణుల గురించి ప్రస్తావిస్తే...; 'ఫాసిస్టు' అనే పదం వాడడాన్ని ఒక మిత్రుడు ఆక్షేపించాడు. అది చాలా తీవ్రమైన పదమని, హిట్లరు, ముసోలిని లాంటి నియంతృత్వాలకు మాత్రమే వాడాలన్నారు. ఈ సందర్భంగా గుర్తు తెచ్చుకోవల్సిందే మిటంటే, హిట్లరు కాలంలోని జర్మనీలో నాజీయిజం అనే పదం వాడుకలో లేదు. అది హిట్లరుకు చెందిన నేషనల్ సోషలిస్టు పార్టీకి పొట్టిపేరు. ఈ పొట్టిపేరు యుద్ధానంతర సాహిత్యం ద్వారా మాత్రమే బహుళ ప్రాచుర్యంలోకి వచ్చింది. అలాగే ఫాసిజం కూడా.

నామమాత్రపు ప్రైవేటు యాజమాన్యంతో, ఫ్యాక్టరీలు, కంపెనీలు, హోటళ్ళు, కార్మికులు– ఇలా అన్ని ఉత్పత్తి సాధనాలూ ప్రభుత్వపు పూర్తి నియంత్రణలో ఉండి, సమాజంలోని విద్యాలయాలు, మత సంస్థలు లాంటి వ్యవస్థలన్నీ ప్రభుత్వం కనుసన్నలతో పనిచేసే పరిస్థితినే – ఫాసిజం అంటారు.

పైన ఉదహరించిన విషయాలన్నిటిలోనూ ప్రభుత్వ పాత్ర కొట్టవచ్చినట్లుగా కనబడుతుంది. మొదటగా టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఉత్తర్వులనే తీసుకుందాం. *దేశంలోని తొంభై అయిదు శాతాన్ని మించి టీవీ ఛానళ్ళన్నీ ప్రైవేటువే. అవి ఆర్థికంగా ప్రభుత్వం మీద ఆధారపడి లేవు. వాటిని నిర్వహించడానికయ్యే ఖర్చంతా ప్రకటనల రూపంలో రాబట్టుకోవాల్సిందే. కొన్ని ఛానళ్ళు సినిమాలకు, కొన్ని న్యూస్‌కు, కొన్ని కార్టూన్లకు, కొన్ని క్రీడలకు....ఇలా ఎవరికి వారు తమకంటూ ఒక మార్కెట్ భాగాన్ని ఎంచుకుని, ప్రేక్షకుల ఆదరణ కోసం పోటీ పడుతుంటారు. వారి వారి ప్రేక్షకాదరణ స్థాయిని బట్టి ఒకే వాణిజ్య ప్రకటనకు వేర్వేరు ఛానళ్ళకు రకరకాలుగా డబ్బు చెల్లిస్తారు. వివిధ ఛానళ్ళ ఖర్చులు కూడా రకరకాల స్థాయిల్లో ఉంటాయి. అదీగాక పోటీ ప్రపంచం. తమ ఛానల్‌ను చూడమని ఎవరినీ బలవంతపెట్టలేరు.*

అలాగే, వాణిజ్య ప్రకటనలు ప్రసారం చెయ్యాలా వద్దా...; చేస్తే ఎంత డబ్బు తీసుకోవాలి? అనే విషయంపై కూడా ఎవరిపై ఎవరి బలవంతమూ లేదు. మరి ట్రాయ్ ఇందులో తలదూర్చాల్సిన అవసరం ఏమొచ్చింది? గంటకు ఇన్ని నిమిషాలు మాత్రమే ప్రకటనలు ప్రసారం చెయ్యాలన్న నియంత్రణలతో...; ఆ ఛానల్‌కు నష్టం వస్తే ఎవరు భరించాలి? ఛానల్ మూసేసుకోవాలా?

చూస్తుంటే – ప్రభుత్వ ప్రకటనల ద్వారా – ఆ నష్టాన్ని భర్తీ చేస్తామనే రోజు ఎంతో దూరంలోలేదు అనిపిస్తోంది. ఇప్పటికే రకరకాల వస్తువుల ప్రకటనలను రకరకాల కారణాలతో నిషేధించారు. ఇకముందు ప్రభుత్వం తనకుతాను నిర్వచించుకునే 'ప్రజాశ్రేయస్సు' దృష్ట్యా ; మరిన్ని వస్తువులను వాణిజ్య ప్రకటనల నుంచి మినహాయించొచ్చు. ఈ రకంగా క్రమక్రమేణా 'టెలివిజన్ ఛానళ్ళపై ప్రభుత్వం పూర్తి పట్టు సాధించే దిశలో – ఇది మరొక మెట్టు మాత్రమే. ఇవాళ టీవీ రంగంలో జరిగింది. రేపు వార్తా పత్రికల రంగానికీ విస్తరిస్తుంది. అది క్రమంగా పెరిగి మీడియా మీద దాదాపుగా పూర్తి స్థాయిలో పరోక్షంగా ప్రభుత్వం పట్టు సాధిస్తుంది. ఇప్పటికే ప్రెస్ కౌన్సిల్ ఛైర్మన్ కట్జూ మీడియాను నియంత్రించాల్సిన అవసరం గురించి అవకాశమొచ్చినప్పుడల్లా ఏదో ఒకటి అంటూనే ఉన్నారు.

ట్యూషన్లు నిషేదించాలని ఇంకో కేంద్రమంత్రి అన్నారు. తరతరాలుగా, కష్టపడి బాగా చదువుకోవాలనే విద్యార్థులు, మరికాస్త శ్రమించి నాలుగు డబ్బులు ఎక్కువ సంపాదించాలని, ఉత్సాహం ఉన్న విద్యార్థులకు.... మరింత చదువు చెప్పడం ఒక సదవకాశంగా భావించిన ఉపాధ్యాయులకు – మధ్య స్వచ్ఛందంగా ఏర్పడిన బంధమే ఈ ట్యూషన్లు. దాని వల్ల ఎవరికి, ఏమి నష్టం? 'ట్యూషన్లు చెప్పే ఉపాధ్యాయులు క్లాసుల్లో సరిగ్గా పాఠాలు చెప్పకపోతేనో' అంటారా? ట్యూషన్లు చెప్పిన టీచర్లు, క్లాసులో సరిగా చెబుతున్నారో లేదో ఇన్‌స్పెక్షన్ చేయించవచ్చు కదా! ట్యూషన్లు చెప్పనిస్తే, కనీసం వారికోసమైన టీచర్లు తమ జ్ఞానానికి మెరుగు పెడుతూ ఉంటారు కదా! చూడ్డానికి చిన్న విషయమైనా, వ్యక్తుల స్వేచ్ఛకు ఇలాంటి నిర్ణయాలు ఎంత భంగం కలిగిస్తాయో తరచిచూస్తే తెలుస్తుంది.

రూపాయి విలువ అసలు దిగజార్చిందే కేంద్ర ప్రభుత్వం, రిజర్వు బ్యాంకుల గత నిర్ణయాలు. డబ్బు ఉత్పత్తి, వడ్డీరేట్లపై గుత్తాధిపత్యం సాధించిన ఈ రెండు వ్యవస్థలు (వాస్తవానికి ఒకటే) గత అయిదారు సంవత్సరాలుగా సాలీనా పదిహేను శాతం వరకు డబ్బు పరిమాణాన్ని పెంచి, పెంచి పరిస్థితిని ఇలా దిగజార్చారు. రూపాయి విలువ

జారడం మొదలు కాగానే హడావుడిగా కొన్ని డాలర్లను విడుదల చేసి ఏదో చేసేసినట్లు నటించారు. చెలియలి కట్ట దాటి ప్రళయం రాగానే గద్గద స్వరంతో గంభీరోపన్యాసాలు చేస్తున్నారు. ఇదంతా ఎలా జరిగిందో తమకేమీ తెలియనట్లుగా నటిస్తున్నారు. రబ్బరులా సాగుతున్న రూపాయి విలువని గట్టిగా రాయిలాగా స్థిరీకరించడానికి ఏం చెయ్యాలో ప్రభుత్వానికి, వారి ఆస్థాన మేధావులకూ తెలుసు. కానీ చెయ్యరు. చేస్తే ప్రభుత్వం లెక్కల్లో చూపే ఆర్థిక వృద్ధిరేట్లలోని డొల్లతనం బయటపడుతుంది. ఓట్ల కోసం వెదజల్లే పథకాలు సాగవు, రూపాయిలు ముద్రించుకొని, ప్రభుత్వం – తనకు తానే కావల్సినంత అప్పులిచ్చుకునే వెసులుబాటు ఉండదు. కాబట్టి చెయ్యరు. ఈ ధోరణి కేవలం మన దేశంలోనే కాదు, ప్రపంచమంతటా ఉంది.

పెట్రోలు ధరలు పెంపు ఆయా సంస్థల స్వంత నిర్ణయమట. కానీ అవన్నీ ప్రభుత్వరంగ సంస్థలే కదా! వారి స్వంత నిర్ణయమైతే డీజిలు, కిరోసిన్ ధరలు పెంచలేదేం? ఉత్పత్తి ఖర్చులో డీజిలు, కిరోసిన్, పెట్రోలులకు తేడా ఏం లేదు. మరి ధరల్లో ఇంత వ్యత్యాసమెందుకుంది?

ఉత్పత్తి సంస్థలు స్వంత నిర్ణయాలు తీసుకుంటే వాటి ధరల్లో ఉన్న వ్యత్యాసాలు తగ్గించే దిశగా ప్రయత్నిస్తాయా, లేక ఇప్పటికే గరిష్ట స్థాయిలో ఉన్న పెట్రోలు రేట్లను మరింత పెంచుతాయా?

చెప్పేవాళ్ళు సిగ్గుపడకపోయినా, మౌనంగా విని, ప్రశ్నించని వాళ్ళకయినా ఉండొద్దూ? రోజువారీగా ఇలాంటి ప్రభుత్వ నిర్ణయాలు, నియంత్రణలు, జోక్యాలతో పడుతున్న బాధలు ఒక ఎత్తైతే; ఇదే సరైనదని, ప్రభుత్వమే ప్రజలకు దిక్కని, వారేంచేసినా ప్రజాశ్రేయస్సు కోసమేననే భావజాలంలో కొట్టుకుపోతున్న సమాజ మానసికస్థితి – అత్యంత విషాదకరం, ప్రమాదకరం. సగానికిపైగా జనం స్థూలంగా సంక్షేమ పథకాల లబ్ధిదారులై మిగతా సగంగా ఉన్న స్థూల పన్ను చెల్లింపుదారుల మీదపడి పరాన్న జీవితాలు గడుపుతున్న పరిస్థితుల్లో – వారెన్నుకునే ప్రభుత్వాలు ఇప్పటి కంటే భిన్నంగా ప్రవర్తించడానికి సాహసించవు. కానీ ఈ క్రమంలో అందరూ కోల్పోతున్న స్వేచ్ఛ, స్వశక్తి, చొరవ, తమ తమ స్వలాభం కోసం ఒకరికొకరు సహకరించుకునే మానవ సంబంధాలు – ఒకసారి కోల్పోతే; తిరిగి రాబట్టుకోవడం చాలా కష్టం. విస్తరిస్తున్న ఫాసిస్టు ధోరణులకు వ్యక్తి స్వేచ్ఛ, నైతికత, ఆర్థిక స్వేచ్ఛ, నియమిత పరిమాణ ప్రభుత్వం, వ్యక్తి హక్కుల పునాదులతో ఆడ్డుకట్ట వెయ్యాల్సిన సమయమిది. 1975 పునస్సాక్షాత్కారం కావాలో, 1991 పునరావృతమవ్వాలో తేల్చుకోవాల్సిన తరుణమిది.

27-05-2012

భయానక వర్తమానం

అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు, మీడియా, మేధావులు రెండు రోజుల్లో జరగబోయే ఉప ఎన్నికల మీదే దృష్టి సారించి ఉన్నారు. ఏం జరగబోతోందా, ఉప ఎన్నికల ఫలితాలు ఎలా ఉండబోతున్నాయోనని అందరూ ఉత్కంఠగా ఉన్నారు. వివరాలు ఇంతకు ముందునుంచి అందరికీ తెలిసినా, పది రోజుల క్రితం జగన్ అరెస్టుతో తనపై ఉన్న అభియోగాలు, బయట పడుతున్న సాక్ష్యాధారాలు, కళ్ళు చెదిరే లెక్కలు కొంత బాధను, మరింతగా భయాన్ని కలుగచేస్తున్నాయి. కానీ ఓటర్లలో ఎంతమంది ఈ వాస్తవాలను దృష్టిలో ఉంచుకుని ఓటేస్తారోననేది సందేహమే.

ఇంత అవినీతికి పాల్పడిన వ్యక్తిని గెలిపిస్తే – దేశం ఎటు పోతున్నట్లు భావించాలి? ఇక ప్రజాస్వామ్యానికి విలువేముంది అని గుబులు పడేవాళ్ళు పడుతున్నారు. కానీ వారి ప్రశ్నలో ఒక అపసవ్యముంది. ప్రజాస్వామ్యమనేది ఒక ఎన్నికల ప్రక్రియే తప్ప ; అది నైతికతకు గ్యారంటీ ఇవ్వదు. హత్యకేసులో శిక్ష అనుభవించిన శిబుసోరేన్, పప్పూ యాదవ్, రజ్జూ భయ్యాల వంటి ముఠా రౌడీలు కూడా ఎన్నికలలో గెలుపొందారు; మంత్రులు కూడా అయ్యారు. మూడేళ్ల క్రితం రాజ్‌బబ్బర్ చేతిలో చిత్తుగా ఓడిపోయిన డింపుల్ యాదవ్ (ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ సతీమణి) ఈ రోజు పోటీ లేకుండా గెలిచింది. అంతెందుకు, దావూద్ ఇబ్రహీంను పోటీ చేయనిస్తే – గెలిచే అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాలు ఈ దేశంలో చాలా ఉన్నాయి.

విజ్ఞత గల వాళ్ళు భయపడాల్సింది, ఆలోచించాల్సింది – అసలు సమాజం నైతికంగా ఇంతటి అధమ స్థాయికి ఎందుకొచ్చింది? ఎక్కడ తప్పు జరిగింది? ఆ తప్పును ఎలా సరిదిద్దుకోవాలి? అసలది సాధ్యమేనా? కనీసం ప్రయత్నమన్నా చెయ్యాలా లేక పారిపోయి తల దాచుకోవాలా అన్న విషయాల గురించి.

సమస్త వనరుల మీదా సంపూర్ణ రాచ పెత్తనం అనే విషయంలో పూర్వపు రాచరికాలకు, ఇప్పటి మన ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన ఆధునిక రాజ్యాంగ ప్రభుత్వాలకు ఏ మాత్రం తేడాలేదు. ఎవరి పొలంలోనైనా లంకె బిందెలు దొరికితే, అప్పుడైనా... ఇప్పటి చట్టాల ప్రకారమైనా వాటిని ప్రభుత్వపరం చెయ్యాల్సిందే.

భూమిని తాత్కాలికంగా ఉపయోగించుకునేందుకు, కొన్ని నిబంధనల మేరకు కొనడానికి, అమ్మడానికి మాత్రమే హక్కుంది. (ఆదివాసీలకు అటవీ భూములపై ఆ మాత్రం హక్కు కూడా లేదు) ప్రభుత్వం ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎవరిదంటే వారి భూములను నామమాత్రపు పరిహారమిచ్చి స్వాధీనం చేసుకోవచ్చు. అలా స్వాధీనం చేసుకున్న వనరులను ఆ క్షణాన ప్రభుత్వం నడిపేవారు – తమ కిష్టమైన వారికి ధారాదత్తం చెయ్యవచ్చు. కాకపోతే పేరుకు కొన్ని రాతకోతలు, జీవోలు ఇవ్వాల్సి ఉంటుంది. వాటి పని భృత్యులు చూసుకుంటారు. ఇలాంటి వెసులుబాట్లే అన్ని రకాల వనరులకూ ఉంటాయి. ఇదీ – మన చట్టాలు చెబుతున్నది; ప్రశ్నల్లేకుండా అందరూ అంగీకరించినదీను.

ఇంకోవైపున; దశాబ్దాల తరబడి తొక్కిపెట్టిన ఆర్థిక రంగాన్ని – కొద్దిగా సరళీకరించి, విదేశీ పరిజ్ఞానాన్ని, పెట్టుబడులను కొన్ని తప్పనిసరి పరిస్థితుల్లో రానివ్వాల్సి వచ్చింది. ఆ మాత్రం వెసులుబాటుతోనే ఆర్థిక రంగం పరవళ్ళు తొక్కింది. ఒకవైపు హర్షద్ మెహతా వంటి కుంభకోణాలు జరిగినా, మొత్తంమీద ఎప్పుడూ ఊహించని వస్తువులు, సేవలు సామాన్యులకు అందుబాటులోకి వచ్చాయి.

మరోపక్క ప్రభుత్వాల పన్నుల 'రాబడి' విపరీతంగా పెరిగింది. అసలు సంస్కరణలంటేనే ఆర్థికరంగంలో ప్రభుత్వం తన పాత్రను తగ్గించుకోవడం. కానీ కళ్ళెదుట కనబడుతున్న ప్రజల సంపాదనను చూసి, పన్నుల భారాన్ని పెంచేశారు. సేవా పన్ను, వ్యాట్ లాంటి కొత్త పన్నులను కనిపెట్టారు. మొత్తం మీద ప్రభుత్వ ఆదాయం కొన్ని పదుల రెట్లు పెరిగింది.

సాంప్రదాయబద్ధమైన అవినీతి పద్ధతుల ప్రకారం ప్రభుత్వం పన్నుల రాబడిని ఖర్చుచేసే క్రమంలో – కొంత కమీషన్ల రూపంలో దండుకోవడం, లంచగొండి శాఖ అధికారుల బదిలీలలో కొంత సంపాదించడం లాంటి కార్యక్రమాలతో సరిపెట్టుకోవాలి. కానీ అంతటితో ఆగలేదు, ఆగదు కూడా. తోటకూరతో మొదలైన చౌర్యం అవకాశం కోసం ఎదురుచూస్తుందే తప్ప, తనకు తాను పరిమితుల్ని విధించుకోదు. సమయాను కూలంగా అనూహ్య, అద్భుత వ్యూహాలు రచిస్తుంది. ఇబ్బడిముబ్బడిగా వచ్చి పడుతున్న పన్నుల డబ్బును వ్యక్తిగత ప్రయోజన పథకాల రూపంలో వెదజల్లడం మొదలైంది.

క్రమేణా, ఈవిధంగా ప్రజల్లో సగం మందికి పైగా ప్రభుత్వం విదిల్చే మెతుకులపై ఆధారపడే పరిస్థితి కలగజేశారు.

చూడ్డానికి సంపన్నులపై మోపుతున్నట్లు కనబడే పన్నుల మోతను, ప్రజాకర్షక పథకాలను అలవాటుకొద్దీ, భావజాలపరంగానూ సమర్థించడానికి అలవాటుపడ్డ మీడియా, మేధావి రంగాలు కిమ్మనలేకపోయాయి. అదే సమయంలో ఇంకోపక్క ఎవరికీ తెలియకుండా, సంక్షేమ పథకాల ఆధారిత ఓటర్లకు నొప్పికలగకుండా ఉండే – దోపిడీ పర్వం ప్రారంభమైంది.

ఆర్థిక రంగంలో కీలకమైనవి, తరతరాలపాటు గుత్తాధిపత్యానికి వీలుండే సహజవనరులను టోకుగాను, చిల్లరగాను అమ్ముకోవడం మొదలైంది. దీనికి బాగా డబ్బున్న ఆశ్రిత పెట్టుబడిదారులు తయారుగా దొరికారు. స్వంత పేర్లమీద కొంత, బినామీ కంపెనీల పేర్లమీద కొంత, ఆశ్రిత వర్గాల పేరున కొంత, ఆశ్రిత పెట్టుబడిదారులకు కొంత చొప్పున పనికొచ్చేవి, పనికొస్తాయనుకున్న సహజవనరులను చట్టబద్ధంగా (ధర్మబద్ధంగా కాదుసుమా!) జీవోల సాయంతో, అందరూ చూస్తుండగానే – స్వంతం చేసుకున్నారు.

'మరి మా సంగతేంటి?' అని అడుగుతారనుకున్న వారందరికీ – తలా ఒక ఇసుక ర్యాంపు, ఒక మద్యం సిండికేటు, ఒక అక్రమ క్రమబద్ధీకరణ – తలా ఒకటి విసురుతూపోయారు. ఈ ప్రక్రియలో సహకరించడానికి – బ్రిటీష్ కాలం నాటి చట్టాలున్నాయి. జీ హుజూర్ అనే ప్రభుత్వ భృత్యులున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే మీదపడి దాడి చేసే తోడు దొంగ సహచరులున్నారు. ఓట్లేయడానికి సరిపడా ఆశ్రితులున్నారు. అమ్మకానికి సిద్ధంగా పలువురు ప్రజాసంఘాల నాయకులు, ఉన్నత విద్యావంతులు, కొన్ని మీడియా వర్గాలు, మేధావులు, మేధావులుగా చలామణి అయ్యేవారు ఉండనే ఉన్నారు. ప్రభుత్వం సొమ్ము – తిన్నా, తినకపోయినా; 'మహానేత' లను పట్టుకు వేళ్ళాడే కొన్ని కులాలు, మతాలు కూడా తోడున్నాయి. ఇంక అడ్డేముంది?

'మహానేత' మరణం తర్వాత ఒక సంఘకాపరి (పాస్టరు) టీవీలో వారి ఔన్నత్యాన్ని, దాతృత్వాన్ని తన వ్యక్తిగత అనుభవాన్ని ఉదహరిస్తూ వివరించారు. తనకు తెలిసిన ఒక మహిళా ఉద్యోగిని ఏసీబీ కేసులో సస్పెండై, తన సహాయం కోరగా, తానామెను 'మహానేత' వద్దకు గొనిపోయి 'ఈమె దేవుని బిడ్డ, నీవే కాపాడవలయు' ననగా; ఆయన చిరునవ్వు నవ్వి, దరఖాస్తును స్వీకరించినట్టున్నా, మర్నాడే ఆమె సస్పెన్షన్‌ను ఉపసంహరిస్తూ ఉత్తర్వులు జారీ అయినట్టుగానూ చెప్పుకొచ్చారు. ఆమె అవినీతి వల్ల బాధలు పడ్డ వాళ్ళు – ఏ దెయ్యం బిడ్డలో మరి! చట్టం ద్వారా, శాసనం ద్వారా నియమితులైన

ప్రభుత్వాలు, ప్రభుత్వ నేతలకు మనం కట్టబెట్టిన అధికారాలు, వారు వాటిని ఉపయోగించే తీరు – ఇదీ!

కష్టపడి సంపాదించేవాడి దగ్గర నుంచి లాక్కుని ఇతరులకు పంచి పెట్టడం నైతికం, ధర్మం అన్న రోజునే ఈ పతనానికి బీజం పడింది. ఈ కేన్సరు – ప్రస్తుతం చాలా ముదిరిపోయిన స్థాయిలో ఉంది. అట్టడుగున ఉన్న యాభై శాతం మందికి, ప్రభుత్వ సొమ్మును కొట్టుకుతినే అధికార, రాజకీయ, ఆశ్రిత వ్యాపార గణానికి ఈ రకం అవినీతి, దోపిడీ కనబడదు. కనబడినా – సామూహిక నష్టం కంటె, తమకు కలిగే వ్యక్తిగత లాభం ఎక్కువ కాబట్టి ; ఆ దుర్మార్గాన్నే సమర్థిస్తారు. ఎటూకాని మధ్యతరగతి వారు, ధర్మాన్ని మనసా, వాచా, కర్మణా పాటించేవారు ; ఆ ధర్మం కోసం, వారి తదుపరి తరాల క్షేమం కోసం త్యాగాలకు కూడా సిద్ధపడే వారూ బయటపడి, ముందుకొచ్చి, ఎన్నికలప్పుడు తమ విద్యుక్తధర్మాన్ని పాటించడమే కాకుండా, ఈ అధమ, అధర్మ రాజకీయాలను, భావజాలాలను, శక్తి మేరకు ప్రతిఘటించి – ఓడించాలి. ఎవరో ఒకరు చేస్తారులే, మనకెందుకు అనుకోబట్టే పరిస్థితిని ఇక్కడి దాకా తెచ్చుకున్నాం.

10-06-2012

పతనానంతరం?

ఇటీవల జరిగిన ఉప ఎన్నికలలో డబ్బు ఎలా ప్రవహించిందో అందరికీ విశదమే. పాలకపక్షాలు మాత్రమే కాదు, ప్రతిపక్ష పార్టీలు, ఉద్యమ పార్టీలు, సానుభూతి పార్టీలు కూడా ఓటుకింత అని ఎవరి శక్తి మేరకు వారు చెల్లించక తప్పలేదు. అందరి దగ్గరా డబ్బు పుచ్చుకున్న ఓటరు తనకున్న ఒకానొక ఓటును, తన ఇంట్లో వారి ఓట్లను ఏ పార్టీకి వేశాడో, ఏ నిష్పత్తిలో పంచాడో అంచనాలు వేయడం రాజకీయ విశ్లేషకుల, ఎన్నికల స్పెషలిస్టుల పని. బహుశా దీనిక్కూడా ఒక ఎగ్జిట్ పోల్ నిర్వహించాల్సి రావచ్చు.

అసలు ఈ ఓటర్లకు నోట్ల పంపక ప్రక్రియ పరిణామ క్రమమేమిటి, ఇది ఎక్కడదాకా వెళ్ళి ఆగుతుంది? ఈ పతనానికి అంతం ఎక్కడ? పతనానంతర పరిస్థితులెలా ఉండబోతున్నాయనేది ప్రధాన ప్రశ్న. 2004 ఎన్నికలలో ఓటుకు యాభై, వంద రూపాయలు చెల్లించగా; 2009 నాటికి అది రెండొందల నుంచి అయిదు వందల వరకు ఎగబాకింది. ఆ తర్వాత వచ్చిన ఉప ఎన్నికలలో ఇంకా పెరుగుతూ పోయి, కోవూరు అసెంబ్లీ ఉప ఎన్నికలో వెయ్యిరూపాయల స్థాయిని తాకింది. మొన్న జరిగిన ఉప ఎన్నికలలో కనిష్టంగా మూడు వందలు, మధ్యస్థంగా అయిదు వందలు, గరిష్టంగా రెండు వేల వరకు ఓటుకు చెల్లింపులు జరిగాయని చెబుతున్నారు.

ప్రతి అసెంబ్లీ నియోజక వర్గంలోనూ కనీసం లక్ష ఓట్లకు, గ్రామీణ నియోజక వర్గాల్లో లక్షన్నర ఓట్ల వరకు చెల్లింపులు జరిగాయని అనుకోవచ్చు. ఆశ్చర్యపోనక్కరలేని విషయ మేమిటంటే...; మధ్యతరగతి ఓటర్లు, ఫ్లాట్లలో నివసించే వారు కూడా ఈ విషయంలో మొహమాటపడలేదు. కొంతమంది నేరుగా డబ్బు తీసుకోకపోయినా, బయటి గోడలకు సున్నాలు వేయించడానికనో, లిఫ్టు పెట్టించడానికనో లక్షల రూపాయలు అభ్యర్థుల దగ్గర్నుంచి గుంజారు. కోట్ల విలువ చేసే భవంతుల్లో ఉండే వారు కూడా అడిగి మరీ తీసుకున్నారు(ట).

తెలంగాణలో ఒక నానుడి ఉంది. ఓట్లు వెయ్యకుంటే చచ్చిన వాళ్ళతో సమానం– అని భావిస్తారు. అలాగే సీమాంధ్రలో ఓటుకు డబ్బు తీసుకోకుంటే తమ అస్తిత్వమే ప్రశార్థక మవుతుందని భావిస్తూ వుండాలి. ఇదో కొత్త వరవడి. కొన్ని గ్రామాల్లో సామూహికంగా గుడికట్టడానికో, కులాలవారీగా కమ్యూనిటీ హాళ్ళ నిర్మాణానికో లక్షల రూపాయలు అభ్యర్థుల నుంచి వసూలు చేసిన విషయం బహిరంగ రహస్యమే.

చట్టాలు అలానే ఉన్నాయి. ఎన్నికలన్నాళ్లు – దాదాపు ప్రతిరోజూ ప్రధాన ఎన్నికల అధికారి మీడియా సమావేశాలు నిర్వహించి, ఎన్నికల చట్టాలను అతిక్రమిస్తే ఊరుకునేది లేదని 'మంద్ర స్వరంలో' హూంకరిస్తూనే ఉన్నారు. ఎంకి పెళ్ళి – సుబ్బిచావు కొచ్చిందన్నట్లు; ఎన్నికలు జరిగే నియోజక వర్గ ప్రాంతాల గుండా దారినిపోయే వ్యాపారులు, వ్యవసాయదారులు, సంసారుల వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేయడం..., వారు తమ పనుల నిమిత్తం తీసుకుపోతున్న డబ్బు, దస్కాలను స్వాధీన పరచుకుని అన్ని కోట్లు పట్టుకున్నాం...., ఇంత బంగారం సీజ్ చేశాం అని రోజు వారీ పత్రికా ప్రకటనలు వదులుతూనే ఉన్నారు.

తనిఖీలు, ఎన్నికల పరిశీలకులుపెరిగే కొద్దీ – ఓట్ల కోసం పంచే డబ్బు, వస్తువుల పంపిణీ వ్యవస్థలో ఎంతో అధునికత, సృజనాత్మకత, పకడ్బందీ వికేంద్రీకరణ పుట్టుకొస్తు న్నాయి. ఈ పంపకాలు ఆగాలంటే ఇచ్చేవారన్నా ఆపాలి; లేదా, పుచ్చుకునే వారన్నా ఆపాలి. మూడో వ్యవస్థ ఏదీ దీన్ని ఆపలేదు.

పుచ్చుకునే వారు ఇప్పట్లో ఆపే పరిస్థితి కనబడడం లేదు. ఊరికే వచ్చే దాన్ని ఎందుకు పోనివ్వాలనే ఆలోచన, అందరూ తీసుకుంటున్నప్పుడు మనం మాత్రం తీసుకుంటే తప్పేమిటనే భావన, మనం తీసుకోనంత మాత్రాన – కాబోయే ఎమ్మెల్యే అక్రమ సంపాదన తగ్గించుకొని సచ్ఛీలుడవుతాడా అనే నిర్లిప్తతలు – మెజారిటీ ఓటర్లలో సిగ్గు, ఆత్మాభిమానాలను ఆవిరి చేసేస్తున్నాయి.

ఈ రాజకీయ పోటీ వాతావరణంలో ఒకరికంటే మరొకరు, ఒకసారి కంటే తర్వాతిసారి ఎన్నికలలో ఎక్కువ డబ్బు పంచిపెట్టడం, ప్రచారానికి ఖర్చు చేయడం ఆగే పరిస్థితి లేదు. తర్కపరంగా చూస్తే ఇది చివరికి ఎటు దారి తీస్తుంది? పూర్తి స్థాయి నియంతృత్వానికి దారి తీస్తుంది. ఎన్నికలలో డబ్బు ఖర్చు పెరిగే కొద్దీ; నాయకులలో నైతికత, పాలనలో పారదర్శకత, ప్రభుత్వాధికారుల్లో వృత్తి నైపుణ్యం, జవాబుదారీతనం క్రమేపీ దిగజారిపోవడం మన కళ్ళకు కనిపిస్తూనే ఉంది.

దీనికి సమాంతరంగా – ప్రజల ప్రాథమిక హక్కులు, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను

అంతకంతకూ కాలరాయడం, వాల్టా చట్టం, ఇసుక వాడకంపై హైకోర్టు స్టే, ప్రైవేటు పాఠశాలలకు సుప్రీం కోర్టు నిబంధనావళి, పరిశ్రమ నెలకొల్పాలంటే నూట తొంభై పర్మిషన్ల అవసరం – ఇలా ప్రభుత్వ పరిమాణం ఊబకాయంలా పెరిగిపోతూనే ఉంది. ఆశ్రిత పెట్టుబడిదారులకు అనుమతుల విన్యాసాలు, ఈ పాపాలన్నీ దాచిపెట్టేందుకు ప్రజాకర్షక పథకాల వల; దాని కోసం పన్నుల పెంపు, రూపాయిల ముద్రణ, ప్రభుత్వ అప్పులు, తద్వారా తీవ్ర ద్రవ్యోల్బణం, రూపాయి విలువ పతనం – ఇవన్నీ సామాజిక, ఆర్థిక, నైతిక సంక్షోభాలకు దారితీయక ఏం చేస్తాయి?

ప్రజాస్వామ్యమని చెప్పుకునే వ్యవస్థలో పతనం అంతకంతకూ పెరిగి పోతుండడంతో; నిస్పృహ ఆవహిస్తుంది. ఒక బలమైన – గట్టి నాయకుడు కావాలనుకోవడం, ఆ బలమైన గట్టిదనం ఒక నియంతరూపంలో ఆవిర్భవించడం అనేది – మెల్లగానైనప్పటికీ, నిశ్చయంగా జరగబోయే పరిణామాలు. ఆ సరికి సమాజ ఆర్థిక రాజకీయ వ్యవస్థలు పూర్తిగా అతలాకుతలమై ఎన్నో జీవితాలను, ఆశలను, ఆశయాలను, ఆకాంక్షలను బలితీసుకుని – మరో కొత్త నరకం ఆవిష్కృతమవుతుంది.

ఈ కొత్త దేవుని వ్యక్తిపూజలో, గట్టి నాయకుని అనుచరుల పదఘట్టనల క్రింద కేరింతలు కొడుతూ కొన్ని దశాబ్దాలు గడిచిపోతాయి. అలాంటి నియంతల గొలుసుకట్టు– ఎప్పుడో ఒకసారి తెగిపోయి, మరలా ఒక వంకరటింకర మాఫియా ప్రజాస్వామ్యం అవతరిస్తుంది. ఇదొక చారిత్రక కర్మ సిద్ధాంతమా? ఈ భయంకర భవిష్యత్తును తప్పించుకునే మార్గం లేదా?

మార్గం ఉంది. అవకాశమూ ఉంది. ఎంత దిగజారిన వ్యక్తయినా, తన తప్పు తాను తెలుసుకుని, సరిదిద్దుకోవాలనే కృత నిశ్చయంతో... ప్రయత్న లోపం లేకుండా కృషి చేస్తే; శేష జీవితం సన్మార్గంలో గడపడం ఎవరికయినా సాధ్యమే. అటువంటి వ్యక్తుల సమాహారమే సమాజం. వ్యక్తుల ఆలోచనాధోరణిని ప్రభావితం చేయగల మీడియా, మేధావులు తమ జీవిత బాధ్యతలను గుర్తించాలి. 'తిన్నామా, పడుకున్నామా, తెల్లవారిందా' అన్నట్టుకాకుండా – అసలు ఏది మంచి, ఏది చెడు, ఏది నైతికం, ఏది అనైతికం అనే సైద్ధాంతిక స్పష్టత తెచ్చుకుని; దాన్ని నలుగురికీ పంచాలి.

ఒకరినొకరు కొట్టుకోకుండా, ఒకరినొకరు కొట్టుకు తినకుండా ఆపడానికి మాత్రమే 'ప్రభుత్వం' అనేది ఉండాలి. ఒకరిని కొట్టి మరొకరికి పెట్టడానికి కాదు. ప్రభుత్వాల వల్ల పేదరికం పోదు. 'అసమానతలు' – వాటంతట అవే 'అన్యాయాలు' కావు. మన సంపాదనను అజమాయిషీ చెయ్యమని ప్రభుత్వానికి పగ్గాలిస్తే, జరిగేది...; అభివృద్ధి

కాదు. ఎడతెగని... అలుపెరగని సూక్ష్మస్థాయి అంతర్యుద్ధం. సంక్షేమం కాదు – ఒకరి పట్ల ఒకరికి అపనమ్మకం, అసూయ, అత్యాశ. సంపాదించగలిగిన వారిలో నైరాశ్యం, బుద్ధి మందగింపు, ప్రభుత్వ ఆశ్రిత నక్కలు, తోడేళ్ళ స్వైర విహారం.

మానవజాతి సుఖ సంతోషాలు, సౌకర్యాలు, సగటు జీవితకాలం పెరిగింది, పెరిగేది కూడా – సంపద సృష్టి ద్వారానే. ఆ ప్రక్రియకు – ప్రభుత్వాలు ఆటంకాలే తప్ప, ఆలంబనలు కావు.

ఈ సైద్ధాంతిక సత్యాన్ని, చారిత్రక సాక్ష్యాలను గుర్తించకపోతే విజ్ఞులదే లోపం. 'మృత సిద్ధాంత' కళేబరాలను పీక్కుతినే రాజకీయ రాబందులను నిందించి ప్రయోజనం లేదు. ఓటుకు నోటు ఇవ్వబోయిన వాణ్ణి చెంప పగలగొట్టే జ్ఞానం, స్వశక్తి మీద నమ్మకం పాదుగొలపగలిగిన్నాడు...; పథకాల ఎరలు వేసే వాణ్ణి దొంగతనం, ఛీటింగ్ కేసులు పెట్టి జైల్లో వేసిన్నాడు మాత్రమే – ఈ ఎన్నికలకు నైతికత అబ్బుతుంది. లేదంటే ఒకరిని మించిన మరొక నియంతల పాలనకు సిద్ధమవుదాం. మనం ఆలోచించాల్సింది, భయపడాల్సింది మన జీవితాల గురించి మాత్రమే కాదు. మన పిల్లలు, వారి పిల్లల పిల్లలకు ఎటువంటి సమాజాన్ని వదిలి వెళ్ళబోతున్నామా అనే విషయం గురించి.

24-06-2012

కరవు - చీకట్లు

తొలకరొచ్చిన ఇన్నాళ్ళకూ రుతుపవనాల వర్షాలు పడకపోవడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. రుతుపవనాల ప్రభావం తగ్గిపోయినట్లేనని; ఇక అల్పపీడనాలు, తుపానులపైనే ఆధారపడాలేమోనని వాతావరణ శాస్త్రజ్ఞులు చెబుతున్నారు.

అదే వాతావరణ శాస్త్రజ్ఞులు రుతుపవనాలు అవిగో వచ్చేస్తున్నాయి, ఈ సంవత్సరం వర్షపాతం సాధారణ స్థాయిలోనే ఉంటుంది అని మే నెల సగం నుంచి జూన్ నెలాఖరు వరకు తెలిసో, తెలియకో అబద్ధాలు చెబుతూ వచ్చారు.

పాశ్చాత్య వాతావరణ కేంద్రాలు, ప్రైవేటుగా నడిచి, ఇంటర్నెట్‌లో ఉచితంగా సమాచారమిచ్చే వెబ్‌సైట్లూ - ఈ సంవత్సరం మనదేశంలో చాలా ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులేర్పడుతాయని ముందు నుంచి చెబుతూనే ఉన్నాయి.

మరి వందల కోట్ల రూపాయల ధారవోసి మోస్తున్న మన ప్రభుత్వ వాతావరణ శాస్త్ర పండితులు ఆ మాత్రమైనా హెచ్చరికలు ఎందుకు చేయలేకపోయారు? ఈ విషయంలో ఎవరినైనా బాధ్యులుగా గుర్తించి వారిమీదేమైనా చర్యలు తీసుకున్నారా? ఏదీ లేదు. వారి జీతాలు, ప్రమోషన్లు, డిఏ పెంపుల్లో ఏ మాత్రం తేడా రాదు.

కాకపోతే వారి మాటలు నమ్మి మొదటి కొద్దిపాటి వర్షాలకే వేలకు వేలు పోసి దుక్కులు, విత్తనాల కోసం తగలేసి నష్టపోయిన రైతులు మాత్రం - తీవ్రస్థాయిలో దెబ్బతిన్నారు. ప్రభుత్వం మాటలు నమ్మి నష్టపోవడం రైతులకు, ప్రజలకు కొత్తేం కాదుకదా!

ఈ సీజను మొత్తం పంట వేసుకునే వీలు; ఇప్పటికే వేసిన పంటలు చేతికొస్తాయనే ఆశలు సన్నగిల్లేకొద్దీ - రైతుల్లో ఆందోళన పెరిగిపోతోంది. ఏం చెయ్యాలి, ఏం తినాలి, ఎలా బతకాలనే చింతలో ఉన్నారు. మరోపక్క ఈ సీజన్లో ఉత్పత్తి కావాల్సిన జల విద్యుత్తు-మూలబడి, విద్యుత్ అవసరాలు పెరిగి, ఉన్న ఉత్పత్తి చాలక విపరీతమైన కరెంటు

కోతలతో వ్యవసాయ, వస్తూత్పత్తి, సేవా రంగాలు కుదేలవుతున్నాయి.

గమనించాల్సిన ముఖ్యవిషయమేమంటే వీటిలో ఏ ఒక్కటీ ముందుగా ఊహించలేనిది కాదు, పరిష్కారాలు లేని సమస్యలూ కావు. కాకపోతే వచ్చే ఎన్నికలను దాటి – దీర్ఘకాలం గురించి ఆలోచించని, ఆలోచించలేని, ఆలోచించాల్సిన అవసరం లేని 'ప్రజాస్వామ్య' ప్రభుత్వాల అలవాట్లు ప్రజలకు కూడా పాకి, ఏ రోజుకారోజు, ఏ సీజనుకాసీజను, ఏ యేడాదికాయేడాదిగా తప్ప, తన గురించి, తన ఆర్థిక పరిస్థితి గురించి, ప్రభుత్వం ఆర్థిక విధానాల యదార్థ పర్యవసానాల గురించి ఆలోచించడం ప్రజలు కూడా మానేశారు. ఇది ప్రజాస్వామ్యం కనుక ప్రజలతోపాటే తామూనన్న గొర్రెదాటు మనస్తత్వం మేధావులకు కూడా అలవాటై పోయింది. సమాజంలోని భావ దారిద్ర్యాన్ని చక్కగా ప్రతిబింబించే మీడియా కూడా – ఈ హ్రస్వదృష్టిపూరిత ఆలోచనా ధోరణి రైలుకు – తన బోగీని కూడా తగిలించుకుని కూత పెడుతోంది.

భూ మధ్య రేఖకు దగ్గరలో ఉన్న మన దేశంలో ప్రతి నాలుగైదు సంవత్సరాలకు ఒకటి రెండు సంవత్సరాల పాటు వర్షాలు తక్కువ కురవడం; లేదా – అతి వృష్టి; లేదా– ఒకదాని తరువాత మరొకటి రావడం గత కొన్ని శతాబ్దాలుగా గమనిస్తున్న ప్రాకృతిక వాస్తవం. కాబట్టి ఆ మేరకు సిద్ధపడి ఉండడం – రైతులకు, వ్యవసాయాధారిత వ్యక్తులకు, సంస్థలకు తప్పని పరిస్థితి. ఆ సంసిద్ధత మానసికంగానే కాక, ఆర్థికపరంగా కూడా ఉండాలి. అంటే ఒకటి, రెండు కరవు సంవత్సరాలను తట్టుకోగలిగే స్థాయిలో రైతులు, వ్యవసాయాధారిత ఇతరులు తగిన నగదు, ఆస్తి నిలవలు కలిగి ఉండాలి. అటువంటి నిలవలు లేకపోవడం వల్లే పూర్వ కాలంలో కరువొస్తే లక్షలమంది పిట్టల్లా రాలిపోయేవారు.

పారిశ్రామిక, సాంకేతిక, వ్యవసాయరంగాల్లో వచ్చిన విప్లవాత్మక అభివృద్ధి కారణంగా పాశ్చత్య దేశాల్లో కరువొస్తే – మనంతగా విలవిల్లాడరు. అదే టెక్నాలజీ అందరికీ అందుబాటులో ఉన్నప్పటికీ, మన దేశ రైతులు ఏ చిన్న ఆటుపోట్లను తట్టుకోలేని స్థితిలో ఉన్నారంటే – వారిని శాశ్వత పేదరికం, భిక్షాటనకు పరిమితం చేసిన ప్రభుత్వాలను తప్ప వేరెవరినీ నిందించలేం.

వ్యవసాయానికవసరమైన అన్ని దినుసుల ఉత్పత్తి, పంపిణీని రకరకాల చట్టాలు, పథకాల ద్వారా ప్రభుత్వం తన గుప్పిట్లో ఉంచుకుంది. పండించిన పంటల ధరలను కూడా ప్రభుత్వమే వివిధ ప్రత్యక్ష, పరోక్ష పద్ధతుల ద్వారా నిర్ధారిస్తోంది. ఆ రకంగా వ్యవసాయంలో లాభదాయకతను కుదించివేసి, రైతులు కేవలం బతకడానికి సరిపడా మాత్రమే సంపాదించుకోగలిగేలా నియంత్రిస్తోంది. పారిశ్రామిక రంగాన్ని ఆశ్రిత

పెట్టుబడిదారుల పరం చేసి, అది బహుముఖంగా విస్తరించకుండా, వ్యవసాయధారిత మానవ వనరులు పారిశ్రామిక, సేవా రంగాల్లోకి పెద్దఎత్తున తరలి పోవాల్సిన సహజ ప్రగతి గమనానికి అడ్డుపడుతోంది. అయినా ఇంకా ప్రభుత్వమే అన్నీ చెయ్యాలని సామాన్య ప్రజలు అంటున్నారంటే – వాళ్ళ అమాయకత్వాన్ని అర్థం చేసుకోగలం. కానీ మేధావులు, ఆయా రంగాల్లో నిష్ణాతులు కూడా అదే దృక్పథాన్ని పట్టుకు వేళ్లాడడం – గొర్రెదాటు ధోరణే.

ఈ ఆలోచనా ధోరణే విద్యుత్తు రంగం మూలన పడడానికి కారణం. ఆధునిక జీవితానికి విద్యుత్తు ఎంత అవసరమో కొత్తగా చెప్పనక్కరలేదు. ఎనిమిది శాతం మేర ఆర్థికాభివృద్ధి జరుగుతున్న దేశంలో విద్యుత్తు అవసరాలు ఏ మేరకు పెరుగుతాయో చదువులేని వారు కూడా ఊహించగలరు. కానీ గత పదేళ్ళుగా విద్యుదుత్పత్తి పెంచింది బహుస్వల్పం. పెరిగిన అవసరాలకు ఏ మూలకూ చాలని స్థాయితో పాటు విద్యుదుత్పత్తికి కావలసిన ముడి సరుకులన్నీ పూర్తిగా ప్రభుత్వం ఆధీనంలోనే ఉన్నాయి. బొగ్గు, అణువిద్యుత్తు, పూర్తిగా ప్రభుత్వం చేతుల్లో ఉండగా సహజవాయు నిక్షేపాలను ఆశ్రిత పెట్టుబడిదారులకు అప్పజెప్పారు. విదేశాలనుంచి బొగ్గు దిగుమతి చేసుకుని విద్యుత్తు ఉత్పత్తి చేయాలన్నా – సరాసరిన – రెండువందల పది పర్మిషన్లు అవసరం.

ఈ లంచగొండి ప్రభుత్వాల నుంచి ఇన్ని అనుమతులు తెచ్చుకోవడం కేవలం అధికారంలో ఉన్న రాజకీయ నాయకులకు, వారి కొడుకులకు – పేర్లు చాలకపోతే బినామీలకు తప్ప; నిజమైన పెట్టుబడిదారులకు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు, ఆ రంగాల్లో తలపండిన దేశీయ, విదేశీ పారిశ్రామిక సంస్థలకు సాధ్యం కాదు.

అలా పోటీలేని వాతావరణంలో అప్పనంగా అనుమతులు సంపాదించి, ప్రాజెక్టులు పెట్టి, ఉత్పత్తికి సిద్ధమయ్యేనాటికి – వాటిని అత్యధిక లాభాలకు ఇతర దేశీయ, దేశీ సంస్థలకు అమ్ముకోవడం తద్వారా వేల కోట్ల రూపాయలను తెల్ల డబ్బు రూపంలో సంపాదించడం, అందులో కొంత రాజకీయాలకు వెచ్చించడం అనేది ఇదొక రకం వ్యాపార సూత్రంగా తయారైంది.

భారతి సిమెంట్స్ ఆ కోవలోనిదే. ఇది తెలుసుకున్న ఇతర రాజకీయ నాయకులు, ప్రజాసంఘాలు స్థానిక ప్రజలను రెచ్చగొట్టి, అసలు మర్మం దాచిపెట్టి, పర్యావరణం పేరుమీదో, ఊహాజనిత కాలుష్యం పేరునో, అటవీ హక్కులనో ఆందోళనలు చేయించడం, ఆ ప్రాజెక్టులను ఆపించడం జరుగుతోంది. తమ చేతుల్లో ఉన్న ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులూ ఆఘమేఘాలమీద తెచ్చుకున్న రాజకీయ దళారులు అడవి దున్నపోతుల్లా వ్యవహరిస్తూ – స్థానిక ప్రజల నిజమైన ఇబ్బందులను, అభ్యంతరాలను పట్టించుకొని

పరిష్కరించే ప్రయత్నం చెయ్యకుండా పోలీసులను ఉసిగొల్పడం వారి పాపాలకు, పొగరుకు పరాకాష్ఠ.

ఈనాడు విద్యుత్తు ఉత్పత్తి పెంచాలంటే కావలసింది బొగ్గు, అణుశక్తి, సహజవాయువులు కావు. రాజకీయ ప్రాపకం, గుత్త లాభాపేక్ష. ఇక మార్కెట్ అవసరాలకు సరిపడా విద్యుత్తు ఉత్పత్తి చేసే అవకాశమెక్కడుంది? ఆ ఉత్పత్తయిన కాస్తా కూడా ప్రభుత్వరంగ పంపిణీ సంస్థల బారినపడి ఎటుపోతుందో, ఎంత ధరకు దొరుకుతుందో తెలియని పరిస్థితి. ఈ అనిశ్చిత విద్యుత్తు పరిస్థితిని నమ్ముకొని పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల ప్రవాహం, ఉద్యోగాల సృష్టి ఎలా జరగగలవు?

వ్యవసాయరంగ మేధావులందరూ ఫుడ్ ప్రాసెసింగ్ గురించీ, వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడించాలనీ పదేపదే చెబుతుంటారు. అసలు పగలంతా కరెంటు లేని పల్లెటూళ్ళలో ఏం విలువ జోడిస్తారు? రాజకీయంగా తప్పని పరిస్థితుల నడుమ విడతలు విడతలుగా ముష్టి విదుల్చుతున్న కొన్ని గంటల ఉచిత కరెంటు తప్ప; డబ్బు కడతామన్నా కొత్త కనెక్షన్లు ఇవ్వడానికి ముప్పతిప్పలు పెట్టే ట్రాన్స్‌కో విధానాల నేపథ్యంలో ఏ ఫుడ్ ప్రాసెసింగ్ సాధ్యం? ప్రాసెస్ చేసిన ఉత్పత్తులను రవాణా చేసి, నిల్వ ఉంచే శీతల గొలుసు కట్టు(కోల్డు చైన్)కు విద్యుత్తు ఎక్కడుంది?

ఈ మౌలిక సమస్యలను, వాటి రాజకీయ మూలాలను విశ్లేషించి, వివరించి దీర్ఘకాలిక పరిష్కారాలు సూచించకుండా..., ఉన్నదాన్నే ఏ వర్గానికి ఎంత ప్రాధాన్యమిచ్చి పంచిపెట్టాలనే శషభిషల వల్ల – సంపద సృష్టి జరగదు. 'ఉచిత విద్యుత్తే'గానీ; అసలు విద్యుత్తే ఉండదు. బీహారులోని పల్లెల్లో అసలు విద్యుత్తే ఉండదు. ఎవరో ఒక షావుకారు జనరేటరు నడిపి తాత్కాలిక వైరింగ్‌తో కొన్ని ఇళ్ళకు దీపాలకు కనెక్షనిస్తారు. రోజూ చీకటి పడిన దగ్గర్నుంచి రాత్రి పదిగంటల వరకు అలా దీపాలకు కరెంటు ఇచ్చినందుకు రోజుకు ఒక బల్బుకు మూడు రూపాయల చొప్పున వసూలు చేసుకుంటారు. పది గంటల తర్వాత అంతా చీకటే. చాలా పల్లెలకు సరఫరా లేపోవడంతో తీగెలు, స్తంభాలు చోరీకి గురయ్యాయి. అంతేగాదు భ్రష్ఠమైన వ్యవస్థను తిరిగి బాగు చెయ్యాలంటే ఎంత కష్టమో, ఎంత ఖర్చు, సమయం కావాలో ఊహించగలం. మన రాష్ట్రం కూడా బీహారు పరిస్థితుల దిశగా వడివడిగా అడుగులేస్తోంది. జై మహానేత! జై యువనేత! జై అధినేత! జై ఆమ్ ఆద్మీ! జై ఉచిత విద్యుత్! జై జలయజ్ఞం! జై బీహార్!

08-07-2012

ప్రభుత్వాల క్విడ్ ప్రో కో

'క్విడ్ ప్రో కో' అనే ఆంగ్ల సమాసం మన వాడుక భాషలో భాగమైపోయింది. మాట కొత్తగా అనిపించినా వాడకం పాతదే. కాకపోతే; బహిరంగంగా బరితెగించిన రాజకీయ క్రీడలను ఒక్కమాటలో అర్థం చేసుకోవడానికి ఈ పదాలు బాగా ఉపయోగపడుతున్నాయి. శ్రీ బాగ్ ఒప్పందం నుండి మొదలుకుని పెద్దమనుషుల ఒప్పందం వరకు – ఈ ప్రక్రియలో భాగమే.

1970ల్లో 'అయిదారుగురు ఎమ్మెల్యేల మద్దతు నిరూపించుకున్న వారికే మంత్రి పదవి' అనే స్కీము నడిచింది. అలాంటి చిన్నా చితకా అరుదైన తెరచాటు వ్యవహారాల్నుంచి; గత కొద్దికాలంగా బహిరంగమైన 'ఎర'ల పథకాలు మొదలయ్యాయి. పార్లమెంటులో బిల్లు పాసయ్యేందుకు నోట్ల కట్టలు పంచి పెట్టారు. అప్పటి దాకా రాజకీయ విరోధులైన ములాయం పార్టీ ఒక్కసారిగా ప్లేటు ఫిరాయించింది. అమర్‌సింగ్ మధ్యవర్తిత్వంలో జరిగిన ఆ డీల్ లో ఎంత డబ్బు చేతులు మారిందో, ఇంకేమి హామీలు ఇచ్చి పుచ్చుకున్నారో ఇప్పట్లో తెలిసే అవకాశం లేదు. పార్లమెంటులో ప్రదర్శించిన నోట్ల కట్టలు కళ్ళముందు కదలాడుతున్నా, ఆ వ్యవహారాన్ని విచారించడానికి నియమించుకున్న పార్లమెంటరీ సంఘం 'అబ్బే అసలేం జరగలేద' ని నివేదిక ఇచ్చేసింది.

ఈ మధ్యకాలంలో ఇంకో వినూత్న రాజకీయ 'క్విడ్ ప్రో కో' ఎత్తుగడ మొదలైంది. చాలావరకు పెద్ద రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు రాజ్యం ఏలుతున్నాయి. క్లిష్ట సమయాల్లో, రాజకీయాల కతీతంగా, ఆ పార్టీల మద్దతు పొందడానికి ఒక రాచమార్గం ఎంచుకున్నారు. – కేంద్ర ప్రభుత్వ నిధులు ఉదారంగా పంపడం. పెరిగిపోతున్న ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాలు, పాలనా వ్యయం, అన్నిటి కంటే, శక్తిని మించి ప్రకటించిన ఓట్లాకర్షక ఉచిత పథకాల భారం మోయలేక రాష్ట్ర ప్రభుత్వాలు దాదాపు అన్నీ ఆర్థికంగా సతమతమవు తున్నాయి. ఈ పరిస్థితులను ఆసరా చేసుకుని కేంద్ర ప్రభుత్వం – తాను జమ చేసుకుంటున్న లక్షల కోట్ల పన్నుల డబ్బును ప్రాంతీయ పార్టీల మద్దతు కొనుక్కోవడానికి ఉపయోగిస్తోంది.

రాజ్యాంగం ప్రకారం ప్రతి అయిదేళ్ళకూ ఒక ఆర్థిక సంఘం వేసి; దాని సిఫార్సుల మేరకు మాత్రమే కేంద్రం నుంచి ప్రతి రాష్ట్రానికీ నిధుల బదలాయింపు జరగాలి. ఆ తతంగాన్ని నిర్వహిస్తూనే, కేంద్రం ఇంకా కొన్ని లక్షల కోట్లు తన దగ్గరే ఉంచుకొని, తన కిష్టమైన, రాజకీయంగా అవసరమనుకున్న రాష్ట్రాలకు ఏదో ఒక సాకుచూపి, అడ్డగోలుగా బదలాయిస్తోంది.

రాష్ట్రపతి ఎన్నికల సందర్భంగా ఉత్తరప్రదేశ్‌కు ఇచ్చిన ఎనభైవేల కోట్లు, బీహార్‌కు ఇచ్చిన ప్రత్యేక గ్రాంట్లు ఈ కోవలోనివే. రాజ్యాంగంలో రాసిన అధికరణలకు, వాటి స్ఫూర్తికి తూట్లు పొడిచి, బహిరంగంగా, నిస్సిగ్గుగా స్వల్పకాలిక రాజకీయ ప్రయోజనార్థం ప్రభుత్వాలకే లంచాలివ్వడం – ఎవరికీ తప్పుగా కనిపించకపోవడం అసలు విషాదం. ఒకసారి రుచి మరిగాక ఇది ఇంతటితో ఆగే వ్యవహారం కాదు. రాష్ట్ర ప్రభుత్వాలకు ఉన్నట్లుగా కేంద్ర ప్రభుత్వానికి డబ్బు సమస్య ఎప్పుడూ ఉండదు. ఎంత డబ్బు కావాలంటే అంత సృష్టించగల గుత్తాధిపత్యం వారి చేతుల్లో ఎప్పుడూ ఉంది.

అమెరికా, కెనడా, భారత్ – ఇవన్నీ ఫెడరల్ రాజ్యాంగ వ్యవస్థలు, అంటే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల అధికారాలు, పరిధులు స్పష్టంగా రాజ్యాంగంలో నిర్వచించ బడ్డాయి. అయినప్పటికీ, కాలక్రమేణా రాష్ట్రాల పాత్ర పరిమితం చేసి, కేంద్రమే అందరినీ తోలు బొమ్మలాట ఆడిస్తోంది. ఇది కేవలం భారతదేశంలోనే కాదు, అమెరికా, కెనడాల్లో కూడా ఇదే వరస. దానిక్కారణం అన్నీ దేశాల్లోనూ డబ్బును అపరిమితంగా సృష్టించే అధికారాలు కేంద్ర ప్రభుత్వాల దగ్గర కేంద్రీకృతం కావడమే. ఈ డ్రామాకు ఒక స్క్రీన్‌ప్లే ఉంటుంది.

రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఉండే విద్య, ఆరోగ్యం, రవాణా, వ్యవసాయం లాంటి రంగాల్లో ఒకదానిని ఎంచుకుని, దానికి విశేష ప్రచారం చేసి, కేంద్ర బడ్జెట్‌లో ఆ రంగానికి సంబంధించి ఒక పథకం ప్రవేశపెడతారు. ఆ పథకం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలకు నిధులు పంపి, తాము చెప్పిన రీతిలో ఆ రంగాన్ని నడిపించమని మార్గ దర్శకాలు నిర్దేశిస్తారు. ఊరికే వస్తున్న నిధులను ఏ రాష్ట్ర ప్రభుత్వమూ వద్దనదు. తరువాత సంవత్సరం నుంచి మార్గదర్శకాలను కఠినం చేస్తూ, తాము విధించిన నిబంధనలు, షరతులకు లోబడి అమలుచేస్తేనే ముమ్ముందు నిధులు పంపుతామంటారు. చచ్చినట్లు రాష్ట్ర ప్రభుత్వాలు కాస్త ముందో, వెనకో ఆ నిబంధనలన్నీ అమలుపరచాల్సిందే. ఈ రకంగా కొన్ని సంవత్సరాల్లో రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో ఉండాల్సిన రంగం – దొడ్డిదారిలో కేంద్ర ప్రభుత్వ పరమైపోతుంది. ఈ వాస్తవం – తరవాతి ఆర్థిక సంఘం సిఫారసుల్లో భాగమై పోతుంది.

సర్వ శిక్షా అభియాన్ నుంచి విద్యా హక్కుచట్టం పేర్లమీద విద్యారంగం; ఎఫ్‌సిఐ, వ్యవసాయ రుణాల మాఫీ, కరువు సహాయం, వంగడాల దిగుమతి, అనుమతుల రూపాల్లో వ్యవసాయ రంగం; జాతీయ ఆరోగ్య మిషన్ పేరుతో ఆరోగ్య రంగం – ఇలా రాష్ట్రాల

పరిధిలో ఉండాల్సిన రంగాలన్నీ ఒక్కొక్కటిగా కేంద్ర ప్రభుత్వం చెప్పుచేతుల్లోకి వెళ్ళిపోతున్నాయి. ఈ అధికార కేంద్రీకరణ పర్యవసానాలేమిటంటే రాష్ట్రాలు తమ ఆలోచనలు, అవకాశాలకు అనుగుణంగా ఏ నిర్ణయాలూ తీసుకోలేవు. ఒక విద్యుత్ ప్లాంటు స్థాపించాలన్నా, బొగ్గు నిక్షేపాలను వెలికి తీయాలన్నా కేంద్ర ప్రభుత్వంతో 'క్విడ్ ప్రో కో' ఉండాలి. లేకపోతే సంవత్సరాల తరబడి ప్రతిపాదనలను తొక్కి పెట్టేస్తారు. ఇటువంటి రాజకీయ భావజాల వాతావరణంలో అధికార వికేంద్రీకరణ, స్థానిక సంస్థల బలోపేతం లాంటి విషయాలు కేవలం నినాదాలుగా మాత్రమే మిగిలిపోతాయి.

లైసెన్స్, కోటా రాజ్ నడిచిన పాత రోజుల్లో 'క్విడ్ ప్రో కో' ప్రభావం ఇప్పుడున్నంత స్థాయిలో ఉండేది కాదు. ఆర్థిక సంస్కరణల నేపథ్యంలో ఊహకందని స్థాయిలో సంపద సృష్టి జరిగింది. పన్నుల రూపంలో సొమ్ము వరదలా వచ్చి చేరుతోంది. ఈ పరిస్థితుల్లో ఆర్థిక సంస్కరణలకు తోడుగా రాజకీయ భావజాల సంస్కరణలు వస్తే తప్ప; ఇదే ఆర్థికాభివృద్ధి అదుపుచేయలేనంత అవినీతికి, ఆశ్రిత పెట్టుబడీదారి వ్యవస్థకు దారితీయడం ఖాయం. బెయిల్‌కోసం పదిహేను కోట్లు అలవోకగా విసిరే వాళ్ళు, ఒక అసెంబ్లీ సీటు కోసం ముప్ఫై కోట్లు ఖర్చు పెట్టే వాళ్ళు రాజ్యమేలిన్నాడు – వ్యక్తుల ధన, మాన, ప్రాణాలకు, వ్యక్తులను రక్షించాల్సిన వ్యవస్థలకు ఏ గతి పట్టిస్తారో ఊహించుకోలేమా?

రాష్ట్ర ప్రభుత్వ నిధుల కోసమో, కేసుల్నుంచి తప్పించుకోవడానికో, బెయిలిప్పించుకోవడానికో, ఫలానా రాష్ట్రపతి అభ్యర్థికి ఓటెయ్యడం ప్రజాస్వామ్య రాజకీయాల్లో భాగమేనని వాదించే పుస్తక మేధావులకీ కొదవలేదు. అది అనైతిక 'క్విడ్ ప్రో కో' అయితే, మరి మార్కెట్‌లో డబ్బులిచ్చి కూరగాయలు కొనుక్కోవడం కూడా అనైతికమేనా అనే అడ్డగోలు వాదనలు, అమాయక వ్యాఖ్యలు చేసే వారూ ఉన్నారు.

ఈ రెంటికీ తేడా గుర్తించలేకపోవడమే నేటి భావజాల గందరగోళానికి నిదర్శనం. డబ్బు– కొనుక్కునే వాడి సొంతం. కూరగాయలు – అమ్ముకునేవాడి సొంతం. తన సొంత సొమ్ముతో స్వచ్ఛందంగా వేరే వారి సొంతమైన వస్తు, సేవలను ఇచ్చిపుచ్చుకోవడం అనైతికం కాజాలదు.

కానీ, తన స్వప్రయోజనాల కోసం ఎవరో సంపాదించిన డబ్బును; లేదా తాను కాపాడతానని ప్రమాణం చేసిన చట్టాన్ని అడ్డుపెట్టుకుని 'క్విడ్ ప్రో కో' కు పాల్పడడం ఖచ్చింతంగా... సంపూర్ణంగా అనైతికం. ఈ అనైతిక 'క్విడ్ ప్రో కో'లను నిరోధించాలంటే ప్రభుత్వాల విచక్షణాధికారాలను, విశేషాధికారాలను, గాల్లోంచి డబ్బు సృష్టించే గుత్తాధికారాలను సమూలంగా, సంపూర్ణంగా రద్దు చేయడం మినహా మరో మార్గం లేదు. ఏసుక్రీస్తో, రాముడో, ఇంకో దేవుడో మళ్ళీ పుట్టి, దుష్ట శిక్షణ చేసి, మనల్ని రక్షిస్తాడనుకోవడం పలాయనవాదం. అనుభవించే మనమే ఆలోచించి, ఆర్థం చేసుకోలేనప్పుడు; హాయిగా స్వర్గంలో ఉండే ఆయనకేం పట్టింది?

22-07-2012

ప్రాణం ఖరీదు

మన దేశంలో కుల వ్యవస్థ చాలా ప్రాచీనమైనది. ఈ వ్యవస్థ గురించిన చర్చ కూడా కనీసం కొన్ని వందల సంవత్సరాలుగా సాగుతోంది. బ్రిటిషు వారి పరిపాలనలోనూ, స్వాతంత్ర్యోద్యమ సమయంలోనూ, స్వాతంత్ర్యానంతరం కూడా ఈ చర్చ ఎడతెగకుండా కొనసాగుతూనే ఉంది. వేల మంది మేధావులు ఈ విషయంలో తమ అభిప్రాయాలు, ఆలోచనలు, పరిష్కారాలు వెలిబుచ్చారు. స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో నెహ్రూ లాంటి కాంగ్రెస్ నాయకులు నమ్మి ఆచరించిన రాజ్యస్వామ్య వాద విధానాలు, పరిమిత కాలానికి రిజర్వేషన్ల ద్వారా అనతి కాలంలోనే కులాల్లోని అంతరాలను, వాటి మధ్య విభేదాలను రూపుమాపవచ్చనుకున్నారు.

మరోపక్క; అప్పట్లో రాజకీయ ప్రత్నామ్నాయంగా ఉన్న కమ్యూనిస్టులైతే– కమ్యూనిజం స్థాపన ద్వారా కులాలు వాటంతట అవే మాయమైపోతాయనుకున్నారు. అలా జరగక పోగా, భారత సమాజంలోని కుల వ్యవస్థ, దాని వాస్తవికత, కులం–వర్గం... వాటి అస్తిత్వాలు... వాటి స్పృహ, వాటి మధ్య – పోలికలు, తేడాలు, ఏది సత్యం, ఏది శాశ్వతం, ఏది ప్రాథమికం అనే విషయాల గురించి సాహిత్యం, కవిత్వం, పరిశోధన, సామాజిక విశ్లేషణలు, రాజకీయ ఎజెండాలు – ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు గందరగోళానికి కూడా గురిచేశాయి. చేస్తున్నాయి. కమ్యూనిస్టువర్గ పటంలో ఒక అంచున ఉండే మార్క్సిస్టు లెనినిస్టు విప్లవ పార్టీల్లో కూడా – కులాల విషయంలో తీవ్రమయిన చర్చ జరగడం; వాటిలో కొన్ని కులాధార విప్లవ కమ్యూనిస్టు పార్టీలుగా అవతరించడం కూడా జరిగింది.

ఆధునిక కుల సమూహాలలో....; ఒక్కో సమూహానికి ఒక్కో దేవుడు, ఒక్కో నాయకుడు, ఒక్కో పవిత్ర గ్రంథం, ఒక్కో మేధావి బృందం తయారయ్యాయి. ఈ పరిణామాలన్నీ – సమస్య తీవ్రతకు అద్దం పడుతున్నాయి తప్ప ఒక హేతుబద్ధ అవగాహన,

స్పష్టత, పరిష్కార దిశగా మాత్రం తీసుకెళ్ళడం లేదు. గుడ్డివాళ్ళు; ఏనుగు భాగాలను తడిమి వర్ణించినట్లుగా పరిమితమైపోతున్నారు. భావోద్వేగాలు, అంధ విశ్వాసాలు, స్వప్రయోజనాలు, వర్తమాన రాజకీయాల ప్రభావం లేకుండా హేతుబద్ధ, నిలకడైన విశ్లేషణతో ఈ అంశాన్ని అర్థం చేసుకున్నప్పుడే – సరైన పరిష్కారం దొరుకుతుంది.

తన ప్రమేయం లేకుండా జన్మత: సిద్ధించిన కుల, మత, ప్రాంత, జాతీయతా అస్తిత్వాల (ఐడెంటిటీ)తో సంబంధం లేకుండా; స్వతంత్రుడిగా తనకున్న బుద్ధి కుశలత, శారీరక శక్తులతో తన కృషి మేరకు సంపాదించుకుని సంతోషంగా బ్రతికే హక్కు ప్రతి మనిషికీ – మనిషిగా, సృష్టిలో సహజంగా సంక్రమించిన హక్కు. ఆ హక్కును కాదనే, కాలరాసే అధికారం ఏ ఇతరులకీ లేదు. ఈ రాజకీయ సమానత్వం – రాజ్యాంగం రీత్యా మన దేశంలోని అందరికీ ఉంది. ఆ సమానత్వాన్ని పాక్షికంగా కాలరాయడం; పెడ వ్యాఖ్యానాలతో రాజకీయ అవసరాల మేరకు వికృతంగా మార్చే శక్తి, అధికారం ప్రభుత్వాలకు మాత్రమే ఉంది. ఆ అధికారాలను – ప్రభుత్వాలు సినికల్‌గా వాడుకుంటాయి. మూడు ఉదాహరణలను పరిశీలిద్దాం. పురాణ యుగాల్లో మనుస్మృతి పేరిట రాసి, ఆచరించిన శాసనాలు రాసింది ఎవరైనా; ఆనాటి పాలక ప్రభుత్వాల ప్రమేయం లేకుండా అమలయ్యే అవకాశం లేదు. కాబట్టి వివక్షలకు కారణం ప్రభుత్వాలే తప్ప వ్యక్తులు కాజాలరు. బానిసత్వం రద్దయిన తరువాత కూడా అమెరికాలో నల్లవారి పట్ల తీవ్ర వివక్ష కొనసాగింది. అది 'జిమ్ క్రో' చట్టాల ద్వారా వ్యవస్థీకృతమైన వివక్ష. ఆ రకంగా అమెరికా ప్రభుత్వమే చట్టాల ద్వారా వివక్షకు పచ్చజెండా ఊపింది.

మూడో ముఖ్య ఉదాహరణ. మనదేశ రాజ్యాంగంలో ఒక పక్క రాజకీయ సమానత్వం ఇస్తూనే; ఒక తాత్కాలిక కార్యక్రమంగా పదేళ్ళ పాటు దళితులకు, ఆదివాసీలకు రిజర్వేషన్లు ప్రకటించడం. సమానత్వపు పునాదుల్లోకి జరిగిన ఈ ప్రభుత్వ చొరబాటు, జోక్యం భారతదేశ సమాజంలో కుల వ్యవస్థను శాశ్వతీకరించడమే కాకుండా; మరిన్ని జోక్యాలకు దారితీసింది. వ్యక్తులందరూ రాజకీయంగా సమానులే అన్నది సృష్టిపరమైన వాస్తవం. ఈ వాస్తవాన్ని కాదనే వ్యక్తి తనకు తానుగా తప్పుచేసిన వాడవుతాడు. తాను మాత్రమే నష్టపోతాడు. ఒకవేళ ప్రభుత్వమే ఈ వాస్తవాన్ని ధిక్కరించి చట్టరూపంగా జోక్యం చేసుకుంటే; మొత్తం సమాజం, వ్యవస్థే వికృతమవుతుంది, అయ్యింది కూడా. తన జోక్యం వల్ల జరిగిన అనర్థాలను ఏ ప్రభుత్వమూ ఒప్పుకోదు. వాటిని కప్పిపుచ్చడం కోసం మరిన్ని జోక్యాలకు తెగబడుతుంది. జరుగుతున్నది అదే.

పదేళ్ళ కోసమేనని ప్రవేశపెట్టిన రిజర్వేషన్లు సరిపడా ఫలితాలివ్వలేదన్నారు. ఇంకో పదేళ్ళు, మరో పదేళ్ళు, ఇలా పెంచుకుంటూ పోయారు.

అయినా ఫలితం లేదంటూ ప్రమోషన్లలో కూడా రిజర్వేషన్లన్నారు. అదీ చాలదని ఇప్పుడు ప్రైవేటు రంగంలో కూడా రిజర్వేషన్లుండాలని ప్రతిపాదిస్తున్నారు. ఇలా ఒక జోక్యపు వైఫల్యం మరిన్ని జోక్యాలకు దారితీస్తుంది.

కొన్ని కులాలకు, తెగలకే రిజర్వేషన్లిస్తే – మిగతా వారు ఊరుకుంటారా? వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు, మండల కమిషన్, కేంద్ర స్థాయిలో బీసీ రిజర్వేషన్లు, పంచాయితీలు, స్థానిక సంస్థల్లో, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, కొన్ని కులాలను ఒక గ్రూపు నుంచి ఇంకో గ్రూపుకు మార్చడం, వర్గీక 'రణం'. ఇలా కోతి పుండు బ్రహ్మ రాక్షసి అయ్యింది.

దీనికి తోడు దళితుల రక్షణ కోసమనే పేరుతో దళితేతరులను టార్గెట్ చేసే ప్రత్యేక చట్టాలు, ఉప ప్రణాళికలు, కొన్ని వృత్తులకు ప్రత్యేక ప్రభుత్వ సదుపాయాలు, మహిళలకు ప్రత్యేక చట్టాలు, ప్రాంతాల వారీ రిజర్వేషన్లు, కోటాలు – ఇలా బ్యాంకు నుంచి రుణం పొందాలన్నా, లైసెన్సు పొందాలన్నా, విద్యాసంస్థల్లో ప్రవేశం కావాలన్నా, ఉద్యోగం కావాలన్నా, తప్పుచేస్తే శిక్షించాలన్నా, దౌర్జన్యం నుంచి రక్షించబడాలన్నా, అతడు భారతదేశీయుడైతే చాలదు.

ఏ రక్షిత... అరక్షిత... ఆరక్షిత కుల, మత, ప్రాంతానికి చెందిన వాడో అన్నది ముఖ్యమైపోయింది.

ఇలాంటి చట్టపరమైన వివక్ష వాతావరణంలో – వ్యక్తులు స్వతంత్రంగా ఆలోచించడం, స్వతంత్రంగా బ్రతకాలనుకోవడం మానేసి తన కుల, మత, లింగ, ప్రాంత సమూహాల్లో ఒక సూక్ష్మ భాగంగా తమని తాము భావించడం; ఆ సమూహ అస్థిత్వమే తన వ్యక్తిగత చిరునామాగా భ్రమించడం ఎక్కువైంది. దాంతో వ్యక్తులు ఉత్పాదకతలో ఒకరితో ఒకరు పోటీపడాల్సిన స్థానంలో సమూహాల మధ్య కొట్లాటలు, ప్రచ్ఛన్న యుద్ధాలు, కొన్నిసార్లు ప్రత్యక్షహింసకు దారితీయడం, ఒకరిపట్ల ఒకరికి అసూయ, ద్వేషం ఎక్కువయ్యాయి.

లక్షింపేట సంఘటన, అంబేద్కర్ విగ్రహాల ధ్వంసం; తదనంతర ఉద్వేగాలు ఈ పరిణామాల్లో భాగమే. అందరితో పాటు సమాన స్థాయిలో బుద్ధి కుశలత, శారీరక శక్తులు కలిగి ఉండి కూడా, ఉత్పాదక రంగాల్లో తమ శక్తి సామర్థ్యాలను నిరూపించుకోవలసిన యువతీ యువకులు అనుత్పాదక రంగమైన ప్రభుత్వ ఉద్యోగాలొక్కటే దిక్కన్న భావంతో వాటి వెంట పరుగులు తీస్తున్నారు. ఉద్యోగం దొరికిన వాళ్ళు అందులో వ్యక్తిగత ఎదుగూ బొదుగూ లేకుండా మగ్గిపోతున్నారు. దొరకని వాళ్ళు (అత్యధిక సంఖ్యాకులకు దొరకవు) తీవ్ర నిరాశా నిస్పృహలకు లోనై, కులాల వారీగా చీలిపోయిన

సామాజిక పరిస్థితుల్లో తమ శక్తి సామర్థ్యాలను గుర్తించే వారే లేక కృంగిపోతున్నారు.

కటాఫ్ మార్కులు తగ్గించి కొందరికి విద్యాసంస్థల్లో ప్రవేశం కల్పించడం ద్వారానో, రిజర్వేషన్లిచ్చి కొందరికి ప్రభుత్వోద్యోగాలు ఇవ్వడం ద్వారానో కొందరు వ్యక్తులు తాత్కాలికంగా లాభపడతారేమో గాని; దాని వల్ల ఆ సామాజిక వర్గాలకు, వ్యక్తులకు, వ్యవస్థలకు, మొత్తం మీద సమాజానికి జరిగే నష్టమే ఎన్నో రెట్లు ఎక్కువ.

ఏ కులంలో, ఎంత పేదరికంలో పుట్టినా, ఒక్క తరంలోనే చేతినిండా పని, గౌరవ ప్రదమైన జీవితం, కడుపు నిండా తిండి, అందమైన ఇల్లు, సకల సౌకర్యాలు, కోతల్లేని కరెంటు, సొంత సంపాదనతోనే తనకు, తన కుటుంబానికి కావలసిన విద్య, వైద్య వసతులు – ఇవన్నీ పొందాలంటే కావలసింది – ప్రభుత్వం... ప్రత్యేక చట్టాలు... రిజర్వేషన్లు కాదు.

ప్రజల ధన, మాన, ప్రాణాలను సమానంగా, కట్టుదిట్టంగా రక్షించగల వ్యవస్థలు. ప్రజలందరూ తమ తమ శక్తి సామర్థ్యాలను పూర్తి స్థాయిలో ప్రదర్శించగల స్వేచ్ఛా వాతావరణం. ధనిక, పాశ్చాత్య దేశాల్లో అత్యంత పేదవారిగా పరిగణించేవారికి కూడా మనదేశంలోని మధ్యతరగతి కంటే ఎక్కువ సదుపాయాలు, సంపాదన ఉన్నాయంటే అదే కారణం. తన ఉనికికి అసలు పరమార్థమేమిటో తనకే తెలియక, కుల రాజకీయ క్రీడల్లో మునిగి తేలుతున్న అసమర్థ ప్రభుత్వాల పాలనలో ఎవరి ప్రాణాలకూ విలువ లేదు.

లక్షింపేట సంఘటన నేపథ్యంలో దళితులు గ్రామగ్రామాన మిలిషియాగా ఏర్పడాలని అభిప్రాయపడ్డ మేధావులు ఒక్క విషయం ఆలోచించాలి. దళిత మిలిషియాలకు ధీటుగా దళితేతర మిలిషియాలు ఏర్పడవా? ప్రజలను రకరకాల సామాజిక, ఆర్థిక, లింగ, సమూహాలుగా విడగొట్టి ప్రభుత్వాలు రగుల్చుతున్న రావణ కాష్టాలకు తోడు మేధావులు కూడా అంతర్యుద్ధాలను ప్రోత్సహించాలా? మేధావుల మెదళ్ళను శతాబ్దాలుగా తొలుస్తున్న కుల సమస్యను నాలుగు వరుసల వ్యాసంలో చర్చించడం అసాధ్యమని అంగీకరిస్తూనే, చివరగా ఒక మాట.

తమ పూర్వీకులు పాటించినట్లుగా చెబుతున్న కుల వివక్షలకు నేటి తరం మూల్యం చెల్లించాలంటూ వ్యక్తిగతంగా సంబంధం, బాధ్యత లేకపోయినా ముక్కు పిండి వసూలు చేస్తున్నారు కదా! మరి తెలిసి తెలిసీ ఆధునిక యుగంలో మనం పాటిస్తున్న చట్టబద్ధ వివక్షలకు ఎన్ని భావితరాలు మూల్యం చెల్లించాలో... ఏ రూపంలో చెల్లిస్తాయో! ఎవరైనా ఆలోచించారా?!

05-08-2012

ఉచిత నిరుద్యోగం

చాలా మందికి - ముఖ్యంగా యువతకు - మనం రోజూ తినే తిండి, అనుభవించే వస్తువులు - బట్టలు, కార్లు, సినిమాలు, సెల్‌ఫోన్లు, హోటళ్ళు, కాలేజీలు - ఇవన్నీ ఎక్కడ్నుంచి వస్తున్నాయో తెలియదు. ఆలోచించరు కూడా. ఉత్పత్తి సాధనాలంటే ఏమిటో, వాటికీ సమాజానికీ ఉన్న సంబంధమేమిటో వారికి అర్థం కాదు. సంపద ఎలా సృష్టించ బడుతుందో, వృద్ధి చెందుతుందో, కనీసం ఉన్నదాన్ని ఎలా నిలబెట్టు కోవాలో అనే ఆలోచనగాని; పట్టించుకునే ఓపికా, తీరికా గాని ఉండవు. ఈ పదాలన్నీ ఏదో వామపక్ష విద్యార్థి సంఘాల సమావేశాల్లోనో, విందు వినోదాల సందర్భ సంభాషణల్లోనో ఎక్కడో విన్నట్లు గుర్తుంటుంది.

ఇదంతా మనకెందుకులే... మనమేమీ ఆర్థిక శాస్త్ర విద్యార్థులం కాదు కదా! రాజకీయ నాయకులం కాదు కదా అనుకుంటారు. అసలీ తిండి, వస్తువులు ఎక్కడ్నుంచి వస్తున్నాయి? అసలు నాగరికత ఎక్కడ్నుంచి పుట్టింది, ఇక్కడి వరకూ ఎలా వచ్చింది? విషయం సంక్లిష్టమైనదైనప్పటికీ; దాని సారాంశం సులువుగా అర్థమయ్యేదే.

నాగరికత మూడు ముఖ్యమైన వనరుల ద్వారా పురోగమిస్తుంది. ఒకటి - ప్రకృతి ద్వారా దొరికే సహజ వనరులు ఎప్పుడూ ఉన్నాయి. కొన్ని వేల సంవత్సరాల నుంచి మనిషి కూడబెట్టిన రోడ్లు, యంత్రాలు, విమానాలు లాంటి మానవ నిర్మిత వనరులు. ఇవే ఉత్పత్తి సాధనాలు - ఒక ముఖ్యవనరు. ఈ ఉత్పత్తి సాధనాలకు తోడుగా ఉండాల్సిన ముఖ్యమైన మానవ జనిత వనరులురెండు.

ఒకటి సాంకేతిక పరిజ్ఞానం. ఉత్పత్తి సాధనాలను రూపొందించడానికి, ఉపయోగించడానికి ఇది అత్యంత అవసరం. రెండోది, ఇంకా ముఖ్యమైనది, కళ్ళకు కనిపించనిది, ఆలోచిస్తే గానీ తట్టనిది - నైతిక సక్రమత. కొరతగా ఉండే వనరులను సరైన పద్ధతిలో ఉపయోగించాలంటే ఇది తప్పనిసరి. ఈ రోజు నాగరికత ఇంతగా వృద్ధి

చెందిందంటే దానిక్కారణం మనకు వాసరత్వంగా సంక్రమించిన భౌతిక సంపద, సాంకేతిక నైపుణ్యాలతో; పాటు మానవాళి పుణికి పుచ్చుకున్న నైతిక సక్రమత కూడా ముఖ్యకారణం.

దాదాపు అందరికీ కనీసావసరాలు తీరుతూ సమృద్ధితో వర్ధిల్లుతున్న ఈ రోజుల్లో అసలు సంపద ఎలా కూడుతున్నదనే విషయాన్ని విస్మరిస్తున్నాము. దాన్ని ఎలా పంచిపెట్టాలా అనే విషయం మీద ఎవరికి తోచిన వ్యాఖ్యానాలు వారు చేస్తున్నారు. ఒకరు సమానత్వమని, మరొకరు సామాజిక న్యాయమని, ఇంకొకరు ప్రజాప్రతినిధులు నిర్ణయించిందే ధర్మమనీ-; ఇలా నైతిక సాపేక్షత...శూన్య వాదాలు గర్జిస్తుంటాయి. ఇలాంటి వాదాలు చేసేవాళ్ళు తామేదో బలహీనుల పక్షాన పోరాడుతున్నామనుకుంటారు. కానీ నాగరిక ప్రవర్తన, నైతిక సక్రమత సమాజంలో కొరవడిన నాడు - అందరికంటే ఎక్కువ నష్టపోయేది బలహీనులే. బలవంతులు ఎప్పుడైనా తమ దారి తాము చూసుకోగలరు. ఎంతటి క్లిష్ట పరిస్థితుల్లోనైనా నెట్టుకు రాగలరు.

ఇప్పుడున్న సంపదంతా మాయమైపోతే ఏమవుతుందో ఊహించుకుంటే, మానవ స్వభావం, మన నాగరికత ఎంత సున్నితమైనవో అర్థమవుతాయి. ఏదో ఒక ప్రళయం వల్లో, లేక కూర్చుని తినడం ద్వారానో...; ఇప్పుడున్న సహజ వనరులు, మానవ నిర్మిత వనరులన్నీ నాశనమయ్యాయనుకుందాం. ఉత్పత్తి సాధనాలన్నీ పనికిరాని నాడు మనకున్న సాంకేతిక పరిజ్ఞానం కూడా దండగే.

అప్పుడు మిగిలి ఉన్న మనుషులను నడిపించాల్సింది నైతిక సక్రమత మాత్రమే. మనిషి నరమాంస భక్షకుడై క్రమంగా అంతరించి పోతాడో, లేక నైతిక ధర్మాన్ని పాటించి, ఒక్కో చితుకూ పేర్చి, మళ్ళీ నాగరికతను నిర్మించుకుంటాడో అనేది - మిగిలిపోయిన వారి విజ్ఞత పైనే ఆధారపడుతుంది. ఈ రోజుల్లో ఒకరినొకరు చంపుకుని తినకపోవడానికి ముఖ్యకారణం - అది తప్పు అనే నైతిక భావన. అదీకాక, అన్నీ సమృద్ధిగా దొరుకుతున్న ఈ కాలంలో ఆ అవసరం కూడా లేదు కాబట్టి. బానిసత్వం, నరమాంస భక్షణలు అత్యంత నీచమనే నైతిక భావన, అన్నీ సరిపడా దొరుకుతున్న సంపద, సమృద్ధిల నేపథ్యంలో మనగలుగుతోంది. ఆ సంపద, సమృద్ధిలేని నాడు నైతిక భావనలు ఎటువైపు మొగ్గుతాయో నని ఊహించుకుంటే ఒళ్ళు గగుర్పొడుస్తుంది.

సిరిసంపదలు లేని నాడు; నైతికత మసక బారుతుంది. మరి - సిరి సంపదలు ఎక్కడ్నుంచి వచ్చాయి? ఇంకా వస్తున్నాయి? పనికొచ్చే పనులు చేసి, ఎప్పటి సంపాదన అప్పుడే ఖర్చు చేసెయ్యకుండా భవిష్యత్తులో ఇంకా ఎక్కువ సంపాదించే ఆశతో పొదుపు చేసి, పెట్టుబడులుగా పెట్టడం ద్వారా - సంపద పోగవుతుంది. తక్షణ వినియోగం ఒక వైపు; భవిష్యత్ ఉత్పత్తి, ఉత్పాదకతలు రెండో వైపు ఉన్నప్పుడు; ఆ రెండోవైపుకు మొగ్గు

చూపాలంటే తన సంపాదనకు, పెట్టుబడికి, భవిష్యత్తు మీద ఆశతో దాచుకున్న సంపదకు భద్రత ఉండాలి. అంటే ఖచ్చితమైన ఆస్తి హక్కులు మనిషి ఆర్థిక నిర్ణయాలను నిర్దేశిస్తాయి. మన సంపాదన, సంపదలను మన, మన పిల్లల మెరుగైన భవిష్యత్తు కోసం కాపాడుకోగలమన్న నమ్మకం కలిగినప్పుడు మాత్రమే సంపద కూడబడుతుంది. ఆ నమ్మకం లేని నాడు, ఎప్పుడైనా, ఎవరైనా మన కష్టార్జితాన్ని ప్రత్యక్ష హింస ద్వారానో, లేక రకరకాల భావజాల ప్రేరేపిత చట్టాల ద్వారానో లాగేసుకుంటారనుకుంటే; మనిషి కూడా ఏరోజు దొరికింది ఆరోజే తినేసే జంతువుల్లాగే ప్రవర్తిస్తాడు. అలాంటి పరిస్థితుల్లో బలహీనులు బ్రతకడం ఎంత కష్టమో ఊహించుకోగలం.

ఎవరెవరో సంపాదించిన దాన్ని తాము పంచిపెడతామనే సామాజిక న్యాయ ఛాంపియన్‌లు – సమాజ పునాదులను, అసలు సంపద సృష్టించే వ్యవస్థకు తూట్లు పొడుస్తున్నామన్న వాస్తవాన్ని గుర్తించాలి. నాగరికత ఫలాలు గానీ, సాంకేతికత, ఇతర పరిజ్ఞానం గానీ ఆకాశం నుంచి రాలి పడలేదు. లక్షల కోట్ల మంది వేలవేల సంవత్సరాల కష్ట ఫలితం, నైతిక ధర్మానుసారం నడుచుకుని భవిష్యత్ తరాలకు అందించిన ప్రసాదం. నాగరిక ప్రపంచ పునాదులకు తూట్లుపొడిచే వారంతా తామేదో బలహీనులను ఉద్ధరిస్తున్నామను కోవడం – వారి అమాయకత్వం. మనిషి ప్రవృత్తి గురించి వారికున్న అజ్ఞానం. ఇలాంటి చేష్టల వల్ల; ఉన్న సంపద క్రమంగా హరించుకుపోవడమే కాకుండా; ఇంకా ప్రమాదకరమైన ప్రభావమేమిటంటే – సంపద సృష్టించే ఉత్పాదక శక్తుల్ని క్రమంగా బలహీన పరిచి, నిరుత్సాహపరచి, తద్వారా అందరి భవిష్యత్తూ క్రమేపీ అంధకారం చేయడం.

ఎవరి కష్టం వారిది, ఎవరి సంపాదన వారిది, ఎవరి సంపద వారిది అన్న నైతిక సక్రమతను బలహీనపరిచే ప్రతి చర్యా నాగరికతను, ఉత్పత్తి సాధనాలను, సంపద సృష్టించే శక్తులను ప్రమాదంలో పడేస్తుంది.

ఎన్నికల కోసం తెచ్చిన కొత్త పథకం...; ఫీజు రీయింబర్స్‌మెంటు. కొత్తలో అందరూ – 'మనదేం పోయిందిలే... ప్రభుత్వ సొమ్మే కదా' అనుకున్నారు. మొదటి సంవత్సరం అంతా ఓకే. మామూలుగా అయితే మూత పడాల్సిన వందలాది ఇంజనీరింగ్ కాలేజీలు– ఊపిరి నిలుపుకున్నాయి. రెండో ఏడాది కల్లా ఒకే విద్యార్థి పేరు మీద నాలుగైదు కాలేజీల వారు ప్రభుత్వం నుంచి ఫీజు రాబట్టుకోవడం లాంటి అవకతవకలు మొదలయ్యాయి. మూడో ఏడాది కల్లా ఈ పథకం బరువు; దాని నిరర్థకత అర్థమయ్యాయి.

ఇప్పుడు ఖర్చు తగ్గించడానికి అన్ని కాలేజీలకూ ఒకటే ఫీజంటున్నారు. అంటే

గాడిదా, గుర్రం ఒకటే. ఇక మంచి ప్రమాణాలు పాటించే వారికి విలువేముంది...; అర్థికంగా నష్టం తప్ప? కాలేజీ పెట్టిన ప్రదేశం; కల్పించిన మౌలిక వసతులు; బోధనా ప్రమాణాల ఆధారంగా మార్కెట్ నిర్ణయించిన ఫీజులు వసూలు చేసుకుని, కాలేజీని కొనసాగించాలో... మూసేసుకోవాలో నిర్ణయించుకోవాల్సిన యాజమాన్యాలు, విద్యార్థులకు ఇప్పుడు ప్రమేయమేం లేదు. ప్రభుత్వం చూపిన దారిలో గుడ్డిగా నడవడం తప్ప చెయ్యగలిగిందేమీ లేదు.

విద్యాసంస్థలకు విద్యా దానం తప్ప లాభార్జన అసలు లక్ష్యం కాకుడదనే పెద్దలు, మేధావులు తమ ఆస్తిపాస్తులను, జీత భత్యాలను, పెన్షన్ డబ్బును ఖర్చుపెట్టి ఉచిత విద్యాసంస్థలు ఎందుకు నడపరో అర్థం కాదు. లాభార్జన లేకపోతే వసతులు, ప్రమాణాలు మెరుగుపరచడానికి పెట్టుబడి ఎక్కడ్నుంచి వస్తుందో చెప్పరు. వారి పనల్లా (ఇతరుల వద్ద) ఉన్న సంపదను పంచి పెట్టడంలో వినూత్న మార్గాలు వెతకటమే. ఆ సంపద ఎక్కడ్నుంచి వచ్చిందో పట్టదు. సంపద ఎలా సృష్టించబడుతుందో తెలియదు. ప్రజల దగ్గర్నుంచి కొట్టుకొచ్చి, విచ్చలవిడిగా పంచి పెట్టడానికే ప్రభుత్వాలుండాలని వీరి నమ్మకం. మరి దీపంలో నూనె అయిపోయిన్నాడు? వైద్యం ఉచితం, శిశుమరణాలూ ఉచితం. ఉచిత ఇంజనీరింగ్ విద్య, ఉచిత నిరుద్యోగం. అరవై అయిదేళ్ళ స్వతంత్ర భారతమా, జైహింద్.

19-08-2012

దండలో దారం

అసోంలో ముస్లింలపై హింసాకాండ... బొంబాయిలో అల్లర్లు... దేశవ్యాప్తంగా నివసిస్తున్న ఈశాన్య భారత ప్రజల ఇంటిబాట... బొగ్గు కుంభకోణం... కరెంటు కోతలు... గుజరాత్ కేసుల్లో తీర్పులు... మందగించిన ఆర్థిక వృద్ధి రేటు–ఇవన్నీ పైకి వేరు వేరు అంశాలుగా కనిపించినా; వీటన్నిటినీ సమాహారం చేసే అంతర్లీన దారం ఒకటే. ప్రజల సమస్త వ్యవహారాలనూ శాసిస్తున్న ప్రభుత్వాల పనితీరు. ప్రజలకు హింస నుంచి రక్షణ కల్పించడం ప్రభుత్వాల అత్యంత ప్రాథమికమైన, ముఖ్యమైన విధి. ఆ పనిని సమర్థంగా నిర్వర్తించలేని ప్రభుత్వాలు ఉన్నా ఒకటే, లేకపోయినా ఒకటే. ప్రజలను ఒక్కొక్కరినీ పరిపూర్ణమైన వ్యక్తులుగా గుర్తించి, వారి ధన, మాన ప్రాణాల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన ప్రభుత్వాలు – ఆ ప్రభుత్వాలు కంటి కొనలతో నడిపించే పోలీసు వ్యవస్థలు – మనుష్యులను వ్యక్తులుగా కాకుండా;... ఏదో ఒక వర్గంలో భాగంగా చూడడం అలవాటైపోయింది. ఇష్టమున్నా, లేకున్నా అటువంటి వ్యవహారశైలిని అందరూ 'అదంతే' అని అమోదించే పరిస్థితి వచ్చింది.

ఉదాహరణకు హైదరాబాదు నగరంలో ఒక మామూలు రోడ్డు ప్రమాదం జరిగితే, పోలీసులు ముందుగా వాకబు చేసేది – తప్పెవరిదని కాదు. అది ఒక హిందువు, ఒక ముస్లిం మధ్య జరిగిందేమోననే అందోళన. అదే నిజమైతే, అందరూ అప్రమత్తమవుతారు. ఇదే పరిస్థితి దేశమంతా అలుముకుని ఉంది. ఏం జరిగింది అనే దానికంటే, ఎవరి మధ్య జరిగింది అనే దానికే ఎక్కువ ప్రాధాన్యత. అటువంటి వాతావరణంలో నిష్పక్షపాతంగా న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఎవరికైనా ఎలా ఉంటుంది?

కాబట్టి ఎవరికి వారికి వ్యక్తిగతంగా అన్యాయం జరగకుండా జాగ్రత్తపడాలంటే ఒక కుల సంఘాన్నో, మత సంఘాన్నో, ఉద్యోగ సంఘాన్నో, వృత్తి సంఘాన్నో ఆశ్రయించక

తప్పని పరిస్థితి కల్పించబడింది. ఇక ఉద్యోగ, వ్యాపార రీత్యా దేశంలో ఎక్కడెక్కడో నివశిస్తున్న స్థానికేతరుల అభద్రతా భావాన్ని తేలిగ్గా ఊహించుకోవచ్చు.

దశాబ్దాలుగా అసోంలోకి వలస వచ్చిన లక్షలాది బాంగ్లాదేశ్ ముస్లింలపై స్థానిక ప్రజలకు అభ్యంతరాలున్నాయి. అసోం విద్యార్థి ఉద్యమం, బోడో ఉద్యమం – వీటినుంచే పుట్టాయి. కేంద్ర ప్రభుత్వంతో ఒప్పందంలో భాగంగా బోడో ప్రాదేశిక మండలిని ఏర్పాటు చేయడం; బోడోల పార్టీ అధికార కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో భాగస్వామి కావడం వల్ల వలసొచ్చిన ముస్లిముల పట్ల అభ్యంతరం – కోపతాపాలను దాటి ప్రత్యక్షహింసకు, హత్యాకాండ వరకూ వెళ్ళింది. ఒకపక్కన వలసవచ్చిన వారికి రేషన్ కార్డులిచ్చి, వారి ఓట్లపై ఆధారపడుతూ, మరోపక్క బోడో పార్టీని ప్రభుత్వంలో భాగస్వామిగా చేసుకున్న ప్రభుత్వం ప్రదర్శించిన నిష్క్రియాపరత్వం మరింత హింసకు దారితీసింది. వ్యక్తుల ధన, మాన, ప్రాణాలను కాపాడడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది.

ఉపాధి అవకాశాలు పరిమితంగా ఉండే ఈశాన్య రాష్ట్రాల నుంచి వలస వచ్చిన బాంగ్లాదేశీయులే కాక; అన్ని ప్రాంతాల యువకులు – దేశంలోని వివిధ ప్రాంతాల్లో రకరకాల ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారు. ఇది ఆహ్వానించాల్సిన పరిణామం. ఈశాన్య రాష్ట్రాల ప్రజలు దేశ జీవన స్రవంతిలో ఒక అంతర్భాగమవడానికి ఇదొక మంచి మార్గం. అసోంలో జరిగిన హత్యాకాండకు నిరసనగా బొంబాయిలో వేలాదిమందితో నిర్వహించిన బహిరంగ సభ – కెమేరాల సాక్షిగా హింసాత్మకంగా మారింది. అదొక మహా ప్రభుత్వ వైఫల్యం. ఈ వాతావరణంలో, చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటున్న ఈశాన్య రాష్ట్రాల యువకులకు కొన్ని చోట్ల స్థానిక హిందూ సంస్థల నుంచి బెదిరింపులు, అదే అవకాశంగా తీసుకుని పాకిస్థాన్ ప్రేరేపిత శక్తులు ఎస్ఎంఎస్‌ల రూపంలో పుకార్లు వ్యాపింపజేయడం. అసలే భయాందోళనల్లో ఉన్న తల్లిదండ్రులు – ఇంటికి వచ్చేయమనడంతో ఈశాన్య రాష్ట్ర యువతీ యువకులు చేస్తున్న ఉద్యోగాలను ఉన్నపళంగా వదిలేసి – హైదరాబాద్, బెంగుళూరు వంటి నగరాల నుంచి ఇంటి బాట పట్టారు. స్థానిక ప్రభుత్వాలు రక్షణ కల్పిస్తామన్నా ఎవరూ వినలేదు. ఎందుకంటే ఎవరూ నమ్మలేదు. రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక పోలీసుల పనితీరును రోజూ గమనిస్తున్న వారికి నోటి హామీతో నమ్మకం కలగజేయడం అసాధ్యం.

ఈ పరిణామాలకు – పాకిస్థాన్ ప్రేరేపిత పుకార్ల వ్యాప్తే కారణం అని కొందరు నిందించారు. కొందరు మేధావులైతే... చెక్కు చెదరని తమదైన శైలిలో 'అసలు ఇన్ని లక్షల మంది స్వరాష్ట్రాలను వదలి, ఉపాధి కోసం ఇంత దూరం రావడం ఆయా రాష్ట్ర

ప్రభుత్వాల వైఫల్యం కాదా?' అని చర్చను వేరే దారి పట్టించారు.

వీరి వాదన ప్రకారం ఎవరి రాష్ట్రంలో వారు... ఎవరి జిల్లాలో వారు... చివరికి ఎవరి ఊర్లో వారు – ఉపాధి వెతుక్కోవాలి, స్థానిక ప్రభుత్వాలు ఉపాధి కల్పించాలి! అదే సూత్రం ప్రకారం ఈ మేధావులందరూ తమ తమ పల్లెలకు వెళ్ళి నివసించాలి, అమెరికా, ఆస్ట్రేలియా, లండన్‌లలో ఉద్యోగాలు చేసుకుంటున్న తమ పిల్లలను కూడా వెనక్కి పిలిపించుకోవాలి!

మధ్యయుగాల్లో – భూములు, అడవులు లాంటి సహజ వనరులన్నీ రాజుగారివే. చివరికి ప్రజల ప్రాణాలు కూడా. తమకు విధేయులైన వారికి మండలాలు, మాన్యాలు పంచిపెట్టేవారు. భూస్వామ్యవ్యవస్థ అలా అవతరించింది. తమకిష్టం లేని వారి ప్రాణాలు తీయడం కూడా అవలీలగా జరిగిపోయేది. ఈ ఆధునిక యుగంలోనూ పరిస్థితులేం పెద్దగా మారలేదు. కాకపోతే భాష మారింది. ఇటువంటి వ్యవస్థను సమర్థించే సిద్ధాంతాలు కొత్తరూపాలను సంతరించుకున్నాయి. ఈ సిద్ధాంతాల ప్రకారం సహజవనరులన్నీ సమాజ పరం. అంటే ప్రజలెన్నుకున్న ప్రభుత్వాల పరం. అంటే ప్రధానమంత్రి పరం. కాబట్టే తనకిష్టమైన వారికి బొగ్గు బ్లాకులను పంచిపెట్టారు. దానికొక అధికారుల కమిటీ అనో మంత్రుల కమిటీ అనో ముసుగు కూడా తొడిగారు. ఒక కేంద్ర మంత్రి గారి సోదరుని సంస్థకు బొగ్గు బ్లాకు లభించడం కేవలం యాధృచ్ఛికమట! ఇక ఈ రాద్ధాంత మెందుకు?

ఇప్పటికే హైకోర్టు ఆదేశాల రూపంలో మెడపై వేలాడుతున్న కత్తిని బూచిగా చూపి – దారిపోడుగునా పోలీసు, రవాణా, రెవెన్యూ అధికారులే కాక మీడియా ప్రతినిధులు, ప్రజాప్రతినిధుల మామూళ్ళు ఎన్నో రెట్లు పెరిగినా, ఇసుక ధర కేవలం రెట్టింపు మాత్రమే అయింది!. అలాగే రేపు బొగ్గు ధర కూడా పెరగవచ్చు. కరెంటు ఛార్జీలూ పెరగవచ్చు. అయితేనేం?

బొగ్గు విజయవంతంగా సమాజం పరమైంది కదా! ఒకటే బల్బు వాడే వారికి కరెంటు ఛార్జీలు పెంచట్లేదు కదా! సామాజిక న్యాయం, సమానత్వం సిద్ధించినట్లే కదా! ఇక ఆర్థిక వృద్ధిరేటుతో పనేముంది? పరిశ్రమలు మూతబడితే ఎవరికేంటి?

ప్రజల స్వేచ్ఛ, ప్రాణాలు హరించడానికి ఆధునిక పద్ధతులు నేర్చారు. చిన్న కేసులు, దొంగ కేసులు పెట్టి నిర్భంధించవచ్చు. అనుయాయులనో, కిరాయి గూండాలనో పంపి భౌతిక దాడులు చేయించవచ్చు. దానికి 'ప్రజాగ్రహం' అనే ముద్దుపేరు పెట్టవచ్చు. అలా దాడులు చేసిన వారిపై, కేసులు పెట్టకుండా, శిక్షపడకుండా బహిరంగంగా 'ప్రజా' సంఘాల ద్వారానో, తెరవెనుక రాజకీయంగానో వత్తిడి తీసుకురావచ్చు. ఈ ధైర్యంతోనే

గుజరాత్‌లో మారణకాండ జరిగింది. మొన్న బొంబాయిలో విధ్వంసకాండ జరిగింది. కొందరికైనా శిక్షలు పడడం ముదావహం. రకరకాల రంగుల రాజకీయ పార్టీలు, కుల, మత, భావజాల 'ప్రజా' సంఘాలు, రౌడీలు, గూండాలు ఏదో ఒక మిషతో వ్యక్తుల మీదా, వివిధ వర్గాల మీదా భౌతిక దాడులకు పూనుకుంటుంటే – ఆ హింస బారి నుంచి ప్రభుత్వాలు, ప్రభుత్వ సంస్థలు నిష్పక్షపాతంగా తమను రక్షిస్తాయనే నమ్మకం ప్రజల్లో సన్నగిల్లిపోయింది.

పరస్పర విరుద్ధ భావాలను... భావజాలాలను అలవోకగా ప్రసారం చేసే మీడియా మీద కూడా ఎవరికీ భ్రమల్లేవు. ఒకానొక రాజకీయ పార్టీ చేపట్టిన ప్రాయోజిత కార్యక్రమాన్ని ప్రసారం చేసి, దాని ముసుగులో రిలయన్స్ సంస్థలపై చేసిన మూక దాడులు ఎవరూ మరచిపోరు. అందుకే పుకార్లని అంత తేలిగ్గా నమ్మడం.

ఆ పుకార్లు పాకిస్థాన్ ప్రేరేపితమైనా.... ప్రాంతీయమైనవైనా – ప్రభావం ఒకటే.

'శాంతి భద్రతలు కూరొండు కుంటామా, ముందు ఉచిత పథకాలు కావాలి గానీ. బొగ్గు బ్లాకులు ఎవరికిచ్చుకుంటేనేం, ఉచిత పింఛను టైముకొస్తే చాలు, కరెంటు లేకపోతేనేం, ఉచిత విద్యుత్తే కదా, సరే లక్ష కోట్లు తిన్నాడంటున్నారు కదా. కాబట్టి ఇక ముందు తినాల్సిన అవసరం ఉండదు కదా' అనే ఆలోచనా రాహిత్యం, హ్రస్వదృష్టి, నిర్వేదం, నిర్వికార భావజాల శూన్యంలో ఈ 'కామెడీ ఆఫ్ టెర్రర్స్' పదే పదే పునరావృతమవక తప్పదు.

02-09-2012

ఊ...అంటే ఉలికిపాటు

ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ పనితీరును గురించి 'వాషింగ్టన్ పోస్ట్' లో ఇటీవల ప్రచురితమైన ఒక వ్యాసం గురించి పెద్ద దుమారమే రేగింది.

అసమర్థ, అవినీతిమయ ప్రభుత్వానికి నేతగా ఆయన ఒక దీనమూర్తిగా మిగిలిపోయారని ఆ పత్రిక అభిప్రాయపడింది. ప్రధానమంత్రి కార్యాలయం మొదలుకొని, పలువురు మేధావులు, పార్టీ నేతలతో పాటు, డబ్బులకు పతాక శీర్షికలమ్ముకునే పత్రికలు, ఛానళ్ళు కూడా అత్యంత అసహనాన్ని ప్రదర్శించాయి.

ఈ అసహనం, భావ ప్రకటనా స్వేచ్ఛ పట్ల ద్వంద్వ ప్రమాణాలు ఈ ఒక్క సంఘటనకే పరిమితం కావు. కులపార్టీలు, కుల సంఘాలు, మత సంస్థలు, ప్రాంతీయవాదులు తరచూ ఎవరో ఒకరి మీద, ఫలానా మాట అన్నారనో, ఫలానా విధంగా ప్రచురించారనో ఆవేశపడిపోయి, గుంపులతో ప్రత్యక్ష హింసకు దిగడం జరుగుతూనే ఉంది. తమ సెంటిమెంటునో, ఆత్మగౌరవాన్నో దెబ్బతీశారంటూ పోలీస్ స్టేషన్లోనో, కోర్టుల్లోనో కేసులు పెట్టడం, మళ్ళీ దానికి ప్రచారం సాగించడం నిత్య సాధారణమై పోయింది. అరవై యేళ్లనాడు గీసిన కార్టూన్లు దశాబ్దాల తరబడి పాఠ్యాంశాలై ఉండగా, దాని మీద పార్లమెంటును స్తంభింపజేసిన వైనం చూశాం. ఆంధ్రజ్యోతి సిబ్బంది, కార్యాలయాల మీద జరిపిన దాడులు, మధురైలో ఒక దిన పత్రిక కార్యాలయానికి నిప్పుపెట్టి, సిబ్బందిని చంపేసిన దృశ్యాలు ఇంకా కళ్ళముందే కదలాడుతున్నాయి.

డానిష్ కార్టూన్లకు నిరసనగా – హైదరాబాదు సహా ప్రపంచ వ్యాప్తంగా హింస ప్రజ్వరిల్లగా; నిన్నామొన్న ఒక మత ప్రవక్తను అవమానిస్తూ తీసిన ఒక చెత్త డాక్యుమెంటరీతో రేగిన నిరసన జ్వాలలు హద్దులు దాటి రాయబారి హత్యకు దారి తీశాయి. కార్టూనిస్టులకు కారాగారవాసం, బెదిరింపులే కాక ప్రపంచ ప్రజలందరూ పవిత్రంగా భావించే ఇంటర్నెట్ స్వేచ్ఛకు కూడా చీటికి మాటికీ ఏదో ఒక మిషతో

సంకెళ్ళు వేసే ప్రయత్నాలు జరగుతున్నాయి. మొత్తం మీద ఇరవయ్యో శతాబ్దంతో పోలిస్తే... భావ ప్రకటనా స్వేచ్ఛ ఈ నవ శతాబ్దంలో తిరోగమన దిశలో ప్రయాణిస్తుండడం తేటతెల్లమవుతోంది. భావ ప్రకటనా స్వేచ్ఛ తనంతట తాను ఒంటరి ప్రయాణం చెయ్యదు. ఆర్థిక, రాజకీయ స్వేచ్ఛలు ఏ దారిలో నడిస్తే, వాటితో అత్యంత దగ్గర సంబంధాలుండి, ఒక రకంగా వాటిలో ఒక భాగమైన 'భావ ప్రకటనా స్వేచ్ఛ' కూడా – అదే దారిలో నడుస్తుంది.

పూర్వ, మధ్యయుగాల్లో మతం, రాజ్యం – ఈ రెండూ మనిషి మీద తలోవైపు ఎక్కి స్వారీ చేసేవి. ఆధిపత్యం కోసం తమలో తాము కలహించుకుంటూనే, మతాధిపతులు, రాజులు – ప్రజల కష్ట ఫలాలను గుంజుకుని, పంచుకు తినేవాళ్ళు. మత సంప్రదాయాల పాటింపులోనూ, మత గ్రంథాలను అన్వయించుకునే విషయాల్లోనూ సంస్కరణ వాదాలను బలవంతంగా, సైన్యాల అండతో అత్యంత హింసాత్మకంగా అణచివేయడం శతాబ్దాలపాటు సాగింది. యుద్ధాలు, ఆక్రమణల క్రమంలో లక్షలాది ఇతర మతస్థులను ఊచకోత కోయడం; ఒకే మతంలోని వేరే శాఖల వారిని గుంజకు కట్టేసి సజీవ దహనాలు చేయడం – కాదనలేని చారిత్రక సత్యాలు. జోన్ ఆఫ్ ఆర్క్ ఉదంతం ఒక ఉదాహరణ మాత్రమే. మధ్యయుగాల్లో మెల్లగా మొదలైన సాంస్కృతిక పునరుజ్జీవనం, అభ్యుదయ ఆలోచనా ధోరణులు ఆధునిక నాగరికతకు బాటలు వేశాయి.

ఈ ఆధునిక తాత్విక ధోరణులు వేళ్ళూనుకున్న చోటల్లా సమాజ నిర్మాణంలో పెనుమార్పులొచ్చాయి. ముందుగా – మతాన్ని రాజ్యం, ప్రభుత్వాల నుంచి వేరుచేసి, ప్రక్కన కూర్చోబెట్టారు. అలాగే మనిషి కూడా – రాజ్య పీడన, బానిసత్వాలనుంచి విముక్తుడయ్యాడు. మనిషి మనిషిగా; ఒక పరిపూర్ణమైన స్వేచ్ఛా జీవిగా, తన శరీరం, తన జీవితంపై సకల హక్కులూ ఉన్న సార్వభౌముడిగా నిలబడ్డాడు. ఆచరణలో వివిధ దేశాలు, ప్రాంతాలు, సమాజాల మధ్య తీవ్రమైన తారతమ్యాలున్నప్పటికీ; ఆధునిక ఆలోచనా బీజాలు నాటుకున్న చోటల్లా నాగరికత ఇదే దిశలో ముందుకెళ్లింది. జీవించే హక్కు, ఆర్థిక స్వేచ్ఛ, రాజకీయ స్వేచ్ఛ, మత స్వేచ్ఛ, భావ ప్రకటనా స్వేచ్ఛలు ఎవరో ఇచ్చే తాత్కాలిక దానాలుగా కాక, తమ కాళ్ళమీద తాము నిలబడ్డాయి. కొన్ని దేశాలు, సమాజాలు– ఆలోచనలోనూ, ఆచరణలోనూ నేటికీ ఈ తాత్విక స్థాయికి చేరలేదు. ఒకసారి చేరిన సమాజాలు కూడా ఒక్కోసారి ఒకడుగు ముందుకు, రెండడుగులు వెనక్కు వేస్తూ గందరగోళ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి.

ఇరవయ్యో శతబ్దంలో రేడియో, మీడియా, రవాణా, సమాచార వ్యవస్థల్లో విప్లవాత్మక మార్పులొచ్చాయి. దానికితోడు ప్రపంచమంతా రెండు పరస్పర తీవ్ర విరుద్ధమైన

భావజాల కూటములుగా చీలిపోయింది. కమ్యూనిస్టు, ఫాసిస్టు, మధ్య ఆసియా మతరాజ్యాల్లో అన్ని హక్కులతో పాటు భావ ప్రకటనా స్వేచ్ఛ కూడా నేతిబీరకాయలో నెయ్యి స్థాయిలో ఉండిపోయింది.

వివిధ స్థాయిల్లో ప్రజాస్వామ్యం, ఆర్థిక, రాజకీయ స్వేచ్ఛలున్న మిగతా దేశాల్లో– 'భావ ప్రకటనా స్వేచ్ఛ' అనేది వాటి కిరీటాల్లో ఒక ముఖ్యమైన మణిగా వెలుగొందింది. ఆ సమాజాలు గర్వించదగ్గ విషయాల్లో – భావప్రకటనాస్వేచ్ఛ ఒకటైంది. ఇరవయ్యవ శతాబ్దం పూర్తికాక ముందే ఫాసిస్టు, సోషలిస్టు పేకమేడలు కూలిపోయి, రాజ్యాన్ని పూజించే భావజాల భ్రమలు తొలగిపోయాయి. కాకపోతే ప్రజాస్వామ్య దేశాల్లో 'రాజకీయ అవసరాల' కోసం – సోషలిస్టు ధోరణులు క్రమంగా పెరుగుతూ వచ్చాయి. మనిషిని విముక్తుణ్ణి చేసి, స్వేచ్ఛా జీవితాన్నిచ్చిన తాత్వికతకు ఓట్ల రాజకీయాల తుప్పు పట్టింది. ఆ మేరకు హక్కులు హరించబడ్డాయి. 'భావ ప్రకటనా స్వేచ్ఛ' ఎదుర్కొంటున్న సవాళ్ళు ఇందులో భాగమే.

'హక్కు' అనేది ఒక సకారాత్మక భావం (పాజిటివ్ కాన్సెప్ట్). దానికున్న పరిమితల్లా – ఇతరుల హక్కులకు భంగం కలిగించకపోవడం. ఆ విధంగా, ఇతరులకు హాని, లేదా ఇతరుల హక్కులకు భంగం కలిగించనంతవరకు తనకిష్టమొచ్చినట్లు వ్యవహరించగలగడమే 'హక్కు'.

మనిషి – తన శరీరానికి తానే యజమాని అన్న భావనను అంగీకరించే వారందరూ – మనిషికున్న హక్కులను కాదనలేరు. ఆ రకంగా – జీవించే హక్కు – అనేది అన్ని హక్కులకూ మాతృక. ఆస్తి హక్కు – అంటే తన కష్ట ఫలితాన్ని తన కిష్టమైన రీతిలో అనుభవించే హక్కు మాత్రమే – ఆ జీవించే హక్కుకున్న ఏకైక ఆచరణ మార్గం.

మనిషి సంపాదించిన దాన్ని బలవంతానా లాక్కుని, 'నీకు జీవించే హక్కుంది కదా, చాల్లే పొమ్మంటే' అది హాస్యాస్పదం. ఏం తిని జీవించాలి? ఎవరి కోసం సంపాదించాలి? కాబట్టి మనిషికి తన శరీరం, శరీర భాగాలు, సంపాదన, ఆలోచనల మీద తనకు గల హక్కుతో తన సంపాదనను దాచుకోవచ్చు. సరైన పెట్టుబడిగా పెట్టి మరింత సంపాదించుకోవచ్చు. తాగి తగలేయనూ వచ్చు. నోటి కొచ్చింది మాట్లాడొచ్చు, చేతి కొచ్చింది రాయొచ్చు, చెత్త సినిమాలు తీయొచ్చు (వినే వాళ్ళు, చదివే వాళ్లు, చూసే వాళ్ళు ఉండాలేగాని), కిడ్నీ అమ్ముకోవచ్చు, దానాలు చెయ్యొచ్చు, ఇష్టమైన దేవుణ్ణి నమ్మొచ్చు, నాస్తికుడుగానూ ఉండొచ్చు, భక్తి ముదిరితే హిమాలయాల కెళ్ళి శివ సాయుజ్యం పొందవచ్చు.

ఇతరుల హక్కులకు హాని చేయనంతవరకు ఏమైనా చెయ్యొచ్చు.

ఏ తాత్వికతకైనా పరీక్షా సమయం వస్తుంది. అలాంటప్పుడే మన నిబద్ధత బయటపడుతుంది. నిజమని నమ్ముతూ వచ్చిన తాత్వికతను పాటిస్తామా లేక భావోద్వేగాలకు, తప్పుడు అవగాహనలకు లోనై, దాన్ని (తాత్కాలికంగానైనా) ప్రక్కన పెడతామా అన్నది తేలుతుంది. అర్ధ నగ్న వస్త్రధారణతో ఒక యువతి తన దారిన తాను పోతోందనుకుందాం. అటువంటి వస్త్రధారణ ఆమె సంస్కారానికి, ఇష్టాయిష్టాలకు సంబంధించిన విషయం. మనకది నచ్చనంత మాత్రాన అసభ్య ప్రవర్తనకో, భౌతిక దాడికో తెగబడడం ఆమె హక్కులపై దురాక్రమణే. మన అనాగరికతకు చిహ్నమే. అలాగే, భావ ప్రకటనా స్వేచ్ఛను మనిషికున్న ప్రాథమిక హక్కుగా గుర్తించడమంటే...; మన అభిమాన హీరోని సుతిమెత్తగా విమర్శించనీయడం మాత్రమే కాదు. మనకు అత్యంత సున్నితమైన భావాలను కించపరిచేలా ఎవరైనా వ్యాఖ్యానించినా, రాసినా, తీసినా గానీ అది వారి భావ ప్రకటనా స్వేచ్ఛగా గుర్తించి, వదిలేయడం.

ఒక వాదనను – బలమైన వేరొక వాదంతో ఎదుర్కోవాలి. అది నాగరికం. అదే మానవ మార్గం. అంతేగాని, కత్తులు నూరి కుత్తుకలు కోయబూనడం రాక్షసత్వం. అదే సరైన మార్గమై ఉంటే మనం ఇప్పటికీ మతాలు, ఛాందసాల పేరిట సజీవదహనాలు, ఊచకోతలకు పాల్పడిన మధ్యయుగాల, స్పానిష్ ఇంక్విజిషన్ల కాలంలోనే ఉండిపోయే వాళ్ళం.

కులమైనా, మతమైనా, భాషైనా, ప్రాంతమైనా, జాతైనా, దేశమైనా, దేశపతాకమైనా, ప్రధానమంత్రైనా, పార్టీ అభిమానులైనా – వ్యక్తికి తనపై తనకు ఆత్మ విశ్వాసం, తనతో పాటే అందరి హక్కుల పట్ల గౌరవం ఉన్నంతవరకు ఎవరూ ఎవరినీ కించపరచలేరు. భావ సంఘర్షణ బందూకుల ఘర్షణగా మారడం ఆనవాయితీ అయిన్నాడు – సామాజిక జీవనం అసంభవం; మానవజాతి ఉనికి ఆశాశ్వతం అవుతాయి.

16-09-2012

దృష్టి మళ్ళింపు

మొదట 2జి స్కాము, ఈ మధ్య బొగ్గు గనుల స్కాములో పీకల్లోతున మునిగిపోయిన కేంద్ర ప్రభుత్వం– దృష్టి మళ్ళింపు చిట్కాను ప్రయోగించింది. ఒకవైపున లక్షల కోట్ల కుంభకోణాలు; మరోవైపు నిస్తేజంగా పడున్న దేశ ఆర్థిక పరిస్థితి.

విదేశీ పెట్టుబడిదారుల్లో భారత ఆర్థిక వ్యవస్థపై పెరుగుతున్న నైరాశ్యం; నిరాసక్తత, క్షీణించిన స్టాక్ మార్కెట్‌లు. అదుపులోకి రాని ద్రవ్యోల్బణం, రుతుపవనాల వైఫల్యం, తగ్గుతున్న ఆహార దిగుబడులు.

మరోవైపు – సంవత్సరంన్నరలో ముంచుకొస్తున్న సార్వత్రిక ఎన్నికలు, ఇంకో పక్క చూస్తే ఇప్పటికే సబ్సిడీలతో కుదేలైన ఖజానా, దేశ ప్రజల్లో ప్రభుత్వం పట్ల రోజురోజుకి పెరుగుతున్న వైముఖ్యం. వీటన్నిటి నేపథ్యంలో ప్రజల దృష్టి మరల్చడానికి ఏదో ఒక సాహసోపేతమైనదనిపించే నిర్ణయం తీసుకోక తప్పని పరిస్థితి ఏర్పడింది.

దాని ఫలితమే – ఉరుము, మెరుపు లేకుండా వచ్చిపడిన 'సంస్కరణల' కుంభవృష్టి. డీజిల్ రేటు అమాంతం లీటరుకు ఐదు రూపాయలు పెంచేయడం, వంటగ్యాసు వినియోగంపై పరిమితులు, రిటైల్ రంగంలో విదేశీ పెట్టుబడులు అనుమతించడం, విమానయాన, మీడియా రంగాల్లోనూ విదేశీ పెట్టుబడులకు తలుపులు తెరవడం.... వీటన్నిటినీ గంపగుత్తగా అన్ని ప్రతిపక్ష పార్టీలూ తీవ్రంగా విమర్శించడం – చకచకా జరిగిపోయాయి.

మిత్రపక్షమైన మమత ఆగ్రహంతో – కేంద్ర ప్రభుత్వం అస్థిరతకు గురైందని అనిపించినా; మునిగిపోయే పడవలకు తెడ్లూ, తెరచాపలూ సరఫరా చేసే ములాయం, మాయావతి పార్టీలు – మార్కెట్‌లో సరసమైన ధరలకే అందుబాటులో ఉండడం చేత –

ప్రస్తుతానికి ప్రభుత్వానికొచ్చిన ముప్పేమీ లేదు. కాకపోతే, ఈ కొత్త సంస్కరణల వల్ల జరగబోయే మంచి, చెడులను భరించాల్సిన సామాన్య ప్రజలు తెలుసుకోవలసిన వాస్తవాలున్నాయి.

డీజిల్, పెట్రోల్ విలువ – ముడి చమురు అంతర్జాతీయ ధరలపై ఆధారపడి ఉంటుంది. అంతేకాకుండా అమెరికా ప్రభుత్వ విధానాల వల్ల మారే డాలరు విలువ, మన ఆర్థిక మంత్రిత్వ శాఖ, రిజర్వు బ్యాంకు నిర్వాకాల వల్ల వచ్చే ద్రవ్యోల్బణం, దాని ఫలితంగా మారే రూపాయి మారకం విలువల మీద కూడా ఆధారపడి ఉంటుంది.

ఇంకోవైపున చూస్తే, మన దేశంలోని చమురు వ్యాపారమంతా ప్రభుత్వరంగంలోనే ఉంది. చమురు ఏ దేశాల నుంచి ఎంత ధరకు దిగుమతి చేసుకోవాలో ప్రభుత్వమే నిర్ణయిస్తుంది. చమురు శుద్ధి, రవాణా, పంపిణీ, ఎక్సైజు, అమ్మకం పనులన్నీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చేతుల్లోనే ఉన్నాయి. కాబట్టి పెట్రోల్, డీజిల్, వంట గ్యాసు ధరలు ప్రభుత్వం నిర్ణయించినవే తప్ప; అవి స్వేచ్ఛా మార్కెట్ ధరలు కావు. దిగుమతుల్లో కుంభకోణాలు (నట్వర్ సింగ్ రాజీనామా చెయ్యాల్సి వచ్చింది అలాంటి ఒకానొక కుంభకోణం వల్లనే), ప్రభుత్వ రంగ సంస్థల్లో అవినీతి, అలసత్వం, అధిక ఖర్చులతో పాటు, డీజిల్, పెట్రోల్ తయారీ ఖర్చుకు దాదాపు రెట్టింపుకు పైగా వాటి ధరలున్నాయంటే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధిస్తున్న పన్నులే కారణం. వాస్తవం ఇలా ఉండగా; ధరలను పెంచకపోతే సబ్సిడీ భారం పెరిగిపోతోందనడం హాస్యాస్పదం.

ఎప్పుడో దేవెగౌడ ప్రభుత్వ హయాంలో తీసుకున్న విధాన నిర్ణయాన్ని ఎన్‌డిఏ ప్రభుత్వం – ముందుగా ప్రకటించిన సమయానికి అమలుపరిచింది. ఆ నిర్ణయం ప్రకారం పెట్రోల్, డీజిల్ ధరలను ప్రభుత్వం నిర్ణయించడం మానేసి; ప్రతి పదిహేను రోజులకు చమురు కంపెనీలే అంతర్జాతీయ ధరలకు అనుగుణంగా ధరలు సవరించాలి. కొన్ని నెలలపాటు అమలయింది. కొన్నిసార్లు ధరలు పెరగ్గా, కొన్నిసార్లు తగ్గాయి కూడా.

ఈ విధానాన్ని అప్పట్లో ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ తీవ్రంగా ఆక్షేపించింది. 2004లో అధికారంలోకి రాగానే పెట్రోల్, డీజిల్ ధరలను తిరిగి ప్రభుత్వం గుప్పిట్లోకి తెచ్చుకుంది. ప్రధానమంత్రైన కొత్తలో మన్మోహన్ సింగ్ గారి సతీమణి వంటగ్యాస్ ధరలను పెంచవద్దని ఆయన్ను కోరినట్లు – మీడియాలో ముద్దు ముద్దు కథనాలొచ్చాయి. ఒకవైపు రూపాయిలు ముద్రిస్తూ పోయి, దాని కొనుగోలు శక్తిని తగ్గిస్తూ, ధరలు పెంచకుండా ఎన్నాళ్ళుండగలరు? పెట్రోలు, డీజిల్ ధరలను కొన్ని డజన్ల సార్లు; వంటగ్యాసు ధరలను పలుమార్లు పెంచడమే కాకుండా – గత ఎనిమిది సంవత్సరాల్లో యూపిఏ పుణ్యమాని

అప్పుడప్పుడే కుదురుకుంటున్న పెట్రోలియం ఉత్పత్తుల వ్యవస్థనే నాశనం చేశారు. 2004లో అడగ్గానే దొరికిన గ్యాసు కనెక్షన్లు, సిలిండర్లు ఇప్పుడు మళ్ళీ నల్లబజారుకు తరలిపోయాయి. ఆమ్ ఆద్మీ పేరిట ఓటర్లను తాత్కాలికంగా సంతుష్టపెట్టే రాజకీయ నిర్ణయాలు ఆర్థిక వాస్తవాలను ఎంతో కాలం తొక్కిపెట్టలేవు. దేశీయ చమురు, గ్యాసు అన్వేషణ, ఉత్పత్తి, విదేశీ చమురు దిగుమతి, శుద్ధి, రవాణా, పంపిణీ, ధరల నిర్ణయ వ్యవస్థలను పోటీ వాతావరణంలో పనిచేసే స్వేచ్ఛా మార్కెట్‌కు వదలనంత కాలం ఏం చేసినా అది సంస్కరణ కాజాలదు. ఎవరెన్ని మాటలు చెప్పినా అది పడికట్టు పదాల నృత్యమే తప్ప ప్రజలకు ఉపయోగపడదు.

ఇకపోతే రిటైల్, పౌర విమానయాన, మీడియా రంగాల్లో విదేశీ పెట్టుబడులు అనుమతించడం గురించి.

ఈ రంగాల్లో పెట్టుబడులు అనుమతించినంత మాత్రాన పెట్టుబడులేవో వరదలాగా వచ్చిపడతాయనో; వాళ్ళంతా లాభాలార్జించుకుని మన సొమ్మంతా ఎత్తుకుపోతారనో అనుకోవడం తెలియని తనం మాత్రమే.

ఇప్పటికే మెట్రో, భారతి–వాల్‌మార్ట్ క్యాష్ అండ్ క్యారీ (హోల్‌సేల్) దుకాణాలు కొన్ని సంవత్సరాలుగా నడుస్తున్నాయి. వాటివల్ల హైదరాబాదు బేగంబజారు గానీ, విజయవాడ వన్‌టౌన్ గానీ వ్యాపారమేమీ కోల్పోలేదే! రిలయన్స్, హెరిటేజ్, మోర్ వంటి సంస్థలు ఎన్నో సంవత్సరాలు రిటైల్ సూపర్‌మార్కెట్లు నడుపుతూ ఇప్పటికీ నష్టాల్లోనే ఉన్నాయి. కానీ నాణ్యత విషయంలో వినియోగదారులకు, మధ్యవర్తులు లేకుండా సరఫరా చేయడం వల్ల – ధరల విషయంలో రైతులకు కొంత మేలు జరిగింది. ప్రభుత్వం సృష్టిస్తున్న తీవ్ర విద్యుత్ కొరతల్లో కూడా శీతల గిడ్డంగులు, తదితర సాంకేతిక అభివృద్ధి జరిగింది. ఇప్పుడు విదేశీ పెట్టుబడులు, వాల్‌మార్ట్ లాంటి సంస్థల రాకతో వినియోగదారులు, ఉత్పత్తిదారుల పరిస్థితి ఇంకాస్త మెరుగుపడుతుందనడంలో సందేహం లేదు.

కానీ, పారిశ్రామిక ఉత్పత్తి రంగం ముఖ్యంగా చిన్న, సూక్ష్మ తరహా పరిశ్రమలు చైనా పరిశ్రమలతో పోటీ పడాల్సి వస్తుంది. కరెంటు ధరలు, లభ్యత, పలు రాయితీలు, పని సంస్కృతి, రకరకాల ప్రభుత్వ అధికారుల జులుం, అవినీతి, ఆశ్రిత పక్షపాతం, స్థానిక మీడియా ప్రతినిధుల దగ్గర్నుంచి కులసంఘాలు, రాజకీయ పార్టీలు చేసే బెదిరింపులు, వసూళ్ళు, ఆర్థిక, ద్రవ్య అస్థిరత, పెట్టుబడి కోసం ప్రభుత్వ బ్యాంకుల చుట్టూ కాళ్ళరిగేలా తిరగడం, పీల్చి పిప్పిచేసే పన్నులు – ఇలాంటి విషయాల్లో మనతో పోలిస్తే – చైనాలో పరిస్థితులు ఉత్పత్తికి అత్యంత అనుకూలంగా ఉండడంతో; ఉత్పత్తి వ్యయం తగ్గి, మన దేశ ఉత్పత్తులకు గట్టిపోటీ ఇవ్వబోతున్నాయి.

పౌర విమానయాన రంగంలో కూడా – ప్రపంచవ్యాప్తంగా పదిశాతం కన్నా తక్కువ కంపెనీలే లాభాల్లో ఉన్నాయి. మిగిలినవన్నీ నష్టాల్లో కూరుకుపోయాయి. *ప్రపంచమంతా సంచరించే విదేశీ పెట్టుబడులు – భారతదేశం రావడానికి పెద్దగా ఉత్సుకత చూపడం లేదు. రాజకీయ అస్థిరత... విధానాల్లో అస్పష్టత... కొనసాగించడం సాధ్యం కాని ఓట్లాకర్షక పథకాలు... లోటు – అప్పుల్లో కూరుకుపోయిన ప్రభుత్వ బడ్జెట్లు... సహజ వనరులు – మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం పూర్తి పెత్తనం; వాటి కేటాయింపుల్లో అంతులేని అంచెలంచెల అవినీతి; ఆశ్రిత పక్షపాతం... అధికార దుర్వినియోగం... క్విడ్‌ప్రోకోలు... పర్యావరణం పేరునో... స్థానికత చాటునో అనూహ్య ఆందోళనలు; విధానాల తిరోగమనం; శాంతి భద్రతల కరువు; సాగతీసే న్యాయవ్యవస్థ, దిగజారుతున్న వృద్ధిరేటు – వీటన్నిటి కారణంగా మనదేశం పెట్టుబడులకు అననుకూలంగా మారింది.*

వోడాఫోన్ విషయంలో దేశం బయట జరిగిన వ్యాపార ఒప్పందానికి పదుకొండు వేలకోట్ల రూపాయలు పన్ను కట్టమన్నారు. మూడు వేల కోట్లు డిపాజిట్‌గా కట్టించుకున్న ఐదు సంవత్సరాల తర్వాత సుప్రీంకోర్టు తీర్పిచ్చి, పన్ను కట్టనవసరం లేదని తేల్చి చెప్పింది. అయినా గానీ కక్షపూరిత విధానంతో చట్టాన్ని సవరించి, 1973 నుంచీ జరిగిన లావాదేవీలన్నిటికీ వర్తించేలా నిబంధనలు మార్చారు. ఇంతటి ఇరుకు సందుల్లోకి విదేశీ నిధులు పెట్టుబడులుగా ఎలా ప్రవహిస్తాయి?

రిటైల్ రంగంలో ఇంతకుముందు రిలయన్స్, హెరిటెజ్ వంటి దేశీయ సంస్థలను, ఇప్పుడు విదేశీ సంస్థల రాకను నిరసించే వారు – ఇంతకు ముందు బ్యాంకుల్లో కంప్యూటరీకరణనూ తమకు చాతనైనంతకాలం నిరోధించారు. సాగలేదు గానీ, జట్కా బండ్లు తోలేవారు ఉపాధి కోల్పోతారు కాబట్టి బస్సులు, రైళ్ళ రాకను కూడా అడ్డుకునేవారే. నాగరికత నడిచేది ఉత్పత్తిదారులు, వినియోగదారుల వల్ల మాత్రమే. మిగతా ప్రభుత్వ, నియంత్రణ వ్యవస్థలన్నీ జలగల్లాంటివి. ప్రభుత్వాలు నిర్మించిన అడ్డుగోడలను ఒక్కొక్కటిగా తొలగించడమే నిజమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు, అభివృద్ధికి ఆనవాలు.

వ్యక్తుల, పార్టీల భావజాల, రాజకీయ అజెండాలను గుర్తిస్తూ, గమనిస్తూ వాటి తోక పట్టుకుని ఈదే ప్రయత్నం చెయ్యకుండా స్వతంత్ర ఆలోచనలు పెంపొందించుకోవడమే విముక్తి మార్గం.

30-09-2012

కావాల్సింది భావ వైవిధ్యం

మన దేశం మాత్రమే కాక; ప్రపంచంలోని అన్ని దేశాల్లోనూ ప్రభుత్వాల పనితీరు - అలసత్వం, నిర్లక్ష్యం, అసమర్థత, అనుద్వాదకతలతో నిండి ఉంటుంది. ఇక అవినీతి, ఆశ్రిత పక్షపాతాల గురించి చెప్పనక్కర్లేదు. కాకపోతే వాటి స్థాయి - మనదేశంతో పాటు, ఆఫ్రికా... ఇతర ఆసియా దేశాల్లో కొంచెం ఎక్కువగాను; పాశ్చాత్య దేశాల్లో కొంత మోతాదు తక్కువగాను ఉంటుంది. అది వారివారి సమాజాల్లోని భావజాల పరిణతి; సంస్థాగత పరిణామాలపై ఆధారపడి ఉంటుంది.

అన్ని దేశాల సమాహారమైన ఐక్యరాజ్యసమితిలో కూడా ప్రభుత్వాలకుండే జాఢ్యాలన్నీ ఉంటాయి. అయినా ప్రభుత్వాల పనితీరుని పరిశీలించినంత నిశితంగా ఐక్యరాజ్యసమితి పనితీరును మీడియా, ప్రజలు పట్టించుకోరు; ఎప్పుడో ఆడపాదడపా వచ్చే వార్తా కథనాలు తప్ప.

ఐక్యరాజ్యసమితిని, విచ్చలవిడిగా పెరిగిన దాని అనుబంధ సంస్థలను నిధుల పరంగా అమెరికా భరించడం వల్లనూ; అమెరికా, ఇంగ్లండ్, ఫ్రాన్సులకున్న వీటో అధికారాల వల్లనూ; సెక్రటరీ జనరల్ నియామకంలో పాశ్చాత్య దేశాలు కీలకపాత్ర పోషించడం వల్లనూ; దాని పనితీరుపై పాశ్చాత్య దేశాల ముద్ర స్పష్టంగా కనిపిస్తుంది. అంతర్జాతీయ రాజకీయ విధానాల్లో పాశ్చాత్య దేశాల చేతుల్లో దాదాపుగా కీలుబొమ్మగా మారిన ఐక్యరాజ్యసమితి; తన అనుబంధ సంస్థలైన యునిసెఫ్, యునెస్కో, ప్రపంచ ఆహార సంస్థ తదితరాల ద్వారా ప్రపంచ దేశాలన్నిటిలోనూ తన పాద ముద్రలను నిలుపుకుంటూ ఉంటుంది.

మధ్య యూరోప్‌లో బలమైన దేశమైన యుగోస్లావియాను ముక్కలు చేయడంలో భాగంగా నాటో దేశాలు సెర్బియాపై బాంబుల వర్షం కురిపించి నప్పుడు ఐక్యరాజ్యసమితి, భద్రతామండలి అనుమతి అవసరం అనిపించలేదు. అబద్ధపు ఆరోపణలతో ఇరాక్‌పై

యుద్ధం ప్రకటించినపుడు కూడా దాని అనుమతి అవసరం అనిపించలేదు. ఇరాన్‌పైనో, సిరియాపైనో ఆంక్షలు విధించడానికి మాత్రం ఐక్యరాజ్యసమితి శంఖంలో పోస్తేగానీ తీర్థమవలేదు.

ఇంతగా రాజకీయ పరంగా ఉపయోగపడే ఐక్యరాజ్యసమితి వ్యవస్థను పాశ్చాత్య దేశాలు జాగ్రత్తగా దిశానిర్దేశం చేస్తూ నడిపిస్తుంటాయి. దాని అనుబంధ సంస్థల కార్యకలాపాలను కూడా తమ దేశ పరిశ్రమలకు, బహుళ జాతి సంస్థలకు ఉపయోగపడేలా చూసుకుంటాయి. ఈ అనుబంధ సంస్థల నోటితో – తమకు పనికొచ్చే పలుకులు పలికిస్తూ, కొన్ని 'స్వచ్ఛంద' సంస్థలను పెంచిపోషిస్తూ – తమకు అనుకూలమైన భావాలను మేధావి, మీడియా వర్గాల ద్వారా ప్రపంచీకరిస్తూ ఐక్యరాజ్య అంతర్జాతీయ ప్రహసనాన్ని కొనసాగిస్తుంటారు.

అటువంటి కార్యక్రమాల్లో భాగమే ఇప్పుడు హైదరాబాదులో జరుగుతున్న ప్రపంచ జీవవైవిధ్య సదస్సు.

ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థల కార్యక్రమాలను గమనిస్తే ఆసక్తికరమైన విషయాలు కనిపిస్తాయి. వీరు ప్రతి దశాబ్దంలోనూ ఒక కొత్త పల్లవి ఎత్తుకుంటారు. మానవాళి మనుగడకు అత్యంత తీవ్రమైన సవాలుగా ఆ విషయాన్ని ఎత్తిచూపుతారు. దానికి రుజువుగా, కొన్ని పరిశోధనా వ్యాసాలను ఉటంకిస్తారు. జాగ్రత్తగా సమన్వయించిన అంతర్జాతీయ ప్రచార యుద్ధాన్ని మొదలెడతారు. కొందరు దేశాధినేతలు, కొందరు మాజీ దేశాధినేతల ద్వారా విషయ తీవ్రతను జనస్రవంతి మస్తిష్కాల్లోకి ఎక్కిస్తారు. కొన్నాళ్ళకు ఒక పరికల్పనే (హైపోథిసిస్) పెద్ద నిజమై కూర్చుంటుంది.

ఇక దానిమీద ప్రచారభేరి... దేశీయ, అంతర్జాతీయ సమావేశాలు... జాతరలు, ఒప్పందాలు... వాటి అమలు కోసం దేశీయ చట్టాలు, పలు నిబంధనలు... వాటిని అమలు చెయ్యడానికి కొత్త శాఖలు. ఉద్యోగాలు. విషయం వేడి తగ్గాక కూడా ఉద్యోగాలు కొనసాగాలి కాబట్టి; ఇంకో కొత్త 'మానవాళికి ముప్పు'ను కనిపెట్టడం – ఇలా తనను తాను విస్తరించుకుంటూ, సభ్యదేశాల్లోని అధికార గణాల్ని విస్తరించడంలో ఐక్యరాజ్య సమితిది అందె వేసిన చెయ్యి. నగరాల్లో ప్రచురించబడే మూడు, నాలుగు పేజీల మధ్యాహ్న పత్రికలు స్థానిక వార్తలు, స్థానిక రాజకీయ నాయకులు, అధికారుల పనితీరుకు ప్రాధాన్యమిస్తాయి. వాటికి రాష్ట్ర ప్రభుత్వం కొండ మీద దేవుడిలా కనిపిస్తుంటుంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రచురించే భాషా పత్రికలకు రాష్ట్ర ప్రభుత్వం టార్గెట్‌గాను, కేంద్ర ప్రభుత్వం సుదూరంగానూ కనిపిస్తుంది. నేషనల్ మీడియాకు కేంద్ర ప్రభుత్వం టార్గెట్.

ఐక్యరాజ్యసమితి విమర్శించరాని కొత్త దేవుడిలా కనబడుతుంది. కాబట్టి ఐరాస, దాని అనుబంధ సంస్థలను ప్రశ్నించే వారుగానీ, నిశితంగా విమర్శించే వారుగానీ బహు అరుదుగా కనిపిస్తారు.

జీవ వైవిధ్య సదస్సు మూలాలు, దాని లక్ష్యాలు, ఆవశ్యకత, సాధించజూసే ఆదర్శాలను గమనిస్తే ఐరాస అనుబంధ సంస్థలు – తమ, తమ ఉద్యోగుల, తమను నమ్ముకుని బతికే స్వచ్ఛంద సంస్థల మనుగడ కోసం – ముందుకు తెచ్చిన 'వర్తమాన దశాబ్ద ఫ్యాషన్' గా అర్థమవుతుంది. ఈ సదస్సును పురస్కరించుకుని హైదరాబాద్ రోడ్లు కాస్త బాగుపడ్డాయి. టీవీల్లో పబ్లిసిటీకి స్థానిక పరిపాలనాధికారులకు అవకాశం దొరికింది. ఒక పెద్ద అధికారి మాట్లాడుతూ – మనుషుల్లానే, ఇతర జీవ జాలాలకు కూడా ఈ భూమ్మీద బ్రతికే హక్కు సమానంగా ఉందన్నారు.

అందుకేనేమో డెంగీ దోమలను నిర్మూలించడంలోనూ, క్షయరోగ కారక బ్యాక్టీరియాకు వాడాల్సిన మందుల సరఫరాలోనూ తాత్సారం చేస్తున్నారు!

పరిశోధనల ద్వారానే కాక మనకు కళ్ళకు కనిపించే ఉదాహరణల ద్వారా అర్థమయ్యేదేమిటంటే, భూమి పుట్టిన సుమారు నాలుగొందల యాభై కోట్ల సంవత్సరాల్లోనూ భూమి మీద పుట్టిన జీవరాశుల్లో తొంభై శాతం అంతర్ధానమవడం జరిగిపోయింది. ఒక అంచనా ప్రకారం; ఇప్పటికీ రోజుకు ఇరవై అయిదు చొప్పున జీవరాశులు అంతమవుతున్నాయి. వాటి స్థానంలో కొత్త జీవరాశులు ఉద్భవిస్తూనే ఉంటాయి. అదొక సహజ జీవన పరిణామ చక్రం. డైనోసార్ లాంటి జీవరాశుల అంతర్ధానం అందరికీ సుపరిచితం. ఇన్ని లక్షల కోట్ల జీవరాశులూ ఇన్ని కోట్ల సంవత్సరాల్లో అంతర్ధానమవడానికి మానవాళేం కారణం కాదు గదా! మరి మానవ జనిత కార్యకలాపాల వల్లే జీవవైవిధ్యం ప్రమాదంలో పడినట్లు, దీనివల్ల మానవాళి కూడా తీవ్రముప్పును ఎదుర్కోబోతున్నట్లు జరుగుతున్న ప్రచారం కేవలం ప్రచారం మాత్రమే అని అర్థం చేసుకోవచ్చు.

1970ల్లో భూమి చల్లబడిపోతోందని గగ్గోలు పెట్టారు. సుమారుగా అదే సమయంలో వన్యప్రాణుల సంరక్షణ ఉద్యమం మొదలెట్టారు. 1980ల్లో అటవీ సంరక్షణ కొత్త నినాదమై కూర్చుంది. 1990ల నుంచి భూతాపం పెరిగిపోతోందంటూ గగ్గోలు మొదలైంది. అల్‌గోరె వంటి అమెరికన్ రాజకీయ నాయకుడికి నోబెల్ బహుమతి కూడా తెచ్చిపెట్టింది. కార్బన్ ఉద్గారాల నియంత్రణ పేరిట ప్రపంచ సమాజానికి ఆర్థికంగా గుదిబండలా తయారైంది. శాస్త్రీయ ఆధారాలు లేకుండా ప్రభుత్వ జీతాలతో నడిచే కేంద్రాల ఉద్యోగుల పరిశోధనా పత్రాలే ఉద్యమ కరపత్రాలయ్యాయి. భూమి మీద ఉష్ణోగ్రతలు కొన్నిసార్లు తగ్గడం, కొన్నిసార్లు పెరగడం సహజ ఘటనలనీ, మహా నగరాల విస్తరణ

వల్లనూ, కొన్నిచోట్ల జనాభా సాంద్రత పెరగడం వల్లనూ స్థానికంగా ఉష్ణోగ్రతలు పెరిగినప్పటికీ, భూమి మొత్తం మీద ఉష్ణోగ్రతలు పెరగడానికి కారణాలు మానవ జనితం కాదనీ మొత్తుకున్నా...; వినేవారు లేరు. ఒప్పుకుంటే – బిలియన్ల డాలర్ల పరిశోధనా నిధుల ప్రవాహం ఆగిపోతుంది కదా!

వరి వంగడాల్లో రకాలు తగ్గిపోయాయని... ; దేశవాళీ వంకాయలు, టమాటాలు దొరకడం లేదని వాపోయేవాళ్ళు ఎప్పుడైనా వ్యవసాయం చేశారో.... లేదో అనుమానమే. సగానికి సగం పుచ్చులుండే వంకాయలు, ఒక్కరోజుకే మెత్తబడిపోయే టమాటాల స్థానంలో కొత్త సంకర వంగడాలు, పదునైన పురుగు మందులు రాబట్టే ఇంత జనాభా పెరిగినా వేసవి కాలంలో కూడా కూరగాయలు (అది కూడా కొనగలిగిన ధరల్లో) అందుబాటులో ఉంటున్నాయి. ఎండోసల్ఫాన్ నిషేధం విషయంలో సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చిన సమయంలో ఒక జాతీయ ఛానల్‌లో బొంబాయికి చెందిన ఒక 'స్వచ్ఛంద' సంస్థ ప్రతినిధి మాట్లాడుతూ– ఆర్గానిక్ పంటలు మాత్రమే పండించేలా నియంత్రించాలన్నారు. అలా చెయ్యాలంటే ఇంకో రెండు భూగోళాల్నయినా తెచ్చుకోవాలి. లేదా ఇప్పుడున్న జనాభాలో మూడొంతుల మంది త్వరలో మరణించాలి. (ఆ మూడొంతుల మందిలో ఉండడానికి ఆయన సిద్ధమో కాదో తెలియదు.) బీటీ పత్తిని గురించి ఇంత రాద్ధాంతం చేస్తున్నారు గానీ ఆ రకం పండించొద్దనీ, కాయి తొలిచే పురుగును ఏరుకుంటూ, ఏరలేకపోతే ఆత్మహత్యలు చేసుకుంటూ పాత వంగడాల్నే పండించమని తెలంగాణ, ప్రకాశం జిల్లాల రైతులకు నచ్చజెప్పమనండి చూద్దాం!

ప్రపంచ దేశాల్లో లాగా అభివృద్ధి చెందిన వంగడాలు, శాస్త్రీయత, సాంకేతిక పరిజ్ఞానం ఏ అడ్డంకులూ లేకుండా ప్రైవేటుగా రైతులు, ఔత్సాహికులు ఇచ్చిపుచ్చు కోగలిగితే చాలు; మానవాళి ఆహారభద్రతకు ఏ ఢోకా ఉండదు. అన్నీ తానైన ప్రభుత్వాలు, ప్రభుత్వ జీతాలకు పనిచేసే పరిశోధనా కేంద్రాల ఉద్యోగుల భద్రత ప్రధానమవబట్టే ఇటు రైతులు, అటు వినియోగదారులు నష్టపోతున్నారు. లక్షల కోట్లు పోసి సైన్యాలను పెంచి పోషిస్తాం గానీ, పాకిస్తాన్‌తో ఉల్లిపాయలు, ఆలుగడ్డలు కొనడం, అమ్మడం చెయ్యనివ్వం. హైదరాబాదు– విజయవాడ జాతీయ రహదారిపై సంవత్సరానికి అయిదువందల రోడ్డు ప్రమాద మరణాలు సంభవిస్తున్నాయి. ఇప్పటివరకూ ఈ రోడ్డు మీద మరణించిన వారి సంఖ్య భారత్–పాకిస్తాన్ యుద్ధాల్లో మరణించిన సైనికుల సంఖ్య కంటే ఎక్కువ. నాలుగులేన్ల రహదారి నిర్మించడానికి ప్రభుత్వానికి పైసా ఖర్చులేదు. టోల్‌గేట్ ఛార్జీల ద్వారా ప్రయాణీకులే ఖర్చు భరిస్తారు. మరి ఇన్ని వేల మరణాలకు ఎవరు బాధ్యత వహిస్తారు? ప్రభుత్వ నియంత్రణలు 'జాతీయ ఫ్యాషనై'న మన సమాజానికి – జీవ వైవిధ్యం కంటే, భావ వైవిధ్యం తక్షణ అవసరం.

14-10-2012

నిరర్థక నియంత్రణలు

సోవియట్ యూనియన్; దాని తోక దేశాల్లోని కమ్యూనిస్టు వ్యవస్థ - 1991 డిసెంబరు నాటికి పూర్తి స్థాయిలో కుప్పకూలిపోయింది.

1989 నుంచి దాని సూచనలు కనబడ్డం మొదలయ్యాయి. ఆ వ్యవస్థలోని మౌలికమైన, సరిదిద్దలేని తీవ్రమైన బలహీనతలను; అది కుప్పకూలక తప్పని అనివార్యతను శాస్త్రీయంగా విశ్లేషించి అంచనా వేసిన ఆర్థిక వేత్తలు ప్రపంచంలోనే అతి కొద్దిమంది. కానీ వారినెవరూ పట్టించుకోలేదు. వారి విశ్లేషణలకు, సిద్ధాంతాలకు ప్రాచుర్యం లభించలేదు. లక్షల జీతాలు తీసుకునే హార్వర్డు ప్రొఫెసర్లు, నోబెల్ గ్రహీతలంతా ఏమైనట్లు? సోవియట్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా రకరకాల విన్యాసాలు చేసిన సీ.ఐ.ఏ. తదితర పాశ్చాత్య ఏజెంట్లు ఏం చేస్తున్నట్లు?

అతి కొద్దిమంది ఆర్థిక శాస్త్రవేత్తలు ముందే చెప్పిందీ, సోవియట్ పతనానంతరం బహిర్గతమైన వాస్తవాలు ఎత్తిచూపిందీ ఒకటే. *మార్కెట్ వ్యవస్థ, ధరల వ్యవస్థ లేని పరిస్థితుల్లో - ప్రణాళికా సంఘాల కాకి లెక్కలు ఆర్థిక వ్యవస్థను నడపలేవు అని. అది నిర్ద్వంద్వంగా రుజువైంది.*

పాశ్చాత్య దేశాలు పేరుకు పెట్టుబడిదారీ వ్యవస్థలైనప్పటికీ, అవి మొదటి ప్రపంచ యుద్ధ కాలం నుంచీ అవలంబించిన ఆర్థిక విధానాలు వాయిదాల పద్ధతిలో సోషలిజం వైపు నడకలే. రాజకీయ నాయకులు - ఒకసారి దాని రుచి మరిగాక; ఇక వదిలిపెట్టే అవకాశమే లేదు. విమర్శించే వర్గాలను, ముఖ్యంగా సామాజిక శాస్త్ర అధ్యాపక, మేధోవర్గాలను, మరీ ముఖ్యంగా ఆర్థిక శాస్త్రవేత్తలను కూడా వ్యవస్థ లబ్ధిదారుల బృందాలలో భాగస్వాముల్ని చేశారు. 'ప్రభుత్వం ద్వారా ప్రజా సంక్షేమం' అనే భావజాలం అన్ని వర్గాల్లోనూ విస్తృతంగా వ్యాపింపజేయడంలో సామాజిక శాస్త్ర అధ్యాపక, మేధోవర్గాలు ఇతోధికంగా సాయపడ్డాయి. ఆ విధంగా పూర్వ కాలంలో రాజు, పురోహితుల మధ్య

ఉన్నట్లే ఆధునిక యుగంలో – సంక్షేమ ప్రభుత్వాలు – మేధోవర్గాల మధ్య ఇరుపక్షాలకూ లాభదాయకమైన సంబంధ బాంధవ్యాలేర్పడ్డాయి. దాంతో, రకరకాల పన్నుల విధింపు, వాటిని ఓట్లాకర్షక పథకాలకు విరజిమ్మడం...; ప్రత్యక్షంగా పన్నులు విధించలేనప్పుడు రిజర్వుబాంకును అడ్డం పెట్టుకుని రూపాయల ముద్రణ... అంతులేని ప్రభుత్వ అప్పులు... రుపాయి విలువ, మారకం విలువలను తగ్గించడం ద్వారా ప్రజలు దాచుకున్న సొమ్మును చట్టబద్ధంగా దోపిడీ చేయడం... ఈ దోపిడీ సొమ్ముతో సైన్యాలను, ఆయుధ పరిశ్రమలను పెంచి పోషించి, కయ్యాలకు కాలుదువ్వడం – ఇవన్నీ ఆర్థిక, సామాజిక వేత్తలకు సంక్షేమ రాజ్యంలో తప్పనిసరి పరిణామాలుగా కనిపించాయే తప్ప; వీటి వెనుక ఉన్న రాజ్య దౌష్ట్యం కనిపించలేదు.

అలా 'వాయిదా పద్ధతుల్లో తేబోయే సామ్యవాదాని'కి కట్టుబడి ఉన్నారు కాబట్టే; అసలు సిసలైన సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్కులో ఉన్న పగుళ్లు అది కుప్పకూలిపోయేదాకా వారికి కనిపించలేదు. కుప్పకూలాక కూడా రాజకీయ, ఆర్థిక, మత స్వేచ్ఛలు లేవనో, ఆఫ్ఘనిస్తాన్ ఆక్రమణ బెడిసికొట్టడాన్నో, రీగన్ ప్రతిపాదించిన అంతరిక్ష యుద్ధానికి సరితూగలేక పోవడాన్నో కారణాలుగా చూసారు, చూపారే తప్ప; అసలు కారణమైన ఆ వ్యవస్థ పునాదుల బలహీనతలను, వాటిని ఎప్పట్నుంచో ఎత్తి చూపుతున్న వారిని అసలు ప్రస్తావించలేదు.

ప్రస్తావిస్తే తాము నమ్మి, దేశీయంగా ఆచరిస్తున్న సంక్షేమ రాజ్య ఆర్థిక వ్యవస్థను కూడా తిరగదోడాల్సి వస్తుంది కదా!

సంక్షేమ–సంగ్రామ రాజ్యవ్యవస్థ క్రమేపీ వెర్రితలలు వేసిన అమెరికాలో ఆర్థిక వ్యవస్థ ఎప్పుడు కుప్పకూలుతుందో తెలియని పరిస్థితి. దారి మార్చుకోకపోతే పతనం మాత్రం ఖాయం. తాను మునగడమే కాకుండా; డాలరుతో ముడిపడ్డ ప్రపంచ ఆర్థిక వ్యవస్థనూ ముంచే ప్రమాదం పొంచి ఉంది. రాజకీయ నాయకులు తమంతట తాము దీర్ఘకాలిక లక్ష్యాలను ఎంచుకోరు. వారి దృష్టంతా ఎంతసేపూ రాబోయే ఎన్నికల వరకే పరిమితం. ఇది ప్రజాస్వామ్యానికున్న ముఖ్య బలహీనత. ఎంతగా పాతుకుపోయిన వ్యవస్థనయినా రక్తపాతం లేకుండా మార్చుకోగల వెసులుబాటు కూడా ప్రజాస్వామ్యంలో మాత్రమే ఉంది. ఓట్లేసే ప్రజల్లో విజ్ఞత లోపించినప్పుడు, మెజారిటీ ఓటర్లు ప్రక్కవాడి జేబులు కొట్టేసి తాను 'సంక్షేమం' అనుభవించాలని ఆరాటపడినపుడు ప్రజాస్వామ్య విధానం వ్యవస్థ నాశనానికే దోహదపడుతుంది. తెలివొచ్చేసరికి సమయం మించిపోతుంది, నష్టం జరిగిపోతుంది.

కమ్యూనిస్టు వ్యవస్థ కుప్పకూలి ఇరవై యేళ్ళు దాటింది. ఆ నేపథ్యంలో మన దేశంలో వచ్చిన ఆర్థిక సంస్కరణలకు కూడా ఇరవై యేళ్ళొచ్చాయి. ఈ మధ్యకాలంలో పడుతూ లేస్తూ వచ్చిన ఆర్థిక వ్యవస్థ మరలా పతనం అంచుకు చేరి, రెండో తరం ఆర్థిక సంస్కరణలకు దారితీసింది. కానీ సంస్కరణల పట్ల రాజకీయ నాయకుల, ప్రజల నిబద్ధత

ప్రశ్నార్థకమైన పరిస్థితుల్లో వాటి ప్రభావం అంతంత మాత్రంగానే ఉంది.

లైసెన్సులు, నియంత్రణలు, నిబంధనలు ప్రవేశపెట్టడానికి పాలక వ్యవస్థ ఎంతగా ఇష్టపడుతుందో...; మీడియా కూడా వాటిని అంతే స్థాయిలో సమర్థిస్తుంది. ఇదొక విచిత్రం! పత్రికా స్వేచ్ఛ కోసం గొంతు చించుకునే మీడియా; ప్రజల స్వేచ్ఛను ప్రభుత్వాలు హరిస్తుంటే తానూ వంత పాడుతుంది. విశ్వవ్యాప్తమైన సోషలిస్టు భావజాలం దీనికి ఒక కారణమైతే, ఇందులో ఒక 'అప్రకటిత' వ్యాపార కోణం కూడా ఉంది.

అదేమిటంటే - ప్రభుత్వాలు ఎన్ని నిబంధనలు పెడితే అన్ని ఉల్లంఘనలు జరుగుతాయి. అన్ని వార్తలు, కథనాలు దొరుకుతాయి. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టే క్రమంలో ప్రభుత్వాధికారులు, రాజకీయ నాయకుల దగ్గర వారి పలుకుబడి పెరుగుతుంది. తప్పనిసరి పరిస్థితుల్లో నిబంధనలు అతిక్రమించిన వారు, ఆశ్రిత పెట్టుబడిదారులూ మీడియాకు ఒక ముఖ్యమైన 'ఆదాయ వనరుగా' మారారు. జిందాల్ - జీ టీవీ ఉందంతం ఈ విషయాన్ని కళ్ళకు కట్టి మరీ చూపుతుంది. ఇదేం మొదటిసారి కాదు.

ఇంతకు ముందు నీరా రాడియా టేపులు, రోజూ కొందరు స్థానిక విలేఖరులపై నమోదవుతున్న కేసులు ఇదే వాస్తవాన్ని నిరూపిస్తున్నాయి. వైద్యుడు, వకీలు, విలేఖరి వృత్తులు అత్యంత పవిత్రమైనవనే (మిగతావి అపవిత్రమైన వృత్తులా?) గుడ్డి భావనలు వదిలి, అన్నిటిలాగే అవి కూడా మౌలికంగా వ్యాపారాలేనని గుర్తిస్తే, మీడియాలో వచ్చిన వార్తలను కేవలం వార్తలుగా, విశ్లేషించాల్సిన, రుజువులు సరిచూసుకోవాల్సిన ముడి సమాచారం మాత్రమేనని గ్రహిస్తే, మీడియాలో కొందరి ప్రవర్తన పట్ల అంత నిరాశ, నిస్పృహలుండవు.

'మనిషి తన 'అవివేకం' వల్ల నష్టపోకుండా - ప్రభుత్వాలు అతని ప్రవర్తనను కట్టడి చేయ్యాల'నే భావజాలంతో ఒకసారి ఏకీభవిస్తే, అది స్వేచ్ఛకు సమాధి అవుతుంది. ప్రభుత్వాలు అత్యుత్సాహంగా నియంత్రణల వ్యవస్థను నిరంతరం విశాలం చేస్తాయి. ప్రభుత్వ యంత్రాంగానికి ఇంకా పండుగ. ఆ నియంత్రణలన్నీ అమలుచేసే మిషతో తమ సంఖ్యను మరింతగా పెంచుకోవచ్చు, కొత్త కొత్త అధికారాలు పొందవచ్చు, సమ్మెలు చేస్తామని బెదిరించి జీతభత్యాలు పెంచుకోవడమే కాక, నిబంధనలు అడ్డుపెట్టుకుని పై సంపాదన దండుకోవచ్చు. ఒక నిబంధన పని చెయ్యకపోతే, ఆ లీకేజిని అరికట్టడానికి ఇంకో పది నిబంధనలు తెచ్చుకోవచ్చు. ఇలా ప్రభుత్వ పరిమాణం పెరిగిపోయి ప్రజల మీద స్వారీ మొదలవుతుంది.

ఇటీవల జంట నగరాల్లో మొదలెట్టిన కారు అద్దాల నుంచి నల్ల ఫిల్ములను తొలగించడం నిరర్థక నియంత్రణలకు ఒక దృష్టాంతం మాత్రమే. మోటారు వెహికల్ చట్టంలో ఉన్న రూల్ నెంబరు నూరులో నిర్దేశించిన విధంగా కారు అద్దాలు పారదర్శకంగా ఉంచాలని, అద్దాలకు నల్లఫిల్ముని అంటించరాదనీ సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

దీనికి చూపిన కారణం – లోపల ఎవరున్నారో కనపడకపోవడం వల్ల దోపిడీ, మానభంగం లాంటి నేరాలు పెరుగుతున్నాన్నయట! ఇది అత్యంత ప్రశ్నార్హం.

మనిషి స్వేచ్ఛ ప్రాథమికమా – లేక నియంత్రణలే రాజ్యాంగ సారమా – అన్న విషయంలో నెలకొన్న తీవ్ర అయోమయాన్ని సూచిస్తోంది. బురఖాలు వేసుకుని కొందరు దొంగతనాలకు పాల్పడతారు కాబట్టి బురఖాలను నిషేధిస్తారా? గొడ్డళ్ళు, కత్తులతో హత్యలు చేస్తారు కాబట్టి వాటి వాడకాన్ని నిషేధిస్తారా? ఎవరో ఎక్కడో చేసిన నేరానికి – ఈ ఉష్ణ ఖండంలో కారున్న ప్రతి వారినీ శిక్షిస్తారా? అద్దాల్లోంచి లోపలున్నదంతా కన్పిస్తే, ఒంటరిగా కారు నడుపుతూ వెళ్ళే మహిళల భద్రత మాటేమిటి? వారి మెడల్లోని బంగారం, కార్లో కనిపించే వస్తువులు నేరాలకు ప్రేరేపించవా? సినిమా నటీ, నటులు, ఇతర సెలబ్రెటీల గోప్యతా హక్కుల మాటేమిటి? సూటిగా పడే ఎండ వల్ల చర్మ వ్యాధులకు గురయ్యే వారి ఆరోగ్య హక్కులు, జీవించే హక్కుల సంగతేమిటి? దీన్నడ్డం పెట్టుకుని విచ్చలవిడిగా పెరిగే ట్రాఫిక్ పోలీసు అవినీతిని ఎలా నియంత్రిస్తారు?

ఏసీబీలో ఇంకో అయిదొందల పోస్టులు పెంచుతారా? ఇంతటి అసంబద్ధ నియంత్రణలను ప్రశ్నించకపోగా...; మీడియా అత్యుత్సాహంగా ప్రోత్సహించడం అత్యంత విషాదకరం. నియంత్రించాల్సింది నేరాలను, కారు అద్దాలను కాదు. శిక్షించాల్సింది నేరస్థులను, కారు యజమానులందరినీ కాదు. రోడ్డు ప్రమాదాలు జరుగుతాయి కాబట్టి ట్రాఫిక్‌నే నిషేధిస్తారా? అక్కడక్కడా మానభంగాలు జరుగుతాయి కాబట్టి చీకటినే నిషేధిస్తారా? నల్లఫిల్ములు లేకపోవడంతో కారులోపల వేడెక్కిపోయి, ఏ.సి నడపడానికి మరింత డీజిలు, పెట్రోలు ఖర్చవుతుంది. దానివల్ల యజమాని జేబుకు చిల్లుపడడమే కాక, కర్బన ఉద్గారాలు పెరిగి, కాలుష్యం, భూతాపం పెరుగుతుంది. మరి దీనికి పర్యావరణ వాదులు ఏమంటారు?

ఇటీవల ఒక చైనా మంత్రి వాల్‌స్ట్రీట్ జర్నల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పినదాన్ని బట్టి, శతాబ్దకాలంగా పాశ్చాత్యదేశాలు, ప్రపంచ దేశాలు అనుసరిస్తున్న సంక్షేమ రాజ్య భావజాలం; ఆర్థిక సంక్షోభాలకు వేసే మందు – రోగాన్ని మరింత పెంచుతోంది. అయనే ఇంకో విషయం చెప్పాడు. సంతోషంగా ఉండడానికి రెండు దారులున్నాయి. ఒకటి మన సంతోషం కోసం ప్రక్కవాణ్ణి బాధపెట్టడం. దాన్ని దొంగతనం, దోపిడీ అంటారు. అదే – సంక్షేమ రాజ్యసూత్రం కూడా. రెండో మార్గం ప్రక్కవాణ్ణి సంతోషపెట్టడం ద్వారా మనం కూడా లబ్ధి పొంది సంతోషపడడం – దాన్ని మార్కెట్ వ్యవస్థ అంటారు.

చైనా మంత్రికి కలిగిన కనువిప్పు మన నేతలకు, మేధావులకు, మీడియాకు, ఓటర్లకు కలుగుతుందని మొక్కవోని ఆశతో ఎదురుచూద్దాం.

28-10-2012

సంక్షేమ రాజ్య సంరక్షకుడు

ఒబామా రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికవడం ఆశ్చర్యకరమేమీ కాదు.

గుర్తుందో లేదో...; నాలుగేళ్ళ క్రిందట ఒబామా మొదటిసారి ఎన్నికయినప్పుడు, అప్పుడే కొత్తగా పార్టీ స్థాపించిన నాయకులు తమను తామే ఒబామాతో పోల్చుకుని, అమెరికాలో లాగే ఇక్కడ కూడా రాబోయే 'మార్పు'కు తామే సారథులుగా అభివర్ణించుకున్నారు!

అదలా ఉంచితే, ప్రపంచ ఆర్థిక వ్యవస్థంతా డాలరుతో ముడిపడి ఉండడం, అమెరికా ఆర్థిక వ్యవస్థ కుదేలైన పరిస్థితి నుంచి బయటపడలేక పోతుండడం, ప్రపంచంలోనే అత్యంత బలమైన ప్రజాస్వామ్యంలో ప్రజల ఆలోచన, తీర్పు ఎలా ఉండబోతున్నాయనే ఉత్కంఠతో ఫలితాల కోసం అందరూ ఎదురు చూశారు. ఒబామా విజయంలో రంగు జాతీయులు పాత్ర, ఇటీవలే వచ్చి ఎన్నడూ లేనంత బీభత్సం సృష్టించిన పెను తుపాను శాండీ పాత్ర – ఇవన్నీ ఒక ఎత్తైతే, అసలు ఇద్దరు ప్రధాన అభ్యర్థుల మధ్య మౌలిక విషయాల్లో పెద్దగా తేడా లేకపోవడం; అమెరికా మెడపై కత్తిలా వేలాడుతున్న ఆర్థిక సంక్షోభం విషయంలో ఇద్దరివీ తిరోగమన విధానాలే కావడం – పొంచి ఉన్న ప్రమాదానికి సంకేతం.

అమెరికా ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో ఉంది. యూరప్, ఆసియా దేశాల కంటే తీవ్రమైన గడ్డు పరిస్థితులు దాన్ని పట్టి పీడిస్తున్నాయి. పరిస్థితిని ఈ స్థాయికి దిగజార్చిన పరిణామాలు, వాటి కారణాలను విశ్లేషించకుండా పరిష్కారాలు వెదకడం సాధ్యం కాదు. మొదటి ప్రపంచ యుద్ధకాలం నుంచి అమెరికాలో ప్రభుత్వాలు వారి రాజ్యంగ స్ఫూర్తికి విరుద్ధంగా, ఆర్థిక వ్యవస్థలో తలదూర్చడం మొదలుపెట్టాయి. అది అంచెలంచెలుగా పెరిగి, పెట్టుబడీదారీ వ్యవస్థ స్వభావ, స్వరూపాలు మారిపోయి అదొక సంక్షేమ–సంగ్రామ రాజ్యం (Welfare - Warfare State)గా సాక్షాత్కరించింది.

ఈ పరిణామ క్రమంలో ఎన్నో సంక్షోభాలు, యుద్ధాలు చవి చూసింది. సంక్షోభం వచ్చిన ప్రతిసారీ దానికి దారితీసిన తన తప్పుడు విధానాలను సమీక్షించుకుని సరిదిద్దుకోవడం మానేసి, ఆ సంక్షోభాన్ని తాత్కాలికంగా మరుగుపరచడానికి మరిన్ని తప్పుడు విధానాలు అవలంబించింది. ఆ విధానాలను సిద్ధాంతపరంగా సమర్థించుకోవడానికి ఆస్థాన మేధోవర్గాన్ని పెంచి పోషించింది కూడా.

అవే విధానాలను తమ ఆయుధ సరఫరాల మీద, తన జేబు సంస్థలైన ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకులపై ఆధారపడే ఇతర దేశాలకు, ముఖ్యంగా మూడో ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసింది. తన దుందుడుకు విదేశాంగ విధానాలతో, ప్రపంచమంతటా జోక్యం చేసుకుంటూ, ఆ జోక్యాలను, ఆధిపత్యాన్ని కొనసాగించడం కోసం సాలీనా లక్షల కోట్ల డాలర్ల ఖర్చుతో అతి పెద్ద సైన్యాన్ని నిర్వహిస్తూ... ప్రపంచంలో శాంతికి పెను ప్రమాదంగా పరిణమించింది.

అధ్యక్షులెందరు మారినా, అమెరికా ప్రభుత్వపు ఈ మౌలిక స్వభావం మాత్రం మారలేదు. డెమొక్రాట్లు, రిపబ్లికన్లు పేరుకు శత్రు పార్టీలైనా... ఎన్నికల ముందు ఎన్ని తేడాలు ప్రదర్శించినా.... ఎన్నికల సమయంలో అభ్యర్థుల మధ్య రెండు, మూడు దఫాలుగా జరిగే ప్రత్యక్ష వాదోపవాదాల్లో ఎవరెంత పటిమ చూపినా సరే; ఒకసారి ఎన్నికయాక ప్రతి అధ్యక్షుడూ ఇంతకాలంగా పెంచిపోషించబడి, కరడు గట్టిన సంక్షేమ – సంగ్రామ వ్యవస్థకు దాసోహమనాల్సిందే.

గత శతాబ్ద కాలంగా ప్రజాస్వామ్యమనే ఆలోచన పరిణామం చెందిన తీరే దీనికి కారణం. ప్రజాస్వామ్యమంటే, రక్తపాత రహితంగా ప్రభుత్వాలను మార్చుకునే ఉపకరణం మాత్రమేననే ఆలోచన నుంచి; ప్రజాస్వామ్యమంటే ప్రజల కష్టాలను తీర్చడమనే దోషపూరిత ఆలోచన – అమెరికాలోనే కాదు, ప్రపంచమంతటా ప్రబలింది. దాంతో ఒక తప్పుడు అవగాహన ఇంకో తప్పుడు ఆలోచనకు, చివరికి అంతా ఒక భ్రమ పూరిత–స్వాప్నిక భావ పరంపరకు – దారితీసింది.

ప్రజల్లో ప్రతి ఒక్కరికీ వివిధ సమస్యలు, కష్టాలు ఉంటాయి. నిజానికి ఎవరి సమస్యలను వారు చేతనైన రీతిలో పరిష్కరించుకోవాలి...; లేదా – ఎవరో ఒకరి స్వచ్ఛంద దాతృత్వంపై ఆధారపడి కష్టాలనుండి గట్టెక్కాలి. దాతృత్వం అనేది ప్రతి మనిషీ అలవరచుకోవల్సిన మంచి లక్షణం. సాటి మనిషి కష్టాల్లో ఉన్నప్పుడు ఎవరికి వారు తమ శక్తి మేరకు సహాయపడడం మానవ జాతి ఉత్కృష్టతకు, సాటి మానవుడి మీద తనకున్న నమ్మకానికి, ఆశావాదానికి తార్కాణం. కానీ ప్రజల కష్టాలను ప్రభుత్వాలు తీర్చాలనుకున్నప్పుడే చిక్కులొస్తాయి.

ప్రభుత్వాలు తమంతట తాము ఏమీ సంపాదించవు. కాబట్టి, సంపాదించే వారి మీద పన్నులు విధించి, బలవంతంగా వసూలు చేస్తాయి. ఆ డబ్బును కష్టాల్లో ఉన్నారనుకున్న ప్రజలకు పంచిపెడతాయి. ఈ డొంక తిరుగుడు ప్రక్రియలో క్రమేపీ చోటుచేసుకునే దుష్ట పరిణామాలేమిటంటే – ఎంత డబ్బు దానం చేయ్యాలో, ఎవరి కష్టం ఏ విధంగా తీర్చడానికి సాయపడాలో దాత (పన్నులు కట్టేవారు) నిర్ణయించడు. గ్రహీత తన ఓట్ల ద్వారా నిర్ణయిస్తాడు! పన్నుల రూపంలో బలవంతంగా కొట్టుకొచ్చి, తనకు పంచిపెట్టమని ప్రభుత్వమనే (నేతలు, అధికార గణం) ఏజెంటుకు అధికారాలు, కొరడా, తుపాకీ అప్పగిస్తాడు.

ఈ క్రమంలో నేతలు, అధికారులు తమ విధుల్లో ఎంత అలసత్వం, నిర్లక్ష్యం ప్రదర్శించినా, ఎంత మింగేసినా, ఎంత వృధా చేసినా గ్రహీత పట్టించుకోడు. తనకు తేరగా 'దానం' అందుతున్నంత కాలం అది ఎలా వచ్చిందో, ఎవరి కష్టం నుంచి వచ్చిందో, ఎన్ని జేబులు, కత్తెరలు దాటుకుని వచ్చిందో తన కనవసరం. కొన్నాళ్ళకు ఆ దానం ఒక హక్కుగా మారుతుంది. దాత ఒక దుర్మార్గుడిగా, దోపిడీదారుగా చిత్రీకరించబడతాడు. ప్రభుత్వాలు..., అనంతంగా ఊడలు దిగేసుకున్న పాలక, అధికార వ్యవస్థలూ – మళ్ళీ పుట్టిన ఏసు ప్రభువు ప్రతిరూపాలుగా కనబడతాయి. లబ్ధిదారులు తదుపరి ఎన్నికలలో తమ మరిన్ని 'సంక్షేమ' హక్కులను తామే ఓట్లేసుకుని నిర్ణయించుకుంటారు.

కొన్నేళ్ళ తర్వాత ఇంకా ఇంకా విశాలమవుతున్న సంక్షేమ పథకాలు, సైన్యాలను నడపడానికి – పన్నురాబడి చాలదు. సంపాదించే వారి నుంచి నొప్పి తెలియకుండా సంపద దోచడానికి కొత్త విధానాలు అవసరమవుతాయి. నాణ్యమైన బంగారు నాణాల స్థానంలో కాగితపు కరెన్సీ ప్రవేశపెడతారు. అవసరమైనప్పుడల్లా ఆ కాగితపు డబ్బును ముద్రిస్తారు. అదీ చాలకపోతే దేశ, విదేశాల నుంచి అప్పులు సేకరిస్తారు. ఇవన్నీ చేసి పెట్టడానికి రిజర్వు బ్యాంకనే వ్యవస్థ ఒకటి ఏర్పాటు చేస్తారు. ఇకంతే. సంక్షేమ పథకాలు ప్రతి ఎన్నికతోనూ విస్తరిస్తాయి. ప్రజల డబ్బుతో తెగబలిసిన ప్రభుత్వాలు చీటికీ మాటికీ ఇతర దేశాలపై కయ్యానికి కాలు దువ్వుతాయి. ప్రజాసంక్షేమం, ఉద్యోగాల కల్పన పేరుతో తమ కిష్టమైన రంగాలకు, పరిశ్రమలకు భూములు, రాయితీలు ఇచ్చి, ప్రోత్సహించి, వాటి లాభార్జనకు తోడ్పడతాయి. దాంతో సంక్షేమ లబ్ధిదారులతో పాటుగా, వారితో ధీటుగా, ఆశ్రిత పెట్టుబడిదారీ వర్గమొకటి తయారై; ఈ దోపిడీ వ్యవస్థకు దన్నుగా నిలబడుతుంది. చూస్తుంటే ఇదేదో భారత దేశ ఆర్థిక, రాజకీయ చరిత్రలా అనిపించినా, ఇదంతా జరిగింది అక్షరాలా అమెరికాలోనే.

అంత తేలిగ్గా మార్చలేనంతగా పాతుకుపోయిన ఈ దుర్వ్యవస్థను కొనసాగించడానికే కంకణం కట్టుకున్న కొత్త తరం వీరుడు – ఒబామా. ఆది, అంతములు తన చేతిలో లేవన్నట్టు నిర్వేదంగా కళ్లు మూసుకొని సాగిపోతున్న అమెరికా – నేడు పతనం అంచున నిలబడి ఉంది. ఒబామా రెండో శకం ముగిసే లోగానే వ్యవస్థ కుప్ప కూలడం ఖాయమనే అంచనాలు పలువురు ఆర్థిక మేధావుల నుండి వినిపిస్తున్నాయి. గత 20 ఏళ్లుగా అమెరికా ఆర్థిక వ్యవహారాల్లో జరిగిన ముఖ్య పరిణామాలను గమనిస్తే విషయ తీవ్రత సామాన్యులకు కూడా తేలిగ్గా అర్థమవుతుంది.

1993లో ఒక ఔన్సు (సుమారు మూడున్నర కాసులు) బంగారం విలువ రెండొందల యాభై డాలర్లు. అదే ధర 1998 వరకు కొనసాగింది. అప్పట్లో వచ్చిన మాంద్యాన్ని తప్పించుకోవడానికి వడ్డీరేట్లు కృత్రిమంగా తగ్గించి కొత్త డాలర్లు కుమ్మరించారు. దాంతో 2003 నాటికి బంగారం ధర మూడొందల పదిహేను డాలర్లకు పెరిగింది. 2001లో ఉగ్రవాదుల దాడుల తర్వాత కమ్ముకున్న మాంద్యం, ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్ యుద్ధాల నేపథ్యంలో డాలర్ల ముద్రణ, అప్పుల సేకరణ ముమ్మరం చేశారు. ఆ కొత్త డబ్బులో సింహభాగం ఇళ్ల నిర్మాణ రంగానికి మళ్ళించారు. దాంతో ఇళ్ల ధరలు అమాంతం పెరిగిపోయి. చివరికి బుడగలా పేలిపోయింది. అది పేలిన 2007 నాటికి; ఔన్సు బంగారం ధర ఆరువందల డాలర్లకు చేరింది. కేవలం నాలుగేళ్ళలో ఎన్ని కొత్త, కృత్రిమ డాలర్లు సృష్టించారో అర్థమవుతుంది. తమ రిజర్వుబ్యాంకు ద్వారా వడ్డీరేట్లను తొక్కిపట్టి, డాలర్లను సృష్టించగా తయారైన (నిర్మాణ రంగ) బుడగ పేలాక కూడా – అమెరికా ప్రభుత్వం వెనక్కు తగ్గలేదు. మొదట జార్జిబుష్, తర్వాత మార్పు తెస్తానంటూ వచ్చిన ఒబామా – ఇద్దరిదీ ఒకటే తీరు.

రోగానికి వేసే మందు చేదుగా ఉంటుంది, ఓటర్లకు రుచించదు కాబట్టి– రోగకారకమైన ద్రవ్యోల్బణ, అప్పుల సేకరణలనే కొనసాగించారు. సరైన సమయంలో చికిత్స చేయకపోవడంతో రోగం ముదిరింది. దాన్ని కప్పి పెట్టడానికి ఇంకా ఇంకా అదే తప్పులు చేస్తూ పోయిన ఒబామా పుణ్యమాని నేడు బంగారం ఔన్సు ధర అక్షరాలా పదిహేడు వందల డాలర్లకు చేరుకుంది. దేశంలో సగం మంది మాత్రమే పన్నులు కడుతున్నారు. నిరుద్యోగం పదిశాతం స్థాయి నుంచి క్రిందకు దిగడం లేదు. రెండు కోట్ల మంది ఉచిత ఆహార కూపన్ల మీద ఆధారపడి బతుకుతున్నారు. ఇంకా ఎన్ని కోట్ల డాలర్లు కుమ్మరించినా, ఆర్థిక వృద్ధి ససేమిరా అంటోంది. శతాబ్ద కాలంగా కొనసాగిస్తున్న ఆర్థిక విధానాల నిర్వాకం ఇది.

ప్రభుత్వం మీద ఇంతలా ఆధారపడిన ఓటర్లు, పాత సంక్షేమ విధానాలనే ఇంకా ఇంకా కొనసాగిస్తానన్న ఒబామాను ఎన్నుకోవడంలో ఆశ్చర్యమేమీ లేదు. కాకపోతే, పెట్రోలు చల్లి మంటలర్పడానికి ప్రయత్నించే విధానాలు చెల్లుబడి కాని పరిస్థితి దగ్గరకొచ్చింది. రాబోయే కొన్నాళ్ళలోనే అమెరికా ప్రభుత్వం తన కోటి కోట్ల డాలర్ల అప్పులకు వడ్డీ చెల్లించలేని స్థితికి రావడం అనివార్యం. అప్పుడిక అప్పులన్నా ఎగ్గొట్టాలి. లేదా మొండిగా డాలర్లు ముద్రిస్తూపోయి ద్రవ్య వ్యవస్థ పూర్తిగా నాశనమన్నా కావాలి.

ఈ రెంటిలో ఏది జరిగినా, బ్యాంకులు దివాళా తీస్తాయి. ప్రజలు దాచుకున్న సొమ్ము, ప్రభుత్వానికిచ్చిన అప్పులు తిరిగిరావు. కష్టజీవులు దాచుకున్న సంపద ఆవిరై, ఒక గొలుసుకట్టు ప్రతిచర్యగా ప్రపంచ ద్రవ్య, ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలే ప్రమాదం పొంచి ఉంది. రాబోయే ఈ మహా సంక్షోభ ప్రళయాన్ని ఎవరూ తప్పించలేరు. దాన్నుంచి ఎవరూ తప్పించుకోలేరు. ఎప్పటికప్పుడు మారుతున్న 'ప్రజాస్వామ్యం' నిర్వచనాన్ని పదే పదే అమెరికా నుంచి దిగుమతి చేసుకునే మన దేశం వంతు కూడా, మహా అయితే కొన్ని సంవత్సరాలు – ముందో.... వెనుకో. అంతే.

11-11-2012

సృజనాత్మక దారిద్ర్యం

సల్మాన్ రష్డీ, ఎం.ఎఫ్.హుస్సేన్, అరవై యేళ్ళ క్రితం అంబేద్కర్ మీద శంకర్ వేసిన కార్టూన్లు, డానిష్ కార్టూన్ల మీద జరిగిన వివాదాలు, ఈ మధ్య ఇంటర్నెట్‌లో వచ్చిన ఒక చెత్త లఘు చిత్రం కారణంగా జరిగిన హింసాకాండలకు పొడిగింపుగా మూడు ముఖ్యమైన సంఘటనలు జరిగాయి. ఒకటి, 'దేనికైనా రెడీ' అనే తెలుగు చలన చిత్రంలో బ్రాహ్మణ పాత్రల కూర్పు, ఆ పాత్రల సంభాషణలు, కొన్ని సన్నివేశాలు బ్రాహ్మణుల వృత్తిని, కులాన్ని అవమానించేదిగా ఉందని, ఆ చిత్రాన్ని నిషేధించాలని ఆందోళనలు జరిగాయి, ఇంకా జరుగుతున్నాయి.

రెండోది, చలం రచనల ఆధారంగా తీశామని చెబుతున్న 'ఉమన్ ఇన్ బ్రాహ్మణిజం' అనే చలన చిత్రం. అది పచ్చి బూతు సినిమా అని; దాన్ని పూర్తిగా నిషేధించాలని పలు డిమాండ్లు వచ్చాయి. ఇంక మూడోది – బాల్‌ఠాక్రే మృతి సంధ్భంగా బొంబాయి నగరంలో జనజీవనాన్ని స్తంభింపజేయడాన్ని నిరసిస్తూ ఇద్దరు యువతులు ఫేస్‌బుక్‌లో సంభాషించు కోగా; వాళ్ళిద్దర్నీ అరెస్టు చేశారు. కోర్టులో ప్రవేశపెట్టగా – వ్యక్తిగత పూచీమీద విడుదలయ్యారు. ఆ యువతుల్లో ఒకరి బంధువులకు చెందిన నర్సింగ్ హోం మీద మూకలు దాడిచేసి, ధ్వంసం చేశాయి.

ఈ సంఘటనలన్నింటి మీదా తీవ్ర వాదోపవాదాలు, చర్చలు, విశ్లేషణలతో మీడియా హోరెత్తుతోంది. కానీ చూసినంత వరకు ఈ విషయాలపై మౌలికమైన తాత్వికత దృష్టి కోణంలో శాస్త్రీయమైన విశ్లేషణ ఎక్కడా కనిపించడం లేదు. ఎవరి వాదం వారు చేసుకుంటూ, ఏదో ఒక పక్షం వహించే వారే తప్ప; వ్యక్తులకు, వివాదంలోని పక్షాలకు అతీతంగా, అందరికీ అన్ని కాలాల్లో... అన్ని విషయల్లో సమంగా అన్వయించగల భావజాల సూత్రాలను ఎవరూ ఎత్తిచూపి; ప్రదర్శించి... గందరగోళంలో కొట్టుమిట్టాడుతున్న సాధారణ ప్రజలకు మార్గదర్శనం చేస్తున్న దాఖలాలు – ఎక్కడా కనబడడం లేదు. దాంతో, ఇలాంటి

వివాదాలు వచ్చిన ప్రతిసారీ; చివరికి భావ గందరగోళంతోనే ముగుస్తోంది. ఇవన్నీ చూసేవారికి, అసలు సృష్టిలో – తప్పులు, ఒప్పులు, మంచి, చెడు, ధర్మం, అధర్మం, నైతికం, అనైతికం అంటూ ఏమీ లేవేమో...; ఎవరికి, ఎప్పుడు, ఏది నచ్చితే, ఏది అనుకూలమైతే తన వరకు అదే సరైనదేమో...; ధర్మం అంతా అనిశ్చితం, ఏ సీసాలో పోస్తే దాని రూపు సంతరించుకునే ద్రవం లాంటిదైనపుడు ఎదుటివారి చర్యలను, మంచి, చెడులు గురించి తీర్పు చెప్పడానికి మనమెవరం అనే నిర్లిప్తతలోకి జారిపోతారు. ఇది సమాజ శ్రేయస్సుకు అత్యంత ప్రమాదకరమైన పరిణామం.

మనిషి స్వేచ్ఛా జీవి. ఇది తనంతట తాను సత్యమైన, అనుభవాతూర్వ (apriori) జ్ఞానం. దీన్ని నిరూపించాల్సిన అవసరం లేదు. నిరూపించడానికి తామ్ర శాసనాలు, మత గ్రంథాలు, రాజ్యాంగాలు అవసరం లేదు. (నిజానికి శాసనాలు, మతాలు, రాజ్యాంగాలు ఈ అనంతమైన సత్యాన్ని కట్టడి చేసేవి మాత్రమే). సృష్టిలో ప్రతి జీవి తన సహజసిద్ధ స్వభావం మేరకు మాత్రమే మనగలుగుతుంది.

మనిషి కూడా తన ప్రకృతిసిద్ధ స్వభావం ప్రకారం స్వేచ్ఛాజీవి. ఆ స్వేచ్ఛకు చేసే ప్రతి కట్టడీ తన జీవించే హక్కుకు వేసే సంకెళ్ళు మాత్రమే. మనిషి తన స్వభావ రీత్యా ఆలోచించగల జంతువు. అంతేకాక మాట్లాడగల జంతువు. తన భౌతిక, శారీరక శ్రమను మాత్రమే కాక, తన ఆలోచనలు, మాటల ద్వారా కూడా ఇతరులకు పనికొచ్చే ఉత్పత్తులను సృష్టించగల సృజనాత్మకత గల ఒక విచిత్ర, ప్రత్యేక జంతువు. కాబట్టి, మనిషి తత్వరీత్యా, భావ ప్రకటన స్వేచ్ఛ అతని జీవించే హక్కులో ఒక విడదీయలేని భాగం. అదే సమయంలో తన స్వేచ్ఛానుభవం ఇతరుల స్వేచ్ఛకు భంగం కలుగజేయకూడదు. ఎందుకంటే తాను స్వేచ్ఛను అనుభవిస్తూ, ఇతరులకున్న సమాన స్వేచ్ఛను గుర్తించకపోవడం తర్కవిరుద్ధం (illogical) అవుతుంది.

భావస్వేచ్ఛకున్న లక్షణమేమిటంటే – దాన్నుపయోగించి ఇతరులను విమర్శించడం భౌతిక దాడిగా పరిగణించలేనిది. కానీ, భావస్వేచ్ఛనుపయోగించుకుని తెలిసి తెలిసీ అబద్ధపు ప్రచారం ద్వారా ఇంకో వ్యక్తి వ్యక్తిత్వానికి గానీ, ధన, మాన, ప్రాణాలకుగానీ హాని చెయ్యడం ఖచ్చితంగా నేరమే. దాన్ని ఇతరుల స్వేచ్ఛకు భంగం కలిగించిన నేరం క్రిందే పరిగణించాలి. ఇప్పటివరకు చెప్పుకున్న తాత్వికతకు, మనిషి ప్రవృత్తికి విరుద్ధమైన చట్టాలు, చర్యలు, ప్రతిచర్యలు, చర్చలు, విశ్లేషణలు అన్నీ హేతువిరుద్ధమే. అవి కాల పరీక్షకు నిలబడవు.

ఈ మధ్య జరిగిన మూడు సంఘటనలను హేతుబద్ధ తాత్విక దృష్టికోణం నుంచి విశ్లేషించడానికి పెద్దపెద్ద చదువులక్కర్లేదు. 'దేనికైనా రెడీ' సినిమా విషయాన్నే

తీసుకుందాం. అందులోని బ్రాహ్మణ పాత్రల కూర్పు, చిత్రీకరణ, సంభాషణలు కొన్ని సన్నివేశాల్లో హాస్యం పండించినా, చాలావరకు ఎబ్బెట్టుగానూ, వెగటుగానూ ఉన్నాయి.

అటువంటి చవకబారు సన్నివేశాల వల్ల సినిమా విలువ మొత్తం మీద తగ్గిందే తప్ప, పెరగలేదు. ఇంతకుముందు కూడా చాలా సినిమాల్లో బ్రాహ్మణ, ఇతర వృత్తుల పాత్రలు చవకబారుగా, అసభ్యకరంగా చిత్రీకరించారు. ఇది చలనచిత్ర రంగంలో నెలకొన్న సృజనాత్మక దారిద్ర్యానికి నిదర్శనం.

వీటన్నిటినీ విమర్శనాత్మకంగా వివరించడం ద్వారా, ప్రజల అభిరుచుల స్థాయిని పెంచడం ద్వారా మాత్రమే మాస్ సినిమాల మేధోస్థాయిని పెంచగలం. తన డబ్బుతో చెత్త సినిమాలు తీసే స్వేచ్ఛ దర్శక, నిర్మాత, నటీనటుల కెంత ఉందో; వాటి చవకబారు తనాన్ని ఎండగట్టే భావ స్వేచ్ఛ – ప్రేక్షకులకు, విమర్శకులకు అదే స్థాయిలో ఉంది.

కానీ, ఒకరి మీద ఒకరు భౌతిక దాడులకు దిగడం తప్పు మాత్రమే కాదు, నేరం కూడా. తమ సినిమాను సమర్థించుకునే హక్కు దర్శక, నిర్మాతలకు ఉంది. అలాగే, లాంఛన ప్రాయంగా పిండప్రదానం వారికి చేసే హక్కు విమర్శకులకూ ఉంది. ఇక ఈ విషయాలపై ఒకరి మీద ఒకరు కేసులు వేసుకోవడం హాస్యాస్పదం. ఆ కేసులు విచారణకు స్వీకరించడం ప్రజా ధనం వృథా. మొత్తంమీద చిత్ర జయాపజయాలను, లాభనష్టాలను డబ్బులిచ్చి టిక్కెట్టు కొనుక్కొని చూసే ప్రేక్షకులకు వదిలేద్దాం.

వేలాది సంవత్సరాల సనాతన ధర్మాన్ని, వేద, శాస్త్ర, పురాణ పాండిత్యాన్ని, సామాన్యులకెవరికీ నోరు తిరగని శ్రావ్యమైన మంత్రోచ్చారణను సంపాదనతో తూయకుండా, ఒక వృత్తిగా కాకుండా, ప్రవృత్తిగా, తమ పూర్వీకులు ఇచ్చిపోయిన జ్ఞానాన్ని, సంప్రదాయాలను, సంస్కారాన్ని కులాలకు అతీతంగా భావితరాలకు అందించాలని తపనపడే వృత్తి బ్రాహ్మణులు – ఈ విషయంలో రోడ్డెక్కడం హిందూ సమాజానికి అత్యంత విషాదకరం. అలాగే, స్వతహాగా సరస్వతీ పుత్రులై, విద్య, ఉద్యోగ రంగాల్లో రాణించే బ్రాహ్మణ ప్రముఖులు కూడా భావావేశాలకులోనై, హేతు విరుద్ధ విశ్లేషణలు చేయడం అందరిలోనూ ప్రబలుతున్న గుంపుస్వామ్య ధోరణికి నిదర్శనం. ముహూర్తం, పురోహితుడు లేకుండా ఏ పని తలపెట్టడానికీ సాహసించని వాళ్ళంతా అదే పురోహితులను మాటల్లో, చేతల్లో, సినిమాల్లో, సాహిత్యంలో అసందర్భంగా అవమానించడం – వాళ్ళ కుసంస్కారానికి ప్రతీక.

ఇదే విశ్లేషణ 'ఉమెన్ ఇన్ బ్రాహ్మణిజం' సినిమాకు కూడా వర్తిస్తుంది. అది నిజంగా బూతు సినిమా అయితే మూడు రోజులు కూడా ఆడదు. ప్రాపంకంతోను,

ప్రభుత్వాన్ని నడిపే పెద్దలను ప్రసన్నం చేసుకుని సెన్సారు బోర్డు సభ్యులయ్యే వారు తమ సర్టిఫికెట్ల ద్వారా సినిమాలను, తద్వారా ప్రేక్షకుల వీక్షణ హక్కులను నియంత్రించడం అత్యంత వైవిధ్యభరిత విషాదం. అమెరికా చిత్ర పరిశ్రమలో లాగా పరిశ్రమ తనంతట తాను ఏర్పరచుకునే రేటింగ్ సంస్థ ద్వారా – ఏ చిత్రం ఏ వయసు వారు చూడగలిగేలా ఉందో, అందులో హింస, అశ్లీలత ఏ స్థాయిలో ఉందో హేతుబద్ధ రేటింగ్‌లు ఇచ్చి ప్రదర్శిస్తే, చూడాలో, వద్దో ప్రేక్షకులు నిర్ణయించుకుంటారు.

పరిశ్రమ ఏర్పరచే సంస్థ మీద నమ్మకం లేకపోతే, స్వచ్ఛంద రేటింగ్ సంస్థలు కూడా పుట్టుకొస్తాయి. కాబట్టి సెన్సారు బోర్డులు, నిబంధనలు పరిష్కారం కాదు, అవి సమస్యలో ఒక భాగం.

ఇకపోతే, బాల్‌ఠాక్రే మరణం సందర్భంగా – బొంబాయి నగరం రెండు రోజుల పాటు స్తంభించిపోయింది. దీన్ని నిరసిస్తూ ఫేస్‌బుక్‌లో రాసిన (రాసుకున్న) పాపానికి ఒకరిని, ఆ కామెంట్ చదివి నచ్చిందన్న పాపానికి మరొక యువతిని బొంబాయి శివారులోని థానే పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు పంపారు. అంతటితో ఆగని శివసేన రౌడీలు ఆ యువతుల్లో ఒకరి బంధువుకు చెందిన నర్సింగ్ హోంను ధ్వంసం చేశారు.

ఇదే మన దేశంలో ప్రజల భావస్వేచ్ఛకున్న విలువ. ఇవీ మన రాజకీయాల స్థాయి. రాజ్యంగం 'ప్రసాదించింద'ని చెబుతున్న ప్రాథమిక హక్కుల రక్షణ కోసం ఏర్పాటైన పోలీసు, న్యాయ వ్యవస్థల పనితీరు ఇదీ!

సముచిత సంఖ్యలో గుంపు కూడితే చాలు; వారి ఆవేశం, ఆక్రోశం, ఫిర్యాదు ఎంత అహేతుకమైనవైనా కావచ్చుగాక...; వారిని ప్రసన్నం చేసుకోవడం కోసం – వ్యక్తుల ధన, మాన, ప్రాణాలను నడిరోడ్డు మీద బలిపెట్టే అనైతికత వాతవరణంలో బతుకుతున్నాం.

దేవుళ్ళను ప్రసన్నం చేసుకునేందుకిచ్చే జంతు బలులను నిషేధించాం. కానీ, గుంపులను సంతృప్తి పరచడానికిచ్చే 'మనిషి బలులను' కొనసాగిస్తున్నాం. ఈ గొర్రెలు వేసే ఓట్లతో ప్రభుత్వాలు... అవి చేసే చట్టాలు... వాటిని తమకిష్టమైనట్లు అమలుచేసే వ్యవస్థలు.... ఎన్నాళ్లిలా?

25-11-2012

నోట్లతో ఓట్ల బదిలీ

దేశంలో 2014 ఎన్నికలకు తెరలేచినట్లే. నగదు బదిలీ పథకంతో దీనికి శ్రీకారం చుట్టారు. గుజరాత్ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల కమిషన్ దీనికి తాత్కాలికంగా బ్రేకులు వేసింది. ఈ నెలాఖరుకు అమలు. వచ్చే కేంద్ర బడ్జెట్‌లో దీన్ని దేశమంతటా విస్తరించడం ఖాయం. ఇంకో పక్క దేశమంతటినీ ఆమ్‌ఆద్మీగా మార్చేసే తురుపుముక్క 'ఆహారభద్రత' పథకం కూడా బడ్జెట్ నాటికి బయటకు తీస్తారు. వీటికి సమాంతరంగా, వృద్ధిరేటు పెంచాలని, కాబట్టి వడ్డీరేట్లు తగ్గించాలని రిజర్వు బ్యాంకు వర్గాల్లో రాగాలు వినిపిస్తున్నాయి. ద్రవ్యోల్బణమనే విషాన్ని సంతృప్తస్థాయికి (ఇదో కొత్త పద ప్రయోగం) పెంచాలని ఆస్థాన విద్వాంసులు శ్రుతి సరిచేస్తున్నారు.

ఇంతటితో అయిపోలేదు. దేశంలో బ్యాంకు ఖాతాలు లేనివారందరితో ఖాతాలు తెరిపించాలని రిజర్వుబ్యాంకు నుంచి అన్ని బ్యాంకులకూ ఆదేశాలందాయి. సరిగ్గా ఎన్నికలకు ముందు ఆ కొత్త ఖాతాల్లో డబ్బులు వేసి చట్టబద్ధంగా ఓట్లు కొనుగోలు చేయడానికి అడుగులు పడుతున్నాయి. ఎన్నికల సంఘం కూడా ఏమీ చేయలేని పద్ధతులను అవలంబించబోతున్నారు.

ఇవన్నీ పాత కాపులు చేసే కొత్త దుర్మార్గాలు.

ఓట్ల కోసం డబ్బును పథకాలు, ఉచిత సేవల రూపాల్లో పంపిణీ చెయ్యడం తప్పేమీ కాదని రాజ్యాంగం, కోర్టులు, మేధావి వర్గాలు ఇప్పటికే తీర్పులిచ్చేశాయి. ఈ విషయంలో ఇతర చర్చకు తావులేదు.

ఇప్పుడు పార్టీల మధ్య పోటీ అంతా ఎవరెంత వినూత్నమైన, ఎవరెంత బరితెగింపు పథకాలను రచిస్తారనే విషయంలో మాత్రమే. ఈ పంపిణీలను ఎవరెంత శ్రావ్యమైన మాటల్లో, ఆకర్షణీయమైన భావజాల ముసుగుల్లో ఆలంకరిస్తారనే దాంట్లోనే– పోటీ. ఆ పథకాలు పేదల పట్ల తమ అంకిత భావంగా ఎంతవరకు నమ్మించగలమనే మార్కెటింగ్ వ్యూహాలపైనే – జయాపజయాలు ఆధారపడతాయి. ఉన్న పిండిని ఎంత

పల్చగా, ఎన్ని రొట్టెలుగా, ఎన్ని ముక్కలుగా విసిరి అత్యధిక ఓట్లుకు గాలం వెయ్యొచ్చో చూసుకుంటారు. దాన్నే రాజకీయ విజ్ఞత, దార్శనికతలుగా – మన మేధావి, మీడియా వర్గాలు కొనియాడుతుంటాయి.

వీటన్నిటికీ డబ్బెక్కడ్నుంచి వస్తుంది? ప్రజల జేబుల్లోంచే (జేబులుకొట్టే సామర్థ్యం, అవకాశాలు, పద్ధతుల్లో – కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య చాలా తేడా ఉంది) కదా!

కానీ పన్నులను ఇష్టమొచ్చినంతగా పెంచే వీలు లేదు. 1970లలో లాగా సంపాదించిన దాంట్లో డెబ్భై, ఎనభై శాతం పన్నులుగా గుంజుకునే అవకాశాల్లేవు. ఆ స్థాయిలో పన్నులు విధించడాన్ని సమర్థించే మేధావులకు కొదవలేనప్పటికీ; పన్నులు కట్టేవారి శాతం పెరగడంతో, అటువంటి చర్యలు తీసుకుంటే ఒకవైపు నికర పన్నుల రాబడి; ఇంకోవైపు ఓట్లు – రెండూ తగ్గిపోయే ప్రమాదముంది.

అసలే పన్నుల రాబడిలో సింహభాగం – అదుపులేకుండా పెరిగిపోయిన ప్రభుత్యోగుల జీతభత్యాలకే పోతోంది. మిగిలిన దాన్ని వీలున్నంత ఎక్కువ మంది ఓటర్లకు పంచిపెట్టాలి. ప్రభుత్వాలకు ఎన్ని కష్టాల్లో.... అనుకుంటారేమో! బయటకు కనిపించే పన్నుల డబ్బుకాక, కనిపించకుండా రక్తం పీల్చే దుర్మార్గపూరిత అస్త్రాలు రెండున్నాయి. ఒకటి– ద్రవ్యోల్బణం; రెండోది అప్పులు. మొదటి అస్త్రం ద్వారా – ఇప్పుడు బ్రతికున్న వారి నుంచి తెలియకుండా పిండుతారు. రెండో దాని ద్వారా – పుట్టబోయే పిల్లల నుంచి దోచుకుంటారు.

పాత రోజుల్లో... ఒక్కో ఓటరుకు పెద్దగా ఖర్చుపెట్టనక్కర్లేని కాలంలో – ఎరువుల, వంటగ్యాసు సబ్సిడీలను మొదలెట్టారు. అప్పట్లో పన్నుల డబ్బులో కొంత భాగం వీటికి సరిపోయేది. క్రమేపీ వాటి భారం కొండంతయింది. బడ్జెట్‌లో సింహభాగం వీటికే ఖర్చవుతోంది. అదీగాక, వీటిని కాలక్రమేణా హక్కులుగా భావించడంతో, కొత్తగా వీటివల్ల ఓట్లురాలే పరిస్థితి లేదు. రాజకీయ పరంగా ఇవి వట్టిపోయిన గేదెలు...; బూడిదలో పోసిన పన్నీరు. కాబట్టి ఈ 'ముసలి పథకాల' కు రిటైర్‌మెంట్ ఇచ్చేశారు. హుషారైన 'కుర్ర పథకాలు' తయారుచేశారు.

ఇప్పుడు కొత్త ఓటరు వర్గాలను టార్గెట్ చెయ్యవచ్చు, కొత్త ఆశలు రేకెత్తించవచ్చు. పాత ఓటర్లు కూడా, ప్రభుత్వం తమను అమాంతం ధనవంతులను చెయ్యడం కోసం ఎంత కష్టపడుతోందో అని సంబరపడతారు. మొత్తం మీద బియ్యం ఖర్చు కన్నా, దాన్ని వండడానికి వాడే గ్యాసు ఖర్చు ఎక్కువ కాబోతోందని వీరి బుర్రలకు తట్టదు.

క్రిందటి ఎన్నికలలో అరవై వేల కోట్ల రుణమాఫీ పథకం ద్వారా కోట్లాది మంది రైతుల ఓట్లను కొన్నారు. అందులో కొంత భారం – కిక్కురుమనే అలవాటు లేని ప్రభుత్వ బ్యాంకులపై మోపారు.

ఎంత చౌక బేరం! ఈసారి నగదు బదిలీ, ఆహారభద్రత, పూచీకత్తులేని బ్యాంకు రుణాలు ఆ పాత్ర పోషించబోతున్నాయి. వీటికి అనుకూలమైన సూచనలు వదులుతూ.... రంగస్థలం సిద్ధం చేస్తున్నారు. లేని వారందరికీ బ్యాంకు ఖాతాలు తెరిపిస్తున్నారు.

బయటకు చూపే కారణాలు వేరు. సమ్మిళిత అభివృద్ధే (Inclusive growth) తమ ధ్యేయమని, పేదలను బ్యాంకింగ్ వ్యవస్థలోకి తీసుకురావడం ద్వారా పేదరికాన్ని నిర్మూలిస్తామనే సుభాషితాలు పలుకుతారు. కానీ, దాగి ఉన్న ఆలోచనేమిటంటే – ఎన్నికలకు కొంచెం ముందు ఈ ఖాతాల్లోకి పది నుంచి ఇరవై వేల రూపాయలు జమచేసి; తద్వారా వారి కుటుంబ సభ్యుల ఓట్లన్నీ చట్టబద్ధంగా, ప్రభుత్వ (ప్రజల) సొమ్ముతో కొనుగోలు చేయడం!

దీనికి 'పేదలకు రుణ సౌకర్యం' అనే ఆమోదయోగ్యమైన పేరుపెడతారు. ఎన్నికల సంఘం మాత్రం ఏం చెయ్యగలదు? ఈ రుణాలకు ఎటువంటి పూచీకత్తు ఉండదు. తిరిగి చెల్లించకపోతే? పోతే బ్యాంకులే నష్టపోతాయి. వాటిని జాతీయం చేసిందే అందుకు కదా! ఎవరైనా చాదస్తులు ఏమైనా అనబోతే 'బ్యాంకు రుణాలకు ధనికులు తప్ప, పేదలు అర్హులు కారా?' అంటూ ఎదురుదాడికి దిగొచ్చు. ఇంతకుముందు ఎన్నిసార్లిలా జరగలేదు?

ఇందిరాగాంధీ కాలం నాటి రుణమేళాలు మొదలు, వ్యక్తిగత పూచీ కూడా లేకుండా వేలకోట్ల బ్యాంకు రుణాలు మైక్రోఫైనాన్స్ సంస్థలకు అతి తక్కువ వడ్డీకి ఇవ్వడం; ఏ ఆధారం లేకున్నా కౌలు రైతులకు రుణాలివ్వాలన్న ఆదేశాలు – ఇవన్నీ మన ఘనత వహించిన రిజర్వుబ్యాంకు పుణ్యాలే. అప్పుడు ఎవరేమనగలిగారు? ఇప్పుడూ అంతే. అదే ప్రైవేటు బ్యాంకులైతే, వాటి వాటాదారులు ప్రశ్నిస్తారు. ప్రభుత్వ బ్యాంకులకు ప్రజలందరూ వాటాదారులే. కాబట్టి ఎవరికీ ప్రశ్నించే హక్కులేదు!

ఇంతకీ ఈ తిరిగిరాని రుణాల వల్ల ఏదైనా ప్రభుత్వ బ్యాంకు దెబ్బతిని, దివాలా దశకు చేరుకుంటే?! ఏం ఫర్వాలేదు. ముందు, బ్యాంకు అధికారులను నిందిస్తారు. ఆనక రుణాలు తిరిగి చెల్లించని పెద్ద పెద్ద ఖాతాదారుల మీద కథనాలు రాయిస్తారు. వారంతా రాజకీయ సంబంధాల వల్లే అప్పులు పొందగలిగారని, అటువంటివారే ఎగ్గొట్టారని ఎవరు అడగాలి, ఎవరు చెప్పాలి? ఇలా కొన్నాళ్ళు డ్రామా నడుస్తుంది. ఆనక, రిజర్వుబ్యాంకు రంగప్రవేశం చేస్తుంది. కావల్సినన్ని నిధులు సర్ది, ఆ బ్యాంకు మునక్కుండా చేస్తుంది. రిజర్వుబ్యాంకు నిధులెక్కడ్నుంచి తెస్తుంది? గాల్లోంచి. కంప్యూటర్‌లో నాలుగు మీటలు నొక్కి, డబ్బును సృష్టిస్తుంది. అదే – ద్రవ్యోల్బణమంటే.

కోట్ల మందికి పూచీకత్తులేని రుణాలిచ్చిన బ్యాంకులు మునక్కుండా – రిజర్వు బ్యాంకు ఆలంబన కావాలి. ఆహారభద్రత పథకం వల్ల రాబోయే లోటు బడ్జెట్‌ను పూరించడానికి రిజర్వుబ్యాంకు ముందుకు రావాలి. ఎన్నికల ముందు మంచి ఆర్థిక అభివృద్ధికి అనువైన వాతావరణమనే భ్రమను కలగజేయాలి. ముందుంది మరింత మంచికాలం అనే ఎండమావులను సృష్టించాలి. దానికి డబ్బును విస్తృతంగా మార్కెట్‌లోకి ప్రవహింపజేయాలి. దానికీ రిజర్వుబ్యాంకు కావాలి. రిజర్వుబ్యాంకు ఏం చేస్తుంది? వడ్డీరేట్లు తగ్గిస్తుంది. బ్యాంకుల ద్రవ్య నిల్వ నిష్పత్తి (సి.ఆర్.ఆర్), చట్టబద్ధ ద్రవ్యత్వ నిష్పత్తి (Statutory Liquidity ratio) తగ్గిస్తుంది. కృత్రిమ డబ్బు ప్రవాహం మొదలవుతుంది. ప్రభుత్వమేమో కొత్త మెగా ప్రాజెక్టులను ప్రకటిస్తుంది. 2009లో ఎన్నికలకు ముందు

వడ్డీరేట్లు అమాంతంగా తగ్గించారు. ఎన్నికలవగానే మళ్ళీ పెంచారు. ఎన్నిరోజుల ముందు ఇవన్నీ చేస్తే ఎన్నికల నాటికి మంచి ఆశావహ వాతావరణం ఏర్పడుతుంది? అది మార్కెట్‌లోని వివిధ వర్గాల్లోకి కొత్త డబ్బు చొచ్చుకుపోయే వేగాన్ని బట్టి ఉంటుంది. ఆ లెక్కలన్నీ వేసి ముహూర్తాలు నిర్ణయించడానికే – ఆస్థాన ఆర్థిక సలహాదారుల బృందాలుంటాయి.

ఈ విచ్చలవిడి డబ్బు సృష్టి వల్ల – జరిగేది ధరల పెరుగుదల. కానీ డబ్బును మార్కెట్‌లోకి వదిలిన కొన్ని నెలల తర్వాత గానీ ధరల పెరుగుదల కనిపించదు. ఈలోగా ఎన్నికలయిపోతాయి. తిరిగి గెలిస్తే; ధరలు పెరిగిన నేరాన్ని వ్యాపారుల మీదో, అంతర్జాతీయ పరిస్థితుల మీదో నెట్టవచ్చు. ఓడిపోతే, ధరలు పెంచారన్న ఆరోపణలతో కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వాన్ని చీల్చి చెండాడవచ్చు – మొత్తంమీద ఈ హస్తనైపుణ్యం ఎంత సులువో, అందులో రిజర్వు బ్యాంకు పాత్ర ఎంత ముఖ్యమో చూడండి. వీటి లోతుపాతులు స్వయానా ఆర్థిక వేత్త, ఒకప్పటి రిజర్వుబ్యాంకు గవర్నరైన ప్రధానమంత్రి కన్నా ఎక్కువ ఎవరికి తెలుస్తాయి? రిజర్వుబ్యాంకు చేసే ఈ "దుర్మార్గపు ద్రవ్యోల్బణం" వల్ల డబ్బును డబ్బు రూపంలో దాచుకున్నవారు, అప్పులిచ్చినవారు, స్థిరాదాయంతో బతికే పెన్షనర్లు, వేతనజీవుల జేబులకు చిల్లులు పడతాయి.

*ఎందుకంటే రూపాయి విలువ పడిపోతుంది. ఇది చాలదన్నట్లు, దేశీ, విదేశీ మార్కెట్ల నుంచి ప్రభుత్వం చేసే అప్పులు, వాటిని రిజర్వుబాంకు ద్రవ్యీకరించడం **(Monetization)** ఇంకా దుర్మార్గం. అవి ఎప్పటికీ తీరవు. వడ్డీ కట్టడానికి ఏటా మరిన్ని అప్పులు తెస్తారు. ఈ భారమంతా పుట్టబోయే పిల్లల మీద పడుతుంది. అంటే నేటి ఓటర్లకు పంచిపెట్టడానికి – ఇంకా పుట్టని పిల్లల నుంచి పన్నులు వసూలు చేస్తున్నారు.*

తల్లిదండ్రులు పిల్లలకు ఆస్తులు సంపాదించి పెట్టాలని ఆరాటపడతారు. మన ప్రభుత్వాలు – వాళ్ళకు అప్పులు బదిలీ చేస్తున్నాయి. ఎంత విషాదం! ఇంకా విషాదమేమిటంటే; ఎవర్ని నిందించాలో తెలియని పరిస్థితి. ఆర్థిక వ్యవస్థ ఈ రకంగా క్రమేపీ ఛిన్నాభిన్నమయ్యేసరికి ఈ నాయకులు ఉండరు, పార్టీలు ఉండకపోవచ్చు, ఈ మేధావులూ ఉండరు. ఇది నగదు బదిలీనా, లేక రుణ బదిలీయా? ఇది ఆహారభద్రతా లేక ఆర్థిక వినాశన గ్యారంటీయా?

ఓటర్లలోని ఇంతటి అమాయకత్వానికి, బోళాతనానికి సంతోషించని రాజకీయ నాయకుడుంటాడా? ఓటర్లకు తమ జేబులు ఖాళీ అవుతున్న సంగతి పట్టదు. డిసెంబరు 28న అఖిలపక్ష సమావేశంలో ఏం జరగబోతోందోనన్న ఉత్కంఠతో ఒక నెల గడిచిపోతుంది. ఎంతసేపూ టీవీ సీరియల్‌లో రేపు ఏం జరుగుతుందోననే ధ్యాసే తప్ప, తాము కష్టపడి సంపాదించుకున్న దాన్ని రాజకీయ నాయకులు దోచుకెళ్ళలేని స్వేచ్ఛాయుత రేపటి కోసం ఆకాంక్ష అనేది కానరాదు.

విచక్షణ, వివేచన లేకపోతే విముక్తి అసాధ్యం.

09-12-2012

రాజ్యం - స్వీయ రక్షణ

అమెరికాలోని ఒక స్కూల్లో జరిగిన మారణకాండ ప్రపంచాన్నంతా నివ్వెరపరచింది. ఆ స్థలాన్ని సందర్శించిన ఒబామా కూడా కళ్ళనీళ్ళ పర్యంతమయ్యారు. ఇలాంటి ఘటనలు అమెరికాలో అడపా దడపా జరుగుతూనే ఉంటాయి. ఇలా జరిగిన ప్రతిసారీ అమెరికాలోని పౌరులు విచ్చలవిడిగా తుపాకులు కలిగి ఉండడం, బహిరంగంగా ధరించి తిరుగుతుండడం, వాడడం గురించి అమెరికాలోనే కాక ఇతర దేశాల్లో కూడా చర్చలు జరుగుతుంటాయి. తుపాకుల పరిశ్రమ ఒత్తిళ్ళకు తలొగ్గి అమెరికా ప్రభుత్వం పౌరుల ఆయుధ వాడకాన్ని నియంత్రించడం లేదని; బడా పరిశ్రమల ముందు ఎంత పెద్ద రాజ్యమైనా దాసోహమనవలసిందేననే వ్యాఖ్యానాలు వినిపిస్తుంటాయి. కానీ అలాంటి విశ్లేషణలు చరిత్రపరంగానూ, నైతికంగానూ, తార్కికంగానూ సరికావు.

వ్యక్తిగత రక్షణ కోసం తుపాకులు కలిగి ఉండడం, ధరించడం అమెరికా పౌరులకు రాజ్యాంగపరంగా కలిగిన హక్కు. రెండవ రాజ్యాంగ సవరణ ద్వారా ఆ హక్కును మరింతగా బలపరచుకున్నారు. చారిత్రకంగా – అమెరికా ఒక రాజ్యంగా ఏర్పడిన సమయంలో – అది వ్యక్తి హక్కులు, స్వేచ్ఛల పునాదుల మీద నిర్మాణమయింది. ఆ 'హక్కులు, స్వేచ్ఛలను కాపాడ్డం కోసం మాత్రమే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుంటున్నాం' అని కూడా రాసుకున్నారు. ప్రజాస్వామ్యం దారితప్పి, రాజకీయాలు, ఓట్లవేటలో గత సుమారు వంద సంవత్సరాలుగా క్రమేపీ ప్రజాకర్షక సోషలిస్టు విధానాల వైపు పరుగులు తీసి, అన్ని విధాలుగా ఇప్పుడు పతనం అంచుకు చేరింది గానీ; అది వేరే విషయం.

పౌరులు తుపాకీ కలిగి ఉండడాన్ని, ధరించడాన్ని ఒక పవిత్రమైన హక్కుగా భావించడానికి కారణాలున్నాయి. మొదటిది ప్రతి వ్యక్తికీ తనను తాను రక్షించుకునే హక్కు జన్మత: సిద్ధిస్తుందనే భావన కేవలం ప్రకటనలకు పరిమితమవ్వక, వారంతా మనసా వాచా నమ్ముతారు; ఆచరిస్తారు. రెండోది, ముఖ్యమైన, ఆశ్చర్యకరమైన కారణం

ఇంకోటుంది. అమెరికా ప్రభుత్వాన్ని స్థాపించి, రాజ్యాంగాన్ని రాసిన మూలపురుషుల భావాల ప్రకారం, కట్టుదిట్టంగా అదుపు చేస్తే తప్ప రాజ్యం ప్రజల హక్కులను కబళించేస్తుందని. కాబట్టి ఆయుధ ధారులైన ప్రజలు మాత్రమే రాజ్య దౌష్ట్యాన్ని నివారించగలరు, నిలువరించగలరు... అని. అవసరమైతే ఎదిరించగలరు అని. అందుకే ఆయుధాలు కలిగి ఉండడం ప్రజల అత్యంత ప్రాథమిక హక్కుగా గుర్తించారు.

ఆ ఆయుధాలతో తమ ధన, మాన, ప్రాణాలను రక్షించుకోవడమే కాక; అవసరమైతే రాజ్యాన్ని కూడా సాయుధంగా ఎదుర్కోగల సత్తా పౌరులకు ఉంది కాబట్టే అమెరికా ప్రభుత్వాలు ఒక స్థాయిని దాటి ప్రజల జీవితాల జోలికెళ్ళవు. కాకపోతే, స్కూలు మారణకాండ లాంటి సంఘటనలు జరిగినప్పుడల్లా ఆయుధాల విషయంలో ఏదో ఒక కొత్త నియంత్రణ తేవడం జరుగుతుంది. కొన్ని రాష్ట్రాల్లో ఆయుధాలు కలిగి ఉండడానికి లైసెన్సు పొందాలి. కొన్ని రాష్ట్రాల్లో నయితే, మందుగుండ్లు కొన్నప్పుడల్లా పేరు, ఊరు, వివరాలు చెప్పాలి. అంతవరకే.

చాలామంది, అమెరికాలో నేరాల సంఖ్యను, నేరాల తీవ్రతను ఇతర దేశాలతో పోలుస్తూ, ప్రజల దగ్గర్నుంచి ఆయుధాలను పూర్తిగా తీసేయాలంటారు. అందుకు రకరకాల గణాంకాలు చదువుతారు. కానీ మనుషులు వారి వారి ధన, మాన, ప్రాణాలను రక్షించుకునే హక్కును గణాంకాల దృష్టితో చూడకూడదు. నైతికత, ప్రాకృతిక, ప్రాథమిక హక్కుల దృష్టితో మాత్రమే చూడాలి. ప్రస్తుత దృష్టాంతాన్ని పరిశీలిస్తే, ఈ సంఘటన జరిగింది ప్రభుత్వ పాఠశాలలో. పాఠశాలల్లో టీచర్లుగానీ, తల్లిదండ్రులుగానీ, భద్రతా సిబ్బందిగానీ ఆయుధాలు కలిగి ఉండరాదని ప్రభుత్వం కఠిన నిబంధనలు పెట్టింది. అందువల్ల ఉన్మాదుల చేష్టలను నిరోధించడానికి, సమయానికి అడ్డుకోవడానికి అవకాశం లేకుండా చేసింది.

ఎవరైనా 'మా ఇంటికి తాళాలు వెయ్యము' అని ఇంటి బయట బోర్డు తగిలిస్తే– ఆ ఇంటికి భద్రత ఎంత ఉంటుందో, ఇలాంటి నిబంధనల వల్ల స్కూళ్ళకు, అందులోని పిల్లలకు అంత భద్రత ఉంటుంది.

ప్రభుత్వాలు అనవసరమైన పనులు అసలు పెట్టుకోకూడదు. పెట్టుకున్నంత మేరకు – ప్రజల పన్నుల డబ్బుతో నడిచే ప్రభుత్వాలు తను చేసే పనులను సమర్థంగా నిర్వహించాలి. లేని పక్షంలో నాసిరకం, కల్తీ మందులు వాడినట్లుగా 'సొమ్ముపోయే, శని పట్టే' అన్నట్లుగా తయారవుతుంది. ప్రజలు ఆయుధాలు కలిగి ఉండడమే ఇటువంటి ఘటనలకు కారణమనుకోవడం హ్రస్వదృష్టికి నిదర్శనం.

దుండగులు, ఉన్మాదులు ఎప్పుడూ లైసెన్సు తీసుకుని మారణాయుధాలు

ఉపయోగించరు. ఎదుటివారు అశక్తులు, తమను తాము రక్షించుకోలేరని అనుకున్నప్పుడు ఇంకా తేలిగ్గా ఘాతుకాలకు పాల్పడతారు. అంతెందుకు! సుమారు సంవత్సరం క్రితం నార్వేలో జరిగిన ఉన్మాది కాల్పుల్లో విహారయాత్రకెళ్ళిన ఎనభై మంది మరణించారు. అక్కడ అమెరికాలో లాగా పౌరులు ఆయుధాలు ధరించరు. ఉన్మాది వాడింది లైసెన్సున్న తుపాకీ కాదు. సమాజమన్నాక మతిలేని వాళ్ళు, గతి తప్పిన వాళ్ళు ఉండకుండా ఉండరు. అటువంటి వారి బారిన పడకుండా ఉండాలంటే; వీలైనంత ఎక్కువమంది తగిన ఆయుధాలతో స్వీయ రక్షణ చూసుకోగలగాలి. అప్పటికీ తప్పించుకు పోయేవారిని పరిశోధించి, వెతికి, పట్టుకుని, త్వరితంగా శిక్షించే యంత్రాంగాన్ని ప్రభుత్వాలు నడపాలి. ప్రభుత్వాల ప్రథమ, అసలు బాధ్యత అదొక్కటే.

అమెరికా సంగతి అలా ఉంచితే; మనదేశంలో పరిస్థితి మహా దయనీయం. ఢిల్లీలో జరిగిన హేయమైన అత్యాచారం సంఘటన దృష్ట్యా, ఎవరికి తోచిన ఆందోళనలు వారు చేస్తున్నారు. కనిపించే పోలీసుల వైఫల్యాన్ని దాటి చర్చ ముందుకెళ్ళడం లేదు. క్రింది కోర్టుల్లో కొన్ని కోట్ల కేసులు, హైకోర్టులో కొన్ని లక్షల కేసులు, సుప్రీం కోర్టులో కొన్ని వేల కేసులు సంవత్సరాల కొద్దీ పెండింగ్‌లో ఉన్నాయి. అత్యాచారం చేసి హత్యచేసిన కేసుల్లో – సుప్రీంకోర్టులో కూడా ఖరారైన మరణశిక్షలను – రాష్ట్రపతులు అలవోకగా జీవిత ఖైదులుగా మార్చేస్తున్నారు. ఇక దుండగులకు శిక్ష పడుతుందేమోనన్న భయం, భక్తి ఎక్కడ్నుంచి వస్తాయి?

కేవలం పదిమంది కానిస్టేబుళ్ళకిచ్చే జీతభత్యాలతో ఒక పూర్తిస్థాయి న్యాయస్థానాన్ని నడపవచ్చు. జలయజ్ఞాలకు, సబ్సిడీలకు తగలేసే డబ్బుతో పోలిస్తే, సరిపడా న్యాయస్థానాలు ఏర్పాటు చేయడానికి ఎంత ఖర్చవుతుందని? అకారణమైన, నిందితులకు ఉపయోగపడే – కేసు వాయిదాలను తగ్గించడానికి బ్రిటీష్ వారి కాలం నాటి చట్టాలను సంస్కరించబోతే... న్యాయవాదుల నుంచే తీవ్ర నిరసనలు!

మనదేశంలో పౌరుల స్వీయ రక్షణ అవకాశాలు కనుచూపు మేరలో కనిపించడం లేదు. ఇక్కడ గన్ లైసెన్సులు – కేవలం రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు, సినిమా స్టార్లు, ఎప్పుడూ విమానాల్లో తిరిగే ధనిక పారిశ్రామిక వేత్తలకు మాత్రమే ఇస్తారు. వీరిలో ఎవరికీ స్వీయ రక్షణ అవసరాలు అంతగా ఉండవు. సామాన్యులెవరైనా లైసెన్సుకు దరఖాస్తు చేస్తే; హంతకుణ్ణి చూసినట్టు చూస్తారు. తనకు తుపాకీ ఎందుకు అవసరమో నిరూపించుకొమ్మంటారు. తుపాకీ కలిగి ఉండి, స్వీయ రక్షణ చేసుకోవడం పౌరుని హక్కు అని; లైసెన్సు ఎందుకివ్వరో కారణాలు చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేననీ గ్రహించరు. ఒకవేళ అతి కష్టం మీద లైసెన్సు తెచ్చుకున్నా...; కొనుక్కుందామంటే

మార్కెట్‌లో తుపాకులు దొరకవు. సర్కారీ తయారీ నాసిరకం తుపాకీ కోసం – కొన్ని సంవత్సరాలు వెయింటింగ్ లిస్టులో ఉండాలి. అది కూడా మామూలు ప్రజలకు అందుబాటులో లేనంత ధర. ఇతర దేశాల నుంచి తెచ్చుకునే, తెప్పించుకునే వీలు అస్సలు లేదు. ఇన్నిరకాల నిబంధనల, నియంత్రణల చట్రాలతో ప్రజలను నిరాయుధులుగా, తమ రక్షణ కోసం పూర్తిగా రాజ్యం మీద ఆధారపడేలా చేయడమే ప్రభుత్వాల లక్ష్యం. ఇటువంటి పరిస్థితుల్లో ఢిల్లీలోనైనా, ఇంకెక్కడైనా, యువతులకైనా, యువకులకైనా, పెద్దమనుషులకైనా, పాదచారులకైనా భద్రత ఎలా ఉంటుంది?

ప్రభుత్వాల్లో నియంతృత్వ ధోరణులు, సామాజిక, ఆర్థిక రంగాల్లో రాజకీయ, ప్రభుత్వ జోక్యం పెరిగిన కొద్దీ ప్రజల బలవంతపు నిరాయుధీకరణ ప్రక్రియ కూడా ఎక్కువవుతుంది. ఎందుకంటే సాయుధులైన ప్రజలు నియంతలకెప్పుడూ పక్కల్లో బల్లాలే. జర్మనీలోని యూదులు సాయుధులై ఉండుంటే; నాజీలు ఆ రకమైన మారణకాండకు పూనుకోగలిగేవారా? ఉక్రెయిన్‌లో రైతులు సాయుధులైతే స్టాలిన్ హత్యాకాండ సాధ్యమయ్యేదా?

ఇన్నేళ్ళుగా నిరాయుధంగా బ్రతుకుతూ, ఏ ఉద్యమకారుడికి ఎప్పుడే ఉన్మాదం వచ్చినా మనమీద రాళ్ళు పడకుండా పక్కకు తప్పుకుని పోవడానికి, ఇళ్ళమీద దాడులు చేసినా మౌనంగా భరించి, ఏమీ పట్టించుకోని ప్రభుత్వాన్ని, పోలీసులను తిట్టుకోవడంతో సరిపెట్టుకోవడానికి అలవాటు పడిన మనకు, సాయుధంగా ఎవరికి వారు ఆత్మరక్షణ చేసుకోవచ్చనే భావనే ఆశ్చర్యం కలిగిస్తుంది.

ముచ్చటగా మూడోసారి మూడింట రెండొంతుల మెజారిటీతో నెగ్గిన నరేంద్రమోడీ ప్రధానమంత్రి పదవికి పోటీపడతారనే ఊహాగానాల నేపథ్యంలో 2002 నాటి గుజరాత్ మారణకాండను అందరూ జ్ఞాపకం చేసుకున్నారు. గుజరాత్ ప్రజల్లో అధిక భాగం సాయుధులై, తమ స్వీయరక్షణ సామర్థ్యం కలిగిన వారై ఉంటే మతం పేరిట ఒకరినొకరు అంత పైశాచికంగా చంపుకునే వీలుండేదా? కావాలనే చేష్టలుడిగి చోద్యం చూస్తూ నిల్చున్న రాజ్య యంత్రాంగాన్ని రక్షణ కోసం దేబిరించాల్సిన అవసరం కలిగేదా? సాయుధుడై తనని తాను రక్షించుకోవడం మనిషి జన్మహక్కు.

23-12-2012

వాచాలతకు విరుగుడు

చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే ఆదిలాబాద్ జిల్లా నిర్మల్‌లో గత నెల 22న ఇచ్చిన ఉపన్యాసం దేశమంతటా ప్రకంపనలు పుట్టిస్తోంది. అంతకుముందు డిసెంబర్ 8న నిజామాబాదు పట్టణంలో కూడా అదే రకమైన ఉపన్యాసమిచ్చారు. ఆ ఉపన్యాసాలలో ఉన్న విషపూరిత వ్యాఖ్యలను మీడియా తనంతట తాను పట్టించుకోలేదు. పూర్తి నిడివి ఉపన్యాసాలు అంతర్జాలంలోని యూ ట్యూబ్‌లో విస్తృతంగా ప్రచారం పొందగా, ఈ విషయాన్ని ఒకట్రొండు జాతీయ ఇంగ్లీషు ఛానెళ్ళు సీరియస్‌గా తీసుకొని చర్చాగోష్ఠులు నిర్వహించాక; స్థానిక మీడియా కూడా అంది పుచ్చుకుంది. అన్ని మతస్థుల నుంచీ అక్బరుద్దీన్ వ్యాఖ్యలపై ఖండనలు వెల్లువెత్తాయి. ఆయన మీద ఎడాపెడా కేసులు నమోదయ్యాయి. నోటీసులు జారీ అయ్యాయి. శరవేగంగా చోటుచేసుకుంటున్న ఈ పరిణామాలు కొన్ని ముఖ్యమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. అసలాయన ఏమన్నాడు? అన్నమాటల్లో నిజమెంత, అబద్ధపు అన్వయింపులెంత? ఆయన అన్న మాటలకు కేసులు పెట్టడం సబబేనా? పాలకుల ద్వంద్వ ప్రమాణాలు, సమయానుకూల ఆత్మాశ్రయ (సబ్జెక్టివ్) నిర్ణయాల వల్ల సమాజానికి జరిగే నష్టమేమిటి?

ఆయన ఉపన్యాసంలోని తీవ్ర వ్యాఖ్యలు ముస్లిం సమాజాన్ని, ముస్లిం ఓటర్లను ఆకర్షించడానికి ఉద్దేశించబడినవన్నది సుస్పష్టం. వారి పార్టీని ఆంధ్రప్రదేశ్‌లోని హైదరాబాదేతర ప్రాంతాలకు, దేశంలోని ముస్లిం కేంద్రీకృత ప్రాంతాలకు విస్తరించే ప్రణాళికలో ఇదొక భాగంగా కనబడుతోంది. ఆయన వ్యాఖ్యల్లోని సారాంశంలోకి పోయేముందు, ఆయనకున్న మాట్లాడే స్వేచ్ఛను అందరూ అంగీకరించాల్సిన అవసరం ఉంది. ఎవరి మీదో కోపంతోనో, ఎవరో మరీ అతిగా మాట్లాడారనో, మాట్లాడే స్వేచ్ఛకు సంకెళ్ళు వెయ్యబూనడం సమాజానికి దీర్ఘకాలంలో శాశ్వత చేటు తెస్తుంది. ఆయన వ్యాఖ్యల వల్ల కలత చెందిన వారు – అంతే పదునైన మాటల్లో వాటిని ఖండించొచ్చు.

ఆయన వ్యాఖ్యల్లోని నిజానిజాలను, హేతుబద్ధతను విశ్లేషణా పూర్వకంగా ప్రశ్నించవచ్చు. అది నాగరిక సమాజ లక్షణమనిపించు కుంటుంది.

కానీ, ఆయన వ్యాఖ్యల వల్ల ప్రేరేపితులై ఎవరైనా హింసకు పాల్పడితే – ఆ హింసకు పాల్పడిన వాళ్ళను బాధ్యుల్ని చెయ్యాలే తప్ప వ్యాఖ్యాతలను నేరుగా బాధ్యుల్ని చేయ్యలేం. ఎందుకంటే వ్యక్తి తన చేష్టలకు, చర్యలకు తానే పూర్తి బాధ్యత వహించాలి. ఒకవేళ ఎవరైనా కత్తులు, కటార్లు ఇచ్చి హింసకు పురికొలిపి పంపినా, లేక దగ్గరుండి ప్రోత్సహిస్తూ హింస జరిపించినా వాళ్ళు సహజంగానే నేరంలో భాగస్వాములవుతారు.

ఈ విధంగా, వ్యక్తులు ఎవరిపట్లయినా హింసను మొదలెడితే; దానికి వారే వ్యక్తిగతంగా పూర్తి బాధ్యత వహించాలి. ***కులం, మతం, ప్రాంతం, పార్టీ, భావజాలాలు– హింసను చట్టబద్ధం, ధర్మబద్ధం చెయ్యజాలవు. హింసకు పాల్పడితే ఖచ్చితంగా శిక్షింపబడతామనే నమ్మకం కలిగినప్పుడు మాత్రమే శిక్షాస్మృతుల పట్ల భయం, భక్తి ఉంటాయి. అంతేగాని ఏదో ఒక ఉద్యమమో, కులమో, మతమో, భావజాలమో సాకుగా నలుగురితో కలిసి పాల్పడే హింస – శిక్షింపబడక పోవడమే కాక, తమను హీరోలుగా, నాయకులుగా తయారుచేస్తుందనే భావనే – గుంపు హింసలకు ప్రధాన కారణం.***

అక్బరుద్దీన్ వ్యాఖ్యల్లో మధ్యయుగాల్లోని ముస్లిం పాలన, అప్పటి భారతదేశ రాజ్యాలపై మధ్యప్రాచ్య ముస్లిం సేనల విజయాలు, ఇస్లాం పాలనలోని స్వర్ణయుగం, ముస్లిం రాజులు, చక్రవర్తులు కట్టిన కట్టడాలు, స్మారకాల గురించి పలు ప్రస్తావనలున్నాయి. అతి తక్కువ మంది గల సైన్యాలతో ఆక్రమణదారులు అప్పటి స్థానిక రాజుల సేనలపై విజయాలు సాధించి ఉండవచ్చు. దానికి వారి సైనిక పాటవం, సైనిక సాంకేతిక పరిజ్ఞానం, స్థానిక రాజుల మధ్య ఉన్న పరస్పర వైరాలు, ఆక్రమించే సైన్యాల్లో సహజంగానే ఉండే అధిక ప్రేరణా స్థాయి, పట్టుదలలు కారణాలు కావచ్చు.

కానీ, శతాబ్దాల క్రిందట జరిగిన ఆక్రమణలను, ఆక్రమణదారులు సాగించిన దారుణ మారణకాండలను, ఆక్రమిత ప్రజల్ని బానిసత్వంలోకి నెట్టిన వైనాలను, నడ్డివిరిగేలా పన్నులు విధించి, ఆ సంపదతో చేపట్టిన రాజ్య విస్తరణలు, పెద్ద పెద్ద కోటలు, స్మారకాలు, సమాధుల నిర్మాణాలను, వారి జనానాల్లోని ఉంపుడు స్త్రీల సంఖ్యలను సంబరంగా చెప్పుకోవడం – అర్థరహితమే కాక; అది ఒక వ్యాధిగ్రస్థ మానసిక స్థితిని సూచిస్తుంది.

తన కులస్తులనో, మతస్తులనో సంఘటిత పరచి రాజకీయ శక్తులుగా తయారు చెయ్యడమే ఒక ప్రమాదకరమైన పరిణామం. చరిత్రలను తవ్వి, అప్పుడు జరిగిన అన్యాయాలకు ముసుగులు తొడిగి, గత కీర్తులను, గత రాజ్యాల ఔన్నత్యాలను అతిశయోక్తులతో నింపి గుంపులకు నాయకత్వం వహించే ప్రయత్నాలు – ఇంకా ప్రమాదకరం. ఒకరిని చూసి

మరొకరు పోటీపడి ఈ గుంపు సంస్కృతులను ప్రోత్సహించడమే – నేటి సమాజంలోని పలు సమస్యలకు మూల కారణం.

మన పూర్వీకులు అందించిన సంస్కృతి, సాంకేతికత, శాస్త్రాలు, ఆస్తులు, ఐశ్వర్యాల పట్ల మనం గర్వపడొచ్చు. కానీ ఆ కాలాల్లో సాగిన అన్యాయాలకు ఈరోజు మనం బాధ్యత పడలేం. సున్నాను కనిపెట్టిన భారతదేశ పరిజ్ఞానాన్ని, సంఖ్యాశాస్త్రాన్ని ముందుకు తీసుకెళ్ళిన మధ్యప్రాచ్యాన్ని, అత్యద్భుత భౌతిక శాస్త్ర ఆవిష్కరణలు చేసిన యూరప్‌ను తలచుకుని సంబరపడదాం. కానీ అమానుషమైన కుల వ్యవస్థలను, ఆక్రమణల పర్వంలో కొనసాగిన మానవ హననాలను, సామ్రాజ్యవాదాలను, బానిస వ్యవస్థలను, భూస్వామ్య వ్యవస్థలను మాత్రం హర్షించలేం.

కసబ్ గురించి అక్బరుద్దీన్ చేసిన వ్యాఖ్యలు; కసబ్‌ను నరేంద్రమోడీతో పోల్చడాన్ని ఆయన విజ్ఞతకే వదిలెయ్యాలి. అదీగాక టెర్రరిస్టులను కీర్తించడం రాజకీయ పార్టీలకు కొత్తకాదు. జమ్మూ–కాశ్మీర్‌లో కొన్ని సంవత్సరాల క్రితం కాల్పుల్లో మరణించిన ప్రతి టెర్రరిస్టుకూ పూలదండలు వేసి సత్కరించిన పార్టీలున్నాయి. ఖలిస్థాన్ ఉద్యమ సమయంలోనూ అదే జరిగింది. ఈ మధ్య ఒక సీనియర్ రాజకీయ నాయకుడు పార్లమెంటులో మాట్లాడుతూ ఒసామా బిన్ లాడెన్‌ను ; 'ఓసామా జీ' అని సంభోదించడం నివ్వెరపరిచింది.

ఇలాంటివెన్నో. కాబట్టి, అక్బరుద్దీన్‌కు తాను చెప్పదలుచుకున్నది చెప్పే పూర్తి స్వేచ్ఛ ఉండాలి. ఆయన చెప్పిన మాటలు విన్నవారు వ్యక్తులుగా తమ తమ విశ్లేషణలతో నిర్ణయాలకు రావాలి. అంతే తప్ప; అక్బరుద్దీన్ లాంటి రాజకీయ నాయకుల మీద కేసులు పెట్టి, వారి నోటికి తాళం వేసినంత మాత్రాన ఆయన భావాలు ప్రజల్లో వ్యాపించకుండా మానవు. అంతర్గత, రహస్య భావవ్యాప్తి కన్నా, బహిరంగ వ్యాఖ్యలు... ప్రతి వ్యాఖ్యలు; చర్చలు, విశ్లేషణలే ప్రజల రాజకీయ ఆరోగ్యానికి ఆమోదయోగ్యమైనవి.

ఇక ద్వంద్వ ప్రమాణాల విషయానికొస్తే, ప్రభుత్వాల తీరు హాస్యాస్పదం, అత్యంత ఆక్షేపణీయం. రాజకీయ అవసరాలకు పనికొచ్చినన్నాళ్ళూ మజ్లిస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏం చేసినా చెల్లుబాటయ్యింది. వారి చర్యలను సుతిమెత్తగానైనా ఆక్షేపించిన మత పెద్దలను అత్యంత గర్హనీయంగా అవమానించినా; తమపై వ్యతిరేకంగా రాసినందుకు వార్తాపత్రిక ఎడిటర్లను బహిరంగంగా చితగ్గొట్టినా ....; చట్టాన్ని తన పని తనను చెయ్యనివ్వలేదు. అంతెందుకు, అభ్యుదయ భావాలున్న రచయిత్రి తస్లీమా నస్రీన్ ప్రెస్‌క్లబ్‌లో జర్నలిస్టులతో ఇష్టాగోష్ఠి కార్యక్రమం నిర్వహించడానికొస్తే, పెద్ద ఎత్తున సముహాలతో దాడిచేసి, ఆమెను రాయలేని బూతులు తిట్టి, వెళ్ళగొట్టడమే కాక ఆమెపై ఎదురు కేసులు బనాయించిన వైనం మరచిపోదగింది కాదు. అలాగే మజ్లిస్ శాసనసభ్యుడు ఒక అక్రమ

భవనాన్ని కూలగొడుతున్న మునిసిపల్ సిబ్బందిపై దాడిచేసి, గాలిలో కాల్పులు జరిపి, వారి పనిని ఆపించడమే కాక వారిపై ఎదురు కేసులుపెట్టి, వారి చేత క్షమాపణలు చెప్పించుకున్న దౌష్ట్యం నిన్న, మొన్నే జరిగింది. అలా ప్రత్యక్ష హింసలను ఆపకపోగా, శిక్షింపకపోగా, ప్రోత్సహించిన ప్రభుత్వాలు ఇప్పుడు వారి మాట్లాడే స్వేచ్ఛను శిక్షార్హమైన నేరంగా పరిగణించడం అత్యంత విషాదకరం.

ఈ రాజకీయ క్రీడ – ఎన్ని మలుపులు తిరిగి, ఎక్కడ ఆగుతుందో కాలమే నిర్ణయించాలి. కానీ ఇందులో పావులై, హింసకు, ఆందోళనలకు పాల్పడితే, వ్యక్తులు తమను తామే నిందించుకోవాలి. విజ్ఞులు చెయ్యాల్సిందల్లా – అక్బరుద్దీన్ గానీ, ప్రవీణ్ తొగాడియా గానీ చేసే వ్యాఖ్యలు ఎంతవరకూ సబబో, కాదో హేతుబద్ధంగా, తర్కబద్ధంగా విశ్లేషించి సామాన్య ప్రజలకు అర్థం చేయించాలి. అప్పుడు వ్యక్తులుగా ఎవరికి తోచిన నిర్ణయాలు వారు తీసుకోగలుగుతారు. ప్రజల స్వేచ్ఛలపై ప్రభుత్వాల గుత్తాధిపత్యం వల్ల ఒక ఆచరణాత్మక ప్రమాదముంది. ప్రజల హక్కులను, స్వేచ్ఛలను ప్రభుత్వాలు తమదైన ఆత్మాశ్రయ (సబ్జెక్టివ్) శైలిలో నియంత్రించినంత కాలం – ప్రజలు తమ స్వంత తెలివితో, మేధోపటిమతో విషయాలను విశ్లేషించడం, ఆలోచించడం, నిర్ణయించడం మానేస్తారు. సమాజంలో ఒక రకమైన జడత్వం ఆవహిస్తుంది. అక్బరుద్దీన్ వ్యాఖ్యల్లోని నిజాలను అంగీకరిస్తూ... అబద్దాలను నిరూపిస్తూ... అతిశయోక్తులను ఎత్తిచూపుతూ... అనవసర వాచాలత్వాన్ని నిరసిస్తూ... ఆయన ఆకర్షించదలచిన ఓటర్ల నిర్ణయాలను ప్రభావితం చెయ్యగలిగిననాడు; అలా గుంపులను రెచ్చగొట్టి పబ్బం గడుపుకునే రాజకీయ నాయకులను నిరుత్సాహపరచ గలుగుతాం. మాట్లాడే స్వేచ్ఛను సజీవంగా ఉంచగలుగుతాం. ఆ స్వేచ్ఛను దుర్వినియోగం చేసే వాళ్ళకు తగిన శాస్తి చెయ్యగలుగుతాం.

06-01-2013

యుద్ధోన్మాద ప్రమాదం

జనవరి 8వ తేదీన సరిహద్దుల్లో జరిగిన సంఘటనతో యుద్ధ మేఘాలు అలముకున్నాయి. గస్తీ తిరుగుతున్న సైనికబృందంపై కాల్పులు జరిగి, ఇద్దరు మరణించగా, వారిలో ఒకరి తల నరికి పాకిస్తాన్ సైనికులు తీసుకెళ్ళారు.

ఈ అమానుష దుశ్చర్య సైన్యానికే కాక దేశ ప్రజలందరికీ శరాఘాతంలా తాకింది. అందరూ ముక్త కంఠంతో ఖండించారు. ప్రతిపక్షాలు ఒకడుగు ముందుకేసి దెబ్బకుదెబ్బ తీయాలని, ఒక తలకు పది తలలు తేవాలని, యుద్ధం ప్రకటించాలని అంటూ స్వరాలు పెంచాయి.

జాతీయ మీడియా దీనికి విశేష ప్రాధాన్యాతనిచ్చి మరింత వేడి పుట్టించింది. ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ దేశ రక్షణ విషయంలో మెతక వైఖరి అవలంబిస్తున్నారనే అపప్రథ రాకుండా ఉండేందుకు పాలకపార్టీ ప్రభుత్వం కొన్ని కఠినమైన నిర్ణయాలు తీసుకోక తప్పలేదు. శాంతి చర్చలను, కొన్నిరకాల వీసాల జారీని నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. ఇటువంటి సమయాల్లో దేశ పౌరుల ఆలోచనలకు దిశానిర్దేశం చేసే భావజాల కొరత ప్రస్ఫుటం. దాంతో భిన్నస్వరాల గందరగోళంలో... చివరకు గొర్రెల్లాగా, మీడియా, ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను – దేశ భక్తి పేరిట గుడ్డిగా అనుసరించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

సరిహద్దుల్లో జరిగే సంఘటనల్లో కొంత అస్పష్టత సహజం. సైనిక దళాల పట్ల మనకు గౌరవ భావమున్నప్పటికీ – వారి కథనాలను పూర్తిగా నమ్మలేం. ఇది మనదేశమే కాదు, అన్ని దేశాల్లోనూ జరిగేదే. సరిహద్దులు, యుద్ధక్షేత్రాల్లోకి సాధారణ ప్రజలు, పాత్రికేయులను అనుమతించరు. ఎంపిక చేసిన పాత్రికేయులకు కొన్ని ప్రాంతాల్లో సందర్శనాలు ఏర్పాటు చేసి, తమ వివరణలు ఇస్తారు. అసలు వివరాలు ఎప్పటికోగానీ తెలియవు. అసలు ఎప్పటికీ తెలియకపోవచ్చు కూడా.

దేశభక్తి, దేశ రక్షణల పేరిట తెలిసినా, ఎవరూ బయటపెట్టడానికి ఇష్టపడక పోవచ్చు. కాబట్టి క్లిష్టసమయాల్లో దేశ రక్షణ, యుద్ధ ప్రమాదాల గురించిన చర్చల్లో, ఆలోచనల్లో ప్రజలు మరింత వివేచన, సంయమనం పాటించాల్సిన అవసరముంది. యుద్ధోన్మాదుల మాటల్లో పడి కొట్టుకుపోవడం మంచిది కాదు. యుద్ధాలు ఎంతో రక్తపాతం, ప్రాణహాని, ఆస్తి నష్టం, ఆపారమైన ఖర్చుతో కూడుకున్న వ్యవహారాలు. యుద్ధ భూమికి దూరంగా ఉండి, తమదేం పోయిందిలే అన్న భావనతో బాధ్యతరహితంగా చేసే వ్యాఖ్యలు, వ్యాఖ్యానాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఒకసారి మొదలైతే, ఆధునిక యుద్ధాలు ఎప్పుడు ఆగుతాయో, ఎంతటి పరిణామాలకు దారి తీస్తాయో ముందే అంచనా వేయడం కష్టం.

రెండు దేశాల్లోనూ రాజకీయ పరిస్థితులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. ఏదో ఒక చిన్న విషయాన్ని పట్టుకుని ఒకరిమీద ఒకరు సవాళ్ళు విసురుకుని, ఛాతీలు విరుస్తూ, రొమ్ములు చరుస్తూ తమ తమ దేశప్రజల దృష్టి మళ్ళించాల్సిన రాజకీయ అవసరాలు రెండు దేశాల్లోనూ మెండుగా ఉన్నాయి. ఒక దేశంగా ఏర్పడినప్పటి నుంచీ – తీవ్ర రాజకీయ అస్థిరతతో సతమతమవుతున్న పాకిస్తాన్ పరిస్థితి మరీఘోరంగా ఉంది.

అక్కడ 'ప్రజాస్వామ్య' రాజ్య వ్యవస్థ – ఎప్పటికీ ఎదగని పసిపిల్లాడిలా..... ఎప్పుడూ సైనికపాలన భయం పడగ నీడలో వణుకుతూ ఉంటుంది. విపరీతమైన సైనిక వ్యయంతోపాటు, పాతుకుపోయిన ఫ్యూడలిజం, పాలకుల విపరీతమైన అవినీతితో, ఆర్థికవ్యవస్థ ఎప్పుడూ అమెరికా లాంటి దేశాల ఆర్థిక సహాయం మీద ఆధారపడి ఉంటుంది. దేశం ఏర్పడిన మత ప్రాతిపదిక వారి రాజకీయాన్ని (body politic) మిన్నాగులా ఎప్పటికీ చుట్టుకొని, సమాజాన్ని, రాజకీయాలను ఎప్పటికప్పుడు మతంపేరిట విషపూరితం చేస్తూ వచ్చింది.

ఒక పరిశ్రమలా పెంచి పోషించిన టెర్రరిజం ఇప్పుడు వారి మెడకే చుట్టుకుని దేశం నలుమూలలా ఆత్మాహుతిదాడులతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. సున్నీటెర్రరిజంతో షియాలు, ముఖ్యంగా హజారా షియాలు వేలసంఖ్యలో ప్రాణాలు కోల్పోయి అట్టుడుకుతున్నారు. రాజకీయ భరితమైపోయిన ప్రధాన న్యాయమూర్తి సారధ్యంలో పాకిస్థాన్ సుప్రీంకోర్టు ప్రధాన మంత్రి అరెస్టుకు ఆదేశించడం ఒక పరాకాష్ట.

విద్యుదుత్పత్తి కేంద్రాల కేటాయింపుల్లో అవినీతికి పాల్పడ్డారని సాక్షాత్తు ప్రధానమంత్రి పైన ఆరోపణలు. మరో పక్క అమెరికా దళాలు అబోతాబాద్‌లో బిన్ లాడెను సంహరించి తీసుకుపోయిన అవమానం నుంచి తేరుకోలేక పోతున్న పాక్ సైన్యం; కొనసాగుతున్న టెర్రరిస్టు దాడులు, టెర్రరిస్టు స్థావరాలపై అమెరికా దళాల వైమానిక దాడులతో తలెత్తుకోలేకపోతోంది. ఇటువంటి సమయంలో భారత సరిహద్దుల్లో ఏదో ఒకటి చేసో, లేక

అనుకోకుండా జరిగిన సంఘటనను సాకుగా తీసుకొని పౌర ప్రభుత్వాన్ని కూలదోసో... తిరిగి సైనిక పాలనకు తెరతీయడానికి పాక్ సైన్యం వెనుకాడదు.

మన దేశంలో కూడా రాజకీయ పరిస్థితులు కొంతమేరకు అస్తవ్యస్తంగానే ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వాన్ని సమస్యలు చుట్టు ముడుతున్నాయి. ఎప్పుడూ లేనన్ని అవినీతి ఆరోపణలు... కేంద్ర మంత్రులే నెలల తరబడి జైళ్ళలో మగ్గడం; పెరుగుతున్న ధరల భారం, తగ్గించే వీలులేని సబ్సిడీల భారం, కుంటుపడిన ఆర్థికాభివృద్ధి, ఏ రోజుకారోజు, ఏ బిల్లుకా బిల్లుకు మిత్ర ప్రతిపక్షాల నుంచి సమర్థనను చిల్లరగా కొనుక్కోవలసిన సంఖ్యాపర బలహీనత, ఢిల్లీలో జరిగిన సామూహిక అత్యాచారం సంఘటన సందర్భంగా ఒక్కసారిగా బయటపడ్డ యువతలోని అసహనం, ఒకదాని తర్వాత మరొకటిగా ముఖ్యమైన రాష్ట్రాల ఎన్నికలలో పరాజయాలు, వచ్చే ఎన్నికలలో నరేంద్రమోడీని ఎలా ఎదుర్కోవాలనే సంశయం, రాబోయే బడ్జెట్ సమావేశాల నుండి గట్టెక్కగలమా అనే సందేహాలు – ఇన్ని సమస్యల నడుమ దేశప్రజల దృష్టి మరల్చే ఎత్తుగడలో భాగంగా యుద్ధవిన్యాసాలకు సిద్ధపడడం ఆశ్చర్యం కలిగించదు.

ఇటువంటి సమయంలో మీడియా పాత్ర బహు చిత్రంగా మారింది. అప్పటివరకు ఎంతో హేతుబద్ధంగా వ్యవహరించే మీడియా సంస్థలుకూడా – ఒక్కసారిగా యుద్ధ పిపాసులుగా మారతారు. రక్షణ విభాగాలు అందజేసే సమాచారాన్ని విమర్శనాత్మకంగా విశ్లేషించడం మానేసి, ప్రజలందరికీ వండి వారుస్తారు. ఐక్యరాజ్యసమితి అనుమతుల ఊసే లేకుండా నాటో సేనలు సెర్బియా మీద బాంబుల వర్షం కురిపించినప్పుడు బీ.బీ.సీ లాంటి వార్తా సంస్థలు కూడా పచ్చి అబద్ధాలను ప్రసారం చేశాయి. ఇరాక్ దురాక్రమణకు పూనుకున్నప్పుడు కూడా మామూలు సమయాల్లో అత్యంత తటస్థంగా, నిష్పక్షపాతంగా ఉండే సీ.ఎన్.ఎన్., బీ.బీ.సీ. లాంటి వార్తా సంస్థలు సైతం; వారి వారి పాలకుల, సైన్యాల, నిఘా సంస్థల, సాక్షాత్తూ టోని బ్లెయిర్ లాంటి ప్రధాన మంత్రుల అబద్ధాలనే నిజాలుగా నిరాటంక ప్రచారం చేశాయి. కాబట్టి దేశ రక్షణ, విదేశాంగ విధానాలు, యుద్ధవాతావరణ సమయాల్లో మీడియా నుంచి తటస్థ, నిష్పక్షపాత, హేతుబద్ధ విశ్లేషణలను ఆశించలేం.

ముఖ్యంగా అంతర్గత పరిస్థితులను చక్కదిద్దుకోవడంతోనే దేశ రక్షణ పాటవం ఇనుమడిస్తుంది. దేశంలోని ప్రజలను ఓట్ల కోసం కులాలు, మతాలు, ప్రాంతాలు, వర్గాలుగా విడదీసి ఎలాగోలా వచ్చే ఎన్నికల్లో నెగ్గితే చాలు మిగతా విషయాలు తర్వాత చూసుకుందాం అనే స్వల్పకాలిక విభజన రాజకీయాలే – దేశంలో అనేక కోట్లమంది అసంతుష్టులను తయారుచేస్తాయి. ఈ బలహీనతలను శత్రు దేశాలు తమకు అనుగుణంగా మలచుకుంటాయి.

భింద్రన్‌వాలేను, శ్రీలంకలో తమిళ టైగర్లను పెంచిపోషించి; పులి మీద స్వారీ చేసిన ఘనత మన నాయకులదే. అలాగే తగని సమయంలో ఏకపక్షంగా, పాకిస్తాన్ పట్ల ఉదార, మెతక వైఖరి అవలంబించి, దెబ్బకుదెబ్బ తీయగల ప్రచ్ఛన్న పాటవాలన్నిటినీ నీరుగార్చింది కూడా మన నాయకగణమే. టెర్రరిస్టు శిక్షణా కేంద్రాలని అంతమొందించే శక్తియుక్తులను ఇన్ని దశాబ్దాల్లోనూ సమకూర్చు కోలేకపోవడం మన వైఫల్యమే. గత యుద్ధాల్లో అఖండ విజయం సాధించామని చెబుతున్నా; సరిహద్దు సమస్యలను, కాశ్మీర్ సమస్యను పూర్తిస్థాయిలో ఎందుకు పరిష్కరించలేదో సామాన్య ప్రజలకు అర్థం కాని విషయం.

దేశాలమధ్య, ముఖ్యంగా దేశాల ప్రజలమధ్య శత్రు భావాలు తగ్గి, స్నేహపూర్వక వాతావరణం పెంపొందడానికి ఉపయోగపడేవి చర్చలు. వీసాల కన్నా వాణిజ్యం, వ్యాపార సంబంధాలు. అవి పెరగనంతకాలం ఎప్పుడు తెగిపోతుందో తెలియని సున్నితమైన దారంలా సంబంధాలు కొనసాగుతాయి. పాలకులు మారినప్పుడల్లా, వారి రాజకీయ అవసరాల మేరకు ప్రజలంతా గొర్రెల్లా వారు చూపిన దారిలోనే నడవాల్సి వస్తుంది. పంజాబ్‌లో పండే ఆలుగడ్డలు, పాకిస్తాన్ ఉల్లిగడ్డలు, కనుచూపుమేరలోనే ఉన్నా, సరిహద్దులు దాటవు. రెండువైపులా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రెండువైపులా ప్రజలు కొరతల నెదుర్కొంటున్నారు.

వ్యాపార, వాణిజ్యాల వల్ల ఇరు దేశాల ప్రజలకు లాభమే తప్ప, నష్టమేమీ లేదు. దీనివల్ల టెర్రరిజమేమీ పెరగదు. కాలక్రమేణా ప్రజల మధ్య సంబంధాలు పెరిగి, సరిహద్దు ఘర్షణలకు, అనుచిత ఆవేశాలకు, ప్రాయోజిత యుద్ధాలకు ప్రజామోదం లభించదు. దాంతో పాలక వ్యవస్థలు తమ స్వప్రయోజనాల కోసం కయ్యానికి కాలుదువ్వే అవకాశాలు తగ్గుతాయి. అమెరికాలో ఉద్యోగాలు చేసుకోవడానికి వీసాలు నిరాకరిస్తే ఆవేశపడే మనం; బంగ్లాదేశ్‌నుంచి పని వెతుక్కుంటూ వచ్చినవారిని చొరబాటుదారులుగా భావించడంలోని వైరుధ్యాన్ని గుర్తించాలి. భారతీయులు, పాకిస్తానీయులు విదేశాల్లో కలిసి పనిచేసే సందర్భాల్లో వారి మధ్య అత్యంత స్నేహపూర్వక సంబంధాలుండడం, ఎప్పుడో తప్పిపోయిన అన్నదమ్ములు తిరిగి కలుసుకున్నంత గాఢమైన బంధాలు ఏర్పడడం యాదృచ్ఛికమో, కాల్పనికమో కాదు. పచ్చి యదార్థం. ప్రజల మధ్య వ్యక్తిగత స్థాయిలో సాధ్యమైన ఈ స్నేహం - దేశాల మధ్య ఇచ్చిపుచ్చుకోగల స్థాయికి చేరాలంటే.... ఉత్పత్తులు, సేవలు, ప్రజలు సరిహద్దులు దాటగలగాలి. లేకపోతే సైన్యాలు సరిహద్దులు దాటతాయి.

20-01-2013

ఈ చీకటి విడిపోయేదెప్పుడు?

ఇటీవలే 64వ రిపబ్లిక్ దినోత్సవాన్ని జరుపుకున్నాం. బ్రిటిష్ రాజరిక వ్యవస్థ నీడనుంచి రాసుకున్న రాజ్యాంగబద్ధ దేశంగా మారి భారత్ రిపబ్లిక్ అయింది. ఆ రోజును గణతంత్ర దినోత్సవం అనే కంటే రాజ్యాంగ తంత్ర దినోత్సవంగా పిలుచుకుంటే దాని పరమార్థం మెరుగ్గా అర్థమవుతుంది. ఇంతకీ మన రిపబ్లిక్కు ఎంత ఆదర్శంగా మొదలైంది, ఇన్ని రోజుల తర్వాత ఎలా తయారైంది, దాన్ని ప్రజాస్వామ్యం ఏ దిశగా ఏ మేరకు ప్రభావితం చేసింది, లోపాలు ఎక్కడున్నాయో విశ్లేషించాల్సిన తరుణమిది.

ప్రాతపూర్వక రాజ్యాంగాన్ననుసరించి వంశపారంపర్య రాచరికం లేకుండా నడిచే రాజ్యమే రిపబ్లిక్. దాన్ని రాసేది, సవరించేదీ, అప్పుడప్పుడూ ఉల్లంఘించేది ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాలే. *ప్రజాస్వామ్యమనేది ప్రభుత్వాన్ని నడపడానికి ప్రతినిధులను ఎన్నుకునే ప్రక్రియ మాత్రమే. రాజ్యాంగం పటిష్ఠంగా లేకపోతే రిపబ్లిక్ అనేది ప్రజాస్వామ్యం అని పిలువబడే మూకస్వామ్యపు వలలో చిక్కుకుని క్రమేపీ దాని స్వరూప స్వభావాలే మారిపోతాయి. మనదేశంలో జరిగిందదే.*

రిపబ్లిక్‌ను ప్రజాస్వామ్యం బెడదల నుంచి ఎప్పటికప్పుడు రక్షించుకోవాలి. లేకపోతే మెజారిటీ నిరంకుశత్వానికి మనిషి బలైపోతాడు. ప్రజాస్వామ్యానికున్న ఈ దుర్గుణాన్ని అర్థం చేసుకుని, అదుపు చెయ్యకపోతే అది రాజ్యాంగాన్ని, రిపబ్లిక్ భావాన్ని – వలలాగా కమ్మేస్తుంది. మెల్లమెల్లగా మొదలై, సంక్లిష్టమైన చట్టాలు, నిబంధనలతో మనిషిలోని సృజనాత్మకతను, దార్శనికతను, శక్తి సామర్థ్యాలను బయటకు రానీయకుండా తొక్కిపెడుతుంది. మనిషిలోని ధైర్యాన్ని, దృఢచిత్తాన్ని మెత్తబరిచి, వంచి, చివరకు గొర్రెలా తయారుచేస్తుంది. ఏ పనీ చెయ్యమని బలవంత పెట్టదు. కానీ ఏం చేద్దామన్నా అడ్డుకుంటుంది. మనిషిని నాశనం చెయ్యదు. కానీ తన ఉనికికి, అస్తిత్వానికి విలువ

లేకుండా చేస్తుంది. మనిషిలో వెలగాల్సిన అఖండ దీపాన్ని కొండెక్కించి, గానుగెద్దులా తయారుచేసి, ప్రభుత్వమనే యజమాని చెప్పుచేతల్లో ఉంచుతుంది.

ప్రజలు కూడా క్రమంగా ఈ యాంత్రిక, ప్రభుత్వాధారిత జీవితానికి అలవాటు పడిపోతారు. తాము స్వతంత్రులమనే భావన ఒకవైపు, తమను ఎవరో నడిపించాలన్న భావన మరోవైపు – ఈ రెండింటి మధ్యా పడి కొట్టుకుంటూ ఉంటారు. తమను నడిపించేది తాము ఎన్నుకున్న ప్రభుత్వమే కదా అన్న నిశ్చింతలో ఉంటారు. అప్పుడప్పుడూ నిద్రలేచి..., కొత్త యజమానులను ఎన్నుకుని మళ్ళీ గానుగెద్దు, గొర్రె జీవితాలకు ఉపక్రమిస్తారు.

రాజ్యాంగాలు రాసుకునేది – ప్రభుత్వాన్ని నియంత్రించడానికి. ప్రభుత్వాల నిర్హేతుక, ఏకపక్ష చర్యలు, నిర్ణయాల నుంచి ప్రజలను రక్షించడానికే. ఆ వ్రాతప్రతి ఎంత పటిష్ఠంగా ఉంటే, సవరించడం ఎంత కష్టతరమైతే, ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు, ప్రాథమిక హక్కులకు బేషరతుగా ఎంత విలువనిస్తే...; రిపబ్లిక్ అంత నమ్మకంగా నడవ గలుగుతుంది. లేకపోతే గుంపుల స్వామ్యమనే 'వల'లో పడిన చేపలాగా గిలగిల్లాడుతుంది.

మన రాజ్యాంగాన్ని – అమెరికా, ఫ్రెంచి, బ్రిటిష్, మరికొన్ని రాజ్యాంగాల కలయికగా అభివర్ణిస్తుంటారు. అందులో ఖచ్చితత్వం, పటిష్టత మొదటి నుంచే లోపించాయి. మనిషి హక్కులు అప్రధానమై, ప్రభుత్వాలు, వాటి అధికారాలే సింహభాగాన్నాక్రమించాయి. ప్రతి ప్రాథమిక హక్కుకూ లెక్కలేనన్ని షరతులు విధించే అధికారాలు ప్రభుత్వాలకు కట్టబెట్టారు. ఆస్తి హక్కు అనే ప్రాథమిక హక్కును ఒక సవరణ ద్వారా పూర్తిగా తీసేసే అవకాశం కల్పించారు. ఆచరణ సాధ్యంకాని, ఒక రకంగా అనైతికమైన ఆదేశిక సూత్రాలు నింపారు.

ప్రభుత్వాల నిరంకుశత్వం నుంచి ప్రజల ప్రాథమిక హక్కులను కాపాడ్డమే ముఖ్య ఉద్దేశంగా ఉండాల్సిన రాజ్యాంగం; ఒక పక్క వాటికి సవాలక్ష షరతులు విధిస్తూ, ఇంకో ప్రక్క ప్రాథమిక బాధ్యతలనే పేరుతో – చాంతాండంత చిట్టాను పౌరులనెత్తిన పెట్టింది. వీటన్నిటి పర్యవసానమే ప్రభుత్వాల దాష్టీకం. అమాయక పౌరుల అసహాయత, కులాలు, మతాలు, ప్రాంతాలు, వర్గాల మధ్య ప్రజాస్వామ్యం వేసిన చిక్కుముడులు.

ప్రతిదానికీ అమెరికాతో పోల్చుకుంటాం కదా! రెండూ రిపబ్లిక్కులే. కానీ వాటి రాజ్యాంగాల ప్రాతిపదికలలో మౌలికమైన తేడాలున్నాయి.

అమెరికా రాజ్యాంగం ప్రకారం, పౌరులకు సహజమైన, ప్రాథమిక హక్కులుంటాయి. ప్రభుత్వాలు వాటి జోలికి పోకుండా రాజ్యాంగం అడ్డుకుంటుంది. భారత రాజ్యాంగం ప్రకారం ప్రజల ప్రాథమిక హక్కులు రాజ్యాంగం ప్రసాదించిన వరాలు. వాటిని నియంత్రించడంలో ప్రభుత్వాలకు అపారమైన అధికారాలుంటాయి. కాబట్టి ప్రజలు

ప్రాథమిక హక్కులను అనుభవించగలగడం, స్వేచ్ఛా వాయువులు పీల్చగలగడం మన ప్రభుత్వాల దయాదాక్షిణ్యాలపైన ఆధారపడి ఉంటుంది. ప్రజాస్వామ్యం ముసుగులో మూకస్వామ్యాన్ని ప్రోత్సహించి, ప్రజాహితం పేరిట ఏ హక్కునయినా, ఏ స్థాయివరకైనా విరిచి పాతర పెడుతూ వచ్చారు.

ప్రజలను వర్గాలుగా విభజించి, వారి మధ్య మంటలు రాజేసి, చలికాగుతూ, ప్రభుత్వాలు ఏటా రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తుంటాయి. అందుకే ఏ విషయంలోనూ స్పష్టతగానీ, పరిష్కారంగానీ దొరకదు. సందర్భానుసారం ఒక్క ఉదాహరణ తీసుకుందాం.

భావప్రకటనా స్వేచ్ఛ భారత, అమెరికా రెండు రాజ్యాంగాల్లోనూ ఉటంకించబడింది. భారత రాజ్యాంగం 19వ అధికరణం ప్రకారం 'పౌరులందరికీ భావస్వేచ్ఛ ఉండుగాక...కానీ అమలులో ఉన్న చట్టానుసారం దీనిపై సముచిత నియంత్రణలు విధించవచ్చు....అట్టి నియంత్రణలు దేశభద్రత, దౌత్య సంబంధాలు, శాంతి భద్రతలు, ప్రజా నైతికతల దృష్ట్యా సహేతుకమే....' ఒక ప్రాథమిక హక్కుకు రాజ్యాంగంలోనే ఎన్ని నియంత్రణలు విధించారో చూడండి! అమెరికా రాజ్యాంగంలో ఒకటవ సవరణ ప్రకారం – 'చట్టసభలకు భావ ప్రకటనా స్వేచ్ఛ, పత్రికా స్వాతంత్ర్యాలను కుదించే ఏ చట్టమూ చేసే అధికారం లేదు'. ఇందులో ఇక ఏ ఇతర సన్నాయి నొక్కులకూ స్థానం లేదు.

మన రాజ్యాంగంలో హక్కులకు పెట్టిన షరతుల ప్రభావం కళ్ళెదుటే కనబడుతుంది.

ఇదే శీర్షికలో పూర్వపు వ్యాసాల్లో, 'దేనికైనా రెడీ' సినిమా, అక్బరుద్దీన్ ఉపన్యాసాల నేపథ్యాల్లో వారి వారి భావప్రకటనా హక్కును పూర్తిగా సమర్థించగా, చాలామంది తప్పు పట్టారు. కొందరు కోప్పడ్డారు కూడా. మరీ అంత విశృంఖలత్వం పనికిరాదు, నియంత్రించాల్సిందేనని అభిప్రాయపడ్డారు. అక్బరుద్దీన్ భావాలను తీవ్రంగా తిరస్కరించినా, వారి హక్కును గౌరవించాల్సిందేనన్న విశ్లేషణ అప్పుడూ, ఇప్పుడూ వర్తిస్తుంది. జరుగుతున్నదేమిటో చూడండి.

'విశ్వరూపం' సినిమాను తమిళనాడులో నిషేధించారు. ఆ నిషేధాన్ని హైకోర్టు కూడా సమర్థించింది. కొందరు ముస్లిములు చేసిన అందోళన అర్థం లేనిదని సినిమా చూసిన ఎవరికైనా అవగతమవుతుంది. ఒక భారతీయ సినిమాను హాలీవుడ్ స్థాయిలో నిర్మించిన ప్రయత్నం అభినందనీయం. పైగా సినిమాలో కథా నాయకుని పాత్ర స్వయానా భారతీయ ముస్లిం.

ఇక భావప్రకటనా స్వేచ్ఛ ఎక్కడున్నట్లు? శాంతిభద్రతలను సాకుగా చూపడం మరింత సిగ్గుచేటు. ఇతర రాష్ట్రాల్లో లేని సమస్య అక్కడ మాత్రమే ఎందుకొచ్చింది? పోలీసు బలగాలు చాలవట. పోనీ కనీసం యాభై థియేటర్లలో విడుదల చేసుకోనిచ్చి ఉన్న బలగాలతో భద్రత కల్పించకపోయారా? నిర్మాతలకు కలిగిన అపార నష్టాన్ని ఎవరు తీరుస్తారు? ఇకమీదట ఏ నమ్మకంతో సాహసించాలి? అక్బరుద్దీన్ అరెస్టును సమం చెయ్యడానికా అన్నట్లు ఒక స్వామీజీని జైలుకు పంపారు. జైపూర్‌లోనే కాక దేశంలో పలుచోట్ల ఒక సామాజిక వేత్తపై యస్‌సి/యస్‌టి చట్టం కింద కేసులు. సల్మాన్ రష్దీ కలకత్తా వెళ్ళకుండా నిషేధం. ఇక్కడ ఒకవైపు కేసీఆర్ మీద, మరోవైపు ఉండవల్లి, లగడపాటిలపైన, ఇంకా ముందుకెళ్ళి షిండే, చిదంబరం, ఆజాద్‌లపైన ఎక్కడబడితే అక్కడ కేసులు, కోర్టుల నుంచి సమన్లు. ఇది చాలదన్నట్టు, అంతర్జాలం (ఇంటర్నెట్)లో తొంగి తొంగి చూసి ఎవరో తన వ్యక్తిగత బ్లాగుల్లోనో, ఫేస్‌బుక్‌లోనో రాసుకున్న పిచ్చిరాతలపై మీడియా హాహాకారాలు, వారిని వెతికి పట్టుకుని అరెస్టులు.

ఎప్పుడు, ఎక్కడ, ఏ విషయంపైన ఏం మాట్లాడితే ఎవరికి కోపమొస్తుందో, ఏమేమి కేసులు వేస్తారో తెలియని సంపూర్ణ భావజాల గందరగోళంలో పూర్తిగా ఇరుక్కుపోయాం.

భావప్రకటనా స్వేచ్ఛ అంటే ఇతరులకు నచ్చని విషయాలను, భావాలను కూడా వ్యక్తీకరించగల స్వేచ్ఛ. అందరూ అన్నీ అందరికీ నచ్చే విషయాలే మాట్లాడాల్సి వస్తే, ఈ స్వేచ్ఛకు అర్థమేముంటుంది, దాని అవసరమేముంటుంది? ఎమర్జెన్సీ విధించి ప్రజల గొంతు నొక్కేశారని ఇందిరాగాంధీని నిందిస్తుంటారు. భావప్రకటనా స్వేచ్ఛ అనే భావనను అర్థం చేసుకోలేక ఒకరి గొంతు ఒకరు నొక్కుకుంటుంటే, దీన్నేమనాలి? ప్రకటిత ఎమర్జెన్సీకి కనీసం కాలపరిమితి ఉంటుంది. కానీ, ఈ అప్రకటిత పరస్పర శృంఖల విధింపులకు అంతమెప్పుడో తెలియకుండా ఉంది. ఈ అవగాహనా రాహిత్య ఆలోచనా విధానాల్లో మీడియా, మేధావులు కూడా భాగస్వాములవుతుండడంతో ఈ చీకటి నుంచి బయటపడే దారులు, వెలుతురు అంతకంతకూ తగ్గిపోతున్నాయి.

03-02-2013

దొరికిన కాసేపే దొంగలు

అగస్టా వెస్ట్‌ల్యాండ్ హెలీకాప్టర్ల కొనుగోలు కుంభకోణం కొత్తగా వెలుగులోకి వచ్చింది. రక్షణశాఖ కొనుగోళ్ళలో అవినీతి, మధ్యవర్తులు, కమీషన్లు ఎప్పుడూ ఉండేవే అయినా ఈ విషయంలో వైమానిక దళ అధిపతి కూడా నేరుగా లబ్ధిదారుల జాబితాలో చేరిపోవడం ఆందోళన కలిగించే విషయం.

ఇది ఒక రకంగా పాలనా వ్యవస్థలో బరితెగింపునకు నిదర్శనం. రాజకీయ నాయకులు, పార్టీలు ఎలా వ్యవహరించినా, ఎంత నిర్లజ్జగా అవినీతికి పాల్పడ్డా ఆశ్చర్యం కలిగించదు. కానీ బాధ్యతాయుతమైన కొన్ని పదవుల్లో ఉండే ఉన్నతాధికారులు–ఉదాహరణకు త్రివిధ దళాధిపతులు, కేబినెట్ సెక్రటరీ – మాత్రం వ్యక్తిగతంగా అవినీతికి దూరంగా ఉంటారని ఆశిస్తూ, భావిస్తూ వస్తున్నాం. కానీ ఆమ్ ఆద్మీ పేరిట పాలన మొదలైనప్పట్నుంచీ, పాలకుల పాపాల్లోను, అవినీతి సంపాదనల్లోను ఉన్నతాధికారులు నేరుగా, ఒక ఒడంబడిక ప్రకారం అన్నట్లుగా పాలుపంచుకోవడం సాధారణ విషయమై పోయింది. మన రాష్ట్రంలో జైలు బారిన పడిన, తీవ్ర అభియోగాలు ఎదుర్కొంటున్న ఉన్నతాధికారుల సంఖ్య చూస్తే, 'నీకింత – నాకింత' పథకం కేవలం రాజకీయ నాయకులు, వ్యాపారులకు మాత్రమే పరిమితం కాదని స్పష్టమవుతోంది.

దేశ భద్రతకు, సుస్థిరతకు రక్షణ రంగం ఆవశ్యకత కాదనలేనిది. భావజాల పరంగా ఇష్టమున్నా లేకున్నా; దేశ రక్షణ బాధ్యతలను – ప్రభుత్వానికి అప్పగించడం మినహా మరో గత్యంతరం లేదు. అంతర్గత, బాహ్య శత్రువుల నుంచి ప్రజలను, వారి హక్కులను రక్షించడానికే అసలు ప్రభుత్వాలు అవసరమయ్యేది. ప్రభుత్వాల పనితీరును కొలవాల్సింది కూడా అవి చేసే చట్టాల హేతుబద్ధత, చట్టబద్ధ పాలన, రక్షణ వ్యవస్థల నిర్వహణ వంటి విషయాల్లో మాత్రమే. కానీ గత సుమారు వందేళ్ళుగా నిర్వచనాలు మారిపోయాయి. శాస్త్ర, సాంకేతికరంగాల్లో ఒక దాని తర్వాత మరొకటిగా వచ్చి పడిన

నూతన ఆవిష్కరణలతో వ్యవసాయ, పారిశ్రామిక, సేవారంగాలు అతికొద్ది సమయంలోనే కొన్ని వందల రెట్లు పెరిగిపోయాయి. ఆర్థికాభివృద్ధి ఊహించనంతగా జరిగింది. దాంతో పాటే ప్రభుత్వాలకు పన్నుల రాబడి కూడా విపరీతంగా పెరిగింది. ఏ యుగంలోనూ, ఏ శకంలోనూ, ఏ రంగంలోనూ లేనంత డబ్బు పాలకుల చేతుల మీదుగా ఖర్చు చేసే అవకాశం కలిగింది. సాంకేతిక అభివృద్ధితో ఆయుధాల సంక్లిష్టత, మారణ శక్తి, వాటి ఖర్చు కూడా పెరిగిపోయాయి. ఆయుధాల నిర్మాణం, ఉత్పత్తి, సేకరణ, అమ్మకం వ్యవస్థలు వాటంతట అవే స్వయం చోదకశక్తులుగా తయారయ్యాయి. అవి ప్రభుత్వ రంగంలో ఉన్నా, ప్రైవేటురంగంలో ఉన్నా పెద్ద తేడా ఏమీలేకుండా రక్షణ, విదేశాంగ విధానాల్లో నిర్ణయాధికార శక్తులుగా అవతరించాయి. అవసరమున్నా లేకున్నా, పనికొచ్చినా రాకున్నా మేపక తప్పని ఆబోతులు, ఐరావతాలయ్యాయి.

సాంకేతికత పెరిగిన కొద్దీ ఆయుధాల, రక్షణ రంగాల్లో గోప్యత పెరిగిపోయింది. అందులో ఏం జరుగుతోందో పన్నులు కట్టే ప్రజలకు తెలియనివ్వరు. బహిరంగ చర్చలుండవు.గూఢచర్యం ద్వారానో, క్రమం తప్పకుండా ఏకాగ్ర పరిశీలన జరపడం ద్వారానో ఏ దేశ రక్షణ రంగంలో ఏం జరుగుతుందో దాని శత్రు దేశాలకు దాదాపు అన్ని రహస్యాలు, పరిణామాలు తెలుస్తూనే ఉంటాయి. కానీ స్వంత దేశ ప్రజలకు తెలిసేది అతి స్వల్పం.

రోజూ ఎదురయ్యే కొత్త కొత్త సమస్యలతో నిత్య పోరాటం సాగిస్తూ, దైనందిక జీవితాలతో సతమతమయ్యే సామాన్యులకు వీటి గురించి ఆలోచించే తీరిక, జిజ్ఞాస ఉండవు. కుప్పలు తెప్పలుగా వచ్చి పడుతున్న పన్నుల డబ్బు ఒక వైపు, అవసరమైనంత డబ్బు ముద్రించుకునే వెసులుబాటు మరోవైపు కలిగివున్న ప్రభుత్వాలది ఇక ఇష్టారాజ్యం.

సాలీనా లక్షల కోట్ల బడ్జెట్‌లో రక్షణ రంగ వ్యయం – మొత్తం బడ్జెట్‌లో సింహ భాగంగా ఉంటుంది. అందులోంచి జీతభత్యాలను పక్కనపెడితే కొత్త ఆయుధాలు, వాహనాలు, సమాచార, సాంకేతిక వ్యవస్థల కొనుగోళ్ళు ఏ ఇతర శాఖ కన్నా అత్యధికంగా ఉండేది రక్షణ శాఖలోనే. ఈ కొనుగోళ్ళలో చాలా వరకు మార్కెట్‌లో అందరూ వాడే వస్తువులు అతి స్వల్పం. వారు కొనే వస్తువుల నాణ్యతా ప్రమాణాలు, పరిమితులు అన్నీ ప్రత్యేకమే. సరఫరా చేసే సంస్థలు కూడా చాలా తక్కువ సంఖ్యలో ఉంటాయి. అందులోను విదేశీ సంస్థలు ఎక్కువ. ఇది చాలదన్నట్లు కొన్ని ప్రత్యేక ఉత్పత్తులు ఫలానా దేశానికి సరఫరా చెయ్యనివ్వాలో లేదో ఆయా ప్రభుత్వాలు తమ విదేశాంగ విధానాల ప్రకారం నిర్దేశిస్తాయి. కొన్ని గడుసు దేశాలు అవకాశాన్ని బట్టి – (పాత రోజుల్లో గైడు కొంటేనే

టెక్ట్బుక్ అమ్ముతామని షరతులు పెట్టినట్లుగా) ఫలానా ఉత్పత్తులు తాము చెప్పిన ధరకు కొంటేనే మనకు అవసరమైన ఉత్పత్తులను అమ్మనిస్తామని షరతులు విధిస్తాయి. సాంకేతికంగా ముమ్ముందుగా అభివృద్ధి చెందిన కొన్ని పాశ్చాత్య దేశాలు – రక్షణ రంగ ఉత్పత్తుల అమ్మకమే ప్రధాన ఆదాయ వనరుగా నడుస్తుంటాయి.

ఇన్ని రకాల సంక్లిష్టతల నడుమ రక్షణ రంగ కొనుగోళ్ళు పారదర్శకంగా, అవినీతి రహితంగా జరుగుతాయంటే ఎవరూ విశ్వసించలేరు. సాధారణ విషయాల్లో అవినీతికి ఆస్కారం లేని వ్యవస్థలతో నడిచే అమెరికా వంటి దేశాల్లో కూడా రక్షణ రంగం విషయానికొచ్చేసరికి ఎవరికీ తెలియకుండా ఎన్నెన్నో జరుగుతుంటాయి. స్థానికంగా, దేశీయంగా సేకరించే రక్షణ ఉత్పత్తులు, విడిభాగాల ధరలు ఉత్పత్తి ఖర్చుకు నాలుగైదు రెట్లు ఉండడం అక్కడ సర్వసాధారణం. వారి రక్షణ రంగ వ్యయం అనేక పెద్ద దేశాల మొత్తం బడ్జెట్ల కంటే అధికం. వారి రక్షణ రంగ కొనుగోళ్ళ పరిమాణం కళ్ళు చెదిరిపోయే స్థాయిలో ఉంటుంది.

ఈ మధ్య ఎఫ్ 35 యుద్ధ విమానాల కొనుగోలుకు అమెరికా వెచ్చిస్తున్న ట్రిలియన్ డాలర్లు ఆస్ట్రేలియా దేశ స్థూల ఉత్పత్తికి సమానం. అంత పెద్ద స్థాయిలో రక్షణ రంగ ఉత్పత్తి పరిశ్రమలున్న దేశంలో ప్రభుత్వాల విధానాలు, ముఖ్యంగా విదేశాంగ విధానాలపై ఈ భారీ పరిశ్రమల వత్తిడులు భారీగానే ఉంటాయి. ప్రపంచం నలుమూలలా ఏయే దేశాల మధ్య ఘర్షణలున్నాయో వెతుకుతూ, ఏదో ఒక పక్షానికి ఆయుధాలు విక్రయించే దిశగా అమెరికా విదేశాంగ విధానాన్ని ప్రభావితం చెయ్యడం – వారికి ఆయుధంతో పెట్టిన విద్య.

తమ వ్యూహాలకు అనుగుణమైన వాతావరణాన్ని సృష్టించడానికి దేశీయ, ప్రపంచ మీడియాను కూడా ప్రభావితం చెయ్యగల ఆర్థిక పరిపుష్టి కూడా వారికి సరిపడా ఉంది. ప్రచార ఖర్చులతో పాటు, లాబీయింగ్ సంస్థల నిర్వహణ, ప్రధాన రాజకీయ పార్టీలు, అధ్యక్ష పదవికి పోటీపడే అభ్యర్థులకు నిధుల అందజేతల ద్వారా రాజకీయాలపై తమ పట్టును కొనసాగిస్తూ ఉంటారు. ఇరాక్ యుద్ధంలో అమెరికా సేనలకు తిండి, గుడారాలు, ఇతర సామాగ్రి సరఫరా చేసే కాంట్రాక్టు పొందిన హాలీబర్టన్ కంపెనీలో అప్పటి అమెరికా ఉపాధ్యక్షుడు డిక్ చెనీకి ఉన్న భాగస్వామ్యం గురించి రుజువులతో సహా ఆరోపణలొచ్చాయి. ఇరాక్ చమురుకు – ఏయే నాటో దేశాల కంపెనీలు కాంట్రాక్టులు పొందాయో బహిరంగ రహస్యం.

ప్రభుత్వాలు గుత్తాధిపత్యం కలిగి ఉన్న రక్షణ రంగ నిర్వహణ, కొనుగోళ్ళలో అంతర్జాతీయంగా ఇంత అస్తవ్యస్త, అవినీతిపర వాతావరణముండగా; మన దేశంలో

పరిస్థితులు భిన్నంగా ఎలా ఉంటాయి? అసలే అతి క్రింది స్థాయినుంచి అవినీతిలో కూరుకుపోయిన మన పాలనా వ్యవస్థ పైకెళ్ళే కొద్దీ ఎలా నీతివంతమవగలదు? నిజానికి పైకెళ్ళే కొద్దీ అవినీతి పరిమాణం పెరుగుతుంది. గోప్యత, సున్నితత్వం, ద్వైపాక్షిక ఒప్పందాలు, విదేశాంగ విధానం ఇత్యాది సాకుల నీడలో జరగాల్సిందంతా సాఫీగా జరిగిపోతుంది. ఇందులో ఏ పార్టీకి, ఏ ప్రభుత్వానికీ మినహాయింపు లేదు.

ప్రభుత్వాలు తమ ముఖ్య కర్తవ్యాలైన ప్రజారక్షణ, కోర్టుల నిర్వహణ, అంతర్గత, సరిహద్దుల రక్షణలకు పరిమితమైతే తమకు అప్పగించిన విధుల్లో వారి పనితీరును అంచనా వెయ్యడానికి, తప్పొప్పులను ఎంచడానికి, ఒకసారి జరిగిన పొరపాట్లు మళ్ళీ జరగకుండా చూసే వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవడానికి వీలుంటుంది.

కాని కల్లు గీత నుంచి మొదలుకొని కార్గిల్ యుద్ధం వరకు అన్నీ తానై ప్రజల పురిటినుంచి కాటిదాకా ప్రతి సామాజిక, ఆర్థిక, వ్యక్తిగత విషయాల్లోను తలదూర్చే ప్రభుత్వాల పరిపాలనలో దేశరక్షణ, రక్షణ రంగ నిర్వహణ ఒక అప్రాధాన్య అంశమై పోయింది. ప్రజల్లో అత్యధిక శాతం మందిని బిచ్చగాళ్ళుగా, ప్రభుత్వం మీద ఆధారపడనిదే బతకలేని వాళ్ళుగా, నాలుగు నిజాలతో పాటు రెండు అబద్ధాలు కూడా జోడించి ఏదో ఒక ఉచిత పథకంలో లబ్ధిదార్లుగా మార్చి, వారి నోటితోనే 'తింటే తప్పేంటి, ఎవరు మాత్రం తినలేదు, తినట్లేదు?' అనిపిస్తున్న రాజకీయ జాణతనమే ఇప్పుడు రాజ్యమేలుతోంది.

అందుకే ఎన్ని బోఫోర్సు స్కాములు, ఎన్ని టెట్రా ట్రక్కులు, ఎన్ని ఇస్రో స్కాములు బయటపడ్డా.... హెలీకాప్టర్ కొనుగోలు స్కాములు జరుగుతూనే ఉన్నాయి. 'దొరికినప్పుడు కదా....దొరికినా ఆ కాసేపే కదా చూసుకుందాంలే' అన్న నిర్లిప్త, నిర్లజ్జ భావన; ప్రజల జ్ఞాపక శక్తి లేమి మీద వారికున్న అచంచల విశ్వాసాలే – నాయకులను, అధికారులను ధైర్యంగా అవినీతి బాటలో నడిపిస్తున్నాయి. రాబోయే బడ్జెట్‌లో విడుదల కాబోతున్న ఆహార భద్రత; నగదు బదిలీ ఇత్యాది పథకాల మోతలో – అగస్టా హెలీ స్కాము శబ్దం మరుగునపడిపోక తప్పదని ప్రభువుల నమ్మకం.

17-02-2013

మత ప్రేరిత ఉన్మాదం

మనుషుల సామాజిక ప్రవర్తన, నైతికత, రాజకీయ ఆలోచనలను వారు ఆచరించే మతం, దాని సంప్రదాయాలు చాలావరకు ప్రభావితం చేస్తాయి. ఇది దురదృష్టకరమైనప్పటికీ, విస్మరించజాలని వాస్తవం. అన్ని మతాలు ఒకేలా ఉండవు. అన్ని మతాలు ఒకటేననీ, వాటి సారాంశం ఒకటేనని 'భగవంతుణ్ణి' చేరుకునే మార్గాలు వేరని, అసలవి కూడా వేరుకావని చెప్పే ఊకదంపుడు కబుర్లు పక్కన పెట్టి; వాస్తవాలను చూస్తే, వివిధ మతాల గ్రంథాలు, సంప్రదాయాలు, బోధనలు, ఆచరణ విధానాలు, ప్రాపంచిక దృష్టి కోణాల్లో చాలా తేడాలుంటాయి.

అంతేకాక పైకి చెప్పేదానికి, చేసే పనులకూ వివిధ ప్రాంతాల్లో, కాలాల్లో తేడాలుంటాయి. ఇవన్నీ కొన్ని శతాబ్దాలుగా – క్రింద పడుతూ లేస్తూ, పరిణామం చెందుతూ ఈ రోజున ఒక స్థితికి చేరుకున్నాయి. ఈ మతాలన్నీ ఈ రోజున ఏం చెబుతున్నాయి, ఏం చేస్తున్నాయనేదే మనకు ముఖ్యం.

మనం వర్తమానంలో ఎదుర్కొంటున్న ఉగ్రవాదం లాంటి ముఖ్య సమస్యలను అర్థంచేసుకోవడానికి, పరిష్కారాలు వెతకడానికి మతాల ప్రస్తుత కార్యవ్యవహార శైలిని పరిశీలించాల్సి ఉంటుంది. కాకపోతే క్లుప్తంగా వాటి చారిత్రక పరిణామ క్రమాన్ని పరిశీలిస్తే నేటి – ఎందుకు, ఏమిటి, ఎలా అన్న ప్రశ్నలకు సులభంగా జవాబులు దొరుకుతాయి.

మధ్య ప్రాచ్యంలోని ఎడారుల్లో మూడు ముఖ్య మతాలు ఆవిర్భవించాయి. యూదుల మతం, తర్వాత క్రైస్తవం, ఆఖరుగా ఇస్లాం మతం వివిధ కాలాల్లో ఏర్పడ్డాయి. ఈ మూడూ తమకంటూ మతగ్రంథాలుండి, మతస్థులందరూ ఆ గ్రంథాన్ని పాటించేలా నిర్దేశిస్తాయి. అంతేకాక ఇవి సృష్టిని ఒక అనుదైర్ఘ్య (longitudinal) దృష్టితో చూస్తాయి. అంటే వీరి దృష్టిలో సృష్టి ఒకానొక క్షణాన ఒకానొకరి ప్రమేయం వల్ల పుట్టిందనీ, ఒకానొక పరిస్థితిలో అంతమవుతుందని నమ్ముతారు. ఈ ఆలోచనకు భిన్నంగా హైందవం,

బౌద్ధం, జైనం సృష్టిని ఆది అంతములు లేని చక్రీయ (Cyclical) దృగ్విషియాలుగా (Phenomenon) చూస్తాయి. మధ్యప్రాచ్య మతాలు మూడూ తమ తమ మతస్థులు ప్రత్యేకంగా దైవ కృప కలిగి, దీవించబడిన వారని చెబుతాయి. ముఖ్యంగా క్రైస్తవులు, ముస్లిములు ఇతరులను తమ మతంలోకి మార్చుకోవడం దైవకార్యంగా, బాధ్యతగా భావించి ఆ దిశగా కృషి చేయాలని బోధించబడ్డారు. ఈ పనిలో ఏమేమి చెయ్యొచ్చో వారి వారి మత గ్రంథాల్లో సవివరంగా రాసుకున్నారు. ప్రపంచాన్నంతటినీ తమ మతం నీడలోకి తీసుకురావడానికి ఎంతటి హింసకైనా తెగబడొచ్చన్న స్పష్టమైన ఆదేశాలివ్వ బడ్డాయి.

కాకపోతే ఒక విషయాన్ని గుర్తించక తప్పదు. ఈ మతాలు పుట్టి, వాటి ఆచరణ వ్యవహారాలను గ్రంథస్థం చేసిన కాలంలో అవిద్య, అశాస్త్రీయత, అత్యంత పరిమితమైన ప్రాపంచిక సంబంధాలు, ఎక్కడ జూసినా విపరీతమైన హింస రాజ్యమేలుతుండేవి.

వీటిని స్థాపించిన వారికి తమదగ్గర్లోని పరిసరాలు తప్పించి దూరాన ఉన్న ప్రజల వ్యవహారాల గురించి పెద్దగా తెలియదు. తమ మతస్థులను సమైక్యంగా ఉంచడం, వారి జీవన విధానంలో కొంత ఏక రూపం తీసుకురావడం, వారిని యుద్ధాలకు పురిగొల్పడం, మత వ్యాప్తి పేరుతో వారిని ప్రోత్సహించి, ప్రేరేపించడానికే మత గ్రంథాల్లో కఠిన నియమాలు, ఆదేశాలు నింపారని తర్కపరంగా ఆలోచిస్తే అర్థమవుతుంది. ఆ రకంగా ఆధ్యాత్మిక, ఐహిక, రాజకీయ ప్రయోజనాలు ఒకదానినొకటి పెనవేసుకొని పరస్పర ఆధారితాలై ఉండేవి.

యూదులు మత మార్పిడులు, మత వ్యాప్తి కంటే తమ మతస్థులను, తమ జీవన విధానాన్ని కాపాడుకోవడంలోనే నిమగ్నమయ్యారు. వారి గ్రంథం నుంచి కొన్ని మార్పులతో వెలువడిన క్రైస్తవ గ్రంథం బైబిలు. క్రైస్తవ మతం వ్యాప్తిచెంది దాదాపు పశ్చిమార్ధ గోళం మొత్తానికి పాకే క్రమంలో; మతం కోసమో, మతం పేరిటో యుద్ధాలో బాగానే జరిగాయి. ఏడో శతాబ్దంలో ఇస్లాం మతం పుట్టాక ముఖచిత్రం మరింతగా మారింది. యూదులు, క్రైస్తవుల గ్రంథాల నుంచి తీసుకున్న విషయాలు, సూత్రాలకు మరిన్ని నిబంధనలు చేర్చి ఖురాను తయారైంది.

యూదులతో క్రైస్తవులకు, ఈ ఇద్దరితో ముస్లిములకు రేగిన ఆధ్యాత్మిక, సైద్ధాంతిక, రాజకీయ ఘర్షణలు దాయాదుల పోరును తలపిస్తాయి. ఇస్లాం తూర్పువైపు సాగి అనతికాలంలో ఖండాంతరాలకు వ్యాపించింది. తూర్పు, పడమరలు కలిసే మధ్యప్రాచ్యం, మధ్యధరా సముద్రతీరాలు శతాబ్దాల పాటు క్రైస్తవ - ముస్లిం పోరాటాలకు యుద్ధక్షేత్రాలయ్యాయి.

పశ్చిమ దేశాల్లో 13,14 శతాబ్దాల కాలంలో జ్ఞానోదయమై రాజ్యం, మతం వేరువేరనే భావనలు వేళ్ళూనుకున్నాయి. క్రైస్తవ మతంలో కొన్ని సంస్కరణలు, కొత్త తెగలు, ఛాందసం నుంచి దూరంగా జరగడం, వ్యక్తి స్వేచ్ఛకు ప్రాధాన్యత పెరగడం, వ్యక్తిని ఒక సాధనంగా కాక లక్ష్యంగా పరిగణించడం, మతాచారాలను విమర్శించి సంస్కరించగలగడంతో; సాంస్కృతిక పునరుజ్జీవనం, పారిశ్రామిక విప్లవాల నేపథ్యంలో మతం ఒక వ్యక్తిగత విషయంగా మరుగున పడిపోయింది. లౌకిక, ప్రాపంచిక విషయాల్లో దానిపాత్ర నామమాత్ర మయింది. ఈ మధ్య వాటికన్ కూడా భగవంతుణ్ణి చేరడానికి అనేక మార్గాలున్నాయని కాథలిక్ చర్చి గుర్తిస్తోందని అధికారికంగా ప్రకటించడం పూర్వఛాందసాల సరళీకరణకు నిదర్శనం.

దురదృష్టవశాత్తు అనేక కారణాల వల్ల ఈ రకమైన మార్పులు ఇస్లాం మతంలో రాలేదు. మత విషయాలపై బహిరంగ శోధన, చర్చ, మతాన్ని ఆధునిక సమాజానికి అనుగుణంగా సంస్కరించుకునే ప్రయత్నాలు సరైన స్థాయిలో జరగలేదు, ఎవరైనా ప్రయత్నించినా సాగనివ్వలేదు. నిజానికి ఛాందసం ఇంకా పెరిగి, ఆధునిక సాంకేతికత తెచ్చిన అవకాశాలతో మరింతగా ప్రబలుతోంది. అంతర్గతంగా గానీ, ఇతర మతస్థులు గానీ – సంస్కరణల గురించి మట్లాడితే; హింసాత్మకంగా నోళ్ళు మూయించడం జరుగుతోంది. దాంతో శతాబ్దాల క్రిందట మత గ్రంథాల్లో రాసిన నియమాలు, ఆదేశాలే నేటికీ ప్రామాణికాలవుతున్నాయి. విగ్రహారాధకుల్ని, ఇతర మతస్థులను నిర్దాక్షిణ్యంగా చంపేయడానికి 'పవిత్ర' యుద్ధాలకు పిలుపునివ్వడం, ఆ యుద్ధంలో మరణిస్తే – స్వర్గంలో 72మంది కన్యలు వీరికోసం ఎదురు చూస్తుంటారని నమ్మించడం, మతవ్యాప్తి, మత మార్పిడిలను ప్రోత్సహించడం, ఇవన్నీ వ్యక్తిగత నిర్ణయాలు గాక మతస్థుల పవిత్ర బాధ్యతలుగా నమ్మడం, నమ్మించడం, ఎడతెగని ప్రచారం చెయ్యడంతో రాజకీయాలు, మతం విడదీయలేనంతగా కలిసిపోయి హింసకు – మతపరంగా లైసెన్సు ఇచ్చినట్లయింది.

దీనికి తోడు గత నూరు సంవత్సరాలుగా చమురుకు విపరీతంగా గిరాకీ పెరగడం, అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాలన్నీ చమురు మీద ఆధారపడడంతో అగ్నికి అజ్యం పోసినట్లయింది. అత్యధిక చమురు క్షేత్రాలున్న మధ్య ప్రాచ్యపు ముస్లిమ్ దేశాలకు ఊహించని స్థాయిలో పెట్రో డాలర్లు వచ్చిపడడంతో; అందులో కొంత భాగం మిలిటెంట్ ఇస్లాంకు మళ్ళింది. నిధులు కొరత లేకపోవడంతో ఉగ్రవాదం ప్రపంచమంతా విస్తరించింది. ఆగ్రరాజ్యాలు కూడా చమురు మీది ఆశతో ఉగ్రవాదాన్ని పెంచి పోషించే సౌదీ అరేబియా, ఇరాన్, ఇరాక్ వంటి దేశాలతో విడతలు విడతలుగా అంటకాగడం, తమ దేశాలపై దాడులు

జరిగేంత వరకు ఉపేక్షించడంతో ఉగ్రవాదం అంతర్జాతీయంగా ఒక భరించక తప్పని భయంకర వ్యాధిగా మారింది.

దీనికి పేదరికాన్ని కారణంగా చూపడం సమస్య అసలు మూలాలను విస్మరించడమే అవుతుంది. ఇంగ్లండులో పనిచేసే డాక్టర్లు కూడా ఉగ్రవాద సంస్థల్లో ముఖ్య పాత్రలు పోషించడం – దీనివెనుక ఉన్న మత రాజకీయ పునాదులను సూచిస్తోంది. కాకపోతే పేద దేశాల్నుంచి వచ్చే ముస్లిమ్‌లను మానవ బాంబులుగా మారడానికి ప్రోత్సహించడం కొంచెం తక్కువ ఖర్చుతో కూడుకున్నది కావచ్చు.

ఇంత అననుకూల వాతావరణంలో అసలే బలహీనమైన భారతదేశ పరిస్థితి ఇంకా దయనీయం. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ముస్లిం జనాభా కలిగి, ఒక పక్క పాకిస్థాన్, ఇంకోపక్క బంగ్లాదేశ్, మూడో పక్క చల్లారని, చిక్కు వీడని కాశ్మీర్ సమస్యతో పాటు చమురు దిగుమతుల మీద ఆధారపడ్డ ఆర్థిక వ్యవస్థ. ఇవి చాలవన్నట్లు మైనారిటీ ఓటు బ్యాంకు కోసం అన్ని రాజకీయ పక్షాలూ ముస్లిమ్‌లను ప్రసన్నం చేసుకొనే పోటీ ప్రయత్నాలు, ప్రత్యేక వ్యక్తిగత చట్టాలు, ప్రత్యేక విద్యాసంస్థలు, సంస్కరణలను నిరాకరించే మత పెద్దల మౌఢ్యం, చిన్న విమర్శను కూడా తట్టుకోలేని 'విపరీత సున్నితత్వం' – ఇవన్నీ పౌర జీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. రెండొందల యేళ్ళకు సరిపడా బొగ్గు నిల్వలున్నా, బొగ్గు సరఫరా ప్రభుత్వం ఆధీనంలో ఉండడంతో – కొరతల, అవినీతి మయమైపోయింది. థర్మల్ కేంద్రాల కేటాయింపు ఆశ్రిత పెట్టుబడీదారీ బాట పట్టింది. దాంతో గుండెమండిన ప్రజానీకం పర్యావరణ కాలుష్యంపేరిట వ్యతిరేకించడం, ఆందోళనలు చేయడం ఎక్కువై పారిశ్రామిక అభివృద్ధి స్తంభించిపోయింది.

ఉగ్రవాదాన్ని నిలువరించడం, తరిమికొట్టడం, ఎంతో ఖర్చుతో కూడుకున్న పని. డబ్బు రూపంలోనే కాక, సామాజికంగా, రాజకీయ పరంగా, దౌత్యపరంగా, చట్టాలు, న్యాయస్థానాల పరంగా, కొన్ని కఠినమైన, ఖర్చుతో కూడిన, దీర్ఘకాలిక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. భారతదేశాన్ని ప్రపంచ ముస్లిం సమాజం దృష్టిలో దారుల్ హరబ్ (శత్రుదేశంగా) అభివర్ణించడాన్ని, భారత్‌పై జిహాద్ ప్రకటించడాన్ని – మత పెద్దల స్థాయిలో తీవ్రంగా, బహిరంగంగా, మేధో పరంగా, రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా ఎదుర్కోవాల్సి ఉంటుంది. చదువుకున్న ముస్లింలతో మొదలుపెట్టి – వారిని మతఛాందసానికి దూరంగా జరపగలగాలి. చమురు మీద ఆధారపడడం తగ్గించి, ఇతర ఇంధనాలను వాడడం, అణు విద్యుత్తును పెద్ద ఎత్తున అనుమతించడం మొదలుపెట్టాలి.

కానీ మన అనుభవాలను బట్టి చూస్తే ఈ రకమైన పరిష్కారాలకు మన సమాజం, రాజకీయం, మేధావి, మీడియా వర్గాలు సిద్ధంగా లేవనిపిస్తోంది. ఇటీవల కసబ్, అఫ్జల్

గురుల ఉరితీతల తర్వాత; అందరికీ వీరప్పన్ అనుచరుల ఉరి అమలు చేస్తారేమోననే బెంగ అకస్మాత్తుగా పట్టుకుంది.

వ్యాసాలు, వ్యధాభరిత కథనాలు మొదలయ్యాయి. వీరప్పన్ అనుచరులు అటవీశాఖాధికారులతో సహా ఎంతమందిని కిరాతకంగా చంపారో అంతా మరచిపోయారు.

ఢిల్లీలో ఒక కిరాతకమైన మానభంగం, హత్య జరగ్గానే అందరూ వీధుల్లోకి వచ్చి తక్షణ ఉరిశిక్షను డిమాండు చేసిన అసహనం ఏమయ్యింది? ఇంత చంచల స్వభావమున్న, అపరిపక్వ సమాజం. కఠినమైన నిర్ణయాలు తీసుకోవాలంటే దూరదృష్టి గల, మొహమాటంలేని, దృఢమైన నాయకత్వం అవసరం. మత మౌఢ్యాన్ని, మత విస్తరణ, మత మార్పిడి, 'పవిత్ర' యుద్ధ లక్ష్యాలను పూర్తిగా ప్రక్కన పెట్టకపోతే ఉగ్రవాదుల తయారీ ఆగదు. ఒక పెద్దాయన అన్నట్లు, **మతమన్నది లేకపోతే మంచి వాళ్ళు మంచి పనులు చేస్తారు. చెడ్డవాళ్ళు చెడ్డపనులు చేస్తారు. మంచి వాళ్ళతో కూడా చెడ్డ పనులు చేయించడం – కేవలం మతానికే సాధ్యం.**

03-03-2013

బడ్జెట్ తంతులు

ఇది బడ్జెట్‌ల కాలం. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ విడుదలై పదిహేను రోజులైంది. రాష్ట్ర బడ్జెట్ రేపు రాబోతోంది. ప్రతి బడ్జెట్‌నూ అధికార పక్షాలు ప్రశంసించడం, ప్రతిపక్షాలు విమర్శించడం, పత్రికలు మొక్కుబడి విశ్లేషణలు, తప్పనిసరి సంపాదకీయాలతోసుతి మెత్తగా మందలించడం మినహా– సామాన్య ప్రజలకు దాన్ని గురించిన అవగాహన అతి స్వల్పం. ఎన్నికలు, మ్యానిఫెస్టోలు, పాదయాత్రలు, ఉద్యమాల వంటి ఇతర రాజకీయ ప్రక్రియల లాగానే బడ్జెట్లు కూడా పదజాలాల కనికట్టులో అంతా అర్థమైనట్టే ఉంటుంది గానీ; అసలు మర్మం జనం దృష్టికి రాదు.

అమాయకత్వం ఏ స్థాయిలో ఉంటుందంటే; బడ్జెట్ పరిమాణం పెరిగితే చిన్న పిల్లల్లా కేరింతలు కొడతారు. రాష్ట్ర బడ్జెట్ లక్ష కోట్లు దాటగానే సంబరాలు చేసుకున్నారు. బడ్జెట్ ఎంత పెరిగితే మన జేబులకు అంత పెద్ద చిల్లు పడుతోందని; అంత ఎక్కువ మొత్తంలో మన డబ్బును ఈ అవినీతిమయ రాజకీయ వ్యవస్థ చేతుల్లో పెడుతున్నామని; అంతమేరకు మన డబ్బు మన కిష్టమొచ్చిన వాటికోసం ఖర్చుపెట్టే స్వేచ్ఛను – కోల్పోతున్నామని గ్రహించడానికి ఏ పాటి జ్ఞానం కావాలి?

ఏ శాఖకు, ఏ పద్దుకు, ఏ పథకానికి ఎంత కేటాయించారో పక్కన పెడితే; అసలు పన్నుల వసూలు కార్యక్రమం ఒక అనైతిక ప్రక్రియ అని, దాన్ని ఎంత పరిమితంగా ఉంచగలిగితే అంత మేలని గ్రహించాలి. ప్రభుత్వ కార్యక్రమాల విస్తరణకు ఫుల్‌స్టాప్ పెట్టి, వాటిని క్రమేపి తగ్గించే దిశగా ప్రజాభిప్రాయం ఉండాలి. ఎందుకంటే ప్రభుత్వ విస్తరణ ఉచితంగా జరగదు. మనం కట్టే పన్నుల డబ్బుతోనే జరుగుతుంది. ప్రభుత్వ శాఖలు, వాటి కార్యక్రమాలు ఎంత అవినీతి భరితంగా, ఆశ్రిత పక్ష పాతంతో, అసమర్థతతో జరుగుతాయో తెలిసి కూడా ప్రభుత్వ కార్యక్రమాలు మన జీవితాల్లోకి మరింతగా చొచ్చుకుపోవడాన్ని సమర్థించడం – మన అవగాహన లేమికి, భావ వైరుధ్యానికి నిదర్శనం.

బడ్జెట్లలో మన కంటికి కనిపించని అంశాలు చాలా ఉంటాయి. వాటిని ప్రతిపక్షాలు కూడా ఎత్తి చూపవు. ఎందుకంటే – అధికారంలో ఉన్నప్పుడు వారు కూడా అవే పనులు చేస్తుంటారు కాబట్టి. ఈ విషయంలో రాజకీయ నాయకులు ఒక ప్రత్యేక వర్గ స్వభావం తో వ్యవహరిస్తారు. బడ్జెట్ విడుదలైన కొద్ది గంటల్లోనే (ఛానళ్ల వారికైతే కొద్ది నిమిషాలలోనే) తమ వ్యాసాలు, కథనాలు తయారుచేసి పంపాల్సిన ఒత్తిడిలో, పాత్రికేయులు కూడా మౌలిక విషయాల జోలికి పోరు.

ఆర్థిక మంత్రులు, అధికారులు, సలహాదారులు – తమ స్వీయానుభవాల్నుంచి, ఇతర దేశాల్నుంచి కొన్ని మెలకువలు నేర్చుకున్నారు. ఉదాహరణకు వ్యక్తిగత ఆదాయపు పన్ననే తీసుకుంటే; పన్నుశాతం పెంచలేదన్నట్లే ఉంటుంది. కానీ, కనీసాదాయ పరిమితిని గానీ, శ్లాబులను గానీ మార్చరు. ఏటా దాదాపు పది శాతం ద్రవ్యోల్బణం వల్ల పన్ను చెల్లించాల్సిన వారి సంఖ్య.... కట్టే పన్నుల పరిమాణం చాప కింద నీరులా పెరిగి పోతుంటుంది. ఎప్పుడో ఒక విద్యా పథకం కోసం వేసిన సెస్సు – దశాబ్దాలు గడచినా అలాగే ఉంటుంది. ఈ కామధేనువు ఇచ్చే పాలు ఏటా పెరుగుతూ ఉంటాయి. ఇందిరాగాంధీ జమానాలో అత్యధిక పన్ను శ్లాబులో పన్ను శాతం 90 శాతాన్ని మించేది. అదే స్ఫూర్తితో ఇప్పుడు సంవత్సరానికి కోటి రూపాయల పైబడి సంపాదించే వారిపై పది శాతం సర్‌ఛార్జి విధించారు. అంటే – సమర్థులై, ఎక్కువ ఉత్పాదకత చూపిన వారికి విధించిన శిక్ష అన్న మాట అది.

దాన్ని చూసి, ఆ స్థాయిలో సమర్థులు కానివారంతా లోలోపల సంతోషిస్తారు. అలాగే – ఉన్న పన్నులను పెంచకుండా, కొత్త రకం పన్నులను ప్రవేశపెడతారు. ఉదాహరణకు; సాంప్రదాయక ఆదాయపు పన్ను, సెంట్రల్ ఎక్సైజు, కస్టమ్స్ వంటి పన్నులను ముట్టుకోకుండా 'సేవా పన్ను' అనే కొత్త పన్నును ప్రవేశపెట్టడం గుర్తుండే ఉంటుంది.

మొదట్లో ఇదేమిటో ఎవ్వరికీ అర్థం కాలేదు. తర్వాత్తర్వాత అర్థమైనా చేయగలిగిందేమీ లేదు. అప్పట్లో సామాన్య ప్రజలకు సంబంధంలేని కార్పొరేట్, స్టాక్ మార్కెట్ సేవలకు మాత్రమే అన్నట్లు విధించిన ఈ పన్ను – ఇప్పుడొక ముఖ్య ఆదాయ వనరయింది. ప్రతిఏటా దాని పరిధిలోకి వచ్చే సేవల సంఖ్యను పెంచుతూ పోయారు. ఇప్పుడు ఏ స్థితికి వచ్చిందంటే; ఈ సేవా పన్ను 'పరిధిలోకి రాని' సేవలను మాత్రమే ప్రకటిస్తున్నారు. ఇప్పుడది హోటలు బిల్లు, సెల్ ఫోను బిల్లు, రైలు రిజర్వేషన్ – ఇలా అన్నిటిలోనూ భాగమై పోయింది. ఆదాయపు పన్నును, రాబడి నుంచి ఖర్చులు తీసేయగా మిగిలిన నికరాదాయం మీదనే విధిస్తారు. కానీ సేవా పన్నును – లాభనష్టాలతో సంబంధం

లేకుండా మొత్తం టర్నోవరు మీద విధిస్తారు. సుమారు రెండు లక్షల కోట్ల స్థాయిలో, ఇదిప్పుడు ఎక్సైజు, కస్టమ్స్ పన్నులకు సమమైంది. త్వరలో ఇది ఆదాయపు పన్ను రాబడిని మించిపోయినా ఆశ్చర్యపోనక్కరలేదు. ఇంత దుర్మార్గమైన పన్ను గురించి ఎక్కడా చర్చగానీ, విమర్శగానీ లేకుండా మెత్తని సూది గల సిరంజితో రక్తం లాగేయడమే అసలైన 'చిదంబర' రహస్యం.

అలాంటిదే ఇంకో పన్నును – ఈ సంవత్సరమే ప్రతిపాదించారు. ప్రతి స్థిరాస్తి క్రయవిక్రయం మీదా ఒక శాతం పన్ను.

చూడ్డానికిది ఆస్తులు కలవారికి, కొనడం, అమ్మడం చేసేవారికే కదా; మనదేం పోయింది అనిపిస్తుంది. కానీ కాలక్రమేణా సేవా పన్నులాగే ఇది కూడా విస్తరించి, ప్రతి ఒక్కరికి చుట్టుకుంటుంది. ఇదసలు ఫెడరల్ స్ఫూర్తికి కూడా విరుద్ధం. స్థిరాస్తులపై పన్ను, అమ్మకం పన్ను రాష్ట్ర పరిధిలోనివి. కానీ విద్యా సెస్సు, స్థిరాస్తిపై అమ్మకం పన్నుల ద్వారా రాష్ట్రాల అధికారాల పరిధిలోకి కేంద్రం చొచ్చుకొని వస్తోంది. పెరుగుతున్న కేంద్రీకృత విధానాలకు ఇదొక సూచిక. ఈ వాతావరణంలో రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక సంస్థలకు అధికార వికేంద్రీకరణ చేస్తాయను కోవడం అత్యాశే అవుతుంది.

బడ్జెట్ లోటు – మరో మాయాజాలం. దేశ స్థూల ఉత్పత్తి సుమారు వంద లక్షల కోట్లు కాగా, బడ్జెట్ లోటు సుమారు ఐదున్నర లక్షల కోట్లు. ఇది పూడ్చడానికి సుమారు ఆరున్నర లక్షల కోట్లు ప్రజల నుంచి, బ్యాంకుల నుంచి అప్పులుగా సేకరిస్తారు. సుమారు లక్ష కోట్లు కృత్రిమ డబ్బు ముద్రిస్తారు. అరవై అయిదు లక్షల కోట్లకు చేరిన పాత అప్పులపై వడ్డీ, వాయిదా చెల్లించడానికి మూడున్నర లక్షల కోట్లు ఖర్చవుతుంది. అంటే ఆరున్నర లక్షల కోట్ల మేరకు ప్రజలకు, పరిశ్రమలకు బ్యాంకుల నుంచి అప్పులు దొరకవు. మనం కష్టపడి పొదుపు చేసిన దాంట్లోంచి సింహభాగం ప్రభుత్వం లాక్కెళు తోంటే, పెట్టుబడులు, యాంత్రీకరణ, ఉత్పత్తి ఎలా పెరుగుతాయి? మరి ఆర్థికాభివృద్ధి తొమ్మిది శాతం నుంచి నాలుగన్నర శాతానికి పడిపోవడంలో ఆశ్చర్యమేముంది?

ప్రభుత్వం చేసే అప్పులు – ఒక మోసపూరిత స్కీము లాంటిది. అప్పుల పరిమాణం, దానికి కట్టే వడ్డీ, వాయిదాలు ఎంతగా పెరిగిపోతున్నాయంటే; అతి త్వరలోనే – ప్రభుత్వాలు అప్పులు ఎగవేయక తప్పదు. అప్పుడు జరగబోయే ఆర్థిక, ద్రవ్య వినాశనాన్ని ఏ యేటి కాయేడు వాయిదా వేస్తూ వస్తున్నారు. ఈ పన్నులు, అప్పులతో నడిచే బడ్జెట్‌లో అరవై డెబ్భై శాతం ప్రభుత్వోద్యోగుల జీతభత్యాలకే సరిపోతుంది. ఏ ఉచిత పథకమైనా దానివల్ల లబ్ధిదారులకు కూడా ప్రయోజనం పరిమితం, తాత్కాలికమే. కానీ ఆర్థిక వ్యవస్థకు జరిగే నష్టం అపారం, శాశ్వతం. లబ్ధిదారులు కూడా – ఒనగూడిన లాభం కన్నా;

తెలియకుండానే ఎక్కువ నష్టం అన్ని వైపులనుంచి అనుభవించాల్సి ఉంటుంది. రూపాయికి కిలో బియ్యం దొరగ్గానే సరిపోదు. దానివల్ల ఇతర వస్తువుల ధరలన్నీ పెరుగుతాయి. మద్యం ధర 15 నుంచి 90 రూపాయలవుతుంది. బట్టలు, స్కూలు ఫీజులు, ప్రయాణ ఖర్చులు, సిమెంటు రేకులు-అన్నిటి ధరలూ పెరుగుతాయి. ఫీజు రీయింబర్సుమెంటు ఇచ్చారు కదాని సంబరపడితే; పనికిరాని చదువులతో నాలుగేళ్ళ విలువైన జీవితం వ్యర్థం. ఎవరో కొందరికి పనికొచ్చిన ఆరోగ్యశ్రీలతో ప్రభుత్వ ఆసుపత్రుల నిర్వహణ పూర్తిగా దిగజారిపోవడం. పేలుడు సంఘటనలో గాయపడినవారిని కూడా ఉస్మానియాకు కాకుండా ప్రైవేటు వైద్యశాలలకు తరలించాల్సిన దుస్థితి.

లక్ష కోట్లు పోసిన జలయజ్ఞం సొమ్మంతా ఎటు పోయిందో అందరికీ తెలుసు. ఉచిత విద్యుత్ ఖర్చు పదిహేనువేల కోట్లు కాగా, మద్యం మీద పన్నుల 'ఆదాయం' ఇరవై వేల కోట్లు. రాష్ట్రంలో కోటి ఇందిరమ్మ ఇళ్ళు కట్టారట. అంటే మొత్తం ఇళ్ళలో సగానికి సగం అవే ఉండాలిగా! ఉన్నాయా?

దీనికి తోడు, ప్రతి సంవత్సరమూ కొత్త కొత్త నియంత్రణలు. ప్రభుత్వం విధించే ప్రతి నియంత్రణా ఉత్పత్తి శక్తుల, వినియోగదారుల ప్రయోజనాలను అంతిమంగా పాతరేసేదే. వేలకొద్దీ జీతాలు పోసి కూడా ప్రభుత్వ పాఠశాలల్లో సరిగ్గా పాఠాలు చెప్పించలేని ప్రబుద్ధులు ప్రైవేటు స్కూళ్ళను నియంత్రించడం! ప్రైవేటు స్కూళ్ళ ఫీజులు నియంత్రించే చట్టాలు! అంటే అవి కూడా ప్రభుత్వ స్కూళ్ళలాగే భ్రష్టుపట్టి పోవాలన్నమాట.

ఇదే పరిస్థితి అన్ని రంగాల్లోనూ, అన్ని స్థాయిల్లోనూ రాజ్యమేలుతోంది. ఫలితాలు కూడా అలాగే ఉంటాయి మరి. మనకన్నా జనాభాలో ముప్ఫైరెట్లు చిన్నదయిన ఆస్ట్రేలియాలో మూడున్నర లక్షల మంది విదేశీ విద్యార్థులు చదువుకుంటున్నారు. మన దేశంలో పట్టుమని పదివేలు కూడా లేరు. ఇదీ మనం అరవై ఏళ్ళుగా సాధించిన ఘనత.

సంస్కరణల వల్ల ఉవ్వెత్తున ఎగసిన ఆర్థికాభివృద్ధి ఫలాలను ఆరగించడానికి రాజకీయ వ్యవస్థ - విందు బంతిలో కూర్చుంది. మొదటివరసలో ఎవరు కూర్చోవాలోనని పోటీ పడుతున్నారు. పదార్థాలు (సంపద) పెరిగేకొద్దీ ఈ కాకుల్లో క్రిమినల్ కాకుల చేరిక ఎక్కువైంది. కొత్త కొత్త అరుపులతో మన దృష్టిని మరల్చడానికి ప్రయత్నిస్తుంటాయి. అటువంటి ప్రయత్నాల్లో భాగమే ఈ బడ్జెట్ తంతులు. కొత్త కొత్త ముష్టి పథకాలు చూసి మోసపోకూడదు. అంకెల్లోని సున్నాలు చూసి మురిసిపోకూడదు. ప్రభుత్యోద్యోగుల జీతాలు పెంచితే పన్నులు కట్టే కష్టజీవులు సంబరపడే అమాయకత్వం నుంచి బయటపడ్డప్పుడే- ప్రభుత్వాల నుంచి ప్రజలకు విముక్తి.

17-03-2013

విజ్ఞతకు పరీక్ష

ఈ మధ్య అసెంబ్లీలో ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం సందర్భంగా జరిగిన చర్చల్లో - ఆసక్తికరమైన సంవాదం చోటుచేసుకుంది.

డాక్టర్ జయప్రకాష్ నారాయణ అనర్గళంగా ఉపన్యసిస్తూ; ప్రభుత్వాలన్నీ ప్రజలను ఏ రకంగా తమ మీద ఆధారపడే బిచ్చగాళ్ళుగా మారుస్తున్నాయో, ఎన్నికల ఫలితాలను డబ్బు, మద్యం ఎలా ప్రభావితం చేస్తున్నాయో వివరంగా మాట్లాడారు. సభా నాయకులు తీవ్రంగా స్పందిస్తూ, ప్రజల విజ్ఞతను ప్రశ్నించజాలమన్నారు.

నిజంగా ప్రశ్నించలేమా? ప్రశ్నించకూడదా? ప్రశ్నించాల్సిన అవసరం లేదా? ప్రజాస్వామ్యమంటే ఒకరితో ఒకరు పోటీపడే జనాకర్షక పథకాల ఎంపికేనా? ప్రభుత్వాలను ఎన్నుకోవల్సింది వీటి కోసమేనా?

మిగతా జంతుజాలాలన్నటితోనూ పోలిస్తే - మనిషికున్న ప్రత్యేకత - తన మేధోశక్తి, సంక్లిష్ట భావాలను, సూత్రాలను అర్థంచేసుకోగల శక్తి. ముఖ్యంగా తన తక్షణ అవసరాలు, భావోద్వేగాలకు లోనుకాకుండా దీర్ఘకాలిక వ్యూహంతో ప్రణాళికా బద్ధంగా జీవించగలగడం కేవలం మనిషికే సాధ్యం. కానీ కేవలం దీర్ఘకాలిక ఆలోచనలే చేయాలని మనిషిని బలవంతపెట్టే నరాలేమీ మనిషిలో లేవు. ఇతర జంతువుల్లాగే కేవలం వర్తమానంలో, ఆ క్షణానికి పరిమితమై స్పందించే అంత:ప్రేరణే (Instinct) ప్రతి మనిషిలోనూ ఉంటుంది.

మనిషిలోని ఈ బలహీనతను సొమ్ముచేసుకోవడం ద్వారా ప్రజాస్వామ్య ప్రక్రియకు నైతికతను ఆపాదించే ప్రయత్నాలు చేస్తుంటారు. ప్రజల విజ్ఞతను ప్రశ్నించవచ్చో లేదో పరిశీలించడానికి - మనిషికున్న మరో ప్రత్యేక గుణాన్ని ఉపయోగిస్తే చాలు - అదే జ్ఞాపక శక్తి.

ఒక్కసారి గుర్తుచేసుకుంటే, *ఏసుక్రీస్తును శిలువ వెయ్యడం, బానిసల వ్యాపారం, యూదులపై నాజీ జర్మనీ మారణకాండ, ఢిల్లీలోను, గుజరాత్‌లోను మతం పేరిట జరిగిన*

పాశవిక జన హననం – ఇవన్నీ ప్రజల్లోని అత్యంత మెజారిటీ సభ్యుల ఆమోదంతో జరిగినవే. అంతమాత్రాన ఆ చర్యల్లోని అవిజ్ఞతను, వాటిని సమర్థించిన నాయకుల నైతికతను ప్రశ్నించకపోతే ఎలా?

కాబట్టి ఒక చర్యలోని నైతికతను ప్రజాభిప్రాయమనే గీటురాయిపై పరీక్షించలేమన్నది స్పష్టం.

తిరిగి ఉచిత పథకాల విశ్లేషణకొస్తే; అవి నైతికపరంగా దివాలాకోరుతనానికి, ఆర్థిక శాస్త్ర పరంగా అసమర్థతకు, తిరోగమనానికి ఆనవాళ్ళు. రాజకీయ పార్టీలు, నాయకులు దాని చుట్టూ సందడి చేస్తూ మహా అయితే అవి నిలబడగలవో లేవో, కొనసాగగలవో లేదో అనే విషయాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తారే తప్ప; వాటి నైతికతను ప్రశ్నించే సాహసం చెయ్యరు. ఎందుకంటే వారి చూపు – తదుపరి ఎన్నికలను దాటి ముందుకు పోదు.

అలాంటి సాహసాలు చేస్తే వర్తమాన రాజకీయాల్లో ఒక ప్రక్కకు నెట్టివేయ బడతామేమోననే భయం వారిని పీడిస్తుంది. రాజకీయాలతో సంబంధం లేని మేధో వర్గాల్లో కూడా ఈ విషయంపై చర్చించే చొరవ లేకపోవడానికి కారణం – 60 ఏళ్ళుగా మన దేశంలో 'సోషలిజం' ఒక పవిత్ర మతమై కూర్చుంది. సోషలిస్టు 'నైతికతే' – రాజ్య విధానమయింది. దానిలోని అంతర్గత వైరుధ్యాలు, దాని దారుణ వైఫల్యాలు, దాన్నుంచి పుట్టిన అవినీతి, అసమర్థత, అబద్ధ ప్రచారాలనే రాక్షసులు.... కంటికి కనిపించరు. ప్రత్యామ్నాయాల గురించిన ఆలోచనలు తలకెక్కవు. దేశ సామూహిక స్పృహలో సోషలిజం ఎంతగా పాతుకుపోయిందంటే; ప్రస్తుత తరానికి స్వాతంత్ర్యోద్యమంలోని మహా నాయకుల్లో నెహ్రూ మినహా మిగతా వారెవ్వరూ సోషలిస్టులు కారన్న విషయం కూడా తెలియదు.

గాంధీజీ, వల్లభాయ్ పటేల్ సోషలిస్టు, కమ్యూనిస్టు మార్గాలను, లక్ష్యాలను వ్యతిరేకించారు. రాజాజీ స్వతంత్ర్య పార్టీ స్థాపించి; ఊపిరి ఉన్నంత వరకూ (1974) సోషలిజానికి వ్యతిరేకంగా పోరాడారు. అంబేద్కర్ కూడా సోషలిస్టు కాదు. లోకనాయక్ జయప్రకాష్ నారాయణ్ కూడా సోవియట్ తరహా సోషలిజాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. కానీ సోవియట్ రష్యా వ్యవస్థను – అమితంగా ఇష్టపడిన నెహ్రూ గారి మాటే చెల్లుబాటయింది. ఆయన మొదలెట్టిన సోషలిస్టు విధానాలు, వ్యక్తిగత రంగంపై రాజ్య నియంత్రణలు; ఆయన పుత్రిక ఇందిరా గాంధీ, ఆ తర్వాత జనతాపార్టీ జమానాలో పరాకాష్టకు చేరి, ప్రభుత్వమంటేనే పంచిపెట్టే పథకాల మాంత్రికులని, దానికి ప్రజాస్వామ్యమే మార్గం, సిద్ధాంతం, రుజువు అనే పరిస్థితి వచ్చింది. ఇక ఈ భావజాలాన్ని ఎదిరించేవారుగానీ, ప్రశ్నించేవారుగానీ కనుమరుగైపోయారు.

ఆధునిక యుగంలో – రాజ్యాలు చాలా బలమైనవి. అవి తలచుకుంటే ఒక దేశం మొత్తాన్ని చాలా సంవత్సరాల వరకు ఒక తప్పుడు, చీకటి దారిలో నడిపించగలవు.
ఈ శతాబ్దపు ఉదాహరణలు మయన్మార్, ఉత్తర కొరియా, జింబాబ్వేలు; గత శతాబ్దంలో నాజీ జర్మనీ నడిచిన తీరు విశ్లేషించ దగింది. జర్మన్ ప్రజల భావావేశాలు రేకెత్తించడం ద్వారా, చూడ్డానికి ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిందనిపించే ఎన్నికల ప్రక్రియ ద్వారానే అధికారంలోకి వచ్చిన హిట్లర్ – ఎంతో పరిణతి చెందిన జర్మన్ సమాజానికే కళ్ళకు గంతలు కట్టగలిగాడు. ఇమ్మానుయేల్ కాంట్ ప్రతిపాదించిన తత్వం, దాన్ని ఇంకాస్త ముందుకు తీసుకెళ్ళిన గతి తార్కిక సిద్ధాంత కర్త హెగెల్ సిద్ధాంతాలతో ప్రభావితమైన జర్మన్ మస్తిష్కానికి జర్మన్‌లు ఆర్యులనీ, ప్రపంచాన్నేలే జాతి అని; యూదులు జాతి శత్రువులని, వారిని సమూలంగా నిర్మూలించాల్సిన చారిత్రక తరుణం వచ్చిందని, రాజ్యం సర్వోన్నతమని, దానికి దాసులుగా ఉండడమే ప్రజల ఏకైక కర్తవ్యమని – జర్మన్‌లను నమ్మించడానికి హిట్లర్ పెద్దగా కష్టపడనక్కర లేకపోయింది. దాని పరిణామాలు, పర్యవసానాలు అందరకు తెలిసిందే.

సోషలిస్టు భారతంలో జరిగింది, జరుగుతున్నది ఇలాంటిదే. సోషలిజం ఛత్ర ఛాయలో ప్రజలకవసరమైన, ప్రజలు ఉపయోగించే ప్రతి రంగాన్ని 'ప్రజా ప్రయోజనాల' పేరు మీద ప్రభుత్వం తన చేతుల్లోకి తీసుకోవడమో, లేక తీవ్రంగా నియంత్రించడమో జరిగింది. తద్వారా కొరతలు సృష్టించబడ్డాయి. ఆ కొరతగా ఉండే వస్తువులు, వనరులను ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తగా ఎంచుకున్న వర్గాలకు పంచిపెట్టే అధికారాలను హస్తగతం చేసుకున్నారు. దొరికిన వాళ్ళు – దాన్ని రాజ్యమిచ్చిన బహుమతిగా భావించారు. దొరకని వాళ్ళు – తమ వంతు కోసం ఓర్పుతో నిరీక్షించారు. దీన్నే ప్రజాభిప్రాయమని, ప్రజాస్వామ్యమని, ప్రజల విజ్ఞత అని పేర్లు పెట్టారు. అసలు పంచిపెట్టే పని నీకేంటని ప్రశ్నించేవాళ్ళు కరువయ్యారు. సిద్ధాంత పరంగా – ఈ ప్రక్రియను, దానిలో ఇమిడి ఉన్న పాలకవర్గ స్వలాభాపేక్షను విశ్లేషించగల తెలివితేటలు లేకపోయిన వారికి కూడా, ఈ విధానాల పర్యవసానాలు, దుష్ఫలితాలు కళ్ళెదుటే కనబడుతున్నాయి.

పూర్తిగా ప్రభుత్వ అజమాయిషీలో నడిచే విద్యుత్, నీటిపారుదల, రైల్వేల వంటి రంగాల్లో – అత్యంత తీవ్రమైన కొరతలు కనిపిస్తాయి. ప్రభుత్వం, వ్యక్తిగత రంగాలు రెండూ నిర్వహిస్తూ, ప్రభుత్వ రంగానికి పన్నుల డబ్బుతో నష్టాలు భర్తీచేసే పరిశ్రమల్లో కొరతలు బయటకు కనపడవు, అదీగాక నాణ్యత నాసిరకంగా ఉంటుంది. ఉదాహరణకు విమానయానం, ఉన్నత విద్య, రోడ్డు రవాణా రంగాలు. ప్రైవేటు, వ్యక్తిగత రంగమే ముఖ్యపాత్ర వహించే రంగాల్లో భారతదేశం ప్రపంచ ప్రమాణాలకు – దీటుగా పనిచేస్తుంది.

ఉదాహరణకు టెలిఫోన్లు, కార్ల తయారీ, కంప్యూటర్, ఐటి రంగాలు.

1991 తర్వాత వచ్చిన పాక్షిక సంస్కరణల పుణ్యమా అని ఈమాత్రం రుజువులైనా మన కళ్ళకు కనిపిస్తున్నాయి. అంతకు ముందైతే ఎప్పుడు కావాలంటే అప్పుడు టెలిఫోను కానీ, మోటారు సైకిలు గానీ నిమిషాల్లో కొనుక్కోవచ్చుననే ఊహే మనకు ఒక భ్రమగా అనిపించేది.

ఏం మారింది మరి? అదే దేశం, అదే ప్రజలు, అదే పేదరికం, అదే వర్ణ వ్యవస్థ, అవే వనరులు. ప్రభుత్వం కాస్త పక్కకు తప్పుకుంది. అంటే! తమ ముఖ్య కర్తవ్యమైన దేశ రక్షణ, ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణ, ఒప్పందాల అమలు, కేసులు పెండింగు లేకుండా న్యాయస్థానాల నిర్వహణ మీద ప్రభుత్వం దృష్టి కేంద్రీకరిస్తే, భారతప్రజల శక్తి సామర్థ్యాలు నింగిని తాకుతాయి.

మూకస్వామ్యాన్ని ప్రజాస్వామ్యంగా భ్రమింపజేసి, ప్రజలను మధ్యయుగాల నాటి రాజుల్లాగా పరిపాలించడం ఎంతగా అలవాటైపోయిందంటే; దళితులకు రాజ్యాధికారం, బీసీలకు రాజ్యాధికారం, మహిళలకు, ముస్లింలకు...ఇలాంటి నినాదాలను నిత్యం పరికించడమే తప్ప; ప్రశ్నించాలని కూడా తట్టడం లేదు.

ప్రభుత్వం; దానిలోని అధికారులు, నాయకులు, మంత్రులు, ఎమ్మెల్యేలు మనం జీతాలిచ్చి పోషిస్తున్న సేవకులే గానీ - 'వాళ్ళు రాజులేమిటి? రాజ్యాధికారం దేనికోసం?' అన్న అనుమానాలే రావడం లేదు. సినిమా స్టార్లు మొదలు నాయకుల వరకు రాజులు, యువరాజులుగా పిలవడం, ఎవరైనా మరణిస్తే 'రాజువయ్యా, మహారాజువయ్యా' అని పాడుకోవడం! రాచరికం, ఫ్యూడల్ వ్యవస్థల నుంచి ఒక్కసారిగా ప్రజాస్వామ్య వ్యవస్థలోకి వచ్చిపడిన ప్రజల అలవాట్లను, ఆలోచన ధోరణిని మార్చడం మానేసి, ప్రభుత్వాలకు రాచరిక లక్షణాలను అంటగట్టే విధానాలను సమర్థించడం కొంతమంది మేధావులు సమాజానికి చేస్తున్న దుస్సేవ (Disservice); తప్ప మరొకటి కాదు.

జంతు ప్రేరణలు, మానవ మేధ ఒకటి కాదు. స్వాతంత్ర్యం వేరు, స్వేచ్ఛ వేరు. ఇప్పటి ఉత్తర కొరియా, అప్పటి సోవియట్ రష్యాలు స్వతంత్ర దేశాలే. ఎటొచ్చీ ప్రజలకే స్వేచ్ఛ లేదు. తాత్కాలిక స్వలాభాపేక్ష, వంచనకైనా సిద్ధపడే దురాశలు విజ్ఞత కాబోదు.

31-03-2013

చరిత్ర చౌరస్తాలో భారత్

జాతీయ రాజకీయాల్లో సార్వత్రిక ఎన్నికల వేడి రాజుకుంది. రెండు ప్రధాన పార్టీలూ తమ తమ ప్రధాని అభ్యర్థులను ప్రకటించకనే ప్రకటించాయి. అధికారికంగా ప్రకటించక పోవడానికి ఎవరి కారణాలు వారికున్నాయి. మిత్రపక్షాల నుంచి వ్యతిరేకత మొదలై క్రమేణా అది మోడీ అభ్యర్థిత్వం పట్ల వ్యతిరేక తుపానుకు కేంద్ర బిందువవుతుందేమోననే అనుమానం బీజేపీలో ఉన్నట్లనిపిస్తోంది. పదేళ్ళు అధికారంలో ఉండి, పలు అవినీతి ఆరోపణలు, స్కాములు ఒకవైపు ఎదుర్కోలేక, మరోవైపున ప్రధాని పదవి పట్ల తన వైముఖ్యాన్ని అడపాదడపా ప్రకటిస్తూ, ప్రదర్శిస్తున్న యువరాజు సామర్థ్యం మీద అపనమ్మకంతో అధికార పార్టీ కొట్టుమిట్టాడుతున్నట్టు అనిపిస్తోంది. ఏది ఏమైనా, ఏదన్నా అద్భుతం జరిగితే తప్ప – నరేంద్ర మోడీ, రాహుల్ గాంధీల పోటీ తప్పదనే చెప్పొచ్చు.

ప్రధాని కావాలన్న ఆకాంక్షను బయటపెట్టి కూడా దోబూచు లాడుతున్నట్లే, తమ రాజకీయ, ఆర్థిక కార్యక్రమాన్ని, ఆలోచనలను, భావజాలాలను అందరికీ అర్థమయ్యే భాషలో బయట పెట్టకుండా, ఎవరికెలా కావాలంటే అలా అన్వయించుకోండనే రీతిలో ఇద్దరూ దాగుడు మూతలాడుతున్నారు. ఆఖరు నిమిషంలో గాలివాటుగానో, అత్యంత పరిమిత అవగాహనతోనో కాకుండా ఈ ఇద్దరి వ్యవహార శైలులను కొంతమేరకు అర్థం చేసుకుని, పరీక్షగా పరిశీలిస్తూ పోతే తప్ప; ఓటర్లు ఎంతో కొంత తెలివితో ఓటేయడం సాధ్యం కాదు.

మన దేశంలోని జనాభా – పరిమాణం, కులాలు, మతాలు, ప్రాంతాల పేరిట లెక్కలేనన్ని సంక్లిష్టతలతోపాటు; ప్రజాస్వామ్యం, పలు స్థాయిల్లో క్రమం తప్పకుండా జరిగే ఎన్నికలు, మీడియా స్వేచ్ఛల కారణంగా – ఏ మార్పులు వచ్చినా మెల్లగా వస్తాయే తప్ప రాత్రికి రాత్రి రావు. కానీ అక్షరాలా ఇవే కారణాల వల్ల రాజకీయ, ఆర్థిక, సామాజిక,

భావజాల దిశ మార్చినపుడు – చాలా త్వరగా, దాదాపు రక్తపాత రహితంగా కొత్త ఆలోచనలకు అలవాటుపడగలిగే గుణం కూడా మన సమాజానికుంది. ఎటువైపుకు నడవాలో నిర్ణయించుకునే అవకాశం స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో ఉండేది. నెహ్రూ నిర్ణయించిన సోషలిజం బాట పట్టాము. నలభై ఏళ్ళ సోషలిస్టు ప్రస్థానం తర్వాత 1990ల్లో దిశ మార్చక తప్పని పరిస్థితులేర్పడ్డాయి. ఫలితంగా మార్కెట్ ఆర్థిక వ్యవస్థకు తలుపులు తెరవాల్సి వచ్చింది. గత ఇరవయ్యేళ్ళుగా దాన్ని కూడా వంకర టింకరగా వక్రీకరించి ఆశ్రిత పెట్టుబడిదారీ విధానంగా మారుస్తూ, – పెరిగిన ఆర్థికాభివృద్ధిని రాజకీయాలు గద్దల్లా తన్నుకుపోవడం ఒక విధానంగా మారింది. ఆ పరిస్థితి నుంచి దేశాన్ని దారి మళ్ళించే అవకాశం 2014లో రాబోతోంది. స్వతంత్ర భారత చరిత్రలో మొట్టమొదటిసారిగా రెండు విభిన్న రాజకీయ, ఆర్థిక, సామాజిక నమూనాలు దాదాపు సమాన శక్తితో పోటీపడబోతున్నాయి.

పదేళ్ళుగా పార్లమెంటు సభ్యుడిగా ఉంటూ, తొమ్మిదేళ్ళుగా అధికార పార్టీకి ప్రకటిత వారసునిగా ఉన్న రాహుల్ గాంధీ – తనదంటూ ఒక ముద్ర వేయలేదు. తనదంటూ ఒక నిర్దిష్ట భవిష్యత్ కార్యక్రమాన్ని ప్రకటించలేదు. భారతదేశ సంక్లిష్టతలను, పేదల కష్టాలను, సమ్మిళిత అభివృద్ధి నినాదాలను ఏకరువు పెట్టడం తప్ప, దేశం, సమాజం ఎదుర్కొంటున్న తక్షణ, మధ్య, దీర్ఘకాలిక సవాళ్ళను ఎలా అధిగమించాలో చెప్పడం లేదు. ఇది ఒక రకంగా కాంగ్రెస్ శిబిరంలో నెలకొన్న స్థబ్దత, సైద్ధాంతిక అయోమయాన్ని సూచిస్తోంది. ఈ నైరాశ్యం నుంచి బయటపడాలంటే – గతానికి కాస్తయినా భిన్నంగా ఉండే భవిష్యత్ కార్యక్రమాన్ని ధైర్యంగా ప్రకటించి, ఆశావహ వాతావరణాన్ని కల్పించగలగాలి. కానీ ఆ స్థాయిలో అవగాహన, స్థైర్యం, ఫోకస్ రాహుల్ గాంధీ మాటలు, చేతల్లో ప్రస్తుతానికి కనిపించడం లేదు. ఎక్కువ శాతం ఓటర్లలో ఉండే అజ్ఞానం, అవిద్య, ఉచిత పథకాల పట్ల వారికుండే ఆశ, మైనారిటీలలో అభద్రతా భావం, రాజకీయ పొత్తులు – వీటి మీదే ఎక్కువగా ఆధాపడుతున్నట్లుగా కనబడుతోంది.

మరోపక్క – నరేంద్రమోడీ నిర్దిష్టమైన కార్యక్రమంతో అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది. గత పదేళ్ళుగా గుజరాత్ రాష్ట్రంలో తాను తెచ్చిన పాజిటివ్ మార్పులను కొంచెం ఎక్కువ మోతాదులోనే ప్రచారం చేసుకుంటూ, తన వాగ్ధాటి, ఆలోచనల్లోని స్పష్టతతో చూసేవారిని, వినేవారిని ఆకట్టుకుంటున్నాడు. తన వయసు అరవై దాటినప్పటికీ; ఓటర్లలో ఎక్కువ శాతం ఉన్న యువతను, వారిలో కూడా కంప్యూటర్, ఇంటర్నెట్, స్మార్ట ఫోన్లు వాడే వారిని ఆకర్షించడంలోను, వారితో ఫేస్‌బుక్, ట్విట్టర్ల ద్వారా నేరుగా సంభాషించడంలోనూ

కృతకృత్యుడై ఒక కొత్త ఒరవడిని సృష్టించారు. ఈ పైపై మెరుగులు ఒక ఎత్తైతే; ఆయన ప్రతిపాదిస్తున్న రాజకీయ, ఆర్థిక కార్యక్రమం మాత్రం – కనపడీ, కనపడనట్లుగా కావాలనే కొంత అస్పష్టతతో ప్రకటిస్తున్నారు. మొత్తం మీద మనకు అర్థమయ్యేదేమిటంటే, ఆయన విధానాలు గతం కంటే భిన్నంగా, దేశాన్ని దిశ మార్చేవిగా ఉంటాయి. ఆర్థిక విధానాలు సోషలిజం బాట వదిలిపెట్టి, వ్యక్తిగత చొరవ, మార్కెట్ స్వేచ్ఛల వైపు మళ్ళుతాయి. ఉత్పత్తి, సేవా రంగాలలో ప్రభుత్వం జోక్యం, నియంత్రణ తగ్గి, స్వేచ్ఛాయుత వాతావరణం ఏర్పడుతుంది.

ఉపాధికల్పన అంటే ప్రభుత్వం ఉద్యోగాలో, పనికి ఆహార పథకాలో కాకుండా, ప్రైవేటు రంగం వేగంగా విస్తరించడం ద్వారా పనిచేసే వారికి డిమాండు ఏర్పడే పరిస్థితులేర్పడతాయి. వనరులపై ప్రభుత్వ గుత్తాధిపత్యం కొంత మేరకైనా సడలుతుంది. ప్రభుత్వమే నడపాల్సిన అవసరంలేని రంగాలను పూర్తిగా ప్రైవేటీకరిస్తారు. ప్రభుత్వం పరిమాణాన్ని తగ్గించాలని, ప్రభుత్వాల విధులను పరిమితం చేసి, ఆ పరిమిత విధులను సక్రమంగా నిర్వర్తించేలా దృష్టి పెట్టాలన్న మాట బహిరంగంగా మాట్లాడిన రాజకీయ నాయకుడు – ఆ స్థాయిలో నరేంద్రమోడీ మాత్రమే.

వ్యవస్థీకృత ఉద్యోగ సంఘాల వ్యతిరేకతను ముందే పసిగట్టి, తన ఉద్దేశం ఉద్యోగాల కోత కాదని వెల్లడించి, రాజకీయంగా జాగ్రత్త పడ్డారు. కమ్యూనిజం, కమ్యూనిస్టుల పట్ల ఆయన కనపరచే వ్యతిరేకతను బట్టి; మావోయిజం మొదలుకుని పారిశ్రామిక అశాంతి, యూనియన్ల హింస, ప్రాజెక్టుల వ్యతిరేక ఉద్యమాల వరకు అణచివేసే ప్రయత్నమే జరుగుతుందనేది సుస్పష్టం.

ఇవన్నీ ఒక ఎత్తైతే; దేశంలో మైనారిటీలు, ముఖ్యంగా ముస్లిముల పట్ల ఆయన వైఖరి ఎలా ఉంటుందోనన్న ఆందోళన ఆయన్ను సమర్థించే వారిలో కూడా కొంత స్థాయిలో నెలకొంది. అసలు నరేంద్రమోడీ విషయానికొచ్చే సరికి ఏ ఇతర, ఇంకా ముఖ్యమైన, రాజకీయ, ఆర్థిక విషయాల కన్నా – గోద్రానంతర మత కల్లోలాలే అందరికీ అతి ముఖ్యమవుతాయి. ఈ విషయాల్లో ఆయన ఆలోచనల్లో స్పష్టత ఉంది. గుజరాత్ మత కల్లోలాలకు ఎవరికీ సంజాయిషీ ఇవ్వనక్కరలేదంటారు. భారతదేశంలో ముస్లిములు గానీ, క్రిస్టియన్లు గానీ ఇతరులతో పాటుగా సమాన హక్కులు అనుభవిస్తారని; వారి పట్ల వివక్ష గానీ, వారికి ప్రత్యేక హక్కులు కల్పించడంగాని జరగదంటారు. వారినొక ఓటు బ్యాంకుగా తయారు చేసుకునే అవకాశమూ, అవసరమూ లేని రాజకీయాలను సృష్టించాలన్నదే ఆయన ప్రయత్నంగా కనబడుతోంది. దేశ విభజన, పాకిస్థాన్ ఆవిర్భావాల

నేపథ్యంలో భారతదేశ ముస్లిములు కొంతమేరకు తమ మత విశ్వాసాలను సవరించుకునైనా సరే, భారత జాతీయతను అలవర్చుకోవాలనే ఆరెస్సెస్ సూత్ర విధానాన్ని ఆయన సమర్థిస్తారు. ఈ విషయంలో జనతా పార్టీ నాయకుడు సుబ్రహ్మణ్యస్వామి బహిరంగంగా చెప్పే విషయాలు ఆంతరంగికంగా నరేంద్రమోడీ కూడా నమ్ముతారు. తన 'సమాన హక్కులు, సమాన అవకాశాలు, సమాన జాతీయత' సూత్రానికి మైనారిటీలను ఒప్పించడానికి వారి మత నాయకులు, వారి గుత్త ఓట్లను నమ్ముకున్న రాజకీయాలను ఛేదించి, ప్రజలను నేరుగా చేరుకోవడం ఒక పెద్ద సవాలే.

అదే సమయంలో హిందువుల్లోని అతివాదులను, వారి వాచాలతను అదుపు చెయ్యడం కూడా రాజకీయ పరంగా అవసరం. తన భావజాలానికి పొడిగింపుగా టెర్రరిజం, దేశ భద్రత విషయాల్లోను, విదేశాంగ విధానంలోను కూడా కొంత కరుకు దనాన్ని, పట్టుదలను ప్రదర్శిస్తారని ఊహించవచ్చు. కాకపోతే, ఇతర నాయకులలాగే కాలక్రమేణా తన ధైర్యం, పట్టుదల, స్థిర చిత్తాలు – ఒకింత దూకుడు, మొండితనం, వ్యక్తి పూజలకు దారితీయవని చెప్పలేం.

అప్పుడు ప్రజాస్వామ్యం తనపని తాను చేసుకుపోతుంది.

మొత్తంమీద చరిత్ర చౌరస్తాలో నిలబడ్డ భారతదేశానికి – తన భవిష్యత్ దిశను నిర్ణయించుకునే సమయమొచ్చింది. అమెరికాకు రొనాల్డ్ రీగన్, ఇంగ్లండుకు మార్గరెట్ థాచర్‌ల నాయకత్వాలను ప్రజలు పెద్ద ఎత్తున స్వాగతించిన సందర్భాలు జ్ఞప్తికొస్తున్నాయి. ఎన్నికలు... పాలనల్లో కుల, మతాల పాత్ర... సెక్యులరిజం... ప్రభుత్వ విధులు... పరిమాణం, వ్యక్తికి వ్యక్తిగా సమాజంలో పాత్రలను పునర్ నిర్వచించుకునే తరుణం. దిశ మార్పుకు సారథ్యం వహించడానికి నరేంద్రమోడీ తయారుగా ఉన్నారు. ఒకింత తొందరలో కూడా ఉన్నట్లు కనబడుతోంది. కానీ – దానికి దేశం తయారుగా ఉందో లేదో... ; 'లేక ఇంకో పదేళ్ళు చూద్దాంలే, తప్పకపోతే అప్పుడాలోచిద్దాంలే' అనుకుంటుందో ప్రస్తుతానికి అస్పష్టం. దిశ మార్పుకు ఇది మొదటి అవకాశం కాదు, చివరిదీ కాబోదు.

14-04-2013

పాలనా వైఫల్యాలు

ఈ ఆధునిక ప్రపంచంలో సామాజిక, ఆర్థిక సంబంధాలు, విలువలు, రాజకీయాలు, చాలా సంక్లిష్ట-తలతో కూడి, ఒకదాని నొకటి పెనవేసుకుని ఉంటాయి. కొన్ని సంఘటనలు, సమస్యలు ప్రజల మనసులను ఊహించని స్థాయిలో ప్రభావితం చేసి, ఉద్యమ మార్గాన పట్టిస్తాయి. లోతుగా పరిశీలిస్తే - ప్రజల ఆవేశం, ఆక్రోశాలకు దీర్ఘకాలిక అనుభవాల నేపథ్యం ఉంటుంది. వ్యక్తులు, వ్యవస్థలు, సంస్థలు, విలువలు ఎడతెరపి లేకుండా దిగజారడం చూసి... చూసి ప్రజలు ఒకానొక సందర్భంలో సహనం కోల్పోవడం జరుగుతుంది.

ఈ మధ్య ఢిల్లీలో జరిగిన అమానుష సామూహిక అత్యాచారం, హత్య మరవక ముందే - ఐదేళ్ళ చిన్నారిపై పైశాచిక అత్యాచారం ఒకవైపైతే; 2జీ స్కాము, బొగ్గు స్కాములపై జరుగుతున్న ప్రహసనాలు, బయ్యారం ఇనుప ఖనిజం గురించిన ఆందోళనలు, తెలుగు ఛానళ్ళలో డబ్బింగ్ సీరియళ్ళు ప్రసారం చెయ్యకూడదనే డిమాండ్లు మరోవైపు. ఇవిచూస్తుంటే - వివిధ స్థాయిల్లో పాలనా వైఫల్యం, భావజాల గందరగోళం ప్రస్ఫుటంగా కనిపిస్తాయి.

ఢిల్లీ మహానగరంలో జరిగిన క్రూర సంఘటనలు - అక్కడి వ్యవస్థ వైఫల్యాలలో - మన దృష్టికి వచ్చిన మచ్చులు మాత్రమే.

ఢిల్లీ పోలీసుల ఉదాసీనత, అవినీతి, అసమర్థత అక్కడి ప్రజలకు నిత్య పరిచయం. దేశంలో కెల్లా అత్యంత ఆధునికమైనదై, సంఖ్యలోను, వస్తు సామగ్రి, వాహనాలు, నిధులు కొరతలేని ఆ వ్యవస్థ - ప్రజల ఆకాంక్షల మేరకు పనిచేయ లేకపోవడానికి కారణం కేవలం పాలనా వైఫల్యమే. కమిషనర్‌గా నియమించడానికి - అర్హత. సమర్థతల కంటే డబ్బు, ఆశ్రిత పక్షపాతం ఎక్కువ పాత్రను పోషిస్తున్నాయి. ఇక పోలీసు స్టేషన్ ఇన్‌చార్జ్‌ల నియమాకాలకు - రిటైల్‌గా వేలంపాటలో ధరలు నిర్ణయిస్తారు. అటువంటి వాతావరణంలో ఎటువంటి ఫలితాలను ఆశించగలం? ఎంతమంది, ఎంత సరంజామా, ఎన్ని వాహనాలున్నా ఏం ప్రయోజనం? రోజు రోజుకి పెరిగిపోతున్న ఆ

మహానగరంలోకి లక్షల మంది కార్మికులు పని వెతుక్కుంటూ వలస వస్తుంటారు. వారి పుట్టు పూర్వోత్తరాలను విచారించడం, అనుమానితులను ఒక కంట కనిపెట్టడం, చిన్న చిన్న నేరాలను సుమోటోగానైనా నమోదు చేసి శిక్షించడం, భద్రతా భావాన్ని కలుగజేయడానికి స్థానిక ప్రజలను ఏదో ఒక రూపంలో పోలీసు పనిలో అనుసంధానించడం, భాగస్వాములను చేయడం – ఇవన్నీ క్రమం తప్పకుండా చేస్తూ ఉండి ఉంటే, ఒకటి రెండు ఘోర సంఘటనలు ఎప్పుడన్నా జరిగినా; ప్రజలలో ఆగ్రహం అంతగా కట్టలు తెంచుకోదు.

కళ్ళెదుట రోజూ కనిపిస్తున్న వ్యవస్థ వైఫల్యం, అవినీతి, అలక్ష్యం, నేరపూరిత, రాజకీయ పలుకుబడితో చూస్తుండగానే కోట్లకు పడగలెత్తుతున్న వారి జీవనశైలి – ఇవన్నీ దిగజారుతున్న వ్యవస్థల పట్ల ప్రజలలో ఏహ్యభావం, పాలనా వైఫల్యాల పట్ల అసహనం, తమ భద్రత పట్ల ఒకింత భయాందోళనలు కలుగజేస్తాయి. అందుకే – బోట్ క్లబ్ మైదానం ప్రజల కోపాగ్నితో వేడుక్కుతుంటుంది. అదృష్టవశాత్తూ ప్రజాస్వామ్య వ్యవస్థ ఇంకా పని చేస్తుండడం, త్వరలోనే ఎన్నికలు రాబోతుండడం, ఓటింగు ద్వారా తమ ఆగ్రహాన్ని తెలియజేసే అవకాశముండడంతో; అదొక ఈజిప్టు విప్లవం తరహాగా మారాల్సిన అవసరం రాలేదు. వ్యవస్థ ఆశించిన విధంగా పనిచేయ్యాలంటే – కావలసింది, నిధుల కంటే కూడా – ముఖ్యంగా పాలనా దక్షత; సరిగా పాలించాలనే ఉద్దేశ్యం అని ఢిల్లీ పోలీసులను చూస్తే అర్థమవుతుంది.

భారతదేశంలో ఈనాటికీ పేదరికం, అవిద్య ఇంత ఎక్కువస్థాయిలో ఉండడానికి ప్రాకృతిక, సహజ కారణాలేవీ లేవు. కారణాలన్నీ మానవజనితాలే. సహజ వనరులకు లోటేం లేదు. ప్రజల మేధస్సు ప్రపంచంలోని ఏ ఇతర దేశ ప్రజలకూ తీసిపోదు. కానీ పేదరికం, అవిద్య, వెనుకబాటుతనం వ్యవస్థీకరించబడ్డాయి. ఒక క్రమపద్ధతిలో, ఒక అప్రకటిత ఎజెండాతో, ప్రజల జీవితాలను రాజకీయాలు తన చక్రబంధంలో ఇరికించేశాయి. ఏం చేస్తే పేదరికం పోతుందో రాజకీయనాయకులకు, అత్యున్నత పాలకులకు తెలియక కాదు. కొన్ని విషయాలు తెలియకపోయినా, తెలుసుకోగలిగే సాధనాలున్నాయి. తెలియజెప్పే అధికారులు, ఆర్థిక సలహాదారులు పుష్కలంగా ఉన్నారు.

అయినా సరే; పేదరికాన్ని పారద్రోలే నిర్ణయాలు తీసుకుంటే – పేదరికంతో పాటు, ప్రజల మీద పాలకుల పట్టు పోతుంది. అంతులేని అక్రమార్జన చేసే దారులు మూసుకుపోతాయి. కాబట్టి రాజకీయాల లక్ష్యం పేదరికాన్ని పొగొట్టడం కాదు. వనరులమీద, ప్రజల సంపాదన మీద తమ పట్టును కొనసాగించటమే ఏకైక లక్ష్యం. ఈ విషయంలో అధికార, ప్రతిపక్షాల మధ్య కూడా అవసరమైనపుడు చక్కని అవగాహన ఉంటుంది.

వచ్చిన చిక్కల్లా... మెజారిటీ ప్రజల్లోనే ఈ సత్యం, వాస్తవం పట్ల సరైన అవగాహన లేదు. అది వచ్చినప్పుడు మాత్రమే – రాజకీయాల లక్ష్యం – ప్రజాహిత విధానాలు, నిర్ణయాల దిశకు మారుతుంది.

రాజకీయాలు – ప్రజల పేరు చెప్పి...; వనరుల మీద గుత్తాధిపత్యం తీసుకుంటాయి. ఆ వనరుల నియంత్రణ ద్వారా కృత్రిమ కొరతలను సృష్టిస్తాయి. అలా పరిమితపరచబడ్డ వనరులను ఆశ్రితులకు, అవినీతికి అమ్ముకుని ఆర్జిస్తారు. అటువంటి ఆర్జనలలో కొంత భాగం రాజకీయాల్లో పెట్టుబడిగా పెడతారు. ఏ స్కాము చూసినా చివరికి కనిపించేదదే. 2 జీ స్కాములో విద్యుదయస్కాంత తరంగాలను అక్రమంగా కట్టబెట్టి ఆర్జించారు. వాటిని ప్రజలకే వదిలేస్తే – టెలిఫోను బిల్లులు సగానికి సగం పైగా తగ్గేవి. బొగ్గు కూడా అంతే. రెండొందల సంవత్సరాలకు సరిపడా ఉన్న బొగ్గును ఉచితంగా తవ్వుకోనిచ్చినా నష్టం లేదు. కరెంటు సమృద్ధిగా ఉత్పత్తయ్యేది. ధరలు కూడా దిగి వచ్చేవి. అలా కాదని మొత్తం బొగ్గు మీద గుత్తాధిపత్యం చేతిలో పెట్టుకుని ఆశ్రితులకు అడ్డగోలుగా అమ్ముకున్నారు.

ఈ అవినీతి విధానాల ఫలితంగా విద్యుత్తు ఉత్పత్తీ పెరగలేదు. వాటి ధరలూ మండిపోతున్నాయి. ప్రభుత్వాలు, కోర్టుల పుణ్యమాని ఇసుక కూడా ప్రజలకు దొరక్కుండా పోయింది – ఫలితంగా వందలాది కోట్ల అక్రమార్జన కోసం ఇసుక మాఫియాలు కొత్తగా తయారయ్యాయి. అటవీ ప్రాంతాల్లో ఉన్న బాక్సైటు త్రవ్వకూడ దంటారు. ఆ ఖనిజం మీద ఆదివాసీలకే హక్కుందంటారు. ఇంకో పక్క బయ్యారం ఇనుప ఖనిజం మీద తెలంగాణ వారికి మాత్రమే హక్కుందంటారు. ఇదంతా నిజమే అనుకుందాం.

మరి ఆ హక్కుల్ని ప్రజలకివ్వండి, బాక్సైటును ఆదివాసీలకు, బయ్యారం ఖనిజాన్ని తెలంగాణ ప్రజలకు సమానంగా పంచి షేర్ సర్టిఫికేట్ల ద్వారా పూర్తి, యాజమాన్య హక్కులను ఆ ప్రజలకు దఖలుపరచండి. ఆ బాక్సైటును తియ్యాలో వద్దో, అల్యూమినియం పరిశ్రమ ఎక్కడ రావాలో, శుద్ధి ఎక్కడ చెయ్యాలో – యజమానులైన ప్రజలనే నిర్ణయించు కోనివ్వండి. ఎవరో ఒకరు పెట్టుబడి పెట్టి పరిశ్రమ స్థాపించి, కావలసిన మేరకు ఖనిజాన్ని ప్రజల షేర్ల నుంచి కొనుగోలు చేసి ఉత్పత్తి అయినా చేస్తారు. కనీసం ఇనుము, అల్యూమినియం ధరలైనా తగ్గుతాయి.

అల్యూమినియం కనిపెట్టిన కొత్తలో సైనికుల సాయుధ కవచాల కోసం నెపోలియన్ వాడబోయాడు కానీ, వెండి కంటే ఎక్కువ ఖర్చు కావడంతో విరమించుకున్నాడు. ఈ రోజున అల్యూమినియం ఇంత చవకగా అందుబాటులోకి వచ్చిందంటే; ఎక్కడా బాక్సైటు త్రవ్వకుండానే ఇదంతా జరిగిందా? ప్రజలకు వనరుల మీద యజమాన్య హక్కులు ససేమిరా ఇవ్వరు. కష్టపడి తయారు చేసుకున్న పొలాలను ఆదివాసీలు అమ్ముకునే హక్కే ఇవ్వలేదు! ప్రజల పేరిట యాజమాన్య హక్కులన్నీ ప్రభుత్వాలే ఉంచేసు కుంటాయి. వీలుంటే రక్షణ స్టీల్స్‌కో, రస్ అల్ ఖైమాకో, ప్రభుత్వం మారితే వాటిని రద్దు చేసి ఇంకో ఆశ్రిత బృందానికో ఇచ్చే వెసులుబాటును తమతోనే ఉంచుకుంటారు.

ఎవరూ అప్పటివరకు స్వంతం చేసుకోని వనరుకు – తమ శ్రమను జోడించి, వినియోగం లోకి తెచ్చి ఉత్పత్తి జరిపిన వారికే ఆ వనరు చెందుతుంది. దీన్నే కుటుంబీకరణ

సూత్రం (Principle of homesteading) అంటారు.

అడవులు, బయళ్ళను శుభ్రం చేసి, వాగులకు అడ్డంవేసి చెరువులుగా చేసి మన పూర్వీకులు పొలాలు తయారు చేసింది – ఆ విధంగానే. అలా వచ్చిన యాజమాన్యం హక్కులు క్రమంగా చేతులు మారాయి. కానీ ప్రభుత్వాలు బలపడిన కొద్దీ వనరుల మీద హక్కులు ప్రజల చేతుల్లో లేకుండా పోయాయి. ప్రభుత్వాల బలం ఇంకా పెరిగినకొద్దీ– నిర్ణయాధికారాలు స్థానిక సంస్థలు, సమాజం చేతి నుంచి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల చేతుల్లోకి కేంద్రీకృతమయ్యాయి. ఇటువంటి పరిణామాలు ఆశ్రిత పెట్టుబడిదారుల్ని పోత్సహిస్తాయే తప్ప వాటి ద్వారా స్వేచ్ఛాయుత పారిశ్రామికీకరణ అసాధ్యం. పేదరికం, అవిద్య, వెనకబాటుతనం, ప్రభుత్వ నియంత్రణలు, నిర్బంధాల నడుమ కూడా వ్యక్తులు చూపిన చొరవ, పటిమ, ఔత్సాహికతల వల్లనే ఈ మాత్రం అభివృద్ధన్నా జరిగింది.

తెలుగు ఛానళ్ళలో డబ్బింగు సీరియళ్ళు ప్రసారం చెయ్యకూడదని 'టీవీ ఆర్టిస్టులు' ఉద్యమించడమే కాకుండా, ఆఫీసుల మీద దాడికి పూనుకోవడం – భావజాల గందరగోళానికి పరాకాష్ఠ.

ఛానళ్ళ నిర్వహణ ఒక వ్యాపారమని, ఏ సీరియళ్ళకు ప్రజాదరణ ఉందో, దేనికెంత ఖర్చవుతుందో నిర్ణయించాల్సింది యాజమాన్యాలేనని వీరికి తెలియదా? వీరి ఒత్తిడికి తలొగ్గి; అధిక ఖర్చుతో కూడుకుని, లాభసాటి కాని తెలుగు సీరియళ్ళు ప్రసారం చేసి, నష్టాలపాలై కొన్ని ఛానళ్ళు మూసివేయాల్సి వస్తే; వీరి తెలుగు సీరియళ్ళకు గిరాకీ తగ్గిపోదూ? మళ్ళా కథ మొదటికే వస్తుంది కదా! అదే సూత్రాన్ని ఇంకాస్త పొడిగిస్తే మనం హిందీ, ఇంగ్లీషు సినిమాలుగానీ, పేపర్లు, పత్రికలు, ఛానళ్ళు గానీ చూడకూడదంటే హాస్యాస్పదంగా లేదూ?

ఇదంతా చూస్తే, మొత్తం మీద ఒకరకమైన, అదుపుతప్పిన వ్యవస్థలు, విలువల దిగజారుడు, పరిపాలనా లేమి, కావాలని సృష్టించిన భావజాల గందర గోళాలు సమాజాన్ని ఆవహించినట్లనిపిస్తుంది. ఈ గందరగోళాలకు సమ్మిళిత అభివృద్ధి, సంతులిత అభివృద్ధి, విద్యా హక్కు, ఉపాధి హక్కు, ఆహార హక్కు, మైనారిటీ హక్కులు, ప్రజాక్షేమం, సామ్యవాదం, సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజాభీష్టం..., ఇలా ఎన్ని మేలిముసుగులు తొడిగినా, వాటి వెనుక పాలకుల స్వార్థ స్వప్రయోజనాలను ప్రజలు గుర్తించనంత కాలం – పాలకులు తమంతట తాముగా వచ్చే సంపాదనను వదులుకోరు.

దిక్కుతోచక, నడిసముద్రంలో గిరికీలు కొడుతున్న ఓడ క్షేమంగా ఒడ్డుకు చేరాలంటే, దీప స్థంభం (light house) అవసరం. ఇప్పుడు కావలసింది మరిన్ని మాయ పథకాలు కాదు. అతి తక్కువ వైఫల్యాలతో పాలించే దక్షత. గుర్రం మీద వచ్చే రాకుమారుడు కాదు, దారి చూపి స్వేచ్ఛ నిచ్చే దీప స్థంభం.

28-04-2013

ఎందుకింత ఆశ్చర్యం?

రైల్వే మంత్రి బన్సల్ మేనల్లుడు ఒక బోర్డు మెంబరు నియామకం విషయంలో లంచం తీసుకుంటూ సీబీఐకి దొరికినప్పుడు ఆ లంచం స్థాయి చూసి దేశమంతా విస్తు పోయింది. కానీ నిజానికిందులో ఆశ్చర్యపడాల్సిందే ముంది? ప్రభుత్వరంగ సంస్థల్లో జరిగే భాగోతాలు మనందరికీ తెలియనివా? ఒక్క నియామకం కోసం ఇంత డబ్బు లంచంగా ఇస్తున్నారంటే ఐరావతం లాంటి రైల్వే మొత్తంలో ఎన్ని వేలకోట్లు సాలీనా లంచాల రూపంలో వసూలవుతున్నాయో ఊహించవచ్చు.

ఇక ఎయిరిండియా సంగతేమిటి? వేలకోట్ల రూపాయల ఖరీదు చేసే విమానాల కొనుగోళ్ళలో ఎంత డబ్బు లంచాల రూపంలో చేతులు మారుతుందో? ఇక వాటి నిర్వహణ, విమానా శ్రయాల నిర్మాణం, నిర్వహణ ఉండనే ఉన్నాయి. అదే స్థాయిలో ఉండే కోల్ ఇండియా, బీఎస్ఎన్ఎల్, విద్యుదుత్పత్తి సంస్థలు, ఎఫ్‌సీఐ, లోహాల వాణిజ్యం – ఇవన్నీ మంత్రుల కనుసన్నల్లో నడిచే సంస్థలే. వీటన్నిటినీ నొప్పి తెలియకుండా పిండినా; ఏటా వచ్చే లక్షల కోట్లు రాజకీయుల జేబుల్లోకి ప్రవహిస్తాయి.

ఇంత సులువైన ఆదాయ వనరుల్ని వదులుకుని, ఈ సంస్థలను ప్రైవేటీకరించ డానికి ఎవరు మాత్రం ముందుకొస్తారు? ఈ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల యూనియన్‌లు ఎక్కువగా వామపక్ష పార్టీల ఆధీనంలో ఉంటాయి. వాటి ప్రయోజనార్థం వామపక్ష పార్టీలు కూడా ప్రైవేటీకరణ ఊసునే తీవ్రంగా వ్యతిరేకిస్తాయి. దానికి కావలసిన సైద్ధాంతిక సరంజామా ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుంది.

అవినీతి అనేది ప్రజాస్వామ్యీకరించబడింది. అదిప్పుడు అత్యున్నత నాయకుల నుంచి అట్టడుగు ఓటరు వరకూ విస్తరించింది. రాజకీయులు కూడగట్టే అవినీతి సొమ్ములో చాలా భాగం ఎన్నికలకు ఖర్చవుతోంది. సరాసరిన ఒక్కో ఓటరుకు మందు, ముక్క,

డబ్బు రూపంలో ముట్టేది కొన్ని వందలే అయినా, ఓటర్ల సంఖ్యతో హెచ్చిస్తే కొన్ని కోట్ల రూపాయలు ఖర్చవుతున్నాయి.

రాజకీయ వర్గాల్లో ప్రచారంలో ఉన్న ఊహాగానాలను బట్టి; వచ్చే ఎన్నికలలో అసెంబ్లీ అభ్యర్థులు 10నుంచి 15 కోట్లు, పార్లమెంటు అభ్యర్థి 40 నుంచి 50 కోట్లు ఖర్చు చెయ్యాల్సి వస్తుంది. రాజకీయ పార్టీలైతే – పార్టీకి ఐదు కోట్లు అభ్యర్థులు డిపాజిట్ చేస్తేనే – పేరు పరిశీలిస్తామంటున్నారు. పార్లమెంటు సీటుకైతే డిపాజిట్ చెయ్యాల్సింది ఇరవై కోట్లు. వీరంతా ప్రజా సేవ కోసమే ఇదంతా చేస్తున్నారనుకునేంత భ్రమల్లో ఎవరమూ లేము. ఇదొక రిస్కుతో కూడుకున్న పెట్టుబడి. ఇందులో రిస్కులు చాలా ఉన్నాయి. ముందు గెలవాలి. తర్వాత తన పార్టీ అధికారంలోకి రావాలి. ఆ తర్వాత తనకో పదవి దొరకాలి. అప్పుడు కాంట్రాక్టులు, నియామకాలు, బదిలీలు, కబ్జాలు, లైసెన్సులు, ప్రత్యేక అనుమతులు – వీటిద్వారా పెట్టుబడికి కొన్ని రెట్లు సంపాదించవచ్చు.

ఈ ప్రక్రియలో రిస్కు పెరిగిపోతుండంతో; అనిశ్చితిని కొంతమేరకు తగ్గించడానికి రాజకీయ నాయకులు కొన్ని కొత్త పద్ధతులు ప్రారంభించారు. అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు ఒకరితో ఒకరు లోపాయికారీగా సహకరించుకుంటున్నారు. ఈ రోజు అధికారంలో ఉన్నా, ఏదో నాటికి తాము ప్రతిపక్షంలో కూర్చోవాల్సిందేనని వారికి తెలుసు. అందుకే ప్రతిపక్ష పార్టీకి చెందినప్పటికీ; స్థానిక శాసనసభ్యులకు ప్రభుత్వపరంగా జరిగే పనుల కాంట్రాక్టులలో కమిషన్ యధావిధిగా అందజేయడం మొదలైంది. రాయలసీమ వంటి ప్రాంతాల్లో ఎప్పట్నుంచో కొన్ని సంప్రదాయాలున్నాయి.

కాంట్రాక్టుల్లో కొంతశాతం అధికార పార్టీ శాసనభ్యుడికి లేదా అధికార పార్టీ అభ్యర్థిగా పోటీచేసి ఓడిన వారికి, కొంత తక్కువ శాతం ప్రధాన విపక్ష పార్టీ అభ్యర్థి/ శాసనసభ్యుడికి, కొద్దిగా స్థానిక వామపక్షపార్టీలకు, మరి కొద్దిగా స్థానిక మీడియాకు ఒక పరస్పరంగీకార నిష్పత్తిలో పంచేస్తారు.

అంతా గప్‌చిప్‌గా జరిగిపోతుంది కాబట్టి ఎవరికీ రిస్కులేదు. ప్రజా జీవితంలో ఉన్న ముఖ్యులందరికీ ఎంతో కొంత ఆదాయం ప్రవహిస్తూనే ఉంటుంది. ఇటువంటి వాతావరణంలో పార్టీలు మారడమనేది పెద్దగా నైతికతకు సంబంధించిన విషయం కాదు, అదొక వ్యాపార నిర్ణయం మాత్రమే. ఎన్నికల సమయంలో డబ్బు ఆశించేవారు... తమ కులానికి, మతానికి, వర్గానికి ప్రత్యేక ప్రయోజనాలు ఆశించే వారూ, ఒక రకమైన వ్యాపార దృక్పథంతోనే ఓట్లేస్తారు. దీర్ఘకాలిక ప్రయోజనాలపై పెద్దగా ఆశలు, భ్రమలు లేనప్పుడు – స్వల్పకాలిక స్వప్రయోజనాలకే మొగ్గుచూపుతారు.

అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతున్నారనుకునే వారంతా, వివిధ వర్గాల మధ్య

అప్రకటితంగా కొనసాగుతున్న ఈ క్విడ్‌ప్రోకోను అర్థం చేసుకుని, బహిర్గతం చెయ్యాలి. అరిచినంత మాత్రాన – అవినీతి అంతమైపోదు. అవినీతి మూలాలను, దాన్ని పెంచి పోషించే ప్రక్రియలను గుర్తించి, వాటిని అంతమొందించాలి. ఉదాహరణకు ప్రభుత్వం నడుపుతున్న వ్యాపార సంస్థలన్నిటినీ పారదర్శకమైన పద్ధతిలో వ్యక్తిగత (ప్రైవేటు) రంగానికి బదలాయించాలి. మార్కెట్లో ఒక ఆరోగ్యకరమైన పోటీ వాతావరణాన్ని కల్పించాలి.

ప్రభుత్వంలో అవినీతికి రెండు ముఖ్యమైన మూలాలున్నాయి. ఒకటి – వ్యాపార సంస్థలు నడపడం; వాటికి గుత్తాధిపత్యం కట్టబెట్టడం; సహజ వనరులను గుప్పెట్లో పెట్టుకోవడం; విధాన నిర్ణయాల పేరుతో వ్యక్తిగత రంగంలోని వ్యాపార, ఆర్థిక సంస్థలను శాసించడం.

ఇక రెండోది – పన్నుల డబ్బును ఇష్టమొచ్చినట్లు ఖర్చుచేసే అవకాశం. ఈ రెండు మార్గాలనూ ఒక పద్ధతి ప్రకారం క్రమేపీ మూసేస్తే తప్ప అవినీతి ఆగదు. అలా చెయ్యాలంటే అడుగడుగునా సైద్ధాంతిక అవరోధాలు ఎదురవుతాయి. అందుకే అన్నింటికంటే ముందుగా పౌర జీవితంలో ప్రభుత్వ పాత్రను పునర్నిర్వచించాలి. ప్రభుత్వమనేది కొన్ని పరిమితమైన ఉమ్మడి సేవల నందించేందుకు ప్రజలు ఏర్పాటు చేసుకున్న వ్యవస్థ అనే విషయంలో స్పష్టత ఉండాలి. శతాబ్దాల బానిసత్వంలో మునిగి, మరిగిన మన మనో ఫలకంలో ప్రభుత్వమంటే రాజు అని; మనమంతా – రాజుగారి దయాదక్షిణ్యాలపై బ్రతికే అల్ప మానవులమనే భావన స్థిరపడిపోయింది.

ఈ 'భావజాల బూజు'ను వదిలించుకోవడం తక్షణ కర్తవ్యం. ప్రభుత్వాలు ప్రజల ఆర్థిక వ్యవహారాలను శాసించే అధికారాలు తొలగిపోవాలి. ప్రభుత్వాల దగ్గర అత్యవసర ఉమ్మడి సేవల కవసరమయ్యే కనీస మొత్తంలో మాత్రమే నిధులుండాలి. ఇప్పుడున్న వ్యవస్థలనే కొనసాగిస్తే ఎవరన్నా వ్యక్తిగతంగా నీతిమంతుడైన, బలమైన నాయకుడు నడిపినంత కాలం అవినీతి కొంతలో కొంత అదుపులో ఉంటుందేమో గానీ; వ్యవస్థలోని దౌర్భల్యాలు తొలగిపోవు. వ్యవస్థలను కుళ్ళబెట్టి, వ్యక్తులను నమ్ముకోవడం వల్ల జరిగే అనర్థాలు మనకు తెలియనివి కావు.

ప్రభుత్వరంగ సంస్థలు అవినీతి, అసమర్థతలతో నడవడం వల్ల ప్రజల నిత్యావసర వస్తువులు, సేవల ధరలు పెరిగిపోతాయి. వనరులను ప్రజలు మార్కెట్ ద్వారా తమ నిర్ణయాలను తెలియజెప్పే మార్గాలలో కాక – రాజకీయాలు, రాజకీయుల లబ్ధి కోసం దారిమళ్లించడం వల్ల ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమవుతుంది. రెండోవైపు విపరీతమైన పన్నుల వడ్డింపులతో సేకరించిన లక్షల కోట్ల రూపాయలు – ఓట్ల కోసం ప్రజాకర్షక పథకాలకు, అవినీతిమయమైన ప్రజాపనులకు వెదజల్లడం వల్ల అంత మేరకు కష్టపడి సృష్టించిన సంపద ఆవిరైపోతుంది. అప్రతిహతంగా కొనసాగుతున్న ఈ పతనాన్ని ఆపి,

వెనక్కు తిప్పాలంటే – విజ్ఞత గల వర్గాలు; ముఖ్యంగా, పన్నులు కట్టే వర్గాలు మేలుకోవాలి. తమ ఓట్లద్వారా, బహిరంగ చర్చ ద్వారా తమ భావాలను వ్యక్తీకరించాలి. అసలు ఓటేయడం మొదలెడితే చాలు. తెలివైన రాజకీయ నాయకులు వారి మనోభావాలను పసిగట్టి వ్యవస్థ దారిమళ్ళించే ప్రయత్నం చేస్తారు. తదనుగుణంగానే మ్యానిఫెస్టోలు తయారుచేస్తారు.

ఈ మధ్య కర్ణాటకలో జరిగిన ఎన్నికలలో బాగా చదువుకున్న వారు, సాఫ్ట్‌వేర్ నిపుణులు ఉండే బెంగళూరు నగరంలో అత్యల్ప ఓటింగు శాతం నమోదైంది. ఆదివార-మైనప్పటికీ, ఓటేయడానికి బద్ధకించే వారు, తర్వాత్తర్వాత వ్యవస్థను విమర్శించడానికి అనర్హులవుతారు. ఉచిత పథకాల లబ్ధిదారులు మాత్రమే ఓటేసినంత కాలం రాజకీయ పార్టీలు వారిని ఆకర్షించడానికే ప్రాధాన్యతనిస్తాయి. పన్నులు కట్టే వారు మైనారిటీ అయినప్పటికీ ఒక భావజాల స్పష్టతతో ఓటింగు, రాజకీయ చర్చలాంటి ప్రజాస్వామ్య ప్రక్రియల్లో పాలుపంచుకోవడం మొదలైతే తప్ప పరిస్థితి మారదు. సుపరిపాలన అందిస్తామనే పార్టీల బాధ్యత కూడా స్పష్టం. పన్నులు కట్టే వర్గాలకు ఊరట కలిగించే విధానాలు ప్రకటించి, వారిని ఓటింగుకు రప్పించే ప్రయత్నం చెయ్యని పక్షంలో సుపరిపాలన వాగ్ధానాలకు అర్థం లేదు. అలా జరగనంత కాలం; ఒక బన్సల్ పోతే; మరో పుల్లయ్య వస్తాడు. చేసే పని మాత్రం అదే.

12-05-2013

నాగరికత - నిబంధనలు

రహదారులు - నాగరికతకు సూచికలంటారు. అది నిజమే. మన రోడ్లు, ట్రాఫిక్ వ్యవస్థలను విశ్లేషిస్తే సమాజంలో పరుచుకున్న తాత్కాలికత్వం, అహేతుకత స్పష్టంగా కనిపిస్తాయి. పశ్చిమ దేశాల్లోగానీ, అభివృద్ధి చెందిన తూర్పు దేశాల్లోగానీ పర్యటించిన వారికి రోడ్లు, ట్రాఫిక్ నిర్వహణల విషయంలో - వారికి, మనకు మధ్య ఎంత అగాధముందో అర్థమవుతుంది. ఈ విషయంలో మాత్రం మనదేశం, బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లు ఇంకా విడిపోని అఖండ భారతదేశం మాదిరిగానే దర్శనమిస్తాయి. ఈ మూడు దేశాలూ పాలనా వ్యవస్థలను బ్రిటిష్ పాలకుల కాలంలో - అక్కడ్నుంచి దిగుమతి చేసుకున్నవే. వ్యవస్థ రూపాన్ని అక్కడ్నుంచి తెచ్చుకున్నామే కానీ- అందులోని ప్రతి మూలకం వెనుకా ఉన్న హేతుబద్ధతను, స్ఫూర్తిని విస్మరించాం.

ప్రపంచవ్యాప్తంగా - ట్రాఫిక్ నిబంధనలు చాలా సరళంగా, అందరికీ అర్థమయ్యేలా ఉండడం వల్ల వాటిని అందరూ పాటిస్తారు. అందుకే వారి ట్రాఫిక్ వ్యవస్థ సాఫీగా సాగిపోతూ ఉంటుంది. మనదేశంలో అంతా విరుద్ధం.

నిబంధనలు - పుస్తకాలకే పరిమితం. కళ్ళెదుటే- సగం కంటే ఎక్కువ మంది వాటిని అతిక్రమిస్తూ ఉంటారు. నిబంధనలను ప్రభుత్వ శాఖలే పాటించవు. సామాన్యులు పాటిద్దామన్నా సాధ్యం కాదు. వెరసి అంతా అస్తవ్యస్తం. ఉదాహరణకు ప్రపంచవ్యాప్తంగా అన్ని రోడ్లనూ చిన్న.... కొంచెం పెద్ద.... అతిపెద్ద...ఇలా ఒక క్రమపద్ధతిలో వర్గీకరిస్తారు. చిన్న రోడ్డు నుంచి పెద్ద రోడ్డు మీదకు ఎవరన్నా రావాలంటే; జంక్షన్ వద్ద పూర్తిగా ఆగి, అటూ ఇటూ చూసి - పెద్ద రోడ్డు మీద వెళ్ళే ట్రాఫిక్‌కు అడ్డం కాని సమయంలోనే - పెద్ద రోడ్డు మీదికి ఎక్కాలి. ఇది చిన్న రోడ్డు నుంచి వచ్చే వారి బాధ్యత. దానికి కావాలసిన సూచికలు, బోర్డులు, స్పీడు బ్రేకర్లు ఖచ్చితంగా అమరుస్తారు. అందరికీ ఈ నిబంధన సుపరిచితం.

దీన్ని పాటించకుండా వెళ్ళి ఎవరైనా ప్రమాదానికి కారకులైతే బాధ్యులను ఖచ్చితంగా గుర్తించి, నిబంధనను అతిక్రమించిన వారిని మాత్రమే శిక్షిస్తారు.

మనదేశంలో ట్రాఫిక్ నిబంధనల గురించి అసలు పాఠ్యాంశాలే ఉండవు. చిన్న వయసులోనే నేర్చుకోవాల్సిన ఈ ముఖ్యమైన విషయాలు – పెద్దవాళ్ళకు కూడా చెప్పేవారుండరు. సూచికలు, బోర్డులు మృగ్యం. పెద్దరోడ్డు మీద వెళ్ళే వాళ్ళు ఏ సందులోంచి ఎప్పుడే ట్రాక్టరో, కారో, మోటారు సైకిలో, ఆటోనో దూసుకొస్తుందోనని భయం భయంగా అటూ, ఇటూ చూసుకుంటూ, చిన్నరోడ్ల జంక్షన్ వచ్చినప్పుడల్లా వేగం తగ్గిస్తూ పోతుంటారు. చిన్నా, పెద్ద రోడ్ల జంక్షన్ల వద్ద చిన్న రోడ్డుపై స్పీడు బ్రేకర్లు వెయ్యాల్సింది పోయి, పెద్దరోడ్డు మీద అమరుస్తారు.

దానివల్ల పెద్ద రోడ్డును ఉపయోగించే లక్షలాది వాహనాలు వేగాన్ని పూర్తిగా తగ్గించుకోవాల్సి వస్తుంది. ఫలితంగా – ఎంత డీజిలు, పెట్రోలు వృథా అవుతుందో ఎవరికీ లెక్కలేదు. స్పీడ్ బ్రేకర్లున్నట్లుగా తెలియజేసే సూచికలుండవు, దానిమీద పెయింటు ఉండదు. దారి సుపరిచితం కానివారైతే సడెన్ బ్రేకులు, ఎగిరిపడటం తప్పదు. ఇది చాలదన్నట్లు, ఏదైనా ప్రమాదం జరిగిన చోటల్లా శాశ్వతంగా పోలీసు బారికేడ్లు, డ్రమ్ములు, అవీ పెద్ద రోడ్డు మీదే ఉంటాయి.

పెద్దరోడ్డు మీద వెళ్ళేవాళ్ళు సాఫీగా, అవసరం మేరకు కనీస సంఖ్యలో అడ్డంకులతో, ఒక క్రమ వేగాన్ని పాటిస్తూ ప్రయాణించాలని, అలా ప్రయాణించొచ్చని, అంతకంటే పెద్ద రోడ్డు మీదకు వెళ్ళే జంక్షన్ దగ్గర మాత్రమే అటూ ఇటూ చూసుకొని వెళ్ళాల్సిన బాధ్యత వారిమీద ఉంటుందనేది ఒక హేతుబద్ధమయిన ఐడియా. ఈ ఐడియా, వాహనాలు నడిపే అత్యధికుల్లో లేదు; ఉన్నా పాటించగలిగే పరిస్థితులు లేవు.

ఎక్కడైనా రోడ్డు ప్రమాదం జరిగితే తప్పెవరిదని ఎవరూ చూడరు. రెంటిలో పెద్ద వాహనం ఏదైతే వారిదే తప్పు. రెండూ ఒకే రకమైన వాహనాలైతే, ఎవరెక్కువ వేగంతో వెళుతుంటే వారిదే తప్పు. అంతేగానీ, ఎవరు బాధ్యతను విస్మరించారో, ఎవరి హక్కు ఏమిటో, ఎవరు నిబంధనను అతిక్రమించారో నిర్ధారించే అలవాటే మనమెప్పుడూ చేసుకోలేదు. హేతువేదో, ఫలితమేదో చెప్పలేం కానీ; ఈ అస్పష్టత మాత్రం సర్వవ్యాప్తం.

సంక్లిష్టమైన ఈ ఆధునిక నాగరిక ప్రపంచంలో ప్రశాంతంగా ప్రయాణించాలన్నా, జీవించాలన్నా, నియమ నిబంధనల ఏర్పాటు, వాటి పట్ల అందరూ అవగాహన కలిగి ఉండడం, నియమాలను ఉల్లంఘించిన వారిని గుర్తించి, ఆ మేరకు మాత్రమే శిక్షించే వ్యవస్థ ఉండడం – అత్యంత అవసరం. ఇవిలేని సమాజంలో దిగుమతి చేసుకున్న వస్తు

సంపద, సాంకేతికత, అభివృద్ధి చూడ్డానికి కనబడతాయి కానీ, వాటిని సరిగా వినియోగించుకోగలగడం, వాటిని ఇంకా ముందుకు తీసుకుపోవడం సాధ్యం కాదు. అదే మన వెనుకబాటుతనానికి కారణం. అభివృద్ధి చెందిన దేశాలను చూసి 'వాళ్ళకున్నదేమిటి, మనకు లేనిదేమిటి?' అని వాపోతుంటాం కదా! వాళ్ళకున్నది, మనకు లేనిది – విషయ స్పష్టత. పరిమిత, సరళ నిబంధనలు. ఆ కొద్దిపాటి నిబంధనలనూ అందరూ పాటించే లక్షణం.

ఈ దృష్టి కోణంలో చూస్తే – మనమింకా పతనమవుతున్నామో, లేక సరైన దారిలో నడవడానికి ప్రయత్నిస్తున్నామో అర్థమవుతుంది. వ్యాపార ప్రకటనల ద్వారా వేలకోట్లు ఆదాయాన్ని ఆర్జిస్తున్న ఐపీఎల్ క్రికెట్‌లో – స్పాట్ ఫిక్సింగ్ జరగడం ఆశ్చర్యపోవాల్సిన విషయమేమీ కాదు. దశాబ్దకాలం పైబడి క్రికెట్‌లో బెట్టింగులు, ఫిక్సింగులు నడుస్తున్నాయని తెలిసి కూడా వాటి గెలుపోటముల గురించి అత్యంత ఉత్కంఠను ప్రదర్శించే అభిమానులకు కనువిప్పు కావాలి. వేలకోట్ల వనరులున్న బీసీసీఐ, ఐపీఎల్ యాజమాన్యాలే ఈ ఆటల స్వచ్ఛతకు బాధ్యత వహించాలి. బాధ్యత వహించలేనప్పుడు వాటికి ప్రజాదరణ క్రమేపీ తగ్గిపోయి, బాధ్యత వహించగలిగే ఇంకో లీగ్ పుట్టుకొస్తుంది.

అంతేగానీ, ఇన్ని వందల మంది ఆటగాళ్ళు, వేల మంది బుకీలపై నిరంతరం నిఘా పెడుతూ వందలకోట్ల ఖర్చుతో ఈ ఆటల స్వచ్ఛతకు ప్రభుత్వం, పోలీసు సంస్థలు ఎందుకు బాధ్యత పడాలి? బీసీసీఐ ఒక మాఫియాలా ఎదగడానికి, క్రీడాకారులు మోడలింగ్ చేసి మరిన్ని కోట్లు సంపాదించుకోవడానికా? ప్రజలు కట్టే పన్నుల డబ్బును ఉపయోగించాల్సింది ఇలాంటి పనులకా?

ఎన్నికల సీజను మొదలైంది కాబట్టి; మన మూకస్వామ్య రాజకీయాల అసలు స్వరూపం – ఆకర్షణీయమైన నినాదాల రూపంలో బయటపడుతోంది. దళితులకు, బీసీలకు, కాపులకు ఇలా రకరకాల వర్గాలకు రాజ్యాధికారం కావాలనే ఆకాంక్షలు నినాదాలు – ఉద్యమాలుగా వ్యక్తమవుతున్నాయి. రాజ్యం పరమ భోజ్యమని, దాన్ని ఎలాగోలా చేజిక్కించుకుని, తన వర్గంలో తమలో తాము సింహ భాగాన్ని పంచుకు తినాలన్న ఆలోచనే – పరమ నీచం, అనాగరికం, తిరోగమన భావం. అలాంటి నీచ భావాలకు 'రాజకీయ పవిత్రత' ఆపాదించబడుతోంది.

ఈ మధ్య ఏ పార్టీ మీటింగులు చూసినా కార్యకర్తలకు న్యాయం చేస్తామని, వారికి పెద్దపీట వేస్తామని, వారు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చూస్తామని విశ్వాసం

కలిగించే ప్రయత్నాలు చేస్తున్నారు. అసలు పరిపాలనలో కార్యకర్తల పాత్ర ఎందుకుండాలి? అధికారం చెలాయించేది ప్రజల పన్నుల డబ్బును, ఉమ్మడి వనరులను తమ పార్టీ కార్యకర్తలకు దోచిపెట్టడానికా? ఈ ప్రశ్నలు ఇతర పార్టీల రాజకీయ నాయకులు గానీ, మీడియా గానీ, చివరకు బుద్ధిజీవులనే మేధావులు సైతం అడగరు. ఎందుకంటే కార్యకర్తలకు చేసి పెట్టడమనేది – అందరూ అంగీకరించిన ఒక వాస్తవమై కూర్చుంది. అమెరికా, ఇంగ్లండు, ఫ్రాన్స్, జర్మనీలు కూడా ప్రజాస్వామ్య దేశాలే. అక్కడి రాజకీయ నాయకులు ఎన్నికల మీటింగుల్లో ఇలాంటి మాటలు చెప్పడం ఊహించుకోగలమా? రాజకీయాల్లో పోటీపడేవారు ప్రజలకిది చేస్తాం, అది చేస్తామని చెప్పడం బదులు; దోచిపెడతాం, దాచుకుంటాం అని ప్రకటించడానికి సిగ్గుపడడం లేదు.

మంత్రి పదవులకు రాజీనామాలు చెయ్యడంతోటే వ్యవస్థ బాగుపడేదైతే, ప్రభుత్వం మారినప్పుడల్లా వ్యవస్థ బాగుపడాలి కదా? పరిస్థితి మెరుగవ్వాలంటే అవగాహనలో స్పష్టత ద్వారా ఆలోచనల్లో మార్పు రావాలి. ఐడియాలే ప్రపంచాన్ని మార్చాయి, మారుస్తాయి. మనమేమీ కొత్తగా కనిపెట్టనక్కర్లేదు. మౌలిక భావాలను దిగుమతి చేసుకుని మన దేశ కాలమాన పరిస్థితుల కనుగుణంగా మార్పులు, చేర్పులు చేసుకోవచ్చు. శుభవార్త ఏమిటంటే – కాలం అనంతమయినది. మనం విఫలమైనా, భావితరాలు మంచి ఐడియాలను అందుకొంటాయి. కాకపోతే అలస్యమైన కొద్దీ అనర్థాలు పెరుగుతాయి. అవి ఎవరి పిల్లలను, మనుమలను ఎలా తాకుతాయో ఊహించలేం. నిర్వేదం కాదు గానీ, ఇప్పటి మన ఈ అస్తవ్యస్త పరిస్థితులకు మన ఏ పూర్వీకుల బద్ధకం కారణమో కదా!

26-05-2013

తొమ్మిదేళ్ళ నిర్వాకం

యూపీఏ ప్రభుత్వ పాలనకు కారుమబ్బులు కమ్ముకొస్తున్నాయి. తానే వేసుకున్న చిక్కుముడుల నుంచి బయటపడలేక గిలగిల్లాడుతోంది. ఆర్థిక వృద్ధి రేటు అయిదు శాతం కంటే క్రిందకు పడిపోయి, నెహ్రూ, ఇందిరా గాంధీల జమానాలను గుర్తుచేస్తోంది. బంగారం కొనవద్దని ఆర్థిక మంత్రి ప్రజలకు ఉద్బోధిస్తున్నారు. వృద్ధి లేమితో పాటు ధరల పెరుగుదల, నిరుద్యోగం, కళ్ళు చెదిరే స్థాయిలో అవినీతి, ఆశ్రిత పక్షపాతం, విలువల పతనం – ప్రజలను నిరాశా నిస్పృహలకు గురిచేస్తున్నాయి. ప్రపంచ దేశాల్లో, ముఖ్యంగా పొరుగు దేశాల్లో భారతదేశ ప్రతిష్ట దిగజారుతోంది. మావోయిస్టుల దాడిలో ఒక రాష్ట్ర నాయకత్వాన్ని పూర్తిగా పోగొట్టుకుని కూడా స్వంత పార్టీ వారే కోవర్టులనే ఆరోపణల నెదుర్కొంటున్నారు. ఇవన్నీ వేరు వేరుగా జరిగిన పరిణామాలు కావు. అన్నిటికీ కారణం – ప్రభుత్వం అవలంబించిన మౌలిక రాజకీయ ఆర్థిక విధానాలే.

స్వాతంత్ర్యం వచ్చిన్నాటి నుంచీ కాంగ్రెస్ అవలంబించిన రాజకీయ నమూనా మార్పు లేకుండా కొనసాగుతోంది. ఆ నమూనా ప్రకారం సామాజిక, ఆర్థిక, రాజకీయ విషయాలన్నిటినీ – పార్టీ, ప్రభుత్వం శాసించే విధంగా చట్టాలు, విధానాలు రూపొందించారు. ప్రజలు కష్టపడి సంపాదించిన దాంట్లోంచి లాక్కోగలిగినంత సంపదను పన్నుల రూపంలోనూ, మరికొంత సంపదను లైసెన్సులు, కోటాలు, అనుమతులు, నిబంధనలను అడ్డం పెట్టుకుని అవినీతి రూపంలోనూ – వసూలు చేయడం ఈ నమూనా ముఖ్య లక్షణం. పన్నుల డబ్బును వివిధ వర్గాల ప్రజలకు రాజకీయ అవసరాల మేరకు పంచి పెడతారు. అవినీతి సంపాదనకు వీలుకల్పించే పదవులు, అవకాశాలను కూడా అలాగే పంచుతారు. ఆ రకంగా అన్ని వర్గాల ప్రజలూ తమమీద ఆధారపడి బ్రతికేలా చూసుకుంటారు.

కొందరు లైసెన్సుల కోసం; కొందరు పదవుల కోసం, కొందరు కాలేజీ సీట్లు,

ఉద్యోగాల కోసం, అట్టడుగు వర్గాల వారైతే రోజువారీ బ్రతుకు దెరువు కోసం. ఈ మౌలిక విధానంతోనే నూట ఇరవై అయిదేళ్ల పార్టీ – ప్రజల మీద పట్టు కాపాడుకుంటూ వస్తోంది.

ఈ విధానాలను సిద్ధాంతపరంగా సమర్థించడానికి ఒక పెద్ద నెట్‌వర్క్ కూడా కాలక్రమేణా ఏర్పాటయింది. ఈ నెట్‌వర్క్‌లో మీడియా, మేధావులు, విద్యావంతులు, విద్యావేత్తలు మాత్రమే కాక, ఈ ఆశ్రిత పక్షపాత విధానాలతో లాభపడే వ్యాపారవేత్తలు కూడా ఉంటారు. తప్పనిసరి పరిస్థితుల్లో కొన్ని సంస్కరణలు తేవడం అనివార్యమైనా; మౌలిక రాజకీయ నమూనా మాత్రం మారదు. ఏ ఇతర పార్టీలు కూడా బయటపడలేనంతగా ఈ నమూనా బలపడిపోయింది. ఎవరైనా ఒక విభిన్న అభివృద్ధి నమూనా గురించి మాట్లాడబోతే... ఈ నెట్‌వర్క్ అంతా కలసికట్టుగా వారిమీద విరుచుకుపడిపోతుంది. ఒక రకంగా ఈ వృద్ధ పార్టీ రాజకీయ నమూనాకు – దేశం బందీ అయింది. దీన్నుంచి బయటపడాలంటే, పరిస్థితులు పూర్తిగా దిగజారిపోయి భౌతిక విప్లవమన్నా జరగాలి, లేదా – దేశ ప్రజల ఆలోచనలలో శాంతియుత మానసిక విప్లవమన్నా రావాలి.

విద్యావంతులు, తెలివిగల వారు ఆలోచించాలి. అభివృద్ధి చెందిన దేశాలు ఎందుకు, ఎలా అభివృద్ధి చెందాయి? మన దేశంలో లాగా వ్యక్తి స్వేచ్ఛ, పోటీ తత్వం, ఔత్సాహికతల గొంతు నులమడం ద్వారా కాదు. ప్రజలను వారి మానాన వారిని వదిలి, ఉన్న వనరులను అందరికీ సమానంగా, పారదర్శకంగా అందుబాటులో ఉండేలా చెయ్యాలి. సంపాదించిన దాంట్లో వినియోగం పోగా మిగులును పెట్టుబడిగా పెట్టి, యాంత్రీకరణ పెరిగి, తద్వారా సగటు ఉత్పాదకత పెరిగి, ఆ రకంగా ఉద్యోగులకు డిమాండు పెరిగి, జీతాలు పెరిగి, ప్రజలకు మరిన్ని వస్తువులు, సేవలు అందుబాటులోకి రావడమే – అభివృద్ధి అంటే.

అప్పుడే పేదరికం పోయి, అందరికీ తిండి బట్ట, ఇల్లే కాక; విద్య, వైద్యం, రవాణా, వినోదం, తీరిక అన్నీ అందరికీ దొరుకుతాయి. రెండు రెళ్లు నాలుగన్నది ఎంత సత్యమో, ఆర్థిక శాస్త్ర పరంగా ఈ అభివృద్ధి నమూనా అంత కఠోర సత్యం. ఎన్ని బూజు సిద్ధాంతాల ముసుగు తొడిగి ఎందరిని ఎంతకాలం మోసగించినప్పటికీ, ఈ ఆర్థిక సత్యాన్ని విస్మరించిన మేరకు అభివృద్ధి, సమాజంలో శాంతి కుంటుబడతాయి. ప్రభుత్వ, రాజకీయ జోక్యాల పర్యవసానాలు రకరకాల రూపాల్లో...; కొన్ని ఊహించని స్థాయిలో వ్యక్తమవుతాయి. ఒక జోక్యపు దుష్పరిణామాలు బయటపడినప్పుడు, ఆ జోక్యాన్ని వెనక్కు తీసుకోకుండా, ఆ దుష్పరిణామాన్ని తాత్కాలికంగా కప్పిపుచ్చే ప్రయత్నంలో మరొక జోక్యాన్ని సృష్టించడం పాలకవర్గ నమూనాకు పరిపాటైపోయింది. ఇలా ఒక తప్పుడు విధానం మరొక తప్పుకు దారి తీస్తూ, చివరకు అన్నీ చిక్కుముడులు పడిపోయాయి. ఒక్క ఉదాహరణ చూద్దాం.

ఎవరెన్ని సూత్రాలు చెప్పినా; తర్కపరంగా చూస్తే – ప్రభుత్వాలు విద్యాసంస్థలను నడపాల్సిన అవసరం ఎప్పుడూ లేదు. విద్యకు విలువనిచ్చే వారు ప్రైవేటు పాఠశాలల్లో చదువుకోగలరు. విద్య అందుబాటులో ఉండకుండా పోతుందనేది తర్క విరుద్ధం. ఎవరి స్థోమతకు తగిన పాఠశాలలు, కళాశాలలు వారికి అందుబాటులోకి వచ్చి ఉండేవి. కొన్నేళ్ళ క్రిందటి వరకూ మంచి టీచర్లు – ఇళ్ళ దగ్గర ట్యూషన్లు చెప్పేవారు. వారు వసూలు చేసిన ఫీజు అందరికీ అందుబాటులోనే ఉండేది. పాఠశాలల్లో కూడా అదే స్థాయిలో ఫీజులు వసూలు చేస్తే మరి కట్టలేకపోడమేమిటి? ఉపాధ్యాయుల యూనియన్ల చేతిలో ప్రభుత్వ విద్యావ్యవస్థ నేడు బందీ అయిపోయింది. లక్షలకోట్ల పన్నుల డబ్బు తగలేసినా, ప్రభుత్వ సంస్థల్లో టీచర్ల జీతాలు పెరుగుతున్నాయే తప్ప; విద్యా ప్రమాణాలు, జవాబుదారీతనం, పర్యవేక్షణ రోజురోజుకీ లోపిస్తున్నాయి. విద్యారంగంలో ప్రభుత్వ చొరబాటును క్రమంగా తగ్గించుకుంటూ పూర్తిగా వైదొలిగే ప్రయత్నం జరగాల్సి ఉండగా; ఖచ్చితంగా దానికి విరుద్ధంగా జరుగుతోంది. ప్రభుత్వ గుత్తాధిపత్యం కాపాడడంలోనే టీచర్ల యూనియన్లు, అధికార యంత్రాంగం, రాజకీయ నాయకుల స్వప్రయోజనాలు ఇమిడి ఉన్నాయి. దాంతో ప్రైవేటు విద్యారంగాన్ని తీవ్ర నిబంధనలకు గురిచేయడం ప్రారంభించారు.

ప్రైవేటు విద్యాసంస్థలు – సొసైటీలు, ట్రస్టులు అధ్వర్యంలోనే నడవాలని, లాభాల స్వీకరణ నిషిద్ధమని, ఫీజులు ఇంతే వసూలు చేయాలని, ప్రమాణాలు మాత్రం ఫలానా విధంగా ఉండాలని సవాలక్ష నిబంధనలు పెట్టారు. ఫలితంగా – చాటుగా డొనేషన్లు తీసుకోవాల్సిన అక్రమ మార్గాల్లోకి ప్రైవేటు విద్యా సంస్థలను నెట్టారు. కొత్తగా విద్యాహక్కు చట్టం తెచ్చి వాటి ప్రమాణాలు, ఆర్థిక పరిస్థితి మరింత దిగజారేలా చేశారు. ఏతావాతా ఫలితమేమిటంటే – విద్యాప్రమాణాలు బ్రష్టు పట్టిపోయి – ఎందుకూ పనికిరాని, ఏ కౌశల్యమూ లేని పట్టభద్రులు తయారవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలు మధ్నాహ్న భోజనానికి, విశ్వవిద్యాలయాలు ఉద్యమాలకు, ఇంజనీరింగ్ కాలేజీలు ఫీజు రీయింబర్స్‌మెంటుకు పరిమితమై పోయాయి. ఇదే ప్రహసనం అన్ని ఆర్థిక, సామాజిక రంగాల్లోనూ నడుస్తోంది. ఈ మర్మాన్ని అర్థం చేసుకోకుండా... తప్పెక్కడ జరిగిందా అని బుద్ధిజీవులు కూడా చీకట్లో వెతుక్కుంటున్నారు.

ఈ దృష్టికోణంలో చూస్తే గత తొమ్మిదేళ్ళుగా ఏం జరిగిందో అర్థమవుతుంది. ఎనిమిదేళ్ళు అధికారానికి దూరమైన కాంగ్రెస్; తన పాత పద్ధతులను మళ్ళీ ప్రదర్శించి, ఆమ్ ఆద్మీ పేరుతో ఉచిత పథకాలు, పన్నుల డబ్బును పప్పూ బెల్లాల్లాగా పంపకాలకు

తెరతీసింది. విపరీతమైన కృత్రిమ డబ్బు సృష్టి, తద్వారా ద్రవ్యోల్బణం, సేవా పన్ను లాంటి భారీ వడ్డింపులతో – ప్రజల మిగులు ధనాన్ని నొప్పి తెలియకుండా లాగేశారు. ఒకసారి రుణాల మాఫీ, ఎడతెగని ఉపాధి హామీలతో లక్షల కోట్లు పంచేశారు. అత్యున్నత విద్యాసంస్థల్లో కొత్తగా మరిన్ని రిజర్వేషన్లు పెట్టి, వాటి ప్రమాణాలనూ దిగజార్చారు.

విద్యాహక్కు చట్టం ద్వారా ప్రైవేటు విద్య ప్రమాణాలను, ఆరోగ్యశ్రీ వంటి పథకాలతో వైద్య రంగాన్ని, ఇప్పుడు ఆహార భద్రత బిల్లు ద్వారా వ్యవసాయ రంగాన్ని తిరోగమన బాట పట్టించారు. వామపక్ష పర్యావరణ తీవ్రవాదాన్ని, ఆశ్రిత పెట్టుబడిదారులను ప్రోత్సహించడం ద్వారా భారీ పరిశ్రమలు, విద్యుదుత్పాదన ఇప్పట్లో సాధ్యం కాని పరిస్థితి కల్పించారు. బినాయక్ సేన్ లాంటి స్వప్రకటిత మావోయిస్టు సిద్ధాంతకర్తలను ప్రణాళికా సంఘం సలహాదారులుగా నియమించి, తీవ్రవాద రాజకీయాలకు గౌరవాంగీకారాలు ఆపాదించి పెట్టారు. ఉపాధిహామీ పథకం కారణంగా వ్యవసాయ రంగం,చిన్నతరహా వ్యాపార రంగం కుదేలైపోయి, గ్రామాల్లో అంతంత మాత్రంగా ఉన్న ఆర్థిక, సామాజిక సంబంధాలు మరింత చెడిపోయాయి. చేసింది చాలదన్నట్లు కృత్రిమంగా నిర్ణయించే కనీస వేతనాలను రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించడం లేదని అభియోగిస్తూ జాతీయ సలహా మండలి సభ్యురాలు అరుణా రాయ్ నిష్క్రమించారు.

ఆర్థిక సూత్రాలు ప్రకృతి సూత్రాల్లాగే సరళమైనవి, అంతకు మించి ఖచ్చితమైనవి. వాటి కెదురీదితే – ఎప్పటికైనా మునక్క తప్పదు. గత తొమ్మిదేళ్ళ యూపీఏ పాలనలోని తప్పుడు విధానాల ఫలితాలు ఇప్పుడు చుట్టుముడుతున్నాయి. నిజానికి ఏదీ ఉచితంగా రాదు. తాత్కాలికంగా ఒకరు ఉచితంగా పొందే దానికి వేరొకరు చెల్లిస్తున్నారు. చివరకు నేటి లబ్ధిదారులు కూడా అధిక ధరలు, నాసిరకం నాణ్యత, నిరుద్యోగం, సామాజిక అశాంతి, అభద్రత, శాశ్వత వేదరికాల రూపాల్లో మూల్యం చెల్లించక తప్పదు. ఓట్లేసే ప్రజలు, వారి ఆలోచనలను ప్రభావితం చేయగల మీడియా, మేధావులు – జరిగిన, జరుగుతున్న పొరపాట్లను గ్రహించి ఇక ముందైనా జాగ్రత్తపడాలి. తమంతట తాముగా మారడం – రాజకీయ నాయకులకు ఏమి అవసరం?

09-06-2013

'భద్రతా' విపత్తు!

ఆకస్మిక భారీ వర్షాల మూలంగానో, లేక మంచు కరగడం వల్లనో గానీ - మందాకిని, అలకనంద నదుల్లో వచ్చిన వరద కారణంగా భారీనష్టం జరిగింది. కేదారనాథ్ గ్రామం పూర్తిగా ధ్వంసమైంది. ప్రాణ నష్టం వందల సంఖ్య నుంచి వేలల్లోకి చేరేటట్లు కనిపిస్తోంది. ఇది హిమాలయాల చరిత్రలో మొదటిసారిగా వచ్చిన ఆకస్మిక భారీ వరద. కాబట్టి దీన్ని ముందుగా ఊహించడం ఎవరికీ సాధ్యం కాదు. జరిగిన నష్టం జరిగింది. ఈ పరిస్థితుల్లో మృతదేహాలను వెలికితీయడం, గుర్తించడం, బంధువులకు అప్పగించడం, ప్రాణాలతో ఉన్నవారిని కాపాడి, సురక్షిత ప్రాంతాలకు తరలించడం ముఖ్యమైన పని. దాంతోపాటు నాశనమైపోయిన రోడ్లు, నివాసాలు, వ్యాపారాలు, సౌకర్యాలు ఎంత త్వరగా పునరుద్ధరించగలమనేది ఒక సవాలు. అంతే తప్ప, ఏడుపులు, పెడబొబ్బలు, విమర్శలకిది సమయం కాదు.

కొంతకాలం క్రితం జపాన్‌లో ఇలాగే సునామీ వచ్చిపడి, జన నష్టం కన్నా ఎక్కువ ఆస్తినష్టం జరిగింది. నడుస్తున్న అణు విద్యుత్ కేంద్రం కూడా అత్యంత ప్రమాద స్థితిలో పడింది. అంత పెద్ద దుర్ఘటనలోనూ జపనీయులు చూపిన స్థైర్యం, చొరవ, పట్టుదల నేర్చుకోదగినవి. అడ్డంగా పగిలిపోయిన రోడ్లను వారం రోజుల్లో మళ్ళా యథాస్థితికి తీసుకొచ్చి - వారి జాతి పట్టుదలను ప్రపంచానికి చాటారు. కేదార్‌నాథ్ తదితర ప్రాంతాల్లో జరిగిన నష్టానికి జ్ఞాన లోపం కొంతవరకు కారణం కాగా; కొంత దురదృష్టం తోడై, పేదరికం కూడా ఒక కారణమైంది. 'పేదరికం' - వస్తు సంపదల రూపంలోనే కాదు, ఆలోచనలలో కూడా.

హిమాలయాలు ప్రపంచంలోనే అత్యంత తక్కువ వయసుగల పర్వత శ్రేణి. ఆఫ్రికా ఖండం నుంచి ఒక ముక్క విడిపోయి; సముద్రాల్లో తేలుతూ, ఆసియా ఖండానికి అతుక్కున్న చోట ఆ వత్తిడికి హిమాలయాలు ఏర్పడ్డాయని భూగోళ శాస్త్రజ్ఞుల సిద్ధాంతం.

హిమాలయాల నడినెత్తిన ఉన్న సరస్సులలో ఉప్పునీరు, సముద్ర చేపల అవశేషాలు దొరకడం దానికి ఒకానొక నిరూపణ. హిమాలయాలు సందర్శించిన వారికి అడుగడుగునా దానికి రుజువులు కనిపిస్తాయి. అత్యంత పురాతనమైన దక్కను పీఠభూమిలా కాక; హిమాలయాల్లో కొండలన్నీ మట్టితో కప్పబడి, రాళ్ళు తక్కువ కనిపిస్తాయి. చిన్న చిన్న నీటి ధారలు ఆ మట్టిలోంచి ఉబుకుతూ నీటితో మట్టికొట్టుకు రావడం కనిపిస్తుంది. ఇంకా స్థిరపడని ఈ కొండలు, అస్తమానూ చరియలు విరిగిపడిన తీరు దారి పొడుగునా కనిపిస్తాయి.

1998లో మానస సరోవరం యాత్రలో పెద్ద ఎత్తున జారిపడిన మట్టి కింద పేరొందిన ఒడిస్సీ నర్తకి ప్రతిమా బేడితో సహా సుమారు నాలుగొందల మంది సమాధి అయ్యారు. హిమాలయాలు, దాన్నుంచి వచ్చే నదులు, ధామాల గురించిన పుక్కిటి పురాణాలు ఎలా ఉన్నా; ఈ భౌతిక వాస్తవాలు యాత్రికులకు తెలిస్తే, సున్నితమైన హిమాలయ వాతావరణంలో ఎవరి జాగ్రత్తలు వాళ్ళు తీసుకునే వీలుండేది. కేదారనాథ్ ఆలయం మందాకిని నది ఉద్భవించే చోరాబారీ మంచు ఖండానికి అతి దగ్గరలో ఉండడం వల్ల; వరద విపత్తును దురదృష్టవశాత్తు ముందుగా గ్రహించలేక పోయారు.

కొండచరియలు తరచూ విరిగిపడే ఈ కౌమార హిమాలయాల్లో ఏ నాగరిక సౌకర్యం కలగజేయాలన్నా చాలా ఖర్చుతో కూడుకున్న పని. అంతేగాక, అధునాతక సాంకేతిక పరిజ్ఞానమూ అవసరం. ఇంతకన్నా దుర్భేధ్యమైన ప్రదేశాల్లో అత్యాధునిక సౌకర్యాలు కల్పించిన దృష్టాంతాలు ప్రపంచవ్యాప్తంగా ఉన్నాయి. అంత డబ్బు, చొరవ, ఏకాభిప్రాయం మనదేశంలో దొరకవు. ఏ రోడ్డు వెయ్యాలన్నా, ఏ ప్రాజెక్టు కట్టాలన్నా రకరకాల కారణాలు చూపి అడ్డం పెట్టేవాళ్ళే ఎక్కువ. ఆర్థిక అభివృద్ధి కారణంగా విపరీతంగా పెరిగిన యాత్రికుల తాకిడిని తట్టుకోగల సౌకర్యాలను భద్రమైన ప్రదేశాల్లో నిర్మించలేకపోవడానికి ఇదొక ముఖ్య కారణం. యాత్రికుల సౌకర్యాలకు కావలసిన వందల, వేల కోట్ల రూపాయలను వాటిని ఉపయోగించే వారి దగ్గర్నుంచే వసూలు చెయ్యాలో, లేక హజ్ యాత్రికుల కిచ్చే సబ్సిడీ లాగా దేశం మొత్తం నుంచీ వసూలు చేయాలో అన్నది ఇంకొక తేలని విషయం.

ఇంకో పక్క, ఆహార భద్రత చట్టాన్ని ఆమోదింపజేసుకుని ఎప్పుడెప్పుడు అమలు చేద్దామా అని కేంద్ర ప్రభుత్వం తొందరపడుతోంది. భారత దేశ ఆర్థిక చరిత్రలో ఇది అత్యంత విషాదపూరిత నిర్ణయంగా మిగలబోతోంది. ఇది ఆహార భద్రత గురించి కాదు, రాజకీయ భద్రత కోసమేనని దాదాపు రెండేళ్ల క్రితమే ఈ శీర్షికలో చెప్పబడింది. ఎన్నికలు

దగ్గరపడే కొద్దీ కొద్దికాలమైనా దీన్ని అమలు చేసి ఓట్లు పిండుకోవాలనే ఆత్రం ఎక్కువైంది. కాలక్రమేణా పెను దుష్పరిణామాలకు దారితీస్తున్న ఉపాధి హామీ పథకం విషయంలోనూ; సరిగ్గా ఎన్నికలకు ముందు వ్యవసాయ రుణ మాఫీ పథకం విషయంలోనూ ఇదే జరిగింది. దురదృష్టవశాత్తు, మనదేశంలో తిష్టవేసుకున్న 'బూజుపట్టిన భావజాలం' పుణ్యమా అని ప్రతిపక్షాలకు కూడా ఈ ఓట్ల వేట పథకాలను ప్రశ్నించి, నిలువరించే నైతిక స్థైర్యం కొరవడింది.

అమర్త్యసేన్ మొదలుకొని సంక్షేమ ఆర్థికవేత్తల, వామపక్ష మేధావుల ఆలోచన ప్రకారం సంపద ప్రజలందరికీ ఎలా పంచి పెట్టాలన్నదే – పాలనలో 'ముఖ్య సమస్య.' కానీ ముందు సంపద సృష్టించకుండా ఏం పంచిపెడతారనే తర్కాన్ని వీరు అంగీకరించరు. అందుకే ప్రజల కుండే అన్ని సమస్యల పట్లా ప్రభుత్వం స్పందించాలని డిమాండు చేస్తుంటారు. కానీ ప్రభుత్వ స్పందన – సమస్యను మరింతగా పెంచుతుందనే వాస్తవం ఎన్నిసార్లు రుజువైనా విస్మరిస్తారు. రాజకీయ నాయకులు కూడా ప్రతి విషయంలోనూ కలగజేసుకుని అధికారాన్ని ప్రయోగించాలనే ఆశిస్తారు. అందుకే... రాజకీయ, సంక్షేమ, మేధావి వర్గాలు ఒకరికొకరు అవసరం.

ప్రతిపాదించిన ఆహార భద్రత చట్టం ప్రకారం – దేశంలో మూడింట రెండొంతుల మందికి కిలో రెండు, మూడు రూపాయలకే ఆహార ధాన్యాలు సరఫరా చెయ్యాలనేది ఆలోచన. దీనికి ప్రస్తుత అంచనాల ప్రకారమే సంవత్సరానికి రెండు లక్షల కోట్ల రూపాయలకు పైగా అవసరమవుతాయి. ఇంత డబ్బు ఎక్కడ్నుంచి తెస్తారు? ఎన్నికల వరకు ఎఫ్‌సీఐ దగ్గరున్న నిల్వలను పంచి పెట్టి ఎలాగోలా నడిపినా, తర్వాత పరిస్థితి ఏమిటి? ఇంత ధాన్యం ప్రభుత్వం కొనబోతోంటే, ధాన్యం రేట్లు పెరగనిస్తారా? మరి రైతులేమై పోవాలి? గిట్టుబాటు కాక ఇతర పంటలకు మళ్ళితే, ధాన్యం ఉత్పత్తి ఎలా పెరుగుతుంది? అప్పుడేం పంచిపెడతారు? రూపాయిలు ముద్రించగలరు కానీ ధాన్యాన్ని ముద్రించలేరు కదా! కేరళలో సుక్షేత్రమైన మాగాణి పొలాలను అక్కడున్న కూలీ రేట్లు, పని సంస్కృతికి తట్టుకోలేక వరి పండించడం వదిలేసి బీళ్ళుగా ఉంచడం – ఏడేళ్ళుగా జరుగుతోంది. అదే పరిస్థితి దేశంలోని ఇతర ప్రాంతాల్లో కూడా రావడానికే ఈ చట్టం పనికొస్తుంది.

అత్యంత అవినీతి భరిత, అసమర్థ సంస్థల్లో ఒకటైన ఎఫ్‌సీఐ – ఇప్పుడు సేకరించే ధాన్యంలో సగభాగం నిలవ ఉంచడానికి గోదాములే లేవు. ఈ చట్టాన్ని అమలు చేయ్యాలంటే సేకరణ రెట్టింపుకి పైగా చెయ్యాలి. పౌర సరఫరా విభాగాల ద్వారా పంపిణీ

అవుతున్న ధాన్యాల్లో నలభై నుంచి ఏభై శాతం లబ్ధిదారులకు చేరకుండా బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతోందని జాతీయ శాంపిల్ సర్వే వివరాలు చెబుతున్నాయి. ఆహార ధాన్యాల ఉత్పత్తి ఇప్పుడున్న రెండొందల యాభై మిలియన్ టన్నుల నుంచి మూడొందల యాభై మిలియన్ టన్నులకి పెరిగితే గానీ – చట్టాన్ని అమలుచేయగలిగే పరిస్థితి ఉండదు. అంత ధాన్యం ఉత్పత్తి అయిననాడు అసలీ చట్టం అవసరమే ఉండదు. ఇప్పుడున్న ఉత్పత్తిని కూడా గొంతు నులిమే ఈ చట్టం రైతుల పాలిట, మొత్తంగా వ్యవసాయ రంగం పాలిట పెనుశాపంగా మారబోతోంది.

దేశ ఆర్థిక వ్యవస్థను ఇంత పెద్ద స్థాయిలో నష్టపరచబోతున్న ఆహార భద్రత పథకాన్ని ఎన్నికల ముందు, రాజకీయ లబ్ధికోసం – ముందుకు తేవడంలోని నైతికతను ప్రశ్నించే స్థాయిలో ఏ రాజకీయ పార్టీ కూడా లేదు. అంటే దేశ ప్రజల్లో ఉచిత సరఫరాల పట్ల మోజును అన్ని రాజకీయ పార్టీలూ ఏ స్థాయిలో పెంచి పోషించాయో అర్థం చేసుకోవచ్చు. నిందించాల్సింది ఎవరిని? మారవలసింది ఎవరు? నష్టపోయేది ఎవరు?

23-06-2013

విభజన జరిగేనా?

కొత్తగా చెల్లుబడిలోకి వచ్చిన 'రాయల తెలంగాణ' ఆలోచన తెలంగాణ విషయంలో గత పదేళ్ళుగా సాగుతున్న రాజకీయ ప్రహసనానికి పరాకాష్ఠ. ఇది కష్టమైనది మాత్రమే కాదు, అసంభవమైన ప్రతిపాదన. నిజాం నవాబు అప్పట్లో బ్రిటీష్ వారికిచ్చిన దత్తమండలాలు రాయలసీమగా, సాంస్కృతికంగా మిగతా ఆంధ్రప్రాంతాలతో పెద్దగా తేడా లేకపోయినా; రాజకీయంగా ఒక ప్రత్యేక ప్రాంతంగా గుర్తింపు పొందాయి. అప్పటి ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి భాషా ప్రాతిపదికన ఆంధ్రప్రాంతం విడిపోవాలనుకున్నప్పుడు కూడా...., రాయలసీమ నాయకులు చాలాసార్లు పరోక్షంగా అడ్డంపడేవారు. చివరికి శ్రీబాగ్ ఒప్పందం పేరిట అనేక రాయితీలు కల్పిస్తూ, రాజధానిని ఒక మూలన ఉన్న కర్నూలులో ప్రతిష్టించడానికి ఒప్పుకున్నాకే; 1953లో ఆంధ్రరాష్ట్రావతరణ సాధ్యమయింది.

అలా ఒక రాజకీయ అస్తిత్వం కలిగిన రాయలసీమ సమగ్రత విస్మరింపజాలనిది. టికెట్లు పొంది, కొద్దినెలల్లోనే ఎన్నికలు ఎదుర్కొవలసిన నాయకులు తమ స్వప్రయోజనాల కోసం ఏ సంధి సూత్రాలకు తలొగ్గినా; రాయలసీమ ప్రజలు మాత్రం తమ సీమను అడ్డంగా రెండు ముక్కలుగా విభజించడాన్ని సమర్ధించరు. ఇంత అసంబద్ధమైన పరిష్కారాన్ని చూస్తుంటే – ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలోని అహేతుకత కూడా స్పష్టమవుతోంది.

చారిత్రక, భౌగోళిక కారణాల వల్ల ప్రాంతాల మధ్య ఉండే కొద్దిపాటి అంతరాలే రాష్ట్రాల విభజనకు, చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు ప్రాతిపదిక కావలసివస్తే; ఇందిరా గాంధీ హెచ్చరించినట్లుగా భారత దేశం తిరిగి ఐదారు వందల సంస్థానాల స్థాయిలో ఛిద్రమవుతుంది. దక్షిణ తెలంగాణతో పోలిస్తే, ఉత్తర తెలంగాణ – నీటివనరులు, భూసారపరంగా సంపన్నమైంది. నల్లగొండ జిల్లాలో – మిర్యాలగూడకు, భువనగిరికి, అలాగే ఆదిలాబాద్‌లో తూర్పు, పశ్చిమ ప్రాంతాలకు ఎంతో అంతరముంది. వ్యవసాయమే ప్రధాన వృత్తి, ఆదాయ

వనరయిన పాత రోజుల్లో నీటి లభ్యత, భూసారాలే ఆర్థిక అభివృద్ధిని నిర్దేశించేవి. కానీ ఉత్పత్తి (మాన్యుఫాక్చరింగ్), అంతకుమించి సేవా రంగాలు ముఖ్యమైన ఉద్యోగ, ఆదాయ వనరులయిన ఈ కాలంలో ఆర్థిక అభివృద్ధి మానవ వనరులపై ఆధారపడి ఉంటుంది తప్ప, ప్రాంతాల ప్రాకృతిక వనరులమీద కాదు. తెలంగాణ సహా అన్ని ప్రాంతాల నుంచి లక్షల సంఖ్యలో యువతీ యువకులు పాశ్చాత్య దేశాల్లో ఉద్యోగాలు చేయగలగడం దీనికి ఉదాహరణ. వ్యవసాయానికి సరిపడా నీరు లేని ప్రాంతాల్లో పరిశ్రమలు స్థాపించవచ్చు. వెనకబాటుతనం మన ఆలోచనల్లో, దార్శనికతలో ఉంది తప్ప, ప్రాంతాల్లో లేదు.

చిన్న రాష్ట్రాలంటే మంచిదన్న ఆలోచన చర్చించదగిందే. కానీ ఎంత చిన్నగా ఉండాలి? ఏ ప్రాతిపదిక మీద ఏర్పడాలి? అన్న విషయాల్లో స్పష్టత ఉండాలి. పది జిల్లాల తెలంగాణ అయినా, పన్నెండు జిల్లాల రాయల తెలంగాణ అయినా అంత చిన్నవేం కాదు.

చిన్న రాష్ట్రాలుండాలంటున్న కాంగ్రెస్, బీజేపీలు రెండూ ఉత్తరప్రదేశ్ విభజనను ఆది నుంచి ఎందుకు వ్యతిరేకిస్తున్నాయి? బీజేపీ ఏర్పాటు చేసిన మూడు చిన్న రాష్ట్రాలూ, యాదృచ్ఛికమేగానీ; ఒకేసారి వైఫల్యాలతో వార్తలకెక్కాయి. ఆకస్మిక వరదల బారిన పడిన ఉత్తరాఖండ్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిస్సహాయ స్థితిలో ఉండిపోయింది. ఏ రాష్ట్ర యాత్రికులను ఆ రాష్ట్ర ప్రభుత్వాలు వెతుక్కుని, వెనక్కు తెచ్చుకోవలసిన దయనీయ స్థితి. కేంద్ర బలగాలు, మిలిటరీ రంగంలోకి దిగాల్సి వచ్చింది. చిన్న రాష్ట్రాలకుండే పాలనా బలహీనతలివి. అంతకు ముందు మరో చిన్న రాష్ట్రం ఛత్తీస్‌గఢ్‌లో ప్రతిపక్ష నాయకత్వం మొత్తాన్ని ఏక కాలంలో మావోయిస్టులు ఊచకోత కోశారు. మిగులు కరంటు, మిగులు బడ్జెట్‌లతో సుసంపన్నమైన చిన్న రాష్ట్రంలో శాంతి భద్రతలేవీ? గత ఆరేడేళ్ళుగా ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల నియంత్రణకు కేంద్రబలగాలే బాధ్యత పడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతేమైంది? మరో చిన్న రాష్ట్రం జార్ఖండ్‌లో కూడా మావోయిస్టు హింస అప్రతిహతంగా కొనసాగుతోంది. ఇటీవలే ఎస్పీతో సహా ఆరుగురు పోలీసులను హతమార్చారు. ఒక్కసారి కూడా సుస్థిరమైన ప్రభుత్వమేర్పడలేదు. మాజీ ముఖ్యమంత్రుల్లో మధుకోడా ఏళ్ళతరబడి జైల్లో ఉండగా, శిబుసోరేన్ హత్యకేసులో శిక్షననుభవించారు. ప్రభుత్వాల పరిధి పెరిగే కొద్దీ అధికార కేంద్రీకరణ జరుగుతుంది. ఇదొక తార్కిక సత్యం.

పందొమ్మిదో శతాబ్దం మధ్యలో జరిగిన అమెరికన్ సివిల్‌వార్ ఫలితంగా అక్కడి రాష్ట్రాల అధికారాలు కుదించుకుపోయి – కేంద్రం ప్రభుత్వం పెద్దన్న పాత్ర పెరుగుతూ

వచ్చింది. కెనడాలోనూ అదే జరిగింది. భారతదేశంలోనూ అదే జరుగుతోంది. దాని ఫలితమే అనవసర యుద్ధాలు, ప్రజల కష్ట ఫలాల్ని ఆరగించే రక్షణ రంగ వ్యయం. అంతర్గత అశాంతి, ఉద్యమాలు, ద్రవ్యోల్బణం.

నిరుద్యోగం, ఆర్థిక సంక్షోభాలు. విద్య, వైద్యం, వ్యవసాయం – రాష్ట్ర జాబితాలో ఉండాల్సిన విషయాల్లో కేంద్ర ప్రభుత్వం జోక్యం, అజమాయిషీ ఎంతగా పెరిగిందో అందరికీ తెలిసిందే. అదే బాటలో రాష్ట్ర ప్రభుత్వాలూ నడుస్తున్నాయి. జిల్లాలకు, పంచాయితీలకు అధికార వికేంద్రీకరణ కేవలం 73, 74 రాజ్యాంగ సవరణలకు, వాగ్దానాలకు మాత్రమే పరిమితమైనాయి.

డబ్బు, విచక్షణాధికారాలు కేంద్రీకృతమయ్యాయి కాబట్టే – రాష్ట్ర స్థాయిలో పగ్గాలు చేపట్టాలనే తపన పలు పార్టీల ఏర్పాటుకు; ప్రాంతీయ ఉద్యమాలకు దారి తీస్తోంది. మంచో, చెడో – భాషా ప్రాతిపదికన రాష్ట్రాలు ఏర్పాటయ్యాయి. తిరిగి వాటిని విభజించాలన్నా, పునర్వ్యవస్థీకరించాలన్నా, జాతీయ స్థాయిలో ఏదో ఒక హేతుబద్ధమైన ప్రాతిపదికను నిర్ధారించాలి కదా! ఈ దిశగా ఏ పార్టీలు చొరవ చూపడం లేదు. ఎవరికి వారు రాబోయే ఎన్నికలలో తమకు ఎలా లబ్ధి చేకూరుతుందోనని లెక్కలు వేస్తున్నారు. అలా అని నిస్సిగ్గుగా ప్రకటిస్తున్నారు కూడా.

రాష్ట్రాన్ని విభజిస్తే తమ పార్టీకి లాభమని గుర్తించినట్లు, అందుకే ఆ దిశగా అడుగులు వేస్తున్నట్లు దిగ్విజయ్ సింగ్ ప్రకటించడం రాజకీయ దిగజారుడుతనానికి నిలువెత్తు సాక్ష్యం. గంభీరమైన, దేశ నిర్మాణానికి సంబంధించిన విషయాలపై ఎంత సంకుచిత స్థాయిలో, తాత్కాలిక స్వీయ రాజకీయ ప్రయోజనాలకు మొగ్గు చూపుతున్నారో అర్థమవుతోంది. ఈ స్థాయిలో ఆలోచించే రాజకీయాలు – బొగ్గు బ్లాకులను అమ్ముకోవడం, ఎన్నికలయ్యాక చెల్లించాల్సిన గ్యాసు ధరలను ఇప్పుడే నిర్ణయించి రిలయన్సుకు లబ్ధి చేకూర్చడం, ఓటర్లకు వలగా ఆహార భద్రత పథకాన్ని విసరడంలో ఆశ్చర్యమేముంది? వీటి పట్ల ఎలా స్పందించాలన్నది ప్రజల మేధస్సుకు పరీక్ష.

రాష్ట్ర అసెంబ్లీ అభిప్రాయంతో సంబంధం లేకుండా కేంద్ర ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం ప్రమాదకరమైన పరిణామం. భారత సమాఖ్య మనుగడకు కేంద్ర, రాష్ట్రాల మధ్య పరస్పర విశ్వాసం, గౌరవం అవసరం. వాటిని ఒకసారి కోల్పోతే, దేశ సమగ్రతకే ముప్పు. తాత్కాలిక స్థానిక ప్రయోజనాల కోసం పంజాబు రాజకీయాల్లో చిచ్చుపెట్టి, భింద్రన్‌వాలేలను సృష్టించిన వారు; రగులుకున్న అగ్నికి – తాము ఆహుతవడమే కాక; వేలాది మంది ప్రాణ నష్టానికి కారకులయ్యారు. మళ్ళీ మళ్ళీ అలాంటి అనాలోచిత

నిర్ణయాలకే తెగబడుతున్నారు.

అదుపు చెయ్యలేని స్థాయిలో మావోయిస్టు కార్యకలాపాలు విస్తరిస్తే – చిన్న రాష్ట్రం ఏం చెయ్యగలుగు తుంది? చారిత్రక గాయాలు తిరగదోడి, నివురుగప్పిన నిప్పులా ఉన్న మతోన్మాద శక్తులు చెలరేగితే – అధికారం ఎప్పటికీ తమ చేతుల్లోనే ఉంటుందా? తెలుగు ప్రజలు రెండు, మూడు రాష్ట్రాలుగా ఉంటే తప్పేమిటనే వారు, రేపు భారతీయులు రెండు, మూడు దేశాలుగా ఉంటే ఇబ్బందేముందనే వాదనను ఎలా ఎదుర్కుంటారు?

అధికారమే లక్ష్యం, విభజనే మార్గం అనుకునే వాళ్ళు కూడా కాకి లెక్కలే తప్ప, ఎన్ని సీట్లోస్తాయో ఎంతవరకు ఊహించగలరు? ఇన్ని ప్రశ్నలు, సమస్యలు, సమీకరణాలు, సెంటిమెంట్లు, సెటిలర్ల అభద్రతా భావాల మధ్య ఏం జరగబోతోందో ఎవరికి తెలుసు? ప్రజల కష్టార్జితాన్ని దోచుకు తినడానికి అలవాటుపడిన పాలక వర్గాలు – తమ దోపిడీ నైజం ప్రజలకంట పడకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు కొత్త సమస్యలను సృష్టిస్తూ, ప్రజలను రకరకాలుగా విభజిస్తూ దృష్టి మరల్చుతారు. అది వారి వృత్తి నైపుణ్యత. తమ ఓటును ఈ దోపిడీదారుల నుంచి స్వేచ్ఛ పొందడానికి ఉపయోగించాల్సింది పోయి; ప్రజలు కూడా రాజకీయ నాయకులు విసిరిన ఉచ్చుల్లో చిక్కుకోవడమే అసలు విషాదం. అక్షరాస్యత, సమాచార సాధనాలతో పాటు ఆలోచనా శక్తి, విశ్లేషణా సామర్థ్యం, స్వేచ్ఛా స్ఫూర్తి, వ్యక్తి స్వాతంత్ర్య పిపాస పెరుగుతాయని ఆశిద్దాం.

07-07-2013

సవరణ అంటే కష్టం

రాజకీయ కాంక్షలు, ఆకాంక్షలు, సెంటిమెంట్లు, ఉద్వేగాలతో కూడిన రాష్ట్ర విభజన విషయం గురించి చర్చించడం, కొంత అప్రియకరమైనా, తప్పని పరిస్థితి. చకా చకా కదులుతున్న పావులూ; గంట గంటకూ మారుతున్న వ్యాఖ్యానాలు; తెరపైకొస్తున్న కొత్త కొత్త ప్రతిపాదనల నేపధ్యంలో కొన్ని విషయాలపై ప్రజలకు స్పష్టతనివ్వాల్సిన అవసరముంది. కొందరి అభిప్రాయం ప్రకారం – రాష్ట్ర విభజనకు పార్లమెంటులో బిల్లు పెడితే చాలు; సాధారణ మెజారిటీ సరిపోతుంది. బీజేపీ కూడా సమర్థిస్తానంటోంది, కాబట్టి సమస్యే లేదు. ఒకవేళ రాజ్యాంగ సవరణ అవసరమైనా... దానికీ సాధారణ మెజారిటీ చాలంటారు. కానీ ఇవేవీ నిజాలు కావు. అలా చేప్పే వారికి తెలియకపోవచ్చు, లేదా మైండ్ గేమ్ ఆడుతుండవచ్చు.

రాజ్యాంగంలోని మూడవ అధికరణం (ఆర్టికల్) ప్రకారం కొత్త రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఏర్పాటు చేయడానికి పార్లమెంటుకు అధికారం ఉంది. కానీ దానికొక ప్రక్రియ (ప్రొసీజర్) కూడా అదే అధికరణంలో రాసి ఉంది. ఆ ప్రక్రియను తుచ తప్పకుండా పాటించాల్సిందే. దాని ప్రకారం (కేంద్ర క్యాబినెట్ సూచన మేరకు) రాష్ట్రపతి, విభజన లేదా పునర్వ్యవస్థీకరణ ప్రతి పాదనను సంబంధిత రాష్ట్ర శాసన సభకు పంపాలి. నిర్దిష్ట కాల వ్యవధిలోగా అసెంబ్లీ తన అభిప్రాయం ఏదైనప్పటికీ తెలియజేయాలి – రాష్ట్రపతి అట్టి పునర్వ్యవస్థీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టడానికి ఆ తరువాతే అనుమతించాలి. ఆ బిల్లు పాసవడానికి సాధారణ మెజారిటీ చాలు. ఇక పోతే, రాజ్యాంగం ఒకటో షెడ్యూలులో రాష్ట్రాల, కేంద్రపాలిత ప్రాంతాల పట్టిక ఉంటుంది, ఏదైనా రాష్ట్రం పునర్వ్యవస్థీకరించబడితే కొత్త పేర్లు పట్టికలో చేర్చాల్సి ఉంటుంది. కానీ ఈ చిన్న కార్యక్రమం రాజ్యాంగ సవరణ కిందకు రాదు. అలా అని నాల్గవ అధికరణంలో రాసుంది. ఇంత వరకు ఎక్కడా అస్పష్టతకు తావులేదు.

కాకపోతే, ఆంధ్రప్రదేశ్ విషయాని కొచ్చేసరికి, దాన్ని విభజించాలన్నా ఇంకే రకంగానైనా పునర్వ్యవస్థీకరించాలన్నా, ఇతర రాష్ట్రాల్లా కాకుండా కొన్ని ప్రత్యేకతలున్నాయి. ఆ ప్రత్యేకతకు మూలాలు – '371 డి' అధికరణంలో ఉన్నాయి. నవతరం యువత తెలుసుకోవాల్సింది ఏమిటంటే; 1969లో తెలంగాణలోను, 1972లో సీమాంధ్ర ప్రాంతంలోను విభజన కోసం ఉద్యమాలు జరిగాయి. వాటి ముగింపుగా అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ భాషా ప్రయుక్త రాష్ట్రాల విభజనకు సమేమిరా అన్నారు. కానీ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల ప్రజల ప్రయోజనాలను పరిరక్షిస్తానని హామీ ఇచ్చారు. ఆ హామీల మేరకు 1973 లో చేసిన 32వ రాజ్యంగ సవరణ ద్వారా '371 డి' అధికరణాన్ని రాజ్యాంగంలో చేర్చారు. ఈ అధికరణం కేవలం ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే ఉద్దేశించింది. అందులో తెలంగాణ, రాయలసీమ, ఆంధ్ర వంటి పదాలు లేవు.రాష్ట్రాన్ని జోన్లుగా విభజించి కొన్ని రకాల ఉద్యోగాలను జిల్లాలకు, జోన్లకు పరిమితం చేసి, మిగిలిన వాటిని రాష్ట్ర స్థాయి ఉద్యోగాలుగా గుర్తించడం లాంటి ప్రత్యేక అధికారాలు ఈ అధికరణం ద్వారా రాష్ట్రపతికి ఇచ్చారు. విద్యా సంస్థల్లో ప్రవేశాలకూ అలాంటిదే విధానం తయారయింది. అందుకే మన రాష్ట్రంలో గుమాస్తా ఉద్యోగాలు స్థానిక జిల్లా వాసులకు, ఎమ్మార్వో వంటి గ్రూప్ 2 ఉద్యోగాలు స్థానిక జోన్ వారికి పరిమితమయ్యాయి. ఇలాంటి రాజ్యంగ బద్ధ వ్యవస్థ ఏ ఇతర రాష్ట్రానికీ లేదు.

ప్రాంతాల వారీగా ప్రయోజనాల పరిరక్షణ కోసం ఇచ్చిన ఈ రాజ్యాంగ బద్ధ హామీలే – ఇప్పుడు రాష్ట్ర పునర్వ్యవస్థీకరణకు అడ్డుపడతాయి. కొందరు మేధావులు – ముందు రాష్ట్రాన్ని విభజించి, తర్వాత రాజ్యాంగ సవరణ ద్వారా '371 డి' ని రద్దు చెయ్యవచ్చంటారు. మరి కొందరు, ఒకసారి విభజన జరిగాక '371 డి' దానంతట అదే జీవం కోల్పోతుందం టారు. కానీ అది నిజం కాదు. చాలామంది రాజ్యాంగ నిపుణుల అభిప్రాయం ప్రకారం '371 డి' కి ఒక చారిత్రక నేపథ్యముంది. కాబట్టి దాన్ని తొలగించడానికి రాజ్యాంగ సవరణ అవసరం, అది జరక్కుండా విభజన ప్రక్రియ సాధ్యం కాదంటున్నారు. ఏది ఏమైనా; విభజన ప్రతిపాదనలకు రాజ్యాంగ చిక్కులు, సవరణలు తప్పవు. సరే, సవరించాలంటే ఏం చెయ్యాలి? రాజ్యాంగానికి ఏ సవరణ చెయ్యాలన్నా 368 అధికరణం క్రిందే చెయ్యాలి. వేరే దారి లేదు.

ఈ అధికరణానికి ఒక ఆసక్తికరమైన చరిత్ర ఉంది. 1967లో గోలక్ నాథ్ కేసు సుప్రీంకోర్టు ముందుకు వచ్చింది. రాజ్యాంగం ఇచ్చిన ప్రాథమిక హక్కుల్ని సవరించే అధికారం పార్లమెంటుకు ఉందా, లేదా అన్నది ఆ కేసులో తేల్చాల్సిన ప్రశ్న. రాజ్యాంగ

ధర్మాసనానికి శీర్ష స్థానంలో అప్పటి ప్రధాన న్యాయమూర్తి, న్యాయశాస్త్ర పారంగతుడు, తెలుగువారైన కోకా సుబ్బారావు ఉన్నారు. ప్రాథమిక హక్కుల్ని సవరించే అధికారం పార్లమెంటుకు లేదని తేల్చారు. అందుకు చెప్పిన కారణాలు ఆసక్తికరమైనవి.

రాజ్యాంగం రాసినప్పుడు 368వ అధికరణం రాజ్యాంగ సవరణ ప్రక్రియను, విధానాన్ని వివరించిందే తప్ప, అసలు సవరించే అధికారం ఎవరికుందో చెప్పలేదు. ఇది రాజ్యాంగ నిర్మాణంలో అనుకోకుండా జరిగిన పొరపాటు కావచ్చు, లేదా కావాలనే రాజ్యాంగ సవరణలకు పరిమితులు విధించడానికి కావచ్చు. కానీ ఆ నాటికే రాజ్యాంగాన్ని పలుమార్లు సవరించేశారు! సుబ్బారావు గారి వివరణ ప్రకారం రాజ్యాంగాన్ని సవరించే హక్కు ఎవరికి దఖలయిందో చెప్పే అధికారం ఏదీ ఎక్కడా రాసి లేదు. అయినా పార్లమెంటుకు ఒక మూలన కొంత హక్కుంది.

ఎక్కడ? రాజ్యాంగం ఏడో షెడ్యూలులో కేంద్ర, రాష్ట్రాల అధికారాలు, ఉమ్మడి అధికారాల పట్టికలు ఉన్నాయి. ఉదాహరణకు రక్షణ, విదేశీ వ్యవహారాలు కేంద్రానికి; వ్యవసాయం, విద్య, రాష్ట్రాలకు; నేర శిక్షాస్మృతి, అడవులు ఉమ్మడి జాబితాలోను ఉన్నాయి. మొదటి జాబితాలో 97వ క్రమ సంఖ్యలో ఏ ఇతర జాబితాలోనూ లేని మిగులు అధికారాలన్నీ కేంద్రానికి దఖలయ్యాయి.

ఆ మిగులు అధికారాల క్రింద కేంద్రం, అంటే పార్లమెంటు, రాజ్యాంగాన్ని సవరించే అధికారం కూడా పొందుతోందని తేల్చారు. కానీ అది శాసనాధికారమే తప్ప రాజ్యాంగాధికారం (Constituent Power) కాదని స్పష్టం చేశారు. ప్రాథమిక హక్కులకు 12, 13 అధికరణాలు రక్షణ కవచంగా ఉన్నాయి. శాసనాల ద్వారా ప్రాథమిక హక్కులకు భంగం కలిగించకూడదని వాటి సారాంశం. కాబట్టి తనకున్న సాధారణ శాసనాధికారాలను ఉపయోగించి, పార్లమెంటు, ప్రాథమిక హక్కులకున్న రాజ్యాంగబద్ధ రక్షణ కవచాన్ని ఛేదించే వీలే లేదని, కాబట్టి ప్రాథమిక హక్కుల్ని సవరించే అధికారం పార్లమెంటుకు లేదు పొమ్మన్నారు.

రాజ్యాంగం అమలులోకి వచ్చిన సంవత్సరం లోపు నుండే 'ప్రాథమిక హక్కుల' సమాధికి – రాళ్లు పేర్చడం మొదలైంది. సోషలిస్టు భావజాల ప్రేరిత ప్రభుత్వాలు, దాదాపు అన్ని పార్టీల ఆర్థిక, రాజకీయ ఎజెండాల అమలుకు – ప్రాథమిక హక్కులు అడ్డంకిగా తోచాయి. కోకా సుబ్బారావు గారి పదవీ విరమణ అనంతరం, 1971లో ఇరవై నాలుగో రాజ్యాంగ సవరణ తీసుకొచ్చారు. తద్వారా 368వ అధికరణంలో మార్పులు చేశారు. రాజ్యాంగాన్ని ఎలా కావాలంటే అలా (ప్రాథమిక హక్కులతో సహా) సవరించుకునే అధికారాలు

పార్లమెంటుకు కట్టబెట్టారు. అప్పటినుంచి 368వ అధికరణం రాజ్యాంగ సవరణ హక్కులు పార్లమెంటుకు దఖలు పరుస్తూ, సవరణ ప్రక్రియను కూడా అంతకు ముందులాగే వివరంగా సూచించింది. దాని ప్రకారం ఏ రాజ్యాంగ సవరణ చెయ్యాలన్నా పార్లమెంటు ఉభయ సభల్లోనూ మూడింట రెండు వంతుల మెజారిటీ తప్పని సరి. 371 - డి ని రాజ్యాంగం నుంచి తొలగించాలన్నా అదే మెజారిటీ అవసరం. అంటే లోక్‌సభలో 360ఓట్లు కావాలి. కాంగ్రెస్‌తో పాటు, దాని మిత్ర పక్షాలు, బీజేపి కలసి సమర్థిస్తే గానీ అది సాధ్యం కాదు.

రాష్ట్రాన్ని విభజిస్తే - తెలంగాణ ప్రాంతంలోని 17 ఎం.పి స్థానాల్లో 15 గెలుచుకోవచ్చనేది కాంగ్రెస్ ఆలోచన. బీజేపీ కార్యక్షేత్రం కూడా తెలంగాణే. దేశస్థాయిలో ఈ రెండు జాతీయ పార్టీల మధ్య సమరం నడుస్తోంది. నరేంద్రమోదీ రాకను అడ్డుకునేందుకు కాంగ్రెస్ సకల అస్త్రాలను ప్రయోగిస్తోంది. బీజేపీ కూడా చావో రేవో తేల్చుకునేందుకు సిద్ధమవుతోంది. ఈ పరిస్థితుల్లో 15 లోక్‌సభ స్థానాలు, అది కూడా తాను ఎప్పట్నుంచో ఆశలు పెంచుకున్న తెలంగాణ నుంచి, వెండి పళ్లెంలో పెట్టి కాంగ్రెస్‌కు అప్పగించడానికి బీజేపీ సిద్ధపడుతుందా?

కాంగ్రెస్‌కు సహకరించి, రాజ్యాంగ సవరణ విభజన బిల్లులు పార్లమెంటులో నెగ్గించడానికి ప్రయత్నిస్తుందా? లేక ఏదో ఒక మిషతో కాంగ్రెస్ పథకం పారకుండా అడ్డుపడుతుందా? ఉద్యమాలు, విభజన నిర్ణయాలు ఓట్లు, సీట్లు కోసమేనని వివిధ పార్టీలు బహిరంగంగా ప్రకటించుకుంటున్న నేపథ్యంలో; బీజేపీ ఏవైనా ఆత్మరక్షణ చర్యలకు దిగితే తప్పుపట్టగలమా? ఇప్పుడు బీజేపీ సహకరించకపోతే, రేపు బీజేపీ అధికారంలోకి వచ్చి తెలంగాణ ఏర్పాటు చేద్దామని నిజాయితీగా ప్రయత్నించినా గానీ రాజ్యాంగ సవరణకు కాంగ్రెస్ అప్పుడు సహకరిస్తుందా? సమాధానాలు వెతకాల్సిన అసలు రాజకీయ ప్రశ్నలివే. ఇన్ని అనుమానాలు, అస్పష్టతలు, అస్థిరతల నడుమ - చిగురు టాకులా కంపిస్తున్న రాష్ట్ర భవిష్యత్తేమిటి?

21-07-2013

విషాద ఘట్టం

తెలుగుజాతి చరిత్రలో ఇదొక విషాద ఘట్టం. రహదారి కూడలిలో నిలబడి, చీలిపోయి..., రెండు దారులు పట్టారు. ఈ రెండు దారులు సమాంతరంగా నడుస్తాయో, భిన్న మార్గాల్లో నడుస్తాయో కాలం, ఖర్మం, ఆలోచనా విధానాలే నిర్ణయిస్తాయి.

సిపిఐఎంఎల్ జనశక్తి పార్టీ చీలికలు, పేలికలై, అందులోంచి వీరన్న వర్గం పుట్టుకొచ్చింది. వర్గపోరాటంలో కుల పోరాటాల పాత్ర విషయంలో విభేదిస్తూ బయటకొచ్చిన ఈ సంస్థ, 1996-97లో ప్రత్యేక తెలంగాణ ఏర్పాటుకు పిలుపునిచ్చింది. ఒక బహిరంగ సభ కూడా నిర్వహించింది. ఆ సభకు వచ్చిన స్పందన – వివిధ పార్టీల కంటబడింది. అదే సమయంలో ఉత్తరాంచల్, ఛత్తీస్‌గడ్, జార్ఖండ్ రాష్ట్రాల ఏర్పాటుకు అక్కడ ఉద్యమాలున్నాయి. అప్పటికి కేంద్రంలో అధికారం రుచి చూడని బీజేపీ – చిన్న రాష్ట్రాలకు మద్దతిచ్చింది. తద్వారా తమ పార్టీ ముఖ్యమంత్రుల సంఖ్య పెంచుకోవాలనుకుంది. ఒక ఓటు, రెండు రాష్ట్రాల నినాదంతో కాకినాడలో తీర్మానం చేసి 1997లో తెలంగాణ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అప్పటికే ఉత్తర తెలంగాణను విముక్తి ప్రాంతంగా ప్రకటించుకున్న మావోయిస్టులు కూడా ప్రత్యేక తెలంగాణకు పిలుపివ్వడమే కాకుండా, దీని కోసం టీపీఎఫ్‌లాంటి ప్రజాసంఘాలు పెట్టారు. తమ ముసుగు సంస్థలైన ఎపీసీఎల్‌సీ, విరసంల ద్వారా తెలంగాణలోని విశ్వవిద్యాలయాల నుంచి ప్రత్యేక తెలంగాణ కోసం ప్రచారం మొదలెట్టారు. అప్పటికి ఆర్థిక సంస్కరణల ఫలాలు క్షేత్ర రంగంలో కనిపించలేదు.

అసలే అప్పటికి కొంత వెనకబడి ఉన్న తెలంగాణలోని కొన్ని ప్రాంతాలు, మావోయిస్టుల ప్రాబల్యం వల్ల; పెట్టుబడులు రాక ఇంకా వెనకబడిపోయే పరిస్థితులున్నాయి. మావోయిస్టు ప్రాబల్యం లేని ప్రాంతాల్లో వామపక్షవాదులకు ఒక కొత్త నినాదం దొరికింది. ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టు సౌధాలు కుప్పకూలిపోవడం, ఆర్థిక సంస్కరణల హోరులో

దిక్కుతోచని వీరికి ఒక ఆయుధం, కథలల్లడానికి ఒక కొత్త విలన్ దొరికారు. రచన, వ్యాసంగం, కవిత్వం, రాజకీయ విశ్లేషణ రంగాల్లో విభజనవాద యుగం మొదలైంది.

1999 ఎన్నికలలో కాంగ్రెస్ అధికారాన్ని చేజిక్కించుకోవడంలో విఫలమైంది. 1994లో 26సీట్లు తెచ్చుకున్న పరాభవంతో పోలిస్తే; సీట్ల సంఖ్య ఎంతో కొంత మెరుగైనా, అధికారం సుదూరంలో కానరావట్లేదు. కమ్యూనిస్టు పార్టీలు ఒంటరిపోరుకు దిగి ఘోర పరాభవం పొందాయి. కాంగ్రెస్‌కు వచ్చిన సీట్లలో ఎక్కువ భాగం తెలంగాణ నుంచే వచ్చాయి. కేంద్రంలో ఏర్పడిన బీజేపీ ప్రభుత్వం మూడు కొత్త, చిన్న రాష్ట్రాలు ఏర్పాటు చేసింది. మద్దతుగా ఉన్న తెలుగుదేశం పార్టీ అభ్యంతరాల వల్ల తెలంగాణ గురించి ఆలోచనే చెయ్యలేదు. వామపక్ష తీవ్రవాద వర్గాల ప్రచార హోరును అందిపుచ్చుకుని, నలభై ఒక్కమంది తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అప్పటి ప్రతిపక్ష నాయకుడు రాజశేఖరెడ్డి ఆధ్వర్యంలో – 'ప్రత్యేక తెలంగాణ' కోసం సోనియాకు వినతి పత్రం ఇచ్చారు. ఇతర ప్రాంతపు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎవరూ అభ్యంతరం కూడా పెట్టలేదు. చేతికందిన అంశాన్ని పట్టుకొని ఎలాగోలా తెలుగుదేశం నుంచి అధికారం చేజిక్కించుకోవడమే అప్పట్లో వారి ప్రాధాన్యం.

కేసీఆర్‌కు మంత్రి పదవి దక్కలేదు. దానిక్కారణాలు – తెలుగుదేశం పార్టీవారికే తెలియాలి. కొంతకాలం బెట్టుచేసి, అయిష్టంగానే అసెంబ్లీ ఉప సభాపతి పదవిని కొంతకాలం నిర్వహించి; పార్టీని, పదవులను వదులుకొని బయటకెళ్ళారు. తెలంగాణ సాధన కోసం టీఆర్ఎస్ స్థాపించారు.

మొదట్లోనే పెద్ద ఎత్తున వచ్చిన స్పందనతో, 2004 నాటికి ప్రత్యేక తెలంగాణ అంశం ఎన్నికలలో ఒకానొక ప్రధాన అంశంగా మారింది. ఆ ఎన్నికల్లో వేర్పాటువాదానికి వ్యతిరేకంగా, సమైక్య ఆంధ్రప్రదేశ్‌కు అనుకూలంగా తెలుగుదేశం పార్టీ ఖచ్చితమైన వైఖరి తీసుకుంది. పలు కారణాలతో – ఘోర పరాజయం పాలైంది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని సమర్ధిస్తూ, కాంగ్రెస్ పార్టీ టీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకుని గెలిచింది. తెలంగాణ ఏర్పాటు అనివార్యమనిపించింది.

కానీ, తొమ్మిదేళ్ళు ఆ మాట, ఈ మాట చెబుతూ, ఏ రోటి కాడ ఆ పాట పాడుతూ వచ్చారు. కాలయాపన కోసం కమిటీల మీద కమిటీలు వేశారు. ఈ అనిశ్చితి వల్ల అభివృద్ధి, పెట్టుబడులు ఆగిపోయాయి. రాష్ట్రం మొత్తానికి తీవ్ర నష్టం జరిగింది. విభజనవాదానికి సమర్థనగా – ముందుకు తెచ్చిన అంశాలు చాలా వరకు అబద్ధాలు, కొన్ని అర్ధ సత్యాలు... కొన్నైతే హాస్యాస్పదాలు కూడా. ప్రత్యేకమైన వెనుకబాటుతనం

నిజంకాదని ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయి. కానీ ప్రభుత్వాలు, మేధోవర్గాలు ఈ నిజాల వెలుగులో జరుగుతున్న విష ప్రచారాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నించకపోవడం వారి జడత్వానికి నిదర్శనం. ప్రభుత్వ ఉద్యోగాల్లో పెద్ద ఎత్తున అన్యాయం జరిగిందన్నది నిజం కాదని రుజువైంది.

ఇక ఏవీ దొరక్క; 'ఆత్మగౌరవం... సెంటిమెంటు' అని ఆత్మాశ్రయ వాదాలకు పరిమితమయ్యారు. భారతదేశంలో ఖలిస్థాన్, కాశ్మీర్ ఉద్యమాలతో సహా ఏ ఉద్యమంలోనూ సహ దేశస్తులు, భాషస్తుల పట్ల ఇంత విద్వేషం, విష ప్రచారం జరగలేదు. కొన్ని సంవత్సరాల పాటు – తెరాసను తెలుగుదేశం మెడలు వంచడానికే ఉపయోగించారు. తన అస్తిత్వంలోనే సమైక్యవాదాన్ని నింపుకున్న తెలుగుదేశం – జాతీయ పార్టీల కుట్రలకు తలవంచక తప్పలేదు. తెలంగాణ ఉద్యమం అత్యంత అధో దశలో ఉన్న సమయంలో.... ఎన్నికలు కూత వేటు దూరంలో ఉండగా – తెలుగు ప్రజల మీద పిడుగులాంటి నిర్ణయాన్ని పడేశారు. ఈ నిర్ణయం, నిర్ణయించిన సమయం కేవలం యువరాజు రాజకీయ ప్రయోజనాల కోసమేనని స్పష్టంగా కనిపిస్తోంది. జాతి, దేశ ప్రయోజనాలు, దీర్ఘకాలిక పర్యవసానాలు వీరికి పట్టవని కూడా తేలిపోయింది.

వ్యక్తిగతమైన వైఫల్యాలు గానీ, సాపేక్ష వెనుకబాటుతనంగానీ, మనిషిని, వేరే ఎవరినో నిందించడానికి ప్రేరేపిస్తాయి. అది సహజం. రాజకీయ పార్టీలు కూడా ప్రజల మధ్య ఇంకా కొత్త వైరుధ్యాలు, తేడాలు తెచ్చి; గొర్రె పొట్టేళ్ళలాగా కొట్టుకోవడానికి ప్రేరేపించి, 'చచ్చిన గొర్రెను ఇవాళ తిందాం,' 'మిగిలిన గొర్రెలను ఇంట్లో కట్టేసుకుని రేపు తిందాం' అని చూస్తుంటాయి. మనుషుల్లోని దౌర్బల్యం, 'రాజకీయాల గుంటనక్కతనమ'నే దుష్ట శక్తులు ఏకమైన నాడు జరిగేది వినాశమే, మిగిలేది విషాదమే. ఈనాడు తెలుగుజాతికి జరిగిందదే.

అబద్ధాలు, అర్ధ సత్యాలు, ఇంటికో ఉద్యోగం, మూడెకరాల పొలం, డబుల్ ప్రమోషన్ లాంటి సాధ్యం కాని తాయిలాలతో మనిషిలోని ఆదిమ భావోద్వేగాలను రగిలించడం వల్ల వచ్చే పర్యవసానాలు – చేదు ఫలాలు కాక తప్పదు. కానీ ఎవరికి పట్టింది? నిజాలు తెలిసే నాటికి ఈ నాయకులుండరు. వైఫల్యాలకు నిందించడానికి ఇంకో కొత్త నినాదం దొరక్కపోదు. తక్షణ ఆందోళన హైదరాబాదులోని సీమాంధ్రుల, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి స్థిరపడ్డవారి ధన, మాన, ప్రాణాల రక్షణ విషయంలోనే. ఉద్యమ సందర్భంలో నెత్తినెత్తుకున్న కొన్ని లంపెన్ శక్తులు ఊరికే ఉండవు. బహిరంగ దౌర్జన్యాలకు, బెదిరింపులకు, కబ్జాలకు, రౌడీ మామూళ్ళకు తెగబడతాయి. వీరికి రక్షణ

కల్పించడం భారత ప్రభుత్వపు కనీస కర్తవ్యం. మాటలు, ప్రకటనలు, ఉత్తుత్తి హామీలు ఎందుకూ పనికిరావు.

దీనికంటే గంభీరమైన ప్రమాదం – దేశ ఫెడరల్ (సమాఖ్య) వ్యవస్థకు పొంచి ఉంది. భారతదేశం అనేక భాషా సమూహాల మిశ్రమం, సంగమం. ఈ భాషా సమూహాలన్నీ ఒకే జండా కింద ఉంటున్నాయంటే – దానికి కారణం తమ భాష, సంస్కృతి కాపాడబడతాయనే నమ్మకంతోనే. లేకపోతే; ఒక్కో భాషా సమూహం తమ సొంత జండాను ఎగురేసుకోగలిగినంత పెద్దవి. దేశంలో ఉన్నవి రెండే పెద్ద జాతీయ పార్టీలు. కానీ వాటి దృష్టి లోపాలు, కేంద్రీకృత విధానాలు, 'హైకమాండ్ సంస్కృతుల' వల్ల ప్రాంతీయ పార్టీల ప్రాబల్యం క్రమేపీ పెరుగుతోంది.

ఏ జాతీయ పార్టీ కూడా సొంత బలంతో కేంద్రంలో అధికారానికి వచ్చే అవకాశాలు సుదూర తీరంలో లేవు. ప్రాంతీయ పార్టీల బెదిరింపులు, ప్రతి ఎన్నికలకూ కొత్త సమూహాల ఏర్పాట్లు జాతీయ పార్టీలకు తలనొప్పిగా మారాయి. కొందరు మేధావుల విశ్లేషణ ప్రకారం, – ఈ పరిస్థితుల వల్ల జాతీయ పార్టీలు రెండూ కూడబలుక్కుని; ప్రాంతీయ పార్టీల ప్రాబల్యాన్ని కట్టడి చెయ్యడానికి భాషా రాష్ట్రాలను ముక్కలు చెయ్యడంలో ఒకరికొకరు సహకరించుకుంటున్నాయి. లేకపోతే దేశంలోనే పెద్ద భాషా ప్రయుక్త రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌ను ముక్కలు చేయడానికి బద్ధ శత్రువులైన కాంగ్రెస్, బీజేపీ ఎందుకు కలసి ముందుకొచ్చాయి? యూపీ, బీహార్, మధ్యప్రదేశ్‌లు భాషా ప్రయుక్త రాష్ట్రాలు కావు. భారతదేశపు ఐక్యత, సమగ్రతల పట్ల బాధ్యత ఉన్న వారందరూ ఆలోచించాల్సిన అసలు విషయం ఇది.

పుట్టిన్నాటినుంచి భారత రిపబ్లిక్‌ను నడిపించిన వారి తీరుతెన్నులు చూస్తుంటే, బ్రిటీష్ వారు రాకపూర్వమున్న స్థితికి దేశాన్ని తీసుకెళ్ళేటట్లున్నారు. వివిధ భాషలు మాట్లాడే నూట ఇరవై కోట్లమందిని కలిపి ఉంచడమంటే అదేమీ కుటుంబ వ్యాపార విషయం కాదు. దేశ విధి, ప్రారబ్ధాలను విదేశాల్లో విదేశీయులకు పుట్టి, పెరిగిన సోనియా లేక జోకర్ సింగ్‌ల చేతుల్లో పెడితే ఏమవుతుందో చూసుకోవాల్సిన బాధ్యత ప్రజలదే. హైదరాబాద్ నగర ప్రజల రక్షణ, భవిష్యత్తులకు సంబంధించి మూడు మార్గాలు ముందున్నాయి. నగరాన్ని, నగరపాలనను, పోలీసు యంత్రాంగాన్ని తెలంగాణ ప్రభుత్వం చేతిలో పెడితే, పెట్టుబడులు, అత్యంత ఉత్పాదకులైన వారు ఎగిరిపోతారు. నగరం కుంచించుకు పోతుంది. ఉద్యోగులు, పోలీసులు మంచివాళ్ళయినా, వారిని నియంత్రించే శక్తుల ఉద్దేశాలను, ఎజెండాలను శంకించక తప్పదు. కాంగ్రెస్ నిర్ణయం వెలువడ్డ

ఇరవైనాలుగు గంటల్లోనే స్థిరాస్తి విలువలు ముప్పై నుంచి యాభై శాతం పడిపోవడమే– దీనికి సాక్ష్యం. ఎందుకంటే స్థిరాస్తి విలువ – ఆస్తిలో అంతర్గతంగా ఉండదు. దాన్ని కాంక్షించే వారి బేరీజులో ఉంటుంది. రెండో మార్గం – నగర పాలన, రక్షణ యంత్రాంగాన్ని పదేళ్ళపాటు కేంద్రం ఆధీనంలో ఉంచడం. దాని వల్ల నగరం కొద్దో గొప్పో పెరిగినా, పెరక్కపోయినా, కనీసం ఎండు ద్రాక్షలా కుదించుకు పోదు. మూడో మార్గం – దీన్ని శాశ్వతంగా కేంద్ర పాలిత ప్రాంతం చెయ్యడం. దాని వల్ల పన్నుల భారం తగ్గుతుంది, పెట్టుబడులు విపరీతంగా వచ్చి, ఇంకొన్ని లక్షల మంది తెలంగాణ, సీమాంధ్ర వాసులకు ఉద్యోగావకాశాలొస్తాయి. కానీ, నాకు రెండు కళ్ళు పోయినా ఫర్వాలేదు; ఎదుటి వాడికి మాత్రం – ఒక కన్ను పోవాల్సిందేననుకుంటే – మన యోగ్యతను బట్టే ఫలితాలుంటాయి.

ఏర్పడబోయే కొత్త సీమాంధ్ర రాష్ట్రం విషయానికొస్తే; ఆ రాష్ట్ర ప్రజలు ఒక్క విషయం గుర్తు పెట్టుకోవాలి. అత్యంత తృప్తినిచ్చే ప్రతీకారమేమిటంటే బాగా బతికి చూపించడం. బాగా మాత్రమే కాదు.... బ్రహ్మాండంగా, ఔరా అనిపించుకునేలా బతకడం. తెలుగువారి ప్రజ్ఞాపాటవాలను, అద్భుత విజయాలను చూసి తెలుగుజాతి శత్రువులు ముక్కున వేలేసుకోవాలి. సిగ్గుతో తలదించుకోవాలి. దేశాలు, వాటి సరిహద్దులు శాశ్వతం కావు. బెర్లిన్ గోడను అటు వైపునుంచే పడగొట్టే రోజు వస్తుంది. మన తెలుగుతల్లికి మళ్లె పూదండ. జాతి వైభవానికి కృషి చెయ్యడానికి, తెలుగు తల్లి వైభోగాన్ని చూడడానికి ఇంకో నాలుగు రోజులు జీవితాన్ని పొడిగించమని ప్రార్థిద్దాం.

04-08-2013

వైకుంఠపాళీ

'తాతయ్యా, తాతయ్యా, తెలంగాణ వచ్చేసింది, జై తెలంగాణ' అని కేరింతలు కొడుతూ గదిలోకి వచ్చింది మనుమరాలు. మంచం మీదున్న తొంభై యేళ్ళ తాత గారికి కొంచెం వినికిడి శక్తి తగ్గింది. ఏమిటీ హడావుడంతా అన్నట్లు చూశారు. చెవి దగ్గరకొచ్చి బిగ్గరగా మరోసారి చెప్పింది మనుమరాలు. పెద్దాయన కొన్ని క్షణాలు మౌనంగా ఉండిపోయారు. తర్వాత శక్తంతా కూడదీసుకుని, శరీరాన్ని పైకి లేపి, పిడికిలి ఎత్తి - 'జై విశాలాంధ్ర' అని సింహంలా నినదించారు. ఆయన కళ్ళలో నీళ్ళుబికాయి.

ఖమ్మం జిల్లాకు చెందిన ఆయనకు 1956లో తెలుగు ప్రజలంతా ఒక్కటైనప్పటి భావోద్వేగం, 1969లో విభజన వాదాన్ని తిప్పికొట్టిన సందర్భం - మనుసులో ఇంకా తాజాగానే ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ తీసుకున్న నిర్ణయంతో వచ్చిన తీపి-చేదు స్పందనల సారాంశమిది. వివిధ ప్రాంతాలు, వర్గాలు, తరాల మధ్య రగులుకున్న ఆలోచనా సంఘర్షణ ఇది. నేటి యువతలో చాలా మందికి గతం గురించి తెలియదు. తెలంగాణకు స్వాతంత్ర్యం ఎప్పుడొచ్చిందని అడిగితే 1947 ఆగస్టు 15న అని చెబుతారు. (కాని 1948 సెప్టెంబరు 17న వచ్చింది) వాళ్ళను - ఇంటికో ఉద్యోగం, కుటుంబానికి మూడెకరాలు, డబుల్ ప్రమోషన్ లాంటి ఎండమావుల వెనుక పరిగెత్తించారు. విభజన వల్ల కొందరు దళారులు తప్పించి మిగతా అందరూ నష్టపోతారనే వాస్తవం తెలుసుకునే సరికి చాలా ఆలస్యమైపోతుంది.

అదలా ఉంచితే, కాంగ్రెస్ నిర్ణయానంతరం గంటల వ్యవధిలోనే సీమాంధ్రలో చెలరేగిన ఉద్యమ తీవ్రతను విభజనవాద, సమైక్యవాద రాజకీయ నాయకులుగానీ, మీడియాగానీ, మేధావులుగానీ ఊహించలేదు. రాజకీయ నాయకులకు, సామాన్య ప్రజలకు ఆలోచనల్లో ఉన్న అగాధానికి ఇదొక నిదర్శనం. కాబట్టి - పార్టీలు ఇచ్చిన లేఖలకు, ప్రజల ఇష్టాయిష్టాలకు సంబంధం లేదని రుజువవుతోంది. మీడియా కూడా, తాను సృష్టించే అబద్ధాలను, మిథ్యా ప్రపంచాన్నీ తానే నమ్ముతోంది తప్ప; ప్రజల భావాలను ప్రతిబింబించట్లేదని తెలుస్తోంది. ఇక మేధావుల్లో అత్యధికులకు ఉద్యమాలే ప్రాణవాయువు.

ఏదో ఒక ఉద్యమం లేకపోతే తామేదో నిర్లక్ష్యానికి గురయ్యామనుకుంటారు.

సీమాంధ్రలో జరుగుతున్న ఉద్యమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించగా కొన్ని ఆసక్తికరమైన విషయాలు తెలిసాయి. 'మంచో, చెడో జరగాల్సింది జరిగిపోయింది. కొత్త రాష్ట్రానికి, హైదరాబాదుకు ఏం కావాలో అడిగి సాధించుకోండి' అంటున్న రాజకీయ పార్టీల, మీడియా వర్గాల అజెండాను – సీమాంధ్ర ప్రజలు పక్కన పడేశారు.

రాష్ట్రాన్ని సమైక్యంగా ఉంచాలన్నదే వారి ఏకైక ఎజెండా. హైదరాబాదు సంగతి, నీళ్ళు, నిప్పులు, ఉద్యోగాల గురించి వాళ్ళు మాట్లాడడం లేదు. సీమాంధ్ర వాసులు విభజనను ఆహ్వానిస్తారని, కొత్త రాజధాని, నిధులు వచ్చాయని సంతోషిస్తారని ఊహించిన సిద్ధాంత కారుల ఊహలు పటాపంచలయ్యాయి.

అన్ని వర్గాల ప్రజలు ఏదో ఒక అంతర్వాణి పిలుపునందుకున్నట్లుగా స్వచ్ఛందంగా ముందుకు కదిలారు. కాంగ్రెస్ పార్టీ చూపిన తొందర; నిర్ణయం జరిపిన తీరు... ప్రకటనలో చూపిన అహంకారం... అడిగినవన్నీ ఒక ప్రాంతానికిచ్చి మెజారిటీ ప్రజలను 'దిక్కున్నచోట చెప్పుకోండ'న్నట్లు చూపిన అలక్ష్యం... ఎక్కడో ఆత్మాభిమానాన్ని తీవ్రంగా దెబ్బతీశాయి.

ఒకానొక రాజకీయ పార్టీకి ఒకే ఒక ఎన్నికలో లబ్ధి చేకూరడానికి ఎనిమిది కోట్ల మంది భాషా ప్రయుక్త రాష్ట్ర ప్రజల జీవితాలతో, స్వాభిమానంతో ఆటలాడు-కుంటారా? దానికి మిగతా పార్టీలన్నీ, ఏ కారణం అయితేనేమి, వత్తాసుపలుకుతాయా? ఇదొక రాజకీయ వ్యవస్థా? ఇదొక రాజ్యాంగమా? ఇదొక దేశమా? అని ప్రజల మనసులను వేధిస్తోంది.

ప్రజల ప్రతిస్పందనలో కనిపించిన మరికొన్ని వాస్తవాలు చూద్దాం. బహిరంగ రాజకీయ కార్యక్రమాలకు సాధారణంగా దూరంగా ఉండే ముస్లింలు, మహిళలు పెద్దయెత్తున బయటకొచ్చారు. ఉద్యమం అకస్మాత్తుగా, స్వచ్ఛందంగా మొదలైంది. రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండా, స్థానిక యువకులే నాయకత్వం వహించారు. సమైక్యాంధ్ర వర్ధిల్లాలనే బ్యానర్లకు ఖర్చయ్యే వందో, రెండొందలో తప్ప; ఎవరూ పెద్దగా ఖర్చుపెట్టాల్సిన అవసరం కలగడం లేదు. మర్చిపోతున్న తెలుగు భాషపై ప్రేమ మళ్ళీ చిగురించింది. కాంగ్రెస్ పార్టీ పట్ల, ముఖ్యంగా సోనియా పట్ల వ్యతిరేకత పట్టలేని స్థాయిలో పెల్లుబికింది. ఏ రాజకీయ నాయకులనూ...; ముఖ్యంగా కాంగ్రెస్ నాయకులను దగ్గరకు రానీయడానికి ఇష్టపడడం లేదు. కాంగ్రెస్ నాయకులపై చెయ్యి చేసుకోవాలనే కృతనిశ్చయం కొన్ని ప్రాంతాల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. సోనియా రాజకీయ జీవితంలో ఇంతటి వ్యతిరేకతను ఎవరూ, ఎప్పుడూ వ్యక్తపరచలేదు.

ఆమె దిష్టిబొమ్మలకు పాడె కట్టి, ఊరేగించి, రోడ్లపై దహనం చేసి, పిండాలు పెట్టేంత స్థాయికి వెళ్ళింది. ఆమెను కోడలిగా చేసుకున్న పాపానికే ఇందిరాగాంధీ

విగ్రహాలను కూలుస్తున్నామని బాహాటంగా చెబుతున్నారు. సోనియాపై ఈగ వాలనివ్వని కాంగ్రెస్ నాయకులెవరూ ఆమె తరపున రావడానికి సిద్ధంగా లేరు. రాగలిగే పరిస్థితి లేదు.

ఎవరి భావాలెలా ఉన్నా, ఒప్పుకోక తప్పని వాస్తవాలున్నాయి.ఒకటి – రాష్ట్ర విభజన ఎన్నో సంక్లిష్టతలతో కూడుకున్న విషయం. దాని ప్రభావం కోట్ల జీవితాల మీద కొన్ని తరాలపాటు ఉంటుంది. ఎన్నో సమస్యలొస్తాయి, వాటిని పరిష్కరించాల్సి ఉంటుంది. ఇంత క్లిష్టమైన నిర్ణయాన్ని ఇంకో ఆరు నెలల్లో దిగిపోయే ప్రభుత్వం తీసుకోవడం ఎంత వరకు నైతికం? ఉత్పన్నమయ్యే సమస్యలను ఎవరు పరిష్కరిస్తారు? ఇంతవరకు ఆగిన వాళ్ళు, ఎన్నికలయ్యే వరకు ఆగి, గెలిచాక నిర్ణయం తీసుకుని, (కావాల్సినంత సమయముంటుంది గనుక) వచ్చే సమస్యలను కూడా పరిష్కరించగలిగే వారు కదా!

కాసిన్ని ఎక్కువ సీట్లు గెలవడానికి రాష్ట్రంతో, దేశంతో ఆడుకుంటుంటే ఊరుకుంటారా? ఇంకో విషయం – అన్ని పార్టీలు లేఖలిచ్చాయంటున్నారు, సరే. కానీ లేఖ ఇవ్వడానికి, తెలంగాణ ఏర్పరచమనడానికి చెప్పిన కారణాలు వేరు వేరు కదా! బీజేపీ చిన్న రాష్ట్రాలకు సుముఖం కాబట్టి ఇవ్వండి అన్నారు. సీపీఐ ప్రజల అభీష్టం కాబట్టి ఓకే అన్నారు. ఈ రెండు పార్టీలు రెండు – మూడు శాతం మించి ఓట్లు పొందవు. దోపిడీ జరిగింది కాబట్టి, తెలంగాణ రాష్ట్రం ఏర్పరచమని తెరాస అన్నది. తేదేపా, వైయస్సార్‌సీపీలు ప్రజల సెంటిమెంటును గౌరవిస్తున్నాం, కాబట్టి ఇస్తే అభ్యంతరం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ నిర్ణయం చెప్పింది కానీ, నిర్ణయించడానికి గల ప్రాతిపదికను స్పష్టపరచలేదు. పార్టీలు లేఖలిచ్చాయి కానీ, కారణాలు, ప్రాతిపదికపై స్థూలంగానైనా ఏకాభిప్రాయమేది? అదీగాక రాజకీయ పార్టీల అసహాయతలతో ప్రజలకేం సంబంధం?

ఒకరి తర్వాత ఒకరుగా ఉద్యోగులందరూ సమ్మెబాట పట్టారు. కాంగ్రెస్ పార్టీ, ఉద్యోగులు ఇద్దరూ ఇందులోంచి బయటపడే మార్గాలను వెతుక్కోక తప్పదు. ఇప్పటికీ కాంగ్రెస్ పార్టీ నిర్ణయాన్ని విభజన బిల్లుగా మార్చగలరో లేదో అనుమానమే. ఈ వైకుంఠ పాళీలో నిచ్చెనల కంటే పాములెక్కువ ఉన్నాయి. చివరికి కాంగ్రెస్ పార్టీ రెండు వైపులా నష్టపోయినా ఆశ్చర్యం లేదు. కరవమంటే కప్పకు కోపం, విడవమంటే పాముకు కోపం. బిల్లు ఆలస్యమైనా, హైదరాబాదు విషయంలో ఎక్కువ రాజీపడినా – ఆశించిన లాభం చేకూరదు. సీమాంధ్రలోనైతే ఎన్ని దశాబ్దాల పాటు కాంగ్రెస్ కనుమరుగవుతుందనేదే ప్రశ్న.

ఇన్ని భేదాభిప్రాయాలు నడుమ – బీజేపీ ఎంతమేరకు సహకరిస్తుందనేది అనుమానమే. కాంగ్రెస్ పార్టీ నాన్చి, నాన్చి నిర్ణయం తీసుకున్న తీరు భారత సమాఖ్య

వ్యవస్థ సుస్థిరత పట్ల ప్రశ్నలు లేవనెత్తుతోంది. సీమాంధ్రులతో ఇలాగే కరకుగా, ముతకగా వ్యవహరించడం కొనసాగిస్తే... వారు యుద్ధం ప్రకటించినా ఆశ్చర్యపోకూడదు. 1960లలో తమిళనాడులో ఏం జరిగిందో చూశాం కదా! మహాత్మాగాంధీనే ప్రశ్నించిన ప్రకాశం పంతులు, ఆంధ్ర రాష్ట్రం కోసం నెహ్రూనే లెక్కచేయని వారసత్వం ఉంది. జోకర్‌సింగ్‌ల అహంకార పూరిత ప్రేలాపనలు పరిస్థితిని ఇంకా దిగజారుస్తున్నాయి.

జాతీయస్థాయిలో, సర్వేల ప్రకారం వచ్చే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ పతనం తథ్యమనిపిస్తోంది. కాబట్టి వ్యవస్థను పూర్తిగా నాశనం చేసి వెళదామనుకుంటున్నారేమో అనిపిస్తోంది. ఆర్థిక వ్యవస్థ దివాలా తియ్యడానికి బంగారం కొనుగోళ్ళు కారణం కాదు. పదేళ్ళ నుంచీ చేస్తున్న పాపాల పరిణామమే పెరిగిన బంగారం కొనుగోళ్ళు. పెట్టుబడి పెట్టడానికి ఇంకెక్కడా సురక్షితం కాకుండా చేశారు కాబట్టే; ప్రజలు తమ దగ్గరున్న మిగులు ధనంతో బంగారం కొంటున్నారు. ఇప్పుడు దానిపై పన్ను వేయడం ద్వారా మరింత మంది దావూద్ ఇబ్రహీంలు తయారవుతారు. ఇంకా దుర్మార్గమైన చర్య కొత్తగా తెస్తున్న భూపరిమితి (సీలింగ్) చట్టం.

ఉన్న సీలింగును ఎత్తివేయాల్సింది పోయి, కమతాలను ఇంకా పరిమితం చెయ్యాలట. మాగాణి 5 ఎకరాలు లేదా మెట్ట 15 ఎకరాలకు మించకూడదట. అది ఎవరి పోషణకు వారికి సరిపోతుంది. యాంత్రీకరణ ఎలా సాధ్యం? ఉత్పాదకత ఎలా పెరుగుతుంది? మిగులు ధాన్యం లేకపోతే పట్టణ ప్రజానీకానికి తిండెక్కడ నుంచి వస్తుంది? ఇప్పటి సీలింగ్ చట్టాల వల్ల వ్యవసాయ, గ్రామీణ రంగం నాశనమైంది. పేదరికం నుంచి బయటపడలేక పోతోంది. ఇప్పుడు తెచ్చే చట్టంతో మొత్తం దేశం నాశనమవుతుంది. పేదరికం నుంచి ఎప్పటికీ బయటపడలేని పరిస్థితి వస్తుంది.

మన్మోహన్ సింగ్, చిదంబరంలు గొప్ప ఆర్థిక వేత్తలు కారు. ఆర్థికశాస్త్రంలో శిక్షణ పొందారు. అంతే! కానీ అధికారానికి అలవాటు పడ్డారు. దానికోసం దేశ క్షేమాన్ని పణంగా పెట్టడానికి ఏమాత్రం సంకోచించరు.

వారు రాచ కుటుంబం చేతిలో కీలుబొమ్మలు. ఎంత అలంకరించినా, తోలు బొమ్మలకు; – మంచి ఆశయాలు, భావాలు, సంకల్పం గల నాయకత్వానికి మధ్యన – నక్కకు... నాగలోకానికి ఉన్నంత తేడా ఉంది. దేశం చాలా సంక్షోభాలలోకి నెట్టబడింది. మన రాష్ట్రంలో సంక్షోభం స్థాయి మరింతగా ఉంది. అందరికంటే ఎక్కువ మంది ఎంపీలను గెలిపించి పంపినందుకు ఇది మనకిచ్చిన బోనస్!

18-08-2013

ముసుగు తొలగిద్దాం

'ఇంకా ఎన్నాళ్ళు మోసం చేస్తామయ్యా?' అని వాపోయారు ఆ కమ్యూనిస్టు కురువృద్ధుడు. 'విప్లవం వస్తుందని, సమసమాజం ఏర్పడుతుందని, భూమ్మీద స్వర్గం సాక్షాత్కరిస్తుందని ఎన్నాళ్ళు ఈ అమాయక ప్రజలను మభ్యపెడదాం?' అన్నారు. గుంటూరు జిల్లాకు చెందిన ఆ పెద్దాయన వ్యక్తిగతంగా ఎంతో నిజాయితీతో బ్రతికారు. కానీ ఆయన నమ్మినన్నాళ్ళు నమ్మి, ప్రచారం చేసి, ప్రజలను నమ్మించిన భావజాల విలువలు మాత్రం సమాజానికి ఎనలేని హాని చేశాయి. దాని ప్రభావం, పర్యవసానాలు ఇంకా అనుభవిస్తూనే ఉన్నాం. నినాదాలు, హామీలు, పథకాల ముసుగుచాటున ఇప్పటికీ అంతర్లీనంగా రాజ్యమేలుతున్న తప్పుడు భావ వ్యవస్థ స్వభావాన్ని అర్థం చేసుకోకపోతే ఇంకా అనుభవిస్తూనే ఉంటాం.

విడివిడిగా కనిపించే కొన్ని ముఖ్యమైన వాస్తవాలు ప్రజలను గందరగోళ పెడుతున్నాయి. రూపాయి విలువ పడిపోయింది, ఉల్లిపాయల ధర అమాంతంగా పెరిగిపోయింది. ఆర్థిక వృద్ధి రేటు మళ్ళీ 1970ల స్థాయికి చేరింది. పరిశ్రమలు, సేవారంగాలు నష్టాల్లో మునిగిపోతున్నాయి. కేంద్ర ప్రభుత్వం మరిన్ని జనాకర్షక పథకాలకు తెరతీస్తోంది. దాంతో లోటు బడ్జెట్ ఇంకా పెరుగుతుంది. ఆహార భద్రత పథకం వల్ల లోటు బడ్జెట్ పెరగడమే కాక వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కోబోతోంది. ఆంధ్రప్రదేశ్ విభజన విషయంలో లాగా కాళ్ళ క్రిందకి నీళ్ళు వచ్చేదాకా పట్టించుకోరా? ఆగస్టు 15 ప్రసంగంలో ఆహార భద్రత బిల్లును నరేంద్రమోడీ తీవ్రంగా విమర్శించారు. కానీ పదిహేను రోజుల్లోపే ఆయన పార్టీ అదే బిల్లుకు సంపూర్ణంగా మద్దతిచ్చింది. బొగ్గు బ్లాకుల కుంభకోణంలో ఫైళ్ళు గల్లంతయ్యాయి. సుప్రీంకోర్టు తీవ్రంగా ఆక్షేపించింది. ఇంకో పక్క; జడ్జీల ఎంపిక, నియామకాలు, బదిలీల అధికారాలను ప్రభుత్వం తన చేతుల్లోకి తీసుకునే బిల్లు రాజ్యసభలో ప్రవేశపెట్టారు. విభజన నిర్ణయంతో దిగ్భ్రాంతి

చెందిన ఐదు కోట్ల మంది సీమాంధ్ర ప్రజలు అట్టుడుకుతున్నారు. నెలరోజుల్నించి రోడ్లెక్కి ఉద్యమిస్తున్నారు. కానీ జాతీయ మీడియాలో దీని గురించి అసలు ప్రస్తావనే లేదు. ముంబాయిలో ఒక మహిళా విలేఖరిపై జరిగిన సామూహిక అత్యాచారం – గురించి రోజుల తరబడి ప్రసారాలు, చర్చాగోష్ఠులు నిర్వహించారు. కానీ ఒక మహిళ తన కొడుకును ప్రధానిని చెయ్యడానికి ఎనిమిది కోట్ల తెలుగు ప్రజల జీవితాలతో ఆడుకుంటుంటే జాతీయ మీడియాకు అదొక పెద్ద విషయంలా కనిపించదు. భారత్ నిర్మాణ్ ప్రకటనల పంపకం, దాని పేరిట డబ్బు చెల్లింపులు కేంద్ర ప్రభుత్వ విస్తృత విచక్షణాధికారాల నీడలో జరిగిపోతున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థ క్లిష్టస్థితిలో ఉందంటున్న వారే – వందల కోట్లు ప్రజా ధనం వార్తా సంస్థలకు పంచి పెడుతున్నారు.

రిజర్వు బ్యాంకు అజమాయిషీలో నిల్వ ఉండే బిలియన్ల డాలర్లు, నిబంధనల్లో స్వల్ప మార్పులు – వీటితో ఎవరికీ తెలియకుండా రూపాయి మారకం విలువను తాత్కాలికంగా అటూ ఇటూ మార్చొచ్చు. ఏనుగుల్లాంటి ప్రభుత్వ రంగ ఆర్థిక సంస్థలైన ఎల్ఐసీ, యూటీఐల దగ్గరుండే వేలకోట్ల నగదు నిల్వలనుపయోగించి స్టాక్ మార్కెట్లో ప్రకంపనలు పుట్టించొచ్చు. ఇంత బలమున్న ప్రభుత్వాన్ని ఎవరు ఎదుర్కోగలరు? ఇన్ని అధికారాలున్న వ్యవస్థను నీతిమంతంగా నడుపుతామని ఏ పార్టీ వారు హామీ ఇచ్చినా, నమ్మగలమా? అదసలు మానవ సాధ్యమేనా?

అత్యున్నత న్యాయస్థానాలు కూడా తక్కువేం తినలేదు. తీర్పుల్లో అస్థిర, అస్పష్ట, జనాకర్షక భావజాల ప్రభావాలు కనిపిస్తుంటాయి. ఓట్లాకర్షక పథకాలను, కష్టజీవుల సంపద పున:పంపకాన్ని ఇన్నాళ్ళు న్యాయస్థానాలు సంపూర్ణంగా సమర్థించాయి. దానికి రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలను, పీఠికలో ఇందిరాగాంధీ చేర్చిన 'సోషలిస్టు' శబ్దాన్ని ముసుగుగా వాడాయి. కాస్తో కూస్తో పనిచేస్తున్న ప్రైవేటు విద్యారంగాన్ని నాశనం చెయ్యబోయే విద్యా హక్కు చట్టాన్ని కూడా సమర్థించాయి. ప్రజల సొమ్ముతో కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిలవ చెయ్యలేక; ముక్కబెడుతూ... పందికొక్కులకు మేపుతూ... పారబోస్తున్న ఎఫ్‌సీఐని రద్దు చెయ్యాల్సింది పోయి; ధాన్యాన్ని ఉచితంగా ఎందుకు పంచిపెట్టట్లేదని ప్రశ్నించింది. అదే న్యాయస్థానం ఉచిత హామీలను పార్టీల మేనిఫెస్టోలలో చేర్చడాన్ని ఆక్షేపించింది!

రెండేళ్ళు మించి జైలు శిక్ష పడినా, చట్టబద్ధమైన కస్టడీలో ఉన్నా ఎన్నికల్లో పోటీకి అనర్హులని తీర్పిచ్చింది. ఆ లెక్కన 1977లో జార్జి ఫెర్నాండెజ్, అంతకు ముందు మహాత్మాగాంధీ, నెహ్రూ, పటేల్‌లు కూడా ఎన్నికలలో పోటీ చెయ్యడానికి అనర్హులయ్యేవారు.

ఈ రోజుల్లో ఆర్థిక, తదితర నేరస్థులకు ఓట్లేస్తున్న ప్రజల విచక్షణ ఏ గంగలో కలిసింది? రాజకీయ పార్టీలు కూడా సమాచార చట్టం పరిధిలోకి వస్తాయని తీర్పు రాగానే, వామపక్షాలు సహా అన్ని పార్టీలు కలసిపోయి, ఏకగ్రీవంగా ఆ నిబంధనలు మార్చేశాయి. అలాగే నేరస్థుల ఎన్నిక అర్హతలు, ఉచిత హామీల విషయాల్లో అన్ని పార్టీలు ఏకమయ్యాయి.

సమైక్యాంధ్ర ఉద్యమంలో అన్ని పార్టీల పట్లా నిరసనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. రాజకీయ వ్యవస్థ చేతిలో మోసపోయామన్న భావన – విస్తృతంగా వ్యాపించింది. ఇలా ఎందుకు జరిగింది, ప్రజాస్వామ్యం ఎక్కడ ఫెయిలయింది – అనేది చాలా మందికి అర్థం కావడం లేదు. రాజకీయ పార్టీలను కాదనుకుని ఎటువైపు, ఎలా, ఎంతదూరం ముందుకు పోగలం? ఇప్పుడున్న వాటిని కాదని కొత్త పార్టీలు వచ్చినా అవి కూడా ఇలాగే తయారవవని నమ్మకమేముంది? ఎక్కడ తప్పు జరిగింది? సరిదిద్దుకోవడమెలా? ఈ ప్రశ్నలకు సమాధానాలు ప్రజలే, వ్యక్తులుగా, చిన్న చిన్న సమూహాలుగా, ఆలోచించి, అర్థం చేసుకుని, నలుగురికీ తెలియజెప్పాలి. అంతే తప్ప, రాజకీయ పార్టీలు గానీ, న్యాయస్థానాలు గానీ, మీడియా గానీ, ఇప్పుడున్న పాఠ్య పుస్తకాలు గానీ సమాధానాలు చెప్పలేవు, చెప్పవు కూడా.

సీమాంధ్రలో జరుగుతున్న ఉద్యమం సామాజిక శాస్త్రజ్ఞులకు ఒక ప్రయోగశాల వంటిది. ఒక కేంద్ర నాయకత్వం లేకుండా, క్షేత్రస్థాయిలో పూర్తిగా వికేంద్రీకరణమై ఉండడం వల్లే చొరవ, సృజనాత్మకత, అతి తక్కువ ఖర్చు, అహింసాయుతంగా సాగుతోంది. ఒక వర్గం సమ్మె వల్ల ఇంకో వృత్తి పని వారికి ఎక్కువ హాని జరక్కుండా ఎక్కడికక్కడ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇదే స్ఫూర్తితో పరిపాలనంతా వికేంద్రీకరణ చెయ్యొచ్చు. కానీ విస్తృత, విశేష, విచక్షణాధికారాలు, ఒక లక్ష కోట్ల పై చిలుకు బడ్జెట్టు లేకపోతే ఇన్ని రకాల అధికార, అనధికార రాజ్యాధారిత వ్యవస్థలు మెయ్యడానికి గ్రాసం దొరకదు కదా! దీనికి సంబంధించిన ఆలోచనలకు ఉపయోగపడే శాస్త్రీయ, సిద్ధాంత నేపథ్యాన్ని సరళమైన భాషలో మీ ముందుంచుతాను. ఎవరి విశ్లేషణలు వారు చేసుకోవచ్చు, ఎవరి నిర్ణయాలకు వారు రావచ్చు.

ఆధునిక మానవ సమాజ నిర్మాణంలో ప్రభుత్వ పాత్ర ఎందుకుండాలి, ఎంత ఉండాలి, ఎలా ఉండాలి, ఆర్థిక సంబంధాలు, నియంత్రణలు లాంటి విషయాల్లో మార్క్సిస్టు సిద్ధాంత ప్రభావం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఇది పాశ్చాత్య దేశాల్లో ప్రారంభమై, మన దేశానికి గంపగుత్తగా దిగుమతి అయింది. 1850లలో మార్క్సు ప్రతిపాదించిన గతి తార్కిక భౌతిక వాదం, చరిత్ర పరిణామ వివరణ, వర్గ విశ్లేషణ, వర్గ పోరాట సిద్ధాంతాలు

ఎవరూ ప్రశ్నించజాలని పవిత్ర సూత్రాలై పోయాయి. వాస్తవ జీవితంలో అవన్నీ సోవియట్ రష్యా, చైనా లాంటి ప్రయోగశాలల్లో పరీక్షించబడి, ఘోరంగా విఫలమయ్యాయి.

అయినప్పటికీ వాటి సైద్ధాంతికతను, అందులోని లోపాలను గుర్తించే ప్రయత్నం అతి కొద్ది మంది మాత్రమే చేస్తున్నారు. మెజారిటీ మేధావులు పాత ఒరవడిలోనే కొట్టుకు పోతున్నారు. అంతేగాక ఈ విఫల సిద్ధాంతాలు మనలాంటి పేద దేశాలకు ప్రత్యేకంగా వర్తిస్తాయని, కులం, పేదరికం, అవిద్యలకు అదొక్కటే సమాధానమనే పైత్యాలు ప్రదర్శిస్తుంటారు. పడికట్టు పదాలే జ్ఞానమని, వాస్తవ వీక్షణం దృష్టికోణ లోపమని నమ్మిస్తుంటారు. దీనికి కారణం వ్యక్తిగత లాభనష్టాలు కావచ్చు, లేదా కేవలం మేధో బద్ధకం కావచ్చు.

మార్క్సు ప్రతిపాదించిన చారిత్రక పరిణామ వివరాలు సరైనవే. కానీ ఆయన ఎంచుకున్న నైతిక కొలబద్ద, వివరణ, విశ్లేషణలు తప్పుడు అవగాహనతో కూడుకున్నవి. మధ్యయుగాల్లోని బానిసత్వాన్ని, భూస్వామ్య వ్యవస్థని, ఆధునిక యుగంలోని స్వచ్ఛమైన కాపిటలిస్టు వ్యవస్థను ఒకేగాట కట్టేస్తాడు. ఆయన సిద్ధాంతం ప్రకారం ఇన్ఫోసిస్ నారాయణమూర్తి కూడా దోపిడీ దారుడే.

ఎవరికీ చెందని అడవినో, తుప్పలనో, కంచెనో కష్టపడి, శుభ్రం చేసి, ఒకాయన పొలంగా మార్చుకున్నాడనుకుందాం. దాన్ని పండించు కుంటూ, మిగుల్చుకున్న డబ్బుతో కొంత కాలానికి పిల్లలను చదివించుకుందామని పట్నం బయల్దేరాడునుకుందాం. వెళుతూ తన చేను కౌలుకిస్తే అది కూడా దోపిడీయే నంటాడు. ఈ విషయాల్లో మార్క్సు పప్పులో కాలేశాడని చిన్న పిల్లలకు, చదువురాని వాళ్ళకు కూడా అర్థమవుతుంది. ఎటొచ్చీ చదువొచ్చిన వాళ్ళను గందరగోళ పరచి, తన సిద్ధాంతానికి ఒప్పించడానికి ఇంకొన్ని సూత్రాలు గాల్లోంచి కనిపెట్టాడు. అవేమిటో వచ్చేసారి చూద్దాం.

ఇన్ని సమస్యల మధ్య నలిగిపోతుంటే ఇప్పుడీ సిద్ధాంత రాద్ధాంతాలు అవసరమా – అంటే; అవసరమే. సమస్య స్వభావాన్ని, దాని మూలాలను తెలుసుకోకుండా విశ్లేషణ, పరిష్కారం అసాధ్యం. ఈ బద్ధకం వల్లే ఒక పార్టీ పట్ల విసుగొచ్చి, ఇంకోటి అచ్చం అలాంటి పార్టీనే నమ్ముకుంటున్నాం.

01-09-2013

చట్టాలు ధర్మబద్ధమేనా?

పద్నాలుగో ఆర్థిక సంఘం పర్యటన సందర్భంగా ఒక ఆసక్తికరమైన విషయం బయటకొచ్చింది. ఆర్థికంగా అభివృద్ధి చెందిన రాష్ట్రాలకు కేంద్ర కేటాయింపులు తగ్గించడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అభివృద్ధి చెందడం నేరమా? జనాభాను నియంత్రించి, అక్షరాస్యత పెంచడం పాపమా? అందుకు శిక్షిస్తారా? అని ప్రభుత్వ నేతలు, మేధావులు ప్రశ్నించారు. కానీ వ్యక్తి స్థాయిలో ఇన్నాళ్ళు మీరు చేస్తున్నదేమిటి? కష్టపడి సంపాదించిన వాళ్ళు దొంగలన్నట్లు, ఎవరినో దోపిడీ చేయబట్టే- సంపాదించుకోగలిగారన్నట్టు.

వాళ్ళ సంపాదనలో నలభై – యాభై శాతం రకరకాల పన్నుల రూపంలో లాగేసుకోవడం లేదూ? దీన్ని సిద్ధాంతీకరించి, సమర్థించి, ప్రోత్సహించింది సామ్యవాద భావజాలం కాదూ? అవే సూత్రాల్ని కేంద్రం, రాష్ట్రాల పట్ల అమలు చేస్తోంది.

ఒక మిత్రుని సమాచారం ప్రకారం – మన రాష్ట్రంలో స్థూల తలసరి ఆదాయం దేశ సరాసరి కంటే ఎక్కువ ఉంది. కానీ హైదరాబాద్, మెదక్ వంటి నాలుగు జిల్లాలను మినహాయిస్తే, పందొమ్మిది జిల్లాల్లో తలసరి ఆదాయం – దేశ సగటు కంటే తక్కువ ఉంది. మరి రాష్ట్రస్థాయి గణాంకాల ఆధారంగా కేటాయింపులు జరిపితే పందొమ్మిది జిల్లాల వెనుకబాటుతనం ఎవరు, ఎలా తీర్చాలి? ఈ అసంబద్ధతలన్నిటికీ మార్క్సిస్టు భావజాలం మూల కారణం.

మార్క్సు ఆలోచనల ప్రకారం –

1) వర్గపోరాటాల చరిత్రే మానవ చరిత్ర. కొద్దిమంది పాలకులు, పాలిత జన బాహుళ్యాలు కష్టపడి సంపాదించిన సంపదలోంచి కొంతభాగం దోచుకొని, తమ స్వంత అవసరాలకు వాడుకుంటారు. ఇది నిజమే. రాజుల కాలం నుంచి, నేటి 'ప్రజాస్వామ్య' ప్రభుత్వాల వరకూ జరుగుతున్నదిదే. పాలక వ్యవస్థ కేవలం రాజకీయ నాయకులకే పరిమితం కాదు. ప్రభుత్వ ఉద్యోగాలు, ఆయుధ సామగ్రి లాంటి ప్రభుత్వ కొనుగోళ్ళలో దళారీలు,

ఆశ్రిత పెట్టుబడిదారులు, బెదిరించి బతికే మీడియా వర్గాలు, అదే కోవలో నడిచే ఆశ్రిత మేధావులు, చివరికి చాలా మంది ఉద్యమ నాయకులు – ఈ పాలక వ్యవస్థలో భాగస్వాములు. పన్నుల వసూళ్ళు, వారి ఉత్పాదక విలువను మించిన జీతాలు, అంతకుమించిన భత్యాలు, అవినీతి వసూళ్ళు, కమీషన్లు, కాంట్రాక్టులు, లైసెన్సులు పొందడాలు, ప్రభుత్వ ప్రకటనలు, కొన్ని వర్గాలకు ప్రత్యేక రాయితీలు, చివరికి నామినేటెడ్ పోస్టులు, నంది, పద్మ అవార్డులతో పాటు పలు రూపాల్లో వారి దోపిడీ సాగుతుంది. ఈ డబ్బంతా కష్టజీవుల శ్రమ ఫలితం నుంచే వస్తుంది. ఈ సూత్రం ఆయన కొత్తగా కనిపెట్టిందీ కాదు, ఈ విషయంలో ఎవరికీ భిన్నాభిప్రాయాలూ లేవు.

2) పాలక వర్గాలు తమ ఉమ్మడి ప్రయోజనార్థం – ఈ దోపిడీ వ్యవస్థను కాపాడుకోవడమే కాక ఇంకా విస్తరించే ప్రయత్నం, దోపిడీ స్థాయిని పెంచే ప్రయత్నాలు చేస్తాయి. తనంతట తానుగా దోపిడీని తగ్గించుకోదు, వదులుకోదు. దాని ప్రాబల్యాన్ని, దోపిడీ స్థాయిని తగ్గించాలంటే, పాలిత వర్గాల్లో చైతన్యం, సమైక్యత రావాలి. లేదా పరిస్థితులు దిగజారి, చెయ్యిదాటి పోవాలి.

ఇదీ నిజమే. పరిస్థితులు, టెక్నాలజీ ఎంత మారినా, ఈ ఇంకా విస్తరిస్తుందే తప్ప, ఒక్క ప్రభుత్వ శాఖ కూడా మూతబడదు, కుదించబడదు. నిరుద్యోగం ఎంత ప్రబలంగా ఉన్నా, ప్రభుత్వోద్యోగుల జీతాలు పెరగడం ఆగదు. మరింత మంది అశావహుల్ని సంతృప్తి పరచడానికి శాసన మండలి, ప్రాంతీయ మండళ్ళు, మార్కెట్ కమిటీలు, దేవాలయ కమిటీలు – ఇలా ప్రజల సంపాదన పెరిగే కొద్దీ, పాలకవర్గ విస్తరణ కూడా జరుగుతూనే ఉంటుంది. పరిస్థితులు చెయ్యిజారి పోయినప్పుడు – ఒక ఎన్టీరామారావు ఆవిర్భావం...; ఒక 1991 పాక్షిక ఆర్థిక సంస్కరణలు.... తప్పనిసరవుతాయి. అమెరికాలో రీగన్, ఇంగ్లండులో థాచర్‌ల పాలనలు కూడా ఇలాంటి తప్పనిసరి పరిస్థితుల్లోనే అవసర మయ్యాయి, సాధ్యమయ్యాయి.

కానీ సంక్షోభం తీరిపోగానే, దోపిడీ కార్యక్రమం తిరిగి విజృంభిస్తుంది. గత పదిహేనేళ్ళుగా అమెరికాలోనూ, గత పదేళ్ళుగా మన దేశంలోనూ జరుగుతున్నదదే. మళ్ళీ సంక్షోభం అనివార్యం. గిలగిల్లాడుతున్న ఆర్థిక వ్యవస్థకు – ఇంకో డోసు పాక్షిక సంస్కరణలు తప్పనిసరి. కాకపోతే ఇంజెక్షనిస్తున్న డాక్టరు (మన్మోహన్ సింగ్) మీద రోగికి నమ్మకం సడలింది. అందుకే నరేంద్ర మోదీ వైపు చూస్తున్నది. ఏది ఏమైనా మొత్తం దోపిడీ వ్యవస్థలో ఈ అరకొర ఆర్థిక సంస్కరణలు ఎంత కొద్దిపాటివో, వాటి ప్రభావం ఎంత తాత్కాలికమో, వాటి ప్రభావాన్ని రెండు మూడు ఉచిత పథకాలతో ఎలా నిర్వీర్యపరచవచ్చో మన పాలకులు ఇటీవలే చేసి చూపించారు. ఇంతవరకూ మార్క్సిస్టు సిద్ధాంతంతో ఏ పేచీ లేదు.

3) పాలకవర్గ రాజ్యవ్యవస్థ తన దోపిడీ కొసాగింపునకు అనుకూలంగా ఉండి, తన మాటకు ఎదురులేకుండా, పాలితులపై తన సార్వభౌమాధికారం ప్రశ్నించే అవకాశం లేని రాజ్యాంగ, చట్ట వ్యవస్థను ఏర్పరచుకుంటుంది. న్యాయ వ్యవస్థను కూడా దానికనుగుణంగానే ఏర్పాటు చేసుకుంటుంది. ఆ విధంగా తన దోపిడీ వ్యవస్థకు నైతికతను, సహేతుకతను, అవసరాన్ని తనకు తానే ఆపాదించుకుంటుంది. ఇదీ నూటికి నూరుపాళ్ళు నిజమే. ఎంతో సంస్కారవంతంగా, ఆధునిక ఆలోచనలతో, ప్రపంచానికంతటికీ ఆదర్శప్రాయమైన స్వేచ్ఛాయుత సమాజం నిర్మించిన అమెరికా రాజ్యాంగ కర్తలు కూడా – అప్పట్లో ఇంకా కొనసాగుతున్న బానిస వ్యవస్థను రద్దు చెయ్యలేదు. దాన్ని గురించిన ప్రస్తావనే లేదు. ఆ అమానవీయ, వ్యక్తి స్వేచ్ఛా విరుద్ధ వ్యవస్థను ఇంకో శతాబ్దం పాటు కొనసాగించిన చట్టాలను – కట్టుదిట్టంగా అమలు చేసేవారు.

మనదేశంలోని చట్టాలను చూసినా అదే కనిపిస్తుంది. పాలకవర్గాలు విధించే పన్నులను, వాటిని ఖర్చుచేసే విధానాన్ని, ప్రశ్నించే హక్కు లేకుండా చట్ట, న్యాయ వ్యవస్థలున్నాయి. వ్యక్తి స్వేచ్ఛకు, ప్రభుత్వ ఆదేశాలకు మధ్య వచ్చిన వివాదాల్లో చట్టాలు, న్యాయస్థానాలు దాదాపు ఎప్పుడూ ప్రభుత్వం వైపే మొగ్గుచూపుతాయి. ఆస్తి హక్కు, భావస్వేచ్ఛ, సమానత్వం లాంటి ప్రాథమిక హక్కులకు తొంభై ఆరు సవరణలు చేసి వాటి స్ఫూర్తినే నాశనం చేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఊరి పక్క వాగులోంచో, నదిలో నుంచో ఇల్లు కట్టుకోవడానికి గిద్దెడు ఇసుక కూడా తీసుకోకూడదు! అనుమతులేమో ఇవ్వరు.

అంబానీలు పద్నాలుగు వేల కోట్లు ఆర్జించవచ్చు, ఎవరికీ పద్నాలుగెకరాల పొలం మాత్రం ఉండకూడదు! వీటన్నిటికీ చట్టబద్ధత ఉంది కాబట్టి, న్యాయబద్ధమే అని న్యాయస్థానాలంటాయి. కానీ అవి ధర్మబద్ధమేనా?

ఈ రకంగా పాలక దోపిడీ వర్గాలు తమ వ్యవస్థ కొనసాగింపునకు అనుకూలమైన నీతిసూత్రాలు, పౌర బాధ్యతలు, చట్టాలు, వాటిని అమలుచేసే నిర్మాణాలను ఏర్పరచు కుంటాయనేది కాదనలేని వాస్తవం. ఇప్పటి వరకు మార్క్సిజంతో బేధాభిప్రాయం లేదు.

4) అంతర్గతంగా, పాలకవర్గాల్లోని పోటీతత్వం అధికార కేంద్రీకరణకు దారితీస్తుంది. చెల్లాచెదురుగా ఉన్న చిన్న చిన్న దోపిడీ వ్యవస్థలు యుద్ధాలు, గెలుపు, ఓటములు, ఒడంబడికల ఫలితంగా పరిమితమైన కేంద్రీకృత దోపిడీ కేంద్రాలుగా మారతాయి. అంతర్జాతీయ స్థాయిలో ఇది యుద్ధాలకు, సామ్రాజ్య విస్తరణకు, సామ్రాజ్యవాదానికి దారితీస్తుంది. ఇది అక్షరాలా నిజం. చిన్న చిన్న జమిందార్లు పోటీపడగా; గెలిచి సజీవంగా మిగిలిన వాళ్ళు చిన్న సైజు రాజులవడం; చిన్న రాజుల పోరాటాల నడుమ – మధ్య ఆసియా నుంచి దండయాత్రలతో వచ్చిన ఘనమైన మొఘల్ సామ్రాజ్యాలు, తర్వాత ఆంగ్లేయ సామ్రాజ్యపాలన – ఇవన్నీ మనకు బాగా పరిచయమే. తత్వరీత్యానూ; అదీగాక

మూడు వేపుల సముద్రం, నాలుగో వైపు హిమాలయాలున్న భౌగోళిక పరిమితుల వల్లనూ మనకు అలవాటు లేదుగానీ; యూరప్‌లో మధ్యయుగాలన్నీ సామ్రాజ్యాల స్థాపన, విస్తరణలో మునిగి తేలేవి. ఈ చారిత్రక పరిణామం విషయంలో మార్క్సు ఆలోచనలు – వాస్తవానికి దగ్గర్లోనే ఉన్నాయి. సందర్భం వచ్చింది గనుక ఆలోచించాల్సిన విషయమేమిటంటే, మనం ఆ సామ్రాజ్యాల్ని, ప్రజల డబ్బుతో వాళ్ళు కట్టిన కోటలను, చేసిన యుద్ధాలను, వారి రాణుల, సానుల సంఖ్యను చెప్పుకుని మురిసిపోతుంటాం, గర్వపడుతుంటాం!!

5) చివరగా ఈ అధికార కేంద్రీకరణ, దోపిడీ రాజ్య వ్యాప్తి, ప్రపంచ ఆధిపత్యానికి దారితీస్తుందంటాడు. పోటీ లేకపోవడంతో, టెక్నాలజీ, భావాలు, ఆలోచనల అభివృద్ధికి ఆటంకం ఏర్పడి, స్తబ్దత, సంక్షోభం వస్తాయి. ఆ సంక్షోభ సమయంలో పాలిత వర్గాల్లో చైతన్యం వెల్లివిరిసి, దోపిడీ వ్యవస్థ నిజమైన స్వభావం, తీరుతెన్నులు అర్థం చేసుకుని, విప్లవించి, అధికార వ్యవస్థను కూలదోసి, వర్గరహిత సమాజం ఏర్పడుతుందంటాడు. అప్పుడు మనిషిని వేరొక మనిషి పాలించే వ్యవస్థపోయి, వాటంతట అవే నడిచే యంత్రాంగాలను పైపైన అజమాయిషీ చేసే వ్యవస్థ వస్తుందంటాడు. దాంతో ఎన్నడూ ఊహించని సుఖ సంతోషాలతో, అష్టైశ్వర్యాలతో, సమాజం భూతల స్వర్గంగా మారుతుందని స్వప్నిస్తాడు – మార్క్సు.

చారిత్రక పరిణామాన్ని వివరించే సూత్రాల్లోని ఈ ఆఖరి సూత్రం పాక్షికంగా మాత్రమే నిజం. మధ్యయుగాల్లో వెనిస్, తర్వాత ఇంగ్లండు ప్రపంచ ఆధిపత్యాన్ని, తాత్కాలికంగా, కనీసం ఆర్థికపరంగా ఆర్జించాయి. అదే కోరికతో హిట్లరు జర్మనీని ప్రపంచ సామ్రాజ్య కేంద్రంగా చెయ్యాలని ప్రయత్నించి, విఫలమయ్యాడు. ఇప్పుడు, అమెరికా చేస్తున్న ప్రయత్నాల్లో – అది కూడా ఫెయిలవక తప్పదు. అంతవరకు ఈ సూత్రం పాక్షికంగా నిజం. మిగతా భాగం విషయంలో మార్క్సు చెప్పిన సూత్రానికి విరుద్ధంగా వాస్తవంలో జరిగింది.

కమ్యూనిస్టు విప్లవం వచ్చిన రష్యా, చైనాలలో అప్పట్లో ఉన్న పాత ప్రభుత్వాలు పోయి, అంతకన్నా కేంద్రీకృత, నియంతృత్వపు, పాశవిక ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. రాచరికం కాకపోతే, పొలిట్‌బ్యూరో రూపంలో మనిషిని మనిషి పాలించడం ఆగలేదు. యంత్రాంగాలు వాటంతట అవే నడవలేదు. అంతులేని హింసాయుత మార్గాల్లో ప్రతి యంత్రాంగాన్నీ తుపాకీ గొట్టాలతో శాసించాల్సి వచ్చింది. ఇంతా చేసి సాధించింది– భూతల స్వర్గం కాదు, కటిక పేదరికాన్ని. లక్షల కొద్దీ ఆకలి చావులను. విప్లవ ప్రతీఘాత శక్తులుగా ముద్రించబడి, సైబీరియాల్లో బానిస బతుకులీడ్చి, ఎవరికీ తెలియని, గణాంకాలకు కూడా చేరని, ఎవరూ శోకించని, ఆగంతక మరణాలు. ఎందుకిలా జరిగింది? మార్క్సు ఎక్కడ పొరబడ్డాడు?

15-09-2013

ఎందుకీ వర్గ కసి?

ప్రైవేటు సంస్థల్లోని ఉద్యోగులకు తమ సంస్థల యాజమాన్యాలపై కసి; యాజమాన్యాలకు తమ ఉద్యోగుల యూనియన్ కార్యకలాపాలంటే భయం, కోపం, మంట. వ్యవసాయ కూలీలకు రైతులు తమ శ్రమను దోచేస్తున్నారనే భావన; రైతులకేమో... కూలీలకు పని పట్ల శ్రద్ధ, రైతు పట్ల గౌరవం లేకుండా పోతున్నాయనే దుగ్ధ. ఇలా సమాజంలో అన్ని వర్గాలూ ఒకరిపట్ల ఒకరు వ్యతిరేక భావనలు పెంచుకుంటున్నారు. ఎవరికి వారు తమ సమస్యలను పరిష్కరించమని ప్రభుత్వం వైపు చూస్తుంటారు. అసలీ సమస్యలకు చాలా వరకు మూలకారణం ప్రభుత్వమేనన్న సత్యాన్ని గుర్తించలేకపోతున్నారు. ఈ గందరగోళానికి కారణం మార్క్స్ ప్రతిపాదించిన 'దోపిడీ సిద్ధాంతం'; దోపిడీ జరిగే అసలు నరాన్ని పట్టుకోవడంలో ఆయన వైఫల్యం.

చరిత్ర, దాని పరిణామాన్ని వివరించడంలో కృతకృత్యుడైన మార్క్స్, ఆ పరిణామ క్రమానికి మూల శక్తి, చోదక శక్తి అయిన 'దోపిడీ' విధానాన్ని సరిగా గుర్తించడంలోనూ, వివరించడంలోనూ తీవ్రమైన తప్పిదం చేశాడు.

బానిసత్వం, వెట్టిచాకిరీ, ఫ్యూడలిజం నడచిన రోజుల్లో బానిసల శ్రమ దోపిడీ జరిగేది. తాను తయారు చేసుకున్న తన పొలాన్ని పండించడానికి కూడా స్థానిక భూస్వామికి కప్పం కట్టవలసి వచ్చేది. ఇంతవరకు నిజమే. కానీ మార్క్స్ ఈ అవగాహనను ఆధునిక, స్వచ్ఛమైన పెట్టుబడీదారి విధానానికి కూడా విస్తరించాడు. బానిసల స్థానంలో స్వేచ్ఛాయుత కార్మికవర్గం, కప్పం కట్టేవారి స్థానంలో కౌలు రైతులు ఉన్న వ్యవస్థలోనూ దోపిడీ జరుగుతుందంటాడు. పెట్టుబడిదారులు, భూముల యజమానుల పూర్వీకులు సంపాదించిందంతా హింస, ఆక్రమణ, దోపిడీల ద్వారానే సంపాదించారని తన 'క్యాపిటల్' గ్రంథంలోని 24వ అధ్యాయంలో రాశాడు.

అది నిరూపించడానికి సాక్ష్యాలు లేకపోయినా; కాదనడానికి సాక్ష్యాలు లేవు కాబట్టి అంతవరకు నిజమేననుకుందాం. కానీ ఇక్కడే మార్క్స్ తన కనికట్టును

ప్రదర్శించాడు. పెట్టిన పెట్టుబడి సాక్ష్యాధారాలతో సహా కేవలం స్వశక్తితో, శ్రమతో, దాన్లోంచి దాచుకున్న డబ్బుతో సమకూర్చుకున్నప్పటికీ; అటువంటి పెట్టుబడితో నడిపే ఉత్పత్తి వ్యవస్థ కూడా దోపిడీ వ్యవస్థేనంటాడు. ఉదాహరణకు ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి, తన జీతం నుంచి పొదుపు చేసిన పదివేల రూపాయాలతో ఒక చిన్న సంస్థను స్థాపించి, ఉద్యోగులను నియమించుకుని, సాఫ్ట్‌వేర్ ఉత్పత్తి చేసి, వచ్చిన లాభాలతో ఇంకా ఇంకా విస్తరించి, ఒక వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించారు. కానీ మార్క్స్ సిద్ధాంతం ప్రకారం అది కూడా దోపిడీ వ్యవస్థే.

ఒక చెప్పులు కుట్టే కార్మికుడు కొద్ది మొత్తాల్లో డబ్బు దాచుకుని, ఒక చిన్న చెప్పులు కుట్టే వర్క్‌షాపు పెట్టుకుని, ఇంకో ఇద్దరు ముగ్గురు కార్మికులను నియమించుకుని ఉత్పత్తి చేస్తే, అది కూడా దోపిడీయేనంటాడు. ఈ దోపిడీని గుర్తించి వివరించడమే ఆయన సామాజిక శాస్త్రానికి అందించిన మహత్తరమైన జ్ఞానం అని వామపక్షీయులు నమ్ముతారు. తినగ తినగ వేపాకు తియ్యనైనట్లు, మార్క్సిస్టు శాస్త్రం అధ్యయనం చేసిన వామపక్ష మేధావులే కాక; అలవాటు కొద్దీ – ఈ సిద్ధాంతం సామాన్య ప్రజలకు కూడా వంటబట్టింది. అందుకే యజమానిని చూసినప్పుడల్లా ప్రతి కార్మికునికి, రైతుకూలీకి, చివరకు ఇన్ఫోసిస్‌లో పనిచేసే ఇంజనీర్లకూ – తమ శ్రమ దోపిడికీ గురవుతోందనే భావన కలుగుతుంటుంది. ప్రతి సమస్యను, వైరుధ్యాన్ని, సంబంధాన్ని ఈ సిద్ధాంతపు దృష్టి కోణంలో వివరించడానికి ప్రయత్నిస్తుంటారు. ఇంతకీ తన దోపిడీ సిద్ధాంతాన్ని ఆధునిక యుగానికి మార్క్స్ ఎలా విస్తరించి, అన్వయించాడు? అదెంతవరకు సత్యం?

ఒక యజమాని తన దగ్గరున్న డబ్బుతో ఇద్దరు కార్మికులను పెట్టుకుని రోజుకు వందరూపాయల విలువ గల ఉత్పత్తిని సాధించాడనుకుందాం. కార్మికులకు చెరొక నలభై అయిదు రూపాయలు జీతంగా చెల్లించాడనుకుందాం. ఈ పనిలో యంత్రాల వాడకం లేదనుకుందాం. ఉత్పత్తి అమ్ముడుపోవడం ఖాయం, ఏ రిస్కూ లేదనుకుందాం. ఈ ఉత్పత్తికి ప్రత్యేకమైన తెలివితేటలు కూడా అవసరం లేదనుకుందాం. యజమాని మిగుల్చుకుంటున్న పది రూపాయలు అసలు కార్మికులకు చెందాల్సిన అదనపు శ్రమ అనీ; దాన్ని లాభం రూపంలో యజమాని దోచుకుంటున్నాడనేది మార్క్స్ సిద్ధాంతం.

చూడ్డానికి నిజమే కదా అనిపిస్తుంది కానీ, ఇందులో ఒక మెలిక ఉంది. మార్క్స్ గమనించని ఒక ముఖ్యమైన అంశం ఉంది. అదేమిటంటే, డబ్బుకు కాలం విలువ (టైమ్ వ్యాల్యూ) ఉంటుంది. అంటే ఇవాళ చేతిలో వంద రూపాయలు ఉన్నదానికి, నెల రోజుల తర్వాత చేతికొచ్చే వంద రూపాయల విలువకు తేడా ఉంది. చేతిలో ఉన్నదానికి విలువ ఎక్కువ. అది ఎంత ఎక్కువ అనేది మనిషి, మనిషికీ; సమయాన్ని

బట్టీ మారుతుంది. ఒక వ్యక్తి భవిష్యత్ డబ్బుతో పోలిస్తే వర్తమానంలో డబ్బుకు ఇచ్చే ప్రిఫరెన్స్ మీద ఆధారపడుతుంది. ఉదాహరణకు కరవు రోజుల్లో, యుద్ధ సమయాల్లో డబ్బు చేతిలో ఉంచుకోవడానికి కాస్త ఎక్కువ ప్రిఫరెన్స్ ఇస్తారు.

పై ఉదాహరణలో యజమాని తన ఉత్పత్తులను నెలకో, సంవత్సరానికో అమ్ముకున్న తర్వాత వచ్చేది వందరూపాయలు. అది భవిష్యత్ డబ్బు. కానీ కార్మికులకు ఏ రోజుకారోజు చెల్లిస్తున్న మొత్తం తొంభై రూపాయలు వర్తమాన డబ్బు. అది పరిమాణంలో తక్కువైనా, పనివాళ్ళ దృష్టిలో అది విలువలో ఎక్కువ. కార్మికులు వర్తమాన తొంభై రూపాయలకు ఎక్కువ విలువిచ్చారు. కాబట్టే పనిలో కొచ్చారు. నెలో, సంవత్సరమో ఆగగలిగే వాళ్ళయితే... వాళ్ళే ఉత్పత్తి చేసుకుని ఆ వంద రూపాయలు వాళ్ళే పొందగోరే వాళ్ళు. పన్లోకెందుకు వస్తారు? యజమాని వ్యక్తిగత విలువల కొలమానం ప్రకారం ఇవాళ్టి తొంభైరూపాయల కన్నా; నెల, లేక సంవత్సరం తర్వాత వచ్చే వంద రూపాయలు మిన్న. అందుకే కార్మికులను పెట్టుకుని ఉత్పత్తి చేశాడు. భవిష్యత్‌లో వచ్చే వందరూపాయలనూ కార్మికులకు ఈ రోజే ఇచ్చేయాల్సి వస్తే అసలు ఉత్పత్తి ఎందుకు చేస్తాడు? తన డబ్బును తన దగ్గరే భద్రంగా ఉంచుకునేవాడు.

ఈ విధంగా కాల – విలువలను (టైం ప్రిఫరెన్స్, టైం వ్యాల్యూ) పరిగణనలోకి తీసుకోకుండా మార్క్స్ ప్రవచించిన దోపిడీ సిద్ధాంతం అశాస్త్రీయం. నిజ జీవితంలో ఉత్పత్తి చెయ్యడానికి కార్మికులతో పాటు యంత్రాలు అవసరం, ఉత్పత్తి చేసిన సరకు అమ్ముడవుతుందో లేదోనన్న రిస్కు కూడా ఉంటుంది. ఏ వస్తువు ఉత్పత్తి చేయాలి, ఏ పద్ధతిలో చెయ్యాలి లాంటి నిర్ణయాలు తీసుకోవడానికి కేవలం డబ్బుంటే చాలదు, తెలివితేటలు కూడా కావాలి. డబ్బున్నా, ఆ తెలివితేటలు అందరికీ ఉండవు. వీటన్నిటినీ కవర్ చెయ్యడానికి లాభం మార్జిన్ పెట్టుకుంటారు. అది దోపిడీ కాదు. అయినా అనుకున్నవన్నీ కలసిరాక నష్టపోయే వాళ్ళు కో కొల్లలు.

గత సంవత్సరం పత్తి రేట్లు అమాంతం పెరిగి; తర్వాత తగ్గిపోయాయి. ముందుగా కొనుక్కున్న జిన్నింగ్, స్పిన్నింగ్ మిల్లులు కోట్లలో నష్టపోయాయి. నేర్పులేక కొంత, అత్యాశకుపోయి కొంత, కొందరు ధాన్యం వ్యాపారులు తీవ్రంగా నష్టపోవడం పల్లెల్లో చూస్తూనే ఉంటాం. ఎంతో పెట్టుబడి పెట్టి పండించిన ధాన్యం ఒక్క తుఫానుకు తడిసి ముద్దయితే, రైతుకు జరిగే నష్టం ఎవరు తీరుస్తారు? కూలీలకు అప్పటికే చెల్లించేసిన డబ్బు తిరిగి వస్తుందా?

కాబట్టి, స్వచ్ఛమైన, స్వేచ్ఛాయుత, పారదర్శక పెట్టుబడీదారీ విధానంలో కూడా దోపిడీ ఉందనే మార్క్స్ సిద్ధాంతం – పూర్తిగా తప్పు. ఈ సిద్ధాంతం ఆధారంగా వచ్చే

ఆలోచనలు, సాహిత్యం, ఉద్యమాలు, రాజకీయాలు, చట్టాలు – ఉత్పత్తి సంబంధాలకు, మానవ సంబంధాలకు కీడు చేస్తాయి, చేస్తున్నాయి. బానిసత్వం వ్యవస్థలో బానిస శ్రమను యజమాని దోచుకోవడం నిజమే. కానీ స్వేచ్ఛాయుత కార్మికుడికి, పెట్టుబడిదారునికి మధ్యగల సంబంధం ఇద్దరికీ ఉపయోగకరమైనది. పెట్టుబడిదారుడు ఉంటేనే కార్మికునికి వర్తమానంలో డబ్బు అందుతుంది. కార్మికులు ఉంటేనే పెట్టుబడిదారునికి భవిష్యత్తులో లాభంతో కూడిన డబ్బు అందుతుంది. ఈ వ్యవహారం సవ్యంగా సాగితేనే యజమాని వచ్చిన లాభం లోంచి కొంత మాత్రమే వాడుకుని, మిగతాది పొదుపు చేసి, పెట్టుబడిని పెంచుకుంటూ పోతాడు. యాంత్రీకరణ చేస్తాడు, ఇంకో ఫ్యాక్టరీ పెడతాడు. పెట్టుబడి పెరిగిన కొద్దీ కార్మికులకు డిమాండు పెరిగి, జీతాలు పెరుగుతాయి. ఈ గొలుసుకట్టు క్రమమే ఆర్థిక అభివృద్ధి అంటే. కార్మికులు కూడా పొదుపు చేసి, షేర్లు కొనుక్కొని, పరోక్షంగా పెట్టుబడిదారులవుతారు, అది వేరే సంగతి!

సోషలిస్టు ఉత్పత్తి వ్యవస్థలో మార్క్సు ఊహించినట్లుగా యంత్రాలు, ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తి అనూహ్యంగా పెరగడం అటుంచి, కటిక పేదరికానికి దారితీస్తుంది. పెట్టుబడి అనేది క్యాపిటలిజంలో అయితే వ్యక్తిగతంగాను; సోషలిస్టు వ్యవస్థలో – సామాజిక పెట్టుబడి రూపంలోను ఉంటుంది. పెట్టుబడి ఏ రూపంలో ఉన్నా, శ్రమ చెయ్యాల్సింది, ఉత్పత్తి చెయ్యాల్సింది, చేసిన ఉత్పత్తిలో కొంత తిని, మిగతాది పొదుపు చెయ్యాల్సింది వ్యక్తులే. వ్యక్తి తాను చేసిన పొదుపు మీద తనకు నిర్ణయాధికారం ఉందనుకున్నప్పుడు దాన్ని పెట్టుబడిగా మారుస్తాడు.

కానీ సోషలిస్టు వ్యవస్థలో వ్యక్తి చేసే పొదుపు మీద (శ్రమపడని, పొదుపు చెయ్యని) ఇతరులకు సమాన హక్కుంటుంది. కాబట్టి వ్యక్తి పొదుపు చెయ్యడం కంటే, ఉత్పత్తి చేసిందంతా వాడేసుకోవడానికే ప్రాముఖ్యత నిస్తాడు. దాంతో పొదుపు, పెట్టుబడి తగ్గిపోతాయి. దాని పర్యవసానంగా సమాజం పేదరికంలోకి నెట్టబడుతుంది. సోవియట్ రష్యా, మావోయిస్టు చైనా, ఇప్పటి ఉత్తర కొరియా, క్యూబాలలో జరిగింది, జరుగుతోంది అదే.

ఒక తప్పుడు దోపిడీ సిద్ధాంతంతో నాగరిక సమాజపు భవిష్యత్తును నిర్దేశించ జూసిన మార్క్సు ప్రయత్నం – విఫలమవడంలో ఆశ్చర్యం లేదు. కానీ అసలు దోపిడీ లేదంటారా? ఖచ్చితంగా ఉంది. పాలకవర్గాల దుర్మార్గాలు, వారి వర్గ ప్రయోజనాల కోసం ప్రజహితాన్ని బలిపెట్టడం నిజం కాదా? ఖచ్చితంగా నిజం. కానీ ఈ సత్యాలను గ్రహించడానికి, గమనించడానికి వాడాల్సింది – మార్క్సిస్టు కళ్ళద్దాలు కావు. చిన్నపిల్లలు కూడా సమాధానం చెప్పగల కొన్ని ప్రశ్నలు వేసుకుంటే చాలు. ఆ తర్వాత తర్కమే దారి చూపుతుంది. మనిషికి తన శరీరం మీద తనకు హక్కుందా, లేదా? (బానిసలకు అటువంటి

హక్కు ఉండదు). ఇది వరకు ఎవరూ ఉపయోగించని సహజవనరును ఇతరులు ఎవరికీ ఇబ్బంది కలగని రీతిలో ఉపయోగించుకునే హక్కు మనిషికి ఉందా, లేదా? ఉదాహరణకు ఎవరూ చేపనారు పొయ్యని చెరువులోనో, సముద్రంలోనో చేపలు పట్టుకోవచ్చా? తన సొంత శారీరక శ్రమతో చేపలు పట్టి, కొన్ని తిని, మిగతావి అమ్ముకోవచ్చా? వచ్చిన డబ్బుతో ఇంకాస్త మంచి పడవ, వల కొనుక్కోవచ్చా? వీటన్నిటికీ అవుననేదే సమాధానమయితే, మరి దోపిడీ అసలెవరు చేస్తున్నారో, దానిలో పాలక వ్యవస్థ పాత్రేమిటో వచ్చేసారి చూద్దాం.

29-09-2013

రాజ్యం దోపిడీదారుల భోజ్యం

డబ్బు సంపాదించడానికి రెండే రెండు మార్గాలున్నాయి. ఒకటి - కష్టపడాలి; సంపాదించాలి. కొంత వాడుకుని మిగతాది పొదుపు చెయ్యాలి. దాన్ని మదుపు చెయ్యాలి (పెట్టుబడి పెట్టాలి). వచ్చిన లాభంలో కొంత వాడుకుని మిగతాది పొదుపు, మదుపు...ఇలా. అటువంటివారు సంపద సృష్టికర్తలు. ఇతరులెవరినీ నష్టపెట్టకుండా యాంత్రీకరణ, పని విభజన, కొత్త సాంకేతిక ఆవిష్కరణల ద్వారా సంపద సృష్టించి లోక కళ్యాణానికి కారకులవుతారు.

రెండో మార్గం-పైవన్నీ చేసి సంపాదించిన వాళ్ళ దగ్గర్నుంచి లాక్కోవడం. మానవజాతికి రెండు మార్గాలూ సాధ్యమే. సంపద సృష్టించేవారు చిన్న స్థాయి మొదలుకుని, వ్యాపార, ఉత్పత్తి సంస్థలుగా, బహుళజాతి కంపెనీలుగా విస్తరిస్తారు. అలాగే లాక్కుని తినేవాళ్ళు కూడా దొంగల ముఠాలుగా, రాజకీయ పార్టీలుగా, ప్రభుత్వాలుగా, రాజ్యాలుగా ఏర్పడి ఎవరూ కన్నెత్తి చూడలేనంత పెద్ద పెద్ద సంస్థలుగా రూపొందుతారు. ఈ దోపిడీ దారులతోనే పాలక వర్గాలు ఏర్పడతాయి. అవి క్రమేపీ తమ పరిధులను విస్తరించుకుని, ఊడలు తీరిన మహా వృక్షాలవుతాయి.

ఈ వాస్తవిక కోణం నుంచి చూస్తే చరిత్ర అంతా కష్టపడి సంపాదించే వర్గం ఒకవైపు, వారిని దోచుకుని తినే పాలక వర్గం రెండోవైపు ఉండి, ఈ రెండు వర్గాల మధ్య జరిగిన సంగ్రామాల సమాహారంగా కనిపిస్తుంది. కాబట్టి, చరిత్రను వివరించడానికి వివిధ కాలాల్లో ఉన్న స్వేచ్ఛ, దోపిడీ పాళ్ళు, పరాన్నజీవితాలు, ఆర్థిక అణచివేత, ఆస్తి హక్కులు, వాటిని కాలరాసిన తీరు లేదా రక్షించిన సంస్కృతి-ఇవే ప్రధానాంశాలు కావాలి. అలా కాకుండా రాజులు, రాజ్యాలు, యుద్ధాలు, కట్టడాల రూపంలో చరిత్రను వివరిస్తే, అది సారంలేని విశ్లేషణ, వృథా ప్రయాస అవుతాయి. మార్క్సిస్టు వర్గ పోరాట విశ్లేషణ కూడా అంతే వృథా ప్రయాస.

ఉత్పత్తి శక్తులు అనేవి, కష్టమర్ల కోరికలను బట్టి వస్తుంటాయి, పోతుంటాయి. గుర్రపు బగ్గీలు వచ్చాయి, పోయాయి. అంబాసిడర్ కార్లు వచ్చాయి, పోయాయి. కంపెనీలు మూత పడుతుంటాయి.

కానీ దోపిడీ మీదే బ్రతికే పాలక వర్గం మాత్రం ఎప్పటికీ మూతపడదు. వద్దన్నా పోదు. 'వచ్చి నన్ను దోచుకో' అని సంపాదించే వారు – కోరరు. కానీ, పాలక వ్యవస్థ వారిపై బలవంతంగా రుద్దబడుతుంది. ఫియట్ కార్లు కొనేవారు లేకపోతే కంపెనీ మూతపడుతుంది. కానీ పాలక వ్యవస్థ వద్దు అనుకునే స్వేచ్ఛ – పాలితులకు ఉండదు. దాన్ని బహిష్కరించలేము. అది అప్రతిహతంగా సాగిపోవడానికి కారణం పాలిత వర్గాల్లో వర్గ చైతన్యం లేకపోవడం. (ఒక మనవి – అందరికీ చిర పరిచయమైన మార్క్సిస్టు పదజాలాన్ని వాడడం ఆ సిద్ధాంతంతో ఏకీభవించినట్లుగా భావించరాదు.)

పదిమంది – మరో పదిమందిని దోచుకోవడానికి ప్రయత్నిస్తే సమర్థంగా ఎదిరిస్తారు. కానీ కొన్ని వేల మంది పాలక వర్గ సభ్యులు కోట్ల మందిని దోపిడీ చేస్తుంటే ఏమీ చెయ్యలేకపోతున్నారు. దానికి కారణం – అటువంటి దోపిడీ మంచిదేననే అంధ విశ్వాసమన్నా కావాలి; లేదా – ఎలాగూ ఆపలేం కాబట్టి నిశ్శబ్దంగా భరించడమన్నా కావాలి.

బాధితుల్లో మెజారిటీ సభ్యులు తాము దోపిడీకి గురవుతున్న విధానాన్ని గుర్తించి, ఎదిరించినప్పుడే అది ఆగుతుంది. అలాంటి వర్గ చైతన్యంతోనే అమెరికా, పశ్చిమ యూరప్ లోని భూస్వామ్య, ఫ్యూడల్ నియంతృత్వ వ్యవస్థలకు వ్యతిరేకంగా పోరాటాలు జరిగాయి. మనిషికున్న ప్రాథమిక, సహజ హక్కులు, ఉదారవాదం లాంటి భావాలు వ్యాపించాయి. కానీ ఇరవయ్యో శతాబ్ధం వచ్చేసరికి – ఆ వర్గ చైతన్యం పలుచబడిపోయింది. దీనికి ముఖ్య బాధ్యత వహించాల్సింది మార్క్సిజం. సంపాదించే వారి దగ్గర నుంచి సంపాదించని పాలక వర్గాలు చేసే దోపిడీని వేలెత్తి చూపాల్సింది పోయి; దృష్టి మళ్లించి, స్వచ్ఛందంగా సంబంధాలేర్పరచుకునే పెట్టుబడిదారుడికి, కార్మికులకు మధ్య చిచ్చు పెట్టిన మార్క్సిజమే వర్గ చైతన్యాన్ని గందరగోళంలో పడేసింది.

కొద్దిమందితో కూడిన పాలక వర్గం – అసంఖ్యాక ప్రజా శ్రేణుల్ని శాసిస్తూ, దోపిడీ చెయ్యాలంటే... ప్రజల్లో వర్గ చైతన్యం చాలా నిమ్న స్థాయిలో ఉంచాలి. అంటే తాము దోపిడీకి గురవుతున్నామన్న విషయం... అది ఏ విధంగా జరుగుతోంది అన్న వివరాలు ప్రజలకు తెలియకూడదు; వాటిపై ప్రజల్లో విస్తృతస్థాయిలో ఏకాభిప్రాయం రాకూడదు. వస్తే పాలకవర్గం పట్ల వ్యతిరేకతకు, విప్లవానికి దారితీస్తుంది. పాలకవర్గాల కొంప మునుగుతుంది. వర్గ చైతన్యం ప్రబలకుండా తీసుకునే జాగ్రత్తల్లో మొదటిది –

ఒక రాజ్యంగా, వివిధ చట్ట సంస్థలు, చట్టాలు ఏర్పరచడం. దాని ద్వారా సమాజంలో శాంతి, సుస్థిరతలు ఏర్పడతాయని బయటకు చెబుతారు. నిజానికి సుస్థిరమయ్యేది– పాలకవర్గం, వారి ప్రత్యేక స్థానం, వారి విశేష అధికారాలు. ప్రజాదరణ కలిగిన సమానత్వం, స్వేచ్ఛ, ఆస్తి హక్కులాంటి భావాలను పొందుపరుస్తూనే, పాలకవర్గాల ప్రత్యేక అధికారాలను, పాలితుల పరిమితులను చట్రాల్లో బిగించేస్తారు.

ఉదాహరణకు; పేరుకు – ఆస్తి హక్కు ఉంటుంది. కానీ ప్రభుత్వం దానిమీద ఇష్టమొచ్చిన పన్నులు వేసుకోవచ్చు, ఎప్పుడు కావాలంటే అప్పుడు జాతీయం చెయ్యొచ్చు. అందరూ సమానమే, కానీ మంత్రులు, అధికారులు, రాష్ట్రపతి, గవర్నర్లు, జడ్జీలు – ఎవరూ ప్రశ్నించలేనంత ప్రత్యేక రక్షణలు కలిగి ఉంటారు. స్వేచ్ఛ ఉంటుంది, కానీ ప్రభుత్వం ఎప్పటికప్పుడు నిర్ణయించే పరిమితుల మధ్య మాత్రమే అనుభవించగలం. పాలితుల విషయంలో అమలయ్యే చట్టాలు, విధానాలు తమకు వర్తించకుండా చూసుకుంటారు. ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు, పాలకవర్గ ప్రయోజనాలకు మధ్య పేచీ వస్తే... పాలకవర్గమే గెలిచేలా చట్టాలు రాసుకుంటారు. ప్రజల కష్టఫలం నుంచి కావలసినంత భాగం పన్నులు, సెస్సుల రూపాల్లో లాక్కోవడానికి ప్రశ్నించజాలని విశేషాధికారాలు తమకోసం తాము కల్పించుకుంటారు. ఆ విధంగా కష్టపడే వారికి వారి కష్టఫలం మీద, వ్యక్తులకు వారి శరీరాల మీద హక్కు లేకుండా చేస్తారు. అదే అసలైన దోపిడీ.

మార్క్సు – దీన్ని ఎత్తి చూపకుండా, అదనపు విలువ, అదనపు శ్రమ సిద్ధాంతాల భ్రమలో కొట్టుకుపోయాడు. ఆస్తి హక్కులను చట్టపరంగా గుర్తించడం ద్వారా దోపిడీ వర్గాలు వర్గ న్యాయాన్ని (Class justice) అనుసరిస్తాయన్న మార్క్సు వివరణ – శుద్ధ తప్పు. పాలకవర్గం – తన వర్గ న్యాయాన్ని నిజానికి ఎలా అమలు చేస్తుందంటే – తాము కష్టపడకుండా తిని కూర్చోవడానికి వసూలు చేసే దాన్ని పన్నులంటుంది. అదే పని ప్రైవేటు వ్యక్తులు చేస్తే దాన్ని దొంగతనంగా జమకడుతుంది. ఈ వైరుధ్యం ద్వారా మాత్రమే – పాలకవర్గ న్యాయం అమలవుతుంది.

దోపిడీ విధానాన్ని గుర్తించి, వివరించడంలో విఫలమైనా – రాజ్యం యొక్క మౌలికమైన దోపిడీ స్వభావాన్ని మార్క్సు సరిగానే గుర్తించాడు. సంక్షేమం పేరుతో సంపద పున:పంపిణీ వ్యూహాల ప్రాముఖ్యతను, వాటి వెనుక ఉండే అసలు ఉద్దేశాలను కూడా సరిగానే గుర్తించాడు. సంక్షేమ పథకాలను కార్మిక వర్గానికి విసిరే రొట్టె ముక్కలుగా అభివర్ణిస్తూ, వాటి కోసం ఆశపడి, విప్లవ అవసరాన్ని మరువవద్దని తన కరపత్రాల ద్వారా బోధించాడు. నిజానికి సంక్షేమ పథకాల ముఖ్య ఉద్దేశం – పాలిత ప్రజల్లో

వర్గచైతన్యం పెరక్కుండా చూసుకోవడం, ప్రజల్లో రకరకాల విభజనలు తెచ్చి, అందరూ కలిసిపోకుండా, దోపిడీ వర్గానికి ఎదురు తిరగకుండా నిలువరించడం. ఈ వ్యూహపు ఫలితాలు కళ్ళెదుటే ఉన్నాయి.

'తింటే తిన్నాడు, మనక్కూడా కొంచెం పెట్టాడు కదా!' అనే ఆలోచనలు దీనికి రుజువు. పాలకవర్గం వివిధ పదవులను ప్రజాస్వామీకరించి, తలా ఒక పదవి పడెయ్యడం కూడా ప్రజల్లో వర్గచైతన్యాన్ని తగ్గించి, విభజనలు సృష్టించే వ్యూహంలో భాగమే. అందుకే కొత్త పదవుల సృష్టి జరుగుతూనే ఉంటుంది. మార్కెట్ కమిటీలు, ఆలయ కమిటీలు, ఎంపీటీసీ, జడ్పీటీసీ, శాసనమండలి పున:ప్రతిష్ట, కార్పొరేషన్ చైర్మన్లు, నామినేటెడ్ పోస్టులు, చివరికి ఆదర్శ రైతులు – ఇవన్నీ ఆ ప్రయత్నాలకు సజీవ సాక్ష్యాలే.

మార్క్స్ కూడా సరిగ్గానే గుర్తించినట్లుగా; ప్రచారం, ప్రాపగాండా, మభ్యపెట్టే కళల్లో – రాజ్యం ఆరితేరింది. దోపిడీని నిజమైన స్వేచ్ఛగా నమ్మిస్తుంది. అవి నిర్బంధ పన్నులుకావు, స్వచ్ఛంద విరాళాలుంటుంది. అది పౌర బాధ్యత అంటుంది. ఎవరూ ఎవరినీ పాలించడం లేదు, మనల్ని మనమే పాలించుకుంటున్నామని నమ్మబలుకుతుంది. వీటన్నిటికీ అంతులేని నిధుల్ని, తన శక్తియుక్తుల్ని వెచ్చిస్తుంది. రూ.500 కోట్లతో భారత్ నిర్మాణ్ ప్రచార భేరి ఇందులో భాగమే. ప్రాథమిక స్థాయి నుంచి పాఠ్యాంశాలను రాజ్యమే నిర్దేశించడానికి కారణమిదే. తద్వారా పాలకవర్గ సర్వసత్తాకతకు ఎక్కడా భంగం కలగకుండా, ఎటువంటి విరుద్ధ భావనలూ కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. ఎప్పుడన్నా ఏదన్నా సంక్షోభం ఎదురైతే, సంపాదించేవారి స్వార్థాన్ని ఎత్తిచూపి, సరిపడా పన్నులు కట్టడం లేదని ఆడిపోసుకుంటారు.అంతేగానీ, పార్లమెంటు సభ్యులకు మూడొందల కోట్ల మార్కెట్ విలువ గలిగి, ఎకరం భూమిలో కట్టిన బంగ్లాలు, రాష్ట్రపతికి మూడొందల యాభై ఎకరాల ఎస్టేటు ఎందుకు అవసరమో – పొరపాటున కూడా చర్చలోకి రానీయరు.

చివరగా, రాజ్యానికి, వ్యాపారస్తులకు–ముఖ్యంగా బ్యాంకింగ్ రంగానికి ఉన్న అవినాభావ సంబంధాన్ని మార్క్స్ ఎత్తిచూపడం సరైనదే. కానీ దాన్ని వివరించడంలో తప్పుడు అవగాహన చూపాడు. రాజ్యం ఆస్తి హక్కుల్ని కాపాడుతుంది కాబట్టి – వ్యాపార వర్గాలు రాజ్యం మీద ఆధారపడుతున్నాయన్నాడు. అది శుద్ధ తప్పు. వాస్తవం దానికి పూర్తి విరుద్ధం. నిజానికి – రకరకాల రాజ్యాంగ అధికరణలు, చట్టాలు, పన్నుల వ్యవస్థల ద్వారా ఆస్తి హక్కులను రాజ్యం కాలరాస్తుంది కాబట్టే; వ్యాపార వర్గాలు రాజ్యం పంచన చేరతాయి. కొందరేమో తమ ఆస్తులను రాజ్యం లాక్కోకుండా చూసుకునేందుకు, కొందరేమో లైసెన్సులు తెచ్చుకుని లాభపడేందుకు, మరికొందరు; రాజ్యం అండతో తమకు పోటీ లేకుండా చూసుకునేందుకు – ఆశ్రిత పెట్టుబడిదారులవుతారు. కొన్ని దశాబ్దాల పాటు

బజాజ్ స్కూటర్లు, అంబాసిడర్ కార్లు పోటీ అనేదే లేకుండా బ్లాకులో అమ్ముడయ్యేవి. తప్పనిసరి పరిస్థితుల్లో పోటీ వాతావరణాన్ని 'అనుమతించే' సరికి; అవేమయ్యాయి? కనుమరుగయ్యాయి. ఒక రంగంలో గుత్తాధిపత్యాలు పోయి, పోటీ వాతవరణం వచ్చినా, రాజ్యం తన దోపిడీని వేరే రంగాలకు మళ్ళించింది.

జలయజ్ఞం, స్పెక్ట్రమ్, బొగ్గు బ్లాకులు, కేజి బేసిన్ కట్టబెట్టడాల ద్వారా ఊహాతీతమైన స్థాయిలో దోపిడీకి పాల్పడింది. అది బయటపడి వివాదాస్పదమైంది కాబట్టి ఇప్పుడు దోపిడీ ఇంకో రంగానికి మళ్ళుతుంది. మనకు తెలిసే లోగా గుటకాయ స్వాహా అయిపోతుంది. అందుకే వ్యాపార రంగం రాజ్యాన్ని అంటిపెట్టుకుని ఉంటుంది. కాబట్టి ఆశ్రిత పెట్టుబడిదారీతనం ఒక నిరంతర వాస్తవం. రిజర్వు బ్యాంకు ఆధీనంలోని బ్యాంకింగ్ రంగం వ్యాపార వర్గాలకు కృత్రిమమైన తక్కువ వడ్డీకి రుణాలందిస్తుంది. ప్రభుత్వానికి అవసరమైనన్ని నోట్లు ముద్రిస్తుంది. నగదు నిష్పత్తుల నిరంతర సవరణల ద్వారా బ్యాంకులు గాల్లోంచి డబ్బు సృష్టించే వెసులుబాటు కల్పిస్తుంది. ప్రజలు ఈ విష వలయం నుంచి తప్పించుకునే వీలు లేకుండా ఆదాయ పన్ను చట్టాలు, బంగారం మీద నియంత్రణ చట్రాలు గట్టిగా బిగిస్తుంది. అన్ని లావాదేవీలు బ్యాంకుల ద్వారానే జరగాలంటుంది. దాంతో ప్రతి లావాదేవీ పైనా రాజ్యం పెత్తనం ఉండి, ఎక్కడ కావాలంటే అక్కడ పన్ను విధించి దోచుకోవచ్చు.

ఇదీ అసలు దోపిడీ జరుగుతున్న విధానం, దోపిడీ శక్తుల వివరణ. ప్రతి దోపిడీ వెనుక రాజ్యం, లేదా రాజ్యాన్ని ఆసరా చేసుకుని బ్రతికే శక్తులే ఉంటాయి. స్వేచ్ఛాయుత వాణిజ్యం దోపిడీ కాదు. ఈ విషయాల్లో మార్క్సిస్టు తప్పుడు అవగాహనల నుంచి బయటపడితే తప్ప; దోపిడీ మూలాలను గుర్తించడం, వర్గ చైతన్యం పెంచుకుని, దోపిడీకి వ్యతిరేకంగా జతకట్టి పోరాడడం – సాధ్యం కాదు. ప్రజలు కులం, మతం, ప్రాంతం, వర్గం, పార్టీల్లాంటి కృత్రిమ విభజనలకు లోనై తమలో తాము కలహించుకుంటూ అసలు దొంగైన రాజ్యాన్నే ఆశ్రయించి న్యాయం కోరడం, తీర్పు చెప్పమనడం హాస్యాస్పద విషాదం.

మనం ఇరుక్కుపోయిన ఈ సాలెగూడు నుంచి తప్పించుకోవడమెలానో వచ్చేసారి చూద్దాం.

13-10-2013

విముక్తి మార్గం

మార్క్స్ చూపిన విముక్తి మార్గం - తిన్నగా నరకానికి దారితీస్తుంది. ఆయన సిద్ధాంతం ప్రకారం; 'దోపిడీ శక్తుల కేంద్రీకరణ ఆర్థిక స్తబ్దతకు, సంక్షోభానికి దారితీసి, విప్లవానికి అనుకూలమైన పరిస్థితులు కల్పిస్తుంది. విప్లవం ద్వారా ఈ దోపిడీ శక్తులు అంతమొంది, వర్గరహిత, రాజ్యరహిత సమ సమాజం ఏర్పడి కనీవినీ ఎరుగని ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక వికాసాన్ని సాధిస్తుంది. ఇదొక స్వాప్నికుడి ఊహాలోకం మాత్రమే కాదు, సాధారణ తర్కానికి కూడా నిలవలేని వాదం.

ఎందుకంటే, మార్క్స్ స్వప్నించిన వర్గరహిత సమసమాజంలో ఉత్పత్తి శక్తులు - అంటే ఫ్యాక్టరీలు, యంత్రాలు, పొలాలు, పనిముట్లు అన్నీ సమాజపరమై ఉంటాయి. వ్యక్తుల స్వంత ఆధీనంలో ఉండవు. అటువంటి వ్యవస్థ - ఇంతకు ముందే చెప్పుకున్నట్లుగా; లెక్కల సమస్యలో కూరుకుపోయి, ఏ పని, ఏ ప్రాజెక్టు, ఏ వస్తువుల ఉత్పత్తి ఎలా చేస్తే చౌకగా అవుతుందో తెలియక - ఆర్థిక అసమర్థతకు, గందరగోళానికి దారితీస్తుంది. మార్క్స్ ఊహించిన రాజ్యరహిత సమాజం ఏర్పడకపోగా; రాజ్యం ఎప్పుడూ లేనంత బలంగా, నియంతృత్వంగా తయారవుతుంది. ఎందుకంటే ఉత్పత్తి శక్తులు, సాధనాలన్నీ సమాజ పరమైనపుడు ఏది ఉత్పత్తి చెయ్యాలో, ఎలా పంచాలో నిర్ణయించే విషయంలో ఏకాభిప్రాయం అసంభవం. కాబట్టి అలాంటి నిర్ణయాలు తీసుకోవడానికి అవధులు లేని అధికారాలతో పనిచేసే రాజ్యవ్యవస్థ తప్పనిసరి అవుతుంది.

ఇదేదో ఇరవయ్యొకటో శతాబ్దంలో, తీరిగ్గా కూచుని, సోవియట్ రష్యా, చైనాల అనుభవాలు, ఆ వ్యవస్థలు కుప్పకూలిన వైనాలు దృష్టిలో ఉంచుకుని చెప్పే మాట కాదు. అవి కుప్పకూలక ముందే, తర్కపరంగా విశ్లేషించి, ఇలా జరగబోతోందని, ఇలా తప్ప వేరేలా జరిగే అవకాశమేలేదని నెత్తీ, నోరు బాదుకుని చెప్పిన ఆర్థిక వేత్తలు, తాత్వికులు

వందలాది మంది ఉన్నారు. కానీ సమసమాజ ఆవిష్కరణ, కూర్చుని తినే అవకాశాలను అందిస్తామని పదే పదే చెప్పే కమ్యూనిస్టు-సోషలిస్టు రంగుల కలలను – సినిమాలా చూసి తరించడంలో నిమగ్నమైన ప్రపంచం – వారి మాటలను పట్టించుకోలేదు. ఇప్పటికీ, మెజారిటీ జన సామాన్యం పట్టించుకోవడం లేదు.

ఆలోచనాధోరణులకు ఖచ్చితమైన పర్యవసానాలుంటాయి. ముఖ్యంగా ఆర్థిక విధానాలు, వాటిని అమలు చేసే సంస్థాగత మార్పులు సమాజపు దీర్ఘ కాలిక ప్రారబ్ధాన్ని నిర్వచిస్తాయి. స్వల్పకాలిక ప్రయోజనాలను ఆశించి తీసుకునే నిర్ణయాల వల్ల కలిగే దీర్ఘకాలిక దుష్పరిణామాలను అంచనా వేయగలిగే మేధో పటిమ మెజారిటీ ప్రజల్లో లేకపోతే, సమస్యల మూలాలు అర్థం కావు, పరిష్కారాలను బేరీజు వేయడం సాధ్యం కాదు. మార్క్స్ సూచించిన విముక్తి మార్గం సరైనది కానప్పుడు, మరి ఏది సరైన మార్గం అనే ప్రశ్న ఉదయిస్తుంది. చరిత్ర ఫలానా విధంగా ప్రయాణించి – చివరకు; సోషలిస్టు స్వర్గ ఆవిష్కరణతో పరిణామక్రమం పరిసమాప్తమవుతుందని మార్క్స్ సిద్ధాంతీకరించాడు. కానీ నిజానికి సమాజ చరిత్ర ఫలానా రకంగా మాత్రమే ప్రయాణించాలనే బండ సూత్రమేదీ లేదు.

జాగ్రత్తగా గమనిస్తే, స్థూలంగా జరిగే పరిణామాలివీ: రాజ్యం, రాజ్యాన్ని అంటిపెట్టుకుని ఉండే శక్తుల దోపిడీ వల్ల సంపద సృష్టికి అడ్డు తగులుతుంది. కాబట్టి ఈ దోపిడీ స్థాయి తక్కువగా ఉండే రాజ్యాల ఆర్థిక శక్తి పుంజుకుంటుంది. ఆ పుంజుకున్న ఆర్థిక శక్తితో, దోపిడీ ఎక్కువగా ఉండి, ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయ పరంగా, మిలటరీ పరంగా బలహీనంగా ఉండే రాజ్యాలపై భౌతికంగానో లేక ఆర్థికంగానో దండయాత్రలు చేస్తాయి. మొదట్లో ఈ దండయాత్రల వల్ల ఆక్రమిత రాజ్యం ఒక రకంగా విముక్తి పొందిన భావన కలుగుతుంది. (ఉదాహరణకు 18,19 శతాబ్దాల్లో ఇంగ్లండులో ఉన్న రాజ్య దోపిడీ ప్రపంచం మొత్తం మీద అత్యల్ప స్థాయిలో ఉండి, ఆ దేశం ఆర్థికంగా బాగా బలపడింది. దానికన్నా ఎన్నోరెట్లు పెద్దవైన ఫ్రాన్సు, జర్మనీల కంటే మిలటరీ పరంగా బలమైన ప్రపంచ శక్తిగా తయారయింది) ఉత్పత్తి శక్తులు రెక్కలు విప్పుతాయి. ఆర్థిక ఏకీకరణ జరిగి, ప్రపంచ మార్కెట్లు వెలుస్తాయి. పని విభజన, యాంత్రీకరణ జరిగి ఆక్రమిత దేశాల్లో కూడా ఉత్పాదకత, సంపద సృష్టి పెరుగుతుంది. ఆర్థిక వికాసంతో పాటు జనాభా పెరుగుతుంది. భవిష్యత్తు మీద ఆశలు ఎన్నడూ లేనంత స్థాయిలో పెరుగుతాయి.

ఈ సామ్రాజ్యవాద ఆక్రమణలు పెరిగి, పెరిగి, వేరెవరూ పోటీపడలేని స్థాయిలో, అతి కొద్ది ప్రపంచ రాజ్యాల గుప్పిట్లో ప్రపంచమంతా ఇరుక్కుపోతుంది. అప్పుడిక బయట

నుంచి దోచుకోవడానికేమీ మిగలని పరిస్థితిలో.... దేశం లోపల, అంతర్గత సమాజం నుంచి – పన్నులు, నియంత్రణలు, దోపిడీ ఎక్కువవుతుంది. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక స్తబ్ధత ఏర్పడి, ఆశలు నిరాశలై, విప్లవ పరిస్థితులేర్పడతాయి. సమస్యలకు మూలకారణాలైన రాజ్యపాలన, పన్నులు, నియంత్రణల దోపిడీ వ్యవస్థల పట్ల సైద్ధాంతిక అవగాహన పెరిగి, పరిష్కారం కోసం రాజ్యం దగ్గరకు పరిగెత్తడం మానేసి, రాజ్యమే అసలు సమస్యగా గుర్తించడం జరుగుతుంది.

రాజ్య వ్యతిరేక శక్తులు ఏకమై – పాతుకుపోయిన రాజ్య వ్యవస్థలను ఒక్కొక్కటిగా పెకలించి పడేసి, వ్యక్తి స్వేచ్ఛ, చొరవ, వ్యక్తి బాధ్యతల మార్గంలో విముక్తికి దారి చూపుతాయి. అప్పుడు ఏర్పడే రాజ్యరహిత సమాజంలో స్వేచ్ఛాయుత వ్యక్తుల చొరవ, సృజనాత్మకలతో, అత్యంత మెరుగైన పని సంస్కృతి, బాధ్యతాయుత ప్రవర్తనలతో సమాజంలో శాంతి, సంపదలు వెల్లివిరుస్తాయి. ఇదీ అసలు సిసలైన ప్రత్యామ్నాయ సిద్ధాంతం. ప్రస్తుత ప్రపంచ సమాజం ఆస్టేజికి రాలేదు. ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సొచ్చేట్టుంది.

ప్రజల శక్తి – అంటే వ్యక్తుల, సామాజిక శక్తి ఒకవైపు, రాజ్యం శక్తి ఒకవైపు ఉండి, ఈ రెండింటి మధ్య హక్కులు, అధికారాల పంపకం ఎప్పటికప్పుడు మారుతూ ఉంటుంది. నాగరిక సమాజపు నడకను, నడతను సూక్ష్మ దృష్టితో గమనించే మేధావులు చూడాల్సింది – వ్యక్తులతో కూడిన సమాజం ఒకవైపు, రాజ్య వ్యవస్థలు ఇంకోవైపు ఉండి, వాటి మధ్య మారుతున్న సమీకరణాలను మాత్రమే.

దైనందిన తాత్కాలిక రాజకీయాలు,ద్రవ్యోల్బణం, రూపాయి మారకం విలువ, వానలు, వరదలు, ఉల్లిపాయల ధరలు – ఇవన్నీ తాత్కాలిక దృశ్యాలు, అవి రోజూ మారుతుంటాయి. కానీ వాటికున్న తక్షణ ప్రాముఖ్యం వల్ల సాధారణ ప్రజల దృష్టిని ఆకర్షించి, వారి ఆలోచనల్ని పూర్తిగా ఆక్రమిస్తాయి. ప్రజలు అధికారాలు క్రమేపీ కోల్పోయి, రాజ్యం అధికారాలు క్రమంగా బలపడటం మరో పక్క జరిగిపోతూ ఉంటుంది.

రాజ్యానికి తనదంటూ డబ్బు ఏమీ ఉండదు. మనం పన్నుల రూపంలో కట్టేదే దాని డబ్బు. అలాగే, రాజ్యానికి తనదంటూ అధికారాలు, శక్తి ఏమీ ఉండవు. అదంతా మనం ధారపోసిందే..... కొన్ని సంక్షోభాలను అడ్డంపెట్టుకునో, కుయుక్తుల ద్వారానో రాజ్యం మన దగ్గర్నుంచి లాక్కున్నదే.

రాజ్యం బలం పెరిగే కొద్దీ వ్యక్తులు, సమాజంగా – మన బలం తగ్గిపోతున్నదని గుర్తించాలి. రాజ్యం బడ్జెట్ సైజు పెరుగుతున్న కొద్దీ మన జేబులు ఆ మేరకు ఖాళీ అవుతున్నాయన్న వాస్తవాన్ని కనీసం గుర్తించాలి. పోలీసు, మిలటరీ కవాతులను, యుద్ధ విన్యాసాలను, వేలకోట్లు పోసి అద్దెకు తెచ్చుకునే జలాంతర్గాములు, సెకండ్ హ్యాండ్

విమాన వాహన నౌకలను, నాయకుల వాహన శ్రేణులను చూసి అబ్బురపడడం మానేసి, ఇవన్నీ అసలు అవసరమా అని ప్రశ్నించాలి.

రాజ్యం వేసే ఎత్తుగడల్లో మొదటిది – రాజ్యశక్తి అధికార కేంద్రీకరణ. క్రమేపీ 'ప్రజల స్వచ్ఛంద శక్తి' ని ముందుగా స్థానిక సంస్థలు, వాటి నుంచి రాష్ట్ర ప్రభుత్వాలు, అక్కడ్నుంచి కేంద్ర ప్రభుత్వం నిర్విరామంగా లాగేసుకుని, ఒక వ్యక్తి చేతిలో కేంద్రీకృత మవుతుంది. అది ఒకప్పుడు నెహ్రూ కావచ్చు, ఇందిరాగాంధీ కావచ్చు, ఇప్పుడు సోనియా గాంధీ కావచ్చు, రేపు రాహుల్ గాంధీయో, మోదీనో కావచ్చు. వారు ఇష్టారాజ్యంగా నిర్ణయాలు తీసుకునే అధికారాలను, వ్యవస్థలను పోగుచేసుకుంటారు.

వారు ముఖ్యమంత్రుల్ని అలవోకగా మార్చగలరు, దోపిడీ చేసి సంపద పోగేసు కోగలరు. ఒక రాష్ట్రాన్ని పూర్తి సంక్షోభంలోకి నెట్టగలరు. రెండోది – ప్రజా వ్యవహారాలను నియంత్రించడానికి అధికార యంత్రాంగాన్ని విపరీతంగా విస్తరించడం. ఒకదాని తర్వాత ఒకటిగా బ్యూరోలు, రెగ్యులేటరీ సంస్థలు, ప్రాధికార సంస్థలు పుట్టుకొస్తూనే ఉంటాయి. వాటి నిర్వహణ, నియంత్రణల అవినీతి చట్రాల్లో – ప్రజలు ఇరుక్కుపోక తప్పదు. ఇక మూడోది – పేదరికాన్ని, అప్రయోజకత్వాన్ని ఒక రాజకీయ సాధనంగా వాడుకోవడం. దాని ద్వారా – కొంతమంది అనుభవిస్తున్న పేదరికానికి సమాజమే కారణమని; వారికి తిండి పెట్టే బాధ్యత సమాజానిదేనని; ఈ బాధ్యతను సమాజం తరపున రాజ్యం స్వీకరిస్తోందని నమ్మబలుకుతారు. తద్వారా పేదలు, అసమర్థులు – రాజ్యానికి కాణీ ఖర్చు లేకుండా ఓటర్లుగా దొరికి; రాజ్య వ్యవస్థను సమర్థించి, పోషిస్తారు. పేదరికం, నిరుద్యోగం, అసమర్థత, అసమానతలను కాపాడుకోవడం – రాజ్యానికి ఒక రాజకీయ అవసరంగా మారుతుంది.

నిజమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కావాలన్నా, సమస్యలు తీరాలన్నా, ఇక ముందు సమస్యలు రాకుండా ఉండాలన్నా, కలుపు మొక్కలా మొదలై వటవృక్షంలా వేళ్ళూనుకున్న రాజ్యవ్యవస్థ అంగాలను – ఒక్కొక్కటిగా విరిచి పొయ్యిలో పెట్టాలి. క్రమేపీ రాజ్య శక్తిని తగ్గిస్తూ, ప్రజాశక్తిని పెంచుకుంటూ పోవాలి. ప్రజల ఆలోచనా శక్తి, తాత్విక స్పష్టత, వ్యక్తిగత చొరవ పెరిగితే తప్ప అది సాధ్యం కాదు. అలా జరిగిననాడు ఒక్క బొట్టు రక్తం కూడా చిందకుండానే విప్లవం సాధ్యం. ఓటు హక్కు, రాజ్యశక్తులే ఆయుధాలుగా ఇప్పుడున్న ఒకరినొకరు దోచుకునే, అందరినీ కలిపి దోచుకునే వ్యవస్థ నుంచి బయట పడడానికి రాజ్య శక్తిని క్షీణింపజెయ్యడమొక్కటే దారి. దానికి ఎన్నాళ్ళు పడుతుందో, ఈ లోగా ఎంత నష్టం జరుగుతుందో ఒడ్డున నుంచుని చూస్తుండాలో; లేక ఈ ప్రక్రియలో కార్యకర్తగా క్రియాశీలక పాత్ర పోషించాలో – ఎవరికి వారుగా నిర్ణయించుకోవాలి.

27-10-2013

వ్యక్తిగత కర్తవ్యం

ఇది ఎన్నికల కాలం. రానున్న ఆరు నెలల్లో ప్రజలు – ముఖ్యంగా మేధావులు, మీడియా, చదువుకున్న వారు, ఆలోచించగలిగే వారు, విజ్ఞులు – వీరంతా చేసే ఆలోచనలు, తీసుకునే నిర్ణయాలపై సమాజం, రాష్ట్రం, దేశం భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. మెజారిటీ ప్రజలు సరైన రీతిలో ఆలోచించి, క్రియా పూర్వకంగా వ్యవహరిస్తే సమాజ పరిస్థితులు కొంత మెరుగయ్యే అవకాశం ఉంది. అది జరగకపోతే, పరిస్థితులు మరింతగా దిగజారకుండా ఆపలేరు. సరిగ్గా అంటే ఎలా ఆలోచించాలి?

వివిధ పార్టీలను, మానిఫెస్టోలను, వ్యక్తులను ఎలా అంచనా వెయ్యాలి? ప్రతి వాదనకూ విభిన్న పార్శ్వాలున్నప్పుడు, ధర్మాధర్మాలను, మంచి, చెడులను ఎలా బేరీజు వెయ్యాలి?

మున్ముందుగా మార్క్సిస్టు భావజాల ముసుగును తొలగించి ప్రపంచాన్ని చూడడం మొదలు పెట్టాలి. మార్క్సిస్టులు చెడ్డవారని కాదు. వారిలో అత్యధిక శాతం మందికి – దాని లోతు, నిజ స్వరూపం, ఆ సిద్ధాంతపు అశాస్త్రీయత, దాని తోక పట్టుకుని వెళితే సమాజాన్ని ఏ గోదాట్లోకి తీసుకెళ్ళి ముంచుతుందో.... మొదలైనవి తెలియవు. పడికట్టు పదాలకు అలవాటుపడి, అదనపు శ్రమ, దోపిడీ లాంటి సిద్ధాంతాలను విశ్లేషించి వ్యతిరేకించగల శాస్త్రీయ అవగాహన కొరవడి, అదొక ఫ్యాషన్‌గా మారిపోయి, ఆ భావజాల ఒరవడిలో కొట్టుకుని పోతుంటారు. స్వయంగా కష్టపడరు. కానీ, కష్టజీవులను ఇష్టపడతారు. మళ్ళీ కష్టజీవుల సంపాదనను వ్యతిరేకిస్తారు. వారి సంగతలా ఉంచితే, నిత్య జీవితంలో వ్యక్తులను, వృత్తులను, సంస్థలను, పార్టీలను, నాయకులను విశ్లేషించడానికి శాస్త్రీయమైన, బలమైన భావజాల పునాదుల మీద నిర్మితమైన సూత్రాలున్నాయి. వాటిని విస్మరిస్తే, ఎవరో అన్నట్టు 'వాస్తవాలు పగ తీర్చుకుంటాయి'

నిజాయితీగా, మోసాలకు, నేరాలకు పాల్పడకుండా కష్టపడి సంపాదించే వారిని అభినందించి, ప్రోత్సహించగలగాలి. ప్రజలు వినియోగదారుల రూపంలో కోరుకొన్న

ఉత్పత్తులను లేదా సేవలను అందించినప్పుడే ఎవరైనా సంపాదించగలుగుతారు. (అలా కాని సంపాదనంతా అనైతికమే.) కాబట్టి ఎంత ఎక్కువ సంపాదిస్తే అంత ఎక్కువగా ప్రజల అవసరాలు తీర్చినట్టు. కాబట్టి వారిని అభినందించాలి. అంతేకాక, వారు సంపాదించినదంతా వాడేసుకోరు. అత్యధిక శాతం తిరిగి అదే పరిశ్రమలోనో లేక ఇతర రంగాల్లోనో పెట్టుబడిగా పెట్టి, ఉత్పాదకతను పెంచి, ఆర్థికాభివృద్ధికి కారకులవుతారు.

అలా సంపాదించిన వారు రైతు కావచ్చు, వ్యాపారి కావచ్చు, గాయకుడు కావచ్చు, ఔత్సాహిక పారిశ్రామికవేత్త కావచ్చు, లేదా కొత్త టెక్నాలజీని కనిపెట్టిన మేధావి కావచ్చు. అటువంటి వారి ఉత్పాదకతను, సమాజానికందించిన సేవలను, వారి సంపాదనను చూసి గర్వించాలి కానీ, అదంతా ఎవరి అదనపు శ్రమనో దోచుకుంటే వచ్చిందనే వ్యర్థ, తప్పుడు సిద్ధాంతాల ముసుగులలో ఈర్ష్య పడకూడదు. అటువంటి వారిని చూసి స్ఫూర్తిని పొందాలి. తాము కూడా ఆలోచించి, కష్టపడి ఇతరులకు కావలసిందాన్ని ఉత్పత్తి చేసి డబ్బు సంపాదించాలనే ఆరాటం కలగాలి.

అంతేగానీ, సంపాదించిన వాడి దగ్గర్నుంచి ఏ కారణం చెప్పి, ఎలా దోచుకుని తిందామా అని ఆలోచించడం అనైతికం; మిగతా వారికి అదొక చెడు ఉదాహరణగా ఉంటుంది. అటువంటి ఆలోచనలను, భావాలను, ప్రోత్సహించే సిద్ధాంతాలు, భావజాలలు, రాజకీయాలను గుర్తించి; వాటికి దూరంగా ఉండడమే కాకుండా –వాటిని క్రియా శీలకంగా వ్యతిరేకించాలి. మనకెందుకులే అని ఉపేక్షిస్తే, మన ప్రమేయం లేకుండానే వాటి దుష్ప్రభావాలు మనకు కూడా చుట్టుకుంటాయి.

ఉత్పత్తులు, సేవలు అందించే వారందరూ – పత్తిత్తులు కారు. వారిలో చాలా మంది తమ పరిశ్రమలు, వ్యాపారాలకు పోటీ లేకుండా గుత్తాధిపత్యం చెలాయించి, తద్వారా విపరీతమైన లాభాలు గడించాలని ఎప్పుడూ ప్రయత్నిస్తూ ఉంటారు. అలా ప్రయత్నించడం మానవ సహజం. దీనికి రకరకాల ఎత్తులు వేస్తుంటారు. వారి కుయుక్తులలో అతి ముఖ్యమైన పాత్ర పోషించేది ప్రభుత్వం. ప్రభుత్వం అనడం కన్నా 'రాజ్యం' అనడం సముచితం. ఎందుకంటే ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఏ పార్టీ అధికారంలో ఉన్నా కొందరు బడా పారిశ్రామికవేత్తలు; రాజ్య వ్యవస్థల మధ్య – బిగుసుకుపోయి ఉన్న అవినాభావ సంబంధాలు చెడిపోవు. 1990కు పూర్వం లైసెన్స్, పర్మిట్, కోటా వ్యవస్థల ద్వారా ఈ బంధం నడిచేది.

ఆర్థిక సరళీకరణ తర్వాత కూడా రాజ్యం దగ్గర నిబంధనలు, నియంత్రణలు, ఆదాయపు పన్ను విభాగం, సెబి, రిజర్వు బ్యాంకు, ప్రభుత్వ బ్యాంకుల రూపంలో ఎన్నో సాధనాలున్నాయి. వాటి ద్వారా ఆశ్రిత పారిశ్రామికవేత్తల ప్రయోజనాలు కాపాడుతూ,

వారికి మార్కెట్లో నిజమైన పోటీ లేకుండా చూసుకుంటున్నారు. బాగా స్థిరపడిపోయిన కంపెనీలు మరిన్ని నియంత్రణల్ని ఆహ్వానిస్తాయి. సహజవనరుల మీద రాజ్యపు గుత్తాధిపత్యాన్ని కోరుకుంటాయి. ఎందుకంటే తద్వారా ఆ రంగంలోకి కొత్త పోటీదారుల ప్రవేశానికి అధిగమించలేవన్ని అడ్డంకులు సృష్టిస్తారు. ఔత్సాహిక యువ పారిశ్రామికవేత్తలు ప్రవేశించకుండా చూసుకోవడానికి – బ్యాంకులు రుణాలిచ్చే విధానాలను, అనుమతులిచ్చే ప్రక్రియలను కొత్త వారికి విసుగుపుట్టే స్థాయిలో తయారు చేయించుకుంటారు. టెక్నాలజీని దిగుమతి చేసుకోనివ్వరు. ఆహార వస్తువుల ఎగుమతులు నిషేధించి, ధరలను నియంత్రించి, రైతుల కష్టానికి స్వేచ్ఛా మార్కెట్ ధరలు దొరక్కుండా చేస్తారు.

కాబట్టి ఉత్పత్తిని గౌరవించాలే గానీ, అందరు ఉత్పత్తిదారులనూ బేషరుతుగా సమర్థించాలని కాదు. ఆశ్రిత పరిశ్రమలు, వ్యాపారాలను గుర్తించి, వాటిని ఎండగట్టాలి. వారికి రకరకాలుగా ఆశ్రయమిస్తున్న ప్రభుత్వాల విధానాలను బహిరంగపరచాలి. అంతే తప్ప, ఆశ్రిత వ్యాపారులను, వారు పొందే దుర్మార్గపు లాభాలను చూసి; అసలు ఉత్పత్తి వర్గాలనే అసహ్యించుకుని, వారిని నియంత్రించమని రాజ్యం మీద వత్తిడి తెచ్చే అమాయకత్వానికి గురికాకూడదు.

ప్రభుత్వ అండ లేకపోతే ఈ ఆశ్రితులు మార్కెట్లో ఒక్క రోజు కూడా నిలబడలేరన్న వాస్తవాన్ని గుర్తించాలి. కాబట్టి పారిశ్రామికవేత్తలకు రాయితీలిచ్చే ప్రభుత్వాలను, నియంత్రణ చట్టాలను, నియంత్రణ వ్యవస్థలను బలోపేతం చేసే ప్రభుత్వాలను, పార్టీలను తక్కున అనుమానించాలి. ఏ రాయితీలు, నిబంధనలు లేకుండా పరిశ్రమలను వాటి మానాన వాటిని వదిలేసే విధానాలను సమర్థించాలి, ప్రోత్సహించాలి. వాటి వల్ల కాలుష్యం రూపంలోనో, ఇంకే రకంగానో స్థానికులకు నష్టం జరిగితే స్థానిక న్యాయస్థానాల్లో పూర్తిస్థాయి పరిహారం పొందే విధంగా నష్టపరిహార చట్టాలు, త్వరగా తీర్పులిచ్చే కోర్టులు ఉండాలి.

పరిహారం చెల్లిస్తూ పోతే దివాళా తియ్యాల్సిన పరిస్థితులు ఏర్పడతాయనే భయముంటేనే పరిశ్రమలు జాగ్రత్తపడతాయి. అంతే తప్ప రెండు వేలు లంచం, దసరా మామూలు ఇచ్చి కాలుష్య మండలి తమ జోలికి రాకుండా చేసుకోగలమన్న నమ్మకమున్నంత వరకు; ఎన్ని నియంత్రణలున్నా కాలుష్యం ఆగదు. కాలుష్య మండలి ఇచ్చే సర్టిఫికెట్ కారణంగా – నష్టపోయిన స్థానికులకు కోర్టులోనూ పరిహారం దొరకదు.

ఇక పార్టీలు, నాయకుల విషయానికి వస్తే, వారిని అంచనా వెయ్యడం కూడా తేలికే. సాధారణంగా ప్రజలు, ముఖ్యంగా ఓటర్లు, రెండు రకాల మత్తు పదార్థాలకు అలవాటు పడతారు. ఒకటి – మతం లేదా కులం, రెండోది – సంక్షేమం. రెండూ ప్రమాదకరమైన

మత్తుమందులే. కానీ ఈ మత్తు పదార్థాలు వ్యసన కారకాలు కావు. మానవ సహజమైన మేధతో ఆలోచించి, వాటి స్వభావాన్ని గుర్తించిననాడు – తక్షణమే ఆ మత్తు నుంచి బయటపడే అవకాశం ఉంది. ఏ పార్టీ, ఏ నాయకుడు ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ మతాన్నో, కులాన్నో, ప్రాంతాన్నో అడ్డం పెట్టుకుని ఓట్లడుగుతాడో..., ఎవరు సంక్షేమ పథకాల వాగ్దానాలతో ముందుకొస్తారో...., ఆ మేరకు వారిని సమాజ ద్రోహులుగా చూడగలగాలి. మనుషుల్లో మంచి, చెడు, నైతికతలను బట్టి వారితో సంబంధాలేర్పరచుకోవాలి తప్ప – కులం, మతం, ప్రాంతం, చివరికి దేశం ఆధారంగా కాదు.

అలాగే, సంక్షేమ పథకాల పేరిట ఓట్ల కోసం వెదజల్లే డబ్బు రాజకీయ నాయకులు కష్టపడి రిక్షా తొక్కి సంపాదించింది కాదు. అది కష్టపడి సంపాదించిన ప్రజలను పోలీసు తుపాకులతో బెదిరించి పన్నుల పేరిట బలవంతంగా లాక్కున్న సొమ్ము. ఈ దోపిడీని ఆపాలంటే, ఎక్కువ సంక్షేమ పథకాలను ఎరగా చూపే పార్టీలను, నాయకులను ఓడించాలి. అంతేగాక, ఈ అవినీతిమయ, అసమర్థ ప్రభుత్వాలు పడేసే బిచ్చానికి ఎదురు చూడకుండా– ఎవరి కాళ్ళ మీద వాళ్ళు నిలబడడాన్ని ప్రోత్సహించాలి. అలా నిలబడాలంటే – ఆర్థిక అభివృద్ధికి అవకాశం కల్పించే స్వేచ్ఛాయుత ఆర్థిక విధానాలు కావాలి. వాటికి ప్రాధాన్య మిచ్చే పార్టీలను, నాయకులను ప్రోత్సహించడం ద్వారా రాజకీయాలకు దిశానిర్దేశం చెయ్యగలం. రాయితీలు కావాలని అడగడం మానేసి, పన్నులు తగ్గించాలని డిమాండు చెయ్యాలి. రంకెలు వేస్తూ, ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్న ఆంబోతులాంటి రాజ్య వ్యవస్థ పీచమణచాలంటే – పన్నుల ద్వారా దాన్ని మేపడం ఆపాలి. కనీసం తగ్గించాలి. ప్రభుత్వాలు మిలటరీ, పోలీసు, న్యాయవ్యవస్థల నిర్వహణకు మాత్రమే పరిమితమై, విమానయానం, గనులు, ఓడలు, పాలు, కరెంటు, పరిశ్రమలు, ఇత్యాది వృత్తులను ఔత్సాహిక రంగానికే వదిలేసేలా ప్రభుత్వాలపై వత్తిడి తేవాలి.

నిర్ణయాధికారాలు – ప్రధానమంత్రి, ముఖ్యమంత్రుల స్థాయి నుంచి క్రమంగా వ్యక్తి స్థాయికి వికేంద్రీకరణ జరగాలి. పన్నుల విధింపు, వసూళ్ళు చేసే అధికారం ఎంత స్థానిక స్థాయికి వెళితే, వ్యక్తికి అంత ఎక్కువ స్వేచ్ఛ, చొరవ దొరుకుతాయి. ఇవేవీ వాటంతట అవే జరిగిపోవు. మన ఆలోచనలు, విషయ పరిజ్ఞానం, విశ్లేషణా సామర్థ్యం పెరిగి, వాస్తవిక దృష్టితో, హేతుబద్ధ నిర్ణయాలు తీసుకున్నప్పుడే మంచి దిశగా మార్పు సాధ్యం. సమాజంలో కనీసం ఐదు శాతం మంది ప్రజలు అలా ఆలోచించగలిగితే, మార్పుకు సరిపడా చోదక శక్తి దొరుకుంది. ఎవరికి వారు – నాకెందుకులే అనుకుంటే రాష్ట్రం మరో బీహార్ అవుతుంది, దేశం – ఇంకో జింబాబ్వేలా తయారవుతుంది.

10-11-2013

రాచరిక ప్రజాస్వామ్యం

కాలం అనంతమైనది. అందులో మనిషి జీవితం కూడా అరవై-డెభ్భై ఏళ్ళ పాటు సాగుతుంది. తన జీవితకాలంలో తీసుకునే నిర్ణయాలు, తన తర్వాతే వచ్చే తరాల మీద ప్రభావం చూపుతాయి. తన పూర్వ తరాల నిర్ణయాలు, వాటి ప్రభావాలు, పర్యవసానాలను నిరంతరం విశ్లేషిస్తూ, జరిగిన తప్పులను సరిదిద్దాల్సిన బాధ్యత కూడా వర్తమాన మనిషి మీద ఉంటుంది. అట్టి బాధ్యతలను గుర్తించేవారు, నిర్వర్తించేవారు సమాజంలో కొద్దిమందే ఉంటారు. అందరూ ఉండరు. మెజారిటీ వ్యక్తులు అవసరం కొద్దీ కావచ్చు...; వ్యక్తిగత ప్రవృత్తి మేరకు కావచ్చు...; ఏ పూటకాపూట గడిచిపోతే చాలు, మిగతా విషయాలు మనకెందుకులే అనుకుంటూ గడిపేస్తారు. అటువంటి మెజారిటీ జన సామాన్యాల చేతుల్లో సమాన ఓటుహక్కు పెట్టడం వల్ల జరిగే అనర్థాలకు – వర్తమాన, భావితరాలన్నీ గురికావలసి వస్తున్నాయి. కాబట్టి ఈ విధానంపైన పునరాలోచించడం అవసరం.

చిన్న, పెద్ద రూపాల్లో వేలాది సంవత్సరాలు ప్రపంచవ్యాప్తంగా రాచరిక వ్యవస్థ రాజ్యమేలింది. ప్రజాస్వామ్య వ్యవస్థ వయసు కేవలం వందేళ్ళే. 1914లో మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభమయ్యే నాటికి అమెరికా, స్విట్జర్లాండు తప్ప ఇంకెక్కడా స్థిరమైన గణతంత్ర ప్రజాస్వామ్య వ్యవస్థ లేదు. మొదటి ప్రపంచ యుద్ధంలో – తనకు అవసరం లేకపోయినా అమెరికా అడుగుపెట్టడంతో ప్రపంచ రాజకీయ ముఖ చిత్రం మారిపోయింది. ఆస్ట్రియా – హంగరీ, టర్కీ, జర్మనీ (ప్రష్యా), రష్యా సామ్రాజ్యాలు కుప్పకూలిపోయి ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. మిగిలిన చిన్న చిన్న రాజ్యాలు కూడా క్రమేపీ ప్రజాస్వామ్య ప్రభుత్వాలకు దారివదిలి, రెండో ప్రపంచ యుద్ధానంతర కాలానికి అమెరికా కోరుకున్న, అమెరికా ప్రభావిత, అమెరికా ఆధారిత ప్రజాస్వామ్య ప్రభుత్వాలు అన్ని ఖండాల్లోనూ ఏర్పడ్డాయి. దీన్నుంచి తూర్పు యూరోపులో ఏర్పడ్డ కమ్యూనిస్టు ప్రభుత్వాలు మినహాయింపు.

గత వందేళ్ళలో అటు కమ్యూనిజం, ఇటు ప్రజాస్వామ్యం పేరుతో విస్తరిస్తున్న సోషలిస్టు ప్రభుత్వాల పనితీరు... ప్రజాజీవితం... నైతిక విలువల మీద – వాటి ప్రభావం విశ్లేషించు కోవలసిన అవసరముంది. ఇలాగే కొనసాగితే – భవిష్యత్తులో సమాజం కారు చీకట్లోకి ప్రయాణిస్తుందేమోననే భయాందోళనలను తేలిగ్గా కొట్టిపారేయలేం.

గెలిచిన వాళ్ళే చరిత్ర రాస్తారు. కాలక్రమేణా అందరితోనూ ఆ చరిత్రనే నమ్మిస్తారు. తాను ఆచరిస్తున్న ప్రజాస్వామ్య విలువలను, పాలనా విధానాలను ప్రపంచం మొత్తం మీద అమెరికా రుద్దుతోంది. మాకొద్దు మొర్రో అంటున్న మధ్యప్రాచ్య దేశాల్ని కూడా – "వింటే రాయబారం;" "లేకపోతే యుద్ధం" అన్న ప్రాతిపదికపై కబళిస్తోంది. ఈ రోజున అమెరికా ఆర్థిక, ఆయుధ శక్తి ముందు నిలబడగల దేశం ఏదీలేదు. ఈ ఆధిపత్యం ఎంతోకాలం కొనసాగకపోవచ్చు కానీ; ప్రస్తుతానికిదొక వాస్తవం. ప్రజాస్వామ్యం అంత గొప్ప వ్యవస్థ అయితే... ప్రపంచ వ్యాప్తంగా ఇన్ని సంక్షోభాలెందుకు? ప్రతి దేశంలోనూ ఇన్నిన్ని సమస్యలెందుకు? అసలు రాచరికం నుంచి ప్రజాస్వామ్యంలోకి మారడాన్ని అభ్యుదయం క్రింద చూడాలా? లేక అది తిరోగమనమా? ప్రజాస్వామ్యమనే ఆలోచనలోనే ఎక్కడో లోపం ఉందా? లేక కేవలం ఆచరణలోనే తప్పు జరిగిందా? ఈ పొరబాట్లను సహజమైనవిగా, తాత్కాలికమైనవిగా భావించాలా? లేక ప్రజాస్వామ్య విధానంలో వ్యవస్థీకృతంగా అంతర్లీనంగా ఉన్న లోపాలు కాలక్రమేణా దాన్ని డొల్ల చేస్తూ, త్వరలోనే కుప్పకూలుస్తాయా?

ఇటువంటి ప్రశ్నలను ఎదుర్కోవడానికి గానీ, ఇటువంటి చర్చనే అంగీకరించ డానికి గానీ ప్రజాస్వామ్య వాదులకు చాలా అసౌకర్యంగా ఉంటుంది. కానీ కేవలం వందేళ్ళ క్రితం రాచరిక వ్యవస్థ సమర్థకులు కూడా – రాచరికానికి ప్రత్యామ్నాయముందనే భావనలను సైతం దగ్గరికి రానిచ్చేవారు కాదు. ఈ చర్చ అవసరమని అనిపించడానికి కారణాలున్నాయి.

రాచరిక వ్యవస్థలో లిఖిత రాజ్యాంగాలుండేవి కావు. అలిఖిత, అప్రకటిత సహజ న్యాయ సూత్రాలు అమలులో ఉండేవి. సహజ న్యాయం, ధర్మాలు రాజు కంటే ముందు పుట్టినవని – రాజుతోపాటు ప్రజలు కూడా నమ్మేవారు. రాజులు కూడా వాటికి కట్టుబడి ఉండేవారు. అలా కాకుండా తనకిష్టమొచ్చిన న్యాయాన్ని అనుసరిస్తే – తన పీఠానికి, ప్రజలను పాలించే తన సార్వభౌమాధికారానికి ఎసరు వస్తుందని రాజులకు తెలుసు. అలా ఒక విధంగా అప్పటికే వాడుకలో ఉన్న న్యాయ, ధర్మాలను అమలు చేయడం వరకే రాజుల విధిగా ఉండేది. అంతే తప్ప కొత్త న్యాయాలను, చట్టాలను సృష్టించడం వాళ్ళ పని కాదు. ఇంకోవైపు ప్రజాస్వామ్య వ్యవస్థలలో దాదాపు అన్ని దేశాలకూ లిఖిత రాజ్యాంగాలున్నాయి.

అక్కడ రాజ్యం న్యాయాన్ని అమలు చెయ్యడమే కాక, న్యాయాన్ని, న్యాయ సూత్రాలను, చట్టాలను తయారుచేసే అధికారాలు కూడా దఖలు పర్చుకుంది. మొదట్లో సహజన్యాయ, ధర్మాలను గుర్తించినప్పటికీ; కాలక్రమేణా, ప్రజాస్వామ్య వ్యవస్థ నిర్మాణంలోనే ఇమిడి ఉన్న అంతర్గత చలన సూత్రాల కారణంగా – ఆ సహజ న్యాయ, ధర్మాలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. అమెరికా మొదలుకొని అన్ని దేశాల్లోనూ జరిగిందదే. దీని వల్ల న్యాయ, ధర్మాలకు స్థిరత్వం కోల్పోయి, ఏ రోజు ఏ కొత్త చట్టం ద్వారా మానవ సంబంధాలు, ఉత్పత్తి ప్రయత్నాలలో ఏది నిషేధించబడుతుందో, ఏది బలవంతాన రుద్దబడుతుందో తెలియని అనిశ్చిత పరిస్థితి సర్వదా నెలకొంటోంది. ఇది మనిషి నైతికత మీద, వ్యక్తిగత బాధ్యత మీద తీవ్రమైన దుష్ప్రభావం చూపుతోంది.

రాచరికాలు అంతరించి పోయేవరకు – డబ్బు (రూపాయి) విలువ బంగారం, వెండి లాంటి ద్రవ్యాలతో ముడిపడి ఉండేది. తమ కిష్టమైనట్లుగా రూపాయి విలువ మార్చే అధికారం గానీ, అవకాశం గానీ రాజులకు ఉండేది కాదు. రూపాయి విలువలను రాజులు, రాజ్యాలు నీరుకార్చకూడదనేది – వాడుకలో ఉన్న ప్రాచీన న్యాయం. దాన్ని, కొన్ని తాత్కాలిక తుగ్లక్ చేష్టలు మినహా, రాజులందరూ గౌరవించేవారు. రాచరికపు అంతం....; రూపాయి, డాలర్ లాంటి అన్ని కరెన్సీల పతనం దాదాపు ఒకేసారి జరిగాయి. మొదట ఇంగ్లండు, తర్వాత 1913లో అమెరికా ఫెడరల్ రిజర్వు బ్యాంకుల హయాంలో భాగహారిక (Fractional) రిజర్వు బ్యాంకింగ్ శకం మొదలైంది.

మొదట్లో పాక్షికంగాను, తర్వాత పూర్తిస్థాయిలోను రూపాయి, డాలర్ విలువలకు బంగారం లాంటి ద్రవ్యాలతో గల సంబంధాన్ని తుంచేశారు. ఇదంతా ప్రజాస్వామ్య వ్యవస్థలు రాసుకున్న రాజ్యాంగాలను తమకిష్టమొచ్చినట్లు వ్యాఖ్యానించు కోవడం ద్వారా, లేక సవరించుకోవడం ద్వారా సమర్థించుకున్నాయి. అలా, సంపద సృష్టితో సంబంధం లేకుండా గాల్లోంచి డబ్బును సృష్టించడం మొదలైంది. అలా సృష్టించిన డబ్బును ఆశ్రిత వర్గాలకు పంచడం సహజ న్యాయ, ధర్మాలకు విరుద్ధమైనా, రాజ్యాంగ బద్ధం కాబట్టి ఎవరూ వ్యతిరేకించే వీలు లేకుండా పోయింది. ఆశ్రిత వర్గాలు అత్యంత పేద ఓటర్లు కావచ్చు, అత్యంత ధనిక పారిశ్రామిక వేత్తలు కావచ్చు.

ఈ డబ్బు సృష్టి వల్ల అసలు జరిగేదేమిటంటే, అనాశ్రిత ప్రజలు కష్టపడి సంపాదించి, దాచుకున్న లేక పెట్టుబడి పెట్టిన డబ్బు, సంపదల విలువ తగ్గిపోతుంది. ఇది కష్టజీవుల ప్రమేయం లేకుండా, వాళ్ళకసలు తెలియనే తెలియకుండా జరిగిపోతుంది. కొత్త ద్రవ్యరహిత రిజర్వుబ్యాంకింగ్ ప్రారంభమైనప్పట్నుంచి రూపాయి, డాలర్ విలువలు కొన్ని వందల భాగానికి పడిపోయాయి. ఇంతటి దుర్మార్గాన్ని తనలో ఇముడ్చుకున్న ప్రజాస్వామ్య వ్యవస్థను ప్రశ్నించాలా? వద్దా?

ఇక పన్నుల వడ్డింపు విషయానికొస్తే; రాచరిక కాలంలో మొత్తం పన్నులు దేశ ఉత్పత్తి, ఆదాయాల్లో రెండునుంచి నాలుగు శాతం మాత్రమే ఉండేవి. దాంతోనే రాజరిక వ్యవస్థ హంగు, ఆర్భాటాలు. కొద్దిపాటి సైన్యం మాత్రమే నడిపేవారు. పన్నులు పెంచాలంటే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందని భయపడేవారు. ప్రజలు కూడా పన్నుల పెంపును నిరసించేవారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో పన్నుల విధింపునకు అడ్డు, అదుపే లేదు. ప్రజలు కూడా 'మనకు మనమే రాజులం, మనం ఎన్నుకున్న ప్రభుత్వమే కదా విధించేది' అని పన్నులను నిరసించే హక్కును, చొరవను కోల్పోయారు. దాంతో క్రమేణా పెరుగుతూ.... నేటికి దేశ ఉత్పత్తిలో దాదాపు సగ భాగం, అంటే యాభై శాతం వరకు వివిధ పన్నుల రూపంలో రాజ్యం లాగేసుకుంటోంది. దీనికి అమెరికా, స్వీడన్, మనదేశం ఏవీ అతీతం కాదు. అంటే ఇప్పటికే యాభై శాతం సోషలిజంలో ఉన్నాం. ఈ శాతం పెరిగేదే తప్ప తగ్గేది కాదు. అంటే మొదట ప్రజాస్వామ్యమనుకున్నది – క్రమేపీ, అమెరికాతో సహా, సోషలిజంలోకి రూపాంతరం చెందుతోంది. ప్రపంచం కోరుకున్నది ఇదేనా?

ఇంకా వివిధ అంశాలను పోల్చుకుంటూ పోతే – రాచరిక వ్యవస్థతో పోల్చి చూసినప్పుడు ప్రజాస్వామ్య వ్యవస్థ సమాజానికేమీ హితం చేసినట్లు కనబడడం లేదు. కాని, ఈ విశ్లేషణ తాత్పర్యం – రాచరిక వ్యవస్థను సమర్థించడం ఎంతమాత్రం కానేకాదు. రాచరికం నుంచి మారి మనం అనుసరిస్తున్న ప్రజాస్వామ్యం అసలు అభ్యుదయమా, లేక తిరోగమనమా అన్న చర్చ లేవదీయడమే ముఖ్య ఉద్దేశం. పోనీ ప్రజాస్వామ్యం ఇలా కాకుండా ఇంకొంచెం మెరుగ్గా ఉండే వెరైటీలేమన్నా ఉన్నాయా? ఆ రోజుల్లో– ప్రజాస్వామ్యం ఎంచుకోవడం తప్ప; ప్రపంచ దేశాలకు ఇతర ఆప్షన్లు ఏవైనా ఉన్నాయా?

నిజాములు, మొగలాయిలు, విజయనగర సామ్రాజ్యాల వంటి రాజ్యాల విధివిధానాలను తరచి చూడాల్సిన అవసరం లేకుండా; సిద్ధాంత పరంగా, కేవలం సైద్ధాంతిక, తర్క స్థాయిలో రాచరికాన్ని, ప్రజాస్వామ్యాన్ని పోల్చి చూసి ఎందులో ఏది మంచి, ఏది చెడు అనేది నిర్ధారించుకోవడం సాధ్యం, అవసరం కూడా. ఇప్పటికైనా సరైన విశ్లేషణ, అవగాహనల ద్వారా ప్రజాస్వామ్యాన్ని ప్రక్షాళన చేయడమో, లేక దాన్ని త్యజించి, ఇంకో కొత్త వ్యవస్థను నిర్మించుకోవడమో విజ్ఞుల లక్ష్యం కావాలి.

24-11-2013

అనాగరీకరణ

తెలుగు రాష్ట్రం, తెలుగు ప్రజలు (ప్రస్తుతానికి) రెండు ముక్కలవుతున్న ఈ సమయంలో సిద్ధాంత రాద్ధాంతాలు అప్రస్తుతమనిపించవచ్చు. కానీ, భారత ప్రభుత్వం, కాంగ్రెస్, బీజేపీ లాంటి జాతీయ పార్టీలు ఆలోచించే తీరును అర్థం చేసుకోవాలన్నా; ఇకముందు ఎలా ప్రవర్తిస్తాయో అంచనా వెయ్యాలన్నా - మనం ఏరికోరి నడుపు కుంటున్న గణతంత్ర ప్రజాస్వామ్య వ్యవస్థ స్వభావం గురించిన అవగాహన అవసరం. నాయకులమని చెప్పుకుంటున్న వారిలో నైతికత, దార్శనికత క్రమేణా లోపించడం, చెప్పేదొకటి, చెయ్యదలుచుకుంది వేరొకటి, అనైతికత, భ్రష్టత్వం ప్రజల్లో కూడా వ్యాపించడం - ఇవన్నీ వాటంతట అవి జరగలేదు. ఈ పరిణామాలకు, మన రాజకీయ వ్యవస్థకు అవినాభావ సంబంధం ఉంది. ఆ సంబంధాన్ని స్పష్టంగా చూడగలిగినప్పుడే పరిష్కారాలు స్ఫురిస్తాయి.

తక్షణ అవసరాలకు మించి సంపాదించడం; ఆ మిగిలిందాన్ని పొదుపు చేసి, పెట్టుబడి పెట్టి, భవిష్యత్తులో ఇంకా ఎక్కువ పొందగోరడం - అనే ప్రక్రియే నాగరికతకు మూలం. కొద్దికాలం తర్వాత ఎక్కువ ఫలితం వస్తుందనుకుంటే మాత్రమే మనిషి ప్రస్తుత వినియోగాన్ని మానుకోవడానికి సిద్ధపడతాడు. ఉదాహరణకు బంగాళదుంపను భూమిలో పాతేస్తే - సంవత్సరానికి పది దుంపలవుతాయనే ఆశతోనే ఈ రోజు దాన్ని తినడం మానుకుంటాడు. సంవత్సరం తర్వాత కూడా ఒకటే దుంపగా ఉండి పోతుందంటే, ఇదంతా ఎందుకు అని, ఇవాళే ఆరగిస్తాడు. ఎవరు, ఎంతకాలానికి, ఎంత ఎక్కువ ఫలితం ఆశించి, ఎంత మేరకు పొట్టకట్టుకోవడానికి సిద్ధపడతారనేది మనిషి మనిషికీ మారుతుంది. గుర్తించాల్సిందేమంటే, ఆ నిర్ణయాలకు, దేశ, కాలమాన పరిస్థితులకు ఖచ్చితమైన సంబంధం ఉంది.

సంపాదించిన దాంట్లో ఎంత తినాలి, ఎంత దాయాలి, ఏ రంగంలో ఎంత

పెట్టుబడి పెట్టాలనేది చాలా అంశాల మీద ఆధారపడుతుంది. వరదో, ఉప్పెనో, ప్రమాదకరమైన ప్రభుత్వమో, యుద్ధమో వస్తుందనుకుంటే పొదుపు ఎక్కువ చేస్తారు. చిన్న పిల్లలకు పొదుపు, భవిష్యత్ ఫలితాలమీద అవగాహన ఉండదు గనుక తక్షణ వినియోగం కోసం మారాం చేస్తారు. పరిణతి చెందిన మధ్య వయస్కులు ఎక్కువ పొదుపు చేస్తారు. మరికొందరు – వ్యక్తిగత స్వభావ రీత్యా రేపటి గురించి ఆలోచించకుండా సంపాదించినదాన్ని ఏ రోజుకారోజు అవజేస్తారు. అటువంటి స్వభావం మరింత తీవ్రమయితే, జులాయిలుగా, తాగుబోతులుగా పతనమవుతారు. సమాజం ఇటువంటి వ్యక్తులందరి సమాహారం. అందరి మీద కలుపుకుని ఎంతో కొంత మిగిల్చిన ధనంతోనే – టెక్నాలజీ, ఉత్పత్తి, కళలు–ఇవన్నీ సాధ్యపడ్డాయి. మన పూర్వీకుల త్యాగాల వల్లే – ఇక్కడి దాకా వచ్చాం.

ఇదంతా ఎందుకంటే, నాగరికత ఎంత వేగంగా ముందుకెళ్తుందో, లేదా ఆగిపోతుందో; లేక తిరోగమనబాట పడుతుందో అనేది సమాజ నిర్మాణం, ప్రభుత్వ స్వభావాలమీద ఆధారపడి ఉంటుంది. ప్రభుత్వాల పనితీరు, విధానాలను బట్టి ఫలితాలు మారుతుంటాయి. సంపాదన, పొదుపు, పెట్టుబడి, క్రయవిక్రయాల ద్వారా నాగరికత అభివృద్ధి చెందుతుంది. దాని పరుగుకు అడ్డుపడే బంధనాలు రెండు రకాలు. ఒకటి – దొంగలు దోచుకుపోవడం, రెండోది ప్రభుత్వాలు దోచుకోవడం.

దొంగలయితే ఎప్పుడో ఒకసారే తప్ప – రోజూ మీద పడరు. తాను అన్యాయంగా దోచుకున్నాననే స్పృహ దొంగకు కూడా ఉంటుంది. ఒకసారి దెబ్బతిన్నాక, తగు జాగ్రత్తలు పాటించినా లేక ఆత్మరక్షణకు ఏర్పాట్లు చేసుకున్నా మళ్ళీ మళ్ళీ దొంగల బారినపడడం.

కానీ, ప్రభుత్వం అలా కాదు. దర్జాగా, అధికారికంగా దోచుకుంటుంది. అది అప్రతిహతంగా సాగుతుంది. దాన్నుంచి విముక్తి లేదు, తప్పించుకునే దారిలేదు. ఆ దోపిడీని ప్రతిఘటిస్తే, మనల్నే నేరస్థుల్ని చేసి జైల్లో పెడుతుంది. తాను చేసే దోపిడీని పన్నులని, ప్రజోపయోగమైన నిబంధనలని తన చర్యలను తాను సమర్థించుకుంటుంది. ఆ వివరాలను సాధారణ ప్రజలేకాక, దోపిడీకి గురైన బాధితులు కూడా నమ్ముతారు. వ్యక్తులు తమ సంపాదన, వినియోగం, పొదుపు, భవిష్యత్ ప్రణాళికల విషయాల్లో తీసుకునే నిర్ణయాల మీద ప్రభుత్వాల వ్యవస్థీకృత దోపిడీ ప్రభావం బయటకు కనపడకపోయినా, మాటల్లో వ్యక్తీకరించకపోయినా, ఈ దోపిడీ ప్రభావం తప్పకుండా ఉంటుంది.

రాచరికం, ప్రజాస్వామ్యం ఈ రెండు రకాల ప్రభుత్వాల ఆలోచనా తీరు, ప్రణాళికా కాలపరిధులు చాలా విభిన్నంగా ఉంటాయి. అందుచేత వాటి ప్రభావం నాగరికత పురోగమనం మీద వేర్వేరుగా ఉంటుంది. రాజరికంలో రాజుకు రాజ్యం మీద యాజమాన్య హక్కులుంటాయి. దాన్ని తన ప్రైవేటు ఆస్తిగా పరిగణిస్తాడు. దాని సంపద, విలువ

పెరిగితే అది తనకు, తన వారసులకు మంచిదనుకుంటాడు. అందుచేత, తన తక్షణ వినియోగానికి – పన్నుల దోపిడీ చేస్తూనే; రాజ్యంలో సంపద పెరగాలనుకుంటాడు. ఒక దీర్ఘకాలిక వ్యూహంతో వ్యవహరిస్తాడు. యుద్ధాల ద్వారానో, వివాహ సంబంధాల ద్వారానో తన రాజ్యాన్ని విస్తరించు కోవడానికి ప్రయత్నిస్తాడు. ఆ యుద్ధాలు – రాజుగారి సొంత వ్యవహారంగా పరిగణించి; సాధారణ ప్రజలు వాటిలో భాగస్వాములు కారు. తన కొచ్చిన పన్నుల డబ్బులోంచి సైన్యాన్ని నడుపుకుంటాడు. అందుకే సైన్యాలు చిన్నవిగా ఉండి, ప్రాంతాల కోసం చేసే యుద్ధాలు పరిమిత స్థాయిలో ఉండేవి. రాజరికంలోకి ఎవరికి పడితే వారికి ప్రవేశం ఉండదు గనుక, బయట ఉండి పన్నులు కట్టే ప్రజలు వర్గ స్పృహ, చైతన్యం కలిగి; రాజులు చేసే ప్రతి పనిని, వేసే ప్రతి పన్నును విమర్శనాత్మకంగా గమనించే – వారు.

ఇన్ని కారణాల వల్ల – రాజరికంలో దోపిడీ పరిమితి స్థాయిలో ఉంటుంది.

'ప్రజా ప్రభుత్వాల'ని పిలిచే ప్రజాస్వామ్యంలో ఈ పరిమితులేవీ ఉండవు. ప్రభుత్వాధి నేతలు రాజ్యాన్ని కొంతకాలం వరకు ఏలవచ్చు, ఇష్టమొచ్చినట్టు ఉపయోగించు కోవచ్చు గానీ, యాజమాన్య హక్కులుండవు. కాబట్టి వారికి సంపద సృష్టి ముఖ్యం కాదు, రాబడి ముఖ్యం. తాముండే ఐదేళ్ళలో సంపదను కరిగించైనా సరే, ఎంత దొరికితే అంత దోచుకోవడం మీదే దృష్టి సారిస్తారు. ప్రజల్లో కూడా వర్గ చైతన్యం నశిస్తుంది. తాము కూడా ప్రభుత్వాధినేత కావచ్చు గదా అనే భ్రమలో, వచ్చే ఎన్నికలలో మార్చేద్దాంలే అనే నైరాశ్యంలో, తాను నిరంతరం ఇంకా ఇంకా పెచ్చు స్థాయిలో దోపిడీకి గురవుతున్నామన్న వాస్తవాన్ని విస్మరిస్తారు. ప్రతిఘటనాశక్తి క్షీణిస్తుంది. పన్నులు పెరుగుతాయి, ద్రవ్యోల్బణం వల్ల తన సంపాదనకు విలువ పడిపోతుంది. ప్రభుత్వం పరిమాణం పెరిగిపోతుంటుంది. ప్రభుత్వ సేవల ఖరీదు పెరుగుతుంది, నాణ్యత తగ్గుతుంది. ప్రభుత్వ 'రాబడి'కి పరిమితులుండవు. ఇంకా చాలకపోతే ప్రజల డబ్బును 'అప్పు' రూపంలో లాగేసుకుంటారు. భవిష్యత్‌లో (మరింత ద్రవ్యోల్బణం వల్ల) విలువ తగ్గిన రూపాయిల్లో చెల్లిస్తారు. అది కూడా వచ్చే ప్రభుత్వం చూసుకుంటుంది.

తాను వ్యక్తిగతంగా బాధ్యత పడాల్సిన అవసరం లేనపుడు అప్పు తీసుకోవడానికి (అదీ బలవంతంగా) ఎవరైనా వెరుస్తారా? అత్యంత ప్రాథమికం, ప్రాచీనం, సహజం అయిన ఆస్తి హక్కును తృణప్రాయంగా తీసి పక్కన పడేస్తారు. కృత్రిమాలయిన – విద్యా హక్కు, ఆహార హక్కు, వైద్య హక్కు, ఉద్యోగ హక్కులు ముఖ్యమవుతాయి.

ప్రజల ధన, మాన, ప్రాణాలను కాపాడ్డం మానేసి, ఒకరు సంపాదించింది ఇంకొకరికి పంచి పెట్టడమే ముఖ్య కార్యక్రమవుతుంది. యుద్ధాల్లో సమస్త ప్రజలు

పాలుపంచుకోవాల్సి రావడం, అంతులేని ఖర్చు, రక్తపాతం జరుగుతాయి. జాతీయవాదం రగిల్చి, యువకులను బలవంతంగా సైన్యంలో చేర్చుకుని, యుద్ధంలో – ఏదో ఒక పక్షం సర్వనాశనమయ్యే దాకా ఆగరు.

వీటన్నిటి వల్లా, ప్రజాస్వామ్య ప్రభుత్వాల పాలనలో అనిశ్చితి, అభద్రత చాలా ఎక్కువ స్థాయిలో ఉంటాయి. ఏ కొత్త పన్నులు విధిస్తారో తెలియదు. ఎంత కృత్రిమ డబ్బును ముద్రించి, సంపాదించిన దాని విలువ ఎంత మేర తగ్గిస్తారో తెలియదు. ఎప్పుడే నిబంధనలు కొత్తగా పెడతారో తెలియదు. దాంతో కష్టపడాలి, సంపాదించాలనే తపన తగ్గి, పొదుపు చేసే లక్షణాలు క్షీణించి, ఎంత దొరికితే అంత వాడేసుకునే స్వభావం ఎక్కువతుంది. ప్రభుత్వం విసిరే సంక్షేమ వలలో చిక్కుకుని, వ్యక్తిగత బాధ్యతమరచిపోయి, జులాయితనం, వ్యసనాలు, అమర్యాదకర ప్రవర్తన, విశృంఖలత్వం, తెచ్చిపెట్టుకున్న తిరుగుబాటు ధోరణి అలవడతాయి. ఇది నాగరికత పురోగమనాన్ని దెబ్బతీయడమే కాక, క్రమేపీ అనాగరీకరణకు దారితీస్తుంది. ఈ అనాగరీకరణ సరళి – రాజరికాలకంటే, ప్రజాస్వామ్య సమాజాల్లోనే మరింత వేగంగా సాగుతుంది.

ఈ విశ్లేషణ కేవలం పోలిక కోసం, సమస్య స్వభావాన్ని అర్థం చేసుకోవడానికే తప్ప; తిరిగి రాచరికంలోకి పోదామని సిఫారసు చేయడానికి కాదు. ప్రజాస్వామ్యమనే విత్తులో ఉన్న జన్యులోపాలను గుర్తించగలిగితేనే, అటువంటి లోపాలు లేని కొత్త విత్తనాన్ని నాటగలం. మరింత విశ్లేషణ తర్వాత – ఆ ఆవకాశాలను పరిశీలిద్దాం.

రాష్ట్ర ప్రజల విభజనలో ప్రదర్శిస్తున్న లెక్కలేనితనం, తొందరపాటులను అర్థం చేసుకోవాలంటే; ప్రజాస్వామ్య వ్యవస్థలో పార్టీల స్వభావం, అవి చూపే హ్రస్య దృష్టి, తాత్కాలిక ప్రయోజనాల కోసం పడే తాపత్రయం – క్షుణ్ణంగా అర్థం కావాలి. ప్రజాస్వామ్య వ్యవస్థలు ఇంతకన్నా మరీ మెరుగ్గా ఉండే అవకాశం లేదు. అదే జన్యు స్వభావం గల రాష్ట్రపతి, రాజ్యాంగం, సుప్రీంకోర్టు లాంటి వ్యవస్థలు ఈ విపరీత బుద్ధులకు కళ్ళెం వేస్తాయనుకోవడం కేవలం భ్రమ. ఒకే ఒక అవకాశం ఉంది. అంతే హ్రస్య దృష్టిగల ఇతర ముఖ్య ఆటగాళ్ళు – తమ పాచికలను తెలివిగా వాడితే తాత్కాలిక ఉపశమనం దొరకొచ్చు. ఈ ఆటలో నైతికత కోసం వెతుక్కోవడం అమాయకత్వం అవుతుంది. రాష్ట్రం, భాష, భవిష్యత్తు అని ఒకవైపు, ఆస్థిత్వం, ఆత్మగౌరవం అని మరోవైపు మనం వెంపర్లాడుతుంటే; వచ్చే ఐదేళ్ళ అధికారం, 'రాబడి' గురించి వాళ్ళు ఆలోచిస్తున్నారు. అలా మాత్రమే వాళ్ళు ఆలోచించగలరు.

08-12-2013

గుత్తాధికారాలతోనే చేటు

చరిత్రను నిర్మించేవి, నాగరికతను నడిపించేవి- ఆలోచనలు, భావాలు, భావజాలాలు. అంటే ఐడియాలు. అంతేగాని రాజులో, ప్రభుత్వాలో, ఒకరిద్దరు నాయకులో కాదు. ఆ ఐడియాలు మంచివి కావచ్చు, కాకపోవచ్చు. కమ్యూనిజం మంచి ఐడియా కాదని చరిత్రే రుజువు చేసింది. ప్రజాస్వామ్యం మంచి ఐడియా అవునో కాదో ఇంకా ప్రశ్నార్థకంగానే ఉంది. ఆ ప్రశ్నలు, సందేహం, అసంతృప్తి, అసహనం నుంచి పుట్టుకొచ్చిందే అన్నా హజారే ఉద్యమం.

ఆ ఉద్యమ కార్యకర్తలు ఏర్పరిచిన ఆమ్ ఆద్మీ పార్టీ ఇప్పుడో చర్చనీయాంశమైంది. ప్రస్తుతమున్న వ్యవస్థమీద పేరుకుపోయిన అసంతృప్తి నుంచి పుట్టిందే తప్ప, లోతైన ఆలోచనల్లోంచి రాలేదు. మనం చూసిన ప్రజారాజ్యం, లోక్‌సత్తాల్లాగా అదీ ఇంకో పార్టీగానే మిగిలిపోతుంది. ఈ పార్టీలు పెట్టినవారి చిత్తశుద్ధి ఇక్కడసలు చర్చనీయాంశం కానే కాదు. సమాజ నిర్మాణం, ప్రభుత్వ పాత్రల పట్ల వారి భావజాలాల్లో ఇతర పార్టీలతో పోలిస్తే ఏమాత్రం తేడా లేదు. నాయకుల వ్యక్తిగత నడవడికలో తేడాలుండొచ్చు గాక, ఫలితం మాత్రం మారదు. కేజ్రీవాల్ ఢిల్లీ ఎన్నికల సందర్భంగా విడుదల చేసిన మేనిఫెస్టోను చూస్తే ఈ విషయం చిటికెలో అర్థమవుతుంది.

ఢిల్లీలోని ప్రతి కుటుంబానికీ 700 లీటర్ల తాగునీరు ఉచితంగా సరఫరా చేస్తారట. విద్యుత్ బిల్లులు యాభై శాతం తగ్గిస్తారట. మురికివాడల్లో నివసించే వారందరికీ పక్కా ఇళ్ళు కట్టిస్తారట. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు స్కూళ్ళతో సమానమయ్యేలా అభివృద్ధి చేస్తారట. ప్రభుత్వం వెచ్చించే అభివృద్ధి నిధులు సరిగ్గా ఖర్చు పెట్టేలా వాడ కమిటీలు ఏర్పాటు చేసి వికేంద్రీకరిస్తారట. ఈ హామీల అమలు కోసమే అయితే – కొత్తగా ఇంకో పార్టీ ఎందుకు? కాంగ్రెస్ పార్టీ డెబ్భై ఏళ్ళుగా ఇంతకన్నా వినసొంపైన హామీలిస్తోంది కదా!. బీజేపీలో కూడా అందమైన మేనిఫెస్టోలు రాసేవాళ్లు చాలమంది ఉన్నారు. అసలు

ప్రశ్నేమిటంటే; ఉచిత తాగునీరు, సగం ధరకు కరెంటు ఎవరి డబ్బులతో ఇస్తారు? ప్రజల డబ్బుతోనేగా?

అంటే ఆమ్ ఆద్మీ జేబులకేగా చిల్లు?! ఉచితంగాను, సబ్సిడీతోను ఇచ్చే వస్తువులు అనవసర వినియోగంతో వృధా అవుతాయని, కొరతలు ఏర్పడతాయని ఇన్‌కంటాక్స్ ఆఫీసరుగా పనిచేసిన కేజ్రీవాల్‌కు తెలియదూ? కట్టించిన పక్కా ఇళ్ళను అద్దెకిచ్చుకుని ఇంకో మురికి వాడ ఏర్పరచుకోవడం బొంబాయిలోను, ఇతర పట్టణాల్లోనూ అనుభవం కాలేదూ? ప్రభుత్వ పాఠశాలలు అంతగా అభివృద్ధి చెందితే ఇక ప్రైవేటు స్కూళ్ళెందుకుంటాయి? అదే నినాదంతో ఇప్పటికి ఎన్నో వేల కోట్లు తగలేయడం చూడలేదూ? వాడ కమిటీలు సరే, అసలు ఏ వాడలో ఎంత, ఏ పనికి ఖర్చుపెట్టాలో నిర్ణయించేది కేంద్రీకృతంగా కేజ్రీవాల్ కాదూ? వికేంద్రీకరణ నిజంగా చెయ్యాలనుకుంటే ఏ వాడలో ఖర్చు పెట్టాల్సింది ఆ వాడలోని ప్రజల నుంచే వసూలు చెయ్యగలరా?

అబ్బే, పన్నుల పెంపు, వసూళ్ళు మాత్రం ఆమ్ ఆద్మీ ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా కేంద్రీకృతంగానే జరుపుతారు! కాబట్టి, పై పూతల మెరుగులు మినహా వారికీ..., ఇతర పార్టీలకు తేడా ఏమీ లేదు.

పరిణతి చెందిన ఇద్దరు వ్యక్తులు ఇష్టపూర్వకంగా చేసుకున్న ఆర్థిక ఒప్పందాలు, శారీరక సంబంధాలలో ప్రభుత్వం జోక్యం చేసుకుంటే కలిగే దుష్పరిణామాలకు ఇటీవల జరిగిన సంఘటనలు ఉదాహరణలు. మొదటిది రాయబార కార్యనిర్వహణ ఉద్యోగిని దేవయాని ఉదంతం.

ఆమె ఇంట్లో ఫలానా జీత భత్యాలకు పనిమనిషిగా ఉండడానికి ఒప్పుకున్నావిడకు తాము నిర్దేశించిన కనీస వేతనం ఇవ్వట్లేదని కేసు పెట్టడానికి అమెరికా ప్రభుత్వానికేం సంబంధం? అరెస్టు, సంకెళ్ళు, శారీరక తనిఖీ – ఇదంతా దేనికి? అసలు చట్టమే ఇంత పనికిమాలింది, దుర్మార్గమైనదైనప్పుడు – దాన్ని ఎంత తు.చ తప్పకుండా పాటించినా ఎవరికి ఉపయోగం? చివరకు ఫలితమేమిటి?

అమెరికా నిర్దేశించిన కనీస వేతనం పనిమనుషులకు చెల్లించడం ఎవరితరమూ కాదు. దాంతో నెలకు ముప్పైవేల జీతం, భోజనం, వసతి, ప్రయాణ ఖర్చులు ఇస్తే..., పనిమనిషి ఉద్యోగాలు వందల కొద్దీ ఖాళీగా ఉండిపోతాయి.

ఎవరిని ఉద్ధరించినట్లు? కనీస వేతన చట్టాల ఫలితాలు ఎప్పుడైనా ఇంతే. అవి నిరుద్యోగాన్ని మరింతగా పెంచుతాయి. అమెరికాలో పెరిగిపోతున్న నిరుద్యోగానికి కారణమిదే. రెండో ఉదాహరణ – స్వలింగ సంపర్కం నేరంగా పరిగణించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు. ఇద్దరు వ్యక్తులు ఇష్టపడి – వేరెవరికీ నష్టం కలగని సంబంధం ఏర్పరచుకుంటే అది ఏ ధర్మం, నైతికతల ప్రకారం నేరం అవుతుంది? కులాంతర, మతాంతర వివాహాలను ప్రోత్సహించే మన అభ్యుదయం – అక్కడితోనే ఆగిపోయిందా? పోలీసుల, నిర్వాహకుల

దోపిడీ లేనప్పుడు – వేశ్యావృత్తి, జూదమాడడం కూడా నేరాలుగా చూడాల్సిన అవసరం లేదు. వాటిని నేరాలుగా పరిగణించకపోతే – అందులో దోపిడీయే ఉండదు.

ఇన్ని పనికిమాలిన చట్టాలు, వాటిని అమలు చెయ్యడానికి ప్రజల నుంచి డబ్బు వసూలు చేసి ఇంత పెద్ద పోలీసు, పరిపాలనా యంత్రాంగం ఏర్పాటు చేయ్యడం, దీనికి దారి, తెన్నూ, అంతూ పొంతూ లేకుండా పోతుండడానికి కారణమేంటి? హేతుబద్ధత, ధర్మనిరతి లేకుండా చట్టాలు చేసి; వాటిని అమలుచేసే గుత్త అధికారం ప్రభుత్వాల చేతిలో పెట్టడమే – దానికి కారణం. ఇదంతా ఎలా జరిగింది?

ప్రకృతి రీత్యా, సహజ సిద్ధంగా మనుషుల పనితనంలో.... బుద్ధి కుశలతలో తేడాలుంటాయి. అందరూ ఒకేలా పుట్టరు... పెరగరు... ఆలోచించరు. ఈ సహజమైన తేడాలే కొందరిని సైంటిస్టులుగా, కొందరిని మంచి రైతులుగా, కొందరిని రచయితలుగా తయారుచేస్తాయి. ఎవరి ఊరికి వారు పరిమితమైన రోజుల్లో, ఈ తెల్ల ఏనుగు ప్రభుత్వాలు పాతుకుపోని పాతకాలంలో; స్థానికుల్లోని కొందరు పెద్దమనుషులుగా గుర్తించబడేవారు. వారి విజ్ఞతను, దక్షతను, ఉత్పాదకతను, ధర్మ ప్రవర్తనలను బట్టి వారిని గౌరవించేవారు. ప్రపంచవ్యాప్తంగా ఈ సంప్రదాయం ఉండేది. దీనికి కులంతో కూడా సంబంధం లేదు. పల్లెల్లో పుట్టి పెరిగిన వారికి – ఈ మధ్య కాలం వరకు ఇది పరిచయమే. స్థానికులు చిన్న చిన్న తగాదాలు తీర్చడానికి, సలహాలకు అటువంటి పెద్దమనుషుల దగ్గరకు స్వచ్ఛందంగా వెళ్ళేవారు. ఆ పెద్దమనుషులు కూడా డబ్బు పుచ్చుకోకుండా, ఏమీ ఆశించకుండా న్యాయం చెప్పేవారు. ఆ తీర్పులు కూడా స్వచ్ఛందంగా, ఎలాంటి వత్తిడి లేకుండా అమలయ్యేవి. సహజ న్యాయ సూత్రాలే ఆ తీర్పులకు ప్రాతిపదికయ్యేవి.

అలా ఎక్కడికక్కడ స్థానికంగా, చౌకగా అందరూ స్వచ్ఛందంగా అంగీకరించిన ధర్మం ప్రకారం న్యాయం దొరికేది. ఇష్టం లేని వాళ్ళు ఊరొదిలి పక్క ఊరికో, సంస్థానానికో వెళ్ళిపోయేవారు. ఈ కులీనులను కట్టడిచేస్తూ, వాళ్ళందరి మీదా సార్వభౌమత్యం వెలగబెట్టే రాజులు వచ్చారు. తనదంటూ గిరిగీసుకున్న రాజ్యంలో న్యాయ పరిపాలనంతా తన గుత్తాధిపత్యంలో పెట్టుకున్నారు. గుత్తాధిపత్యానికుండే అవలక్షణాలన్నీ రాజులకూ అబ్బినాయి. తన తీర్పులకు ఎదురులేక పోవడం, పన్నులు విధించే విశేషాధికారం, వీటన్నిటితో రాజుల్లో నైతిక పతనం మొదలైంది. యుద్ధాలు, వివాహ సంబంధాల ద్వారా రాజ్యాల విస్తీర్ణం పెరిగేకొద్దీ అధికార కేంద్రీకరణ, న్యాయ వ్యవహారాల్లో ఖర్చు ఎక్కువ, నాణ్యత తక్కువైంది. తప్పు రాజులది కాదు, గుత్తాధిపత్యానిది. గుత్తాధిపత్యం ఉన్న రాజు మంచివాడైనా, వ్యవస్థ మంచిదైపోదు.

ఈ మర్మం తెలియని ప్రజలు (ఆమ్ ఆద్మీ పార్టీని ఆకాశానికెత్తింది అటువంటి ప్రజలే) భ్రష్టుడైన రాజు వ్యక్తిత్వం, రాజరికం వల్లే వ్యవస్థ చెడిపోయిందనుకున్నారు. రాజు స్థానంలో ప్రజలెన్నుకున్న ప్రభుత్వాన్ని కూర్చోబెట్టారు. రాజులు అనుభవించిన

గుత్తాధికారాలన్నీ ఈ 'ప్రజా' ప్రభుత్వాలకు కట్టబెట్టారు. ఫలితం తెలిసిందే.

ఇంతకు ముందు పరిమిత సంఖ్యలో ఉన్న రాజు, అతని అనుచర, బంధుగణంతో పోలిస్తే – కొన్ని వందల రెట్ల మంది రాజకీయ నాయకులుగా, ప్రభుత్యోద్యోగులుగా, రకరకాల చట్టాలతో, వాటిని అమలు చేసే గుత్తాధిపత్యంతో కష్టపడి పనిచేసి సంపాదించే ప్రజల మీద పడి బతికేస్తున్నారు. దక్షత, విజ్ఞత, మచ్చలేని వ్యక్తిత్వం, జాలి, దయ, ఔదార్యం, కళా పిపాస, వంశపారంపర్య సంపద గల పెద్ద మనుషులందరూ – తొక్కివేయబడి, నామరూపాల్లేకుండా చెల్లా చెదురయ్యారు. ఘనత వహించిన ప్రజాస్వామ్య యుగంలో డబ్బు సంపాదించాలంటే ప్రభుత్వం మీద ఏదో ఒక రకంగా ఆధారపడక తప్పని పరిస్థితి ఏర్పడింది. గుత్తాధికార ప్రభుత్వాల చట్టాలను, విశేష, విచక్షణాధికారాలను, నిబంధనలను, నియంత్రణలను అడ్డం పెట్టుకుని వ్యక్తిగత ప్రతిభతో సంబంధం లేకుండా అడ్డగోలుగా, అడ్డదారుల్లో వందలు, వేలు, లక్షల కోట్లకు అధిపతులయ్యే నయా సంపన్నులు ఎటు చూసినా కనిపిస్తున్నారు.

వాళ్ళలో అత్యధికులలో వ్యక్తిత్వం గానీ, నైతికత గానీ, సున్నితత్వం గానీ, చూసి అనుకరించాలనిపించే మంచి గుణాలేవీ పెద్దగా కనబడవు. మోసం, దగా, కుట్ర, రెండు నాల్కల ధోరణులు మూర్తీభవించినట్లుగా అనిపిస్తుంది. వాళ్ళ అక్రమ సంపాదన చూసి..., అసలు సంపద అన్నా, సంపన్నులన్నా వెగటు పుట్టి, ధర్మంగా సంపాదించడానికి ప్రయత్నించే వాళ్ళలో కూడా లోపాలు వెతకడం అలవాటయింది. మనం అసహ్యించుకోవాల్సింది, వ్యతిరేకించాల్సింది సంపదను కాదు, అక్రమ సంపాదనకు రాచమార్గం చూపే ప్రభుత్వాల గుత్తాధిపత్యాన్ని.

సక్రమ సంపద సృష్టే నాగరికతకు మూలాధారం.

చట్టాలు చెయ్యడం, పన్నులు విధించడంపై ప్రభుత్వాలకు, ముఖ్యంగా ప్రజాస్వామ్య ప్రభుత్వాలకున్న గుత్తాధిపత్యమే – సమాజంలోని అన్ని రుగ్మతలకు, అవినీతికి, అక్రమ సంపాదనకు అసలైన ఒకే ఒక కారణం. పచ్చి అధర్మమైన కరెన్సీ, బ్యాంకింగు చట్టాల ద్వారా దొంగ డబ్బు ముద్రించే, తీర్చనక్కర్లేని అప్పులు చేసే అధికారాలను ప్రభుత్వం తనకు తాను దఖలు పరుచుకుంది. కేవలం దాని ఫలితమే ద్రవ్యోల్బణం. నిజానికి సెల్‌ఫోన్ ఛార్జీల్లాగా క్రమంగా తగ్గాల్సిన ధరలు – రోజు రోజుకూ పెరిగి పోవడానికదే కారణం. ఈ విషయం – అత్యధిక శాతం ప్రజలకు తెలియదు. కానీ చిదంబరం, యశ్వంత్ సిన్హా, కేజ్రీవాల్‌కు ఖచ్చితంగా తెలుసు. ఆమ్ ఆద్మీ మీద పడుతున్న ధరల భారం గురించి నినాదాలివ్వడమే తప్ప; కేజ్రీవాల్ కూడా అసలు మూలమైన దొంగ నోట్ల ముద్రణాధికారాలను తొలగించాలని డిమాండు చెయ్యడు. అదే 'ప్రజాస్వామ్య' రాజకీయమంటే.

22-12-2013

ఉదారవాద ఎజెండా

ఉదారవాదమనేది మెజారిటీ ప్రజలకు, ముఖ్యంగా వామపక్ష మేధావుల పరిభాషలో ఒక కళంకిత పదం. ఉదారవాదాన్ని (లిబరలిజం) ఒక్క ముక్కలో నిర్వచించాలంటే, 'ఆస్తి హక్కుల పరిరక్షణ' వాదం. అంటే ఉత్పత్తి సాధనాలన్నీ ప్రైవేటు చేతుల్లో ఉండడం. మనుషుల్లో, ప్రాంతాల్లో (సహజ వనరుల విషయంలో) సహజమైన తారతమ్యాలుంటాయి. అందుకే ఒకరి ప్రత్యేకతలను ఇంకొకరితో ఇచ్చిపుచ్చుకుంటారు. అందరూ ఒకేలా ఉండి, అన్ని ప్రాంతాలూ సరిగ్గా ఒకలాగే ఉంటే ఇచ్చిపుచ్చుకునేందుకు ఏమీ ఉండదు. తేడాలున్నందువల్లే, రైతులు డబ్బిచ్చి బట్టలు కొనుక్కుంటారు. నేతగాళ్ళు డబ్బిచ్చి బియ్యం కొనుక్కుంటారు. చేపలు పట్టే నైపుణ్యమున్న వారు సముద్రాలు, నదులు, చెరువుల చెంత చేరతారు. లలిత కళాకారులు పట్నాలకు చేరతారు. ఇందులో తప్పూ లేదు, దోపిడీ లేదు. వలస వెళ్లడం పాపమో, శాపమో కాదు. మరింత మెరుగైన జీవితం కోసం మనిషిపడే తపన.

మనుషుల్లో దొంగలు... మోసగాళ్ళూ ఉంటారు. వాళ్ళను అదుపుచేస్తే తప్ప ఎవరి సంపాదన వాళ్ళు అనుభవించగలగడం అసాధ్యం. ఆ అదుపు కోసం మాత్రమే రాజ్యాన్ని, ప్రభుత్వ యంత్రాంగాన్ని కోరుకుంటారు. ఉదారవాదం కూడా అలానే కోరుకుంది. కోరుకుని పొరబడింది. అందులోని వైరుధ్యాన్ని, వచ్చే ప్రమాదాన్ని పసిగట్టడంలో విఫలమైంది. మన ఆస్తిని రక్షించడానికి ఎంత జీతమివ్వాలో తనకు తానే నిర్ణయించుకునే వాచ్‌మెన్ – మన ఆస్తిని నిజంగా రక్షిస్తాడా? లేక, క్రమంగా భక్షిస్తాడా?

అదే జరిగింది. అలాంటి వారి చేతిలో వ్యక్తుల సంపదకు రక్షణ ఎలా దొరుకుతుంది? ఉదారవాదం ప్రజాస్వామ్యాన్ని సమర్థించింది. కానీ దాని దృష్టిలో ప్రజాస్వామ్యమంటే వ్యక్తుల స్వయం పరిపాలన. అంటే ప్రభుత్వమనేది ప్రజలు స్వచ్ఛందంగా చేరాలో వద్దో నిర్ణయించుకోగల వ్యవస్థ. అంటే ప్రతి వ్యక్తికి, ప్రతి చిన్న సమూహానికి, ప్రతి గ్రామానికి స్వాతంత్ర్యం ప్రకటించుకునే అపరిమితమైన స్వేచ్ఛ.

అంతేగానీ ఎవరో ఇష్టానుసారంగా గీసి పడేసిన భౌగోళిక సరిహద్దులమధ్య మనుషులను బలవంతంగా కట్టిపడేసి; మెజారిటీ అభిప్రాయాలకు బానిసలుగా చేయడం కాదు.

దేశ సరిహద్దులు అటూ, ఇటూ దాటడానికి; కావాలనుకుంటే కొన్ని వేల ముక్కలుగా విడిపోవడానికి ఎటువంటి ఆంక్షలు లేనిదే అసలైన ప్రజాస్వామ్యం. ఆ వెసులుబాటు లేనప్పుడు పేరు ప్రజాస్వామ్యమైనా, వాస్తవానికది రాచరికం, నియంతృత్వం, బానిసత్వాల కంటే మెరుగైందేమీ కాదు. ఇష్టంలేని వాళ్లు గ్రామస్థాయి దగ్గర్నుంచి విడిపోగలిగినప్పుడు – విప్లవాలు, యుద్ధాల అవసరం ఏ మాత్రం ఉండదు. ఉదారవాద అభిప్రాయాలు ఇలా ఉండగా, ఈ రోజు ప్రజాస్వామ్యానికి మనమిస్తున్న నిర్వచనం ఏమిటి?

విడిపోయే హక్కులేనప్పుడు – ప్రజాస్వామ్యమనేది దేశ సరిహద్దుల మధ్య ఉన్న ప్రజల మీద గుత్తాధికార వ్యవస్థగానే మిగిలిపోతుంది. ఆ ప్రజలను రక్షించే పద్ధతి, దానికయ్యే ఖర్చు రాజ్యమే నిర్ణయిస్తుంది. దాని కోసమని విధించడం మొదలెట్టిన పన్నుల డబ్బు క్రమేణా ఎక్కడెక్కడికో వెళ్ళిపోతుంది. ఈ మౌలిక స్వభావంలో ప్రజాస్వామ్యానికి, రాజరికానికి, నియంతృత్వానికి తేడా ఏమన్నా ఉందా? ఒక వాస్తవం గమనించాలి.

నేరస్థులు పేదరికం నుంచే పుడతారనే వాదం వామపక్ష మేధావులు తరచూ వినిపిస్తుంటారు. మరి సంపద పెరిగిన కొద్దీ నేరస్థులు తగ్గాలి కదా! కానీ ఇంటా బయటా రక్షణ వ్యయం పెరిగిపోతోందేమిటి? – నిజానికి జరిగేదేమిటంటే; సంపద పెరిగే కొద్దీ రక్షణ పేరుతో విధించే పన్నులు పెంచుకుంటూ పోతారు. మనం నియమించుకున్న వాచ్‌మాన్ (రాజ్యం)ది గుత్తాధిపత్యం కదా! రక్షణ వ్యవస్థను వ్యక్తుల ఆస్తి హక్కుల్ని కాపాడేందుకు ఉపయోగించడం తగ్గిపోతుంది. అసలు ఆస్తి హక్కుల్నే క్రమంగా అస్పష్టం చేస్తారు. సంపాదించిన వారందరినీ దోపిడీదారులుగా సిద్ధాంతీకరిస్తారు కాబట్టి దొంగలకు కూడా గిల్టీ ఫీలింగ్ ఉండదు. పనికిమాలిన కొత్త కొత్త నేరాలను కనిపెడతారు. గృహహింస, కట్నం వేధింపులు, దళితులపై అత్యాచారాలు, ఇప్పుడు కొత్తగా రాబోతున్న మత హింస చట్టం – ఈ కోవలోకే వస్తాయి. వాటన్నిటినీ మనిషి ఇంకో మనిషిపై చేసే హింసగా చూడ్డం మానేసి; కొన్ని వర్గాలను ప్రత్యేకంగా పరిగణించడం వల్ల – మనుషుల మధ్య, వర్గాల మధ్య శాశ్వతంగా ఘర్షణ వాతావరణం నెలకొంటుంది.

అంతేకాదు. రక్షణ వ్యవస్థకున్న సమయంలో సింహభాగం గంజాయి పీల్చడం, జూదమాడ్డం, కోడిపందాలు, వైన్ షాపులు తెరిచి ఉంచే సమయాలు, కనీస వేతనాల (దేవయాని ఉదంతం) చట్టాలు అమలు చెయ్యడం లాంటి వాటికి వెచ్చిస్తారు. ఇటువంటి వాటిలో స్వయం కృతాపరాధాలు తప్ప; ఒకరిమీద వేరొకరు చేసే జులుమేమీ ఉండదు. పలుచనయి పోయిన నేరనిరోధక వ్యవస్థలో అసలు పనైన ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణ మరుగున పడిపోతుంది. తను ఏం పని చెయ్యాలో, ఎలా చెయ్యాలో మన వాచ్‌మాన్ తనకు తానే నిర్ణయించుకుంటాడు కదా!

రాజుల పటాటోపం అసహ్యకరంగా అనిపించేది. కానీ ప్రజాస్వామ్య ప్రభువుల పటాటోపం తక్కువేమీ లేదు. ప్రభుత్వ వ్యవస్థలో ఎవరి ప్రివిలేజ్‌లు వారివి. అధికారం పేరిట ఏం చేసినా ప్రశ్నించడానికి వీల్లేకుండా చట్టాలు రాసుకున్నారు. ప్రజలు కట్టే డబ్బుతో జీతాలు తీసుకునే వీరు – ప్రజలను బానిసల్లా, పురుగుల్లా చూస్తారు. బిళ్ళ బంట్రోతు కూడా నారాయణ మూర్తిని నిలబెట్టి మాట్లాడగలడు. రాజులు కూడా పక్షపాతం చూపేవారు. తమకు నచ్చిన వారికి దానాలు, ప్రత్యేక హక్కులు ఇచ్చేవారు. కానీ అది పరిమితంగా – అక్కడొకరు, ఇక్కడొకరుగా వ్యక్తులకే పరిమితమయ్యేది.

కానీ, మనిషికో ఓటున్న ప్రజాస్వామ్యంలో – వ్యక్తులకు చాటుగా, వర్గాలకు, సమూహాలకు బహిరంగంగా ప్రత్యేక రాయితీలివ్వడం మొదలైంది. రాజ్యం ఏ రకమైనదైనా, ఎవరికైనా ఏదైనా ఇవ్వాలంటే, దాన్ని వేరే ఎవరి దగ్గర్నుంచో ముందు లాక్కోవాల్సిందే. ఏ దేశ, కాలాల్లో చూసినా కలిగిన వారికంటే లేనివారే ఎక్కువ మంది ఉంటారు. సమానత్వం సాధించడమనేది 'ప్రజాస్వామ్య' నినాదమైపోయింది కదా! కాబట్టి సంపద పున:పంపిణీ కార్యక్రమం అపరిమితంగా, అంతు... దరి లేకుండా ఎప్పటికీ సాగిపోతూనే ఉంటుంది. కలిగి ఉండడం ఒక నేరంగాను, లేనితనం ఒక అర్హతగానూ పరిగణించబడతాయి. దాంతో సంపాదించే వారు రాను రాను తగ్గిపోయి, సోమరులు, ఎదుటి వారిమీద పడి, తిని బతికే వారి సంఖ్య క్రమంగా పెరిగిపోతుంది. సమాజంలో విలువలు, పోటీతత్వం, శీలం, గుణగణాలకు గిరాకీ తగ్గిపోతుంది.

జరుగుతున్నదదే. చాలామంది ఈ మర్మం గ్రహించరు. సమాజంలో డబ్బాశ పెరిగిపోయిందని, వినిమయతత్వం పెరిగిపోయిందని, డబ్బుసలు మహా చెడ్డదని రకరకాల భాష్యాలు చెబుతుంటారు. పోటీతత్వం అన్నిటా మంచిది కాదు. కష్టపడడం, ఉత్పత్తి, పొదుపు, పెట్టుబడి లాంటి నిర్మాణాత్మక అంశాల్లో పోటీతత్వం మంచిదే. కానీ హింస, పీడన, దోపిడీ, సంపద పున:పంపకాల్లో 'ప్రజాస్వామ్య' పార్టీలు, ప్రభుత్వాలు పడే పోటీ – సమాజానికెంతో హానికరం. దాని గమ్యస్థానం సర్వవినాశనం. పూర్వం రాజులు, వారి కుటుంబం, అనుయాయులు మాత్రమే కష్టపడకుండా ప్రజల సొమ్ముతో బ్రతికేవారు.

'ప్రజాస్వామ్య' యుగంలో ఎవరైనా రాజు కావచ్చు. కాబట్టి ప్రతి వ్యక్తీ ప్రమాదకరంగానే కనబడతాడు. సమూహాలు, వర్గాలు చేసే ప్రతి డిమాండు 'న్యాయ' మైనదే. ఎందుకంటే సమూహాలకు గంపగుత్త ఓట్లుంటాయి. దాంతో ప్రతి ఓటరూ పక్క వ్యక్తికి ప్రమాదకారే. సంపాదించే వారి దగ్గర్నుంచి లాక్కుని, సంపాదించని వారికి దోచిపెట్టడం ఒక తప్పులా కనిపించదు. అదో హక్కుగా తయారవుతుంది. కాబట్టి అటువంటి అనైతిక మనస్కులను రెచ్చగొట్టి, గుంపు చేసి, ఓట్లు పొందే నాయకులు ఒకరితో ఒకరు పోటీ పడతారు. అటువంటి వారే అత్యున్నత స్థానాలకు చేరగలుగుతారు. కేజ్రీవాల్ ఒక చిన్న ఉదాహరణ మాత్రమే.

ఇటువంటి వ్యవస్థీకృత చట్రంలో ఇరుక్కుపోయాం. మరి ఉదార వాదానికి, మనిషి స్వేచ్ఛా, స్వాతంత్ర్య ప్రియత్వానికి భవిష్యత్తేమిటి? ముమ్మందుగా ఒక విషయం గ్రహించాలి.

ప్రభుత్వాల పరిమాణం, పటా టోపం, ఆయుధ సంపత్తి చూడ్డానికి భయపెట్టినా, ప్రజల సంఖ్య ముందు అవి చాలా అల్పమైనవి. అది పెద్ద అడ్డంకి కాదు. అడ్డంకల్లా మన ఆలోచనల్లోని అస్పష్టతే. మనమిచ్చిన అధికారాలతోనే ప్రభుత్వాలు మన వర్తమానం, భవిష్యత్తులను నాశనం చేస్తున్నాయి. మనమిచ్చిన డబ్బుతోనే ఆయుధాగారాలు నింపుకుంది. మనకు ఉగ్గుపాల నుంచీ నేర్పిన విధేయతతో, తదనుగుణ ఆలోచనలతో – ప్రభుత్వాలకు మనం వేసిన వీరతాళ్ళే మనకు ఉరితాళ్ళవుతున్నాయి. కాబట్టి తెలియని తనంతో, పొరపాటున మనమిచ్చిన అనుమతులను వెనక్కు తీసుకుంటే సరి; అది కుప్పకూలిపోతుంది. సాయుధ విప్లవం అక్కర్లేదు. ఎవరిమీదా చెయ్యి వెయ్యక్కర్లేదు. సింపుల్‌గా వ్యవస్థను తిరస్కరిస్తే చాలు.

కానీ ఎలా? మనమొక్కరం అనుకుంటే ఏమవుతుంది? ఇదేమన్నా నవ్వులాటా? నవ్వులాట కాదు. వ్యక్తిగత స్థాయిలో కూడా వ్యవస్థను తిరస్కరించడం ఎంతో ప్రభావాన్ని చూపుతుంది. దాన్ని ఎలా మొదలు పెట్టాలి, ఎలా ముందుకు తీసు కెళ్లాలన్నది వచ్చేసారి చర్చిద్దాం. ఒక విషయం మాత్రం స్పష్టం. మనల్ని రక్షించేందుకు నియమించుకున్న వాచ్‌మెన్‌కి సర్వాధికారాలివ్వడం ప్రమాదం. జ్వరం తగ్గించడానికి ఉరితీయడం వైద్యం కాదు.

పదిలక్షల కోట్ల పెట్టుబడులకు పర్యావరణ అనుమతులు లభించక, ఆర్థిక ప్రగతి కుంటుబడిందని, అందుకే జయంతి నటరాజ్‌ను తప్పించారని, ఇప్పుడు అనుమతులన్నీ చకాచకా ఇచ్చేస్తున్నారనీ వార్తల్లో చదివాం. అప్పుడు అనుమతులు ఇవ్వకపోవడానికి హేతుబద్ధత ఏమిటి? ఇప్పుడు ఇవ్వడానికి లాజిక్కేమిటి? అన్ని ప్రాజెక్టులు ఆగిపోవడం వల్ల ఎంతమంది నిరుద్యోగులు నష్టపోయారు? ఎంతమంది వినియోగదారులు నష్ట పోయారు? ఎన్ని పెళ్లిళ్లు ఆగిపోయాయి? ఎంతమంది వైద్యానికి డబ్బుల్లేక మరణించారు? లెక్కకట్టగలమా? దీనికి ఎవరైనా బాధ్యత వహిస్తారా? రెండొందల సంవత్సరాలకు సరిపడా ఇనుప ఖనిజ వనరులున్న మనదేశం; ప్రస్తుతం దాన్ని దిగుమతి చేసుకోవలసి రావడానికి కారకులెవరు?

నిజానికి పర్యావరణాన్ని పూర్తిస్థాయిలో కదపకుండా ఉంచాలంటే, ఈ భూమ్మీది మనుషులందరం మరణించడ మొక్కటే దారి. అలా చేద్దామా? అబ్బే, కొంత నియంత్రిస్తే చాలంటారా? అన్నేసి నియంత్రణాధికారాలను ఈ నిరక్షరాస్య, అవినీతి మయమైన, అయిదేళ్ళ కొకరుగా వచ్చి పోయే బాధ్యతా రాహిత్య, తాత్కాలిక ప్రభువుల చేతుల్లో పెట్టడం భద్రమేనా?

05-01-2014

ముందుకెళ్ళే దారి

ఎవరో రావాలి, ఈ వ్యవస్థను బాగు చెయ్యాలి, మనలను ఉద్ధరించాలని అందరూ కోరుకుంటూ ఉంటారు. కానీ ఎవరు రావాలో, వచ్చి ఏం చెయ్యాలో, ఉద్ధరించడమంటే అసలేమిటో అనే విషయాలపైన వ్యక్తుల మధ్య.... సమూహాల మధ్య.... వర్గాల మధ్య తీవ్రమైన అభిప్రాయ భేదాలుంటాయి. ఎన్నికల సమయానికి ఈ విభిన్న ఆలోచనలున్న వారిలో-మెజారిటీ ఓట్లు పొందడమే రాజకీయ పార్టీల లక్ష్యంగా ఉంటుంది. ఇందులో మంచి, చెడు, న్యాయం, అన్యాయం, ధర్మాధర్మాలు, నైచ్యం, దుర్మార్గం అనే శషభిలుండవు. తీరా అంత ఉద్వేగంతో గెలిపించుకున్నాక; నిరాశ చెందుతారు. నిన్నగాక మొన్న ఉవ్వెత్తున ఎగసిన కెరటంలా ముందుకొచ్చిన ఆమ్‌ఆద్మీ పార్టీ పట్ల కూడా నెల రోజులు తిరక్కుండానే భ్రమలు తొలగుతుండడం దీనికి నిదర్శనం.

ఇంతకు ముందు వివరంగా చర్చించుకున్నట్లుగా మెజారిటీ స్వామ్యం వ్యక్తులను రాజ్యపీడన నుంచి బంధ విముక్తులను చెయ్యదు. రాచరికంతో పొలిస్తే మరింత హ్రస్యదృష్టితో, బాధ్యతా రహితంగా విధానాలు రూపొందిస్తూ, ప్రజలను రకరకాల ప్రాతిపదికలపై చీలిక పేలికలుగా విడదీస్తూ... ముడులేస్తూ... అందరూ అందరిపట్ల శత్రుత్వ భావనలు పెంచుకునే పరిస్థితులు ప్రజాస్వామ్యంలో కనిపిస్తాయి. ఉదారవాదం స్వప్నించిన ప్రజాస్వామ్యం వ్యక్తి స్వేచ్ఛకు, స్వాతంత్ర్యానికి దారితీస్తుంది.

అటువంటి నిజమైన స్వేచ్ఛను అనుభవించాలంటే, ముందుగా వ్యక్తిగత స్థాయిలో ఎవరికి వారుగా ఈ వ్యవస్థను తిరస్కరించాలి. సాయుధ విప్లవం అక్కర్లేదు, ఎవరిమీదా చెయ్యి వెయ్యనక్కరలేదు. మానసికంగా తిరస్కరించాక కేంద్రం, తర్వాత రాష్ట్ర ప్రభుత్వాలను (దూరం ఎక్కువైన కొద్దీ మరింత ఎక్కువ తిరస్కరణ) అధర్మమైనవిగా, ఆక్రమణ దారులుగా, పరాయి పాలనగా భావించాలి. తప్పని పరిస్థితుల్లోనో, ఆత్మ సంరక్షణార్థమో తప్ప వాటి కార్యకలాపాలలో పాలుపంచుకోకూడదు, సహకరించకూడదు. వీలున్నంత తక్కువ పన్నులు చెల్లించాలి.

కేంద్ర, రాష్ట్ర చట్టాలను అన్యాయాలుగా పరిగణించి, వీలున్నంతవరకు వాటిని పాటించడం మానేయాలి. కానీ వ్యక్తిగత స్థాయిలో అనైతిక పనులకు పాల్పడకూడదు. ఇతరుల ధన, మాన, ప్రాణ హక్కులను పూర్తిగా గౌరవించాలి. ప్రభుత్వ ఉద్యోగాలకు, ఉద్యోగులకు దూరంగా ఉండాలి. (ముఖ్యంగా జాతీయ) రాజకీయ పార్టీలకు దూరంగా ఉండాలి. ప్రభుత్వం మీదపడి బతికే ఏ సంస్థతోనూ సంబంధాలు పెట్టుకోకూడదు. కష్టపడి సంపాదించిన సొమ్మును ప్రభుత్వం కంట పడకుండా దాచుకునే దారులు వెతకాలి. కొద్ది మందైనా సరే, తనలాగా ఆలోచించే వారితో కలిసి ఒకే చోట నివాసం ఉండేలా ఏర్పాటు చేసుకోవాలి. మెజారిటీ ప్రజలు ఈ ఆలోచనల్లోకి మారితేనే పరిస్థితి మారుతుందన్న షరతులేం లేవు. ఇలా ఆలోచించే వారు చిన్న చిన్న సమూహాలుగా అనేక చోట్ల ఏర్పడితే చాలు. మనం సొమ్ము దాచుకోవడానికి తాళాలు, బీరువాలు కొంటాం. అలాగే, ఈ స్వేచ్ఛాయుత ఉదారవాద భావాల వ్యాప్తికి ఖర్చు పెట్టాలి. ఎంత త్వరగా, ఎక్కువ సంఖ్యలో ఈ నూతన 'జ్ఞాన దీవులు' ఏర్పడితే, మనకంత శ్రీరామరక్ష.

ఒకసారి మనకు స్పష్టత వచ్చాక, ఇతరులతో నిజాయితీగా సంభాషిస్తే ఎంతమంది ఈ ఆలోచనలతో ఏకీభవిస్తారో చూస్తే ఆశ్చర్యపోతారు. మెజారిటీ ప్రజలు మౌలికంగా, స్వభావరీత్యా ధర్మాధర్మాల మధ్య వ్యత్యాసం తెలిసిన వారే. కాకపోతే వ్యక్తిగత స్థాయిలో ప్రధాన ఆలోచనా స్రవంతికి విరుద్ధంగా ఆలోచించడానికి, మాట్లాడడానికి భయపడతారు.

సమాజంలో చాలా మంది బద్ధకస్తులు, అవివేకులు, అమాయకులు ఉంటారు. మరికొందరు ఈ వ్యవస్థలోని అనైతికతను చూడగలిగినప్పటికీ, దానిపై ఆధార పడి బ్రతకడానికి అలవాటు పడ్డారు, కాబట్టి కనీసం మానసికంగానైనా ఎదిరించడానికి సాహసించరు. ఈ నిశ్శబ్ద విప్లవం కేవలం ఓ పుంజీడు మంది సాహసికులతోనే మొదలవాలి. వారే ధర్మాన్ని తిరిగి నిలబెట్టే యుగ కర్తలు. కాలి బూడిదైనా, ఆరు గజాల లోతున పాతిపెట్టినా, స్వేచ్ఛా స్వాతంత్రాలనే భావాలకు తిరిగి జీవం పోయగల సృష్టికర్తలు. ప్రతి విప్లవానికీ ముందుండి నడిపే కొద్దిమంది ఆలోచననాపరులు, సాహసికులు అవసరం. క్రమంగా తమ ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్ళి, వారిని కూడా ఆలోచింప చెయ్యగలగడం వారి విశిష్టత. రాజ్య, ప్రభుత్వ వ్యవస్థల నుంచి తమను తాము స్వతంత్రులుగా భావించి, ప్రకటించుకునే వీరు – ఒక సుదీర్ఘ సైద్ధాంతిక పోరాటానికి సిద్ధం కావాలి. కేవలం ప్రభుత్వాలను, వాటి విధానాలను విమర్శించడానికే పరిమితం కాకూడదు. అటువంటి విమర్శల నెన్నిటినయినా తట్టుకుని నిలబడగలిగే సామర్థ్యం గత వందేళ్ళలో ప్రభుత్వాలు, పార్టీలు సంపాదించుకున్నాయి. ప్రభుత్వ విధాన వైఫల్యాలను ఎత్తిచూపుతూనే, అవి కేవలం రోగ లక్షణాలేనని, అసలు రోగ కారకాలను, 'ప్రజాస్వామ్య', 'మెజారిటీ నియంతృత్వ' ప్రభుత్వాల జన్యులోపాలను అందరికీ అర్థమయ్యేలా వివరించాలి.

ఒక గ్రామంలో దుర్మార్గులు ఎక్కువై – స్వేచ్ఛగా బ్రతికే వీలు లేదనుకున్నపుడు; వేరే గ్రామానికి మన తట్టా, బుట్టా ఎత్తుకుని వలస పోగలం. ఒక తాలూకాలో పరిస్థితులు బాగోపోతే ఇంకో తాలూకాకు కొంచెం కష్టమైనప్పటికీ, వెళ్ళిపోవచ్చు. కానీ దేశం చాలా పెద్దదై, కేంద్రీకృత 'ప్రజాస్వామ్యం' విధానాలతో, అంతటా దుర్మార్గం, పీడన ఆవహించి ఉంటే, ఎక్కడికని పోగలం? అందువల్ల, ఉదారవాద దృష్ట్యా, దేశాలు ఎంత చిన్న సైజువయితే, అంత మంచిది. సార్వభౌమాధికారం – రాజ్యం నుంచి వ్యక్తికి బదలాయింపు కావాలంటే, రాజ్యం క్రమేణా ముక్కలు ముక్కలవుతూ రాష్ట్రం, మండలం, గ్రామం, కుటుంబం, చివరికి వ్యక్తి స్థాయికి చేరాలి. అదే స్వేచ్ఛా పిపాసుల అంతిమ లక్ష్యం కావాలి. వ్యక్తులకు మరింత స్వేచ్ఛనిచ్చే రాజ్య విభజనలను ఉదారవాదులు సమర్థించడమే గాక ప్రోత్సహించాలి. చిన్న రాజ్యాల మధ్య పోటీతత్వం పెరిగి, పీడన తగ్గుతుంది.

మన కోరికలు తీర్చే, కలలను సాకారం చేసే పరికరంగా ప్రభుత్వాలను, రాజ్యవ్యవస్థను పూజించే మనలో చాలామందికి – ఈ కొత్త భావాలు కొత్తగా మాత్రమే కాక, కొందరికి చేదుగా, భయంకరంగా అనిపించడం సహజం.

కానీ దైనందిన బ్రతుకు పోరాటాలను కాసేపు ప్రక్కనపెట్టి, తీరిగ్గా, తర్కబద్ధంగా ఆలోచిస్తే; ఇందులోని సత్యం బోధపడుతుంది. రోజూ మన చుట్టూ జరుగుతున్న సంఘటనలను ఉదారవాద సిద్ధాంత ఆద్దాల్లోంచి చూస్తే వాస్తవాలు వాటి అసలు రంగుల్లో కనిపిస్తాయి. రాజ్యాలు ఎంత పెద్దవైతే, ఎంత కేంద్రీకృతమైతే అంత మంచిదని ఒక్క క్షణం అనుకుందాం. అప్పుడు భారతదేశమేం ఖర్మ, మొత్తం ఆసియా, అసలు మొత్తం ప్రపంచం ఒకే ప్రభుత్వంగా ఏర్పడితే మానవాళికి ఇంకా మంచిది కదా! అలా జరిగిందనుకుందాం. మనిషికో ఓటు ఉంటుంది గనుక అప్పుడు ఏర్పడేది ఖచ్చితంగా భారత్–చైనాల సంకీర్ణ ప్రభుత్వమే అయి తీరుతుంది. మళ్ళీ ఎన్నిక కావాలంటే ఏ నినాదాలు, విధానాలు ఎంచుకుంటారు? పశ్చిమ దేశాల్లో ఉన్న సంపదంతా వెనుకబడిన ఆసియా, ఆఫ్రికాలకు తరలించాలంటారు. అలాగే, ఓటు హక్కు వయో పరిమితిని ఇప్పుడున్న పద్దెనిమిదేళ్ళ నుంచి ఏడేళ్ళకు తగ్గించారనుకుందాం. అప్పుడు మానిఫెస్టోలలో బాల ఓటర్లకు ఉచిత సినిమాలు, చాక్లెట్లు, ఐస్‌క్రీముల పథకాలు వెల్లువెత్తుతాయి.

ఇదంతా అసమంజసంగా అనిపించవచ్చు. కానీ గత వందేళ్ళలోనే – ఓటేసే వయసు.... ముప్పై యేళ్ళ నుంచి పద్దెనిమిదేళ్ళకు వచ్చింది. ఒకప్పుడు కేవలం పన్నులు చెల్లించే వారికి మాత్రమే పరిమితమైన ఓటుహక్కు – ఇప్పుడు సార్వజనీయమైంది. మెజారిటీగా ఉండే సంక్షేమ పథకాల లబ్ధిదారులు మైనారిటీగా ఉండే పన్ను చెల్లింపుదారులను పరోక్షంగా శాసిస్తున్నారు. అందుకే సంపద సృష్టి నిరుత్సాహానికి, నిర్బంధాలకు గురై, సంపద పున:పంపిణీ అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది.

అలా అని సంక్షేమానికి ఖర్చుపెట్టే డబ్బెప్పుడూ ధనికుల నుంచి పేదలకు మాత్రమే ప్రవహిస్తుందనే రూలేం లేదు. పేద, కార్మిక వర్గాలు ఐఐటి, ఐఐఎమ్ లాంటి విద్యాసంస్థలకు తమ పిల్లలను పంపడం చాలా తక్కువ. కానీ మధ్యతరగతి, ధనికుల పిల్లలు చదువుకునే వీటిని నడపడానికయ్యే వందల, వేలకోట్లు, పేదలు, కార్మికులు కట్టే పన్నులోంచి కూడా వస్తుంది. తవ్విన కాలవల్లో ఏనాడూ నీరు ప్రవహించకపోయినా, ధనిక వర్గాలైన ఇంజనీర్లు, కాంట్రాక్టర్లకు ప్రవహించే డబ్బు ఆగదు. సంక్షేమ పథకాలు లేకపోతే పేదలు బ్రతకలేరనే ఆలోచన పూర్తిగా నిరాధారం, అసత్యం.

పేదైనా, ధనికుడైనా – ఒక మనిషి తన జీవిత కాలం మొత్తంలో – ప్రభుత్వం వల్ల పొందే లాభం కన్నా నష్టమే ఎక్కువ. అవినీతిపరులు, నేరస్థులకు ఈ సూత్రం నుంచి మినహాయింపు.

వచ్చిన నెలలోపే భ్రమలు తొలగిపోతున్న ఢిల్లీ ఆప్ ప్రభుత్వం మన ప్రజాస్వామ్య వ్యవస్థ నిష్ఫలత్వానికి ఓ మచ్చు తునక. నెలకు ఇరవై వేల లీటర్ల నీరు, నాలుగొందల యూనిట్ల కరెంటు వరకు వాడుకునే వారికి అదంతా పూర్తిగా ఉచితమట. దానికి మించి ఇంకొక్క లీటరు నీరు గాని, ఒక్క యూనిట్ కరెంటు గానీ వాడితే మొత్తానికి డబ్బు చెల్లించాలట. ఇదేం ధర్మం? ఒక్క లీటరు నీరు ఎక్కువ వాడుకున్నవారు ఏం పాపం చేశారు? అసలు ఈ ఉచితాలకు డబ్బెవరు కట్టాలి? లక్షలాది మంది మధ్యతరగతి సంసారులే కదా! వాళ్ళకెందుకీ శిక్ష? రిటైల్ రంగంలో ఎఫ్‌డిఐలకు ఇచ్చిన అనుమతులు రద్దు చేశారు. దీనివల్ల ఎవరికి లాభం? రిలయన్స్ వంటి దేశీయ రిటైల్ దిగ్గజాలకు కాదూ? అదే సూత్రం ఇతర దేశాలు పాటిస్తే మన ఫార్మా రంగం ఏమైపోవాలి? ఎగుమతుల మీదే ఆధారపడిన మన సాఫ్ట్‌వేర్ రంగం సంగతి? మాదాపూర్ అంతా మూసెయ్యాలా?

నాగరికత పరిఢవిల్లడానికి, పురోగమించడానికి వ్యక్తులు, కుటుంబ వ్యవస్థలే ఆధారం. ప్రభుత్వాలు ఈ ప్రక్రియకు కేవలం ఒక అడ్డంకి మాత్రమే. నిరుపేదలు, నిస్సహాయులకు ఆకస్మికంగా వచ్చిన ఆపద నుంచి బయటపడేయడానికి తమకు చేతనైనంత సహాయం చెయ్యడానికి ముందుకురాని గ్రామస్తులు ఎక్కడా ఉండరు. ఆ విధంగా, తెలిసినవారికి అవసరమైన సహాయం చేసే ఉదారత్వం, దాతృత్వం మనుషుల్లో ఎప్పుడూ ఉంటుంది. వచ్చిన చిక్కల్లా, ముక్కుమొఖం తెలియని వారికి ప్రభుత్వాలు రాజకీయ ప్రాతిపదికపై నిర్ణయించిన సంక్షేమం చెయ్యడం కోసం ప్రజలందరి జేబులకూ చిల్లులు పెట్టడం. వ్యక్తికి తన వృత్తిని, సంపాదనను, దాన్ననుభవించే తీరును, తన దాతృత్వాన్ని నిర్ణయించుకునే స్వేచ్ఛ లేకుండా చేసిన ఈ వికృత 'ప్రజాస్వామ్య' రాజ్యవ్యవస్థను తిరస్కరిద్దాం, పదండి ముందుకు.

19-01-2014

అనార్కిజం, అయోమయం

రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ఇచ్చిన సందేశం కొంత నిజాయితీగా ఉండడం ఆసక్తికరం అనిపించిది. ప్రభుత్వాలు దాతృత్వ సంస్థలు కావని, అమలు చెయ్యలేని హామీలు ఇవ్వకూడదని, ప్రజల్ని భ్రమల్లో ముంచడం రాజకీయాలకు మంచిది కాదని, అరాచకం (అనార్కిజం) పరిపాలనకు ప్రత్యామ్నాయం కాదని హితవు పలికారు. అది ప్రభుత్వం రాసిచ్చిన ప్రసంగ పాఠం అయితే పర్వాలేదు. కానీ వ్యక్తిగత అభిప్రాయాలైతే మాత్రం ఆశ్చర్య పోవాల్సిందే. ఎందుకంటే, స్వతంత్ర, గణతంత్ర భారతదేశంలో ప్రజల సొమ్ముతో అతిపెద్ద దాతృత్వ యంత్రమైన కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వాలలో కీలక పదవులు నిర్వహించిన ప్రణబ్ – ఈ అభిప్రాయాలను వెలిబుచ్చడం హిపోక్రసీ అవుతుంది.

ప్రభుత్వాలు పేదరికాన్ని నిర్మూలించవు, ఉద్యోగాలు సృష్టించవు అనే వాస్తవం ఇన్నాళ్ళుగా రాజకీయాల్లో ఉన్న వాళ్ళకు తెలియనిది కాదు. అయినా, పేదరిక నిర్మూలన పేరుతో ఎన్ని దశాబ్దాలుగా ఎన్ని లక్షల కోట్లు దుబారా చేశారో, అ పేరు మీద ఆర్థికాభివృద్ధికి ఎన్ని నియంత్రణలు పెట్టి అడ్డంకులు సృష్టించారో తెలిసిందే.

అలాగే, ఉపాధి హామీ పేరుతో ఎంత తగలేశారో, దానివల్ల గ్రామాల్లో ఆర్థిక పరిస్థితులు, సంబంధాలు ఎంతగా అస్తవ్యస్తమయ్యాయో అనుభవించే వాళ్ళకు మాత్రమే తెలుస్తుంది. సగటు మనిషిని ఆదుకునే నెపంతో ఎన్నెన్ని పన్నులు ఎంతలా పెంచారు? ఎంత కృత్రిమ డబ్బు సృష్టించి ద్రవ్యోల్బణానికి కారకులయ్యారు? సహజ వనరులన్నీ 'చేతి'లో పెట్టుకుని ఎంత అవినీతి, అక్రమార్జన, ఆశ్రిత పెట్టుబడీదారీ తనాలకు పాల్పడ్డారు? మీడియాలో కొన్ని వర్గాలను, సీబీఐని రాజకీయంగా ఎంత నిర్లజ్జగా వాడుకున్నారు? ప్రజల్ని ఇన్నేళ్ళుగా భ్రమల్లో ముంచిన వారే ఇలాంటి హితోక్తులు పలకడం విడ్డూరం. చిన్న రాష్ట్రాల ఏర్పాటు విషయంలో చర్చ జరగాల్సిందేనని, అది ప్రజాస్వామ్య

వాతావరణంలో జరగాలని హితవు పలికారు. గత పదేళ్ళుగా ఈ చర్చ ఎందుకు జరపలేదు? ఆ ప్రాతిపదికన రెండో ఎస్సార్సీ వేసుంటే ఈ పాటికి నివేదిక కూడా వచ్చేది కదా!

ఇకపోతే; పాలనకు అనార్కిజం ప్రత్యామ్నాయం కాదనే చురక – ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు సూటిగానే తగిలింది. ఆయన కూడా తనకు తాను అనార్కిస్టుగా ప్రకటించు కున్నారు. ఇబ్బందల్లా, అనార్కిజం అసలు అర్థం వేరు. అనార్కిస్టులంటే అసలు రాజ్యవ్యవస్థ అనేది లేకుండా పోవాలని కోరుకునేవారు. అలా కోరుకోవడంలో తప్పు కూడా లేదు. ఇంతకుముందు వివరంగా చర్చించుకున్నట్లుగా, రాజ్యం పీడనకు ఆద్యం. గుత్తాధికారాలున్న రాజ్యం, అదీ ప్రజాస్వామ్య రాజ్యం ఉన్నంతవరకు; పీడన, దోపిడీ తప్పవు సరికదా; వాటి పరిమాణం, ప్రభావం – క్రమేపీ పెరుగుతూనే ఉంటుంది.

ఇది ఎవరూ కాదనలేని, తప్పించుకోలేని శిలా శాసనం. మధ్యలోవచ్చే మార్పులన్నీ పైపై మెరుగులు, తాత్కాలికం మాత్రమే. సమస్త కళారంగాలనూ ఆవహించిన వామపక్ష భావజాల ప్రభావం కారణంగా కొన్ని పదాలకు నిర్వచనాలు, అర్థాలు, వాడుక మారిపోయాయి. అటువంటి పదాల్లో అనార్కిజం ఒకటి. సుమారు వందేళ్ళ క్రితం కమ్యూనిస్టు సిద్ధాంతాల అంతర్గత ఘర్షణల ఫలితంగా 'అనార్కిజం' ఒక మహాచెడ్డ 'ఇజం'గా ప్రచారం పొందడం మొదలైంది. ఇంతకూ కేజ్రీవాల్ అనార్కిస్టా? కారు, కాలేరు.

ఆయన చేసిన వాగ్దానాలు నేరవేర్చాలంటే చాలా బలమైన, మరిన్ని గుత్తాధికారాలున్న రాజ్యం అవసరం. ఆయన రాజ్య పీడన నుంచి ప్రజల్ని విముక్తుల్ని చేస్తానని ఎప్పుడూ చెప్పలేదు. అవినీతిని ఊడ్చిపారేస్తాననన్నారు. అదీ ఎలా? మరింత లంచగొండితనం ప్రోత్సహించడం ద్వారా! ఆయన అధికారం చేపట్టగానే తీసుకున్న ముఖ్య నిర్ణయాలు – ఒకటి, నెలకు 20వేల లీటర్ల వరకు నీటిని వాడుకునే వారికి పూర్తి ఉచితం; రెండు, నెలకు 400 యూనిట్ల వరకు కరెంటు వాడుకునే వారికి అది సగం ధరకే ఇవ్వడం. దీంతో ఆ పరిమితులు దాటకుండా చూసుకోవడానికి మీటర్లు తిరక్కుండా చేసే మార్గాలు వెతుకుతారు.

అన్ని లక్షల మీటర్లకు ఎవరు కాపలా కాస్తారు? కొద్ది కాలానికి ఆ కాపలా కాసేవారు, గృహ యజమానులు కుమ్మక్కవుతారు. దాంతో ఒక కొత్త అవినీతి మార్గం ఉద్భవిస్తుంది. ఇంతకూ ఈ ఉచితాలకు డబ్బెక్కడిది? ఇతర వినియోగదారులకు రేట్లు పెంచుతారు. ఇప్పటికే కరెంటు ఛార్జీలు ఎనిమిది శాతం పెరిగాయి. ఇంకా పెంచితే గొడవవుతుందనుకుంటే; ఇతర పన్నులు పెంచుతారు. ఇంటి పన్ను, ఆస్తి పన్ను, అమ్మకం పన్ను ఇలా ఎన్ని లేవు? కాబట్టి కేజ్రీవాల్ రాజ్యభక్తుడే తప్ప, అనార్కిస్టు కాదు, కాలేరు కూడా.

యువరాజు రాహుల్‌గాంధీ ఒక ఇంగ్లీషు ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూ సర్వత్రా చర్చనీయాంశమైంది. అందులో ఆయన మాట, మాటకు అడిగిన ప్రశ్నతో సంబంధం లేకుండా తాము సమాచార హక్కు చట్టం తెచ్చామని, లోక్‌పాల్ ఇచ్చామని, పని హామీ, ఆహార భద్రతలు ఇచ్చామని, యువశక్తిని ఉపయోగించుకోవాలని, మహిళా సాధికారత సాధించాలని, వ్యవస్థ లోపభూయిష్టంగా ఉందని, దాన్ని మార్చాలని వల్లె వెయ్యడం అందరికీ నవ్వు తెప్పించింది.

గత 60 ఏళ్ళుగా, ముఖ్యంగా గత పదేళ్ళుగా ఆయన కుటుంబం, ఆయన పార్టీయే – వ్యవస్థ. దాన్ని మార్చాలంటే, ఎవరిని మార్చాలి? సమాచార హక్కుచట్టం స్పెక్ట్రం, బొగ్గు కుంభ కోణాలను ఆపిందా? లోక్‌పాల్ ఆపుతుందా? యువకులు తమ శక్తిని తాము ఉపయోగించుకోకుండా అడ్డుకుంటున్నది ఎవరు? నాలుగు రిజర్వేషన్లతో మహిళలు సాధికారులవుతారా?

ఆయనే స్వయంగా వెళ్ళి, ఒరిస్సాలో అప్పటికే వేలకోట్లు పెట్టుబడి పెట్టిన వేదాంత అల్యూమినియం ఫ్యాక్టరీని ఆదివాసీ హక్కుల పరిరక్షణ పేరుతో నిలుపు చేయించారు. అదే ప్రాంతంలో దక్షిణ కొరియాకు చెందిన పోస్కో సంస్థ స్టీలుఫ్యాక్టరీ పెట్టేందుకు ఇటీవలే ఒప్పందం చేసుకున్నారు. ఏ సమాచార హక్కు చట్టం ద్వారా దీనికి ఎవరు సమాధానం చెబుతారు? ఆదివాసీలు తాముండే ప్రాంతంలో దగ్గర్లోని గుట్టమీద దేవతను ప్రతిష్ఠించుకోవడం అత్యంత సాధారణం. దాంతో ఆ పర్వత శ్రేణి అంతా పుణ్యభూమిగా మారిపోయి ఏ పరిశ్రమా పెట్టగూడదంటే నష్టపోయేదెవరు? పోనీ ఆదివాసీలకు వాళ్ళ ఊళ్ళు, భూములు, అడవి, కొండల మీద ఆస్తి హక్కులిస్తారా అంటే అదీ లేదు. వాళ్ళ పనల్లా ఏ మౌలికవసతులూ లేని మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వం పడేసే గింజలు తింటూ, టూరిస్టులు, సామాజిక శాస్త్రజ్ఞులు, స్వచ్ఛంద సేవాసంస్థలు, ఎన్జీవోలు, రాజకీయ నాయకుల క్రీడలకు పనికొచ్చే వింత జంతువుల్లా పడుండడమేనా? ఆ అడవులు, కొండలు వారివే అన్నప్పుడు ఆస్తిహక్కులు రాసివ్వండి, వారే నిర్ణయించు కుంటారు, ఉంచుకోవాలో లేక పోస్కోకో, వేదాంతకో, ఇంకొకరికో అమ్ముకోవాలో.

హాస్యాస్పదమైన సమాచార హక్కు, లోక్‌పాల్, తెలంగాణ వంటి ఉపయోగం లేని లక్ష్యాలను నిర్దేశించుకుని – అవి రాగానే ఏదో సాధించినట్లు సంతృప్తి వ్యక్తం చెయ్యబట్టే, వర్తమాన రాజకీయాలు ప్రజల ఆలోచనాపరిధులను ఆ మేరకు కుదించేసి, ఆటలాడు కుంటున్నాయి. ఉచిత పథకాల్లోని డొల్లతనాన్ని, ప్రభుత్వాల దుర్మార్గాలను, పాలకవర్గాల పరాన్న జీవితాలను ప్రజలు గుర్తించకుండా, ఎప్పటికప్పుడు ఏదో ఒక కొత్త సినిమాలో వారిని నిమగ్నం చేస్తుంటారు. పాక్షికంగా ప్రభుత్వం మీద ఆధారపడే మీడియా, మేధావి వర్గాలు ఆ సినిమాకు వాయిద్య సహకారం అందిస్తూ ఉంటాయి. ఈ మోతలో – మనిషి

ఆలోచనలు మూసపోతలో మొద్దుబారిపోతున్నాయి. అసలు వాస్తవం ఏమిటంటే – ప్రభుత్వాలు పదవులు, పరాన్న జీవులను సృష్టిస్తాయి తప్ప, సంపదను సృష్టించవు. ఉన్నత ప్రమాణాలతో స్కూళ్ళు, కళాశాలలు, ఆసుపత్రులు, మందులు, ఉద్యోగాలు, పరిశ్రమలు, ఆడపిల్లలకు చదువులు, పరిమిత సంతానం, రోడ్లు, ఫోన్లు, ఆర్థిక అభివృద్ధి – ఇవన్నీ ప్రభుత్వాల వల్ల రావు. ప్రభుత్వాలు తాము అడ్డం పెట్టిన కాలును తొలగించిన కొద్దీ ఇవన్నీ ప్రవాహంలా వస్తాయి. 1992లో జరిగిన వాటిని ఆర్థిక సంస్కరణలు, సరళీకృత విధానాలుగా పిలవడం – ఆ పదాలను మురికి చేయడం అవుతుంది. సంస్కరించాల్సిన స్థాయికి పరిస్థితి తెచ్చిందెవరు? సరళీకృతానికి ముందు పీటముడు లేసిందెవరు? ఏ వ్యవస్థ? ఏ భావజాలం?

మనది సోషలిస్టు దేశమని రాజ్యాంగ పీఠికలోనే రాసుంది. అలా రాసుంది కాబట్టి దాన్ని సాధించడం కోసం ప్రభుత్వాలు సంపద పున:పంపిణీ చేసే క్రమంలో ఎన్ని ఉచిత పథకాలైనా ప్రకటించవచ్చు. ఎన్ని వనరులపై ఎంత గుత్తాధిపత్యమైనా చలాయించొచ్చు, పౌరులను ఎంతగానైనా నియంత్రించవచ్చని ఆదేశిక సూత్రాలు; ఛప్పన్నారు రాజ్యాంగ సవరణలను ఉటంకిస్తూ సుప్రీంకోర్టు ఎన్నో తీర్పులిచ్చింది. కాబట్టి గమనించాల్సిందేమిటంటే, ప్రజలను భ్రమల్లో ముంచవద్దని, నెరవేర్చగలిగే హామీలే ఇవ్వాలని చెప్పగల నైతిక హక్కు రాజ్యాంగానికి గానీ, ఆ రాజ్యాంగం సృష్టించిన పదవులను అలంకరించేవారికి గానీ లేదని.

నరేంద్ర మోదీ ఆలోచనలు – ఈ సంప్రదాయక, సోషలిస్టు రాజకీయాలకు భిన్నంగా కనిపిస్తున్నాయి. ఆయన ఇప్పటి వరకు ఏ ఉచిత పథకాలు ప్రకటించలేదు. గుజరాత్‌లో 24 గంటలు కరెంటు పొందుతున్న గ్రామీణులు ఠంచనుగా బిల్లులు కట్టడానికి అలవాటు పడ్డారు. అవినీతి, అడ్డుపుల్లలు అతి తక్కువస్థాయిలో ఉండడంతో పెట్టుబడుల ప్రవాహం, పారిశ్రామికీకరణ పెరిగాయి. ఆ విధానాలను దేశవ్యాప్తంగా అమలు చెయ్యాలంటే– ప్రధానమంత్రిగా అవకాశాలు, అడ్డంకులు రెండూ ఉంటాయి. ఆయన విధానాలను వ్యతిరేకించి, అమలుపరచని రాష్ట్ర ప్రభుత్వాలు – ప్రధాన అడ్డంకి అవుతాయి. సంకుచిత జాతీయ వాదం (నేషనలిజం)లో కొట్టుకుపోకపోతే మాత్రం ఆర్థిక విధానాల వరకు 1992 తిరిగి సాక్షాత్కరించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ప్రభుత్వాలు జోక్యం చేసుకోకపోతే – ఇప్పుడున్న పేదరికం దానంతట అదే రూపుమాయడానికి పదేళ్ళు చాలు. కానీ పేదరికాన్ని మాత్రమే నమ్ముకుని రాజకీయం చేసే పార్టీలు చూస్తూ ఊరుకోవు. కొంత సంపద సృష్టి జరగ్గానే మళ్ళీ సోషలిస్టు కూనిరాగాలు తీయడం మొదలు పెడతాయి. 2004ను పునరావృతం చెయ్యడానికి ప్రయత్నిస్తాయి. సత్యాన్ని గ్రహిద్దాం, పదిమందికీ తెలియజెబుదాం. స్వేచ్ఛా ప్రియులకు అదే ఇన్సూరెన్సు పాలసీ.

02-02-2014

ఉగాదులు, ఉషస్సులు ఉన్నాయ్

గత వారం పదిరోజులుగా జరుగుతున్న పరిణామాలు తీవ్ర భావోద్వేగాలకు, ఒక రకమైన నిస్పృహతో కూడిన గందరగోళానికి లోనుచేస్తున్నాయి. కానీ సూక్ష్మంగా పరిశీలించి చూస్తే ఇవేమీ ఊహించనివి, ఊహించలేనివేం కావు. ప్రజాస్వామ్యమని, స్వపరిపాలన, సర్వసత్తాక పార్లమెంటరీ గణతంత్ర రాజ్యాంగ వ్యవస్థ అనే పేర్లతో మనజుట్టంతా తీసుకెళ్ళి రాజ్యం చేతిలో పెట్టాక - మనం ఎప్పుడో నిస్సహాయులం అయిపోయాము. ఒకసారి ఏర్పడ్డాక, దాని పరిధి నుంచి తప్పించుకోలేని గుత్తాధికారాలు కట్టబెట్టిన ఏ వ్యవస్థ అయినా ఇలాగే ప్రవర్తిస్తుంది.

ముందుగా సుప్రీంకోర్టు విషయానికొద్దాం. రాజ్యాంగం, చట్టాలకు అర్థ నిర్ణయం చెయ్యడం; వ్యక్తులు, సంస్థలు, వ్యవస్థలు చేసే చర్యలు వాటికి లోబడి ఉన్నాయా లేవా అన్న వివాదాలపై తీర్పులివ్వడం దాని విధి. రాష్ట్రంలో, దేశ రాజధానిలో, పార్లమెంటులో ఇంత గొడవకు కారణమైన కేంద్ర ప్రభుత్వ నిర్ణయాల రాజ్యాంగ బద్ధతను ప్రశ్నిస్తూ ఎంతోమంది, ఎన్నోసార్లు సుప్రీంకోర్టు తలుపుతట్టినా ఇంకా పరిపక్వ దశకు రాలేదని కేసును పక్కకు పెట్టడం ఎంతవరకు సమంజసం? మరోపక్క అదే కోర్టు ఢిల్లీలో ఒక ఈశాన్య రాష్ట్ర యువకుడి మరణాన్ని సుమోటోగా స్వీకరించి కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. వారిని ప్రశ్నించే అధికారం ఎవరికీ లేదు.

ఇక పార్లమెంటులో జరుగుతున్న తంతు అందరూ చూస్తూనే ఉన్నారు. సంప్రదాయాలన్నీ మంటగలిసిపోయాయి, ప్రజాస్వామ్యం అపహాస్యం పాలైంది అనే వారంతా - కొన్ని విషయాలు జ్ఞాపకం చేసుకోవాలి. ఎన్డీయే హయాంలో కార్గిల్ యుద్ధానంతరం శవపేటికల కొనుగొళ్ళలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలతో అప్పటి రక్షణ మంత్రి జార్జి ఫెర్నాండెజ్ మాట్లాడినప్పుడల్లా సభ నుంచి వాకౌట్ చేసే

కొత్త సంప్రదాయాన్ని కాంగ్రెస్ పార్టీ అవలంబించింది. అప్పటి లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీ నాయకురాలు సోనియా, రాజ్యసభలో మన్మోహన్ సింగ్ అధికారంలోకి వచ్చాక పోనీ దాని సంగతేమిటో నిగ్గుతేల్చారా? అవకతవకలు బయటపెట్టారా? ఎవరినైనా బాధ్యులుగా గుర్తించారా?

ఏదీ లేదు. అలాగే గుజరాత్ అల్లర్ల అనంతరం నెలల తరబడి పార్లమెంటును స్తంభింపచేశారు. ఈ నీతిసూత్రాలు అప్పుడేమయ్యాయి? అణు బిల్లు పాస్ చేయించుకోవడానికి ఎంపీలను నిస్సిగ్గుగా కొన్నారు. సాక్షాత్తు పార్లమెంటులోనే నోట్ల కట్టలు ప్రదర్శించారు. పీవీ నరసింహారావు నిర్వహించిన మైనారిటీ ప్రభుత్వం కూడా ఎప్పటికప్పుడు ఎంపీల కొనుగోళ్ళ ద్వారానే పూర్తికాలం అధికారంలో ఉండగలిగింది. ఇప్పటికే నల్లగా మసిబారి పోయిన పార్లమెంటుకు – ఇంకా కొత్తగా అంటుకునే కళంకాలు ఏమైనా మిగిలున్నాయా? గురువారం లోక్‌సభలో వాస్తవానికి ఏం జరిగిందో అందరూ చూశారు కాబట్టి; దాన్ని గురించి ప్రత్యేకంగా వ్యాఖ్యానించడం అనవసరం. అంతకు ముందురోజే విడుదల చేయాల్సిన లోక్‌సభా కార్యకలాపాల బులిటెన్‌లోను, మధ్నాహ్నం పన్నెండు గంటలకు వెలువడే దాన్లోనూ కూడా ఎక్కడా పొందుపర్చని తెలంగాణ బిల్లు ప్రవేశపెట్టే అంశం – ఆకస్మికంగా సభముందుకు తేవడంలో స్పీకర్ పాత్ర ప్రశ్నార్థకం. దొడ్డిదారి వ్యవహారాలను అనుమతించిన వారు – పార్లమెంటరీ విలువలను గురించి వ్యాఖ్యానించడం హాస్యాస్పదం.

ఇదంతా ఎందుకు చెప్పుకోవలసి వస్తోందంటే, ఏ ఒక పక్షాన్నో సమర్థించడానికి కాదు. అసలు మనం కొత్త దేవుళ్ళలాగా పూజిస్తున్న రాజ్యాంగం, పార్లమెంటు, వాటి వివిధ వ్యవస్థలు మన పూజకు అర్హత లేనివి. అనవసరంగా మన భావోద్వేగాలను వాటి గురించి ఆలోచిస్తూ తగలెయ్యడం మానుకోవాలి. ఈ వ్యవస్థల నిజస్వరూపాన్ని–వాటి నగ్నరూపంలో గుర్తించి, తదనుగుణంగా, హేతుబద్ధంగా ఆలోచించుకోవాలి. పార్లమెంటులో వచ్చే వారం జరగబోయే పరిణామాలు కూడా వివిధ పార్టీల స్వప్రయోజనాలపై ఆధారపడి మాత్రమే జరుగుతాయి. అసలు విభజన కోరిక, దాన్ని పెంచిపోషించిన వారి ఉద్దేశాలన్నీ రాజకీయపరమైన వైనప్పుడు ఈ విషయంలో అంతిమ నిర్ణయాలు రాజకీయాలకతీతంగా జరగాలని ఎలా ఆశిస్తాం?

కాబట్టి కానివ్వండి, ఏం జరిగినా సిద్ధపడాల్సిందే. కాకపోతే నిర్ణయానంతరం ప్రజలు ఈ ప్రక్రియనంతా సహేతుకంగా విశ్లేషించుకుని భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్ణయించుకోవాల్సి ఉంటుంది. మమ్మల్ని కూడా పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లాగా వేరే దేశంగా

విడదీయండని టీడీపీ ఎంపీలు చేసిన ప్రకటన – భవిష్యత్‌లో రాబోయే ఆలోచనలకు అద్దం పడుతోంది. పరిపాలనా సౌలభ్యం కోసం చిన్న రాష్ట్రాలు కోరుకునేవారు మరింత సౌలభ్యం కోసం చిన్నదేశాల ఏర్పాటును వ్యతిరేకించలేరు. తెలుగువాళ్ళు రెండు రాష్ట్రాలుగా ఉంటే తప్పేమిటనే వారు కూడా భారతీయులు రెండు దేశాలుగా ఉండడాన్ని తప్పు పట్టరు. ఇక దోపిడీ సిద్ధాంతాలు, అణచివేత ఆరోపణలు ఉత్పత్తి చెయ్యడానికి రాజకీయ పార్టీల కర్మాగారాలు ఎప్పుడూ సిద్ధంగానే ఉంటాయి.

ఆధునిక రాజకీయాల మౌలిక స్వభావమే – ప్రజలను విడదీయడం. ఒకరిని బూచిగా చూపి, ఇంకొకరిని చేరదీసి, ఒకర్ని కొట్టి, ఇంకొకరికి పెట్టి, ఆ క్రమంలో గుట్టుచప్పుడు కాకుండా కొంత భాగం స్వంతానికి లాగించెయ్యడమే – రాజకీయం. అందుకోసం ప్రజలను కులాలుగా, మతాలుగా, వర్గాలుగా ఎప్పటికప్పుడు కొత్త ప్రాతిపదికలపై విభజించి, పాలించడమే రాజకీయ చతురత, సృజనాత్మకత. ఇప్పుడు ప్రాంతాలుగా విడదీస్తున్నారు. ఇందులో కొత్తగానీ, ఆశ్చర్యపడాల్సింది కానీ లేదు. ధర్మాధర్మ మీమాంసకు అసలే తావులేదు. విభజించి, పాలించడంపై బ్రిటిష్ వారికి పేటెంటు హక్కేమీ లేదు.

ఏ రాజకీయ నాయకుడైనా – ప్రజాసేవకుడిగా కనిపిస్తే, మన కళ్ళను పరీక్షించుకోవాల్సిందే. చివరికి ఉవ్వెత్తున ఎగసి క్రింద పడిన ఆమ్ ఆద్మీ పార్టీ కూడా దీనికతీతం కాదు. తాము చేసిన అసంబద్ధ, అశాస్త్రీయ, అసాధ్యమైన హామీలను నెరవేర్చలేమని తెలుసుకోవడం ఒకవైపు; ఒక రకమైన అనాలోచిత సానుభూతి ద్వారా పార్లమెంటు ఎన్నికలలో దేశావ్యాప్తంగా ప్రభంజనం సృష్టించాలనే ఆశ ఒకవైపు ప్రేరేపించగా – తమ ప్రభుత్వాన్ని కావాలని తామే కూలగొట్టుకోవడం – ఈ కొత్త సినిమా ఇతివృత్తం.

కేంద్ర ప్రభుత్వం తీసుకున్న గ్యాసు ధరల పెంపు నిర్ణయం ఢిల్లీలో జరిగింది కాబట్టి, రాష్ట్ర ప్రభుత్వం తరపున ఏసీబీ విచారణకు ఆదేశించడం హాస్యాస్పదం. గ్యాసు ధరల పెంపులో రాజకీయ, అవినీతి కోణాలు లేవని కాదు. కానీ ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వానికి ఈ విషయంలో అధికార పరిధి లేదు. అలాగే, జనలోక్‌పాల్ బిల్లు ప్రవేశపెట్టే ముందు కేంద్ర ప్రభుత్వ అనుమతి తీసుకోవాలన్నది – అమలులో ఉన్న చట్టం. దానిని అతిక్రమించి, అక్రమంగా బిల్లు ప్రవేశపెట్టే ప్రయత్నం చెయ్యడం ఒక రాజకీయ క్రీడ తప్ప; దానికి నైతికత లేదు. ముకేష్ అంబానీ మీద కేసు పెట్టాం కాబట్టి కాంగ్రెస్, బీజేపీ కలిసి జనలోక్‌పాల్ బిల్లును అడ్డుకున్నాయన్న ప్రచారంతో; అసలే రాజకీయాలంటే విరక్తితో ఉన్న అమాయక ప్రజలను మభ్యపెట్టి, పార్లమెంటు ఎన్నికలలో ఓట్లు పొందాలనుకోవడం నగ్న, దుర్మార్గ రాజకీయాలకు పరాకాష్ట.

ఏదిఏమైనా వర్తమాన రాజకీయ పోకడలను చూసి పొందే ఆందోళన నిస్పృహకు దారితీయకూడదు. ఈ దుర్మార్గాలకు దశాబ్దాల క్రిందటే బీజం పడిందన్న సత్యాన్ని

గ్రహించాలి. అపరిమిత అధికారాలిచ్చి - రాజ్యవ్యవస్థను ఏర్పరచుకోవడంలోనే తప్పుచేశాం. దానికి ప్రజాస్వామ్యమనే ముద్దుపేరు పెట్టుకుని; ఓట్ల రాజకీయాలకు - లేని గౌరవం ఆపాదించాం. రాజకీయ నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ ఉద్యోగులు ఇలా లెక్కలేనంత మంది - కష్టపడకుండా, పరాన్న జీవులుగా, సంపాదించే వారి మీద పడి బ్రతికే అవకాశం కల్పించాం. జరిగిన తప్పులు సరిదిద్దుకోవడం కూడా మన చేతుల్లోనే ఉంది. వ్యక్తి సర్వ స్వతంత్రుడవ్వాలంటే గుత్తాధికార రాజ్య వ్యవస్థల పట్ల భ్రమలు తొలగించుకోవాలి. మనకు ఉగాదులున్నాయ్... ఉషస్సులున్నాయ్. కానీ ఈ పూటకు జరిగిపోతే చాలులే, ప్రక్కింటివాడి కరెంటు ఖర్చుతో, వాడి లైటు వెలుతురులో మన పని కానిచ్చేద్దాం అనుకుంటే మాత్రం ఎప్పటికీ టేబుల్ ఐటంగానే మిగిలిపోతాం.

16-02-2014

స్వయం పాలన దిశగా...

చరిత్ర ఒక మలుపు తిరిగింది. తెలుగుజాతికే కాదు, ఇది మొత్తం భారతదేశ రాజకీయాలకు ఒక కీలక మలుపు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, రాష్ట్రపతి, స్పీకర్లు, కేబినెట్, పార్లమెంటు ఉభయసభలు, ప్రధాన ప్రతిపక్షం, ఇత్యాది వ్యవస్థలన్నిటి పట్లా ప్రజలకున్న భ్రమలు ఒకేదెబ్బతో పటాపంచలయ్యే అవకాశం కలిగినందుకు ఒకరకంగా సంతోషించాలి. ఇంకా మిగిలున్న సుప్రీంకోర్టు ముచ్చట కూడా తీరిపోతే తప్ప – ఢిల్లీవైపు చూస్తూ దేబిరించడం మానుకోము. రాచరిక యుగానంతరం మనం ఎంచుకున్న ప్రజాస్వామ్య వ్యవస్థలో నిర్మాణం, భావజాల పరంగా తీవ్రమైన, ప్రమాదకరమైన లొసుగులున్నాయన్న విషయం ఇంతకు ముందు విపులంగా చర్చించుకున్నాం. ఆ సిద్ధాంత పరమైన విశ్లేషణకు – సజీవ ఉదాహరణ రాష్ట్ర విభజన జరిగిన తీరుతెన్నులు.

రాచరిక పాలనల్లో మిగతా లోపాలెలా ఉన్నా, న్యాయపరంగా ప్రాచీన ధర్మాన్ని అనుసరించేవారు. ధర్మాన్ని అమలుచెయ్యడమే రాజ్యం విధిగా ఉండేది. దానికి విరుద్ధంగా ప్రజాస్వామ్య రాజ్యవ్యవస్థలో రాజ్యం చట్టాలను ఉత్పత్తిచేసే కర్మాగారంగా మారిపోయింది. ఆ చట్టాల రూపకల్పనలో ధర్మాధర్మాల మీమాంసకు తావులేదు. మెజారిటీ తోడేళ్ళుచేసే చట్టాలకు మైనారిటీ గొర్రెలు తలవంచాల్సిందే. పార్లమెంటు చివరిరోజుల్లో డజన్ల కొద్దీ చట్టాలను మూజువాణీ ఓటుతో లాగించెయ్యడం దీనికి నిదర్శనం. గత వందేళ్ళలో ఇలా ఉత్పత్తి చేసిన చట్టాలన్నిటినీ పేరిస్తే ఒక గడ్డివామంత అవుతాయి. ఇవన్నీ పశువుల కాపరి నుంచి పార్లమెంటు సభ్యుడిదాకా క్షుణ్ణంగా తెలిసుండాలని అందులోనే ఒక చట్టం చెబుతుంది. ఈవిషయాలు ఎత్తిచూపడమూ నేరమేనని మరో చట్టం ద్వారా నిరూపించొచ్చు. మొత్తానికి చెప్పొచ్చేదేమిటంటే, ఈ 'ఆధునిక' రాజ్యవ్యవస్థలో వ్యక్తులు బానిసలుగా మిగిలిపోయారు. మెజారిటీ యాజమాన్య, గుత్తాధికారాలకు తలవంచక తప్పనిపరిస్థితి ఏర్పడింది.

ఈ బానిసత్వం నుంచి బయటపడి విముక్తి పొందాలంటే; వ్యక్తి ముందుగా తానున్న పరిస్థితిని గుర్తించగలగాలి. ఆ తర్వాత, రాజ్య వ్యవస్థలోని ఒక్కొక్క భాగాన్ని, అంగాన్ని విసిరిపారేస్తూ రాజ్యాన్ని 'అనిర్మాణం' (deconstruct) చెయ్యాలి. ఆచరణాత్మకంగా ఆలోచిస్తూ మొదట కేంద్రం, తర్వాత రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలను, పరిమాణాన్ని క్రమక్రమంగా కుదిస్తూ, వాటి నిర్మూలనే అంతిమ లక్ష్యంగా ముందుకు సాగాలి. ఇది ఒక్కరోజులోనో, కేవలం కొంతమంది వల్లో సాధ్యపడేది కాదు. కొన్ని తరాల పాటు మనుషుల మేధను ఈ ఆలోచన ప్రభావితం చేసి, అహింసాత్మక భావ సంఘర్షణలు జరిగితే తప్ప మనిషికి రాజ్యం చెరనుంచి విముక్తి దొరకదు. మొదటి అడుగు వేయాల్సిన మంచి సమయం, అవకాశం మనముందుకొచ్చాయి.

ఇక తక్షణ సంబంధ విషయాలకొస్తే; తెలంగాణ, అవశేష ఆంధ్రప్రదేశ్‌లు రెండూ – తమ అభివృద్ధి, భవిష్యత్తుల కోసం కేంద్ర ప్రభుత్వం వైపు చూడడం మన భావ దారిద్ర్యాన్ని సూచిస్తోంది. అంతపెద్ద కోస్తా తీరముందని ఒకరంటే; సామాజిక తెలంగాణను పునర్నిర్మించాలని మరొకరంటారు.

అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో కోస్తా తీరం లేదా? సామాజిక తెలంగాణ నిర్మించకుండా ఎవరు అడ్డుకున్నారు? కొత్తగా ఏర్పడే రెండు రాష్ట్రాల్లోనూ అభివృద్ధి జరుగుతుందా, అల్లకల్లోలమవుతాయా అనేది అక్కడ రాబోయే ప్రభుత్వాల తీరుపై ఆధారపడుతుంది. కొన్ని కేంద్ర ప్రభుత్వ సంస్థల ఏర్పాటు వల్లనో... విదిల్చే కాసుల వలనో అభివృద్ధి జరగదు. సహజ వనరులు కొంతవరకు తోడ్పడతాయి గానీ అభివృద్ధికి అవి ముందస్తు షరతులు కావు. అన్నిటికంటే విలువైన సహజ వనరు – మనుషులు. నాగరికత మనిషి వల్ల వచ్చింది తప్ప, భూమి, అడవులు, చమురు, చేపల వల్ల కాదు. ఏ సహజ వనరులున్నాయని ఇజ్రాయిల్ అభివృద్ధి చెందింది? ఏం తక్కువైందని ప్రక్కనే ఉన్న ఇరాక్ రోజూ రక్తమోడుతోంది?

సంపద సృష్టికి కావలసింది మానవ మేధస్సు, దానికి స్వేచ్ఛ, మనిషి సంపాదనను సామాజిక న్యాయం వంటి రకరకాల పేర్లతో దోచుకోబోరనే భద్రత. మనిషికి స్వేచ్ఛనిస్తే ఆకాశంలో ఎగురగలడు, రకరకాలచట్టాలు, నిబంధనల్లో బంధిస్తే కీలుబొమ్మలా బ్రతుకు ఈడవగలడు. ప్రజలముందున్న ప్రశ్న ఒక్కటే. మనపని మనల్ని చేసుకుని, సంపాదించుకొని, బాగుపడనిచ్చే ప్రభుత్వాన్ని ఆహ్వానించడమా; లేక సంపాదించిన వారి దగ్గర్నుంచి దోచుకొచ్చి, కొంత తాను తిని, మిగతాది తమకు పప్పు, బెల్లాల్లా పంచిపెట్టేవారిని ఎన్నుకోవడమా – అనేది నిర్ణయించుకోవాలి. దానిపైనే సమాజ భవిష్యత్తు ఆధారపడుతుంది.

వివరాల్లోకి వెళితే, సముద్రంలో కలుస్తున్న గోదావరి జలాలను ఉపయోగించుకోవడానికి ఇప్పటిదాకా ఉన్న ఒకే ఒక అడ్డంకి రాజకీయాలు.

ఇన్నాళ్ళూ పోలవరం ప్రాజెక్టును నిర్వాసిత గిరిజనుల పేరుతో తానే అడ్డుకున్నానని జైరాం రమేష్ చెప్పినట్లు వార్తలొచ్చాయి. ఈ రాజకీయాలు అడ్డులేకపోతే, పోలవరం కట్టినా, కట్టకున్నా ఎత్తిపోతల ద్వారానైనా గోదావరి నీటిని ఉపయోగించుకునే వీలుంది. దానిక్కావలసిన కరంటును ఉత్పత్తి చెయ్యడానికి, విద్యుత్ కేంద్రాలు నెలకొల్పడానికి, బొగ్గు లింకేజీలకు, ఉత్పత్తి చేసిన విద్యుత్తును డబ్బు కట్టే వారికే అమ్ముకోవడానికి మళ్ళీ రాజకీయాలు.... ప్రభుత్వాలే అడ్డంకి. పండించిన ధాన్యాన్ని ఎగుమతి చెయ్యలేకపోవడానికీ ప్రభుత్వ ఆంక్షలే కారణం. ఫ్రాన్సు, జపాన్ వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో డెబ్భైశాతం విద్యుత్ అవసరాలను తీరుస్తున్న అణు విద్యుత్ కేంద్రాలను నెలకొల్పనీయకుండా చేయడానికి ప్రభుత్వాలు, ప్రాయోజిత ఉద్యమాలే కారణం. విద్యుత్ సరిపడా ఉత్పత్తి చేయగలిగితే గోదావరి జలాలతో కోస్తా అంతా సాగునీరు అందించగలం. కృష్ణానది నీటిని పూర్తిగా రాయలసీమకు తరలించే వీలుంది.

అలాగే విద్య, వైద్య విషయాలకొస్తే, కేంద్ర ప్రభుత్వం విదిల్చే సంస్థల కోసం ఎదురుచూడాల్సిన అవసరం ఏమాత్రం లేదు. అవినీతి పంకిలమైన ఏఐసీటీఇ, ఎమ్‌సీఐ లాంటి సంస్థల నియంత్రణల నుంచి విముక్తి పొందగలిగితే చాలు. విద్యా సంస్థలను లాభాలు ఆశించే పెట్టుబడి కేంద్రాలుగా గుర్తిస్తే చాలు. పాశ్చాత్య విద్యాసంస్థలతో ఒప్పందాలు చేసుకోనిస్తే చాలు. ఇవి చెయ్యడానికి పైసా ఖర్చవదు. కాకపోతే ప్రభుత్వాలు వాటిపై పెత్తనం కోల్పోతాయి.

కాలంచెల్లిన కార్మిక చట్టాలు, కేవలం దేశీయ పరిజ్ఞానం, పెట్టుబడులతో పారిశ్రామికీకరణ జరగదు. ఇంత హెచ్చుస్థాయిలో ఉన్న పన్నులూ పెట్టుబడులకు ఆటంకమే. మనుషుల తర్వాత అత్యంత విలువైన సహజవనరు – కాలం. ఒకసారి పోతే తిరిగిరాదు. మౌలిక సదుపాయాల కోసం, రకరకాల అనుమతుల కోసం ప్రభుత్వాల చుట్టూ తిరగడంలో ప్రాజెక్టుల ప్రణాళికలు, పరిశ్రమల పెట్టుబడుల రూపురేఖలు, లాభదాయకతలు మారిపోతాయి. ఈ నిస్సహాయతను అడ్డంపెట్టుకునే రాజకీయ నాయకులు మరిన్ని నియంత్రణలు విధిస్తూ ప్రతి పైసా పెట్టుబడీని తమ చెప్పుచేతల్లో ఉంచుకునే ప్రయత్నం నిరంతరంగా, నిరాఘాటంగా, నిస్సంకోచంగా చేస్తూ వచ్చారు.

ఈ మానసికత నుంచి ప్రభుత్వాలు, రాజకీయాలు తమంతట తాము బయటపడలేవు. సరైన దృక్పథంతో ఆలోచించగలిగే ప్రజలే ఎన్నికల సమయంలో తమ

నిర్ణయాల ద్వారా మెల్లగానైనా సరే మార్పు తీసుకురాగలగాలి. అందరూ దొంగలేననే నిస్పృహకు లోనుకాకుండా తక్కువ ప్రమాదకారులను ఎన్నుకోవాలి. అవశేష ఆంధ్రప్రదేశ్‌లాగే తెలంగాణలోనూ అభివృద్ధికి అపార అవకాశాలున్నాయి. ప్రభుత్వం సృష్టించే ప్రతి ఉద్యోగం వెనుక – అదే డబ్బుతో ప్రైవేటు రంగంలో సృష్టించకుండా పోయిన ఉద్యోగాలు కనీసం రెండుంటాయి. ప్రభుత్వ నిర్ణయాల పర్యవసానాలు కంటికి కనిపించకుండా ఒకదానికొకటి పెనవేసుకుపోతాయి.

ఉదాహరణకు వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు కరంటు – కొరతకు దారితీస్తుంది, తీసింది. దాంతో ఐదు హార్స్‌పవర్ పంపు సరిపోయే చోట ఇరవై హార్స్ పవరు పంపు బిగించాల్సి వస్తోంది. అంత ఖరీదైన పంపు రోజుకు పద్దెనిమిది గంటలు వృధాగా పడుండాల్సిందే. ఈ ఉచిత విద్యుత్తు భారం – అగ్గిపుల్ల, సబ్బుబిళ్ళ లాంటి ఇతర వస్తువుల ధరలపై పడుతుంది. ఇన్ని సబ్సిడీలు పొందే రైతు; తను పండించిన ధాన్యాన్ని ఎగుమతి ఎందుకు చేసుకోనివ్వరని ప్రశ్నించే నైతిక స్థైర్యం కోల్పోతాడు. ఇన్ని చిక్కుముడులున్న ఆధునిక ఆర్థిక వ్యవస్థను సులువుగా అర్థమయ్యేలా సామాన్యులను ఆలోచింపజేయడం – బుద్ధిజీవుల మానవీయ కర్తవ్యం. రాజకీయాలు సృష్టించిన ఈ చారిత్రాత్మక మలుపు నుంచి విజేయులుగా ముందుకెళ్దాం. తెలుగు జాతికి చేసిన దుర్మార్గాలు, అన్యాయాలకు అదొక్కటే సరైన శిక్ష. స్వయం పాలనతోనే సరైన భవిష్యత్తు.

02-03-2014

విభజనకు అటు, ఇటు

ప్రతి మనిషీ రోజూ కొన్ని వందల నిర్ణయాలు తీసుకుంటాడు. లేవగానే కాఫీ తాగాలా లేక టీ తాగాలా అనే విషయం దగ్గర్నుంచి, దాదాపు ప్రతి నిమిషం ఎదుట ఉన్న పలు ఛాయిస్‌లలో నుంచి ఏదో ఒకటి ఎంచుకోక తప్పని పరిస్థితి ఎదుర్కొంటూ ఉంటారు. చిన్న చిన్న విషయాలను పక్కన పెడితే, మనిషి జీవితాన్ని ప్రభావితం చేసే పెద్ద నిర్ణయాలను ఎంత విజ్ఞతతో, ముందుచూపుతో తీసుకుంటామో దానిపైనే భవిష్యత్తు ఆధార పడుతుంది. గడియారం ముల్లు వెనక్కు తిరగదు. చౌరస్తాలో నిలబడినప్పుడు ఏదో ఒకదారి ఎంచుకోవలసిందే తప్ప రెండు దారుల్లోనూ ఒకేసారి ప్రయాణించ లేము. కొంత దూరం వెళ్ళి తప్పయిపోయిందనుకుని వెనక్కు వచ్చినా, ఈలోపు మిగతా ప్రపంచమంతా మారిపోతుంది.

ఈ రోజు విభజన రేఖకు అటూ ఇటూ ఉన్న తెలుగు ప్రజలు – చరిత్ర చౌరస్తాలో నిలబడ్డారు. వ్యక్తిగతం నుంచి సామాజికం దాకా, వ్యక్తులు తీసుకునే నిర్ణయాలపైనే వారి వారి భవిష్యత్తు ఆధారపడుతుంది. తెలంగాణ రానంతకాలం దాని కోసం తహతహ లాడిన వారు సైతం చెయ్యి తెగిపడ్డట్టు, ఏదో కోల్పోతున్నట్టు అస్పష్టమైన భయాందోళనలకు లోనవుతున్నారు. మరోపక్క సమైక్యత కోసం నిద్రలేని రాత్రులు గడిపినవారు – తమ వాదం ఓడిపోవడాన్ని జీర్ణించుకుంటూ, ఈ పరిస్థితికి కారణమైన అంశాలన్నిటిపైనా కసిగా యుద్ధానికి సిద్ధమవుతున్నారు. విభజన మూలంగా వచ్చిన కొత్త రాజకీయ, రాజ్యాధారిత అవకాశాలను అందుకోవాలనే రేసులో ఉండేవారు ఎలాగూ ఉన్నారు. ఏది ఏమైనా జరిగిపోయింది తిరిగి రాదు.

తెలంగాణ సమస్య ఏదో ఒక కొలిక్కి వచ్చింది కాబట్టి హైదరాబాదు నగరంతో సహా తెలంగాణ అంతా అభివృద్ధిలో దూసుకుపోతుందనే ఆశావహ వాతావరణం కనబడడం లేదు. హైదరాబాదు, చుట్టుపక్కల భూములు ధరలు రెక్కలు విప్పుకోలేదు

సరికదా, ఇప్పటికే ఉన్న అధో స్థాయి నుంచి ఇంకా దిగజారిపోయే సూచనలు కనిపిస్తున్నాయి.

దీనికి ఎన్నో కారణాలున్నాయి. ఒకటి – రాజకీయ అస్పష్టత. అధికారంలోకి రాబోయేది జాగో, భాగో పార్టీలో; లేక – తెచ్చిన, ఇచ్చిన పార్టీలో..., లేక సమన్యాయ పార్టీలో లేక... వారి పొత్తుల కూటములో తెలియని పరిస్థితి. కొత్తగా ఏర్పడిన రాష్ట్రం కాబట్టి మొదట కొన్నిసార్లు అధికారంలోకి వచ్చే ప్రభుత్వాల విధానాల మీద అన్ని అంశాలూ ఆధారపడతాయి. తెలంగాణలో ఉన్న ప్రధాన పార్టీలలో భావసారూప్యత తక్కువ ఉండడంతో, ఆ పార్టీలను సమర్థించేవారు, వ్యతిరేకించేవారు ప్రభుత్వం నుంచి, రాజ్యం నుంచి ఆశించే విషయాల్లో చాలా భిన్నత్వం, వైరుధ్యం ఉంది. కాబట్టి ఏ పార్టీ, లేదా కూటమి గెలుస్తుందో తెలియని స్థితిలో అభివృద్ధి చోదకశక్తులు స్తబ్ధంగా ఉన్నాయి.

రెండోది – భావజాల అస్పష్టత. ఒకవైపు మావోయిస్టులు మొదలుకుని, చిన్నా పెద్ద విప్లవ, మామూలు కమ్యూనిస్టు పార్టీలు, మరోవైపు మతం ఆధారిత పార్టీలు నవ తెలంగాణలో పోషించబోయే పాత్రపై ఇంకా స్పష్టత రాలేదు. బీజేపీ 1997లో కాకినాడ తీర్మానం చేయడానికి ముందే, ప్రత్యేక తెలంగాణ నినాదం ఇచ్చిన మావోయిస్టుల ప్రాబల్యం మొదట గ్రామీణ ప్రాంతాల్లో, తర్వాత పట్టణాల్లో ఎంతమేరకు వ్యాపిస్తుందో ఇప్పటికింకా తెలియదు. అదీగాక మావోయిస్టు సిద్ధాంతాలే తెలంగాణ పునర్నిర్మాణానికి మార్గదర్శకాలు కావాలని నిజాయితీగా, బలంగా నమ్మేవారు – తెలంగాణ మేధావుల్లో అత్యధికంగా ఉన్నారు. ఉద్యమ సమయంలో ఇచ్చిన హామీలు, సృష్టించిన భవిష్యత్ చిత్రాలు, స్వప్నాలు కూడా ఆ దిశలోనే ఉన్నాయి.

మూడోది పాలనా వ్యవస్థ విషయంలో సందిగ్ధత. ఇప్పటికే ఉమ్మడి రాజధానిలో శాంతి భద్రతలు, మరికొన్ని అంశాలపై గవర్నరు విశేషాధికారాల రాజ్యాంగ, చట్టబద్ధతలు ప్రశ్నార్థకంగానే ఉన్నాయి. మరోవైపు ప్రభుత్వోద్యోగుల పంపకం ఎలా జరుగుతుందో ఎంతమంది ఏ ఆప్షన్‌ను ఎంచుకుంటారో తెలియదు. అసలు ప్రజలకు దూరంగా సీమాంధ్ర ప్రభుత్వం హైదరాబాదులో ఎన్నాళ్ళుంటుందో ఇప్పుడే చెప్పలేం. ప్రభుత్వం అంచెలంచెలుగానైనా సీమాంధ్రకు తరలిపోతే, దానితోపాటు ప్రభుత్వోద్యోగులు, ప్రభుత్వాధారితంగా పనిచేసే వ్యక్తులు, సంస్థలు కూడా వెళ్ళిపోతే, దాని ప్రభావం హైదరాబాదుపై తప్పకుండా ఉంటుంది. ఉద్యమ సమయంలో చేసిన బెదిరింపులను నిజంగా అమలుచేస్తే, అంతర్గత కాందిశీకుల సమస్య, దాని ప్రభావం ఆర్థికంగాను, రాజకీయంగాను ఎదుర్కోక తప్పదు.

కొత్తగా ఏర్పడినప్పుడు అన్ని ఆర్థిక సూచికలలోను బీహార్ కంటే ఎంతో బలంగా ఉన్న జార్ఖండ్ రాష్ట్రం; పదేళ్ళలోనే తీవ్రమైన రాజకీయ అస్థిరతకు, అదుపులేని మావోయిస్టు

ప్రాబల్యానికి, అత్యంత అవినీతిమయమైన పాలనకు దారితీయడం, వీటన్నిటి కారణంగా ఆర్థిక వ్యవస్థ దిగజారిపోవడం యాదృచ్ఛికం కాదు. అలాగే, ఒకప్పుడు ప్రపంచ మహా నగరాల్లో ఒకటైన డెట్రాయిట్, కార్ల తయారీ పరిశ్రమల్లోని కార్మిక సంఘాల గుత్తాధిపత్యానికి తలొంచి, సృజనాత్మకత, పోటీతత్వం కోల్పోయి, ఇప్పుడొక శిథిల నగరంగా మన కళ్ళముందే మారిపోయింది. మున్సిపల్ పన్నులు కట్టగలిగితే చాలు, ఇళ్ళు ఉచితంగా ఇచ్చే పరిస్థితి నెలకొంది.

నగరాలు, పరిశ్రమలు, భవంతులు, వాటంతట అవే భూమిలోంచి పుట్టుకురావు. ఒకసారి వచ్చాక వాటంతట అవే నడవవు. వాటిని దర్శించి, సృజించి, నిర్మించేది మనుషులు. అటువంటి ఉత్పాదక సమూహాలను ఉన్నవారిలోంచి తయారు చేసుకుంటూ, బయట నుంచి కూడా వచ్చేలా ఆకర్షించగలిగితేనే అభివృద్ధి సాధ్యం. కొత్త ఆలోచనలు, పెట్టుబడులతో బయటివారు రావడం ఆగిపోతేనే అభివృద్ధి స్తంభిస్తుంది. అలాంటిది ఉన్నవారినీ వెళ్ళగొట్టుకోవడం, వెళ్ళాల్సిన పరిస్థితులు కల్పించడం ఆత్మహత్యా సదృశ్యం.

అటువైపు సీమాంధ్రలోనూ రాబోయే ప్రభుత్వ పాత్ర అంతే స్థాయిలో ముఖ్యం కాబోతోంది. రాజధాని నిర్మాణం ఒక అనుత్పాదక వ్యయం. ప్రజలసొమ్ముతో కట్టే అత్యద్భుత భవంతులు రాజకీయ నాయకులు, అధికారులు, పైరవీకారుల సౌకర్యార్థమే తప్ప; ప్రజలకు ఒరిగేదేమీ ఉండదు. తర్కం, అనుభవం నేర్పిన పాఠాల నేపథ్యంలో ప్రభుత్వ పరిమాణాన్ని, ప్రభావాన్ని అత్యంత పరిమితం చేసి, జాతి శక్తియుక్తులను ఉత్పాదక రంగాల్లోకి మళ్ళిస్తేనే సమాజహితం కోరినవారవుతారు. ఉద్యమ సమయంలో నమ్మజూపిన లక్ష ప్రభుత్వ ఉద్యోగాలు ఎక్కడున్నాయో కనిపెట్టి; వాటిని నింపాలని తెలంగాణ ఉద్యోగ సంఘాలు డిమాండు చేస్తున్నాయి.

అసలా ఉద్యోగాలు ప్రజలకు అవసరమా లేదా అని ఎవరూ ప్రశ్నించరేం? వారందరి జీతభత్యాల ఖర్చు భరించాల్సింది సామాన్య ప్రజలేగా? దక్షిణ తెలంగాణపై ఉత్తర తెలంగాణ ఆధిపత్యాన్ని సహించమని ఒకరంటే, కాంట్రాక్టు ఉద్యోగుల్ని పర్మనెంటు చేస్తే మాకు ఉద్యోగాలెక్కడ్నుంచి వస్తాయని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. ప్రాంతీయ, ఉప ప్రాంతీయ భావాలు ఒకసారి మొదలైతే విస్తరిస్తూనే ఉంటాయి. అలాగే రాజ్యమంటే పప్పుబెల్లాలు పంచి పెట్టే ధార్మిక సంస్థగా ప్రజలను నమ్మించిన కొద్దీ అందులో భాగస్వామ్యం కోసం తోపులాట పెరుగుతుంది. సీమాంధ్రలోనూ ఉత్తరాంధ్ర, కోస్తా, రాయసీమ అస్తిత్వ ధోరణులు ప్రబలకుండా ఉండాలంటే రాజకీయ, ఆర్థిక వికేంద్రీకరణతో పాటు ప్రజల జీవితాల్లో రాజ్యం పాత్ర అత్యంత పరిమితమవ్వాలి.

రాష్ట్రం విడిపోవడం పట్ల రాజకీయ నాయకులకు వ్యకిగతంగా సంతోషం కలిగినా, బాధ కలిగినా అది కేవలం వ్యక్తిగతం. రాజకీయాలే వృత్తిగా స్వీకరించిన పాత్రధారుడిగా ఇది తనకు రాజకీయంగా ఎలా ఉపయోగపడుతుందనే విషయంపైనే దృష్టి కేంద్రీకరిస్తాడు. కాబట్టి విభజన వల్ల నష్టపోవడమంటూ జరిగితే అది వ్యక్తులకే తప్ప; రాజకీయాలు మొత్తం మీద ఎప్పుడూ నష్టపోవు. ఈ విషయాన్ని గుర్తించి, రాజకీయ నాయకులు చెప్పేమాటలను విజ్ఞతతో విశ్లేషించుకుని, సమాజానికి మంచి చేసే కార్యక్రమంతో ముందుకు వచ్చే వారిని మాత్రమే ఎంచుకోవడం ద్వారా మనల్ని మనం కాపాడుకోవాలి. రాజకీయ నాయకుల స్వప్రయోజనాల నుంచి సమాజాన్ని కాపాడాలి. ఎవరికివారు తమ వయసు, జ్ఞానం, అవగాహనా శక్తులను బట్టి గత పది, ఇరవై, ముప్పై సంవత్సరాల అనుభవాలను గుర్తుచేసుకుంటూ, భవిష్యత్తు చిత్రపటంపై తమకున్న సైద్ధాంతిక స్పష్టతతో సముచిత నిర్ణయాలు తీసుకుంటారని ఆశిద్దాం. చివరకు మన కర్మలకు మనమే బాధ్యులం.

16-03-2014

ఇది ఉద్వేగాల యుగం

గత శతాబ్దిలో 1970-90 కాలాన్ని ఉద్యమాల యుగంగా అభివర్ణిస్తారు. వియత్నాం యుద్ధ వ్యతిరేక ఉద్యమాలు మొదలుకుని, విచ్చలవిడి సంస్కృతి, మాదక ద్రవ్యాల వినియోగంలో మునిగితేలే హిప్పీయిజం ఒకవైపు; హంగేరీలో జరిగిన తిరుగుబాటు - అణచివేత, చైనాలో వెర్రితలలు వేసిన సాంస్కృతిక విప్లవం గాలులు హిమాలయాలు దాటి నక్సల్బరీ, దాని వివిధ రూపాలలో రాజకీయ, సాంస్కృతిక ఉద్యమాలు మరోవైపు- ప్రపంచాన్ని ఒక ఊపు ఊపాయి. స్వభావ స్వరూపాలు వేరైనా అది ఉద్యమాల యుగమే. 1989-90 నుంచి బెర్లిన్ గోడ బద్దలవడంతో మొదలై; కమ్యూనిస్టు ప్రభుత్వాలు - ఒకదాని తర్వాత మరొకటిగా కుప్పకూలాయి. సమకాలీన చరిత్రకారులు కొందరు అత్యుత్సాహంతో 'ఇంకేముంది, చరిత్ర పరిసమాప్తమయింది. ప్రజాస్వామ్యం, పెట్టుబడిదారీ వ్యవస్థ అంతిమ విజయం సాధించాయి' అని నిర్ధారించేశారు. ఇతర చాలా సందర్భాలలో లాగే ఇదొక తప్పుడు అవగాహన. ఓడింది కమ్యూనిజమే, కానీ గెలిచింది కేపిటలిజం కాదు.

ఆ తర్వాత ఇరవై యేళ్ళ కాలంలో రాజ్యం మరింత బలపడింది. ఏక ధ్రువ ప్రపంచానికి అధిపతి అయిన అమెరికా పెత్తనం నమూనాగా, ప్రపంచమంతటా ప్రజా వ్యవహారాలన్నిట్లోనూ రాజ్య ప్రభావం అంతకంతకూ పెరుగుతూ వచ్చింది. రిజర్వు బ్యాంకులు, రుణ వ్యవస్థలు స్టాక్, ఫైనాన్షియల్ మార్కెట్ల ద్వారా సామాన్యుల ఊహకందని రీతిలో, స్థాయిలో డబ్బు సృష్టించి, ఎడతెగని ద్రవ్యోల్బణం, ఆర్థిక బుడగల సృష్టి..., అవి పేలడంతో కలిగిన సంక్షోభం. మళ్ళీ మళ్ళీ పునరావృతమవుతూ సామాన్యుడి జీవితంతో రాజ్యం చెలగాటమాడింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో వచ్చిన విప్లవం ప్రజలకెంత మేలు చేసిందో; ప్రజల ఆదాయ, వ్యవహారాల మీద రాజ్యం పిడికిటిని కూడా అంతకంటే ఎక్కువే బలోపేతం చేసింది. ఆ మృగ బలంతో ఇరాక్ యుద్ధం, యుగోస్లావియాను

ముక్కలు చెయ్యడం, నాటో విస్తరణ, డాట్‌కామ్ సంక్షోభం, గృహరుణ ప్రేరిత సంక్షోభం, ఇస్లామిక్ తీవ్రవాదం, దానిమీద యుద్ధం పేరుతో దేశాల సార్వభౌమత్వం, ప్రజల ప్రైవసీ ప్రశ్నార్థకంగా మారడం – మన కళ్ళముందే జరిగింది.

ఈ ఇరవైయ్యేళ్ళు ప్రసార మాధ్యమాల యుగం. అబద్ధాలను, అర్ధ సత్యాలను నిజమని నమ్మించడానికి, వాస్తవాలపై కేంద్రీకృతమవకుండా ఎప్పటికప్పుడు ప్రజల దృష్టి మరల్చడానికి ప్రసార మాధ్యమాలు రాజ్యానికి మంచి సాధనంగా ఉపయోగపడ్డాయి. మరింత బలపడ్డ రాజ్యానికి బలమైన మీడియా తోడయ్యింది.

ఇప్పుడు నడుస్తున్నది ఉద్వేగాల యుగం. ఆర్థికంగానూ, చట్టపరంగానూ బలిసిపోయిన రాజ్యం కబంధ హస్తాల్లో చిక్కుకుపోయిన సామాన్యులు – ఈ చీకట్లో ఎటు పోవాలో దారి తెలియక ఉద్వేగాలకు లోనవుతున్నారు. చిన్నా, పెద్దా ఉద్యమ రూపాల్లో రోడ్డెక్కుతున్నారు. అసలు సమస్యను, శత్రువును గుర్తించే సైద్ధాంతిక స్పృహ కొరవడి ఎదురుగా కనిపించే 'సులభ శలభాల'పై లంఘిస్తున్నారు. అదే పరిష్కారమని భ్రమిస్తున్నారు. కారణమేదో, పరిణామమేదో తెలుసుకోకుండా మిణుగురు పురుగుల వెంట పరిగెత్తుతున్నారు. ఇది కూడా ప్రపంచ వ్యాప్తంగా జరుగుతూ...; మన దేశానికి, మన రాష్ట్రానికి కూడా పాకింది.

ఉత్తరాఫ్రికాలోని అరబ్బు దేశం ట్యునీషియాలో జరిగిన మల్లెపూవు (జాస్మిన్) విప్లవంతో మొదలైన ఆకస్మిక వీధి ఉద్యమాలు తదుపరి ఈజిప్టు, లిబియాలకు పాకాయి. అదే కాలంలో టీ పార్టీ ఉద్యమంగా అమెరికాలో మొదలైన చైతన్యం; వాల్‌స్ట్రీట్ మీద దండయాత్రగా మారింది. మన దేశంలో అన్నా హజారే ఉద్యమం, దానికి రాందేవ్ బాబా తోడవ్వడం, నిర్భయ అత్యాచారం, హత్య కేసుతో యువత ఢిల్లీ రోడ్ల మీదికి రావడం, ఈ నేపథ్యంలో ఆమ్ ఆద్మీ పార్టీ స్థాపన..., దానికి విస్తృత ప్రచారం – మనకు పరిచయమే. అలాగే ఉక్రెయిన్‌లో నెలలతరబడి హింసాత్మక వీధి పోరాటాలు, చివరికి క్రిమియా ప్రాంతం విడిపోయి రష్యాలో కలవడం చకాచకా జరిగిపోయాయి. మన రాష్ట్రంలో తెలంగాణ ఉద్యమమొక ఉద్వేగం కాగా, పవన్‌కల్యాణ్ జనసేన స్థాపన మరొక ఉద్వేగం.

ఈ ఉద్వేగ ఉద్యమాలకు నేపథ్యాలు, కారణాలు, పరిస్థితులు ఒకదానికొకటి భిన్నమైనవైనప్పటికీ, కొన్ని సారూప్యాలతో అవన్నీ ఈ కాలపు దశను సూచిస్తున్నాయి. వారి ఆవేశం నిజమైనదే. కానీ ఆలోచనల్లో లోతు కరవై, అసలు శత్రువును, కారణాలను గుర్తించడంలో విఫలమై, తప్పుడు పరిష్కారాలకు దారితీశాయి కూడా. ట్యునీషియా ఉద్యమం, అరబ్బు దేశాలన్నిటిలోకీ ఆధునికమైన ఆ దేశాన్ని ఇస్లామిక్ మౌఢ్యం వైపు నెట్టింది. షరియాను పూర్తిగా అమలుచెయ్యాలని ఇంకా ఆందోళనలు కొనసాగుతున్నాయి.

అలాగే ముబారక్‌ను వదిలించుకున్న ఈజిప్టు ప్రజలు ఇస్లామిక్ బ్రదర్‌హుడ్ అనే మహా మూఢుల చేతిలో ఇరుక్కుని, వారి తరపున అధ్యక్షుడయిన మోర్సీని దించడానికి మరొక హింసాత్మక ఉద్యమం చెయ్యాల్సి వచ్చింది. అమెరికాలో టీపార్టీ ఉద్యమకారులు ప్రభుత్వాన్ని కుదించడం, పన్నులు తగ్గించాలనే సరైన డిమాండ్‌లతో మొదలై, క్రమంగా, సైద్ధాంతిక స్థిరత్వం లేని రిపబ్లికన్ ఎజెండాలోకి వెళ్లిపోయారు. చివరకు వాల్‌స్ట్రీట్ మీద కదం తొక్కిన ఉద్యమం వామపక్ష భావజాల ప్రేరేపితం. ప్రజల సొమ్ముతో పెద్ద పెద్ద కంపెనీలు, బ్యాంకుల నష్టాలను భర్తీ చేసిన ప్రభుత్వపు దుర్మార్గాన్ని ప్రశ్నించడం మానేసి, కొన్ని కంపెనీల ఉద్యోగుల జీత భత్యాలను ప్రశ్నించడానికే పరిమితమవడం – పరిణతి లేమికి నిదర్శనం.

అన్నా హజారే కూడా కొన్ని అవినీతి సంఘటనలను, కొందరు అవినీతిపరులైన నాయకుల మీదే దృష్టంతా కేంద్రీకరించి; లోక్‌పాల్ వ్యవస్థే సర్వరోగ నివారిణిగా ప్రచారం చెయ్యడం ఆయన ఆశయాలకే తూట్లు పొడిచింది. అసలు అవినీతికి మాతృక అయిన ప్రభుత్వ విశేష విచక్షణాధికారాలను ప్రశ్నించకపోవడం ఆ ఆలోచనా పరిధిలోని డొల్లతనాన్ని సూచిస్తుంది. లోక్‌పాల్ బిల్లు తీరా పాసయ్యాక కూడా లోక్‌పాల్‌ను ఎంపిక చేసే కమిటీ కూర్పు గురించి రేగిన దుమారం – ఈ వ్యవస్థతో ఒరిగేదేం లేదని చెప్పకనే చెబుతోంది.

సొంతంగా, లోతుగా ఆలోచించడానికి బద్ధకించే ప్రజలను ఉద్ధరిస్తానంటూ బయలుదేరిన కేజ్రీవాల్ – తనకు అడ్డు వచ్చిన వారందరినీ అవినీతిపరులని, అంబానీ ఏజెంట్లని విరుచుకు పడడం తప్ప చేసిందేముంది?

ఉక్రెయిన్ రాజధానిలో కొన్ని నెలలపాటు జరిగిన హింసాత్మక వీధి పోరాటాల కారణంగా ఎన్నికయిన అధ్యక్షుడు రష్యాకు పారిపోగా; తాత్కాలిక ప్రభుత్వం పీఠమెక్కింది. ఆ ప్రభుత్వాన్ని తక్షణం గుర్తించడమే కాక, ఐఎంఎఫ్ ద్వారా బిలియన్ల డాలర్ల ఆర్థిక సహాయం చేసేందుకు అమెరికా నాయకత్వంలో నాటో దేశాలు ముందుకొచ్చాయి. దీనికి ప్రతి చర్యగా – రష్యా ప్రేరేపిత క్రిమియా రాష్ట్రం రిఫరెండం పెట్టుకుని, ఉక్రెయిన్ నుంచి విడిపోయి, రష్యాలో కలసిపోవడం చకాచకా జరిగిపోయాయి. ఊతమిచ్చింది ఎవరైనా, ప్రజలు తమంతట తాము ప్రశాంత వాతావరణంలో తీసుకున్న నిర్ణయాన్ని చట్టవిరుద్ధం..., మేం అంగీకరించం... అంతేకాదు, రష్యా మీద ఆంక్షలు విధిస్తామంటున్న అమెరికా, దాని మిత్ర దేశాలు తమని తాము ప్రపంచ ప్రజాస్వామ్య పరిరక్షకులుగా కీర్తించుకుంటాయి!

ఈ ప్రపంచ రాజకీయ చదరంగంలో నైతికతకు స్థానం లేదు. రష్యా ప్రభుత్వ ఆదాయంలో సగానికి సగం పశ్చిమ యూరోపు దేశాలకు గ్యాసు అమ్మకం ద్వారా వస్తోంది. ఇప్పుడు ఆ ఆదాయానికి గండికొట్టడం ద్వారా రష్యా పీక బిగించాలని చూస్తున్నారు. ఇది మరో ప్రచ్ఛన్న యుద్ధానికి దారితీసి మిలటరీలకు డబ్బు తగలెయ్యకపోతే చాలు, ప్రపంచానికి మేలు జరుగుతుంది.

ప్రపంచంలో అత్యధిక చమురు నిక్షేపాలున్న దేశం వెనెజులా. గత పదిహేను ఏళ్ళుగా చావెజ్, ఇప్పుడు ఆయన శిష్యుడు మదురో పక్కా సోషలిస్టు విధానాలు అమలు చేశారు. దాని ఫలితంగా దుర్భరమైన పేదరికం తాండవిస్తోంది. ద్రవ్యోల్బణం ఏభై ఆరు శాతం, డాలర్ల నుంచి అన్ని సరకులు నల్లబజారుమయం. హత్యలు, ఇతర నేరాలు విపరీతంగా పెరిగాయి. సంవత్సరం కాలం నుంచి రోజూ ఆందోళనలు, బ్యారికేడ్లతో అట్టుడికిపోతోంది. మరోపక్క ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ భృతులపై ఆధారపడి బతికేవారు ఆందోళనకారుల మీద దాడులకు దిగుతున్నారు. అసలు సిసలైన వర్గపోరాటం జరుగుతోంది.

కాబట్టి, ప్రతి ఆవేశం, ఆందోళన, ఉద్యమం – అర్థవంతమయిందని అనుకోవడానికి వీల్లేదు. ఈ గందరగోళయుగంలో– ఉద్వేగానికి మారుపేరైన పవన్‌కళ్యాణ్ తన సొంత 'ఇజం'తో ముందుకొచ్చారు.

ఇంతకు ముందు, ఇప్పుడు ఉన్న ఉద్వేగకారుల్లాగే వ్యవస్థపట్ల, సమస్యల స్వభావం, అసలు కారణాలు, సరైన పరిష్కారాల పట్ల ఆయనకున్న అవగాహన శూన్యానికి దగ్గర్లో ఉంది. కల్తీలేని కమ్యూనిజానికి యవ్వనాన్ని, జీవితాన్ని ధారవోసిన చేగువేరా తనకు ఆదర్శమంటూనే, మరోపక్క ప్రభుత్వానికి కళ్ళెం వేసి, ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించడం ద్వారా ఉత్పత్తిని పెంచాలంటున్న మోదీని నెత్తికెత్తు కోవడంలోనే సైద్ధాంతిక అస్పష్టత స్పష్టమవుతోంది. అంతమంది అభిమానులు, మంచి వాగ్ధాటిగల ఇటువంటివారు అసలు ప్రభుత్వమనే వ్యవస్థే ప్రజల చొరవను, సృజనాత్మకతను ఎలా అణగదొక్కుతుందో, తన జంతుబలాన్ని సామాన్యుల నిస్సహాయతలపై ఎంత కర్కశంగా ప్రయోగిస్తుందో, కాబట్టి ప్రభుత్వాలకు పెరిగిపోయిన కొవ్వుని కరిగించడం ప్రథమ కర్తవ్యమని వివరించగలిగితే– ఎంత బాగుండునో అనిపిస్తుంది.

ఇటువంటి ఉద్వేగ విప్లవకారులు ముందుకొచ్చి ఫెయిలయిన కొద్దీ ; రాజ్యానికి బలం, కండకావరం మరింతగా పెరుగుతాయి. ఈ వ్యవస్థను ఎప్పటికైనా బాగు చేసుకోగలమని ప్రజలకు తమ మీద తమకుండాల్సిన నమ్మకం సడలిపోతుంది. ఇదే అసలు విషాదం.

సినీనటి నగ్మా లోక్‌సభకు పోటీ చేస్తోంది. ఆమె నియోజకవర్గానికి చెందిన జుత్తు నెరిసిన ఎమ్మెల్యే ఒకరు – కెమెరాలు చూస్తుండగానే పబ్లిగ్గా ఆమెను ముద్దు పెట్టుకున్నాడు. అయినా ఏం జరగలేదు. నగ్మా అసలు ఫిర్యాదే చెయ్యనంటోంది. ఎందుకంటే బహుశా ఆమెకు ప్రస్తుతానికి ఆ పశువును శిక్షించడం కంటే – తాను గెలవడం ముఖ్యమనిపించి ఉండొచ్చు.

మన ప్రజలు కూడా నగ్మా ఉన్న పరిస్థితిలోనే ఎప్పుడూ ఉంటున్నారు. తన కులానికి రిజర్వేషన్లు, తన వర్గానికి ఫించన్లు, ఉచిత విద్య, వైద్యం, ఆహారం, విహారం కావాలంటూ ప్రభుత్వం చుట్టూ తిరిగేవారికి – అదే ప్రభుత్వపు ఆరాచకాలను, అవినీతిని పట్టువదలకుండా ప్రశ్నించే నైతిక స్థాయి ఎక్కడ్నుంచి వస్తుంది? షేక్‌స్పియరు రాసినట్లు 'the fault, my dear Brutus, is not in our stars, but in ourselves'. తెలుగీకరిస్తే 'మనవాళ్లు ఒఠ్ఠి వెధవాయిలోయ్'.

అయినా చూద్దాం, మంచిరోజులు రావాల్సొస్తే, ఎంతసేపు?

30-03-2014

మహా తమాషా భారతం

దేశ వ్యాప్తంగా జరుగుతున్న ఎన్నికలలో ఆఖరి అంకం మొదలైంది. అత్యంత ప్రత్యేకమైన పరిస్థితులలో అసెంబ్లీకీ కూడా ఎన్నికలు జరుగుతున్న మన రాష్ట్రంలో పోటీలు మరింత ప్రత్యేకతను సంతరించుకున్నాయి. దానికి తోడు మున్సిపాలిటీలు, పరిషత్తులకు జరిగిన గొలుసుకట్టు ఎన్నికలతో రాజకీయాలు క్రింది నుంచి పైదాకా మరింత వేడెక్కాయి. గత కొద్ది రోజులుగా చోటు చేసుకుంటున్న పరిణామాలు ఈ వ్యవస్థ పట్ల భ్రమలను ఒక్కొక్కటిగా తొలగిస్తున్నాయి. కానీ ఇది చూడదలుచుకున్న వారికి మాత్రమే కనబడుతుంది. ఈ ఎన్నికల జాతరలో ఎమోషనల్‌గా మునిగిపోయినవారికి ప్రతిదీ ప్రజాస్వామ్యంలోని గొప్పదనంగానే కనబడుతుంది.

టూకీగా చెప్పాలంటే ఒక ముఠా గత అయిదు, పదేళ్ళుగా పరిపాలించింది. ఆ క్రమంలో ఎంతో అక్రమ సంపాదనకు పాల్పడింది. వాటిలో కొన్ని సంఘటనలు బయటికొచ్చాయి, చాలావరకు గుంభనంగా జరిగిపోయాయి, ఎప్పటికీ బయటకు రావు. ముఖ్యంగా ప్రజాస్వామ్య వ్యవస్థలో అక్రమ సంపాదన ఒకరిద్దరికి పరిమితం అవదు. వ్యవస్థకు భుజం కాసి కాపాడే అనేకానేక వర్గాల అక్రమ సంపాదనను చూసీ చూడకుండా వదిలేస్తేనే ఆ వ్యవస్థ నిలబడగలుగుతుంది.

రాజకీయ నాయకులు కాంట్రాక్టులు, కమీషన్లు, బదిలీలు, ప్రాజెక్టుల అనుమతుల ద్వారా సంపాదించుకుంటే, ప్రత్యేకంగా ఎంపిక చేసుకున్న అధికారులు, ఆశ్రిత కులాల, మతాల ప్రముఖులు, మీడియా ప్రతినిధులు, మేధావులు కూడా తమవాటాలు తాము పోరాడిమరీ గుంజుకుంటారు. ప్రతి మనిషికీ ఒక ఓటు ఉంటుంది కాబట్టి, సాధారణ ఓటర్లకు, మరీ ముఖ్యంగా పేద వర్గాల ఓటర్లకు ఒక మజ్జిగ చుక్కా, నాలుగు గింజలో పడేస్తే అదే మహాభాగ్యమనుకుంటారు.

ఈ రకంగా ప్రజాస్వామ్య ప్రస్థాన ప్రహసనం ఎప్పటికప్పుడు సాగిపోతూనే ఉంటుంది. గత ప్రభుత్వాలు పాల్పడిన అక్రమాలు, కుంభకోణాల గురించి ఆవేశంగా

ప్రస్తావించే ప్రజలు వారికి ఓట్లేసి ఎందుకు గెలిపించారో ఆత్మవిమర్శ చేసుకోవాలి. ఏ తక్షణ తాయిలాలకు, ఏ క్షణిక ప్రలోభాలకు లొంగిపోయి ఆ ప్రభుత్వాలను ఎన్నుకున్నారో ఒక్కసారి ఆలోచించమని చెప్పే ధైర్యం ఏ రాజకీయ పార్టీకి లేదు. ఎందుకంటే ఒక ముఠా స్థానంలో రాబోతున్నది ఇంకో ముఠా; అదే అధికార గణం, అదే కాంట్రాక్టర్లు, మీడియావర్గాలు, అవే మేధావి బృందాలు, అవే ఆశ్రితవర్గాలు ఉన్న ప్రభుత్వం తిరిగి రావాలనో లేక కొత్త ప్రభుత్వం రావాలనో కోరుకుంటున్నాయి. ముఠాలు, ఆశ్రితుల్లోని వ్యక్తులు మారుతారు తప్ప వారిస్వభావంలో పెద్దగా మార్పేమీ ఉండబోదు.

కొద్దికాలం క్రితం వరకు పార్టీ మారడమంటే ఒక పెద్ద సంఘటనగా భావించి, దాన్ని గురించి రోజుల తరబడి చర్చ జరిగేది. పార్టీ మారిన నాయకులు – దానికి దారితీసిన కారణాలు, పరిస్థితులపై వివరంగా సంజాయిషీ ఇచ్చేవారు.

కానీ గత పదిహేను రోజుల్లో జరిగిన కప్పగంతులు నవ్వు తెప్పించాయి. ఉదయం ఒకపార్టీ, సాయంత్రం ఇంకో దాంట్లోకి, మర్నాటి కల్లా మరో పార్టీలో చేరి టికెట్ తీసుకుని నామినేషన్ వెయ్యడం కూడా జరిగిపోయింది. ఈ సంఘటనలన్నీ చూశాక పార్టీలు, వాటి సిద్ధాంతాలు, వాటి పట్ల నాయకుల విధేయతలు, వీరందరి నైతిక స్వభావాల పట్ల ఇప్పటిదాకా ఎవరకైనా భ్రమలుంటే – అవన్నీ పటాపంచలై పోయాయి.

ఈ నగ్న సత్యం ప్రజల ముందు బహిర్గతమవడం ఒక రకంగా శుభ పరిణామమే. ఇక నుంచి నాయకులు, అభ్యర్థుల వ్యక్తిగత గొప్పతనాలు, వారికి పార్టీలు, సిద్ధాంతాల పట్ల ఉండే విధేయతల గురించి ఆలోచించడం, చర్చించడం మానెయ్యొచ్చు... పార్టీలకు కూడా ఎవర్ని చేర్చుకోవడం పట్లా ఎటువంటి భేషజాలు, పట్టుదలలు లేవని తేలిపోయింది. కాబట్టి ఇకనుంచి ఎంత సీనియర్ నాయకులైనా తమ పార్టీని సమర్థిస్తే, ఇతర పార్టీలను విమర్శిస్తుంటే వారిని ఆ పార్టీ తాత్కాలిక అధికార ప్రతినిధిగా పరిగణించాలే తప్ప, వారేదో గొప్ప నిబద్ధతతో మాట్లాడుతున్నట్లు భావించాల్సిన అవసరం లేదు.

ఇదీ ఒక రకంగా మంచి పరిణామమే. నాయకులను వ్యక్తిగతంగా పూజిస్తూ, వాళ్ళ కోసం చొక్కాలు చింపుకుని, కొట్లాటలకు దిగి, కేసుల పాలవడం లాంటివి తగ్గిపోయి, నాయకులు–అనుచరుల మధ్య కేవలం పరస్పర ప్రయోజనాలే ప్రాతిపదిక, కొలబద్దలుగా మిగిలిపోయే అవకాశాలు పెరుగుతున్నాయి. దీని ప్రభావం ఇప్పటికే కనిపిస్తోంది. గతంలో మాదిరిగా కాకుండా ఇప్పుడు బహిరంగ సభ లేదా రోడ్ షోలకు జనాన్ని అద్దెకు తీసుకుని తరలించాల్సి వస్తోంది. సగటున మనిషికి రోజుకు మూడొందలు, ఆరోజుకు పోటీ ఎక్కువగా ఉంటే – అయిదు వందల వరకు ఖర్చు చేస్తే తప్ప సభలకు జనం రాని పరిస్థితి ఏర్పడింది. ఓటర్లు కూడా ఇదే పంథాలో ఉన్నారు. మునిసిపాలిటీ, పరిషత్ ఎన్నికలలో అన్ని పార్టీల అభ్యర్థులూ ఓటుకు సగటున అయిదు వందల వరకు పంచిపెట్టాల్సి వచ్చింది.

ఇంకో విశేషమేమిటంటే, ఇంతకుముందు పేద వర్గాలకు మాత్రమే పరిమితమైన పంపకం, ఇప్పుడు మధ్యతరగతి, చివరకు ఉన్నతాదాయ వర్గాలకు పాకింది. అగ్ర కులస్తులు, ఉద్యోగస్తులు కూడా తమకు రావాల్సిన డబ్బు అందలేదని ఫిర్యాదులు చెయ్యడం పరిస్థితికి అద్దం పడుతోంది. ఇప్పటికే పార్టీల పరిస్థితి గుల్లయిపోయింది. ఇప్పుడు రాబోయే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలకు డబ్బు ఖర్చు పెట్టాల్సిన అభ్యర్థులు, పార్టీలకు నిద్రపట్టడం లేదు. ఇంత డబ్బు ఖర్చుపెట్టాక వచ్చే ప్రభుత్వాలు, ఎంత నీతిమంతంగా ఉండగలవో ఊహించుకోవచ్చు. అన్ని పార్టీల దగ్గర్నుంచీ అడిగి మరీ పుచ్చుకున్న ఓటర్లు ప్రభుత్వాలు ప్రజాప్రతినిధుల పనితీరును ఎంత మేరకు విమర్శనాత్మకంగా చూడగలరు? ఈ రకంగా దైనందిన రాజకీయాలలో ప్రజల పాత్ర అంతకంతకూ తగ్గిపోతుంది. క్రమేపీ ప్రజాస్వామ్యం పట్ల విముఖతకు, నిర్లిప్తతకు, పెదవి విరుపునకు దారి తీస్తుంది. అదీ ఆహ్వానించదగ్గ పరిణామమే.

రాజ్యవ్యవస్థ బలపడిన కొద్దీ; దానిలోని వివిధ భాగాల మధ్య పోటీ ఎంతో విస్తరించుకుంటూ పోతుంది. ప్రభుత్వాలు, చట్టసభల వైఫల్యాల సాకుగా న్యాయ వ్యవస్థ తన స్వయం నిర్ణయాధికారాలను, విచక్షణాధికారాలను పెంచుకుంటూ పోయింది. అలాగే రాజకీయ వ్యవస్థ, న్యాయ వ్యవస్థల వైఫల్యాల వల్ల – ఎన్నికల కమిషన్ తన అధికారాలు విస్తృత పరచుకుంది. ఈ మొత్తం వ్యవహారంలో బలహీనపడేది – వ్యక్తి హక్కులే. చిదంబరం 2009లో ఎన్నికైన కేసు సుప్రీంకోర్టులో ఇప్పటిదాకా తేల్చలేదు. మన రాష్ట్ర విభజనకు సంబంధించిన కేసు ఇప్పటికీ అతీగతీ లేదు. ఢిల్లీ స్కూళ్ళలో నర్సరీ అడ్మిషన్లు నిలిపివేయాలని మాత్రం తక్షణ నిర్ణయం తీసుకుంటారు. ఇదేమిటని ప్రశ్నించే హక్కు ఎవరికీ లేదు. అదే విధంగా ఇప్పుడు ఎన్నికల సీజను నడుస్తోంది. కాబట్టి ఎన్నికల కమిషన్ హవా నడుస్తోంది. వారేం చేసినా ప్రశ్నించే వీలులేదు.

వివిధ వ్యక్తిగత, వ్యాపార పనుల మీద దారిన పోయేవారి దగ్గర్నుంచి డబ్బు స్వాధీనం చేసుకుంటారు. వందల కోట్లు స్వాధీనం చేసుకున్నట్లుగా ప్రచారం. కానీ అందులో ఎన్నికలు, అభ్యర్థులకు సంబంధించిన డబ్బెంత ఉందని మాత్రం చెప్పరు. ఈ పిచ్చి ఏ స్థాయికి చేరిందంటే – బ్యాంకు అధికారులు బ్యాంకు వాహనంలో, ఏటీఎంలలో డబ్బు నింపడానికి వెళ్తుంటే; దాన్ని కూడా స్వాధీనం చేసుకుని డబ్బు పట్టుకున్నాయని బ్రేకింగ్ న్యూస్‌గా ప్రచారం చేసుకోవడం. వ్యాపారులు, సాధారణ ప్రజల దగ్గర స్వాధీనం చేసుకున్న డబ్బును ఆదాయపు పన్ను శాఖ అధికారులకు అప్పగిస్తామని బెదిరించి అందులో కొంత తమ జేబుల్లో వేసుకున్న సంఘటనలు లెక్కలేనన్ని. 2009లో స్వాధీనం చేసుకున్న డబ్బు ఇప్పటికీ విడుదల చేయని ఉదంతాలున్నాయి. ఈ సమయంలో ఎవరికి చెప్పుకోగలరు? ఎవరు వింటారు? ఎన్నికల కమిషన్ విధుల్లో న్యాయస్థానాలు కూడా తలదూర్చవు.

ఇంతా చేసి గ్రామాల్లో, వాడల్లో డబ్బు పంపకాలు ఆపగలుగుతున్నారా అంటే అదీ లేదు. దీనికి తోడు మాట్లాడే హక్కును కూడా తీవ్రంగా నియంత్రించే ఎన్నికల కోడ్ ప్రాథమిక హక్కులకు ప్రతిబంధకంగా మారుతోంది. కాంగ్రెస్ అధ్యక్షురాలు షాహీ ఇమాం బుఖారీని ముస్లిముల ఓట్లేయించమని అడిగినా, అమిత్ షా ఓట్లేయడం ద్వారా ప్రతీకారం తీర్చుకోమన్నా, అజంఖాన్ తన ప్రత్యర్థులపై తీవ్ర నిందారోపణలు చేసినా – అవన్నీ భావ ప్రకటన హక్కుగా భావించి, రాజకీయంగా ఎదుర్కోవాలే తప్ప, చీటికి మాటికి నోటీసులు జారీ చెయ్యడం, ఎఫ్ఐఆర్‌లు నమోదు చెయ్యడం, తీవ్ర హెచ్చరికలు జారీ చెయ్యడం పరిణతి అనిపించుకోదు. కానీ ఏం చేస్తాం?

సుప్రీంకోర్టు లాగే ఎన్నికల – కమిషన్ నిర్ణయాలకూ ఎదురులేదు.

ఎగబడి మరీ జనం ఓట్లేసి రెండుసార్లు గెలిపించిన కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కుంభకోణాలకు అంతులేదు, ఎదురులేదు. బయటపడిన కొద్దీ ప్రజల అసహనం ఇంకా పెరిగిపోతోంది. బయటకు కనిపించని అపసవ్యాలు ఇంకా చాలా ఉన్నాయి. ఆర్థిక విధానాలు, రకరకాల పన్ను పోట్లు, ఉపాధి హమీ చట్టం, విద్యా హక్కు చట్టం, ఆహార భద్రత చట్టం, పర్యావరణ చట్టాలు, మైనింగ్ నిషేధం, ప్రభుత్వ ఉద్యోగుల పీఆర్‌సీ, భూసేకరణ చట్టం – ఇవన్నీ వచ్చే ప్రభుత్వాలకు గుదిబండలుగా మారనున్నాయి.

కాకపోతే, కాగితాల మీద ఎన్ని రాసుకున్నా, ప్రజలకు తమ ప్రయోజనాలేమిటో స్పష్టంగా తెలిసొచ్చిన నాడు అన్నీ మారిపోతాయి. ఎన్నికల కమిషన్ ప్రచారం, ఓటేయని వర్గాలు కూడా ఈసారి క్యూ కట్టడం ఆశావహ భవిష్యత్తును సూచిస్తోంది. వచ్చే ఎన్నికల నాటికి ఇంటర్నెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించగలిగితే పోలింగు శాతం తొంభైని మించుతుంది. అదీ కాక, ఇప్పటిదాకా సంక్షేమ పథకాల లబ్ధిదారులను ఇంకా ఇంకా సంతుష్టులను చెయ్యడానికి మాత్రమే పోటీపడుతున్న పార్టీలు – రాబోయే రోజుల్లో పన్ను చెల్లింపుదారులనూ దృష్టిలో పెట్టుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడతాయి. ఇప్పుడున్న నిరుద్యోగ, ద్రవ్యోల్బణ, పేదరిక పరిస్థితుల నుంచి బయటపడే దాకా అయినా పొదుపు, పెట్టుబడులు, ఆర్థిక వృద్ధిలపై దృష్టి కేంద్రీకరించక తప్పని స్థితిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎదుర్కొంటాయి. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాల వల్ల ఆర్థిక బుడగలేర్పడతాయి తప్ప సమతుల్య అభివృద్ధి సాధ్యం కాదని గత పదేళ్ళలో రుజువయింది.

బీజేపీ మేనిఫెస్టోలో – కళ్ళు చెదిరే సంక్షేమ పథకాల ప్రస్తావన లేకపోవడం సంతోషించదగ్గ విషయం. రాష్ట్ర స్థాయిలో కూడా వివిధ రాజకీయ పార్టీలు, ముఖ్యంగా ఓటర్లు కళ్ళు నేల మీద ఉంచి, సంక్షేమ పథకాలను కనీస స్థాయికి కుదించి ఉన్నంతలో తక్కువ అవినీతికి పాల్పడే వారిని ఎంచుకోగలగాలి. దోచుకోవడం, దోచిపెట్టడమే రాజకీయ లక్షణం, కుటుంబ గౌరవంగా భావించే వారే కావాలనుకుంటే – సూర్యోదయం కోసం ఇంకో పదేళ్ళు ఆగాల్సిందే. ప్రజలు వారికి వారే భావి భాగ్య విధాతలు.

13-04-2014

నిర్ణయం మనదే, పర్యవసానాలూ మనకే

'చరిత్రను విస్మరిస్తే దాని పునరావృతాన్ని అనుభవించక తప్పదు' అనే నానుడిని సరైన కోణంలో అర్థం చేసుకోవాలి.

చరిత్ర అనేది మనుషులు, వారి ఆలోచనలు, పరిస్థితులు, వీటన్నిటి సంక్లిష్ట కలయికతో నియమం తప్పకుండా వచ్చిన పర్యవసానాల సమాహారం. వీటిలో కాలం, పరిస్థితులనేవి మనుషుల నియంత్రణలో ఉండవు. ఉండేదల్లా మనిషి ఆలోచనా సరళి మాత్రమే. ఆ ఆలోచనాసరళి ఏ సైద్ధాంతిక పునాదులు మీద ఆధారపడిందో ఆ భావజాలం మారకపోతే కాలం ఏదైనా, పరిస్థితులు ఏవైనా, పర్యవసానాలు అదే తీరున ఉంటాయి. దాన్ని చూసి మనం చరిత్ర పునరావృతమైందనుకుంటాం.

1947లో దేశ విభజన జరిగి పాకిస్తాన్ (బంగ్లాదేశ్ కూడా దాని అంతర్భాగంగా) ఏర్పడే ముందు కొన్ని సంవత్సరాలపాటు అత్యంత తీవ్రమైన భావోద్వేగాలు, హింస, హిందూ ముస్లింల మధ్య అగాధాన్ని పెంచేశాయి. 1930 వరకు కాంగ్రెస్ పార్టీతోనే ఉన్న జిన్నాకు – నెహ్రూకు మధ్య చెడింది. 1935లో వచ్చిన విస్తృత చట్టం (అదే మన రాజ్యాంగానికి పునాది) ప్రకారం జరిగిన ఎన్నికలలో; అప్పటి యూపీలో ముందు ఇచ్చిన మాటను కాదని జిన్నాతో అధికారం పంచుకోవడానికి నెహ్రూ తిరస్కరించారు. ఫలితంగా – పూడ్చలేని అగాధం ఏర్పడింది. వారిద్దరి మధ్య వచ్చిన పొరపొచ్చాలు ముస్లిం లీగ్ – కాంగ్రెస్ మధ్య పోరాటంగా, చివరికి హిందు – ముస్లిం విభేదాలుగా మారడానికి ఎంతోకాలం పట్టలేదు.

అప్పటికే హిందు–ముస్లింలు మధ్య పెత్తనం కోసం అంతర్లీనంగా కొంత ఘర్షణ, దాన్ని ఎగదోసిన కవులు, రచయితలు, కళాకారులు, మేధావుల్లా కనిపించే వారితోపాటు, బ్రిటిష్ వారి ఎత్తుగడలు ఉండనే ఉన్నాయి. వీటన్నిటినీ కలుపుకుంటూ, దాన్నొక ఉద్యమ ప్రవాహంగా మార్చి, ముందుండి నడిపించడానికి జిన్నా లాంటి అసాధారణ

వాక్చాతుర్యం, తెగింపు ఉన్న నాయకుడు దొరకగానే – దానికో ఐడెంటిటీ, లెజిటమసీ వచ్చేశాయి. చిన్న చిన్న ఆపశృతులు, వైరుధ్యాలు లెక్కలోకి రావు. కొంత కాలానికి ఆ వాదం, ఉద్యమ ప్రవాహమే నాయకుణ్ణి కూడా ముందుకు తోసుకుంటూ వెళ్తుంది. పాకిస్థాన్ ఏర్పాటు విషయంలో జరిగిందదే.

లక్షలాది ప్రాణాల హననం, తీవ్రమైన మనస్పర్థల మధ్య ఏర్పడిన పాకిస్తాన్‌కు– తీరా ఏర్పడ్డాక ఎలా ముందుకు పోవాలో చాలాకాలం వరకు అర్థం కాలేదు. విభజనలో తమ వంతుకు వచ్చిన సైన్యానికి జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితులు. బెలూచిస్తాన్, ఆఫ్ఘన్ తెగల ప్రాంతాల్లో అంతర్గత అలజడులు; వారి మీద పట్టులేకపోవడం, ప్రజాస్వామ్య దేశమో, ఇస్లామిక్ రాజ్యంగా ఉండాలో కూడా తేల్చుకోలేని అయోమయం...,

వీటన్నిటినుంచి ప్రజల దృష్టి మరల్చడానికి కాశ్మీర్‌లో యుద్ధం, ఓటమి, భారత్ తమను మింగేయాలని ప్రయత్నిస్తున్నదని ప్రచారం. తమ పంటలను ఎప్పుడూ అమ్ముకునే భారతదేశ మార్కెట్టును కూడా కాదనుకోవడం. ఇదంతా ఎందుకు జరిగిందంటే..., ఉద్యమ సమయంలో అన్ని వర్గాలను కలుపుకు పోవడం కోసం అందరికీ నచ్చే విషయాలు చెబుతారు. వాటి పరస్పర వైరుధ్యాలను గుర్తించరు, గమనించరు. చివరకు అమలు చెయ్యాల్సి వచ్చేసరికి చుట్టుముటిన ముళ్ళ కంపలా ఎటు కదిలినా గుచ్చుకుంటాయి.

హిందువుల పట్ల ఇన్నాళ్ళు క్రోధం, విషం చిమ్మాక సెక్యులర్ రాజ్యం ఏర్పరుస్తామనడానికి లేదు. అలా అని ముల్లాల మాట విని ఇస్లామిక్ రాజ్యం స్థాపిస్తే దేశం మధ్యయుగాల మూఢత్వం సుడిలో మునిగిపోతుందనీ తెలుసు. లేనిపోని అభిజాత్యం, ముస్లిం దేశాల్లో కల్లా అతి పెద్ద తర్ఫీదు పొందిన సైన్యం తమ దగ్గరుందని, మధ్య ప్రాచ్య ముస్లిం దేశాల వ్యవహారాల్లో తాము కీలక పాత్ర పోషించబోతున్నామనే డాంబికాలు. ఆ అంశాలను మార్కెట్ చేసుకుంటూ అమెరికాతో ఏకపక్ష స్నేహం, నిధులు, మిలటరీ సామగ్రి కోసం దేబిరింపు. తన పాట్లు తాను పడుతున్న భారతదేశంపై కయ్యానికి కాలుదువ్వడం. ఇవన్నీ కీలక వ్యక్తులు ఆ కాలం, పరిస్థితుల మధ్య తీసుకున్న నిర్ణయాలు. వాటి పర్యవసానాలు మనకు కనిపిస్తూనే ఉన్నాయి.

వాస్తవాలను గుర్తించి, కొన్ని నిజాలు చేదువైనా సరే అంగీకరిస్తూ, తమలోని శక్తిని, బలహీనతలను గుర్తిస్తూ, పరస్పర హనన ప్రయత్నాల కంటే పరస్పర సహకారమే లాభ దాయకమనే స్పృహతో పనిచెయ్యకపోతే – ఎవరైనా, ఎంత బలవంతులైనా ఖచ్చితంగా ఇదే రకమైన పర్యవసానాలను అనుభవించక తప్పదు. ఒక మనిషికైనా, కుటుంబానికైనా, కంపెనీకైనా, రాష్ట్రానికైనా, దేశానికైనా ఖచ్చితంగా అన్వయించే బండ సూత్రమిది.

మన రాష్ట్రం విషయానికొస్తే, అత్యంత ఉద్వేగాలతో కూడిన ఉద్యమాల నడుమ తెలంగాణ రాష్ట్రం ఏర్పడబోతోంది. ఉద్యమ సమయంలో అందరినీ సంతృప్తి పరచి అంతర్గత విమర్శలకు చోటు లేకుండా చెయ్యడానికి ఎన్నో వాగ్దానాలు, వాగాడంబరాలు ప్రదర్శించి ఉండొచ్చు. అవన్నీ నిజాలని, అవే నిజాలని – నమ్మడం మన అమాయకత్వం, కించిత్ బద్ధకం అవుతుంది. ఇప్పటికే చాలా మాటలు అబద్ధాలని తేలిపోయాయి. ఇచ్చిన పార్టీ, తెచ్చిన పార్టీ, ద్రోహుల పార్టీ అనే తేడాలు లేకుండా జంపింగులు, టికెట్ల పంపిణీ ప్రహసనాలు, అలకలు, విమర్శలు చూస్తేనే... చాలావరకు అర్థం కావాలి. ఇక్కడ పరీక్షకు నిలబడాల్సింది నాయకుల వాక్శుద్ధి, చిత్త శుద్ధికాదు. ఓటేసే ప్రజల మనోస్థితి. ఎర వేస్తున్న ఆకులమందను చూస్తూ గొర్రెల్లాగా ముందుకు పోతే; కొండ చరియ దాటి, కిందకు పడిపోతాం.

కొత్త రాష్ట్రాలుగా ఏర్పడిన నేపథ్యంలో ప్రస్తుత తెలంగాణ, సీమాంధ్ర ప్రజలు తమ భవిష్యత్తుకు పునాదులు వేసుకునే అవకాశం ఈ ఎన్నికల ద్వారా వచ్చింది. అనవసరపు, ఆచరణ సాధ్యంకాని హామీలను నమ్మి ఓట్లేస్తే నష్టపోతారు. హామీలను తీర్చట్లేదని తెలిసే సరికి అయిదేళ్ళు అయిపోతాయి. కాబట్టి నాయకులకు వచ్చే నష్టమేమీ ఉండదు. తమ పని తాము కానిచ్చేసుకుంటారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేక పోవడానికి కారణాలుగా వాతావరణాన్ని, ప్రక్క రాష్ట్రాన్ని, కేంద్ర ప్రభుత్వాన్ని, అంతర్గత ద్రోహుల్ని, 'దోపీడీదారు'ల్ని, చివరకి అమెరికాను కూడా చూపుతారు. దిగజారుతున్న పరిస్థితుల నుంచి తాత్కాలికంగా బయటపడడానికి మరిన్ని తిరోగామి విధానాలను అవలంబించి కొన్ని వర్గాలను సంతృప్తిపరచి, అసహనంగా ఉన్న ప్రజల్లో చీలికలు తెచ్చే ప్రయత్నాలు చేస్తారు. మంచికో, చెడుకో ఈ రోజు అభ్యర్థులతో పెద్దగా నిమిత్తం లేకుండా కేవలం పార్టీ నాయకులను చూసి మాత్రమే ఓటెయ్యాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కాబట్టి అధినాయకులను స్థూలంగా అంచనావేసి, ఎవరు తమకు తక్కువ హాని చేస్తారో ఓటర్లు నిర్ణయించుకోవాలి.

గత పదేళ్ళుగా పాలకుల విధాన నిర్ణయాల ఫలితంగా తీవ్రమైన ఆర్థిక స్థబ్దత ఏర్పడింది. దీన్నుంచి బయటపడడానికి పుక్కిట పురాణాలను, అరిగిపోయిన భావజాల రికార్డులను లెక్కచేయకుండా సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించి, పన్నులు తగ్గించి, కనీసం ఇంకా పెంచకుండా, వ్యక్తిగత పొదుపు, పెట్టుబడులు పెంచుకునేలా ప్రోత్సహించాల్సి ఉంది. ప్రభుత్వం మీద ఆధారపడడం తగ్గించుకుని ప్రజలు తమ స్వశక్తితో, అనవసరపు అడ్డంకులు లేని మార్కెట్ వాతావరణంలో కష్టపడి, తమ సంపాదనను, జీవన ప్రమాణాలను మెరుగు పరచుకోవాల్సిన అవసరముంది.

గుడ్డి గానుగెద్దులాగా బ్రిటిష్ వాళ్ళు వదిలిపెట్టి పోయిన చట్టాలు, వ్యవస్థలు, రాజ్యాంగం, మనం ఇంతకాలం పెంచిపోషించిన నియంత్రణ, రెగ్యులేటరీ యంత్రాంగాలు, వర్గ సంతుష్ట విధానాలన్నిటినీ సమీక్షించి తాజాగా దేశానికి దిశానిర్దేశం చెయ్యగల నాయకత్వాన్ని ఎంచుకోవాలి. మన రాష్ట్రం విషయానికొస్తే, సీమాంధ్రలో కొత్త రాజధాని నిర్ణయం, నిర్మాణంతోపాటు, వ్యవసాయాన్ని స్థిరీకరించడం, ఆధునికీకరించడం ద్వారా వ్యవసాయం మీద ఆధారపడేవారి సంఖ్యను తీవ్రంగా కుదించడం, సమాంతరంగా పారిశ్రామిక, సేవారంగాలను విస్తరించడం ద్వారా ఉద్యోగాల కల్పన, జన సాంద్రత అధికంగా ఉండే కోస్తా ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, వ్యవసాయానికి అనువుగాని రాయలసీమ ప్రాంతాల్లో పారిశ్రామిక కేంద్రాలు, వీటన్నిటికీ సరిపడా విద్యుత్తు, తాగునీరు అందించగలగాలి. దేశ విదేశ మార్కెట్ల అవసరాలకు అనుగుణంగా మానవ వనరులకు పనికొచ్చే నైపుణ్యాలలో శిక్షణ ఇచ్చి, ఎగుమతి చెయ్యగలగడం, వ్యర్థమైన కుల పోరాటాలు, కుల ఆధిపత్య ధోరణులను అందరూ ఈసడించుకునేలా ఆలోచనలను మార్చాలి. ఇవన్నీ మనముందున్న నిజమైన సవాళ్ళు. ఇవన్నీ ప్రభుత్వం చేస్తుందనుకోవడం పొరపాటు. మనంతట మనల్ని చేసుకోకుండా అడ్డుకోకపోతే – చాలు.

అలాగే తెలంగాణలో కూడా వాతావరణం, భూసారం, నీటి లభ్యతల వాస్తవాలను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయాన్ని ఆధునీకరించడం; సీలింగు చట్టానికి సమీక్ష, పెట్టుబడులను పారిశ్రామిక వేత్తలు, నిపుణులు, భయపడి పారిపోకుండా చూసుకోవడం, స్థానిక, దేశ, విదేశ పెట్టుబడులను ఆహ్వానించడం, అన్నిటికంటే ముందుగా విద్యుత్ లభ్యత పెంచడం, మానవ వనరుల నైపుణ్యం స్థాయిని, పని సంస్కృతిని మెరుగు పరచడం, పొదుపు, పెట్టుబడులను ప్రోత్సహించడం, సహజ వనరులను మార్కెటీ కరించడం, ఉద్యమంలో తమ పాత్రకు ప్రతిఫలంగా వాటా కోసం వేచి చూస్తున్న జాక్‌లు, వివిధ పక్షీయులు, మేధావులు, మావోయిస్టులు, వివిధ సామాజిక వర్గ నాయకత్వాలను అదుపు చెయ్యడం – ముఖ్యమైన సవాళ్ళలో కొన్ని మాత్రమే.

మనుషుల్లో అద్భుతమైన శక్తి సామర్థ్యాలు, సృజనాత్మకత ఉన్నాయి. వాటిని వ్యక్తీకరించగలిగే వాతావరణాన్ని అనుమతించే సమాజాన్ని నిర్మించుకోవడం కూడా మనుషులదే బాధ్యత. ఈ చారిత్రక సమయంలో, మన భవిష్యత్తును నిర్దేశించే ఈ నిర్ణయాత్మక ఎన్నికలు, ఈ రాజకీయ విష సాగర మథనంలోంచి అమృతం పుట్టిస్తాయో లేక పాకిస్థాన్ లాంటి శాశ్వత పరాజిత పలాయనవాద విషాన్ని సృష్టిస్తాయో....నిర్ణయం మనదే. పర్యవసానాలూ మనకే.

27-04-2014

సోషలిజం వచ్చేసింది!

సోషలిజం వచ్చేసింది! ఎందరో మహనీయులు, మరెందరో మేధావులు దశాబ్దాలుగా కన్న కలలు సాకారమయ్యాయి. పేదలు, మధ్యతరగతి, ధనవంతులనే వర్గ వ్యత్యాసాలు తొలగిపోయాయి. కుల మతాల సరిహద్దులు చెరిగిపోయాయి. అంటరానితనమనే పదమే అంటరానిదయింది. తరతమ భేదాలన్నీ మరచిపోయి, సమాజమంతా ఒక్కటైంది.

ఈ సార్వత్రిక ఎన్నికలలో డబ్బు పంచడం, పుచ్చుకోవడమనే ప్రక్రియ ద్వారా సర్వమానవ సమానత్వ, సౌభ్రాతృత్వాలు వెల్లివిరిసాయి. దళితుల నుంచి అగ్రకులాల వరకు, ఉద్యోగస్తుల నుంచి వ్యవసాయ కూలీల వరకు అందరికీ ఒకే మొత్తం పంచారు. అందరూ తీసుకున్నారు. సమయాభావం వల్లనో, లేక పంపిణీ వ్యవస్థ లోపాల కారణంగానో డబ్బు చేరనివారు, చాలా హుందాగా, బాధ్యతగా, మొహమాట పడకుండా ఆయా పార్టీల కార్యాలయాలకు వెళ్ళి, లైన్లో నుంచుని, తమ వాటా పొందిన తర్వాతే – పొలింగ్ బూత్ వైపు అడుగులేసి తమ ప్రజాస్వామిక బాధ్యతను నెరవేర్చారు.

అసెంబ్లీ, పార్లమెంటులకు కలిపి సగటున ఒక్కో అసెంబ్లీ స్థానానికి ఒక్కో ముఖ్య పార్టీ తరపున సుమారు 12 కోట్లు ఖర్చయ్యాయి. ఇందులో అసెంబ్లీ అభ్యర్థి స్వంత నిధులు, పార్లమెంటు అభ్యర్థి అందజేసినవి, స్థానికులు, బంధుమిత్రుల విరాళాలు పోనూ మిగతాది ఆయా పార్టీలు సర్దుబాటు చేశాయి. ఎలక్షన్ కమిషనరు హూంకారాలు, పోలింగు సిబ్బంది హడావుడి మధ్య రాష్ట్రమంతా ఒకరకమైన పండుగ వాతావరణం నెలకొంది. హింసాత్మక సంఘటనల రూపంలో అక్కడక్కడ కొన్ని అపశ్రుతులు మినహా ఎక్కడికక్కడ గ్రామస్థాయి నుంచి మొదలైన పోలింగు మేనేజిమెంటు – ఇరు పార్టీలలోని స్థానిక నాయకత్వంలోని నిబద్ధతకు, నిమగ్నతకు, నైపుణ్యానికి పరీక్ష పెట్టింది.

ఇన్ని అపసవ్యాల నడుమా సంతోషించదగ్గ విషయమేమిటంటే, ఓటు హక్కున్న దాదాపు ప్రతి ఒక్కరూ దాన్ని ఉపయోగించుకోవడానికి ప్రయత్నించడం. అల్ప ఆదాయ

వర్గాలు ఎక్కువగా ఉన్న ఇంత పెద్ద సమాజంలో ఎనభై శాతానికి మించి ఓటు హక్కు వినియోగించుకోవడం సామాన్యమైన విషయం కాదు.

ఓటు వెయ్యడానికి మరెన్నో సరళమైన సౌకర్యాలు, ఎండలో లైన్లో నిలబడే అవసరం లేకుండా కొన్ని రోజుల తరబడి ఓటేసే అవకాశాలున్న పాశ్చాత్య ప్రజాస్వామ్య దేశాల్లో కూడా – ఓటింగు అరవై శాతం మించడం అరుదు. అలాంటిది, ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి, గంటల తరబడి బస్సులు, రైళ్ళలో నిలబడి ప్రయాణం చేసి, ఒక రకమైన కసి, దృఢ సంకల్పంతో ఓటేయ డానికి వెళ్ళడం చూస్తే; ప్రజల చైతన్యం పట్ల అత్యంత గౌరవ భావం కలగక మానదు. ఎవరికి ఓటేయడానికి ఇంత ప్రయాసపడ్డారో ఈ నెల 16వ తేదీ దాకా తెలియకపోయినా, వారి ఉద్వేగం, ఉత్సాహాలను చూస్తే సమాజంలో చొరవ, చైతన్యం సజీవంగా ఉన్నాయనే సంతృప్తి కలుగుతోంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక ఇంత పోటాపోటీగా, ఎక్కడికక్కడ విభిన్నమైన పార్టీలు, ఆలోచనలలో ఇంత తేడా ఉన్న నాయకుల మధ్య ఎంచుకునే అవకాశం వచ్చింది ఈ సారే. దేశస్థాయిలో ఒకపక్క మోదీ, ఇంకోపక్క రాహుల్ గాంధీ, రాష్ట్రస్థాయిలో కేసీఆర్, చంద్రబాబు, జగన్‌ల మధ్య ఆలోచనల్లోను, శైలిలోను, లక్ష్యాలలోను చాలా తేడాలున్నాయి. వీరిలో ఎవరెవరిని ఎంచుకుంటారో – దానిమీద దేశ, రాష్ట్రాల భవిష్యత్తు తీవ్రస్థాయిలో ఆధారపడి ఉంది.

ఒక పక్క ఓట్ల కోసం డబ్బు పంపిణీ విషయంలో పూర్తి సోషలిజం వెల్లివిరిస్తే, మరో పక్క జంతు హక్కుల విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు దిగ్భ్రాంతి కలిగిస్తోంది. జల్లి కట్టు ప్రదర్శనలో ఎద్దులను ఉపయోగించడాన్ని నిషేధిస్తూ, కొన్ని సంచలన వ్యాఖ్యలు చేశారు. జంతువులకూ గౌరవప్రదంగా బ్రతికే హక్కు ఉన్నదంటూ...; జంతువుల హక్కులను రాజ్యాంగబద్ధ హక్కులుగా చెయ్యాలని కూడా సూచించారు. ఈ రకమైన ఆలోచనా విధానం–సృష్టిపట్ల, అందులో మానవుని స్థానం పట్ల కొందరికి ఉన్న అవగాహన లోపాలకు నిదర్శనం. సృష్టిలో అందరూ సమానమేనని, అందులో మనుషులకు ప్రత్యేక స్థానం లేదని ఒకానొక ఉపనిషత్తులో రాసిన వాక్యాన్ని కూడా తీర్పులో ఉటంకించారు.

ఉపనిషత్తులోనో, తీర్పులోనో రాశారు కాబట్టి అదే సత్యమనుకోవడానికి లేదు. వాస్తవాల ఆధారంగా విశ్లేషించుకోవాలి. సృష్టి అంతటిలోకి మనిషికి ప్రత్యేకమైన స్థానం ఉంది. దీనికి కారణం మనిషి నైజం. ***సృష్టిలోని ప్రతి మూలకానికీ తనదంటూ ఒక నైజం ఉంటుంది. రాళ్ళూరప్పలూ ప్రాణ రహితమైనవి, ఎక్కడికీ కదలవు. అది వాటి నైజం. బ్యాక్టీరియా నుంచి ఏనుగు, పులి, తిమింగలాల వరకు వాటి జాతి రీత్యా ప్రత్యేకమైన నైజాలున్నాయి. అందులో ఒకదానికి మరొకటి ఆహారంగా ఉంటూ సృష్టి కొనసాగుతుంది. పులి లేడిని చంపి తినడాన్ని హింస అనో, క్రూరత్వం అనో అనలేము. చీమలు, తేనెటీగలు,***

వాటిలోని రాణి చీమ, రాణి ఈగలకు పనిచేసి పెట్టడాన్ని బానిసత్వం అనలేము. జంతువుల లైంగిక కలయికను ప్రేమగానో, లేక అత్యాచారంగానో పరిగణించలేము. అవన్నీ వాటి నైజాలు. తమ తమ జాతి నైజానుసారం ప్రవర్తించడం తప్ప అవి కొత్తగా, వేరుగా ఏమీ చెయ్యలేవు. అందులో నైతికతకు గానీ, ధర్మాధర్మ మీమాంసలకు గానీ తావులేదు. అదంతే. సృష్టిలో వివిధ జాతుల మధ్య అన్యోన్య క్రియ, పరస్పర చర్యలు (ఇంటరాక్షన్) ఉంటాయే తప్ప - ఆలోచించుకుని, ఒకదానికొకటి సహకరించుకునే తత్వం లేదు. ఎందుకలా అంటే, అదంతే. Existence exists. It exists the way it exists. దీన్ని ప్రశ్నించడమంటే వాస్తవాన్ని, సత్యాన్ని ప్రశ్నించడమే. సమాధానం దొరకదు. అసలు దాన్ని ప్రశ్నించడ మంటేనే వాస్తవాన్ని నిరాకరించ చూడడం కింద లెక్క.

జీవం లేని రాళ్ళు, భూమి, జీవమున్న మొక్కలు, జంతుకులాల ఉనికి, వాటి మధ్య పరస్పర చర్యలలో నైతికతను వెతకరాదు. అంటార్కిటికాలో భూమి పనికిరాకుండా మంచుతో కప్పబడడం, బ్రహ్మకమలం సముద్ర మట్టానికి పధ్నాలుగు వేల అడుగుల ఎత్తున మాత్రమే వికసించడం, డెల్టాలో నీటి లభ్యత ఎక్కువగా ఉండడం అన్యాయం కాదా అని ప్రశ్నించడం అమాయకత్వం, తెలియని తనం.

నైతికత కేవలం మనిషికి సంబంధించింది. అది కూడా మనిషి నైజం మేరకు తనకు సంక్రమించింది. మనిషి తన నైజం ప్రకారం ఆలోచించగలిగే శక్తి, హేతుబద్ధంగా తర్కించగలిగే శక్తి, భవిష్యత్తును అంచనా వెయ్యగలిగే శక్తి; సృష్టిలోని మూలకాల, జంతుజీవాదుల పరస్పర చర్యల్లోని సమీకరణాలను గుర్తించి, వాటిని తన జీవనానికి అనుకూలంగా మలచుకోగల అత్యద్భుతమైన సమర్థత కలిగి ఉన్నాడు. అందువల్లనే నాగరికత నిర్మించగలిగాడు. మనిషికి తన చర్యలను ఎంచుకునే అవకాశం (ఛాయిస్) ఉంది. కాబట్టే తన ప్రతి ఒక్క చర్యను నైతిక పరీక్షకు గురి చేయాలి. తన దగ్గరున్న కత్తిని అకారణంగా ఇంకొకరిని పొడవడానికి ఉపయోగిస్తాడా లేక ఒక పండునో, తన కోడినో కొయ్యడానికి వాడతాడా అనేది తన ముందున్న రెండు మార్గాలు. ఏది ఎంచుకున్నాడో చూసి అది నైతికమో, అనైతికమో తేల్చగలం.

ఇతర మనుషులకు హాని కలిగించకుండా, తన శారీరక, ఆలోచనా శక్తి మేరకు సృష్టిమీద ఆధారపడి బ్రతకడం మనిషి మౌలిక నైజం. అందుకే హక్కులు అనే కాన్సెప్ట్ వచ్చింది. మనిషికుండే అత్యంత ప్రాథమికమైన హక్కు - తాను ఇతరులకు హానిని కలిగించనంత కాలం; తన ధన, మాన, ప్రాణాలను ఇంకొక మనిషి హరించకుండా ఉండే హక్కు మాత్రమే. (విద్యా హక్కు, పని హక్కు, ఆహార హక్కు, ఇప్పుడు రాహుల్ గాంధీ ప్రచారం చేస్తున్న ఆరోగ్య హక్కు - ఇవన్నీ ఓట్ల కోసం ఒకరిని కొట్టి మరొకరికి

పెట్టే, రాజకీయ మాఫియాలు సృష్టించిన కృత్రిమ హక్కులే. దాని సంగతి ప్రస్తుతానికి ప్రక్కన పెడదాం) కాబట్టి జంతువులకు హక్కులు ఆపాదించడమంటే సృష్టి, వాస్తవాలను తప్పుగా అర్థం చేసుకోవడం మాత్రమే.

ఇదే తర్కాన్ని ఇంకాస్త పొడిగిస్తే, చికెన్ తినడమూ హత్యానేరమే. పాలు తాగడమూ లేగ దూడ హక్కుల చౌర్యమే. ఇన్ఫెక్షనొస్తే యాంటీ బయాటిక్స్ వాడడమూ బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్‌ల పట్ల నేరమే, అంతేకాదు. ధాన్యం, కాయగూరలను కోసుకు తినడమూ ప్రాకృతిక జీవరాసుల పట్ల నేరంగా పరిగణించేవారూ ఉంటారు.

కాబట్టి ఆఖరికి మానవుడు ఆకలితో చనిపోతే తప్ప ఇలాంటి జీవ, జంతు, పర్యావరణ వాదుల కోరిక తీరదు. అప్పటికి వారూ మిగలరనుకోండి, అది వారూ గుర్తించరు. జంతువులకు హక్కులు ఆపాదించడమనే 'జాఢ్యం' వాస్తవికత వ్యతిరేక భావజాలాల నుంచి పుట్టింది. సర్కస్‌లో జంతువుల నిషేదం మొదలుకుని, జల్లి కట్టు నిషేధం దాకా పాకింది. ఇంకొన్ని విచిత్రమైన తీర్పులొచ్చినా ఆశ్చర్యపడకూడదు. జంతువుల పట్ల ప్రేమ, వాటిలో సృష్టి ఔన్నత్యాన్ని దర్శించగలగడం వ్యక్తుల సంస్కారానికి సంబంధించింది. ఆ సంస్కారాన్ని చట్ట రూపంలో నిర్బంధంగా నేర్పలేము. అదసలు చట్టాల పని కానే కాదు.

అపరిమితమైన అధికారాలున్న వ్యవస్థల వల్ల - సమాజానికి, ప్రజల అసలైన హక్కులకు ఎంత ప్రమాదం పొంచి ఉందో దీనివల్ల అర్థమవుతోంది.

అలాంటి అపరిమిత అధికారాలున్న ఇంకో వ్యవస్థ ఎలక్షన్ కమిషన్. అది వేస్తున్న పిల్లి మొగ్గలూ ఈసారి ఇంకా స్పష్టంగా కనబడుతున్నాయి. చంద్రబాబు నాయుడు ఓటేసి వచ్చాక ఎవరికి వెయ్యాల్సి వచ్చిందో చెప్పడాన్ని నేరంగా పరిగణించిన భన్వర్‌లాల్; ఆ ఓటు చెల్లదని తొందరపాటుగా ప్రకటించడం, కొన్ని గంటల తర్వాత కూడా రూల్సు చదువుకోకుండా అదే పట్టు కొనసాగించడం, చివరికి ఢిల్లీలోని కమిషన్ అలాంటిదేమీ లేదనడం ఒక ఉదాహరణ.

అదలా ఉండగా ఢిల్లీలోని కమిషనర్ బ్రహ్మ ఎగ్జిట్ పోల్స్‌ను ఈ నెల పదహారు వరకు ప్రసారం చెయ్యకూడదనడం, తర్వాత చాలా సేపటికి కమిషన్ నాలుక్కరుచుకోవడం చూస్తే, ఎంతటి సాధారణ, దుర్బలుల చేతిలో గుత్తాధికార వ్యవస్థలను, ఎవరూ ప్రశ్నించజాలని స్థాయిలో కూర్చోబెడుతున్నామో అర్థమవుతోంది. ఈ వ్యవస్థలన్నిటి ప్రక్షాళనే - కొత్తగా వచ్చే ప్రభుత్వాల మొదటి కర్తవ్యం కావాలి.

11-05-2014

కాగితాలయిపోయాయి....సెలవు

అదో ప్రజా ప్రభంజనం. వెల్లువెత్తిన రాజకీయ, స్వాభిమాన, స్వీయరక్షణ చైతన్యం. ఇంతకు ముందెన్నడూ లేనంత స్థాయిలో ఓటువేసి తీరాలన్న ఆదుర్దా, ఉద్వేగం, ఎంతో కాలం నుంచి ఎదురుచూస్తున్న అవకాశాన్ని చేజార్చుకోకూడదనే తాపత్రయం. చంటి పిల్లల్ని చంకనేసుకుని బస్సులు, రైళ్ళలో నిలబడైనా సరే దూర ప్రయాణాలు చేసి; ఎలాగోలా ముంచుకొస్తున్న ప్రమాదం నుంచి తనను, తన తరువాతి తరాలను రక్షించుకోవాలనే ఆవేశ భరిత, యుద్ధ సమాన ప్రయత్నం.

ఈ సారి జరిగిన ఎన్నికలలో, ముఖ్యంగా సీమాంధ్రలో ఆవిష్కృతమైన దృశ్యాలివి. దినాలు కూడా కాకుండానే వితంతువులు సంప్రదాయాలను పక్కన పెట్టి ఓటేయడానికి బయటకు రావడం; ఎంత ముదుసలులనైనా వదిలిపెట్టకుండా కుర్రాళ్ళు మోసుకెళ్ళి మరీ ఓటేయించడం, రాక్షస ప్రభుత్వమెక్కడొచ్చి పడుతుందోననే భయంతో ఎవరికి ఓటేసింది చివరికి భర్తక్కూడా చెప్పకపోవడం - ఇవన్నీ మామూలు ఎన్నికలలో కనపడవు. ఓటర్ల మనోగతాన్ని తెలుసుకోవడంలో విఫలమైన ఎగ్జిట్‌పోల్స్, గూఢచారి వర్గాల నివేదికల పేరుతో ప్రచారమైన అంచనాలను నమ్ముకుని కోట్ల రూపాయల పందాలు కాయడం, చివరకు రేపు ఓట్ల లెక్కింపు జరుగుతుందనగా ఈ రోజు సాయంత్రం పందెపు రాయుళ్ళ ప్రయోజనాల కోసం విశ్వసనీయమైన వనుకునే సర్వే సంస్థలు కూడా అస్పష్ట ఫలితాలను ప్రచారం చెయ్యడం - ఇవన్నీ ఈసారి ఎన్నికలకే ప్రత్యేకం.

గత పదేళ్ళుగా గతి తప్పని పతనానికి మూగ సాక్షులుగా మిగిలిపోయిన ప్రజలు, ముఖ్యంగా వారిలోని ఆలోచనాపరులు, ఈసారి ఎన్నికల వ్యవహారాన్ని తమ చేతుల్లోకి తీసుకున్నారు. ఎన్నికలనేవి తమకిష్టమున్నా, లేకున్నా తమ

జీవితాలను అత్యంతగా ప్రభావితం చేసే ప్రక్రియ అని; వాటిని రాజకీయ నాయకులకు, క్షణిక, స్వల్పకాలిక ప్రయోజనాలకు లొంగిపోయే ఓటర్లకు వదిలివేయకూడదనే నిర్ణయాని కొచ్చారు. ముఖ్యంగా మన రాష్ట్రంలో దొంగలు, దోపిడీని వ్యవస్థీకృతం చేసే మాంత్రిక ప్రతి నాయకులు అధికారం చేజిక్కించుకుంటే ఏమైపోతామో ననే మానసిక ఆందోళన ప్రజల్ని పరుగులెత్తించింది. పైకి మాత్రం ఎన్నికల ప్రచార, ప్రలోభాల తంతు యధావిధిగా నడిచింది. నిజానికి ఈసారి ఓటర్లకు నేరుగా అందజేసిన డబ్బు పరిమాణం, మొత్తం ఓటర్ల సంఖ్యలో మొహమాటం లేకుండా డబ్బు పుచ్చుకున్న వారి శాతం గత అన్ని రికార్డులను బద్దలుకొట్టాయి. ఈ మితిమీరిన అపసవ్యాలను కొంతవరకైనా సరిచేయాలనే ఆదర్శాలకు పోవడానికి ఏ పార్టీ కూడా సాహసించలేదు. కాకపోతే, తేడా అల్లా స్థానికంగా డబ్బున్న వారు వారి వారి గ్రామాల్లో, వార్డుల్లో తమ కిష్టమైన పార్టీల ఖర్చును భరించడానికి ఇంకాస్త స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. రెండోది, ఓటువేసి తీరాలన్న తపన, కసి సర్వత్రా వ్యాపించింది. వాటి ఫలితంగానే ఆంధ్రలో తెలుగుదేశం పార్టీ, దేశంలో బీజేపీ తమంతట తాముగా మెజారిటీలు సాధించాయి.

మొత్తానికి ప్రజలు తమ స్వప్రయోజనాలను కాపాడుకునే ధోరణితో ఓటేసినట్లే. కాకపోతే, వారి నిజమైన, దీర్ఘకాలిక స్వప్రయోజనాలు ఏమిటన్నది వివరించి అర్థం చేయించడంలో – ఈ రెండు పార్టీల నాయకులు సఫలమయ్యారు. రాష్ట్ర విభజన రూపంలో రెక్కలు కత్తిరించబడి; అయినా సరే – ఎగరాల్సిన పరిస్థితిలో ఉన్న సీమాంధ్ర ప్రజలు వైఎస్ఆర్సీపీ అధికారంలోకి రాకుండా ఆపాలనే కృతనిశ్చయం చూపారు. దేశస్థాయిలో, ముఖ్యంగా యువతలో లౌకిక శక్తులమంటూ చెప్పుకుతిరిగే పార్టీల వర్గ సంతుష్ట విధానాలను ఈసడించుకుని, నరేంద్రమోదీ చూపిన అభివృద్ధి బాట మాత్రమే శరణ్యమనే భావన సర్వత్రా వ్యాపించింది. తెలంగాణలోనూ ప్రజలు తమ స్వప్రయోజనాలకు అనుగుణంగానే ఓటేశారు. అదే సమయంలో హైదరాబాదు, చుట్టుపక్కల ప్రజలు తమ స్వీయ రక్షణకు టీఆర్ఎస్‌ను దూరం పెట్టడమూ ధర్మబద్ధమే. దేశవ్యాప్తంగా కనబడిన సరళి ఏమంటే కాంగ్రెస్‌తో పాటుగా, ఆ పార్టీతో ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ

సంబంధాలు పెట్టుకున్న పార్టీలన్నీ ఓటర్ల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వచ్చింది. కాంగ్రెస్‌కు దూరంగా, వ్యతిరేకంగా ఉన్న పార్టీలను స్థానిక పరిస్థితుల ఆధారంగా సమదృష్టితో చూశారు. మాయావతి, ములాయం సింగ్, ఫరూక్ అబ్దుల్లా, నితీశ్ కుమార్‌ల పార్టీలు చరిత్రలో ఎన్నడూ లేనంత ఘోరంగా దెబ్బతినడానికి కారణమిదే. కాంగ్రెస్ పార్టీ పట్ల ఇన్నాళ్ళూ బిగపట్టుకుని, అణచిపెట్టుకున్న ఆగ్రహం ఒక్కసారిగా బద్దలైంది.

ఇంతకుముందు ఎన్నోసార్లు ఈ శీర్షికలో చర్చించినట్లుగా, ఏ సంక్షేమ పథకాలూ ప్రకటించకుండా, ఏ వర్గాలనూ ప్రత్యేకంగా ఉద్దేశించకుండా, కేవలం మెరుగైన పనితీరు, అభివృద్ధి సాధన దిశా జనిత విధానాలు మాత్రమే ప్రచార ఆయుధాలుగా దేశం మొత్తం తన వెంట నడిచేలా ఫలితాలు సాధించడం చరిత్రలో ఇదే మొదటిసారి. అందుకే, నరేంద్ర మోదీ విజయం దేశ చరిత్రను ఒక కొత్త మలుపు తిప్పిందనడంలో సందేహం లేదు. కులాలు, మతాలు, వర్గాలను స్పృశించకుండా, కేవలం అందరిపట్లా సమదృష్టి, అందరికీ అభివృద్ధి అనే నినాదాలతో ఎన్నికలు ఎదుర్కోవడానికి ఎంతో ఆత్మస్థైర్యం, ధైర్యం, తన హేతుబద్ధత మీద తనకు నమ్మకం, ఆత్మవిశ్వాసం కావాలి. నమ్మదగిన నాయకులు హేతుబద్ధమైన కార్యక్రమంతో ముందుకొస్తే, ఆదరించగల ఆలోచనాపటిమ తమకుందని ప్రజలు రుజువు చేశారు. ఇదీ అసలైన విప్లవం. అసలైన విజయం. ప్రజల నమ్మకాన్ని నిలబెడుతూ, అధికారం చేపట్టిన మొదటి వారంలోనే ఆర్థిక వ్యవస్థను నియంత్రణల చట్రం నుంచి విముక్తి చేసి, విదేశీ పెట్టుబడులకు ఆహ్వానం ద్వారా ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో అనుసంధానించే విధానాలు అవలంబించడం ముదావహం.

తెలుగు ప్రజలు, ప్రభుత్వాలూ సంక్షేమ పథకాల మత్తులోంచి బయటపడి, అభివృద్ధి దిశగా ఆలోచిస్తే మంచి భవిష్యత్తు ఉంటుంది. ఆర్థిక, ఉత్పత్తి వ్యవస్థలను అధికార యంత్రాంగపు అనవసర జోక్యం నుంచి, స్థానిక రాజకీయ మాఫియాల నుంచి విముక్తి చేయాల్సి ఉంటుంది. అంతేకాక, ప్రజలు తమ కాళ్ళమీద తాము నిలబడగలిగే శక్తిసామర్థ్యాలు కలవారేననే సందేశం బలంగా

చేరవేయగలగాలి. ఈ ఎన్నికలలో ఓటేసిన తీరు ద్వారా ప్రజలు తాము హేతుబద్ధంగా ఆలోచించగల శక్తి కలిగిన వారమేనని, తమ స్వప్రయోజనాలేమిటో తమకు తెలుసునని రుజువు చేశారు. ఇప్పుడు తమను తాము రుజువు చేసుకోవాల్సింది రాజకీయ నాయకులే. ఆర్థికాభివృద్ధికి, ఇప్పుడున్న పరిస్థితుల్లో, ప్రభుత్వాలు, రాజకీయ నాయకులు అత్యంత ప్రభావవంతమైన ఉత్ప్రేరకాలుగా ఉపయోగపడగలరు. అలా చెయ్యకపోతే అభివృద్ధి నిరోధకులుగా పరిగణించబడి, ప్రజలు పెట్టిన పరీక్షలో ఫెయిలవుతారు. కాంగ్రెస్ పార్టీకి సంభవించిన దుస్థితి స్వాతంత్ర్య భారతావనిలో అత్యంత ముఖ్యమైన చారిత్రక, రాజకీయ గుణపాఠం. దాన్ని కనీసం వచ్చే వందేళ్ళ వరకు మరిచిపోకూడదు.

గత నాలుగేళ్ళుగా ఈ శీర్షికను క్రమం తప్పకుండా రాశాను. రెండేళ్ళ పాటు ప్రతి ఆదివారం; తర్వాత - వారం విడిచి వారం, విదేశాల్లో ఉన్నా రాస్తూ వచ్చాను. కొన్ని వందల చారిత్రక, ఆర్థిక, రాజకీయ, భావజాల, సమకాలీన విషయాలను విశ్లేషిస్తూ వచ్చాను. ఊహించిన దిశల నుంచి ఉదార స్థాయిలో విమర్శలొచ్చాయి. వీలున్నంతవరకు ప్రతి విమర్శకూ సమాధానం రాశాను. నా భావాలను, ఆలోచనలను పంచుకోవడానికి అవకాశమిచ్చిన వేమూరి రాధాకృష్ణ గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు. కొన్ని విషయాలలో వారి అభిప్రాయాలకు, వారి ఎడిటోరియల్ పాలసీకి పూర్తిభిన్నంగా రాసినా, అభిప్రాయ వ్యక్తీకరణకు పూర్తి అవకాశమివ్వడం వారి పాత్రికేయ ఔదర్యానికి నిదర్శనం. హేతుబద్ధంగా, తర్కపరంగా ఆలోచించగలగడం సృష్టిలో మనిషికి మాత్రమే ఉన్న వరం. అలా ఆలోచించగలగడం; తదనుగుణంగా నిర్ణయాలు తీసుకోవడం; ఆ నిర్ణయాల ఆచరణ వల్ల కలిగే పర్యవసానాలకు బాధ్యత వహించడం -మానవ ధర్మం. ఈ విషయాలను విశదీకరించడానికే నేను చేసిన ఈ ప్రయత్నం. ఎన్నికల ఫలితాల ద్వారా నా ప్రయత్నం ఎంతో కొంత మేరకు సఫలీకృతమైందని నమ్ముతున్నాను. ప్రస్తుతానికి, నా దగ్గర కాగితాలయిపోయాయి. చెయ్యాల్సిన వేరే పనులు చాలా ఉన్నాయి. వినమ్రంగా సెలవు తీసుకుంటూ...

01-06-2014